పద్య కవితా పరిచయం

నన్నయ నుంచి కంకంటి దాకా



బేతవోలు రామబ్రహ్మం

పద్య కవితా పరిచయం

(నన్నయ నుంచి కంకంటిదాకా)

సంపాదకులు

కీ.శే. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు

రచయిత

బేతవోలు రామబ్రహ్మం



అ.జో. - వి.భా. ప్రచురణ

జనవరి - ౨000

NAVODAYA BOOK HOUSE
STREET OPP ARYA SAMAJ KACH GUDA
HYDERABAD-500 027 ☎ 4652387


PADYAKAVITA PARICHAYAM

(NANNAYA TO KANKANTI)

FIRST EDITION : 1000 : Oct 1997

SECOND EDITION : 1000 : Jan 2000

B. RAMABRAHMAM
SCHOOL OF LITERATURE
P.S. TELUGU UNIVERSITY
RAJAHMUNDRY CAMPUS
BOMMURU - 533 124
Phone: 0883 - 77372



FOR COPIES : ALL BRANCHES OF VISALANDHRA BOOK HOUSE

PUBLISHED BY :

APPA JOSYULA - VISHNU BHOTLA FOUNDATION U.S.A.

PRINTED AT
VIJAYA BLOCK MAKING & PRINTING WORKS
RAJAHMUNDRY - 1. ☎ 0883 - 421444, 421333

PRICE : Rs. 100/- US $ 25.00

ఇదే వరస

సంపాదకీయము

ఇటీవలి కాలమున తరుణ వయస్కులైన సాహితీప్రియులు అనేకులు నన్ను కలిసి పద్య కావ్యముల యందలి కవితా సౌందర్యములను తెలియజెప్పడని అడుగుచున్నారు ఇది నాకు పలుతావులలో నెదురవుచున్న సమస్య పద్య కవితాభిమానిగా వారి జిజ్ఞాసకు సంబరపడుట యొకటియు, దానిని తీర్చుటెట్లాయని దిగులు పడుట యొకటియుగా నా అంతరంగము పన్నీరు కన్నీరగుచున్నది

వ్యాఖ్యానిరపేక్షముగా ప్రౌఢ పద్యకావ్యములు నేటి వారికి అర్థము కావు ఏవో కొన్ని కావ్యములకు వ్యాఖ్యానములున్నను అవి మరొక వ్యాఖ్యానమునో పార ప్రవచనమునో అపేక్షించునవిగానైనవి నేటి పాఠకుల స్థాయికి అందుబాటులో లేవనుట ఫలితాంశము.

ఇట్లుండగా శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు సాహిత్యపరిచయ రూపమున గ్రంథములు వెలువరించు కార్యక్రమమును చేపట్టుట అస్మదాదులకే కాదు పాఠకులందరికిని ఆనందహేతువు ప్రథమ ప్రయత్నముగా పద్యకవితా పరిచయ మను దీనికి నన్నే సంపాదకునిగా చేయుట వాగ్దేవి అనుగ్రహము

ఇట్టి ప్రయత్నములు లోగడ కొన్ని జరిగినవి. ఆయా కవుల కావ్యములలో తమకు నచ్చిన కొన్ని పద్యములను స్వీకరించి వానిలోని అందచందములను వివరించుచు విశ్వనాథ పుట్టపర్తి ప్రభృతులు లఘు వ్యాసములను పాఠకులకు అందించిరి దానికి భిన్నముగను మరింత సమగ్రముగను కవితా పరిచయము చేయనెంచి ఒక ప్రణాళికను రూపొందించితిమి కవులను కావ్యములను ఘట్టములను ఎంపిక చేసికొంటిమి

ఈ గ్రంథ రచయిత శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు వేలు అందించిన మండె మ్రింగగల నేర్పరులు అల్లుకొని పోయిరి ఆయాకవుల కవితాలక్షణములును వ్యక్తిత్వములును రూపుగట్టునట్లు ఘట్టములను సాంగోపాంగముగా వివరించిరి

ఆశ్చర్యపరచు క్రొంగ్రొత్త సొగసుల నెన్నింటినో వెలార్చిరి, ఛందస్సౌందర్యములను తెలిపిరి. ఆలంకారిక ప్రస్థానములను తడవిరి. వ్యాకరణ విశేషముల పరిణతులను నిర్ధారించిరి

వీరి వచన రచనాశైలికి నేను మరింత ముగ్ధుడనైతిని, ఎంతలోతైన విషయము నైనను సులభముగా స్ఫుటముగా తెలియజెప్పగల ఒక యొడుపు వీరికున్నది వాడుక భాషలోని తీయందనము నుడికారపు సొగసులు సుకుమారములగు ఛలోక్తులు- ఇవి ఈ రచనకు పఠనీయతను ఇమ్మడిముమ్మడిగా కల్గించినవి. ఆకర్షణను

ఇనుమడించినవి పాఠము చెప్పుచున్నట్లు సంభాషణాత్మక శైలిని ఆశ్రయించుటతో వీరి వచన రచనకు ఇన్ని సద్గుణములు అబ్బినవి సంతృప్తితో సంతుష్టితో పులకించుచున్న మనస్సుతో చిరంజీవులు బేతవోలు రామబ్రహ్మము గారిని అభినందించుచున్నాను ఆశీర్వదించుచున్నాను

కందుకూరి- తిరుపతి వేంకటకవుల నుండి తెలుగు పద్యకావ్యము వస్తు భాషా శిల్పప్రయోజన పరముగా నెంతేని మార్పునకు లోనైనది ఆ విశేషములు తదనుకూల ప్రణాళికతో మరొక ప్రత్యేక గ్రంథముగా రాదగినవి కావున నీ గ్రంథమున ఆదికవి మహాభారతముతో శ్రీకారము చుట్టి కంకంటి పాపరాజు నుత్తర రామాయణముతో ఇతిశ్రీయంటిమి

ఇందైనను గ్రంథవిస్తర భీతిచే కొందరు మహాకవుల మహాకావ్యములను అని వార్యముగా విడిచి పుచ్చవలసివచ్చినది అట్లే ద్విపద శతక యక్ష గానాది ప్రక్రియలు ఈ ప్రణాళికలోనికి ఇముడవని విడువక తప్పినది కాదు అయిననేమి- ఈ పద్య కవితా పరిచయ కార్యక్రమము కేవల మీ యొక్క గ్రంథముతోనే ఆగిపోదుగదా మరెన్నేని వచ్చును రావలెను అన్ని ప్రక్రియలలోను అన్ని కావ్యములలోను రసవద్ఘట్టములను దుళ్ళగొట్టవలెను కొల్లగొట్టవలెను ఇది తెలుగు పాఠకుల ఆదరణము పైనున్నది జిజ్ఞాస పెరిగి కవితాపిపాసతీరునుగాక! సమర్థులుతీర్తురు గాక! శుభం భూయాత్

లలితానగరం　　　　　　　　మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి
రాజమహేంద్రి　　　　　　　　　　　　　　　5-8-92

ఇదిశాస్త్రిగారి ఆశీస్సు ఆకాంక్ష అలనాడు రాసిచ్చింది యధాతధంగా మీముందు ఉంచాను వారుండగా దీన్ని అచ్చొత్తించ లేకపోయానే అని బాధపడుతున్నాను పుణ్య లోకాలనుంచి చూసి ఇప్పుడు సంతృప్తి చెందుతారనీ నిండుగా ఆశీర్వదిస్తారనీ నమ్ముతున్నాను

అందమైన ప్రణాళిక ఇచ్చారు ఘట్టాలను సూచించారు చమత్కారాలు తెలిపారు నా ప్రార్థన మన్నించి సంపాదకత్వం వహించారు ఏమిచ్చి ఋణం తీర్చుకోను సహృదయ మూర్ధన్యులు వారిని స్మరించుకుని అంజలి ఘటిస్తున్నాను

ఇలా చాలా సంపుటాలు రావాలనీ రసవద్ఘట్టాలను దుళ్ళగొట్టి ఈ నాటి పాఠకులకు పంచిపెట్టాలనీ వారు ఆకాంక్షించారు సమర్థులను ఆహ్వానించారు నా ప్రయత్నం నేను చేస్తున్నాను సమర్థులారా మీరూ పూనుకోండి పద్యకవితా మధురిమలను ఈ తరానికి అందించి ఋణం తీర్చుకోండి ఇది బాధ్యత ఇది కర్తవ్యం ఇది ఇప్పటి అవసరం. తద్ధి తపః తద్ధి తపః

- బేతవోలు రామబ్రహ్మం

2 7 97

బేతవోలు

కృతజ్ఞతలు

శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్ర గురుదేవులకూ

సంపాదకులు ప్రాతఃస్మరణీయులు కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారికీ,

శ్రీ శేషాద్రి వెంకటరమణ కవుల వంటి తొలితరం వ్యాఖ్యాతలకూ, శ్రీ వంతరాం రామకృష్ణారావు ప్రభృతులకు నేటి వ్యాఖ్యాతలకూ

శ్రీ నిడదవోలు వెంకటరావు వంటి తొలితరం సాహిత్య పరిశోధక - విమర్శకులకు, ఆచార్య శ్రీ జి వి సుబ్రహ్మణ్యం ప్రభృతులకు నేటి పరిశోధక - విమర్శకులకూ

అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్

సలహా సంప్రదింపులలో వాదోడుగా నిలిచిన సర్వశ్రీ మల్లంపల్లి శరభయ్య, యేలూరిపాటి అనంతరామయ్య జొన్నలగడ్డ మృత్యుంజయ రావు తల్లావఝల పతంజలిశాస్త్రి, వల్లభాచార్య, యెండ్లూరి సుధాకర్, కె. నాగార్జున శ్రీ ప్రభృతులకూ

మా తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్యపీఠ గ్రంథాలయం అధికారిణి శ్రీమతి ప తారాబాయి, ఉద్యోగి మిత్రులు శ్రీ ఐ ఎస్ ఎన్ రాజు, శ్రీ ఎమ్ విజయకుమార్‌లకు బోధనేతర సహవ్రతులు సర్వశ్రీ ఏ ప్రభాకర్ సబ్బారావు గంగరాజు, దొర, సత్య నారాయణ బంగారయ్యలకు నాబ్రహ్మ రాతను అర్థంచేసుకుని మేలు ప్రతి తయారు చెయ్యడంలో చేదోడుగా నిలిచిన మిత్రులు సర్వశ్రీ మధునాపంతుల వేంకటాచలపతి, డా జి. యస్. భాస్కర రావు ఎమ్ రామలింగేశ్వరావు వై. రామ నరసింహం, బాణాల రమేష్, కుమారి పి మల్లీశ్వరి, కుమారి పి సుశీల - వీరికీ కృతజ్ఞతలు

అందంగా ముద్రించి ఇచ్చిన శ్రీ కొండపల్లి విజయకుమార్ గారికీ వారి ముద్రణాలయ సిబ్బంది శ్రీ నరసింహమూర్తి, శ్రీ రవికుమార్‌లకూ ధన్యవాదాలు

ఈ పుస్తకం రచించి అయిదేళ్ళు అయ్యింది(౧౯౯౨) కొన్ని అనివార్యకారణాల వల్ల ఆలస్యమై ఇప్పటికి వెలుగుచూస్తోంది దీనికి ప్రేరణ అనపర్తి జి.బి ఆర్. డిగ్రీకళాశాల.

౧౯౯౭ ఫిబ్రవరి ౨౨, ౨౩ తేదీల్లో ఈ కళాశాల వారు యు జి.సి సెమినార్ జరిపారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం మీద. హేమాహేమీలు చాలా మంది వచ్చారు నేనూ పాల్గొన్నాను వీరు సెమినార్ నడిపిన తీరు నన్ను ముగ్ధుణ్ణి చేసింది నడిపితే ఇలానడపాలి అన్నట్టు నడిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉద్యోగుల భాగస్వామ్యం, యాజమాన్యం వారి సహాయ సహకారాలూ, నిండుదనం చేకూర్చాయి. అతిథిమర్యాదలు సరేసరి చర్చలూ బాగా జరిగాయి చుట్టు ప్రక్కల కాలేజీల నుంచి అధిక సంఖ్యలో తెలుగు ఉపన్యాసకులు వచ్చి పాల్గొన్నారు గోష్ఠీపత్రాలు చదివారు ఒకటేమిటి సర్వాంగ సుందరంగా ప్రణాళికాబద్ధంగా జరిగింది ఆ సెమినార్,

ఉత్సాహం పట్ట లేక ఈ పుస్తకాన్ని ఆ కాలేజికి అంకితం చేస్తానని ముగింపు సభలో ప్రకటించాను. ఆలస్యమైనా మాట నిలబెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది సెమినార్‌ను దక్షతతో నడిపిన ప్రిన్సిపాల్ సాహితీప్రియంభావుకులు మాన్య శ్రీ బి. రత్నరెడ్డి గారికీ, చేయూతనిచ్చిన కరస్పాండెంట్ సహృదయులు శ్రీ కొండ బాబు గారికీ సాహిత్య విద్యార్థిగా మరోసారి ధన్యవాదాలు చెబుతున్నాను

కళాశాల సంస్థాపకులు విద్యాపోషకులు గుప్తదాతలు కీ శే శ్రీ గొలుగూరి బాపిరాజు గారిని ఈ శుభ సందర్భాన తలుచుకుంటున్నాను మనం ఇక్కడ తలుచుకున్నంతకాలం వారికి అక్కడ పుణ్యలోక నివాసం శాశ్వతం

) ఆచార్యచేకూరి రామారావుగారు గ్రంథం ఆసాంతం చదివి ప్రణాళికను అభినందించి ఆలోచనాత్మకమైన చరిత్రాత్మకమైన పీఠికను సమకూర్చారు వారి వాత్సల్యానికి సవినయంగా అయిదు పది చేస్తున్నాను.

౽) నా సాహితీ కృషిలో ఎల్లవేళలా వెన్నుతట్టే మాన్యమహోదయులు శ్రీ ఏ కే ఖాన్ గారికీ (డి ఐ జి గుంటూరు) శ్రీ డి టి నాయక్ గారికీ (పోలీస్ కమిషనర్ విజయవాడ) శ్రీ వినయ్ రంజన్‌రే గారికీ (ఎస్ పి కాకినాడ), శ్రీ జె ప్రభాకరరావుగారికీ (డి ఎస్ పి రాజమండ్రి) ఎ పి. పేపర్ మిల్లు వారికీ దన్యవాదాలు నా ఆరోప్రాణం శ్రీ సత్తి చంద్రారెడ్డిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు

ప్రియపాఠకులారా ! ముందు పద్యం చదవండి. తరవాత వివరణ చదవండి మళ్ళీ మరొక్కసారి అదే పద్యం చదవండి అటుపైని - తరువాత పద్యంలోకి వెళ్ళండి. ఇది సూచన ఇది అభ్యర్ధన

పద్యం చదివి అర్థం చేసుకోగలిగిన అదృష్టవంతుల కోసం కాదు ఈ పుస్తకం - అని మనవి చేస్తూ ---------- సెలవు



ప్రశాంతి నగర్, బేతవోలు రామబ్రహ్మం

బొమ్మూరు-౽౩౩ ౨౪ ఈశ్వర విజయదశమి

భూయో భూయో

ఇటీవల నెల్లూరు సభలో శ్రీ ప్రసాదరాయ కులపతిగారన్నట్టు అజోవిభొఫౌండేషన్ వారందిస్తున్న లైఫ్ టైమ్ అచ్చీవ్ మెంట్ అవార్డ్ కోసం అందరూ ఉవ్విళ్ళూరుతూ ఎదురు చూస్తున్న వాతావరణం తెలుగునాట కనిపిస్తోంది ఆ స్థాయిలో నిష్పాక్షికంగా నిస్స్వార్థంగా నిర్వహిస్తున్నారు అజోవిభొ పురుషత్రయం వఃశ్రేయసే భూయాసుః. ఎక్కడో అమెరికాలో స్థిరపడిన అప్పాజోస్యుల సత్యనారాయణ విష్ణు భొట్ల రామన్న లక్ష్మన్నలు ఏటేటా పనిగట్టుకుని తెలుగు దేశానికి రావడమేమిటి, కొన్ని లక్షల రూపాయలు కష్టార్జితాన్ని మన సాహిత్య సాంస్కృతిక రంగాలకు వెచ్చించడమేమిటి పురస్కారాలు ఇచ్చి సభలు జరిపి చేతులు దుల్లుపుకోవడం కాదు శాశ్వతంగా ఉండిపోయే విలువైన పుస్తకాలను ఈ సంస్థ ప్రచురించడం మరొక విశేషం ఇలాంటి పనులు చెయ్యాలంటే మంచి అభిరుచి ఉండాలి. మంచి అభినివేశమూ ఉండాలి తెలుగు సాహిత్యంలో అందమైన ప్రతి పద్యమూ ప్రతికవితా తమ నోటికి రావలసిందే కనీసం తాము చదివి ఉండవలసిందే – ఇదీ ఈ త్రిపురుషుల అభినివేశం అందుకే తమ సంస్థకూ తమ కార్యకలాపాలకూ ఇంతటి స్థాయిని సంపాదించగలిగారు పరోక్షంలో కనక ఈ నాలుగుముక్కలైనా రాయగలిగాను ప్రత్యక్షంలో అయితేనా అప్పాజోస్యులవారు ఈపాటికి నా చేతిలో కలం ఊడలాక్కుని ఉండేవారు సరే - ఈ ముగ్గురికీ సహకుటుంబానాం సకల శ్రేయస్సులూ ప్రేయస్సులూ ఇతోధికంగా కలగాలని ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నాను

తొలిచూపులోనే ఈ పద్యకవితా పరిచయంతో గాఢంగా ప్రేమలో పడ్డారు సత్యనారాయణగారు అర్ధరాత్రి అపరాత్రి అమెరికానుంచి ఫోన్లు చెయ్యడం మొదలుపెట్టారు ఈ ఇంటర్ కాంటినెంటల్ ప్రేమ ఇదిగో ఇలా ద్వితీయముద్రణగా ఫలించింది వారి సౌజన్యానికి భూయో భూయో నమామ్యహమ్ కంకంటితో ఆగిపోయింది ఈ మొదటి సంపుటి • కందుకూరినుంచి కరుణశ్రీ దాకా రెండవ సంపుటిగా అందించే ప్రయత్నంలో ఉన్నాను దాని ముద్రణకుకూడా అప్పుడే వలచి వాగ్దానం తీసుకున్నారు అజోవిభొవారు ఇక నాదే ఆలస్యం

౧౯౯౨లో నా ఈ పనికి జెన్నన్న పెద్దలు డా॥ పోరంకి దక్షిణామూర్తిగారు వారికి ఇప్పుడైనా కృతజ్ఞతలు చెప్పడం నా పవిత్ర విధి నమో నమః

ముద్రించిన రెండేళ్ళకే దీన్ని ద్వితీయ ముద్రణకు తెచ్చింది తెలుగు పాఠకుల్లోని సంప్రదాయ సాహిత్య ప్రీతి కొత్త తరం పాఠకుల్లోని జిజ్ఞాస చరిత్రాత్మకమైన ఈ సరిసంఖ్యా రోజున ఆ రెండింటికీ మళ్ళీ మళ్ళీ రెండు చేతులూ జోడిస్తు న్నాను దీనికి ముఖపత్రాలంకరణ చేసిన చంద్రగారికీ, చేయించిన రచన సాయి గారికీ ధన్యవాదాలు. సెలవు

బొమ్మూరు-౫౩౩ ౨౪
౨ - ౨ - ౨౦౦౦

భవదీయుడు
బేతవోలు రామబ్రహ్మం

చేరా పీఠిక

ఇన్ డిఫెన్స్ ఆఫ్ క్లాసికల్ పొయెట్రీ

ఏ జాతిలోనూ కనిపించని ప్రాచీన సంస్కృతి నిరాదరణ తెలుగు వాళ్లలో కనిపిస్తుంది అన్ని సంస్కృతిశాఖల గురించి నాకు తెలియదు గాని సాహిత్యం విషయంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది ఒక కాలంలో హేతువాదం పేరిట, అభ్యుదయం పేరిట ఆధునికత పేరిట ప్రాచీన సాహిత్య వ్యతిరేకత మొదలయింది ప్రాచీన సాహిత్యంలో చెప్పినవి హేతువిరుద్ధంగా భౌతిక చలన సూత్రాలకు అతిరిక్తంగా కనిపిస్తున్నాయి కాబట్టి ప్రాచీన సాహిత్యాన్ని చదవక్కర్లేదని (లేదా చదవకూడదని) ప్రచారం జరిగింది. ఆధునిక సాహిత్యోద్యమాలు, ధోరణులు, రాజకీయార్థిక సామాజిక సిద్ధాంతాలు ప్రాచీన సాహిత్యనిరాదరణకు తమతమ పాత్రలను తాము నిర్వహించాయి ఆయా ధోరణులు, సిద్ధాంతాలు ప్రత్యక్షంగా పనిగట్టుకుని తమ విధానంగా ప్రచారం చేశాయని పత్రప్రమాణాలతో నిర్ధారణ చెయ్యలేము గాని ఆచరణలో ఈ పని జరిగింది అందుకే రానురాను ' ఆధునికత' పెరిగి నేటి విద్యా రంగంలో ప్రాచీన సాహిత్యం పాఠ్యప్రణాళిక నుంచి తప్పకోటం ప్రారంభించింది దానికనుబంధంగా నేర్చుకోవాల్సిన ప్రాచీన భాషా వ్యాకరణానికి, సంస్కృతానికి వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాల నుంచే అలజడి ప్రారంభమైంది ఛందశ్శాస్త్రాన్ని బిచ్చికానికి తోసేస్తున్నారు వీటి స్థానంలో భాషా శాస్త్రాన్ని, జానపద సాహిత్యాన్ని చొప్పిస్తున్నారు ఇంకా అనేకాధునిక ప్రక్రియలకు కూడా చోటు కావాల్సి ఉంది కథానిక నవల నాటకం ఇవన్నీ ఎక్కడ పెట్టాలి ? అందువల్ల ఉన్న కొద్ది వ్యవధిలోనే నేర్చుకోవాలి కాబట్టి ఏం త్యాగం చెయ్యాలి ? అదేదో ముతక సామెత చెప్పినట్లు వెంటనే కనిపించేది ప్రాచీన సాహిత్యమూ ఛందోవ్యాకరణాలూ ఇప్పటి తెలుగు ఎం ఏ ల పేరుతో తయారవుతున్న అభ్యర్థులు ఎందులోనూ అధికారం సంపాదించ లేకపోతున్నారు. అధికారం మాట దేవుడెరుగు ! ఒక పాటి సాధారణ పరిచయం (work ng knowledge) కూడా ఏర్పడటంలేదు

విద్యాలయాల బయట కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది వచన కవిత్వపు హోరుగాలిలో పద్యకవిత్వం బాగా చేవ ఉంటే తప్ప నిలదొక్కుకోలేక పోతున్నది ఇటీవలి వచన కవులను పలకరించి చూడండి పద్యం లయ, ప్రాస అనుప్రాస వంటి భావనలు అర్థంకాని దశలో ఉన్నారు. గీత పద్యానికీ, కందపద్యానికీ తేడా చెప్పలేని కవులూ కవితాపారకులూ చాలామంది ఉన్నారు. తెలియక పోవటం దోషంకాదు తెలుసుకో అక్కర్లే దన్న అహంభావం విచారణీయం ఆ అవసరాన్ని గుర్తు చేస్తే వాళ్లమీద విరుచుకుపడతారు కొంతమంది తమ అజ్ఞానాన్ని సమర్థించుకుంటూ వాదాలుచేస్తారు, వ్యాసాలు రాస్తారు ఒక్కోసారి తిట్టు కవిత్వం రాస్తారు

ఈ పరిస్థితికి కారణమేమిటి ? ఈ పరిస్థితిని మెరుగుపర్చలేమా? అసలు ప్రాచీన సాహిత్య పరిజ్ఞానం అవసరమా ? నేర్చుకుంటే లాభం ఏమిటి ?- ఇట్లాంటివి

మేధావులను, భావుకులను అభ్యుదయ కాముకులను వేధించే ప్రశ్నలు ఈ ప్రశ్నలను అందరూ వేసుకోవాలి సమాధానాలను అన్వేషించాలి. పరిష్కారాలను సాధించాలి తీగెలాగితే డొంకంతా కదుల్తుంది గనక ప్రశ్నలన్నిటినీ ఇక్కడ లోతుగా పరిశీలించను మీ ఆలోచనలను రేకెత్తించటమే తక్షణ కర్తవ్యం

ఈ పరిస్థితులకు ఎవరో ఒకరు ఏదో ఒక వర్గం బాధ్యులుకారు అందరికీ పాలుంది ఆధునికత హేతువాదం - వంటివి కొన్నింటిని ఇంతకు ముందు పేర్కొన్నాను ఇందుకు సంప్రదాయవాదుల సహకారం తక్కువేం లేదు సాంప్రదాయికులు ప్రాచీన సాహిత్యాన్ని, సంస్కృతిని హేతుబద్ధంగా పరిశీలించటం మానేసి అదొక్కటే మార్గం అనీ, దాన్ని సంస్కరించటానికి వీల్లేదనీ వాదించారు సాహిత్యంలో మార్పుని నిరోధించారు ఆధునిక విజ్ఞాన, శాస్త్రపరిశోధనల, పరిశీలనల ఫలితాలను అర్థం చేసుకోటానికి ప్రయత్నించకుండా గుడ్డిగా వ్యతిరేకించారు సంప్రదాయాన్ని అర్థం చేసుకోటంలో సాంప్రదాయికులూ ఆధునికులూ ఇద్దరూ సమానంగా దారితప్పారు సంప్రదాయం సంస్కరణకు వ్యతిరేకమని రెండు వర్గాల వారు పొరబడ్డారు సంప్రదాయ సాహిత్యంలో వస్తువు నమ్మకాలు సాహిత్యే తరంగాకూడా వర్తిస్తాయని రెండువర్గాలవారూ- ఒకరు ప్రత్యయం తోనూ, మరొకరు అనుమానంతోనూ విశ్వసించారు. ప్రాచీన సాహిత్యం ప్రచారం చేస్తున్న భావధోరణిని వ్యతిరేకిస్తూనే నమ్మకాలను భౌతిక ప్రపంచ సత్యాలుగా కాక మనఃప్రపంచ కల్పనలుగా స్వీకరించవచ్చునని ఆధునికులు గ్రహించ లేకపోయారు ఇక సాంప్రదాయికులయితే సాహిత్యంలో కథావస్తువును వ్యాఖ్యలను, సందేశాలను వాస్తవాలని నమ్మటమే కాక ఆ ధర్మబోధలు ఈనాటికీ వర్తించేవేనని అమాయకంగా నమ్మారు ఆ విధంగా ఆధునికతను వ్యతిరేకించారు ఈ శతాబ్దపు పూర్వార్థ భాగమంతా ఈ చర్చలు విస్తరించి ఉన్నాయి` అప్పటి సాహిత్య చర్చల్లో సగం ఈ ఘర్షణల చరిత్ర. చరిత్రను వెనక్కి తిప్పలేం గతంనుంచి పాఠాలను మాత్రమే నేర్చుకోగలం` సాంస్కృతిక రంగంలో గతాన్ని అంచనా వేసుకొని మన దృక్పథాలు మలచుకోవలసిన అవసరం వచ్చిందను కుంటున్నాను

విశ్వాన్ని ముంచెత్తుతున్న సామ్రాజ్యవాద, వలసవాద సంస్కృతి మన వాకిట్లోనే పొంచి ఉంది మన ఇళ్లల్లోకే జొరపడింది ఇది కొత్తతరాన్ని విపరీతంగా ప్రభావితం చేస్తుంది ఈ మాదకద్రవ్యం ఏ సంస్కృతినీ మిగలనియ్యదు ఏ విలువ లనూ మన నియ్యదు అందువల్ల మనకు వారసత్వంగా సంక్రమించిన సంస్కృతిలో మంచిని రక్షించుకుందాం

ఈ దృష్టితో మన ప్రాచీన సాహిత్యాన్ని అంచనావేసుకోవాలి గుడ్డిగా ద్వేషించగూడదు అంతా ఆచరణీయం అని నమ్మగూడదు

ప్రాచీన సాహిత్యంలో మత విశ్వాసాలున్నాయి ఆధ్యాత్మిక విషయాలు న్నాయి. వాటిని విశ్వాసాలుగానే గ్రహించి చదువుకోవచ్చు వర్ణ ధర్మాలున్నాయి అగ్ర నిమ్న వర్ణాల భేదాలున్నాయి సామాజిక రంగాలలో లాగే ఇక్కడ నిమ్న వర్ణాల

కన్యాయం జరిగింది స్త్రీల విషయంలో దారుణమైన పాతివ్రత్యం దాస్య బోధ ఉంది వీటిని ఇంకా ఆచరించాలని ఎవరు బోధించినా కాలవ్యతిక్రమమే. అయితే ఇది ఒక నాటి వాస్తవంగా రాగ ద్వేషరహితంగా చరిత్రగా గ్రహించటం సాధ్యమే. సాధ్యం చేసుకోవాలి చరిత్రకారులూ సామాజిక శాస్త్రవేత్తలూ తమతమ పరిశోధనల్లో విశ్లేషిస్తారు, విమర్శిస్తారు వ్యాఖ్యానిస్తారు అందుకు సాహిత్యం ఒక ప్రధాన సమాచార సామగ్రి (source mater'a) మన గతంలో ఉన్నవీ, జరిగినవీ గ్రహించటానికి ప్రాచీన సాహిత్యం చదవాలి గతమంతా చెత్తకాదు. మంచి గతమున కొంచెమైనా ఉంది మానవ సంబంధాలూ ప్రేమలూ అనురాగాలూ ఆప్యాయతలూ ఈ కథల్లో కనిపి స్తాయి వాటిని గ్రహించటంలో తప్పలేదు ఈ కథల్లో పాత్రలపై ఈ శతాబ్ది పూర్వార్ధంలో చాలా చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఇంతగా జరగటానికి ఇవి జాతిసంస్కృతిలో భాగం కావటమే. అంతే కాదు ఈ కథల్నుంచి గ్రహించిన ప్రతీకలను సాహిత్య స్రష్టలు రకరకాలుగా వాడుకున్నారు పద్యాల్లో పాటల్లో కథల్లో ఇవి కనిపిస్తూనే ఉన్నాయి అత్యాధునిక కవిత్వంలో కూడా ఈ ప్రతీకలు కనిపిస్తాయి ఆ సాహిత్యమూ, ఆ చర్చలూ, ఈ ప్రతీకలూ అన్నీ మన సంస్కృతిలో విడదీయరాని భాగాలు అందుకు ప్రాచీన సాహిత్యాన్ని పునఃపఠించాలి

ప్రాచీన సాహిత్యంలో కవితావ్యూహాలు ప్రత్యేకంగా పఠనీయాలు రకరకాల శబ్దాలంకారాలు సరే వాటిద్వారా సాధించిన ప్రయోజనా లేమిటి ? (funct ons) శ్రవో మాధుర్యంతో పాటు భావగత ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా ? ఈ రకమైన చర్చ జరగలేదని కాదు ఒక నిర్దిష్ట ప్రాతిపదిక పై జరగలేదు. స్వీయ భావధోరణి తప్ప ప్రమాణ నిర్ధారణ జరగలేదు.

ప్రాచీన సాహిత్యంలో సంభాషణల్లో ఉక్తి వైచిత్రి కాకుస్వర ప్రయోగం కనిపిస్తాయి కథనంలో ఒక రకమైన వాక్య ప్రయోగం ఉంటుంది ప్రబంధ వర్ణనల్లో కొన్ని ఉత్ప్రేక్షలు రూపకాలు, విశాల విశ్వాన్నీ ప్రకృతినీ, గర్భీకరించుకోగలిగినంత గాఢంగానూ, ఉన్నతంగానూ ఉంటాయి కవుల ఊహాశాలిత కివి జయస్తంభాలు అంతేకాదు ఆయా కవుల లోకజ్ఞతకు కూడా ఇవి దర్పణాలు వీటిని సాహిత్య దృష్టి తోనూ వస్తుసామ్య దృష్టితోనూ మనస్తత్త్వ దృష్టితోనూ వింగడించి విశ్లేషించాల్సిన అవసరం ఉంది ప్రాచీన కవులు కొన్ని పద్యాలను కొన్ని రకాల పద్యాలను కొన్ని భావాల వ్యక్తీకరణలకు వాడుకున్నట్టు కనిపిస్తున్నది. ఉద్ధతశైలికి విక్రీడిత పద్యాలూ, సుకుమారతకు మాలా పద్యాలు, తాత్త్విక భావాలకు గీతపద్యాలు, పుష్పాపచయాది సందర్భాలకు రగడలు మధ్య మధ్యలో స్రగ్ధర, మహా స్రగ్ధరలు, మానిని కవిరాజ విరాజితాలు ఉత్సాహం, పంచ చామరాలు - వంటి పద్యాలు ఏ ఏ ప్రయోజనాలు (funct'ons) నిర్వహిస్తున్నాయి ? ఒక కవి గురించి కాక సాహిత్య సర్వస్వ దృష్టితో పరిశీలించాలి అట్లాగే చంపూకావ్యాల్లో వచనం ఎట్లాంటి ప్రయోజనాలకు కవులు వాడుకున్నారో పరిశీలించవచ్చు

భాషావిషయంలో ప్రాచీన సాహిత్యం అమృతభాండమే. ఇంత వరకూ

ప్రాచీన కావ్యభాషపై జరిగిన పరిశోధన చాలా యాంత్రిక (mechan c) పద్ధతిలో జరిగింది ఫోనీములు మార్ఫీములు (వర్ణాలూ, ప్రకృతి ప్రత్యయాలూ) నిర్ణయించటంతో సరిపోయింది పదనిర్మాణ రీతులను పదవిస్తరణ రీతులను, అధ్యయనం చెయ్యాల్సే ఉంది ముఖ్యంగా కొత్త భావనలకు భాషలో ఏ వనరులను (అర్థ సంకోచ విస్తరణలు కృత్తద్ధితోత్పాదనలు, సమాస కల్పనలు - వగైరా) ఎట్లా ఉపయోగించుకున్నారో శాస్త్రీయంగా పరిశోధిస్తే భాషా విస్తరణ రీతులు తెలుస్తాయి అవి ఈనాటి భాషాయోజనకు (language p ann ng) పలు రకాలుగా పనికి రావచ్చు

ప్రాచీన భాషానిర్మాణావగాహనకు ఇంతవరకు సాంప్రదాయిక వ్యాకరణాలమీదనే ఆధారపడ్డాము ఈ వ్యాకరణాల సంప్రదాయం గొప్పదే కాని అసమగ్రాలు పైగా వాక్యనిర్మాణ, ప్రయోగ శైలీ రీతుల అధ్యయనం చాలా జరగాలి ప్రౌఢ వ్యాకరణంలో కొన్ని స్వల్ప సూచనలు మాత్రమే కనిపిస్తాయి విస్తృత స్థాయిలో ఆధునిక భాషాశాస్త్ర పరికరాల సాయంతో ఈ పని జరగాలి. ప్రాచీన భాషావగాహనకు ఇది అవసరం అంతేకాదు ఆధునిక భాషా వ్యాకరణ రచనకు ఈ పరిశోధన చాలా ఉపకరిస్తుంది

భాషా పరిణామ పరిశోధకులు శాసన భాషా వ్యాకరణాన్ని కొంత విస్తృతంగానే పరిశీలించారు కాని శాసన భాషకు విషయ విస్తృతీ, సందర్భ వైవిధ్యం లేవు సాహిత్య భాషకు ఇవి పుష్కలంగా ఉన్నాయి సాహిత్య భాషను సమగ్రంగా వ్యాకరించకుండా భాషాపరిణామాన్నీ ఆధునికభాషనూ పూర్తిగా అర్థం చేసుకోలేం

ఈ సందర్భంలో వ్యావహారిక భాషావాదం చేసిన హానిని గురించి కూడా కొంత ప్రస్తావించక తప్పదు ప్రాచీన కావ్య రచనా శైలి ఆధునికరచనకు పనికి రాదనే దాంట్లో ఎవరికీ పేచీలేదు అయితే వ్యావహారిక భాష అంటే మాట్లాడే భాష అనే విపరీతార్థం ఇచ్చి, రాసే భాష అంతా- మాట్లాడే భాష గీచిన గిరి దాటకూడదనే భాషా నియంతృత్వవాదం ఒకటి బయలు దేరింది ఈ వాదాన్ని ప్రభావితం చేస్తున్నవారు వర్ణక్రమా(స్పెల్లింగు) లలో అవ్యవస్థను సృష్టిస్తున్నారు, సంధుల్లో అక్రమాలను వ్యాపింపజేస్తున్నారు కొన్ని వాక్యనిర్మాణాలను నిషేధిస్తున్నారు. నిజానికిది వ్యావహారిక భాషా వాదాన్ని స్థాపించిన ఆది గురువుల దగ్గరే మొదలైంది. దాన్ని తెలుగు రచయితలూ, పత్రికాసంపాదకులూ కొందరు భాషను గురించి తెలీని పత్రికా రచయితలూ ప్రచలితం చేస్తున్నారు వ్యవస్థా ధ్వంసమే వ్యావహారిక భాష అనే భ్రమ కల్పిస్తున్నారు. దీన్నుంచి బయట పడాలంటే ప్రాచీన సాహిత్య పఠనం ఒకటే మార్గం కాదు కానీ కనీసం ఒక మార్గం

మనం మాట్లాడే భాషలో పదజాలం మన భాషావసరాలన్నిటికీ సరిపోదు. అవసరాలంటే అన్ని సందర్భాలకు అని కూడా ఈనాటి ఏ వచన రచనను చూసినా ఇట్టే తెలిసే విషయం ఏ వార్తా పత్రిక తీసినా మాట్లాడే భాషలో అవసరంపడని ప్రాచీన

భాషా పదాలు విరివిగా కనిపిస్తాయి. విస్తృత శాస్త్ర రచన చేసేటపుడు ఈ లోపం మరీ కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది ఔద్ధత్యం లాలిత్యం, మాధుర్యం గాంభీర్యం, విషాదం సౌకుమార్యం వంటి అనేక భావరీ'ఘలను ప్రదర్శించ టానికి మాట్లాడే భాష మీదనే ఆధారపడలేం సందర్భోచిత శైలీ వైవిధ్యాన్ని ప్రదర్శించటానికి శాస్త్రనిష్కర్ష పాటించ టానికి మాట్లాడే భాషలో ఉన్న పదాలు చాలవు వాక్యరీతులు కూడా పూర్తిగా చాలవు ఈ లోపాలను పూరించుకోటానికి ప్రాచీన సాహిత్య పరనం అవసరం విదేశభాషా పదాలను యధేచ్ఛగా వాడుకోటానికి సంకోచించని మనం స్వభాషా పదాలను ప్రాచీన మైనంత మాత్రాన వాడుకోటానికి సంకోచించ నక్కర్లేదు

ప్రాచీన సాహిత్యం మన పూర్వులు సృజించి ఇచ్చిన అమూల్య సంపద అనే కాధునికావసరాలకు అందుబాటులో ఉన్న నిధి దీన్ని పారేసుకోటం మన పనికిమాలిన తనం ఉపయోగించుకో లేకపోవటం మన చేతకానితనం

ఇన్ని విధాల అవసరమైన ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని మన విద్యా వేత్తలూ, మేధావులూ, కవులూ, రచయితలూ నిర్లక్ష్యం చేయటం అత్యంత విషాదకరం ఈ సాహిత్యాన్ని తగిన పద్ధతుల్లో విద్యార్థుల చేత చదివించాలి సాహిత్యాభిమానుల చేత చదివించాలి

ప్రాచీన కావ్యాలు ఒక పట్టాన అర్థంకావన్న మాట నిజమే అర్థంచేయి ంచగల పండితులింకా ఉన్నారు వాళ్ళలో కొందరు ఇంకా వ్యాఖ్యానాలు లేని కావ్యాలకు వ్యాఖ్యానాలు రాస్తున్నారు ఇటీవల శ్రీనాధుని కాశీఖండ భీమఖండాల కట్లాంటి వ్యాఖ్యానాలు వచ్చాయి రావాల్సిన గ్రంధాలింకా చాలా ఉన్నాయి తెలుగు సంస్కృతి పరిరక్షణ కేర్పడ్డ తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు మందకొడిగా కాక చురుగ్గా చెయ్యాల్సిన పనులు

ఇంకా ఎన్నో విధాల ప్రాచీన సాహిత్యాన్ని పాఠకులకు సన్నిహితం చేయాలి అందులో ఒక పద్ధతి ఇప్పుడు మీరు చదవబోతున్న పద్యకవితా పరిచయం ఇది ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారి నిబద్ధ కృషి ఫలితం అందుకాయన కున్న అర్హతలను గురించి నేను వేరే చెప్పక్కర్లేదు నాబోటివాళ్ల యోగ్యతా పత్రాలు ఆయన కనవసరం కొత్త గోదావరి కవిగా, సంస్కృత ప్రాకృతాంధ్ర వ్యాకరణ వేత్తగా కావ్యవ్యాఖ్యాతగా కావ్యపురాణ కధకుడిగా ఈపాటికే ఈయన లబ్ధప్రతిష్ఠుడు ఉత్తమోపా ధ్యాయుడి గా జనాకర్షక వక్తగా, అవధానిగా ఇంతకన్నా ఎక్కువగా అవధాన నిర్వాహకుడిగా కూడా ఈయనకు పేరుంది చదివించగల ఆధునిక వచనం రాయగల కొద్దిమందిలో ఈయనొకరు అటువంటివారు ప్రాచీన కావ్యపరిచయానికి పూనుకోటం తెలుగు వారి అదృష్టం సంస్థలు చేయించాల్సిన పనులకు వ్యక్తులే శ్రమపడి పూనుకోటం దన వ్యయానికి సిద్ధపడి అచ్చువేసుకోవాల్సిరావటం మన దురదృష్టం, దౌర్భాగ్యం

ఇందులో బేరా ఇరవై మంది ప్రాచీనాంధ్ర కవులను పరిచయం చేశారు అవే ఇరవై అధ్యాయాలు ప్రతి అధ్యాయంలో ఆ కవి కాలాదులను కవితాలక్షణాలను చాలా క్లుప్తంగా పరిచయంచేశారు ఆ తరవాత కధా ఘట్టాన్ని పరిచయంచేసి

పార్శ్యభాగంలోకి వెళ్ళిపోతారు ఈ పార్శ్యభాగం ప్రధానంగా ఏదో కథా ఘట్టమే అవుతుంది ఈ పద్ధతిలో ఒక అసౌకర్యం ఉన్నమాట నిజమే ఆ కావ్యంలో ఇతరత్రా ఉన్న మంచి పద్యాలు ఇక్కడ రాకపోవచ్చు అయితే ప్రాచీన కావ్యాలు ప్రధానంగా కథా కావ్యాలు ప్రాచీన (కథా) చంపూకావ్యాల్లో పద్య గద్య క్రమానికీ విషయక్రమానికీ క్రమ సంబంధం(connectedness) ఉంటుంది అందువల్ల కథా కావ్య ఘట్టాలు ఎన్నుకోటం అవసరం ప్రాచీన కవుల రచనా సౌందర్యం అక్కడక్కడ రాసిన మంచి పద్యాలకు పరిమితంకాదు ఆ ఘట్టాన్ని నడపటంలో కవి నేర్పు కనిపిస్తుంది అందువల్ల కవి రచనా ప్రతిభ గురించి పూర్తిగా తెలియదుగదా అనొచ్చు ప్రతి కవిని గురించి సంపూర్ణంగా ఒక పుస్తకమే రాయాల్సి ఉంటుంది ఇది ఒక పరిచయం మాత్రమే అని తెలుసుకున్నప్పుడు ఈ పరిమితిని అర్థంచేసుకోటం కష్టంకాదు

ఇక వ్యాఖ్యాత ఒక్కో కవిలో ఆ ఘట్టాన్నే ఎందుకెన్నుకున్నాడు అని అడగొచ్చు కొన్ని చోట్ల మనకు సులువుగానే తెలిసిపోతున్నా కొన్ని చోట్ల మనకూ సందేహం వస్తుంది నన్నయగారి కుమారాస్త్ర సందర్శన ఘట్టం ప్రసిద్ధమే భారత యుద్ధానికి బీజాలు ఇక్కడ పడతాయి భారతవీరుల శౌర్య లక్షణాలు చాలావరకు ఇక్కడే నిర్ణీత మవుతాయి అట్లాగే తిక్కనగారి కీచకవధా ఘట్టమూ ప్రసిద్ధమే ఇక్కడ తిక్కనగారి నాటకీయ శైలి తెలుస్తుంది

అయితే ఎర్రనగారి రచనలో సత్యా ద్రౌపదుల సంభాషణ ఎందుకు తీసుకున్నట్లో అక్కడ ద్రౌపది సత్యభామకు పతివ్రతాధర్మా లుపన్యసిస్తుంది అవి ఇప్పటి సమాజానికి ఏమాత్రం పనికి రాని ధర్మాలు పోనీ అప్పటి ధర్మాలు తెలియటం కోసం అని సమర్థించుకున్నా వ్యాఖ్యాత వాటిని అనుమోదిస్తున్నట్లు రాశారు "భర్త అనురాగాన్ని నిష్కల్మషంగా అనన్యంగా నిరంతరం పొందడమే భార్యకు సౌభాగ్యం' అని వ్యాఖ్యాత తన అభిప్రాయాన్ని జోడిస్తారు పైగా ఎర్రాప్రగడ రచనాశైలిని గ్రహించటానికి ప్రత్యేకించి ఈ ఘట్టం పనికొస్తుందనుకోను నృసింహ పురాణంనుంచో హరివంశంనుంచో గ్రహించి పరిచయం చేస్తే బాగుండేదేమో అట్లాగే- మనుచరిత్రలో వరూథినీ ప్రవరుల సంభాషణ చాతుర్యం పారిజాతాపహరణంలో సత్యభామ అలగటం, శ్రీకృష్ణుడామె అలక తీర్చటం వంటి మధుర ఘట్టాలకు బదులు ఇతర ఘట్టాలు తీసుకున్నారు "రాయలవారు వర్ణనలకు పెట్టింది పేరు" అంటూనే ఆముక్తమాల్యదలో రాజనీతి బోధన ఘట్టాన్ని తీసుకున్నారు వైవిధ్యం కోసమనీ విస్తృత కావ్య ప్రయోజనాలలో మరో పార్శ్వాన్ని చూపిద్దామనీ ఈ పని చేస్తున్నామన్నాక మనం చేసేదేముంది అయితే చివరలో రాయల వర్ణనలను కొన్నిటి నుదాహ రించారు అట్లా కొంత లోప పూరణ చేశారు.

పారిజాతాపహరణంలో మధురఘట్టాన్ని ఈ పుస్తకం ద్వారా దర్శించలేక పోయినా తిమ్మన గారి "మరో పార్శ్వాన్ని" ఇక్కడ ఉచిత గంభీరంగా ప్రదర్శించారు ముఖ్యంగా తిమ్మనగారి ముద్దుపలుకు లిక్కడ ముదురు పలుకులుగా ఎట్లా మారిందీ చూపించారు మేరునగ వర్ణనలోనూ, సూర్యాస్తమయ, చంద్రోదయాస్తమయ

సూర్యోదయ వర్ణనలలో పెద్దనగారిని మించిన అన్వయ కాఠిన్యంతో పాటు భాషా ప్రయోగ దక్షత, ఉత్ప్రేక్షల్లో నిక్షేపించిన ఊహల ఔన్నత్యం కనిపిస్తాయి. వీటి నన్నిటినీ సుగమంచేసి వ్యాఖ్యానించారు బేరా "కవిప్రతిభకు సంబంధించిన అనల్పకల్పనా శక్తికి ఉత్ప్రేక్ష ఒక సాము గరిడీ అనంతలోక పరిశీలనకు ఇది కాణాచి పరిచితశాస్త్ర పాండితిని కవిత్వంగా మలుచుకోవడానికి ఈ అలంకారం అపరిమితంగా అవకాశం ఇస్తుంది" అని ఈయన ఉత్ప్రేక్ష ప్రయోజనాన్ని (function) గురించి చేసిన వివరణ చాల మౌలికమ్మైనది భాషాశాస్త్రంలో ఒక్కో సూత్రం చేసే నిర్వాకం అంటే భాషాప్రయోగంలో నిర్వహించే ప్రయోజనాన్ని వివరించే పద్ధతిని (funct'ona approach) అంటాం ఉత్ప్రేక్షాలంకార ప్రయోగాన్ని గురించి పైన చేసిన వివరణ అట్లాంటిది ఇతర అలంకారాలకు కవితావ్యూహాలకుకూడా ఈ రకం ప్రయోజనాలను అన్వేషించాలి

బేరా గారి వ్యాఖ్యానంలో అనవసరంగా అమరకోశ ప్రమాణాలను చూపించటం, పాండిత్యప్రదర్శనకోసం మాటిమాటికీ సంస్కృత శ్లోకాల నుదాహరించటం వంటి గారడీలుండవు. కవిచేసిన స్వతంత్ర కల్పనలు చూపించటం కోసమే సంస్కృత మూలాలు చూపించారు

ఈ వ్యాఖ్యానంలో అక్కడక్కడ ఛందో వ్యాకరణ వివరణలున్నాయి. ప్రాచీన భాషలో ప్రవేశించటానికివి అవసరమే కాని సాహిత్య పాఠకులందరికీ వ్యాకరణ శాస్త్ర పరిచయం ఉండకపోవచ్చు అందువల్ల బాల వ్యాకరణంలోని సూత్రాలను పేర్కొనటం వల్ల ఎంతమందికి ప్రయోజనం ఉంటుందో చెప్పలేము చదివి మరిచిపోయినవారికి గుర్తుచెయ్యటం వీటి ప్రయోజనం కావచ్చు, అయితే ఇవి తెలియాల్సిన అవసరం మాత్రం ఉంది, కొన్ని చమత్కారాలు గ్రహించటానికి ఈ వ్యాకరణ పరిజ్ఞానం అవసరమవుతుంది. ఉత్తరహరివంశంలో హంసడిభకోపాఖ్యానంలో వాళ్లు వాళ్ల నాన్నతో చేయించే రాజసూయ యాగానికి శ్రీకృష్ణుని రమ్మని జనార్దనుడిని రాయబారం పంపుతారు. జనార్దనుడు కృష్ణుడికి హితుడు. అతను చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాడు. రాజసూయ యాగానికి ఒక రాజు వెళ్లటమంటే యాగం చేసే రాజు ఆధిపత్యాన్ని ఒప్పుకొని కానుకలతో వెళ్లటం. అందువల్ల జనార్దనుడు భాషాప్రయోగంలో జాగ్రత్త వహించాలి. దాన్ని అద్భుతంగా వివరించారు బేరా గారు. అక్కడో పద్యంలో– వేగరమ్మను మియ్యాగమునకు అని ప్రయోగం ఉంది. ఇక్కడ సంధి వివరణ ద్వారా భిన్నపదస్ఫూర్తిని సాధించారు ఈ + యాగము అని ఒక విభాగం. ఈ+ ఆగము అని మరో విభాగం ఒకచోట సిద్ధ సంస్కృత 'య' కారం, ఇంకోచోట సాధ్య ఆగమ అచ్చిక యకారం ఇక్కడ ఈ సూత్రాల ద్వారా ఈ పదస్ఫూర్తి వస్తుంది. ఆగము అంటే అల్లరి అని అర్థం ఒక చమత్కారంతో సంతృప్తిపడే తత్వంకాదు 'బేరా'ది సంస్కృతంలో ' ఆగస్ ' అనే అమహన్నపుంసక శబ్దముందనీ, అది సకారలోపంతో తత్సమంగా తెలుగులో ప్రవేశించి 'ము ' ప్రత్యయాన్ని గ్రహించి ఆగము అయిందనీ, దానికి పాపం–తప్పు అనే అర్థాలున్నాయనీ వివరించారు. ఈ అర్థాలను కవి ఉద్దేశించాడా లేదా అనేది

ఇక్కడ అనవసరం కవి ఆలోచనను పరీక్షించి పట్టుకోటానికి సాహిత్యంలో లిట్మసు టెస్టులుండవు కవి పాఠ్యాన్ని రచిస్తాడు దాని అర్థగ్రహణకు దొరికిన మార్గాలన్నిటినీ పాఠకుడు అన్వేషిస్తాడు

యాగము తత్సమాగము ఆచ్ఛికాగము వివరించిన తరవాత 'ఇది యొక శబ్ద చమత్కారము' అని ఆ చర్చ ముగిస్తారు యడాగమం ద్వారా వచ్చిన చమత్కారం అని ఆయన ఈ గ్రాంథిక వాక్యం ద్వారా సూచించారు వ్యావహారిక శైలిలో యడా గమాలుండవు గదా అందుకని గ్రాంథిక వాక్యాన్ని ఆశ్రయించారు ఇది యొక చమత్కారము (వ్యాఖ్యాతకే వ్యాఖ్యాత అవసరం అవుతున్నట్టున్నాడు)

అట్లాగే భాగవతంలో శ్రీకృష్ణుడు నరకాసురసంహారానికి వెళ్లే ఘట్టంలో సత్యభామ తన్ను కూడా తీసుకెళ్లమని అడుగుతుంది అక్కడ సత్యభామ దేవా ప్రాణేశ . అని శ్రీకృష్ణుడుని ఉద్దేశించి రెండు సంబోధనలు చేస్తుంది వాటికి సున్నితమైన అర్థాలను ప్రతిపాదించారు దేవా అంటే కోరిక తీర్చమనీ ప్రాణేశ అంటే కోరిక మన్నించమనీ అర్థాలట భక్తుల కోరికలు తీర్చే బాధ్యత దేవుడిది భార్యకోరికను మన్నించే అవసరం భర్తది రెండు సంబోధనల్లోను అంత స్వారస్యాన్నిలాగారు ఇట్లాంటి చమత్కార వివరణలు ఈ వ్యాఖ్య గుణాన్నిపెంచాయి శ్రీకృష్ణుడు సత్యను సంబోధిస్తూ 'కన్య.' అంటాడు ఆదునిక రసజ్ఞులు భార్యను 'ఇదిగో అమ్మాయీ' అని పిల్చినట్టట కొన్ని ప్రయోగాల్ని ఆధునికభాషలో జాతీయాలకు అన్వయించి చెప్పటం కూడా ఈయన వ్యాఖ్యలో కొత్తదనం. 'సాలప్రాంశున్' అని కర్ణునికి నన్నయగారు వేసిన విశేషణాన్ని తెలుగులో 'చెట్టంత మనిషి ' అని వ్యాఖ్యానించటం అట్లాంటిదే

ఉత్తర హరివంశంలో'' ఇందే వచ్చినపని, గోవింద యెఱింగింప కెఱుంగవే'' అనే ప్రయోగంలో వాక్యాన్వయం ప్రకారం పెడితే, గోవింద ఇందే వచ్చిన పని యెఱింగింప కెఱుంగవే- అని ఉంటుంది. వచ్చిన పని గోవింద- అని కూర్చటం వల్ల ఈనాటి వాడుకలో ఉన్న ''నాపని గోవింద!'' అనే రకమైన అర్థాన్ని లాగారు ఆ కాలంలో ఈ జాతీయం ఉందని మనకాధారంలేదు లేదని చెప్పలేం దేనికీ విరుద్ధం కానంతవరకు ఈ పద్ధతి వ్యాఖ్య పాఠ్యానికి రమణీయత పెంచుతుంది కనక అభ్యంతరం చెప్పక్కర్లేదనుకుంటాను సంబోధనల్లో స్వారస్యం చూపిన చోట దీన్ని గ్రహించాలి అన్ని సంబోధనల్లోనూ ఔచిత్యం చూపించటం కుదరదు వేరా గారు సరిగ్గా అదేపని చేశారు. ఉన్నచోటనే చూపించారు, లేనిచోటలేదు

ఈయన పూర్వవ్యాఖ్యానాలను పరిశీలించారు. ఏ వ్యాఖ్యాత అయినా పూర్వవ్యాఖ్యాతలకు ఋణపడే ఉంటాడు అంతటితో ఆగిపోతేనే ప్రమాదం పూర్వ వ్యాఖ్యాతలతో భేదించిన చోట్లు చూపించారు. పాఠభేదాలనుకూడా ప్రస్తావించారు పూర్వవ్యాఖ్యాతలు చెప్పింది చెప్పి, తాను చేర్చింది చూపించారు ఆముక్త మాల్యదలో- (4-247)'' పోవంబోలు లఘుప్రయాణత దినమ్ములే కొన్ని యొండొంటనే కాపైలిక్షితికి సైన్యము గూడ '' అనే పద్యభాగాన్ని వ్యాఖ్యానిస్తూ '' ఒండొంట '' శబ్దాన్ని

వేదంవారూ వావిళ్ళవారూ సైన్యానికి అన్వయించారు బేరా కాలానికి అన్వయించారు. ''ప్రతిరోజూ అవిఘ్నంగా ప్రయాణం సాగాలనటం కాలం దృష్టితో ప్రధానం'' అని వినయంగా చెప్పారు వారిది తప్పనలేదు. ఇంకో అన్వయం సాధ్యమన్నారు

బేరా కవులపట్ల పక్షపాతం చూపలేదు పోల్చినచోట ఎవరు ఎక్కడ మించారో సోదాహరణంగా చూపించారు కాకపోతే మొత్తం చదివితే ఈయనకు రాయలవారి పట్ల విపరీతమైన గౌరవం ఉందనీ చేమకూరవాని పట్ల బోలెడు చిరాకుందనిన్నీ తెలుస్తుంది. సాహిత్యాన్ని ఎంత పక్షపాత రహితంగా చదివినా అభిరుచి భేదాలను బట్టి ఈ మాత్రం గౌరవ భేదాలు తప్పవనుకుంటా అందులో తప్పకూడా లేదనుకుంటాను.

కంకంటి పాపరాజు దగ్గరి కొచ్చే సరికి వ్యాఖ్యానం మానేశారు, పద్యాలు సుబోధకంగా ఉన్నాయి గనక. పద్య సరళీకరణం ఇక్కడే ప్రారంభమైందన్నారు. అందువల్ల వ్యాఖ్యానం అక్కర్లేదనుకున్నారు తెలుగు కవిత్వంలో పాపరాజు మార్గం ఒకటుందనీ తిరుపతి వేంకట కవులూ పింగళి - కాటూరి కవులూ ఈ మార్గాను యాయులనీ ప్రతిపాదించారు ఇది ఇంకాస్త పరిశోధించ వలసిన అంశం

అనేకార్థక కావ్యాలలో కూడా వీలుదొరికినప్పుడు అత్యుత్తమ కవితా శిల్పాన్ని కవులు చూపిస్తారనటానికి రాఘవపాండవీయంలో వసంత వర్ణన పద్యాన్ని తెలుగు సాహిత్యంలో గొప్ప పద్యమన్నారు అచ్చతెలుగు కావ్యాలు- ఉన్న తెలుగు పదాలను రక్షించుకోటానికి చదవాలని సూచించారు కొత్త తెలుగు పదాలను సృజించుకునే పద్ధతికి కూడా అచ్చ తెలుగు కావ్యాలు పనికి వస్తాయి

అట్లాగే తెలుగు కవులు కొత్త డిక్షన్ తయారు చేసుకొన్నవైనం చూపించారు పాండురంగమాహాత్మ్యంలో 'తోయదవాహన రత్నవేది', ఘర్మగభస్తి వంటివి, కాళహస్తి మాహాత్మ్యంలో దివిషదన్నప్రాయ వాగ్గుంఫన, పారిజాతాపహరణంలో అమరుల బోన పుట్టిక వంటి వాటిని ఉదాహరించారు. వీటిపై ఇంకా పరిశోధిస్తే తెలుగు కవుల సృజన శక్తిని గురించి మరికొన్ని విషయాలు తెలుస్తాయి

'బేరా' ఇన్ని విధాల ఉపయోగకరమైన ఆసక్తికరమైన, ప్రతిభావంతమైన ప్రాచీన సాహిత్య పరిచయంలో నేను తీవ్రంగా విభేదించే ఒక అంశం చెప్పకతప్పదు ప్రాచీన సాహిత్యంలో పరిహరించ వలసింది పాతివ్రత్యం అనే విలువ అది స్త్రీని బానిస చేసింది ఎర్రాప్రగడలో ఆ ఘట్టాన్ని ఎన్నుకోటంవల్ల స్త్రీలకే కాదు కవికికూడా అన్యాయం జరిగింది.

కాశీఖండంలో గుణనిధి కథ తీసుకున్నారు యజ్ఞదత్తుడు కొడుకును సమర్థించి తనకు నిజం తెలియనియ్యని సోమిదమ్మను వదిలేసి ఇంకో శ్రోత్రియుని కూతుర్ని పెళ్లాడి గృహస్థధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడట ఇది భార్యకు చేసిన దారుణమైన అన్యాయం. వ్యాఖ్యాత దీన్ని నిరసించక పోగా ఆమోదిస్తున్నట్టు ''కొడుకుని పాడు చేసినందుకు ఇది ఆమెకు శిక్ష '' అంటాడు యజ్ఞదత్తుడు గృహస్థ ధర్మాలను నిర్వర్తిస్తున్నాడు గనక శివ సాయుజ్యం పొందుతాడు. సోమిదమ్మ గతి ఏమిటి ?

భోజరాజీయంలో ఆ రమణీలలామకు అని ఉంటే ఆ పతివ్రతకు అని అర్థం చెపుతారు పతివ్రతను స్త్రీకి పర్యాయపదం చేశారు ఈ విషయంలో 'బేరా' లో మార్పును ఆశిస్తాను

ఈ పద్య కవితాపరిచయం చూసిన తరవాత నాకెన్నో ఆశలు కలుగుతున్నాయి పద్యరచనలో సౌందర్యదృష్టి ఎట్లావస్తుందో, ఆ సౌందర్యాన్ని గ్రహించే పద్ధతి ఏమిటో వివరించే ఒక రీడర్ లాంటిది తయారు చేస్తే ఈ పుస్తకానికి అనుబంధ గ్రంధంగా పనికొస్తుంది

ఆధునిక కాలంలో కొత్త వస్తువులతో కావ్య, ఖండ కావ్యరచన జరిగింది దురదృష్టవశాత్తు ఆధునిక కవిత్వం అంటే వచన కవిత్వం అనే అర్థం వస్తున్నది కాని ఈ శతాబ్దపు పూర్వార్థంలో అనేక సాహిత్య ధోరణులకు పద్యం విస్తరించింది స్వాతంత్రోద్యమం, దేశభక్తి స్వరాష్ట్రోద్యమం, భావకవిత కర్షక కవిత సంస్కరణోద్యమం హేతువాదోద్యమం అభ్యుదయోద్యమం - ఇటువంటి బహూద్యమాలలో పద్యం వాహకంగా విస్తరించింది సరళీకృత పద్యం ఆధునిక భావ వ్యాప్తికి అద్భుతంగా దోహదంచేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆధునిక పద్యకవితా పరిచయం అనే పుస్తకాన్ని కూడా బేరా లాంటివారు రాయాలి ఇప్పటి గ్రంధంలో చోటు దొరకని ప్రాచీన కవులింకా ఉన్నారు కావ్యధోరణులింకా ఉన్నాయి ద్విపద కావ్యాలు పరిచయం కాలేదు శివ కవితోద్యమం పరిచయంకాలేదు శతకధోరణిలో ప్రసిద్ధశతకాల పరిచయంకూడా అవసరమే క్రీడాభిరామం ఒక ప్రత్యేక ధోరణికి చెందిందికదా! అనంతర ప్రబంధయుగ కవులను పూర్తిగా విస్మరించలేం ప్రాచీన కవయిత్రులలో రంగాజమ్మ, ముద్దుపళని, తరిగొండ వెంకమాంబ వాళ్ల గురించి కూడా తెలుసుకోవాల్సి ఉంది ఈ గ్రంధానికి మరో భాగంగా ఇంకొకటి అవసరం.

ఇట్లా చెప్పకుంటూ పోతే ఇంకా ఎన్నో ఉన్నాయి ఇవన్నీ ఒక్క మనిషి చెయ్యగలడా ? ఒక్క మనిషే చెయ్యాలా ? అనే ప్రశ్నలు ఎదురవుతాయి. ఈ పని చేయించాల్సిన విద్యాసంస్థలు విద్యేతర వ్యవహార పంకంలో నిలువులోతుగ కూరుకుపోయినప్పడు ఇంక దారేది ? అదీ ఈ రకం పుస్తకాలు తయారు చేయటానికి మాటి మాటికీ శ్లోకాలప్పచెప్పే పాండిత్యం చాలదు రసదృష్టి కావాలి అందాలు వెలికితీయగల చాతుర్యం కావాలి సుబోధకంగా వ్యక్తం చెయ్యగల నేర్పుండాలి అన్నిటికీ మించి పాఠకులను వెంటతీసుకుపోయే వచనం (commun cat ve prose) రాయగలిగిన నైపుణ్యం ఉండాలి. ఇవన్నీ ఒక్క బేరాకే ఉన్నయ్యని కాదు కాని, ఇవి బేరా లో పుష్కలంగా ఉన్నయ్యని నాకు తెలుసు అందుకే ఈ ఆశ. వాటి కోసం ఎదురు చూస్తూ అందాకా ఈ ప్రాచీన కావ్యపరిచయలహరిలో ఓలలాడుదాం

చేరా

౧౯౭ అక్టోబరు ౧ - ౩

నన్నయభట్టు (11-వ శతాబ్ది)

ఆంధ్రమహాభారతము-(కుమారాస్త్ర విద్యాసందర్శన1-6-14నుంచి 63)

తెలుగులో మహాకావ్యరచనకు శ్రీకారం చుట్టినవాడు నన్నయ భట్టారకుడు అందుకే ఇతడిని ఆదికవి అంటారు. రాజమహేంద్రవరం రాజధానిగా వేంగిదేశాన్ని పరిపాలించిన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఈయన ఉండేవాడు క్రీ.శ. ౦౮౦ ప్రాంతం వ్యాస మహాభారతాన్ని ఆంధ్రీకరించడానికి అనువైన ప్రణాళిక వేసుకొని రచన ప్రారంభించాడు. ఆది సభాపర్వాలు పూర్తిచేసి అరణ్యపర్వంలో సగం వరకూ వచ్చేసరికి రచన ఆగిపోయింది బహుశ నన్నయ దివంగతుడు అయ్యుంటాడు శారద రాత్రులు . అనేది వీరి చివరి పద్యం

ఈ ఆంధ్రీకరణ మహాయజ్ఞంలో నన్నయకు నారాయణ భట్టు సహకరించాడు వీరిద్దరూ సహాధ్యాయులు కృష్ణార్జున మైత్రి. వీరి ఆంధ్రీకరణకు రాజరాజ నరేంద్రుడు ప్రథమశ్రోత రాజరాజు కోరిక మీదనే చంద్రవంశపు రాజుల చరిత్రగదా అని నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీ కరించడానికి పూనుకున్నాడు ఇవి అవతారిక ద్వారా తెలిసే విశేషాలు

వ్యాసభారతాన్ని మక్కికి మక్కిగా అనువదించడం నన్నయ లక్ష్యం కాదు భారత కథల్లో ఉన్న పరమార్థాన్ని తన బాణీలో తెలుగువారికి అందించాలనుకున్నాడు. అలాగేచేసాడు స్వతంత్రకావ్యంలా సంతరించాడు. తరవాత వచ్చిన తిక్కన ఎఱ్ఱన్న కూడా ఇదే పద్ధతి అనుసరించారు ఈ ముగ్గురూ కలిసి భారతాంధ్రీకర్తలై కవిత్రయం అయ్యారు

నన్నయకన్నాముందు తెలుగుపద్యాలు, ఒకటి రెండు శాసనాల్లో కనపడుతున్నాయి కానీ ఆ ఛందస్సులకీ ఆ తెలుగుభాషకీ కావ్యగౌరవం కలిగించిన ఘనత నన్నయదే పద్యకావ్య నిర్మాణానికి నన్నయ పెట్టిందే ఒరవడి

ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తినిధి త్వము అనేవి తన కవిత్వానికి ప్రధానగుణాలని నన్నయ అవతారికలో చెప్పకున్నాడు ఆనాటికి సంస్కృత అలంకార శాస్త్రంలో ప్రసిద్ధికెక్కిన మూడు ప్రస్థానలకీ ఇవి ప్రతిబింబాలు మొదటిది రసప్రస్థానానికి, రెండవది రీతిప్రస్థానానికి మూడవదిఅలంకార ప్రస్థానానికి సంసూచ కాలు సూక్తి అంటే (శోభనా చ సా ఉక్తిశ్చ) అలంకారమనే.

భారతంలో రసవద్ఘట్టాలను కావ్యఖండాలుగా నన్నయ తీర్చి దిద్దాడు అటువంటి ఒక రసగుళిక కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం

కౌరవ పాండవుల నైపుణ్యాలను ధృతరాష్ట్రాదులకూ ప్రజలకూ తెలియ జూపడానికి వినోదంగా ద్రోణాచార్యుడు అస్త్ర విద్యా ప్రదర్శన ఏర్పాటు చేసాడు. ప్రేక్షకాగారం కిటకిటలాడిపోతోంది కుంతి గాంధారి, ఇంకా సుందరీమణులూ ఒక

వైపున కూర్చున్నారు వ్యాస కృప శల్యశకుని, భీష్మ విదురాదులు మరొక ప్రక్క కూర్చున్నారు మంత్రులూ సామంతులూ దండనాయకులూ మహామండలేశ్వరులూ వచ్చారు. గాయకులూ వంది మాగధులూ చేరారు అంతా ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు

ద్రోణాచార్యుడు తెల్లని వస్త్రాలు ధరించి నెరిసిపోయిన జుట్టూ, గడ్డమూ మీసాలతో రంగమధ్యంలో మధ్యాహ్న సూర్యుడులా నిలబడ్డాడు అశ్వత్థామ అంగారక గ్రహంలా ఆ ప్రక్కనే నిలబడ్డాడు

పాండవులూ కౌరవులూ జ్యేష్ఠానుపూర్విగా వచ్చి తమతమ విద్యల ను ప్రదర్శిస్తున్నారు భీమదుర్యోధనులు గదా యుద్ధానికి తల పడ్డారు ఒకే శిఖరమూ రెండు పర్వతాలూ అన్నట్టు కలహించుకుంటున్నారు

అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ, నత్యుచ్చ భై
రవహుంకార రవంబునన్ వియదగారంబెల్ల భేదిల్ల బాం
డవ కౌరవ్యగదా విఘట్టన మహాండ ప్రోత్థమై, భావి పాం
డవ కౌరవ్యరణాభి సూచన పటిష్ఠం బయ్యె ఘోరాకృతిన్ (ర 4)

ఆ ఇద్దరి కాలితాపులతోనూ భూమి కంపిస్తోంది భయంకరమైన హుంకారాలతో ఆకాశమండపం పగిలిపోతోంది. అకారణంగా-ఉత్తినే -వాళ్ళిద్దరూ గదలతో కలబడ్డారు అది పెరిగిపోయింది భవిష్యత్తులో జరగబోయే కురుక్షేత్ర మహాసంగ్రామానికి ఇది సూచకమా అన్నంత ఘోరంగా మారిపోయింది

ఇది భీమదుర్యోధనుల గదాయుద్ధం ద్వంద్వయుద్ధం అది ఎంత పట్టుగా సాగుతోందో తెలియజెయ్యడానికి పద్యం కూడా బిగింపుగా సాగింది ''పాద ఘాత హతి అత్యుచ్చభైరవ భేదిల్ల గదావిఘట్టనము ప్రోత్థమై రణాభిసూచన పటిష్ఠంబు, ఘోరాకృతిన్'' అంటూ సంయుక్తాక్షరాలూ సమాసాలతో ఈ పద్యరచన వీరరసానుకూలంగా ఆ దృశ్యాన్ని చూపిస్తోంది అందునా మత్తేభ పద్యం

భీమదుర్యోధనులు ఇలా తలపడి నువ్వానేనా అని పోరాడుతుంటే ప్రేక్షకులు రెండువర్గాలుగా చీలిపోయారు. కొందరు దుర్యోధనపక్షం. మరికొందరు భీమపక్షం. ఉత్సాహం ఉరకలు వేసి పక్షపాతం మేరమీరి పరస్పర క్రోధవచనాలు మిన్నుముట్టాయి

గాంధరీ ధృతరాష్ట్రులకి విదురుడు జరుగుతున్న సంగతులు వివరించి చెబుతున్నాడు.

ద్రోణుడికి పరిస్థితి అర్థమయ్యింది ఇది చిలికి చిలికి గాలివాన అవుతుంది అనుకున్నాడు ప్రదర్శన భంగపడుతుందని భయపడ్డాడు వెంటనే అశ్వత్థామను పంపించి భీమదుర్యోధనుల్ని విడదీసాడు అప్పటి వరకూ సముద్రఘోషగా బోరున మ్రోగుతున్న వాద్యాలు శాంతించాయి

''ఇప్పుడు నా ప్రియశిష్యుడు అర్జునుడు తన ధనుర్విద్యా కౌశల్యం ప్రదర్శిస్తాడు. తిలకించండి'' అని ద్రోణుడు ప్రకటించాడు. అర్జునుడు రంగమధ్యంలోకి వచ్చాడు.

హారివిచిత్రహేమ కవచావృతు డున్నతచాపచారు దీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పల వర్ణుడు, సేంద్రచాప శం
పారుచి మేఘమో యనగ బాండవ మధ్యము దొప్పి బద్ధ తూ
ణీరుడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నె చూడగన్. 6-17

అందమైన విచిత్రమైన బంగారపు కవచం ధరించాడు ఆజానుబాహుడు ఒక చేతిలో ఉన్నతమైన ధనుస్సు ఉంది మనిషి నల్లకలువల రంగు లో తళతళలాడుతున్నాడు పైరెండింటితో (విచిత్రహేమకవచం ఉన్నత చాపం) కలిసిన మొత్తం రూపం -హరివిల్లుతో,మెరుపుతీగతో కలిసిఉన్న నీలమేఘంలాగా ఉంది వీపుమీద అటూ ఇటూ అంబుల పొదులున్నాయి పాండవమధ్యముడైన అర్జునుడు ఇలా వచ్చి రంగమధ్యంలో నిలబడితే ప్రజల చూపులన్నీ అతడి మీదే నిలబడ్డాయి

అర్జునుడి రూపంలో ఉన్న ఉదాత్తతనీ వీరోచిత దర్పాన్నీ ఉన్నతినీ ఈ పద్యం సూచిస్తోంది సమాస నిర్మాణంలో ప్రయోజనం నెరవేరింది నడకలో లీవి స్ఫురిస్తోంది వేటిని స్ఫురింపజెయ్యాలన్నా కవిచేతిలో ఉన్నసాధనాలు శబ్దార్థాలు మాత్రమే గదా వాటిని సద్వినియోగం చేసుకొని వాచ్యార్థంకన్నా లోతయిన అంశాలు స్ఫురింపజేయగలిగిన వాడే మహాకవి

అర్జునుడు నల్లగా ఉంటాడని ఈ పద్యంలో తెలుస్తోంది. ''కర్జి విక్ర మంబు కాల్పనే'' అని ద్రౌపది ఉద్యోగపర్వంలో అంటుంది కర్జి అంటే నల్లనివాడు అనే అర్థం ద్రౌపది కూడా నలుపే 'కృష్ణ' అని ఆవిడకి పర్యాయపదం శ్రీ కృష్ణుడు సరేసరి నీల మేఘశ్యాముడు ఇలా పాండవ పక్షంలో ముఖ్యులు ముగ్గురు నల్లనివారు

ఇంద్ర ధనుస్సుతో మెరుపుతీగతో కలిసిఉన్న మేఘంలా ఉన్నాడు అర్జునుడు వర్షఋతువులో కనబడవచ్చు ఇటువంటి దృశ్యం ఇక్కడ మరొక విశేషం ఉంది ఇంద్రచాపంతో కలిసి ఉన్న మేఘంగా ఉత్ప్రేక్షించడం వల్ల అర్జునుడు ఇంద్రుని కుమారుడు అనే విషయం కూడా స్ఫురణకు వస్తుంది

వీడె కృతహస్తు డఖిలాస్త్ర విద్యలందు,
వీడె యగ్రగణ్యుడు ధర్మవిదులలోన
వీడె భరత వంశం బెల్ల వెలుగ. గుంతి
కడుపు చల్లగా. బుట్టిన ఘన భుజుండు. 6-19

''ఇతడే అర్జునుడు అఖిలాస్త్ర విద్యానిపుణుడు ధనుర్విద్యా వేత్తలలో (ధర్మవిదులలో) అగ్రగణ్యుడు కుంతి కడుపు చల్లగా జన్మించాడు భరత వంశాన్ని ఉజ్జ్వలంగా ప్రకాశింపచేస్తాడు '' అంటూ ప్రజలు పెద్దగా అరుస్తున్నారు ఆశాభావం ప్రకటిస్తున్నారు

దీర్ఘసంస్కృత సమాసాల ప్రయోగంలోనే కాదు ''కడుపుచల్లగా'' వంటి తెలుగు పలుకుబళ్ళ వాడకంలోనూ నన్నయ కృతహస్తుడే

కుంతీదేవి ఆనందానికి అవధులు లేవు. మనస్సులో మాతృప్రేమ పొంగి

పాల్లింది. ఆనంద బాష్పధారలూ క్షీరధారలూ పెల్లుబికాయి (తల్లికి బిడ్డల్ని చూసి మనస్సు ఉప్పొంగితే పాలధారలు స్రవిస్తాయిట)

చారు మనస్స్వమ్మద రస
పూరము వెలివేర్చునట్లు పొలతికి విగళ
ద్భూరిస్తన జనిత పయో
ధారలు, నానంద బాష్పధారలు నొప్పెన్ (6-21)

ప్రజల ఆనంద కోలాహలం మిన్నుముట్టి ఆకాశాన్ని బద్దలు కొట్టేసేటంతగా విజృంభించేసరికి ధృతరాష్ట్రుడు అదిరిపడ్డాడు "ఇది యేమి రభసంబు" అని విదురుణ్ణి అడిగాడు అర్జునుణ్ణి చూసిన ప్రజల ఆనందకోలాహలమిది అని అతడు చెప్పాడు " ఆహా చెవులు ఉన్నందుకు ఫలంగా పాండుసుతుల విద్యాశక్తులు ఇప్పుడు వింటున్నాను"-అని ధృతరాష్ట్రుడు తన ఆనందాన్ని పొగడ్తలతో ప్రకటించాడు (6-24) కన్నులు లేకపోవడం వల్ల చూడలేకపోతున్నా చెవులున్నందుకు వినగలుగుతున్నాను. అదే పది వేలు అని ధృతరాష్ట్రుడి అభిప్రాయం ఆనందాన్నే ప్రకటించాడు పదిమందిలోనూ అంత తేలికగా బయటపడతాడా మరి

ద్రోణాచార్యుని అనుమతితో అర్జునుడు తన అస్త్ర విద్యా ప్రదర్శన ప్రారంభించాడు ఆగ్నేయాస్త్రంతో అగ్నులు కురిపించి వారుణాస్త్రంతో వానలు కురిపించి చల్లార్చాడు మేఘాస్త్రంతో మేఘాలు సృష్టించి వాయవ్యాస్త్రంతో చెదరగొట్టాడు భూబాణంతో భూమిలో ప్రవేశించాడు శైలబాణంతో మహాపర్వతం అయ్యాడు అదృశ్యాస్త్రం వేసి అదృశ్యుడయ్యాడు చిత్రవిచిత్రమైన అస్త్రాలు ప్రయోగించాడు క్షణంలో పొట్టివాడవుతున్నాడు మరుక్షణంలో పొడుగువాడవుతున్నాడు. సూక్ష్మరూపం ధరిస్తున్నాడు రథం మీద కనబడుతున్నాడు ఆకాశంలో నిలబడుతున్నాడు. మరు నిమేషంలో నేల మీదే ఉంటున్నాడు.

ప్రజలంతా ఆశ్చర్యపోతున్నారు నిశ్శబ్దంగా కళ్ళు అప్పగించి చూస్తున్నారు ఉన్నట్టుండి-ప్రదర్శనశాల ముఖద్వారం దగ్గర ఎవరో జబ్బచరిచారు కొండ మీద వజ్రాయుధం పడినంతటి చప్పుడయ్యింది ప్రజలంతా అటు దృష్టి మళ్ళించారు పాండవులు వెళ్ళి ద్రోణుడి వెనకాల నిలబడ్డారు కౌరవులంతా దుర్యోధనుణ్ణి చుట్టుముట్టారు ఇది సన్నివేశగతమైన నాటకీయత. ఆ వచ్చినవాడు ఎవరు? -కర్ణుడు.

సాలప్రాంశు, నిజోజ్జ్వలత్కవచు, శశ్వత్కుండలోద్భాసితున్,
బాలార్కప్రతిమున్, శరాసన ధరున్, బద్ధోగ్ర నిస్త్రింశు, శౌ
ర్యాలంకారు, సువర్ణ వర్ణు ఘను, గర్ణాఖ్యున్, జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణు జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్ 6-31

(సాలము=మద్దిచెట్టు, ప్రాంశువు= ఎత్తయిన సాలప్రాంశువు=చెట్టంత మనిషి) సాలప్రాంశువు-అంటే చెయ్యెత్తు(చెయ్యిచాపినంత ఎత్తు) మనిషి ప్రకాశిస్తున్న

కవచం తళతళలాడుతున్న కుండలాలు. బంగారపు రంగులో బాలసూర్యుడిలా మెరిసిపోతున్నాడు. ధనుస్సు ఉంది. ఖడ్గం ఉంది. శౌర్యమే భూషణంగా కనపడుతున్నాడు కంటికి దిట్టంఛా అనుతున్నాడు అతడిగుణగణాలు అప్పటికే కొందరు ప్రజలకు తెలుసు ఇలాంటి రూపంతో కర్ణుడుగుమ్మంలో కనిపించేసరికి ప్రేక్షకులంతా ఆశ్చర్యచకితులయి పోయారట

కర్ణుడుగుమ్మంలో కనిపించేసరికి ప్రేక్షకులంతా ఆశ్చర్యచకితులయి పోయారట

వీరి ఆశ్చర్యానికి కారణం ఏమిటి ? ఎత్తయిన రూపం మెరిసిపోతున్న కవచ కుండలాలు బంగారపు మేనిచాయ- ఇవన్నీ ఆశ్చర్యం కలిగించే అంశాలే ధనుస్సుతో ఖడ్గంతో శౌర్యం ఉట్టిపడుతూ వచ్చినిలుచు న్నాథు ఇదేమిటీ ఇతడు ఇప్పుడు ఇక్కడకు వచ్చాడు, అనేది కూడా ఆశ్చర్యజనకమే. ఇది కుమారాస్త్ర విద్యాప్రదర్శన ద్రోణుడి శిష్యులకి- కౌరవ పాండవులకి పరిమితంగా జరుగుతున్న కేవల విద్యాప్రదర్శన వినోద ప్రదర్శన దీనికి ఇతడు రావడమేమిటి? ప్రేక్షకుడుగా రావచ్చు కానీ అలా అనిపించడం లేదే. వాలకం చూస్తే కయ్యానికే వచ్చినట్టుంది భయంకరం గా జబ్బచరచడం ఒకటి బహుశ ఇవన్నీ కారణంగా చూపరులు ఆశ్చర్య పోయారు

'బాలార్క ప్రతిముడు' అనడంలో కర్ణుడి జన్మవృత్తాంతం స్ఫురిస్తుంది సాల ప్రాంశువు అనేమాట ముందు చెప్పి తరవాత కవచకుండలాల ప్రసక్తి తేవడంలో ఒక చమత్కారం ఉందిట భవిష్యత్తులో చివరికి కర్ణుడు కవచకుండలాలను కోల్పోయి వట్టి శరీరంతో సాలప్రాంశువుగా మిగులు తాడనిట కావచ్చు అర్జునుణ్ణి పరిచయం చేసిన పద్యంతో పోల్చిచూస్తే మరికొన్ని చమత్కారాలు స్ఫురిస్తాయి

అర్జునుణ్ణి పరిచయం చేసిన పద్యంలోకూడా అన్ని విశేషణాలూ చెప్పి 'పాండవ మధ్యముడొప్పె'' అనేమాట కూడా అనేసి ఆ తరువాత ''బద్ధ తూణీరుడు'' అనే విశేషణం వేసాడు నన్నయ్య ఇది పాఠకుల దృష్టిని దాని మీదకు కేంద్రీకరింపజేసే శిల్పం భవిష్యత్కథలో అర్జునుడు అక్షయ తూణీరాలతో నిలుస్తాడు అని సూచన.

అర్జునుణ్ణి వర్ణించిన పద్యం ఉత్పలమాల -కర్ణుడి పద్యం శార్దూలం దాని నడకలో సాత్త్వికత దీని నడకలో ఔద్ధత్యం. ఇది వీరి స్వభావాలకు ప్రతీక ప్రేక్షకుల స్పందనలోకూడా ఇది ప్రతిబింబించింది. అర్జునుణ్ణి చూసినపుడు ప్రజలు ఆనందించారే తప్ప ఆశ్చర్యపోలేదు కర్ణుడి ఆకారం ఆశ్చర్యపరిచింది సాత్త్వికతకీ ఔద్ధత్యానికీ ఉన్న భేదం ఇది.

కర్ణుడు జబ్బ చరిచి ద్వారం దగ్గర ఆగిపోలేదు ప్రజల్ని అదల్చి తప్పించుకుని వచ్చి రంగమధ్యంలో నిలబడ్డాడు అన్నివైపులకీ కలియ జూసాడు కృపద్రోణులిద్దరికే నమస్కరించాడు. ఉరుముతున్నట్లు మాట్లాడు తూ అర్జునిడితో వాదానికి దిగాడు

నీవ ఒడు నేర్పుకాడవు

గా వలవదు, వీని గొన్ని గఱచితిమేమున్

నీ విద్యలెల్ల జూపుదు

మే వీరులు సూడ మేలు మేలని పొగడన్ (౧-౩౩)

అర్జునా నువ్వే పెద్ద నేర్పరి ననుకుంటున్నావేమో? ఈ నీ విద్యలు మేము కూడా కొన్ని నేర్చాం వీరులంతా మెచ్చుకునేట్టు ఇవన్నీ మేముకూడా ప్రదర్శించగలం

ఆత్మస్తుతి పరనింద అనే దుర్గుణాలు రెండూ అక్షరశః ప్రతిధ్వని స్తున్నాయి ''పరగ దను దా బొగడి కోలు బ్రబ్బికోలు రెండూ ఆత్మహత్యా సదృశాలన్నారు పెద్దలు కర్ణుడు జన్మించిన తీరు పెరిగిన వాతావరణం ఎదురైన సమస్యలు కసి- అన్నీ కలిసి అతడిని వాచాలుడుగా మార్చేసాయి ఇదొక వింత మనస్తత్వం

'' నాకూ ఇటువంటి విద్యలు వచ్చు నేనూ ప్రదర్శిస్తాను అనుమతి ఇవ్వండి'' అని సాత్త్వికంగా అడిగి ఉండవచ్చు ఇవ్వనంటే అప్పుడు చూడవచ్చు కానీ అలా చెయ్యడం కర్ణుడి తత్త్వానికి విరుద్ధం

అనిన నినతనయు పలుకులు

జనులకు విస్మయము, సవ్యసాచికి కోపం

బును సిగ్గును, మఱి దుర్యో

ధనునకు బ్రీతియును జేసె. దత్ క్షణమాత్రన్ ౧-౩౪

అసలే ఆశ్చర్యచకితులై చూస్తున్న ప్రజలకు కర్ణుడి మాటలు మరీ ఆశ్చర్యం కలిగించాయి అర్జునుడికైతే ఒక వైపు కోపం మరోవైపు సిగ్గు- ముంచెత్తుకొచ్చాయి దుర్యోధనుడికి మాత్రం ఆ క్షణంలో గొప్ప ఆనందం కలిగింది

ద్రోణుడు కర్ణుడికి అనుమతి ఇచ్చాడు అర్జునుడు ప్రదర్శించిన అస్త్రవిద్యా విశేషాలన్నీ అనాయాసంగా కర్ణుడు ప్రదర్శించాడు దుర్యో ధనుడు తన తమ్ముళ్ళతో సహా వెళ్ళి కర్ణుణ్ణి కౌగిలించుకున్నాడు ''నాతో స్నేహంగా ఉండు నాకూ నా బంధుకులకూ హితం చెయ్యి నన్నూ ఈ కౌరవసామ్రాజ్యాన్నీ ఉపయోగించుకో'' అని దుర్యోధనుడు అనగానే కర్ణుడు ఒప్పేసుకున్నాడు ''ఈ మూగిన రాజసమూహమూ నువ్వూ చూస్తుండగా అర్జునుడితో నేను ద్వంద్వ యుద్ధం చెయ్యాలి'' అని తన కోరిక వెల్లడించాడు అర్జునుడు మండిపడ్డాడు

పిలువంగ. బడక సభలకు

బలిమిం జని పలుకు పాపభాగుల లోకం

బులకు జనవేడి పలికెదు

పలువ! యెఱుంగవు పరాత్మ పరిమాణంబుల్ (౧-౩౫)

ఓరీ నీచుడా పిలవని పేరంటంగా సభల్లోకి చొచ్చుకు వెళ్ళి ఇష్టం వచ్చినట్టు మాట్లాడే పాపాత్ములు పోయే లోకాలకి పోదామని ఉందా నీ అంతస్తూ నా అంతస్తూ తెలుసుకోకుండా ఇలా మాట్లాడుతున్నావ్!

ఎవరు పిలిచారని వచ్చావు? వచ్చిన వాడవు నోరుమూసుకొని కూచోక వాగుతావా మేము రాకుమారులం తెలుసా? ఇన్ని హెచ్చరికలు న్నాయి ఈ పలుకు

ల్లో ''పలువ'' అని సంబోధించడం అర్జునుడి అసహనానికి చిహ్నం అయితే మొదట్లో కర్ణుడు చేసిన అధిక్షేపణ కూడా దీనికి కారణం

హార్దా. కుంటి సాకులు పలుకకు అస్త్రాలతోనే సమాధానం చెప్పు ఈ రంగ భూమి అస్త్ర విశారదులందరికీ చెందుతుంది అంతే కానీ వీరికి ప్రవేశం ఉంది వీరికి ప్రవేశం లేదు అనే నిబంధనలు ఏమీ లేవు-

ఈ రంగ భూమి యస్త్ర వి
శారదులగు వారికెల్ల సామాన్యముగా
కారయు వీరికి. కొరనగు
వీరికి. గాదను విచార విషయము గలదే! (౧-౩౮)

కర్ణుడు గర్వించి పలికాడు. దుర్యోధనుడు సమ్మతించాడు ద్వంద్వ యుద్ధానికి సన్నద్ధమయ్యాడు ద్రోణుడి ప్రేరణతో, ధర్మజాదుల ప్రోత్సాహంతో అర్జునుడు ప్రళయాగ్నిలాగా ప్రతిఘటించి నిలబడ్డాడు.

జనితామర్షుఁ డంత బార్థుఁడయి బర్జన్యాస్త్ర ముత్కర్ణుఁ డే
సె నపారంబయి భూనభోంతరము దజ్జీమూత యూథంబు గ
ప్పిన దద్ధ్వాంత తిరోహితాపఘనుఁడై బీభత్సుఁ డుండెన్, విరో
చను డాత్మద్యుతి విస్తరించె సుతుపై సంప్రీత చేతస్కుఁడై. (౧-౪౦)

సహనం కోల్పోయి ముందుగా కర్ణుడు పర్జన్యాస్త్రం వేసాడు వెంటనే నల్లని మేఘాలు దట్టంగా వ్యాపించాయి భూనభోంతరాలలో అంతా కటిక చీకటి. అసలే నల్లని అర్జునుడు, ఆ చీకటిలో కలసిపోయి కనబడటం లేదు కర్ణుడి మీద మాత్రం సూర్యకాంతి పడుతోంది ఆ తండ్రి (విరోచనుడు) ఈ కొడుకుని చూసి సంతోషిస్తున్నట్టుంది

(ధ్వాంతం చేత తిరోహితమైన అపఘనం=శరీరం కలవాడు అయ్యాడు)

సరిగ్గా ఈ సమయంలో దుర్యోధనుడు సోదరసహితుడై కర్ణునివైపు నిలబడ్డాడు భీష్మద్రోణులు కృప పాండవులు అర్జునుడి ప్రక్కన నిలబడ్డారు కర్ణార్జునుల యుద్ధానికి కుంతి భయపడింది అర్జునుడు చీకటిలో కలసిపోయాడనీ ఏమి జరుగుతుందో అనీ ఆరాటం పెరిగి మూర్ఛ పోయింది. ప్రక్కనే ఉన్న విదురుడు శీతలోపచారాలు చేసాడు తేరుకుంది

''అంత నర్జునుండ నిల బాణంబున నమ్మేఘపటలంబు పఱవ నేసి యాదిత్యసమతేజుండయియున్న విదురదర్శితులైన యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లెనపుడు ధర్మవిదు డఖిల ద్వంద్వయుద్ధ సమాచార నిపుణుం డయ్యిద్దఱ నడుమ నిలిచి కర్ణున కిట్లనియె-'' (౧-౪౪)

అర్జునుడు వాయవ్యాస్త్రం ప్రయోగించాడు మబ్బులు చెదిరిపోయాయి సూర్యుడు కనపడ్డాడు అర్జునుడుకూడా అదే కాంతితో ప్రకాశించాడు కర్ణార్జునులను విదురుడు చూపించాడు కుంతి చూసింది హమ్మయ్య అని సంతోషించింది

ద్వంద్వయుద్ధ నియయాల్ని తెలిసిన కృపాచార్యుడు కర్ణార్జునుల మధ్య నిలబడి కర్ణుడితో ఇలా అన్నాడు

కురుకులజుండు పాండునకు గుంతికి బుత్రుడు రాజధర్మబం
ధురచరితుండు నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదు వంశమును దల్లిని దండ్రిని జెప్పు- చెప్పినన్
దొరవగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూసెడున్. 6-45

అర్జునుడి గోత్రనామాలు చెప్పాడు. నీ వంశమూ నీ తల్లి దండ్రులూ చెప్పమన్నాడు నువ్వు దొరవయితే నీతో అర్జునుడు యుద్ధం చేస్తాడన్నాడు ఇది ఆనాటి సాంఘిక నియమ స్థితి

వ. అనిన విని కర్ణుడు దన కులంబును, దల్లిదండ్రులను జెప్ప సిగ్గువడి తల వంచి యున్నం జూచి దుర్యోధనుడు గృపున కిట్లనియె (6-46)

కులము గలవాడు,శౌర్యము
గలవాడును, నధికసేన కలవాడును, భూ
తలమున రాజను నామము
విలసిల్లగ దాల్చు మూడు విధముల పేర్మిన్ (6-47)

కులం ఉన్నవాడూ పరాక్రమం ఉన్నవాడూ పెద్దసైన్యం ఉన్నవాడూ ఈ ముగ్గురూ రాజు అనే పేరుకు అర్హులు కర్ణుడికి శౌర్యం ఉంది కనుక రాజు పదానికి అర్హుడే అని దుర్యోధనుడి అభిప్రాయం ఒకవేళ అదీ కుదరదంటే

రాజసుతుడైన పార్థుతో రాజుగాని
యాత డని సేయగా దగడేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ
రాజు జేసెద నే నంగ రాజ్య మిచ్చి (6-48)

రాజ్యం లేదు కాబట్టి రాజుకాడు రాజుకాడు కాబట్టి అర్జునుడితో యుద్ధం చెయ్యడానికి తగడు అనేట్టయితే ఇదిగో ఇప్పుడే అందరూ చూస్తుండగా ఈ కర్ణుణ్ణి నేను అంగరాజ్యం ఇచ్చి రాజును చేస్తాను. దుర్యోదనుడు ఈ మాట అనడమేమిటి అన్ని ఏర్పాట్లూ చకచకా జరిగి పోయాయి భీష్మ ధృతరాష్ట్రుల అనుమతి తీసుకున్నాడు కర్ణుణ్ణి కాంచన పీఠం మీద కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా పట్టాభిషేకం జరిపించాడు. కిరీటంతో సహా సకలరాజ చిహ్నాలూ కర్ణుడికి అమిరాయి పట్టలేని సంతోషంతో అంటున్నాడు దుర్యోధనా-

దీనికి సదృశముగా మఱి
యే నేమి యొనర్తు నీకు నిష్టం? బనినన్
మానుగ నాతో జెలిమి మ
హానూతముగ జేయు మిదియె యిష్టము నాకున్. (6-51)

ప్రత్యుపకారం ఏం చెయ్యమంటావు అని కర్ణుడడిగితే ' నాతో స్నేహంగా

బేతవోలు

ఉండు-చాలు అదే ప్రత్యుపకారం. అంతకంటే ఏమీ అవసరం లేదు'' అన్నాడు గంభీరంగా దుర్యోధనుడు

అనిన విని దుర్యోధనున కెంతయు సంతోషంబుగా గర్ణుం డతని తోడి
యిష్టసఖిత్వంబున తొడంబడియె నంత గొడుకు రాజ్యాభిషేకోత్స
వంబుసూచి హర్షపరవశుండయి సూతుండు కర్ణునొద్దకుంబఱతెంచిన
గర్ణుండును వినమితోత్తమాంగుండైన- (౬-౩౨)

కడగి సూతుండు పుత్రకు గౌగిలించి
కొని,తదీయ మూర్ధాఘ్రాణ మొనరజేసి
అంగ రాజ్యాభిషేకార్ద్రమైన శిరము
దడిపె వెండియు హర్షాశ్రు తతులజేసి- (౬-౩౩)

సూతుడు వచ్చి కర్ణుణ్ణి కౌగిలించుకున్నాడు. శిరస్సు మూర్కొన్నాడు అభిషేక జలంతో అప్పటికే తడిగా ఉన్న ఆ శిరస్సును తన ఆనందబాష్పాలతో మరింత తడిపాడు

భీముడికి కథ అర్థమయింది. కర్ణుడి తండ్రి ఎవరో తెలిసిపోయింది పరిహాసిస్తూ-

నీదు కులమునకు దగగ బ్రి
తోదము గొని రథము నడప దొడగుము నృపధ
ర్మోదయుడగు నర్జునుతో
గాదనక రణంబు సేయగా నీ కగునే! (౬-౩౫)

ఉత్తమ క్షత్రియ ప్రవరోపభోగ్య
మైన యంగరాజ్యంబు నీ కర్హమగునె?
మంత్ర పూతమై గురుయజమాన భక్ష్య
మగు పురోడాశ మది కుక్క కర్హ మగునె!! (౬-౩౭)

కర్ణా! నీ కులానికి తగినట్టు నువ్వు కమిచీ పట్టుకోవాలి రథం తోలుకోవాలి అంతే గానీ అర్జునుడితో నీకు యుద్ధమేమిటి. క్షత్రియోచితమైన అంగరాజ్యానికి కూడా నువ్వు అనర్హుడివి మంత్ర పూతమైన పురోడాశాన్ని (యజ్ఞంలో నైవేద్యం లాంటిది) యజ్ఞం చేసేవాళ్ళు చేయించేవాళ్ళు పుచ్చుకోవాలి తప్ప కుక్క ముట్టుకోవచ్చా కుక్కకు అర్హమగునె !

కర్ణుడు ఎలా నోరు పారేసుకుంటాడో, భీముడు అంతకంటే ఎక్కువ. కుక్కల దాకా వెళ్ళిపోయాడు పాపం కర్ణుడు అవాక్కయి తెల్లబోయాడు నిట్టూర్చాడు

'' కర్ణుండు వెల్లనై యెద్దియుంజేయునదినేరక దీర్ఘోష్ణ నిశ్వాస వ్యాకులి తవదనుండై ఆకాశంబువలననున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె''
(౬-౩౮)

తన తండ్రి సూర్యుడు ఆకాశంలో ఉన్నాడు ఆయన గానీ, భూమి మీదే ఉన్న తన తల్లి గానీ నోరు విప్పి మాట్లాడరు అసహాయ స్థితిలో అలా చూస్తూ నిలబడి

పోయాడు ఈ దుఃస్థితిని గమనించి

"అంతర్విలులితుండైన కర్ణుంజాది భ్రాతృ పద్మవన మధ్యంబునుండి దుర్యోధన మదాంధ గంధ సింధురంబు వెలువడివచ్చి యలిగి భీముని కిట్లనియె (6-58)

తొంబై తొమ్మిది మంది సోదరులు పద్మాల్లాగా ఉంటే.ఆ పద్మవన మధ్యం నుంచి మదించిన ఏనుగులాగా దుర్యోధనుడు వెలువడి వచ్చాడు సాధారణంగా మత్తేభం పద్మవనాలను నాశనం చేస్తుంది బహుశ ఈ మద గజం కారణంగానే భ్రాతృ పద్మవనం నాశనమవుతుందని సూచన కాబోలు ఇది మూలభారతంలో వ్యాసుడు చెప్పిందే **"భ్రాతృ పద్మవనాత్తస్మిన్మదోత్కట ఇవ ద్విపః (ఆది 27-9)**

అనిలజ! నీ కిట్లని ప

ల్కను దలపను నగునె? లేడి కడుపున బులి పు

ట్టునె?, యిట్టి దివ్యతేజం

బునవాడ ధమాన్వయమున బుట్టునె చెపుమా!" (6-59)

భీమా ఇలా మాట్లాడటం నీకు తగునా లేడి కడుపున పులి పుడుతుందా? ఇంత దివ్యతేజస్సుతో ఉన్న ఈ మనిషి అధమకులంలో పుట్టాడంటే నమ్మడం ఎలాగ? -అన్నాడే తప్ప దుర్యోదనుడైనా కులప్రసక్తి ఎందుకు? అందులో హెచ్చు తగ్గులేమిటి? అని అడగలేకపోయాడు అదీ ఆనాటి వర్ణవ్యవస్థ పట్టు

శూరుల జన్మంబు సురల జన్మంబును

నేఱుల జన్మంబు నెఱుగ నగునె,

యెుగిని దధీచి యెముకల బుట్టదయ్యెనే

వాసవాయుధమైన వజ్రమదియు,

గాంగేయుడన మఱి కార్తికేయుండన

నాగ్నేయుడన రౌద్రుడనగ శరవ

ణోద్భవుండన, గుహుండుద్భవిల్లడె శర

స్తంబజన్ముడు గాడె ధర్మవిదుడు

కృపుడు, ఘట సంభవుడు గాడె కీర్తిపరుడు

వరుడు ద్రోణుడు, విప్రుల వలన బుట్టి

రైరె సత్ క్షత్రియ ప్రభు లవని గావ

గడగి మా జన్మములు నిట్లకావె వినగ! (6-60)

ఇలాగ ఎవరెవరు తక్కువ కులాల్లో పుట్టి గొప్ప గొప్పవాళ్ళు అయ్యారో ఏకరువు పెట్టాడు. కృపాచార్యుడి మాట ఏమిటి? ద్రోణుడు కుండలో కాదా పుట్టింది? అంతెందుకు మేమేమిటి-మాజన్మలేమిటి? అని ప్రశ్నించాడు అయినా వాటితో పనేమిటిలే...

వానితోడి దేమి! సహజ కవచకుండల మండితుండితడు ప్రకృతి

పురుషుండు గాడు:తన బాహుబలంబున నీ యంగ రాజ్యంబునకె కాదు:సకల మహీ రాజ్యంబున కర్హుండగు ననుచున్నయంత నాదిత్యుండ స్తంగతుండైన నన్ని సందర్శన రంగంబు వెలువడి దుర్యోధనుండు గర్ణుం దోడ్కొని కరదీపికాసహస్రంబులువెలుంగ నిజమంది రంబున కరిగె..... (6-61)

సహజ కవచకుండలాలున్న ఈ కర్ణుడు సాధారణ మానవుడు కాదు. బాహు బలంతో ఈ అంగరాజ్యాన్నే కాక మొత్తం భూమండలాన్నే పరిపాలించదగినవాడు- అని దుర్యోధనుడు కర్ణుణ్ణి సమర్థిస్తూ తన మందిరానికి తీసుకు వెళ్ళాడు.

కుంతి యంత సహజకుండల కవచాభి
రాము గర్ణు జూచి, రవి సమాను
బ్రత్యభిజ్ఞ నెఱిగి, ప్రథమ పుత్ర స్నేహ
మెఱుక పడక యుండ నింతి యుండె (6-62)

కుంతీదేవి కర్ణుణ్ణి కవచకుండలాలతో గుర్తించింది. సూర్యతేజస్సు గుర్తుగా తన పెద్దకొడుకు అని గ్రహించింది. అయినా అది ఇతరులకు తెలియకుండా ఉండే ట్టూ,తన ముఖంలో ఏ మార్పూ రాకుండా ఉండేట్టూ, జాగ్రత్త పడింది. ధీరురాలు.

వినుత ధనుర్విద్యావిదు
ఘను గర్ణు సహాయు బడసి, కౌరవ విభు డ
ర్జునువలని భయము సెడి తో
మ్మున జేయిడి నిద్రవోయె ముదితాత్ముండై. (6-63)

ఇంతకాలమూ దుర్యోధనుడు అర్జునుడికి భయపడుతున్నాడు. గదా విద్యలో భీముడికి పోటీగా తాను ఉన్నాడు. ధనుర్విద్యలో కిరీటికి సాటిగా తన వైపున ఎవరూ లేరు. అదీ భయం. నిద్ర పట్టడం లేదు. ఇప్పుడు కర్ణుడు దొరికాడు. భయం తొలగి పోయింది.సంతోషించాడు.హాయిగా గుండెల మీద చెయ్యివేసుకొని నిద్రపోతున్నాడు.

వ్యాస భారతంలో ఈ ఘట్టం నాలుగు అధ్యాయాల్లో (ఆది 124 నుంచి 127)నూట ఇరవై ఎనిమిది శ్లోకాల్లో సాగింది . దీన్ని నన్నయ మొత్తం యాభైఆరు గద్యపద్యాల్లోకి కుదించాడు. అయినా మూలంలో ఉన్న ఏ అందాన్నీ విడిచి పెట్టలేదు. పైగా''అవనీ చక్రము పాదఘాతహతి నల్లా డంగ..'' అనే అమూలకమైన పద్యంతో కొత్త అందాన్ని సంతరిం చాడు.

ఔచిత్య దృష్టితోనో,లేకపోతే తనకు దొరికిన ప్రతిలో లేకపోవడం వల్లనో గానీ మూలంలో ఉన్న ఒకటి రెండు చిన్న చిన్న విషయాలను నన్నయ పరిహరించాడు.

అర్జునుడు ధనుర్విద్యను మాత్రమే కాకుండా ''గదా ఖడ్గాది వివిధాయుధ దక్షతనూ ప్రదర్శించాడని (6-28) నన్నయ్య చెప్పాడు. దీనికి మూలం ఇది-

ఇత్యేవమాది సుమహత్ ఖడ్గే ధనుషి చాభవత్
గదాయాం శస్త్రకుశలో దర్శనాని వ్యదర్శయత్

కర్ణుణ్ణి వర్ణించిన నాలుగు శ్లోకాలనూ ఒక పద్యంగా రూపొందిం చాడు

నన్నయ్య. అంతేకాదు కర్ణుడు సూర్యసంభవుడని వ్యాసుడు వాచ్యం చేస్తే (తీక్ష్ణాంశోర్భాస్కరస్యాంశః) నన్నయ్య దాన్ని వ్యంగ్యంగా సూచించాడు

రంగమధ్యంలోకి వచ్చి నిల్చిన కర్ణుడు 'కలయం జూచి కృప ద్రోణా చార్యులకు నమస్కరించి'' అని నన్నయ్య చెప్పాడు ఇక్కడ వ్యాసుడు-

స నిరీక్ష్య మహాబాహుః సర్వతో రంగమండలం

ప్రణామం ద్రోణ కృపయోః ర్నాత్యాదృత మివాకరోత్

ద్రోణాచార్యునికీ కృపాచార్యునికీ మొక్కుబడిగా నమస్కరించాడు అంతగా ఆదరం కనబడలేదు (న+అత్యాదృతం) అని చెప్పాడు కర్ణుడికి కృపద్రోణుల మీద ఆ క్షణంలో అనాదరం ఉండవలసిన అవసరం లేదు నిజానికి

''నీవ కడు నేర్పుకాడవు గావలవదు, వీని గొన్ని గఱచితి మేమున్ అంటూ అర్జునుడితో తొలిసారిగా కర్ణుడు పలికిన మాటల్లో ఆక్షేపమూ, అహంకారమూ, అధిక్షేపమూ అన్నీ స్ఫురిస్తాయి వ్యాసుడి కర్ణుడు ఇలా మాట్లాడలేదు

పార్థ! యత్తే కృతం కర్మ విశేషవదహం తతః

కరిష్యే పశ్యతాం నృణాం మాత్మనా విస్మయం గమః (। ౭౦-౨)

అర్జునా. నువ్వు చేసి చూపినవన్నీ నీ కంటే విశేషంగా నేనూ చెయ్య గలను ఈ రాజులంతా చూస్తుండగా చేస్తాను ఆశ్చర్యపోవద్దు అన్నాడు అంతే ఈ మాటల్లో ఆక్షేపం లేదు కానీ బబ్బచరచడంలోనూ, నీ కంటే విశేషంగా చేస్తాననడంలో నూ ఉన్న అహంకారానికి తగినట్టుగా నన్నయ మాటలు కూర్చాడు.

ఈ కర్ణుడి మాటలకు ప్రజలు ఆశ్చర్యపోయారు అని మాత్రమే చెప్పి ఊరుకున్నాడు నన్నయ్య యంత్రోత్క్షిప్త ఇవ క్షిప్రముత్తస్థౌ సర్వతో జనః అన్నివైపులా జనం-యంత్ర+ఉత్క్షిప్తులలాగ టక్కున లేచి నిలబడ్డారు అన్నాడు వ్యాసుడు. యంత్రోత్క్షిప్తులు అనే మంచి పోలికను నన్నయ ఎందుకో వదిలేసాడు

కర్ణార్జున సంవాదంలోకూడా చిన్నచిన్న తేడాలు ఉన్నాయి పిలవని పేరంటంగా వచ్చి సభల్లో వాగే పాపాత్ములు పోయే లోకాలకు పోదామను కుంటున్నావా దుష్టుడా! (పలువా) అన్నాడు తెలుగు అర్జునుడు సంస్కృతం అర్జునుడు పలువా అనలేదు గాని ''అలాంటి వాళ్ళు పోయే లోకానికి పోతావు నువ్వు ఇప్పుడు నా చేతిలో చచ్చి. 'అన్నాడు దీనికన్నా పై తిట్టే నయం

అనాహూతోపసృప్తానా మనాహూతోపజల్పినాం

యే లోకాస్తాన్ హతః కర్ణ మయా త్వం ప్రతిపత్స్యసే

దీనికి బదులుగా కర్ణుడు అలాగే అన్నాడు- గురువుల సమక్షంలో ఇప్పుడే బాణాలతో నీ తల నరికేస్తానన్నాడు గురోస్సమక్షం యావత్తే హరామ్యద్య శిరః శరైః -ఈ చావు కబుర్లన్నీ నన్నయ చల్లగా వదిలేసాడు

కర్ణుడు మేఘాలను సృష్టించినప్పుడు ఇంద్రుడు తన కుమారుని వైపు సస్నేహంగా చూశాడనీ, ఇది గమనించి సూర్యుడు తన పుత్రుడ్ని సమీపిస్తున్న మేఘాల

ను నాశనం చేసాడనీ వ్యాసుడు వర్ణించాడు

తతః స్నేహాత్ హరిహయం దృష్ట్వా రంగావలోకినం
భాస్కరోపనయన్నాశం సమీపోపగతాన్ ఘనాన్

ఇలా కర్ణార్జునుల పక్షాన తండ్రులు నిలబడటాన్ని నన్నయ్య పరిహరించాడు ఇంద్రుడి ప్రసక్తి తేలేదు సూర్యుడి విషయం మాత్రం సూచన ప్రాయంగా చెప్పి ఊరుకున్నాడు.

కర్ణుడి శక్తి సామర్థ్యాలు చూసాక దుర్యోధనుడికి భయం పోతే ధర్మరాజుకి భయం పట్టుకుందన్నట్టుగా సూచించాడు వ్యాసుడు-యుధిష్ఠిరస్యాప్యభత్తదా మతిర్న కర్ణతుల్యోస్తి ధనుర్ధరః క్షితౌ ' కర్ణుడికి సాటి వచ్చే విలుకాడు భూమిలోలేడు అని దర్మరాజు నిర్ణయించుకున్నాడు దీన్నికూడా నన్నయ పరిహరించాడు

అస్త్ర విద్యాప్రదర్శన ఘట్టం ముగిసాక ద్రోణుడు శిష్యుల్ని ద్రుపదుడి మీదకి పంపిస్తాడు తన పాత కసి తీర్చుకోడానికి . ఇదీ తరువాత ఘట్టం.

నన్నయ్యకు సంబంధించి ఇప్పటికి రెండువందలయాభైకి పైగా వ్యాసాలు వెలువడ్డాయి. పాతిక దాకా పరిశోధనలు జరిగాయి ఏదో ఒక స్థాయిలో పాఠ్యభాగంగా పాఠకులకు నన్నయ్య రచన పరిచితమయ్యే ఉంటుంది అందుకని ఈ వ్యాసాన్ని క్లుప్తంగా ముగించడమయ్యింది

నన్నెచోడుడు (12వ శతాబ్ది)

కుమారసంభవము...పార్వతి తపస్సు (6-82 నుంచి 67)

నన్నెచోడుని కాలాన్ని గురించి చాలా చర్చన భర్చనలు జరిగాయి వాదోపవాదాలు నడిచాయి నన్నయ్యకు ముందువాడని కొందరంటే తిక్కన్నకి తరువాతవాడని కొందరన్నారు అదీ ఇదీ కాదు ఇద్దరికీ నడిమి వాడు క్రీ శ ౧౨వ శతాబ్దము అని చివరకి సిద్ధాంతం చేసారు

కుమారసంభవము ఒక్కటే ఇతని రచన గూఢ వస్తుమయంగా జాను తెనుగులో రచిస్తానని ప్రతిజ్ఞచేసాడు ఈ రచనలో నన్నయకన్నా ముందర్ కాలానికి చెందిన కొన్ని ప్రయోగాలు కనపడటంతో ఇతని కాలానికి సంబంధించి వాదోపవాదాలు చెలరేగాయి పైగా పూర్వ కవి స్తుతుల్లో అనంతర కవులు ఎవ్వరూ ఇతడి పేరు చెప్పలేదు క్రీ.శ ౧౯౦౯ వ సంవత్సరంలో మానవల్లి రామకృష్ణకవి గారు ఈ పుస్తకాన్ని బయట పెట్టేవరకూ ఎవరికీ అసలు ఇది ఉన్నట్టే తెలీదు శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ఈ కుమారసంభవం నన్నెచోడుని రచనకాదు, మానవల్లి వారి కూటసృష్టి అని ఇటీవలనే ఒక ప్రతిపాదన చాలా బలంగా చేసారు అది ఇంకా పరిశోధకుల ఆమోదాన్ని పూర్తిగా పొందినట్టులేదు అంచేత ఇతడు ప్రస్తుతానికి క్రీ శ ౧౨వ శతాబ్దివాడుగానే లెక్క. ఇతడు జంగమ మల్లి కార్జునుణ్ణి తన గురువుగా పేర్కొని అతడికే కావ్యం అంకితం చేసాడు కావ్యకథ శివలీలాత్మకం కాబట్టి ఇతడు శైవుడు అనడంలో అభిప్రాయభేదం లేదు

నన్నయ్య ప్రారంభించిన భారతాంధ్రీకరణ పద్ధతికి కొంచెం భిన్నంగా ఇతడి రచన సాగింది ఇది పూర్తిగా కావ్యధోరణి మనుచరిత్రాది ప్రబంధాలకు మార్గదర్శకంగా వర్ణనలకు పెద్ద పీట వేసింది అచ్చ తెనుగు పదాల వాడకం ఎక్కువ ఇందులో కొన్నిపదాలకు అర్థం చెప్పడంలో ఇప్పటికీ పెద్దలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు

సతి జన్మం, వినాయకసంభవం దక్షాధ్వర ధ్వంసం, సతి అగ్ని ప్రవేశం పార్వతీజననం శివుని తపస్సు, తారకాసుర సంక్షోభం, మన్మధదహనం పార్వతి తపస్సు, గౌరీ కళ్యాణం, కుమారస్వామి జననం తారకా సుర సంహారం ఇవీ ఈ కావ్యంలో ప్రధానఘట్టాలు. పురాణ కథను తీసు కొని పన్నెండు ఆశ్వాసాల సుందర ప్రబంధంగా మలచాడు

సతి జన్మంబున్, గణాధీశ్వరుజననము, దక్షక్రతుధ్వంసముం, బా
ర్వతి జన్మంబున్, భవోగ్రవ్రతచరితయు, దేవద్విషత్ క్షోభమున్, శ్రీ
సుత సంహారమ్ము, భూభృత్సుత తపము నుమాసుందరోద్వాహమున్, ద
ద్రతి భోగంబుం, గుమారోదయము, నత డనిన్ దారకుం బోర గెల్పున్

ఈ కావ్యంలో అన్ని వర్ణనలూ మనోహరంగానే ఉంటాయి ఐనా పార్వతీ

తపస్సును నన్నెచోడుడు వర్ణించిన తీరు మరీ మనోహరం. శివుడు మన్మథుణ్ణి భస్మం చేసేసాడు. తపస్సు కొనసాగించుకోవడం కోసం వేరే చోటుకి తరలి వెళ్లిపోవడంతో పార్వతిలో పట్టుదల పెరిగింది. తపస్సు చేసి మెప్పించి శివుణ్ణే భర్తగా పొందాలని నిర్ణయించుకుంది. తల్లిదండ్రుల అనుమతి తీసుకుంది. గురుతుల్యులైన మునీంద్రుల ఉపదేశం పొందింది. శైవాగమదీక్ష స్వీకరించింది. ఆ తపోవేషం ఎలా ఉందంటే-

పవడంపు లతమీద ప్రాలేయ పటలంబు
పర్వెనా మెయినిండ భస్మమలది
లాలితంబగు కల్పలత పల్లవించెనా
గమనీయ ధాతు వస్త్రములు గట్టి
మాధవీలత కళిమాలికల్ ముసరెనా
రమణ రుద్రాక్ష మాలకలు పెట్టి
వరహేమలతిక పై బురినెమ్మి యూగెనా
సన్నుతంబగు నెఱి జడలుపూని
హరుడు మాహేశ్వరీ రూపమ్మైన చెలువ
మభినయించెనొ యని మునులర్థిజూడ.
గురుతపశ్శక్తి మూర్తిసేకొనిన కరణి
దగిలి యుమ తపోవేషంబు దాల్చి పొల్చె 6-82

(మాలా+కన్=మాలకలు. రలయతి,హారములు అని వావిళ్ల ప్రతి)

పార్వతీదేవి పసుపు ముద్దలాంటి తన శరీరం నిండా విభూతి పులుముకుంది. పగడాలతీగమీద తెల్లని మంచు దట్టంగా పడినట్టుంది. దీక్షావస్త్రాలు కట్టింది. అవ్వి గైరికధాతువర్ణంలో ఉన్నాయి. అంటే ఇంచు మించు ఎఱ్ఱగా ఉన్నాయి. కల్పలత చిగురించినట్టుంది. రుద్రాక్షమాలికలు మెడలోనూ చేతులకీ నడుముకీ ఇలా వొళ్లంతా ధరించింది. మాధవీలత మీద తుమ్మెదలు బారులు బారులుగా వాలినట్టుంది. రుద్రాక్షలు నల్లగా ఉంటాయి. జుట్టుకి ముడి వెయ్యకుండా జడలుగా విడిచి పెట్టింది. బంగా రు తీగమీద (హేమలత=చాంపేయలత=సంపెగతీగ) మగ నెమలి పింఛం అరబోసుకొని ఊగుతున్నట్టుంది. ఈ రూపాన్నీ కోరికోరి చూస్తూ మును లు, శివుడు మహేశ్వరీ రూపాన్ని అభినయిస్తున్నాడా అనుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే తపశ్శక్తి మూర్తీ భవించినట్టుంది పార్వతీదేవి తపస్వినీ వేషం.

వ. తదనంతరంబ 6-83

వేని కుంకుమరాగంబు, మెలత తోపు
మోవి తాంబూలరాగంబు మొగిన వాసి
చారుతరమయ్యె దోడ నా శైలతనయ
వీతరాగంబు ప్రకటించు విధము పోలె 6-84

అంతఃపురకన్యలు విలాసంగా శరీరం నిండా పులుముకొనే కుంకు మ

రాగాన్ని పార్వతి ఇప్పడు పులుముకోవడం లేదు పరిత్యజించింది అసలే ఎఱ్ఱని పెదవి దానికి తాంబూలరాగం దూరమయ్యింది (తపోదీక్షలో తాంబూలం వేసుకోరు) ఆ రాగమూ ఈ రాగమూ (ఎఱుపు) పోవడం ఎలా ఉందంటే- పార్వతీదేవి తన వీతరాగ స్థితిని (రాగద్వేషాలు విడిచి పెట్టిన వైరాగ్యస్థితి) ప్రకటించుకొంటున్నట్లుంది రాగ శబ్దానికి ఎరుపూ ప్రేమ అని రెండు అర్థాలు ఇది శ్లేష చమత్కారం (మొగిన్+ అ= మొగిన+ పాసి= మొగిన వాసి =వెంటనే విడిచి)

కురులతో గూడ విలసిల్లు గిరిజ మొగము
జడలుదాల్చిన గడు బెడం గడరి పాల్చి
భృంగములు మూగి చెలువొందు బిసరుహంబు
పాకు దాల్చియు గర మొప్పు భంగిపోలె 6-86

ఇది వరకు పార్వతీదేవి నుదురుమీద ముంగురులు ఆడుతూండేవి అప్పడది తుమ్మెదలు మూగిన పద్మంలాగా (బిసరుహము) భాసించేది ఇప్పడేమో జుట్టు జడలుకట్టి వేలాడుతోంది ఈ సొగసు ఎలా ఉందంటే-పద్మం మీద నాచు తీగలు వేలాడుతున్నట్లుంది అప్పడూ ఇప్పడూ కూడా అందానికి లోటు లేదు పార్వతి ముఖం పద్మం ముంగురులు తుమ్మెదలు జడలు నాచుతీగలు (పాకు)

వ. ఇట్లు పార్వతి తపోలక్ష్మీ ముఖవిశేషంబునుంబోని తపోవిశేషంబు దాల్చి మహోత్సాహంబున నిజగురువరానుజ్ఞాతయై యా క్షణంబ

ఆ నగపతిసుత మది బర
మానందముతో మహేశు నారాధింపం
గా నిర వరయుచు జని గం
గానది తీరమున గాంచె గౌరీవనమున్ 6-87

తపోలక్ష్మీముఖసౌందర్యం ఎలా ఉంటుందో పార్వతీదేవి ఇప్పడు అలా ఉంది. లేదా తపోలక్ష్మీముఖం వంటి విశిష్టతపస్సును స్వీకరించింది ఈ వీరతపస్సుకు కావలసిన ఉత్సాహం ఉరకలు వేస్తోంది విశేషకం బునుంబోని - అని పాఠాంతరం మకరికా పత్రప్రాయమైన మహోన్నత తపస్సు అని తాత్పర్యం. తపస్సుకు అనువైన ప్రదేశం కోసం (ఇరవు) వెదికి వెదికి గంగాతీరంలో గౌరీవనం చేరుకుంది ఆ వనాన్నికని దాని పుత్ర పుష్ప ఫలసమృద్ధి మెచ్చుచు- 6-88

స్థల పద్మ మృదురత్న దళ పాదతలకాంతి
గమనీయ మత్తేభ గమనలీల
సన్నుతరంభోరు సంపద నిర్ఝర
పులిననితంబ విస్ఫురణ పేర్మి
మానిత మృగరాజ మధ్యదేశ స్థితి
వరపయోధర భార వహన శక్తి
జిత కురంగ శాబక లోచన ద్యుతి

ఱమరసుకేశపాశ ప్రభూతి
దేలియుండె కాదు చారుతరావయ
వంబులందు దన్ను వరుస బోలి
యునికి దద్ద మలిగియున్నట్ల యుండె నా
గౌరివనమునందు గౌరిదేవి. ౬-౮౨

అది గౌరివనం పేరుకి మాత్రమే కాదు రూపంలోనూ గౌరీ వనమే. పార్వతికీ ఆ వనానికి చాలా పోలికలు ఉన్నాయి

ఆ వనంలో స్థలపద్మాలూ(మెట్టతామరలు) మృదువైన రత్నదళాలూ (రత్న రాశులు) ఉన్నాయి వీటితో నేలంతా (పాదతలం) అందంగా ప్రకాశిస్తోంది పార్వతీ దేవి పాదతలాలు స్థలపద్మాల్లాగా ఉన్నాయి రత్న కాంతుల్ని ప్రసరిస్తున్నాయి గోళ్లను రత్నాలుగానూ, నక్షత్రాలుగానూ పోల్చడం ఉంది కాబట్టి పార్వతీదేవి కాలిగోళ్ళు రత్నపుతునకల కాంతిని వెదజల్లుతున్నాయని భావం అడవిలో మత్తేభాలు సంచరిస్తు న్నాయి ఆ అందాలు కనపడుతున్నాయి ఈమె మత్తేభ గమన (మదగజయాన)

అక్కడ మంచి మంచి (సన్నుత) పెద్ద పెద్ద (ఉరు) రంభావృక్షాల సంపద ఉంది అరటి చెట్లు సమృద్ధిగా ఉన్నాయి. రంభల వంటి ఊరువుల సంపద (తొడలు) ఈమెకు ఉంది రంభా+ ఉరు, ఊరు=రంభోరు)

ఆ వనంలో సెలయేరు (నిర్ఝరం) ఉంది దాని మధ్య ఇసుక తిన్నె కనపడు తోంది పులినం వంటి నితంబం (కటి ప్రదేశం) ఈమెకు ఉంది

ఈ వనమధ్య ప్రదేశంలో గౌరవింపదగిన (మానిత) సింహాలు ఉన్నాయి ఈమె శరీరంలో మధ్యప్రదేశం (నడుము) మృగరాజు మధ్యాన్ని (సింహం నడుముని) పోలి ఉంది

ఆ అరణ్యం ఆకాశంలో ఎగిరిపోతున్న మేఘాలను (పయోధ రాలను) పట్టి ఆపుతోంది వాటి బరువును వహించగలిగిన శక్తి అరణ్యానికి ఉంది ఈమెకు పయోధర భారాన్ని (కుచసంపద) వహించగలిగిన శక్తి ఉంది లేడి కూనల (కురంగ శాబకం) బెదురు (చకిత) చూపుల కాంతి (లోచనద్యుతి) అడవిలో ఉంది బెదిరిన లేడి కూనల కన్నులసొగసు ఈమె కన్నులకు ఉంది

పొడుగు తోకలతో చమరమృగాలు ఆ వనంలో ఎక్కడ పడితే అక్కడ కనబడు తున్నాయి ఈమె కేశపాశంతో పోలిక కుదిరింది (ప్రభూ తి=సమృద్ధి) స్త్రీల కేశపాశాన్ని చమరీమృగం తోకతో పోల్చడం కావ్యాల్లో తరచు కనపడుతుంది

ఇలాగ కేవలం పేరులోనే కాకుండా అవయవాల పొందికలో కూడా తనని పోలి ఉండటంతో ఆ గౌరీవనం ఈ గౌరీదేవికి - చాలాకాలం నుంచి అలవాటు పడిన ప్రదేశంలాగా అనిపించింది

సమాసనిర్మాణంలో ఉన్న సాంకేతికత వల్ల గౌరికీ గౌరీవనానికీ పోలికలు స్ఫురిస్తున్నాయి ఇది నన్నెచోడుని నేర్పరితనం తరువాతకాలంలో ఈ పద్ధతిని బాగా

వినియోగించుకున్న కవి- వసుచరిత్ర భట్టుమూర్తి అలంకారంగా చెప్పవలసివస్తే దీన్ని *సమాసోక్తి అంటారు*

వ...అట్లు గౌరి నగంబునందు బరమేశ్వరుంగోరి ఘోర తపంబు సేయం దొడంగి విహితస్నానార్చనాహోమాది నిత్యకర్మంబుల శాకాహార ఫలాహార పర్ణాహార జలాహార మారుతాహార నిరాహారాది మహాతపోవ్రతంబుల నంద వాసాభ్రకవాసైక పాదాంగుష్ఠోర్ధ్వబాహూర్ధ్వముఖాధో ముఖాగ్ని ముఖపంచాగ్ని మధ్యాద్యనేకోగ్ర తపంబులం బ్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులను షడంగయోగంబు ల మనోవాక్కాయ కర్మంబులను నిష్ఠా నుష్ఠానంబులంబ రమేశ్వరారాధన తాత్పర్యయై నిరంతరానంత తపో వృత్తిం బ్రవర్తించుచుండె నంత. ౬-౨౦

ఆ వనంలో ప్రవేశించి పార్వతీదేవి పరమేశ్వరుడి కోసం ఘోర తపస్సు చేస్తోంది స్నానం అర్చన హోమం లాంటి నిత్యకర్మలు ఆచరిస్తోంది కొన్ని రోజులు శాకాలు (కాయలు) తిని కొన్ని రోజులు ఫలాలు తిని మరికొన్ని రోజులు పర్ణాలు (ఆకులు)తిని. కొన్ని రోజులు కేవలం జలాలు పుచ్చుకొని కొన్ని రోజులు వాయువు మాత్రమే పీల్చి మరికొన్ని రోజులు నిరాహారంగా తపోవ్రతాలు సాగించింది. పర్ణశాలలోకొన్నాళ్ళు, ఆరుబయట (అభ్రకవాస) కొన్నాళ్ళు తపస్సుచేసింది ఒంటి కాలి మీద బొటనవేలిమీద నిలిచి ఊర్ధ్వ బాహువులుగాను ఊర్ధ్వముఖంగాను అధోముఖంగాను తపస్సు చేసింది అగ్నికి ఎదురుగా నిలబడి కొన్నాళ్ళు చేసింది పంచాగ్నుల మధ్య నిలబడి మరికొన్నాళ్ళు ఉగ్రతపస్సు చేసింది (నాలుగువైపులా అగ్నులు నెత్తిమీద సూర్యుడు కలిపి పంచాగ్నులు) షడంగ యోగంతో త్రికరణశుద్ధిగా అతి నిష్ఠానుష్ఠానాలతో పార్వతి తపస్సు సాగుతోంది

అలకల పొల్పు తేటిగములందు ,మదాలసయాన లీల హం
సలకడ, వక్త్రభాతి జలజంబులపై దనుకోమలంబుదీ
గల దెస, దృగ్విలాసము మృగంబులచే, నగజాత యిల్లడల్
గలయఁగ బెట్టెనా, దనువికాసములేదె దపః ప్రసంగతిన్ ౬-౨౧ ।
(ఏదుట=తొలగుట, నశించుట)

పార్వతీదేవి శరీరసౌందర్యాలు తపో నియమాలవల్ల కృశించాయి ఇది వరకటి తళతళలూ నిగనిగలూ కనుమరుగయ్యాయి ముంగురుల సొగసులు తుమ్మెదలను చేరుకున్నాయి. మందగమన విలాసం హంసలకు చేరింది ముఖకాంతి వెళ్ళి పద్మాలను ఆశ్రయించింది. శరీర కోమలత్వం తీగెలకు పాకింది చూపుల బెళుకు లేడికూనలను పొందింది పార్వతీదేవి తన సొగసులను ఇలా ఇల్లడం పెట్టినట్లు (ఇల్లరికం ఉంచడం) అయ్యింది ఇదివరలో ఈమె అందాలకు ఉపమానాలుగా పనికి వచ్చే వస్తువుల్లో మాత్రమే ఇప్పుడు ఆ అందాలు కనబడుతున్నాయి ప్రస్తుతం ఈమె దగ్గర కనపడటల్లేదు. తపస్సు ఫలించాక వీటిని మళ్ళీ పొందుతుందని సూచన (కోమ

లంబు అనేది కోమలత్వం అనే అర్థంలో భావప్రధానప్రయోగం అనుకోవాలి)

ఉగ్రతపమున దోర్తోన విగ్రహంబు
చాల శోషించె బ్రాలేయ శైలతనయ
యర్ధనారిగా దన దేహ మభవు మేన
నల్ప మల్పము నంటించు నట్ల పోలె (౮-౯౨)

పార్వతి ఉగ్రతపస్సు చేస్తోంది తీవ్రమైన తపస్సు అని ఒకర్థం ఉగ్రుడి కోసం (ఉగ్రుడు=శివుడు) చేసే తపస్సు అని మరొక అర్థం ఆవిడ శరీరం రోజురోజుకీ చిక్కి సన్నబడిపోతోంది భవిష్యత్కాలంలో పార్వతీదేవి తన శరీరాన్ని శివుడి శరీరంతో సగానికి సగం కలుపుతుంది అర్ధనారీశ్వర రూపంలో ఈవిడ సగమేకదా ఉండేది అందుకని ఆప్రయత్నం ఇప్పటి నుంచి మొదలుపెట్టి కొంచెం కొంచెం శివుని శరీరంతో అతికిసున్నట్టుగా భాసిస్తోంది- ఈ చిక్కి పోవడం ఇది కవి ఊహ ఉత్ప్రేక్ష అంత ౮-౯౩

గతసంతాపము, శీతలీకృత మహీకాంతాంగ, మత్స్యర్ధత
స్మిత కుందోత్కర కేతకీ కుటజరాజిభ్రాజితామోద, మూ
ర్ఛితవల్లీ ప్రకరంబు, వర్ధిత శిఖిశ్రేణీ ప్రమోదంబు, ర
మ్యతరంబై కుతలంబునం బరగె వర్షారంభ మత్యున్నతిన్. ౮-౯౪

వర్షఋతువు వచ్చింది తాపం తీరిపోయింది భూదేవి శరీరం శీతలత్వం పొందింది తెల్లని మొల్లలు (కుందోత్కరం) నవ్వుల్లా విరబూసాయి మొగలిపొదలు (కేతకీకుటజరాజి) వికసించాయి పరిమళాలు వ్యాపించాయి తీగెలూ లతలూ ప్రాణం పోసుకున్నాయి నెమలిగుంపులకు (శిఖిశ్రేణి) ఆనందమే ఆనందం భూమి అంతటికీ ఇలా అందాన్నీ ఆనందాన్నీ పంచిపెడుతూ పెద్ద పెట్టున వర్షారంభం జరిగింది

తొలకరి వానలు ఉరుములూ మెరుపులతో ఫెళఫెళార్భటులతో వచ్చిపడతాయి. సమాసనిర్మాణంలో అది చూపించాడు కవి

దిశల బొలయు మెఱుగు దృష్టులు, ఘుర్ఘుర
గర్జనంబు లులియు గజపగతులు,
ఘనపయోధరములు- దనరంగ జవ్వని
పోలె వచ్చె వానకాల మర్థి ౮-౯౫

ఈ వానకారు యౌవనంలో ఉన్న వనితలాగా కోరివచ్చింది అంటున్నాడు కవి వానలకాలానికీ జవ్వనికీ పోలికలు కుదిర్చాడు.(అర్థిన్=కోరికతో)

మెరుపులు చూపుల్లాగా అన్ని వైపులకీ వ్యాపిస్తున్నాయి ఘుర్ఘుర ధ్వనులు చేస్తూ బరువుగా సాగుతున్న మేఘాల మత్తేభ గమనాలు (గజప=గజరాజు) జవ్వనిది మత్తేభగమనం, నడుస్తున్నప్పుడు భూషణాల ధ్వనులు. ఘనపయోధరములు-పెద్ద పెద్ద మేఘాలు, వక్షోజాలు. ఇలా వానాకాలం జవ్వనిలాగా వచ్చింది. కోరి వచ్చింది

ఈ రెండు పద్యాల్లోనూ వర్షర్తువును వర్ణించినా అవి పార్వతీదేవి తపస్సుకు సంబంధించిన భావాలు కావు వర్ణనల్ని ప్రకృత కథతో అనుసంధించాలి లేకపోతే

తీర్థానికి తీర్థమూ ప్రసాదానికి ప్రసాదమూ అయ్యి పొందిక చెడిపోతుంది అందుకే వెంటనే ప్రకృతంలోకి వస్తున్నాడు

అట్లపోలె, విధమపోలె- ఇత్యాదిగా ఇవార్థకపదాలను జంటలుగా ప్రయోగించడం ఈ కవి లక్షణం

పరమస్నేహము హృత్సరోరుహమునం బాత్రంబుగా నించి సు
స్థిరతం బుణ్యదశన్ దపోగ్ని మదినుద్దీపించి, బ్రహ్మాండ క
ర్పరఖండమ్మున మంత్రకాటుక దగన్ ఫాలాక్షు గూర్పంప న
గ్గిరిరాజాత్మజ పట్టినా నమరి నింగిం బర్వె నీలాభ్రముల్. ౬-౨౮

నల్లని మబ్బులు ఆకాశమంతటా కాటుకలా వ్యాపించాయి పార్వతీదేవి శివుణ్ణి వశీకరించుకోవడంకోసం తయారుచేసుకున్న మంత్ర కజ్జలం - మంత్రించిన కాటుకలా ఉంది అంజనాన్ని మంత్రించి పులిమితే వశీకరణౌషధంగా పనిచేస్తుందని విశ్వాసం పార్వతీదేవి అందుకోసమని అలా మంత్రించి తయారుచేసుకుందిట ఈ మబ్బులకాటుకను

ఆమె హృదయపద్మమే ఒక పాత్ర అందులో పరమస్నేహం నింపింది స్నేహమంటే మైత్రి నూనె అని రెండర్థాలు అందులో స్థిరంగా నిలిచేట్టు పుణ్యపువత్తిని వేసింది ఆ వత్తిని తపోగ్నితో (తపస్సు అనే అగ్ని) ఉద్దీపింపజేసింది దానిమీదఈ బ్రహ్మాండమనే కుండచిప్పను మూకుడు లా బోర్లించింది ఆకాశం - కుండ బోర్లించినట్టు ఉంటుంది కనుక ఇప్పుడు బ్రహ్మాండ కర్పరఖండం నిండా(కర్పరము= కుండ ఖండము=ముక్క) లోపలితట్టున పొగజారి కాటుక పట్టింది అది మంత్రకజ్జలం. దీన్ని ధరించి శివుణ్ణి వశీకరించుకుంటుంది పార్వతి

అత్యద్భుతమైన కల్పన రూపకంతో బలిసిన ఉత్ప్రేక్ష లోకంలో కాటుక తయారుచేసే విధానాన్ని ఇక్కడ కవి ఉపయోగించుకున్నాడు దాన్ని పార్వతి తపస్సుతో అనుసంధించాడు కథతో పొందిక కుదిరింది కాలాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటోందనీ వర్షర్తువులో కూడా పార్వతి తపస్సు నిరాటంకంగా కొనసాగుతోందనీ సూచన

ప్రచారంలో ఉంది కనుక బ్రహ్మాండ భాండము అంటే అందరికీ వెంటనే అర్థమవుతుంది భాండానికి బదులుగా కర్పరం అనే పర్యాయ పదం వాడాడు దానితో క్లిష్టత ఏర్పడింది ఇలా భాషకు ప్రౌఢిని తీసుకు రావడం ప్రబంధకవుల్లో మరింత ముదురుపాకాన పడింది

మంత్రకాటుక అనేది వైరి సమాసం. ఇది తప్పు అందుకని మంత్ర కజ్జల మొగిన్ అనే పాఠాంతరం స్వీకరించింది వావిళ్ళ ప్రతి. కజ్జల మంటే కాటుక కానీ ఇతరత్రా నన్నెచోడుడు వైరిసమాసాలు చాలా వాడాడు అది శివకవుల లక్షణం

ధర నిదాఘవాతాహతి నెరియకుండ
విధి తమాలమంటపము గావించె ననగ

నొప్పె నీలాభ్రపటల మచ్చప్పరమున

తాళులన నెల్లదెస వానకాళు లమరె 6-97

వర్షర్తువులో సాధారణంగా కనిపించే దృశ్యం వానకాళ్ళు. వాన కురవబోయే ముందు లేదా దూరంగా ఎక్కడో కురుస్తున్నప్పుడు దిగంతాల్లో నింగినుంచి నేలకు గీతలు చారికల్లా కనిపిస్తాయి. అవి అంత లావుగానూ ఉండవు మరీ సన్నగానూ ఉండవు ఈ దృశ్యాన్ని కవి పట్టుకున్నాడు

గ్రీష్మంలో వడగాలి దెబ్బకు (నిదాఘం=గ్రీష్మం, వాత=వాయువు ఆహతి= దెబ్బ) నేల (ధర) చిట్లిపోయి నెరియలిచ్చేస్తుంది. అలా జరగకుండా చూడాలని భూమి ని కాపాడటంకోసం బ్రహ్మదేవుడు(విధి)ఒక పందిరి వేసాడు అది తమాలమంటపం. అంటే కానుగ చెట్ల ఆకులతో వేసిన మండపం అదే ఆకాశంలో కనపడుతున్న (నీలా భ్రపటలము) నల్ల మబ్బుల గుంపు పందిరి-అంత ఎత్తుగా వేసాడు బ్రహ్మదేవుడు కనక వెయ్యగలిగాడనుకుందాం . అయితే ఈ పందిరికి గుంజలూ రాటలూ అక్కర్లేదా అంటే కావాలి ఉన్నాయి వాన కాళ్లే రాటలు (రాళులు) రాతి గుంజలు. అందుకే నల్లగా కనబడుతున్నాయి సుదూరంగా ఉన్నాయి కనుక సన్నగా కనబడుతున్నాయి

పల్నాడు రాయలసీమల్లో రాతి గుంజల పందిళ్ళు పూరిళ్లు ఈ నాటికీ కనబడతాయి తన సామ్రాజ్యంలో చూసి ఉంటాడు ఈ రాజకవి ఇటువంటి వర్ణనల్లో ఈయన కృష్ణదేవరాయనికి అగ్రగామి

పుడమి దన యాజ్ఞ సేకొని

నడపిన దంపతుల మీద నలి మరు డింపే

ర్పడ బుష్పవృష్టి గురిసిన

వడువున దొలువాన గురిసె వడగండులతోన్ (6-98)

తొలకరివాన (తొలువాన) వడగళ్లతో కురిసింది తెల్లటి చిన్న చిన్న వడగళ్ళు మల్లెమొగ్గల్లాగా ఉంటాయి మన్మధుడు (మరుడు) పుష్పవృష్టి కురిపిస్తున్నట్టుగా ఉంది

ఎవరి మీద?

దంపతులు మీద.

ఎందుకోసం?

ఇంపు ఏర్పడటం కోసం-సంతోషం ప్రేమ కలగడం కోసం.

ఎందుకని?

ఆ దంపతులు భూలోకంలో (పుడమిన్)తన ఆజ్ఞను మన్నించి

(చేకొని)అనుకూలంగా నడుస్తున్నారు కనక.

సంతోషించిన మన్మధుడు పుష్పవృష్టి (పూలవాన) కురిపిస్తున్నట్టు వడగళ్ళ వాన కురిసిందని ఉత్ప్రేక్ష మన్మధుడు భస్మమైపోయినా అనంగుడుగా పునరుజ్జీవితుడయ్యాడు అమరుడు

మరుడు ఎసగేర్పడ అని పాఠాంతరం ఎసగు+ ఏర్పడ ఇంపు ఏర్పడ అని తాత్పర్యం

ప్రాచీన కావ్యాల్లో చాతక పక్షుల వర్ణన ఒకటి తప్పనిసరిగా కనపడతూ ఉంటుంది మిన్ను విరిగి మీద పడిపోతుందేమో అని వీటి భయంట అందుకని ఆకాశాన్ని తన్నిపెట్టి ఉంటాయట తొలకరి వానల కోసం దేవేంద్రుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాయిట ఇది ఈ పక్షులకు సంబంధించి కవులు కల్పించిన కథ చకోర పక్షులు ఇలాగే మరొకరకం. అవి వెన్నెల త్రాగి జీవిస్తూ ఉంటాయిట వాటికే వెన్నెల పులుగులు అని తెలుగు పేరు వీటి ప్రస్తావన సాధారణంగా శరదృతు వర్ణనల్లో వస్తుంది ప్రస్తుతం వర్షర్తువులో ఉన్నాం కదా చాతకాలను వర్ణిస్తున్నాడు కవి

ఉదుటఁ దెమల్చి మ్రింగు సరసోదక బిందుల మౌక్తికంబు లం
గదఁ గబళించు బీల్చు వడగండ్లకుఁ దను వోసరించు దో
యదము లదల్చి తూరు, నచిరాంశులతాగ్రము లెక్కు మెల్పునం
బదలకు నుప్పరం బెగయు చాతక పోతకముల్ సెలర్చుచున్ ౮-౯౭

(ఉదుటన్= ఉద్ధతితో అంగదన్= ఆకలితో ఓసరించు= తప్పించుకొను తూరు=చొచ్చు ప్రవేశించు. అచిరాంశువు=క్షణ ప్రభ, మెరుపు మెల్పునన్=నెమ్మదిగా, నేర్పుగా, పోతకములు=పిల్లలు చెలర్చుచున్=విజృంభించుచు)

చిన్న చిన్న చాతకాలు గుంపులు గుంపులుగా విహరిస్తున్నాయి ముత్యాల్లాగా (మౌక్తికంబులు) ఆకాశంనుంచి రాలిపడుతున్న నీటి బిందువుల్ని హఠాత్తుగా తుంపి మింగుతున్నాయి నీటి ధారనుంచి బిందువుల్ని తుంచుకొని మింగుతున్నాయన్నమాట ఆకలితో మరికొన్ని మరికొన్నిటిని కబళిస్తున్నాయి పీలుస్తున్నాయి వడగళ్ళు పడుతోంటే తమ మీద పడకుండా (తనువు) తప్పించుకుంటున్నాయి మబ్బుల్ని (తోయ దములు) చీల్చుకుని ప్రవేశిస్తున్నాయి. కొన్ని మెరుపు తీగలు ఎక్కి ఆడుతున్నాయి మరికొన్ని మృదువుగా నేర్పుగా మబ్బులు దాటి ఆకాశంలోకి (ఉప్పరము) ఎగురుతున్నాయి. ఇలా ఆ పక్షులు రకరకాలుగా విజృంభిస్తు న్నాయి వానాకాలం వచ్చిందంటే చాతకాలకు పండగ

వానలు పడటంతో నేల పచ్చబడుతుంది ఆర్ద్రపురుగులు- వీటినే ఇంద్ర గోపములు . అంటారు. ఎర్రగా ఉంటాయి ప్రత్యక్షమవుతాయి వీటిని వర్ణిస్తున్నాడు నన్నెచోడుడు-

చలిగాడ్పుల ముసరుల మెయి
వలిగొని ధాత్రీపురంధ్రి వలి బచ్చని కం
బళి గవిచికొన్న విధమున
బొలుపుగ జిప్పరువు గవిసె- భూతల మెల్లన్ (౮-౧౦౦)

(వలిగొని=చల్లబడి, వలి=చలి, కవిచికొను=కప్పుకొను చిప్పరువు=చిప్ప గడ్డి, కవియు=వ్యాపించు, పొందు)

ముసురు పట్టి వానకురుస్తున్నప్పుడు చలిగాలులు రివ్వురివ్వున తాకుతాయి అవీ ముసురుకొంటాయి భూదేవి ఆ చలినుంచి రక్షణగా ఆకుపచ్చని కంబళి కప్పుకొంది నేలంతా అందంగా పరుచుకొన్న చిప్పగడ్డి (కొత్తగా మొలకెత్తిన గడ్డి) కంబళిలాగా ఉంది

కా రను వీరుడు మెఱు గను
దోరసి బాంథు లను రిపుల దునిమిన దద్దే
హారుణ బిందులు దొలిగెనొ
ధారుణి నన నింద్రగోపతతి విలసిల్లెన్ (6-101)

(కారు=వర్షర్తువు దో:+ అసి=చేకత్తి, పాంథులు=బాటసారులు ఇంద్రగోపములు= ఆర్ద్రపురుగులు)

వియోగంలో ఉన్న దంపతులకు వర్షర్తువు మరీ విరహాన్ని పెంచుతుంది. ఏదో వ్యాపారం కోసం దూరదేశాలకు వెళ్ళిన భర్త అక్కడ విరహం పడుతూంటే, ఇంటి దగ్గర ఉన్న భార్య ఇక్కడ ఉసురుసురుమంటూ ఉం టుంది మబ్బులు,మెరుపులు, వానచినుకులు,చలిగాలి ఉన్నట్టుండి ఉరుములు ఇవన్నీ విరహబాధను ఉద్దీపింపజేస్తాయని కవులు వర్ణిస్తుంటారు

భార్యల్ని ఇళ్ళ దగ్గర వదిలేసి బాటసారులైన కొందరిని ఈ వర్షర్తువు హింసిస్తోందిట-వానకారే ఒక వీరుడు ఇతడి చేతిలో మెరుపు అనే కత్తి ఉంది ఈ వీరుడికి (విరహంలో ఉన్న) బాటసారులందరూ శత్రువులే వాళ్ళని ఈ కత్తితో ముక్కలు ముక్కలుగా నరికేస్తున్నాడు రక్తబిందువులు జలజలా రాలి నేలమీద పడుతున్నాయో అన్నట్టుగా ఆర్ద్రపురుగులు భాసి స్తున్నాయి పచ్చికబయళ్ళలో వచ్చి వాలుతున్న ఎర్రని ఇంద్రగోపాలను రక్త బిందువులుగా ఉత్ప్రేక్షించి ఇంతకథ కల్పించాడు రూపకాలంకారం సహకరించింది

వానలు గట్టిగా నిలబడి కురిస్తే మన్నూ మిన్నూ ఏకమై పోయా యనడం మనకు అలవాటే ఎలా ఏకమైపోయాయో శబ్ద చమత్కారంతో చూపిస్తున్నాడు కవి

సురపగోపచాప శోభితంబై యుండు
నవపయోదవేళ భువియు దివియు
దెసలు దీటుకొనగ దృణఘన నివహ సం
ఛన్న మయ్యె మఱియు మన్ను మిన్ను (6-102)

క్రొక్కారుమేఘాలు ముసురుకునే వర్షర్తువులో భూమి సురపగోప శోభితమవుతుంది సురపుడంటే-సురలకు పతి- ఇంద్రుడు. సురపగోపాలంటే ఇంద్రగోపాలు అవి నేలమీద కనబడతాయి ఆకాశం చాప శోభితం అవుతుంది అంటే ఇంద్రచాపం- ఇంద్ర ధనుస్సు సాక్షాత్కరి స్తుంది భువి-ఇంద్రగోపసంశోభితం దివి-ఇంద్రచాపశోభితం. ఇది ఒక పోలిక మరొకటి-అన్నివైపులకూ వ్యాపిస్తూ మన్ను (భూమి)తృణ నివహ సంఛన్నమవుతుంది గడ్డి దట్టంగా మొలుస్తుంది మిన్ను-

ఘననివహ సంఛన్నమవుతుంది అంటే మబ్బులు దట్టంగా ముసురుకుంటాయి క్రమాలంకారంతో భువికీ దివికీ-మన్నుకీ మిన్నుకీ ఐక్యం సాధించాడు మన్ను- తృణ నివహ సంఛన్నం మిన్ను-ఘననివహ సంఛన్నం

వర్షర్తువులో కనబడే మరొక సుందరదృశ్యం-నెమలి నాట్యం నల్లని మబ్బుల్ని చూసి, చల్లని గాలికి మురిసి, ఉరుములు మృదంగ ధ్వనులుగా నెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తాయి దీన్ని నన్నెచోకుడు రాజు కనుక ఆస్థాన నర్తకీమణుల నాట్యప్రదర్శనగా వర్ణిస్తున్నాడు.

ఆ క్రౌంక్కారను రాజభ్రమోల నిజరావానంతగేయాభ్రనా
దైకాతోద్యముగూర్చి మ్రోయ, సురగోపాంభోజరాగ(తృ)ణా
నీకోద్యద్ధరితాశ్మక స్థలిసన్నృత్యోరు రంగస్థలిన్
గేకీ పాత్రము లాడె భావముగ నుత్క్షిప్తాగ్రపింఛమ్ములై (౦-౧౦౩)

(ఆతోద్యము= వాదిత్రము వాయులోహచర్మవాద్యాలు కేకి= ఆడనెమలి, పాత్ర ము=వేశ్య,నాట్యకత్తె, క్రౌంక్కారు= వర్షఋతువు అశ్మము-అశ్మకము=చిన్నరాయి మణి)

ఆడనెమళ్లు నాట్యకత్తెలు. అవి అందమైన తమ పింఛాలను విప్పి భావ ప్రధానంగా నాట్యం చేస్తున్నాయి విరిసిన పింఛం గేయభావాన్ని అభివ్యక్తం చేసే ముద్రలాంటిది రంగస్థలం కూడా అందంగా కుదిరింది. పచ్చికబయలే నృత్య+ ఉరు+ రంగస్థలం. దట్టంగా మొలిచిన గడ్డి ముదు రాకు పచ్చగా మారింది అది మరకత మణులు (హరిత+ అశ్మకములు) తాపించిన రంగస్థలంగా ఉంది (మరకతాలు ఆకు పచ్చగా ఉంటాయి) కాంతికోసమని దానిమీద పద్మరాగాలు పొదిగినట్టు సురగోపాలు (ఆర్ద్రపురుగులు) ఉన్నాయి మేఘాల ఉరుములు వాద్యఘోషను సమ కూరుస్తున్నాయి (అభ్రనాద+ ఏక+ ఆతోద్యము). ఒక్కొక్కపుడు పాటను నాట్యకత్తెలే పాడుకుంటారు ఇది పాతకాలం మాట నెమళ్లు చేస్తున్న క్రేంకారాలే గేయం(నిజరావ+ అనంత గేయ)-పెద్దపాట. ఇంతకీ ఈ నెమళ్ళు ఎవరి ముందు నాట్యం చేస్తున్నాయి? వర్షర్తువు అనే రాజుగారి ముందు.ఆ రాజుదర్బారులో సాగుతోంది ఈ నృత్యం అద్భుతమైన రూపకం

ఆడనెమళ్ళకు పింఛం ఉండదు మగనెమలికే ఉంటుంది. అవ్వే నాట్యం చేస్తాయి. కానీ కవి ఇక్కడ కేకీ పాత్రములు అని ఆడ నెమళ్ళను చెప్పాడు సాధారణంగా నృత్యం నాట్యకత్తెలది కనక స్త్రీ లింగం చెప్పాడను కోవాలి. పైగా పశుపక్ష్యాదుల విషయంలో లింగం అంత ప్రధానం కాదని, ఇటువంటి వర్ణనలకు అలంకారశాస్త్ర వేత్తలు అనుమతి ఇచ్చారు. అందుకే కేకీనృత్యాలు, పికీ గీతాలు కావ్యాల్లో కోకొల్లలు.

సురగోపాంభోజరాగ+ తృణానీక అన్నచోట తృ. అనేది వట్రు సుడి తో ఉన్న అక్షరం సంయుక్తం కాదు అందువల్ల .గ గురువుకాక ఛందోభంగం అవుతుంది అయినా .తృ.ని ఉచ్చారణను బట్టి రేఫ సంయుక్తంగా భావించి నన్నెచోడుడు .గ.ని గురువు చేసాడు. శివకవుల్లో ఇటువంటివి చాలా కనపడతాయి. మొల్ల కూడా తన

రామాయణంలో ఋష్యశృంగుడు.. అనే పదాన్ని 'ష్య' గురువుగా ప్రయోగించింది సరే- త్విషా(కాంతి) అని పాఠాంతరం

లోకంలో విరహులు నివురు గప్పిన నిప్పల్లాగా ఉన్నారు. పైకి గంభీరంగా చిరునవ్వులు చిందిస్తున్నా ప్రశాంతంగా కనిపిస్తున్నా వీరి అంతరంగాలలో విరహాగ్ని కణాలు ప్రజ్వరిల్లుతున్నాయి సరిగ్గా వీరికి ప్రతిబింబంలాగా ఉంది ప్రకృతి.

డిందప్పై పూచి పర్విన కుందలతల
తోన కడమలు(కడుములు) బూచె దొల్వాన కాల
మెసగె -విరహులు విరహాగ్ని నెరసి నీఱు
పారవు గొని యున్న నిప్పల ప్రోవులనగ (6-104)

(డిందప్పై=క్రుంగిపోవునట్లు,వంగునట్లు కడమలు=కడపలు, కడిమి చెట్లు ఎరియు =కాలిపోవు నీఱు=బూడిద)

తొలకరి వానలకు కడిమిచెట్లు పుష్పించాయి. వాటి పువ్వులు ఎర్రగా నిప్పకణాల్లా ఉంటాయి. కుందలతలంటే వర్షర్తువుకనక మొల్లతీగలు(గ్రీష్మమైతే మల్లెలు) అవి అల్లుకొని(పర్విన)లేదా చుట్టుప్రక్కల ఒత్తుగా ఎత్తుగా ఎదిగి దట్టంగా (డిందప్పై) పుష్పించాయి ఆ తెల్లని పువ్వుల్లో కప్పబడి ఎర్రని పువ్వులు- నీఱు(బూడిద) పారవుగొని యున్న(పాదుపుకొన్న) నిప్పల ప్రోవుల్లాగా ఉన్నాయి. విరహాగ్నిని దాచుకున్న విరహుల్లాగా ఉన్నాయి

ముద్రిత ప్రతులన్నింటా ..కడమలు.. అనే ఉంది కడమ=తక్కినది మిగిలినది దీనికి బహువచనం కడమలు. నిఘంటువులన్నింటా ఇదే అర్థం. కుందలతలతో పాటు తక్కినవికూడా పుష్పించాయని సామాన్యార్థం చెబితే, ఆ పుష్పించినవి నిప్పలకు సాటివచ్చే ఎర్రటి పువ్వులే కానవసరం లేదు అందుకని ఇది కడుములు లేదా కడపలు అయ్యుంటుంది

సురనది ఝషములు డిగ్గగ
శరనిధి,కా శరధిలోని ఝషకము లెక్కన్
సురనది కిట్లిడపడకయు
కురిసె మహావృష్టి గుండ్లు గూర్చిన భంగిన్ (6-105)

మింటికీ మంటికీ ఏకధారగా వాన కురుస్తోంది కుంభవృష్టి గుండ్లు వర్షిస్తున్నట్టుంది చినుకులు కనపడటం లేదు ఒక ప్రవాహమేదో ఆకాశంనుంచి భూమి మీదకు పడుతున్నట్టుంది అకాశగంగలో ఉన్న చేపలు సముద్రంలోకి దిగడం సముద్రంలో ఉన్న చేపలు ఆకాశగంగలోకి ఎక్కడం -సాధ్యమయ్యేటట్లు ఎడతెరిపిలేని వాన

దరములు ముంపుచున్, తరులతాతతి వేళులతోన కూలగా
నురువడి ద్రోచుచున్,మడువు లోలి గలంచుచు, నంబుజాళిసం
హరణముసేయుచున్, మదజలౌఘము గ్రమ్మ మదాంధగంధ సిం
ధురములు బోలె బెల్లన నదుల్ సనుదెంచె భయంకరాకృతిన్ 6-106

కుంభవృష్టికి నదులు పొంగాయి ఒడ్డుల్ని ముంచేస్తున్నాయి అవి విరిగి పడిపోతున్నాయి చెట్లను తీగెలూ వేళ్లతో సహా పెళ్లగించి కూల్చి మడుగుల్ని-చెఱువుల్ని కలచివేస్తున్నాయి కొత్త నీటితో బురద బురద అయిపోతున్న చెఱువులు-పద్మాలను నాశనం చేసేస్తున్నాయి కొత్త నీటిలో అవి మునిగిపోతున్నాయి మదించిన జలరాశి తో-జలసమూహంతో నదులు భయంకరస్వరూపం దాల్చాయి మదించి కన్నూ మిన్నూ కానకుండా సంచరించే మత్తేభాల్లాగా (మదాంధ-గంధ సింధురములు బోలెన్) ఉన్నాయి

నదుల్ని మత్తేభాలతో పోల్చాడు మదజలం ఏనుగుల కుంటే మదించిన జలంతో నదులున్నాయి రెండూ భయంకరాలే. ఒడ్లు విరిచె య్యడం,చెట్లూ తీగలూ పెకలించడం చెరువుల్ని కెళకిళ్ళు చెయ్యడం తామరపువ్వుల్ని తూడులతో సహా నాశనం చెయ్యడం ఇవన్నీ రెండింటికీ ఉన్న పోలికలు

వ. .అట్టి వర్షాసమయంమునం దంభోవాసియై గౌరి ఘోరతపంబు సేయు నవసరంబున 6- 07

అమరె నెఱి జడలపై ను
త్తమరుచి నవజలకణములు దగిలి బెడంగై,
యుమ తపమున కెదమెచ్చి త
దమరులు ముత్యములు సేస లలికిన భంగిన్. 6- 08

(బెడంగు=అందము సేసలు=అక్షతలు అలుకుట=చల్లుట)

ఎంతటి కుంభవృష్టి కురుస్తున్నా పార్వతీదేవి అలాగ్గే వానలోనే కూర్చుని తపస్సు చేస్తోంది వానకురుస్తోంది వెలుస్తోంది తపస్సు మాత్రం ఆగడం లేదు. ఒకవాన కురిసి వెలిసిన తరవాత చూస్తే-

పార్వతీదేవి నల్లని పొడుగైన అందమైన జడలమీద వాన నీటి బిందువులు నిలబడి ఉన్నాయి ఆ దృశ్యం చాలా అందంగా ఉంది తైల సంస్కారం లేక బిరుసెక్కిన జుట్టు దువ్వుకోడాలు లేక చెల్లాచెదురుగా ఉన్న జుట్టు ఆ జుట్టులో నీటి బిందువులు పార్వతి తపస్సుకి మెచ్చుకొని దేవతలు ముత్యాలను అక్షతలుగా (సేసలు) చల్లారేమో!

మఱియును- 6-109

అడరు నవాంబుధారలు జటాటవిలోబడి విభ్రమించి వె
ల్వడి చనుదెంచి రాలుగొని పక్ష్మములన్ వెడనిల్చి మోవిపై
బడి కుచఘట్టనం జెదరిపాఱి రయంబున ముత్తరంగలన్
మడుగులువాఱి నాభి కెడమానక జొచ్చె ననుక్రమంబునన్ 6- 10

(అడరు=ఒప్పు వ్యాపించు,రాలుగొను=ప్రవాహముకట్టు ముత్తరంగలు=త్రివళులు)

వర్షంలో కూచుని పార్వతీదేవి నిశ్చలంగా తపస్సు చేస్తోంది అప్పుడు ఆమె మీద కురిసిన వానచినుకులు శరీరం మీద క్రమక్రమంగా ఎలా కిందికి దిగు తున్నాయో కవి వర్ణిస్తున్నాడు.

తొలకరి వాన చినుకులు పార్వతీదేవి జటాటవిలో పడ్డాయి జుట్టు ఎత్తు పల్లాల్లో అవి అటూ ఇటూ తిరిగి తిరిగి ముఖం మీదకు ప్రవాహం కట్టాయి ఒత్తయిన కనురెప్పలమీద (పక్ష్ములన్) క్షణకాలం నిలిచాయి పెదవిమీదకు (మోవి) జారాయి అక్కడనుంచి ఎత్తయిన గుండెలమీద పడ్డాయి తుంపురులుగా చెదిరి మళ్ళీ ధారకట్టి పొట్టమడతల మీదుగా (వళిత్రయం= మూడు మడతలు) రయంతో క్రమంగా నాభిలోకి చేరుకున్నాయి.

ఈ నీటి బిందువులు నాభికి చేరిన క్రమమూ తీరూ పార్వతీదేవి ధ్యానంలో కూర్చున్న భంగిమను తెలియజేస్తోంది పద్మాసనంతో కూర్చుని నడుమూ మెడా నిల బెట్టి కన్నులు మూసి ధ్యానం చేస్తోంది కాబట్టే తల మీద పడిన నీటిబిందువులు ముఖం మీదుగా అధరం మీదుగా గుండెల మీదుగా వళిత్రయం మీదుగా నాభికి చేరు కున్నాయి

కాళిదాసు కుమారసంభవంలో చెప్పిన శ్లోకం ఈ పద్యానికి ఆధారం అక్కడక్కడా కాళిదాసు శ్లోకాలనూ భావాలనూ నన్నెచోడుడు అందంగా ఉచితంగా ఉపయోగించుకున్నాడు ఆ శ్లోకం ఇది-

స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః
పయోధరోత్సేధ నిపాత చూర్ణితాః
వళీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణ నాభిం ప్రథమోద బిందవః

ఇంతవరకూ ఇది వర్షర్తు వర్ణన పదహారు పద్యాలు వీటిలో .పరమ స్నేహము అడరు నవాంబు ధారలు అనే రెండు పద్యాల్లోనే పార్వతీదేవి తపస్సుని వర్ణించాడు. తక్కిన వన్నీ కవిగారి కల్పనలు. ప్రకృతి పరిశీలనలూను ఆద్యంతాలలో వర్ణనల్ని కథాంశంతో అనుసంధించి మధ్య లో ఎన్ని పద్యాల్లో ఎక్కడెక్కడ విహరించినా కథాసూత్రం తెగిపోదు. వర్ణన ముగిసేసరికి పాఠకుడు మళ్లీ కథాసూత్రంలోకి వస్తాడు. ఇదొక నిర్మాణశిల్పం శ్రీ కృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలోనూ ఇదే పద్ధతి

ఇప్పడింక శరదృతువు వస్తోంది వర్షర్తువు అందాలూ అతి శయాలూ అణగిపోయాయి ప్రకృతి కొత్తరూపం ధరించింది స్థూలంగా వచ్చిన మార్పులన్నిం టినీ ముందుచెబుతున్నాడు ఆ తర్వాత సూక్ష్మాంశాల పరిశీలన, వర్ణన ఉంటాయి. ఇది నన్నెచోడుని వర్ణనల ప్రణాళిక

తదనంతరంబ (6- 11)

దళితాంభోరుహ సప్తపత్ర సుమహత్కాశాస సౌఘంబు, ని
ర్దళితాంబుప్రద కేతకీ కుటజకుంద వ్రాత, ముద్భాసితేం
దు లసన్మత్త మరాళకంబు, గతవిద్యుత్కేకి సల్లాస్య, మ
గ్గలమై పర్వె జగంబులం దురుశరత్కాలంబు రమ్యాకృతిన్ 6-112

రమ్యాకృతితో ఉరు శరత్కాలం అతిశయించి (అగ్గలమై) వేంచేసింది

పద్మాలకూ ఏడాకుల అరటి చెట్లకూ (సప్తపత్రము) రెల్లు దుబ్బుకూ (కాశ) వేగిసకూ (అసన) వికాసం వచ్చింది వర్షర్తువు వెళ్ళిపోయి తమకు అనుకూలమైన కాలం వచ్చినందుకు వీటి సంబరం. ఇవి సంతోషిస్తోంటే ప్రకృతిలో మరికొన్ని ముఖం ముడుచుకొన్నాయి మేఘాలూ (అంబుప్రద) మొగలి పొదలూ (కేతకీకుటజ) మొల లూ(కుంద)నిర్దళితమయ్యాయి. వర్షర్తువుతో పాటు వాటి అందమూ పోయింది ఆకాశం మబ్బుతొలగి తేట పడటంతో చందమామ బాగా ప్రకాశిస్తున్నాడు రాయం చలు - మత్త మరాళాలు- ఆనందిస్తున్నాయి. సరోవరాల్లో నీరు తేటపడటం తామరలు బాగా దొరకటం ఇవి హంసల ఆనందానికి కారణాలు మెరుపు తీగెల (విద్యుల్లా స్యము) నెమళ్ళ లాస్యాలు (కేకిలాస్యము) అంతరించాయి గతకాలపు కధలయి పోయాయి సంతోషించేవి కొన్ని, దుఃఖించేవి కొన్ని, ప్రకృతిలో ఈ స్థితి ఎప్పుడూ ఉండేదేనని తత్త్వ సూచన

వ్యాకరణం ప్రకారం మహాకాశ అనవలసి ఉన్నా మొదటిపాదంలో యతి కోసమని మహత్కాశ అన్నాడు కవి గొప్ప రెల్లు అని కాకుండా పెద్ద రెల్లు అని చెప్పి సమన్వయించుకోవాలి

జలశాయులైన హరిల
క్ష్ములు, వర్షనిశావసానమున మేల్కని, క
న్నులు విచ్చి చూచి నట్లులు,
జలజోత్పల రుచులు వెలసె శారదవేళన్ 8-113

శరదృతువులో ఎర్రకలువలూ (జలజములు=పుండరీకములు) ,తెల్లదామర లూ (ఉత్పలములు) రెండూ వికసిస్తాయి. తేటపడిన చెరువులో ఇవి కళకళలాడుతుం టాయి వర్షర్తువు అనే రాత్రి గడిచిపోయింది తెల్ల వారింది జలనిధిలో (క్షీరసముద్రం లో) నిద్రపోతున్న విష్ణుమూర్తికీ (హరి) లక్ష్మీదేవికీ మెలుకువ వచ్చింది కన్నులు తెరిచి చూసారన్నట్టుగా పుండరీకాలూ ఉత్పలాలూ వికసించి కొత్తకాంతులు విరజిమ్మాయి. విష్ణుమూర్తి పుండరీకాక్షుడు అంటారు ఆయన కళ్ళల్లో భాగ్యచిహ్నంగా ఎర్రజీర ఉంటుందిట అందుకని అవి ఎర్రకలువల్లా భాసిస్తాయి లక్ష్మీదేవి కళ్ళు తేటగా తెల్లగా సాత్త్వికంగా ఉంటాయి అందుకని అవి ఉత్పలాల్లా (తెలిదామరలు) ప్రకాశిస్తాయి శరదృతువులో విష్ణుమూర్తి తన యోగ నిద్రనుండి మేల్కొంటాడనీ, ఆయనతోపాటే లక్ష్మీదేవి కూడా నిద్ర లేస్తుందనీ పురాణ ప్రసిద్ధి. అలా నిద్రలేచిన ఆ దంపతుల కన్నుల్లాగా- కలువలూ తామరలూ వికసించి అందాలు ఒలకబోస్తున్నాయని కవి ఉత్ప్రేక్ష ఇంకా ప్రకృతిలో వచ్చిన మార్పుల్ని తెలియజేస్తున్నాడు-

తేఱెం గొలకులు, వే తడి
యాఱె మహీతలము, విలసె నబ్దము తెలిమిన్,
బాఱె మరాళము, లోలిం
దీఱెన్ బులినములు, వెలిగె దిక్కులు గలయన్. 8-114

సరోవరాలు (కొలకులు) తేరుకున్నాయి బురద విరిగి నీరు తేట పడింది నేల తడి ఆరింది మబ్బులు (అబ్దములు) విడిపోయాయి హంసలు (మరాళములు) ఎగురుతున్నాయి హంసలు వర్షర్తువులో మానస సరోవరానికి ఎగిరిపోయి శరదృతువులో తిరిగి వస్తాయని కవులు వర్ణిస్తూ ఉంటారు క్రమక్రమంగా (ఓలిన్) నదుల్లో నీటి మట్టం తగ్గి ఇసుకతిన్నెలు (పులినములు) బయటపడ్డాయి ఇదంతా స్వభావోక్తి ప్రకృతిలో వచ్చిన మార్పుల్ని కాంతల ప్రతిస్పందనల్నీ కలిపి వర్ణిస్తున్నాడు తరువాత పద్యంలో

కాంతల హార ప్రకాశంబుతోడన
కాశవికాస ప్రకాశ మెసగె
మడతుల తిన్నని నడపులతోడన
నయమున రాయంచనడపు లడరె
బాలతుల కనుగవ పాలపంబుతోడన
నలి జకోరంబుల పాలప మెలసె
పెలదుల ముఖకాంతి వెలుగులతోడన
విమలమై శశికాంతి వెలుగు డమరె
దెలవ లెదల గలక తేటుటతోడన
యేటులందు గలక దేట దొడగె
మదనవతుల మదసముదయంబుతోడన
పండి శారదోదయంబు దనరె ౬-౧౧౫

విరహిణుల్ని హింసించే వానకారు వెళ్ళిపోయింది. బాటసారులుగా వెళ్ళిన భర్తలు తిరిగి వచ్చారు. కాంతామణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి ముత్యాల హారాలు రత్నాలహారాలు అలంకరించుకొంటున్నారు వాటికి దీటుగా ప్రకృతిలో రెల్లు పువ్వులు (కాశ) తెల్లగా వికసించాయి పడతుల (మడతులు) నడకల్లో ఒక ఒయ్యారం కనబడింది ప్రకృతిలో రాయంచల నడకలు పొలతుల కన్నులు కావి రంగు విడిచిపెట్టి స్వచ్ఛతను సంతరించుకున్నాయి. శరద్రాత్రులలో వెన్నెల పులుగుల (చకోరముల) సంచారాలు మొదలయ్యాయి చకోర పక్షులు వెన్నెలతాగి జీవిస్తాయనీ తెల్లగా ఉంటాయనీ కవుల వర్ణన వీటిని చూపులతో పోలుస్తారు పెలదుల ముఖాల్లో కొత్తకాంతీ కొత్త చైతన్యమూ వెల్లివిరిసాయి స్వచ్ఛమైన వెన్నెల (శశికాంతి) అన్ని వైపులా కళకళలాడింది. స్త్రీల హృదయాలు కలత తేరాయి వియోగ బాధ ఉపశమించింది నదులలో బురద అంతరించి నీరు తేటపడింది మదవతుల్లో కొత్త కోరికలూ కామ వాంఛలూ (మద-స ముదయంబు) ఉదయించాయి ప్రకృతిలో విస్తరించి శరదృతువు ఆవిర్భవించింది. ప్రకృతికాంత - మానవ కాంతలతో పోటీపడి కొత్త అందాలను సమకూర్చుకుంది మరొక ఊహ చేస్తున్నాడు

చారు నిశీథినీ విమల సాంద్ర సుధాకరభాతి రోదసీ
పూరితమై దివంబుల నభోమణి దీప్తి దళంత కిమ్మగా
బేరి ఘనీభవించెనన బెల్లెసగన్ సిత మేఘహంస పం
కేరుహ కాశ సంహతులు గ్రిక్కి టిసెన్ శరదాగమంబునన్ ౬- ౧౧౬

(నిశిథిని=రాత్రి సుదాకర భాతి=చంద్రకాంతి, దివంబులు=దివసంబులు, పగటిపూట తఱంకక=క్షీణింపక నభోమణి =సూర్యుడు)

రాత్రంతా కురిసిన వెన్నెల తెల్లవారేసరికి ఏమయిపోతోంది? అనే ప్రశ్న ఉదయించింది కవి మనస్సులో దానికి సమాధానం ఈ పద్యం

అందమైన శరద్రాత్రి నిర్మలంగా దట్టంగా కురిసిన వెన్నెల రోదసి అంతా నిండిన వెన్నెల తెల్లవారి సూర్యుడు ఉదయించేసరికి ఈ వెన్నెలంతా ఏమైపోయింది? ఎక్కడికి పోయింది? క్షీణించి పోయిందా,లేదు దట్టంగా పేరుకొని(ఘనీభవించి) గడ్డకట్టి తెల్లటి మేఘాలుగా,హంసలుగా పద్మాలుగా రెల్లు పువ్వులుగా మారి పోయింది రూపం మార్చుకుందిట శరదృతువులో ఇవన్నీ ఎక్కడచూసినా కిటకిట లాడుతూ కనిపించి వెన్నెల ముద్దల్లా గా ఉన్నాయని కవి ఊహ

ఈ శరదృతువులో (రాకారాత్రి) అందమైన పున్నమిరేయి ఎటుచూసినా పండు వెన్నెల లోకమంతా వెన్నెలలో జలకాలాడుతోంది కవికి అతిలోక సౌందర్యం కనిపించి విష్ణులోక సాక్షాత్కారమయ్యింది

శ్వేత ద్వీపము చంద్రబింబము , మహాక్షీరాబ్ధి తత్ జ్యోత్స్నత
ద్యాతిం గృష్ణుడు తన్మృగాంకము, లసత్పద్మాలయాక్షి ద్యుతుల్
ప్రీతిం జారుచకోరదంపతులు నా బృథ్వీధరుంబోలి వి
ఖ్యాతిం బొల్చగు శారదాభినుత రాకారాత్రు లత్యున్నతిన్ ౬-౧౧౭

వెన్నెల క్షీరసముద్రంలాగా ఉంది అందులో చంద్ర బింబమే శ్వేత ద్వీపం. క్షీరసముద్ర మధ్యంలో శ్వేతద్వీపంలో విష్ణుమూర్తి శేషశయ్యమీద పవ్వళించి ఉంటాడనీ లక్ష్మీదేవి పాదాలు ఒత్తుతూ ఉంటుందనీ పురాణ ప్రసిద్ధి విష్ణుమూర్తి నీల మేఘశ్యాముడు. చంద్రబింబమనే శ్వేతద్వీపంలో విష్ణుమూర్తి మృగాంకం. (చందమామలో లేడి ఆకారంలో ఉండే నల్లని మచ్చ) . లక్ష్మీదేవి (పద్మాలయ) అక్షి ద్యుతులు అంటే మెరుపుచూపులు- చకోరదంపతులు ప్రసన్నమైన తెల్లని చూపుల్ని చకోరాలతో పోల్చడం కవి సమయం అవి వెన్నెల పిట్టలు ఇలా శారదాభినుత రాకా రాత్రులు అన్నీ విష్ణుమూర్తిని (పృథ్వీధరున్) పోలిఅత్యున్నతితో పొల్పు వహించాయి. నన్నెచోడుడు కవిగా శైవుడే. వీరశైవుడు మాత్రం కాదు.

వారీ సంగమ సుఖముల
జేరని గాంభీర్యవృత్తి జేకొనక సరి
త్తీర జలంబుల మధ్యమ
వారిన్ నగునట్లు కాశవన రుచి వెలిగెన్ ౬-౧౧౮

(వారి= నీరు, కాశవనము= రెల్లు పొదలు, గాంభీర్యవృత్తి=గంభీరత్వము లోతు)

రెల్లు దుబ్బులు నదుల ఒడ్డున తీరజలాల్లో మొలిచి దట్టంగా వనంలా పెరిగి శరదృతువులో పుష్పిస్తాయి ఆ రెల్లు పువ్వులు తెల్లగా నవ్వుల్లా ఉంటాయి తీర జలాలే (తీరజలంబులు+ అ) ఈ వికసించిన రెల్లు పువ్వుల వంకతో నదీమధ్య జలాలను (మధ్యమవారిన్) పరిహసిస్తున్నట్టున్నాయిట ఎందుకని పరిహసిస్తున్నాయంటే- నదీ మధ్యమజలాలు నారీసంగమ సుఖాలను పొందవు స్త్రీలు నదుల ఒడ్డునే స్నానం చేస్తారు తప్ప మగవారిలాగా మధ్యలోనికి ఈదుకుంటూ వెళ్ళి స్నానం చెయ్యరు అందుకని మధ్య జలాలు ఈ సుఖం ఎరగవు నోచుకోలేవు వాటిది స్త్రీ సుఖం ఎరుగని గంభీర ప్రవృత్తి లేదా అటువంటి సుఖాన్ని వద్దని తిరస్కరించిన గాంభీర్యం వాటిది వైరాగ్యమన్నమాట (తీరంలో కన్నా ప్రవాహ మధ్యంలో లోతు - గాంభీర్య వృత్తి ఎక్కువ ఉంటుంది) ఆ గాంభీర్యాన్ని మేము స్వీకరించక (చేకొనక) స్త్రీ సంగమ సుఖాన్ని అనుభవిస్తున్నాం. మీరు అనుభవించ లేకపోతున్నారు సుమా అని మధ్యమ జలాలను తీరజలాలు వేళాకోళం చేస్తున్నట్లు పరిహసిస్తున్నట్లు ఒడ్డున కాశ వనరుచి ప్రకాశించింది మధ్యమ వారిన్ నగునట్లు సరిత్తీర జలంబులన్ కాశవనరుచి వెలిగెన్

సుఖాలు పొందలేక గంభీర ముద్ర పెట్టుకొని కూర్చున్న వాళ్ళను చూసి, ఆ సుఖాలు అనుభవిస్తున్నవారు ఎగతాళి చెయ్యడం లోకరీతి . కానీ ఈ ఎగతాళి తాత్కాలికం శరదృతువు -కాలం కలిసి వచ్చి నంతవరకే ఈ మిడిసి పాటు గాంభీర్య వృత్తి మాత్రం శాశ్వతం నది ఉన్నంత కాలం ఉంటుంది ఇది వ్యంగ్యం. ఉపదేశం

శరదాగమమున శోభా

కరముగ గై ప్రాలబండి కలమునంబుల్

గరుసున నెలమిన తామర

విరిపువ్వుల తావి కెఱగు విధమున దొలిచెన్ ౭-౧౧౨

(గరుసున= ఒడ్డున, ఎలమిన=ప్రకాశించిన, ఎఱగుట=నమస్కరించుట కలమ వనము=వరిచేను)

ఇరుగుపొరుగుల్లో ఉన్న మంచిని గుర్తించి దాన్ని అలవరచుకోడం ఉత్తమోత్తమం అలవర్చుకున్నా లేకపోయినా కనీసం దాన్ని గౌరవిం చడం ఉత్తమ లక్షణం దీన్ని వ్యంగ్యంగా ఉపదేశిస్తున్న పద్యమిది

శరదృతువులో - సంక్రాంతికి ముందు-వరిచేలు విరగపండి, కంకుల బరువుతో ఒరిగిపోయి బంగారు కాంతులీనుతూ, కోతకు సిద్ధంగా ఉంటాయి బాడవగట్లమీద తామరపువ్వులు వికసించి పరిమళాలు (తావి) విరజిమ్ముతూ ఉంటాయి ఆ పరిమళాలకు మెచ్చి చేను సాష్టాంగ పడినట్టుంది. సాగిల పడిన వరికంకులు నమస్కారముద్రలు. వరికి రంగూ రుచీ ఉన్నాయి కానీ పరిమళం అంతగాలేదు తనకు లేని సుగుణం తామర లకు ఉంది. అది లోకాన్ని అలరిస్తోంది అందుకని వరిచేను సాగిలబడి మొక్కుతోంది

పండగ వచ్చినా పబ్బం వచ్చినా గుమ్మాలకూ పందిళ్ళకూ మామిడాకులో ఇంకో ఆకులో పచ్చటి తోరణాలు కట్టడం భారతదేశం అంతటా కనిపించే ఆచారం కంటికి ఇంపుగానూ ఉంటుంది. ఆరోగ్యం కూడా తోరణాలు లేకుండా పండగ వాతావరణం రాదు

శరదృతువు రావడమే ఒక ఉత్సవం ప్రకృతికి అదొక పెద్ద పండుగ అందు కని తోరణాలు ఉత్సాహంగా ఏర్పాటు చేస్తున్నాడు కవి.

అరుణ శాలి కణిశములు శుకాళి గఱచుకొనుచు నం
బరతలమున నోలి నెగసి పాఱు - దిగ్వధూచయం
బరయ జెలువ మెసగు శారదాగమమున నుత్సవో
త్కర విభాతి దోరణములు గట్టినట్టు లందమై 6-120

(శాలి=వరి, కణిశములు=కంకులు శుక+ ఆళి=చిలుకలబారు ఓలి=వరుస, చెలువము=అందము)

ఎర్రటి వరి కంకుల్ని ముక్కులకి కరుచుకొని చిలకలు బారులు తీరి ఆకాశం లో ఎగురుతున్నాయి శరదృతువు వచ్చింది కదా అని మహోత్సవము (పండగ) జరుపు కుంటున్న దిక్కులు అనే కాంతలు తోరణాలు కట్టి నట్టు అందంగా కనపడుతున్నాయి

పచ్చటి చిలకలు ఒక వరసలో ఎగురుతూంటే తోరణాలు కట్టినట్టే . వరి కంకుల్ని కరచుకొనిమరీ ఎగురుతున్నాయేమో ఒక పువ్వూ ఆకూ కలిపి కట్టినట్టు ఇంకా అందంగా ఉంది దిక్కులు తేటపడతాయి కనుక శరదాగమనం వాటికి ఆనందదాయ కమే మహోత్సవమే ప్రకృతి కాంతకు పండగ. దిక్కుల్ని కాంతలు అనకుండా వధువు లు అనడంలోనూ ఒక అందం ఉంది. పెళ్లికళ స్ఫురిస్తుంది. కొత్త పెళ్లికూతుళ్ళకు శరదృతువు ఉద్దీపకం గదా! అందుకనే నేమో ఉత్సాహపద్యం ఎత్తుకున్నాడు

(ఏడు సూర్యగణాలు+ ఒకగురువు -5 యతిస్థానం)

శరదృతువు ఇంత మనోహరంగా అతిరమణీయంగా ఉంది. అయినా పార్వతి ఏమీ చలించకుండా తపస్సు నిష్ఠతో కొనసాగిస్తోంది.

ఇట్లఖిల మనోరంజకంబై యతిరమణీయంబైన శరత్సమయంబున పార్వతి తత్కాలోచితంబు లనుష్ఠించుచుండు నంత- 6-121

శాంత దినాధిప ప్రకర చండతరత్వము మందితాబ్జ వి
భ్రాంతము వీతసప్తదళ గర్వము ధూతమరాళికాళి వి
భ్రాంతము నిర్గతేందుకర భాసము-దేశములందు బర్వె హే
మంతము సంతతోపచిత షూర వికార మనం గ్రమంబునన్ 6-122

పద్యం ప్రాస చూడగానే చెప్పెయ్యవచ్చు హేమంతం కోసం ఇది ప్రారంభిం చిందని శరదృతువు వెళ్లిపోయింది క్రమంగా హేమంతం వచ్చింది తన ప్రణాళిక ప్రకారం హేమంతం ప్రధాన లక్షణాలను ముందు గా రాసిపోసాడు నన్నెచోడుడు

సూర్యకిరణాల (ప్ర+కర) చండిమ -వేడిమి శాంతించింది. తామరల

బేతవోలు

అందచందాలు అణిగిపోయాయి ఏడాకుల అరటిచెట్ల అహంకారం అంతరించింది హంసల (మరాళిక) విలాసాలూ తుమ్మెదల (అళి) ఎగురుళ్ళూ ఎగిరిపోయాయి చంద్ర కిరణాల కాంతి మాసి పోయి ంది ప్రకృతిలో అందాలన్నీ మటుమాయమ య్యాయి. ప్రాణికోటికి మన్మధ వికా రాలు మాత్రం వృద్ధి పొందాయి (ఉపచిత మారవికారము) శరదృతువులో పార్వతి తపస్సు ఎలా కొనసాగిందో కవి వర్ణించ లేదు. ఆ లోటుని ఇప్పడు హేమంతంతో కలిపి తీరుస్తున్నాడు. కథతో అను సంధిస్తూ

శరదాగమంబు తన సుత
కురు పరితాపంబు సేయుచుండుట హిమ భూ
ధరపతి కని , వాని పయిన్
బరిగొనియెనొ నాగ దుహిన పటలము పర్వెన్ ౬- ౨౩

(పరిగొనియెను=దండెత్తెను, తుహినపటలము=దట్టమైన మంచు)

శరదృతువు అందాలరాసిగా ప్రకృతిలో మన్మధవికారాలను పెంచుతూ విజృంభించి పార్వతికి గొప్ప పరితాపం కలిగించింది పర్వతరాజు హిమవంతుడు ఇది గమనించాడు. మా అమ్మాయికి ఇంత తాపం కలిగి స్తుందా అని అలిగి శరదృతువు మీద దండయాత్రకు బయలుదేరాడు (పరిగొనియె) అన్నట్టుగా మంచు దట్టంగా వ్యాపించింది అలిగిన మహా రాజు హిమవంతుడు కాబట్టి దండెత్తిన అతని సైన్యం తుహినపటలమయ్యింది ఇది కూడా ఉత్ప్రేక్షాలంకారమే

శీతాత్యంత నిపీడనం బడి జగజ్జీవాళు లత్యార్తులై
పాతాళంబుల సొచ్చు న ట్టిరవు లొప్పన్ భూగృహావాసులై
భీతిన్ వెల్వడకుండ, వహ్ని మెయి కంపింపం, బ్రచండార్చికిన్
జేతుల్ గ్రొవ్వెర పోవుచుండ శిశిరోచ్ఛేదంబు పర్వెన్ మహిన్౬- ౨౪

(ఇరవు=స్థానము మెయి=శరీరము, క్రొవ్వెర పోవుచుండన్=కొంకరలు పోవు చుండు శిశిర+ ఉచ్ఛేదంబు=శిశిరాతిశయము)

హేమంత శిశిరాలు కలిసే ఉంటాయి విడదీయడానికి ఏమంత వీలు పడదు శిశిరం విజృంభించింది ప్రపంచంలో సర్వప్రాణికోటినీచలి దారుణంగా బాధి స్తోంది. ఆర్తులై మనుషులంతా పాతాళం తాకేచోటు ల్లాంటి భూగృహాల్లో దూరి దాక్కుంటున్నారు బయటకు రావడానికి ఎవ్వరూ సాహసించడం లేదు లోపలే ఉండి పోతున్నారు అంతెందుకు అగ్నికే వణుకు పుడుతోంది జ్వాలలు గాలికి కదలడం వణుకులా ఉంది సూర్యుడికి (ప్రచండార్చి) చేతులు కొంకరలు పోతున్నాయి జ్వాలలు వణకటమూ కిరణాలు వంకర్లు తిరగడమూ సహజము దాన్ని శీతలబాధగా కవి భావిం చి శిశిర తీవ్రతను తెలియజేస్తున్నాడు

ఇలా చలి ఎముకలు కొరికేస్తుంటే పార్వతీదేవి ఎలా తపస్సు చేస్తోందో చూపించి కవి పాఠకుణ్ణి మళ్ళీ కథలోకి మళ్ళిస్తున్నాడు

తదవసరంబున- ౬- ౨౫

తనరి హేమంత మగుడు బద్మంబు లడగి
పోవ, బోయిన గొలనొక్క పువ్వు తనకు
విత్తుగా డాచికొనియున్న విధము పోలె
శైలసుతముఖ ముదక వాసమున నొప్పె 6- 26

ఈ చలికాలంలో పార్వతి కొలనులో దిగి, మెడలోతు నీళ్లలో నిలిచి, ముఖం ఆకాశం వైపునకు ఎత్తి, తపస్సు చేస్తోంది కొలనునీటిపై ఇప్పడు పార్వతిముఖం ఒక్కటే కనబడుతోంది శరదృతువు వెళ్ళిపోవడంతో, హేమంతం వచ్చి (అగుడున్) మంచు దట్టంగా కురవడంతో సరోవరంలో పద్మాలు పూర్తిగా అంతరించాయి అణిగి పోయాయి అణిగిపోతే (పోయి నన్) పార్వతి ముఖం ఒక్కటే ఒకే ఒక్క పద్మంలాగా ఉంది రాబోయే కాలానికని సరోవరం ఈ ఒక్క పద్మాన్నీ విత్తనంలా దాచుకుందేమో (విత్తు-విత్తనం)

రైతులు ఎంత కరువు వచ్చినా విత్తనాల సంచీ విప్పరు ప్రాణాలు ఒడ్డి కాపాడు కొంటారు రాబోయే కాలానికి విత్తనాలే లేకపోతే ఎలా? అలాగే సరోవరం పార్వతీదేవి ముఖ పద్మాన్ని విత్తనంలా దాచుకుందేమో అని కవి ఉత్ప్రేక్ష పార్వతి ముఖం అచ్చం పద్మంలా ఉందనీ ఘోరతపస్సు సాగుతోందనీ వ్యంగ్యం

విత్తనాలను కాపాడే బాధ్యత రైతుది మాత్రమేకాదు, ఆ పంట మీద ఆధార పడే కుటుంబసభ్యులదీ ప్రజలదీ కూడా ఈ అభిప్రాయంతో పై భావాన్ని మరికొంత కొనసాగిస్తున్నాడు

మఱియును 6-127

వనజము లెల్ల మంచుగొని వాడినచో, నొకపువ్వు నిల్చినన్
గని, యళు లన్నియున్ నెలవుగై కొని, దీనికి ముచ్చు వచ్చునో
యను వగ -మీద బిండుకొని యడ్డము నిల్చెనొ నాగ నంబుజా
ననముపయిన్ జటావళి పెనంగి నగాత్మజ కొప్పె నత్తఱిన్ 6-128

(అళులు=తుమ్మెదలు, నెలవు=స్థానము, ముచ్చువచ్చుట= దొంగిలింపబడుట, వగ=బాధ, పిండుకొని=గుంపుకట్టి నాగన్=అనగా)

మంచువానకి పద్మాలన్నీ (వనజములు) వాడిపోతే ఒక పువ్వు మాత్రమే మిగిలి ఉంది.తుమ్మెదలిది గమనించాయి అక్కడికి ఆ సరోవరా నికి చేరుకున్నాయి. దీనికి కూడా ప్రమాదం ముంచుకు వస్తుందేమో అంత రించిపోతుందేమో అని దిగులుచెందాయి కాదు అలా జరగడానికి వీలు లేదు అని ఒక నిశ్చయానికి వచ్చినాయి. గుంపుకట్టి పద్మం మీద అడ్డంగా నిలబడ్డాయి రక్షణ కవచంగా ఏర్పడ్డాయి-అన్నట్టుగా పార్వతీదేవి ముఖపద్మంమీద, ముంగురులూ, జుట్టూ పెనగొని అందంగా (ఒప్పగా) కపబడుతోంది.

జుట్టు ముఖం మీద పడుతోంటే అది తుమ్మెదలు మూగినట్టు ఉంది దానికి కారణం ఉత్ప్రేక్షించాడు కవి. ఇది సిద్ధహేతూత్ప్రేక్షాలంకారం

హేమంత శిశిరాల్ని వర్ణించిన నాలుగుపద్యాల్లోనూ పార్వతి తపస్సు ప్రసక్త మయ్యింది. మొత్తం వర్ణనకి కథతో సంధానం కుదిరింది ఈ రెండు ఋతువుల్లోనూ పార్వతి నిరంతరం నీళ్ళలోనే నిలబడి, నిరాహార దీక్షలతో ఘోర తపస్సు చేసింది అటుపైన వసంతఋతువు ప్రవేశిస్తోంది

ఇట్లతిదుస్సహశీతోపేతంబులగు హేమంత శిశిరంబులందు నిరంతరో దకవాస నిరాహారాది ఘోర తపోవృత్తిం బ్రవర్తించుచుండు నంత 29

జలజలదుల్లు పర్ణముల చప్పుడు , అక్కడ జాడజాడ బై
నెలమెడు వల్దమోసులును, నేర్పడు కెందలిరాకు జొంపముల్
బొలుపగు మొగ్గలున్ విరియు పూవులు బూపలు ప్రాని ప్రాని త
గ్గలముగ దాల్చె-జెప్ప వినగా దది యెట్టి వసంతవేగమో। 6-130

(ఎలముట =తేలుట వల్ద=పెద్ద మోసులు=చిగుళ్లు తలిరాకు=లేత ఆకు, పూపలు =పిందెలు)

శిశిరం వెళ్ళిపోతూ వసంతం ప్రవేశిస్తున్నప్పడు ప్రకృతిలో వస్తున్న మార్పుల్ని అదే క్రమంలో పట్టుకుని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నాడు.

ఆకులు జలజలా రాలిపోతున్నాయి ఆ చప్పళ్లు ఒక ప్రక్క వినపడుతూనే ఉన్నాయి కొమ్మనించి ఆకురాలిపోయిన ప్రదేశంలోనే సరిగ్గా అక్కడే చూస్తుండగానే కొత్తగా చిగుళ్లు పొటమరిస్తున్నాయి అవి ఎర్రటి లేత ఆకుల జొంపాలుగా తయారగు తున్నాయి మరి కొన్ని రోజుల్లోనే అందంగా మొగ్గలు వస్తున్నాయి పువ్వులుగా విక సిస్తున్నాయి పిందెలు కడుతున్నా యి చెట్టుచెటుకీ ఇదే వరస ఈ సొగసూ ఈ వేగమూ ఎవరూ చెప్పింది కాదు, ఎన్నడూ విన్నదీ కాదు అన్నట్టు వసంతం వచ్చింది (చెప్పవినగానది వేగమో అనీ పేర్చె వినగా నది యెట్టి అనీ రెండు పాఠాంతరాలు ఉన్నాయి వీటికన్నా పైదే బాగుందనిపించి-

వ. అన నిఖిల భువన మనోరంజకం బగుచు। 6-131

పొలుపుగ నేచి చెల్వడర బూచి బెడంగుగ గాచి పండ ప్రా
కులు,మరు డేయ, గోయిలలుగూయ,మదాళులుమ్రోయ, రాగులన్
వల రసమంద, బ్రోషితులు వంద, గవల్ మదమంద వచ్చె న
ఘుత్యలవసంత మర్వర ననంత విభూతి నిరంతరంబుగాన్ 6-132

(ఏచి=విజృంభించి చెలువు=సొగసు అడరన్=వ్యాపించగా, బెడంగుగాన్= ఇంపుగా వలరసము=అనురాగము ప్రోషితులు= విరహులు వందుట=దుఃఖించుట ఉర్వరన్=భూమి పై)

సకల ప్రపంచానికే మనోరంజకంగా ఉన్న ఈ వసంతంలో ఇంకా ఏమేమి మార్పులు జరుగుతున్నాయో ప్రాణికోటి ఎలా స్పందిస్తోందో చెబుతున్నాడు

చెట్లు అందంగా విజృంభిస్తున్నాయి అందంగా పుష్పిస్తున్నాయి అంతకంటే అందంగా కాస్తున్నాయి. ఆ కాయలు ఫలిస్తున్నాయి వసంతుడు సైదోడుగా

మన్మధుడు (మరుడు) బాణాలు వేస్తున్నాడు గుండెలు చీలుస్తున్నాడు ప్రాణికోటికి మన్మధవికారాలు విజృంభిస్తు న్నాయి కోయిలలు కూస్తున్నాయి మదించిన తుమ్మెదలు మ్రోస్తున్నాయి అనురక్తులలో అను రాగం అంకురిస్తోంది విరహుల బాధ వర్ణనాతీతం జంటల (కవలు) ఆనందానికి అవధులు లేవు అనంత సంపదతో నిరంతరంగా నిరాఘాటం గా వసంతం భూమికి అవతలించింది

శబ్దాలంకారం ఇక్కడ మరొక అందం ప్రకృతిలో కలిగిన చైత న్యాన్ని ఇది స్ఫురింపజేస్తోంది ఏచి-పూచి-కాచి అని మొదటి పాదంలో ఏయ-కూయ-మ్రోయ అని రెండవ పాదంలో అంద-వంద- అంద అని మూడవ పాదంలో వేరు వేరు అను ప్రాసలు ఉన్నాయి దేని అందం దానిదే ఏ ప్రాంతంలో అందం ఆ ప్రాంతానిదే అందుకే ఈ వసంతానికి ''నిరంతరమ్మైన అనంత విభూతి''

అంతం బార్వతి వసంతానంతలతాంత సంతతి నంతకాంతకాక్రాంత పూజాత్యంత హోమాది క్రియలం బ్రవర్తించుచుండు నంత! 6-133

స్ఫురదురుదావపావకము, శోషిత సింధుచయోదకంబు, సం
హరిత పతంగ సంఘ, మసమర్థిత మార్గి (ర్గ) గణంబు, తప్త భూ
మిరుహకులంబు, వర్ధితసమీర విదాహ, మశేష దగ్ధ భూ
ధర నికరంబు నా బటు నిదాఘము పర్వె భయంకరాకృతిన్ 6- 34

(సింధుచయము=నదులు పతంగసంఘము=పక్షులు మార్గి=బాటసారి, తెరువరి విదాహము=వేడి)

వసంతంలో ఎటుచూసినా ఎన్నోరకాల పువ్వులు వాటిని (అంతక + అంతక) శివ పూజకు పార్వతి ఉపయోగిస్తుంది హోమాది క్రియలతో తపస్సు సాగిస్తోంది. (అంతకుడు=యముడు అంతక+ అంతకుడు= యముణ్ణి గెలిచినవాడు - శివుడు)

వసంతం ఇంత అందంగా ఉంటే, దాన్ని తరిమికొడుతూ భయం కరాకృతితో గ్రీష్మం (నిదాఘము) వచ్చి పడింది. సమాస బంధురంగా దాని భీకరాకారాన్ని స్ఫురింపజేస్తూ ముందు స్థూలంగా వర్ణిస్తున్నాడు

అడవుల్లో ఎటుచూసినా దావానలాలు వ్యాపిస్తున్నాయి ప్రకృతిని మరింత వేడెక్కిస్తున్నాయి.ఎండిన చెట్టుకొమ్మలు గాలికి ఒరుసుకొని నిప్పు రవ్వలు రాలిపడి క్రింద ఎండుటాకులు అంటుకుని దవానలం-కార్చిచ్చు వ్యాపిస్తుంది. గ్రీష్మ ఋతువులో ఇది సహజం. నదులలో (సింధు చయ) నీళ్లు ఇంకిపోయాయి వేడి తట్టుకోలేక, నీరూ నీడాదొరక్క పక్షులు(పతంగ సంఘు) గుంపులుగుంపులుగా మరణిస్తున్నాయి. మార్గాలలో (మార్గగణం బు) జనసమ్మర్దం తగ్గిపోయింది ఎవరూ ఇళ్లు వదిలి బయటికి రావడం లేదు బాటసారులు (మార్గిగణంబు) కనపడటంలేదు. చెట్లు ఎండిపోతు న్నాయి.గాలి బాగా వేడెక్కింది.వడగాలిలా మారింది కొండలు తగులబడుతున్నాయి. వేసవి కాలము ఇంత భయంకరంగా ఉంటే ఎండవేడి ఇంకెంత భయంకరంగా ఉందో అత్యద్భుతంగా చెబుతున్నాడు

తలచిన డెందము కందును,
పలికిన నోరెల్ల పొక్కు, ప్రభ సూచిన రె
ప్పలు కమరు ననగ పటుతర
విలయానలభాతి నెండ వేసవి గాచెన్ 6- 35

ప్రళయాగ్నిలాగా (విలయ+అనల) ఎండకాస్తోంది ఆ ఎండను తలుచుకుంటే చాలు గుండెలు కందిపోతున్నాయి పలికితే నోరు పొక్కి పోతుంది కాంతి చూస్తే చాలు కనురెప్పలు కమిలిపోతాయి -అని పించేంతగా వేసవికాలం ఎండ కాస్తోంది వేడిమి తీవ్రత ఇంతకంటే గొప్పగా చెప్పడం సాధ్యమా ఆ వేడికి వీచే వడ గాలుల వేగాన్ని విసురునూ సమాసాలతో మత్తేభంలో చూపిస్తున్నాడు

స్ఫురదారణ్య మహీధరోపరి సముద్భూతో గ్ర (జీ) దావానలో
త్కర విస్ఫార శిఖాలి గూడి, రవికాంత వ్రాత సంజాత దు
స్తర తీవ్రాగ్ని బెనంగి వీచె వడ- ఆసంక్రుద్ధ కాలాగ్ని రు
ద్రరయోచ్ఛ్వాస సమేతమో యని జనవ్రాతంబు గుంపింపగాన్6- 36

అసలే వడగాలి అది రెండింతలు వేడెక్కింది అడవుల్లో కొండలున్నాయి ఆ కొండల మీద కార్చిచ్చు వ్యాపించింది ఆ మంట మీదుగా ఈ వడగాలి జనావాసాల్లోకి వీస్తోంది కొండలమీద సూర్యకాంతమణులు ఉన్నాయి అవి సూర్యకిరణాలు సోకి భగ్గుభగ్గున మండుతున్నాయి ఆ మంటల తో పెనుగులాడి ఈ వడగాలి వీస్తోంది ఇలా వేడి రెండింతలయ్యింది. తీవ్రం గా కోపించిన కాలాగ్ని భీకరవేగంతో (రుద్ర రయంతో) నిట్టూరిస్తే అది ఈ గాలితో కలిసి ఇటు వీస్తోందేమో అని ప్రజలు భయంతో వణికి పోతున్నారు లేదా ఆసంక్రుద్ధకాలాగ్ని+ ఆసంక్రుద్ధ రుద్ర-రయోచ్ఛ్వాసంతో కలిసిందేమో-అని కానీ పైని రెండగ్నులున్నాయి కనక.

ఉరునిదాఘాతపాహతి గరుల తలలు
వ్రస్సి లోపల ముత్యముల్ వరుస మెఱసి
మంగలములోని ప్రేలల భంగి దూలి
ప్రేలిపడ గాసె గట్టెండ పిడువరించి 6-137

(ఆతపము= ఎండ, ఆహతి=దెబ్బ, ప్రేలలు=పేలాలు, పిడువరించి=శోషిల జేసి)

రోహిణిలో రోళ్లు పగులుతాయని సామెత గ్రీష్మంలో ఎండదెబ్బకు ఏనుగుల కుంభస్థలాలు పగిలిపోయాయిట ఆ కుంభస్థలంలో వరసగా పేర్చినట్టున్న ముత్యాలు మంగలంలో పేర్చిన పేలాలలాగా తూలి పేలిపడుతున్నాయిట ప్రపంచాన్ని శోషిల్లచేస్తూ ఇంత కట్టెండ కాసిందట ఉత్ప్రేక్షలు విడిచాడు వైవిధ్యం కోసం ఇదొక అతిశయోక్తి.

మదగజాల కుంభస్థలాల్లోనూ, ముదిరిన వెదురు గడల్లోనూ ముత్యాలుంటాయని కవులు వర్ణిస్తుంటారు లోకంలో నిజంగా ఉండక పోవచ్చు. వీటినే కవిసమయాలు అంటారు శాస్త్ర విరుద్ధమే అయినా కావ్య ప్రపంచం అంగీకరించిన విషయం -కవి సమయం

ఎప్పుడు వరదలు వచ్చినా ఎప్పుడు ఎండలు కాసినా ప్రజలు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరమే '' ఇంత దారుణం ఎప్పుడూ ఎరగం'' అని చెప్పకోవడం ఆశ్చర్యపోవడం కద్దు - ఇదిగో ఈ మనస్తత్వాన్ని పట్టుకున్నాడు కవి ఈ పద్యంలో

అవియని గండశైల మన, నంఘ్రుల తోడన యెండకున్న భూ
భవ మన, నింకి బీటగిల బాఱని యేఱన ,మస్తకం బొగిన్
బవులని మూర్ఛ సంఘ మన బట్టదు- లోకములోన నిట్టి వే
సవి గలదయ్య నా నిఖిల సాధ్వస మయ్యె నిదాఘముగ్రమై ౭ - 1 38

పగలని కొండా బండా మచ్చుకయినా కనపడటం లేదు వేళ్ళతో సహా ఎండిపోని చెట్టంటే కనపడటం లేదు నీళ్ళన్నీ ఇంకిపోయి బీటలు తియ్యని ఏరంటే లేదు తలలు పగలని బాటసారులూ లేరు లోకంలో ఇలాంటి వేసవి అసలు ఎప్పడయినా ఉందా కనీవినీ ఎరుగుదుమా అని ప్రజలంతా భయపడేట్టు గ్రీష్మం ఉగ్ర రూపం ధరించింది.

''పట్టదు'' అనే క్రియను పైవాటిలో దేనికి దానికి ప్రత్యేకంగా అన్వయించుకుంటే విడివిడి వాక్యాలు ఏర్పడతాయి ఇది భాషాప్రయోగంలో క్లుప్తతను సాధించడానికి ఒక వ్యూహం

అతి దుస్తరమూ అతి దుస్సహమూ అతి తీవ్రతరమూ అయిన నిదాఘభయం మానవుల్నే కాదు త్రిమూర్తుల్ని కూడా హింసించింది అయితే తాపం పోగొట్టుకోవడానికి ఏవేవో ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకున్నారు

హరి శరధి గ్రుంకె, నభవుడు
సురనది దలదాల్చె, నబ్జజుడు గ్రమ్మఱ నం
బురుహంబు సొచ్చె,నతి దు
స్తర దుస్సహ తీవ్రతర నిదాఘభయమునన్ ౭- 39

ఎండవేడి తట్టుకోలేక విష్ణుమూర్తి సముద్రంలో (శరధిన్) మునిగాడట శివుడు గంగానదిని (సురనది) నెత్తిమీద పెట్టుకున్నాడట బ్రహ్మదేవుడు మళ్ళీ పద్మంలోకి దూరిపోయాడట విష్ణుమూర్తి క్షీరసముద్రంలో ఆదిశేషునిపై పవ్వళించి ఉంటాడనీ, శివుడి నెత్తిమీద గంగా నది ఉంటుందనీ (గంగాధరుడు) బ్రహ్మదేవుడు పద్మాసనంలో కొలువు చేసి ఉంటాడనీ పురాణ ప్రసిద్ధి దీనినే చమత్కరించాడు కవి ఉక్తివైచిత్రి. ''దుస్తర- దుస్సహ- తీవ్రతర విశేషణాలు మూడు ఉండటం గ్రీష్మతీవ్రతను తెలియజెయ్యడానికే

ఇట్లతిదారుణమైన ఘర్మ దివసంబునం బార్వతి పంచాగ్ని మధ్యాగ్నిముఖా ధోముఖోర్ధ్వముఖాది ఘోర తపంబులు సేయుచు

౭ - 1 40

ఆతప భీతి నీడలు రయంబున వ్రాకుల క్రిందు దూరెనో
యా తరులుం దృషాభిహతులై తమ నీడలు తార త్రాగెనో

భాతి ననంగ నీడ లురుపాదపమూలములం దడంగె గ్రీ
ష్మాతప మధ్య వాసరములందు ఇలింపకయుండు నెండలన్ 6-14

ఈ వేసవికాలంలో పార్వతీదేవి పంచాగ్ని మధ్యంలో నిలబడి తపస్సు చేస్తోంది. అగ్నిముఖంగా కొంతసేపు అధోముఖంగా కొంతసేపు ఊర్ధ్వముఖంగా కొంతసేపు ఘోరతపస్సు చేస్తోంది

గ్రీష్మంలో ఎంతసేపటికీ పగలు గడవదు పగటి ప్రొద్దు ఎక్కువ మధ్యాహ్నానికి ఎండ నిలబడిపోయినట్టు ఉంటుంది ఈ సమయంలో మిట్ట మధ్యాహ్నం చెట్ల నీడల్ని వర్ణిస్తున్నాడు నీడలు మొదళ్ళకి చేరిపోతున్నాయి విశాలమైన పెద్ద చెట్టయితే మానుచుట్టూ కాస్త నీడ ఉంటుంది పళ్లెంలా. సన్నటి చెట్టయితే (ఈత తాడి) అదీ ఉండదు

ఎండకు భయపడి కాబోలు నీడలుకూడా పరుగుపరుగున వెళ్లి చెట్టు మొదళ్ళు చేరాయి వేసవిలో సూర్యుడు మధ్యాహ్నం వరకు చరచరా సాగుతాడు అక్కడ నుంచి మందగించినట్టుంటుంది అందుకని నీడలు రయంబున మాకుల క్రింద దూరుతున్న భ్రాంతి కలుగుతున్నది అలాగయినా అయ్యుండాలి లేదంటే తరువులు దప్పికతో తమ నీడలు తామే త్రాగేసా యేమో ఏమయితేనేమి నీడలు చెట్ల మొదళ్లకు చేరాయి. ఇదీ మధ్యాహ్న కాలంలో దృశ్యం రెండూ ఉత్ప్రేక్షలే.

తరువులు అనేది పురుష వాచకం కాదు. అయినా తృషాభిహతులై అనే విశేషణాన్ని మహద్రూపంతో ప్రయోగించినాడు ఈ మానుషత్వారోపణ ప్రజల ఆర్తినీ దప్పికనీ స్ఫురింపజేస్తుంది

పరితాపోగ్ర నిదాఘవేళ, శిలపై బంచాగ్ని మధ్యంబునన్
బరమధ్యాన సమేతయై నిలిచి, విభ్రాజిల్లె నుద్యత్తప
శ్చరణాలంకృత శైలనందన, గనత్సంధ్యారుణాంభోధరో
త్కర మధ్యస్థిరకాంత కాంతియుత శీతద్యోతిలేఖాకృతిన్ 6-142

సకల జీవరాశినీ ఇంతగా పరితపింపజేస్తున్న గ్రీష్మంలో మధ్యాహ్నవేళ పార్వతీదేవి గండశిల మీద పంచాగ్ని మధ్యంలో ధ్యానముద్రతో నిలబడి తపస్సు చేస్తోంది సంధ్యాకాలంలో ఎర్రని మేఘాల మధ్యస్థిరంగా విరాజిల్లుతున్న చంద్రరేఖలాగా ఉంది

గండశిల ఆకాశం అగ్నులు ఎర్రని మేఘాలు తపోనియమాలతో కృశించిపోయిన పార్వతి చంద్రరేఖ తపశ్శక్తి అంతర్గతంగా ఉన్న కాంతి

ఛటఛట బేల్చుచు నలుగడ
బటుతర శిఖిశిఖలు నెగయు, బదిలముగా నుం
గటము ధర నూది, సుస్థితి
గుటిలాలక వదనమెత్తికొని రవిజూచున్ 6-143

ఛటఛటా పేలుతున్న ఎర్రటి నిప్పలతో నాలుగువైపులా అగ్ని గుండాలు

న్నాయి వాటి మధ్యలో పార్వతి పదిలంగా నిలబడి ఉంది ఒంటి కాలి మీద అదీ ఒక్క బొటనవేలు మీద- నిశ్చలంగా నిలబడింది ముఖం ఎత్తి అయిదవ అగ్ని సూర్యబింబం వైపు చూస్తూ తపస్సు చేస్తోంది పంచాగ్ని మధ్యంలో ఉగ్రతపస్సు అంటే ఇది (ఉంగటము= బొటనవేలు)

అలా సూర్యుడికేసి చూస్తూ తపస్సు చేస్తుంటే పార్వతి ముఖం ఏమయ్యింది కన్నులు ఏమయ్యాయి అనేది కవి మనోనేత్రంతో దర్శించి చూపెడుతున్నాడు

ఖరకర కరహతి ముఖసర
సిరుహము కడువంది, కాంతిసెడి, నయనేందీ
వరము లలరె, గిరిజ తపః
స్థిరశక్తిని బగలు రేయి చేసెనొ యనగాన్ 6- 44

గ్రీష్మ సూర్యుని వాడి కిరణాలకూ వేడి కిరణాలకూ పార్వతి ముఖ పద్మం వాడిపోయింది కాంతి కోల్పోయింది కాటుక కన్నులు మాత్రం నల్లకలువల్లాగా విప్పారి కనపడుతున్నాయి బహుశ అవికూడా చుట్టూ నల్లగా కమిలిపోయి ఉంటాయి. కానీ కాంతి తగ్గలేదుట '' అలరె'' అంటు న్నాడు సరే ఇంతకీ- సూర్యుడు ప్రకాశిస్తున్న సమయంలో వికసించవల సిన(ముఖ) పద్మం వాడిపోవడమేమిటి? ముకుళించ వలసిన నల్లకలువలు (నయనేందీ వరములు) వికసించడమేమిటి? గిరిజ తన తపశ్శక్తితో పగలు రేయిగా మార్చివేసిందేమో అని కారణాన్ని ఊహించాడు

పార్వతి తపస్సు మొదలుపెట్టి సంవత్సరం అయ్యింది ఈ గ్రీష్మం వెడితే మళ్లీ వర్షర్తువే. ఉగ్రతపస్సు. శక్తి ఉండదా పగటిని రేయిగా మార్చలేదా రాబోయే పద్యాల్లో ఈ తపశ్శక్తిని వర్ణించబోతున్నాడు దానికి ఈ ఉత్ప్రేక్ష ఒక ప్రాతిపదిక

అట్టి తపంబునందునుం బరమేశ్వరుండు ప్రసన్నుండు గామికి నగజ తపఃక్లేశంబు పరమేశునకెఱియదనేరమికి నుద్వేగించుచు 6-145

ఇనుము రసంబులో నుడుగ కెప్పడు నూనినగాని కాదె కాం
చన, మమరాద్రి వాయసము సంతతమున్ వసియించికానియే
కనకము చాయగాదు చిరకాలమునుసేవనగాని కాచె స
ఘ్నమున నిన్ దలంచు టొకమాత్రయు చాలదె ముక్తికీశ్వరా 6-145

ఎంత ఘోరతపస్సు చేసినా పరమేశ్వరుడు ప్రసన్నుడు కాలేదు తన శ్రమ పరమేశ్వరునికి చేరే విధమేమిటో నగజకు తెలియలేదు ఆరాట పడుతోంది. మనస్సులో ఇలా అనుకుంటోంది

పరమేశ్వరా ఇనుము ఎంతోకాలం పాదరసంలో నానితేనేగానీ బంగారంగా మారదు కాకి మేరుపర్వతం మీద చాలాకాలం నివసిస్తే తప్ప బంగారురంగు పొందదు అలాగ చిరకాలం నిన్ను సేవిస్తేనేగానీ ముక్తి లభించదా ? ప్రత్యక్షం కావా? మంచి మనస్సుతో ఏకాగ్రతతో (ఒక్కసారి ఒక్కమాత్రయు) నిన్ను స్మరిస్తే చాలదా ?

కర మవిచారి, తద్దయు వికారి మనం బది సారివోలెనే
తిరిగెడు గాని నిల్వదెట, దీని చలత్వము మాల్చి నీ పదాం
బురుహములందు సంస్మరణ బొంద దయన్ సురబృందవంద్య!సు
స్థిరముగ నిల్పు, తత్త్వ విధి దెల్పు సమస్థితి సల్పు శంకరా! 6- 47

శంకరా. ఈ మనస్సు తెలివితక్కువది అవిచారి. మాటిమాటికీ రకరకాల వికారాలూ పొందుతూ ఉంటుంది కుమ్మరి చక్రంలా (సారి) గిరగిరా తిరుగుతూ ఉంటుంది క్షణకాలం ఎక్కడా నిలబడదు దీని తిరుగుళ్లు ఆపవయ్యా నీ పాదపద్మాలను సంస్మరించే సుస్థిరత్వాన్ని దయజేసి అనుగ్రహించు సకలదేవతలచేతా నమస్కరింపబడేవాడా తత్త్వం తెలియ జెయ్యి. దాని కిటుకేమిటో చెప్పు సమస్థితి కలిగించు

అనుచున్ బరమేశ్వర ధ్యానలీయమానమానసయై దేహంబు నిరంతర తపఃక్లేశంబునన్ జర్మాస్థిమయంబై కాష్ఠావస్థ నెయిదియున్ తపోనిష్ఠ విడువక యనుష్ఠించు 6-148

అరగొనక శైలతన్మక
హరు మనమున గోరి చేయు నత్తపమున క
చ్చెరువంది భువనముల నిది
యరుదని ముత్తెంపు సేస లలికిరి విబుధుల్ 6- 49

(అరగొనక=విడువక, అలికిరి=చల్లిరి, విబుధుల్=దేవతలు సేసలు=అక్షతలు తలంబ్రాలు)

పరమేశ్వర ధ్యానంలో పార్వతి మనస్సు లీనమయ్యింది తపఃక్లేశముతో శరీరం కృశించి ఎముకల గూడు మిగిలింది. కాష్ఠావస్థను (ఎండు కర్ర) పొందింది నిష్ఠ విడవకుండా తపస్సు అనుష్ఠిస్తోంది.

హిమగిరి నందిని శివుణ్ణి కోరి విడవకుండా (అరగొనక) చేస్తున్న ఆ తపస్సుకి దేవతలు ఆశ్చర్యపోయారు. ముల్లోకాల్లోనూ ఇది చాలా అరుదన్నారు సంతోషించి మెచ్చుకోలుగా ముత్యాల తలంబ్రాలు చల్లారు

తదవసరంబున 6-150

చిరసద్బ్రహ్మ తపోధనావళి తపస్తేజంబులున్, బేర్మితో
దిరమై పొల్పగు దేవ తాపస తపస్తేజంబులున్ గౌరి సు
స్థిరభావోగ్ర తపోగ్రతేజమున నిస్తేజంబులై యుండె, న
త్ఖరు చండాంశు కరప్రభా ప్రతిహతద్యోతిః ప్రభాభాసమై 6- 5

పార్వతీదేవి సుస్థిరభావంతో చేస్తోంది ఉగ్రతపస్సు దాని గొప్ప తేజస్సు ముందు (అగ్రతేజము=శ్రేష్ఠమైన తేజస్సు) బ్రహ్మర్షుల చిరకాల తపస్తేజాలూ దేవర్షుల తపస్తేజాలూ నిస్తేజాలైపోతున్నాయి సూర్య (చండాంశు) కిరణాల కాంతిముందు నక్షత్రాల వెలుగుల్లా వెలవెల పోతున్నాయి (ద్యోతిః=నక్షత్రం)

మఱియును 6-152



ధర కంపించె నిశాకర

ఖరకర గతు లెడలె, దారకంబులు డుల్లెన్,

గిరులురిలె, శరధులింకె న్,

బరమేష్ఠి చలించె, నమరపతి మది నులికెన్ 6-153

ఆ తపశ్శక్తి తాళలేక ఏమేమి ఉపద్రవాలు జరిగాయో ఆరుపద్యాల్లో వరుసగా వివరిస్తున్నాడు

భూమికంపించింది సూర్య (ఖరకర) చంద్రులు (నిశాకరుడు) గతి తప్పారు నక్షత్రాలు రాలిపడ్డాయి పర్వతాలు దొర్లిపోయాయి సముద్రాలు ఇంకి పోయాయి బ్రహ్మ చలించిపోయాడు దేవేంద్రుడు (అమరపతి) మనస్సులో ఉలిక్కిపడ్డాడు.

ఉరగపతి విషము గ్రక్కెను,

హరి చిత్తమునందు వందె , నగతనయా తపో

భరమున ధారుణి దాల్చగ

భరమై కమఠంబు డిందువడి కడునడగెన్ 6-154

ఆదిశేషుడు విషం కక్కాడు విష్ణుమూర్తి మనస్సులో కలత రేగింది తపోభారం వల్ల భూమి మరింత బరువెక్కి తాబేలు డీలాపడి అగిపోయింది ఆదిశేషుడు, ఆదికమఠము అష్టదిగ్గజాలు ఈ భూగోళాన్ని అడుగునుండి మోస్తుంటాయని పురాణ కవిసమయం బరువు పెరిగిన భూమిని మొయ్యలేక కమఠం అణగారిపోయిందిట.

వనరాశు లేడు నుప్పరి

పెనమున నీరులును బోలె బెల్లున నుడిగెన్

గనకాద్రి క్రోవిలోపలి

కనకంబును బోలె నీరుగా గరగె వడిన్ 6-155

సముద్రాలు (వనరాశులు) ఏడూకాలిన ఉప్పపెనంమీద పడిన నీళ్ళలాగా క్షణంలో ఆవిరి అయిపోయాయి మేరుపర్వతం (కనకాద్రి) మూసలో (క్రోవి) బంగారం లాగా కరిగిపోయింది.

తారకము లెల్ల రుచిరాం

గారంబుల కరణి వెలిగె , గములారి తమో

హారులు గ్రాగిన రజత ము

హారజతాదర్శనంబులన దనరి రెడన్ 6-156

(రజతము=వెండి, మహారజతము= బంగారము ఆదర్శనము= అద్దం)

ఆకాశంలో నక్షత్రాలు నిప్పకణికల్లా వెలుగొందాయి సూర్య చంద్రులు వెండి బంగారు అద్దాల్లా మారిపోయారు. అంటే ఇవి మునుపటి కాంతిని కోల్పోయాయన్నమాట.

పొండిగ నగజ తపశ్శిఖి

మూండు జగంబులను దీవ్రముగ బర్విన బ్ర

హ్మాండము గాచిన కాంచన

భాండము క్రియ దాల్చె దత్ప్రభా భాసితమై 6-157

పార్వతి తపస్సు ఒక మహాగ్ని. అది ముల్లోకాలకీ వ్యాపించింది. ఆ కాంతులతో నిండిన బ్రహ్మాండం కరిగిన బంగారు కుండలాగా ఉంది (కాంచనభాండము)

''పోడి-మూడు'' అనే పదాల్లో లేఖన పద్ధతి ప్రకారం అరసున్న ఉంటుంది కానీ ఒకప్పుడు వీటిలో పూర్ణానుస్వార ఉండేది. శాసనాల్లో అలాంటి రూపాలు కనపడుతున్నాయి. అందుకని అప్పటి నన్నెచోడుడు నిండు సున్నతో ప్రాసస్థానంలో ప్రయోగించాడు. ఇలా కొన్ని నిండుసున్నలు వ్యవహారంలో ఉచ్చారణలో జారిపోయి అరసున్నలుగా, ఒకప్పటి నిండు సున్నాల గుర్తులుగా మిగిలిపోయాయి

గిరిసుత తపః ప్రభాతికి

దరతరమ చలించి రజతధరణీధర ము

చ్చెరువుగ జిఱ్ఱున దిరిగెన్

బురహరుతోగూడ వెండి బొమ్మరము క్రియన్ 6-158

ఈ తపః ప్రభావానికి కైలాస పర్వతం-వెండి కొండ రజత ధరణీ ధరం క్రమక్రమంగా చలించి ఆశ్చర్యకరంగా జర్రున తిరిగింది. శివునితో సహా వెండి బొంగరంలా గిర్రున తిరిగింది (పురహరుడు=త్రిపురారి, శివుడు)

ఇది ఇలా ఉండగా- అలనాడు మన్మధుణ్ణి దహించివేసి అక్కడ నుండి వెళ్ళిపోయిన శివుడి పరిస్థితి ఎలా ఉందో చెబుతున్నాడు

అంత నటచని కృతాంతాంతకుడు కంతులతాంతాస్త్ర హతాంతరంగుండై కాంతావియోగంబునం దురపిల్లుచు 6-159

(మార్కండేయుణ్ణి కాపాడటానికి) యముణ్ణి జయించిన మహావీరుడు శివుడు మన్మధుణ్ణి సంహరించాడు. అయినా మనస్సులో మన్మధుడు(కంతుడు) చావలేదు. మన్మధుని పూలబాణాలు (లతాంత+ అస్త్ర),అంతరంగానికి తగులుతూనే ఉన్నాయి. పార్వతీ విరహంతో బాధ పడుతున్నాడు. పశ్చాత్తాపంతో తనను తాను నిందించుకుంటున్నాడు

హిమవంతు డింతి నా కీ దెచ్చు టెఱిగియు

నా మాట లేనేల యాడనైతి

నతడొండు నానోడి యతివ నాకడనుంచి

యేగిన కన్నేల యెఱుగనైతి

నా బాల ననుకూడనాశించుచున్నచో

మిన్నక తపమేల పన్నికొంటి

నెలనాగ నామీద నెలయింప వచ్చిన

భావజుతోనేల పగయు గొంటి

దరుణి వలరసంబు దఱుమ పై బడనున్న

నెఱ నెఱింగి కూడ నేర కేల

బేలనైతి ననుచు బాలేందుధరు డాత్మ

చింత విడిచి విరహచింత దగిలె 6- 60

హిమవంతుడు తన కూతుర్ని ఇవ్వడానికే తీసుకువచ్చాడు అనే విషయం అప్పుడే గుర్తించాను అయినా అందుకు తగిన మాటలు ఎందుకు మాట్లాడలేక పోయాను. నేను మాట్లాడి ఉండవలసింది. పాపం హిమవంతుడు మారుమాట్లాడ లేక పార్వతిని నా దగ్గర ఉంచి (సేవల కోసం) వెళ్లాడు అందులో ఉన్న రహస్యాన్నీ ఆ జాడనీ (కన్ను) నేనెందుకు గుర్తించ లేకపోయాను

ఆ బాలిక నన్ను పొందాలని ఆశించింది అయినప్పడు నేను ఉత్తినే తపస్సుకు ఎలా పూనుకున్నాను ఆమెను నా మీద అనురక్తురాలిగా చేసి లోబరచడానికి వచ్చిన మన్మధుడితో పగపెట్టుకున్నానెందుకు అనురాగం మేరమీరి తరుముతూంటే ఆ తరుణి తనంత తాను నాపై పడుతుందని బాగా స్పష్టంగా గ్రహించికూడా నేను ఏమీ ఎరగని వాడిలా బేలలాగా ఎందుకుండిపోయాను

రకరకాల ఆలోచనలతో ఇలా పశ్చాత్తాపపడుతూ ఆ చంద్రశేఖరుడు (బాల + ఇందు=చంద్రరేఖ) ఆత్మచింత, ఆత్మధ్యానం - విడిచిపెట్టేసి విరహచింతలో తగులు కున్నాడుట స్వామివారికి తపస్సుఎగిరిపోయింది ఉస్సురుస్సులు మిగిలాయి ధ్యానం లో పార్వతీదేవి సాక్షాత్కరిస్తోంది

బొమ లల్లార్చుచు లోచనద్యుతుల బై బూరించుచున్ మందహా

సమరీచుల్ దళుకొత్త బల్కునొఱపుల్ సంధించుచున్, లోలభా

వము సూచించుచు నీశు ప్రోల నెలమిన్ వర్తింపఁజొచ్చెన్ మనో

రమణం బార్వతి రూప విభ్రమ మహోరాత్రంబు సాన్నిధ్యమై 6-101

విలాసంగా కనుబొమ్మలు అల్లలాడిస్తూ చూపుల్లో స్నానం చేయిస్తూ చిరు నవ్వుల సిరివెన్నెల (మరీచి=కాంతి) చిందేలా మాటతీరు ఏర్పరచుకొంటూ (మాట్లాడ బోతూ)తన అనురాగాన్నీ ఆసక్తినీ సూచిస్తూ పార్వతీదేవి (రూపవిభ్రమం) రూప విలాసం రేయింబవళ్లు సన్నిధి చేసి పరమేశ్వరుని ఎదుట వర్తించడం మొదలుపెట్టింది

ఇంక తపస్సు ఏమి సాగుతుంది. ఇదే తపస్సు నిరంతరం పార్వతీ ధ్యానమే నిజానికి శివుడి తపస్సు ఫలించింది.

హరునకు జూడగా మహి జరాచర రూపము లెల్ల సన్నతిన్

గిరిసూతరూపమై విరతఖేదము జెప్ప దొడంగె, నట్లకా

కరయగ నాదిశక్తి సచరాచరరూపమ కావునన్ మహా

పురుషుల కన్నకాన్కి యనపోహము కావుటదేమి చోద్యమా! 6-102

చూడగా చూడగా శివుడికి జంగమస్థావర రూపాలన్నీ పార్వతి రూపాన్నే నమ్రతతో (సన్నతిన్) విన్నవిస్తున్నాయి ఖేదపడవద్దు అంటు న్నాయి. అంతేకదా. ఇది సమంజసమే. పార్వతీదేవి ఆదిశక్తి-పరాశక్తి. సృష్టి లో చరాచరరూపాలన్నీ ఆవిడే మహాపురుషుల దర్శనం అపోహలు లేని సత్యమవ్వడంలో ఆశ్చర్యమేముంది (అగుట

అనడానికి బదులు కావుడు -కావుట అనే రూపాన్ని నన్నెచోడుడు ప్రయోగిస్తూ ఉంటాడు.) మొత్తం ప్రకృతి అంతా పార్వతీమయంగా దర్శనమిచ్చిందంటే శివుని తపస్సు ఫలించినట్టే కదా!

ఏడాదిక్రితం శివుడు మన్మథుణ్ణి దహించివేసాడు అందుకు మన్మథుడి సైన్యం శివుడి మీద పగ పట్టింది కసి తీర్చుకుంటోంది మామిడి చిగుళ్ళు, గండు తుమ్మెదలు, పండువెన్నెల, మలయమారుతం- ఇవన్నీ మన్మథుడి బలగం ఇవి శివుణ్ణి ఆక్రమించినట్టుగా కవి రూపకల్పన చేస్తున్నాడు

తదవసరంబున 6-163

ఉరుకపర్దారుణతరదీప్తులను వ్యదు
నవ సహకార పల్లవ విభాతి
నీలకంఠ ప్రభాజాలంబులను సమ
దాళీల రోలంబ మాలికలును
పాండురాంగామల బహుల దీధితులను
పూర్ణ చంద్రాతపాకీర్ణరుచులు
గంగాంబు శీకరోత్కలితాహి నిఃశ్వాస
ముల మందపవనంబు బొందుచేసి
కాము జంపిన పగ దీర్ప గడగి సూక్ష్మ
భావమున జొచ్చి చిత్తతాపావహంబు
లయ్యెనొకొ నాగ-శివు డంగజాపహారి
యయ్యు విరహాగ్ని బడి వేగె నలసి సొలసి 6-164

శివుడిది రాగిజుట్టు అవి మామిడిచిగుళ్లలాగా ఉన్నాయి గరళం మింగి నీలకంఠుడయ్యాడు ఆ నల్లని కాంతులు -వరసలు కట్టి ఎగురుతున్న గండుతుమ్మెదల్లాగా ఉన్నాయి తెల్లని శరీరకాంతులు పండు వెన్నెలలాగా ఉన్నాయి శివుడు గంగాదరుడు, నాగభూషణుడు, సర్పాల నిట్టూర్పులు గంగానది నీటి తుంపరలతో కలిసి చల్లటి మందపవనంలాగా(మలయమారుతంలాగా)ఉన్నాయి ఇన్నీ కలిసి సూక్ష్మరూపంతో శివుడిని చుట్టు ముట్టాయేమో అన్నట్టుగా ఉంది శివుడు మన్మథాంతకుడే అయినా విరహాగ్నిలో పడి అలిసీ సొలసీ వేగిపోతున్నాడు మరి ఈ వేడి, ఈ తాపం చల్లా రాలంటే ఏమి చెయ్యాలి సరోవరంలో మునగాలి. ఇది మాములు తాపం కాదు కనక మామూలు సరోవరం పనికిరాదు

అళిధమ్మిల్ల , మృణాలహస్త, గమనీయావర్త నాభిన్, మహో
త్పల గంధిన్, గలహంసయాన, విలసద్బంధూక రక్తోష్ఠ, ను
త్పల నేత్రన్, గమలాస్య, నంగజరసాంభఃపూర, దత్పార్వతీ
జలజావాసము జొచ్చి యాడక మనోజాతానలం బారునే 6-165

అలౌకిక స్థితినుంచి శివుణ్ణి పూర్తిగా లౌకిక శృంగార స్థితికి తెస్తు న్నాడు

ఇది '' ఉరుకపర్దారుణ'' అనే పద్యంతో ప్రారంభమై మూడు పద్యాలకి కొనసాగింది.

పార్వతిని సరోవరంతో పోల్చాడు సరోవరంలో తుమ్మెదలుంటాయి ఈవిడ జుట్టు అలా ఉంది చేతులు తామరతూడులు. నాభ (బొడ్డు) నీటి సుడి. పార్వతి పద్మినీజాతి స్త్రీ కాబట్టి పద్మసుగంధం ఉండనే ఉంది నడకలు హంసయానాలు. మంకెనపువ్వు లాంటి పెదవి ఎర్రకలువ నేత్రాలు ఉత్పలాలు ముఖం మరొక పద్మం. శృంగారరసమే నిండా ఉన్న నీరు ఇటు వంటి పార్వతీ సరోవరంలో ప్రవేశించి ఈదు లాడకపోతే మన్మధాగ్ని చల్లారుతుందా అనుకున్నాడు శివుడు (మంకెన పువ్వు లాంటి ఎర్రని పెదవి కలది- విలసద్బంధూకరక్తోష్ఠ- అనేది ఒక్కటీ సరోవరానికి సరాసరి అన్వ యించడం లేదు)

అళుల వంటి ధమిల్లము(జడ) కలది మృణాలముల వంటి హస్తములు కలది కమనీయమైన ఆవర్తము వంటి (సుడి) నాభ కలది పద్మ గంధం కలది హంసయానము వంటి యానము కలది బంధూకమువలె ఎర్రనైన ఓష్ఠము కలది. ఉత్పలముల వంటి నేత్రములు కలది కమలము వంటి ఆస్యము కలది అంగజ రసమ నునట్టి అంభఃపూరము కలది ఇలా అన్నీ బహువ్రీహి సమాసాలు అన్నింటా రూపకం ఉంది సావయవ రూపకం అంటారు పార్వతీదేవి సమస్తావయవాలలోనూ సరోవరం తాలూకు సర్వావయవాలనూ ఆరోపించి సమగ్రంగా సరోవరత్వాన్ని సాధించడం

అత్తనుమధ్య రూపు గడునందముగా గుసుమాయుధుండు నా
చిత్తమునందు రేఖగొని చిత్రము వ్రాసెనొ , పోలుపొంద న
చ్చొత్తెనొ, నేర్పునం గలయ నూనెనొ గాకిది తన్మనోభవో
న్మత్త వికారమా,మదను మాయయొ నిక్కువమొ తలంపగాన్ ౬-౧౦౬

తనకు ఏమి జరిగిందో అని శివుడు ఆశ్చర్యపోతున్నాడు ఆ కుసుమాయు ధుడు- మన్మధుడు- సన్నని నడుమున్న(తనుమధ్య) పార్వతి ఆకారాన్ని నా హృదయం లో రేఖాచిత్రంగా రాసాడేమో. లేదా బొమ్మగా అచ్చు ఒత్తాడేమో ! హృదయమంతా అదే అయ్యేట్టు తగిలించాడేమో . కాకపోతే ఇదేమిటి ఇది మన్మధవికారమా! మాయా! లేదంటే-చూడగా చూడగా ఇది నిజమా ! ఏమీ పాలు పోకుండా ఉంది.

అని యనేక ప్రకారంబులన్ ద్రిలోచనుండు రణరణక వ్యధాకులిత హృదయుండగుచు నుండె, నంత నగజ తపఃప్రభావం బీశాను బలాత్కా రంబున నాకర్షింప దొడంగిన ౬-౧౦౭

త్రినేత్రుడు ఇలా అనేక విధాలుగా ఆలోచిస్తూ మన్మధార్తితో కలత చెందు తూంటే- పార్వతీ తపఃప్రభావం అతడిని మరీ మరీ బలాత్కారంగా ఆకర్షిస్తోంది

చివరికి ఇద్దరి తపస్సులూ ఫలించి ఒకరికొకరు తపఃఫలంగా దంపతుల య్యారు. కళాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః ఫలాభ్యామ్- అంటూ శివా నందలహరిలో ఆదిశంకరులు ఈ ఆదిదంపతులను స్తుతించారు. పరస్పర తపః ఫలాయిత పరస్పరౌ అని కీర్తించారు.

తిక్కన (13వ శతాబ్ది)

ఆంధ్రమహాభారతము (కీచకవధ) (4-2-318 నుండి 340)

తిక్కన యజ్ఞంచేసి సోమయాజి అనిపించుకున్నాడు. విరాటపర్వం మొదలుకొని పదహేను పర్వాల భారతం ఆంధ్రీకరించాడు దీనికి ముందు నిర్వచనోత్తరరామాయణం రచించాడు ఉభయకవిమిత్రుడు అని బిరుదు నెల్లూరు మనమసిద్ధి ఆస్థానంలో మంత్రి హరిహరులకు భేదం లేదని ధర్మాద్వైత సిద్ధాంతాన్ని ఇతడు ప్రబోధించాడు. హరిహరునికి భారతం అంకితం చేసాడు

భారతాంధ్రీకరణకు నన్నయ పెట్టిన ఒరవడిలోనే ఇతడు ప్రయాణించాడు రసవద్ఘట్టాలను ప్రబంధ మండలిగా తీర్చిదిద్దాడు ఇతడి రచనలో నాటకీయత ఎక్కువగా ఉంటుందని విమర్శకులు భావించారు సంభాషణాత్మకంగా రసస్ఫోరకంగా రచన సాగించడం ఈ కవి ప్రత్యేకత

రాయబారాలను రాజనీతికుశలతతో నడిపించడంలోనూ యుద్ధ వర్ణనల్లోనూ మాటనేర్పరితనంలోనూ మంత్రిగా ఇతడి గడుసుదనం కనపడుతుంది

కీచకవధ ఘట్టాన్ని ఒక ఖండకావ్యంగా రమణీయంగా తీర్చిదిద్దాడు. తిక్కన శైలికి ఈ ఖండం ఒక మచ్చుతునక

విరాటుని కొలువులో కీచకుడు చేసిన అవమానానికి కుమిలి పోతున్న సైరంధ్రి అర్ధరాత్రి ఏకాంతంలో భీముడితో సంప్రదించింది అతడి సలహా ప్రకారం మర్నాటి సాయంకాలం నర్తనశాలకు రమ్మని కీచకుడికి సంకేతస్థలం తెలియజేసింది

ఎప్పుడు ప్రొద్దుగ్రుంకుతుందా ఎప్పుడు నర్తనశాలకు చేరుకుం దామా ఎప్పుడు సైరంధ్రితో ఆనందిద్దామా అని కీచకుడు ఉవ్విళ్లూరుతున్నాడు

విరహతాపం తట్టుకోలేక ఉద్యానవనంలో తిరుగుతూ ఒక చంద్ర కాంతన మీద చదికిలపడ్డాడు

సైరంధ్రితో ఎలా క్రీడించాలో ఏమేమి చెయ్యాలో ఆమెను ఎలా లోబరుచుకోవాలో రకరకాలుగా ఊహిస్తున్నాడు భావరతాలతో శిశిరోప చారాలతో కాలక్షేపం చేస్తున్నాడు. ఎంతకీ ప్రొద్దు గుంకడం లేదు కీచకుడికి చిరాకు వచ్చింది

మాయ రవి యేల గ్రుంకడొ
కో యనును, నిట్టేల తడసెనో యనును, గ్రుంకం
బోయెడు జా యిప్పడ యనును,
దాయపటిచె నను మనోజతాపము పేర్మిన్ 2-312

(తడయు= ఆలసించు దాయపటచు=పగపట్టు, మనోజతాపము= విరహం)

ఈ మాయదారి సూరీడు ఇంకా అస్తమించడేమిటి, ఇలా ఎందుకు ఆలస్యం చేస్తున్నాడు చెప్మా, ఇదిగో అస్తమిస్తున్నాడులే. నా మీద పగబట్టినట్టున్నాడు అనుకుంటూ అస్తమయం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

దివము కాని యింత భువనంబునందిట
వట్టి రాత్రి లేని యట్లు కాగ
జేసె నొక్కొ విధి! విశేషించి నాకకా
నేడ దివము సాగి నిలిచె నొక్కొ 2-3 3

ఈ ప్రపంచంలో పగలే తప్ప ఇంక రాత్రి అనేది లేకుండా చేసాడా బ్రహ్మదేవుడు లేదంటే విశేషించి నా కోసమే ఇవ్వేళ పగలు దీర్ఘంగా నిండి నిలిచిందా ఏమిటీ ఎంతకీ ప్రొద్దు గ్రుంకటం లేదు

ఇలా పరితపిస్తూ తానై క్రుంకింపరాని ప్రొద్దు వైపు చూస్తూ అనేక శీతలోపచారాలు పొందుతూ వనరి వనరి వందురి వందురి పొగిలి పొగిలి ఆ సింహబలుడు పూర్తిగా మన్మథుడికి వశమైపోయాడు ఎట్టకేలకు సూర్యుడు పశ్చిమ దిశకు చేరుకున్నాడు

ఇనుడు తనకడకు నేతెం
చిన రాగము బొందుటది యుచితముగా గెం
పున మెఱసి పశ్చిమాశాం
గన జనసంభావనముల గౌరవ మందెన్ 2-3 18

ఆకాశంలో పశ్చిమదిక్కు ఎరుపెక్కింది సాయంసంధ్య సూర్యుడు తనంత తానుగా వచ్చాడు నేను రాగం (ప్రేమ ఎరుపు) వహించడం సముచితం అనుకుందేమో పశ్చిమదిక్కు అనే కాంత-కెంపున మెరిసింది ఇది గమనించి జనులు ఆమెను గౌరవించారుట సంధ్యావందనాలు చేసారన్నమాట

చుక్కలు తోడుతోడ దలచూప దొడంగె మనోభవుండు వి
ల్లెక్కిడి చక్రవాకముల యిక్కలు రోయగ జొచ్చె, నేల కెం
పెక్కుచు వచ్చె దీవియలు నేర్తెఱ సోయగమందె. సందడుల్
తక్కె బురంబు వీథుల, మదం బొలసెన్ విటచిత్త వృత్తులన్ 2-3 2

క్రమక్రమంగా చుక్కలు పొడిచాయి మన్మదుడు తన విల్లు ఎక్కుపెట్టి చక్రవాకాల నివాసస్థానాలు (ఇక్కలు) ఎక్కడ లభిస్తాయా ని వెదకడం మొదలుపెట్టాడు (రోయజొచ్చె)

సూర్యాస్తమయం అయితే చక్రవాకాలకు కన్నులు కనిపించవట అవి తెలవార్లూ దుఃఖిస్తాయట అందుకని మన్మదుడు వాటిని ఏడిపించ డానికి సన్నద్ధుడవుతున్నాడు

నేల ఎరుపెక్కుతూ వచ్చింది దీపాల విజృంభణ కొత్త సోయగాలను సంతరించింది చీకటి ముసరడంతో కాంతి పెరిగింది రాత్రి అయ్యేసరికి సూర్యుడి తేజస్సు అగ్నికి సంక్రమిస్తుందట

పట్టణ వీధుల్లో సందడి తగ్గిపోయింది జారుల హృదయాల్లో మదం ప్రవేశించింది ఇంక వాళ్లూ వేటకు బయలుదేరతారు కానీ వెన్నెల అడ్డం

"పదంపడి జారచోర జనంబుల మనంబులలరం జంద్రాస్తమయం బగుటయు" 2-320

కొంతసేపటికి చంద్రుడుకూడా అస్తమించాడు ఆ ఉన్న కాస్త గుడ్డి వెన్నెలా మాయమయ్యింది చిక్కగా చీకట్లు వ్యాపించాయి జారుల మనస్సులూ చోరుల మనస్సులూ ఆనందించాయి

కీచకుడు మనఃస్థితికీ కీచకుడి అస్తమయానికీ అనుకూలమైన వాతావరణం ప్రకృతిలో కల్పిస్తున్నాడు కవి గుట్టుగా ఒక సింహబలుణ్ణి మట్టుపెట్టాలి దౌష్ట్యానికి దౌష్ట్యమే సమాధానం

పెను మిట్టిది పల్లం బిది
యనకుండగ, నోలమును బయలునొక్కటి గా
గను విచ్చుటయును మోడ్చుట
యును సరిగా, దమము పర్వె నుర్వీం దోడ్తోన్ 2-32

చంద్రుడు అస్తమించగానే చీకట్లు వెంటనే భూమి అంతా వ్యాపించాయి ఏది మెట్ట ఏది పల్లం తెలియడం లేదు ఏది లోపల (ఓలము= సభామందిరం) ఏది బయట తెలియడం లేదు రెండూ ఒక్కలాగానే ఉన్నాయి కన్నులు తెరవడమూ ముయ్యడమూ అంతా ఒక్కటిగానే ఉంది ఏమీ కనపడటం లేదు అంతా చీకటి

అప్పు డా కృశోదరి వృకోదరునకడకుం జని సమయంబయ్యె ననవుడు 2-322

అతడు పెండ్లికి బిలిచినయట్లు వికచ
హృదయుడై తలచీర యాయితము చేసి
ద్రుపదనందన జూచి - నాతోన వెనుక
నల్ల నంతంత నరుగుదెమ్మని కడంగి. 322

ఆ చీకట్లో ద్రౌపది (సైరంధ్రి) వృకోదరుడి దగ్గరకు వెళ్ళి సమయం అయ్యింది అని ఒక్క మాటమాత్రం అంది ఎవరో పెళ్ళికి రమ్మని పిలిచినట్టుగా భీముడి హృదయం వికసించింది ద్రౌపదికి జరిగిన అవమానానికి ప్రతీకారం చెల్లిస్తున్నాననో కీచకుడనే మహావీరుడితో తలపడబోతున్నాననో, దుష్టసంహారం చెయ్యడమనో ఏదో తెలియని ఆనందంతో భీముడి హృదయం వికసించింది తలపాగ చుట్టుకున్నాడు ఇది అప్పటి ఆచారం కావచ్చు పైగా అది దారిలో ఎవరూ తనని గుర్తించకుండా పని కొస్తుంది నర్తనశాలలో కప్పుకొని కూచోడానికి ముసుగుగా పనికొస్తుంది అలాగే (తలచీర) ఉత్తరీయం సిద్ధం చేసుకున్నాడు లేచినిలబడ్డాడు ద్రౌపదివైపు చూసాడు " నా వెనక్కాలే కొంచెం దూరం దూరంగా నువ్వు కూడా మెల్లగా రా ' అని బయలుదేరాడు

గమనము వీక వేడుక వికారము పుట్టక, సంగరోత్సవో
ద్యమ రభసాతిరేకము బయల్పడు టించుకలేక, రోష సం
భ్రమ మొకయింతయైన బరభావ నిరూప్యము గాక, ద్రౌపదీ
రమణుడు పోయె విక్రమధురంధరతం దగ నాట్యశాలకున్ 2-324

భీముని నడకలో ఒక ఠీవి ఉంది. వేరే వికారాలకూ అది అవకాశం ఇవ్వడం లేదు జంకూ గొంకూ లేవు ఎవ్వరైనా చూస్తారేమోనన్న భయంగానీ ఇంకోటి గానీ లేవు భయంతో మెల్లగా నడవడం లేదు తొందరపడి గబగబా అడుగులు వెయ్యడం లేదు రణమహోత్సవానికి వెడుతున్నప్పటి ఉత్సాహాతిశయం రవ్వంతయినా బయట పడటం లేదు హుందాగా నడుస్తున్నాడు

గుండెల్లో మండిపోతున్న రోష సంభ్రమం కొంచెంగానైనా ఎదుటివారికి అందడం లేదు ఎవరు చూసినా అతడి ముఖంలో కానీ కదలికలోగానీ ఏభావాన్నీ గమనించలేరు రోషాన్ని అసలే గుర్తించలేరు అంత గంభీరంగా సాగుతున్నాడు

ఆ ద్రౌపదీ రమణుడు విక్రమధురంధరుడుగా నాట్యశాలకు - నర్తన శాలకు- చేరుకున్నాడు

కీచకసంహారానికి పూనుకొని ద్రౌపదిని సంతోషపెడుతున్నాడు కనక భీముడిప్పడు ద్రౌపదీ రమణుడు అదీకాక నియమం ప్రకారం ఐదుగురిలో భీముడే ప్రస్తుతం ద్రౌపదీ రమణుడు. అందుకే అర్ధరాత్రి వేళ అతని దగ్గరకు వెళ్ళి ఏకాంతంగా సంభాషించింది ద్రౌపది

వచ. వివేకరహితు హృదయంబునుంబోలె దమోదూషితంబును, విదగ్ధ వనితా ప్రేమంబునుంబోలె దుర్నిరూపంబును, ఘోరాటవీభాగంబు నుంబోలె నిర్మానుష్యంబును, కాపురుష లక్ష్మీ విలాసంబునుంబోలెననుపయో గ్యంబును, నవ భ్రష్ట శాస్త్రంబునుంబోలె దుర్గమంబును, స్వప్న లబ్ధపదా ర్థంబునుంబోలె నదృష్టి గోచరంబును, విషమ కావ్యంబునుం బోలెన స్పష్టా లంకారంబును, బాలిశు రాజ్యంబు నుంబో లె జారచోర హృద్యంబునునైనయా నర్తనాగారంబు ముఖభాగ స్థలంబు చేరి- 2-325

ఆ చీకటి రాత్రి నర్తనశాల ఎలా ఉందో కవి వర్ణిస్తున్నాడు

వివేక హీనుడి హృదయంలా తమోదూషితమ్మై ఉందిట. వివేకం లేనివాడి హృదయం తమోగుణంతోదూషింపబడి ఉంటుంది ఇప్పడు నర్తనశాల దీపాలు లేక చీకటితో దూషితమ్మై ఉంది

నెరజాణ అయిన వనిత ప్రేమలాగా దుర్ని రూపంగా ఉంది టక్కెర కత్తెల అనురాగాన్ని ఎవడూ ఇదమిత్థంగా నిరూపించలేడు వారి ప్రేమ నిజమో అభినయమో గ్రహించడం కష్టం. అలాగే ఇప్పడు నర్తనశాలకు తూర్పు పడమరలూ పొడుగు వెడల్పులూ ఏవీ నిరూపించడం కష్టంగా ఉంది

భయంకరమ్మైన అడవి మధ్యభాగంలో లాగా నర్తనశాల- ఆ పరిసర ప్రాంతం నిర్మానుష్యంగా ఉంది లోభి దగ్గర ఉన్న ధనసంపదలాగా ఇప్పడు నర్తనశాల అనుపయోగ్యంగా పడి ఉంది ఆ ధనం ఎలా ఎవరికీ ఉపయోగపడదో ఇప్పడు ఇదీ ఎవరికీ ఉపయోగపడటం లేదు పగలే దీని ఉపయోగం రాత్రిళ్ళు అలికిడి లేకుండా ఖాళీగా పడి ఉంటుంది. అందుకనే దీన్ని అనుకూలమ్మైన సంకేత స్థలంగా నిర్ణయించి నట్టు ద్రౌపది కీచకుడికి చెప్పింది కూడా.

ఏ శాస్త్రాన్నయినా క్షుణ్ణంగా అభ్యసిస్తే అందులోని లోతుల్లోకి చొరవగా ప్రవేశించవచ్చు అభ్యసించని శాస్త్రం ఎవరికయినా తేలికగా చొర రానిదే, దుర్గమమే ఇప్పుడు నర్తనశాల అలా దుర్గమంగా ఉంది గుమ్మం ఎక్కడో మెట్లు ఎక్కడో ఏమీ కనపడటం లేదు స్వప్నంలో కనపడ్డ పదార్థం ఎలా దృష్టి గోచరం కాదో అలా నర్తన శాల చూపులకి అందడం లేదు. గోడ లూ వైశాల్యమూ ఏమీ కనపడటం లేదు అంతా అగమ్యగోచరంగా ఉంది

నర్తనశాలకున్న రంగులూ, బొమ్మలూ మొదలైన అలంకారాలు కూడా చీకట్లో కలిసిపోయాయి అస్పష్టంగా ఉన్నాయి విషమకావ్యంలాగా ఉంది అందు లోనూ అంతే అలంకారాలు స్పష్టపడవు

విటులకీ దొంగలకీ ఇది అనువైన ప్రదేశంగా కనపడుతోంది వాళ్లు కనక దీన్ని గమనించి ఉంటే తప్పకుండా ఆనందిస్తారు. జారచోరులు మాత్రమే ఆనందించే దుష్టుడి రాజ్యంలాగా ఉంది

ఇటువంటి నర్తనశాలకు సింహద్వారం దగ్గర నిలబడ్డాడు భీముడు.

కెలకులు పిఱింది దెసయును
గలయం బరికించి, తన యఖండిత బాహా
బలగర్వము యచ్చటి ముం
గలిగా మదమత్త భద్ర గజ సదృశగతిన్ 2-326

(కెలకులు=పార్శ్వములు పిఱింది దెస=వెనుకవైపు)

అక్కడ నిలబడి ఒక్కసారి అటూ ఇటూ పరికించాడు. వెనుకవైపు చూసాడు ఎవరైనా ఉన్నారా, ఎవరైనా అనుసరిస్తున్నారా,ఎవరికైనా అనుమానం కలిగిందా అని నిర్ధారణ చేసుకోవడం కోసం చూసాడు ద్రౌపది తప్ప మరింక ఏ అలికిడీ లేదు తిరుగులేని భుజబలమే ఆ గర్వమే అతడికంటే ముందు నడిచింది నర్తనశాలలోకి దారి చూపింది భావం ముందు ప్రవేశించింది దాని వెనకాలే మదించిన భద్ర గజంలా మదగజ గమనంతో భీముడు ప్రవేశించాడు

ధ్వాంతాకారితకుడ్య కుట్టిమ ఘనస్తంభావళీ రూపముం
బ్రాంతాది ప్రవిభాగ బోధ రహిత ప్రాగ్ద్వారముం గాతర
స్వాంత త్రాసకరంబునై దురభివేశంబైన యాలోను ని
శ్చింతుండై సతి కేలువట్టికొని చొచ్చెన్ భీముడత్యుగ్రతన్ 2-327

నర్తనశాల గోడలూ నేలా (కుట్టిమము) పెద్ద పెద్ద స్థంభాలూ చీకటిలో కలిసిపోయాయి ఇది ప్రాంతమూ ఇది మధ్యమూ అనే భేదం తూర్పువాకిలి దగ్గర కూడా తెలియడం లేదు. పిరికివాళ్లను (కాతరస్వాంతులు) భయపెడుతూ ప్రవేశించ రానిదిగా ఉన్న ఆ లోపలికి భీముడు నిశ్చింతగా అత్యుగ్రంగా- ద్రౌపది చెయ్యిపట్టుకుని మరీ ప్రవేశించాడు

ఇట్లు చొచ్చి దఱియంజని మధ్యప్రదేశంబున విరాటనందన లీలా పర్యంకం

బరసికని, దాని కనతిదూరంబున బాంచాలి నోసరిల నునిచి, తానా తల్పమున నుండె 2-328

ప్రవేశించి లోపలికి వెళ్లాడు. మధ్యభాగంలో పగటిపూట ఉత్తర నాట్యం నేర్చుకునే లీలాపర్యంకం. కృత్రిమ వేదికని వెదికి తడిమి పట్టుకున్నాడు దానికి కొంచెం దూరంలో ద్రౌపదిని దాక్కోమన్నాడు తానేమో ఆ తల్పం మీద కూర్చున్నాడు

ఇక్కడ పరిస్థితి ఇది ముందుగా వీళ్ళు ఇద్దరూ వచ్చి ఆనూపానూ చూసుకొని సిద్ధంగా కాసుకొని కూర్చున్నారు. ఇంక అక్కడ అంతం - గీచకుండు

క్రైసేసి, మదవికారో
ల్లాసంబున మేనువొంగ , లఘుగతి నుత్కం
ఠాసవ పాన విధాన
వ్యాసంగ తరంగితాంతరంగుం డగుచున్ 2-329

అందంగా అలంకరించుకున్నాడు మదవికారం అతిశయించి శరీరం ఉప్పొంగుతోంది. అంతరంగం త్వరపెడుతోంది. ఉత్కంఠ అనే మద్య పానంవల్ల లేదా ఉత్కంఠతో చేసిన మద్యపానంవల్ల అంతరంగం తరంగితం అవుతోంది ఉరకలు వేస్తోంది (క్రైసేయు= అలంకరించు ఆసవము= మద్యము)

ప్రాచీనులకి రకరకాల మద్యాలూ ఆసవాలూ తయారుచేసుకోవడం తెలుసు ఏది దేనికి ఉపయోగిస్తుందోకూడా తెలుసు (తలనొప్పి తగ్గ డానికి మదిర కావాలంది సుధేష్ణ దానికోసం సైరంధ్రిని కీచకుడి మందిరానికి పంపింది అసలు కథ అప్పడే ప్రారంభమయ్యింది కొన్ని ఉత్కంఠను పెంచేవి, తగ్గించేవి కొన్ని ఉత్సాహం కలిగించేవి మరికొన్ని పిరికి తనం పోగొట్టి ధైర్యం ఇచ్చేవి- ఇలా చాలా రకాల ఆసవాలు ఉన్నాయి వాటిలో ఇప్పడు కీచకుడు ఉత్కంఠాసవపానం చేసాడు ఆ వ్యాసంగంతో తరంగితాంతరంగుడయ్యాడు- అని కూడా చెప్పకోవచ్చు.

ఏమయితేనేమి కీచకుడు సన్నద్ధుడై ఉత్సాహంగా నర్తనశాలకు బయలుదేరాడు

సింగంబున్న గుహానికేతమునకున్ శీఘ్రంబునన్ వచ్చు మా
తంగంబున్ బురుడించుచున్ పవనపుత్ర స్వీకృతంబైన యా
రంగాగారము చేరవచ్చి, మదిలో రాగంబు ఘూర్ణిల్ల "నా
తిం గాముండిట దేడె యింతకొ నియుద్వృత్తాంగజోన్మాదుడై 2-330

సింహం ఉన్న గుహ దగ్గరికి కళ్ళు మూసుకుని శీఘ్రంగా వస్తున్న ఏనుగు లాగా (పురుడించుచున్=పోలుచు), అప్పటికే భీముడు ఆక్రమించి కూర్చున్న ఆ నర్తన శాలకు చేరుకున్నాడు కీచకుడు దాన్ని సమీపించే కొద్దీ ఆ కీచకుడి మనస్సులో మన్మధ వికారాలు పెచ్చుపెరుగుతున్నాయి అనురాగం ఘూర్ణిల్లుతోంది ఈ పాటికి మన్మథుడు సైరంధ్రిని (ఇంతిని) ఇక్కడికి తీసుకువచ్చి ఉండడా తెచ్చే ఉంటాడు అనుకున్నాడు మదపిచ్చి (అంగజోన్మాదం) మరీ విజృంభించింది

స్వాంతము బాహుగర్వఘనసంతమసాంధము గాగ, శంక యెు
క్కంతయు లేక కీచకు డహంకృతి ముంగిలి గాగ, మండపా

భ్యంతర భూమిఁజొచ్చి తళియం జని, యారసి సెజ్జఁగాంచి, య
త్యంతముదావహుండగుచు నందు రయంబున గేలు సాచినన్ 2-33

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి. ఆ గ్రుడ్డి చీకటిలో నర్తనశాలలోకి ప్రవేశించాలంటే కీచకుడికి ఒక్కసారి బాహు బలం జ్ఞాపకం వచ్చింది హృదయమంతా బాహుగర్వమనే గాఢాంధ కారంతో నిండిపోయింది ఆలోచనలు ఆగిపోయాయి హృదయం కూడా గుడ్డిది అయిపోయింది లోపల ఎవరున్నారో ఏమవుతుందో ఇలాంటి శంకలూ అనుమానాలూ రానేరావడం లేదు

అహంకారము ముందూ తాను వెనుకా, కీచకుడు నర్తనశాలలోకి అడుగు పెట్టాడు లోపలికి వెళ్లాడు (దళియంజని) తడుముకుంటూ వెదికి (ఆరసి) సెజ్జ పట్టుకున్నాడు అది విరాటనందన లీలాపర్యంకం దాని మీదనే ఒక ప్రక్కన భీముడు కూర్చుని ఉన్నాడు కీచకుడు చెయ్యి చాపాడు

భీముడు అంతా గమనిస్తున్నాడు. కోపమే కాదు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా ఉగ్గబట్టుకొని చూస్తున్నాడు

ఘనతరకోప వేగమున గంపమునొందు నిజాంగకంబులన్
దన ధృతి పెంపు సొంపచలితంబుల జేయ, సమీరు కూర్మినం
దనుడు తదీయచేష్టలును దద్వచనంబుల చొప్ప నేర్పడం
గనుమతి నూరకుండె నవికార నిగూఢ నిజప్రకారుడై 2-332

భీముడి శరీరం-కాళ్ళూచేతులూ కోపావేశంతో కంపిస్తున్నాయి కానీ అతడి ధీరత్వం (ధృతి పెంపు సొంపు) గొప్ప నిగ్రహం - వాటిని అదుపు చేస్తోంది వణకని వ్వడంలేదు (అచలితంబుల చేయన్).వాయుదేవుని ముద్దుల కుమారుడతడు. నిశ్చలంగా కూర్చున్నాడు కీచకుడి చేష్టల్ని మాటల పద్ధతినీ (వచనంబుల చొప్ప) పరిశీలిద్దామనిపించి ఏం చేస్తాడో, ఏమంటాడో చూద్దామనిపించి ఊరుకున్నాడు ఏ వికారమూ కనపడని నిగూఢమైన పద్ధతిలో తన స్వరూపమేమిటో అస్సలు తెలియ నివ్వకుండా గుంభనంగా కూర్చున్నాడు. పైగా చీకటి

కీచకాధముండు కిమ్మీర వైరిపై
గేలు చాచి, యా విశాలనయన
గా దలంచి, మేను గరుపార, నిట్లను
మదన ఘూర్ణమాన హృదయు డగుచు 2-333

కీచకుడు భీముడి మీదకు చెయ్యిచాచాడు అది సైరంధ్రే అను కుని వొళ్లు పులకించిపోయింది. హృదయంలో మన్మథవికారాలు కళపెళ లాడాయి

కీచకాధముడు అన్నాడు కవి ఇతడి అధమత్వానికి అనేక కారణా లున్నాయి పరకాంతావ్యామోహం మొదటిది అహంకారం రెండవది స్పర్శతో ఆడో మగో తెలుసు కోలేని అజ్ఞానం మూడవది. కామంతో కళ్లు మూసుకొని పోయాయి. ఉద్వృత్తాంగ జోన్మాదానికీ, స్వాంతము బాహుగర్వఘన సంతమసాంధము కాగ అనడానికీ ఇది

నిదర్శనము అన్నీ కలిసి కీచకాధ ముడు అనే మాట వెలువడింది

భీముడికి పర్యాయపదంగా 'కిమ్మీరవైరి' అన్నాడు కిమ్మీరుడు బకాసురుడి సోదరుడు. కిర్మీరుడు అన్నా ఇతడే ఇంతకు ముందే భీముడు ఒక్కడూ ఇతణ్ణి అనాయాసంగా సంహరించాడు (బక జరాసంధులూ) హిడింబ కిమ్మీర కీచక దుశ్శాసన దుర్యోధనులూ భీముడి చేతిలో నిహతులై న మహావీరుల్లో కొందరు. జరాసంధుణ్ణి ఓడించినవాడే కీచకుడిని సంహ రిస్తాడనీ వీరిద్దరినీ చంపినవాడి చేతిలోనే దుశ్శాసన దుర్యోధనులు నిహతులవుతారనీ ఒక కథ ఉంది) అటువంటి బలశాలి మీదకి చెయ్యి చాపుతున్నాడంటే ఆ కీచకుడు ఏమవుతాడో ఊహించుకోమని కవి సూచన

విశేషణాలు సాభిప్రాయంగా ఉంటే పరికరాలంకారం విశేష్యం సాభి ప్రాయంగా ఉంటే పరికరాంకురాలంకారం

ఇంతవరకూ సన్నివేశాన్ని రూపు కట్టించాడు ఇక నుంచి నాటకీయ సంభాషణ నడిపిస్తున్నాడు

వనిత! మనోహరంబులగు వస్తువులెల్లను వేడ్కనే ఱి నీ
కని నియమించి తెచ్చితి బ్రియంబున గై కొను. మెప్పు నంగనా
జనములు నన్ను జూచి మరునాయతముల్ తమ చిత్తవృత్తు లే
చిన గొని వచ్చి యిత్తురు విశిష్ట ధనంబులు నాకు లంచముల్ 2-334

వనితా అందమైన వస్తువులన్నీ ఏరికోరి నీకోసమని మీదు గట్టి తీసుకు వచ్చాను. ఇదిగో తీసుకో! ప్రియంగా తీసుకో నన్ను చూసిన స్త్రీలు మన్మధతాపానికి లోనై విశిష్టధనాలు తీసుకువచ్చి నాకు లంచంగా ఇస్తారు ఎప్పుడూ జరిగేది ఇది. ఇప్పుడుమాత్రం అది తిరగబడింది నీకు నేను ఇస్తున్నాను తీసుకో

నాదు రూపంబు మనంబున జిక్కిన
తరుణి తక్కొరు నేల సరకుసేయు
నాదు లావణ్యంబునకు నిచ్చ మెచ్చిన
యెలనాగ పైబడ కేల నిలుచు
నా విలాసంబులు భావింపబడసిన
యింతి పుష్పాస్త్రుచే నెట్లు బ్రదుకు
నా వివేకమున కానందింప గనిన యం
గన యెట్లు నిలువున గ్రాగకుండు
మెఱయు నా యాడు మాటలు తెఱవపిండు
నుల్లములకు నింపొరెడు నురులు కావె
యిట్లు నీ పొక్కతవె నన్ను నేల కుంటి
కాక మాటలింకేటికి కమలవదన! 2-335

కమలవదనా నారూపం మనస్సులో తగులుకొంటే, ఏస్త్రీ అయినా మరొక

చేతవోలు

మగాణ్ణి లెక్కచేస్తుందా ! (సరకుసేయుట)

నా లావణ్యాన్ని మెచ్చుకున్న ఎలనాగ (విలాసవతి) తనంతతాను గా వచ్చి మీదపడదా పడకుండా నిలవగలదా !

నా విలాసాలను భావించిన ఇంతి మన్మధ బాణాలను తట్టుకొని బ్రతక గలదా

నా వివేకానికి ఆనందించిన అంగన నిట్టనిలువునా విరహాగ్నిలో కాగి పోదూ

ఇంపుగా నేను మాట్లాడే మాటలు(నా ఆడుమాటలు) వనితా సమూహానికి (తెలవపిండు) వారి మనస్సులకు అందమైన ఉరులు కావూ (ఉరి- ఉరులు)

ఇంతకాలానికి ఇలా నువ్వొక్కత్తెవే నన్ను అంగీకరించకుండా ఏడిపించు కుని తింటున్నావు తప్ప అంగనలందరూ నాకోసం ప్రాకులాడే వారే ఎందుకులే ఊరికే వెయ్యిమాటలు

అనవుడు మనమున నిక్కీ
యని యుచితనిగూఢ భంగు లగు భాషణముల్
తన ప్రియ వినిపించుట కి
ట్లనియెన్ మృదురీతి భీము డాతనితోడన్ 2-336

కీచకుడు ఇలా తనని తాను పొగుడుకుంటూంటే భీముడికి అసహ్యం వేసింది. మనస్సులోనే ఛీఛీ అనుకున్నాడు. అయినా ఒక సరదా పుట్టింది ద్రౌపదికి వినపడేట్లూ అమె ఆనందించేట్లూ నిగూఢమైన సంభాషణ చెయ్యాలనుకున్నాడు గొంతుని మృదువుగా సైరంధ్రి గొంతులాగా మార్చిపలికాడు-

ఇట్టి వాడవు కావున నీవు నిన్ను
బొగడికొనదగు నకట నాపోల్కియాడు
దాని వెదకియు నెయ్యెడనైన నీకు
బడయ వచ్చునె యెఱుగక పలికితిట్లు 2-337

అవును నిజంగా అంతటివాడవు కనకే ఇలా నిన్ను నువ్వు పొగుడు కుంటు న్నావు అయ్యో ! నా లాంటి ఆడది ఎంత వెదికినా ఎక్కడైనా నీకు దొరుకుతుందా అది తెలుసుకోలేక ఇలా మాట్లాడుతున్నావు

అందరూ నా వెంట పడితే నేను నీ వెంట పడ్డానని అంటున్నావు. నిజమేమరి నాలాంటి ఆడది నాలాంటి సౌందర్యవతి నీకు ఇంక ఎక్కడా దొరకదు ఇది కీచకుడికి స్ఫురించే పైపై అర్థం. ''నాపోల్కి యాడుదానిని' అంటే మగవాడే ఆడదిగా కూర్చోవ డం. ఇదెక్కడా దొరకదు అది తెలుసుకోలేక మాట్లాడుతున్నావు. అని అసలు సిసలు అంతరార్థం. ఇది ద్రౌపదికి స్ఫురిస్తుంది

నా యెమిడలు చేర్చినప్పుడు
నీ యెమిడ లెట్లగునొ దాని నీ వెఱిగెదు, న

న్నే యబలలతోడి దిగా

చేయదలంచితివి, తప్ప సేసితి కంటే 2-338

నా శరీరాన్ని తాకినపుడు నీ శరీరం ఏమవుతుందో ఎలా అవుతుందో నువ్వు తెలుసుకుందువు గాని నన్ను లోకంలో ఏ అబలలతోడిది గా చెయ్యదలిచావు నన్ను అందరివంటిదే మామూలు అబల అనుకుని చూసావా - తప్పు చేసావ్

నన్ను తాకితే నీ శరీరం నజ్జునజ్జు అయిపోతుంది క్షణంలో తెలుసుకుందువు గాని అని హెచ్చరిక నన్ను మామూలు 'అబల' అనుకున్నావు కాదు భీముణ్ణి సుమా ఎంత తప్పు చేసావో, కనిపెట్టలేకపోయావు అని దెప్పిపొడుపు

ఇవన్నీ విని ద్రౌపది గొప్పగా సంతోషిస్తోందనుకోవాలి ఎక్కడా సంబోధన లేకుండా సంభాషణ నడిపిస్తున్నాడు. వాడి పేరు ఉచ్చరించ డమం టేనే అసహ్యం అదీ చమత్కారం కవి నిగ్రహం ఇంక చిట్ట చివరగా

నను ముట్టి నీవు పెండియు

వనితల సంగతికి బోవువాడవె, య్యై నం

దను వే బడసిన ఫలమే

కనియెద, విదె చిత్తభవవికారములెల్లన్ 2-339

నన్ను తాకి నువ్వు మళ్ళీ వేరే వనితలతో సంగమానికి వెళ్ళవు వెళ్ళలేవు. నా పొందు రుచిమానాక ఇంక ఎవరి పొందూ నీకు నచ్చదు అయి నా ఈ శరీరాన్ని నేను (ఏన్) ధరించినందుకు ఫలమేమిటో తెలుసు కొందువుగాని ఇదిగో మన్మధ వికారాలన్నీ ఇప్పటితో సరి

నన్నుతాకిన మరుక్షణంలో నువ్వు బతికిఉండవు. కాబట్టి పరకాంతా సంగతి కి పోలేవని నేను ఈ రూపం ధరించడానికి ఫలం నిన్ను సంహరించడమే అని

"అయినం దనువే పడసిన ఫలమే కనియెదవు" అని అరసున్న లేని పాఠం ప్రకారం నువ్వు ఈ శరీరం ఈ జన్మ ధరించినందుకు ఫలితం అనుభవిద్దువుగాని అని సమన్వయం

శ్లేషలు లేవు సంస్కృత పదాలు లేవు సమాసాలు లేవు అన్నీపాడి మాటలు కానీ వాక్యనిర్మాణంతోనూ కాకుస్వరంతోనూ- ఉచ్చరించే విధానం- వ్యంగ్యార్థం సులభంగా స్ఫురిస్తోంది

రంగస్థలంమీద మూడు పాత్రలుంటే అందులో మొదటిపాత్ర అంటున్న మాటలు రెండవపాత్రకి ఒకలాగా మూడవపాత్రకి మరోలాగా అర్థమవ్వడం, ఎవరికీ స్ఫురించింది వారికి సరిపోవడం గొప్ప నాటకీయత. దీన్ని వక్రోక్తి అంటారు డ్రమెటిక్ ఐరనీ అంటారు. సన్నివేశాన్ని బట్టి సంభాషణల్లో ఇది స్ఫురిస్తుంది ఫలితం అనుభవి ద్దువుగాని అంటూనే భీముడు చయ్యన లేచాడు

అనుచుం గ్రక్కున లేచి రోషకలనంబొ పాస మా సూతు నె

మ్మన ముద్వేగము బొందజేయు బలసామగ్రిన్ సముజ్జృంభణం

బున వానిందలపట్టి వంచుటయు నేపుం జేవయుం దోప వా
డనుమానింపక బె ట్టదల్చికొని కోపాటోప దీప్తాంగుడై 2-340

ఆ మాట అంటూనే భీముడు గ్రక్కున లేచాడు రోషంతో వికటాట్టహాసం చేశాడు కీచకుని మనస్సు(సూతునెమ్మనము) ఉద్వేగ పడింది ఊహించని పరిస్థితి. సైరంధ్రి అనుకుంటే ఎవడో మహావీరుడు

బలమంతా కూడ గట్టుకొని భీముడు కీచకుడి తలపట్టుకున్నాడు తన వైపుకువంచాడు. ఆ వంచడంలో ఏపూ చేవా కనిపించాయి.

కీచకుడికి అనుమానం తీలపోయింది కోపాతిశయంతో ప్రజ్వలించాడు భీముడి పట్టునుంచి తల తప్పించుకున్నాడు ఆ పాటి ఏపూ చేవా వీడికీ ఉన్నాయి

అయిదుగురు గంధర్వులు నన్ను కాపాడుతూ ఉంటారని సైరంధ్రి చెప్పింది (దుర్వారోద్యమ) ఆ అయిదుగురిలో వీడు ఒకడయ్యుంటాడు అనుకున్నాడు

గంధర్వుండను తలంపున 2-341
పవనతనూజు బాహువులు పాణియుగంబున బట్టి వీకమై
నవనిపయింబడం దిగిచి యంగము జానుల నూదినం గడున్
జవమున- దండతాడిత భుజంగము భంగి సముత్థితాంగుడై
యవయవముల్ ప్రకోపరభసాతిశయంబున బొంగనుద్ధన్ 2-342

కీచకుడు కూడా మల్లయుద్ధంలో ఘటికుడు ఇప్పడిద్దరూ నిరాయుధులే అందుకని మల్లయుద్ధమే సాగింది.

తల తప్పించుకున్న కీచకుడు భీముడి బాహువులు రెండూ రెండు చేతుల తోనూ పట్టుకొని బలవంతంగా నేలమీదకి పడవేసాడు మీదకి ఎక్కి శరీరాన్ని మోకాళ్ల తో (ఊది) పొడిచి కూచున్నాడు (అంగము జానుల ఊదినన్)

భీముడు రెట్టించిన వేగంతో దండతాకిత భుజంగంలాగా లేచాడు. దెబ్బ తప్పించుకున్న కోడెత్రాచులాగా లేచాడు కోప ప్రకోపంతో ఒళ్ళు ఉప్పొంగింది

మగుడం గీచకు బట్టి, వాడును బలోన్మాదంబునన్ బాహుగ
ర్వ గలిష్ఠుండగ. నా హిడింబరిపు దీవ్రక్రోధుడై పట్టి బె
ట్టుగ ద్రోపాడగ నిద్దఱున్ భుజబలాటోపంబుమై నొండొరున్
మిగులం జాలక కొంతసేపు వడి మేమే పోరి రుగ్రాకృతిన్ 2-343

అలా లేచిన భీముడు మళ్ళీ కీచకుణ్ణి పట్టుకున్నాడు. వాడికీ బలోన్మాదం ఉంది మల్లయుద్ధంలో(యుక్తికన్నా) శక్తి ప్రముఖ పాత్ర వహిస్తుంది భీముణ్ణి పట్టుకోబోయాడు హిడింబాసురుణ్ణి సంహరించిన బాహుగర్వంతో(గరిష్ఠుడై) విర్రవీగుతున్న భీముణ్ణి పట్టుకున్నాడు బలంగా నెట్టుతున్నాడు ఒకరినొకరు పడదొయ్యాలని ప్రయత్నం. కానీ భుజబలం లో ఇద్దరూ సమానులే. ఒకరినొకరు మించలేక పోతున్నారు అలా కొంత సేపు సరిసమానంగా ఉగ్రంగా ఒకరినొకరు నెట్టుకొంటూ పోరుసల్పారు

వింత ఏమిటంటే జబ్బలు చరుచుకోవడాలూ హుంకరించుకోవడాలూ అరవడాలూ ఇటువంటివి లేవు ఇద్దరూ చప్పడుచెయ్యకుండా గుట్టుగా యుద్ధం చేస్తున్నారు దీనికి ఎవరి కారణాలు వారికి ఉన్నాయంటున్నాడు కవి-

అట్టియెడ- ౭-౩౪౪
తన యగపాటొరు లెఱుగుదు
రని సూతుడు, సమయభంగ మగుటకు భీముం
డును గొంకుచు నప్పుడు సే ౭-౩౪౫
మల్లయుద్ధ నైపుణ్యంబు మెరయయుం గడంగి ౭-౩౪౬

ఒక సిగ్గుమాలిన పనికోసం కీచకుడు రహస్యంగా నర్తనశాలకు వచ్చాడు ఈ వేళప్పుడు తాను ఇక్కడ ప్రజలకు(ఒరులకు) కనపడటం (అగపడు- అగపాటు= కనిపించుట) అది తనకే తలవంపులు. అందుకని కీచకుడు చప్పడు చెయ్యడం లేదు

భీముడి గొంకు ఏమిటంటే (సమయభంగం) ఒప్పందం భంగమవుతుందే మోనని అజ్ఞాతవాసం ఏడాది ముగించకుండా బయట పడితే మళ్లీ అరణ్యవాసానికి పోవాలి ఆ భయంతో ఇతడు చప్పడు చెయ్యడం లేదు

ఇద్దరూ గూఢమైన విమర్దనలు- ఒకరినొకరు అణచుకోవడం గూఢమైన ప్రహారాలు-మోచేతితో మోకాలితో పొడుచుకోవడం- వీటితోనే యుద్ధం సాగిస్తున్నారు. మల్లయుద్ధ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు.

తిగిచిన నడుగులు తెరలక యెుండొరు
గ్రమ్మఱ దిగుచుచు, కడిమి మెఱసి
పొడిచిన వెస జెఱువోవక యెుండొరు
నందంద పొడుచుచు, నవని బెట్టి
యెుత్తిన బెగ్గలం బొందక యెుండొరు
బలువిడి నొత్తుచు, నలవు మిగిలి
యడగంగ బొదివిన నడచిపాటించుక
యునుకలేక వీక నొండొరుల నడరి
యడగ బొడువుచు, నలుక యంతంత కగ్గ
లించి యాయాయములఁ నొంచి దోర్బల నెఱపి
యుల్లసిల్లిన స్రుక్క కొండొరుల రౌద్ర
వృత్తి నొంచు చొండొరులకు వెక్కసముగ ౭-౩౪౭

భీముణ్ణి కీచకుడు గుంజుతున్నాడు కానీ భీముడు అడుగు కదపటం లేదు (తెరలక) గట్టిగా నిలబడి కీచకుణ్ణి గుంజుతున్నాడు.

పెద్ద ప్రయత్నంతో (కడిమి మెఱసి) భీముడు కీచకుణ్ణి పొడిస్తే వాడు చెక్కు చెదరకుండా (జెఱువోవక) అదే ప్రదేశంలో (అందంద) అదేవేగంతో భీముణ్ణి పొడుస్తున్నాడు. ఇలా ఒకరిని ఒకరు పొడుచుకుంటున్నారు

భీముణ్ణి కీచకుడు నేలకు పెట్టి ఒత్తితే (అవని బెట్టి యొత్తిన) అదిమితే అతడు జంకకుండా చలించకుండా (బెగ్గలం బొందక) కీచకుణ్ణి అంతేబలంగా అంతే వేగంగా (బలువిడి) నేలకేసి అదుముతున్నాడు ఇలా ఇద్దరూ అదుముకుంటున్నారు

ఒక మంచి ఉపాయం స్ఫురించి (అలవు మిగిలి) దానితో కీచకుణ్ణి అణిచి పట్టుకుంటే వాడు అణిగి పోవడమనేది లేకుండా భీముణ్ణి అదే ఉపాయంతో అదే అభ్యాసంతో అణిచి పట్టుకుంటున్నాడు (అడగ బొదవుచు) ఇద్దరూ ఇలా అణుచు కుంటున్నారు.

అంతకంతకీ ఇద్దరికీ అలుక పెచ్చుపెరిగింది భీముడు కీచకుడి మర్మ స్థానాల్లో- ఆయువు పట్టుల్లో(ఆయముల్) నొప్పి కలిగిస్తూ తన బాహుపరాక్రమం చూపించి విరాజిల్లితే , కీచకుడు ఏ మాత్రమూ బాధ పడకుండా నొప్పి అనకుండా (స్రుక్కక) అదే రౌద్రంతో భీముడి ఆయువు పట్లకు నొప్పి కలిగిస్తున్నాడు. ఇలా ఒకరి ఆయువు పట్లను ఒకరు నొంచు కుంటున్నారు

ఏ పట్టులోనూ, ఏ పెట్టులోనూ తీసిపోకుండా ఒకరికి ఒకరు పెక్కసమ య్యారు ఒకరిని మించినవారు ఒకరుగా పోరాడారు.

కదియుచు బాయుచు బట్టుచు
వదలుచుచుం బడుచు లేచు చడగుచు వడిగొం
చొదవెడు కినుకం గడు బె
ట్టిదముగ బెనగిరి చలంబు డింపక కడిమిన్ 2-348

భీమకీచకులు ఒకరికొకరు లొంగడం లేదు పెక్కసంగా ఉన్నారు పరస్పరం పట్టుకోవడానికి కలుస్తున్నారు. విడిపోతున్నారు వీలుచిక్కినప్పుడు ఒకర్ని ఒకరు పటు కుంటున్నారు అదుల్చుకుంటున్నారు పడుతున్నారు లేస్తున్నారు. అణిగిపోతున్నారు వేగం పుంజుకుంటున్నారు ఇద్దరికీ కోపం ప్రకోపిస్తోంది . చాలా భయంకరంగా ఘోరంగా (బెట్టిదముగ) ప్రయత్నపూర్వకంగా పెనుగులాడుతున్నారు. పట్టువదల ఎవ్వరూ వదలడం లేదు

ఇవ్విధమున నేచి యిరువురు బెద్దయు
బ్రొద్దు పోర, వాయుపుత్రు బలము
తోడుతోడ బెరుగ దొడగె, నా కీచకా
ధముని లావు పిదప దలుగ జొచ్చె 2-349

ఇలా విజృంభించి (ఏచి) ఇద్దరూ చాలాసేపు (పెద్దయుబ్రొద్దు) పోరాటం సాగించారు వాయుపుత్రుడి బలం క్రమక్రమంగా పెరగ సాగిం ది. భీముడికి తండ్రి ఇచ్చిన వరం, యుద్ధం జరుగుతున్న కొద్దీ బలం పెరుగు తుంది కీచకాధముడుకి అలాంటిది లేదు. వాడి బలం నెమ్మది నెమ్మదిగా తరిగిపోవడం మొదలుపెట్టింది.

దాని నెఱింగి యెంతయు నుదగ్రత నా బకవైరి గ్రక్కునన్
వాని నడంగ బట్టి పడవైచి మహోగ్రత నాక్రమించె బం

చానవ మేణమునుం బొదువున ట్లతడూర్జిత శక్తి నుద్భటుం
డై నెగసెన్ సమీరసుతు నల్కకు బ్రాకిడినట్లు, వీకతోన్ ౨-౩౫౦

కీచకుడి బలం క్షీణిస్తున్న విషయాన్ని భీముడు గమనించాడు ఒక్క ఉదుటున వాణ్ణి ఒడిసి పట్టుకున్నాడు నేలమీదకు పడవేసాడు సింహం (పంచానన ము) లేడిపిల్లను (ఏణమున్) పొదువు కున్నట్టుగా ఆక్రమించేసాడు మహోగ్రంగా మీదకి ఎక్కి కూర్చున్నాడు అయితే కీచకుడు ఉద్భటుడు శక్తి అంతా కూడదీసు కున్నాడు (ఊర్జితశక్తి). ఒక్కసారిగా పైకి లేచాడు భీముడి కోపానికి ప్రాకుడు కొయ్య పాతినట్టు లేచి నిలిచాడు

పాదులూ తీగలూ పైకి పాకడానికి వీలుగా మొదళ్ళ దగ్గర కర్రలు పాతు తారు వాటిని పాకులు అంటారు లేచి నిలబడ్డ కీచకుడు భీముడి కోపలత పైకి పాక డానికి పాతిన కర్రలాగా ఉన్నాడు

నెగయునెడ నగ్గమైనను
బిగియూరుచు బిఱుదు సనని పిడికిట గొఱ సం
దగడు బెడిదముగ బొడిచెం-
బగతుడు కనుమిడిసి నేల బడి తన్నికొనన్ ౨-౩౫౧

(అగ్గము=అనుకూలము, బిగియూరుచు=బిగియుచు, పిఱుదు సనని=తిరుగులేని, వెనుదిరగని కొఱసంది= ఆయువుపట్టు బెడిదముగన్=కఠినముగా భయంకర ముగా. పగతుడు=శత్రువు)

కీచకుడు అలా లేచినిలబడే సమయంలో భీముడికి అనువు చిక్కింది. అంతే తిరుగులేని పిడికిలి గట్టిగా బిగించాడు ఆయువుపట్టులో బలంకొద్దీ గట్టిగా కొట్టాడు. పిడిగుద్దు వేసాడు అయిపోయింది. కీచకుడు కళ్లు తేలవేసాడు (కనుమిడిసి) కుదేలయిపడి గిలగిలా తన్నుకుంటున్నాడు కీచకుడు ఎలా పడ్డాడో దృష్టాంతంతో చూపిస్తున్నాడు

పల్లవప్రసూన ఫలభరితంబగు
ద్రుమము గూల ద్రోచు మత్తగజము
పోల్కి వివిధ రత్న భూషణ భూషితుం
డైన సూతు గూల్చె ననిల సుతుడు ౨-౩౫౨

చిగురాకులూ పువ్వులూ పండ్లతో నిండి కళకళలాడుతున్న పెద్ద చెట్టుని ఒక మదగజం నిర్దాక్షిణ్యంగా నేలకి తోసినట్టు , రకరకాల రత్న భూషణాలు అలంక రించుకున్న కీచకుణ్ణి భీముడు నేలకూల్చాడు

మల్లయుద్ధాన్ని వర్ణించేటప్పుడు శాస్త్రం తెలిస్తే పట్లూ పద్ధతులూ వివరణ చెప్పవచ్చు, కానీ ఒక వీరుడు పడిలేచేటప్పుడు రెండవవాడికి అనువు ఎలా చిక్కుతుంది అనే విషయం పసికట్టాలంటే అనుభవం ఉండాలి చేసయినా ఉండాలి-చూసైనా ఉండాలి. తిక్కన అటువంటి అనుభవజ్ఞుడు కనక యుద్ధ వర్ణనల్ని మట్టుతెలిసి మెలకువ

బేతవోలు

తో వర్ణించి చూపించాడు

ఇక్కడ వ్యాసుడూ మల్లయుద్ధమే చేయించాడు. పన్నెండు శ్లోకాలలో వర్ణించాడు దండతాడితమైన భుజంగము వోలె (దండాహత ఇవో రగః 2 -5) మాంసవాంఛతో శార్దూలం మృగాన్ని ఒడిసి పట్టినట్టు (శార్దూ లః పిశితాకాంక్షీ గృహీత్వేవ మహామృగమ్ 2 -58) ఇలాంటి పోలికలు కూడా చెప్పాడు జుట్లు పట్టుకోవడాలూ నెట్టుకోవడాలూ తన్నుకోవడాలూ అన్నీ ఉన్నాయి వసంతంలో ఒక ఆడ ఏనుగు కోసం పోరాడు తున్న రెండు బలిసిన మగఏనుగుల్లాగా ఉన్నారనికూడా చెప్పాడు (తం హీయమానం విజ్ఞాయ భీమసేనో మహాబలః55) ఎన్ని చెప్పినా అవకాశాన్ని అనువుగా దొరకబుచ్చుకోవడమనే మెలకువని వర్ణించిన తిక్కనది పై చెయ్యే మరి.

ఇక్కడ మరొక విశేషం ఉంది భీమకీచకులు గుట్టు చప్పడు కాకుండా యుద్ధం చేసారని సహేతుకంగా ప్రతిపాదించాడు తిక్కన కానీ వ్యాసభారతంలో వారిద్దరూ గర్జిస్తూ యుద్ధం చేసారనీ నర్తనశాల కంపించిపోయిందనీ వర్ణన ఉంది

తతస్తద్భవనం శ్రేష్ఠం ప్రాకంపత ముహుర్ముహుః
బలవచ్చాపి సంక్రుద్ధౌ అన్యోన్యం ప్రతిగర్జతామ్ 2 -53

కీచకుడు నేలమీద పడి గిలగిలా తన్నుకుంటున్నాడు భీముడికి ఒక వింత కోరిక పుట్టింది పరకాంతావ్యామోహానికి భయంకరమైన శిక్ష వేయాలనుకున్నాడు భవిష్యత్తులో అందరికీ భయం పుట్టేలా చెయ్యాలను కున్నాడు

వికృతపు జావు సంప మది వేడుకపుట్టిన గిట్టి పట్టి మ
స్తకమును జీన దీర్ఘ భుజశాఖలు బాదయుగంబు మేనిలో
నికి జొర నుగ్గుగా దురిమి నిండిన క్రంతల తిత్తియైన కీ
చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగ జేసె దుష్టుడై 2-353

కీచకుణ్ణి భయంకరంగా వికృతపు చావు చంపాలనుకున్నాడు అలాంటి వేడుక పుట్టింది వాడి తల బాహువులు పాదాలూ నుగ్గు నుగ్గు చేసి మొండెంలోకి కుక్కేసాడు దాన్ని నేలమీద చదిపి చదిపి ఉప్పళించి ఒక ముద్దగా చేసాడు చిన్నాపెద్దా వస్తు సామగ్రితో నింపిన చిల్లుల (కంతల) గోనెసంచీ (తిత్తి) లాగా ఉంది కీచకుడి కళేబరం అప్పటికి కసీ క్రోధం చల్లారి సంతుష్టుడయ్యాడు (దుష్టుడు అని వినపడేట్టు కవి సంధిచేసాడు- అబ్బా రాక్షసుడురా బాబూ భీముడు అనే స్ఫూర్తి కలుగు తుంది) వ్యాసుడూ ఇది ఇలాగే వర్ణించాడు

తన కడిమి కలిమి నచ్చియు
మనమున దల కడర సూతు మరణంబు గనుం
గొనుటకు దల్లడ పడు ప్రియ
వనిత కతని చావు సెప్పి వడి దన్మాత్రన్ 2-354

కీచక సంహారం పూర్తి అయ్యింది. భీముడి క్రోధాగ్ని చల్లారింది ఇప్పుడు వీడి శవాన్ని ద్రౌపదికి చూపించాలి

తన పట్టుదల తన బలం, తన పరాక్రమం(కడిమి) వీటి ఉనికీ వీటి అతి శయమూ (కలిమి) ద్రౌపదికి నచ్చినా, విశ్వాసం ఉన్నా ఆవిడ మనస్సులో ఏదో శంక (తలకు) ఉంది కీచకుణ్ణి నేను గుట్టుగా సంహరించగలనా, సంహరించలేనా అని ద్రౌపదికి అనుమానంగానే ఉంది. అందుకని కీచకుడి చావు తనంతతాను కళ్ళారా చూడాలని తల్లడపడుతోంది అటువంటి ద్రౌపదికి-ప్రియవనితకు కీచకుని చావు తెలియచేసి వెంటనే వేగంగా వెళ్లి క్షణంలో (వడిన్ తన్మాత్రన్) దీపం పట్టుకుని వచ్చాడు

మృతకళేబరాన్ని చూడడానికి జంకుతున్న ద్రౌపదికి అతని చావు చెప్పి అని సమన్వయించడం సులభపద్ధతి. అంతకన్నా ఇది నిగూఢం ద్రౌపది మనస్సులో ఇటువంటి శంక ఉంది అనడానికి ఇంతకు ముందు వారిద్దరికీ జరిగిన సంభాషణలో ఆస్కారం ఉంది

కీచకుణ్ణి నువ్వు సంహరించాలి అని ద్రౌపది అడిగినప్పుడు భీముడు తెగ ఆవేశపడిపోయాడు. భూమి కంపించేటట్టు, ఆకాశం రాలిపడిపోయేట్టు దిక్కులు ఎగిరిపోయేట్టు, పర్వతాలు దొర్లిపోయేట్టు, సముద్రాలు ఉప్పొంగిపోయేట్లు, నా క్రోధం తీర్చుకొని చిత్రవధ చేసి కీచకుడికి నా రౌద్ర స్వరూపం చూపిస్తానన్నాడు.-

అవనీచక్రము సంచలింపగ, దివంబల్లాడ, నాశాచయం
బవధూతంబుగ, గోత్రశైల నికరం బాకంపముం బొంద, న
ర్ణవముల్ ఘూర్ణన మొంద, గ్రోధము గృతార్థత్వంబు నొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపుదున్ 2-284

ద్రౌపదికి భయంపట్టుకుంది. ఇలా అయితే గుట్టుకాస్తా రట్టయిపోతుంది. అజ్ఞాతవాసం భంగపడుతుంది.

కావున వంచన బాహిర
పోవకయుండంగ మన రిపుం బరిమార్పం
గా వచ్చునేని నట్టిద
నా వల పటుగాక తక్కినను వలదు సుమీ 2-287

కాబట్టి వంచన బైటికి పొక్కకుండా శత్రువును సంహరించగలిగే ట్టయితే ఒప్పుకుంటాను. అలా కాకపోతే నేను ఒప్పుకోను మనకు ఈ ప్రయత్నమే వద్దు అని ఖరాఖండీగా చెప్పేసింది

ఇది భీముడి మనస్సులో నాటుకుంది గుట్టుగా అసహాయశూరు డుగా చంపగలిగాను చూసావా అని నిరూపించుకుంటున్నాడు.ఆవిడ మన స్సులో ఉన్న శంకని తొలగించడంకోసం చావుకబురు చెప్పి గబగబా వెళ్లాడు

అనలము గూఢయత్నమున నయ్యెడకుం గొనివచ్చి దాన ఐ
య్యన వెలుగొంద జేయుటయు నచ్చెరువున్ భయమున్ బ్రియంబునున్
బెనగొనగా గనుంగొనియె భీతమృగేక్షణ భీము డాయగా
జని కడునక్కజంబయిన చందమునం బడియున్న పీనుగున్ 2-338

ఎక్కడనుంచో(వంటశాలనుంచేమో) గుట్టుగా అక్కడకు నిప్ప తీసుకు వచ్చాడు. దానిని చయ్యన మండేట్లు చేశాడు. ఆ వెలుగులో ద్రౌపది చూసింది. ఆశ్చర్యం, భయం, ప్రియం ఇన్ని భావాలూ ఒక్కసారిగా ముసురాయి. కళ్లల్లో భయం తొణికిసలాడింది. అప్పుడు ద్రౌపది కన్నులు భయ పడిన లేడి కన్నుల్లాగా ఉన్నాయి. (భీతమృగేక్షణ) భీముడికి దగ్గరగా వెళ్లిం ది. ఎట్టిదుట ఎవరినైనా ఆశ్చర్యపరచే పద్ధతి లో పడి ఉంది పీనుగు -పెద్ద మాంసం ముద్దగా.

చూచుచు జేరి వ్రేళ్ళుడుచుచుం దలయూచి విలక్షచిత్తయై
యా చపలాక్షి ముక్కుపయి నంగుళముం గదియించి దీనికై
కీచక! యింతసేసితి సుఖిత్వము బొందుదు గాక యింక, న
ట్లేచిన నిట్లుగా కుడుగునే యనుచున్ వెఱగందుచుండగన్ 2-356

అలా చూస్తూనే రెండడుగులు ముందుకు వేసింది. దగ్గరకు వెళ్లింది. తగిన శాస్తిలయ్యిందని కసిగా మెటికలు విరిచింది.(వ్రేల్మిడుచుట) తలపంకించి మనస్సు లో ఆశర్యపోయింది (విలక్షము= ఆశ్చర్యము, సిగ్గు) ఆశ్చర్యంతో కన్నులు కదిలాయి. ఆ చపలాక్షి ముక్కుమీద వేలు వేసుకుంది.

కీచకా! దీనికోసం ఇంత చేసావా ! ఈ చావు కోసం
అంత అల్లరి చేసి ఆరాటపడ్డావా !!
ఇంత సుఖపడుదువు గానిలే !
వెంటపడి నన్ను అలా హింసిస్తే మరి ఇలా
కాకుండా ఉంటుందా !

తనలో తాను మాట్లాడుకుంటూ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది ద్రౌపది. ఇంత గుట్టుగా భీముడు సంహరించాడా అనీ, అవయవాలు కనపడకుండా మాంసం ముద్ద ఏమిటీ అనీ-తామేనా దీనికి కారణం అనీ ద్రౌపదికి అన్నీ ఆశ్చర్యాలే. కానీ భీముడి ఆనందం వేరేగా ఉంది.

పూనిక నెఱపితి, సతి యవ
మానము బరితాపభరము మాన్చితి నిపు డీ
ట్లేనని మది బొంగెడు పవ
మానసుతుం డిట్లులనియె మానినితోడన్ 2-357

తల పెట్టిన పని (పూనిక) నెరవేర్చాను. ద్రౌపదికి అవమానదుఃఖ భారం తొలగించానుఇప్పుడు ఇలా అని వాయునందనుడు మనస్సులో ఉప్పొంగిపోతున్నాడు. ద్రౌపదిని సంతోషపెట్టడమే భీముడికి ఆనందం. ద్రౌపదికి జరిగిన ప్రతీ అవమానానికీ ప్రతీకారం చెల్లించినవాడు భీముడే. ఆ ఆనందంతో ద్రౌపదిని పలకరిస్తున్నాడు.

చింతాశల్యము వాసెనే భుజబలోత్సేకంబు నీ కెక్కెనే
శాంతింబొందెనె రోషపావకుడు, దుశ్చారిత్రునిం జూచితే
సంతోషించితె, యిట్లు గాక బ్రదుకన్ శక్యంబె దుర్వృత్తి నీ
చెంతంజేరినయట్టివారలకు నాచేతం బయోజాననా ! 2-358

పద్మముఖీ ద్రౌపదీ నీ గుండెల్లో దిగి విరిగిన ఇనుపముక్క (శల్యము) ఊడిపోయిందా !ఆ బాధతీరిపోయిందా నా భుజబలాతిశయం నీకు నచ్చిందా! మనస్సుకి ఎక్కిందా. నీలో రోషాగ్ని శాంతించిందా. దుశ్శీలుడు ఏమయ్యాడో చూసావా సంతోషిస్తున్నావా! దుర్బుద్ధితో దుష్ట ప్రవర్తనతో నీ దగ్గరకు చేరినవాళ్ళు నా చేతుల్లో పడి ఇలా అయిపోకుండా బతికి జీవించడం సంభవమా

ద్రౌపదినుంచి మెప్పుకోరుకుంటున్నాడు భీముడు వాయునంద నులు హనుమద్భీములిద్దరికీ పొగడ్తలు కావాలి) నన్ను శంకించావు కదా ఇప్పుడేమంటావు అన్నట్టుగా ఉన్నాయి అతడి మాటలు (భుజబలోత్సేకంబు నీ కెక్కెనే) అది గమనించింది ద్రౌపది

అనిన విని సింహబలము

ర్దను నవలోకించి ద్రుపదరాజతనయ యి

ట్లను దన మనమున నిండా

రిన సమ్మోదంబు వెలి విరిసి జెరయంగన్ 2-359

సింహబలుణ్ణి (కీచకుణ్ణి) సంహరించి ఇలా మాట్లాడుతున్న భీముణ్ణి ద్రౌపది చూసింది తన మనస్సులోని ఆనందం వెల్లివిరిసి స్పష్ట పడేట్టు పలికింది

కొలువులోపల నిన్న కోపమగ్లెత్తిన

దలకక నిలిచిన ధైర్యమహిమ

నే డిందు జనుదెంచి నిర్వికారత ప్రజ

కన్నులు గప్పిన గౌరవంబు

మనవారిలోన నొక్కరినైన బిల్వ కు

త్సాహంబు సేసిన సాహసంబు

లోకదుర్జయుడగు నీ కీచకునిని ప్రే

ల్మిడి రూపు మాపిన కడిమి సొంపు

నూడ దలపోయ మెచ్చ సంస్తుతి యొనర్ప

నా తలంటె, నీ యుత్తమ నాయకత్వ

మెఱిగి నిను గొనియాడ నే నెంతదాన

మహిత విస్మయానంద నిర్మగ్ననైతి 2-360

నాధా నిన్న కొలువులో అంతకోపం ఎత్తి వచ్చినా కంగారుపడకుండా అది బయటపడకుండా నిగ్రహించుకున్న నీ ధీరత్వం

ఇవ్వేళ ఇక్కడకు ఇలా వచ్చి ఏ వికారాలూ బయటపడకుండా ఎవ్వరికీ అనుమానం కలక్కుండా ప్రజలకనుగప్పిన నీ పెద్దరికం నీ హుందాతనం (గౌరవంబు)

మనవాళ్ళలోనైనా ఒక్కరినికూడా తోడు పిలువకుండా ఒంటరిగా కీచకుడి తో యుద్ధానికి దిగిన నీ ఉత్సాహం, నీ సాహసం

మహావీరుడూ ఒకపటాన జయింపనలవికానివాడూ(దుర్జయుడు)

అయిన ఈ కీచకుణ్ణి చిటికెలోమట్టుపెట్టిన నీ బలం నీ పరాక్రమం (కడిమి), (మొదటి వి రెండూ ధర్మరాజులక్షణాలు-చివరి రెండూ అర్జున లక్షణాలు)

వీటిని గుర్తించాలన్నా ఆలోచించాలన్నా మెచ్చుకోవాలన్నా పొగ డాలన్నా నా తరమా చెప్ప నాకు సాధ్యమయ్యే పనేనా! కాదు (నాలుగు క్రియల్నీ పై నాలుగు పదాలకీ క్రమంగా అన్వయించినా బాగానే ఉంటుంది కానీ అన్నీ ఒకచోట గుప్పిస్తే భీముని ఆనందం నాలుగు రెట్లు అవుతుంది)

నీలో ఉన్న ఉత్తమనాయకత్వాన్ని తెలుసుకుని నిన్ను కొనియాడాలంటే నిజంగా నేను సరిపోను పైగా గొప్ప ఆశ్చర్యంలోనూ ఆనందంలోనూ మునిగి పోయాను నేనింకేమీ మాట్లాడలేనని తాత్పర్యం

ఎంత సెరజాణగా మాట్లాడిందో! ధర్మరాజు కన్నా ధీరత్వమూ అర్జునుడి కన్నా వీరత్వమూ నీలోనే ఉన్నాయని స్ఫూర్తి అయిదుగురిలోకీ నీవే గొప్పవాడివని సూచన నువ్వే నచ్చినవాడవనీ నిన్ను నమ్ముకునే కదా నేను నిశ్చింతగా బతుకుతు న్నాననీ వ్యంగ్యం భీముడు ఉబ్బితబ్బిబ్బు అయిపోయాడు.

అను పలుకులు కర్ణరసా
యనములగుడు నయ్యుధిష్ఠిరానుజుడు ముదం
బునదేలి యింత దడయం
జనదని ద్రౌపదికి జెప్పి చయ్యన నేగన్ 2-36

ఆ మాటలు భీమునికి కర్ణరసాయనాలు అయ్యాయి ఆనందంలో తేలి పోయాడు సంతృప్తితో కర్తవ్యాన్ని ఉపదేశించాడు.

దేవీ మనం ఇంక ఇక్కడ ఆలస్యం చెయ్యకూడదు పద అని చెప్పి ముందు తాను చకచకా వెళ్ళిపోయాడు

వ్యాసుడు ఈ ఘట్టం మీద అట్టే దృష్టి పెట్టలేదు ఒక మహాకథలో ఇదొక చిన్న భాగం అది వ్యాసుడి దృష్టి తిక్కన దృష్టిలో ఇది కావ్యం ఇది ఒక లఘు ప్రబంధం. ఈ తేడా బాగా కనపడుతుంది

ఇక్కడ సూర్యాస్తమయాన్ని వ్యాసుడు వర్ణించలేదు. దానికోసం కీచకుడు ఎదురుచూడటం పరితపించడం వంటి అందాలన్నీ పూర్తిగా తిక్కన కల్పనలే అస్తమయానికి ఎదురుచూసిన కీచకుడు అస్తమించాడు

మిట్టమధ్యాహ్న వేళ వెళ్లి ఈ రాత్రికి నర్తనశాలకు రమ్మని కీచకుడితో చెబుతుంది వ్యాసుడి సైరంధ్రి రోజులో మిగిలిన ఆ సగభాగమూ కీచకుడికి నెల అయ్యిందట(దివసార్థం సమభవన్మాసేనైన సమం నృప 2 - 8)ఆభరణాలు అలంకరించుకుంటూ సైరంధ్రిని తలుచు కుంటుంటే ఎంతకీ కాలం గడవలేదుట చాలా దీర్ఘ మయ్యిందట (తస్య తత్కుర్వత: కర్మ కాలో దీర్ఘ ఇవా భవత్ అనుచింతయ తశ్చాపి తామేవాయత లోచనామ్ 2 -2) సైరంధ్రి మాటల్ని నమ్మి జరగబోయే సమాగమాన్ని గురించి మధురోహల్లో తేలిపోతూంటే కీచకుడికి తెలియకుండానే

పగలు గడిచిపోయిందిట (కృతసంప్రత్యస్తత్ర యకీచక: కామమోహిత: నాజా నాద్దివసం యాంతం చింతయాన: సమాగమమ్- 23) వ్యాసుడు ఇచ్చిన సూచనల ను తిక్కన కవితాత్మకంగా వ్యాఖ్యానించాడు కీచకుడి మనస్తత్వాన్ని ఆవిష్కరించాడు

ఆసీదభ్యధికా చాస్య శ్రీ: శ్రియం ప్రముముక్షత:

నిర్వాణకాలే దీపస్య వర్తీమివ దిధక్షత: 22

అలంకరించుకున్న కీచకునిలో ఒక కొత్త అందమూ విలాసమూ తొంగి చూసాయి ఆరబోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లు ఈ వర్ణన ను తిక్కన ఉప యోగించుకోలేదు వదిలేసాడు

నర్తనశాలలోకి ముందు భీముడు ప్రవేశించాడు తరువాత ఆ చీకటి గృహంలోనికి కీచకుడు అడుగుపెట్టాడు (ప్రవిశ్య చ స తద్వేశ్మ తమ సా సంవృతం మహత్-40) ఈ మాటని తిక్కన అందంగా వివరించాడు

చీకటిలో సైరంధ్రిని అరుగుచాటున కూర్చోబెట్టడం అనే సన్నివేశ నాటకీయ త వ్యాసుడి దగ్గరలేదు కీచకుణ్ణి చంపాక భీముడు ద్రౌపదిని పిలిచి చూపిస్తాడు. అప్పుడు తెలుస్తుంది ద్రౌపది కూడా అక్కడే ఉందని

అరుగుమీద పడుకుని ఉన్న ఒక ఆకారం చూసి సైరంధ్రే అనుకొని కీచకుడు సంబరపడిపోయాడు. బహుమతులు తెచ్చానంటాడు (44) గృహిణులంతా నాకోసం వెంపరలాడిపోతున్నారు, నాలాంటి పురుషుడు లేడంటున్నారు (45) అని రెండే శ్లోకాల్లో సంభాషిస్తాడు క్లుప్తంగా ఆత్మస్తుతి చేసుకుంటాడు దీన్ని సాగదీసి కీచకుడి వెకిలితనాన్నీ, లేకితనాన్నీ బట్టబయలు చేసాడు తిక్కన్న

అప్పడు వ్యాసభీముడు చమత్కారంగానే మాట్లాడాడు గొంతు మార్చాడో లేదో చెప్పలేదు. మార్చే ఉంటాడని మనం ఊహించుకోవాలి ఆ మాటలు చూడండి.

దిష్ట్యా త్వం దర్శనీయోసి దిష్ట్యాత్మానం ప్రశంససి

ఈదృశస్తు త్వయా స్పర్శ: స్పృష్టపూర్వో న కర్హి చిత్ 21-46

అదృష్టవశాత్తూ నువ్వు అందగాడి వయ్యావు అదృష్టవశాత్తూ నిన్ను నువ్వే పొగుడుకుంటున్నావు ఇలాంటి స్పర్శ నువ్వు ఎప్పడూ పొంది ఉండవు ఈ మాటలు అంటూనే భీముడు లేచి కలియబడ్డాడు జుట్టు పట్టుకున్నాడు

ఈ మాటల్లో నిగూఢార్థం ఉంది. దర్శనీయుడవయ్యావంటే అదృష్టవశాత్తూ నీ అంతట నువ్వే కనపడ్డావు దొరికావని దిష్ట్యాత్మానం ప్రశంససి- అంటే నిన్ను పొగడవలసిన దు:స్థితి నాకు తప్పిందని నేను పలక వలసి వస్తే నిన్ను తిట్టడమే తప్ప పొగడటం ఉండదని స్ఫురణలు ఇలాంటి స్పర్శ నువ్వు ఎప్పడూ అనుభవించి ఉండవు అనడంలో ఉన్న వ్యంగ్యం స్పష్టం

ఈ వేలు అందిపుచ్చుకున్న తిక్కన మొత్తం చెయ్యి మింగేసాడు. తిక్కన శైలి అంటే ఆంధ్రీకరణ విధానాని నాటకీయతకూ వర్ణనా నిపుణత కూ ఈ ఘట్టం ఒక మచ్చుతునక

ఎఱ్ఱన (క్రీ.శ. 14వ శతాబ్ది ప్రథమపాదం)

ఆంధ్రమహాభారతము

సత్యాద్రౌపదీ సంవాదము (అరణ్య 5-290 నుండి 324)

పూర్తి పేరు ఎఱ్ఱాప్రగడ ఇంటిపేరు 'చదలవాడ' అని విమర్శకులు భావిస్తున్నారు క్రీ.శ 4 వ శతాబ్ది తొలి నాళ్ళవాడు అద్దంకి రాజధానిగా పాకనాటిని పరిపాలించిన ప్రోలయవేమారెడ్డి ఆస్థానంలో ఇతడు ఉండే వాడు ప్రబంధ పరమేశ్వరుడు శంభుదాసుడు అనేవి ఈయన బిరుదులు ఆంధ్ర మహాభారతంలో అరణ్యపర్వశేషాన్ని పూరించాడు. శారద రాత్రులు (4- 42) పద్యం తరువాత స్ఫురదరుణాంశు (4- 43) అనే పద్యంతోనన్నయశైలిలో మొదలు పెట్టి పర్వం ముగిసేసరికి క్రమ క్రమంగా తిక్కనశైలికి అందించాడు హరివంశము, నృసింహపురాణము ఇతడి ఇతర రచనలు రామాయణంకూడా రచించాడని తెలుస్తోంది లక్షణ గ్రంథాల్లో ఉదాహరణలుగా కొన్ని పద్యాలు కనపడుతున్నాయి తప్ప ఆ గ్రంథంమాత్రం దొరకలేదు.

ప్రబంధయుగంలో ప్రధానలక్షణమైన అలంకారిక శైలికి ఒరవడి దిద్దిన కవులలో ఎఱ్ఱనకూడా ఒకడు. పురాణ-ప్రబంధ శైలులు రెండూ ఇతడి రచనలో సరిసమానంగా కనపడతాయి. నాచన సోమన శ్రీనాథు లతో మరికొంత పరిణతి చెంది పెద్దననాటికి ప్రబంధ శైలి ప్రస్ఫుటంగా రూపొందింది

పాండవులు పాంచాలీ సహితులై అరణ్యవాసం చేస్తున్నారు శరదృతువులో సరస్వతీ నదీతీరాన ఉన్నారు అక్కడనుంచి బయలుదేరి కామ్యక వనం చేరుకున్నారు. ధౌమ్యాది పురోహితులూ, ఇంద్రసేనాది మూల భృత్యులూ వీరితోపాటే ఉంటున్నారు

చూచి వెడదామనిపించి ఒక రోజున శ్రీకృష్ణుడు సత్యభామా సహితుడై పాండవుల దగ్గరికి వచ్చాడు సరిగ్గా అదే సమయానికి మార్కండేయ మహర్షి వచ్చాడు ఆయన ఏవేవో కథలు - అత్రిగౌతముల సంవాదం, వైవస్వతుడి కథ కలియుగధర్మం, ఇంద్రద్యుమ్న కువలాశ్వ మధుకైటభచరిత్రలు, ధర్మవ్యాధుడి కథ, ఇంద్రుడి కథ - ఇవన్నీ వినిపిస్తున్నాడు. మగ వాళ్ళంతా శ్రద్ధగా వింటున్నారు

"....వారివ్విధంబున నభీష్టకథాగోష్ఠిం బ్రవర్తిల్లునెడ గృష్ణవల్లభయైన సత్యభామయు బాంచాలియు నేకతంబ యొక్కయెడ బ్రియసల్లాప సంసక్తలై యుండి రప్పుడు సత్యభామ ద్రౌపది కిట్లనియె (౬-౨౯౦)

శ్రీకృష్ణుడి ప్రియభార్య సత్యభామకీ పాంచాలికీ ఏకాంతం దొరికింది ఒకచోట చేరారు ఒకరితో ఒకరు ప్రియంగా వేళాకోళంగా వరసైనవారు కనుక మాట్లాడుకుంటున్నారు ఈ ఉత్సాహభరితమైన సమయంలో సత్యభామాదేవి ద్రౌపదిని ఒక రహస్యం అడిగింది.

నీ ప్రియభర్తల నిర్మల చరితుల
ప్రకట తేజుల లోకపాల నిభుల
బార్థుల నీవొక భంగిన వదలక
చెలువ! యెబ్భంగి భజింతు, తగిలి
యొక్క రొక్కనికంటె నువిద! నీ కేవురు
ననురక్తులగుట యత్యద్భుతంబు,
నగు మొగంబుల కాని నళినాక్షి! నీ దెస
బతులకు గింకి లిపాటు లేదు,
వ్రతము పెంపొ, మంత్రౌషధ వైభవంబొ
సరసనై పథ్యకర్మ కౌశలమొ, చతుర
విభ్రమోల్లాసరేఖయొ, వెలది! నీ వి
శేషసౌభాగ్య హేతువు సెపుమ నాకు! ౮-౨౭।

ద్రౌపదీ! నీకు అయిదుగురు ప్రియ భర్తలున్నారు అయిదుగురూ మంచి నడవడిక కలవారే మహాపరాక్రమవంతులే. దిక్పాలకులతో సాటి వచ్చేవారే అయిదుగురూ రాజులే వీరిని ఒకే తీరున ఎల్లవేళలా ఎలా సేవిస్తు న్నావు అయిదుగురినీ ఒకేలా(ఒక భంగిన)సేవిస్తున్నావ్ ఎల్లవేళలా (వద లక) సేవిస్తున్నావ్! ఇది ఎలా సాధ్యమవుతోంది నీకు!

నువ్వంటే పోనీ ఎలాగోలా సేవిస్తున్నావనుకుందాం నీభర్తలు కూడా నీపట్ల అలాగే ఉంటున్నారు ఒకరిని మించి ఒకరు-అయిదుగురూ నీ పట్ల ఎప్పడూ (తగిలి) అనురక్తులై ఉంటున్నారు ఇది మరీ అత్యద్భుతం

పరాక్రమవంతులైన క్షత్రియుల్ని అయిదుగుర్ని ఒక స్త్రీ మెప్పించ గలగడమే ఆశ్చర్యమనుకుంటే ఆ అయిదుగురూకూడా అన్యకాంతా సక్తులు కాకుండా ఉండటం సత్యభామకు మరీ అత్యద్భుతంగా విడ్డూ రంగా కనిపించింది. ఎంతకాలంగా అడగాలనుకుంటోందో- ఇప్పటికి అవకాశం చిక్కి అడిగేసింది

ఒకప్పడు కాకపోతే ఒకప్పడైనా- కోప్పడకపోతే మానే కనీసం ఒక్కరయినా ముచ్చటకి చిరాకు పడతారేమో అంటే అదీ లేదు

ఓ పద్మాక్షీ ఎప్పడూ నవ్వుమొహాలే తప్ప- నవ్వుతూ ప్రసన్నంగా మాట్లాడటమేతప్ప నీభర్తలు నీమీద చిరాకు పడింది (కింకిలిపాటు) లేదు

దీనికి కారణం ఏమిటి? ఏదయినా వ్రత మాహాత్మ్యమా? మంత్రాలూ వశీకరణౌషధాలూ వాటి మహిమా ? నిన్ను నువ్వు సరసంగా ముస్తాబు చేసుకోవడంలో (నైపథ్యకర్మ) ఉన్న నైపుణ్యమా? లేకపోతే నేర్పుగా ఏవయినా విలాసాలూ విభ్రమాలూ ప్రదర్శించి ఆకట్టుకుంటు న్నావా? నీ విశేష సౌభాగ్య హేతువు ఏమిటి? నీ సౌభాగ్య రహస్యం ఏమిటి? దయచేసి నాకు చెప్పవా. అని అడిగింది.

భర్త అనురాగాన్ని నిష్కల్మషంగా అనన్యంగా నిరంతరం పొందడమే

భార్యకు సౌభాగ్యం సత్యభామకు అది కరువయ్యింది శ్రీకృష్ణుడికి సత్యభామపై అనురాగం ఉందా అంటే ఉంది లేదాఅంటే లేదు. ఆయన ముమ్మూర్తులా దక్షిణ నాయకుడు అంతుచిక్కడు అలా అని చిక్క కుండానూ ఉండడు తన మటుకు తాను అనురక్తురాలే ఆ అనురాగం వేుర మీరి అసూయగా పరిణమించి తన్నులాడుకోవడం దాకా వెళ్ళింది తమ దాంపత్యం ఇలా ఉంది. అందుకని ఆ రహస్యమేదో ద్రౌపదినుంచి గ్రహిద్దామనుకుని ఆశపడింది అడిగింది దాపరికం లేకుండా చెప్పింటికూడా-

ఏనును నీవలన నిజము
గా నిది యంతయు నెఱింగి, కమలదళాక్షుం
బూని వశగతుని జేసి, యు
నూన స్నేహానుభావయుక్తి దలిర్తున్ 5-292

ద్రౌపదీ నేనుకూడా నీనుంచి నిజంగా ఇదంతా తెలుసుకుని శ్రీకృష్ణుడి పట్ల ప్రయోగించి వశంవదుణ్ణి చేసుకుంటాను మిక్కుటమ్మైన స్నేహానుభావంతో ఆనందిస్తాను దయచేసి ఆ రహస్యమేమిటో చెప్పవా.!

అని యడిగిన మది నించుక
కినుక వొడమ నడచుకొనుచు గృష్ణ మృదులహా
సిని యగుచు గృష్ణభామిని
గనుగొని యిట్లనియె నిర్వికారాకృతియై 5-293

సత్యభామ ఇలా అడిగేసరికి ద్రౌపది (కృష్ణ) మనస్సులో కొంచెం కోపం వచ్చింది (ఇంచుక కినుక పొడమన్) మంత్రాలూ, తంత్రాలూ అంటుందేమిటి ఈ పిచ్చిది అని కాబోలు అయితే ఆ కోపాన్ని అణచుకొంది చిరునవ్వులు చిందిస్తూ (మృదులహాసిని) కృష్ణభామినిని చూసింది కోపం గానీ హేళన గానీ కించపరచడం గానీ గర్వించడం గానీ ఇలాంటి ఏ భావమూ కనిపించకుండా-నిర్వికార+ ఆకృతియై, గంభీరంగా సమాధానం చెప్పింది

ఈ పద్యాన్ని విడివిడి వాక్యాలుగా రాస్తే ఇలా ఉంటుంది.

అని అడిగిన-
మది నించుక కినుకవొడమ నడచుకొనుచు
కృష్ణ-మృదుల హాసిని యగుచు
కృష్ణభామిని గనుకొని
ఇట్లనియె
నిర్వికారాకృతియై.

నను నిట్లు దుష్టవనితా
జనమున టులుగా దలంపజనునే నీకున్
మనసొప్పదు-పురుషోత్తము
వనితవుగా దగవు నీవు వనరుహనయనా! 5-294

ఓపద్మనయనా సత్యభామా! ఇలా నన్ను ఒక దుష్టవనితలాగా నువ్వు భావించడం,జమకట్టడం - ఇది నీకు తగునా. నిన్ను ఏమనడానికీ మనసు ఒప్పడం లేదు అందుకని ఊరుకుంటున్నాను పురుషోత్తముడికి భార్యగా ఉండే అర్హత నీకు లేదు వదినా మా అన్నయ్యకు నువ్వుతగవు సుమా

అని మేలంపుజందంబున దాని వివేక విహీనత
యెఱుకపడనాడి పాంచాలి మఱియు నిట్లనియె ౮-౨౨౮

వేళాకోళంతో(మేలము) కలిపి ద్రౌపది ఘాటుగానే తిట్టింది నన్ను మొగుడికి మందులూ మాకులూ పెట్టే దుష్టవనితగా జమకడతావా అంది నువ్వు శ్రీకృష్ణుడంతటివాడికి భార్యగా ఉండదగినదానవు కాదు పొమ్మంది సత్యభామ తెలివి తక్కువతనం ఏమిటో తెలిసి వచ్చేట్టు పలి కింది

బుద్ధిమంతురాలివయ్యుండి (బుద్ధి ఉండి) కృష్ణుడి ప్రియభార్య వై ఇలాంటి సంశయం ఇలాంటి ప్రశ్న నీకు తగదు సుమా అని మాత్రమే అంది వ్యాస ద్రౌపది

అనుప్రశ్నః సంశయో వా నైతత్త్వయ్యుపపద్యతే
తథాహ్యుపేతా బుద్ధ్యా న త్వం కృష్ణస్య మహిషీ ప్రియా ౩-౨౨౨-౧౦

మగవాడికి మంత్రాలు వెయ్యడం మందులు పెట్టడం కులస్త్రీలు చెయ్యరు. వేశ్యలు చేస్తారు అల్లాగే మితిమీరిన ముస్తాబులూ విభ్రమోల్లాసాలూ ఇవన్నీ వేశ్యలకే చెల్లు. సత్యభామ చాలా తెలివి తక్కువగా- అజ్ఞానమో అహంకారమో - ప్రశ్నించింది. ద్రౌపదికి పట్టరానంత కోపం వచ్చింది అయినా ధీరురాలు కనక, అవతల ఉన్నది కృష్ణుడు కనక నిగ్రహించుకుంది ''మనసొప్పదు ' అనడంలో ఆ నిగ్రహం కనపడు తుంది ద్రౌపదికి ఈ తరహా మొదటినుంచీ ఉంది కోపం గానీ అసహ్యం గానీ ముఖం మీద కనిపించనివ్వదు

నీ భర్తకు నువ్వు తగవు అనడంలో వేళాకోళంతో మిళాయించి అంతటి కోపాన్నీ అసహ్యాన్నీ ప్రకటించింది అక్కడితో ఆగింది

ఇంతటి వివేకహీనురాలికి తప్పనిసరిగా విషయం ఎరుక పరచాలి అనుకుని కొనసాగించింది లేకపోతే సత్యభామ అదే అభిప్రాయంతో ఉండి పోయే ప్రమాదం ఉంది

అలియక మంత్రతంత్ర వివిధౌషధ భంగుల జేసి యెంతయున్
వలతురు నాథులంట మగువా! కడు బేలతనంబు, దాన ము
న్గలిగిన ప్రేమయుం బొలియుగాని యొకండును సిద్ధిబొంద,ద
ప్పొలతుకతోడి మన్కి యహి పొత్తుగఁజూచు విభుండెఱింగినన్ ౮-౨౨౯

ఓ మగువా! మంత్రాలూ-తంత్రాలూ, మందులూ-మాకులూ ఉపయోగిస్తే భర్తలు వలచి పడి ఉంటారు. ఇది అలుపూ సొలుపూ లేకుండా తేలికగా అయిపోయే పని అనుకోవడం మూర్ఖత్వం,అమాయకత్వం (బేల తనంబు). వీటిని

ప్రయోగిస్తే నిజానికి అంతకు మునుపున్న ప్రేమకూడా చస్తుంది తప్ప అంతకన్నా ఏ ప్రయోజనమూ సిద్ధించదు పైగా ఇది భర్తకు తెలిస్తే అటువంటి స్త్రీతో కాపురం చెయ్యడానికి భయపడతాడు పాముతో స్నేహంలా చెలగాటంలా(అహిపాత్తు) భావిస్తాడు అంతేకాదు ఇటువంటి ప్రయోగాలు చేస్తే - ఉన్న నాలిక్కి మందిస్తే కొండనాలిక ఊడిపోయిం దని-మరొక ప్రమాదం ఉంది.

మగువ యొనర్చు వశ్యవిధి మందులు మాకులు నొండు చందమై
మగనికి దెచ్చు రోగములు, మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు, నద్దురితముల్ దన చేసిన చేతలై తుదిన్
జగమున తెక్కి నిందయును సద్గతి హానియు వచ్చు నింతికిన్ ౮-౨౨౭

ఎవరో ఏదో చెప్పారనీ, ఏదో ఇచ్చారనీ అవన్నీ విశ్వసించి భార్యా మణి వశీకరణౌషధాలూ గిపుషధాలూ, మందులూ మాకులూ ప్రయో గిస్తే అవి వికటించి (ఒండుచందమై) భర్తకి రోగాలూ, రొష్టులూ తెచ్చిపెడతాయి వాటి ప్రభావం తేలికగా వదలదు (మానక)కొంతకాలానికి నెమ్మదిగా మూగవాడైపోవచ్చు, చైతన్యం ఉత్సాహం కోల్పోయి నిస్తేజంగా ఒక జడపదార్థంగా మారిపోవచ్చు, మతిచలించి తింగరివాడై పోవచ్చు (జలోదరం బొల్లి, జుట్టు తెల్లబడి పోవడం, నపుంసకత్వం అంధత్వం చెవుడు- ఇలాంటివి వస్తాయని వ్యాసద్రౌపది ౩-౨౨౨/ ౮) అప్పుడు అదంతా బయటకు పొక్కుతుంది లోకానికి తెలుస్తుంది ఎలా ఉండేవాడు ఎలా అయిపోయాడో ఆ మహా ఇల్లాలు మందో మాకో పెట్టింది-అని లోకం నిందిస్తుంది ఉత్తమ లోకాలూ,(సద్గతులూ)చేజారిపోతాయి ఇహంలో నిందా పరంలో నరకమూ తప్పవు

కావున బతులకు నెప్పుడు
గావింపందగదు కపటకర్మంబులు,త
ద్భావ మెఱిగి యనువర్తని
యై వనిత చరింప నదియయగు నెల్లవియున్ ౮-౨౨౮

కాబట్టి ఓ సత్యభామా మాయలూ మంత్రాలూ మందులూ మాకులూ ఇలాంటి దొంగపనులు (కపటకర్మంబులు) భర్తలకి ఎప్పుడూ చెయ్యకూడదు. చెయ్యవలసిందల్లా ఒక్కటే- ఆయనగారి మనస్సు తెలుసుకొని అనుకూలంగా భార్య (వనిత) నడచుకోవడం అదే మందూ, అదే మంత్రమూ అన్నీ అదే అవుతుంది (అదియ యగు నెల్లవియున్)

ఇంక పాండవుల పట్ల నేనెలా ప్రవర్తిస్తున్నానో ఎలా ఉంటున్నానో ఏ రకంగా ఇంత సౌభాగ్యం పొందగలిగానో ఆ రహస్యంకూడా దాపరికం లేకుండా నీకు ఎరుకపరుస్తాను-శ్రద్ధగా విను స్పష్టంగా(ఏర్పడ) తెలుసుకో-

పాండవులయెడనేనెట్టిదాననై యిట్టి సౌభాగ్యంబునంది నది నీకు నెఱింగించెద నేర్పడ వినుము. ౮-౨౨

మనసు ఎరిగి మెసులుకోవడమే గొప్ప మందు అంది ఆ మెస లుకోవడం ఏమిటో ఎలాగో వివరిస్తోంది తాను పాండవుల ''భావ మెరిగి'' అనువర్తిస్తున్న విధానాన్ని తెలియజేస్తోంది. సత్యభావు మనస్సులో ఉన్న అపోహల్ని తొలగించడంకోసమని తన సంసార రహస్యాల్ని కూడా బయట పెడుతోంది

పతు లాత్మ నౌండొక్క పడతుల గలిసిన
నలుగ,నెయ్యెడల నహంకరింప,
మదము ప్రమాదంబు మాని వారికి జిత్త
మేకముఖంబుగ నెల్లప్రొద్దు
భక్తి సేయుదు,జాపు బలుకును గోర్కియు
జెయ్వులు వింతగా జేయనెపుడు,
నమర గంధర్వ యక్షాదులందైనను
బురుషు నన్యుని దృణంబుగ దలంతు,
స్నానభోజన శయనాది సంప్రయోగ
మర్థి బతులకు మున్నెందు నాచరింప,
బతులు వచ్చిన నాసన పాద్యవిధుల
భక్తితో నేన కావింతు బనుప నౌరుల 5-300

సత్యా! నా భర్తలు మనస్సులలో పరకాంతలతో రమించినా (కలిసి నన్) నేను అలగను ఎట్టి పరిస్థితులలోనూ అహంకరించను నేనింత అనుకూలంగా ఉంటున్నాను నాకు అన్యాయం చేస్తావా అని అలగడంగా నీ, నేనింత అందగత్తెను నన్ను అవమాన పరుస్తావా అని అహంకరించడం గానీ చెయ్యను అంటోంది

నకుల సహదేవుల మాట ఏమోగానీ పాండవుల్లో పై ముగ్గురికీ వేరేవేరే సంసారాలున్నాయి. అది సత్యకి తెలుసు ద్రౌపదికీ తెలుసు లోకా నికి అంతటికీ తెలుసు. అయినా ద్రౌపది ఎందుకు ఇలా మాట్లాడుతోం దంటే- బహుశ సంసారతత్త్వం ఇటువంటిది అని చెప్పడానికే ఆ నాడు రాజులకి బహుభార్యాత్వం ఉంది. అప్పట్లో అది ధర్మబద్ధమే దాన్ని గురించి కాదు ద్రౌపది మాట్లాడుతున్నది. భర్త తనతో కలిసి ఉన్నప్పుడుకూడా ''ఆత్మ నౌండొక్క పడతుల గలిసి'' నప్పటికీ, తాను దాన్ని పసిగట్టినప్పటికీ అలగదుట, అహంకరించదుట. ఇది- ఎనిమిదిమందిని పెళ్లాడిన కృష్ణుడి భార్యగా సత్యభామకి అవసరమైన ఉపదేశం అలిగీ అహంకరించీ అల్లరి చేసుకోకు అని సూచన

భార్యా సహితులైన పాండవుల్ని అహంకారం విడిచిపెట్టి కామ క్రోధాలు విడిచిపెట్టి ప్రయత్నపూర్వకంగా సేవించుకుంటూ ఉంటాను.

అహంకారం విహాయాహం కామక్రోధౌ చ సర్వదా
సదారాన్ పాండవాన్నిత్యం ప్రయతోపచరామ్యహమ్ 3-222-18

అని వ్యాసద్రౌపది అంటే, దీన్ని ఎర్రన ఇందుకే ఇలా మార్చి ఉంటాడు.

మానసికంగా చేస్తే పాపమో దారుణమో కాదా . ఏమిటో

అహంకరించకుండా (మదము మాని) పొరపాటులు జరగ కుండా (ప్రమాదంబు) సావధానచిత్తంతో ఎల్లవేళలా (ఎల్లప్రొద్దు) భర్తలకు సేవ చేస్తూ ఉంటా (భక్తిసేయుదు)

''మరపు బ్రమాదంబు మాని'' అని మరొక పాఠం మరచిపోవడం పొరపాటుపడటం- ఇటువంటివి జరగకుండా అని తాత్పర్యం

''మదము' అనే మాట మరీ ఘాటుగా ఉందని ''మరపు'' అనే మాట వచ్చి ఉంటుంది. మదం ప్రమాదం పురుషేషు హిత్వా సంయచ్ఛ భావం ప్రతిగృహ్య మౌనమ్'(౩-౨౨౩- ౦)మౌనం నిరసనేమో !

నా చూపుల్లోగానీ, మాటల్లోగానీ, కోర్కెల్లోగానీ (చెయ్వులు) వింత దోరణికి తావు ఇవ్వను అతి చేసి వింతగా ప్రవర్తించను

పరపురుషుడు ఎవడైనా సరే-వాడు అమర గంధర్వ యక్షాది దేవతా జాతికి చెందిన మహానుభావుడే అగుగాక- వాణ్ణి గడ్డిపోచతో సమానంగా పరిగణిస్తాను

అరణ్యంలో ఉన్నా అంతఃపురంలో ఉన్నా ఎక్కడ ఉన్నా (ఎందున్) నేనై కోరి (అర్థిన్) నా భర్తల ఎట్ట ఎదుట (మున్ను) స్నాన భోజన శయనాదులు ఆచరించను వారికన్నా ముందు ఆచరించను.

ఇవన్నీ వారివి అయ్యాక తాను పరోక్షంలోనే చేస్తుంది స్నానాదులు ముందు,భోజనాదులు వెనకా ఒకవేళ మగడే కోరితే-కలిసి జలకాలాడుతుంది కలిసి భోజనం చేస్తుంది తానై కోరదు. అర్థిన్ అన డంలో ఉంది ఈ చమత్కారం కానీ-భార్యాభర్తలు కలిసే భోజనం చెయ్యాలన్నాడు మనువు

రాజకార్యాలు ముగించుకొని భర్తలు ఇంటికి వచ్చినపుడు వారికి కుర్చీలు వెయ్యడం, కాళ్ళ కడుక్కునేందుకు నీళ్ళ ఇవ్వడం ఇటువంటి ఉపచారాలను (ఆసన-పాద్య - విధులను)నేనే చేస్తాను (నేన కావింతు).

అదీ భక్తితో చేస్తాను. అంతేకానీ బంధువులనో,సేవకులనో (ఒరులను) నియోగించను (ఎంత ఆత్మీయులైనా ఎంత విధేయులైనా ఒరులు తనంత భక్తితో చెయ్యరు. పైగా సంతృప్తి తాను చేస్తే భర్త పొందే ఆనందం !)

తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన భోజన క్రియల్
దగ నొడగూర్తు భర్తలకు, ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వనెప్పుడు, గృహ స్థల భాండ విశోధనంబు లి
మ్ముగ నొనరించు నేమఱ, బ్రమోదము సల్పుదు బంధుకోటికిన్ ౨-౩౦।

సత్యా మరొక్క మాట నాభర్తలకి వేళ తప్పకుండా తగిన సమయంలో నియతంగా స్నానాలూ భోజనాలూ పద్ధతిగా ఏర్పాటు చేస్తాను. (తగ నొడగూర్తు)

ఇంట్లో ధనధాన్యాలు వృధాగా వ్యయపరచడాన్ని ఎప్పుడూ సహించను ఇల్లూవాకిలీ పాత్రలూ(భాండ)పరిశుభ్రంగా ఉంచడం లో(విశోధనంబు) ఏనాడూ ఏమరుపాటు చెందను బంధువులందరినీ ఆనందింపజేస్తూ ఉంటాను

ఇంక వ్యక్తి గతంగా తీసుకోవలసిన జాగ్రత్తలు చెబుతోంది

పలుమాఱుం దలవాకిట
మెలగుట, యసతీజనైక మిత్రత, కలహం
బుల దెలయుట, నగుపలుకుల
బెలుచనగుట- నాకు గాని పేరివి మగువా! 5-302

ఓ మగువా పని ఉన్నా లేకపోయినా అస్తమానూ వీధి గుమ్మం లోనే మెలగడం చెడిపెలతో(అసతీ)స్నేహం చెయ్యడం, ఇంట్లోనూ ఇరుగు పొరుగుతోనూ కయ్యాలకి కాలుదువ్వడం(జగడంబులకు ఎలయుట) హాస్యోక్తులకీ ఛలోక్తులకీ(నగు పలుకులన్) మరీ విరగబడి నవ్వడం(పెలుచ-నగుట) ఇలాంటి పనుల ఊరూ పేరూకూడా నాకు తెలియదు (నాకుగాని పేరివి)

పతు లిచ్ఛమెయి బ్రవాస
స్థితులైనం బుష్పగంధ దీప్తాభరణ
ప్రతతి ధరియింప, దద్గత
మతినగుచు దదాగమంబ మది గాంక్షింతున్ 5-303

ఏదో పని మీద, ఏదో సాధించాలి చక్కబెట్టాలి అనే పూనికతో కోరికతో (ఇచ్ఛమెయిన్) నాభర్తలు ఊరు విడిచి కొన్ని రోజుల పాటు ఎక్కడి కయినా వెడితే (ప్రవాసస్థితులైనన్) ఇంట్లో నేనెలా ఉంటానో తెలుసా- పువ్వులు ముడుచుకోను-గంధం అలదుకోను-సుగంధ ద్రవ్యాలు విని యోగించను. ఆభరణాలు- తళతళలాడే భూషణాలు ఏవీ ధరించను భర్తలనుగురించే ఆలోచిస్తూ(తద్గత మతినగుచు) వారి రాకనే కోరు కుంటూ అలా ఎదురుచూస్తూ ఉంటాను

అత్తకు భక్తి గల్గి మది నాయమ సెప్పిన మాడ్కి జీవితా
వృత్తము లావహింతు, గురువిప్రజనాతిథి పూజనంబు ల
త్యుత్తమభక్తి నేన తగనోపి యొనర్తు, బ్రియంబు దాల్మియున్
మెత్తదనంబు సన్మతియు మేలుగ దాల్తు సమస్తభంగులన్ 5-304

మా అత్తగారు కుంతీదేవి ఉంది ఆమె పట్ల ఎప్పుడూ మనస్సులో భక్తి కలిగి ఉంటాను ఆవిడ చెప్పినట్టే నా జీవికనీ నా నడవడికనీ తీర్చిదిద్దు కుంటూంటాను పెద్దలు, విప్రులు అతిథులు- వీరికి పూజలు నేనే వీలు చేసుకొని (తగన్ ఓపి) ఉత్తమ భక్తితో చేస్తాను ప్రియమూ ఓర్పూ(తాల్మి యున్) మృదుత్వమూ (మెత్తదనంబు) సద్బుద్ధి - వీటిని సమస్త విధాలా మంచిగా (మేలుగా) నిలుపుకుంటూనే ఉంటాను.

కడు మృదువులనుచు దేకువ
సెడి యెపుడు జరింప, భరత సింహులు కోపం
బడరిన నాశీవిషముల
వడువున క్రూరులని వెఱపు వదలక కొల్తున్ 5-305

భామా. నా భర్తలు మృదువైనవారు చాలా మెత్తని మనసున్న మనుషులు అలాగని నేనెపుడూ నా ధీరత్వాన్ని (తేకువ) విడిచిపెట్టను మేర మీరను ఎందుకంటే కోపం విజృంభిస్తే (కోపంబు అడరిన) పాండవులు (భరతసింహులు) విషసర్పాల లాగా మహాక్రూరులని భయపడుతూ (వెఱపు వదలక) సేవలు చేస్తూంటాను

మా యత్త పృథ్వీసమాన పృథాదేవి
గుంతిభోజాత్మజ గోమలాంగి
సతతంబు భోజన స్నానాదికములయం
దిమ్ముగా బరిచర్య యేన చేసి
సంప్రీత జేయుదు, జనవంద్యుడగు ధర్మ
తనయుని బంతి నిత్యంబు పసిడి
పళ్లెరంబుల గుడ్చు బ్రాహ్మణు లతిపుణ్యు
లెనిమిది వేలు సమిద్ధమతులు
యతులు పదివేలు వారల కనుదినంబు
నన్నపానంబు లర్హసహాయ నగుచు
నొడికముగ నేన కావింతు నుచిత వస్త్ర
భూషణాదుల బరితోషముగ నొనర్తు 5-306
(ఒడికము=అందము, ఉపాయము, యుక్తము)

భూదేవిలాంటి మా అత్తగారు కుంతిభోజులవారి పెంపుడు కూతురు సేవలు చేయించుకోవడమే తప్ప చేసి ఎరుగని కోమలాంగి- పృథాదేవికి ఎల్లవేళలా భోజనం స్నానం మొదలైన పరిచర్యలన్నీ నేనే స్వయంగా చేసి ఆవిడను సంప్రీతురాలిని చేస్తూంటాను

ప్రజలంతా నమస్కరించే (జనవంద్యుడు) ధర్మరాజుగారు ఉన్నారు ఆయనతో సహపంక్తిని కూర్చుని బంగారపు పళ్ళేలలో నిత్యం ఎనిమిదివేల మంది బ్రాహ్మణోత్తములు విందు ఆరగిస్తారు వీరు కాక ధీమంతులైన యతీశ్వరులు మరొక పదివేల మంది ఉంటారు మొత్తం పద్ధెనిమిదివేల మందికీ అన్నపానాదులు ఏర్పాటు చెయ్యాలి తగినవాళ్ల సహాయం తో ఆ ఏర్పాట్లన్నీ యుక్తంగా పొందికగా రోజూ నేనే చేస్తాను ఇది అయిన తరువాత ఉచితమైన వస్త్రాలూ భూషణాలూ వారికి సంతోషంగా బహూకరించి ఆనందపరుస్తాను

వ. మఱియు ధర్మరాజు నగరియందు గనక మణిమయ భూష ణాలంకృతలయిన పరిచారికలు నూఱువేలు, రేయును బగలును పాత్రహస్తలై

యభ్యాగత భోజనంబు లొడగూర్చువారు నందఱ కలరు. వీరెల్ల నిట్టిట్టి మెలకువల నెఱుంగుదు రని తత్కృతాకృతంబు లేన యెఱుంగుదు. 5-307

తాను స్వయంగా నిర్వహిస్తూన్న విధులేమిటో ఇప్పటికే ఇన్ని చెప్పింది ద్రౌపది ఇంకా చెబుతోంది-

ధర్మరాజుగారి అంతఃపురంలో లక్షమంది పరిచారికలున్నారుట వాళ్ళంతా కనక మణిమయ భూషణాలంకృతలట వీళ్ళుకాక మరో లక్షమంది వంటావార్పూ వడ్డన చూసే ఆడవాళ్ళు ఉన్నారుట వీళ్ళు నిరం తరం పాత్రలు చేత్తోపట్టుకుని పగలూ రేయీ తేడా లేకుండా అభ్యా గతులకి- అనుకోని అతిధులకు- వండి వడ్డిస్తూ ఉంటారు. అదే వీళ్ళపని

సత్యభామా ఈ రెండులక్షలమందిలోనూ ఎవరికి ఏ నైపుణ్యం ఉందో, ఎవరు ఏది చెయ్యగలరో ఏది చెయ్యలేరో (కృత+అకృ తంబులు) నాకే తెలుసు నేనే ఎరుగుదును (వీళ్ళం దరినీ పేర్లతో సహా నేను గుర్తుపడతానంది వ్యాస ద్రౌపది (3-222-46)

"నిరంతర మదధారాతరంగిత కపోలంబులయిన భద్రగజశత సహస్రంబులు ప్రభూత జవసత్త్వ సన్నుతంబులయిన యుత్తమాశ్వశతసహస్రంబులుంగలవు. వానికి నన్నింటికి నిత్యోచితంబులైన ఖాద్యంబులొనరింపను బాలింపను తగినవారి నేన నియమింతు" 307

నిరంతరం మదం స్రవించే గండస్థలాలతో లక్ష భద్రగజాలు ఉన్నాయి. అత్యధిక జవసత్వాలున్న లక్ష మేలుజాతి గుర్రాలున్నాయి వీటన్నింటికీ రోజూ కావలసిన మేత దాణా అందించడానికీ వీటిని సంరక్షిం చడానికీ తగిన వ్యక్తుల్ని నేనే నియమిస్తాను

"అఖండ భాండాగార పూరితంబులైన యగణ్యమణి కనకాది వస్తువులును బ్రతిదిన విహితంబులయిన యాయవ్యయంబులు నా యెఱుంగనియవియు లేవు." 5-307

మాకు చాలా భాండాగారాలున్నాయి వాటిలో లెక్కపెట్టడానికి వీలులేనన్ని మణులూ మాణిక్యాలూ- బంగారపు వస్తువులూ ఉన్నాయి అవన్నీ నాకు తెలుసు ఇవి కాక ప్రతిరోజూ వచ్చే రాబడి (ఆయము) జరిగే ఖర్చు (వ్యయము) అన్నీ నాకు తెలిసే జరుగుతాయి. తెలియకుండా ఏదీ జరగదు.

"గోపాలజనంబులు దుదిగా గల సకలభృత్యజనంబుల జీవితంబు లరసి యేన నడుపుదున్" 5-307

పశుపాలకులతో సహా సేవకులందరి జీవితాలనీ (జీతాలనీ) గమ నించి నేనే తగిన సౌకర్యాలు కల్పిస్తూ ఉంటాను ఆ విభాగం నడిపేదీ నేనే.

పరమ యశోధనులగు పాండునందనులు నిజకుటుంబ భారంబు **సర్వంబు నాకు సమర్పించి తారు నిర్భరులై ఇష్టవిహారంబుల నుండుదురు రే**

బేతవోలు

నెల్లవెంటల నప్రమత్తనై వర్తింతు" 5-307

మొత్తం కుటుంబ భారమంతా నాకు అప్పగించి నాభర్తలు హాయిగా స్వేచ్ఛా విహారాలు చేస్తూంటారు నేను అయిదుగురినీ కనిపెట్టు కుని వెనక్కాల జాగరూకతతో అన్నీ చూసుకుంటూ సంచరిస్తూంటాను.

ఇన్ని పనులు రోజూ చక్కబెట్టడానికి ద్రౌపదికి సమయం ఎలా సరిపో తోంది బహుశ సత్యభామ ముఖంలో, విప్పారిన కన్నుల్లో ఈ సందేహం కనిపించి ఉంటుంది అబ్జనయనా అని సంబోధిస్తూ ద్రౌపది చెబు తోంది

వేగ జాము గలుగ వెడనిద్ర బొందుదు
గాని రాజ్య భారకార్యయుక్తి
నబ్జనయన! నాకు నాహారనిద్రల
కెడయు లేదు సువ్వె యెల్లప్రొద్దు 5-308

(వేగన్=తెల్లవారుటకు, వెడనిద్ర=అల్పమైన నిద్ర–గాఢనిద్ర కానిది. ఎడ=వ్యవధానం, సందు. సువ్వె =సుమా!)

పద్మాల్లాంటి కన్నులదానా తెల్లవారడానికి సరిగ్గా ఇంకొక జాము (మూడు నాలుగు గంటలు) ఉందనగా ఏదో అలా చిన్న కునుకు తీస్తాను అంతే ఉన్నపొద్దంతా ఇంత రాజ్యభారాన్నీ ఇన్ని పనుల్నీ చక్కబెట్టుకోవడానికే సరిపోదు ఇంక నాకు కడుపు నిండా తినడానికీ కంటినిండా నిద్రపోవ డానికీ అవకాశమెక్కడ! పొద్దుసరిపోదు సుమా

ఇట్టి వర్తనముల నెపుడు పాండవులకు
దగిలి ప్రియము సేయదగితి గాని
మగువ! నీవు సెప్ప మందులు మాకులు
నింద్రజాలములును నేనెఱుంగ 5-309

మగువా! ఇటువంటి నడవడితో ఇలా పాండవులకు ఎప్పుడూ ప్రియం కలిగిస్తానే తప్ప, నువ్వు చెప్పిన ఆ మందులూ మాకులూ మంత్రా లూ మహేంద్ర జాలాలూ నేనెరుగ నమ్మా!

సత్యభామ ప్రశ్నించిన తీరు ద్రౌపదిని ఎంతగా నొప్పించిందో ఈ మాటతీరులో మందులూ మాకులూ అనడంలో స్పష్టపడుతోంది కసిగా నొక్కి నొక్కి ఆ మాటలు మాట్లాడుతోందన్న మాట పాపం సత్యభామ

అనిన విని లజ్జాకలిత చిత్తయగుచు సత్యభామ పాండవభామినికిట్లనియె 310

తన పొరపాటును గమనించి చాలా సిగ్గుపడింది క్షమించమని అడుగు తోంది ఇప్పుడు ఆమె దృష్టిలో ద్రౌపది "పాండవభామిని ' అయ్యింది

ఏ నెఱుగమి నిట్లడిగితి
నా నేరమి సైపవలయు నగవుగ గొనుమీ
మానిని! నా పలుకులు స
న్మానితము భవచ్చరిత్రమహిమ ధరిత్రిన్ 5-311

ఓ మానినీ (అభిమానం ఉన్నదాన.) తెలియక ఇలా అడిగాను నా పొర పాటు క్షమించు (సైపవలయు). నా మాటల్ని పరిహాసంగా సరదాకి అన్నమాటలుగా తీసుకో (నగవుగగొనుమీ) నీ ప్రవర్తన తాలూకు గొప్పదనం (భవత్ చరిత్ర మహిమ) మొత్తం ఈ భూలోకంలోనే సన్మానితం

ఇప్పటికి ద్రౌపది కోపం చల్లారింది మనసు కుదుట పడింది ముఖం మీద కాస్త చిరునవ్వు కనిపించింది

అనినం బాంచాలి మందస్మితాననయగుచు'' నది యట్ల కాదే''
యని పలికి మఱియు నిట్లనియె - ర-3 2

చిరునవ్వులు చిందిస్తూ ''అది సరేలే అలాగే'' అని రవ్వంత హాస్యాన్ని నిజం గానే మేళవిస్తూ అసలైన ఉపదేశం మొదలుపెట్టింది ఇంత వరకూ తన ప్రవర్తననీ తన పద్ధతినీ వివరించడమే సరిపోయింది. ఇక ఇప్పుడు ఉపదేశిస్తోంది-

పతి మనసు నాచికొనియెడు
చతురోపాయంబు నీకు జపలాక్షి! సుని
శ్చితమతి జెప్పెద విను మూ
ర్జితమును ధర్మాన్వితము సుశీలంబునుగన్ ర-3 | 3

''చపలాక్షి'' అని సంబోధన సత్యభామ మాటల్ని చాపల్యంగా పరిగణించి వదిలేసింది

భర్త మనస్సుని ఆకట్టుకొనేందుకు (ఆచికొనియెడు) మంచి ఉపాయం నిశ్చయంగా చెబుతున్నాను విను తిరుగులేని ఉపాయం ధర్మ బద్ధం. శీల సంపన్నం అదేమిటంటే-

పతిగడవంగ దైవతము భామలకెందును లేదు. ప్రీతుడై
పతి కరుణించెనేని గలభాషిణి! భాసుర భూషణాంబరా
న్విత ధనధాన్య గౌరవము విశ్రుత సంతతియున్ యశంబు స
ద్గతియును గల్గు, నొండుమెయి గల్గనె యెన్నితెఱంగులారయన్ ర-3 | 4

అందంగా మాట్లాడేదానా! (కలభాషిణి-సున్నితంగా వేళాకోళం) పతిని తప్పిస్తే (కడవంగ) భామలకి వేరే దైవం ఎక్కడా లేదు మగడే దేవుడు ఆయన సంతోషించి కరుణిస్తే నగలు చీరలు సమృద్ధిగా ధనం ధాన్యం (గౌరవం) మంచి సంతానం యశస్సు ఇహలోకంలో లభిస్తాయి పర లోకానికి సద్గతి కలుగుతుంది. ఇవి మరింక ఏ విధంగానూ లభించవు. నోములు, జపాలు తపాలు, తీర్థయాత్రలూ- ఇలా ఎన్ని మార్గాల ప్రయత్నించినా లభించవు అందునా నువ్వు అసలే అబలవు .

కరము దుఃఖపడిన గాని యెుక్కింత సౌ
ఖ్యంబు ధర్మగతియు గలుగ దెందు
బాడు మఱల! భర్తృశుశ్రూష ఫలము సం
తత శుభంబు గలదు-ధర్మువాదవు ర-3 | ర

అబలా. మిగతా మార్గాల్లో ఎంత కష్టపడినా ఎంత శ్రమపడినా రవ్వంతైనా సుఖం లేదు ధర్మమూ లేదు భర్తను సేవించడంవల్ల కలిగే ఫలం ఎప్పటికీ శుభప్రదం దర్మబద్ధం (కలదు = కలిగినది కలిగించేది)

కావున నిత్యము సమ్య

గ్భావము ప్రేమంబు వెరవు భక్తియు బ్రియముం

గావింపుము నీ ప్రియునెడ

భావము దానెఱిగి భర్త బాగుగ మరగున్ ౩-౩ ౬

అంచేత ఓ సత్యభామా నీ భర్త పట్ల ఎప్పడూ మంచి మనస్సుతో ఉండు ప్రేమగా ఉండు ఉపాయంగా వ్యవహరించు భక్తితో ఉండు. ప్రియం ఆచరించు దీన్ని నీ భర్త గ్రహిస్తాడు నిన్నే మరిగి ఉంటాడు పురుషాహంకారశమనానికీ లొంగుబాటుకీ ఇది మానసిక చికిత్స కాదోలు సరే-

సత్యభామ తెలివితేటలు తెలిసాయి కనుక ఇంకా స్పష్టంగా చెబుతోంది-

వనజాక్షుండు గడంగి నీదగు గృహద్వారంబు సేరంగ వ

చ్చెననంగా విని లెమ్ము సంభ్రమముతో, జెన్నొందు నభ్యంతరం

బునకున్ వచ్చిన నాసనాదికరణంబుల్ దీర్ప దత్తజ్ఞనం

బు నియోగించితి నంచు నుండక ప్రియంబుల్ సేయు మీవుం దగన్ ౩ । ౭

శ్రీకృష్ణుడు (వనజాక్షుండు) బయలుదేరి వచ్చాడు నీ ఇంటి సింహద్వారం చేరుకున్నాడు అనే సమాచారం అందగానే నువ్వు సంభ్రమంగా లేచి ఎదురు వెళ్ళు ఆయన గుమ్మం దాటి లోపలికి రాగానే సింహాసనం చూపించడం అర్ఘ్యపాద్యాలు అందించడం ఇలాంటి ఉపచారాలు చెయ్యి సేవకులున్నారు కదా అని ఊరుకోకు నువ్వుకూడా తగిన పద్ధతిలో ప్రియాలు చెయ్యి

తివిరి మురారి నీకు గడు దీపుగ జెప్పిన పల్కుగల్గినం

గువలయనేత్ర! నీ మనసు గూడినవారికినైన నెప్డు జె

ప్పవలదు, దాన నొండొక నెపంబు ఘటింతు రెఱింగిరేని నీ

సవతులు, కృష్ణు బుద్ధి విరసంబగు నీదెస దత్ప్రయుక్తిచేన్౩-౩ । ౮

ఓ కలువల వంటి కన్నులు గలదానా శ్రీకృష్ణుడు నీకు తియ్యగా ప్రియంగా ఏదయినా చెబితే, ఏదయినా వాగ్దానం చేస్తే అది ఏమంత రహస్యం కాకపోయినా సరే దాన్ని బడాయిగా నువ్వు ఎవరికీ చెప్పకు నీకు వాళ్ళు ఎంత సన్నిహితులైనా సరే మనసు కలిసిన స్నేహితురాండ్రే అయినాసరే ఎవ్వరికీ ఎప్పడూ చెప్పకు ఆ ప్రియం ఏదో నీ సవతులకి తెలిసి పోయిందంటే ఇక దాన్ని చెడగొట్టడానికి వాళ్ళు ఏదో ఒక వంక కల్పిస్తారు వాళ్ళ కుయుక్తులవల్ల శ్రీకృష్ణుడి మనస్సు మారిపోతుంది నీపట్ల విరసమై పోతుంది

మనస్సు కలిసిన స్నేహితురాలు నీకు ఒకతె ఉంటే ఆ స్నేహితురాలికి అలాగే మనసు కలిసిన స్నేహితురాలు కనీసం మరొకతయినా ఉంటుంది. ఆమెకు ఇంకొకతె

ఇలా రహస్యం పాకిపోతుంది. ఇది లోక సహజం. అందుకని ద్రౌపది హెచ్చరించింది మరొక ఉపాయం చెబుతోంది -

పతికి ననుంగులైన తగు బంధుల మిత్రుల భోజనాది స
త్కృతముల నాదరించుచు నకృత్రిమభక్తి నియుక్తి సంతతో
త్థితమతివై చరింపుము, తదీయ హితేతరవృత్తులైనవా
రతివ! భవత్సుహృజ్జనములైనను గైకొనకుండు మెప్పుడున్ ౭-౩౧౯

అతివా నీభర్తకు అత్యంతాప్తులైన బంధువులు కొందరుంటారు. మిత్రులుంటారు- వీళ్లని గమనించి భోజనాదిసత్కారాలతో లోటు రాని వ్వకుండా ఆదరించు. భక్తి ఉండాలి అది సహజంగా ఉండాలి. కృత్రిమం గా నటన కాకూడదు. అలాంటి భక్తితో అప్రమత్తంగా ఎప్పడూ ఏ కోశానా ఏమరుపాటు లేకుండా జాగరూకతతో (సంతత+ ఉత్థిత మతివై) సంచ రించు ఏం అలాగే నీ భర్తకు నచ్చనివాళ్ళూ కొందరుంటారు వాళ్లలో కొందరు నీకు బంధువులో మిత్రులో కావచ్చు. అయినా సరే వాళ్లని ఎన్నడూ చేరనివ్వకు. దూరంగానే ఉంచు. ఎందుకంటే -

విను- ప్రద్యుమ్నాది భవ
త్తనయులయెడనైన నేకతంబున నేకా
సనమున నుండుట దూష్యం
బని యెఱుగుము- సతుల చరిత లతిదుష్కరముల్ ౭-౩౨౦

ప్రద్యుమ్నుడు సాంబుడు మొదలైన (ఎదిగిన) నీ కొడుకు లతోనైనాసరే (కొడుకువరసవారో) ఏకాంతంలో ఏకాసనం మీద కూర్చోవడం, పడుకోవడం లాంటివి చెయ్య కూడదు అది నింద్యమని తెలుసుకో అమ్మా! సత్యభామా! ఆడవాళ్ల వర్తనలు(చరితలు) అసిధారా వ్రతం లాంటివి. అతిదుష్కరాలుసుమా. (పురుష ప్రపంచానికిఇది పరోక్షనింద).

పై రెండు పద్యాల్లోనూ పతికి ఇష్టులైన మిత్రులతో తన పుత్రులతో ఎలా ఉండాలో చెప్పింది కనక రెండూ కలిపి మూడో ఉపాయం అనుకుంటే ఇంక చివరిదిగా నాలుగో ఉపాయం చెబుతోంది-

కులవతులును సతులును ని
ర్మలమతులును నయినయట్టి మగువలతోడం
జెలిమి యొనరించునది, దు
ర్విలసిత వనితాభియుక్తి విడువుము తరుణీ! ౭-౩౨౧

తరుణీ! (వయస్సులో ఉన్నదానా) నీ స్నేహాలుకూడా ఎలా ఉండాలంటే- కులవతులు పతివ్రతలు నిష్కల్మషహృదయులు అయిన మగువల తోనే స్నేహం చెయ్యి అంతేగానీ పిలకోరి చెడిపెలతో స్నేహం చెయ్యకు అలాంటివాళ్లు ఎవరయినా ఉంటే వెంటనే వదుల్చుకో

" ఇది నీకు పరమసౌభాగ్యమూలంబైన యుపాయం బనినం

ప్రీతచిత్తయై సత్యభామ యిట్లనియె - 5-322

ఈ చివర చెప్పింది పరమసౌభాగ్యానికి అతిప్రధానమైన ఉపాయం-గ్రహించుకో అని ద్రౌపది తన ఉపదేశం ముగించింది సత్య భామ మనస్సు విప్పారింది ద్రౌపది అంటే ఏమిటో తెలిసింది.

నీవు ధర్మజ్ఞవు. దేవ సన్నిభులు నీ
భర్తలు మహనీయ కీర్తిధనులు
ధైర్యతేజోబల శౌర్యసంపన్నులు
గావున వీరికి నేవిధమున
ధారుణీ రాజ్యంబు సేరెడు దడయుత.
మీ కెగ్గు సేసిన లోకనింద్య
చరితుండు గౌరవధరణీశు వనితలు
దిక్కులే కలమట బొక్కుచుండ
గని ముదంబున బొందెదు వనిత! నీవు.
సుతుల నత్యంత నిర్మల శౌర్య
యుతుల గాంచిన సద్గుణాన్వితవు-వగవు
వలదు చిత్తంబులో నీకు జలజనయన! 5-323

ద్రౌపదీ నువ్వు ధర్మం తెలిసినదానవు నీ భర్తలు దేవతల్లాంటి వారు కీర్తి దనులు వారికి ధైర్యం తేజస్సు బలం పరాక్రమం ఇవన్నీ పుష్కలంగా ఉన్నాయి అంచేత ఎలా చూచినప్పటికీ (ఏవిధమునన్) వీరికి వీరి రాజ్యం తిరిగి లభించి తీరుతుంది ఇంక ఆట్టే ఆలస్యం లేదు.(తడయక)

మీకు అపకారం చేసాడనీ మీకు కష్టాలు కలిగించాడనీ దుర్యోధనుణ్ణి లోకం తిడుతోంది (లోక నింద్య చరితుడు) ఆ దుర్యోధనుడి స్త్రీలంతా దిక్కులేని వాళ్లయిపోయి దుఃఖిస్తోంటే నువ్వు చూసి ఆనందిద్దువుగాని ఆ రోజు దగ్గరలోనే ఉంది

నీకేమి లోటు రత్నాల్లాంటి కొడుకుల్ని కన్నావు నీ పుత్రులు నిష్కల్మష హృదయులు శౌర్యవంతులు సద్గుణసంపన్నులు ధైర్యంగా ఉండు మనస్సులో ఏ దిగులూ పెట్టుకోకు ప్రతివింధ్యుడు మొదలుకొని నీ అయిదుగురు పుత్రులూ ఎటొచ్చీ ఇప్పుడు యదుపురంలోనే మా దగ్గరే ఉన్నారు కదా! వారికి ఏ లోటూ లేదు (ధర్మజుని కొడుకు ప్రతివింధ్యుడు భీముని కొడుకు సుతసోముడు అర్జునుని కొడుకు శ్రుతకర్మ నకులుని కొడుకు శతానీకుడు సహదేవుని కొడుకు శ్రుతసేనుడు)

ప్రతివింధ్యాదులైన నీ పుత్రులేవురు నిప్పుడు వచ్చి యదుపురం బున నున్నవారు. వారికి నొక్కటం గొఱంత లేదు. రుక్మిణియు సుభద్రయు తక్కిన వారలును అక్కుమారులయెడల దమ కొడుకులకంటె గారవంబు సేయు దురు. వారిదెస నిశ్చింతవు గమ్మనియె. అయ్యవసరంబునం గృష్ణుండు

పాండవుల వీడ్కొని మార్కండేయాది విప్రజనంబు నామంత్రణంబు సేసి గమనోన్ముఖుండగుటయు, సత్యభామ యాజ్ఞసేనిం గౌగిలించుకొని సగౌరవంబుగా వీడ్కొనియె, (చకారాభిప్రదక్షిణమ్- అన్నాడు వ్యాసుడు 3-224- 6) అంత వాసుదేవుండును ప్రియా సహితంబుగా రథారూఢుండై ద్వారవతీపురంబున కరిగె. మార్కండేయుండును బాండవేయుల నాశ్వా సించి నిజాశ్రమంబునకుం జనియె- అని చెప్పిన వైశంపాయనునకు జన మేజయుం డిట్లనియె 6-324

కొసమెరుపు:- తెలుగు కవిత్వంలో నన్నయమార్గం తిక్కన మార్గం ఉన్నట్టే ఎర్రన మార్గం ఒకటి ఉంది భక్తి ప్రబోధం దేశీయత, సంస్కృతాంధ్రాల సమ్మేళనం శైలీ సాత్త్వికత లేదా అనుల్బణత - దాని లక్షణాలు స్పందనలో పదాల ఎంపికలో కూర్పులో ఛంధోనియమాలను వివరించడంలో ఈ సాత్త్వికత కనపడుతుంది (సృజనకు రజోగుణమే కారణమైనా సత్త్వతమోగుణాల కలయికతో దాని రంగు మారుతూంటుంది)

ఇవి ఈ భారత భాగంలో కంటే ఎర్రన గారి ఇతర రచనలలో బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తాయి ప్రబోధచంద్రోదయ పారిజాతాపహరణ ఉత్తర రామాయణ ఏకాంతసేవ సౌందరనంద రచయితలు ఎర్రన మార్గానికి అనుయాయులు అని పిస్తారు. ఈ దృష్టితో అనుశీలించవలసిన అవసరం ఉంది ఒక్కమాటలో అంచనా చెప్పాలంటే కవిత్రయంలో ఎర్రన సుమిత్రలాంటి వాడు అది అలా ఉండగా-

కథాపరంగా పాత్రల పరంగా సంభాషణల పరంగా కనిపించే అందచందాలు క్రమంగా వెనకబట్టి ప్రబంధాలనాటికి ఆద్యంతమూ అన్నింటా కవియే సాక్షాత్కరించడమూ, కల్పనలతో చమత్కారాలతో మల్ల చరిచి నిలబడడమూ గమనిస్తాం.

మారన (క్రీ.శ. 1320 ప్రాంతం)

మార్కండేయ పురాణము

వరూధినీ ప్రవర వృత్తాంతము (4-254 నుంచి 5-105)

కేతన మారన్నలిద్దరూ తిక్కన సోమయాజికి సాక్షాత్తూ శిష్యులు కేతన దశకుమార చరిత్రను రచించి తిక్కనకు అంకితం చేసాడు మారన "శ్రీమదుభయకవి మిత్ర తిక్కన సోమయాజ ప్రసాద లబ్ధ సరస్వతీ పాత్రుడ" ననిపించుకున్నాడు ఇతడి అద్వితీయరచన మార్కండేయ పురాణం

రెండవ ప్రతాపరుద్రుని కొలువులో (క్రీ.శ. ౨౯౬- ౩౨౩) కటక పాలకుడైన (రాజధానీ సంరక్షుడు) గన్నయ సేనానికి ఈ పురాణాన్ని మారన అంకితం చేసాడు గన్నయ సేనాని హరిహరాద్వైత భక్తి తత్పరుడు. అందుకే అంకితం చేసి ఉంటాడు

మారన తండ్రి పేరుకూడా తిక్కనామాత్యుడే తండ్రిదీ, గురువుదీ ఒకే పేరు కావడం విశేషం

సంస్కృతంలో అష్టాదశ పురాణాలున్నాయి వాటిలో మార్కండే యం ఏడవదని పరిశోధకులందరూ అంగీకరిస్తున్నారు మార్కండే యుడు వక్తగా క్రోష్టుకి శ్రోతగా ఇది ౩౪ అధ్యాయాలతో అయిదువేలకు పైగా శ్లోకాలలో ఉంది దీన్ని మారన ఎనిమిది ఆశ్వాసాలలో రెండువేల అయిదువందల గద్యపద్యాలలోకి ఇమిడ్చాడు సంఖ్యను బట్టి చూస్తే సగానికి సగం తగ్గించినట్టు కనపడుతుంది కానీ సంస్కృతంలో అను ష్టుప్పులు ఎక్కువ అది ముప్పయి రెండు అక్షరాల చిన్న శ్లోకం తెలుగులో కందమూ గీతమూకూడా దీనికంటే పెద్దవే మూలంతో పోల్చేటప్పుడు ఇది గుర్తు పెట్టుకోవాలి

ఇతడి ఆంధ్రీకరణం నన్నయ తిక్కనల మార్గంలోనే సాగినా ప్రధానంగా వారిది కథానువాదపద్ధతి ఇతడిది భావాను పద్ధతి అన్నారు దీనిపై ప్రత్యేక కృషి చేసిన ఆచార్య జి వి సుబ్రహ్మణ్యంగారు (ఆంప్ర సా అ ప్రచురణ పీఠిక ౨౮౪) భావాను వాద పద్ధతికి శ్రీనాథుని కంటే ముందు శ్రీకారం చుట్టినవాడు మారన అని వీరి అభిప్రాయం

శ్రీ శేషాద్రి రమణకవులు ఇతడి కవితాశైలిని గురించి ఏమన్నారంటే- "రస పోషణ సంవిధానమున ఈ కవి తన లేఖినిని మనోభావ ప్రకటనమునకు విని యోగించును. మొత్తము మీద ఈ కవి కథాంశము లను క్లుప్తము సల్పి సముచిత ములగు వర్ణనములకు తావొసంగి కావ్య నిర్మాణ మొనరించుటలో మిగుల నేరుపుగల వాడు వర్ణనాంశములకంటె కథాంశములకే యీ కవి విలువగల తన కావ్యమున దావొసంగును ఈ యంశమునను నీతడు తిక్కన సోమయాజి శిష్యుడని చెప్పదగిన

వాడే (వావిళ్ల ప్రతి పీఠిక ౨౮౮)

మనోభావ ప్రకటనకు పట్టం కట్టడం, వర్ణనలకు తావివ్వడం అనేవి గురువు గారి లక్షణాలు పురాణాన్ని మహాకావ్యంగా మలచే పైఖరికి తొలి ప్రయత్నాలు అందు కే ''తెలుగు కవులకు మార్కండేయ పురాణ కథలపై మరులు కొలిపించింది మారన రచనా'' అన్నారు శ్రీ జి వి యస్ స్వారోచిషమను సంభవము, కువలయాశ్వచరితం, హరిశ్చంద్రోపాఖ్యానం మరుత్తరాట్చరిత్రం, దత్తాత్రేయకథ, దేవీ మాహాత్మ్యం – ఇవి తరువాతకవుల చేతుల్లో ప్రత్యేక కావ్యాలుగా రూపుదిద్దుకున్నాయి దీనికి మూల పురాణం కన్నా మారన్న అనువాదమే ఎక్కువ దోహదం చేసిందనీ ఆకర్షించిందనీ వీరు ''ప్రథమాంధ్ర మహాపురాణం- ప్రబంధ కథా మూలం'' అనే సిద్ధాంత వ్యాసంలో నిరూపించారు.

వరూథినీ ప్రవరుల వృత్తాంతాన్ని పెద్దనకు మార్గదర్శకంగా మారన ఎలా నిర్వహించాడో ఈ ఘట్టంలో గమనించవచ్చు ఇది చతుర్థాశ్వాసం ౨ ౦ నుంచి ౨౮4 (44) వరకూ పంచమాశ్వాసంలో ౦౮ వరకూ- అంటే మొత్తం ౮౦ గద్యపద్యాల్లో చురుకుగా సాగింది

సిద్ధుడిచ్చిన పాదలేపనంతో ప్రవరుడు హిమాలయాలకు వచ్చాడు అక్కడి ప్రకృతి సౌందర్యానికి పులకించిపోతున్నాడు.

సురసిద్ధ సాధ్య కిన్నర మనోహర కేళి
విలసిత కందరవిభ్రమములు
కలకంఠ కులకంఠ కలరవరంజిత
వివిధ తరూద్యాన విలసనములు
హంస రథాంగ విహారోల్లసన్నవ
నీరజాకర రామణీయకములు
త్రిదివ నితంబినీ క్రీడాభిరమ్యల
తాగృహమహిత సౌందర్యములును
దగిలి చూచి చూచి, తలయూచి తలయూచి
మెచ్చి మెచ్చి విప్రుడిచ్చదనివి
చనక యింత నెల్లి చనుదెంచి యేర్పడ
జాతు నిన్నగంబు సొంపు బెంపు 4-౨౨4

ఆ మంచు కొండల్లో చాలా గుహలు (కందరములు) ఉన్నాయి సురసిద్ధ సాధ్య కిన్నర దంపతులు ఆ గుహల్లో స్వేచ్ఛగా విహరిస్తున్నారు ఆ విలాసం ప్రవరుడు తిలకించాడు.

రకరకాల చెట్లతో లతలతో ఉద్యానవనాలున్నాయి వాటిలో కోకిలలు దండి గా ఉన్నాయి. కంఠాలనుంచి కలకూజితాలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. అలాంటి ఉద్యానవనాలు చూసాడు

సరోవరాలున్నాయి వాటిలో నిండా పద్మాలు వికసించి కంటికి ఇంపుగా కనపడుతున్నాయి హంసలు చక్రవాకాలు ఆ తామరల మీద మృదువుగా గెంతుతూ విహరిస్తున్నాయి అటువంటి సరోవరాల అందాలు గమనించాడు.

మరోవైపున పూల పొదరిళ్ళు(లతా గృహాలు) కనిపించాయి వాటిలో అప్సరసలు (త్రిదివ-నితంబిని=దేవతాస్త్రీ) క్రీడిస్తారు. ఆ లతా గృహాలు ఎంతో అందంగా కన్నుల పండువుగా ఉన్నాయి

ఈ అందచందాల్ని ప్రవరుడు ఆసక్తితో (తగిలి) చూసాడు మెచ్చుకున్నాడు తల పంకించాడు ఎంతటికీ మనస్సు తనివి తీరలేదు. రేపు (ఎల్లి) వచ్చి ఈ పర్వత సౌందర్యాన్నీ (సొంపును) అతిశయాన్నీ (పెంపును) ఇంకా పరిశీలనగా చూస్తాను

అని తలచి నిజగృహమునకు
జన గడగుటయుం బదములు జడభావం బొం
దిన నద్ధరణీ దేవుడు
దన మది వెఱగంది యివ్విధం బేమియెుకో 4-225

రేపు మళ్లీ వచ్చి చూద్దాం. ఇప్పుడింక ఇంటికి వెళ్లిపోదాం అని ప్రవరుడు బయలుదేరబోతే కాళ్ళు కదలలేదు. జడత్వం పొందాయి వచ్చేటప్పటిలాగా చయ్యన ఆకాశంలోకి ఎగరలేకపోయాడు. ఆశ్చర్య పోయాడు ఇదేమిటి చెప్మా అనుకున్నాడు. వెంటనే కారణం స్ఫురించింది

హిమవారి గఱగి మత్పా
దములంబూసిన సదౌషధము వోవుట జో
ద్యము గదిరె నిప్పు, డక్కట
గమనరయంబుడిగె ననుచు గడుదుఃఖితుడై 4-226

పాదాలకు పులుముకొన్న దివ్యౌషధం మంచునీటికి కరిగి పోయిందన్న మాట చాలా ఆశ్చర్యంగానే ఉందే అయ్యో ఇప్పుడింక నా గమన వేగం పోయినట్టే ఆకాశంలో ఎగరలేను అనుకుంటూ చాలా దుఃఖపడ్డాడు పరిపరివిధాల ఆలోచనలు చుట్టుముట్టాయి

ఇంత దూరమ్మైన యిగ్గిరీంద్రమునకు
నేల నన్ను దైవ మిట్లు తెచ్చె!
నెవ్విధమున నింక నేనింటి కేగుదు!
నేమి సేయువాడ! నేది తెరువు! 4-227

ఎక్కడి మా ఊరు ఎక్కడి ఈ హిమాలయం ఇంతదూరంలో ఉన్న ఈ కొండమీదకి ఇలా నన్ను ఎందుకు తీసుకువచ్చాడు ఆ దేవుడు! ఇంటికి వెళ్లడం ఎలా ! దారి (తెరువు) ఏది ఏం చెయ్యాలి

నిత్యనై మిత్తికములైన నిఖిలకర్మ
ములకు నాఱడి యిట్టులు పుట్టె, వెడగు

యై తి, నింటికి జను నుపాయంబు వేడి
కొనగ నిచ్చట నొక తపోధనుడు లేడె ! 4-228

ఇంటి దగ్గరే ఉంటే నిత్యకర్మలూ నైమిత్తిక కర్మలూ అన్నీ హాయిగా జరుపుకునేవాణ్ణి ఈ రకంగా వాటికన్నింటికీ హాని (ఆరడి) కలిగింది వట్టి వెర్రివాణ్ణి (వెడగు) అయ్యాను ఇంటికి చేరుకునే ఉపాయం చెప్పమని ప్రార్థిద్దామన్నా ఈ చుట్టుప్రక్కల కనీసం ఒక్క తపస్వి ఎవరయినా ఉన్నారో లేదో పిలిస్తే పలికే దిక్కుకూడా లేదని

ఇదీ ప్రవరుడి వేదన ఇక్కడ నేనేమయిపోతానో అని కాదు అతడి భయం. నిత్యనైమిత్తికాలకు, అగ్నికార్యాలకు అంతరాయం కలిగిందే అని దిగులు ఈ ప్రవరుడి తత్త్వాన్ని పట్టుకున్నాడు పెద్దనగారు 'వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీక్షా పరతంత్రుడు అనారతాధ్యాపన తత్పరుండు'' అని పరిచయం చేసాడు

ఉపాయం చెప్పడానికి దేవతలకోసం ఎదురుచూడలేదు ప్రవరుడు '' ఒక తపోధనుడు లేడె'' అని ఆశపడ్డాడు తపశ్శక్తి మీద అతడికున్న విశ్వాసం అటువంటిది చివరికి అదే ఉద్ధరించింది

'' ఇంక నెల్లి చనుదెంచి యేర్పడజాతు నిన్నగంబు సొంపు బెంపు'' అనే మాట తలమే బ్రహ్మకునైన అనే పద్యంగానూ, '' వెడగునైతి'' అనే మాట అకలంకౌషధ-అనే పద్యంగానూ పెద్దనగారి చేతిలో కవితా మహితంగా విస్తరించాయి

ప్రవరుడు ఇలా దుఃఖిస్తూ దారిచెప్పే తపోధనుడికోసం గాలిస్తున్నాడు

అని కడు వంత గూరుచు హిమాద్రితటంబున సంచరించు వి
ప్రుని మకరాంకసన్నిభు వరూధిని నా జను నొక్క యప్సరోం
గన, లలితాంగ కాంతి జిత కాంచన విభ్రమ, చంచదబ్జలో
చన,కలహంసయానకని సంభ్రమ సంచలితాంతరంగయై 4-229

మన్మథుడంతటి అందగాడు ఈ విప్రుడు మంచుకొండ చెరియల్లో లోయల్లో సంచరిస్తున్నాడు వరూధిని కంటపడ్డాడు . ఆవిడ ఒక అప్సరస. సుకుమారైన శరీరం. దాని కాంతి బంగారు కాంతిని సహితం కాదు పొమ్మంటోంది పద్మాల్లాంటి కన్నులు అవి చంచలంగా ఉన్నాయి హంస నడక మన్మథుడిలా ఉన్న ప్రవరుణ్ణి చూస్తూనే ఆమె మనస్సు సంభ్రమంతో సంచలించిపోయింది.

ఆడతాంబూలపు వాసన సోకడం, ప్రవరుడు అటువెళ్ళడం వీణ వాయిస్తున్న వరూధినిని చూడటం – ఇవన్నీ పెద్దన గారి కల్పనలు. ఇక్కడ వరూధినికే ప్రవరుడు కనిపించాడు చూస్తూనే ఆశ్చర్యపోయింది ఆ సౌందర్యానికి ముగ్ధురాలయ్యింది. మనస్సులో కోరికలు క్రేళ్ళురికాయి

ఈ సుకుమారు డెవ్వడొకొ, యిందుల కెందుల నుండి వచ్చెనో,
భాసురరూప కాంతి జిత భావజ చంద్రుడు, డితండు రాగ లీ
లా సరసత్వ మొప్ప గడు లాలసుడై నను జూచె నేని, నే
జేసిన పుణ్య మెవ్వరును జేయరు – కాముని దక్కనేలుదున్

ఆహా ఈ సుకుమారుడు ఎవరో కదా ఎక్కడనుంచి ఇక్కడకు వచ్చాడో కదా అందమైన రూపం. ప్రకాశిస్తున్నశరీరకాంతి రూపంలో మన్మధుడు (భావజు) కాంతిలో చంద్రుడు ఇతడే కనక అనురక్తితో నన్ను చూస్తే, నాకు లాలసుడైతే - ఓహో నిజంగా నేను చేసిన పుణ్యమే పుణ్యం ఇంక ఎవ్వరూ అటువంటి పుణ్యం చెయ్యనట్టే మన్మదుణ్ణి ఏలుకుంటాను గదా దాసుణ్ణి చేసుకుంటాను గదా

అని మఱియును 4-231

వీని సురూప విభ్రమము. వీని తనూద్ధత చారుకాంతియున్
వీని మృదూల్లసద్గతియు, వీని వినిర్మల దృగ్విలాసమున్
వీని ముఖాంబుజ ద్యుతియు, వేడ్క గనుంగొన నింతయొప్పనే
మానవ దేవ కిన్నర కుమారుల జూడనె । వారు నిట్టిరే 232

ఉవ్విళ్లూరుతున్న మనస్సుతో వరూధిని క్రమక్రమంగా ప్రవరుణ్ణి సమీపిస్తోంది నాలుగు అడుగులు ముందుకి నడిచిన విశ్రాంతికి సూచకం "అని మఱియును" అనే ముక్క

ఏమి ఇతగాడి రూప విభ్రమం ఏమి శరీర కాంతి (తను+ ఉద్ధత+ చారు కాంతి) సుకుమారమూ గంభీరమూ ఏమి నడక (మృదు+ ఉల్లసత్ గతి). కన్నులు నిర్మలంగా ఉన్నాయి చూపుల్లో ఒక విలాసమూ ఉంది ముఖపద్మం కాంతిమంతంగా ఉంది తేజస్సు కనపడుతోంది ఇంత ఒప్పూ ఇంత సొగసూ నేను ఎక్కడా చూడలేదు ఇంతకు ముందు మానవ కుమారుల్నీ దేవకుమారుల్నీ కిన్నర కుమారుల్నీ ఎంతమందిని చూడలేదు వాళ్లలో ఒక్కడైనా ఇంతటి అందగాడు ఉన్నాడా లేదు ఇతడిది అపూర్వ సౌందర్యం

ఈ విశేషాల కూర్పులో ఒక క్రమగతి ఉంది దూరంనుంచి చూసినప్పుడు ప్రవరుడి మొత్తం రూప విభ్రమం ఆకర్షించింది కొంచెం దగ్గరయ్యాక శరీర కాంతి స్ఫురించింది ఇంకొంచెం సమీపించాక నడక లో అందాలు కనిపించాయి బహుశ ఇప్పుడు ప్రవరుడు వరూధినిని చూసి ఉంటాడు "వినిర్మలదృగ్విలాసం" బయట పడింది అప్పడే ముఖపద్మం కాంతికూడా "లాలసుడై నను చూచెనేని" అనుకుంటున్నవరూధినికి ప్రవరుడి"వినిర్మలదృగ్విలాసం" సంతృప్తినిస్తుందా! ఆ చూపుల్లో తనకు కావలసిన భావం కనిపించి ఉండదు

ఈ కుమారుని మీద నా హృదయ మిప్పు
డ థిక రాగ రసోద్రిక్త మైన మాడ్కి
నితని మనమును నాయందు నతుల రాగ
లలిత మగునేని అది జన్మఫలము కాదె । 233

ఈ సుకుమారుడి మీద నా హృదయం ఇప్పుడు పట్టరాని అనురాగంతో రసోద్రిక్తం అవుతోంది మరి ఇతడి మనస్సుకూడా నా మీద ఇలాగే "అతుల రాగలలితం" అవుతుందా అలా అయితే బాగుండును నా పుట్టుక సఫలమవుతుంది

ఈ జన్మకు అదే ఫలం

సజ్జనులకి మనస్సే ప్రమాణం అన్నాడు కాళిదాసు తన మనస్సు లాగానే ప్రవరుడి మనస్సు రంజితం అవుతుందేమోనని వరూధిని ఆశ, మనస్సు చూపుల్లో ప్రతిబింబిస్తుందంటారు ఈ రెండు అంశాల మీద కథ అంతా నడిచింది పెద్దనకూడా చూపుల ప్రాముఖ్యాన్ని గుర్తించి వర్ణించాడు

వరూధిని ఇలా ఆలోచిస్తూనే ప్రవరుడికేసి నడుస్తోంది

అని మనమున దల పోయుచు
మనసిజ శర నికర దళిత మానస యగుచున్
జని యవ్వనితామణి వి
ప్రుని ముందట నిల్చె రత్న పుత్రికవోలెన్ 234

మనసిజుడు అంటే మన్మధుడు. మనస్సులో పుడతాడట అతడికి అయిదు రకాల పూలబాణాలు ఉన్నాయట ఒక్కొక్క రకానికీ ఎన్నేసి ఉన్నాయో తెలీదు ఆ బాణాల పరంపరతో (శరనికర) వరూధిని మనస్సు చితికి పోతోంది ''మనసిజ శరనికర దళిత మానస' అయ్యింది ఆ వనితా మణి అలా ఆలోచిస్తూనే నడుస్తూ వెళ్ళి ప్రవరుడి ముందు నిలబడింది రత్నాలు పొదిగిన బంగారు బొమ్మలాగా (పుత్రిక) నిలబడింది

మారన అక్కడా అక్కడా పొందుపరిచిన విశేషాలను ఒకచోటికి చేరిస్తే ప్రవరుడి స్వరూప స్వభావాలు స్పష్టపడతాయి అతులగుణోత్తరుడు ధరణీసురవరుడు (అంబురుహగర్భకులాభరుణుండు--మను -5) అశ్వినుల కంటే సుందరుడు(2 3)-అతి సుకుమారమూర్తి, ఉదాత్తుడు వేదపారంగతుడు (భాషాపర శేషభోగి-మను -5) అతిథిజనార్చనాభిరతుడు శైలకాననాంచిత సకలావనీతల విశేషములెల్లను బ్రీతిగన్గొన్ మతి గడుగోరుచుండు (2 4) ఇవి పెద్దనగారి తీర్థసంవాసులు (-57) పద్యానికి మార్గదర్శకాలు ''నిత్య నైమిత్తికములైన నిఖిల కర్మములకు నాబడి ' పుట్టిందని దుఃఖించేవాడు (228) మకరాంక సన్నిభుడు (229). భాసుర రూపకాంతిజిత భావజచంద్రుడు(230) ఇదే పెద్దన చేతిలో ''మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి'' అయ్యింది మానవ దేవ కిన్నర కుమారుల జూడనె వారునిట్టిరే (232). ఇది ''అలేఖ్య తనూ విలాసుడుగా'' మారింది (మను -50)

నైష్ఠికత్వం కారణంగా ప్రవరుడి సౌందర్యం వారకాంతలకి అందకుండా పోయింది పూచిన సంపెంగ పాలుపు మధుకరాంగనలకు వోలె (మను -52) ఈ అంశాన్ని పెద్దన ముందుగానే వాచ్యం చేసేసి ప్రవరుడి పాత్రని రూపు కట్టించాడు మారన్న రవ్వంత ఔత్సుక్యం నిలబెట్టాడు.

వరూధిని ప్రవరుణ్ణి చూడటంతో మారన ఒక క్రమం పాటిస్తే ప్రవరుడు వరూధినిని చూడటంలో పెద్దన క్రమం పాటించి ఇలాంటి చమత్కారమే స్ఫురింపజేసాడు (మను 2-25)

సరే-మళ్ళీ కథలోకి వద్దాం అవ్వనితామణి విప్రుని ముందటనిల్చె రత్నపుత్రిక వోలెన్

నిలిచినం జూచి యవ్విప్రుండు దాని డాయం "నీ వెవ్వతెవు? ఇచట నేకతంబ యేల యున్నదానవు ?" అని యడిగి తన తెఱంగంతయు నెఱింగించిన నత్తలోదరి యిట్లనియె 235

ప్రవరుడు ఎదురుగా నిలబడిన వరూధినిని చూసాడు. దగ్గరకు వెళ్లాడు నీవు ఎవతెవు ? ఇక్కడ ఈ అరణ్యంలో ఒంటరిగా ఉన్నావేమిటి? అని ప్రశ్నించాడు ప్రశ్నించాడు గానీ సమాధానం కోసం ఆగలేదు ముందు కు ముందే తన కథ అంతా చెప్పేసాడు ఆవిడ అడగకుండానే చెప్పేసాడు. అంతా విని ఆ సన్నని నడుమున్న చిన్నది (తల+ ఉదరి) ఇలా అందిట

ప్రవరుడి అమాయకత్వానికీ భయభ్రాంతమైన మానసిక స్థితికీ ఈ వచనం దర్పణం పడుతోంది కనిపించిన ఒకే ఒక వ్యక్తి కనుమరుగై పోతుందేమో, ఆవిడ గొడవ నాకెందుకు నాకేమయినా దారి చూపెడుతుందేమో, నా పబ్బం గడిచిపో తుంది- ఇలాంటి ఆలోచనలేవో ప్రవరుడిని తొందరించి ఉంటాయి ఈ అందాలన్నీ స్ఫురించేలాగానే పెద్దనగారి ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ (మను.2-39) అనే పద్యం సాగింది. "మనసిజ శరనికర దళితమానస" అనే సమాసం " మీనకేతన ధను ర్జ్యాముక్త నారాచ దుర్దినసమ్మూర్ఛిత మానసాంబురుహ" గా పెద్దన చేతిలో కొత్త అందాలను సంతరించుకుంది. "అడ్డంబు నిల్చిన నయ్యచ్చర జూచి చేరజని పల్కెన్ వాడు విభ్రాంతుడై" (మను 2-38) అనేది రెండిటా సమానం

ప్రవరుడితో వరూధిని పలుకుతోంది-

ముని తనయ! విను వరూధిని
యను నచ్చరలేమ ననఘ! యనుపమ బహుర
త్ననికాంతకాంతి సంపద
నొనరిన యిగ్గిరి జరించుచుండుదు నెపుడున్ 4-236

పవిత్రుడా (అనఘ) ఓ ముని కుమారా! విను. నేను వరూధినిని. అప్సరస ను. సాటిలేని రత్నరాశులతో, ఎడతెరిపిలేని వాటి కాంతి సంపదతో ప్రకాశించే ఈ పర్వతం మీద నేను ఎప్పుడూ సంచరిస్తూ ఉంటాను.

ఆకారాన్ని బట్టి 'మునికుమారా' అని సంబోధించింది ముఖంలో కనపడు తున్న తేజస్సుని బట్టి 'అనఘా'! (పాపరహితుడా) అంది ఈ పర్వతం మీద ఎప్పుడూ ఇలాగే సంచరిస్తూ ఉంటాను అనడంలో ' ఒంటరి దాన్ని' అనే సూచన ఏమయినా ఉందేమో అయినా దాపరికం లేకుండా స్పష్టంగా తన అభిప్రాయం చెబుతోంది

నీ విలసనంబు గనుగొని
భావజు నలరంప వెల్లి పాల్పడితి ననుం
గావుము సుందరమూర్తీ!
నావుడు నతడిట్లనియె నలినాననకున్ 237

ఓ సుందరాకారా నీ విలాసం చూసాను అంతే-మన్మధ పరవశ ను

అయిపోయాను మన్మథుడి (భావజు) పూల బాణాలు (అలరు+ అమ్ము) ఒక వరద లాగా (వెల్లి) నన్ను ముంచెత్తుతున్నాయి ఆ వెల్లిలో కొట్టుకుపోతున్నాను నన్ను కాపాడు (కావుము) అని ప్రాధేయపడింది అప్పడు ఆ పద్మముఖికి (నలిన+ ఆననకున్) ప్రవరుడు ఇలా చెప్పాడు

నిత్యకృత్యముల్ సలుపంగ నిజగృహమున
కిపుడ యరుగంగవలయు నా కిందువదన !
చను నుపాయ మేయది ? సెప్పు, నను సముద్ధ
రింపు, నిత్యక్రియాహాని పెంపునడచు. 4-238

చంద్రముఖీ అధ్యయనం అధ్యాపనం అగ్నికార్యాలు మొదలైన నిత్యకృత్యాలు జరుపుకోవడానికి నేను ఇప్పడే అత్యవసరంగా మా ఇంటికి వెళ్లిపోవాలి వెళ్లే ఉపాయం ఏమిటి? అది చెప్పు- నన్ను ఉద్ధరించినదానవు అవుతావు నను సముద్ధరింపుము గట్టెక్కించు నిత్యకృత్యాలకి అంతరాయము (హాని) కలిగితే అది అన్ని అభివృద్ధుల్నీ శ్రేయః ప్రేయస్సుల్నీ (పెంపు) నాశనం చేస్తుంది

ఇందులో వరూథిని మాటలకు సమాధానం లేదు అవునని గాని కాదనీ గానీ అనలేదు వాటినసలు గుర్తించినట్టేలేదు తన గొడవా తన అవసరమూ అదే మాట్లాడుతున్నాడు ప్రవరుడు అయితే 'ఇందువదన' అనే సంబోధన వరూథినికేమైనా ఆశ కలిగించిందేమో అప్సరసలు చంద్రాంశసంభూతలు కాబట్టి ఆమె ముఖంలో చంద్రుని పోలికలు ప్రవరుడికి కనిపించి ఉంటాయి

అనిన నయ్యింతి యిట్లనియె 4-239
ధరణీ దేవకుమార ! యిట్లనకు ముద్యత్ప్రీతి నన్బాసి నీ
కరుగంగా దగునెట్లు, మేలె యతిరమ్యంబై వసింపంగ ని
గ్గిరికంటెన్ భవదీయగేహ,మెలమిన్ గ్రీడింపు నాతో మనో
హరకేళిగతి, నెందుబోకుము, సుహృద్వ్యామోహ ముప్పొంగగన్ 240

ప్రవరుడు పూర్తిగా నైష్ఠిక ధోరణిలో మాట్లాడుతున్నాడు తమకంతో ఉన్న వరూథిని మరి ఈ విషయాన్ని గుర్తించలేదో గుర్తించినా మరో ప్రయత్నం చేద్దాం మెత్తబడకపోతాడా అనుకుందో -మాట్లాడుతోంది

ఓ బ్రాహ్మణకుమారా ఇలా అనకు నన్ను విడిచి పెట్టేసి ఎక్కడో ప్రీతి పెంచుకుని వెళ్లిపోవడం నీకు తగునా . నీకు భావ్యమా (ఉద్యత్ప్రీతి అయిన నన్ను వాసి అనికానీ) నివసించడానికి ఈ పర్వతంకన్నా మీ ఇల్లు అతిమనోహరమై గొప్పగా ఉంటుందా ! దీనికంటే అది మేలైనదా మనస్సు ను హరించే శృంగారకేళులతో (మనోహర-కేళీ-గతిన్) నాతో విహరించు 'ఎలమి' అంటే ధైర్యం, దయ అనే అర్థాలుకూడా ఉన్నాయి ధైర్యంగా నాతో విహరించమనీ నాకు సంబంధించినవాళ్లవల్ల నీకు ఏ కీడు మూడు తుందో అని భయపడవద్దనీ సూచన నా అవస్థను గ్రహించి దయ పూని నాతో క్రీడించమని ప్రార్థన ఈ క్రీడించడంకూడా ఎలాగా-సుహృద్వ్యా

మోహముప్పొంగగన్ స్నేహభావాతిశయం-మైత్రీ వ్యామోహము- ఉప్పొంగేటట్లు క్రీడించు ఎందున్ పోకుము దయచేసి ఎక్కడికీ వెళ్ళిపోకు

ఇది వరూధిని ప్రార్థన ఈ పద్యాన్ని వచనంలా విడగొట్టి రాస్తే

ధరణీ దేవకుమార!

ఇట్లనకుము.

ఉద్యత్ప్రీతి నన్ బాసి నీకు అరుగంగా దగునెట్లు!

అతిరమ్యంబై వసింపంగ ఇగ్గిరికంటెన్ భవదీయ గేహము మేలె!

సుహృద్వ్యామోహముప్పొంగగన్

మనోహర కేళిగతిన్ ఎలమిన్ నాతో క్రీడింపుము. ఎందున్ పోకుము!

''మునితనయ'' అనీ ''ధరణీ దేవకుమార'' అనీ సంబోధిస్తోంది అంటే ప్రవరుడు వయసులోనే ఉన్నాడని వ్యంగ్యం


పై పద్యంలో ''మనోహర'' అన్నంతవరకూ సంబోధన చెయ్యవచ్చు నా మనస్సు దోచినవాడా నీలోనూ నాపట్ల సుహృద్వ్యామోహం ఉప్పొంగుతున్నా నన్ను ఆటపట్టించడంకోసం-కేళగతిన్- ఎక్కడికో వెళ్లిపోకు ఇది ఉద్దిష్టం కాకపోయినా వరూధిని చిలిపితనానికీ సందర్భానికీ అనుకూలమైన అన్వయమే సరే -

వరూధిని తన ప్రయత్నాన్ని ఇంకా కొనసాగిస్తోంది- రకరకాల ఆకర్షణలు చూపించి ఊరిస్తోంది

భక్ష్యభోజ్యాలేహ్య పానీయములు రత్న
మండనములు వస్త్ర మాల్యములును
గర్పూర చందన కస్తూరికాదులు
నే నర్థి నీ గొని, యింపు మిగుల
గా సుఖించుచు, లీల గంధర్వ కిన్నర
వేణు వీణాగీత వివిధ గతులు
వినుచు, మందానిలం ,నుభవించుచు, నిమ్మ
హాశైల సానుపర్యంకతలము
నందు రమియింపు, భవదీయమందిరమున
గలుగునే యిట్టి దివ్యభోగంబు ? అనుచు
రాగసాగర మగ్నయై రాజవదన
కదిసి భూసురవరు నక్క గౌగిలించె 241

పై పద్యంలోనుంచి (240)''సుహృద్వ్యామోహముప్పొంగగన్'' అనే ముక్కను ఈ పద్యంలోకి తెచ్చుకున్నా తెచ్చుకోవచ్చు

ఓ విప్రవరా. భక్ష్యాలు (పిండివంటలు) భోజ్యాలు (వంటకాలు) ఆలేహ్యాలు (జామ్స్) పానీయాలు (డ్రింక్స్) ఇలాంటి తినుబండారాలూ, రత్నాలు పొదిగిన ఆభరణాలూ (మండనములు), వస్త్రాలూ పూలదండలూ కర్పూరం చందనం



కస్తూరి మొదలైన సుగంధద్రవ్యాలూ ఇవన్నీ నేను ప్రేమతో కోరికోరి, కొసరి కొసరి (అర్థిన్) అందిస్తుంటే నువ్వు స్వీకరించి హాయిహాయిగా (ఇంపు మిగులన్) సుఖించు మా గంధర్వులూ, కిన్నరు లూ-కొందరు వేణువు ఊదుతోంటే కొందరూ వీణ పలికిస్తూంటే మరికొందరు గీతాలు ఆలపిస్తూంటే రకరకాల బాణీలను (వివిధ గతులు) విలాసం గా (లీల) వింటూ పరవశించు చల్లగా మెల్లగా వీతెంచే పిల్లగాలుల్ని అనుభవించు ఈ కొండ చెరియ లో (సానువుల పర్యంక తలము) రమించు- ఆనందించు ఇటువంటి దివ్యభోగాలు మీ యింట్లో దొరుకుతాయా ? దొరకవు గాక దొరకవు

ఇలా ఒక పూనకంలోలాగా మాట్లాడుతూ అప్పటికే అనురాగ సముద్రంలో పూర్తిగా మునిగిపోయిన ఆ చంద్రముఖి (రాజవదన) ప్రవరుడికి ఇంకా దగ్గరగా వచ్చి (కదిసి) మరి ఆగలేక చక్కగా కౌగిలించుకుంది

ఇట్లు దన్ను నయ్యంగన గాఢాలింగనంబు సేయుటయును 4-242

అంట కంటకు నన్ను మృగాక్షి ! నీకు
సదృశుడగువాని నన్యుని వెదకికొనుము
నిన్ను నొక్కటి యడుగంగ నీవు వేఱ
యొకటి కోరి ననున్బొంద నుచిత మగునె ? 243

ఇలా వరూధిని గాఢంగా కౌగిలించుకునేసరికి ప్రవరుడు ధీరంగా నిలబడి పలుకుతున్నాడు విప్పారిన ఆమె చూపుల్లో కామాతిరేకం వల్ల అప్పుడు ఏదో ఒక చాంచల్యం కనిపించినట్టుంది మృగాక్షీ అని సంబోధించాడు

తాకకు తాకకు నన్ను, నీకు తగినవాణ్ణి వేరే ఎవరినైనా వెతుక్కో నేను నిన్ను అడిగింది ఒకటి. నువ్వు కోరినదీ చేస్తున్నదీ మరొకటి ఇది ఉచితమా ! ఇలా నన్ను పొందాలనుకోవడం నీకు తగదుసుమా !

' అంటకు నన్ను' అనే ఎత్తుగడలో కసురుకోవడం ఉంది ఇది కౌగిలింతకు తక్షణప్రతిస్పందన. అసహ్యమే తప్ప అనుగ్రహం లేదు అందు కే తరువాత వాక్యాల్లో నిశ్చయంతో కూడిన సౌమ్యస్థితి కనపడుతోంది. ''నీవు వేఱయొకటి కోరి'' అన్నాడే తప్ప ఆ కోరుకున్న దేమిటో మాటవరసకు కూడా చెప్పలేదు ఆ మాట అనడంకూడా అతడికి ఇష్టం లేదన్నమాట అటుపైన తన అభిప్రాయం చెబుతున్నాడు తన నైష్ఠికత్వాన్ని తెలియపరుస్తున్నాడు

అనలునియందు రేపును మాపు వేల్వంగ
బడు హవ్యముల జేసి పడయవచ్చు
పుణ్యలోకంబులు పొలతి ! నీ వెఱుగ వీ
త్రిజగంబు హవ్యప్రతిష్ఠితంబ
యనిన నా యింతి నా యందు నిగ్గిరియందు
నీకు బ్రియంబేల నెలవుకొనదు ?

విద్యాధరాదుల విడిచి మనుష్యుల
కడకేల యరుగంగ గడగె దనిన
వినుము దర్భలు నరణులు వేదికలును
నగ్నులును నాకు గరము ప్రియంబొనర్చు
గాని యెుండందు బ్రియ మెద గలుగ దనిన
నవ్వరూథిని యిట్లను నతనితోడ 4-244

అమ్మాయీ (పాలతీ) పొద్దుటా రాత్రీ క్రమం తప్పకుండా అగ్నిలో (అనలునియందు) హవ్యాలను హోమం చేస్తే (వేల్చుట) దానివల్ల వచ్చే పుణ్యలోకాలు ఏమిటో నీకు తెలీదు నువ్వు ఎరగవు ఈ ముల్లోకాలూ హవ్యంతోనే నిలుస్తున్నాయి హవ్యంలోనే నిలుస్తున్నాయి

నేను చేసే అగ్నికార్యం అంత గొప్పది దానికి విఘ్నం రాకూడదు. తక్షణం ఇంటికి వెళ్లిపోవాలి ఇది ప్రవరుడి అభిప్రాయం

నా మీద కానీ ఈ పర్వతం మీద కానీ నీ కసలు ప్రేమా రక్తీ కలగడం లేదా? వింతగా ఉందే మేం విద్యాధరులం అప్సరసలం. మమ్మల్ని విడిచిపెట్టి మనుష్యుల దగ్గరకి పోతానంటావేమిటి ?

అలాగా అయితే చెబుతున్నాను విను- దర్భలు, అరణులు (యాగాగ్నిని ఉత్పత్తి చేసేందుకు కొయ్యచెక్కలు), అగ్నివేదికలు, అగ్నులు ఇవి నాకు బాగా ఇష్టం ఇవే నాకు ప్రియం కలిగిస్తాయి. ఇవి తప్ప మరింక దేని మీదకీ (ఒండందు) నా మనస్సు పోదు మరింక ఎందులోనూ ప్రియం కలుగదు (ప్రియము ఎదన్ కలుగదు)

ఖండితంగా చెప్పేసాడు ప్రవరుడి తత్త్వం అర్థమయ్యింది అయితే మరీ మంచిది ఆ నైష్ఠికత్వం మీదనుంచే ఆ పుణ్యలోక స్పృహనుంచే నరుక్కువద్దామనుకుంది వరూథిని పుణ్యాత్ముడా అంటూ కొనసాగించింది.

అఖిల ధర్మవేదివైన నీ సుగుణాష్ట
కంబు ముఖ్యగుణము కాదె కరుణ
దాని బూనవలదె తథ్యము నా యందు
దయకు సరియె యెుండు ధర్మమనఘ! 4-245

అనఘా (పాపరహితుడా) నువ్వు అఖిలధర్మాలూ తెలిసిన వాడివే అయితే మరి నీ సుగుణాష్టకంలో ముఖ్యమయిన సుగుణం కరుణ కాదా ఆ దయని నా విషయంలో నువ్వు వహించవద్దా వహించి తీరాలి కదా మరొక ధర్మం ఏదయినా సరే దయకి సాటి వస్తుందా

దయఁబోల వధ్వరంబులు
దయఁబోలవు వివిధ భూరి దానచయంబుల్
దయఁబోలవు జపతపములు
దయ తలపోయఁగ విశిష్టతమధర్మ మిలన్ 4-246

యజ్ఞాలూ యాగాలూ రకరకాల పెద్ద పెద్ద (భూరి) దానాలూ జపాలూ తపాలూ - ఇవి ఏవీ దయకు సాటిరావు బాగా ఆలోచిస్తే దయ ఒక్కటే అన్ని ధర్మాల్లోకీ విశిష్టమైన ధర్మం అవునా ఆ దయ రవ్వంత చూపించు నా మీద

నిను బాసి నిముసమైనను
మను జీవము పట్టజాల, విప్రోత్తమ! నే
నన్నృతంబు పలుక, నిజమిది,
నను బ్రీతి వరింపు, కరుణ నాన్పు మనంబున్ 4-247

ఓ బ్రాహ్మణోత్తమా ఒక్కమాట చెబుతాను విను నిన్ను విడిచి పెట్టి నిముషంకూడా బతకలేను (జీవము పట్టజాలను) నేను అబద్ధం (అనృతము) చెప్ప డం లేదు ఇది నిజం. నన్ను వరించు ప్రేమతో వరించు నీ మనస్సుని దయాగుణంలో కాసేపు నానబెట్టి చలువచెయ్యి (నాన్పుము) మెత్తబరుచు

నీకు నిజగృహంబునకు నవశ్యంబు నరుగవలయునేని కొంతకాలంబు నాతోడ నిష్టోప భోగంబులనుభవించి మఱి యరుగు మనిన ఆ బ్రాహ్మణుం డిట్లనియె 4-248

అంతగా నువ్వు ఇంటికి వెళ్ల తీరాలంటే అలాగే పోనీ పెడుదువు గాని నిన్ను శాశ్వతంగా ఇక్కడే ఉండమనడం లేదు కొంతకాలం ఉండు చాలు నాతో ఇష్టోప భోగాలు అనుభవించు ఆపైన-నీ ఇష్టం - మీ ఇంటికి వెళ్ళు కాదనను

వరూధిని అన్నివైపులనుంచీ దాడి చేస్తోంది చుట్టుముడుతోంది చిట్టచివర గా-తాత్కాలికమైన ఒప్పందానికైనా రమ్మంది అప్సరస వాళ్ల నీతులూ వాళ్ల ధర్మాలూ వేరు. ప్రవరుడు మానవుడు బ్రాహ్మణుడు తన ధర్మం ఏమిటో స్పష్టంగా చెబు తున్నాడు ఖండితంగా నిరాకరించటం తప్ప ఒప్పించడాలు అసంభవం

'విప్రవర్యులు భోగములేవేడ్క సేయ
రిడుమ లిహమునబడి కాంతు రెలమి బరమ
నందు సుఖ'' మన్న నింతి- మత్ప్రాణదాన
మిహపరోపభోగంబు లీడేర్చు నీకు 4-249

వరూధినీ విజ్ఞులైన బ్రాహ్మణులు భోగాలకు ఆశపడరు (వేడ్క చేయరు) ఇహలోకంలో కష్టాలు (ఇడుములు) అనుభవించి పరలోకంలో ఆనందంగా సుఖాలు అనుభవిస్తారు ఇహలోక భోగాలకన్నా పరలోక సౌఖ్యాలనే నావంటివారు ఆకాం క్షిస్తారు

ఈ మాటలతో వరూధిని మనస్సు గాయపడింది అయినా దానగుణమే రాణిస్తోంది నాకు ప్రాణభిక్ష పెడితే అది నీకు ఇహపరాల్లో కోరికలూ భోగాలూ తీరుస్తుంది

" నీచేత నిరాకృత నైతినేని పంచత్వంబు నొందుదు. నీవు నన్ బాపంబునంబడుదువు " అనిన నమ్మహీదేవుండు - 4-250

' ఈడేర్చు' నని సాగదీసి చెప్పతూ కాలికీ మెడకీ మెలిక వేసింది. నువ్వు తిరస్కరిస్తే నేను మరణిస్తా (పంచత్వంబు నొందుదు) ఇది ఖాయం నేను మరణిస్తే నువ్వు పాపంలో పడిపోతావు ఇదీ ఖాయమే. చూసుకో మరి అంది దానికి ఆ మహీదేవుడు (నేలమీద దేవుడు) అంటున్నాడు కదా-

పరవనితారతి కీడని
గురు లెఱిగింతు రటుగాన గోమలి! మది నా
కు రతి జనింపదు నీ దెస
నిరతము నా దెస భజింపు నీవును విరతిన్ 4-251

ప్రథమదర్శనంలోనే ఇంత గాఢంగా ప్రేమించడం నువ్వు కాదంటే మరణిస్తాననడం - ఇవ్వి వరూధిని మనస్సు ఎంతకోమలమో తెలియజేస్తున్నాయి శారీరక సౌకుమార్యం కళ్లకు కనపడుతూనే ఉంది అందుకని "కోమలీ" అని సంబోధించాడనుకోవాలి

ఓ కోమలీ. పరకాంతారతి కీడు అని పెద్దలు తెలియచెబుతున్నారు అంచేత నీ పట్ల (నీ దెస) కోరిక (రతి) కలగడం లేదు మనస్సు ఇష్టపడటం లేదు నువ్వుకూడా నా పట్ల (నాదెస) కోరిక వదులుకో.

స్పష్టంగా చెప్పేసాడు ఆవిడ ధోరణి అర్థమయ్యాక, అది పూర్తిగా తనకు వ్యతిరేకమార్గమని గ్రహించాక వరూధినిమీద ప్రవరుడికి అసహ్యం కూడా అంతరించి పోయింది ఏ భావమూ లేదు మనవి వేరు వేరు మార్గాలు విభిన్న సంస్కృతులు నీ దారి నీదీ నా దారి నాదీ- స్వస్తి ఇదే నిశ్చలత్వం, ఇదే నిర్మమత్వం ప్రవరుడిలో రూపు కట్టాయి అందుకే ఆమెతో చర్చకు దిగలేదు ఉపదేశాలు చెయ్యలేదు తన నైష్ఠికత్వాన్ని చెప్పాడు దాని మహత్తు నిదర్శనంగా చూపిస్తున్నాడు.

అని యమ్మహాభాగు డాచమన మొనర్చి
నియతుండు శుచియునై నిలిచి గార్హ
పత్యాగ్ని దనమది భావించి వందన
మొనరించి యిట్లను "ననిలమిత్ర!"
నీయంద యాహవనీయాగ్నియును దక్షి
ణాగ్నియు బ్రభవించె నఖిలదేవ
తలకును దృప్తి నీవలన సిద్ధించును
సకలలోకముల కాశ్రయము నీవ
నిత్యసత్యమూర్తి! నీ ప్రసాదంబున
నినుడు గ్రుంకకుండ నిపుడ యింటి
కరుగువాడ గాక- యాగమోదిత కర్మ
జాత నైష్ఠికుండ నైతినేని. 4-252

ఇక్కడ ప్రవరుడు "మహాభాగుడు" అన్నాడు కవి. నైష్ఠికత్వ విజయానికి

ఇది అభినందన

ఆ మహానుభావుడు ఆచమించాడు నియతుడయ్యాడు బహిరంతశ్శౌచం సాధించాడు (అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాన్ గతో పి వా యః స్మరేత్పుండరీకాక్షం స బాహ్యాభ్యంతరః శుచిః) ఏకాగ్రచిత్తంతో నిలబడ్డాడు నమస్కరించి అంటున్నాడు.

ఓ అగ్నిదేవుడా (అనిలమిత్ర)ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని నీనుంచే ప్రభవించాయి సమస్తదేవతలకూ తృప్తి నీవల్లనే లభిస్తోంది సకల లోకాల కూ నీవే ఆశ్రయం నీవు నిత్య సత్యమూర్తివి సూర్యుడు అస్తమించేలోగా నీ దయవల్ల నేను ఇప్పడే ఇంటికి వెళ్లగలుగుదునుగాక నేను ఆగమాలు చెప్పిన యజ్ఞయాగాది నిత్య నైమిత్తిక కర్మలను ఆచరించే నైష్ఠికుడనే అయితే ఇది జరుగుగాక !

అనిల మిత్ర నిత్యసత్యమూర్తి అని రెండు సంబోధనలున్నాయి. అగ్ని వాయు దేవుడికి స్నేహితుడు నిత్యం ప్రత్యక్షదైవం ఇది ఇలా ఉండగా- ఈ సందర్భంలో పెద్దనగారు స్వాహావధూవల్లభా (మను 2-75) అనే సంబోధన వేసారు స్వాహాదేవి అగ్ని భార్య అందుచేత నీకు దాంపత్య పరమార్థం పవిత్రత తెలుసు నన్ను ఈ ఇక్కట్టు నుంచి ఉద్ధరించు అనేది ప్రవరుడి అభిప్రాయమని వ్యాఖ్యాతలు వివరించారు నిత్య సత్యమూర్తి అనడంలో గార్హపత్యాగ్ని దాంపత్యపవిత్రతకు సాక్షి అనే వంగ్యస్ఫూర్తి లేకపో లేదు '' అనిల మిత్ర'' అనడంవల్ల వాయువేగంతో నన్ను మా ఇంటికి చేర్చు అన్న భావం స్ఫురిస్తుంది

పరనారీ పరధన రతి
పరత్వమెన్నడును నాకు బాటిల్లని యా
స్థిర సత్యమహిమ నతిస
త్వరితగమన సిద్ధి కలుగవలయు హుతవహా! 4-253

ఓ హుతవహుడా ?(ఆహవనీయాగ్ని -హవ్యవాహనుడు) పరుల కాంతా కనకాలను నేను ఎప్పడూ ఆశించలేదు ఆ స్థిరమైన నా నైతిక శక్తి నాకిప్పడు అతి వేగగమనాన్ని సిద్ధింపజేయాలి

నైతిక ప్రవర్తనవల్ల ఆత్మవిశ్వాసం లభిస్తుంది ఆత్మవిశ్వాసానికి అసాధ్యమేదీ లేదు

అని యభ్యర్థించిన నగ్నిదేవుం డవ్విప్రుని శరీరంబునందు సన్నిహితుండ య్యె నతండును ప్రభామండలమధ్యగతుండై మూర్తిమంతుండైన హుతవహుండునుంబోలె దత్ప్రదేశంబు వెలిగించుచు నద్దివ్యాంగన యంతరంగంబున నంతకంత కనురాగం బతిశయిల్ల శోభిల్ల నగ్నిప్రసాదం బున నెప్పటి యట్ల శీఘ్రగమనంబువడసి నిజగృహంబున కరిగి నిత్యక్రియా కలాపంబులు నిర్వర్తించె నని మార్కండేయుండు క్రోష్టుకికిం జెప్పిన విధం బునం జెప్పి- 4-254

అగ్నిదేవుడు ప్రవరుని శరీరంలో సన్నిహితుడయ్యాడు. అప్పడు ఒక దివ్య

తేజోమండలంగా ప్రవరుడు కనిపించాడు అతని శరీరం చుట్టూ తేజోమండలం ఒకటి అల్లుకుంది రూపు ధరించిన ఆహవనీయాగ్నిలాగా (హుతవహుడు) ఉన్నాడు ఇంత కాలం క్రమం తప్పకుండా నిష్ఠగా చేసిన అగ్నికార్యాలవల్ల ఇప్పుడు ఈ మహత్తు సిద్ధించింది చుట్టుప్రక్కల ప్రదేశ మంతా కాంతిమంతమయ్యింది

ఇది చూస్తోంటే ఆ దివ్యాంగన-వరూధినికి మనస్సులో ఇంకా ఇంకా ప్రవరుడిపట్ల అనురాగం పెరిగిపోతోంది దివ్యశక్తికి ఆకర్షితురాలవుతోంది

అగ్నిదేవుడి అనుగ్రహంవల్ల (ప్రసాదంబున) శీఘ్రగమనం లభించింది పాదలేపనంవల్ల వచ్చేటప్పుడు ఎంతవేగంగా వచ్చాడో ఇపుడు అంతే వేగంతో (ఎప్పటి యట్ల) వెళ్ళిపోయాడు తన ఇల్లు (నిజగృహము) చేరుకున్నాడు

చేరుకున్నది ఎందుకోసం ? సోమిదమ్మగారిని చూడటంకోసం కాదు అంతరాయం కలగకుండా అగ్నికార్యం నిర్వర్తించడానికి అందుకని వెంటనే నిత్య క్రియా కలాపంబులు నిర్వర్తించె

ఇలా ఈ ఘట్టాన్ని మార్కండేయుడు క్రోష్టుకికి వివరించి చెప్పాడు దాన్ని జ్ఞానపక్షులు జైమినికి చెప్పారు దాన్ని మారన్న నాగయగన్నడికి చెప్పాడు ఇది శ్రోత్ర పరంపర ఇక్కడికి చతుర్థాశ్వాసం పూర్తి అయ్యింది

సరే-ప్రవరుడు ఇంటికి వెళ్ళిపోయాడు తరవాత వరూధిని సంగతి ఏమిటి? ఆవిడ ఏమయ్యింది? ఇవీ సహజంగా కలిగే ప్రశ్నలు. క్రోష్టుకి అదే అడుగు తున్నాడు

పరమజ్ఞానచక్షులైన పక్షులా జైమిని కిట్లనిరి-వరూధిని యటమీద నెట్లు వర్తించెనని క్రోష్టుకి యడిగిన మార్కండేయుండు ౫-౨

ఆ కమలాక్షి చిత్తమున నా ద్విజరాజకుమారు చారు ది
వ్యాకృతి నిల్చి, ప్రీతి వగ లంతకు నంతకు నగ్గలించ చీ
కాకు వడంగ జేయ గుసుమాయుధు నేటుల కంత యోర్వగా
లేక నితాంతవేదన జలించుచు నెంతయు వెచ్చ నూర్చుచున్ ౫-౩

ఆ పద్మదళాయతాక్షి హృదయంలో ప్రవరుడి రూపం ముద్రపడి నిల్చిపోయింది ప్రథమ దర్శనంలో అతడిది చారు (అందమైన) ఆకృతి చిట్టచివరికి దివ్యతేజోమండలంగా మారింది అది హవ్యవాహన తేజస్సు దేవతలకు పరిచితమైన తేజస్సు అగ్నిముఖావై దేవా: అని సూక్తి యాగాగ్ని కుండంలో వేల్చే హవ్యాలను అగ్నిదేవుడు శ్రద్ధగా తీసుకువెళ్ళి ఆయా దేవతలకు అందిస్తాడని ప్రతీతి. ఆ తేజస్సు ఈ దేవకాంతకు పరిచితమే. ఆ దివ్యాకృతి మనస్సులో ముద్రపడింది

కవి ఇక్కడ ప్రవరుణ్ణి ద్విజరాజకుమారుడు అన్నాడు ''రాజకుమార'' అనే పదబంధాన్ని జోడించడంద్వారా శ్రేష్ఠతార్థం మాత్రమే కాక ఒక ఠీవి ఒక ఉదాత్తత స్ఫురిస్తున్నాయి ఆ ఉదాత్తత శీలసంపద వల్లా నిష్ఠా గరిష్ఠతవల్లా లభించాయి.

ఆవిడ ''కమలాక్షి'' కనుక ఇంతటి దివ్యరూపసౌందర్యాన్ని ఆకళించు

కౌగలిగింది మనస్సులో ముద్రించుకోగలిగింది

ప్రవరుడి పట్ల ప్రీతి, అతడు లభింపక పోవడంవల్ల వగ- ఇవి రెండూ అంతకంతకు అధికమై (అగ్గలించి) ఆమెను మరీ చికాకు పెట్టేసాయి దానితో మన్మథుడు (కుసుమాయుధుడు) విజృంభించాడు అతడి పూలబాణాల దెబ్బలకు ఇంక ఓర్చుకోలేకపోయింది ఆవేదనతో- తాపాతిశయంతో చలించిపోయింది మాటి మాటికీ వేడిగా నిట్టూరుస్తోంది

గిరి కందరములు గలయం
దిరుగుచు, దుఃఖాంబురాశి దేలుచు, విప్రుం
దరిగిన వలనికి జూడ్కులు
పార నిగిడించుచును పువ్వుబోడి యలంతన్ 5-4

అలాగే పర్వత గుహలలో (కందరములు) పిచ్చెత్తినట్టు కలయ దిరుగుతోంది దుఃఖసముద్రంలో (అంబురాశిన్) ఈదులాడుతోంది మునుగుతోంది తేలుతోంది ఒక నిముషం పట్టరాని దుఃఖం మరునిమిషం తేరుకోవడం ఇదీ ఈమె పరిస్థితి, చూపులుమాత్రం ప్రవరుడు వెళ్ళిన వైపే సాగుతున్నాయి నిశ్చలంగా (పారన్) అటే చూస్తోంది ఆ చూపుల్లో దుఃఖం బాధ అన్నీ ఉన్నాయి

ఆమె అసలే సుమకోమలాంగి (పువ్వు బోడి) ఈ దుఃఖాన్ని తట్టుకోగలదా!

అకట! మంద భాగ్యనైతి, నా కెమ్మెయి
గలుగు నక్కుమారు గలయు పుణ్య?
మేమి సేయుదాన? నీ కామతాప మే
నెట్లు నిస్తరింతు? నెందు జొత్తు? 5-5

అయ్యో ఎంత దురదృష్టవంతురాలిని ఆ ప్రవరుణ్ణి పొందే పుణ్యం నాకు ఎలా (ఎమ్మెయిన్) లభిస్తుంది. ఈ మన్మథతాపాన్ని ఎలా ఓర్చుకోగలను ఎలా గట్టెక్కగలను? (నిస్తరింతు) ఏది దారి? ఎందులో పడాలి? ఎక్కడికి పోవాలి? ఇలా వరూథిని మనస్సు పరిపరివిధాల ఆలోచనలతో చలించిపోయింది

అనుచు మదన వేదనా భరంబున దురపిల్లుచు నమ్మదిరాక్షి యద్దిన శేషంబును రాత్రియుం గడపి మఱునా డక్కుమారుం డెప్పటియట్ల యరుగుదెంచునో యను కుతూహలంబునం దుహిన గిరి కందరోద్యానంబునందు 5-6

తీవ్రమైన మన్మథతాపంతో దురపిల్లుతోంది వేదనపడుతోంది ఇప్పుడు ఆవిడ మదిరాక్షి (మదిర=కాటుకపిట్ట) తాపాతిశయంవల్లా దుఃఖాతిశయంవల్లా కమిలిపోయి కన్నులకి అప్పుడే కాళిమ (నల్లదనం) వచ్చింది ఆ పగటిపూట ఎలాగో గడిపింది రాత్రికూడా అలాగే నిద్రలేకుండా దీర్ఘంగా గడిపింది మర్నాడు మళ్ళీ అదే సమయం.

ప్రవరుడు నిన్నటిలాగే ఇదే సమయానికి వస్తాడేమో అనుకుంది అదే

ప్రదేశానికి రావచ్చునని ఆశపడింది అదే ఉద్యానవనంలో అదే చోటుకి చేరుకుంది

సమయమూ ప్రదేశమూ జ్ఞాపకాలను గిలకొట్టి మరీ బాధపెడ తాయి. కాలం గడిచిన కొద్దీ సమయం మరుగున పడినా ప్రదేశం ఏడిపిస్తుంది.

ఆ ఉద్యానవనంలో అన్నీ అందాలే ఎటుచూసినా మనస్సును ఊరించే దృశ్యాలే అంతటా ప్రణయమాధుర్యాన్ని అనుభవిస్తూ మైమరచిన జంటలే ఒంటరిగా ఉన్నవాళ్లని మరీ హింసిస్తోంది ఆ ఉద్యానవనం సకల ప్రాణులకూ అదొక భోగభూమి

విరుల గుత్తుల మీద గురువులు వాలుచు
ముద్దిచ్చు తేటుల మొరపములకు
చిగురు జొంపములలో జిబ్బుముబ్బాడుచు
గెరలు కోయిలల సుస్వరములకును
నెలమావి లతలపై గలగొన దారుచు
తెలగు చిల్కల - కల్కి పలుకులకును
నలరుల నెత్తావి నెలమిగా జిలుకుచు
సుడియు మందానిలు సొంపునకును·
గళవళించుచు, గెందమ్మి కొలకులందు
కేళ యొనరించు జక్కవ మేలి లీల
గోర్కు లంతంతకును నెడ గొనలు నిగుడ
మదన మార్గణ విదళిత హృదయ యగుచు 5-7

పూలగుత్తల మీద వాలుతూ వేగంగా ఎగురుతూ మళ్లీవాలుతూ ముద్దు లొలుకుతూ పరస్పరం ముద్దాడుకుంటున్న తుమ్మెదల ఝుంకారాలు ఒకవైపు

చిగురాకుల గుబురులలో పెనగులాడుతూ (చిబ్బుముబ్బాడుచు) గొంతు సవరించుకుంటున్న (కెరలు=కూయు అతిశయించు) కోయిలల గురగురలు ఒకవైపు

గున్నమామిడి కొమ్మలమీగ(మామిడి మొక్కని మావి లత అనడం కవులకు పరిపాటి) చిలక జంటలు అవి-ఏదో తెలియని గుబులా వరించి ఒకదానిని ఒకటి పొదువుకుంటున్నాయి ఇంకా ఇంకా దగ్గరికి చేరుకుంటున్నాయి (తారుచున్) కలికి పలుకులు అవ్యక్తమధురంగా పలుకుతు న్నాయి బహుశ రతిపారవశ్యంలో మణిత ధ్వనులు చేస్తున్నాయి కాబోలు ఆ దృశ్యాలు మరొక వైపు

మొత్తం ఉద్యానవనంలో ఉన్న పువ్వుల పరిమళాలను కొల్లగొట్టి ఆనందంగా పంచిపెడుతూ (ఎలమిన్ చిలుకుచు) అంతటా వ్యాపింపజేస్తూ చుట్టుముడుతున్న మందానిలం(మెల్లగా వీచే గాలి)సొంపు మరొకటి

ఎర్రని పద్మాలు (కెంపు తమ్మి) వికసించిన కొలనుల్లో, కళవళ పడుతూ చక్రవాకదంపతులు (జక్కవలు) కేళిసల్పుతున్నాయి (అదొక బంధ విశేషం) ఆ మనోహర క్రీడా విలాసాన్ని (మేలైన లీలన్) చూడటంతో వరూధిని మనస్సులో

(ఎదన్) కోరికలు అంతకంతకూ కొనసాగాయి (నిగుడన్) మదనతాపం మరీ విజృంభించింది మన్మథ బాణాలతో (మార్గణములు) ఆమె హృదయం విదళిత మయ్యింది. తూట్లు పడింది

ఒక్క రసన తప్ప సర్వేంద్రియ తర్పకమైన ఉద్యానశోభ (ఉద్దీపన విభావం) వరూధినిలో విరహతాపాన్ని ప్రజ్వలింపజేసింది పరువాలు పరవళ్లు తొక్కే వయస్సులో ఈ అందాల కోనలో అచ్చంగా అప్సరసకు ఒంటరితనం, తన మీద తనకు జాలివేసింది.

అడవి గాసిన వెన్నెల యయ్యె నాదు
జవ్వనం బక్కుమారుతో సరసలీల
భావజోపభోగంబుల బడయనైతి
నీ నితాంత తాపంబు నన్నేల సైచు 5-8

అయ్యో నా యౌవనమంతా అడవిలో కాసిన వెన్నెల అయి పోయింది. (ఇప్పుడు నిజంగా అడవిలోనే ఉంది) ఆ వయసుకానితో సరసంగా మన్మథకేళీ సౌఖ్యాలు (భావజ+ ఉపభోగాలు) అనుభవించలేక పోయాను ఆ సుఖాలు పొందలేక పోయాను ఈ దారుణమైన తాపం ఇంక నన్నెందుకు సహిస్తుంది సై పదు-చంపేస్తుంది

అసలు ఆ అబ్బాయి అంత వేడుకపడి (వేడ్కన్ ఊని) ఎక్కడి నుంచి వచ్చాడు ఈ హిమాలయాలకి ? ఏరి కోరి ఇక్కడికే రావాలా ?

ఎక్కడ నుండి వచ్చె నతడీ తుహినాద్రికి వేడ్కనూని ? యే
నక్కట! యక్కుమారు రుచిరాకృతి యేటికి నేల చూచితిన్?
మక్కువ యేల నాటె మది ? మన్మథుడేల సహించు నన్ను! వా
డెక్కడ వచ్చునింక ? నది యేల ఫలించు ? దురాశ యేటికిన్ 5-9

వచ్చాడే అనుకో- అతడి రుచిరాకృతిని (అందమైన రూపాన్ని) హఠాత్తుగా నేనెందుకు చూసాను ?

చూసానే అనుకో - మనస్సులో అతడి మీద మక్కువ ఎందుకు కలిగింది ?

మక్కువ నాటుకున్నాక మరి మన్మథుడు నన్ను హింసించక సహించి ఊరుకుంటాడా . ఊరుకోడు

పోనీ అంటే - అతడు వస్తాడా ? రాడు అది ఫలించే పనికాదు. ఎందుకొచ్చిన దురాశ !!

"అది" అనడంలో చాలా సొగసు ఉంది అతడి రాక అని మాత్రమే కాక కలయిక అనికూడా .

వ. అని వితర్కించుచుం జేడియ విరహాతురయై తిరుగుచుండం దొల్లి యక్కామినిం గామించి దానిచేత నిరాకృతుండైనవాడు కలియను నొక్క గంధర్వుండయ్యవస్థనున్న యా యంగన గనుంగొని దివ్యజ్ఞానంబున దద్వృత్తాంతంబంతయు నెఱింగి పొంగి- 5-10

బేతవోలు

ఇలా రకరకాల ఆలోచనలతో వరూధిని ఆందోళనపడుతోంది. విరహార్తయై ఆతురతతో ఉద్యానవనంలో సంచరిస్తోంది

కాంతిమంతురాలైన (కామిని) ఈ వరూధినిని ఒకప్పుడు ఒక గంధర్వుడు కామించాడు అతడి పేరే కలి అప్పుడు అతడిని ఈమె తిరస్కరించింది

ఇప్పుడు విరహావస్థలో ఉన్న వరూధినిని చూసాడు దివ్యదృష్టితో కథ అంతా గ్రహించాడు వాతావరణం అనుకూలించిందని పొంగి పోయాడు

తను నే గోరిన నొల్లక
మనసిజ శరనికర దళిత మానసు జేసె
న్ననుఁ, విప్రుఁగూర్చి కమలా
నన యక్కట! యిట్లు నేడు నా వలె నుండెన్ ౮- ౧

అప్పుడు నేను కోరితే తిరస్కరించింది నా మనస్సుని మన్మధుడి బాణాలకు గురిచేసింది (కచ్చితంగా చెప్పాలంటే మనసిజ= మన్మధుని యొక్క, శరనికర = బాణ సమూహముచేత దళిత=గాయపరచబడిన, మానసున్=మనస్సు కలవానినిగా ననున్= నన్ను, చేసెన్=చేసెను) ఇప్పుడు విప్రుడికోసమని ఆహా! ఈ పద్మముఖి ఇలా నాలాగా అయ్యింది విరహం అనుభవిస్తోంది

అమ్మహీసురు రూప మొప్పార దాల్చి
యిమ్మృగాక్షితో భోగింతు నింపెలర్ప
నని మనంబున గంధర్వుడలరి విప్ర
మూర్తి యై తోని యబ్జాల మ్రోల లీల ౮-౧౨

వరూధిని ఇప్పుడు ప్రవరుణ్ణి గాఢంగా కోరుకుంటోంది కనక, విరహాగ్నిలో మగ్గిపోతోంది కనక నేను ప్రవరుడి రూపం ధరించి ఈమెతో భోగిస్తాను తేడా లేకుండా (ఒప్పారన్) ప్రవరుడి రూపం ధరిస్తాను ఇంపు అతిశయించేట్టు భోగిస్తాను. ప్రవరుడే అనుకుంటుంది కాబట్టి వరూధినికి ఇంపు కలుగుతుంది తనకు సరేసరి

ఆ గంధర్వుడు కలి ఇలా నిర్ణయించుకున్నాడు. సంబరపడ్డాడు ప్రవరుడిగా మారిపోయాడు. విలాసంగా (లీలన్) నడుచుకుంటూ వెళ్ళి ఆ యువతిముందు నడయాడాడు.

లీల అనేదానికి అలంకారశాస్త్రంలో ఒక ప్రత్యేకత ఉంది ప్రియానుకరణం లీలా ప్రియుడి రూపాన్నీ వేషభాషల్నీ చేష్టల్నీ అనుకరించి ప్రియురాలు తన చెలికత్తెల ముందు ప్రదర్శించడాన్ని లీల అంటారు. ప్రియుడు ప్రియురాల్ని అనుకరించినా లీల కావచ్చు ఇదొక శృంగార చేష్ట ఇప్పుడు గంధర్వుడు వరూధినీప్రియుడి వేషం అనుకరించాడు అదే ఇక్కడి విశేషం ఇది కొత్త తరహా లీల అలా రూపం మార్చుకుని-

మెలగుచునున్నవాని గని మెల్లుక యొప్పటి భూసురుండకా
దలచి విలోచన ద్యుతి వితాన విరాజిత వక్త్ర పద్మయై
అలి గడు డాసి "యేమిటి ? తలంచెద విప్పుడు నంగణాగ్ని నే
నిలిగిన నిన్ను గప్పుడవరే నరు ? లక్కట పాప మెందుడే ? ౮-౧౩

మాయా ప్రవరుడు తక్కుతూ తారుతూ ఆమె ముందు మెలగుతున్నాడు చూసింది నిజంగా నిన్నటి విప్రుడే-ప్రవరుడే అని (అకాన్=అని) అనుకొంది. ఆనందంతో కన్నులు వికసించాయి సంతోషం సంతృప్తి దుఃఖం అసంతృప్తి- సర్వభావాలకూ అభివ్యక్తిస్థానం కన్నులు అవి వికసించాయి కాంతులు విరజిమ్మాయి ఆ కాంతి సమూహంతో (ద్యుతి వితాన ము) ముఖపద్మం వికసించింది మొత్తం ముఖమంతా ఆనందంతో కళకళాడిపోతోంది.

క్రమక్రమంగా (లలిన్) బాగా దగ్గరకు వెళ్ళింది (కడున్ డాసి) తన అదృష్టాన్ని తానే నమ్మలేక పోతున్నట్టు కలా ? నిజమా ? అన్నట్టు నెమ్మదిగా వెళ్ళింది అనడాన్ని సూచిస్తోంది 'లలిన్' అనే మట వెళ్ళి-

ఇలా (ఇమ్మెయిన్) నన్నెందుకు బాధపెడుతున్నావ్ (కలం చెదవు) తాళలేక మన్మధాగ్నిలో (అంగజాగ్నిన్) నేను చనిపోతే (నీలుగు=ఈలుగు=ఇలుగు= చచ్చు) లోకులు నిన్ను కష్టుడు=కలినాత్ముడు అనరా నిందించరా నా ఉసురు ఆ పాపం నీకు తగలదా ?

నిను నిత్యకర్మలోపం
బునకంటె గుమారి! యఘము పొందుంజుమ్మీ
మనసిజు బారికి నను ద్రో
సిన-మత్త్రాణైక ధర్మశీలివి గమ్మీ ! 5- 4

అన్నింటికంటే నాకు నిత్యకర్మానుష్ఠానమే ముఖ్యం అని చెప్పి కదా నిన్న వెళ్ళి పోయాడు. ఆ ముక్క అందిపుచ్చుకొని మాట్లాడుతోంది

వయసుకాడా ! మన్మధుడి బారికి నన్ను నెట్టేసి- ఎర చేసేస్తే నిత్యకర్మ లోపంవల్ల కలిగేదానికంటే ఎక్కువ మహాపాపం నిన్ను చుట్టుకుంటుంది సుమా (పొందున్ జుమ్మీ) అందుకని నన్ను కాపాటడం ఒక్కటే నీకు ఏకైక దర్మం దయచేసి ఆ ధర్మం చేపట్టు (మత్+ త్రాణ+ ఏక ధర్మ శీలివి + అగుమీ)

వ. **అనిన నవ్విప్రరూప గంధర్వుండు** 5-15

వరూధిని ఇలా ప్రాధేయపడేసరికి ఆ ప్రవరుడి రూపంలో ఉన్న గంధర్వుడు లోపల సంతోషిస్తూ పైకి అమాయికంగా అంటున్నాడు

ఏమి సేయుదు దరళాక్షి ! యేను జెపుమ !
నీవు నిట్లని పలికెదు, నిత్యకర్మ
హాని నాకు బాటిల్లదే ? య్యైన నొకటి
నీకు జెప్పెద నేర్పడ నెమ్మి వినుము 5-16

ఆనందాతిశయంవల్ల వరూధిని కన్నుల్లో ఒక తారళ్యం మెరుస్తోంది అది గమనించి 'తరలాక్షీ' అని సంబోధించాడు.

నన్నుమాత్రం ఏం చెయ్యమంటావు చెప్పు అన్నీ తెలిసి నువ్వు కూడా (నీవును) ఇలా మాట్లాడితే ఎలా ! కర్మానుష్ఠానానికి హాని కలగదా ! అయినా సరే ఒకటి చెబుతాను జాగ్రత్తగా విను.

ఏనునన్-నీవునన్ అని సముచ్చయార్థకాలను(న్) కలపడంలో ఉంది సాగ సంతా వాక్యం ఎత్తుగడలో సంబోధనలో చనవు. నీకోసం నిన్ను బ్రతికించడంకోసం నా విలువైన అనుష్ఠానాన్ని త్యాగం చేస్తున్నాను సుమా అన్న ధోరణి. కాబట్టి ఇతడు చెప్పేదానికి వరూధిని ఒడబడక తప్పదు

వ. సంభోగ సమయంబున నిమీలితాక్షివై నన్నుం జూడకయుండ వలయు నట్లయిన నీకు నాకును సంగమంబగు, నట్లు గాకున్న గాదనిన వరూధిని దాని కొడంబడియె నంత- 5-17

అమ్మాయీ సంభోగ సమయంలో నువ్వు కళ్లు మూసుకోవాలి నన్ను చూడకూడదు ఈ నియమానికి ఒప్పుకుంటే నీకూ నాకూ సంగమం కుదురుతుంది ఒప్పుకోకపోతే కుదరదు. అంతే.

ఇంత ఖరారాముడిగా వాడు చెప్పినా వరూధిని ఒప్పుకుంది అవును- అవసరం తనది తాను ప్రాధేయపడితే అతడు అనుగ్రహిస్తున్నాడు. అతడిదే పై చేయి అదీగాక పారవశ్యంలో కన్నులు మూతలు పడనే పడతాయి

రతి-మృతి సమయాల్లో మాయారూపాలు బైటపడిపోతాయట అప్పడు అల్లరి చేస్తుందేమో అని గంధర్వుడు ఆ నియమం పెట్టాడు నిజానికి అదే వరూధినికి ఉపకరించింది ఆమె హృదయంలో సర్వాత్మనా ప్రవరుడే , అతని తేజస్సే నిలిచింది.

ఆ గంధర్వుడు నప్పరోంగనయు నత్యాసక్తిమై గూడి హై
మాగస్ఫార దరీ గుహాంతర లతాంతాగార భాస్వత్త టీ
భాగీరథ్యురు సైకతస్థల జలప్రాంత ప్రదేశంబులన్
భోగింపంగ దొడంగి రంగజ సుఖాంభోరాశి నిర్మగ్నులై 5-18

గంధర్వుడికి వరూధిని మీద సహజమైన ఆసక్తి. వరూధినికి అతడు ప్రవరుడనే భ్రాంతితో ఆసక్తి పెరసి పరస్పరాసక్తి హిమాలయాల (హైమ+అగ) పెద్ద పెద్ద (స్ఫార) లోయలూ(దరీ) గుహాంతర్భాగాలూ పూల పొదరిళ్లతో ప్రకాశించే సానువులూ (భాస్వత్తటీ-ప్రదేశంబులన్), విశాలమైన గంగానది ఇసుకతిన్నెలూ (సైకతస్థలాలూ), జలపాతాలూ (సరస్సులు) ఈ యీ ప్రదేశాలలో భోగించడం మొదలుపెట్టారు (తొడం గిరి). మన్మథసుఖాలు అనే సముద్రంలో ఇద్దరూ పూర్తిగా మునిగిపోయారు

పద్యరచనా శైలిలో హఠాత్తుగా మార్పు వచ్చింది శార్దూలం సమాస బంధురంగా సాగింది ప్రకరణంలో వచ్చిన మార్పుని రచనలో సూచిస్తున్నాడు కవి. ఆసక్తి సాంద్రతకీ కేళీకలాప దీర్ఘతకీ, ప్రౌఢతకీ నిరం తరతకీ ఈ గాఢబంధం ఒక సంకేతం దీర్ఘసమాస రచనను ఓజోగుణం అంటారు ఇది వీర రౌద్రాలకు వ్యంజకం నిజానికి శృంగారం సుకుమార రసం. అందునా విప్రలంభ శృంగారం (వియోగ శృంగారం) మరీ సుకుమారం. అందుకే వరూధిని విరహవర్ణనలో అలతి అలతి పదాల అచ్చిక బహుళరచన (3 నుంచి 7)సాగింది. దీన్ని మాధుర్యగుణం అంటారు

ఇంతగాకాకపోయినా సంభోగశృంగారఘట్టంలోకూడా రచన సుకుమారంగానే సాగాలి కానీ పై పద్యాన్ని కవి దీర్ఘసమాసాలతో రేఫాది సంయుక్తాలతో నడిపించాడు. ఒక్కొక్కసారి సంభోగశృంగారం వీరస్థాయి లో నడుస్తుందిష నాయికానాయకుల సంస్కారాన్నిబట్టి ఇది ఉంటుంది ఇక్కడ వరూథినీగంధర్వులిద్దరూ కేవల భోగపరాయణులు విరహాతు రులు మానసికంగా ఉద్ధతులు

కాదంటున్నా ప్రవరుణ్ణిపైబడి కౌగిలించుకునేటంత ఉద్ధతురాలు వరూథిని ప్రవరరూపం ధరించి అన్యాసక్తను కికురించేటంత ఉద్ధతుడు గంధర్వుడు అందుచేత వీరి సంగతి వీరరసానుకారి అయ్యుంటుందని సూచించడానికి ఓజోగుణభూయిష్ఠ రచన చేపట్టి ఉంటాడు కవి.

వ. ఇట్లయ్యిరువురు మనోహరంబులగు మనోభవసుఖంబు లనుభవించుచుండ 5-19।

సురత సమయమున నా సుం
దరి నయనాబ్జములు మోడ్చి దహనశిఖా వి
స్ఫురిత శరీరుండగు నా
ధరణి సురకుమారు నాత్మ దలచెను నెమ్మిన్ 5-20

వరూథినీగంధర్వులిద్దరూ పరస్పరం మనస్సులు హరించే (మనో హరంబులు) మనోభవ సుఖాలను (మన్మథకేళి సౌఖ్యాలను) అనుభవిస్తున్నారు. అనురక్తులకి దర్శన స్పర్శన సంభాషణాదులన్నీ మనోభవ సుఖాలే. వాటిలో సంభోగం (సురతం) ఒకటి ఆ సమయంలో మాత్రం ఆ సుందరి నియమం ప్రకారం తన పద్మాల్లాంటి నేత్రాలను (నయనాబ్జ ములు) మొగిడ్చి ఆత్మలో ఆ విప్రుణ్ణి - అగ్నిశిఖలాగా ప్రకాశిస్తున్నశరీరంగల ఆ ప్రవరుణ్ని ఆ తేజోమూర్తిని- ప్రేమతో(నెమ్మిన్) తలుచుకుంటోంది.

వ. కాలక్రమంబున నబ్బాలికారత్నంబు గర్భిణియైన దానిం బ్రియవచనంబుల నూఱడించి యాపె యనుప విప్రరూప గంధర్వుండు నిజేచ్ఛనరిగెనంత 5-21।

"బాలికారత్నం' అన్నాడు కవి నిజమే వరూథిని తప్పలేదు సౌందర్యానికి సమ్మోహితురాలై ప్రకృతి సహజంగా తాను వలచింది వలచానని చెప్పింది ప్రవరుడే అనుకొని అదే ధ్యాసతో విశ్వాసంతో క్రీడించింది తన జాతికి ఇది సాధారణం. అందుకని బాలికా రత్నము అన్నాడు

పైగా గంధర్వుడి ప్రియవచనాలను నమ్మింది అనుష్ఠానాలకు ఇంకా ఎంతకాలం దూరమవ్వమంటావనో, మళ్లీ రానా అనో ఎవో ఇచ్చకాలు చెప్పి ఉంటాడు. పిచ్చితల్లి నమ్మేసింది తనంతతానే పంపింది వాడు తుర్రుమన్నాడు

నెలలు నిండి వరూథిని ప్రసవించింది పండంటి మగ పిల్లాడు పుట్టాడు.

స్వరుచిసముద్గమస్ఫురణ సర్వదిగంతరముల్ వెలుంగ భా
సురతరమూర్తి యై వెలయు సూర్యుని మాడ్కి సుతుండు ప్రీతిన

చేతవోలు

త్తరుణికి నుద్భవించి సముదాత్త తనుద్యుతిజాలసంపద
న్సురుచిరుడై స్వరోచి యను సుందరనామము దాల్చి యెంతయున్

కాంతులు బయల్వెడలి అన్ని దిక్కులా నడిమిభాగాన్ని కాంతి మంతం చేస్తుండగా భాసురరతరమూర్తియై ప్రకాశించే సూర్యుడిలా ఉన్నాడు ఆ పుట్టిన బిడ్డడు వరూధిని ప్రీతి చెందింది ఆ శిశువు ఉదాత్త శరీరకాంతి సంపదతో రుచిరుడుగా ఉన్నాడు కాబట్టి స్వరోచి అని సార్థక నామధేయం ఏర్పడింది

తేజస్వంతమైన ప్రవరుడి మూర్తిని ధ్యానించినందువల్ల ఇంత కాంతిమంతుడు జన్మించాడు విరహంతో ఉన్నప్పుడుకూడా ఆమె 'అక్కుమారు రుచిరాకృతినే'' ౩-౨ తలచుకుంది దాన్ని గుర్తుచేస్తూ ''సురుచిరుడై'' అనే మాటను కవి ఇక్కడ పొందుపరిచాడు

కళ లభివృద్ధి బొందు శశికైవడి దద్దయు సద్గుణంబుల
న్వెలుగుచు నాడు నాటి కభివృద్ధి వహించి మనోజ్ఞ యౌవనో
జ్జ్వలుడును, నస్త్రవిద్యను విశారదుడున్, బలభాసితుండు నై
పొలుపుగ మందరాద్రి తటభూముల నాతడు కేళ సల్పుచున్ ౫-౨౩

స్వరోచి దినదిన ప్రవర్థమానుడవుతున్నాడు రోజుకి ఒక కళ చొప్పన అభివృద్ధి చెందే చంద్రుడిలా ఆ బాలుడు సద్గుణాలతో ఎదుగుతున్నాడు. యౌవనం వచ్చింది మరింత మనోజ్ఞంగా భాసిస్తున్నాడు అస్త్రవిద్యలో విశారదుడయ్యాడు బలసంపన్నుడయ్యాడు మందర పర్వత సానువుల్లో క్రీడలు సల్పుతున్నాడు ఇవి యుద్ధ విద్యాభ్యాస క్రీడలు

స్వరోచిని మొదటి పద్యంలో సూర్యుడిగా ఈ పద్యంలో చంద్రుడిగా పోల్చాడు ఒకటి ప్రవరుడి అంశ. మరొకటి వరూధిని అంశ. అప్సరసగా ఆమె చంద్రాంశ సంభూత రెండూ కలసి స్వరోచికి ఉజ్జ్వలత్వం మనోజ్ఞ త్వం జన్మత: లభించాయి

వరూధిని గర్భిణి అవ్వడంనుంచి స్వరోచి యౌవనుడవ్వడం వర కూ ఒక వచనం రెండు పద్యాల్లో కథ పరుగు తీసింది ఇది పురాణకవి ధోరణి గర్భిణీ లక్షణాలు చిట్టుములు, ప్రసవవేదన బాల్యక్రీడలు- ఇత్యా దులను విస్తరించి స్తిమితంగా వర్ణించడం ప్రబంధ కవి ధోరణి- ఆ అందచందాలు పెద్దనగారి మనుచరిత్రలో దర్శనీయాలు మనుసంభవానికి స్వరోచి అవసరం. స్వరోచికి విప్రగంధర్వతేజస్సులు అవసరం ఇంత వరకే మారన ప్రమేయం.

సంస్కృత మార్కండేయ మహాపురాణంలో ఈ కథ, ఈ ఘట్టం ఇలాగే ఉన్నాయి తేడా ఏమీ లేదు యాభై ఎనిమిదో అధ్యాయంలో వరుణాతట అరుణాస్పద ప్రవర నిర్దేశంతో ఇది మొదలయ్యింది

కశ్చిద్ద్విజాతి: ప్రవర : పురేఽభూదరుణాస్పదే
వరుణాయాస్తటే విప్రో రూపేణాత్యశ్వినావపి ౫౮-౫

ప్రవరుడి స్వభావంగురించి చెబుతూ-అతడు మృదు స్వభావ: సద్వృత్త: వేదవేదాం

గహారగః సదాతిథిప్రియః రాత్రావాగ తానాం సమాశ్రయః అన్నాడు అతిధులు రాత్రిపూట వచ్చినా ఇతడే దిక్కు. అన్నివేళలా ఇతడు అతిథి ప్రియుడు

వండ నలయదు వేవురు వచ్చిరేని
నన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి
యతిథు లేతేర నడికిరే య్యైన బెట్టు
వలయు భోజ్యంబు లింట నవ్వారిగాగ (మను 1-56)

పెద్దనగారి ఈ పద్యంలో ముఖ్యంగా "అతిధు లేతేర నడికి రేయ్యైన బెట్టు" అనే పాదానికి పై "రాత్రావాగతానాం సమాశ్రయః" అన్నదే ప్రేరణ

ప్రవరుడికి వివాహమయ్యిందనీ ఒక సోమిదమ్మ ఉందనీ వ్యాసుడుగానీ, మారనగానీ వాచ్యం చేయలేదు గార్హపత్యాగ్నిని అర్చించాడు అని చెప్పడంలో అతడు గృహస్థు అనే సూచన ఉంది దాన్ని పెద్దన్నగారు విపులీకరించి పరిపూర్ణత చేకూర్చారు

ప్రవరుణ్ణి చూసిన వరూధిని " ఇతడు నాకోర్కె తిరస్కరించి అవమానించక పోతే చాలు నా జన్మ సఫలమయినట్టే" అనుకుంటుంది "సఫలం మే భవేజ్జన్మ యది మాం నావమన్యతే"(58-37) ఇదే భావాన్ని మారన పెద్దనలు విపులీకరించి చెప్పి. నా "యది మాం నావమ న్యతే" అనుకోవడంలో ఒక మెరవడి ఉంది ప్రవరుడి తేజస్సును చూస్తే అతడు ఇలాంటి కోరికలు అంగీకరిస్తాడు అనే నమ్మకం వరూధినికి కలుగలేదు ఈ సూచన ఈ వాక్యంలో ఉంది

" ఇతడి పట్ల నేను అనురక్తురాలినయినట్టే ఇతడూ నా పట్ల అనురక్తుడయితే నా పూర్వజన్మ పుణ్యాలు పండినట్టే" అని వరూధిని భావించిందన్నాడు మారన. దీనికి మూల శ్లోకం ఇది

యథాహమస్మిన్ మయ్యేవ సానురాగ స్తథా యది
భవేదత్ర మయా కార్యస్తత్కృతః పుణ్యసంచయః (58-40)

అల్లాగే " ఇతడు ప్రేమగా సుస్నిగ్ధంగా ఒక చూపు నా పైకి విసిరితే చాలు ముల్లోకాలలోనూ నాకంటే అదృష్టవంతురాలూ పుణ్యాత్మురాలూ ఎవతె ఉంటుంది " అనికూడా మారనగారి వరూధిని భావించింది సంస్కృత వరూధినీ ఇలాగే అనుకుంది

యద్యేష మయి సుస్నిగ్ధాం దృష్టిమద్య నిపాతయేత్
కృతపుణ్యా న మత్తోఽన్యా త్రైలోక్యే వనితా తతః 58-41

వరూధినితో సంభాషణ మొదలుపెట్టిన ప్రవరుడు ఎవ్వతె వీవు? అని ప్రారంభించి ఆమె సమాధానంకోసం ఆగకుండా తన కధ అంతా ఏకరువు పెట్టేసాడు. సంస్కృత ప్రవరుడుకూడా" కా త్వం కమలగర్భాభే" (58-44) అని మొదలుపెట్టి అంతే చేసాడు. వికసించిన పద్మగర్భంలాగా – అరంగులో ఉన్నదానా! కమల గర్భాభే- అనే సంబోధన తెలుగులోకి రాకపోయినా శరీరకాంతి వర్ణన జరిగింది.

మదిరేక్షణే(45) శుచిస్మితే(48) భద్రే కళ్యాణి(49) ఇలాంటి సంబోధన

లతో పాటు భీరు(౫౦) అనే సంబుద్ధికూడా సంస్కృతంలో కనపడుతోంది పెద్దనగారి ప్రవరుడు భీతహరిణేక్షణా అనడానికి ఇది దారి చూపిందేమో!

ప్రవరుడు తన పరిస్థితికి పశ్చాత్తాప పడుతూ - బ్రాహ్మణులకు పరదేశ నివాసం (ప్రవాసం) ఎప్పుడూ మంచిది కాదు దేశాలన్నీ చూడాలనే నా ఉబలాటం ఇంత ప్రమాదం తెచ్చిపెట్టింది అంటాడు

ప్రశస్యతే న ప్రవాసో బ్రాహ్మణానాం కదాచన
అపరాధ్యతి మే భీరు దేశదర్శన కౌతుకమ్ (౫౮-౫౦)

ఇది మారన దగ్గరా పెద్దన దగ్గరా ఎంత సున్నితంగా మారిందో పాఠకులు గ్రహించవచ్చు

ఇంటికి పోయే దారి చెప్ప అని అడగబోతూ ప్రవరుడు ' ఓ కళ్యాణీ నీకు చేతనైతే నా కొక ఉపకారం చేస్తావా ? అని అడుగతాడు. అపుడు వరూధిని సంబర పడిపోతూ '' ఆజ్ఞాపించు నేనేం చెయ్యాలో. ఇప్పడు నీ అధీనురాలిని అంటుంది. ''ప్రశాధి యన్మయా కార్యం త్వద ధీనాస్మి సాంప్రతమ్'' (౫౮-౪౭). ఈ సొగసు తెలుగులోకి రాలేదు మారనదికూడా పూర్తిగా యథామూలానువాదం కాదు అనడానికి ఇదొక నిదర్శనం

''నన్ను తాకకు నీకు తగినవాణ్ణి మరొకణ్ణి ఎవరినయినా చూసుకో నేను ఒకటి అడిగితే నువ్వు మరొకటి కోరి నన్ను సమీపిస్తున్నావ్'' అన్నాడు ప్రవరుడు - దీనికి మూలం

మా మాం స్ప్రాక్షీ ర్వృణాన్యత్ర దుష్టే యస్త్వద్విశస్త్రివ
మయాన్యథా యాచితే త్వమన్యథైవాభ్యుపైషి మామ్(౫౮-౬)

ఆ తరువాత అగ్నికార్యాల గొప్పదనం చెబుతూ ముల్లోకాలూ హవ్యంలోనే ప్రతిష్ఠితమై ఉన్నాయి అంటాడు 'త్రైలోక్యమేతదఖిలం మూఢే హవ్యే ప్రతిష్ఠితమ్ (౫౮-౬౨) '

దుష్టే-మూఢే వంటి ఛాందస సంబోధనలను మారన పెద్దనలు వదిలి వేసారు

పరకాంతాభిలాష పనికిరాదని మా పెద్దలు చెప్పారు కాబట్టి నేను నిన్ను వాంఛించను- ఇంతమాత్రమే అని ఊరుకున్నాడు మారన ప్రవరుడు. సంస్కృత ప్రవరుడు మరొక్క అడుగు ముందుకి వేసి నువ్వు ఎంతగానైనా ఏడువు ఎండిపో - ఇది ఇంతే ' అన్నాడు

పరస్త్రియం నాభిలషే దిత్యూచుర్గురవో మమ
తేన త్వాం నాభివాంఛామి కామం ప్రలప శుష్య వా (౫౮-౭౩)

ప్రవరుడు అగ్నిని జపిస్తూ ''అనిలమిత్రా నిత్యసత్యమూర్తీ స్వాహావ దూవల్లభా ' అని సాభిప్రాయంగా సంబోధించడం తెలుగు కవుల ప్రతిభావిశేషం

గార్హపత్యాగ్నిని ఆవాహన చేసుకొని అతడు ఆకాశంలోకి ఎగిరి వెళ్ళిపోతూం

టే వరూధిని-తన్వంగి-నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయింది కన్నీళ్ళు నిండిన చూపులూ మెడ వణికే నిట్టూర్పులూ-జాలి గొలిపే సన్నివేశం

జగామ చ త్వరాయుక్తస్తయా సాస్రం నిరీక్షిత:

అదృష్టిపాతాత్తన్వంగ్యా నిఃశ్వాసోత్కంపి కంధరమ్ ౧౨-౧

దీన్ని తెలుగు కవులు ఎందుకో జారవిడుచుకున్నారు ఇక్కడ కృశాంగికి పర్యాయంగా తన్వంగి అనడం సాభిప్రాయం

ఏడ్చి ఏడ్చి ఆమె కన్నులు ఎరుపెక్కాయని సూచిస్తుంది 'మదిరే క్షణ' అనే విశేషణం ''మందభాగ్యేతి చాత్మానం నినింద మదిరేక్షణా'' (౧౨-౮) ఇదే పదాన్ని మారన్న ప్రయోగించాడు దీన్ని పెద్దన్నగారు ''కన్నుగవ ధవళరుచుల్ కావిగొన నేడ్చి'' (మను ౭-7) అని వాచ్యం చేసారు

మదిరా (స్త్రీ) మాద్యతీతి మదిరా మత్త ఖంజన: ఇతి శబ్ద రత్నావళి యథా శాకుంతలే 'యది మదిరాయతనయనాం తామధిక్ర్త్య ప్రహరతి (౩-౮) '' అని శబ్ద కల్పద్రుమంలో వివరణ ఉంది మదించిన కాటుక పిట్ట అని అర్థం విరహాగ్నితో కమిలిపోయిన కన్నులకు కాళిమ వచ్చిందనడం ఒక చమత్కారం మాత్రమే

ఇంకెక్కడా చూడదగిన చోటు లేనట్టు ఆ ప్రవరుడు ఇక్కడికే రావాలా ! వచ్చాడు బో నాకెందుకు కనపడాలి ? కనపడ్డాడు బో ఇలా వితర్కించుకుంది మారన్నగారి వరూధిని సంస్కృత వరూధిని కూడా ఇలాగే వితర్కించుకుంది కానీ ప్రవరుడు ఇక్కడకు ఎందుకు వచ్చాడు అనలేదు. నేను ఎందుకు వచ్చాను ఇక్కడికి? పాడుదైవం నన్ను ఇక్కడికే ఎందుకు తీసుకురావాలి ? అతడు కంటిలో ఎందుకు పడాలి ? అని తనను తాను ప్రశ్నించుకుంది ఇది సముచితంకూడా

క్వాగతాహమిమం శైలం దుష్టదైవబలాత్కృతా

క్వ చ ప్రాప్త : స మే దృష్టిగోచరం తాదృశో నర: (౧౨- ౦)

ఉద్యానవనంలో విహరిస్తూ అందచందాలు చూస్తూ సరస్సులో చక్రవాక దంపతుల్ని తిలకిస్తుంది తన యౌవనాన్ని తిట్టుకుంటుంది

చకార రమమాణే చక్రవాకయుగే స్పృహామ్ ।

ముక్తా తేన వరారోహా నినింద నిజయౌవనమ్ ॥(౧౨- ౧ ౧)

ఏ విహంగము గన్న నెలుగిచ్చుచును.. (మను ౩- ౬) పరితపిస్తున్న ఒక చక్రవాకిని సందర్భోచితంగా ప్రవేశపెట్టారు పెద్దనగారు దీనికీ లీలా మాత్రంగా ఒక సంస్కృతమూలం ఉందన్నారు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు

ఆయాతి యాతి పునరేవ జలం . ప్రయాతి

పక్షాంకురాణి విచినోతి ధునోతి పక్షౌ।

ఉన్మత్తవద్భ్రమతి కూజతి మందమందం

కాంతావియోగ విధురో నిశి చక్రవాక: ।॥

'' ఈ శ్లోకమున కా పద్య మనువాదమయ్యు నెంతయేని మనోజ్ఞ ముగా

బెంపొందింపబడినది మరియు బుంలింగముకన్న కర్తృపద మత్యంతస్వార స్యాపాద కమగునట్లు స్త్రీలింగముగా మార్చబడినది'' (మనుపీఠిక-వావిళ్ల ప్రచురణ ౨౩౦)

విరహార్తగా ఉన్న వరూధినిని గంధర్వుడు చూసాడు దివ్యదృష్టితో కథ తెలుసుకున్నాడు తెలుగు కవులు ఇంతే చెప్పారు వరూధిని విరహాన్ని ప్రత్యేకంగా వర్ణించారు కానీ సంస్కృతమూలంలో గంధుర్వుడి ముఖత: మ్లాన వరూధినిని చూపించాడు కవి ఇక్కడుందేమిటి ? ఇంతగా నిట్టూరుస్తోందేమిటి ? ముని శాపం ఏదైనా తగిలిందా ? ఎవరయినా అవమానించారా ? ఈవిడ ముఖం కన్నీటితో దొప్పదోగుతోందేమిటి- అని మాయాప్రవరుడు ఇదయిపోయాడు

స చింతయామాస తదా కింత్వేషా గజగామినీ।

నిశ్వాస పవనమ్లానా గిరావత్ర వరూథినీ॥

మునిశాపక్షతా కింను కేనచిత్కిం విమానితా।

బాష్పవారి పరిక్లిన్న మియం ధత్తే యతో ముఖమ్॥ (౬౨- 7)

''మునిశాపక్షతా కిన్ను'' అనే ఒక్కమాటతో క్లిన్నవరూధిని దర్శన మిస్తోంది ఇంత గొప్ప అభివ్యక్తిని తెలుగు కవులు ఎందుకు వదిలేసారో .

మాయాప్రవరుణ్ణి చూడగా ఆమె కన్నులు కించిత్తు వికసించాయి ''సాతం దృష్ట్వా వరారోహా కించిదుత్ఫుల్లలోచనా ౬౨-౨౩' ఈ అభివ్యక్తిని తెలుగు కవులు విస్తరించారు

'' ఏం చెయ్యను చెప్ప అక్కడ క్రియాహాని ఇక్కడేమో నువ్వు ఇలా మట్లాడుతున్నావు -సన్నని నడుముదానా ! అని అన్నాడు మాయాప్రవరుడు తెలుగు లోనే కాదు సంస్కృతంలోకూడా ఈ వాక్యవిన్యాసం ఇదే ఎత్తుగడతో చనువుగా సాగింది

కిం కరోమి క్రియాహానిర్వివిష్మత్యత్ర సతో మమ।

త్వమప్యేవం విధం వాక్యం బ్రవీషి తనుమధ్యమే॥ (౬౨-౨7)

స్వరోచి అగ్నిలా ప్రజ్వలిస్తూ (జ్వలన్నివ విభావసు: ౬౦-౬) సూర్యుడిలా దిక్కుల్ని ప్రకాశింపజేస్తూ (స్వరోచిభిర్యధా సూర్యో భాసయన్ సకలా దిశ: ౬౦-౬). సార్థక నామధేయుడయ్యాడు కళలతో చంద్రుడిలా గుణాలతో ఆ బాలుడు అభివృద్ధి చెందాడు ''గుణౌస్మైశ్చ యధా బాల: కళాభి: శశలాంఛన: ౬౦-7'' అగ్నితో సూర్యుని తో చంద్రునితో పోలిక చెప్పడంలోని ఔచిత్యం సంస్కృతంలోనూ ఉన్నట్టే

మారన మూలానికి ఇంత సన్నిహితంగా రచనను సాగించినా వర్ణనాదుల్లో స్వకీయ ప్రతిభను జోడించి పుష్టి కల్గించాడు అనువాదానికి ఉన్న పరిమితులూ వసతులూ అటువంటివి మూల విధేయతకోసం చూస్తే వ్యక్తిత్వం పోతుంది దాని కోసం ప్రయత్నిస్తే మూలానికి దూరమైపోతుంది రెండూ సాధించగలగడం కత్తిమీద సాము చాలా నేర్పు ఉండాలి

నాచన సోమన (క్రీ.శ. 1300 - 1380)

ఉత్తర హరివంశము

జనార్దనుని రాయబారము (4-119 నుంచి 1 70)

తిక్కనగారి వారసత్వం అందిపుచ్చుకుని హరిహరనాధునికి అంకితంగా ఉత్తరహరివంశం రచించినకవి నాచన సోమనాధుడు సోమనాధుడు ఇతని పేరు. నాచనగారి పుత్రుడు కాబట్టి నాచన సోమనాధుడయ్యాడని పెద్దలు నిర్ణయించారు.

'' ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కనసోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారత కథానంతరంబున '' అంటూ ఆశ్వాసాంతగద్యం రాసుకున్నాడు తిక్కన గారి నామధేయాన్ని ప్రతి ఆశ్వాసాంతంలోనూ సంస్మరించి గురుభక్తి ప్రకటించుకున్నాడు

శ్రీకృష్ణలీలావర్ణనాత్మకమైన హరివంశం భారతానికి శేషగ్రంధం దీనిని కూడా పఠిస్తేనే తప్ప భారతపారాయణ ఫలం దక్కదని పూర్వుల విశ్వాసం వ్యాసుడే దీనికర్త పూర్వోత్తర భాగాలుగా ఉన్న ఈ హరివంశాన్ని మొత్తంగా తెనిగించాడు ఎఱ్ఱన సోమనాధుడుమాత్రం ఉత్తర హరివంశమే రచించాడు

సాధారణంగా ప్రతి గ్రంధానికీ ఉండే అవతారిక ఈ ఉత్తర హరివంశానికి లేదు హరిహరనాధుణ్ణి ఒక కందంలో స్తుతించి ''దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె '' అంటూ కావ్యం ప్రారంభమవుతుంది '' హరివంశ ప్రధమ కథాంతరమున గల వింతలెల్ల'' విన్నాం ఆ మీద మరింక ఏ కథలు ముచ్చటగా ఉంటాయో చెప్పమని వైశంపాయనుడు అడిగితే జనమేజయుడు ఉత్తర హరివంశ కథలు చెబుతాడు ఇలా సరాసరి కథలోకి దూకెయ్యడం చాలా అపూర్వమైన సంఘటన.

అవతారిక లేకపోవడంవల్ల నాచన సోమనకు సంబంధించిన సమాచారం మనకు తెలియకుండాపోయింది. బహుశ ఇతడు పూర్వ హరివంశంకూడా రాసి ఉంటాడు దానికి అవతారిక ఉండి ఉంటుంది అందుకే దీనికి లేకపోయిందని కొందరు ఊహించారు. అయితే అప్పటికీ ఇప్పటికీ పూర్వ హరివంశం ఇతడి రచనగా ఏదీ లభించలేదు. అందుచేత ఉత్తర హరివంశమే రచించి ఉంటాడు అవతారిక ఎందుకో మానేసి ఉంటాడు అనే అభిప్రాయమే స్థిరపడింది ఆరవ ఆశ్వాసం అయ్యాక ఉత్తర హరివంశం ముగిసి నట్టుకూడా ఇతడు చెప్పలేదు - అదొక విశేషం

ఇతడి కాలాన్నిగురించికూడా చాలా వాదోపవాదాలు జరిగాయి బుక్కరాయలు గుత్తిదుర్గంలో ఉన్న పెంచుకల దిన్నె గ్రామాన్ని నాచనసోమన్నకు దానం చేసిన తామ్రశాసనం ఆధారంగా ఇతడి కాలాన్ని క్రీ శ 344 గా పరిశోధకులు నిర్ధారించారు అంటే సుమారు 300 నుంచి 380 మధ్యకాలంలో జీవించి ఉంటాడు ఎఱ్ఱాప్రగడకు సమకాలీనుడుగానీ కొంచెం తరువాతవాడుగానీ అవు

తాడు అద్దంకిలో ఎఱ్ఱాప్రగడ హరివంశం సంతరిస్తున్నాడని గుత్తిమండలానికి తెలిసి ఇతడు పూర్వహరివంశం వదిలేసి ఉత్తర హరివంశం చేపట్టి ఉండవచ్చునని కూడా విమర్శకులు భావించారు

కారణాలు ఏవయినప్పటికీ ప్రస్తుతానికి ఇతడి రచనగా అవతారికా రహితంగా ఆరాశ్వాసాల ఉత్తర హరివంశమే లభిస్తోంది. లక్షణగ్రంధాలలో ఇచ్చిన ఒకటి రెండు ఉదాహరణల్నిబట్టి ఇతడు ''వసంత విలాసము'' అనే మరోకావ్యం రచించాడని తెలుస్తోంది. కానీ ఇంతవరకూ అది బయటపడలేదు.

ఆశ్వాసాంత గద్యాలలో ఇతడు తనకు ప్రత్యేకంగా కొన్ని విశేషణాలు వేసుకున్నాడు

''శ్రీమత్సకల భాషా భూషణ, సాహిత్య రస పోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణ కీర్తి నవీన గుణసనాథ నాచన సోమనాథ ప్రణీతంబైన యుత్తర హరివంశంబు నందు. ''

వీటిలో ''సకల భాషాభూషణ'' అనేది పాండిత్య సూచకం బుక్కరాయని దానశాసనంలోకూడా ఇతడు ''అష్ట భాషా కవిత్వ శ్రీమహితుడు'' అని ఉంది అదే ' సకల భాషా భూషణ'' అయ్యుంటుంది. ''సంపూర్ణ కీర్తి'' అనేది కవిగా పండితునిగా ఇతడు పొందిన ప్రతిష్ఠకు సంకేతం.

మిగిలిన మూడు విశేషణాలూ ఇతడి కవితా లక్షణాలు లేదా కవితా గుణాలను సూచించే బిరుదులు

సాహిత్యరసం అంటూ వేరే ఏదీ ఉండదు కాబట్టి ''సాహిత్య రస పోషణ'' అంటే ఏమిటా అని విమర్శకులు తర్జన భర్జనలు చేసారు సాహిత్యము అంటే కలిసి- సహితంగా- ఉండటం శృంగార వీరాది విరుద్ధ రసాలను రసవైరం లేకుండా పరిపోషించడంలో ఇతడు నేర్పరి. జమిలి వేల్పును - హరిహరనాధుణ్ణి - ఆరాధించిన తాత్త్వికుడు అదే లక్షణం ఇతడి రచనలోనూ కనపడుతోంది కాబట్టి సాహిత్య రస పోషణ అంటే ఇది అని శ్రీమల్లంపల్లి శరభయ్యగారు అన్నారు.

సాహిత్య పోషణ- రసపోషణ అని రెండుగా విడగొట్టి రసస్పర్శలేని వర్ణనల్లో నైపుణ్యం సాహిత్య పోషణ అనీ రసవద్ఘట్టాల నిర్వహణలో చాతుర్యం రసపోషణ అనీ డా కోవెల సంపత్కుమారాచార్య సమన్వయించారు (పూర్వ కవుల కావ్యదృక్పథాలు) ''సాహిత్య రస పోషణ సంవిధాన చక్రవర్తి'' అంతా కలిపి ఒకే బిరుదని శ్రీపింగళివారు భావించారు

సంవిధాన చక్రవర్తి అంటే కథా ఘట్టాల సంవిధానంలో సార్వభౌముడు అన్నారు విశ్వనాథ (ఒకడు నాచన సోమన) కథా కథనంలో ఋజు పద్ధతి, చక్ర పద్ధతి రెండు ఉన్నాయనీ చక్ర పద్ధతిలో సోమన సంవిధానం సాగిందనీ సంపత్కుమారాచార్య అభిప్రాయపడ్డారు ఉత్తర హరివంశం తెలుగులో మొట్టమొదటి వంశకథాకావ్యమనీ దాని సంవిధానంలో చాతుర్యంవల్ల ఇతడు సంవిధాన చక్రవర్తి అయ్యా

డనీ శ్రీ జ.వి సుబ్రహ్మణ్యంగారు ప్రతిపాదించారు.(సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు వ్యాసం ౨౦) నవీన గుణసనాధ అనే బిరుదుగురించి వ్రాస్తూ శ్రీ జ వి సుబ్రహ్మణ్యంగారు పూర్వ విమర్శకుల అభిప్రాయాలను చర్చించి చివరన చమత్కార ప్రస్థానం ఇతడి నవీన గుణమన్నారు(వ్యాసం ౨) చమత్కారప్రస్థానకర్త విశ్వేశ్వరదేశికుడు సోమనకు సమకాలికుడు(370-77) పద్య నిర్మాణంలో రీతిప్రాధాన్యమే ఇతడి నవీనగుణ మన్నారు సంపత్కుమారాచార్య

ఇవన్నీ ఉత్తర హరివంశంలో ప్రస్ఫుటంగా కనిపించే కవితా గుణాలు ఇతడిది కావ్యాంగాలన్నింటా ఒక విలక్షణమైన మార్గం విలక్షణమైన అభివ్యక్తి.

ఉద్యోగ పర్వంలో తిక్కన గారు సంజయురాయబారాన్ని అత్యద్భుతంగా నిర్వహించారు శ్రీకృష్ణుని రాయబారం సరేసరి రెండింటా సోమయాజిగారి రాజకీయ ధురంధరత్వం ప్రతిమాటలోనూ ప్రతి కదలికలోనూ కనపడుతుంది నాచన సోమన్న జనార్దనుని రాయబారం అదే పద్ధతిలో నడిపించాడు

బ్రహ్మదత్తుడు సాళ్వదేశాన్ని పరిపాలిస్తున్నాడు ఇతడికి ఇద్దరు భార్యలు చాలాకాలం సంతానం లేదు పదేళ్లు తపస్సు చేస్తే పరమేశ్వ రానుగ్రహంవల్ల ఇద్దరు మగపిల్లలు పుట్టారు వారిపేర్లు హంసుడు, డిభకుడు.

బ్రహ్మదత్తుడికి ఒకస్నేహితుడున్నాడు మిత్రసహుడు ఇతడికీ సంతానం లేదు పదేళ్లు తపస్సుచెయ్యగా విష్ణుమూర్తి అనుగ్రహంవల్ల ఒక కుమారుడు జన్మించాడు అతడి పేరు జనార్దనుడు

ఈ ముగ్గురు పిల్లలూ స్నేహంగా మెలుగుతూ సమస్త విద్యలూ నేర్చుకున్నారు. మహావీరులయ్యారు

హంస డిభకులు హిమాలయాలకు వెళ్లి శివుణ్ణి గురించి తపస్సు చేసారు. దేవాసురల చేతిలో ఓడిపోకుండా ఒక వరం, బ్రహ్మాస్త్రంతో సహా సకలాస్త్రాలూ తెలిసేట్లు మరో వరం పొందారు

జనార్దనుడు మాత్రం ఇంటి దగ్గరే ఉండి విద్యావివేక సంపన్నుడై విష్ణుమూర్తిని అర్చిస్తున్నాడు

ఈశ్వర వర దర్పితులు హంసడిభకులు ఒక రోజు వేటకని అడవికి వెళ్లి అక్కడ ఋషుల్నీ మునుల్నీ పీడిస్తూ దూర్వాసుణ్ణి కూడా హింసిస్తారు ఆ ముని ఎంతో నిగ్రహం పాటించి వీరిని శపించకుండా ద్వారకకు వెళ్లి శ్రీకృష్ణుడికి అంతా విన్నవిస్తాడు. వారిని వధించడానికి కృష్ణుడు ప్రతిజ్ఞ చేస్తాడు

వేటనుంచి తిరిగి వచ్చిన హంసడిభకులు రాజసూయ యాగం చెయ్యమని తమ తండ్రి బ్రహ్మదత్తుణ్ణి ప్రోత్సహిస్తారు. మేం దిగ్విజయం చేసి యజ్ఞసంభారాలన్నీ సమకూరుస్తామంటారు. కొడుకుల పరాక్రమం నమ్మి బ్రహ్మదత్తుడు ' తొగాక' అంటాడు

అత డౌ గా కనుటయు స
న్నుతమతియగు నా జనార్దనుండు ధరిత్రీ
పతిసుతులకు నతిహితముగ
జతురతతో బలికె సహజసౌజన్యమునన్ (4-1 ౨)

బ్రహ్మదత్తుడు ఎప్పుడయితే అంగీకరించాడో అప్పుడు జనార్ధనుడు కల్పించుకున్నాడు అతడు సన్నుతమతి. పొగడదగిన మతి ఉన్నవాడు సహజమైన సౌజన్యం - మంచితనం - ఉంది అందుకని ధరిత్రీపతికీ అతడి సుతులకూ హితం చెప్పాడు అదికూడా 'చతురతతో' పలికాడు

రాజసూయంబు చేయ నే రాజు తలచు
నాతనికి రాజు లరిగాపు లయిన గాని
నిర్వహింపదు - మన మెల్లి నేడు సేయు
లావు మెఱయునె! ధర యింగలాల పుట్ట 4-120

మిత్రులారా రాజసూయం చెయ్యాలని ఏరాజు తలచుకుంటాడో అతడికి మిగతా రాజులంతా ''అరిగాపులు'' అవ్వాలి ఓడిపోయి కప్పం (అరి) చెల్లించే సామంతులు అవ్వాలి అలా అయితేనే గానీ రాజసూయం సాగదు (నిర్వహింపదు) మనం రేపూ ఇవ్వేళా (ఎల్లి=రేపు) సంపాదించి ప్రదర్శించే బలమూ (లావు) పరాక్రమమూ అదేమంత గొప్పదా (మెరయునే?) ఈ భూమి (ధర) ఇంగలాల పుట్ట-తెలుసా ఎక్కడ పడితే అక్కడ మహాగ్నికణాలు ఉన్నాయి ఏ రాజు కా రాజే ఒక అగ్నికణం అంచేత ఇవ్వేళారేపూ మీరు కొత్తగా సంపాదించిన బలపరాక్రమాలు ఎందుకూ కొరగావు. రాజులనందరినీ జయించి అరిగాపులుగా చేసుకోడం అంత తేలిక కాదు

''నే డెల్లి సేయు లావు మెరయునే. ధర ఇంగలాలపుట్ట'' అనేది కొత్త అభివ్యక్తి రాజులు ఇంగలాలు వారు సమృద్ధిగా ఉన్నారనడానికి ''పుట్ట'' అన్నాడు. రాజులు అనే ఉపమేయాన్ని చెప్పకుండా ఇంగలాలు (అగ్నికణాలు) అన్న ఉపమానాన్నిమాత్రమే చెప్పి దానితోనే ఉపమేయం స్ఫురించేట్టు చేసాడు దీనిని ఆలంకారిక పరిభాషలో సాధ్యవసాయం అంటారు రూపకాతిశయోక్తి అవుతుంది

ఎంతెంతటి మహాగ్నికణాలు- విస్ఫులింగాలు- ఉన్నాయో వివరిస్తున్నాడు

వ. అది యెట్లనిన 4-121

ఇరువదియొక్కమాఱు ధరణీశ్వరులం బరిమార్చి పేర్చి, దు
ర్ధరతరసారుడైన జమదగ్ని తనూజుడు- సంగరంబులో
సరిసరి బోరియుం బిదప జాలక యెవ్వని కోహటించె-నా
పరబల భీష్ము భీష్ము బె ఱ పార్థివు లేమనువారు పోరులన్-4- ౨౨

మొదటి ఇంగలం భీష్ముడు పరశురాముణ్ణి జయించినవాడు పరశురాముడు తక్కువవాడా ఇరవైయొక్కసార్లు రాజులందరినీ (ధరణీ+ ఈశ్వరులన్) సంహరించి (పరిమార్చి) పేర్చినవాడు ఎదిరించి ధరింపరాని (దుర్ధర)

సారం - పరాక్రమం కలవాడు అంతటి జమదగ్ని కుమారుడు యుద్ధంలో (సంగ రంబులో) సరిసమానంగా పోరాడి పోరాడి చిట్టచివరికి (పిదపన్) భీష్ముడికి సరిపోలేక (చాలక) తలవంచేసాడు. వెనుదీసి తొలగిపోయాడు (ఓహటించెను). భీష్ముడంటే పరబల భీష్ముడు - శత్రుసైన్యాలకు భయంకరుడు

పరశురాముడే అలా అయిపోతే ఆ భీష్ముడితో పోరులకి ఇంక మిగిలిన రాజులు ఏమంటారో చెప్పండి! మీరూ ఆ పెలి పార్థివుల్లో ఒకరు మీ గతి ఏమవు తుందో చూసుకోండి అని హెచ్చరిక.

కురువీరాగ్రణి బాహ్లికుం డలిగినన్ కోదండ పాండిత్య మె
వ్వరు జూపంగ వలంతులే, పవనజన్ వైరిక్షమాపాల భీ
కరు భీముం గదలించువారు గలరే, కంసారితో బోరిలో
సరివాడై యరి మీకు బెట్టుట జరాసంధుండు సైరించునే 4-123

కురువీరుల్లో అగ్రగణ్యుడైన బాహ్లికుడున్నాడు ఆయన అలిగితే (అలిగి నన్) ఎవ్వరైనా సరే ఎదురు నిల్చి ధనుర్విద్యాపాండిత్యం ప్రదర్శించడానికి సమర్థులా? (వలంతులే) ఒక్కడంటే ఒక్కడు ఉన్నాడా అంతటి సమర్థుడు?

ఇంక భీముడు శత్రురాజులకు భయంకరుడు (వైరి-క్షమా పాల-భీకరుడు) అతణ్ని కదిలించగలిగినవాళ్లుకూడా (కదలించువారున్) ఉన్నారా ఈ సృష్టిలో?

జరాసంధుడు మావాడు మావాడు అనుకుంటున్నారేమో యుద్ధంలో కృష్ణుడికి (కంసారితో) సాటి వచ్చే మహావీరుడు. కప్పం (అరి) మీకు చెల్లించడం (పెట్టుట) సహిస్తాడా? (సైరించునే) ఒప్పుకుంటాడా?

ఇవి ఏవీ జరిగేవి కావు మీ ప్రాణానికి వీళ్లల్లో ఏ ఒక్కడైనా చాలు ఈశ్వరు డిచ్చిన వరాలు ఉన్నాయి కనక ఒకవేళ వీరినందరినీ మీరు ఎలాగోలా జయించారే అనుకోండి .. శ్రీ కృష్ణుడు లేడూ.

నరకాసురప్రాణ నాళోత్తరణకేళ
రణకేళి వలకేలి రమణ జూపె
కంసదానవశిరః కమల కృత్తన మేలు
తన మేలుచేయి పెద్దలకు నొసగె
చాణూర ముష్టికక్షతజకీలాలంబు
నాలంబులోనెల్ల నలవు వఱపె
మురహయగ్రీవాంత్రమూల ఫేనావళి
నావలిదలగ జీకాకు వఱచె
వీరరససార కాసార విహరణంబు
విష్ణునకు నొప్ప-నతనితో విగ్రహింప
దొరకొనిన వచ్చు మనకు "మద్దులు మునింగి

బేతహోలు

హాల వెంపళ్లు తమకెంత బంటి" యనుట 4- 24

నరకాసురుణ్ణి అవలీలగా సంహరించాడు అతడి ప్రాణనాళాలను (తూడులు) పెకలించడం (ఉత్తరణం) ఒకకేళ. అటువంటి రణక్రీడలో తన ఎడమ చేతి గొప్పదనం (వలకేలు-దాని రమణ=వలకేలి రమణన్) చూపించాడు

నరకాసురుడంతటివాణ్ణి ఒక తూడుని పీకినట్టు హేలగా కేళీ విలాసంగా ఎడంచేత్తో లాగించేసాడని

కంసాసురుడుండేవాడు వాణ్ణి కుడిచేత్తో పీకేసాడు కంసుడి శిరస్సు ఒక కమలం దాన్ని తుంచెయ్యడం (కృత్తనము) ఒక పని ఆ పనిని ఏలినది- శ్రమ లేకుండా నిర్వహించినది-తన మేలు చేయి మేల యిన చేయి-కుడిచేయి దాన్ని శ్రీకృష్ణుడు పెద్దలకు ఇచ్చాడు (ఒసగెన్)

కంసుణ్ణి చంపి తన కుటుంబంలో ఉన్న పెద్దలకీ ఇంకా సజ్జనులకీ అభయహస్తం ఇచ్చాడని

చాణూరుడు ముష్టికుడు అనే ఇద్దరు రాక్షసుల్ని చీల్చిచెండాడి వాళ్ల గాయాల్లోంచి ప్రవహించే రక్తం(క్షతము=గాయము, క్షతజము= రక్తము) అనే నీటిని (కీలాలము) రణరంగం అంతటా (ఆలంబులోన్ ఎల్లన్) మళ్లించాడు (అలవు పఱపె)

గుఱ్ఱం తల రాక్షసుడు (హయగ్రీవ) మురుడు వాడి పొట్టలోపలి పేగుల్ని-వాటి మూలాలు (అంత్రమూల) అనే నురుగుల్ని (ఫేన+ ఆవళి) అవతలికి తొలగి పోయేట్టు (అవలి తలగన్) చీకాకు పెట్టేసాడు

పేగులు నురుగుల్లా తెల్లగా ఉంటాయిట నురుగుల్ని చిమ్మినంత తేలికగా పేగుల్ని చిమ్మేసాడని

వీరరసంతో నిండిన శ్రేష్ఠమైన సరోవరంలో (సార కాసారము) విహరించడం విష్ణుమూర్తికే చెల్లింది (ఒప్పన్) అతడితో యుద్ధానికి పూనుకుంటే (దొరకొనినన్) మనకు ఒక సామెతతో పోలిక వస్తుంది మద్దిచెట్లు మునిగేట్టు ప్రవాహం పొంగిపారుతుంటే వెంపలిచెట్లు (వెంపలి-వెంపళ్లు) మా కే పాటి లోతు (ఎంతబంటి) అనుట మనకు వచ్చు అన్నట్టుంటుంది మనం కృష్ణుడితో తలపడటం. నరకాసుర కంసాదు లకే దిక్కులేకపోతే మనం కృష్ణుడితో తలపడటమా

ఇందులో ఉత్తరణకేళి-రణకేళి, కృత్తనమేలు-తనమేలు కీలాలంబు-ఆలంబు, ఫేనావళి- ఆవలి - అని నియతస్థలంలో నియతాక్షరాల ఆవృత్తి కూర్పులో నైపుణ్యం రీతి ప్రాధాన్యం నవీనగుణం. ఈరీతి పద్యరచన ప్రబంధాలలో పరవళ్లు తొక్కింది

శ్రీకృష్ణుడితో పాటు బలరాముడున్నాడు. అతని పరాక్రమాన్ని వర్ణించి చెబుతున్నాడు

నిలువంతాలుదురే రణాంగణములో నీలాంబరాడంబరో

జ్జ్వలవేషంబు హలాహలస్థల హలవ్యాపార దోస్సారముం

బ్రళయాంభోధర సోదరారవము నొప్పన్ దర్ప మేర్పాటుగా

బలభద్రుం డతిరౌద్రుడై కదిసినం బ్రత్యర్థిభూపాలకుల్ 4-128

బలరాముడు నల్లని వస్త్రాలు ధరిస్తాడు నాగలి అతడి ఆయుధం. ఎల్లవేళలా మద్యం సేవిస్తూ ఉంటాడని ప్రసిద్ధి

అతడిది నీలవస్త్రాల ఆడంబరంతో ఉజ్జ్వలమైన వేషం హాలాహల మయమైన స్థలంలోకూడా - అటువంటి భీషణరణరంగంలోకూడా తన హలాయుధ వ్యాపారం - దున్నివేయగలగడం - సాగించగల భుజసారం ఉన్నవాడు లేదా - హాలా హాలానికి స్థలమైన హలం - దాన్ని ఆయుధంగా ఉపయోగించే భుజబలం ఉన్నవాడు (హాలాహలం హలహలం హాలహాలం ఇవన్నీ ఒకటే) ప్రళయకాల మేఘంతో సాటి వచ్చే (ప్రళయాంభోధరానికి సోదరమైన) అంటే ఆ మేఘగర్జకి తోబుట్టువువంటి ఆరవం (హుంకారం, గర్జన) చెయ్యగలవాడు ఆ వేషం ఆ దోస్సారం ఈ ఆరవం ఒప్పగా, లీవీ దర్పం స్పష్టపడేట్టు బలభద్రుడు అతి రౌద్రుడై ఎత్తివస్తే - సమీపిస్తే (కదిసి నన్) శత్రురాజులు (ప్రత్యర్థి - భూపాలకులు) రణ రంగంలో నిలువగలుగుతారా?

యుద్ధం చెయ్యడం జయించడం మాట అటుంచు ముందసలు ఎదిరించి నిలబడగలరా? అని

చిచ్చఱపిడుగు సాత్యకి అతడి శక్తి సామర్థ్యాలు వివరిస్తున్నాడు

వికల వ్యూహ విధా విహస్తభటమై విధ్వస్తమాతంగమై
శకలీభూత శతాంగమై శరఘటా శల్యాయమానాశ్వమై
సికతాసేతువు నిమ్న గా రయముచే జిందైన చందాన సా
త్యకిచేతంబడు శత్రుసంఘము దశాదైన్యంబు సైన్యంబునన్ 4-128

శత్రుసంఘం అది ఎంతటిదైనా సాత్యకిచేతిలో నశిస్తుంది శత్రుసైన్యంలో దశాదైన్యం -దీనదశ -ఆవరిస్తుంది ఇసుకతో (సికతా) కట్టిన వారధి (సేతువు) సెలయేటి ప్రవాహవేగంతో (నిమ్నగా-రయమునన్) చెల్లాచెదురై కొట్టుకుపోయినట్టు (చిందైన చందమున) శత్రుసంఘం క్షణంలో మాయమై పోతుంది ఎలాగంటే- శత్రువులు పన్నిన వ్యూహవిధాన మంతా వికలమైపోయి (వికలవ్యూహవిధా) భటులు చెదిరిపోతారు (విహస్తభటమై) గజసైన్యం (మాతంగాలు) విధ్వస్తమైపోతుంది. రథాలు (శతాంగాలు) తుత్తునియలైపోతాయి (శకలీభూత) బాణసమూహం తో-పరంపరతో (శరఘటా) అశ్వాలు శల్యాయమానమైపోతాయి గుచ్చుకున్న బాణపు ములుకులతో వాటి శరీరాలు నిండిపోతాయి

పదాతి-గజ-రథ-అశ్వ సైన్యాలతో బలిసివచ్చిన శత్రుసంఘం సాత్యకి చేతిలో ఇట్టే నాశనమైపోతుందని.

పద్య నిర్మాణంలో సమతూకం సాధించడం ఒక శిల్ప విశేషం. ఇదీ లీతిలోకే వస్తుంది ఇందులో వికల వ్యూహ విధావిహస్త భటమై - ఇది మొదటిదళం పద్దెనిమిది మాత్రలు విధ్వస్తమాతంగమై - ఇది రెండవదళం - పన్నెండు మాత్రలు. వెరసి పాదానికి ముప్ఫయి మాత్రలు శకలీభూత శతాంగమై ఇది రెండవ పాదంలో మొదటి

దళం - పదమూడు మాత్రలు శరఘటా శల్యాయమానాశ్వమై - ఇది రెండవ దళం పదిహేడు మాత్రలు మొత్తం ముప్పయి మాత్రలు సికతాసేతువు నిమ్నగారయముచే - ఇది మూడవపాదంలో మొదటిదళం. పద్దెన్మిది మాత్రలు చిందైన చందాన - ఇది రెండవ దళం పది మాత్రలు సాత్యకిలో 'సా' ఇందులోంచి జారడంవల్ల రెండు మాత్రలు తగ్గాయి పాదావసానం కనక చదివేటప్పడు కలిసిపోతాయి సా-త్యకి చేతంబడు శత్రుసంఘము అనేది నాలుగో పాదంలో పదిహేను నుంచి పదిహేడు మాత్రల మొదటి దళం దశా దైన్యంబు సైన్యంబునన్ అనేది పదిహేను మాత్రల రెండవ దళం మొత్తం ముప్పయి మాత్రలు

ఒకటి రెండు మాత్రలు అటూ ఇటూగా పాదాలలో దళాల మధ్య సమతూకం కుదిరింది దళాదిని యతిమైత్రి పొసగింది ఒకటీ మూడూ బేసి పాదాలలో అది నియతయతి స్థానం రెండూ నాలుగూ సరిపాదాలలో (సాని తోసి పలికినా) నియత స్థానంతో పాటు దళాదినీ యతి కుదరడం విశేషం పద్యరచనలో సమతౌల్య సాధన కవిదృష్టిలో ఉంది అనడానికి ఈ దళాదియతిమైత్రి ఒక నిదర్శనం దళాల నిడివిలోకూడా బేసి పాదా లకూ సరిపాదాలకూ పోలిక అమరింది

అంచేత మొత్తం పద్యం సమతూకంలో నడిచి ఒక వినూతన రచనా శిల్పాన్ని ఆవిష్కరించింది వృత్తాలలో గణాలవారీగా గురులఘువుల క్రమం నియతమే అయినా దాని కూర్పులో సాధించే వైవిధ్యంవల్ల గమనం లో ఎంతో వైవిధ్యం వస్తుంది దానికి ఈ పద్యం ఒక మచ్చుతునక ప్రకృత మనుసరామః

కౌరవసభలో శ్రీకృష్ణుడు పంచపాండవుల బలపరాక్రమాలను వర్ణించి చెప్పి దుర్యోధనాదుల్ని భయపెట్టినట్టు ఇక్కడ జనార్దనుడు మాట్లాడాడు అయిదుగురు మహావీరులగురించి అయిదుపద్యాలు నడిచాయి. సంభాషణాత్మక శైలిలో వాక్య విన్యాసం ఒక నాటకీయత

పరాయివాళ్లనుంచి వచ్చిపడే ప్రమాదం కాక మీ అంతట మీరు తెచ్చిపెట్టుకున్న ప్రమాదంకూడా కొంత ఉందని తెలియచెబుతున్నాడు

వ. అదియునుంగాక 27

చేసినవారు మీరు కడుచెట్టతనం, బది యెవ్వారూలేక దు
ర్వాసుడు వాసుదేవు గని వైరము తీరము చేసినాడు స
న్న్యాసుల గూడి కొంచుజని; యంతకుమున్ గడిద్రెవ్వి మీ యెడన్
గాసిలియుండు యాదవనికాయము సైపదు రాజసూయమున్ 4- 28

(చెట్టతనము=దౌష్ట్యము, గడిద్రెవ్వి=బంధము తెంచుకొని లేక తోడీవీడి. గాసిలు=కష్టపెట్టుకొనుట, బాధపడుట)

అదియునుంగాక, మఱియు వంటి చిన్నవచనాలు సాధారణంగా ప్రస్తావనలో విషయం మారడాన్నీ వాతావరణంలో మార్పునీ సూచిస్తాయి

అదీకాక-మొన్న వేటకు వెళ్లిమీరు పెద్దఅల్లరి చేసారు దౌష్ట్యం (చెట

తనం) ప్రదర్శించారు దూర్వాసుణ్ణి అవమానించారు అది సహించలేక ఆయనగారు తోటి (సన్యాసులతో) మునులతో కలిసి ద్వారకకు వెళ్లి కృష్ణుణ్ణి దర్శించి శత్రుత్వాన్ని మరింత పెంచాడు (తీరముచేసినాడు) అంతకు ముందునుంచే అనుబంధం తెంచేసుకుని మనస్సు కష్టపెట్టుకొని మీరంటే మండిపడిపోతున్న యాదవసమూహం రాజసూయాన్ని సహిస్తుందా? సహించదు గాక సహించదు (సైపదు)

ఈ అభిప్రాయానికి హేతువు లే ఆధారాన్నీ చెప్పి సమర్థించు కుంటున్నాడు

మును చేసిన వైరంబును
ముని చేసిన వైరమును మిముం దడవక పో
వునె! వైదేశికు డగు వి
ప్రునిచే నివ్వార్త వింటి భోజనవేళన్ 4- 29

మునుపు మీ అంతట మీరు సమకూర్చుకున్న శత్రుత్వం ఇప్పుడు ముని దూర్వాసుడు చేసిన వైరం - ఇవి రెండూ మీకు తగలక పోతాయా (తడవక పోవునే.). యాదవులు ఇలా కత్తి కట్టి ఉన్నారనే విషయం దూర్వాసుడు అక్కడకు వెళ్లి ఎక్కించా డనే విషయం - ఇవి ఒక పరదేశి ద్వారా తెలిసాయి ఈరోజు ఒక పరదేశి బ్రాహ్మణుడు (దేశాటన చేసే విప్రుడు) - ద్వారక నుంచి వచ్చినవాడు - ఈ వార్త చెప్పాడు (మును చేసిన వైరంబును మునిచేసిన వైరమును అనడంలో రీతి ప్రాధాన్యం)

జనార్దనుడు చెప్పాలనుకున్నది చెప్పేసాడు అయితే ఈ మాటలకు హంసడిభకులు ఎలా స్పందిస్తారో అలుగుతారో అంచేత సర్దుకొని తన మాటల్లో ఉన్న తీవ్రత స్థాయిని కొంచెంగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నాడు మాటకారి చాతుర్యం చూపిస్తున్నాడు

ఒప్పగునో తప్పగునో
యిప్పటికిం దోచు కార్యమిది నృపతులకుం
జెప్పవలె నాప్తమంత్రులు
చొప్పగునే మనకు రాజసూయము చేయన్ 4- 30

ఒప్పో తప్పో - ఇప్పటికి తోచింది ఇది. మీరు రాజులు నేను ఆప్త మంత్రిని. నేను చెప్పాలి. కాబట్టి చెప్పేసాను రాజసూయం చెయ్యడం మనకి తగునా- అన్నాడు.

ఈ పద్యంలో మొత్తం మూడు వాక్యాలున్నాయి. వచనంగా రాస్తే - '' ఒప్పగునో తప్పగునో ఇప్పటికిం దోచుకార్యమిది ఆప్తమంత్రులు నృపతులకున్ చెప్పవలె. రాజసూయము చేయన్ మనకు చొప్పగునే. ''

ఒప్పో తప్పో అనడంలో మంచి చెడ్డల్ని నిర్ణయించుకునే బాధ్యత మీదే అని హెచ్చరిక ''ఇప్పటికిం దోచు కార్యమిది'' అనడంలో నేను బాగా ఆలోచించి చెబుతు న్నాను సుమా అన్న సూచనతో పాటు ఇది యోగ్యమన్న నిర్దేశం ఆప్తమంత్రులు నృపతులకుం జెప్పవలె అనే వాక్యానికి మీరు వినవలె అనేది హేతుబద్ధమైన ముగింపు. నేను మామూలు మంత్రిని కాదు ఆప్తుణ్ణి అని అనడంలో ఆత్మవిశ్వాసం. విధి నిర్వ

హణలో వంశహారం పర్యంగా వస్తున్న నిజాయితీ నేను మీకు ఆప్తమంత్రిని అంటే మీరు నాకు ఆప్తులు. నేను మీకు ఆప్తుణ్ణి - ఈ ఆప్తత పరస్పరం ఉండాలి అన్న స్ఫురణ రాజసూయము చేయన్ మనకు చొప్పగునే అని కాకుస్వరంతో ముగించ డంవల్ల చొప్ప కాదు అన్న వ్యంగ్యం వాచ్యం చేసినదానికన్నా కాకువుతో వదిలెయ్యడంలో వాడి ఎక్కువ రాజసూయం చెయ్యడానికి మీరు తగరు. మీకంత శక్తిలేదు అంటే అది తిరస్కారమో ధిక్కారమో అవుతుంది. కొంపలంటుకుంటాయి అసలే వాళ్ల అహంభావులు దాన్ని పల్చబరచడం కోసం 'మనకు' అని ఉభయార్థకం వాడటం. ''వినుము మనము మధ్యస్థులము సంజయా. (ఉద్యోగ -౨౮౦) అన్నాడు తిక్కనగారి ధర్మరాజు ఆ గడసరితనం కొంత కనపడుతుంది ఇక్కడ

జనార్దనుడు జాగ్రత్తగా పదాలు ఎంచుకుని వాక్యవిన్యాసం చేసి '' మీరు చాలరు'' అన్న విషయాన్ని ఇంక ఇంతకంటే సున్నితంగా చెప్పడం సాధ్యంకాదన్న పద్ధతిలో చెప్పాడు హంసడిభకులు అలగలేకపోయారు కానీ అన్నీ గుచ్చుకున్నాయి ఒక్కొక్కదానికీ ధీరంగా హంసుడు జవాబిస్తున్నాడు:-

అనుటయు హంసు డిట్లను జనార్దనుతో - ముదిజోదు భీష్మునొం
డన బనిలేదు, బాహ్లికుడు నాతనికంటె నబంకు, వీరు మ
ద్ఘన భుజశక్తికిం దరముగారు, తలంపక వచ్చి భీముడుం
గనుగొనలేడు మద్ధనురకాండ రవిచ్ఛవి చండకాండముల్ 4- 3।

జనార్దనా. భీష్ముడు భీష్ముడు అంటున్నావు ఆయన ముసలి యోధుడు (ముదిజోదు) ఎప్పటివాడు ఇప్పటికి పనికిరాడు అంచేత భీష్ముణ్ణి గురించి ఇంకో రకంగా అనుకోవలసిన పనిలేదు (ఒండు అనన్ పనిలేదు) అంటే ఆయనకు భయ పడనక్కర్లేదని.

తరువాత బాహ్లికుణ్ణి కదా ప్రస్తావించాడు. అది చెబుతున్నాడు ఈ బాహ్లికుడు భీష్ముడికన్నా పిరికివాడు శూరునిలా నటించేవాడు (బంకు) భీష్ముణ్ణే లెక్కచేయక్కర్లేదంటే ఇక బాహ్లికుణ్ణా !అని

వీరిద్దరూ నా ఘన భుజశక్తికి (ఘనమైన భుజాలు-వాటి శక్తి ఘనమైన భుజశక్తి) తరంకారు సాటి రారనీ తట్టుకోలేరనీ

ఇంక భీముడు (అతడికి మాపేరు చెబితేనే భయం యుద్ధానికి రాడు) ఒకవేళ ముందూ వెనకా ఆలోచించుకోకుండా వస్తే (తలంపక వచ్చి) తట్టుకోలేడు నా ధనుస్సు ఒక అపూర్వసూర్యగోళం (అకాండ రవి) దానినుంచి మిరుమిట్లు గొలు పుతూ వెలువడే కాంతులవంటి (ఛవి) చండప్రచండమైన బాణాలను (కాండ ముల్) చూడలేడు నా ధాటికి ఆగలేడని (సమాస ఘటనలో ఆధాటి వినపడు తోంది)

యాదవ మహావీరులందరినీ కలిపి ఇంకా చులకనగా తీసి పారేస్తూ మాట్లాడుతున్నాడు

కలుద్రావం బని బూని యాదవులు ఖడ్గాఖడ్గి వాదింతురే

కలగం బాఱుట గాక; పంతములకుం గంసారి సైరించినం
గలనం బ్రాణముతోన పట్టువడు, నింకన్ సాత్యకిన్ గీత్యకిన్
బలభద్రున్ గిలభద్రు నా యెదుర జెప్పం జొప్ప దప్పంజుమీ! 4-132

యాదవులకు కల్లుత్రాగటమే పని. వాళ్లు కత్తికి కత్తి దూసి జవాబు చెబు తారా- భయపడి పారిపోతారు తప్ప. ఒకవేళ కంసారి- యాదవుల్లో కెల్లా కంసుణ్ణి చంపిన మహావీరుడు - ఆ అహంకారంతో పంతానికి పోతే (పంతములకున్ సైరించ నన్) రణరంగంలో (కలను- కలనన్) ప్రాణాలతో సహా పట్టుబడతాడు (శ్రీకృష్ణుడి పనే ఇలా అయితే) ఇక సాత్యకి- గీత్యకి బలభద్రుడు-గిలభద్రుడు వీళ్ల మాటే నా దగ్గర చెప్పవద్దు నా ముందు (నా యెదురన్) వాళ్ల ఊసెత్తితే చొప్ప తప్పుతుంది - ఔచిత్య భంగ మవుతుంది సుమా ◦

''కలగం బాఱుటగాక'' అనేది అటు యాదవులకూ ఇటు కంసారికీ అన్వయిస్తుంది అందుకు అనుకూలంగా గడపమీద దీపం లాగా (దేహళీదీపన్యా యంగా) ఆ మాటని రెండు వాక్యాల మధ్యలో ప్రవేశపెట్టాడు సోమనాధుడు కృష్ణుడు కూడా పారిపోయిన సందర్భాలు (జరాసంధుడితో యుద్ధాలు) లేకపోలేదు మరి.

సాత్యకి-గీత్యకి బలభద్రుడు - గిలభద్రుడు అనే ప్రయోగాలు నిందార్థ సూచకాలు నిందార్థంలో ద్విరుక్తి జరిగి రెండవపదం మొదట ఉన్న హల్లుకి హ్రస్వ దీర్ఘాచ్చులను బట్టి గి గీలు వస్తాయని చిన్నయసూరి పేర్కొన్నాడు 'సా' దీర్ఘం కనక 'గీ' వచ్చింది 'బ' హ్రస్వం కనక 'గి' వచ్చింది హంసుడి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తు న్నాయి.

ఖడ్గాఖడ్గి, కచాకచి, బాహాబాహి, ముష్టాముష్టి - వంటి ప్రౌఢ ప్రయోగాలు వీరరసాభివ్యంజకాలు ''ఖడ్గాఖడ్గి వాదింతురే నా యెదుర జెప్పం జొప్ప తప్పంజుమీ'' అని వాక్యాల ముగింపు ఉత్సాహస్థాయి భావానికి అనుకూలం మొత్తంమీద సంభాష ణాత్మకంగా నడిచిన ఈ పద్యాలలో వ్యావహారిక వాక్య విన్యాస శైలి కనపడుతుంది. తిక్కనగారి గురుత్వాన్ని ప్రకటిస్తోంది

యుద్ధంలో శ్రీకృష్ణుడంతటివాడు జరాసంధుడు అతడు మీకు కప్పం కడతాడా మీ రాజసూయం ఒప్పకుంటాడా? అని జనార్దనుడు లేవనెత్తిన శంకకి చివరగా సమాధానం చెబుతున్నాడు -

మనకు జరాసంధునకును
మనసులు గలిసినవి, ధర్మమయుడు దాతం డీ
పని గాదన డింక జనా
ర్దన! యాదవ నగరమునకు దడయక చనుమీ! 4-133

జనార్దనా జరాసంధుడికీ మనకీ మనసులు కలిసాయి గాఢమైన స్నేహం ఉంది పైగా అతడు ధర్మస్వరూపుడు ఈపని కాదనడు. అడ్డుపడడు. కప్పం చెల్లించ డానికి ఒప్పకుంటాడు అంచేత ఇంక నువ్వు ఆలస్యం చెయ్యకుండా (తడయక)

ద్వారకకు (యాదవనగరమునకు) వెళ్లు.

చని యా జనార్దనునిచే
ఘనమగు లవణంబు మనకు గప్పమడుగు, మే
ధనములును సరకుగా, విట
చనుదెమ్మను మతని యజ్ఞసమయంబునకున్ 4-134

ద్వారకకు వెళ్లి ఉప్పు మనకు కప్పంగా చెల్లించమని కృష్ణుణ్ణి అడుగు ఇంక ఏ ధనాలూ మనకు లెక్కకాదు (సరకు గావు) యజ్ఞసమయానికి ఆయన్ని ఇటు రమ్మను.

ఉప్పు కప్పంగా అడగటంలో రాజకీయం ఉంది విలువ తక్కువది కదా ఏదో లాంఛనంగా అడిగాడు పోనీలే అని చెల్లించినా చెల్లించవచ్చు. ఉప్పుగల్లయినా తమలపాకు తొడిమైనా కప్పం కప్పమే కనక అలా చెల్లిస్తే చాలు వీరు దిగ్విజయం సాధించినట్లే యాదవులు సామంతులయినట్లే. పబ్బం గడిచిపోతుంది

ఇంకో విశేషమేమిటంటే – మీరు ఉప్పు తప్ప ఏమి చెల్లించగలరు, అందుకని అదే అడుగుతున్నామని యాదవులకు సవాలు మీరు సామంతు లని నిర్ధారణకోసం ఉప్పు కప్పంగా అడుగుతున్నామే తప్ప మీనుంచి మాకు ఏ ధనాలూ అవసరం లేదు. మేము మీకన్నా అన్నింటా సంపన్నులమే అని అహంకారం ''ఘనమగు లవణము – ఏ ధనములును సరకు గావు'' అనడంలో ఈ ఎకసక్కెం వినపడుతోంది

''ఘనమగు'' అనే పదబంధం ఒక్కొక్కప్పుడు అల్పార్థకంకూడా దీపం ఘనమయ్యింది అంటే అల్పమై ఆరిపోయింది అని రవ్వంత ఉప్పు అడుగు అని ఏదో మాటవరసకి అన్నట్టు పైకి కనపడుతుంది

జనార్దనుడు దూతగా వెళ్లి యాదవులకూ కృష్ణునికీ చెప్పవలసిన సందేశం ఇది రెండే రెండు వాక్యాలు ఉప్పు కప్పంగా అడగడం యజ్ఞం చూడడానికి రమ్మ నడం అయితే వారేమయినా సందేహాలు లేవనెత్తవచ్చు. అంత తొందరగా అంగీక రిస్తారా వివరాలు అడగవచ్చు. సంభాషణలో ఏమయినా రావచ్చు అవన్నీ ఊహించి హంసుడే సమాధానాలు చెప్పి పంపలేడు గదా అందుకని స్వేచ్ఛ ఇస్తూ జనార్దనుడి మీద తనకున్న నమ్మకాన్ని ప్రకటిస్తున్నాడు

ఏ యుత్తరంబు సెప్పిన
నీ యానయ నీకు, జెలిమి నీతో మిగులం
జేయుట నొండననేర, న
సూయ తలంపునకు రాదుసూ నిను గనినన్ 4-135

జనార్దనా! అక్కడ మాట్లాడేటప్పుడు అవసరమై నువ్వు ఏ సమా ధానం చెప్పినా చెప్పవచ్చు. నీకు నువ్వే ప్రమాణం నీ ఆజ్ఞే నీది (నీ ఆనయ నీకు) నీతో మాకు మిక్కిలి స్నేహం ఉంది చెలిమి చేస్తున్నాం. కాబట్టి నువ్వు చెప్పినదాన్ని ఆమోదిస్తానే తప్ప కాదనను (ఒండు అననేరను) నిన్ను చూస్తే అసూయ అనేది

నా కసలు గుర్తుకే రాదు సుమా ఈ పాటి స్వేచ్ఛ ఇవ్వకపోతే జనార్దనుడు వెళ్లక పోవచ్చు, ఇవ్వక చేసేదీ లేదు విశ్వాసం కుదురుకొనేట్టు ఆత్మీయతను ప్రకటించాడు.

భీష్ముడినుంచి సాత్యకి వరకూ మహావీరుల్ని ప్రశంసిస్తూ జనార్దనుడు మాట్లాడినదానికీ కాకువుకీ హంసుడి మనస్సు ఎంతగా నొచ్చుకుందో ఈ పద్యంలో కొంత వెల్లడి అవుతోంది నీ అంతటివాడివి నువ్వు. ఏమయినా మాట్లాడవచ్చు నీతో స్నేహం అతిగా చేస్తున్నాం కనక (చెలిమినీతో మిగులంజేయుటన్) ఏమీ అనలేం. భరిస్తున్నాం నిన్ను చూస్తే మాకు అసూయ కలగదుసుమా అని చెప్పటంకూడా. ''అసూయ తలంపునకు రాదుసూ నిను గనినన్'' అని సార్వకాలికంగా (రాదు సుమా) మాట్లాడటంలో ఈ స్ఫూర్తి ఉంది మరి నీకో ? - శేషప్రశ్న

ఈ పద్యం మూడు విడి వాక్యాలు అందులో మొదటి వాక్యానికి క్రియ లేదు. వ్యావహారిక శైలి

ఏ యుత్తరంబు సెప్పిన నీ యానయు నీకు.
చెలిమి నీతో మిగులన్ జేయుట నొండననేరను
నిను గనినన్ అసూయ తలంపునకు రాదు సూ ।

ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుణ్ణి రాయబారానికి పంపుతూ ధర్మరాజు చెప్ప వలసిందంతా చెప్పి చిట్టచివరికి గడుసుగా అంటాడు గదా - శ్రీకృష్ణా. ''వే యేల యే గతి నడపదలచి తదియ నాకు బ్రియము'' (౩-౨౮). నువ్వు అన్నీ ఎరుగుదువు-

మమ్మెఱుగు, దెదిరి నెఱుగుదు'
నెమ్మి యెఱుగు, దర్థసిద్ధి నెఱి యెఱుగుదు' వా
క్యమ్ముల పద్ధతి యెఱుగుదు'
పామ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పన్ (౩-౨౮)

ఇదే బాణీలో మాట్లాడించాడు నాచన సోమన పాత్రల స్వభావాల్లో తేడా ఉన్నా సంభాషణలో పోలిక ఉంది అంతవరకే సుమా

అనుడు న్వీడుకతోడ వీడుకొని యశ్వారూఢుడై యూ జనా
ర్దను డేతేర దదంతరంగము మునీంద్రత్రాణు శ్రీవత్స లాం
ఛను నే డెల్లి కనుంగొనం గలిగినం జాలుం గృతార్థుండ దో
మ్మని చింతింపగ నాకు నేడొదవె నాహా! తీర్థమున్ స్వార్థమున్ 4-౧౩౦

హంసుడు వెళ్లమని పురమాయించాడు. డిభకుడూ బ్రహ్మదత్తుడూ మాట్లాడలేదు అంటే అంగీకరించినట్టే. జనార్దనుడు సంబర పడ్డాడు. వీడ్కోలు పలికి అశ్వారూఢుడై బయలుదేరాడు. అప్పుడు అతడి అంతరంగంలో -

మునీంద్ర సంరక్షకుడు (త్రాణుడు) శ్రీవత్సలాంఛనుడు (విష్ణుమూర్తి పుట్టు మచ్చకు శ్రీవత్సమని పేరు) అయిన శ్రీకృష్ణుణ్ణి ఇవ్వేళో రేపో (నేడు- ఎల్లి) సాధ్యమైనంత తొందరలో - జన్మ ముగిసేలోగా- చూడ గలిగితే చాలు కృతార్థుణ్ణి అయిపోతానులే అని ఆలోచిస్తోంటే (చింతింపగా) నాకు ఇంత కాలానికి ఇవ్వేళ

తీర్థమూ స్వార్థమూ కలిసి వచ్చాయి (నేడు ఒదవెను)- ఆ అవకాశం లభించింది ఆహా

అని సంబరపడ్డాడు జనార్దనుడు. తాను దర్శించాలని చాలా కాలంగా కోరుకుంటున్న శ్రీకృష్ణుడి దగ్గరికే తన ప్రభువు పంపుతున్నాడు. తీర్థమూస్వార్థమూ కలిసివచ్చాయి ఉద్యోగధర్మంగా వెళ్లినచోట స్వప్రయో జనంకూడా నిర్వర్తించు కోవడం

బయలుదేరడమేమిటి జనార్దనుడి మనస్సు శ్రీకృష్ణుని సన్నిధికి వెళ్ల పోయింది ఆ ఆలోచనలతోనే ప్రయాణం సాగిస్తున్నాడు

యదుకులాంబుధి చంద్రు నానందమున జూచు
రామాది హితచకోరములలోన
దనుజారి పారిజాతము జేరి పొదిగొన్న
రాజన్య రాజకీరములలోన
వసుదేవసుత సరోవరములో నోలాడు
సనకాది దివ్యహంసములలోన
గోపాల నవపుష్పగుచ్ఛంబు మూగిన
పరిచారికా ద్విరేఫములలోన
గలయ దొలు బాము నోములు గలవు గాన
సెలవులేక జన్మంబులు చెడియె - నాకు -
మీద జన్మంబు గలుగ నిర్మించెనేని
కమలజుని పేర దాపటి కాలి బొమ్మ 4-137

(సెలవు=ప్రయోజనం సెలవులేక=ప్రయోజనం లేకుండా పొదిగొనుట =గుంపుగా మూగుట, పరివేష్టించుట)

యదువంశం అనే సముద్రానికి చంద్రుడు శ్రీకృష్ణుడు పున్నమి నాడు సముద్రం ఉప్పొంగుతుంది శ్రీకృష్ణుడివల్ల యదువంశం పెంపు వహించింది. అందుకని ఈ రూపకం

ఆ శ్రీకృష్ణుణ్ణి నిత్యం ఆనందంతో చూస్తున్నారు చూసి ఆనంది స్తున్నారు బలరాముడు మొదలైన హితులు (ఇష్టులు). వాళ్లు చకోరాలు ఆ చకోరాల్లో నేని ప్పుడు కలుస్తున్నాను ఇంత కాలానికి శ్రీకృష్ణుణ్ణి దర్శించి నేనూ ఆనందించబోతు న్నాను అని

రాక్షస సంహారకుడైన శ్రీకృష్ణుడు ఒక పారిజాతం - ఒక కల్ప వృక్షం అతణ్ణి చేరి చుట్టూ పరివేష్టించి ఉంటారు రాజన్యులు. ఆ రాజన్యులే రాచిలుకలు (రాజకీరము=శ్రేష్ఠమైన చిలుక) వారిలో నేనూ ఒక రాచిలుకగా కలవబోతున్నాను.

వసుదేవుని సుతుడు శ్రీకృష్ణుడు ఆయన ఒక సరోవరం వంటి వాడయితే అందులో సనకుడు సనందనుడు మొదలైనవారు దివ్యహంసల లాగా ఓలలాడు

తుంటారు ఆ హంసల్లో నేనూ కలవబోతున్నాను (యతులు పరివ్రాజకులు హంసలు పరమహంసలు అనేవి కొన్ని శ్రేణులు ఆధ్యాత్మిక స్థాయికి సంకేతాలు)

గోపాలుడు ఒక కొత్తరకం పూలగుత్తి (నవ పుష్పగుచ్ఛము) పరిచారికలు అనే తుమ్మెదలు దానిచుట్టూ మూగి ఉంటాయి నేనూ ఒక తుమ్మెదగా వాటిలో కలవ బోతున్నాను ఆ పూలగుత్తిని ఆస్వాదించ బోతున్నాను

ఇంత గొప్ప అవకాశం నాకు లభిస్తోందంటే దానికి కారణం తొలిజన్మలో (తొలిబాము) నేను నోచిన మంచినోములు ఏవో ఉండటమే ఇప్పటికి ఈ అవకాశాన్ని అందించడంవల్ల నా పూర్వజన్మలన్నీ చరితార్థమైనట్టే ఇప్పుడు శ్రీకృష్ణ సందర్శనంతో ఈ జీవుడికి జన్మ సాఫల్యం సిద్ధిస్తోంది కనక రాబోయే జన్మలన్నీ నిరుపయోగమే నిష్ప్రయోజనమే ప్రయోజనం, ఉపయోగం లేకపోవడంతో (సెలవులేక) నాకు భవిష్యజ్జన్మలు నశించిపోయినట్టే. కృష్ణదర్శనంతో జన్మరాహిత్య స్థితి వచ్చేస్తుందని ఇక్కడ మరొక అన్వయం చెప్పవచ్చు. నాకు = అనకు. క్రియాపదం హల్పరత్వంలో ములోపం తొలుబాము నోములు కలవు గాన-గతజన్మలు సెలవులేక చెడియె అనకు కృష్ణదర్శనం కలిగించాయి కనక అవి చరితార్థాలే ఈ దర్శనంతో ఇక మరో జన్మ ఉండ కూడదు జన్మరాహిత్యం (ముక్తి) కలగాల్సిందే. అలాకాక-

ఒకవేళ బ్రహ్మదేవుడు నాకు మళ్లీ జన్మ కలిగేట్టు (మీద జన్మంబు గలుగ) చేస్తే-సృష్టిస్తే ఆ బ్రహ్మదేవుని పేరుతో (కమలజుని పేర) నా (దాపటి కాలికి) ఎడమ కాలికి బొమ్మ వేసుకుంటాను అతడి పేరు వ్రాసి బొమ్మ వేసి నా ఎడమ కాలికి కట్టు కుంటాను. అంత ఘోరంగా అవమానిస్తానని

పూర్వకాలంలో మహారాజులు తాము జయించిన శత్రురాజుల బొమ్మల్ని ఎడంకాలి మీద పచ్చబొట్లు పొడిపించుకునే వారట గండ పెండే రాల మీద చెక్కించి కాలికి తొడుక్కునేవారట. మరికొందరు తీవ్ర స్వభావులు ఉమ్మి తొట్టెలమీద చిత్రింప చేసుకునేవారట. ఇలా దారుణంగా అవమానించి సంతృప్తి పడేవారట.

జన్మరాహిత్యం కాక తనకి పునర్జన్మ కల్పిస్తే కమలజుణ్ణి నింద స్తానని జనార్దనుడి తాత్పర్యం. జన్మరాహిత్యం లభించితీరుతుందని పూర్తి విశ్వాసం.

యదుకులాన్ని సముద్రమని రూపకం చేసినందువల్ల- దానికి ఆనంద కారకుడైన శ్రీకృష్ణుడు చంద్రుడయ్యాడు ఆయన చంద్రుడ య్యాడు కాబట్టి అతడిని చూసి ఆనందించే బలరామాదిహితులు వెన్నెల పిట్టలు (చకోరములు) అయ్యారు శ్రీకృష్ణుణ్ణి పారిజాతం అనడం వల్ల రాజన్యులు కీరాలు అయ్యారు వసుదేవసుతుణ్ణి సరోవరం చెయ్యడంతో సనకసనందనాదులు దివ్య హంసలయ్యారు. గోపాలుడు నవపుష్ప గుచ్ఛ మవ్వడంవల్ల పరిచారికలు తుమ్మెదలయ్యారు ఇలా ఒక రూపకం మరో రూపకానికి కారణమయ్యింది కాబట్టి దీన్ని పరంపరిత రూపకం అంటారు

'ద్విరేఫము' అంటే రెండు రేఫలున్న (రకారాలు) పదం. అది ''భ్రమర'' శబ్దం. భ్రమరమంటే తుమ్మెద కాబట్టి ''ద్విరేఫము'' అనేది ''భ్రమర'' పదంద్వారా

తుమ్మెద అనే అర్థాన్ని ఇస్తుంది. ద్విరేఫము = తుమ్మెద అని స్థిరపడింది

చకోరాల వర్ణన సాహిత్యంలో తరచుగా వినపడుతుంది. ఇవి వెన్నెలని తాగి జీవిస్తాయిట తెల్లగా ఉంటాయిట వెన్నెల పులుగులు వెన్నెల పిట్టలు అని తెలుగులో వ్యవహారం అయితే ఇవి కావ్యాల్లోనే తప్ప లోకంలో కనపడవు. కావ్యమీమాంసాకర్త రాజశేఖరుడు ఇటువంటివాటినికూడా కవి సమయాలే అన్నాడు

శ్రీకృష్ణుని సాన్నిహిత్యాన్ని అనుభవించే భాగవతోత్తముల్లో తానూ ఒకడిని కాబోతున్నందుకు సంబరపడిపోతున్న జనార్దనుడు ఇప్పుడు స్వామి (సగుణ) రూపాన్ని హృదయంలో సన్నిధి చేసుకుంటున్నాడు

వెలిదమ్ములో లేత వెన్నెలో యమృతమో
కన్నులో చిఱునవ్వొ కనికరంబొ
గగనమో చుక్కలో గ్రహరాజ బింబమో
వక్షంబొ మౌక్తికావళియొ మణియొ
తరగలో ఫేనమో తరణిమండలమొ హ
స్తములొ శంఖంబొ సుదర్శనంబొ
తలిరులో కలికరంబులొ కుంకుమప్రభయొ
పదములో యూరులో పచ్చబట్టొ
యనుచు గన్నులార నా జగన్నాథుని
గనుగొనంగ నేడు గలుగుగాన
తలపులోన మున్న దలచిన రూపంబు
పట్టువడుట జన్మఫలము గాదె 4- 38

ఒక్కొక్క పాదంలోనూ శ్రీకృష్ణుని మూర్తికి సంబంధించిన మూడేసి అంశాలు ఉన్నాయి. వాటికి ఉపమానాలూ ఉన్నాయి ప్రతిపాదం లోనూ పూర్వార్థం ఉపమానాలు ఉత్తరార్థం ఉపమేయాలు యథా క్రమంగా అన్వయించుకోవాలి ఇతడు కూర్చిన ఉపమానాలు కొత్తవేమీ కాదు కానీ సందేహాలంకారంగా వాటిని కూర్చిన పద్ధతిమాత్రం కొత్తది దీనికి అపూర్వత లేదా నవీనత కేవలం కూర్పుతోనే సిద్ధించింది

అది తెల్లని తామర పువ్వులో శ్రీకృష్ణుని కన్నులో (సితపుండరీకా క్షుడు) అది లేత వెన్నెలో గోపాలుని చిఱునవ్వో అది అమృతమో కన్నయ్య కనికరమో (దయ)

అది ఆకాశమో యదుసింహుని వక్ష: స్థలమో! (విశాలమైన వక్ష స్థలమని) అది నక్షత్రాలో కౌస్తుభహారంలోని మౌక్తికాలో (వక్ష స్థలం ఆకాశంలాగా ఉంది కనక హారంలోని ముత్యాలు చుక్కల్లాగా ఉన్నాయని) అది సూర్యబింబమో (గ్రహరాజు సూర్యుడు) హారంలోని కౌస్తుభమో

అది తరంగాలో స్వామివారి నాలుగు హస్తాలో! అది నురుగో (ఫేనము) ఒక చేతిలోని శంఖమో (శంఖం తెల్లగా ఉంటుంది) అది సూర్యమండలమో మరొక చేతిలోని సుదర్శన చక్రమో

అవి చిగురాకులో (తలిరులు) శ్రీమన్నారాయణుడి పాదాలో అవి ఏనుగు తొండాలో జగత్పతి తొడలో. అది కుంకుమ కాంతి పటలమో నీలమేఘ శ్యాముడు ధరించిన పీతాంబరమో (పసుపు పచ్చని పట్టువస్త్రం నిగనిగలు- కుంకుమ ప్రభల్లాగా భాసించినట్టు కాంతిలోనే సామ్యం)

కన్నులతో మొదలు పెట్టి హస్తాల దాకా వచ్చి, పాదాలతో మొదలు పెట్టి కటి ప్రదేశం దాకా వర్ణించాడు

ఇలా ఒక్కొక్క అవయవాన్నీ పోల్చుకుంటూ తీరికగా దగ్గరగా కన్నులారా ఆ జగన్నాధుణ్ణి దర్శించబోతున్నాను ఇవ్వేళ. ఇంత కాలంగా ఊహల్లోనే దర్శిస్తున్న స్వామిరూపం ఇవ్వేళ ప్రత్యక్షంగా పట్టుబడబోతోంది చర్మచక్షువులకు దొరికి పోతోంది ఆహా ఇది ఈ జన్మకి చరితార్ధత కాదా

నాల్గో పాదంలో "కుంకుమ ప్రభయొ" అన్నచోట "ప్ర" సంయుక్తాక్షరం కనక దాని ఊనికవల్ల "మ" గురువవ్వాలి అలా అయితే గణ భంగం అవుతుంది సీస పద్యంలో పాదానికి వరసగా ఆరు ఇంద్రగణాలు రెండు సూర్యగణాలు ఉంటాయి మొదటి నాలుగు ఇంద్రగణాలూ పూర్వార్ధం తక్కిన రెండింద్ర గణాలు రెండు సూర్య గణాలు కలిపి ఉత్తరార్ధం పూర్వోత్తరార్ధాలు రెండింటా యతి ఉంటుంది మూడవ గణం మొదటి అక్షరం యతి స్థానం. ఇలా నాలుగు పెద్ద పాదాలు రచించి చివరలో ఆటవెలది కానీ తేటగీతి కానీ కూరిస్తే సీసపద్యం పూర్తి అయినట్టు. సరే - ఇప్పుడు నాలుగో పాదంలో తలిరులో - కరికరం - బులొ కుంకు-మ ప్రభయొ - పదములో-యూరులో - పచ్చ-బట్టొ నల, నగ సల భ, ర త - ఇవి ఆరూ ఇంద్ర గణాలు వీటిలో "మ ప్రభయొ" అనేది నాలుగు లఘువులతో 'నల' అవ్వాలి. అందు కని "ప్ర" వల్ల "మ" గురువు అయ్యింది అనడానికి వీలులేదు గురువయితే "భల" అవుతుంది అది ఇంద్ర గణాల్లో లేదు

ప్ర- హ్ర మొదలైన రేఫ సంయుక్తాలు పరంగా ఉన్నప్పుడు పూర్వాక్షరం వికల్పంగా గురువవుతుందని ఛంద కర్తలు అనుజ్ఞ ఇచ్చారు అవసరాన్ని బట్టి లఘువుగా ఉంచు కోవచ్చు ఇక్కడ "ప్ర" పరంగా ఉంది కాబట్టి కుంకుమ- ప్రభయొ అని విడగొట్టి ఊనిక పడకుండా చదువుకోవాలి

ఇంత గొడవ ఎందుకులే అనీ 'మ' మీద ఊనికతో ఉచ్చరించ డమే వాడుకలో ఉంది అనీ భావించి కొందరు "కుంకుమప్రభో" అనే పాఠాంతరం అంగీకరించారు. కానీ ఇందులో వచ్చిన ఇబ్బంది ఏమంటే ప్రభ+ ఓ= ప్రభో అని సంస్కృతీయానికి - తత్సమ పదం చివరి అత్త్వానికి - సంధి చెయ్యడం. ఇటువంటి సంధుల్ని నాచనసోమన అంగీకరించాడు ఇంకా రెండుమూడు చోట్ల చేసాడు. కాబట్టి ఈ పాఠాంతరాన్ని ఒప్పుకోవచ్చునని వీరి భావన (మరోసారి పద్యం చదివి రండి)

జనార్దనుడు శ్రీకృష్ణుణ్ణి ధ్యానించుకుంటూ అతడి అందచందాలను ఊహించుకుంటూ గుర్రంమీద ప్రయాణం సాగిస్తున్నాడు ద్వారక చేరుకున్నాడు.

వ . అని వర్ణించుచుం జని ద్వారకావగర ప్రవేశంబు చేసి యదు వల్లభు నగరు వాకిట హయావతరణంబు చేసి తన రాక యెఱింగించి పుచ్చి యద్దేవదేవుని యనుమతంబున సభామండపంబునకుం జని జనార్దనుండు 4-139

పురప్రవేశం చేసాడు శ్రీకృష్ణుడు కొలువు తీరి ఉండే భవనం ముందు గుర్రం దిగాడు అక్కడ ఉన్న ద్వారపాలకులతో తనరాక చెప్పి శ్రీకృష్ణుడికి వర్తమానం పంపించాడు (పుచ్చి) ఆయన అనుమతి అందింది. సభామండపంలోకి వెళ్లాడు- వెళ్లి.

కనియెం గౌస్తుభరత్న భూషణు వలత్కర్పూర హారావళీ
వనితాచాలిత తాళవృంత పవన వ్యాధూత చేలాంచలున్
మనుజాధీశ కిరీట కోటి పరిషన్మధ్యస్థ సింహాసనాం
కుని దేజః ప్రసర ప్రభాత తరణిన్ గోపాలచూడామణిన్. 4-140

కనియెన్ -గోపాల చూడామణిన్ శ్రీకృష్ణుణ్ణి దర్శించాడు అనడం కన్నా దర్శించాడు శ్రీకృష్ణుణ్ణి అనడంలో దర్శనానికి ప్రాధాన్యం. జనార్దనుడి తపనకూ వేదనకూ ఆరాటానికీ - వీటన్నింటి సఫలతకూ అనువైన అభివ్యక్తీకరణ. సరే - ఎలా ఉన్నాడు ఆ సమయంలో శ్రీకృష్ణపరమాత్మ-

కౌస్తుభరత్నాన్ని భూషణంగా ధరించి ఉన్నాడు. చూడగానే మిరుమిట్లు గొలుపుతూ కౌస్తుభం జనార్దనుడి దృష్టిని ఆకర్షించింది. అటుపైని చుట్టుప్రక్కలు పరికించాడు

స్వామి సింహాసనంమీద సమాసీనుడై ఉన్నాడు కుడి ఎడమల నిలిచి వనితలు ఒయ్యారంగా వీవనలు (తాళవృంతాలు) వీస్తున్నారు. ఆ చిరుగాలులకు శ్రీకృష్ణుని పీతాంబరాల అంచులు సుతారంగా అల్లల నాడుతున్నాయి. ఆ వనితలు పొడుగైన కర్పూరహారావళులు ధరించి ఉన్నారు. అవి వేలాడుతున్నాయి (వలత్) వనితలతో వీవనలు కదిలించ బడుతున్నాయి.(చాలిత తాళవృంత) కర్పూరసుగంధం నిండిన పిల్లగాలు లతో పీతాంబర చేలాంచలాలు అల్లల నాడింపబడుతున్నాయి (పవన వ్యాధూతచేలాంచల) అటువంటి చేలాంచలం కలిగి ఉన్నాడు.

సింహాసనం చుట్టూ సామంతరాజులు (మనుజాధీశ) సాష్టాంగ పడి నమస్కరిస్తున్నారు వారి కిరీటాగ్రభాగాల సముదాయం మధ్య సింహాసనం ఉంది. ఆ సింహాసనం అధిష్ఠించి కూర్చున్నాడు స్వామి

దశదిశలా ప్రసరిస్తున్న తేజస్సు చూస్తే ఉదయ కాల భాస్కరు డిలాగా (ప్రభాత తరణి) ఉన్నాడు కౌస్తుభం, పీతాంబరాలు సామంత రాజుల కిరీటాలు సింహాసనం స్వతస్సిద్ధమైన తేజస్సు- అన్నీ కలిపి ప్రభాత సూర్యుడిలాగా కనిపించాడు - ఆ గోపాలాగ్రణి (గోపాల చూడామణి)

శ్రీకృష్ణుడు జనార్దనుడి కంటికి సూర్యనారాయణుడిలా కనిపించడం సమంజసమే ఇదే మొదటిసారిగా దర్శిస్తున్నాడు అందుకని ప్రభాత తరణిలా

భాసించడమూ సహజమే ప్రాతస్సాయం సూర్యబింబాలు దర్శనీయాలూ అర్చనీయాలూ మధ్యందిన మార్తాండుడు దుర్నిరీక్ష్యుడు అదీకాక సూర్యుడు త్రిమూర్తి స్వరూపుడు -'' ఏష బ్రహ్మేచ విష్ణుశ్చ శివ స్కంద: ప్రజాపతి: '' అని వాల్మీకి ఆదిత్య హృదయం ఆదిత్యుడు వేదత్రయ స్వరూపుడని వేదమే చెబుతోంది - '' ఆదిత్యోవా ఏష ఏతన్మండలం తపతి తత్ర తా ఋచస్తదృచా మండలగ్ంస ఋచాం లోకోఽథయ ఏష ఏతస్మి న్మండలేర్చిర్దీప్యతే తాని సామాని స సామ్నాం లోకోఽధ య ఏష ఏతస్మి న్మండలే అర్చిషి పురుషస్తాని యజూగ్ంషి స యజుషాం లోకస్సైషా త్రయ్యేవ విద్యా తపతి య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయ పురుష ''

శ్రీకృష్ణుణ్ణి దర్శించాక జనార్దనుడు సభ అంతా పరిశీలనగా ఎవరెవరున్నారో చూస్తున్నాడు

బలభద్రుడును దాను భద్రపీఠంబున
  గదియ శైనేయు డగ్రమున మెఱయు
దుర్వాసుడును నారదుండును రెండు ది
  క్కుల దన కింపుగా గోష్ఠిసేయ
నుగ్రసేనుడు గౌరవోన్నతి దనుజేర
  గంధర్వగానంబు గలసి పొలయ
నప్సరోగణ నర్తనాడంబరము జూచు
  తనచేత నభినవధనము లడర
దనకునై వంది మాగధస్తవము నిగుడ
సామవేదులు దనయందు సారమెఱుగ
దనవలన లోకు లానందధార దేల
లీల బేరోలగంబున్న నీలవర్ణు 4-141

(మెఱయు పొలయు, అడరు= ఒప్పు నిగుడు=వ్యాపించు వలను=దిక్కు)

పట్టాభిషిక్తుడు కూర్చునేది సింహాసనం అదే బంగారానిదైతే భద్రాసనం (నృపాసనం యత్తత్ భద్రాసనం తు తద్ హైమమ్ - అమరం) అటువంటి భద్ర పీఠంమీద బలరాముడూ శ్రీకృష్ణుడూ కలిసి కూర్చున్నారు ఎట్ట ఎదుట సాత్యకి (శిని కొడుకు=శైనేయుడు)కూర్చున్నాడు దూర్వా సుడూ నారదుడూ చెరోవైపునా సమాసీనులై ఉన్నారు శ్రీకృష్ణునికి ఇంపుగా ఏదో గోష్ఠి నడుపుతున్నారు ఉగ్రసేనుడు గౌరవాతిశయంతో చేరువగా ఉన్నాడు

గంధర్వగానం వినపడుతోంది గంధర్వులే వచ్చి పాడుతున్నారు అప్సరసల బృందం నర్తనంలో తమ నేర్పరితనాన్నీ అతిశయాన్నీ (ఆడం బరము) ప్రదర్శిస్తోంది. దాన్ని కృష్ణుడు తిలకిస్తూ వారికి బహూకరించ డానికని క్రొత్త బంగారుకాసులు గుప్పిటపట్టి కూర్చున్నాడు అవ్వీకాంతులీ నుతున్నాయి నాట్యకత్తెలకూ, కళాకారులకూ బంగారు నాణేలూ నగలూ అప్పటికప్పుడు బహూకరించడం మహారాజులకు

అలవాటు (అభినవ ధన ములు=క్రొత్తక్రొత్త ధనములు ఆభరణములు అభిమత దనములు=కోరిన ధనములు, భూషణములు)

కృష్ణునికోసం సాగుతున్న వందిమాగధుల స్తోత్రాలు ఒక వైపు నించి అలా వినిపిస్తూనే ఉన్నాయి

వంది-మాగధుడు అని రాజుల దగ్గర ఇద్దరు స్తోత్ర పాఠకులు ఉంటారు వీరు రాజును పొగుడుతూ ఎప్పడూ మంచి ఉల్లాసంగా ఉంచు తారు ఒక్కొక్కడికి లేని గుణాలుకూడా ఉన్నట్టు కీర్తిస్తూ ఉంటారు. విని విని అటువంటి మంచి గుణాలు ఒకప్పడు కాకపోతే ఒకప్పడయినా అలవరచుకోవడానికి ఆ రాజు ప్రయత్నిస్తాడనీ అందువల్ల సమాజానికి మేలు జరుగుతుందనీ వెనుకటి వాళ్ల ఆశట!

వీళ్ల స్తోత్రపాఠాలు ఒక ప్రక్క సాగుతోంటే - మరోప్రక్క సామవేద పండితులు సామలు గానం చేస్తూ శ్రీకృష్ణుని తత్త్వాన్ని (సారము) అధ్యయనం చేస్తున్నారు శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుడుగా వేదవేద్యుడని తక్కిన సభాసదులంతా (లోకులు) శ్రీకృష్ణుడివైపే చూస్తూ ఆనంద రసధారలలో తేలియాడుతున్నారు. ఇంత వైభవంగా విలాసంగా నిండు సభ(పేరు+ ఓలగంబు)తీర్చి ఉన్న నీలవర్ణుణ్ణి చూసాడు జనార్దనుడు. (మరోసారి పద్యం చదివి రండి)

వ. అని కదియంబోయి తన పేరు చెప్పి నమస్కారంబు చేసి బలదేవునకు నట్ల ప్రణమిల్లి యథోచిత స్థానంబునం గూర్చున్న యనంతరంబ మురాంతకుం డతనితో నిట్లనియెం- 4-142

దగ్గరకు వెళ్లాడు తన పేరు చెప్పి నమస్కరించాడు పెద్దల దగ్గరకు వెళ్లినప్పడు గోత్రనామాలు చెప్పకుని అహంభో అభివాదయే అని నమస్కరించడం సంప్రదాయం అలా జనార్దనుడు కృష్ణబలరాము లిద్దరికీ నమస్కరించాడు.

రాజసభల్లో దూతలకోసమని కొన్ని ఆసనాలు కేటాయించి ఉంటాయి శ్రీకృష్ణుడు చేసన్నతో ఒక ఆసనం చూపించి ఉంటాడు జనార్దనుడు అందులో కూర్చున్నాడు అప్పడు ఆ మురాంతకుడు (మురుడు అనే రాక్షసుణ్ణి సంహరించినవాడు) శ్రీకృష్ణుడు ఇలా సంభాషణ ప్రారంభించాడు

అనఘ! మీ రాజు బ్రహ్మదత్తునకు గుశల
మా? నరేంద్రకుమారులు హంసడిభకు
లధిక భవ్యులె? వరములు హరునిచేత
గొన్నవారట - కుశలంబు గొఱత గలదె! 143

'అనఘా' అని సంబోధన. నువ్వు పవిత్రుడివే మంచివాడివే నీవల్ల ఏ అపరాధమూ పాపమూ లేదని హెచ్చరిక

మీరాజు బ్రహ్మదత్తుడికి క్షేమమేనా రాకుమారులు హంస డిభకులు అధిక భవ్యులేనా? (అధిక కుశలమా అనడంలో ఎకసక్కెం) వారిద్దరూ ఈ మధ్య శివుడి నుంచి ఏవో వరాలు సంపాదించారట గదా - ఇక కుశలానికి లోటేమి ఉంటుందిలే!!

మీ జనకుడు శుభయుతుడే

రాజులు మిము గారవింతురా సుఖ కరులే

భూజనము లిపు డిచ్చోట ప్ర

యోజనమా నీవు వచ్చు నుద్యోగమునన్ 4-144

మీ తండ్రి మిత్రసహుడు కుశలమా? రాజులు - బ్రహ్మదత్త హంస డిభకులు మిమ్మల్ని గౌరవిస్తున్నారా? తక్కిన ప్రజలంతా (భూజనులు) సుఖకరంగా ఉన్నారా? (వాళ్లు సుఖంగా ఉన్నారా? మిమ్మల్ని సుఖపడ నిస్తున్నారా? - అని)

నువ్వు ఇప్పడు ఇక్కడికి వచ్చావు ఈ ప్రయత్నానికి (ఉద్యోగము= ప్రయత్నము) ప్రయోజనం ఏమిటి?

'ప్రయోజనమా''అన్న కాకుస్వరాన్ని ప్రశ్నార్థకంగా ఉచ్చరించాలి స్వరానికి లేఖనచిహ్నం ఉండదు కానీ కావ్యంలో అందునా సంభాషణలో దీని ప్రాధాన్యం గొప్పది. అది గుర్తించి సందర్భాన్ని బట్టి ఉద్దిష్టార్థం స్ఫురించేట్టు పలించాలి అప్పడే రసస్ఫూర్తి కలుగుతుంది అందుకే కావ్య పఠనం ఒక కళ అన్నారు.

కావ్య మీమాంసలో రాజశేఖరుడు ఈ విషయం మీద ఒక ప్రకరణం రాశాడు కంఠస్వరం ఎలా ఉండాలి, ప్రాంతీయమైన ఉచ్చారణలు ఎలా ఉంటాయి. కావ్య భాషనుబట్టి పఠన విధానం ఎలా మారుతుంది మొదలైన అంశాలన్నీ చర్చించాడు. కావ్యం రచించడం కావ్యం పలించడం రెండూ రెండు కళలు ఇవి రెండూ ఉన్నవాడు పరిపూర్ణుడు. అతడు అరుదుగా దొరుకుతాడుట

వ. అనుటయు నా జనార్దనుం డిట్లనియె 4-145

శ్రీకృష్ణుడి మాటల్లో ఉన్న వేళాకోళం జనార్దనుడికి అందింది ఆయన పేరుపేరునా కుశలమడిగితే ఈయన సామూహికంగా చెప్పి తెమిల్చేస్తున్నాడు

అందఱకుం గుశలము, మా

కుం దగు మన్నవల, ప్రజలకుం బరిణామం

బందే వచ్చినపని గో

వింద! యెఱింగింప తెలుగవే విశ్వపతీ! 4-146

"అందరూ కుశలమే మాకూ తగిన మన్ననలు లభిస్తూనే ఉన్నాయి. ప్రజలకుకూడా ఆనందమే (పరిణామంబు= ఆనందము) గోవిందుడా! ఓ జగన్నాథా! (విశ్వపతీ) ఇక్కడికి నేను వచ్చినపని ఏమిటో నేనై తెలియజెప్పకపోతే నువ్వు తెలుసుకోలేవా!

''మాకుం దగుమన్ననల''. తగు అనడంలో ఉంది చమత్కార మంతా. హంసడిభకుల దగ్గర మామాట పూర్తిగా చెల్లడం లేదు. అలాగని తిరస్కారమూ అవమానమూ లేవు ఇదీ "తగు" లో ఉన్న సూచన హృదయంలో ఉన్న భావం అసంకల్పితంగా మాటల్లోనూ స్వరంలోనూ ప్రతిఫలిస్తుంది మాటల్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకొని ఎంత నిగ్రహంగా పలికినా ఎక్కడో ఒకచోట చిన్న పదంలో దొరికి

పోతుంది

" ఇందు ఏను వచ్చిన పని ఎఱింగింపక ఎఱుగవే" అనేది వాక్యం విశ్వపతీ అనేది సంబోధన మొత్తం విశ్వానికే నీవు పతివి. ఎక్కడ ఏది జరిగినా నీకు తెలుస్తుంది నేనెందుకు వచ్చానో గ్రహించగలవు అని సంబోధన చరితార్థం

'గోవింద" అన్న సంబోధనని ప్రయోగించినచోటు- ప్రాస కోసమే అయినా- ఫలితార్థాన్ని చెబుతోంది బహుశ ఆ రకం వాడుక సోమ నాథుని కాలం నుంచీ సమాజంలో ఉండే ఉంటుంది నేను వచ్చిన పని గోవింద అంటే విఫలమై పోతుందనీ అదే నేనూ కోరుకుంటున్నాననీ సూచన

శ్రీకృష్ణుడు వేళాకోళంతో మొదలుపెట్టి చనువు ఇచ్చాడు కనక జనార్దనుడు అదే బాణీని అందిపుచ్చుకున్నా వెంటనే తన ఉపాధి జ్ఞాపకం వచ్చినట్టుంది, గంభీరంగా మారిపోయాడు తత్త్వజ్ఞుడై మాట్లాడుతున్నాడు

లోపల వెలుపల వెలుపల
లోపలగా నుండు నఖిలలోకంబులకున్
నీ పరతత్త్వము చిత్రము (వు)
రూపమునై-నీవులేని రూపముగలదే 4-147

ఈ సమస్తలోకాలకూ నీ పరతత్త్వం బహు విచిత్రమైనది. అఖిల సృష్టికీ ఇది లోపల వెలుపలగా ఉంటుంది వెలుపల లోపలగా ఉంటుంది. ఒక రూపంతోనూ ఉంటుంది రూపరహితంగానూ ఉంటుంది రూప రహితమైనా అన్ని రూపాలలోనూ తానుంటుంది

లోపల వెలుపలగా వెలుపల లోపలగా ఉండటమనేది "అంతర్బ హిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణఃస్థితః" అనే శ్రుతికి ప్రతిధ్వని ఇది పరతత్త్వం కనక నిరాకారమూ నిర్గుణమూ అప్రమేయమూ అవ్వాలి ఒక్కొక్కప్పుడు సాకారమైనా నీవులేని రూపం ఉండదు ఇదీ విచిత్రం అంటున్నాడు. సర్వాంతర్యామి వాసుదేవ తత్త్వాన్ని తేలికగా తెలుగు మాటల్లో చెప్పాడు వాసనాద్వాసుదేవస్య వాసితంతే జగత్రయమ్

అంచేత నేను ఎందుకు వచ్చానో నీకు తెలియకపోవడమేమిటనీ నేను చెప్పడమేమిటనీ జనార్దనుడి ఆశ్చర్యం

తాను కృష్ణ భక్తుడు ఇప్పుడు హంసడిభకుల దూతగా వచ్చాడు. ఇది తనకు బొత్తిగా ఇష్టంలేదు వచ్చిన పనీ అటువంటిదే మనస్సు గుంజుకుంటోంది తన దురవస్థని విన్నవించేసి తేలిక పడాలనుకున్నాడు

ఉండుట తప్పు వారికడ నుండమి త, ప్పిటు రాక తప్పు రా
కుండుట తప్పు, తప్పులకు నొప్పులకున్ గతి నీవ దేవ! యే
నొండొకరుండనే; పలుకకూరక నేరక యుండజేయు వీ
టిండితనంబుచేత నిసిఱింతలువాఱెడి జిత్తమిప్పుడున్ 4-148

(వీఱిడితనము=వెఱ్ఱితనము ఇసిఱింతలువాఱుట=కంపించుట)

పరమాత్మా! వారిదగ్గర ఉండటమూ తప్పే ఉండకపోవడమూ తప్పే. ఇక్కడికి రావడమూ తప్పే రాకపోవడమూ తప్పే. ఈ తప్పలకీ ఒప్పలకీ అన్నింటికీ నువ్వే గతి. నువ్వే దిక్కు నేను వేరొకడినా!

ఏమీ మాట్లాడకుండా (పలుకక) ఊరికే ఉండలేని పరిస్థితిని కల్పిస్తున్న (ఉండనేరకజేయు) ఒక వెర్రితనంవల్ల నా మనస్సు ఇప్పటికీ కంపిస్తూనే ఉంది. అలజడి చెందుతూనే ఉంది

పలుకకూడని పలుకులు పలుకవలసి వస్తోంది. ఎందుకు దూతగా వచ్చానా అని మనస్సులో బాధపడుతున్నాను - ఇది జనార్దనుడి తాత్పర్యం

మరెందుకు వచ్చావయ్యా అంటే రాక తప్పదు అక్కడ మంత్రి హంసడిభకులకు స్నేహితుడు పోనీ కొలువు వదిలిపెట్టవచ్చుగదా అంటే ఉండక తప్పదు. తాత తండ్రుల కాలంనుంచీ ఉన్న అనుబంధం

ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటే తాను చెప్పబోయే మాటలకి శ్రీకృష్ణుడు తనని అపార్థం చేసుకోకుండా, అలగకుండా ప్రశాంతంగా వినడానికి

జనార్దనుడు పడుతున్న గుంజాటనని గుర్తించాడు జనార్దనుడు భరోసా ఇస్తున్నాడు

అనుడు జనార్దనుం డను జనార్దనుతో - విను దూతకృత్యముం
బనివడి పూని యేలికల ప్రల్లదమైనను జెప్ప జెల్లు, ద
ప్పని పలుకైన బోలు విన, బంతము జల్లకు వచ్చి ముంత దా
చిన గతి నింత మాటువడజేసిన గార్యము గానవచ్చునే.. 4-149

జనార్దనా ఒకమాట చెబుతాను విను అవసరపడి (పనివడి) నువ్వు దూతకార్యాన్ని వహించావు వహించాక మీ ప్రభువులు చెప్పమన్నది చెప్పాలి అది వట్టి పనికిమాలిందే అయినా తప్పడు మాటే అయినా (ప్రల్లద ము) చెప్పక తప్పదు, అలా చెప్పడం తప్పకాదు, ఒప్పే

చెప్పిన తరువాత అవతలినుంచి తప్పనిసరిగా సమాధానం వస్తుంది. అది తప్పని పలుకు. అయినా తప్పదు వినాలి (వినన్ పోలు)

చల్లకి వచ్చి ముంత దాచినట్టు ఇక్కడిదాకా వచ్చి ఇప్పడు మీ ప్రభువుల పంతాన్ని ఇంత దాచిపెడితే (మాటుపడజేసినన్) ప్రయోజనం ఏమిటి చెప్ప మేము చెయ్యవలసిన పని (కార్యము) స్పష్టపడుతుందా అని

వాళ్లు చెప్పమన్నది చెప్పడం మేము చెప్పేది తీసుకుపెళ్లడం - ఇంతే దూతగా నీ పని అంచేత చెప్పడానికి సంశయించవలసిన పనిలేదు ఒకవేళ నీ అంతట నువ్వే వాళ్లని కాపాడటంకోసం ఏదయినా దాద్దామను కుంటే దానివల్ల ప్రయోజనమూ లేదు చల్లకోసం వచ్చి, అడగడానికి మొగమోటపడి ముంతదాచుకున్నట్టవుతుంది గౌరవమూ దక్కదు ప్రయోజనమూ నెరవేరదు కాబట్టి పల్చబరచకుండా ఉన్నది ఉన్నట్టు చెప్పెయ్యమని తాత్పర్యం

ఇటువంటి పనిమీద వచ్చినందుకు జనార్దనుడు అసలే సిగ్గుపడుతున్నాడు ''వీటిండితనంబు'' అంటున్నాడు దానికి మాట్లాడు తున్నాడు కృష్ణుడు ఇప్పడు-

రావలదే పంచిన పని

సేవకులకు, బాముకాటు సీర దుడిచినం

బోవునె, వారేమనిరో-

నీవేలా దాచె, దేమి నేరమినీకున్? 4-150

ప్రభువులు ఆజ్ఞాపించిన పనులమీద సేవకులకు రాక తప్పదు గదా! పాముకాటుని గుడ్డతో (చీరతో) తుడిస్తే పోతుందా వారు ఆ హంస డిభకులు ఏమన్నారో నువ్వెందుకూ దాచడం నీ తప్ప ఏముంది

అయిదు చిన్న చిన్న వాక్యాలుగా విరామాలతో ఊనికలతో కాకు స్వరాలతో సాగింది ఈ పద్యం వాడుక భాషలో ఉండే ఒడుపు కనపడుతోంది.

సర్వాంతర్యామిగా శ్రీకృష్ణుడికి జనార్దనుడు వచ్చిన పని ఏమిటో తెలిసినా తక్కిన శ్రోతలకు తెలియాలి కనక - దాచకుండా చెప్ప, నిన్ను తప్ప పట్టను అని ప్రోత్సహిస్తున్నాడు. అంతవరకూ బాగానే ఉంది ఇక్కడ ఆలోచించవలసిన అంశం ఏమిటంటే -

వాలిదగ్గర ఉండటం తప్ప ఉండకపోవడం తప్ప,ఇక్కడికి రావడం తప్ప రాకపోవడం తప్ప - అంటూ జనార్దనుడు మాట్లాడిన అంశాన్ని శ్రీకృష్ణుడు అవుననలేదు, కాదనలేదు దాని ఊసు తప్పించేసాడు వర్తమానం గురించీ రావడం గురించీ మాత్రమే ప్రస్తావించాడు. అందులోనూ దూతను పట్టుకుని ''సేవకులకు'' అన్నాడు పాముకాటు అన్నాడు నువ్వు పాముకాటుకి గురి అయ్యావు ఇప్పడు చీరతో తుడుచుకుని ఏమి లాభమని

హంసడిభకుల స్వభావం జనార్దనుడికి బాగా తెలుసు. ఏనాడో వారి కొలువు విడిచిపెట్టెయ్యాలి. కనీసం దూర్వాసుణ్ణి అవమానించి నప్పడయినా తాను వాలితో తెగతెంపులు చేసుకొని ఉండాల్సింది శ్రీకృష్ణుని దగ్గరకి వెళ్లిపోయి ఉండాల్సింది అలా చెయ్యలేదు చెయ్యలేకపోవడానికి కారణం రాజభోగాలు హంస డిభకులంటే కుదరకపోయినా ఆదరమో అనాదరమో వాళ్లు కల్పిస్తున్న రాజభోగాలు మాత్రం కావాలి వాటిని వదులుకోలేకపోయాడు అంటిపెట్టుకుని తిట్టుకుంటూనే ఉండి పోయాడు పాము కాటుకు గురి అయ్యాడు ఇప్పడు కృష్ణుడి దగ్గరకు వచ్చి అది తప్పఇది తప్ప అంటూ బడాయి పోతే ఎలాగ ? అందుకని రెండు చురకలు తగిలించాడు స్వామి - అనుకోవాలి భావగ్రాహీ జనార్దనః అన్నారు కనక ఈ జనార్దనుడి అంతరంగంలో ఉన్న భక్తిని ఆ జనార్దనుడు గ్రహించి చురకలతో వదిలేసాడందాం

నువ్వు దాచడమెందుకు నీతప్ప ఏముంది కనక! నిర్భయంగా చెప్ప అనడంతో జనార్దనుడు అసలు విషయం చెబుతున్నాడు

అనుడు నతండు - హంసడిభకానుమతంబున రాజసూయమున్
జనపతి సేయబూని, భుజసారమునన్ సడిసన్న రాజులన్
ధనములు చాల దెండని, పదంపడి దేవర యున్న చోటికిన్
నను బనివంపె, నిన్ను యజనంబున మున్నిడి చేయువాడుగాన్ 4-151

బ్రహ్మదత్తుడు హంసడిభకుల అనుమతితో రాజసూయ యాగం చెయ్యడానికి పూనుకున్నాడు భుజ పరాక్రమంలో ప్రసిద్ధికెక్కిన (సడి సన్న) రాజుల్ని రాజసూయానికి సొమ్ములు తెమ్మని వర్తమానం పంపించాడు ఆ తరువాత (పదంపడి) నీ దగ్గరికి - ఈ ద్వారకకు - నన్ను నియోగించాడు (పనివంచు). బహుశ ఆ యజ్ఞంలో నిన్ను అగ్ర పీఠం మీద కూర్చోబెట్టి (మున్ను ఇడి) చేస్తాడు కాబోలు.

మిగతా రాజుల్ని ధనం చెల్లించమన్నాడు. నీ దగ్గరకు నన్ను పంపించాడు. బహుశ నీకు అగ్రాసనం ఇస్తాడు కాబోలు - ఇవీ జనార్దనుడి మాటలు నిన్ను కప్పం చెల్లించమన్నాడు అనేమాట అనలేదు "రాజులన్ ధనములు తెండని పదంపడి నీ దగ్గరకు నన్ను పంపె" అనడంలో అదే సూచన ఉంది "ఇట చనుదెమ్మను మతని యజ్ఞ సమయంబునకున్" (34)అని మాత్రమే చెప్పారు హంసడిభకులు "నిన్ను యజనంబున మున్నిడి చేయువాడుగాన్" అనేది జనార్దనుడి ఊహ ఇదంతా కృష్ణుణ్ణి మెప్పించడానికో, బ్రహ్మదత్తుడి పేరుమీద హంసడిభకుల్ని తప్పించడానికో

అప్పుడా హంసడిభకు లిట్లనిరి - మనకు
లవణ మెంతేని నడుగు యాదవులచేత,
వేగ రమ్మను శౌరి నియ్యాగమునకు
నాపుడుం బనిపూనితి దేవదేవ! 4-152

"దేవదేవా బ్రహ్మదత్తుడి ఆజ్ఞమీద నేను నీ దగ్గరికి బయలు దేరు తున్నప్పుడు హంసడిభకులు- యాదవుల్ని లవణము ఎంతేని అడుగుము అన్నారు. ఈ యాగానికి శౌరిని వేగం రమ్మను అన్నారు అప్పుడు ఈ దౌత్యానికి పూనుకున్నాను"

లవణము ఎంతేని అడుగుము అనడంలో రెండు మూడు రకాల భావాలు స్ఫురిస్తాయి కప్పంగా అనే మాట రాలేదు యజ్ఞానికి వచ్చే ప్రజా నీకానికి భోజనాలు ఉంటాయి కాబట్టి దానికి ఉప్పు కావాలనడం 'ఎంతేని" అంటే చాలా అని. "యాదవులచేత" అని తృతీయా విభక్తి వల్ల కప్పం అనే స్ఫూర్తి కలుగుతోంది. ఇప్పుడు " ఎంతేని" అంటే లాంఛన ప్రాయంగా ఏదో రెండు మూడు ఉప్పు రాళ్లు కప్పంగా అని.

"వేగ రమ్మను శౌరి నియ్యాగమునకు" అనే మాటలో మరొక చమత్కారాన్ని పెద్దలు చెబుతున్నారు ఈ+యాగమునకు అనే పద విభాగంతో ఈ యజ్ఞమునకు అని అర్థం చెప్పకున్నాం ఈ+ ఆగమునకు - యడాగమం- ఈ+ యాగమునకు-త్రికసంధి-" ఇయ్యాగమునకు" అవుతుంది " ఆగము" అంటే

అల్లరి ''ఆగంచేస్తున్నాడు'' అని వ్యవహారం ఆగస్ శబ్దం ఒకటుంది సకారాంతం పాపం, తప్పు, కిల్బిషం మొదలైన అర్థాలు దానికి ఉన్నాయి తత్సమంగా సకారలోపంతో తెలుగులోకి వస్తే

''ఆగము ' అవుతుంది హంసడిభకులు తాము చేసే ఈ అల్లరికి ఈ పాపకార్యానికి నిన్ను రమ్మన్నారు స్వామీ- అని అంతరార్థమట. ఇదియొక శబ్దచమత్కారము

కృష్ణుడితో సహా యాదవ మహావీరుల్ని హంసుడు తూలనాడిన విషయాన్ని జనార్దనుడు ప్రస్తావనకు తేలేదు అది దూతగా తన సందేశంలో భాగం కాదు అంతకుముందు తానూ తన ప్రభువూ మంచి చెడ్డ లు ఆలోచించుకున్నవి అంచేత వాటిని ప్రస్తావించవలసిన అవసరం జనార్దనుడికి లేదు దూతగా వచ్చి ఆ పని చెయ్యకూడదు

అభీష్టం ఎలా ఉన్నా విధినిర్వహణలో తేడా రాకూడదు సాధ్యమైనంత సుకుమారంగా చెప్పి అంగీకార యోగ్యంగా పలికి జనార్దనుడు ఉత్తమ దూత అనిపించుకోవడంతో పాటు తన స్వామిభక్తిని కూడా ప్రకటించుకున్నాడు

అయితే ఈ మాటలకి శ్రీకృష్ణుడి స్పందన తీవ్రంగానే ఉంది దూర్వాసుడుకూడా అక్కడే ఉన్నాడాయె -

వ. అనుటయు వాసుదేవుండు రోసంబునకు మూలంబైన హాసంబు చేసి యిట్లనియె 4-153

రాజసూయకర్త బ్రహ్మదత్తుండట్టె
రభస మెసగ - హంసడిభకులట్టె
చేయబంచువారు, చెల్లబో లవణంబు
మోచువాడు కాక మురవిరోధి 4- 54

జగద్వ్యాపకుడైన వాసుదేవుడు రోషానికి మూలమైన హాసం చేసాడు చులకనగా పరిహాసోక్తులు పలుకుతున్నాడు. వీర రసానికి ఇవి ఉద్దీపకాలు

రాజసూయం చేసేవాడు బ్రహ్మదత్తుడా ఆర్భాటంగా (రభసము ఎసగన్) చేయించేవారు హంసడిభకులా భేషు భేషు (చెల్లబో) ఇంక ఈ కృష్ణుడు (మురవిరోధి) ఉప్పు మోసేవాడే. కాక తప్పదు

అట - అట్టె అనేవి ఎగతాళిని స్ఫురింపజేస్తాయి ''చెల్లబో'' అనే అవ్యయంకూడా అలాంటిదే మోచువాడు+అ-మోచువాడ అనే అవధార ణార్థకం రోషతీవ్రతని తెలియజేస్తోంది మొయ్యాల్సిందే తప్పతుందా మరి అని - వేళాకోళం

ఉప్పు కప్పంగా చెల్లించాలి అనేదాన్ని తాను ఉప్పు మొయ్యడంగా చిత్రించాడు శ్రీకృష్ణుడు ఇలా తన మీదకి సవాలుగా తీసుకోవడంవల్ల అనుచరులైన యాదవ మహావీరుల్లో రోషమూ హంసడిభకుల మీద ఆగ్రహమూ ప్రజ్వరిల్లుతాయి

శ్రీకృష్ణుడే మాట్లాడుతూ మురవిరోధి అనడం కుదరదు వాచ్యార్థం పొసగదు (రాముడే మాట్లాడుతూ ''రాముణ్ణి కనక అన్నీ సహిస్తాను-రామోజ స్మి

సర్వం సహా''-అన్నట్టు) మురుడి లాంటి మహారాక్షసుల్ని అనాయాసంగా సంహరించినవాణ్ని, నాకు ఈ హంస డిభకులు ఒక లెక్కా అనేది ఈ మాటలో ధ్వని ''మురవిరోధి'' అనేమాట వేరొక అర్థంలోకి సంక్రమిస్తోందన్నమాట ఇటువంటి దాన్ని అర్థాంతర సంక్రమిత వాచ్య ధ్వని అంటారని ఆనందవర్ధనుడు (ధ్వన్యాలోకం) జన వ్యవహారంలో కూడా ఇటువంటి నుడికారం వినపడుతుంది

ఇంక హాస్యపు పూత విడిచి పెట్టేసి, గంభీరంగా రోషావిష్కరణం చేస్తున్నాడు శ్రీకృష్ణుని ముఖంలో కంఠధ్వనిలో వచ్చిన మార్పును ఊహించుకోవాలి.

అప్పన మెంతగావలె నహంకరణంబు దొఱంగి యిచ్చినన్
గప్పముపేర, నేడు నొడికారితనంబున మోసపుచ్చగా
నుప్పలుదెత్తురే! సమరయోగ్యతలంబున వైరికోటితో
నుప్పన బట్టి లాడునెడ నుప్పలు దెత్తురు గాక యాదవుల్ ॥ ।౭౭

వ్యక్తిత్వాన్ని చంపుకుని (అహంకరణంబు దొఱంగి) కప్పం అని చెల్లించినట్టయితే ఆ కానుక (అప్పనము) ఎంతటిది కావాలేమిటి ఉప్పరాయి ఇచ్చినా మేరు పర్వతం ఇచ్చినా ఒక్కటే కప్పం కప్పమే వ్యక్తిత్వాన్ని చంపుకున్నట్టే

''శౌరిని ఇయ్యాగమునకు వేగరమ్మనుము, యాదవులచేత లవణమెంతేని నడుగుము'' అని పదాలు జాగ్రత్తగా పేర్చుకుని కప్పం అనే మాట రాకుండా, ఇంత అని చెప్పకుండా, శత్రుత్వం స్ఫురించకుండా - మాట నేర్పరితనంతో, (నుడి-నొడికారితనంబునన్) మాయచేస్తే (మోసపుచ్చగాన్) ఉప్పు తీసుకువస్తారా మా యాదవులు . తీసుకురారు సమరానికి యోగ్యమైన ప్రదేశంలో శత్రుసమూహంతో ఉప్పన బట్టిలాడేటప్పుడు తప్పకుండా ఉప్పను తీసుకువస్తారు - అంతే.

''అప్పన మెంతగావలె'' అనే ఎత్తుగడలో 'గా' మీద ఉండే ఊనికలో కృష్ణుడి రోషం కస్సుమని లేచిన వైనం కనపడుతుంది అదే భావ తీవ్రతని అనుసంధించుకుని సహృదయుడై పాఠకుడు ఈ పద్యాన్ని చదివితే, శ్రీకృష్ణుడి కదలికలూ ముఖ కవళికలూ ప్రత్యక్షమవుతాయి

ఏ బొమ్మని రూపుకట్టించాలన్నా కవికి ఉన్న ఏకైక సాధనం శబ్దార్థాలే. వాటితోనే అన్నీ రూపుకట్టిస్తాడు సంభాషణలు హ్రస్వ దీర్ఘాలతో సహా సహజతకు దగ్గరగా ఉంటే వాటిని ఉచ్చరిస్తున్న పాత్ర కదలికలూ కళ్ళు ఎగరెయ్యడాలూ తల పంకించడాలూ, చేతులు తిప్పడాలూ, స్వరంలో హెచ్చుతగ్గులూ వగైరా చేష్టలన్నీ పాఠకుడికి అందేస్తాయి ఎటొచ్చీ పాఠకుడు అక్కడి భావంతో ఏకవాక్యత కుదుర్చుకుని సహృదయుడై ఉండాలి అంతే అతడే ఉత్తమ పాఠకుడు ఉత్తమ శ్రోత, సరే - ప్రకృతానికి వస్తే -

ఉప్పన బట్టిలాట తెలుగువారి గ్రామీణ క్రీడ ప్రతిపక్షంవారిని తప్పించుకుంటూ వారికి పట్టుబడి పోకుండా అవతలి గడిలోంచి గుప్పెడు ఇసుక తెచ్చి తమ గడిలో కలుపుకుంటే గెలిచినట్టు. ఇసుక తీసుకు రావడాన్నే ఉప్పు తీసుకురావడం

అంటారు ఇది జయాసిత సంకేతం

హంసడిభకులతో యుద్ధమంటే మాకు ఉప్పన బట్టెలాట లాంటిది వాళ్ల బలాలూ వాళ్ల వరాలూ మమ్మల్ని భయపెట్టవని. ఆ ఉప్పన బట్టెలాటలో మేం తప్ప కుండా ఉప్ప తీసుకువస్తాం అంటే గెలిచి తీరతామని

'' ఉప్పన బట్టెలాటని'' ప్రస్తావించడంవల్ల యాదవవీరుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుంది వీర రసస్థాయి కుదురుకొంటుంది ఇప్పడు వాలితో మాట్లాడుతున్నాడు

వ. అని పలికి యాదవలోకంబు నాలోకించి 4- 56

కలరా యింతకు మున్న యాదవులచే గప్పంబు దెప్పింపగా

గల రారాజులు, గాజులుం దొడవుగా గల్పించిరా, కాకులం

గలకంఠంబుల జేసెనా కటకటా గౌరీశ్వరుం, డేమి కా

గలవారో యిట మీద హంసడి భకుల్ గర్వాంధకారంబునన్ 4-157

శ్రీకృష్ణుడు యాదవవీరుల వైపు ఒక్కసారి అలా చూసాడు ఏమి పలుకుతాడో అని అందరూ సావధానులయ్యారు అదే గాంభీర్యాన్ని కొనసాగిస్తూ -

యాదవ వీరులారా చరిత్రలో ఎప్పడయినా (ఇంతకు మున్ను) యాద వులతో కప్పం కట్టించుకున్న రారాజులు (చక్రవర్తులు) ఉన్నారా? - లేరు అంటే వారంతా గాజులు తొడుక్కున్నవారేనా? (తొడవుగా= భూష ణంగా) ఇంతకాలానికి ఈ హంసడిభకులు బయలుదేరారు- మగవాళ్లు- మనతో కప్పం కట్టించుకోడానికని,

రారాజులే కట్టించుకోలేక పోతే వీళ్లా కట్టించుకోగలిగేది అనీ ఆ రాజులంతా అసమర్థులైనట్టూ వీళ్లుమాత్రమే సమర్థులయినట్టూ బయలు దేరారనీ వ్యంగ్యం

''గౌరీశ్వరుడు-శివుడు (వరాలిచ్చి) కాకుల్ని కోయిలలు చేసాడా అయ్యయో ''భోళాశంకరుడై పనికిమాలినవాళ్లకి అడిగిన వరాలల్లా ఇచ్చేస్తే ఇలాగే ఉంటుందని దెప్పి పొడుపు

''వరాలవల్ల కలిగిన గర్వాంధకారంతో పేట్రేగిపోతున్నారు పాపం హంస డిభకులు ఏమయిపోతారో''

సర్వనాశనమవుతారని తాత్పర్యం ''ఏమి కాగలవారో'' అనడంలో హాస్య స్ఫూర్తి హాస్యవీరాలు భిన్న ధర్మాలు కలిగిన రసాలే అయినా జాగ్రత్త గా నడిపించ గలిగితే హాస్యం వీరరసానికి పరిపోషక మవుతుంది. ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది దాన్ని ఈ ఘట్టంలో గమనించ వచ్చు హాస్యవీరాల- జమిలి రసాల -సాహిత్య రసపోషణ ఇది

శ్రీకృష్ణుడు గంభీరంగా మొదలుపెట్టి ఉదాత్తత చెడిపోకుండా హాస్యస్ఫూర్తితో ముగించాడు యాదవ వీరులు ఆ ముగింపు కొస అందు కున్నారు

వ. అనుటయు యాదవులు తమలోన 4-158

హంసడి భకులు రాజసూయంబు సేయ

మనము కప్పంబు గొనిపోక మంచిమాట,
నేడు సారెసత్తుల మొనల్ వాడిచేసి
నోరిచౌరవ భూతేశుండు వారి జెఱిచె 4-159

హంస డిభకులు రాజసూయం చేస్తోంటే మనం కప్పం తీసుకు వెళ్లడం (కొనిపోక) మంచిమాటే చక్కిలాల మొనలు (సారెసత్తుల మొనలు) సూదిగా చేసి (వాడిచేసి) వాళ్ల నోటి చౌరవతోనే వాళ్లను నాశనం చేస్తున్నాడు ఇవ్వేళ శివుడు.

శివుడు భూతేశుడుగా సర్వసంహారకుడు ఆ పనిని నిర్వ హిస్తున్నాడు. వాడి వేలుతోనే వాడి కన్ను పొడుస్తున్నాడు. హంసడిభకులకు నోటి చౌరవ ఎక్కువ ఆ చౌరవతోనే వరాలడిగారు ఆ చౌరవతోనే దూర్వాసుణ్ణి అవమానించారు ఆ చౌరవతోనే శ్రీకృష్ణుణ్ణి కప్ప మడిగారు ఆ చౌరవతోనే అంతం కాబోతున్నారు

నోరిచౌరవ అంటే జిహ్వా చాపల్యం ఆబగా చక్కిలాలు తినేవాడికి వాటి మొనలు సూదుల్లా చేసి అందిస్తే చిగుళ్లు తెగిపోయి అంగుడు కొట్టుకుపోయి హింస పడతాడు. అదిగో అలాగ శివుడు వరాలిచ్చి వాళ్లని నాశనం చేస్తున్నాడని మొనలు వాడిచేసిన సారెసత్తుల వంటివి వరాలు నోరిచౌరవ ఉండనే ఉంది వినాశం తప్పదని

యాదవు లుప్పు మోవక మురారికి సోలలు మోవ కింక బో
రాదు ,హలాయుధుం గొలువ రమ్మనరై రటుగాని యాగము౦
గాదట చేయ హంసడిభకక్షితిపాలకుమారులంచు, నా
బీదలకేల పోగుబడి బెద్దరికంబును బెట్టబీరమున్ 4- 60

యాదవవీరులు పరస్పరం చేతులు చరుచుకుంటూ –(ఒకరి ఎడమ అరచేతిలో మరొకరు కుడి అరచేయి తాటిస్తూ-కాబోలు) గోలగోలగా అపహాస్యం చేస్తున్నారు ఆటపట్టిస్తున్నారు

యాదవులకు ఉప్పు మొయ్యకా తప్పదు, శ్రీకృష్ణుడికి సోలలు (కొల పాత్ర) మొయ్యకా తప్పదు తప్పించుకోలేమురా (ఇంక పోరాదు) అని

ఇంకా నయం - బలరాముణ్ణికూడా సేవకు రమ్మన్నారు కాదు (రమ్మనరైరి).

అలా అయితేనే గానీ రాజకుమారులైన హంసడిభకులు యాగం చెయ్యడం పూర్తి కాదుట (యాగమున్ చేయ కాదట)

ఇలా అంటూ యాదవవీరులు '' ఒండొరు జెయివ్రేసి'' అపహాసి స్తున్నారు . మరికొందరయితే -

ఆ అల్పులకి (బీదలు=అల్పులు బలహీనులు దరిద్రులు,) ఎందుకయ్యా తెచ్చిపెట్టుకున్న(పోగుబడి) పెద్దరికమూ మహాపరాక్రమమూ నూ, (బెట్టబీరమున్) అంటూ ఒకరొకరు చేతులు చరుచుకుంటూ అపహసింపగా అని తరవాత పద్యంలోకి అన్వయం.

అనుచు నొండొరు జెయివ్రేసి యపహసింప
హరియు గలగల నవ్వి జనార్దనుండు
వినగ నిట్లను - నొండేల వీరవరుల
నలుగు మొనగాఁక కప్పంబు లడుగ నగునె 4-161

యాదవులు గోలగోల చేసేస్తోంటే శ్రీకృష్ణుడుకూడా వంతకలిపి గలగలా నవ్వి దూతగా వచ్చిన జనార్దనుడు వినేటట్టు పలికాడు

ఒండేల ఇంకోటీ ఇంకోటీ ఎందుకు (పెయ్యేల అన్నట్టు) మహా వీరుల్ని రణాగ్రభాగంలో తప్ప (అలుగు=యుద్ధం మొన=అగ్రం) కప్పం అడగవచ్చా! అది తగునా

అరి గరమున నే దాల్చిన
నరి గరము నగేంద్ర ధీరు డయినం జెడడే,
యరి దిరమై నన్నడుగుట
యరిది రమైకాభిలాషులగు నృపతులకున్ 4-162

(అరి=చక్రము, శత్రువు కప్పము, కరము=చేయి, మిక్కిలి, తిరము=స్థిరము అరిది=అరుదైనది)

చక్రాన్ని చేతితో నేను ధరిస్తే శత్రువు మిక్కిలి ధీరుడయినా- మహా పర్వతంలాంటి ధీరుడయినా సరే నాశనమైపోడా

కప్పం చెల్లించమని ధీమాగా (తిరమై) నన్నడగడం, తమ సంపద నిలుపుకోవాలనుకునే రాజులకి చాలా అరుదైన విషయం

తన రాజ్యాన్నీ తన సంపదనీ నిలుపుకోవా లనుకునే రాజు ఎవడూ (రమా+ ఏకభిలాషులు) నన్ను కప్పం అడగడు హంసడిభకులు అడిగారు అంటే నాశనం కోరు కుంటున్నారని

ఒకటి రెండు పాదాల్లో మొదటినుంచి ఆరు అక్షరాలు సమానంగా ఉన్నాయి మూడు నాలుగు పాదాల్లోకూడా దీన్ని కొనసాగించి ఉంటే పంచాక్ష రప్రాసకందం అయ్యుండేది అంటే ఐదు అక్షరాల ప్రాస పాటించినట్టయ్యేది. అలాగే మూడు నాలుగు పాదాల్లో మొదటి నుంచి అయిదు వేరేఅక్షరాలు సమానంగా ఉన్నాయి ఈ క్రమాన్నే పూర్వార్థం లోనూ పాటించి ఉంటే చతురక్షర ప్రాస అయ్యుం డేది కాలేదు ఏ భాగానికి ఆ భాగం శబ్దాలంకారం మాత్రమే

విభిన్న పదాల కూర్పుతో చెవికి ఏక శబ్ద భ్రాంతిని కల్గించాడు అరిగరమున, అరి+ గరము+ న-గేంద్ర అరి+ దిరమై అరిది+రమై-కాభి ఇటువంటి కూర్పు ఒక నవీనగుణం, శ్రోతలకు ఉత్సాహజనకం వీర రసఘట్టం కనక ఈపాటి శబ్దచమత్కారం దృష్టి మళ్లించి రసభంజకం కాదు శ్రీకృష్ణుడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నాడు-

వెదకంబోయిన తీవ కాల దవిలెన్, వేయేల దుర్వాసుచే
మొదటన్ సంచకరంబు హంసడిభకోన్మూల క్రియాకేళికిం
గుదురై యున్నది, సాటిగాక యిట మత్కోదండ కాండోదర
ప్రదర ప్రావరణాంబుద ప్రకట శంపాకంపశాత్కారముల్ 4-163

వెదకబోయిన తీగ కాలికి తగిలింది వెయ్యేల హంస డిభకుల్ని పెకలించి వెయ్యడం (ఉన్మూలక్రియ) అనే కేళికి దూర్వాసుడు ముందే బజానా (సంచకరంబు) ఇచ్చాడు సంధించిన బాణంతో నా ధనుస్సు ఒక మేఘం దానినుంచి ఉరుముల్లా ధ్వనిచేస్తూ (శాత్కారము) మెరుపుల్లా (శంప) బాణాలు వెలువడట మొక్కటే తరువాయి

వెదక బోయిన తీగ కాలికి తగిలింది అనేమాట నిందార్థకం ఆడబోయిన గంగ ఎదురయ్యింది అనేది గౌరవార్థకం తీగను పెకలించి నట్టు తేలికగా హంసడి భకుల్ని ఉన్మూలిస్తాను అని దూర్వాసుడు బజానా ఇచ్చాడు శ్రీకృష్ణుడు పుచ్చు కున్నాడు అంటే ఇంక ఆ పని చెయ్యక తప్పదన్నమాట

ఉప్ప కప్పంగా అడిగి మమ్మల్ని అవమానించినందుకు కాదు దూర్వాసాది ముని పుంగవుల్ని అవమానించినందుకు ఈ శిక్ష అని

మత్కోదండ కాండోదర . . శాత్కారముల్ అనే సమాసంలో ప్రసాదగుణం లేదు. అంటున్న శ్రీ కృష్ణుడిలోనూ లేదు రౌద్రం స్ఫురిస్తోంది

జనార్దనుడు వెళ్ళి హంసడిభకులకు ఏమి చెప్పాలో - ప్రతి సందేశం - వివరిస్తున్నాడు

వ. వారలతో నిట్లనుము 4-164

ఈశు వరముచేత నెవ్వడే నిప్పాట
శూరుడైన- దువ్వుజూచి నక్క
యొడలు గాల్చికొన్న వడువున మీరింత
లావు మాటలాడ లజ్జగాదె! 4-165

జనార్దనా వాళ్లతో ఇలా చెప్ప శివుడిచ్చిన వరంతో ఎవడైనా ఇలా (ఇప్పాటన్) మహావీరుడయితే కావచ్చు. కానీ అలాంటివాణ్ని చూసి మీరిలా వీరాలాపాలు (లావు మాటలు=పెద్దపెద్దమాటలు) పలకడం సిగ్గు సిగ్గు పులిని చూసి (దువ్వుజూచి) నక్క తన వొళ్లంతా వాతలు పెట్టుకున్నట్టు (వడువున=వలె) ఉంది మీ వ్యవహారం.

హరి గదావిహార మల్లంత దోచిన
వరము మిమ్ము గావ వలతి యగునె!
వెఱ్ఱివార! పిడుగు వ్రేసిన దలనొప్పి
యాగునే! వివేకమ్మైన వలదె! 4-166

ఈ శ్రీకృష్ణుడి గదావిహారం అల్లంత దూరంలో కనిపించిందంటే చాలు

వరం గిరం పాలిపోవలసిందే అది మిమ్మల్ని కాపాడగల్గుతుందా! (వలతి= సమర్థము)

పెఱ్ఱి మొహోల్లారా (పెఱ్ఱివారు అనే పదానికి సంబోధన) పిడుగు పడితే తలటోపీ ఆగుతుందా? ఆ మాత్రం వివేకమయినా ఉండవద్దా?

రవ్వంత అలుసు దొరక బుచ్చుకొని పెఱ్ఱి మొహోల్లారా అని నిందించెయ్యడం గడసరితనం రెండు పద్యాల్లోనూ రెండు లోకోక్తులున్నాయి. పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం పిడుగు పడితే టోపీ కాపాడు తుందా? అనడం రెండూ వివేక హీనతను తెలియజెప్పేవే

స్వతహాగా బలపరాక్రమాలు లేకపోతే లేకపోయాయి కనీసం వివేకమైనా ఉండవద్దా అని ఎగతాళి ఇవి శత్రుపక్షాన్ని ఎగసన దొయ్యడం తో పాటు స్వపక్షాన్ని ఉత్సాహపరుస్తాయి

అగునో కావో వరములు
డిగ విడువగ రాదు హంసడిభకుల, నన్నున్
మొగలించిన హరునైనను
జగ మెఱుగగ దోలి తమ్ము జంపెద ననుమీ 4-167

వరాలు ఉన్నాయో లేవో (అవి కాపాడతాయో కాపాడవో అది వేరే సంగతి). హంస డిభకుల్నిమాత్రం వదలను- వదలరాదు

నన్ను ఎదిరిస్తే (మొగలించినన్=తలపడితే) శివుణ్ణయినా సరే ప్రపంచాని కంతటికీ తెలిసేలాగా పారద్రోలి హంసడిభకుల్ని చంపుతానని చెప్పు.

తన భక్తుల్ని కాపాడుకోడానికి ఒకవేళ శివుడే స్వయంగా వచ్చినా ప్రయోజనం ఉండబోదని

పరపగు మోహర మేర్పను
పెరవగుచో నెల్లి నేడు విడిసెద మధురా
పురమున బ్రయాగమున బు
ష్కరమున దారేర్చికొన్న కలనగు మాకున్ 4-168

మహాయుద్ధం జరగడానికి తగినచోట ఇవ్వేళ రేపు విడిది చేస్తాను. అది మధురా పట్టణమో ప్రయాగయో పుష్కరస్థలమో – ఎక్కడంటే అక్కడ – వాళ్లు ఎంచుకున్న యుద్ధమే (ఏర్చికొన్న కలను) మాకూ సమ్మతమే (మాకున్ అగున్)

రణరంగం ఎంపిక మీదే. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తామని ఏ యుద్ధం చెయ్యాలి - కత్తి యుద్ధమా? గదా యుద్ధమా? ద్వంద్వ యుద్ధమా? ఈ ఎంపిక కూడా మీదే మీరు నేర్చిన యుద్ధంలోనే మిమ్మల్ని ఓడిస్తామని

మొగమోటంబున నీవు వారియెదుటన్ ముఖ్యంబు యుద్ధంబికా
దెగనాడన్ వెఱతేని సాత్యకి సమిద్ధీరుండు నీతోన యే

గి గుణగ్రాహులు గాని తద్ధరణీభృత్కీటాంతరంగంబులం
బగులన్వ్రేచు గఠోరవీర వచనప్రాస ప్రసారోద్ధతిన్ 4-169

(సమిత్=యుద్ధం, గుణగ్రాహులు=మంచిని గ్రహించేవారు, విల్లు ఎక్కుపెట్టేవారు. ప్రాస=ఖడ్గము, అనుప్రాస)

జనార్దనా యుద్ధమే ముఖ్యం అని నేనన్న మాటలన్నీ వాలి యెదురుగుండా యధాతథంగా చెప్పడానికి నువ్వు మొగమోట పడతావేమో భయపడతావేమో అంచేత రణమహావీరుడు (సమిత్ ధీరుడు)మా సాత్యకి నీతోపాటే వస్తాడు. మీవాళ్లు గుణగ్రాహులు కాదు రాజకీటాలు (అల్పులు) మావాడు వచ్చి తన కఠోర వీరవచనాలు అనే ఖడ్గప్రసారంతో దాని ఉద్ధతితో మీ రాజకీటాల గుండెలు బద్దలు కొడతాడు - చీల్చి చెండాడి వస్తాడు

సాత్యకిని పంపడమెందుకంటే నిజంగా జనార్దనుడు చెప్పలేడని కాదు హంసడిభకుల్ని మానసికంగా ముందు ఓడించడానికి కుంగ దియ్యడానికి. దానికి సాత్యకి ఒక్కడే సమర్థుడు ఇతడు వెడితే వాళ్ల యుద్ధసన్నద్ధతనుకూడా అంచనా వేసి రాగలడు

వ. అని పలికి సాత్యకిం గనుంగొని నీవితనితోడ సాల్వనగరంబునకు హయారోహణుండవై సన్నాహంబు మెఱసి యొక్కరుండవ చని మదీయ వచనంబులన్నియు దద్రాజ డింభకుల యెదుర బలికి కలను చెప్పి రమ్మని వీడుకొల్పిన 4-170

జనార్దనుడితోకూడా సాల్వనగరానికి వెళ్లమని సాత్యకిని ఆజ్ఞాపించాడు. గుఱ్ఱంమీద వెళ్లమన్నాడు. ఒక్కడివే వెళ్లు అన్నాడు సన్నాహంతో వెళ్లమన్నాడు. ఆ రాజడింభకులకు నా మాటలన్నీ చెప్పమన్నాడు యుద్ధం చెప్పి రమ్మన్నాడు

''కలను చెప్పి రమ్మను'' అనేది తెలుగు నుడికారం భోజనాలు చెప్పారన్నట్టు

పుష్కర క్షేత్రంలో జరిగిన ఘోరయుద్ధంలో హంస డిభకుల పని అయిపోతుంది యుద్ధ వర్ణనల్లోకూడా తిక్కన బాణీ కనపడుతుంది తెలుగు కవిత్వాన్ని తేజస్వంతం చేసిన కవుల్లో నాచన సోమన్న ఒకడు అందుకే ''సోముడు భాస్కరుండు వెలిగింపన్'' అన్నాడు భట్టుమూర్తి

శ్రీనాథుడు (క్రీ.శ.1380నుండి1450)

కాశీఖండము (గుణనిధి కథ 4-78 నుండి 134)

కవిత్రయంలో ఎవరి పేరు చెప్పినా నైష్ఠికరూపం మనసులో సాక్షాత్కరిస్తుంది మడికట్టుకుని కూర్చున్న పెద్దరికం రూపుకడుతుంది శ్రీనాధుని పేరు చెప్పగానే ఒక విలాస పురుషుడు, ఒక భోగపరాయణుడు, రాజసం ఉట్టిపడే రూపంతో కనపడతాడు జనజీవనంతో చెయ్యి కలిపిన చైతన్యమూర్తి స్ఫురిస్తాడు బహుశ దీనికి కారణం శ్రీనాధుని పేర ప్రసిద్ధి కెక్కిన చాటువులూ, క్రీడాభిరామం పలనాటి వీర చరిత్ర రచనలూ కావచ్చు, నాటి రెడ్డి రాజులతో శ్రీనాధుని చెలిమి, పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి పదవి మరికొంత కారణం. పోతనతో బంధుత్వం కలిపి ప్రచారంలోకి వచ్చిన కథలు సరేసరి అన్నీకలిసి శ్రీనాథుడుకి ఒక రూపం ఇచ్చాయి అది తెలుగు ప్రజల హృదయాల్లో స్థిరపడిపోయింది. నిజంగా శ్రీనాథుడు నిజ జీవితంలో అలా ఉన్నాడో లేదో ఆజానుబాహువు అవునో కాదో !!

చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు
రచియించితి మరుత్త రాట్చరిత్ర
నూనూగు మీసాల నూత్న యౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున గొని
యాడితి భీమనాయకుని మహిమ
ప్రాయమింతకు మిగుల గై వ్రాలకుండ
గాశికాఖండమను మహాగ్రంథ మేను
దెనుగు జేసెద గర్ణాట దేశ కటక
పద్మవన హేళి శ్రీనాథ భట్ట సుకవి

ఇది కాశీఖండం అవతారికలో శ్రీనాథుడు చెప్పకొన్న పద్యం దీన్ని బట్టి చూస్తే ఇతడు పుట్టుకవి అన్పిస్తాడు ఏదో కొంతకాలం కవితా రచన చేసి ఊరుకున్న వాడు కాడు కవిగా పుట్టి కవిగా జీవించి కవిగానే గిట్టినవాడు యావజ్జీవితం కవితా సృష్టి చేసినవాడు మరుత్తరాట్చరిత్ర శాలివాహన సప్తశతి ఇతని తొలి రచనలు ఇవి ఇంతవరకూ దొరకలేదు శృంగార నైషధం భీమేశ్వరపురాణం కాశీఖండం ఇవేకాక హరవిలాసం శివరాత్రి మాహాత్మ్యం ఇవీ శ్రీనాథుడి రచనలే.

పలనాటి వీరచరిత్రలో కల్లు ప్రతిష్ఠ బాలచంద్రుని యుద్ధం అనే భాగాలను శ్రీనాధుడు రచించాడంటారు అలాగే క్రీడాభిరామం వల్లభరాయని రచనమే అయినా శ్రీనాథుడి చెయ్యి ఉంది అంటారు ఇవి ఏడూ లభిస్తున్న రచనలు

ధనంజయ విజయం నందనందనచరిత్ర వల్లభాభ్యుదయం అనేవి శ్రీనాధుడి ఇతర రచనలుగా వినపడుతున్నాయి. కానీ అవి ఇంతవరకూ కనపడలేదు. ఇతడి మరొక రచన పండితారాధ్య చరిత్ర అదీ దొరకలేదు.

వక్రత కాఠిన్యం సరసత అనేవి తన కవితా గుణాలుగా శ్రీనాధుడు పేర్కొన్నాడు.

హరచూడా హరిణాంక వక్రతయు గాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధరస్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననగా సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండు గవిరాజీ గేహరంగంబులన్ (భీమ. -1)

వక్రత గురించి ఆలంకారికులు రకరకాల అభిప్రాయాలు ప్రకటించారు కట్టకడపటికి ఇది సౌందర్య పర్యాయం అయ్యింది శబ్ద వక్రత-అర్ధ వక్రత అని ఇది ప్రధానంగా రెండువిధాలు శబ్ద సౌందర్యం అర్ధ సౌందర్యం ఉంటాయని పైగా ఇది హరిణాంక వక్రత చంద్రుని తాలూకు వక్రత ఆ చంద్రుడుకూడా ఆకాశంలో ఉన్న చంద్రుడు కాదు శివునికి శిరోభూషణంగా అలంకారంగా ఉన్న చంద్రుడు అంటే శ్రీనాధుని కావ్యాలు శివపారమ్య స్థాపకాలనీ ఆహ్లాదకరత్వం ప్రధాన లక్షణమనీ అలంకార ప్రాధాన్యం వ్యంగ్యం

కాఠిన్యంకూడా దారుశిలా కాఠిన్యం కాదు స్తన కాఠిన్యం అదీ చండికా స్తన కాఠిన్యం అంటే భక్తిలోకి పర్యవసించే రక్తి అనుకోవాలి స్తన కాఠిన్యం కనక ఆభాస మాత్రమే శబ్ద యోజనలో ప్రౌఢి అంతేకానీ అన్వయ కాఠిన్యం కాదు అనేకశాస్త్ర విషయాలు ప్రస్తావనకు వచ్చినందు వల్ల ఏర్పడే కాఠిన్యంకూడా. హృదయ విస్తార కారకం వక్రత అయితే బుద్ధి విస్తారకారకం ఈ కఠినత పాఠకుణ్ణి వ్యుత్పన్నుణ్ణి చెయ్యడమనేది కూడా కావ్య ప్రయోజనాల్లో ఒకటి.

సరసత్వం అన్నింటికీ పైది పతాక రససహితత్వం ''రసప్రసిద్ధ ధారాధుని'' అని శ్రీనాధుని ప్రసిద్ధి ఏది చెప్పినా రసమహితంగా చెపుతాడు రసోచితమైన కాఠిన్యం, రసోచితమైన వక్రత ఉంటాయని

శ్రీనాధుడు ఆకాంక్షించినట్టుగానే అతడివి సత్కావ్యాలై కవుల ఇళ్ళల్లో హృదయాల్లో చిరకాలంగా నటిస్తున్నాయి నటిస్తాయి

తెలుగు సాహిత్యంలో క్షేత్రమాహాత్మ్యకావ్యశాఖకు భీమఖండ కాశీఖండా లతో శ్రీకారం చుట్టినవాడు శ్రీనాధుడు

సర్వవిధాలా భ్రష్టుడైన ఒకడు చివరి క్షణంలో అసంకల్పితంగానైనా సరే దైవదర్శనం చెయ్యడమో దివ్యక్షేత్రంలో ప్రాణాలు వదలడమో జరిగి అతడు సరాసరి ముక్తి పొందెయ్యడమనే కథ, ఇంచుమించు అన్ని క్షేత్ర మాహాత్మ్యకావ్యాలలోనూ కనపడుతుంటుంది అదిశైవం కావచ్చు వైష్ణవం కావచ్చు వాడు ఎంత భ్రష్టుడైనట్లు వర్ణిస్తే అంత మంచిది. అంతటి భ్రష్టుణ్ణికూడా ముక్తుణ్ణి చెయ్యగలిగిన క్షేత్రమిది

అని క్షేత్ర పరమైన దివ్యత్వానికి ఇది అతిశయాన్ని కలిగిస్తుంది

కాశీఖండంలో కుబేర వృత్తాంతంలో ప్రస్తావనకు వచ్చిన గుణనిధి కథ ఇటు వంటిది కాంపిల్య నగరంలో యజ్ఞదత్తుని కొడుకు ఈ గుణనిధి ఇతడు మరుసటి జన్మలో కళింగదేశాధిపతి అయ్యాడు దముడు అప్పటి పేరు. ఆ దముడే దీపికాదాన పుణ్య ప్రభావంతో తరువాత జన్మలో కుబేరుడయ్యాడు

గుణనిధి కథను సుమారు అరవై గద్యపద్యాల్లో శ్రీనాథుడు వర్ణించాడు (కాశీ చతుర్థ78 నుంచి 34)తరువాత కాలంలో సుకుమారుడు (శివరాత్రి మాహాత్మ్యం) నిగమశర్మ (పాండురంగ మాహాత్మ్యం) నిరంకుశుడు (నిరంకుశోపాఖ్యానం) మొదలైన పాత్రలకు ఈ గుణనిధి మార్గదర్శకుడయ్యాడు

భూసురోత్తమ! కాంపిల్య పురమునందు
యజ్ఞదత్తాఖ్యుఁ డొక్క బ్రాహ్మణుడు గలఁడు
వేదవేదాంగ వేదార్థ విత్తముండు
యజ్ఞ విద్యావిశారదుం డా ద్విజుండు 4-78

విష్ణుదూతలు శివశర్మకు స్వర్గాది సమస్తలోకాలనూ వర్ణించి చెపుతూ ఆ క్రమంలో దిక్పాలకుల వృత్తాంతాలు వివరిస్తారు. ఇది కుబేర వృత్తాంతంలో కథ. ' భూసురోత్తమ' అనేది శివశర్మకు సంబోధన "బ్రాహ్మణోత్తమా " అని

ఓ శివశర్మా కాంపిల్య నగరంలో యజ్ఞదత్తుడు అని ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు ఆయన వేదపండితుడు వేదాంగాలైన ఆరు శాస్త్రాలనూ అధ్యయనం చేసాడు వేదం వల్లించడం మాత్రమే కాదు దాని అర్థంకూడా తెలిసినవాడు. వేదార్థ వేత్తలలో అగ్రగణ్యుడు (వేదార్థవిత్+తముడు) యజ్ఞాలు చెయ్యడం ,చేయించడం అనే శ్రౌత విద్యలో ఆలతేరినవాడు

అతని పుత్రుఁడు గుణనిధి యనెడివాఁడు
దర్పకుని తోడిజోడు సౌందర్య రేఖ
నెయ్య మలరంగ గురు లుపనీతు జేసి
చదువ బెట్టిరి వాని నాచార్యు నొద్ద. 4-79

ఆ యజ్ఞదత్తుని పుత్రుడే గుణనిధి. ఇతడు సౌందర్యంలో మన్మధునికి (దర్పకునికి) సరిజోడు. యజ్ఞదత్తుడూ తక్కిన పెద్దలూ ఎంతో ప్రేమతో ఇతడికి ఉపనయనం చేసి (ఉపనీతుజేసి) ఒక గురువు దగ్గర వేదాది విద్యలన్నీ నేర్పించారు

గుణనిధిని పరిచయం చేస్తూనే "దర్పకుని తోడిజోడు" అన్నాడు కవి. సౌందర్యారాధనమే ప్రధానంగా కామపురుషార్థానికి దాసుడై ఆచార భ్రష్టుడయ్యాడని సూచన

ద్యూత క్రీడా రతుడై
యాతఁడు కితవులును దాను నాసాయం బా
ప్రాతస్సమయము దిరుగు న
పేత నిజాచారుఁడగుచు నెల్లెడ వీటన్ 4-80

ఈ గుణనిధి జూదరి (ద్యూత క్రీడారతుడు) అయిపోయాడు. ఎప్పుడూ జూదగాళ్ళతోనే(కితవులు) తిరుగుతున్నాడు ప్రొద్దుటినుంచి సాయంకాలం వరకూ ఇదే పని. మళ్ళీ సాయంకాలంనుంచి ప్రొద్దుటి వరకూ ఇదే పని తన కులమేమిటో, తాను పాటించవలసిన ఆచారా లేమిటో చెయ్యవలసిన విధులేమిటో అన్నీ వదిలేసాడు (అపేత= విడిచిపెట్టిన, నిజ=తనయొక్క ఆచారములు కలవాడు) పట్టణంలో ఎక్కడ చూసినా ఇతడే

ఆసాయము ఆప్రాతస్సమయము అనేవి అవ్యయీ భావసమా సాలు మర్యాద (అంతవరకు) అభివిధి (దానితో కలిపి) అనే అర్థాలలో ఆఙ్ అనే ఉపసర్గ సాయమ్ ప్రాతస్సమయ పదాలతో సమసించిం ది ''ఆ సాయము'' అంటే ప్రొద్దుటి నుంచి సాయంకాలము వరకు అని. ''ఆ ప్రాత స్సమయము'' అంటే సాయంకాలం నుంచి మర్నాటి ఉదయం వరకు అని

పూర్తిగా ఇల్లు విడిచి పోలేదు ఇల్లు పట్టకుండా తిరుగుతున్నాడు అంతే. రోజులో ఏదో ఒక సమయంలో ప్రొద్దుటా సాయంత్రమూ ఇంటికి వస్తున్నాడు నాలుగు మెతుకులు తింటున్నాడు కాసేపు ఇంట్లో ఉన్నట్టు అభినయిస్తున్నాడు కావల సింది ఏదో పట్టుకొని పోతున్నాడన్నమాట. '' ఆ సాయం బాప్రాతస్సమయము దిరుగు '' అని విరవడంలో వెసులుబాటు ఇది

నిజాచారాలు ఏవేవి విడిచి పెట్టేసాడు కితవులతో కలిసి ఏమేమి ఆచరిస్తు న్నాడు అనేది వివరిస్తున్నాడు ఈ తరవాత పద్యంలో -

బ్రాహ్మణాచారంబు పరిహాసకము సేయు
నగ్నిహోత్రవిధాన మన్న నలుగు
సంధ్యాభివందన శ్రద్ధ యుజ్జన సేయు
గీత వాద్య వినోదకేళి దగులు
పాషండ భండ దుర్భాష లావర్తించు
ద్యూతకారులతోడి యుద్ది వడయు
ధాతువాదుల మీద దాత్పర్య మొనరించు
జెలిమి పాటించు నాస్తికులతోడ
వటుల మన్నించు, హర్షించు విటుల జూచి,
పీఠమర్దుల దొనరించు బెద్దతీకము
తొలటేయుల బాటించు గారవించు
శిష్టకుల దీక్షితుని పట్టి సిగ్గు విడిచి 4-81

బ్రాహ్మణాచారము అంటే చాలు అది ఏమైనా సరే పరిహాసము చేస్తున్నాడు ''మనది నిత్యాగ్ని హోత్రుల వంశం, అగ్ని హోత్రం చెయ్యరా నాయనా!'' అంటే ''చెయ్యను పో'' అని అలుగుతున్నాడు ముప్పొద్దులా సంధ్య వార్చాలి సంధ్యావం దనం చెయ్యాలి. ఆ శ్రద్ధ పొత్తిగా వదిలేశాడు (ఉజ్జన చేసాడు) సత్కర్మాచరణకు

బేతవోలు

(కాయిక తపస్సుకు) దూరమయ్యాడని

గీత వాద్యవినోదకేళికి తగులుకున్నాడు భక్తి గీతాలు కాదు వినోదగీతాలు. అదికూడా ఒక కేళి పిచ్చి పాటలూ పిచ్చిగంతులూ ఆ జనాలతో తిరుగుతున్నాడు.

''తగులుకొన్నాడు '' అనడంవల్ల ఆ బూతు పాటలూ పాటగత్తెలూ వాద్య గాంధ్రూ - ఇదంతా గుణనిధికి వ్యసనమయ్యిందని వ్యంగ్యం.

వేద ప్రామాణ్యాన్ని అంగీకరించనివాళ్ళను పాషండులు అంటారు భండులు అంటే దుష్టులు ఆకతాయి జనం వీళ్లు పలికే దుర్భాషల్ని చిలక పలుకుల్లా అనువదిస్తు న్నాడుట గుణనిధి అంటే వేదదూషణ దైవదూషణ చేస్తున్నాడని. వాచిక తపస్సుకు దూరమయ్యాడు

ద్యూతకారులతో పోటీపడుతున్నాడు ధాతువాదుల మీద నమ్మకం పెట్టు కొంటున్నాడు

దాతువాదులు అంటే రసవాదులు పాదరసాన్ని బంగారంగా మారుస్తామనే వాళ్లు ప్రకృతి విరుద్ధులు. ఈ రసవాదాన్ని నమ్మి ఆస్థులు పాగొట్టుకున్నవాళ్ళూ, మతి చలించినవాళ్ళూ చాలామంది ఉన్నారు

ద్యూత వ్యసనానికిలోనై పెట్టుబడికి ధనమవసరమై పాదరసంతో బంగారం తయారుచేసి ఇస్తామనేవాళ్ళని నమ్ముతున్నాడనీ ఇంతటి దుస్థితికి దిగజారాడనీ తాత్పర్యం

గుణనిధి నాస్తికులతో చెలిమి చేస్తున్నాడు (పాటించు). తన లాంటివాళ్ళు ఇంకా మరికొందరు ఆ కాంపిల్యనగరంలో ఉన్నారన్నమాట వారితో ఇతడికి చెలిమి

జూదరులది విచిత్రమైన మనస్తత్వం గెలవడానికీ కానిదానికీ శకునాలు చూడటం మొక్కుకోవడం లాంటి మనఃస్థితి కొందరిదైతే, స్వయంకృతాపరాధాలవల్ల గట్టిగా దెబ్బతిని అసలు దేవుడే లేడు పొమ్మనే విపరీతస్థితికి చేరుకొనేవారు కొందరు జూదరులై కానీ కాకనోగానీ నాస్తి కులైనవాళ్ళతో గుణనిధి స్నేహం చేస్తున్నాడు.

నటులను గౌరవిస్తున్నాడు విటులను చూసి సంతోషిస్తున్నాడు పీఠమర్ద లకు పెద్దరికం ఇస్తున్నాడు. వేశ్యాపుత్రుల్ని (కులట=వేశ్య, కౌల టేయులు=వేశ్యల సంతా నం) గౌరవించి మన్నిస్తున్నాడు

పూర్తిగా సిగ్గువిడిచి ఇదంతా చేస్తున్నది- కాంపిల్యనగరంలో శిష్టుల సమూ హానికి దీక్షితుడైన యజ్ఞదత్తుని ఏకైకపుత్రరత్నం సిగ్గు అనే రెండక్షరాల మాటని వదిలి పెట్టెయ్యాలే కానీ ఎవ్వడైనా ఎంత పని అయినా చేసెయ్యవచ్చు-

''కౌలటేయుల బాటించు గారవించు జేటకుల దీక్షితుని పట్టి సిగ్గు విడిచి '' అని పాఠాంతరం కనపడుతోంది కౌలటేయులను పాటిం చును, చేటకులను గౌరవించును అని అన్వయం విట పీఠమర్దులతో పాటు ఈ పాఠంలో చేటులు వచ్చారు

నటవిట గాయకులూ వర్ధీవ్యాపారులూ (వార్ధుషికులు) పంక్తి బాహ్యులని

ఒకప్పటి ధర్మశాస్త్రాల మాట నటన గానం అనేవి సమ్మోహన విద్యలనీ, వాటినభ్యసిం చినవారి ప్రవర్తన తేడాగా ఉంటుందనీ ధర్మశాస్త్ర కర్తల భావన? విటులు సరేసరి. వడ్డీవ్యాపారులది ఓ రకం హింసా ప్రవృత్తి వీరిని శిష్టులు సహపంక్తిని భోజనాదులకు కూర్చోపెట్టుకోకూడదని అప్పటి నియమం ఇది దరహం మీద అప్పటి పరిస్థితుల్ని బట్టి చెప్పినమాటే తప్ప నటగాయకుల్లో శిష్టులు అసలే ఉండరని కాదు ఈ గణంలో కొందరు కవులనుకూడా చేర్చారు స్పందించే మనస్సు ఉంటుంది కనక శీలసంపద ఉండవలసినంతగా ఉండదేమోనని కాబోలు

అలంకార శాస్త్రంలో శృంగార నాయకుడికి సహాయకులుగా విటుడు విదూషకుడు చేటుడు, పీఠమర్దుడు అని నలుగుర్ని చెప్పారు దేశకాలజ్ఞులై ఉండటం మధురంగా సంభాషించగలగడం, జాణతనం, నాయకుణ్నిగానీ నాయికలను గానీ ప్రోత్సహించడంలో నేర్పరులు కావడం చెప్పింది చెప్పినట్టు చెప్పగలగడం రహస్యాలను కాపాడటం, రహస్యంగా మంత్రాలోచనలు జరపడం ఇత్యాదులు ఈ నలుగురికీ ఉండే గుణాలు. (దేశకాలజ్ఞతా భాషామాధుర్యం చ విదగ్ధతా ప్రోత్సాహనే కుశలతా యథోక్త కథనం తధా నిగూఢమంత్రతేత్యాద్యా: సహాయానాం గుణా మతా: రసార్ణవ- -౬౩)

ఈ నలుగురిలోనూ పీఠమర్దుడు ఇంచుమించు నాయకునితో సమా నుడు అతనికంటే గుణాలలో కొంచెం తక్కువవాడు నాయకుడికి అనుచరుడే కాదు భక్తుడుకూడా. నాయకుడి మీద అలిగిన నాయికల దగ్గరికి వెళ్ళి వాళ్ళ కోపాన్ని పోగొట్టి అనుకూల పరచడం ఇతని ప్రధాన కర్తవ్యం. అంతటి జాణతనం ఉన్నవాడు పీఠ మర్దుడు (నాయకానుచరో భక్త:కించిదూనశ్చ తద్గుణై: పీఠమర్ద ఇతి ఖ్యాత: కుపితస్త్రీప్రసాదక:రసార్ణవ - -౬౦) కామశాస్త్ర రహస్యాలూ కామకళలూ తెలిసిన వాడు విటుడు (కామతంత్ర కళావేదీ విట ఇత్యభిధీయతే(-౬) నాయికను నాయకునికి సంధానపరచగల నేర్పరి చేటుడు (సంధానకుశలశ్చేట: కలహంసాదికో మత: సాధారణంగా నాటకాలలో చేటుడికి కలహంసుడు మొదలైన పేర్లుంటాయి) వికృతాకారంతో వికృత వాక్కులతో వికృత చేష్ట లతో నవ్వు పుట్టించే వాడు విదూషకుడు. (వికృతాంగవచోవేషైర్హాస్యకారీ విదూషక: -౬౨)

రసార్ణవసుధాకరంలో సింగభూపాలుడు వీరికి లక్షణాలను అలా వివ రించాడు.

వీళ్ళల్లో విటులనీ పీఠమర్దుల్నీ చేటకుల్నీ గుణనిధి చేరదీస్తున్నాడు. చెలిమి చేస్తున్నాడు. అంటే వాళ్ళ అవసరం ఇతడికి ఏర్పడిందన్నమాట కేవలం ద్యూత పరాయణుడు మాత్రమే కాదు స్త్రీలోలుడు కూడా అయ్యాడని

గుణనిధి విడిచిపెట్టేసిన సదాచారాన్నీ చేపట్టిన భ్రష్టాచారాన్నీ శ్రీనాథుడు ఒకే పద్యంలో చెప్పినా విడివిడిగా చెప్పాడు ఈ రెండింటినీ కలిపి తెనాలి రామకృష్ణుడు నిగమశర్మోపాఖ్యానంలో అద్భుతమైన పద్యం సృష్టించాడు ఉష్ణాని హోమాగ్ని యూద

నొల్లడుగాని విరహజ్వరార్తిచే వెచ్చ నూర్చు-అంటూ

జూదం ఆడటానికి డబ్బు ఎక్కడినుంచి వచ్చింది మన గుణనిధికి అనేది తెలియజేస్తున్నాడు -

వ. సజీవ నిర్జీవ ద్యూతంబుల నోడిన ధనంబులు గితవులకుం దల్లి మేని రవణంబుల నమ్మి పెట్టుచుండు. 4-82

సజీవద్యూతాలు అంటే నట్టువరాంధ్ర గెలుపు ఓటముల మీద, పరకాంతల లొంగుబాటులమీద పందేలు కాయడం. కోడి పందేలు, పొట్టేళ్ళ పందేలు, పరుగూ ఈతా పందేలు ఈ కోవలోవే నిర్జీవద్యూతాలు అంటే పాచికలు-చదరంగం-(పేట్ల పేక) ఇత్యాదులు డబ్బు పణంగా పెట్టి గుణనిధి ఈ రెండు రకాల జూదాలూ ఆడుతు న్నాడు ఓడిపోతున్నాడు అవతల గెలిచిన జూదగాళ్ళకి (కితవులకు) తాను ఓడిపోయిన దనం చెల్లించాలి ఇందుకోసం తన తల్లి ఒంటిమీద ఆభరణాలు (రవణంబులు) తీసుకుపోయి అవి తెగనమ్మి పణం చెల్లిస్తు న్నాడు

దనం అవసరమైనప్పుడు ఇల్లు కనపడుతోంది వస్తున్నాడు. నగా నట్రా పట్టుకుపోతున్నాడు పుత్రవ్యామోహంతో ఆ తల్లి ఇస్తోంది ఇక నైనా మారతాడు, ఇకనైనా మారతాడు అనుకుంటోంది అమ్మా ఈ క్షణంనుంచి మానేస్తాను , మారి పోయానులాంటి కల్లబొల్లి కబుర్లేవో చెబుతున్నాడు నమ్మిస్తున్నాడు ఆ రకం మనుషుల కి ఆ చాతుర్యం బాగా ఉంటుంది పిచ్చి తల్లి నమ్మేస్తోంది చాలామంది ఇంతే నిజా యితీపరుణ్ణి నమ్మరుగానీ మోసగాణ్ణి చటుక్కున నమ్మేస్తారు పైగా కన్న పేగు. ఆశ చావదు పాపం

వచ్చినప్పుడల్లా ప్రేమగా చూసి ఏదో ఒక ఉపదేశం చేస్తూనే ఉంది దారికి తెద్దామని ఆ తల్లి ప్రయత్నిస్తూనే ఉంది

తల్లి బోధించు దత్పర్వత్వంబు గలిగి
యన్న! మీ యన్న చెప్పినయట్ల చేయు,
ధూర్త సంగతి విడువు, సాధువులతోడ
బరిచయము సేయు మని పుత్రు బ్రతిదినంబు 4-83

"నాయనా మీనాన్న చెప్పినట్లు నడుచుకోరా!(లేదా-మీ నాన్న మొండి వాడు ఏదైనా అన్నాడంటే అన్నంతపనీ చేస్తాడు కనక-) ధూర్తులతో సాంగత్యం వదిలి పెట్టరా! సజ్జనులతో (సాధువులు) మైత్రి పెట్టుకోరా! ఏమిటిరా ఈ తిరుగుళ్ళు" అని ఆ తల్లి ప్రతీరోజూ బోధిస్తూనే ఉంది- మారతాడనే నమ్మకంతో (తత్పరత్వంబు కలిగి)

తండ్రిని అన్నా అని పిలవడం ఈనాటికీ కొన్ని ప్రాంతాల వాడుకలో ఉంది నాయన్నా -నాయనా-నాన్న అయ్యిందని కొందరి ఊహ.

తల్లి ఉపదేశిస్తోంది కొడుకు లక్ష్యపెట్టడం లేదు. తండ్రి అంటే భయమే కానీ ఆయనగారికి ఇతణ్ణి పట్టించుకునేంత తీరికలేదు.

వ. దీక్షితుండును గృహకార్యాభ్యంతర వ్యగ్రుండై

కొడుకు వర్తనంబు బరామర్శింపక యుండు   4-84

ఇల్లు గడవడానికి కావలసినవి సంపాదించడం, అగ్నికార్యాలూ, యజ్ఞయాగాదులూ వీటితోనే సరిపోతోంది యజ్ఞదత్తదీక్షితులవారికి కొడుకు ఏం చదువుతున్నాడు, ఏం చేస్తున్నాడు అని పరామర్శించడానికి తీరికలేదు ఏ భోజనాల వేళనో జ్ఞాపకం వచ్చి, అడపాదడపా విచారణ చేస్తున్నాడు

ఎడప దడప -తనూభవుండెచట నుండె
గానరాడంచు గృహభర్త కాంతనడుగ .
నింత దడవును నాయొద్ద నిచట నుండి
యరిగె జదువంగ నని భర్త కతివ మొఱగు   4-85

ఏడే మీ అబ్బాయి? ఎక్కడున్నాడు? అసలు కనపడటం లేదు అని ఎప్పుడయినా గృహభర్త అడిగితే "అయ్యో ఇంతసేపూ ఇక్కడే నా దగ్గరే ఉన్నాడండీ! ఇప్పుడే చదువుకోవడానికి వెళ్ళాడు" అని ఆ తల్లి అబద్ధ మాడేది కొడుకు ప్రవర్తనని కప్పిపుచ్చేది (మొఱగుట) భర్తకి తెలియనిచ్చేదికాదు

" స్నానమాడెనె ? వార్చెనే సంధ్య? యగ్ని
హోత్ర మొనరించెనే ? యింతి! పుత్రు " డనిన
" స్నానమాడెను, వార్చెను సంధ్య, యగ్ని
హోత్ర మొనరించె" ననుచును నువిద మొఱగు   4-86

" ఇంతీ! పుత్రుడు స్నానం చేసాడా? సంధ్య వార్చాడా ? అగ్ని హోత్రం వేల్చాడా ? అని దీక్షితులుగారు అడిగితే " ఆహా స్నానమాడాడు సంధ్య వార్చాడు, అగ్నిహోత్రం చేసాడు "అని అన్నింటికీ తడుముకోకుండా ఖచ్చితంగా అబద్ధాలు చెబుతోంది (మొఱగుట) ఆ ఇల్లాలు

ఇదీ కన్న తల్లిగా ఆవిడ చేసిన పెద్ద పొరపాటు. పుత్ర వ్యామోహం అలా చేయించింది

గొడ్డు వీగి కన్న బిడ్డండు కావున
పొక్కరుండ కాన వుత్పలాక్షి
ధూర్తుడైన వాని దుశ్చేష్టితము లెల్ల
వధవు పెఱుగనీక యడచుచుండు   4-87

చాలాకాలం దాకా ఈ దంపతులకు సంతానం లేదు అందరూ ఈవిణ్ణి గొడ్రాలు అన్నారు అలాంటి గొడ్డుతనం వీగిపోయి వీణ్ణి ప్రసవించింది లేకలేక కలిగిన సంతానం అదొక కారణం మళ్లీ ఈవిడ కడుపు పండలేదు. ఏకైక పుత్రుడు ఇది రెండవ కారణం అంచేత వాడు ఎంత చెడిపోయినా ధూర్తుడైపోయినా వాడి దుశ్చేష్టల్ని భర్తకి తెలియ నివ్వలేదు. దాచేసింది (అడచు చుండు).

తెలిస్తే చంపేస్తాడని భయం. తననీ చంపుతాడు. కొడుకునీ చంపుతాడు. అంత చండశాసనుడుగా తండ్రి ఉండటం అదొక తప్పు ఇటువంటి తల్లులూ తండ్రు

లూ కొడుకులూ ఎప్పుడూ సమాజంలో ఉంటూనే ఉంటా రు వారిని హెచ్చరించడం కోసమే ఈ కథ

ఇలాంటి చెడు తిరుగుళ్ళు తిరిగే ఏకైక పుత్రుల విషయంలో ''వాడికి పెళ్ళిచేస్తే బాగుపడుతాడు'' అని తల్లితండ్రులు విశ్వసించడం, ''చక్కని చుక్కను చూసి కట్టబెట్టండి ఇంక ఎవ్వరూ ఆనరు, కొంగుపట్టుకు తిరుగుతాడు'' అని బంధువులు ప్రోత్సహించడం- కద్దు మరోప్రాణిని బలిచేస్తున్నాం అనుకోరు అదేమిటో

వ. చూడాకర్మానంతరంబున షోడశ వర్షంబున గృహ్యోక్త ప్రకారంబున నతనికి వివాహంబు చేసి ప్రత్యహంబును 4-88

చూడాకర్మ అంటే పుట్టు వెంట్రుకలు తీయించడం. ఇది బేసి సంవత్సరాల్లో చేస్తారు మూడు అయిదు ఏడు సంవత్సరాల వయస్సులో చేసే సంస్కారం ఎనిమిదవ సంవత్సరంలో ఉపనయనం చెయ్యాలని ధర్మశాస్త్రం చెబుతోంది

'నెయ్యమలరంగ గురు లు నీతు జేసి చదువబెట్టిరి వాని నాచార్యు నొద్ద' (72) అని ఇంతకుముందే చెప్పాడు. ఎనిమిదవ ఏట గుణనిధికి ఉపనయనం జరిగింది మళ్లీ ఇపుడు ''చూడాకర్మానంతరంబున'' అని చెప్పడంలో ఆంతర్యం ఏమిటో స్పష్టంగా బోధపడటంలేదు

అయితే ప్రాయశ్చిత్తోపనయనాన్ని ధర్మశాస్త్రాలు (ధర్మసింధువు) చెబు తున్నాయి మద్యపానమూ మాంసాదిభక్షణమూ,వృషభాద్యారోహణమూ,వ్యభిచారమూ - ఇలాంటి అకృత్యాలు (అపేయపాన అభక్ష్య భక్షణ అకార్యకరణాలు) చేసినప్పుడు ప్రాయశ్చిత్తంగా సంస్కారాలు అన్నీ చేస్తారు దీనికి పూర్వాంగంగా జాతకర్మాది సంస్కారాలు అన్నీ చెయ్యవలసి ఉంటుంది అప్పుడు మళ్ళీ పుట్టు వెంట్రుకలు తీయిస్తారు బహుశా ఇది జరిగిందేమో

అయితే గుణనిధి భ్రష్టుడయ్యాడనే సంగతి తల్లికి తెలుసునేగానీ ఇంత వరకూ తండ్రికి తెలియదు అలాంటప్పుడు ప్రాయశ్చిత్తోపనయనం చూడాకరణం వగైరాలు యజ్ఞదత్తుడు ఎందుకు చేయిస్తాడనేది ఒక ధర్మసందేహం ఏవో అకృత్యాలు చేసే ఉంటాడులే ఎందుకైనా మంచిది అని చేయించాడేమో గుణనిధి సంధ్యవారుస్తూ ఈ తండ్రికి ఏనాడూ కనపడలేదు కదా అన్నీ తల్లి సర్దిచెప్పడమేనాయె (దీనికి ఇంతకన్నా మంచి సమన్వయం దొరుకుతుందేమో చూడాలి)

''కాశీఖండ ''మణికర్ణికా ' వ్యాఖ్యలో శ్రీ మల్లంపల్లివారు'' ఇచట చూడ కర్మ యనగా వివాహమునకు ముందరిదైన స్నాతకవ్రతములోని గోదానము కేశఖండనమని తెలియనగును గోశబ్దమునకు కేశములని యర్థము దానము=ఖండనము 'దో' అవఖండనే అని ధాతువు ''అనిచెబుతూ ''అథాస్య గోదానవిధేరనంతరం వివాహ దీక్షాం నిరవర్తయద్గురుః'' అనే రఘువంశం మూడవ శ్లోకాన్ని ఉపబలకంగా చూపించారు ద్వి భా పుట-7

పదహారో ఏడు వచ్చాక గృహ్యసూత్రాల్లో చెప్పిన ప్రకారం గుణనిధికి

వివాహం జరిపించారు తల్లి మాత్రం ప్రతిరోజూ చెవిలో ఇల్లు కట్టుకుని ఉపదేశం చేస్తూనే ఉంది

స్నేహార్ద్ర హృదయయయ్యై యతి
సాహస కృత్యములు మాన సమకొల్పుటకై
యూహాపోహ విచార స
మాహిత గతి దల్లి సుతుని మఱి బోధించున్ 4-89

ఆవిడది పుత్రస్నేహంతో ఆర్ద్రమైన హృదయం ఎలాగైనా ఈ అతి సాహస కృత్యాలు మాన్పిద్దామని ఆమె ప్రయత్నం. ఊహలు కొన్నీ నిజాలు కొన్నీ (అప+ ఊహ= అపోహ= ఊహ కానిది=సత్యము) ఆలోచనలు కొన్నీ వీటన్నింటితోనూ ఏకోన్ముఖమైన పద్ధతిలో (సమాహితగతి) సుతుడికి బోధలు చేస్తోంది నయానా భయానా చెబుతోంది

అన్న! మీ తండ్రి కోపగాడౌనొ కాదొ!
యీవు పొనరించు దుర్వృత్త మెఱిగెనేని
గల్లతనమున పలుమాఱు గప్పి పుచ్చ
నట్టి నామీద ఱంపంగ నలుగకున్నె! 4-90

నాన్నా! మీ నాన్న కోపగాడవునో కాదో కానీ నువ్వు చేస్తున్న చెడ్డ పనులూ నీ చెడు ప్రవర్తన తెలిసాయంటే ఇంకేమయినా ఉందా? నిన్ను గురించి ఎప్పుడు అడిగినా నేను అబద్ధాలు చెప్పి (కల్లతనమున) కప్పిపుచ్చుతూనే ఉన్నాను. ఇందుకు నన్ను చంపేస్తాడు అంత కోపమూ వస్తుంది మీ నాన్నకి

సచ్ఛ్రోత్రియులు ననూచానులు సోమ పీ
థులు నైన కులము పెద్దల దలంచి
రాజమాన్యుడు సత్యరతుడు వినిర్మలా
చారవంతుడునైన జనకు దలచి
భాగ్యసంపద బుణ్యపతిదేవతలలోన
నెన్నంగ దగియెడు నన్ను దలచి
వేదశాస్త్ర పురాణ విద్యానిరూఢులై
వాసికెక్కిన తోడివారి దలచి
చెడ్డయింటి చెదారమై శివుని కరుణ
నివ్వటిలు నిర్వదేనేండ్ల నిన్ను దలచి
పదియునార్వత్సరంబుల భార్య దలచి
గోరతనములు మానురా! కొడుకు గుణ్ణ!! 4-91

కొడుకులకి నాన్న మీద అభిమానం ఉన్నా లేకపోయినా అమ్మ మీద తప్పకుండా ఉంటుంది అందుకని " మీ నాన్నకి తెలిస్తే ముందు నన్ను చంపుతారురా నాయనా" అని తనమీద వేసుకుని కొంతకాలం ఉపదేశాలు చేసింది లాభించలేదు.

చేతవోలు

ఇప్పుడు ఆభిజాత్యాన్ని-వంశ గౌరవాన్ని తెలియజెప్పి పౌరుషపడేట్టు చేద్దామని ప్రయత్నిస్తోంది

ఒరే . కొడుకు కుఱ్ఱా ! (కుఱ్ఱ వయసులో ఉన్న కొడుకా) మన కులం పెద్దలను ఒకసారి తలుచుకోరా అందరూ శ్రోత్రియులురా వేద వేదాంగ పండితులురా (అనూచానులు) యజ్ఞాలు చేసి సోమరసం చవిగొన్న సోమపీథులురా వీళ్ళని ఒకసారి తలుచుకోరా ఇటువంటి వంశంలో పుట్టామే, ఏమిటి ఈ ప్రవర్తన అని పశ్చాత్తాపపడి ప్రవర్తన మార్చుకోరా.

నీ తండ్రి చూడు , ఎటువంటి మహానుభావుడో మహారాజుల చేత గౌరవాలు పొందుతున్నాడు సత్యసంధుడు మాలిన్యం లేనివాడు. పరమనైష్ఠికుడు ఈ తండ్రికి తగిన తనయుణ్ణి అనిపించుకోరా

పోనీ నాకోసం-నా ముఖం చూసయినా మారరా పవిత్రలైన పతివ్రతలలో చేర్చదగిన వ్యక్తిత్వం నాది అంతటి భాగ్యవంతురాలిని. నన్ను చూసయినా నీ అల్లరి పనులు మానరా (పతియే దేవతగా కలది-పతి దేవత=పతివ్రత)

ఇరుగుపొరుగు బ్రాహ్మణ కుమారుల్ని చూడు.నీ వయస్సువాళ్ళే, అప్పుడే వేదాల్లో పురాణాల్లో శాస్త్రాల్లో పాండిత్యం సంపాదించి పేరు గడించారు నీతోటి వాళ్ళే కదా . వాళ్ళని చూసయినా నీ నడవడి దిద్దుకోరా తండ్రీ

శివుని దయవల్ల లేకలేక మాకు సంతానంగా జన్మించావు ఏమి లాభం చెడ్డయింటి చెదారమయ్యావు (చెత్త). ఇప్పటికి ఇరవై అయిదేళ్ళు (ఇరువది+ ఏను) నీ నెత్తిమీదకి వచ్చినాయి ఇంకా ఎంతకాలం రా నిన్ను నువ్వే చూసుకుని, ఆత్మ పరామర్శ చేసుకొని బాగుపడరా

ఇప్పుడు నీ ప్రాణానికి మరొక ప్రాణం జతపడింది. పదారు వసంతాల పడుచు వయసులో ఉంది కోడలుపిల్ల బంగారపు బొమ్మ దాని ముఖం చూసయినా ఇక నీ చెడు నడతలు (గోరతనములు)మానుకోరా!

అఖిల కల్యాణ గుణగణాయత్త యత్త
మామ యౌదార్య తేజః క్షమామహితుడు
మాతులుండు యశోమహిమాతులుండు
తనయ ! యేలయ్య కైకోవు వినయ బుద్ధి !! 4-92

నీకు పిల్లనిచ్చిన అత్తగారా సకల సద్గుణసమన్విత నీ మామగారా ఔదార్యానికీ తేజస్సుకీ ఓర్పుకీ పెట్టింది పేరు నీ మేనమామ (మాతులుడు) యశోమహితుల్లో సాటిలేనివాడు నువ్వేమిటి ఇలా తయ్యారయ్యావు ? నాన్నా! వినయ బుద్ధి అలవరుచుకోరా నా మాట వినరా

గుణగణ+ ఆయత్త+ అత్త=గుణగణాయత్త యత్త. మామ ..క్షమా మహితుడు మాతులుడు (మహిమ+అతులుడు)-మహిమాతులుడు పదాలు వేరు అర్థాలూ వేరు కానీ కూర్పులో అక్షరాల క్రమం '' యత్త యత్త'' మామ మామ'' మాతులుడు

మాతులుడు'' అని పునరావృత్త మయ్యేట్టు చేసాడు ఇదొక శబ్ద చమత్కారం గ్రథన వక్రత.

వంశ గౌరవం చూడమంది. సాటివాళ్ళని చూడమంది నీ పెళ్ళాం కాపురానికి వచ్చింది. ఇక నీ భవిష్యత్తు నువ్వు చూసుకోవాలంది అత్త వారింట్లోనూ ఎంత చులకన అయిపోతావో గ్రహించమంది మేనమామల ముందు ఎంత తేలికయిపోతావో చూసుకోమంది అన్నివైపులనుంచీ ఆలోచించి బుద్ధులు చెపుతోంది బంధుత్వాలూ గౌరవ మర్యాదలూ చూపించి చెప్పడం అయ్యింది ఇంక ఇప్పుడు అసలుకే మోసం వచ్చే సంగతి ప్రస్తావిస్తోంది

ఎవళ్ళు ఏమనుకొంటే నాకేమిటి ? ఎవరి గౌరవం ఏ గంగలో కలిస్తే నాకేమి నా జూదాలకూ నా తిరుగుళ్ళకూ సొమ్ములు దొరుకుతున్నాయి కదా అనుకొంటున్నావేమో అదీ ఊడుతుంది సుమా- అని హెచ్చరిస్తోంది

విడువక నీవు పట్టణము వీథుల వీథుల వెఱ్ఱివాడవై
చెడుగుల గూడి ధౌర్త్యములు సేయ మహీరమణుం డెఱింగెనేన్
విడుచునను సోమయాజి, మను వృత్తులు చేకొను నెల్ల భంగులన్
జెడుదుము నీకతంబునను జీరయు కూడునులేక పుత్రకా! 4-93

నాయనా నువ్వు ఇలాగే వెఱ్ఱివాడవై ఈ కాంపిల్య పట్టణంలో వీధులన్నీ తిరుగుతూ దుష్టులతో కలిసి ధూర్త కృత్యాలు (ధౌర్త్యములు) చేస్తూ ఉంటే అది రాజుగారికి ఇవ్వేళో రేపో తెలుస్తుంది తెలిసాక ఊరుకుంటాడా మీ తండ్రిని పరిత్యజిస్తాడు. (విడుచును) కొలువునుంచి తప్పిస్తాడు ఇంతకాలం ఇస్తున్న మనువృత్తులు అన్నీ వెనక్కి తీసేసుకుంటాడు (మనుటకు ఆధారమైన వృత్తులు జీవనాధారాలు. వార్షికాలు, భూములు వగైరా)

పుత్రకా నీ పుణ్యమా అని- నీ కారణంగా (నీ కతంబునన్) కూడుకీ గుడ్డకీ (చీరయు) దూరమై మేమంతా చెడిపోతాం. ఎల్లభంగులన్ చెడుదుము- సర్వవిధాలా నాశనమైపోతాం (ఎల్లభంగులన్ చేకొను అని కూడా అన్వయించవచ్చు)

ఇదీ కట్టకడపటికి నువ్వు చేసే నిర్వాకమని విడమర్చి చెప్పింది. నీవల్ల మేమంతా చెడిపోవడం మాట అలా ఉంచి వ్యక్తిగతంగా నీ కెంత నగుబాటో తెలుసుకోమని వివరిస్తోంది

పట్టణములోన నీవు దర్పమున జేయు
కొయ్యతనములు వీక్షించి కూర్మితనయ!
నవ్వుదురు నిన్ను మొదల, నానా విధముల
నవ్వుదురు దీక్షితుని ననంతరమ జనులు 4-94

ఓ అనుంగుపుత్రుడా! (కూర్మితనయా) ఈ పురంలో దర్పంతో నువ్వు చేసే సిగ్గుమాలిన పనులు (కొయ్యతనములు) చూసి ప్రజలంతా మొట్టమొదట నిన్ను పరిహసిస్తారు. నవ్విపోతారు. అటుపైని మీ తండ్రి దీక్షితులవారిని నానావిధాలా ఎగతాళి చేస్తారు

నీ పనులవల్ల నువ్వే కాదు నీ కన్న తండ్రికూడా నవ్వుల పాలు అవుతాడని. కొయ్యతనములు దర్పమున చేస్తున్నాడనటం చమత్కారం గుట్టుచప్పుడు కాకుండా ఏవో బలహీనతలు తీర్చుకుంటున్నావా అంటే అదికాదు లీవిగా దర్పంగా, నేను చేసేది తప్పు కాదు అన్నంత ధీమగా, పదిమందికీ తెలిసేటట్టు చేస్తున్నావు ఈ సిగ్గుమాలిన పనులు - అని

నీ తండ్రితో ఆగుతుందా నన్నూ తిడుతుంది లోకం- అంటోంది.

వ. అనియంత నిలువక 4-౨౮

తల్లి బడి కొల్లి చెట్టంచు నుల్లసంబు
లాడుదురు నన్ను గూర్చి నిన్న హరహంబు
దుర్ణయం బెల్ల నామీద ద్రోచి జనులు-
డబ్బరలు పల్కువారి కడ్డంబు గలదె! 4-౨౯

(ఉపదేశం చేస్తూ ఒక్క నిమేషం ఊపిరి తీసుకుంది ఆ తల్లి దానికి సూచన అని అన్న వచనం)

తల్లి వెంటే కొల్లి చెట్టు అని నన్నుకూడా నీతో కలిపి ఈ జనులు ఇక రోజూ (అహరహంబు) పరిహసిస్తారు.ఎత్తి పొడుస్తారు. (ఉల్లసంబులు ఆడుదురు) మొత్తం నీ తప్పు అంతా నామీదకి తోసేస్తారు నిందారోపణ లు చేసేవారికి (దబ్బరలు=అసత్యాలు) అడ్డమూ ఆపూ ఉన్నాయా? (లోకు ల నోటికి తాళం ఉందా? లోకానికి మూకుడు ఉందా ? అన్నట్టు)

తల్లిని బట్టే కొల్లి చెట్టు అన్నది ఒక లోకోక్తి.తల్లి గుణాలే సంతానానికీ వస్తాయి అని దీని తాత్పర్యం కావచ్చు. ఇది శ్రీనాథుని కాలంలో వాడుకలో ఉండేదన్నమాట కొల్లి చెట్టు అంటే ఏమిటో దానికి తల్లి చెట్టు లక్షణాలు ఏమేమి ఎలా వస్తాయో స్పష్టంగా తెలియడంలేదు కొల్లి= ఒకా నొక చెట్టు ఇంతమాత్రమే- నిఘంటువులు చెపుతున్నాయి తల్లి చెట్టు ఎటువంగితే పిల్ల చెట్టు అటే వంగడంలాంటి పోలికలేవో ఈ జాతి చెట్టుకి ఉండి ఉంటాయి ఇవన్నీ ఊహలు మాత్రమే తద్‌జ్ఞలు దీనిని వివరించ వలసిందిగా ప్రార్థన

అముక్తమాల్యదలో రాయలవారు కూడా దీన్ని ఇలాగే ప్రయో గించారు 'అకులేతద్వదనేందురాగ తల్లిబడి కోల్ చెట్టాటయేకా మహిన్ (5- 32)చెట్టు+ ఔట అని వావిళ్ళవారూ చెట్ట+ ఔట అని వేదంవారూ వ్యాఖ్యానించారు మల్లంపల్లివారి కాశీఖండం వ్యాఖ్యలోకూడా దీనికి ఇంతకన్నా వివరణ లేదు చట్టు (శిష్యుడు) అనే పాఠం స్వీకరించి తల్లిబడి లో కొల్లి(కొడుకు)శిష్యుడు అని అర్థం చెప్పారు శ్రీయార్లగడ్డ బాలగంగాధరరావు గారు కొల్లిచట్టు+అంచు అని పాఠాంతరం కనపడు తోంది. చట్టు అంటే రాయి ఇదీ అగమ్యగోచరంగానే ఉంది ''దుర్ణయం బెల్ల నామీద'' అనడానికి బదులు ''దుర్ణయం బుల్ల నా మీద'' అని మరొక పాఠం కనపడుతోంది ఉల్ల - అల్ల అనేవి పర్యాయపదాలు నీ దుర్ణయాన్ని (అవినీతిని) అల్లా నా మీదకి తోసేస్తారు అని అన్వయం

కొడుకు ఇలా భ్రష్టుడయ్యాడంటే ఆ తల్లి గుణాలే వచ్చి ఉంటా యని కొంద రూ, ఆ మహాతల్లి ఇంకెంతటిదో అని కొందరూ నన్నుకూడా ఆడిపోసుకుంటారురా నాయనా. నీవల్ల నేనుకూడా వీధిని పడతానురా బాబూ అని ఆ తల్లి వాపోయింది. మాతృప్రేమతోనైనా మారతాడేమోనని ఆవిడ ఆశ - చిట్టచివరికి అంటుంది

అవినయ నిధాన మగు నీ
నవయౌవన శైశవముల నడిమి వయసునం
గవిసెడు వ్యసనోద్రేకం
బవగాఢము దీని మానవయ్య తనూజా! 4-97

కుమారా! నవయౌవనానికీ బాల్యకౌమారాలకీ (శైశవవయస్సు) మధ్య ఉండే ఇప్పటి నీ వయస్సు ఉందే ఇది చాలా ప్రమాదకరమైనది అన్ని రకాల అవలక్షణా లకీ అవినయాలకీ నిలయం (నిధానము) ఈ వయస్సులో అలవాటయిన వ్యసనాలు ఒక పట్టాన వదలవు చాలా గాఢంగా ఉంటాయి (అవగాఢము= లోతు) జీవితాంతం పట్టి పీడిస్తాయి అంచేత నా మాట విని బాబ్బాబు ఇప్పుడే వాటిని వదిలెయ్యరా

అలవాటుగా మారకముందే ఆదిలోనే వదిలెయ్యమని ఆమె ఉపదేశం. ''మానవయ్యా'' అనడంలో ఆర్ద్రత, మాతృప్రేమ వాత్సల్యం, అభ్యర్దన ప్రార్థన ఇన్ని భావాలు స్ఫురిస్తున్నాయి 'తనూజా' అనడంలో రక్తం పంచుకుని పుట్టినవాడా నీకు జన్మనిచ్చిన తల్లి-కన్నపేగు-ఎంతగా తల్లడిల్లిపోతోందో గమనించరా అనే స్ఫూర్తి ఉంది.

వ. **అని యనేకప్రకారంబుల బోధించిన తల్లి మాటలు చెవుల సోకనీక యిట్టట్టనక యూరకుండె. మృగయా మద్య పైశున్య వేశ్యా చౌర్య దురోదర పరదారాభిలాషంబులను దోషంబులు నవయౌవనారంభమున సంభవించె నేని వానిం బరావర్తింప నెవ్వరు నేర్తురు. గురువచనం బతినిర్మలంబయ్యు నిలిలంబునుం బోలె శ్రవణ స్థితం బై యభవ్యునికి శూల పుట్టించు. అయథార్థ నామధేయుండగు నగ్గుణనిధి యథాపూర్వంబు దుర్వర్తనంబుల దిరుగుచుం డ నొక్కనాడు** 4-98

అనేక పద్ధతులతో అనేక కోణాలనుంచి తల్లి బోధలు చేసింది వేటినీ చెవికి సోక నివ్వలేదు గుణనిధి. అవుననలేదు కాదనలేదు ఊరుకున్నాడు బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నాడు.

వేట మద్యపానం కొండేలు చెప్పడం (పిశునుడు= కొండేలు చెప్పేవాడు), వేశ్యాలోలత్వం, దొంగతనాలు చెయ్యడం జూదమాడటం (దురోదరము), పరస్త్రీలను వాంఛించడం- ఈ దోషాలు కనక నవయౌవ నారంభంలో (పదారేళ్ళ వయస్సు) అలవాటైతే ఇక వాటిని వదిలించు కోవడమనేది ఎవ్వడితరమూ కాదు ఇప్పుడు గుణనిధి పరిస్థితి ఇది

పెద్దలు మలినం లేని మంచిమాటలు చెపుతారు ఈ గురువచనా లు చెవిలో పడితే నీళ్ళల్లాగా దుష్టుడికి (అభవ్యునికి) కర్ణశూల పుట్టిస్తాయి నీళ్ళు మంచివే అయినా

చెవిలోకి పెడితే ఎలా పోటు వస్తుందో దుష్టుడికి పెద్దలు చెప్పే మంచి మాటలు అలా చెవిపోటుగా ఉంటాయి

పేరు చూస్తే గుణనిధి ప్రవర్తన చూస్తే దుర్గుణనిధి అసత్య నామధేయుడు తల్లి ఎంత చెప్పినా ఎంత బతిమాలినా వీడు తన ప్రవర్తన మార్చుకోలేదు పాత పద్ధతిలోనే (యధాపూర్వంబు) దుష్ట ప్రవర్తనతో అలాగే తిరుగుతున్నాడు ఇలా ఉండగా ఒకరోజు ఏం జరిగిందంటే-

దర్శనం బిచ్చె నెద్దాని గోమటి క్రొత్త
పాడచూపనేతెంచి భూభుజునకు
దనకిచ్చె నెద్దాని ధారాంబుపూర్వంబు
పుణ్యకాలమునాడు భూమి భర్త
దానిచ్చె నెద్దాని ధర్మగేహినియైన
సోమిదమ్మకు మనఃప్రేమ మలర
దలి చూచి యిచ్చెనెద్దాని బట్టికి దల్లి
జూదమోడిన పైడి సుట్టికొనిన
నట్టి నవరత్నమయమైన యంగుళీయ
కంబు యజ్ఞావభృథ పుణ్య కర్మసాక్షి
వీటిలో నొక్క జూదరి వ్రేల నుండ
జూచె గను విప్ప వెట్టక సోమయాజి 4-99

సోమయాజిగారు వీధి వెంట నడిచి వస్తున్నారు ఒక జూదరి ఎవడో ఎదురయ్యాడు వాడి చేతి వేలికి నవరత్న ఖచితమైన ఉంగరం ఉంది అది తనదే. వీడి చేతికి ఎలా వచ్చింది చెప్మా అని ఆశ్చర్యపోయాడు. ఆ అంగుళీయకం చరిత్ర ఏమిటో దాని ఘనత ఏమిటో వివరిస్తూ ఈ సన్నివేశానికి తలుపులు తీస్తున్నాడు శ్రీనాథుడు కథనకౌశలం

అనగాఅనగా ఒక పెద్ద వ్యాపారి. ఆయన ఒకరోజున కాంపిల్య ప్రభువులను మొట్టమొదటి సారిగా దర్శించడానికి వచ్చాడు. ప్రథమ దర్శనంలో రాజుగారికి ఏదో ఒకవిలువైన కానుక సమర్పించడం రివాజు. (లేకపోతే వీళ్ళ వ్యాపారాలు సాగవు) నవరత్న ఖచితాంగుళీయకాన్ని బహూకరించాడు. (దర్శనంబిచ్చె)

ఆ ఉంగరాన్ని మన రాజుగారు ఒక పర్వదినాన శుభసమయంలో సోమయాజిగారికి ధారపోసి దానం చేసారు.

దాన్ని భద్రంగా తీసుకువచ్చి సోమయాజిగారు తన ధర్మపత్ని సోమిదమ్మగారికి ప్రేమగా అందించారు- జాగ్రత్త పెట్టమని.

ఆవిడేం చేసిందీ - కొడుకు జూదంలో ఓడిపోయిన సొమ్ము చెల్లిం చాల్సివచ్చి మెడకి చుట్టుకుంటే(చుట్టుకొనిన) సోమయాజులుగారు ఇంట్లో లేని సమయం చూసి (తలి చూచి) కొడుక్కి ఇచ్చింది (పట్టికి ఇచ్చె ఎద్దా నిన్) దీన్ని పట్టుకువెళ్ళి జూదం

బాకీగా జమకట్టరా తండ్రీ అని ఇచ్చింది

వ్యాపారితో మొదలై ఇలా ఇది చేతులు మారుతూ వచ్చి వచ్చి ఇప్పుడు జూదగాడికి దక్కింది

అటువంటి నవరత్నమయమైన అంగుళీయకం యజ్ఞ పరి సమాప్తికి నిదర్శనమైన అంగుళీయకం-అది ఇవ్వేళ ఈ నగరంలో ఒక జూదగాడి వ్రేలికి ఉండటం చూసారు సోమయాజిగారు కనురెప్ప వెయ్యకుండా చూసారు

యజ్ఞం పూర్తి అయ్యాక యజమానుడు దీక్షావిరమణగా చేసే స్నానాన్ని అవభృథ స్నానం అంటారు (రాజసూయావభృథంబునందు వసుధామరమంత్ర పవిత్ర వారి ధారావళి జేసి పావనములైన శిరోజముల న్ తెమల్చిపట్టి పాపావహుడీడ్చి తెచ్చె సభ కందఱు విస్మయమంది చూడ గన్'' అంది నన్నయగారి వాగ్దేవి) అప్పుడు ఆ యజమానుడు- కాంపిల్య ప్రభువు - యజ్ఞ విధాన విశారదుడైన యజ్ఞదత్త సోమయాజికి-బ్రహ్మ గారికి- తన చేతి నవరత్న ఖచితాంగుళీయకం బహూకరించాడన్న మాట అంచేత ఈ ఉంగరం యజ్ఞావభృథ పవిత్రకార్య క్రమానికి సాక్షి. అది ఇప్పుడు ఒక జూదగాడి వేలిని కనపడటంతో సోమయాజిగారు ఆశ్చర్యపోయారు

వ. చూచి తన సొమ్మౌట యెఱింగి దీక్షితుం డక్షక్రీడాజీవనుం గదిసి కేలు వట్టి యెత్తి ''యీ యంగుళీయకంబు నీ కెట్లు గలిగె? ఉన్న రూపు చెప్పు. తప్పఁ జెప్పితేని భూపాలు సన్నిధిం బెట్టి నిజంబు దెలిపి దండింతు'' ననిన జూదరి ''నీ తనయుండు గుణనిధి నెత్తంబున నొడ్డిన విత్తంబునకై యీ యంగుళీయకంబు నాకిచ్చె. మఱి బంగారు భృంగారు కర్కరీకలాచికలు, తలియలు, పళ్లెరంబులు, తామ్రపాత్రంబు, లారకూట ఘటంబులన్నియుం దాఁకట్టు వెట్టియు దురోదర క్రీడా పరాయణుండై పట్టణంబులోన జరియించుచున్నవాడు. 4- 00

యజ్ఞదత్తదీక్షితుడు ఆ జూదరి చేతికి ఉన్న ఉంగరం చూసాడు అది తన ఆభరణమే అని గ్రహించాడు (అటువంటి ఉంగరం ఆ పట్టణంలో ఇంకెవ్వరికీ లేదు. అదొక్కటే) వాడి దగ్గరకి వెళ్లాడు ఆ చెయ్యిపట్టుకొని పైకెత్తాడు

అబ్బాయ్ ఈ ఉంగరం నీకు ఎక్కడినుంచి వచ్చింది? ఉన్నది ఉన్నట్లు చెప్పు (ఉన్నరూపు). అబద్ధంచెప్పావో నిన్ను రాజుగారి ఎదట నిలబెడతా నిజం తెలియపరిచి నిన్ను శిక్షిస్తా. చెప్పు అని కాస్త గదమాయించాడు

అవతలివాడు జూదరి. మామూలు జూదగాడు కాదు ముదురు. అక్షక్రీడా జీవనుడు. అంటే పాచికలాడి (అక్షములు=పాచికలు) పొట్టపోసుకుంటున్నాడు జూదమే వాడికి జీవనాధార విద్య వాడు గద మాయింపులకీ అదమాయింపులకీ బెదురుతాడా! ధీమాగా నిలబడి '' ఏమిటయ్యోయ్ . గట్టిగా మాట్లాడుతున్నావ్'' అనే పద్ధతిలో సమాధానం చెప్పాడు

నీ కొడుకు గుణనిధి ఉన్నాడే అతడు జూదంలో (నెత్తంబున) నాకు ఓడి

పోయిన డబ్బుకి బదులుగా ఈ ఉంగరం ఇచ్చాడు. ఇదొక్కటే కాదు బంగారపు గిన్నెలు (భృంగారువులు) దోసకాయ చెంబులు (కర్కరీ) తాంబూలం ఉమ్మేపాత్రలు, (కళాచికలు) భోజనపాత్రలు(తలియ) పళ్లేలు, రాగిపాత్రలు, ఇత్తడి బిందెలు (ఆరకూట ఘటంబులు) - ఇలాంటివి అన్నీ తాకట్టు పెట్టి ఇరవైనాలుగు గంటలూ జూదమాడటమే పనిగా (దురో దర క్రీడాపరాయణుడై) పట్టణంలో తిరుగుతున్నాడు నీ తనయుడు

ఒక బిందె తాకట్టు పెట్టడం ఆ సొమ్ముతో ఒక పేటలో జూదమాడటం, అది ఓడిపోవడం ఇంటికి వెళ్ళి మరో వస్తువేదో తేవడం తాకట్టు పెట్టడం ఆ సొమ్ముతో మరోపేటలో మరో జూదగృహానికి వెళ్లడం-ఇలా జూదగాడై తిరుగుతున్నాడు నీ కొడుకు

అక్షధూర్తులలోన నీ యనుగు గొడుకు
దొరయునంతటి యక్ష ధూర్తుండు లేడు
క్షితి తలంబున యాగ దీక్షితులలోన
గీర్తి నీ యట్టి యాగదీక్షితుడు లేడు 4-10

అయ్యా ఈ భూమి మీద (క్షితితలంబున) జూదగాళ్లలో నీ ప్రియ పుత్రుడికి సాటివచ్చే(దొరయునంతటి) జూదగాడు (అక్షధూర్తుడు) లేడు యాగదీక్షితులలో (శ్రౌత విద్వాంసులలో) కీర్తి గడించిన నీవంటి యాగదీక్షితుడు లేడు

ఇది ఆ జూదరి సమాధానం సాధారణంగా జూదగాళ్లకి లోక జ్ఞానమూ తెగింపూ ఎక్కువగా ఉంటాయి పెద్దంతరం చిన్నంతరం ఉండవు సంభాషణా చాతుర్యంకూడా ఎక్కువగానే ఉంటుంది లోకజ్ఞతకి ఫలం "నీ యంతటివాడవు నువ్వయితే నీ కొడుకంతటివాడు నీ కొడుకు ఎవరి రంగంలో వారు అద్వితీయులు" అన్నాడు ఇది పొగడ్తా ? తెగడ్తా ? ఇద్దరినీ కలిపి తిట్టినట్టయ్యింది నీ ఇంటిని చక్క దిద్దుకోలేక, నీ కొడుకుని అదుపు లో పెట్టుకోలేక నడివీథిని నిలబెట్టి నన్ను గదమాయి స్తావేమిటి చాల్చాల్లే పెద్దమనిషీ! అన్నట్లుంది సమాధానం

వ. అనిన విని లజ్జా క్రోధంబులు మనంబున ముప్పిరిగొన యజ్ఞ దత్తుండు అర్ధముండితంబైన మూర్ధంబున నీర్కావిధోవతి నలిముడి జుట్టుకొని యింటికేతెంచి మొగంబు గంటు పెట్టుకొని "సోమిదమ్మా! యేమి సేయుచున్న దాన వినుమమ్మ ! నీ కొడుకెక్కడం బోయె ? బోవుగాకేమి ! విను "మని యిట్లనియె 4-102

జూదగాడి మాటలు వినేసరికి పాపం యజ్ఞదత్తుడు బిక్కచచ్చి పోయాడు ఒక వైపున సిగ్గు, ఒక వైపున క్రోధం మనస్సుని ముప్పిరిగొన్నాయి భుజంమీద ఉన్న నీరుకావి ధోవతిని హడావిడిగా తలకి చుట్టుకు న్నాడు శిఖ తప్ప ముందు సగభాగం ముండితమైన తల అది దానికి చుట్టుకున్నాడు సరాసరి ఇంటికి వచ్చేసాడు ముఖం గంటు పెట్టుకున్నాడు అంటే మనస్సుకి తగిలిన గాయం అవమానభారంగా ముఖం మీద కనపడుతోంది కోపం అణచుకుంటూ ఇల్లాలిని పిలిచాడు

సోమిదమ్మా. ఏం చేస్తున్నావ్? ఇటురా ఒకసారి. నీ కొడుకు ఎక్కడకి వెళ్ళాడు? వెడితే వెళ్ళాడులే ఎక్కడికో అక్కడకి ఇది విను-

అంగోద్వర్తనవేళ నీవు దరహాసాంకూరముల్ లోచనా
పాంగప్రాంతములం దిగుర్చ నొక సయ్యాటంబు గల్పించి నా
యంగుళ్యాభరణంబు పుచ్చుకొనవా యా యుంగరం బిప్పుడే
సింగారింపనిచేత బావకునకున్ జేయన్ హవిర్దానమున్ 4-103

ఆ మధ్యన నాకు ఒకనాడు తలంటుకోసం నలుగుపెడుతూ (అంగ+ ఉద్వర్తనం=శరీరానికి నలుగుపెట్టడం) చిరునవ్వుల మొలకలు (దరహాస+ అంకూరముల్) కన్గొసలలో చిగురింపజేస్తూ (ఇగుర్చన్), ఒక సయ్యాటం కల్పించి నా ఉంగరం (అంగుళీ+ ఆభరణంబు) తీసుకున్నావు కదూ గుర్తుందా ఆ ఉంగరం ఇప్పుడు కావాలి అది సింగారించుకోని చేతితో ఇవ్వేళ నేను అగ్నిహోత్రుడికి హవిర్దానం (హవిస్సు దానం) చెయ్యను

ఆ ఉంగరం ఇంట్లోలేదని యజ్ఞదత్తునికి తెలుసు. అయినా తీగలాగితే డొంకంతా కదులుతుంది గదా అని ప్రణాళిక.ఆ వేళ ఉంగరం తీసుకోవడంలో సోమిదమ్మ కల్పించిన సయ్యాటం గుర్తుకి వచ్చి తల్లీ కొడుకులు కుమ్మక్కు అయ్యారనే సంగతి గ్రహించేసాడు అందుకే ' నీ కొడుకెక్కడం బోయె''? అని చెప్పడం ''ఒక సయ్యాటంబు గల్పించి'' అనడంలోనూ '' సింగారింపని చేత '' అనడంలోనూ ఎత్తి పొడుపు ధ్వనిస్తోంది

సయ్యాటంబు అనే మాటలో ''య్యా'' యతిస్థానంలో పడింది అక్కడ ఇంకొక్క మాత్రకాలం ఒయ్యారంగా సాగదీసి వళవేసి చదివితే పద్యంలో షోకు బయటపడుతుంది

ఈ ఘట్టంలో ఇది రెండవ వృత్తం. ఇందులో రవ్వంత సంస్కృత ప్రౌఢి రూపు కట్టింది దీనికి వెనకా ముందూ గద్యపద్యాల్లో తెలుగు పలుకుబడి, నుడికారం గూడు కట్టాయి.''ప్రౌఢి బరికింప సంస్కృత భాషయంద్రు పలుకునుడికారమున నాంధ్ర భాష యందు రెవ్వరేమన్న నంద్రు గాకేల కొఱత నా కవిత్వంబు నిజము కర్ణాటభాష '' అని భీమఖండంలో చెప్ప కున్నదానికి నిదర్శనంగా నిలుస్తుంది ఈ ఘట్టం

సరే- దీక్షితులవారు ఆ ఉంగరం ఇప్పుడే కావాలంటున్నారు

వ. **అనిన నద్దీక్షితాయని దీక్షితున కిట్లనియె** 4-104

దీక్షితాయని అంటే దీక్షితులవారి ధర్మపత్ని ఆమె దీక్షితులవారితో ఇలా అంది-

మధ్యాహ్న సంధ్యాసమాగమంబిది తీర్థ
మవధరింపుము నిత్యమాచరింపు
మగ్నికార్యము దీర్పు మభవు బూజింపుము
పంచమహాయజ్ఞ పరుడ వగుము

మొగసాలనున్నారు జగతీ సువర్వులు
గ్రాసార్థులగుచు బెక్కండ్రతిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులు
చల్లనాఱెన యేని జవులు దప్పు
పదిలముగ మందసమునందు బరిణిలోన
నునిచి దాచినదాన మీ యుంగరంబు
దీర దిప్పుడు పెట్టి శోధించి చూడ
నారగించిన పిదప నే నధిప! తెత్తు 4- ౦౮

నాథా ఇది మధ్యాహ్న సంధ్యాసమయం ముందు స్నానం చెయ్యండి సంధ్య వార్చండి (నిత్యము ఆచరింపుము)నిత్యము అనేది సంధ్యావందనానికి పర్యాయంగా వాడుక అది నిత్యకృత్యం కనక. (సంధ్య యాచరింపుము అనే పారమూ ఉంది) అగ్నికార్యం చెయ్యండి శివుణ్ణి పూజించండి బ్రహ్మ-పిత్ర-దేవ- భూత- మనుష్యయజ్ఞాలు (పంచమహా యజ్ఞాలు) కానివ్వండి

మొగసాలలో చూశారు కదా-బ్రాహ్మణులూ భోజనార్థులై వచ్చిన అతిథులూ ఎంతమంది వేచి ఉన్నారో! త్వరగా కానివ్వండి.

అన్నమూ,కూరలూ పిండివంటలూ అన్నీ సిద్ధంగా ఉన్నాయి వేడి చల్లారితే రుచులు తప్పతాయి.

మీ ఉంగరం ఎక్కడికీ పోలేదు మహానుభావా (అధిప) బరిణిలో పెట్టి బోషాణంలో (మందసం) పదిలంగా దాచి ఉంచాను పెట్టె వెదకి చూడటానికి ఇప్పుడు తీరదు భోజనాలు అయిన తరువాత (ఆరగించిన పిదప) వెదికితీసి పట్టుకు వచ్చి ఇస్తాను

సోమిదమ్మగారుకూడా నెరజాణే (తల్లి బడి కొల్లిచెట్టు) తొణక్కండా బెణక్కండా పెద్ద పట్టీ చదివేసింది భోజనాలు అయ్యేదాకా వాయి దా వేస్తే ఆ తర్వాత కాసేపు నడుం వాల్చడాలు, అటు పైని అతిథుల్ని సాగనంపడాలు-అంతదాకా తనకి వ్యవధి కలిసివస్తుంది అప్పడు చూసుకోవచ్చు ఈలోగా కొడుకు రానూవచ్చు ఉంగరం తేనూ వచ్చు, ఏదయినా జరగవచ్చు, సోమయాజిగారు మరిచిపోనూ వచ్చు

ఆకలీ ఆగ్రహమూ కలిస్తే అతిథులందరి ముందూ అభాసుపాలు. ఆకలి తీరాక ఏకాంతంలో ఆగ్రహం చల్లార్చవచ్చు, నెమ్మదిగా నిజం చెప్పెయ్యవచ్చు, అయ్యగారికి అసలు విషయం తెలిసిపోయింది అనుకోక ఇలాంటివి ఏవో ఆలోచించి ఉంటుంది దీక్షితాయని నిపుణంగా సమా ధానం చెప్పింది

అనిన విని సోమయాజి కోపాగ్రహమున
దత్తరించుచు వడి సోమిదమ్మ బలికె
నౌనె సత్పుత్ర జనయిత్రి! యౌనె సాధ్వి!
యౌనె సూనృత భాషిణి! యౌనె దేవి! 4- ౦౯

సోమయాజిగారు మండి పడ్డారు ఇక దాచుకోలేకపోయారు మాటల్లో వేగం పెరిగింది

''అవును ఉంగరం ఎక్కడికీ పోలేదు దాచి ఉంచావ్ అనక తెచ్చి ఇస్తావ్! అవునే సత్పుత్రుణ్ణి కన్నదానా! అవునే పతివ్రతా! అవునే సత్యభాషిణీ అవునే దేవీ ''

ఈ సంబోధనలన్నీ దెప్పి పొడుపులే. సత్పుత్రజనయిత్రీ అంటే వెధవని కన్నావని వ్యామోహంతో కొడుకుని తగలేసావని సాధ్వీ అంటే మొగుణ్ణి మోసం చేసావనీ పరువు తీసావనీ సూనృత భాషిణీ అంటే అన్నీ అబద్ధాలే చెప్పావనీ. ఇప్పుడూ అంతే చేస్తున్నావనీ దేవీ అంటే రాక్షసీ అని

ఈవిడ ఏమేమి అబద్దాలు చెప్పిందో ఎలా తనని మోసగించిందో గుర్తు చేస్తున్నాడు తప్పులు ఎంచి చూపిస్తున్నాడు

స్వాధ్యాయ మెన్నండు జదువగ బోకుండ
    బోలునే చదువంగ బోయె ననుట
తెల్లవాఱగ నీట దీర్థమాడక యుండ
    ననురూపమే తీర్థమాడె ననుట ?
తలితోడ నగ్ని హోత్రము వేల్వకుండంగ
    విజ్ఞాన సరణియే వేల్చె ననుట?
సమయానుకూలత సంధ్య వార్చకయుండ
    వైదగ్ధియే సంధ్యవార్చె ననుట
కల్లలాడంగ ఫలమేమి కలిగె నీకు?
మాటిమాటికి నేను నీ మాట నమ్మి
యరసి రక్షింప నేరక యనుగు గొడుకు
భ్రష్టు జేసితి నేమి చెప్పంగ గలదు. 4-107

వాడు వేదాధ్యయనానికి వెళ్ళకపోయినా వెళ్ళాడని చెప్పావు స్నానం చెయ్యకపోయినా చేసాడనే చెప్పావు వేళకి సంధ్య వార్చకపోయినా వార్చాడని చెప్పావు. అగ్నిహోత్రం చెయ్యకపోయినా చేసాడని చెప్పావు నేను ఏ రోజున ఏది అడిగినా అన్నీ అబద్ధాలే చెప్పావు ఇన్ని కల్లలు పలికావు ఏమిటి లాభించింది నీకు? కొడుకు భ్రష్టుడయ్యాడు ప్రతీసారీ నీ మాట నమ్మాను ఊరుకున్నాను నేనై పరిశీలించలేక పోయాను. కన్నకొడుకును రక్షించుకోలేకపోయాను. భ్రష్టుణ్ణి చేసాను ఇంత చెప్పడానికి ఏముంది.

ఏడ బోయెనొ కదా మేడలో మంజిష్ఠ
    పెనుబండువునసైన బెట్టు జాల
దాకట్టు వడనె యింతకు వైశ్యగృహమున
    కనక కర్కరిల భృంగారుకంబు
పట్టు సూత్రమయంబు పసిడి యొడ్డాణ మే

యిగురుబోడి కటీర మెక్కెనొక్కొ!
శశికాంత పీలికాస్తంభలీలా రత్న
సాలభంజిక యెందు సాగె నొక్కొ
ఎచట నున్నది యొకొ రత్నఖచితమైన
హంస తూలికాడోలా విహార తల్ప
మూచముట్టుగ నీవు నీ యొంటి కొడుకు
బాడు చేసితి గృహము నిర్భాగ్యురాల! 4-108

ఇంటిలో నుంచి ఏయే విలువైన వస్తువులు మాయమయ్యాయో ఏకరువు పెడుతున్నాడు

మేడమీద గదిలో ఉండే నా మంజిష్టి- ఎరుపు పసుపు మొదలైన కలగలుపు రంగుల్లో ఉండే విలువైన శాలువా- ఏమైపోయిందో గదా !పెద్ద పండుగనాడైనా (సంక్రాంతి) వేసుకోలేకపోయాను

దోసకాయ (కర్కుల) ఆకారంలో ఉండే బంగారు గిన్నె (భృంగారువు) కోమటింటిలో ఈ పాటికి ఏనాడో తాకట్టు పడిపోయి ఉంటుంది

పట్టుదారాలతో మణులు గ్రుచ్చిన బంగారపు ఒడ్డాణం ఎవతెకు దక్కిందో ఏ చిగురుబోడి కటి ప్రదేశాన్ని అధిరోహించిందో !

చంద్రకాంత మణులు పొదిగిన పీఠం మీద స్తంభాకారంలో పొడవుగా ఉండే రత్నాల కీలుబొమ్మ(సాలభంజిక) ఎక్కడికి ప్రయాణం కట్టిందో ఎక్కడికి తరలిపోయిందో (ఎందుసాగెనో)

హంసతూలికల విలువైన పరుపు కలిగి రత్నాలు పొదిగిన తూగుటుయ్యేల మంచం (డోలావిహారతల్పము) ఇప్పుడు ఎక్కడ ఉందో! (హంసరెక్కలు దూదిగా పరుపులు ఉండేవిట)

ఓసి దౌర్భాగ్యురాలా నువ్వు నీ ఒక్కగానొక్క కొడుకునీ ఈ ఇంటి నీ కూడా పూర్తిగా (ఊచముట్టుగ) నాశనం చేసావు (ఇక్కడ దీక్షితులుగారొక్కరే విలపిస్తే నిగమశర్మోపాఖ్యానంలో -పాండురంగ మాహాత్మ్యం-తల్లి, తండ్రి, అక్క తమ తమ వస్తువులకోసం విలపించారు)

చాలు నింక, నాపాలికి జచ్చినాడు
కొడుకు గుణనిధి యనువాడు-కులవిషంబు,
తిలలు దర్భయు నుదకంబు దెత్తుగాక,
యే నివాపాంజలులు వాని కిత్తు నిపుడు 4-109

చాలు సర్వనాశనం చేసేసావు మరి చెయ్యవలసింది ఏమీ లేదు. ఇవ్వేళనుంచి నాపాలిటికి కొడుకులేడు చచ్చిపోయాడు గుణనిధి అనేవాడు కులానికి విషం నువ్వులూ దర్భలూ నీళ్ళూ తే (తెత్తువుగాక) వాడికి తర్పణాలు వదిలేస్తాను (నివాప+ అంజలులు=తర్పణోదకంతో నిండిన దోసిళ్ళు)

గుణనిధి అనేవాడు కులవిషంలా ఉన్నాడు అయితే వాడు ఇప్పుడు తనకి కొడుకుకాదు పితాపుత్ర సంబంధాన్ని తెంచేసుకొని దానికి నీళ్లు వదిలేస్తున్నాడు కొడుకుగా మరణించాడు గుణనిధిగా ఎవడో ఎక్కడో ఎలాగో ఉంటాడు తనకింక సంబంధంలేదు అని ఇలా పుంజీలు తెంచేసుకోవడం వైదికాచారపరాయణులకు సహజమయిన స్వభావం అంత మంది అతిథులు ఉన్నా అలా చిందులు తొక్కెయ్యడం కొత్తగా కాపురానికి వచ్చిన కోడలి ముందే కొడుక్కి నువ్వులూ నీళ్లూ వదిలెయ్యడం ఇవన్నీ ఆ స్వభావానికే చెల్లు శ్రోత్రియాచార పరాయణత్వం పట్ల వారి నిష్ఠ -వారి పట్టుదల ఆ స్థాయిలో ఉంటాయి

వ. కుపుత్రత్వంబుకంటె నపుత్రత్వంబు మేలు. కులపాంసనుండైన వీనినొక్కని త్యజించి కులంబు రక్షించుట నీతియకదా ! యని పలికి కోపావేశంబున పెదవుల దర, గటతటంబులు చిటుల, భ్రూకుటి నిటలంబున నటింప, కటాక్షంబుల కెంపు గదురం, గటకటం బడుచు, నాహ్నికంబైన క్రియాకలాపంబు నిర్వర్తించి, యాగ్రహం బు కృతార్థత్వంబు నొంద, కొన్ని దివసంబులకు నొక్క శ్రోత్రియుని పుత్రిం బెండ్లి యాడి, యజ్ఞదత్తుండు గృహస్థధర్మంబు నిర్వర్తించుచుండె. అంతక మున్న గుణనిధి తండ్రి కోపం బెఱింగి, యింటికిం బోవక, యెందేని యు జనువాడనని, మనంబున నిట్లని వితర్కించె

4-1 ౦

దుష్టుడైన పుత్రుణ్ణి కలిగి ఉండటం కన్నా అసలు పుత్రుడే లేకుండా ఉండటం మంచిది వంశగౌరవాన్ని నాశనం చేస్తున్న (కులపాంసనుడు= కులదూషణుడు) వీణ్ణి ఒక్కణ్ణీ పరిత్యజించి మొత్తం కులాన్ని కాపాడటం నీతి కూడా

ఇక్కడికి మాటలు ఆగాయి కోపావేశంతో పెదవులు అదురుతున్నాయి కణతలు చిట్లుతున్నాయి కనుబొమ్మలు ముడివడి నొసలు నాట్యం చేస్తోంది కడ కన్నులలో ఎర్రదనం వ్యాపిస్తోంది అలాగే కోపగించుకొంటూనే (కటకటంబడుచున్) పగటి పూట చెయ్యవలసిన కార్యక్రమాలు అన్నీ (సంధ్య, శివార్చన, అగ్నిహోత్రం, అతిథి పూజనం వగైరా) నిర్వర్తించాడు

అలాగే కొన్ని రోజులు గడిచాయి కొంతకాలం తరువాత యజ్ఞదత్తుడు తన పట్టుదల(ఆగ్రహంబు) చరితార్థమయ్యేట్టుగా ఒక శ్రోత్రియుని కూతురిని పెళ్లి చేసుకున్నాడు గృహస్థధర్మం ఆమెతో నిర్వర్తిస్తున్నాడు

కొడుక్కి నీళ్ళు వదిలేసాడు సోమిదమ్మను వదిలేసాడు మరో పెళ్లి చేసేసుకున్నాడు దాచీ మూచీ అబద్ధాలు చెప్పినందుకూ అలా కొడుకుని పాడుచేసినందుకూ ఇది ఆమెకు శిక్ష

తన తండ్రి ఆగ్రహోదగ్రుడై ఇంటికి వెళ్ళాడన్న సంగతి గుణనిధికి తెలిసింది. బహుశ ''అక్షధూర్తులలోన నీ యనుగు కొడుకు దొరయు నంతటి యక్షధూర్తుండు లేడు'' అని దీక్షితులవారికి చెప్పిన ధూర్తుడే ఆయన కోపం సంగతి గుణనిధికి చెప్పి

ఉంటాడు జూదరులది అదొక ప్రత్యేక లోకం పెద్ద కట్టుబాటు. ఊళ్ళో ఏది జరిగినా ఎవరి కొంపమీదకి ఏది వచ్చినా, నిమిషాల మీద వాళ్ళకి తెలిసిపోతుంది. అలాగే గుణనిధికీ తెలిసిం ది ఇంటికి వెడితే ప్రమాదం. మరింకెక్కడికయినా పోదాం-అనుకున్నాడు

ఇంటి గుమ్మం తొక్కే అవకాశం లేకపోవడంతో తన ఒంటరితనం గుణనిధికి కళ్ళముందు ప్రత్యక్ష మయ్యింది దిక్కులేనివాణ్ణి అయిపోయానే అనిపించింది దిగులు కమ్ముకుంది మనస్సులో పశ్చాత్తాపంతో కూడిన వితర్కం మొదలయ్యింది

ఏమి సేయుదు ? నెక్కడి కేగువాడ ?
ధనము నిష్పచ్చరంబు, విద్యయు హుళక్కి,
పెట్టసాగెడు నా చేయి భిక్షసేయ
నెట్లు నేరుచు ? దైవంబ యెఱుగు నింత 4-111

ఏమి చెయ్యను? ఎక్కడికి వెళ్ళను ? ధనమూ లేదు.(నిష్పచ్చరము-శూన్యము) చదువా హుళక్కి

ఇంతకాలమూ ఒకడికి ఇంత పెట్టిన చెయ్యి ఇది ఇప్పుడు అడుక్కోవాలా? ఈ నా చెయ్యి ముష్టి ఎత్తడం ఎలా నేర్చుకుంటుంది దేవుడికే తెలవాలి. దైవంబ ఎఱుగునింక

ఇంట్లో ఉన్న వస్తువులన్నీ తెగనమ్మి జూదాలకీ నేస్తగాళ్ళకీ విచ్చలవిడిగా ఖర్చు పెట్టేసాడు తోటి జూదగాళ్ళను ఎందరినో ఇంతకాలం పోషించాడు. ఇప్పుడు బాధపడుతున్నాడు డబ్బులు లేకపోయేసరికి బుర్ర తిరుగుతోంది చదువుకోనందుకు చింతిస్తున్నాడు

ఏ భయంబుల నెచ్చోట నెనయలేదు,
నరున కెప్పాట విద్యాధనంబు ధనము,
చోరబాధాదికముచేత జాఱిపోవు
ధనము ధనమౌనె ? యెన్నిచందముల దలప 4-112

ఏ రకంగా ఆలోచించినా(ఎన్నిచందములదలపన్) మానవుడికి విద్యాధనమే నిజమైన ధనం దానికి ఏ భయమూ లేదు దొంగలు అపహరిస్తారనిగానీ అగ్నికి ఆహుతి అవుతుందని గానీ, పరిపాలకుడు లాగేసుకుంటాడనిగానీ తరిగిపోతుందనిగానీ భయపడవలసిన అవసరం లేని ధనం విద్యాధనం ఈ మూడింటికీ చూరబోయే ధనం నిజానికి ధనం కానే కాదు

ఇప్పటికి గుణనిధికి కనువిప్పు అయ్యింది తన పుట్టుక ,ప్రవర్తన బేరీజు వేసుకుంటున్నాడు

భోగలాలసుడై చెడుతిరుగుళ్ళు తిరిగేవాడు ఏదో ఒక విఘాతంతో దారిమళ్ళి నివృత్తిమార్గంలో ప్రవేశించడం లోకసహజం అదే జరుగు తోంది

అక్కటకట ! దురోదర వ్యసన మెట్లు !
యహయజాత విశిష్టాన్వవాయ మెట్లు !

ఎట్లు చేసిన జేసెగా కేమనంగ
వేర్చువారము! విధి దయానిస్వహృదయి 4-113

అయ్యయ్యో ఈ ద్యూత వ్యసనమేమిటి నా వంశమేమిటి. యజ్ఞాలుచేసిన శిష్టులూ విశిష్టులూ జన్మించిన వంశం (అన్వవాయము) నాది నా పితృపితామహ ప్రపితామహాదులందరూ యాయజూకులు నేనేమో ద్యూత వ్యసనిని విధి ఎంత విచిత్రమైనది . దాని హృదయం ఎంత కఠినం దయ అనేది లేనేలేదు (నిస్వ). ఎలాంటి వాడిని ఎలా చేసేసింది ఏమనగలం

తాను చేసిన తప్పలకి విధిని నిందిస్తున్నాడు ఇదికూడా సహజపరిణామమే నెపం దేవుడి మీద వెయ్యకపోతే ఇటువంటి పరిణామదశలో దుష్టులంతా ఆత్మహత్యలు చేసుకోవాలి విధి దయానిస్వహృదయిట స్వమ్ అంటే ధనం(సొమ్ము) నిఃస్వమ్ అంటే దరిద్రం. సొమ్ములేని స్థితి విధి హృదయం దయ విషయంలో దరిద్ర మని అంటే అదృష్టదేవతది దయా దరిద్రమైన (దయాశూన్యమైన) హృదయమని గుణనిధి స్వానుభవంతో తీర్పు ఇచ్చాడు

ఈ కష్టకాలంలోనే తల్లి ప్రేమ గుర్తుకి వచ్చింది కుర్రవాడికి తలుచుకుని వాపోతున్నాడు-

అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం బొడతేర గిన్నెలో
బెరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగ బెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే!
హరహర! యెవ్వరింక గడుపారసి పెట్టెద రీప్సితాన్నముల్ 4-114

తెల్లవారి సూర్యోదయమయ్యే సరికల్లా గిన్నెలో పెరుగూ అన్నం కలిపి వడ పిందెల ఊరగాయ వేసి ''నాన్నా తినరా''అని పెట్టేది మా అమ్మ ఎంతటి దయా మూర్తి! ప్రాణానికి ప్రాణం. అటువంటి తల్లి మరింకెక్కడ యినా ఉంటుందా ! నా ఆకలి తెలుసుకొని(కడుపు+ ఆరసి) నేను ఇష్టపడే వంటలు చేసి (ఈప్సిత+ అన్న ముల్) ఇంక ఎవరు పెడతారు నాకు శివశివా

వ. అనుచు నెందేనియుం జనియె నంత 4-115

ఇలా వితర్కించుకుంటూ కాంపిల్యనగరం వదిలిపెట్టి ఎటో వెళ్ళాడు. గమ్యం లేని ప్రయాణం అంతలోకే సాయంకాల మయ్యింది.

ఘుసృణ కుసుమమాలాకోటి పాటల్య లీలన్
గిసలయముల చాయం గీర చంచూపుట శ్రీ
విస్మయకర స్వమరోర్ణా విభ్రమ ప్రౌఢి మింటన్
బిసరుహ హిత దీప్తుల్ పింగళత్వంబు నొందెన్ 4-116

అస్తాద్రికి చేరుకున్న సూర్యుని కిరణాలు క్రమక్రమంగా ఎరు పెక్కాయి. కుంకుమపువ్వులతో (ఘుసృణకుసుమాలు) కోటిదండలు గ్రుచ్చి వేలాడదీసిన ఎర్ర దనం (పాటల్యము) కనిపించింది చిగురాకుల చాయ పొడచూపింది . చిలక

ముక్కుల శోభ స్ఫురించింది. చమరీమృగాల(సృమర) విప్పారిన(విసృమర) తోకలతో ఎర్రదారపు పోగుల్లా(ఊర్ణా) ఉండే ఈక ల సొగసు(విభ్రమము) అగుపించింది. ఆకాశంలో (మింటన్) సూర్యకిరణాలు (బిసరుహహితుడి దీప్తులు) ఇలా ఎర్రదనం (పింగళత్వంబు) సంతరించుకున్నాయి. (మాలినీవృత్తం. ననమయయ. ౹-౯యతి)

బిసము అంటే తామరతూడు. దానినుంచి పుట్టేది బిసరుహం -పద్మం. సూర్యోదయంలో పద్మాలు వికసిస్తాయి. కనక బిసరుహహితు డు-సూర్యుడు. అతడి దీప్తులు ఎరుపెక్కి చరమ సంధ్యాకాశం రక్తరంజిత మయ్యింది. అప్పుడు సూర్యుడు ఎలా ఉన్నాడంటే పరుశురాముడిలా ఉన్నాడు.

పాటలాంశు జటా భార భాసురుండు
భార్గవుడుం బోలె నోలాడె భాస్కరుండు-
రాగరక్త చ్ఛటా నిర్ఝర ప్రపూర్ణ
చరమ సంధ్యాశమంత పంచక నదముల 4-117

పరశురాముడు క్షత్రియ సంహారం చేసి శమంత పంచకం అనే చోట నెత్తురు మడుగులు అయిదు సృష్టించాడు. ఇప్పడు చరమ సంధ్యాకాశం- ఎర్రదనమ నే నెత్తురుటేర్లతో (రక్తప్రవాహాలతో) నిండి శమంత పంచకంలా ఉంది. రాగిరంగు కిరణాలే(పాటలాంశువులు) జటలుగా, భాస్కరుడు భార్గవుడుగా ఆ నెత్తురు మడుగుల్లో (నదములన్) ఓలలాడుతున్నాడు.

వెండియు ధౌతారకూట పాటలకోమలాతపంబై వాసరంబు పలుకం బాఱె. అస్త్రాద్రి కిరీట కూటంబున దరవికచ నిచుళకుసుమ మంజరీ పుంజంబు నుంబోలె మిహిర బింబంబు చూపట్టె. చరమధరాధరధాతుధారాప్రవాహంబు నుంబోలె సంధ్యారాగంబు గగన మండలంబు నాక్రమించె. చైత్యద్రుమంబులు విద్రావణ ద్రోణకాక కాకా కారకాకుకోలాహలాకులకులాయంబులయ్యె. అంధ కరిపు కంధరామూల కాలకూటచ్ఛాయాశ్రేణి పాణింధమంబై యంధకారంబు బ్రహ్మాండ మండలంబు నాచ్ఛాదించె. రజనీశుక్తి ముక్తా ఫలంబులు చుక్కలు పొడిచె. భవిష్య ద్వాస రకర ప్రరోహబీజాంకురంబులుంబోలె బ్రదీపంబులు భవనాంతరంబుల వెలింగె. అప్పడు గుణనిధి పేరాకలి పేర్చు కార్చిచ్చునుం బోలె బెచ్చు పెరిగి యందంద కడుపు మండింప "వంటకం బెక్కడ గలుగునో" యని చింతాక్రాంతుడై యున్న యవసరం బున నద్దినంబు శివరాత్రి యగుటం జేసి శైవుండొక్కరుండు నగర బాహ్యప్రదేశం బున నొక శివలింగ స్థానం బున జాగరణంబు జేసి నాల్గుజాములు నుపహారంబులు సమర్పించువాడై నియమవ్రతంబు బూని భక్తి విశ్వాస తాత్పర్యాతిశయంబున-

క్రమక్రమంగా సాయంకాలపు లేత ఎండ- ఈరెండ- తోమిన ఇత్తడి (ధౌత+ ఆరకూటము) రంగులోకి మారింది. పగటి పూట ముగిసింది. పండబారింది - పలుకంబాఱె.

అస్తగిరి కిరీటం మీద సూర్యబింబం (మిహిర బింబము) విరిసీ విరియని (దరవికచ) నీటి ప్రబ్బలి పుష్పగుచ్ఛంలాగా (నిచుళ-కుసుమ మంజరి) ఎర్రగా భాసించింది

పర్వతం మీద ఉండే ధాతుశిలలు ఏవో కరిగి ప్రవాహాలు కట్టి నట్టు గగన మండలంలో ఎర్రదనం

ఉద్యానవనాల్లో చెట్లు(చైత్యద్రుమాలు) ఆ చెట్లమీద పక్షుల గూళ్ళు గూళ్ళకు తిరిగి వచ్చి అటూ ఇటూ వాలుతూ ఎగురుతున్న నల్లకాకులు(ద్రోణకాకము లు) వాటి 'కాకా+కార' అరుపులూ కూతలూ అవే కాకుస్వరాలు ఈ కోలాహలం తో మారుమ్రోగిపోతున్నాయి (ఆకుల ములు) చెట్ల మీద గూళ్ళు (కులాయంబులు).

చీకటి బ్రహ్మాండమండలమంతటా దట్టంగా అలుముకుంది అది మహా శివుని(అంధక రిపువు) కంఠ మూలంలో ఉన్న కాలకూటాన్ని తిరస్కరించేటంత నల్లగా ఉంది

చుక్కలు పొడిచాయి అవి రాత్రి (రజని) అనే ముత్తెపు చిప్ప నుంచి బైట పడిన ముత్యాల్లా ఉన్నాయి

ఇళ్ళల్లో దీపాలు వెలిగాయి రేపటి సూర్యకిరణాల మొలకల్లా అవి బీజాంకు రాల్లాగా భాసించాయి (వాసర అంటే రోజు వాసరకరుడు అంటే దినకరుడు అని కర ప్రరోహాలంటే కిరణాలనే మొలకలు)

అపుడు గుణనిధికి బాగా ఆకలి వేసింది అది పెద్ద కార్చిచ్చులాగా పెరిగి కడుపు మండిపోతోంది భోజనం ఎక్కడ దొరుకుతుందా ఆలోచిస్తున్నాడు

ఆ రాత్రి శివరాత్రి అవ్వడం మూలాన ఒక శివభక్తుడు ఒక నగరంలో ఒక ఉద్యానవనంలో ఒక శివాలయంలో (శివలింగస్థానము) జాగరణం చేస్తున్నాడు తెల్లవార్లూ మెలకువగా ఉండి నాలుగుజాములకీ నాలుగుసార్లు ఉపాహారాలూ నైవేద్యం పెట్టాలనే నియమంతో భక్తి విశ్వాస తాత్పర్యాలతో వ్రతం చేపట్టాడు

మరిచి ధూళి పాళి పరిచితంబులు మాణి
బంధాశ్మ లవణ పాణింధమములు
బహుళ సిద్ధార్థ జంబాల సారంబులు
పటురామఠామోద భావితములు
తింత్రిణీక రసోపదేశ ధురంధరములు
జంబీర నీరాభిచుంబితములు
హైయంగవీన ధారాభిషిక్తంబులు
లలిత కుస్తుంబరూల్లంఘితములు
శాకపాకరసావళి సౌష్ఠవములు,
భక్ష్యభోజ్య లేహ్యంబులు, పానకములు,
మునుప్పగాగల యోగిరంబులు, సమృద్ధి
వెలయు గొనివచ్చె నొండొండ వివిధములను 4-112

ఆ శివభక్తుడు తెచ్చిన నైవేద్యాలను వర్ణిస్తున్న పద్యమిది మిరియాలపొడి (మరిచిధూళి) చల్లినవి కొన్నీ, సైంధవలవణం వేసి తయారు చేసినవి కొన్నీ, ఆవపెట్టి (సిద్ధార్థ) వండినవి కొన్నీ ఇంగువతో (రామరము) ఘుమఘుమలాడుతున్నవి కొన్నీ, చింతపండుపులుసుతో (తింత్రిణీక రసం) చేసినవి కొన్నీ, నిమ్మరసంతో (జంబీర నీరం) చేసినవి కొన్నీ, తాజా నేతిలో (హైయంగవీనము=నిన్నటి పాలనుంచి నేడు చిలికి తీసిన వెన్నకాచిన నెయ్యి -సద్యోఘృతం) మునిగితేలుతున్నవి కొన్నీ లేత కొత్తిమీరతో పరి మళిస్తున్నవి కొన్నీ, శాకంగా ఉన్నపుడూ పాకంగా రసంగా మారిన పుడూ సొష్ఠవంకోల్పోని భక్ష్యాలూ భోజ్యాలూ, లేహ్యాలూ పానకాలూ ఈ మొదలైన వివిధాహారాలను సమృద్ధిగా ఒక్కటొక్కటే ఇంటినుంచి ఆలయానికి తీసుకువచ్చా డా భక్తుడు

భక్ష్యాలు అంటే నమిలి తినవలసినవి కరకరలాడేవన్నమాట భోజ్యాలు అంటే అంతగా నమలక్కరలేకుండా భుజింపదగినవి లేహ్యాలు అంటే నాల్కకు పని చెప్పేవి పానకాలు అంటే త్రాగేవి వండకముందు ముడి పదార్థంగా ఉన్న దశలోనూ అవి సొష్ఠవంగా ఉన్నాయి అలాంటి వాటిని ఏరి ఏరి కొనితెచ్చాడన్నమాట వండిన తర్వాత అవి అంతే సొష్ఠవంగా ఉన్నాయి కంటికింపుగా అనుతున్నాయి

వ. అప్పుడు భూసురప్రవరుండు నాసికాపుటకుటీకుటుంబి యగు పక్వాన్న గంధంబు గాలి వెరవున నాఘ్రాణించి యాయన్నంబు నాకు నెట్లంగి గుడువ సమకూఱునొకో యని యప్పరిమళంబు సవ పట్టుకొని పోయి శంభు భవన ద్వారంబునం గూర్చుండి నృత్త గీత వాద్యంబులు ప్రవర్తిల్ల సరిప్రొద్దు పోవునం దాక వీక్షించుచు జాగరంబుచేసి యంతంత సాగి ప్రజలు చొక్కు మడంగియుం డ దా నయ్యవసరంబున 4-120

ఆ దారిని పోతున్న గుణనిధికి ఈ వంటల ఘుమఘుమలు గాలి వాటాన సోకాయి నాసికా పుటాలకు కుటుంబిలా ఆహ్లాదం కలిగించాయి అసలే ఆకలిమీద ఉన్నాడేమో అవి తినాలనే కోరిక కలిగింది ఆ పరిమళం జాడ (సవ) పట్టుకుని శివాలయానికి వచ్చేసాడు ద్వారభాగంలో కూర్చున్నాడు

భక్తుల జాగారంకోసం నృత్తగీత వాద్యాలు ప్రారంభమయ్యాయి అర్ధరాత్రి (సరిప్రొద్దు) గడిచింది అలాగే చూస్తూ తానూ జాగారం చేసాడు క్రమక్రమంగా భక్తులంతా నిద్రలోకి జారుకున్నారు (చొక్కు= మత్తు చొక్కు మడంగి యుండన్) ఆ సమయంలో-

కట్టాయితంబుగా గటిమండలమున
దీర్చి దట్టీచేల బిండుగట్టి
తలుపు గిట్టనకుండ దలిమి కొంచెంబైన
యోరవాకిట దేహ మొయ్య మొనిపి
మునివ్రేళ్ల లొయ్యొయ్య మోపి చప్పుడు గాని

పరిపాటి బవనంబు బట్టి నడచి
దీపాంకురచ్ఛాయ దెలివి చాలనియట్టి
కొనచీకటిని లోని కొనర జొచ్చి
పళ్లెరములం దపూప సూపములతోడ
ననటి పండులతోడ నాజ్యంబుతోడ
దధిపయఃక్షౌద్ర బహు పదార్థములతోడ
ధవళ కలమాన్న మీక్షించె ధరణి సురుడు 4-12

గుణనిధి ఆ నైవేద్యాలు అపహరించడానికి సన్నద్ధుడయ్యాడు అందులో మొదటిగా - కాసెగుడ్డ (దట్టీచేలము= ఉత్తరీయము) తీసి నడుముకి బిగించాడు (దిండుగట్టి) గర్భాలయం తలుపు కిర్రుమని చప్పుడు చెయ్యకుండా నెట్టాడు (తలిమి) ఆ సన్నని వాకిటిలో తన శరీరం దూర్చాడు చప్పుడు కాకుండా మునివేళ్ల మీద ఊపిరి బిగబట్టి (పవనంబు బట్టి) నడుస్తున్నాడు లోపల ప్రమిదలో చిన్ని దీపం. దాని వెలుగుతో ఏర్పడిన నీడలు కనిపించీ కనిపించని(తెలివిచాలని) ఆ చీకటి నీడ అంచు మీద (కొనచీకటిని) నడుస్తూ లోపలికి పూర్తిగా ప్రవేశించాడు

లోపల పళ్లేలలో పదార్థాలు రకరకాల పిండివంటలు (అపూపములు= అప్పాలు అప్పచ్చులు) పప్పు అరటిపళ్ళు, నెయ్యి(ఆజ్యము)పాలు పెరుగు తేనె(క్షౌద్రము) - ఇంకా పలురకాల పదార్థాలు వీటన్నింటి మధ్యా ఉన్న తెల్లని వరిఅన్నం (కలమాన్నం) - గుణనిధి చూసాడు

గర్భ మంటప దీపికా కలిక యపుడు
దశ చెడగ గాలి, నిర్వాణ దశ వహింప,
దీప్తి సంధుక్షముగ జేసి, తెలివి పడగ
నన్న మీక్షింప దలచె, బ్రాహ్మణకులుండు 4-122

సరిగ్గా అదే సమయానికి - ఆ గర్భమండపంలో ఉన్న ప్రమిదలో వత్తి (దశ) కాలిపోయి దీపం కొండెక్కే దశకి (నిర్వాణదశ) వచ్చింది గుణనిధి వెంటనే వెలుగు పెంచి (దీప్తిని సంధుక్షముగా చేసి) ఆ వెలుగులో స్పష్టపడేట్టు అన్నం చూడాలని భావించాడు (గర్భ మంటపికా దీపకళిక అని పాఠాంతరం కనపడుతోంది గర్భాలయం చిన్నదిగానే ఉంటుంది కాబట్టి మంటపిక అందులో ఉన్న దీపపు మొగ్గ-మొగ్గలా ఉన్న దీపం దీపకళిక)

గ్రుక్కిళ్లింగుచు నొక్క యోదనమహాకుంభంబు నీక్షించువా
డక్కోణంబున మందరశ్మియగు దీపాంకూరమున్ మీదటై
యెక్కంద్రోచి, ఘృతంబు నించి, నిజవస్త్రైకాంశమును జించి, చే
నొక్కెన్ వత్తిగ నేత దోచెను, శిఖిన్యోజించె వైశ్వానరున్ 4- 23

అప్పటికే నోరూరుతూ గుక్కిళ్ళు మింగుతూ ఒక అన్న కుంభాన్ని చూస్తున్న ఆ గుణనిధి ఆ ప్రక్కని(ఆ కోణంబున)కాంతి మందగిస్తున్న దీపకళికను (దీప+ అంకూ

రము= దీపపు మొలక) ముందు ఎగసన ద్రోసాడు ప్రమిదలో నెయ్యి నింపాడు తన వస్త్రంనుంచి ఒకముక్క చింపాడు దాన్ని చేత్తోనే నలిపి వత్తిగా చేసాడు నేతిలో (నేతియందున్-నేతన్) తడిపాడు (దోచెను=దోగునట్లు చేసెను) మలగిపోతున్న ఆ దీపంతో అగ్నిని ఆ వత్తి చివరిభాగానికి (శిఖన్) అంటించాడు (అక్షరాలా దీపారాధన చేసాడు)

పక్వాన్నపాత్రంబు పాణి గైకొని బహి
ర్ద్వారభూమి భుజించువాంఛ నపుడు
వెల్వడి వచ్చుచో విధివశంబున వాని
కాలిప్రేలొకని యంగంబు దాకె.
దాకిన, వాడు తత్తఱపాటుతో మేలు
కని, ముచ్చుముచ్చని కళవళించె.
గళవళింప, గతానుగతిక మార్గంబున
నాక్రోశ మొనరించి రఖిలజనులు.
నన్న పాత్రంబు విడువక యువని సురుడు
పాఱె భయవిహ్వలుండయి బయలు పట్టి,
వెంటదగిలి తలవరులు వెడగుపడగ
బాణముల నేసి చంపి రా బ్రహ్మకులుని 4-124

గుణనిధి తాను చేసిన వెలుగులో ఒక పక్వాన్న పాత్రను చేత బట్టాడు. ఆలయంబైటకి పోయి తిందామని ఆశపడ్డాడు గర్భాలయం నుంచి బయలుదేరాడు దురదృష్టవశాత్తూ ఇతడికాలు అక్కడ మాగన్ను గా పడుకున్న భక్తులలో ఒకడి శరీరానికి తగిలింది తగలగానే వాడు ఉలిక్కిపడి లేచాడు. (తత్తరపాటుతో మేలుకని) దొంగ దొంగ (ముచ్చు) అని అరిచాడు అంతే -ఫాలోమని అందరూ అరిచారు (గతానుగతిక మార్గము= ఒకడివెంట ఒకడు నడిచిన పద్ధతిలో)

గుణనిధి భయపడిపోయాడు అయినా అన్నపాత్ర వదలలేదు అది పుచ్చుకుని ఆలయం వెలుపలికి పారిపోయాడు

ఈ అరుపులు వీదిలో తలారులకు (రాత్రి కావలివారు) వినిపించాయి వాళ్ళు వెంటపడ్డారు తరిమి తరిమి ఇక అందక బాణాలు వేసారు అవి తగిలి గుణనిధి మరణించాడు (బ్రహ్మకులుడు-నామమాత్ర బ్రాహ్మణుడని)

అతని గొనిపోవ బనిబూని యముని భటులు
వరుణపాశోగ్రహస్తులై వచ్చి రపుడు
వాని గొనిపోవ బనిబూని వచ్చిరపుడు
త్ర్యంబకుని కింకరులు విమానంబు గొనుచు 4-125

గుణనిధిని తీసుకుపోవడానికి యమభటులు పనిబూని వచ్చారు వాళ్ళ చేతుల్లో భయంకరమైన వరుణపాశాలు ఉన్నాయి మరొక వైపు నుంచి శివుని

కింకరులు విమానం తీసుకు మరీ వచ్చారు

వ. అనంతరంబ పట్టిసత్రిశూల ఖట్వాంగ ప్రముఖబహువిధ ప్రహరణ పాణులగు పినాకపాణి భటులం జూచి భీతులై కృతాంత కింకరులు కరపంకజంబులు మొగిచి వారి కిట్లనిరి 4- 26

పినాకపాణిభటుల చేతుల్లో పట్టిసాలు(అడ్డకత్తులు) త్రిశూలాలు, ఖట్వాంగాలు (ఇవ్వీ ఒకరకం ఆయుధాలు) మొదలైన అనేకవిధాల ఆయుధాలున్నాయి. వీళ్ళని చూసి యమభటులు (కృతాంతకింకరులు) భయపడిపోయారు దండాలు పెట్టి వినయంగా మాట్లాడారు

అభవు కింకరులార! మహాత్ములార!
తగవు ధర్మంబు పాడి పంతంబు తెలియు
మీకు నడ్డంబు గలదె ముల్లోకములను!
నెంతవారము మేము మీ యెదురఁ నిలువ! 4-127

ఓశివభటులారా! మహాత్ములారా . ఉచితమూ(తగవు) ధర్మమూ న్యాయమూ (పాడి), పౌరుషమూ (పంతము) అన్నీ తెలిసిన వారు మీరు ముల్లోకాలలోనూ మీకు అడ్డం లేదు మీ ఎదుట నిలవడానికి మేమెంత వారం

వ. వీడు కులాచార హీనుండు, పితృవాక్యపరాఙ్ముఖుండు, సత్యశౌచ భ్రష్టుండు , సంధ్యా స్నానవర్జితుండు . శివనిర్మాల్యాపహర్త. వీనియందొక్క ధర్మలేశంబు గలిగిన నానతిండు వినియెదము. వీని పుణ్యాపుణ్యవివేకంబునకు మీర ప్రమాణంబు - అనిన కృతాంత కింకరుల వాక్యము లాకర్ణించి శివకింకరులు వారి కిట్లనిరి. 4- 28

వీడు - ఈ గుణనిధి తన కులాచారాన్ని విడిచిపెట్టినవాడు తండ్రి మాటను పెడచెవిని పెట్టాడు సత్యం శుచిత్వం విడిచి పెట్టి భ్రష్టుడయ్యాడు సంధ్యావందనమూ లేదు, స్నానమూ లేదు అన్నీ వదిలేసాడు ఇతడిలో ఏ ధర్మమైనా లేశమాత్రానవైనా ఉంటే, మీకు కనపడితే చెప్పండి- వింటాం వీడి పుణ్యపాపాల వివేచనానికి మీరే ప్రమాణం.

యమభటులు ఇలా మాట్లాడేసరికి శివకింకరులు అంతా విని నెమ్మదిగా వారికి సమాధానం చెప్పారు

శివధర్మం బతి(తి) సూక్ష్మము
శివధర్మము లేశమైన సిద్ధించినచో
వివిధ మహాపాపోప
ద్రవములు చేరంగరావు ధన్యుని నతనిన్ 4-129

యమదూతలారా శివధర్మమనేది పరమసూక్ష్మం ఆ శివధర్మం లేశమాత్రంగా ఏకొంచెం సిద్ధించినా సర్వమహాపాపాలూ నాశనమైపోతాయి ఆ ధన్యాత్ముణ్ణి ఏ ఉపద్రవాలూ సోకవు ఇది ధర్మ సూక్ష్మం

స్థూలదృష్టి నీక్షించిన దోపకుండు.
సూక్ష్మదృష్టి నీక్షించిన జాడ్కి కందు
గాన, శివభక్తి ధర్మం బగాధమహిమ-
కానవచ్చినయట్లుండు గానరాదు 4-130

ఈ శివధర్మం స్థూలదృష్టికి కనిపించదు. సూక్ష్మదృష్టికే కనపడుతుంది. దీని మహిమ అగాధం-లోతు అందదు అంతా తెలిసినట్లే ఉంటుంది. కనిపించినట్లే ఉంటుంది- కానీ ఏమీ తెలియదు ఏమీ కనిపించదు.

ఆచారం బిది యనగ , న
నాచారం బిది యనంగ, నజునకు నైనన్
గోచరము గాదు, శివధ
ర్మాచారము సూక్ష్మరూపమై వర్తిల్లున్ 4-131

ఈ శివభక్తిధర్మంలో ఇది ఆచారం ఇది అనాచారం అని చటుక్కున నిర్ణయించడం ఆ బ్రహ్మతరంకూడా కాదు (అజునకునైనన్ గోచ రము కాదు). శివాచారం అంత సూక్ష్మరూపంలో ప్రవర్తిల్లుతూ ఉంటుంది

స్థూలదృష్టికి అనాచారంగా కనపడేది సూక్ష్మదృష్టిలో సదాచారం కావచ్చు అంచేత పైపైని చూసి నిర్ణయాలు చేయడం పొరపాటు అని శివకింకరులు హెచ్చరించారు ఇంతవరకూ సిద్ధాంతభాగం చెప్పి, ఇపుడు గుణనిధి పనుల్ని విశ్లేషించి చూపుతున్నారు

వ. ఇతడు చేసిన పుణ్యకర్మంబు వినుండు
4-132

అశన మబ్బకయున్న నైనను శివరాత్రి
యోరంత ప్రొద్దును నుపవసించె,
నోగిరంబు హరింప నొన పెట్టుకొనియైన
వేగునంతకు జేసె జాగరంబు,
హాత్రావలోకనోపాయంబునకునైన
వెలయించె దీపంబు వెలుగుజాల,
జూడ నొల్లకయైన జూచె నీశ్వరు మౌళి
పరులు చేసిన యట్టి ప్రసవపూజ
ఇచ్చె విధి మూడియైనను ఇంద్రధరుని
నగరి మోసాల బెంద్రోవ నట్టనడుమ
సూక్ష్మదృష్టి విచారించి చూచినప్ప
డింతకంటెను ధర్మంబు లెవ్విగలవు! 4-133

తినడానికి అన్నం దొరకకపోవడంవల్లనైతేనేమి గాక, గుణనిధి శివరాత్రి నాడు పగలూ రేయీ ఉపవాసం ఉన్నాడు. అహోరాన్ని అపహరించ డం కోసమైతేనేమి

గాక, గుడిలో తెల్లవారేదాకా (వేగునంతకు) పొంచి ఉండి (ఒన పెట్టుకొని) జాగారం చేసాడు ఆహార పదార్థాలున్న పాత్రల్ని చూడటం కోసమైతేనేమి గాక వత్తివేసి శివుని ముందు దీపం వెలిగించాడు దర్శనం చేసుకుందామనుకోకపోయినా ఏదో కారణం గా శివరాత్రినాడు శివాలయానికి వెళ్ళాడు శివుని శిరస్సు మీద భక్తులు చేసిన పుష్పాల పూజను చూసాడు చావు మూడినందువల్లనే అయినా శివాలయం ముఖశాల దగ్గర (మొగసాల) ప్రధానమార్గం నట్టనడుమ ప్రాణాలు వదిలాడు సూక్ష్మదృష్టితో ఆలో చించి చూస్తే ఇంతకంటే శివభక్తీ -శివదర్శాలూ ఏమిటి చెప్పండి?

గుణనిధి శివరాత్రినాడు ఉపవాసం ఉన్నట్టయింది జాగరణ చేసినట్ట య్యింది దీపం పెట్టినట్టయ్యింది పుష్పాభిషేకం దర్శించినట్టు అయ్యింది శివుని సన్నిధి లో పరమపవిత్రమయిన రోజున ప్రాణత్యాగం చేసి నట్టయ్యింది ఇంతకంటే మహా పుణ్యం ఏముంది? తెలియక చేసినా వేరే దృష్టితో చేసినా పాపం పాపమే పుణ్యం పుణ్యమే. పైకి పాపాలుగా కనిపించేవన్నీ ఇపుడు పుణ్యాలుగా మారిపోయాయి ఇది శివుడి మాహాత్మ్యం శివరాత్రి మాహాత్మ్యం - శివక్షేత్ర మాహాత్మ్యం

వ. అని పారిషదులు యమదూతల వీడ్కొలిపి యతని దివ్యవిమానా రూఢుం జేసి, శివలోకంబునకుం గొనిపోయి, శివుని సన్నిధిం బెట్టిరి. శివుండు ను ప్రదీప సంధుక్షణాదిక పుణ్యానురూపంబైన ఫలంబునం గళింగదేశాధి పతియైన యరింద మునకు దనయుండై దముం డనుపేర నా దేశంబునకు రాజుగా ననుగ్రహించి పుత్తెంచె. ఈశ్వరానుగ్రహంబునం బట్టాభిషిక్తుండై-

4- 34

శివభటులు (పారిషదులు=సభ్యులు) శివదర్శసూక్ష్మాన్ని వివరించి గుణనిధి పుణ్య విశేషాన్ని నిరూపించి యమభటులకు వీడ్కోలు చెప్పారు గుణనిధిని తమ దివ్యవిమానంలో ఎక్కించుకొని శివలోకానికి తీసుకువెళ్ళి శివుడి సన్నిధిలో నిలిపారు. శివరాత్రినాడు దీపారాధన చెయ్యడం మొదలైన పుణ్యకార్యాలకి అనురూప ఫలంగా పరమశివుడు గుణనిధికి గొప్ప వరం ఇచ్చాడు కళింగరాజైన అరిందమునికి తనయుడుగా జన్మించమని పంపించాడు ఆ జన్మలో గుణనిధి పేరు దముడు కళింగా నికి యువరాజై తరువాత రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు ఇది ఈశ్వరానుగ్రహం.

తెలిసీ తెలియని వయస్సులో అనేక కారణాలుగా చెడు స్నేహాలకూ చెడు అలవాటులకూ లొంగిపోయినా, ఏదో ఒక సమయంలో తప్పు తెలుసుకుని మనస్సు మార్చుకుని, సన్మార్గంలోకి రావచ్చుననీ, అయ్యో పాపా త్ములమైపోయామే అని జీవితాంతం అలాగే కుళ్ళిపోవలసిన అవసరం లేదనీ సన్మార్గంలోకి వచ్చిన పుణ్యంతో పూర్వపాపాలు ప్రక్షాళితమై పోతాయనీ - అటువంటివారిలో విశ్వాసాన్ని కలిగించ డానికి ఇటువంటి కథలు బాగా ఉపకరిస్తాయి

చేతవోలు

అనంతామాత్యుడు (క్రీ.శ 1430 ప్రాంతం)

భోజరాజీయము- వసిష్ఠాగస్త్యోపాఖ్యానము

(తృతీయ10నుండి30)

తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన ప్రక్రియ కథాకావ్యం. జక్కన విక్రమార్కచరిత్ర, అనంతామాత్యుడి భోజరాజీయము, కొఱవి గోప రాజు సింహాసన ద్వాత్రింశిక దూబగుంట నారాయణకవి పంచతంత్రం పాలవేకరి కదిరీపతి శుక సప్తతి అయ్యలరాజు నారాయణకవి హంస వింశతి- ఇవి ఈ ప్రక్రియలో పేరెన్నికగన్న కావ్యాలు

జాతివార్తాచమత్కారాలు ఈ కథాకావ్యాలలో ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రతిపాదిస్తూ శ్రీ జి వి సుబ్రహ్మణ్యంగారు ''స్థూలంగా వివేచిస్తే జక్కన చమత్కారాన్ని ఆదరించిన కవి అనంతామాత్యుడు జాతిని గౌరవించిన కవి ఈ వివేచనం ప్రాధాన్యవివక్షతో చేస్తున్నదే'' - అన్నారు (సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు పుట- ౨౨)

ఈ కథాకావ్యశాఖకు సంబంధించి సంస్కృతంలో రాజతరంగిణి, దశకు మారచరిత్ర కాదంబరి కథాసరిత్సాగరం మొదలయినవి ఎన్ని ఉన్నా పంచతంత్రానిదే అద్వితీయస్థానం ఇది ఇంచుమించు మన దేశభాష లన్నింటిలోకే కాదు, ప్రముఖమైన ప్రపంచ భాషల్లోకి కూడా అనూదిత మయ్యింది జంతువులు పాత్రలుగా ఇంత అద్భుతమైన రచన మరొకటి ప్రపంచ భాషలలోనే ఎక్కడా కనపడదని గొప్పగా ప్రశంసలు అందుకొంది ఒక వయస్సువారికి నీతిని బోధించడం లోకజ్ఞత నేర్పడం దీని లక్ష్యాలు. అద్భుతరసంతో ఆకట్టుకోవడం దీని శిల్పం

కథాకావ్యాలన్నింటా ఇదే పద్ధతి కనపడుతుంది కథలోంచి కథ కథలోంచి కథ పుట్టుకువచ్చి కావ్యశరీరం వటవృక్షంలా వ్యాపిస్తుంది ఏ కథకు ఆ కథ స్వతంత్రంగానూ ఉంటుంది ఒక నీతినో ఒక ధర్మాన్నో ఒక తత్త్వాన్నో ఒక జీవన విధానాన్నో ఒక విశ్వాసాన్నో ఒక ఆచారాన్నో ప్రబోధిస్తూ కథలు సాగుతాయి సాధారణంగా ఒకరు చెప్పడం ఒకరు వినడంగా ఉంటుంది. కానీ అప్పడప్పుడూ శ్రోతకూడా తనకు తెలిసిన కథలు అనుకూలంగానో ప్రతికూలంగానో చెబుతూ ఉంటాడు లేదా వక్త చెప్పిన కథలో కొన్ని అంశాలను ప్రశ్నిస్తూ ఉంటాడు. దానితో మరోకథ మరోకథ పుడతాయి. అంచేత కథాకావ్యాలు చర్చారూపంలో నడుస్తాయనడం సబబు కథను రాయడం కాకుండా చెప్పడం ఇక్కడి సాంకేతికత.

వీటిలో కథకే ప్రాధాన్యం. వర్ణనలు ఉంటాయి కానీ విస్తృతంగా ఉండవు అవసరానికి సరిపడా వాతావరణాన్ని అందిస్తూ క్లుప్తంగా ఉంటా యి మరో విశేషమేమంటే అష్టాదశవర్ణనలుగా పేరుపొందిన నగరార్ణవశైలాది వర్ణనలే కాకుండా దేశీయమైన విశేషాలను తెలియజెప్పే వర్ణనలు ప్రముఖంగా కనపడుతూ ఉంటాయి వస్తువులు, దుస్తులు, భూషణాలు గృహాలు, గృహోపకరణాలు పంట పొలాలు,

పెంపుడు జంతువులు ప్రాంతీ య సంస్కృతికి దర్పణం పట్టే ఆటపాటలు ఆచార వ్యవహారాలు వేషభాష లు ఇత్యాదులు కథాకావ్యాల్లో ఎక్కువగా ప్రస్తావనకు వస్తూ ఉంటాయి

వస్తుపరంగా భాషాపరంగా సమాజానికి మరింత దగ్గరగా ఉండే కావ్యప్రక్రియ ఇది వివిధ వృత్తులవారూ వారి పరస్పర సంబం ధాలు గౌరవమ ర్యాదలు వైషమ్యాలు ఆశలు నిరాశలు, విశ్వాసాలు మోసాలు దగాపడటాలు, దారిద్ర్యాలు అసంతృప్తులు ఇలాంటివన్నీ కథా కావ్యాలలో దర్శనమిస్తాయి సజీవ సమాజం కనపడుతుంది ఆదర్శ ప్రాయమైన జీవితాన్ని ఉపదేశించే లక్ష్యంతో అద్భుతా వహమైన కథలకు ఆటపట్లు ఇవి వీరశృంగారహాస్యాది రసాలు కూడా యథోచితంగా ఉంటాయి కథా కథనంలో శిల్పవైవిధ్యం బాగా కనపడుతుంది ప్రసిద్ధికెక్కిన కథన పద్ధతులన్నీ మనం గమనించవచ్చు పాఠకుల్లో లేదా శ్రోతల్లో ఉత్కంఠను రేకెత్తించే ప్రారంభాలతో దాన్ని కడదాకా నిలబెట్టే కథన వైదుష్యంతో నట్టనడుమ ఉత్కంఠను మరింత పెంపొందించే శాఖోపశాఖ ల విస్తరణలతో ఇవి అలరారుతుంటాయి

ఈ కథాకావ్యాలలో అనంతామాత్యుడి ''భోజరాజీయము'' చాలా ప్రముఖమయ్యింది '' ఛందోదర్పణము'' ఇతడి మరొక రచన ''రసాభరణము'' అనే గ్రంధాన్ని కూడా ఇతడు రచించాడని తెలుస్తోంది గానీ అది ఇంతవరకూ దొరకలేదు పేరునుబట్టీ దొరుకుతున్న ఒకటి రెండు ఆధారాలను బట్టీ రసాభరణం అలంకార శాస్త్రగ్రంధమని పరిశోధకుల అభిప్రాయం దీని రచనాకాలం క్రీ.శ 434. పదిహేనవ శతాబ్ది ప్రారంభకాలంలో అనంతుడున్నాడని నిర్ణయం

భోజరాజీయాన్ని అహోబలనృసింహస్వామికి అంకితంగా రచించాడు ఛందోదర్పణంలో లక్షణాలూ లక్ష్యాలూ విష్ణుపరంగానే రూపొందిం చాడు వీటిని బట్టి అనంతుడి ప్రాంతమూ స్వాంతమూ మనకు అవగత మవుతాయి

సర్పటి (సిద్ధయోగి) భోజరాజుల సంభాషణంగా సాగిన ఈ కథలను మహుడు అనే రాజుకు దత్తాత్రేయుడు తపఃఫలంగా ప్రత్యక్షమై ఉపన్యసిస్తాడు అలా అని అనంతామాత్యుడు అహోబలనృసింహస్వామికి విన్నవించుకున్నాడు ఇదీ వక్తృ శ్రోతల పరంపర సిద్ధయోగిచరితలు, గోవ్యాఘ్రసంవాదం లాంటి (పద్మ పురాణం-పాతాళఖండం) ఎన్నో మంచి కథలకు ఇది పెద్దనిధి

లోహాన్ని బంగారంగా మార్చే ధూమవేది అనే విద్యను సర్పటి నుంచి భోజ రాజు మాయోపాయంతో నేర్చుకుంటాడు- అపహరిస్తాడు దానికి ఆ సిద్ధయోగి అలిగి-నీకు సంతానం కలగదు పొమ్మని శపిస్తాడు భోజరాజు ప్రాధేయపడతాడు. సిద్ధయోగి శాంతించి విరుగుడు చెబుతాడు అప్పుడు భోజరాజు సంతోషించి-

'' స్వామీ! మీతో సహపంక్తిని కూర్చుని ప్రసాదం స్వీకరించే అదృష్టం ఆనందం నాకు కల్పించండి మా అంతఃపురానికి దయచేయండి మీ కోడళ్ళు నలుగురూ భోజనం వండి వడ్డిస్తారు'-అని ఆహ్వానిస్తాడు ''

"మహారాజా నేను పంచభిక్షా నియమంతో ఉన్నాను. వ్రతభంగం చెయ్యలేను" అని భోజరాజు ఆహ్వానాన్ని సర్పటి సున్నితంగా తిరస్కరిస్తాడు

రోజుకి అయిదు ఇళ్ళల్లో ఒక్కొక్క ముద్ద చొప్పున బిచ్చం అడుక్కుని అది మాత్రమే తిని కాలం గడపడాన్ని పంచభిక్షావ్రతం అంటారు

"స్వామీ మా ఇంటిలో ఏకభిక్ష చెయ్యండి మీకు వ్రతభంగం కాదు" అని భోజుడు ఉపాయం చెబుతాడు

పంచ భిక్షయు నాహార పరత లేక
యునికి యును నొక్క రూపె కావున నరేంద్ర!
వ్రతము పూనితి గురు నాజ్ఞ వదలరాదు,
వలదు పొండని సిద్ధుండు పలుకుటయును (3-7)

నరేంద్ర పంచభిక్ష చెయ్యడమంటే ఆహారం లేకుండా ఉపవాసం ఉండటంతో సమానం. ఇవి రెండూ ఒకటే (ఒక్కరూపే) మా గురువుగారి ఆజ్ఞ ప్రకారం నేను ఈ వ్రతం చేపట్టాను దీన్ని వదలకూడదు అంచేత మీరు వెళ్ళరండి (పొండు- గౌరవార్థంలో బహువచనం వాడటం)

సర్పటి ఇలా పలికే సరికి భోజుడు ఒక ధర్మసూక్ష్మం వెలికి తీసాడు.

ఎచట మీరెఱుంగని ధర్మమేమి కలదు!
వినుడు- మీతోడ మాటాడ వెఱతు గాని
పూని యెుండుల ప్రార్థన భోజనంబు
సదుపవాసంబుగా జెప్ప శాస్త్రచయము (3-8)

మహాత్మా ఏ విషయంలోనైనా సరే మీకు తెలియని ధర్మం ఏముంది అన్నీ మీకు తెలుసు మీతో మారు మాట్లాడాలంటే- వాదించా లంటే- నాకు భయం అయినా గానీ ఒక మాట చెబుతాను దయచేసి వినండి ఎదుటి వారి ప్రార్థనవల్ల వారి అభ్యర్థనను కాదనలేక తప్పని సరై భోజనం చేస్తే అది ఉపవాసమే అవుతుందనీ, అందువల్ల ఉపవాసవ్రతం చెడదనీ శాస్త్రాలు చెబుతున్నాయి.

ఈ యర్థంబున తొల కథ
మీయట్టి మహాత్ము లర్థి మెయి జెప్ప మునీం
ద్రా! యేను వింటి దదభి
ప్రాయ మవధరింపు విన్నపం బొనరింతున్ 3-9

ఈ విషయాన్ని ప్రతిపాదించడానికి (ఈ అర్థంబునకు) ఒక కథ ఉంది మునీంద్రా మీలాంటి మహాత్ములు కోరి చెప్పగా (అర్థిమెయిన్ చెప్పన్) నేను విన్నాను దాని సారాంశం (తదభిప్రాయము) విన్నవిస్తాను ఆలకించండి (అవధరింపుము)-

అనఘుడు వసిష్ఠముని ప్రతి
దినమును దగ నగ్నిహోత్ర దేవార్చనముల్
మునుచేసి యరుంధతిచే
బనుపు నగస్త్యునకు భిక్ష పరమప్రీతిన్ 3-10

పరమ పావనుడు వసిష్ఠ మహర్షి రోజూ అగ్నిహోత్రం వేల్చి, దేవుడికి నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని అగస్త్యుడికి భిక్షగా ప్రేమతో పంపించేవాడు అరుంధతీదేవి స్వయంగా తీసుకువెళ్లి ఇచ్చేది (మహర్షులూ సన్యాసులూ తీసుకునే ఆహారానికి భిక్ష అని వ్యవహారం)

అగస్త్యుడు ఎక్కడ ఉన్నాడు, వసిష్ఠుడు ఎక్కడ ఉన్నాడు ఈయనకు భిక్షపంపించడమేమిటి, అదీ అరుంధతితోనా- మొదలైన సందేహాలతో ఉత్కంఠను రేకెత్తించే ప్రారంభమిది వీటికి సమాధానాలు తరువాత చెబుతున్నాడు-

గౌతమి యవ్వలం దపముగై కొని చేయుచునున్న కుంభ సం
జాతున, కివ్విధంబున నజస్రము దత్సతి భిక్ష దేర బ్ర
ఖ్యాతిగ నన్న వర్జమగునట్టి వ్రతం బొనరించుచుండియున్
బ్రీతమనస్కుడై పరిహరింప కతండు భుజించు నిచ్చలున్ 3-11

గోదావరికి ఇవతల తీరంలో అరుంధతీ వసిష్ఠుల ఆశ్రమం అవతలి ఒడ్డున అగస్త్యుడు (కుంభ సంజాతుడు) తపస్సు చేసుకుంటు న్నాడు అది నిరాహార నియమంతో చేస్తున్న తపస్సు (అన్న వర్జమగునట్టి వ్రతంబు) అయినా ప్రతీరోజూ (అజస్రము) అరుంధతీదేవి తీసుకువచ్చి ఇస్తున్న భిక్షను అతడు తిరస్కరించకుండా (పరిహరింపక) ప్రీతితో (ప్రీతమన స్కుడై) భుజిస్తున్నాడు

అగస్త్యుడి నియమం తెలిసీ వసిష్ఠుడు ఎందుకు భిక్ష పంపుతున్నట్టూ, ఆయన కాదనకుండా ఎందుకు భుజిస్తున్నట్టూ వీటికి సమాధానం ఇక్కడ చెప్పడు. ఇది రోజూ యథావిధిగా సాగుతూనే ఉంది

ఎప్పటి యట్టుల నొక నా
డప్పాలతి యగస్త్యమునికి నాదట నన్నం
బొప్ప గొని పోవ నేమని
చెప్పదు గట్టిదుటి భయద జృంభణ మెసగన్ 3-12

ఎప్పటిలాగే ఒక రోజున ఆ అరుంధతి (ఆ +పాలతి) అగస్త్య మహర్షికి ప్రేమతో (ఆదటన్) అన్నం తీసుకుని బయలుదేరింది గోదావరి దాటి వెళ్ళాలి. ఏమి చెప్పమంటావు సర్పటీ సరిగ్గా ఆ సమయానికి గౌతమీ నది భయంకరంగా విజృంభించి పరళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది

గంగా భోగవతీ తరంగిణుల కైక్యప్రీతి గావించు న
ట్లంగిం బొంగుచు, నేల గ్రొచ్చికొనుచుం బాథోనిధుల్ రెంటికిన్
సాంగత్యం బొనరింప జాచు గతి బార్శ్వవ్యాపకంబై, బృహ
ద్భంగ శ్రేణి పరంపరాక్రమణ మొప్పం బాఱు నగ్గౌతమిన్ 3-13

అటు ఆకాశగంగనూ ఇటు పాతాళగంగనూ (పాతాళంలో ప్రవహించే గంగకు భోగవతి అనిపేరు) ఏకంచేద్దామన్నట్టుంది గోదావరి ఉద్ధతి అంత ఎత్తుకి పొంగుతోంది ఇంతలోతుకి నేలను కోసేస్తోంది. (క్రొచ్చికొనుచున్) అంతేకాదు

రెండువైపులకూ వ్యాపిస్తోంది (పార్శ్వవ్యాపకం బై) బహుశ రెండు సముద్రాలనూ (తూర్పు సముద్రం పడమటి సముద్రం) సంగత పరుద్దామని భావిస్తోంది కాబోలు ఒకదానిని ఒకటి తరుముకుంటూ వస్తున్న పెద్దపెద్ద తరంగాలతో పరుగులు తీస్తున్న ఆ వరదగోదావరిని ఎట్ట ఎదుట చూసింది అరుంధతి.

నీటికి సర్వతోముఖము అని పేరు ఊర్ధ్వపీడనం అధఃపీడనం పార్శ్వ పీడనం కూడా ఉంటుందని కాబోలు గోదావరి పైకి పొంగుతూ నేలను కోసివెయ్య డానికి ఒక హేతువునీ ఉభయపార్శ్వాలకూ వ్యాపించడానికి మరొక హేతువునీ కవి ఉత్ప్రేక్షించాడు శైలిని హఠాత్తుగా మార్చి వస్తుస్ఫూర్తిని కలిగించాడు నీటివరద ఏక కాలంలో చేస్తున్న అన్ని పనుల్నీ ఒకేసారి కంటితో పట్టుకుని ఒకే పద్యంలో బొమ్మ కట్టాడు ఇది కథా కావ్యం కనక ప్రవాహవర్ణనలో కొట్టుకు పోకుండా వెంటనే కథలోకి వచ్చేస్తున్నాడు -

కనుగొని యయ్యరుంధతి -ఖగప్రకరంబునకైన నిమ్మహా
ధుని యవిలంఘనీయమయి తోచుచునున్నది, మర్త్యు లెవ్విధం
బున దరియింప జాలుదురు బుద్ధి దలంపగ, మర్త్యులందు నం
గనల వశంబె యిప్పని! యగమ్యము పొమ్మని భీతినొందుచున్. (౩-౧౪)

ఉరవడిని చూస్తూనే అరుంధతి భయపడి పోయింది. ఎగిరివెళ్లే పక్షులకు కూడా (ఖగప్రకరంబునకైనన్) ఈ నదిని ఇప్పుడు దాటడం అసంభవమనిపిస్తోంది అటువంటిది మానవులు ఎలా దాటగలుగుతారు. పురుషులే దాటలేరంటే ఇంక అంగ నలకు ఈ పని సాధ్యమవుతుందా! ముమ్మాటికీ అసంభవం అని నిశ్చయానికి వచ్చే సింది (పొమ్ము అనేది నిశ్చయార్థకం).

పక్షులు కూడా దాటలేవు అనే అతిశయోక్తి ప్రవాహతీవ్రతను సూచిస్తోంది ఇక్కడ అలంకారం అప్రధానం వస్తుస్ఫూర్తి ప్రధానం. దీన్ని అలంకార కృత వస్తుధ్వని అంటారు దాటలేమని నిశ్చయించుకుని అరుంధతి వెనుదిరిగింది

వెస దిరిగి వచ్చి యా పు
ణ్య సతీ తిలకంబు పతికి నమ్రయగుచు వె
క్కసమెసగ జెప్పెను నదీ
ప్రసర రవ గభీర ఘోర పాథోరయమున్ (౩-౧౫)

ఆ సాధ్వీరత్నం గబగబా (వెసన్) ఆశ్రమానికి తిరిగి వచ్చింది వచ్చేసి - హోరెత్తిపోతూ (నదీ ప్రసరరవ) గంభీరంగా భయంకరంగా ప్రవహిస్తున్న గోదావరి నీటివేగాన్ని (పాథోరయమున్) తన పతి వసిష్ఠుడికి సవినయంగా (నమ్రయగుచు) వివరించి చెప్పింది

వెక్కస మెసగ జెప్పెను అనడంలో భయపడి తాను వెనక్కి వచ్చెయ్యడానికి సమర్థకంగా బాగా వివరించి చెప్పింది అని సూచన దాన్ని స్ఫురింపజేస్తోంది పద్యంలో ఏక సమాసంగా సాగిన చివరిపాదం

వ. ఇట్లు చెప్పి వివర్ణవదన యగుచునున్న యన్నళినవదన
వదనం బవలోకించి చిఱునవ్వు నవ్వుచు నవ్వసిష్ఠుడు (16)

ఇలా వివరించి చెబుతూంటే అరుంధతి ముఖం వివర్ణ మయ్యింది భయం ప్రతిఫలించింది (వివర్ణమగుట= రంగుమారుట) ఆ పద్మముఖి (నళినవదన) ముఖాన్ని ఆ పరిస్థితిలో గమనించి వసిష్ఠుడు చిన్నగా నవ్వుతూ-

పడతుక! నీ వేమియు భయ
పడక సదాబ్రహ్మచారి పనుపున నేనొ
క్కెడ కేగెద దెరు విమ్మని
యడుగుము పొమ్మనిన బోయి యట్ల యడిగినన్. (3-17)

ఇంతి! (పడతుక=స్త్రీ) నువ్వు ఏమీ భయపడవద్దు ఒక నిత్య బ్రహ్మచారి ఆజ్ఞమీద (పనుపున) నేను ఒక చోటికి వెడుతున్నాను.దారి ఇయ్యి అని గోదావరిని అడుగు వెళ్ళు- అన్నాడు

అరుంధతీదేవి వెళ్ళి అలాగే అడిగింది అడగడంతోటే ఆశ్చర్య కరంగా-

ఆనవైచినట్లు, పూని మంత్ర ప్రయో
గంబు చేసినట్లు, కట్టినట్లు,
నిట్టపొడిచి యెదుర దొట్టిన వాహిని
యివుర జలము వాఱె నిసుక దోప. (3-18)

ఎవరో ఒట్టువేసినట్టు (ఆన = ఆజ్ఞ, ఒట్టు) మంత్రప్రయోగం ఏదో చేసినట్టు కట్టేసినట్టు (కట్టినట్లు=బంధించినట్టు కనికట్టు చేసినట్టు) అప్పటివరకూ ఎట్టఎదుట (నిట్టపొడిచి) పొంగి పరవళ్ళు తొక్కుతూన్న గోదావరీనది నీళ్ళు ఇంకిపోయి (ఇగురన్- ఇవురన్) ఇసుక కనిపించేలా ప్రవహించడం మొదలు పెట్టింది మడిచీల లోతుకి మారిపోయి తెరిపి ఇచ్చింది

ఆ తెఱపి నబల చనుటయు
నాతతముగ దొంటి యట్ల యా నది పాఱెన్.
నాతి యట యరిగి యన్నం
బా తపసికి బెట్టి మరలు నవసరమందున్ (3- 19)

(తొంటియట్ల=మునుపటి వలెనే అవసరము= సమయం)

ఆ తెరిపిలో అరుంధతి నదిని దాటి అవతలి గట్టుకు వెళ్ళింది మళ్ళీ ఆ నది అంతకుముందులాగే పరవళ్ళు తొక్కుతూ (ఆతతముగ) ప్రవహించడం మొదలు పెట్టింది.

అరుంధతి అవతలిగట్టున ఉన్న అగస్త్యాశ్రమానికి వెళ్ళి అక్కడ అగస్త్యుడికి అన్నం పెట్టి తిరిగి బయలుదేరుతూ, మళ్ళీ నదిని దాటి వెళ్ళడం ఎలాగా అని సందేహిస్తూ-

అనుమానింపుచు నాతని
గనుగొని ''యోతండ్రి! నేడు గౌతమి దర్పం
బున మిన్నుముట్టి పాఱెడి
జననేర, నుపాయ మొకటి చయ్యన జెపుమా! 3-20

ఓ తండ్రీ ఇప్పేళ గౌతమీనది గర్వంతో విజృంభించి ఆకాశం తాకేటంత ఎత్తుగా ప్రవహిస్తోంది దాన్ని దాటి వెళ్ళలేను ఏదయినా ఉపాయం ఒకటి చెప్పవా- అని అగస్త్యుణ్ణి అభ్యర్థించింది

అనవుడు ''దల్లి! నీ విచటి కాదటతో జనుదెంచునప్పడే
యనువున వచ్చి'' తన్న బతి యాడిన చందము నట్లు పల్కినం
దనకది త్రోవ యిచ్చుటయు దానటు దాటిన యాక్షణంబ వా
హిని గడు బొంగి పాఱుటయు నేర్పడ జెప్పిన నయ్యగస్త్యుడున్ (3-2)

(అనవుడున్= అనగా ఆదటతో= ఆదరంతో అనువు= ఉపాయం, విధానం)

అమ్మా నువ్వు ఇక్కడికి ఆదరంతో వచ్చావుగదా వచ్చేటప్పుడు మరి ఏ ఉపాయంతో నదిని దాటావు? అని అగస్త్యుడు వివరణ అడిగాడు.

వసిష్ఠుడు చెప్పిన విధానం తాను అలా పలకడంతోనే నది తనకు దారి ఇవ్వడం తాను దాటడం దాటగానే అది మళ్ళీ పొంగి ప్రవహించడం.- ఇదంతా స్పష్టంగా వివరించి (ఏర్పడన్) చెప్పింది అరుంధతి

ఆ రమణీలలామకు బ్రియంబున జేతులు మోడ్చి ''సద్గుణా
ధార చరిత్ర! యింతియు కదా, యిది యెంతటి కార్య మా నదిం
జేరగ బోయి యిట్లనుము, చెప్పెద, నేనొక మార్గము,న్నిరా
హారున కోదనం బిడుటకై చని క్రమ్మఱ నేను బోయెదన్.(3-22)

తెరు విమ్మని యటులడుగుము
సరభసగతి నుదక మిఱు దెసల బాయ గడుం
బరువున బోవగ నయ్యెడు
దరుణీ! యరుగు మఱికాలు తడి గాకుండన్. 3-23

అగస్త్యుడు ఆ పతివ్రతకు (రమణీలలామకు) ప్రేమతో చేతులు మోడ్చి నమస్కరించాడు ''సకల సద్గుణాలకూ ఆధారమైన ప్రవర్తన (చరిత్ర) కలదానా! ఇంతే కదా ఇది ఎంత పని నేనొక మార్గం చెబుతాను ఆ నది దగ్గరకి వెళ్ళి ఇలా అను- ఓనదీ ఒక నిరాహారుడికి అన్నంపెట్టి నేను తిరిగి వెడుతున్నాను దారి ఇయ్యి- అని అడుగు వెంటనే నీరు రెండు వైపులకీ తొలగిపోతుంది నీకు దారి ఇస్తుంది గట్టినేలమీదలాగా పరుగు పరుగున నువ్వు వెళ్ళిపోవచ్చు, అమ్మా (తరుణీ) అరికాలికి తడి అంట కుండా హాయిగా వెళ్ళు'' అని అగస్త్యుడు మరో కొత్త ఉపాయం చెప్పాడు

అనిన- వసిష్ఠుడు మున్న
ట్లనుటకు దోడిదియు నొక్క యాశ్చర్యము పా

వ్మని తలచుచు గౌతమికిం
జని యట్లుల పల్క నది వెసం దెరువిచ్చెన్ (24)

తానిక్కడికి వచ్చేటప్పుడు తన భర్త వసిష్ఠుడు అలా పలికాడు నది దారి ఇచ్చింది దానికి తోడు ఇప్పుడు ఇది మరొక ఆశ్చర్యం. బలే- అనుకుంటూ అరుంధతి బయలు దేరింది. గౌతమిని సమీపించింది అగస్త్యుడు చెప్పినట్టే పలికింది నది వెంటనే (వెసన్) దారి ఇచ్చేసింది (తెరువు ఇచ్చెన్)

ఆ మార్గమున బ్రీతి నరుదెంచి ప్రాణేశు
డగు వసిష్ఠుని గాంచి, యతని యడుగు
దమ్ములు తనదు మస్తకము సోకగ మ్రొక్కి,
ప్రాంజలియై నిల్చి, భక్తితోడ
బడతి యిట్లని విన్నపము చేసె-మీ వాక్య
గతి విన్న యప్పుడు, గౌతమీ మ
హానది తెరువిచ్చె, నటపోయి క్రమ్మఱ
వచ్చుచో నమ్మునివరుని జూచి,
యేను నేడు నిండి పాఱుచున్నది, నాకు
జన నుపాయ మెద్ది యనిన, నాత
డేమి యనెనొ వింటిరే!, తొల్లి యెన్నడు
వినని యద్భుతములు వింటి నేడు. 3-25

ఆ దారిలో ఆనందంగా నడిచి వెళ్ళింది వెడుతూనే వసిష్ఠులవారి పాదాలకు తన శిరస్సు ఆనించి నమస్కారం చేసింది భక్తితో నమస్కరిస్తూ లేచి నిలబడింది. నెమ్మదిగా విన్నవించింది.

స్వామీ! మీరు అనమన్న వాక్యాలు వినగానే గోదావరి దారి ఇచ్చింది అవతలివైపుకి వెళ్ళాను తిరిగి వచ్చేటప్పుడు అగస్త్యులవారికి పరిస్థితి వివరించాను అయ్యా! ఇవ్వేళ గోదావరి గట్లు తాచి ప్రవహిస్తోంది దాన్ని దాటి నేను తిరిగి వెళ్ళడానికి ఏదయినా ఉపాయం చెప్పండి - అని అడిగాను అప్పుడు ఆయన ఏమి అన్నాడో విన్నారా! ఇంతకు ముందు ఎప్పడూ విని యెరుగని అద్భుతాలు విన్నాను ఇవ్వేళ. (ఈవిడకూడా వసిష్ఠునిలో ఉత్కంఠ పెంచుతోంది.)

వ అని పలికి తా నిటు మరలి వచ్చునప్పు డగస్త్యుండు గౌతమితో బల్కుమన్న తెఱంగును, నట్లు పలికిన నానది తొంటియట్ల తెరువిచ్చుటయును జెప్పి యప్పొలంతి "యనఘా! నాయందుం గడుపార నూర్వురు కొడుకులం బడసిన యట్టి నీవు సదాబ్రహ్మచారి వనుటయును, మీ పంపున నేను నిచ్చలుం గొనిపోయి పెట్టినట్టి మృష్టాన్నంబు తుష్టిగా ననుభవించుచున్న యమ్ముని దాను నిరాహారుండ ననుటయును నతి విరుద్ధంబులై యున్నవి. మీ మాయలెవ్వరికి నెఱుంగనగు, నైనను నా చనవు చెఱుపక యీ రెండు

దెలుంగులు నాకుం దెలియ నానతీయవలయు ననిన విని నవ్వుచు వసిష్ఠుండిట్లనియెం- 3-26

అగస్త్యుడు ఏమి ఉపాయం చెప్పాడో, ఏమి పలకమన్నాడో వివరించింది. ఆ మాటలు పలికే సరికి గోదావరి ఇదివరకులాగే దారి ఇచ్చింది అని చెప్పి ఆ తరువాత అరుంధతి అసలు సిసలు సందేహాన్ని బయ ట పెట్టింది

ఓ పుణ్యాత్ముడా (అనఘా) నూరుగురు కొడుకలకి కన్నతండ్రివి నువ్వు. నా కడుపు చల్లగా వాళ్ళు నీవల్ల జన్మించారు. అటువంటి నువ్వు ''నిత్యబ్రహ్మచారిని నేను అనడమేమిటి

మీ ఆజ్ఞ ప్రకారం నేను రోజూ తీసుకు వెళ్ళి పెడుతూన్న మృష్టాన్నాన్ని కడుపు నిండా తృప్తిగా భోజనం చేస్తూ ఆ అగస్త్యుడు ''నిరాహారుణ్ణి నేను'' అనడ మేమిటి!

ఇవి రెండూ అత్యంత విరుద్ధాలుగా కనపడుతున్నాయి. సరే- మీ మాయలు ఎవరికీ అర్థంకావు అయినా చనువు కొద్దీ, కాదనరని అడుగుతున్నాను (చనవు చెలుపక)- ఈ రెండూ నాకు తెలియజెప్పండి.

అని అరుంధతి అడిగేసరికి వసిష్ఠుడు చిరునవ్వుతో సమాధానం చెప్పాడు

అశనాభిరతి లేక యటవీస్థలంబున
నియత తపోనిష్ఠ నెఱపుచుండ,
గృహధర్మ నిరతులు గ్రహియించి, భక్తిపూ
ర్వకముగా దగ సమర్పణము చేయు
నన్నపానాదుల, ననాసక్తుడై కొను
నతడు నిరాహారు డండ్రు బుధులు,
ధర్మమార్గమున సంతతి నుపార్జింప స
మాన్వయంబున వివాహంబు వడసి,
మనసు తమకంబు లే, కాత్మ వనిత యందు
బూని ఋతుకాల మందున- గాని తిథులు
పరిహరించి, యథోచిత భంగి గేలి
సలుపువాడు సదా బ్రహ్మచారి యండ్రు. 3-27

ఆహారం మీద ఆస్థ విడిచి పెట్టేసి (అశన+ అభిరతి+ లేక) నిరా హారదీక్షతో ఎవరయినా ఒక మహర్షి ఏదో ఒక అడవిలో తపస్సు చేసుకుం టున్నాడనుకో అది గృహస్థులకు తెలిసి వాళ్ళు భక్తితో పట్టుకువచ్చి ఆహారం ఏదయినా సమర్పించారనుకో అప్పడు ఆ గృహస్థుణ్ణి చిన్నబుచ్చడం ఇష్టం లేక ఆ అన్నపానాదుల్ని అనాసక్తుడై (ఆసక్తుడుకాకుండా) ఆ మహర్షి స్వీక రించాడనుకో. అయినా అతడు నిరాహారుడు కిందే లెక్క అని పండితులు (బుధులు) చెబుతున్నారు

ఎదుటివారి భక్తి పూర్వకమైన అభ్యర్థనతో నిర్బంధంతో ఏది తిన్నా ఉపవాసం చెడదు. ఆసక్తుడు కాకుండా ఉండటం ప్రధానం.

అలాగే - ధర్మమార్గంలో సంతానం కోరి, తగిన వంశంనుంచి (సమ+ అన్వయంబున) కన్యను వివాహమాడి, మనస్సులో తమకం (కామప్రకోపం) వీడి, ఆ ధర్మపత్నిని ఋతుకాలంలోమాత్రమే సంగమిస్తూ, అప్పడుకూడా అవి కాని తిథుల యితే కనక (చతుర్దశి అమా వాస్య- ఇత్యాదులు) సంగమం పరిహరిస్తూ యథో చితంగా సంసారకేళి జరిపేవాడు నిత్యబ్రహ్మచారి - అని బుధులు చెబుతున్నారు.

కావున నమ్ముని మాటకు
నా వచనంబునకు గారణంబిది కంటే
నావుడు సవినయ భాషల
నా వనితారత్న మిట్టులను బ్రాంజలియై. 3-28

అంచేత ఓ అరుంధతీ. అగస్త్యుడు నిరాహారుణ్ణి అనడానికీ, నేను సదాబ్రహ్మచారిని అనడానికీ కారణం ఇది - తెలిసిందా (కంటే)

ఆ వనితారత్నం అరుంధతి ఇది విని అలా నమస్కరిస్తూనే సవినయంగా పలికింది

ఇట్టిది ధర్మసూక్ష్మమిది యెవ్వ రెఱుంగుదు, రింత యొప్పనే,
యిట్టి మహానుభావమును, నిట్టి చరిత్రము, నీక యొప్పు, ని
ట్టట్టని తేఱి చూడ నమరాదులకుం దరమయ్యె, నేడు నా
పుట్టు కృతార్థతం బొరసె, భూరి భవద్వచనామృతంబునన్ 3- 29

నాథా! ధర్మ సూక్ష్మమంటే ఇది ఓహోహో ఎవరికి తెలుసు ఎంత గొప్పగా ఉంది (ఇంత యొప్పనే) ఇటువంటి గొప్పదనం (మహత్ + అను భావము) ఇటువంటి నడవడిక (చరిత్ర-శీలము) నీకే తగును. అల్లాటప్పాగా నీపైపు తేరి చూడటానికి దేవతలకికూడా తరంకాదు ఇవ్వేళ్టకి నా జన్మ (నా పుట్టు) ధన్యమయ్యింది- నీ ఉప దేశామృతం కారణంగా

అనియె నటుగాన నీవును నయ్యగస్త్య
ముని విధంబున నాదు ప్రార్థనము గరుణ
నవధరించుట కర్తవ్య మనిన నతడు
భోజవిభు జూచి యాననాంభోజ మలర. 3-30

అని అరుంధతీ దేవి వసిష్ఠుణ్ణి తెగమెచ్చుకుంది అంచేత ఓ సర్వటీ నువ్వు కూడా అగస్త్యుడిలాగా నా ప్రార్థనను మన్నించి మా ఇంటిలో భోజనం చెయ్యి నీ నిరాహార దీక్ష గానీ పంచభిక్షావ్రతం గానీ చెడిపోవు - అని భోజరాజు తన ఆహ్వానాన్ని సమర్థించుకుంటూ కథ ముగించాడు

అప్పటికీ సర్వటి అంగీకరించడు భోజరాజు ఆశ్చర్యపోతాడు ఏమిటి మీరంతా భిక్షాశనాన్ని ఇంత దీక్షగా పాటిస్తున్నారు, దాని గొప్ప ఏమిటి అని అడుగు తాడు.

భిక్షాశన నియమాన్ని పాటిస్తున్న సిద్ధయోగులకు గృహస్థులు ఏది ఇస్తే

అది కోటి రెట్లుగా ఫలిస్తుందంటూ సర్వటి ఆ కథలు కొన్ని చెబుతాడు. ఇలా కథలోంచి కథగా ఈ కావ్యం సాగిపోతుంది ప్రసన్నత అనంతా మాత్యుడి ప్రధాన కవితాగుణం. సంభాషణల్లో తిక్కనగారి ఒడుపూ వ్యావహారిక శైలి బాగా కనపడతాయి

'' అలాంటి మహాకవుల రచనలు చదివి ఆస్వాదించిన మీకు నా కొత్త తరహా కవిత్వం రుచిస్తుందా. అయినా తల్లిదండ్రులకి ఎదిగిన తమ బిడ్డల గడుసు మాటల కన్నా పసిబిడ్డల తొక్కుపలుకులే ఎక్కువ ఆనందం కలిగిస్తాయిట అంచేత నా కవిత్వం మీకు నచ్చకపోదు'' అంటూ తన గడుసుదనాన్ని అవతారికలో ప్రకటించుకున్న వినయగుణసంపన్నుడు ఈ అనంతుడు.

వెలయఁగ, దొంటి పెద్దల కవిత్వముఁబోలె రుచింపనొక్కొ యే
బలికెడు నూత్న కావ్య రసభావము, లైనను, భూమి దల్లి దం
డ్రులకు నిజాగ్రసూనుల పటు ప్రచురోక్తుల కంటె, జిన్ని బి
డ్డల వెడ తొక్కు బల్కులు దృఢంబగు నింపుల నీనకుండునే! (1-70)

బమ్మెరపోతన (క్రీ.శ. 1440 ప్రాంతం)

శ్రీ మదాంధ్ర మహాభాగవతము

(నరకాసుర వధ-దశమస్కంధం,ఉత్తరభాగం 150-200)

ఇప్పేళా రేపూ ఇంగ్లీషు కాన్వెంటులు బలిసిపోయి చెప్పలేం కానీ నిన్న మొన్నటి దాకా'' తల్లీ నిన్ను దలంచి పుస్తకము జేతంబూనితిన్---- అనే పద్యం పోతన్నగారిది నోటికి రాని బాలుడు తెలుగునాట లేడంటే అతిశయోక్తి కాదు. తెలుగుల పుణ్యపేటి బమ్మెరపోతన్న

సంస్కృతంలో మహామహాపండితులకు పరీక్షాస్థానం శ్రీమన్మహాభాగవతం అటువంటి వ్యాసకృతిని భక్తి రసాయనంలో ముంచి సమార్ద్ర పరచి తెలుగువారికి రుచిగా శుచిగా అందించాడు పోతన్న

భక్తివల్ల పాపభీతి దానివల్ల నైతిక ప్రవర్తన ఏర్పడతాయి. ఆత్మ వత్సర్వ భూతాని అనే భావంతో సర్వప్రాణికోటినీ సమతాదృష్టితో చూసే నడవడిక సిద్ధిస్తుంది ఉద్వేగ రహితంగా జీవితం గడపగల్గుతాడు ఇవి భక్తి సాధించే సామాజిక ప్రయోజనా లు అందుకే భక్తి కావ్యాలకూ అందునా భాగవతానికీ ఉన్నంత ప్రసిద్ధి మిగతా కావ్యాల కు లేదు. శ్రీ కైవల్యపదం చేరుకుని పునర్జన్మ లేని మోక్షాన్ని పొందడం కోసం పోతన్న గారు భాగవతాంధ్రీకరణకు పూనుకొన్నారు కవి దృక్పథం ఇది నన్నయాదులు భాగ వతాన్ని తెలుగు చెయ్యకపోవడం తన పూర్వజన్మ సుకృతమని సంబరపడ్డాడు

ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీ యుర్విన్ బురాణావళుల్
దెనుగుంజేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు తానెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్, దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు లేకుండగన్

ధ్రువోపాఖ్యానం, ప్రహ్లాదచరిత్ర,గజేంద్రమోక్షం,వామనావతార చరిత్ర, రుక్మిణీకల్యాణం, నరకాసురవధ కుచేలోపాఖ్యానం-ఇలాంటివి ఘట్టాలకు ఘట్టాలే తెలుగువారికి నోటికి వచ్చు వీటిని ఈనాటికీ పారా యణం చేసేవారున్నారు ఇంతగా ప్రసిద్ధి కెక్కిన గ్రంధం మహాభాగవతం.

పోతన్న శ్రీనాధుడికి సమకాలికుడు వీరిద్దరూ బావా బావ మర దులంటూ ప్రచారంలో ఉన్న కథలకు చారిత్రకాధారాలు లేవని పరిశోధకు లు తేల్చి చెప్పారు పోతన్నగారి భాగవతాన్ని సర్వజ్ఞ సింగభూపాలుడు(క్రీ శ 422- 447) అంకితం పొందాలని ఆకాంక్షించాడనీ అది సాధ్యం కాలేదనీ మరొక కథ ప్రచారంలో ఉంది ఇది పోతన్న సర్వజ్ఞ సింగ భూపాలుని కాలం వాడనడానికీ, ఓరుగల్లు నివాసి అనడానికీ మాత్రం ఉపకరిస్తోంది

వీరభద్ర విజయం భోగినీ దండకం నారాయణశతకం ఇవి కూడా పోతన్న రచనలే అని కొందరి అభిప్రాయం

తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధికెక్కిన స్త్రీ పాత్రల్లో సత్యభామ దినుసే వేరు. శృంగార వీరాలు మూర్తీభవించిన వ్యక్తిత్వం ఆమెది నరకాసుర వధకు శ్రీకృష్ణుడితో రణరంగానికి తరలి వెళ్ళింది

నాచనసోమనాథుడి చెయ్యి అందిపుచ్చుకుని పోతన్నగారు ఈ ఘట్టాన్ని తీర్చిదిద్దారు దశమ స్కంధంలో ఉత్తర భాగంలో కథ ఇది

వ........హరి నరకాసుర వధార్థంబు గరుడవాహనారూఢుండై చను సమయంబున హరికి సత్యభామ యిట్లనియె ।౮౦

దేవా। నీవు నిశాట సంఘముల నుద్దీపించి చెండాడ నీ
ప్రావీణ్యంబులు సూడ గోరుదు గదా ప్రాణేశ। మన్నించి న
న్నీవెంటంగొని పొమ్ము నేడు కరుణన్, నే జూచి యేతెంచి నీ
దేవీసంతతి కెల్ల జెప్పుదు భవద్దీప్తప్రతాపోన్నతుల్ ।౮౧

నరకాసురుణ్ణి వధించడానికి శ్రీకృష్ణుడు బయలుదేరుతున్నాడు గరుడ వాహనాన్ని అధిరోహించాడు సరిగ్గా ఆ సమయానికి సత్యభామ చకచకా వచ్చింది. ఒక చిన్న విన్నపం చేసింది దేవా నువ్వు రాక్షసుల్ని (నిశా+అట+సంఘములు= రాత్రిళ్ళు సంచరించేవారు రాక్షసులు) విజృంభించి చీల్చి చెండాడుతున్నప్పుడు నీ ప్రావీణ్యాలనూ నీ యుద్ధ విద్యా నైపుణ్యాలనూ తిలకించి పులకించాలని నేను చాలా కాలంగా కోరుతున్నాను గదా (చూడగోరుదు గదా) ఇవ్వేళ నన్ను నీతో తీసుకువెళ్ళు యుద్ధం చూస్తాను చూసివచ్చి ఆ విశేషాలూ నీ దీపించిన ప్రతాపాలూ వాటి ఔన్నత్యాలూ (భవద్దీప్త ప్రతాపోన్నతుల్) నీ దేవేరుల కందరికీ (దేవీసంతతికి= భార్యాసమూహానికి) వివరించి చెబుతాను

ఇదీ సత్యభామ విన్నపం రణరంగంలో శ్రీకృష్ణుని వీర విజృంభణను చూడాలని చాలాకాలంగా కోరుకుంటోందట ఆ కోరిక ఇవ్వాళ తీర్చమంది. ప్రాణేశా అని ప్రేమగా అడిగింది చూసి ఏం చేస్తావంటే చక్కని కారణం కూడా చెప్పింది నీ దేవేరులకి నీ విజృంభణను వివరించి చెబుతానంది తాత్త్విక సమన్వయాలను కాసేపు పక్కన పెడితే శ్రీకృష్ణుడు శృంగారపురుషుడు కాదనలేని కారణం. దేవా అన్నప్పుడు కోరిక తీర్చాలి 'ప్రాణేశా' అన్నప్పుడు కోరిక మన్నించాలి. తనతోనే కూడా తీసుకువెళ్లాలి అయినా రణరంగమంటే ఏమిటనుకుంటున్నావ్ అన్న ధోరణిలో శ్రీకృష్ణుడు రవ్వంత భయపెడుతున్నాడు

వ. అనిన ప్రాణవల్లభకు వల్లభుండిట్లనియె

సమదపుష్పంధయ ఝుంకారములు కావు
భీషణ కుంభీంద్ర బృంహితములు
వాయు నిర్గత పద్మవన రేణువులు గావు
తురగలంఖా ముఖోద్ధూత రజము(లు)
లాకీర్ణ జలతరంగాసారములు గావు

శత్రు ధనుర్ముక్త సాయకములు
కలహంస సారస కాసారములు గావు
దనుజేంద్ర సైన్యకదంబకములు
కమలకల్హారకుసుమ సంఘములు గావు
చటుల రిపు శూల ఖడ్గాది సాధనములు
కన్య ! నీ వేడ ! రణరంగగమన మేడ !
వత్తు వేగము నిలువుము వలదు వలదు ।53

ఆమె ప్రాణవల్లభ. అతడు ప్రాణవల్లభుడు అడిగింది చిన్న కోరిక కాదనడం కష్టమే అయినా పరిస్థితి వివరిస్తున్నాడు. 'కన్యా' అని సంబోధించాడు వివాహితలనుకూడా కన్య అనవచ్చు. స్త్రీ పర్యాయంగా ఉపయోగించినట్టు (కొందరు సరసులు భార్యల్ని అప్పుడప్పుడూ '' ఇదిగో అమ్మాయ్'' అని పిలుస్తూ ఉంటారు)

మదించిన తుమ్మెదల (పుష్పంధయ) ఝుంకారాలు ఉంటాయనుకుంటున్నావేమో రణరంగలో భయంకరమ్మైన మదగజాల ఘీంకారా లుంటాయి. ఘీంకారాలు ఝుంకారాలు కావు

పిల్లగాలులతో ఎగిరివచ్చే (నిర్గత) పద్మాల పుప్పొడి ఉండదు గుఱ్ఱాలు డెక్కలతో (లింఖా ముఖము =డెక్కల అగ్రభాగం) ఎగరగొట్టే దుమ్ము (రజములు) ఉంటుంది 'రజములు' పుష్పరేణువులు కావు

సరోవరంలో ఎగిసిపడుతూ ఒకదానికి ఒకటి ఢీకొనే (ఆకీర్ణ) కెరటాల నుంచి చెదిరివస్తున్న నీటి తుంపరలు (ఆసారములు) ఉండవు శత్రువుల ధనుస్సుల నుంచి వెలువడే బాణాలు (సాయకములు)ఉంటాయి. శరపరంపరలు నీటితుంపరలు కావు

కలహంసలతో బెగ్గురు పక్షులతో (సారసము) కోలాహలంగా ఉండే సరోవరాలు(కాసారములు)ఉండవు. రాక్షసేశ్వరుడి సైన్య సమూహాలు (కదంబములు) ఉంటాయి. సైన్యకదంబకాలు కాసారాలు కావు

పద్మాలు కలువలు (కల్హార) లాంటి పూలరాసులు ఉండవు. శత్రువుల చేతుల్లో శూలాలూ ఖడ్గాలూ వంటి ఆయుధాలు ఉంటాయి ఖడ్గాది సాధనాలు కమలాదికుసుమాలు కావు (నువ్వు చూడదగినవీ, చూచి ఆనందించదగినవీ ఏమీ ఉండవని తాత్పర్యం)

నువ్వేమిటి రణరంగానికి రావడమేమిటీ వద్దు వద్దు నేను వెంట నే వచ్చేస్తాను నువ్వు ఇక్కడే ఉండు (విషమాలంకారంలో ఇదొక రకం) వీటిలో మొదటి వన్నీ సత్యభామకు పరిచితమ్మైనవి ఆహ్లాదకర మ్మైన సుకుమార వస్తువులు . రెండవ వన్నీ శ్రీకృష్ణుడుకి పరిచితాలైన రణరంగానికి సంబంధించినవి భయంకరమ్మైన క్రూరవస్తువులు. అంచేత యథాక్రమంగా నువ్వేమిటీ, రణరంగానికి రావడమేమిటీ అని కాకువు తగదు సుమా అని పరిహాసం. ''కన్య'' అనడంలో బహుశా చిన్నదానివి అనే స్ఫూర్తికూడా ఉందేమో !

వేతవోలు

శృంగార వీరాల కలయికకు ఈ పద్యం నాంది ప్రతి పాదంలోనూ పూర్వార్థంలో సుకుమార బంధం ఉత్తరార్థంలో రూక్షబంధం. భీషణ కుంభీంద్ర, రింఖాముఖోద్భూత శత్రుధనుర్ముక్త,దనుజేంద్ర సైన్య శూల ఖడ్గాది సాధనములు - వీటిలో ఒత్తు అక్షరాలూ రేఫ సంయుక్తాలతో రూక్షబంధం యుద్ధవాతావరణాన్ని ప్రత్యక్షం చేస్తూ సత్యభామను భయ పెట్టాలన్నమాట

శ్రీకృష్ణుడు ఇలా పరిహాసం చేసినందువల్లనే కాబోలు సత్యభామ రణరంగానికి రావడమే కాదు యుద్ధంలో పాల్గొందికూడా దీనికి ఫలితార్థం అది అయ్యింది సరే- శ్రీకృష్ణుడు ఇలా భయపెట్టి వారిస్తే సత్యభామ ప్రియం కలిగేటట్టు ఇంకా దగ్గరికి వచ్చి - అనిన బ్రియంబు జనియింప డగ్గరి (54)-సమాధానం చెబుతోంది.

దానవులైన నేమి మఱి దైత్య సమూహములైననేమి- నీ
మానిత బాహుదుర్గముల మాటున నుండగ నేమి శంక, నీ
తో నరుదెంతు నంచు గర తోయజముల్ ముకుళించి మ్రొక్కెన
మ్మానిని దన్ను భర్త బహుమానపురస్సరదృష్టి జూడగన్ ।౮౮

నాథా దానవులైతే నా కేమి దైత్యులయితే నాకేమి, నీ బాహు దుర్గాల చాటున సురక్షితంగా ఉంటాను ఇంక నాకు భయమేమిటి! శంక ఏమిటి ! నీతో వస్తాను

ఇలా తేల్చి చెప్పేసి చేతులు రెండూ జోడించి(కరతోయజముల్= హస్తపద్మాలు) నమస్కరించింది. అప్పుడు ఆ మానినిని భర్త శ్రీకృష్ణుడు బహుమాన పురస్సరంగా చూసాడు

శ్రీకృష్ణుని ఆ చూపులో సత్యభామ పట్ల గౌరవం ప్రతిఫలించింది అవును మరి- నీ రక్షణ ఉండగా నేను ఏ రాక్షసులకీ భయపడనవసరం లేదు- అని దృఢమైన విశ్వాసాన్నీ ధీమాన్ని ప్రకటించిన భార్య పట్ల గౌరవం ప్రేమ ఇమ్మడిముమ్మడి కావా సత్యభామ చాకచక్యం

రాక్షసుల్లో దానవులు అనీ దైత్యులు అనీ రెండు ప్రధాన శాఖలు న్నాయి. దనువు సంతతి దానవులు. దితి సంతతి దైత్యులు. ఈ రెండు శాఖలకీ పరస్పరం మైత్రి ఉంది అదీ ప్రమాదం అంచేత నరకాసురుడి సైన్య కదంబకంలో వాళ్ళూ వీళ్ళూ కూడా ఉండవచ్చు. ఎవరుంటే నాకేమి నీ అండ ఉండగా అంది సత్యభామ.

శత్రుదుర్భేద్యంగా రక్షణ కల్పించే కోటనుదుర్గం అంటారు దాన్ని నేలమీద నిర్మిస్తే అది స్థల దుర్గం కొండమీద కడితే గిరిదుర్గం అడవిలో ఏర్పాటు చేస్తే వన దుర్గం నీళ్ళల్లో కడితే అది జలదుర్గం ఇప్పడు సత్యభామకు రక్షణ శ్రీకృష్ణుని బాహు దుర్గాలు లోపల ఉన్నవారిని దుర్గాలు ఎలా రక్షిస్తాయో నీ బాహువులు నీ వెంట ఉన్న నన్ను అలా రక్షిస్తాయి నీ బాహు వులు శత్రు దుర్భేద్యాలు అని తాత్పర్యం. అందుచేతనే అవి మానితాలు (గౌరవింపబడేవి) అయ్యాయి.

రక్షణ సమర్థత అనే సామ్యాన్ని పురస్కరించుకుని బాహువులకు దుర్గాలతో

అభేదం చెప్పాడు బాహువులకు దుర్గాలకన్నా ఆధిక్యం గానీ (ఎక్కువతనం) న్యూనత్వంగానీ (తక్కువదనం) చెప్పబడలేదు అంచేత ఇది అనుభయ అభేద రూపకం అవుతుంది

సత్యభామ అలా నమస్కరించే సరికల్లా శ్రీకృష్ణుడు మరి మారు మాట్లాడ లేదు

వ. ఇట్లు తనకు మ్రొక్కిన సత్యభామను గరకమలంబుల గ్రుచ్చియెత్తి తోడ్కొని గరుడారూఢుండై హరి గగనమార్గంబునం జని గిరి-శస్త్ర- సలిల- దహన-పవన దుర్గమంబై మురాసురపాశపరివృతంబైన ప్రాగ్జ్యోతిషపురంబు దగ్గఱి- ।౮౬

తన హస్తపద్మాలతో ఆమెను ఎత్తి గరుడవాహనం మీద తన సరసన కూర్చో బెట్టుకున్నాడు ఆకాశమార్గంలో ప్రయాణం సాగింది నరకాసురుడి రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. దాన్ని సమీపించారు

ఈ నగరానికి అయిదురకాల దుర్గాలు రక్షణ వలయాలుగా ఉన్నాయి ఎంతటివాడయినా ఒక పటాన లోపలికి అడుగుపెట్టలేడు లోపలి కేమిటి దరిదాపులకి పోలేడు గిరి దుర్గాలు మొదటి వలయం. శస్త్ర దుర్గాలు రెండో వలయం మందు పాతరలయ్యుండాలి లేదా ఆయుధ పాణులై రాక్షసవీరులు రక్షణవలయంగా నిలబడి ఉండాలి. జలదుర్గాలు-అగడ్త వంటివి-మూడో వలయం అగ్ని దుర్గాలు నాలుగో వల యం పట్టణం చుట్టూ ఎల్లవేళలా ఉవ్వెత్తున మంటలు లేస్తూ ఉంటాయి కాబోలు లేదా శత్రువు అలికిడి అయితే ఇవి ప్రజ్వలిస్తాయో. మొత్తానికి అగ్నిదుర్గాలు ఉన్నాయి వాయుదుర్గాలు అయిదోవలయం చండప్రచండ వాయువులు శత్రువులకు ఎదురవుతాయికాబోలు అగ్ని దుర్గాల వేడి పట్టణానికి రాకుండాకూడా బహుశ ఇవ్వి కాపాడుతూ ఉండి ఉంటాయి ఈ అయిదు రక్షణ వలయాల నట్టనడుమ ప్రాగ్జ్యోతిషం ఉంది

మరొక రక్షణకూడా ఉంది మురాసురుడు పైకి కనిపించని గొలుసులతో (ప్రచ్ఛన్న పాశములు) ఈ పట్టణాన్ని రక్షిస్తూ ఉంటాడుట

నరకాసురుడు తన పట్టణానికి ఇంత బందోబస్తు చేసుకున్నాడు అంటే అంతగా భయపడుతున్నాడనీ చేసిన తప్పులు భయపెడుతున్నాయనీ గ్రహించాలి.

అయితే ఈ అలాంటినీ శ్రీకృష్ణుడు అనాయాసంగా క్షణంలో బద్దలు కొట్టేసాడు. దేనిని ఏలా ఏ ఆయుధంతో నాశనం చేసాడో ఒకే ఒక్క పద్యంలో చెప్పే సాడు కవి

గదచే బర్వత దుర్గముల్ శకలముల్ గావించి, సత్తే జిత
ప్రదరశ్రేణుల శస్త్ర దుర్గచయమున్ భంజించి, చక్రాహతిం
జెదరన్ వాయుబలాగ్ని దుర్గముల నిశ్శేషంబులం జేసి, భీ
ప్రదుడై వాలున ద్రుంచె గృష్ణుడు మురప్రచ్ఛన్న పాశంబులన్ । ౮౭

గదాయుధంతో పర్వత దుర్గాలను తుత్తునియలు చేసాడు ప్రజ్వరిల్లే బాణాలు వేసి(సత్+తేజిత+ ప్రదర+ శ్రేణులన్)శస్త్ర దుర్గాలను- ఆయుధాగారాలను భగ్నం చేసాడు భగ్నమనిపించి ఉంటాడు తిరుగులేని- సుదర్శనచక్రం ప్రయోగించి వాయు దుర్గాలనూ(వాయుబల) అగ్ని దుర్గాలనూ మటుమాయం చేసాడు. శేషం లేకుండా చేసాడు (నిశ్శేషంబు లన్ చేసి) మురాసురిడి ప్రచ్ఛన్న పాశాలను అంటే కంటికి కనిపించని గొలుసుల్ని భయంకరుడై(భీప్రదుడై) ఖడ్గంతో తెగ్గొట్టాడు (వాలునన్ త్రుంచెను)

క్షణంలో అంతా అయిపోయింది. పట్టణ ప్రాకారం చేరుకున్నాడు "మఱియును" ౫౮

ప్రాకారంబు గదాప్రహారముల నుత్పాటించి యంత్రంబులున్
నాకారాతుల మానసంబులును భిన్నత్వంబు జెందంగ, న
స్తోకాకారుడు శౌరి యొత్తె విలయోద్ధూతాభ్రనిర్ఘాతరే
ఖాకాఠిన్యము పాంచజన్యము విముక్త ప్రాణి చైతన్యమున్। రి

గదా భఘాతాలతో చుట్టుగోడని (ప్రాకారంబున్) పడగొట్టేసాడు (ఉత్పాటించి) ఆ ప్రాకారం మీద యంత్రాలు ఉన్నాయట


లంకానగర ప్రాకారం మీద ఉపల యంత్రాలున్నాయని వాల్మీకి వర్ణించాడు ప్రాకారం వెలుపల వైపున చుట్టుముట్టి మోహరించి నిలిచిన శత్రువుల పైకి పుంఖానుపుంఖంగా బండరాళ్ళను కురిపించే యంత్రాల న్నమాట అవి ఒకే దెబ్బతో నూరుమందిని మట్టుబెట్టే శతఘ్నుల్ని కూడా వాల్మీకి చెప్పాడు అవీ యంత్రాలే. ఇటువంటివి ఏవో యంత్రాలు నరకాసు రుడు తన రాజధాని ప్రాకరం మీద ఏర్పాటు చేయించాడు

ఆ యంత్రాలూ వాటితోపాటు, దేవతలకు శత్రువులైన ఆ రాక్షసుల మనస్సులూ (నాకులు= దేవతలు, అరాతి=శత్రువు నాక+ అరాతి+ లు = రాక్ష సులు) రెండూ పగిలిపోయేట్టు ప్రాకారం పడగొట్టేసాడు.

ప్రాకారం పడగొట్టినా శ్రీకృషుడి ఆకారం చెక్కుచెదరలేదు. మరింత ఉజ్వలంగా ఉన్నతంగా ప్రకాశిస్తోంది అస్తోక+ ఆకారుడుగానే ఉన్నాడు అశ్రమంగా చేసేసాడని

ఇప్పడు యుద్ధానికి ఆహ్వానిస్తున్నట్టు తన శంఖాన్ని పాంచజన్యాన్ని ఒక్కసారిగా పూరించాడు శౌరి పాంచజన్యమున్ ఒత్తె. దాని ఘోష ఎంత కఠినంగా ఉందంటే - ప్రళయకాలంలో ఒకదానితో ఒకటి ఢీకొంటున్న మేఘాలనుంచి (అభ్ర) రాలిపడే పిడుగుల్ని పోలిన (నిర్ఘాతరేఖా) కాఠిన్యం ఉంది ఆ శంఖానికి దాన్ని పూరిస్తే సర్వప్రాణి కోటీ చైతన్యం కోల్పోయి స్తబ్ధమై పోతుంది (విముక్తమైన ప్రాణిచైతన్యము కలది- విముక్తప్రాణి చైతన్య మున్) అటువంటి పాంచజన్యాన్ని పూరించాడు

విలయ+ ఉద్ధూత+అభ్ర+నిర్ఘాతరేఖా కాఠిన్యమున్ పాంచజన్యమున్, విముక్త ప్రాణి చైతన్యమున్ అని "న్యము" అనేది మళ్ళీ మళ్ళీ వచ్చేట ట్టు పదాలను



కూర్చాడు. ఇది అంత్యానుప్రాస. పద్యాన్ని ఇలా ముక్తాయింపుతో ముగించడం పోతన గారి ముద్ర. ఈ రచనాశిల్పం నాచన సోమ నాథుని దగ్గరకూడా ఉంది. ''కనిరి కుమారులంత---'. అంటూ క్రియా పదంతో పద్యాన్ని ప్రారంభించి మదాళిమాలికాత ను వనజాత నూతన పతాకము బుష్కరమన్ దటాకమున్ (ఉత్తరహరి 4-30) అని ముగించిన పద్యం ఈ బాణీకి ఉదాహరణ. అయినా ఈ శిల్పాన్ని పోతన్న బాగా పరిపోషించి సొంతం చేసుకున్నాడు. ఇటువంటి ఎత్తుగడలూ ముగింపులూ పోతన్న రచనలో కోకొల్లలు.

యంత్రంబులున్ నాకారాతుల మానసంబులును భిన్నత్వంబు జెందంగ అని రెండింటినీ కలపడం ఉక్తి విశేషం. యంత్రాలు పగిలిపోయాయి. అది చూసి రాక్షసుల హృదయాలు పగిలిపోయాయి -అని విడి విడిగా చెబితే కవితాసాంద్రత తగ్గిపోతుంది. ఇలా కలిపి చెప్పడం వల్ల వాక్య నిర్మాణపద్ధతిలో ఇది తుల్యయోగితాలంకారమవుతోంది. రెండూ ఒకేసారి జరిగాయని తెలుస్తోంది. నిజానికి యంత్రాలు పగిలిపోవడం అనే కారణంవల్లనే మనస్సులు విరిగిపోయాయి. దేనికైనా కారణం ముందు పుడుతుంది. కార్యం తరువాత జరుగుతుంది. ఇది లోకసహజం. కానీ ఇక్కడ కార్యకారణాలు రెండూ ఒకేసారి జరిగాయని చెబుతున్నాడు. ఇది ఒక రకం అతిశయోక్తి అలంకారం. రాక్షసులు రక్షణలేనివారయ్యారనీ ధైర్యం కోల్పోయారనీ ఈ రెండు అలంకారాలవల్లా లభిస్తున్న వ్యంగ్యం.

అయితే ఈ వ్యంగ్యార్థం వాచ్యార్థం కన్నా మనోహరంగా లేదు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే వాచ్యార్థసిద్ధికి వ్యంగ్యార్థం సహకరిస్తోంది. ఎలాగంటే -మానసంబులు భిన్నత్వంబు జెందె అనే వాక్యానికి అన్వయం కుదరదు. విరిగిపోవడం, పగిలిపోవడం అనే క్రియలు వస్తువులకు సంబంధించినవి. కర్రలు విరిగిపోతాయి. కుండలూ యంత్రాలూ పగిలిపోతాయి. మనస్సు అటువంటి వస్తువుకాదు. మరి పగిలిపోవడమేమిటి? ''ముఖ్యార్థ బాధ'' అంటారు. ఇటువంటిది కలిగినప్పుడు అన్వయసిద్ధి కోసం వేరే సంబంధితార్థాన్ని స్వీకరిస్తాం. వికలమైపోయాయి అని చెబుతాం. దాన్ని 'అర్థాంతర స్వీకారము' అంటారు. క్షణంలో ధైర్యం కోల్పోయారని చెప్పడం' ప్రయోజనం'. ఈ మొత్తాన్ని లక్షణావృత్తి అంటారు. ముఖ్యార్థ బాధ, అర్థాంతర స్వీకారం, ప్రయోజనం ఇవి మూడూ లక్షణావృత్తికి బీజాలు

ఇలా -ధైర్యం కోల్పోయారు అనే వ్యంగ్యార్థం వాచ్యార్థ సిద్ధికే అవయవమవుతోంది. కనక ఈ పద్య భాగాన్ని వాచ్యసిద్ధ్యంగము అనే మధ్యమకావ్య ప్రభేదంగా పరిగణించాలి.

మొత్తం మీద ఈ పద్యంలో అతిశయోక్తి-తుల్యయోగిత అంత్యానుప్రాస అని మూడు అలంకారాలున్నాయి. దేనికది గుర్తించడానికి వీలుగా తిలతండుల న్యాయంగా (నువ్వులూ బియ్యమూ కలిసినట్టు) కలిసి ఉన్నాయి. కాబట్టి దీన్ని 'సంసృష్టి' అంటారు. తేలికగా గుర్తించి విడదియ్యడానికి వీలులేని రీతిలో క్షీర నీర

న్యాయంగా (పాలూ నీళ్ళూ కలిసినట్టు) అలంకారాలు కలిసి ఉంటే దాన్ని 'సంకరః' అంటారు. తిలతండులవత్ సంసృష్టిః, క్షీర నీరవత్ సంకరః అని కొండగుర్తు. అలమ్ అతివిస్తరేణ. కథలోకి వస్తే - శౌరి శంఖం పూరించాడు.

మొట్టమొదటగా అయిదు తలల మురాసురుడు ఎదుర్కొన్నాడు. శౌరి చక్రం వదిలిపెట్టాడు. క్షణంలో వాడి పని అయిపోయింది. వజ్రాయుధం దెబ్బకు పర్వతం కూలినట్టు వాడు దొర్లి (అగడ్తలో) నీళ్ళల్లో పడ్డాడు. దానితో అతడి కొడుకులకి దుఃఖంతో పాటు రోషం పెల్లుబికింది. నరకాసురుడు మరింత ఎగసనదోసాడు. తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణు డు, విభావసుడు, వసుడు, నభస్వంతుడు, అరుణుడు అని వీళ్ళు ఏడుగురు అన్నదమ్ములు. అందరూ ఒక్క పెట్టున వచ్చి శ్రీకృష్ణుణ్ణి ఎదుర్కొన్నారు. రకరకాల ఆయుధాలు ప్రయోగించారు. శ్రీకృష్ణుడు ధనుస్సు చేతబట్టి వీళ్ళ ఆయుధాలను దారిలోనే విరగ్గొట్టి కాళ్ళూ చేతులూ తెగ్గొట్టి తలలు నరికేసాడు. నరకాసురుడు ఆశ్చర్యపోయాడు. గరుడ గమనుణ్ణి దూషించి తనను భూషించుకుని (కుండలాలు అలంకరించుకున్నాడట. అసలు తగువంతా ఈ కుండలాలకోసమే) గజ బలంతో రణరంగంలోకి దిగాడు. ఎట్ట ఎదుట గరుడవాహనం మీద శ్రీకృష్ణుడు (౧౮౦-౧౮౭)

బలవంతుండు ధరాసుతుండు గనె శుంభద్రాజబింబోపరి
స్థల శంపాన్విత మేఘమో యన ఖగేంద్ర స్కంధపీఠంబుపై
లలనారత్నము గూడి సంగరకథాలాపంబులన్ జేయు ను
జ్జ్వల నీలాంగు గనన్నిషంగు గుహనాచ ంగున్ రణాభంగునిన్ ౧౮౮

నరకాసురుడు భూమిపుత్రుడు (ధరాసుతుండు), మహాబలవంతుడు. ఎట్ట ఎదుట గరుత్మంతుడి మూపుమీద సత్యభామతో కలిసి (లలనా రత్నము గూడి) పీఠం పెట్టి కూర్చున్నాడు శ్రీకృష్ణుడు. యుద్ధానికి సంబంధించి ఇప్పుడింక ఎవరు వస్తారు? నరకుడే వస్తాడు- ఇలా సంభాషణ ఏదో నడుస్తోంది వారిద్దరి మధ్య. (సంగరకథా+ ఆలాపంబులన్ + చేయునట్టివాడు) ఆకాశంలో గరుత్మంతుడు. అతడి స్కంధ పీఠం మీద సత్యాశ్రీకృష్ణులు- ఇదీ దృశ్యం. ఈ బొమ్మ పాఠకుల హృదయాల్లో రూపుకట్టడానికి వీలుగా ఒక ఉపమానం కల్పించాడు కవి. శుంభద్రాజ బింబోపరిస్థల శంపాన్విత మేఘమో యనన్.

గరుత్మంతుడూ, ఆదిశేషుడూ, ఐరావతం, ఉచ్చైఃశ్రవం, శివుడి వృషభ వాహనం- ఇవన్నీ తెల్లగా ఉంటాయని పురాణ ప్రసిద్ధి.

ప్రకాశిస్తున్న చంద్రబింబంలాగా (శుంభత్+ రాజబింబ) ఉన్నాడు గరుడుడు. దానిమీద (ఉపరిస్థల) మెరుపుతీగతో కలిసి ఉన్న మేఘంలాగా ఉన్నాడు సత్యాపతి. శ్రీకృష్ణుడు మేఘశ్యాముడు. సత్యభామ మెరుపుతీగ (శంపా+ అన్విత మేఘమో). చంద్రబింబం మీద శంపాన్వితమేఘం నిలిస్తే ఇలా ఉంటుంది అని ఊహ. ఉపమానాన్ని ఊహతో కల్పిస్తే ఉత్ప్రేక్ష అవుతుంది. ఒక దృశ్యానికి పోలికగా మరో దృశ్యాన్ని

ఊహించాడు. కనక ఇది వస్తూత్ప్రేక్ష. వర్ణించే దృశ్యాన్నీ (ఉపమేయవస్తువు), కల్పించిన దృశ్యాన్నీ (ఉపమాన వస్తువు) రెండింటినీ వాచ్యంగా చెప్పాడు కనక ఉక్త వస్తూత్ప్రేక్ష అవుతుంది

సత్యభామతో సంగర కథాలాపంబులన్ చేస్తున్నాడు అన్నందువల్ల శ్రీకృష్ణుడికి ఇదొక యుద్ధంలాగా లేదనీ క్రీడా విశేషంగా నడిపిస్తున్నాడనీ వ్యంగ్య స్ఫూర్తి.

ఈ పద్యాన్ని కూడా అంత్యానుప్రాసల ముక్తాయింపుతోనే ముగించాడు పోతన్న ఉజ్జ్వల నీలాంగున్, కనన్నిషంగున్ కుహనాచంగున్ రణాభంగునిన్

రణ+ అభంగుడు అంటే ఎవరితో ఎంత ఘోరయుద్ధం చేసినా చెక్కు చెదరనివాడు అలిసిపోనివాడు అని అర్థం పైని స్ఫురించిన వ్యంగ్యం ఈ విశేషణంతో వాచ్యమయ్యింది అయితే ఇది శ్రీకృష్ణుడి సర్వయుద్ధాలకూ సంబంధించిన విశేషణం

శ్రీకృష్ణుడు'' ఉజ్జ్వల నీలాంగుడు' ప్రకాశిస్తున్న నీలపు రంగు శరీరం కల వాడు ఇంద్రనీలంలాగా ప్రకాశిస్తున్న కలిన శరీరమని కూడా శ్రీకృష్ణుడి వీపు మీద -యుద్ధానికి వస్తూ తగిలించుకున్న అమ్ములపొది ఉంది. అది లోహమయమేమో తళతళలాడుతోంది.(కనత్= ప్రకాశించు చున్న, నిషంగున్= అమ్ములపొది కలవానిని కనత్+ నిషంగున్- అను నాసిక సంధివల్ల తకారం నకారంగా మారింది.)

''కుహనాచంగున్'' అనేది ఆలోచించవలసిన విశేషణం '' ఆ విషయంలో నేర్పరి''అనే అర్థంలో సంస్కృతంలో ప్రాతిపదికలకి చంగ(ప్)-చణ(ప్) అనే ప్రత్య యాలు వస్తాయి మోసం చెయ్యడంలో నెఱజాణ శ్రీకృష్ణుడు అని దీని భావం. కుహ నాచణుడు అనికూడా అనవచ్చు

స్థూలదృష్టితో చూస్తే ఈ యుద్ధం మొదటినుంచీ కుటిల పద్ధతిలోనే సాగు తోంది. ముందుగా హెచ్చరించకుండా శ్రీకృష్ణుడు మెరుపు దాడి చేసాడు అదీ ఆకాశ మార్గంలో వస్తూనే-శత్రువుని నిరాయుధుణ్ని చెయ్యడానికి ఆయుధాగారాలు భగ్న మనిపించాడు ఇది కుటిల యుద్ధం కాక పోయినా ధర్మయుద్ధం మాత్రం కాదు

శ్రీకృష్ణుడు చేసిన యుద్ధాల్లో కానీ చేయించిన యుద్ధాల్లో కానీ స్థూలదృష్టికి ఇలా కుటిలత్వం కనపడుతుంది వజ్రాన్ని వజ్రంతోనే ఛేదించాలి, దుష్టుణ్ని దౌష్ట్యంతోనే చంపాలి. శఠే శాఠ్యం సమాచరేత్. ముల్లుని ముల్లుతోనే తియ్యాలి- ఇలాంటివి బోలెడు వాక్యాలున్నాయి ఇదంతా రాజనీతిలో భాగం. మనకు కాదు.

శ్రీకృష్ణుడు ఏ నిముషంలోనైనా దండెత్తిరావచ్చు అనే భయంతోనే గదా నరకాసురుడు తనకు అన్ని రక్షణవలయాలు నిర్మించుకున్నది. అంచేత సన్నద్ధంగా ఉన్నట్టే లెక్క. మరింక ముందుగా హెచ్చరికలెందుకు ఇదొక తర్కం. భగవంతుడుగా ఎంత అగమ్యగోచరుడో రాజకీయనాయకుడుగా అంతకంటే అగాధమైన వ్యక్తి అందు చేత కుహనాచంగుడు. అటువంటి శ్రీకృష్ణుణ్ని నరకాసురుడు – ఎట్ల ఎదుట చూసాడు

వ. అని కలహంబునకు నరకాసురుండు గమకింప దమకింపక విలోకించి సంభ్రమంబున ౹౬౯

చూసి యుద్ధం ప్రారంభించడానికి సన్నద్ధుడయ్యాడు. (గమకించుట= యత్నించుట) ఇదంతా సత్యభామ జంకకుండా (తమకింపక) గమనించి త్వరత్వరగా తానూ సిద్ధమయ్యింది

"వేణిన్ జొల్లెము వెట్టి, సంఘటిత నీవీబంధయై, భూషణ
శ్రేణిం దాల్చి, ముఖేందుమండల మరీచీ జాలముల్ పర్వగా
పాణిం బయ్యెద జక్కగా దులిమి, శుంభద్వీరసంరంభయై
యేణీలోచన లేచి నిల్చె దన ప్రాణేశాగ్రభాగంబునన్ ౹70

వాలుజడను ముడిచుట్టింది.(చొల్లెము పెట్టి) చీరకట్టు బిగించింది. (నీవీ బందము= కోకముడి) బయలుదేరేటప్పుడే భూషణాలు ధరించింది ఆమె ముఖం చంద్రబింబంలాగా ఉంది ఈ భూషణాల తళతళలతో కలిసి ఆ ముఖచంద్రమండలం నుంచి వెన్నెల కాంతిపుంజాలు (మరీచీజాలముల్) మరింతగా అన్నివైపులకీ వ్యాపిస్తున్నాయి పైట చెంగుని చేత్తో అందుకుని వెనకనుంచి లాగి బిగించి నడుముకి మరోవైపున దోపుకుంది (తులిమి) వీరోచితమైన సంరంభం (హడావిడి) ఆమెలో ప్రస్ఫుటమవుతోంది ఇలా సన్నద్ధురాలై లేడి కన్నుల సత్యభామ తన ప్రాణవిభుడి ఎట్ట ఎదుట లేచి నిలబడింది. (ఏణీలోచన= ఆడులేడి కన్నుల వంటి కన్నులు కలది)

ఒక స్త్రీ జగడానికి సన్నద్ధమయ్యే విధమంతా బొమ్మకట్టాడు పోతన్న అయితే భూషణశ్రేణిని దాల్చటమనేది ఆ సమయంలో జరిగేపని కాదు అంచేత ముఖేందు మండల మరీచీ జాలముల్ పర్వగా అనేదానికి దీన్ని హేతువుగా సమన్వయించడమే సమంజసం రాహు కంఠము తెగి (తెగుట కారణముగా) దేహము ధరణిబడియె ఇత్యాదిప్రయోగాల్లో అస మాపకక్రియ (తెగి) హేత్వర్థక మవుతోందని ప్రౌఢవ్యాకర్త గుర్తించాడు

కాదంటే మట్టెలూ గాజులూ వెనక్కి తోసుకోవడం, హారాల చిక్కు లెడలించడం పాపట చేరు ఒత్తుకోవడం వెనక్కితిరిగిన ఉంగరాలను సరిచేసుకోవడం- ఇలాంటి పనులను చేసిందని అయినా చెప్పవచ్చు కానీ "దాల్చి" అనే పదంతో ఇటువంటి భావం లభించదు

ముఖేందు మండలం అన్నచోట రూపకాలంకారం ఇందు మండలం వంటి ముఖం అని కవి వర్ణించవలసింది ముఖాన్ని కనక అది ఉపమేయం ఇందుమండలం ఉపమానం ముఖమునందు ఇందుమండ లత్వం(ఇందుమండల ధర్మం) ఆరోపించ బడింది. ఉపమేయంలో ఉప మాన వస్తుధర్మాన్ని ఆరోపిస్తే తాద్రూప్య రూపకం (తద్ రూపత్వం) అవు తుంది ఇందుమండలం కన్నా ముఖంలో (ఉపమేయం) గుణాధిక్యం గానీ, న్యూనత్వంగానీ చెప్పబడలేదు కాబట్టి ఇది కచ్చితంగా చెప్పాలంటే అనుభయ తాద్రూప్యరూపకం

ఇలా రూపకం చేసినందువల్ల ప్రయోజనం ఏమిటంటే ఆమె ముఖం గుండ్రంగా ఉందనే ఆకారస్ఫూర్తితోపాటు అహ్లాదకరత్వం వ్యంగ్యం ఆమె ముఖకాంతు లు వెన్నెలలా అహ్లాదకరంగా ఉన్నాయనీ, గరుత్మంతుడిమీద ఆకాశంలో నిలిచింది కనక చంద్రకాంతులై దశదిశలా ప్రసరిస్తున్నాయనీ

స్త్రీల చూపులు చంచలంగా ఉంటాయని వర్ణించడం కవి సమయం. (లోక శాస్త్ర విరుద్ధమైనా కావ్యలోక సమ్మతమైన అంశాన్ని కవి సమయం అంటారు) అందు కని లేడి కన్నులతో పోలిక. శృంగార సన్నివేశంలో సిగ్గువల్లనో ఆనందంవల్లనో చూపులు చలించవచ్చు, అప్పుడు బెదురుచూపుల చిన్నది అనే భావంతో ఏణీలోచన అనవచ్చు కానీ ఇక్కడ ఇది వీరరసఘట్టం ''తమకింపక విలోకించి''అని పైని వచనంలో (౬౨) చెప్పాడు. కోపంతో నిశ్చలంగా చూస్తోంది అలా చూడటమే సన్నివేశానికి సముచితం. మరి '' ఏణీలోచన ' అని ఎందుకు అన్నట్టు ? లేడి కన్నులు చంచలంగానే కాదు విశాలంగా దీర్ఘంగా కూడా ఉంటాయి (దీర్ఘాపాంగ ము అని ఒక పెంపుడు లేడి పేరు) ఆ దృష్టితో ఏణీలోచన అన్నాడు శుంభ ద్వీర సంరంభయై లేచి నిలబడినప్పుడు సత్యభామ కన్నులు భావతీవ్రతతో మరింత విప్పారి ఉంటాయి ఇలా ఈ విశేషణం సాభిప్రాయమై పరికరాలం కార మవుతోంది స్వభావోక్తి-రూపకం-పరికరం అనే మూడు అలంకారా లు తిలతండుల న్యాయంగా ఈ పద్యంలో కలిసి ఉన్నట్టు

'జన్యంబున దనుజుల దౌ
ర్జన్యము లుడుపంగ గోరి చనుదెంచిన సౌ
జన్యవతి జూచి యదురా
జన్య శ్రేష్ఠుండు సరస సల్లాపములన్'' । 71 ।

(జన్యము=యుద్ధము ఉడుపుట=తొలగించుట)

రాక్షసుల దౌర్జన్యాలను యుద్ధంలో మటుమాయం చెయ్యడం కోసం కోరివచ్చిన సౌజన్యవతి సత్యభామాదేవి. ఆవిడ ఇలా వీరసంరంభం తో లేచి నిలబడితే యదువంశమహారాజులలో అగ్రగణ్యుడైన శ్రీకృష్ణుడు (యదురాజన్య శ్రేష్ఠుడు) చూసి సరససల్లాపాలు మొదలుపెట్టాడు.

(''దనుజుల దౌర్జన్యములు ఉడుపంగ గోరి+ చనుదెంచిన సౌజన్యవతిన్'' అని అన్వయించడంకన్నా'' ఉడుపంగన్+ కోరి చనుదెం చిన'' అని అన్వయించడమే కథకు అనుకూలం సత్యభామ తనంత తాను కోరి రణరంగానికి వచ్చింది గదా!)

శ్రీకృష్ణుడు సరసప్రియుడు. ఎటువంటి సన్నివేశంలోనైనా వరసైన వాళ్లతో సరసాలు ఆడతాడు పైగా ఈ యుద్ధాన్ని కేళీవిలాసంగా నడిపిస్తు న్నాడాయె సత్యభామ ఉన్నట్టుండి కొంగు బిగించేసరికి సరదా పుట్టింది

లేమా! దనుజుల గెలువగ
లేమా! నీ వేల కడగి లేచితి విటు, రా-
లే -మాను, మానవే నా
లే, మా విల్లందికొనుము లీలం గేలన్ 72

(లేమ= స్త్రీ, కడగి=పూనుకొని, ఔలే=అవునులే, కేలన్=చేతితో)

లేమా! ఓ సత్యభామా ఈ రాక్షసుల్ని మేము గెలవలేమా ? నువ్వెందుకు ఇలా యుద్ధానికి సన్నద్ధురాలవై లేచావ్ రా లే. మానేసేయ్ మానకపోతే (మానవేని) అవున్లే-అదీ మంచిదే - ఇదిగో మా విల్లు, విలాసంగా ఇది చేతితో అందుకో

ఇది సరస సల్లాపం లేమా లేమా అని నాలుగు పాదాల్లోనూ మొదట వచ్చే టట్టు కూర్చాడు ఈ శబ్దాలంకారం సరసతకు అభివ్యంజకం. '' నీ వేల కడగి లేచితివి + ఇటు రా'' అనికూడా అన్వయించవచ్చు 'రమ్ము లే' అనడానికి పర్యాయంగా ''రాలే ' అని ఒకే పదంగానూ భావించవచ్చు

'లేమా అనే వర్ణక్రమం (అక్షరానుపూర్వి) నాలుగుపాదాల మొదటా ఒకే లాగా ఉన్నా, విభజనలో పదాలూ అర్థాలూ మారిపోతున్నాయి కనక ఇది యమకం అనే శబ్దాలంకారం జన్యంబున- అనే పద్యంలో కూడా యమకమే

వ. అని పలికి 173

హరిణాక్షికి హరి యిచ్చెను
సురనికరోల్లాసనమును శూర కఠోరా
సుర సైన్య త్రాసనమును
బరగర్వ నిరాసనమును బాణాసనమున్ 174

ఆ హరిణాక్షికి (ఏణీలోచన) శ్రీకృష్ణుడు తన ధనుస్సు అందించాడు (బాణ+ఆసనము బాణాలను దానితో సంధించి ప్రయోగిస్తారు కనక) దాని గొప్ప దనం మూడు విశేషణాల్లో చెప్పాడు అది దేవతా సమూహానికి(సుర-నికర) ఉల్లాసం కలిగిస్తుంది రాక్షసుల్ని సంహరించి దేవతల్ని ఆనందింపజేస్తుందని. శూరులైన కఠినులైన అసుర సైన్యాలను భయపెడు తుంది. (త్రాసనము).. శత్రువుల గర్వాన్ని పూర్తిగా తొలగిస్తుంది (నిరాసన ము) అటువంటి తన బాణాసనాన్ని హరి సత్యభామ చేతికి ఇచ్చాడు

''బాణాసనమున్'' అనే విశేష్యం ద్వితీయా విభక్తిలో ఉంది అందుకని దాని విశేషణాలు మూడూ ద్వితీయా విభక్తిలోనే ఉన్నాయి విశేషణ విశేష్యాలకు లింగ విభక్తివచనాలు ఒకేలా సమంగా ఉండటం సాధారణ నియమం. ఇది సంస్కృతంలో మారడానికి వీలులేని నియమం తెలుగులో అగు అయిన అనే పదాలను మధ్యలో ఉపయోగిస్తే విశేష్యం ఏ విభక్తిలో ఉన్నా విశేషణాలన్నీ ప్రథమావిభక్తిలోనే ఉండవచ్చు సురని కరోల్లాసనము సైన్యత్రాసనము గర్వనిరాసనము అయిన బాణాసనమున్ అని ప్రయోగించవచ్చు 'అగు-అయిన''ఉపయోగించలేదుకనక విశే ష్యాన్ని అను సరించి విశేషణాలు మూడూ ద్వితీయా విభక్తిలోనే ఉన్నాయి.

ఈ పద్యాన్నికూడా అంత్యానుప్రాస ముక్తాయింపుతోనే ముగించి మరోసారి తన ముద్ర ప్రకటించాడు పోతన్న

ఆ విల్లంది బలంబు నొంది తదగణ్యానంత తేజోవిశే
షావిర్భూత మహాప్రతాపమున వీరాలోక దుర్లోకయై

తా వేగన్ సగుణంబు జేసె ధనువుం దన్వంగి దైత్యాంగనా
గ్రీవా సంఘము నిర్గుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్ 78

శ్రీకృష్ణుడు అందించిన ఆ విల్లు అందుకొంది సత్యభామ వెంటనే బలం ఆవేశించింది ఆ ధనుస్సుకి లెక్కకు అందనంత తేజోవిశేషం ఉంది దానివల్ల ఒక మహాప్రతాపం ఆమెకు ఆవిర్భవించింది (తత్+ అగణ్య+ అనంత+తేజోవిశేష+ ఆవిర్భూత+ మహాప్రతాపమునన్) అందుచేత శత్రువీరుల చూపులకు (వీర+ ఆలోక) దుర్నిరీక్ష్య అయ్యింది. (దుర్లోకయై= తేరిచూడరానిదై) యుద్ధక్రీడల్లో ఉండే గొప్ప ఉత్కంఠతో ఆ కృశాంగి సత్యభామ తాను వేగంగా ధనుస్సును ఎక్కుపెట్టింది (గుణము= త్రాడు ధనువున్ సగుణంబున్ చేసె) అదీ ఎలా- రాక్షస స్త్రీల కంఠసమూహాలు (దైత్య+ అంగనా+ గ్రీవా+ సంఘము) త్రాడు తెగినవి అయిపోయేటట్టు (నిర్+ గుణంబుగన్) ధనుస్సు ఎక్కుపెట్టింది ఈమె ధనుస్సుని ఎక్కుపెట్టడం రాక్షససంహారంకోసం రాక్షసవీరులు చనిపోతే వాళ్ళ ధర్మపత్నుల గళసీమలలో మంగళసూత్రాలు తెగిపోతాయి అని రాక్షస సంహారాన్ని సరాసరి చెప్పకుండా ఇలా భంగ్యంతరంగా చెప్పాడు కాబట్టి ఇది పర్యాయోక్తం అనే అలంకారమవుతుంది

దనుస్సుని సగుణం చేసే సరికే (కారణం) గ్రీవా సంఘం నిర్గుణం అయిపోయింది (కార్యం) అని అన్వయం చెబితే కార్యకారణాలు ఒకేసారి జరిగినట్టు కనక ఇది అతిశయోక్తిలో ఒక భేదం అవుతుంది విల్లంది- బలంబునొంది, వీరాలోక - దుర్లోక ఇవి వృత్త్యనుప్రాసలు

నారి మొరయించె రిపుసే
నారింఖన హేతువైన నాదము నిగుడన్
నారీమణి బలసంప
న్నారీభాదికము మూర్ఛనంద నరేంద్రా! 178

భాగవతకథను శౌనకాది మహామునులకు సూతుడు చెప్పినట్టుగా పరీక్షిన్మహారాజుకి శుకుడు చెబుతున్నాడు అంచేత ఈ పద్యంలో నరేంద్రా అంటే పరీక్షిన్మహారాజా అని అర్థం

ఆ నారీమణి సత్యభామ ధనుస్సుని ఎక్కుపెట్టి వింటి నారిని ఒక్కసారి మ్రోగించింది. ధనుష్టంకారం చేసింది శత్రుసైన్యం తొట్రుపడటానికి (రింఖన) కారణమైన ధ్వని వ్యాపించింది ధనుష్టంకార ధ్వనితో శత్రుసేన తొట్రుపడిందని. బలసంపన్నమైన శత్రుగజాలూ మొదలైనవికూడా ఈ ధ్వనికి మూర్ఛపోయాయట అటువంటి నాదం వ్యాపించేలా నారి మొర యించింది

బలసంపన్న+ అరి+ ఇభ+ ఆదికము ఏనుగులతోపాటు ఆదిపదం వల్ల గుర్రాలూ గాడిదలూ వగైరా (రాక్షస సైన్యంలో గాడిదలూ ఉంటాయి) మూర్ఛపోయాయని గ్రహించాలి

నారీమణికి తోడు సవర్ణదీర్ఘసంధివల్ల ఇక్కడ మరొక ''న్నారీ'' పదం తయా

రైంది ''నాలి'' సేనా లంఖన'' అని అక్షరానుపూర్వి కలిసింది పదాలు వేరు అర్థాలు వేరు కనక ఇదీ యమకమే

సౌవర్ణ కంకణ ఝణఝణ నినదంబు
శింజినీరవముతో జెలిమిసేయ
దాటంక మణిగణ ధగధగ దీప్తులు
గండ మండల రుచి గప్పికొనగ
ధవళతరాపాంగ ధళ ధళ రోచులు
బాణజాల ప్రభాపటలి నడప
శరపాత ఘుమఘుమ శబ్దంబు పరిపంథి
సైనిక కలకల స్వనము నుడుప
వీర శృంగార భయరౌద్ర విస్మయములు
గలసి భామిని యయ్యెనో కాక యనగ
నిషువు దొడుగుట దివుచుట యేయుట డెల్ల
నెఱుగ రాకుండ ననిసేసె నిందువదన 177

సత్యభామ (ఇందువదన=చంద్రముఖి) యుద్ధం మొదలుపెట్టిం ది (అని చేసె) తన సౌకుమార్యానికి విరుద్ధమైన పని చేస్తోందనే సూచన ఉంది - ఇందువదన అనడంలో

ఎలా చేస్తోంది ఆ యుద్ధమంటే బాణం (ఇషువు)ఎప్పడు ఎక్కుపెడుతోం దో ఎప్పడు వింటినారిని చెవిదాకా లాగుతోందో (తివుచుట) ఎప్పడు విడిచిపెడుతోం దో తెలియడం లేదు మూడు పనులూ అంత వేగం గా మళ్ళీ మళ్ళీ జరిగిపోతున్నాయి. దనుస్సు ఎప్పడూ ఎక్కుపెట్టి గుండ్రం గానే ఉంటోంది. బాణాలు పరంపరగా వచ్చి పడిపోతున్నాయి అదీ ఆమె లాఘవం

వీర-శృంగార-భయానకరౌద్ర-అద్భుతరసాలు లేదా-ఆ(స్థాయి) భావాలు మూర్తీభవించి ఈ భామినిగా అయ్యాయేమో అనిపించేట్టు ''అని చేసె ఇందు వదన.''

ఆమె బాణాలు వేస్తోంటే వింటినారి మ్రోగుతోంది. (శింజినీరవము) చేతికున్న బంగారు గాజులు (సువర్ణంతో చేయబడినవి- సౌవర్ణ కంకణములు) ఝణఝణలాడుతున్నాయి ఈ రెండు ధ్వనులూ చెలిమి చేస్తున్నాయట. ఒకదానితో ఒకటి కలిసి వ్యాపిస్తున్నాయని.

సత్యభామ చెవులకు కమ్మలు (తాటంకములు) అలంకరించుకుంది వీటి లో మణులు పొదిగి ఉన్నాయి ఆ మణుల ధగధగ దీప్తులు ఆమె చెక్కిళ్ళ కాంతుల్ని (గండమండల రుచిన్) కప్పివేస్తున్నాయి. ఆమె చెక్కిళ్ళ ఎర్రదనంకన్నా మణికాంతుల ఎర్రదనం ఎక్కువగా ఉందని

ఆమె కన్నులూ కన్గొసలూ (అపాంగములు) నిర్మలంగా తెల్లగా ఉన్నాయి (ఇంకా రోషంతో ఎరుపెక్కలేదు కాబోలు ఈమె యుద్ధమూ క్రీడా విలాసమే) వీటి

కాంతులతో బాణాల కాంతులు అణిగిపోతున్నాయి పదునైన బాణాల తళతళల కన్నా ఆమె నయనాంచలాల ధళధళలు అతిశయిస్తున్నాయి (ప్రభాపటలి=కాంతి సమూహం)

బాణాలు వెళ్ళి పడుతున్నప్పటి ఘుమఘుమ ధ్వనులు శత్రుసైన్యంలో చెల రేగుతున్న కలకల ధ్వనుల్ని(స్వనము=ధ్వని) అణిచేస్తున్నాయి కలకలం కంటే ఘుమ ఘుమలు ఎక్కువగా ఉన్నాయని

ఇది స్వభావ విరుద్ధమైన యుద్ధం అందుచేత రచనలో నూ ఆ జాగ్రత్త తీసు కున్నాడు పోతన్న ఎక్కడా బీభత్సం స్ఫురించనివ్వలేదు అంతా క్రీడావిలాసమే. అందుకే శబ్దాలంకారాలు కూడా

సాధారణంగా సీసపద్యం ఎత్తుగీతిలో (తేటగీతి గానీ ఆటవెలది గానీ) నాలుగు విషయాలు చెబితే వాటిని ఆ పద్యంతాలూకు పైనాలుగు పాదాలలోనూ పెదుక్కోవడం సమన్వయించుకోవడం పరిపాటి ఇది చాలా ప్రసిద్ధమైన పద్యరచనా శిల్పం అయితే పోతన్న ఇక్కడ అలా చెయ్యలేదు వీరశృంగార భయరౌద్ర విస్మయాల ను వరసగా తరువాత వచ్చే పద్యాలలో స్ఫురింపచేస్తున్నాడు పరుజూచున్ వరు జూచు అనే పద్యంలో వీరశృంగారాలు అలినీలాలక చూడ నొప్పెసగె---లో భయ రౌద్రాలు అటుపైని రెండు సీసాలలో విస్మయావహమైన అద్భుత స్థితి

పరుజూచున్ వరుజూచు నొంపన లరింపన్ రోషరాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగం, గన్నుల గెంపు సొంపు బరగం, జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచుం, జంద్రాస్య హేలాగతిన్ । 78

సత్యభామ ఒకసారి నరకుణ్ణి(పరుడు) చూస్తోంది మరోసారి తన భర్తను (వరుడు) చూస్తోంది పరుణ్ణి చూడటం నొంచడంకోసం వరుణ్ణి చూడటం అలరించడంకోసం పరుణ్ణిచూస్తున్నప్పుడు రోషోదయంతో క్రిక్కిరిసి(అవిరత) బొమ ముడిపడుతోంది వరుణ్ణిచూస్తు న్నప్పుడు రాగోదయంతో (అనురాగ+ ఉదయం) మందహాసాలు సాగుతున్నాయి ఇలా వీరమూ శృంగారమూ క్రమంగా నడుస్తున్నాయి (జరగన్). కన్నులలో కెంపూ సొంపూ వ్యాపించాయి (పరగన్) కెంపు (ఎరుపు) వీరతాసూచకం. సొంపు శృంగారసూచకం ఆ చంద్రముఖి హేలగా అరిమీదకి చండా స్త్ర సందోహాన్ని హరి మీదకి సరసాలోక సమూహాన్ని(సరసమైన క్రీగంటి చూపులు) నెఱపుచున్- పరు జూచున్ వరు జూచు

తెలుగు సాహిత్యంలో ఇటువంటిది ఇది రెండవ పద్యం మాత్రమే మొదటిది ఉత్తరహరివంశంలో నాచనసోమనాధుడిది

అరిజూచున్ హరిజూచు జూచుకవు లందందంద మందారతే
సరమాలా మకరంద బిందు సలిల స్యందంబు లందంబులై
తొరుగం, పయ్యెద తొంగిలించ తొలగన్ దోర్దండ శరాసారమున్
దరహాసామృతపూరముం గురియుచుం దన్వంగి కేళిగతిన్ । - 102

ఇందులోంచి- ఇద్దరినీ మార్చి మార్చి చూస్తోంది అన్నదొక్కటే పోతన్న అందుకున్నాడు శరాసారము-దరహాసామృతము అన్నదొకటి మిగతా పద్యం నిర్వహణలో పోతన్న సమర్థంగా స్వతంత్రించాడు రెండూ మత్తేభాలే ఎత్తుగడ కుదిరే ఛందస్సు

అలినీలాలక చూడ నొప్పెసగె బ్రత్యాలీఢ పాదంబుతో
నలికస్వేద వికీర్ణకాలకలతో నాకర్ణికానీతస
ల్లలిత జ్యానఖ పుంఖ దీధితులతో లక్ష్యావలోకంబుతో
వలయాకార ధనుర్విముక్తవిశిఖ వ్రాతాహతారాతియై ।79

వర్ణనీయ వస్తువుని బొమ్మ కట్టించడంలో పోతనది అందె వేసిన చెయ్యి యుద్ధం చేస్తున్నప్పటి సత్యభామ రూపాన్ని మనముందు ఉంచుతున్నాడు చూడటానికి చాలా అందంగా ఉందట ఒక కాలు ముందుకు వేసి " ఆలీఢ పాదము" అనే భంగిమలో నిలిచింది ఫాలభాగంలో (అలికము) చెమట పట్టింది ముంగురులు (అలకలు) చెల్లాచెదురై కొన్ని ఆ చెమటలో హత్తుకొంటున్నాయి బాణం ఎక్కుపెట్టి మృదువైన ఆ వింటి నారిని (జ్యా) చెవి కమ్మదాకా లాగుతోంది (కర్ణిక=చెవికమ్మ) అప్పుడు అల్లెత్రాటి కాంతులూ, బాణం కలిపి పట్టుకున్న చేతి గోటి కాంతులూ, ఆ బాణం తోక (పుంఖము) తళతళలూ (దీధితులు) మూడూ కలిసి వ్యాపిస్తున్నాయి బాణాన్ని దేనిమీదకి (ఏనుగో గుర్రమో రథమో)ఎవరి మీదకి (రాక్షసభటుడో నరకాసురు డో) ప్రయోగించాలో ఆ లక్ష్యాన్ని గురి తప్పకుండా ఏకాగ్రతతో చూస్తోంది ఇషువు దొడుగుట విడుచుట యేయు టెల్ల నెఱుగన్ రాకుండా అని చేస్తోంది కనక ఆమె చేతిలో ధనుస్సు ఎప్పుడు చూసినా వలయాకారంలోనే కనపడుతోంది అలాంటి మండలాకార ధనుస్సునుంచి విడిచిపెట్టబడుతున్న శరపరంపరతో (విశిఖవ్రాతము) శత్రువుల్ని పడగొడుతోంది (ఆహత=కొట్టబడిన, అరాతియై=శత్రువులు కలదై అని బహువ్రీహి) ఇంతా చేస్తున్నది అలినీలాలక. తుమ్మెదల్లాంటి లేదా తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులు కల సత్యభామ ఇది ఆమె సౌకుమార్యాన్నీ శృంగారమూర్తిత్వాన్నీ తెలియచేస్తోంది

బొమ్మపెండ్లిండ్లకు బోనొల్ల నను బాల
రణరంగమున కెట్లు రా దలంచె
మగవారి గనిన దా మఱుగు జేరెడునింతి
పగవారి గెల్వ నే పగిది జూచె
బసిడి యుయ్యెల లెక్క భయమందు భీరువు
ఖగపతి స్కంధ మే కడిది నెక్కె
సఖుల కోలాహలస్వనములోర్వని కన్య
పటహభాంకృతుల కె ట్లుంగి యోర్చె
నీలకంఠములకు నృత్యంబు గఱపుచు

నలసి తలగిపోవు నలరుబోడి
యే విధమున నుండె నెలమి నాళీఢాది
మానములను రిపుల మానమడప । ౮౦

ఇష్టసఖులు బొమ్మ పెళ్ళిళ్ళు ఆటగా చేస్తోంటే అక్కడికి వెళ్లడానికి కూడా సిగ్గుపడే ముగ్ధ కదా ఈవిడ రణరంగానికి ఎలా రాగలిగింది మగవాళ్ళు కనపడితే చాలు చటుక్కున తలుపుచాటుకో తెరచాటుకో వెళ్ళిపోయే సిగ్గరి కదా ఈవిడ శత్రు వీరుల్ని సంహరించి గెలవాలని ఎలా అనుకుంది బంగారు తూగుటుయ్యేల అధిష్ఠించ డానికికూడా భయపడే పిరికిపిల్ల కదా ఈవిడ (భీరువు) గరుత్మంతుడి మూపుమీదకి ఏ తెగువతో (కడిది) అధిరోహించింది! చెలిమికత్తెలు ఏదయినా కోలాహలం చేస్తే ఆ చప్పడును సైతం(స్వనము) ఓర్వలేని నిశ్శబ్దప్రియ కదా ఈ బాలామణి (కన్య) పటహఝాంకారాలను-రణభేరీ ధ్వనులను ఎలా (ఏ భంగిన్) ఓర్చుకుంది.

పెంపుడు నెమళ్ళకు (నీలకంఠములు) నృత్యం నేర్పుతూ (కళవు చున్) దానికే అలిసిపోయి వెళ్ళిపోయే సుమకోమలి (అలరు=పువ్వు. అల రు వంటి మేను= శరీరము కలది). ఆలీఢ పాదము ఆకుంచితపాదము మొదలైన భంగిమలతో శత్రువుల అహంకారాన్ని (మానము) అణిచివెయ్యడానికి యుద్ధంలో ఎలా నిలబడింది

తన శృంగారమయ సుకుమార తత్త్వానికి సరిపడని' పూర్తిగా వ్యతిరేక మైన-పనులకు సత్యభామ ఎలా పూనుకొందోనని ఇది విన్నవారు ఆశ్చర్యపోయేలా ఉందని.

వీణె జక్కగ బట్ట వెరవెఱుంగని కొమ్మ
బాణాసనం బెట్లు పట్టనేర్చె
బ్రూతున దీగె గూర్పంగ నేరని లేమ
గుణము నే క్రియ ధనుః కోటి గూర్చె
సరవి ముత్యము గ్రువ్వ జాలని యబల యే
నిపుణత సంధించె నిశిత శరము
జిలుకకు బద్యంబు జెప్పనేర్పని తన్వి
యస్త్ర మంత్రము లెన్న డభ్యసించె
బలుకు మనిన బెక్కు పలుకని ముగుద యే
గతి నొనర్చె సింహగర్జనములు
నవగ మెఱసె భ్రజగదభిరామ గుణధామ
చారు సత్యభామ-సత్యభామ । ౮౧

వీణను చక్కగా పట్టుకునే ఉపాయం (వెరవు) ఎరగని కొమ్మ ధనుస్సుని (బాణ ఆసనంబున్) ఎలా పట్టుకుంది ఉద్యానవనంలో ఒక చెట్టుకి పూల తీగెను కలిపించే దారి తెలియని లేమ అల్లెత్రాడులను ధను ర(గ్రభాగానికి (కోటికి) ఎలా తగిలించింది. వరసగా ముత్యాలు దండ గ్రుచ్చలేని అబల వాడి బాణాలను (నిశిత

శరములు) ఏ నిపుణతతో సంధించింది ! పెంపుడు చిలకకి పట్టుమని ఒక పద్యం పూర్తిగా నేర్పలేని తన్విఅస్త్ర ప్రయోగోపసంహార మంత్రాలను ఎప్పుడు నేర్చింది.

మాట్లాడు మాట్లాడు అని బతిమాలితే ఒక పలుకో అరపలుకో తప్ప ఎక్కువ మాట్లాడని ఈ ముగ్ధ (ముగుద) సింహగర్జనలు చెయ్యడం ఎలా నేర్చుకుంది

అని అందరూ- విన్నవారూ- కన్నవారూ ఆశ్చర్యపోయేలా సత్యభామ అందమైన నిజమైన భామ (ముమ్మూర్తులా స్త్రీ) సకల సద్గుణనిలయ ముల్లోకాలకూ అందగత్తె (త్రిజగత్+ అభిరామ) ఆమె రణరంగంలో ప్రకాశించింది. (మెఱసెన్)

త్రిజగదభిరామ గుణధామ చారుసత్యభామ సత్యభామ అనేది మళ్ళీ పోతన్న గారి అంత్యానుప్రాస ముద్ర వృత్తాలలోనే కాదు సీసపద్యం ఎత్తుగీతి ముగింపు లోకూడా దీన్ని చూపించారు

ఈ రెండు సీసాలలోనూ అన్నీ ఆశ్చర్యపరిచే విషయాలే. రణరంగానికి సంబంధించిన అంశాలు వంకగా సత్యభామ నిత్యకేళి విభ్రమాలను పాఠకుల ముందు ఉంచాడు శృంగార వీరాల గడుసరి పోహళింపు అయితే ఇక్కడ ఆశ్చర్యమే ఫలితాంశం కనక ప్రకృతాలైన రణక్రియలకే ప్రాధాన్యం అంటే శృంగారం వీరరసానికి అంగం అయ్యింది ఇలా ఒక రసానికి గానీ ఒక భావానికిగానీ మరోరసం అంగమైతే దానిని రసవదలంకారం అంటారు నాచనసోమనాధుడి ఈ క్రింది పద్యం పోతన గారి సీసపద్యాలకు ప్రేరక మనిపిస్తుంది

తంత్రీ వినోదంబు తడవు సైపని వ్రేళ్ళ
 గొనయంబు తెగలపై గోరుకొనుట
యుద్ధంపు పిడి ముష్టి నలయు పాణితలంబు
 అస్త్రకం బిభియించు లావుకలిమి
చెలికత్తె నొత్తిలి చీరలేని యెలుంగు
 సింహనాదంబుచే జెదరకునికి
ప్రమదనర్తన కేళి బరిభవింపని పదం
 బైదు లాణంబుల నలత బడమి
సోయగపు జిత్రరూపంబు జూచుచోట
వేసరు విలోచనంబులు విశృత థైత్య
లక్ష్య మీక్షించుటయు మొక్కలంపు గెలుపు
గైకొనియె సత్యభామ సంగ్రామసీమ. (ప్రథమ-10)

సత్యభామ చేస్తున్న యుద్ధాన్ని వర్షఋతువుగా పోలుస్తున్నాడు తరవాత పద్యంలో పోతన.

జ్యావల్లీ ధ్వని గర్జనంబుగ, సురల్ సారంగ యూథంబుగా,
నా వి ల్లింద్రశరాసనంబుగ ; సరోజాక్షుండు మేఘుంబుగా,
దా విద్యుల్లత భంగి, నింతి సురజిద్దావాగ్ని మగ్నంబుగా
బ్రావృట్కాలము సేసె, బాణచయ మంభఃశీకర శ్రేణిగాన్ 62

వింటినారినుంచి వెలువడుతున్న ధ్వని- ధనుష్టంకారాలే ఉరుములు (మేఘగర్జనంబుగన్) ఆకాశంలో నిలబడి యుద్ధాన్ని తిలకించి ఆనందంతో గంతులు వేస్తున్న దేవతలు సారంగసమూహం (సారం గము=లేడి తుమ్మెద, ఏనుగు వానకోయిల ఇన్ని అర్థాలున్నాయి వాన కోయిల అనేది ప్రకృతవర్ణనకు సరిపోతుంది. ఆమె చేతిలో ఉన్న విల్లు ఏడు రంగుల ఇంద్రధనుస్సు ప్రక్కన కూర్చున్న పుండరీ కాక్షుడు (సరోజ+ అక్షుడు) శ్రీకృష్ణుడేమో మేఘం తానేమో మేఘాన్ని ఎడబాయని మెరుపు తీగలా (విద్యుత్+లత) ఉంది ఎట్ట ఎదుట ఉన్న దేవతావిజేత (సురజిత్) నరకాసురుడు కార్చిచ్చు (దావాగ్ని) ఆ దావాగ్ని మునిగి పూర్తిగా చల్లారిపోయేట్టు (మగ్నంబు+ కాన్) బాణ సమూహం వర్ష ధారలు కాగా (అంభః + శీకర+ శ్రేణిగాన్) ఇంతి సత్యభామ ఇలా అకాలంలో వర్షర్తువుని కల్పించింది (ప్రావృట్కాలము చేసెన్).

యుద్ధానికి వర్షర్తు ధర్మాన్ని ఆరోపించడం వల్ల ఇది తాద్రూప్య రూపకం అంతటితో ఆగిపోకుండా యుద్ధ విభాగాలన్నింటా వర్షర్తువులో కనిపించే వస్తువుల ధర్మాలను ఆరోపించాడు జ్యావల్లీ ధ్వనియందు గర్జాత్వాన్నీ, సురలయందు సారంగ యూధత్వాన్నీ ధనుస్సునందు ఇంద్రశ రాస నత్వాన్నీ, సరోజాక్షునియందు మేఘ త్వాన్నీ సత్యభామయందు విద్యుల్లతాత్వాన్నీ, సురజిత్తునందు దావాగ్నిత్వాన్నీ, బాణ చయమందు అంభశ్శీకర శ్రేణీత్వాన్నీ- ఆరోపించి ఉపమేయమ్మైన మొత్తం యుద్ధానికి ప్రావృట్కాలత్వాన్ని ప్రతిపాదించాడు ఇలా ఉపమేయావయవాలన్నింటా ఉపమానావ యవాల ధర్మాలను ఆరోపించి సమగ్రత చేకూరిస్తే దాన్ని సావయవ రూపకం అంటా రు (ఇది నన్నయ దగ్గర తరచు కనబడుతుంది)

రాకేందు బింబమై రవిబింబమై యొప్పు
నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతువై ఘన ధూమకేతువై
యలరు బూబోడి చేలాంచలంబు
భావజు పరిఘయై ప్రళయార్కు పరిఘయై
మెఱయు నాకృష్టమై మెలత చాప
యమృత ప్రవాహమై యనల సందోహమై
తనరారు నింతి సందర్శనంబు
హర్ష దాయియై మహారోషదాయియై
పరగు ముద్దరాలి బాణవృష్టి
హరికి నరికి జూడ నందంద శృంగార
వీర రసములోలి విస్తరిల్ల । 83

సత్యభామను శ్రీకృష్ణుడు చూస్తున్నాడు నరకాసురుడూ చూస్తున్నాడు ఎవరికి ఎలా కనపడుతోందో వర్ణించాడు- ఈ పద్యంలో హరికీ అరికీ అని క్రమం ఆ పద్మాక్షి (నీరజాత+ ఈక్షణ) అందమైన ముఖం హరికి పున్నమినాటి

చంద్రబింబంలా కనపడుతోంది అరి అయిన నరకుడికి సూర్యబింబంలా కనపడు తోంది శ్రీకృష్ణుడు చూసి ఆనందించగలుగుతున్నాడు నరకుడు తేరి చూడలేకపోతున్నాడు అని

ఆ పూబోడి చెంగుకొస (చేల+ అంచలంబు) శ్రీకృష్ణుని కంటికి మన్మధుడి జెండాలాగా భాసిస్తోంది నరకుడి చూపులకి పెద్ద ధూమకేతువులాగా స్ఫురిస్తోంది.

దూమకేతువంటే తోకచుక్క అది అరిష్టాన్ని సూచిస్తుందంటారు నరకాసురుడికి అరిష్టం మూడిందని

బాణం ఎక్కుపెట్టడంతో (ఆకృష్టమై) వలయాకారంగా ఉన్న సత్యభామ దనుస్సు(మెలత=స్త్రీ) హరి దృష్టికి మన్మధుడి పరివేషంలా ఉంది నరకుడి చూపులకి అది ప్రళయకాల సూర్య బింబం చుట్టూ ఉండే గుడిలా ఉంది (దీనినే మామూలు రోజుల్లో వరదగుడి అంటారు సూర్య బింబానికీ (?)చంద్రబింబానికీ ఇది ఏర్పడుతుంది చంద్రబింబానికి తరచు కనపడుతూంటుంది వరదగుడి దగ్గరగా ఉంటే దూరంలో వానలనీ దూరంగా ఉంటే దగ్గరలో వానలనీ ఒక నమ్మకం) ప్రళయం ముంచుకు వస్తోందని

సత్యభామా సందర్శనం శ్రీకృష్ణుడికి అమృత ప్రవాహంలాగా ఉంది. నరకాసురుడి ప్రాణానికి నిప్పులకొలిమిలాగా (అనల+సందో హము) ఉంది సందర్శనం అంటే చూపు అని అర్థం చెబితే అది హరికి అమృతప్రాయంగా ఉంటే అరికి నిప్పులు కురుస్తోందని

ఆ ముగ్ధ కురిపిస్తున్న బాణ పరంపర (ఎడతెరిపిలేని వానలా కురుస్తున్న బాణాలు= బాణవృష్టి) శ్రీకృష్ణుడికి హర్షాన్ని కలిగిస్తోంది (హర్షదాయి) నరకాసురుడికి మహారోషాన్ని కల్పిస్తోంది

ఒకే విషయం వరసగా (ఓలిన్) హరికి శృంగారం విస్తరిల్లేట్టూ అరికి వీరరసం విస్తరిల్లేట్టూ భాసించింది

వాక్య నిర్మాణపరంగా దీన్ని యధాసంఖ్యాలంకారం–లేదా క్రమాలంకారం అంటారు. ఒకే సత్యభామ ఇద్దరికి రెండు రకాలుగా కనిపించినట్టు వర్ణించాడు కనక ఉల్లేఖాలంకారం మరొక విశేషం–విభావాదుల పరిపోషణతో సన్నివేశాలలో రస స్ఫూర్తిని కలిగించాలే తప్ప వీరరసం, శృంగారరసం శాంతరసం అంటూ ఆయా రసాల ను పేర్కొనకూడ దనీ అలా చేస్తే అది స్వశబ్దవాచ్యత అనే దోషమవుతుందనీ ఆలంకారికులు నిష్కర్ష చేసారు. అయితే మహాకవులు చాలామందిలో ఇది కనపడుతోంది

వ. ఇవ్విధంబున ।84

శంపాలతాభ బెడిదపు

టంపఱచే ఘోరదానవానీకంబుల్

పెంపఱి సన్నాహంబుల

సొంపఱి భూసుతుని వెనుక జొచ్చెన్ విచ్చెన్ ।85

ఈ విధంగా మెరుపు తీగలాంటి ఆ సత్యభామ (శంపాలతా+ ఆభ) వేస్తున్న నిష్ఠుర బాణ పరంపరతో (బెడిదమ్మైన అంపఱ) భయంకర రాక్షస సైన్యాలు పెంపు దప్పి వ్యూహాల సొంపు కోల్పోయి నరకాసురుడి వెనక్కి చేరుకున్నాయి చెల్లాచెదురై పారిపోయాయి (విచ్చెన్) రాక్షస వీరులు భయపడిపోయి'' మహాప్రభూ! నువ్వే దిక్కు'' అని నరకుణ్ణి శరణు జొచ్చారనీ కొందరు పారిపోయారనీ మొత్తానికి కకా వికలై పోయారనీ భావం

వ. అయ్యవసరంబున గంససంహారి మనోహారిణిం జూచి సంతోష కారియుం గరుణా రసావలోకన ప్రసారియు మధురవచన సుధారస విసారియుం దదీయ సమర సన్నాహనివారియునై యిట్లనియె ।86

ఆ సమయంలో (అవసరము=సమయం) కంస సంహారి శ్రీకృష్ణుడు తన మనోహారిణి సత్యభామను చూసాడు. చూసి ఆమెకు సంతోషం కలిగిస్తూ కరుణతో నిండిన చూపుల్ని ప్రసరిస్తూ, మధురమైన మాటలతో అమృతాన్ని చిందిస్తూ, ఆమె సమర సన్నాహాన్ని (యుద్ధప్రయత్నాన్ని) నివారిస్తూ, ఇలా అన్నాడు-
(సంతోషకారి మొదలైన విశేషణాలన్నీ కంససంహారికే)

కొమ్మా! దానవనాథుని
కొమ్మాహవమునకు దొలగె, గురువిజయము గై
కొమ్మా! మెచ్చితి నిచ్చెద
గొమ్మాభరణములు నీవు కోరిన వెల్లన్ ।87

(కొమ్మ=స్త్రీ కొమ్ము=పక్షము స్వీకరించుము కైకొమ్ము=చేపట్టుము)

కొమ్మా సత్యభామా రాక్షసరాజయిన నరకాసురుడి పక్షం యుద్ధం నుంచి పారిపోయింది (కొమ్ము+ ఆహవమునకున్) ఘన విజయాన్ని చేపట్టుమా. నిన్నుమెచ్చాను నువ్వు కోరిన ఆభరణాలన్నీ ఇస్తా స్వీకరించు(కొమ్ము+ఆభరణ ములు)

మాట వరసకు అన్నాడే తప్ప ఏమి ఆభరణాలు బహూకరించాడో పోతన్న చెప్పలేదు రుక్మిణి ఎంతో కాలంగా కోరుకుంటున్నా ఆమెకు దొరకని పతకాన్ని శ్రీకృష్ణుడు ఈ సమయంలో సత్యకు బహుమతిగా ఇచ్చాడని సోమనాథుడు చెబుతూ '' నోచినవారి సొమ్ములవి నోమనివారికి వచ్చునే ధరన్'' అని ఒక అర్థాంతరన్యాసం వేసాడు. (ఉ.హ - 68)

నాలుగు పాదాలకూ మొదట ''కొమ్మా'' అనే అక్షరానుపూర్వి ఏర్పడింది పదాలు వేరు అర్థాలు వేరు కాబట్టి ఇది యమకమే ఇటు వంటి శబ్దాలంకారాలను పోతన్న చాలా తేలికగా సమకూరుస్తాడు అంచేతనే ఇవి పాఠకుడి దృష్టిని రసగ్రహణ పారీణతనుంచి అంతగా మళ్ళించవు రసభంగాన్ని కలిగించవు. ప్రత్యేకయత్నం లేకుండా తగినమోతాదులో శబ్దాలంకారాలను కూర్చగలిగితే , వాటంతట అవి వచ్చి పడినంత సహజం గా అమర్చగలిగితే (అపృథగ్ ప్రయత్నం) రసభంజకాలు కావని ఆలంకారికుల తీర్పు.

వ. అని పలికి సమ్మాన రూపంబులు మోహనదీపంబులు దూరీకృత చిత్త విక్షేపంబులునైన సల్లాపంబులం గళావతిం దద్దయు బెద్దరికంబు సేసి తత్కర కిసలయోల్లసిత బాణాసనంబు మరల నందుకొనియె నప్పుడు సురవైరి మురి వైరి కిట్లనియె. ।౮౩

ఆ రకంగా సత్యభామను మెచ్చుకుని ఇంకా మరికొన్ని సల్లాపాలు (మంచి మాటలు) చేసాడు అవి ఆమెకు సమ్మాన రూపాలుగా ,అనురాగాన్ని ఉద్దీపింపజేసేవిగా, మానసికమైన అలసటనూ చాంచల్యాన్నీ (విక్షేపము) తొలగించేవిగా ఉన్నాయి. ఈ మాటలతో ఆ కళావతి సత్యభామకు (కళావతి= విద్యావంతురాలు) పెద్దరికం పెంపొందించాడు చిగురుటాకు లవంటి ఆమె చేతులలో ఉన్న ధనుస్సును మళ్లీ శ్రీకృష్ణుడు తాను అందుకున్నాడు. అప్పుడు అదిచూసిన నరకాసురుడు (సురవైరి= దేవతల శత్రువు) శ్రీకృష్ణుడితో (మురవైరి=మురుడనే రాక్షసుణ్ణి సంహరించిన వాడు) ఇలా అన్నాడట-

సురవైరి మురవైరి పదాలు సమతూకంగా ఉన్నా ఈ రెండింటికీ పరిమితంగా అర్థాన్నిబట్టి చూస్తే సురవైరికే మొగ్గు ఉంది. సమస్త దేవతలనూ ఎదిరించినవాడు అతడు ఒక్క మురాసురుణ్ణి జయించిన వాడు ఇతడు నాయక ప్రతినాయకులకు సమాన ప్రతిపత్తి కల్పించడమే కాదు ఆరంభంలో ప్రతినాయకుడికి మొగ్గు చూపించడం, కట్టకడపటికి అది నాయకుడి గొప్పదనాన్ని చాటడానికే ఉపకరిస్తుంది

ఇప్పుడు వీరిద్దరి మధ్యా అధిక్షేపాలు నడుస్తాయి. అవి వీరరసానికి ఉద్దీపకాలు

మగువ మగవారి ముందఱ
మగతనములు సూప రణము మానుట నీకున్
మగతనము గాదు, దనుజులు
మగువల దెస జనరు- మగల మగ లగుట హరీ! ।౮౪

(మగువ=వనిత మగడు=వీరుడు మగలు=వీరులు)

ఓ హరీ మగవాళ్లముందు ఒక మగువ ఇలా మగతనం (వీరత్వం) ప్రదర్శిస్తూంటే నువ్వు యుద్ధం మానేసి హాయిగా కూర్చోవడం మగతనం కాదయ్యా మా రాక్షసులు ఆడవాళ్ల మీదకి యుద్ధానికి వెళ్లరు. ఎందుకంటే మావాళ్లు వీరులకు వీరులు (మగలకు మగలు+ అగుటన్) ఈ మాటల్లో ఎగతాళి ఉంది అహంకారమూ ఉంది నీ తరఫున ఒక ఆడది యుద్ధం చేస్తుంటే నువ్వు చేతులుముడుచుకొని కూర్చున్నావంటే నువ్వు ఏ పాటి వీరుడవు అని అధిక్షేపం మేము వీరులతో యుద్ధం చేసే వీరులమే తప్ప ఆడవాళ్లతో యుద్ధం చేసేవాళ్లము కాదని అహంకార ప్రకటన స్వాతిశయం

శ్రీకృష్ణుడు దెబ్బతిని మూర్ఛపోతే సత్య నడుం బిగించిందనీ, తేరు కుని శ్రీకృష్ణుడు విల్లందించాడనీ నాచనసోమనాథుడు ఒక కల్పన చేసాడు

అర చందురు డెందములో
కొరబాటి వణంకు తోక చుక్కయు పోలెన్

నరకుం డేసిన బాణము
హరి నిటలతటంబు నాటి యల్లల నాడెన్. (ఉ.హ. ప్రథమ- 1 ౯౩)

నరకాసురుడు వేసిన బాణం శ్రీకృష్ణుడి ఫాలభాగానికి గుచ్చుకొని ఆ వేగంతో జవజవలాడిందట ఫాలభాగం అర్ధచంద్రాకారంలో ఉంది బాణం తోకచుక్క లాగా ఉంది. ఈ దెబ్బతో శ్రీకృష్ణుడు మూర్ఛపోయాడు సత్యభామకు యుద్ధం చేసే అవకాశం లభించింది కోరిక తీర్చుకోమన్నాడు శ్రీకృష్ణుడు.

సోమనాథుడి కల్పనలో పోలిక అద్భుతంగానే ఉంది కానీ మూర్ఛ పోవడం శ్రీకృష్ణుని సామర్థ్యానికీ, దైవత్వానికీ అపకర్ష కలిగిస్తోందని కాబో లు పోతన్న అటువంటిది చెప్పలేదు. పోతనగారి సత్యభామ యుద్ధానికి పూనుకోవడంలో ప్రత్యేకకారణం ఏదీలేదు సరదాపడింది అంతే ''లే మా మేము దనుజుల గెలువగలేమా అయినా నీ ముచ్చట ఎందుకు కాదనాలి ఇదిగో ''విల్లు' అని పోతన్నగారి శ్రీకృష్ణుడు అందించాడు సరసత చూపించాడు అది శృంగార పరిపోషకమయ్యింది. ఇప్పుడు అదే నరకాసురుడు ఆక్షేపించడానికి కారణమయి వీరతాస్ఫూర్తికి దోహదపడింది. శృంగార వీరాలను జమిలిగా నడిపించడంలో పోతన్నదే పైచెయ్యి అయ్యింది

నరకాసురుడు అధిక్షేపించే సరికి

'' అనిన హరి యిట్లనియెం- 1 ౭౦
నరకా! ఖండించెద మ
త్కర కాండాసన విముక్త ఘన శరముల భీ
కరకాయున్నిను సురకి
న్నర కాంతలు సూచి నేడు నందం బొందన్ 1 ౭1

(కాండము= బాణము కాండ+ ఆసనము= ధనుస్సు నందము= ఆనందము)

ఓ నరకా భీకరశరీరుడవైన నిన్ను ఇప్పుడే దండిస్తాను ఇదిగో నా చేతిలో ధనుస్సు దీని నుంచి వెలువడే బలమైన బాణాలతో నిన్ను నరికేస్తాను ఆకాశంలో నిలబడి చూస్తున్న దేవకాంతలూ కిన్నర కాంతలూ ఇవ్వేళ ఆనందిస్తారు (వాళ్ళనందరినీ నరకాసురుడు హింసించినవాడే అంచేత ఇవ్వేళనుంచి వాళ్ళంతా ఆనందిస్తారని)

ఒకటి నాలుగు పాదాల ప్రారంభంలో ''నరకా'' అనే వర్ణక్రమం ఏర్పడింది రెండు మూడు పాదాల ప్రారంభంలో 'కరకా' అనేది ఏర్పడింది ఇది మరొక రకం యమకం నాలుగు పాదాల్లోనూ రెండూ మూడూ అక్షరాలు 'రకా' అని సమానంగా ఉన్నాయి రెండవ అక్షరం ప్రాస మూడవ అక్షరంకూడా అలాగే ప్రాసలాగాకుదిరింది అంటే రెండక్షరాలకు ప్రాస కూర్చినట్లయింది దీన్ని ద్విప్రాస అన్నారు ఛందఃకర్తలు. ప్రాసాక్షరం లగాయతు మూడక్షరాలకు నాలుగుపాదాలలోనూ మైత్రి కుదిరితే అది త్రిప్రాస. అలాగే చతుష్ప్రాస. ఇవి శబ్దాలంకారప్రాసలు

శ్రీకృష్ణుడికి కోపం వచ్చిన దాఖలా లేవీ ఈ మాటలలో కన్పించడం లేదు

క్రీడాప్రాయమైన యుద్ధం మొదటినుంచీ అలాగే ఉంది.

వ. అని పలికి నరకాసురయోధుల మీద శతఘ్నియను దివ్యాస్త్రంబు ప్రయోగించిన నొక్కవరుసను వారలందఱు మహావ్యథం చెందిరి. మఱియును. । ౨౨

నరకా నీ భీకరకాయాన్ని ఖండిస్తాను అంటూనే శ్రీకృష్ణుడు రాక్షససైన్యం మీదకి శతఘ్నిని ప్రయోగించాడు. వందలాదిగా మట్టు పెట్టే ఒక దివ్యాస్త్రం అది దాని తాకిడికి రాక్షసవీరులందరూ మహావ్యథ(మృతి) చెందారు ఇంకా ఏమయ్యిందంటే

శరవిచ్ఛిన్న తురంగమై పటుగదా సంభిన్నమాతంగమై
యురుచక్రాహతవీర మధ్య పద బాహు స్కంధముఖ్యాంగమై
సురభిత్సైన్యము దైన్యముం బొరయుచున్ శోషించి హైన్యంబుతో
హరి ప్రోలన్ నిలువంగ లేక పఱచెన్ హాహా నినాదంబులన్ । ౨౩

దేవతల్ని గడగడలాడించిన (సురభిత్) నరకాసురిడి సైన్యం దీనావస్థను పొందింది శోషించిపోయింది హీనస్థితికి వచ్చేసింది శ్రీకృష్ణుడి ఎదుట నిలవలేక పోయింది హాహాకారాలు చేసింది. సైన్యంలో ఉన్న గుర్రాలు శ్రీకృష్ణుని బాణాలతో విచ్ఛిన్నమైపోయాయి (శరముల చేత విచ్ఛిన్నమైన తురంగములు కలది ఆ సైన్యము) ఏనుగులు బలమైన ఆ గదాఘాతాలకి చితికిపోయాయి చక్రాయుధం దెబ్బలకి వీరుల నడు మూలూ కాళ్లూ చేతులూ మూపులూ మొదలైన శరీరావయవాలు తెగిపడ్డాయి (పటుగదచేత సంభిన్నమైన మాతంగములు కలది ఉరుచక్రము చేత ఆహతమైన వీరుల మధ్య పద బాహు స్కంధముఖ్యాంగాలు కలది అని బహువ్రీహులు సైన్యానికి విశేషణాలు)

విచ్ఛిన్న-సంభిన్న తురంగమై-మాతంగమై సైన్యము- దైన్యము హైన్యము ఇవన్నీ వృత్త్యనుప్రాసలు ఈ పద్యం'' వికలవ్యూహ విధా విహస్త భటమై విధ్వస్త మాతంగమై (4- ౨౭) అంటూ సాగిన నాచనసోమన మత్తేభాన్ని స్ఫురింపజేస్తోంది ఈ రెండింటిలోనూ నిర్మాణ శిల్ప పరిణతి సోమనాథుడి పద్యంలోనే బాగా కనపడుతుంది ఎత్తుగడలో ఉన్నశైలిని కడదాకా నిర్వహించలేదు ఎందుకనో మరి పోతన్న

వ. అప్పుడు । ౨౪

మొనసి దనుజయోధ ముఖ్యులు నిగిడించు
శస్త్ర సముదయముల జనవరేణ్య।
మురహరుండు వరుస మూడేసి కోలల
ఖండితంబు సేసె గదనమందు । ౨౫

ఓ జనవరేణ్యా. పరీక్షిన్మహారాజా ఆ రాక్షసయోధుల్లో ముఖ్యులు కొందరు యుద్ధసన్నద్ధులై (మొనసి) శస్త్రసమూహాలను శ్రీకృష్ణుడి మీదకి ప్రసరింపజేసారు (నిగిడించుట). మురాంతకుడు వాటిని వరసగా ఒకొక్కదానినీ మూడేసి బాణాలతో (కోలలన్) తునాతునకలు చేసేసాడు. (కదనమందున్=రణమునందు)

అతడు మూడు బాణాలు వేస్తే ఇతడు ఏడు బాణాలు వేసి ఖండించాడనీ

అతడు పది బాణాలు వేస్తే ఇతడు ఇరువది బాణాలు వేసాడనీ ఏదో ఒక అంకెతో చెప్పడం యుద్ధవర్ణనలన్నింటా సాధారణంగా కనపడే విషయం ఒకేసారి అన్నేసి బాణాలు సంధించగలిగిన లాఘవం ఉందని సూచించడం ఫలితార్థం ఒకే బాణాన్ని ప్రయోగించినా అది వేల సంఖ్యకు విడిపోవడం మంత్రప్రయుక్తమైన అస్త్రాలకు చెల్లుతుంది ఇటువంటి అద్భుత యుద్ధాలనుకూడా కవులు మనకు చూపించారు

శ్రీకృష్ణుడు ఇలా యుద్ధం చేస్తుంటే గరుత్మంతుడుకూడా కల్పించుకుని యథావకాశంగా సహకరించాడు

వెన్నుని సత్యను మోచుచు
బన్నుగ బద నఖర చంచు పక్షాహతులన్
భిన్నములు సేసె గరుడుడు
పన్నిన గజసముదయముల పౌరవముఖ్యా! ।౨౬

(వెన్నుడు= విష్ణుడు, పన్నుగన్= ఒప్పుగా, పన్నిన=యుద్ధమునకు సన్నద్ధమైన)

సత్యభామనూ శ్రీకృష్ణుణ్ణీ వీపుమీద మోస్తూనే గరుత్మంతుడు (గరుడుడు) తన కాలిగోళ్ళతో (పదనఖరములు) ముక్కుతో రెక్కలతో కొడుతూ శత్రుసైన్యంలో ఉన్న ఏనుగుల్ని చీల్చి చెండాడుతున్నాడు

''పౌరవముఖ్యా'' అనేది పరీక్షిత్తుకి సంబోధన. కురుక్షేత్ర మహాసంగ్రామం అయ్యాక పురువంశంలో మిగిలిన ముఖ్యుడు ఇతడే.

''చంచుపక్షము'' ఒకే పదంగా చెబితే ముక్కుకి ఉన్న అన్ని పార్శ్వాలతోనూ ఏనుగుల్ని చీల్చాడని సమన్వయం పదనఖర +చంచు పక్ష+ఆహతులన్ అని. తఁరువాత వచనంలో పక్షవిక్షేపణాన్ని ప్రత్యేకంగా చెపుతున్నాడు కనక

వ. మఱియు విహగరాజ పక్ష విక్షేపణ సంజాత వాతంబు సైరింపం జాలక హతశేషంబైన సైన్యంబు పురంబు సొచ్చుటం జూచి నరకాసురుడు మున్ను వజ్రాయుధంబుం దిరస్కరించిన తన చేతి శక్తింగొని గరుడుని వైచె, నతండు ను విరుల దండ వ్రేటువ ఇలింపని మదోద్దండవేదండంబును బోలె విలసిల్లె, నయ్యవసరంబున గజారూఢుండై కలహరంగంబున ।౨౭

పక్షీంద్రుడైన గరుత్మంతుడి రెక్కల విసురులతో (విక్షేపణ) పుట్టిన పెనుగాలిని తట్టుకోలేక అప్పటికి చావగా మిగిలిన సైన్యం మాహిష్మతీ పట్టణం లోపలికి పారిపోయింది అది చూసి నరకాసురుడు తన చేతిలో ఉన్న '' శక్తి'' అనే ఆయుధాన్ని గరుడుడి మీదకి విసిరాడు ఈ శక్తి ఇది వరలో (మున్ను) వజ్రాయుధాన్ని సైతం తిరస్కరించినంతటి తిరుగులేని ఆయుధం ఇంతటి శక్తినీ వేస్తే గరుత్మంతుడు ఏమీ చలించలేదు. ఒక పూలదండను పుచ్చుకొని వేస్తే మదించిన ఏనుగు ఎలా చలించదో అలా విలసిల్లాడు శక్తిఘాతం అతడికి పూలదండ తాకిడిలాగా ఉంది. అప్పుడు కదనరంగంలో ఒక మదగజాన్ని అధిరోహించాడు నరకాసురుడు

సమదేభేంద్రము నెక్కి భూమిసుతు డా చక్రాయుధున్ వైవ శూ
లము జేపట్టినయంతలోన - రుచిమాలాభిన్న ఘోరాసురో
త్తమ చక్రంబగు చేతి చక్రమున దైత్య ధ్వంసి ఖండించె, ర
త్నమయోదగ్ర వినూత్న కుండల సమేతంబైన తన్మూర్ధమున్ । -౨౮

మదించిన గజేంద్రాన్ని (సమద+ ఇభ+ ఇంద్రము) అధిరోహించి భూమి పుత్రుడు నరకాసురుడు ఎట్ల ఎదుట ఉన్న ఆ చక్రపాణిని కొట్టడానికి శూలం చేపట్ట బోయాడు దాన్ని చేపట్టినంతటిలోనే చక్రాయుధం వచ్చి అతడి శిరస్సును నరికేసింది. అది శ్రీకృష్ణుని చేతి చక్రం దాని అంచుల కాంతిజాలంతో (రుచిమాలా) లోగడ ఎందరెందరో భయంకరులైన రాక్షసోత్తముల సమూహం (చక్రము) నాశనమై పోయింది (రుచిమాల చేత భిన్నమైన ఘోరాసురోత్తముల చక్రము-సమూహము - కలది ఆ చక్రము అని బహువ్రీహి విశేషణం)

రాక్షస విధ్వంసకుడిగా (దైత్యధ్వంసి) పేరుపడ్డ శ్రీకృష్ణుడు నరకుడి శిరస్సు ను (తత్+ మూర్ధమున్) ఖండించాడు. ఆ శిరస్సు , రత్నాలు పొదిగి గొప్పగా ప్రకాశి స్తున్న కొత్తరకం కుండలాలతో ఉంది (రత్నమయమైన ఉదగ్రమయిన వినూత్న మయిన కుండలాలతో సమేతమై ఉంది)

ఇంద్ర శబ్దం విశేష్యానికి పరంగా చేరితే శ్రేష్ఠతా వాచకం అవుతుంది. కవీంద్రుడు అంటే కవిశ్రేష్ఠుడు అని ఇభేంద్రము, పక్షీంద్రుడు మొదలైనవన్నీ ఇటు వంటివే. ఇభములందు ఇంద్రము అని.

కుండలాలతో ప్రకాశిస్తున్న మూర్ధము అని ప్రత్యేకంగా చెప్పడంలో ఒక విశేషం ఉంది ఈ యుద్ధానికి కారణమే కుండలాలు. ఒకప్పుడు నరకాసురుడు దేవేం ద్రుడి మీద దాడి చేసి అదితి కర్ణకుండలాలనూ వరుణుడు కానుకగా ఇచ్చిన పెల్ల గొడుగునూ వైజయంతి అనే వన మాలనూ అపహరించి తన మాహిష్మతికి తెచ్చేసు కున్నాడు మేరు పర్వతం మీద మణి పర్వతం అనే భాగాన్ని ఆక్రమించుకున్నాడు. ఇవన్నీ తిరిగి నాకు ఇప్పించమని ఇంద్రుడు వచ్చి విన్నవిస్తే శ్రీకృష్ణుడు నరకాసుర వధకు గరుడవాహనం మీద బయలుదేరాడు పదహారువేలమంది రాజకన్యలను చెఱపట్టి మాహిష్మతీ పట్టణంలో బంధించాడు. ఇవన్నీ కలిసి నరకుడి చావుకి వచ్చాయి

నరకుడి తల తెగి మొండెం పెద్ద శబ్దం చేస్తూ నేలమీద పడింది ఆ శబ్దాన్ని ఉత్ప్రేక్షిస్తున్నాడు కవి-

ఇల్లాలం గిటియైన కాలమున మున్నేనంచు ఘోషింతు వో
తల్లీ! నిన్ను దలంచియైన నిచటం దన్నుం గృపం గావడే
చెల్లంబో తల ద్రెంచె నంచు నిల నాక్షేపించు చందంబునన్
ద్రెళ్ళెం ఐప్పడు గాగ భూమిసుతు డుద్దీప్తాహవక్షోణి పై । ౨౯

నరకాసురుడు భూమిసుతుడు ఎలాగంటే - విష్ణుమూర్తి వరాహావతారం

ఎత్తినప్పుడు భూదేవితో సంగమమై నరకుడు జన్మించాడు అంటే శ్రీకృష్ణుడికీ ఇతడు కుమారుడే. అయినా దుష్టుడు కనక నిర్మమకారంగా సంహరించాడు శత్రులకీ పుత్రులకీ ఒకే నీతిని వర్తింప జెయ్యడం గొప్ప సుగుణమని నాచనసోమనాధుడి భూదేవి ప్రస్తుతిస్తుంది కొడుకుని ఇచ్చినవాడవూ నువ్వే పుచ్చుకున్న వాడవూ నువ్వే.''అకట యిచ్చినవాడు దయ్యంబ కొన్నవాడు దయ్యంబ దీనికి వగవనేల ? '' అంటూ-

శత్రులకు బుత్రులకు నొక్క చందమగుట
పెద్దలకు మంచిగుణమని పేరు కొనగ ,
సకల దానవ సంఘంబు జంపినట్లు
కొడుకు జంపితి మునికోటి కోర్కె దీర్ప (ఉ.హ. ప్రథమ- ౮౮)

ఈ మాట చెప్పింది ఈ కధను స్ఫురింపజెయ్యడానికి పోతన్న ఉత్ప్రేక్ష చేసాడు మొండెం నేలపై పడిన చప్పుడు ఎలా ఉందంటే-

అమ్మా శ్రీ మహావిష్ణువు వరాహమైన ఆ పూర్వకాలంలో (మున్ను) ఏను అతడికి ఇల్లాలిని అని ఇంతకాలమూ నాతో ఉద్ఘోషించావు నిన్ను తలచుకునైనా ఈ శ్రీకృష్ణుడు(విష్ణువు) నన్ను దయచూడలేదే. ఆహాహా (చెల్లంబో) తల తెంచేసాడు- అని నరకాసురుడు తన తల్లి భూదేవి ని ఆక్షేపిస్తున్నట్టుగా ఆ కళేబరం యుద్ధభూమిపై పడింది అది ఆహవక్షోణి రక్తధారలతో ఆయుధాల తళతళలతో ఉద్దీప్తమైన ఆహవక్షోణి

ఉత్ప్రేక్షా కల్పనతో పూర్వగాధను స్ఫురింపజెయ్యడం పోతనగారి గడుసు దనం నాచనసోమన అలా చెయ్యలేదు భూదేవిని ప్రవేశపెట్టి స్వీయపరిచయం చేయించాడు

ఏను వసుంధరన్ యదుకులేశ! దయాకర! సూకరాకృతిం
బూనిన వాడు నీవు నను బొందిన బుట్టినవాడు వీడు. నీ
చే నపరాద్ధుడైన మటి చెప్పెడి దెవ్వరికింక , గిన్క లో
నూనగనీక కుండలము లొప్పగ నొప్పనగొమ్ము క్రమ్మఱన్ . ఉ.హ.।- ౮।

నరకాసుర సంహారంపూర్తి అయింది దేవతలూ మునులూ సంతోషం ప్రకటించారు

కంటిమి నరకుడు పడగా
మంటిమి నే డనుచు పెస నమర్త్యులు మునులున్
మింటం బువ్వులు గురియుచు
బంటింపక పొగడి రోలి బద్మదళాక్షున్ ౨౦౦

నరకుడు ఇంతకాలానికి నేలకు ఒరిగిపోగా (పడగన్) కళ్లారా ఇవ్వేళ చూసాం ఇక బతికిపోయాం (మంటిమి) అంటూ వెంటనే దేవతలూ (మర్త్యులు= మనుష్యులు, అమర్త్యులు=దేవతలు) మునులు ఆకాశంనుంచి (మింటన్) పువ్వులు కురిపిస్తూ పుండరీకాక్షుణ్ణి వరసపెట్టి (ఓలిన్) పొగిడారు పొగడ్తలలో ఎవ్వరూ

బేతపోలు

జాగు చెయ్యలేదు. తడబడలేదు (పంటించు=జాగుచేయు తడబడు)

కురియుట, కరుగుట అనే క్రియలు అంతర్భావిత ప్రేరణార్థకాలు. అంటే ప్రేరణార్థాన్ని సూచించే ప్రత్యయం ఏమీ లేకపోయినా ఇవి ప్రేరణా ర్థాన్ని ఇస్తాయి. దేవతలు పుష్పవృష్టి కురిసిరి అంటే కురిపించిరి అని. వాడు బంగారము కరిగెను అంటే కరిగించెను అని

మింటన్ అనేది సప్తమీవిభక్తి మిన్ను+అందున్- ఔపవిభక్తికం (ంటి)- మింటి+అందున్-సప్తమికి అత్వాదేశం. ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వా దేశంబు బహుళంబుగానగు మింటి+ అన్ అపదాదిస్వర నిత్యసంధి మింటన్= మింటి యందున్ ఆకాశమునందు పువ్వులు కురియుచు అంటే ఆకాశమువలననుండి అని పంచమీ విభక్తి చెప్పాలి కాబట్టి ఇది పంచమ్యర్థక సప్తమి. ' ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు-సూరి అనుమతి.

వ అంత భూదేవి వాసుదేవుని డగ్గఱనేతెంచి జాంబూనద రత్న మండితంబైన కుండలంబులును వైజయంతి యను వనమాలయును వరుణ దత్తంబైన సితచ్ఛ త్రంబు నొక్క మహారత్నంబును సమర్పించి మ్రొక్కి భక్తి తాత్పర్యంబులతోడం గరక మలంబులు ముకుళించి విబుధ వందితుండును విశ్వేశ్వరుండునైన దేవదేవుని నిట్లని వినుతించె 20

అప్పుడు భూదేవి ప్రత్యక్షమయ్యింది. వాసుదేవుణ్ణి సమీపించింది. రత్నాలు పొదిగిన బంగారు కుండలాలను (జాంబూనదము=బంగారం) వైజయంతీ వనమాలనూ వరుణసితచ్ఛత్రాన్నీ (వెల్లగొడుగు) మరొక మహారత్నాన్నీ సమర్పించిం ది భక్తితాత్పర్యాలతో చేతులు ముకుళించి నిలబడింది దేవతల నమస్కారాలు పొందే (విబుధులు=దేవతలు పండితులు) విశ్వేశ్వరుణ్ణి, దేవదేవుణ్ణి ఇలా స్తుతించింది

స్తుతించి-నరకాసురుడి కొడుకు భగదత్తుడున్నాడు, వీడు తండ్రిలాంటి వాడు కాదు నీకు భక్తుడు కాబట్టి వీడికి అభయం ఇమ్మని అభ్యర్థించింది. శ్రీకృష్ణుడు అంగీక రించి భగదత్తుడికి సర్వసంపదలూ ఇచ్చి తాను మాహిష్మ తీ పట్టణంలోకి ప్రవేశించి, బందీలై పడి ఉన్న పదారు వేల రాజకన్యలను విడిపించుకుని ద్వారకాపట్టణానికి తిరిగి వెళ్ళిపోయాడు అక్కడ ఆ రాజ కన్యల అభిమతంమేరకు అందరినీ వివాహం చేసు కున్నాడు 202-2 4

1922లో వావిళ్ళ వారు ప్రచురించిన పోతన భాగవతానికి పీఠిక వ్రాస్తూ శేషాద్రి రమణ కవులు ఈ ఘట్టంగురించి కొన్ని విలువైన వాక్యాలు పలికారు

"సంస్కృత భాగవతమున లేని సత్యభామా సంగ్రామమును బోతరాజు నాచనసోమనాథుని యుత్తర హరివంశమునుండి తీసికొనెను కథాంశము నను కరించినటుల గవితంగూడ నా ఘట్టములో నించుక యనుకరించెను కాని భావ చౌర్యము సుంతయేని కావింపక యొకానొక యెడ క్రొత్త మెఱుంగులు సైతము పచరించియున్నాడు. పలుమారు అభిమానముతో నుత్తర హరివంశము పఠించుటచే

నా ఛాయలు కొలదిగ వచ్చియుండునని తోచుచున్నది ''

భాగవతాంధ్రీకరణంలో వెలిగందల నారయ (౮, ౭ స్కం ధాలు), సింగయ (ఆరవ స్కంధం), గంగయ (అయిదవ స్కంధం)- వీరి హస్తం కనపడు తోంది వీరిలో నారయ- పోతనకు సాక్షాత్తు శిష్యుడు ''పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామదేయ ప్రణీతంబు'' అని సగర్వంగా చెప్పకున్నాడు. తక్కిన ఇద్దరూ శిష్యులో ప్రశిష్యులో నారయకు శిష్యులేమో అని కొందరి ఊహ ఈ స్కంధాలే కాకుండా మరి కొన్ని స్కంధాలలోకూడా అక్కడక్కడా వీరి చెయ్యి ఉంది అని విమర్శ కులు భావిస్తున్నారు ఛందో వ్యాకరణాల రీత్యా దోషాలు దొర్లిన ఘట్టాలు పోతన రచనలు అయ్యుండవనీ వీరెవరో లోపపూరణం చేసి ఉంటారనీ విజ్ఞుల అభిప్రాయం పోతన రచన ఏ కారణంగానో అక్కడక్కడా క్రిమిదష్టం అయిపోతే వీరు పూరించి ఉంటారని ఏమయినా పోతనతో పాటు ఈ కవులుకూడా తెలుగు భాగవతంలో చోటు సంపాదించుకుని స్థిరపడ్డ భాగ్యశాలులు

మొల్ల (క్రీ.శ. 15వ శతాబ్ది చివరి పాదం)

మొల్ల రామాయణము

రామకథను చంపువుగా (గద్య పద్యాత్మక కావ్యం) రచించిన మొట్టమొదటి తెలుగు కవయిత్రి మొల్ల. ఆతుకూరి కేసయసెట్టి ఈమె తండ్రి. ఇంతకు మించి ఈ కవయిత్రిని గురించి కచ్చితంగా మనకు తెలుస్తున్న విశేషాలు ఏమీ లేవు ఏ ప్రాంతము ఏ కాలము అనే అంశాల్లో పరిశోధ కులు చిన్న చిన్న ఆధారాలూ ఆధారాభాసాలూ పట్టుకుని రకరకాల ఊహలూ ప్రతిపాదనలూ చేసారు తిక్కనకు సమకాలికురాలు అనడం దగ్గరనుంచి పెద్దనకు తరవాత కాలానిది అనడంవరకూ వీరి ప్రతి పాదనలు విస్తరించాయి

అవతారికలో ఈవిడ తనని గురించి ఏమీ చెప్పకోలేదు '' ఆతుకూరి కేసయవర తనయను '' అని చెప్పింది ఆయన ''శివభక్తి రతుడు'' అని చెప్పింది. కాండాంత (ఆశ్వాసాంత) గద్యలలో మాత్రం'' ఆతుకూరి కేసయసెట్టి గర్భరత్నాకర రత్న'' అని చెప్పకుంది సెట్టి పదం అదనంగా చేరింది.

పూర్వకవి స్తుతిని బట్టి ఈమె కాలాన్ని నిర్ణయించడానికి కొంత అవకాశం ఉంది సీస పద్యంలో వాల్మీకితో మొదలు పెట్టి కాళిదాసు వరకూ సంస్కృతకవుల్ని చెప్పి ఎత్తు గీతిలో -

స్తుత గుణోద్దాము నాచన సోము, భీము,
నవ్యమంజుల వాగ్ధుర్యు నన్న పార్యు,
రసికుడైనట్టి శ్రీనాథు , రంగ నాథు
దిక్క కవిరాజు, భోజు-నుతించి మించి(I -౨)

అని తెలుగు కవుల్ని గుచ్చెత్తింది. ఇందులో శబ్దాలంకారం చూసు కుందే తప్ప కాలక్రమం పాటించలేదు భోజుడంటే భోజరాజీయం రాసిన అనంతామాత్యుడు కావచ్చు, ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణ దేవరాయలు కావచ్చు ననీ కొందరు అభిప్రాయ పడ్డారు. ''తిక్క కవిరాజును నుతించి దీని మించి '' అని వావిళ్ళవారి పాఠం. అప్పడింక భోజుడి ప్రసక్తి ఉండదు ఈమె పూర్వకవిస్తుతి శ్రీనాథుడూ రంగనాథుడితో ఆగిపోయి నట్టు పెద్దనాదుల్ని స్మరించలేదు అంచేత శ్రీనాథుడికీ పెద్దనకీ మధ్యకాలంలో ఈవిడ ఉండి ఉంటుంది అంటే పదిహేనవ శతాబ్ది చివరి పాదం

చెప్పమని రామభద్రుడు
చెప్పించిన పలుకు మీద జెప్పెద నిది, యె
ల్లప్పుడు నిహపర సాధన
మిప్పణ్యు చరిత్ర - తప్ప లెంచకు డిందున్ (I - ౩)

పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట -- అనే పోతన పద్యాన్ని పోలిన పద్యమిది ఈమె రచనలో పోతనగారికి అనుకరణలు చాలా

ఉన్నాయి అయినా పూర్వకవి స్తుతిలో ఈమె పోతన్నను తలపలేదు అనుకరించడం కన్నా గౌరవప్రకటన ఏముందని కావచ్చు, ఆమెకు పూర్వకవి కాకపోయి ఉండవచ్చు ''తప్పలెంచకు డిందున్'' అని హెచ్చరిక

ఇంక ఈమె నివాసంగురించి – '' విఖ్యాత గోపవరపు శ్రీకంఠ మల్లేశు వరముచేత నెఱి గవిత్వంబు జెప్పగా నేర్చుదాన '' (-12) అని చెప్పింది. ఈ గోపవరం నెల్లూరు జిల్లా రాపూరి తాలూకాలో ఉందిట ఆత్మకూరు సమీపంలో చింతలాతుకూరు అని మరో గ్రామం ఉందిట ఇది ఇంటిపేరు అయ్యిందని. అంటే ఆత్మకూరు లేక ఆతుకూరు పుట్టిన ఊరయితే గోపవరం మెట్టిన ఊరై ఉండవచ్చునని డా.. టి. నాగమణిగారు అభిప్రాయపడ్డారు (మొల్లరామాయణము సమగ్రపరిశీలనము పి హెచ్ డి సిద్ధాంతగ్రంథం అముద్రితం)

మును సంస్కృతంబు తేటగ
దెనిగించెడిచోట- నేమి తెలియకయుండన్
దన విద్య మెఱయ గ్రమ్మఱ
ఘనముగ సంస్కృతము చెప్పగా రుచియగునే (1-15)

సంస్కృత కావ్యాలను తెలుగు చేసేటప్పుడు కవి తన పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ మూలంకంటే బరువుగా సంస్కృతాన్ని గుప్పిస్తే అది పాఠకులకు రుచించదని చెబుతూ-

తేనె సోక నోరు తియ్యన యగురీతి
దోడ నర్థమెల్ల దోచకున్న
గూఢ శబ్ద వితతి కొట్లాట పనియెల్ల
మూగ చెవిటివారి ముచ్చటరయ (1-16)

అది చదవగానే అర్థం స్ఫురించాలి నోరు తియ్యనవ్వాలి అర్థం కాని మాటల్ని కూర్చడం కొట్లాట పని. అది మూగ చెవిటివారి ముచ్చట అవుతుంది. కవిత్వానికి ప్రసన్నత ప్రధాన లక్షణంగా ఈమె భావించింది

కందువ మాటలు సామెత
లందముగా గూర్చి చెప్ప నది తెనుగునకుం
బొందై రుచియై వీనుల
విందై మఱి కానిపించు విబుధుల కెల్లన్ (1-17)

కందువ మాటలు అంటే వ్యంగ్యగర్భితమైన చమత్కారోక్తులు వాటినీ, సామెతల్నీ కూర్చి చెబితే అది తెనుగుకి పొందు అవుతుంది తెలుగు పాఠకులకు రుచిస్తుంది. విబుధుల వీనులకు విందు అవుతుంది

వసుచరిత్రలో రామరాజభూషణుడు గిరికాదేవి వీణానాదాన్ని వర్ణిస్తూ ''వీనులవిందై యమృతపు సోనల పొందై యమంద సుమచల దళినీ గానము క్రిందై

--------(౭- 4) అంటూ ఒక కందం రచించాడు. పై పద్యం చదవగానే పొందై విందై అనే అనుప్రాసలతో ఈ పద్యం జ్ఞాపకం వస్తుంది ఇటువంటి ఆధారాలు చూపించి మొల్ల కాలాన్ని ప్రబంధయుగం చివరికి నెట్టివేసారు కొందరు ఎవరిని ఎవరు అనుకరించారో తేల్చడం ఎలా! బలమైన ఆధారాలతో కాలనిర్ణయం జరిగితే అప్పుడు అనుకరణలు మరికాస్త సహకరిస్తాయి అందాకా కేవలం అనుకరణల్ని బట్టి కాలాన్ని నిర్ణయించడం కుదరదు

మొల్ల రామాయణం పద్య సంఖ్యను బట్టి చూస్తే చాలా చిన్న కావ్యం బాల కాండ మొత్తం అవతారికతో కలిపి నూట ఇరవై గద్యపద్యాల ఏకాశ్వాసం అయోధ్య కాండ మరీ చిన్నది. మొత్తం గద్యపద్యాలు నలభై యొక్కటే అరణ్యకాండ డభై రెండు కిష్కింధ అన్నింటికన్నా చిన్నది కేవలం పాతికే సుందరకాండ రెండు వందల నలభై అయిదు యుద్ధకాండ ప్రథమాశ్వాసం నూట రెండు ద్వితీయాశ్వాసం తొంభై రెండు. తృతీయాశ్వాసం నూట ముప్పై అయిదు. వెరసి మొత్తం కావ్యం ఒకటి రెండు అటూ ఇటూగా ఎనిమిది వందల ముప్పై గద్యపద్యాలు. యుద్ధకాండలో తప్ప మిగతా కాండల్లో కథని బాగా సంక్షేపించింది ఇరవై నాలుగు వేల శ్లోకాల్లో ఉన్న వాల్మీకి రామాయణాన్ని మొల్ల ఎంతగా సంక్షేపించిందో సంఖ్యనుబట్టే తెలుస్తోంది.

రంగనాథ రామాయణం భాస్కర రామాయణం వచ్చిన తరవాతే ఈ మొల్ల రామాయణం వచ్చింది. అయినా ఎందుకనో మరి ఆ ప్రౌఢి ఆ పరిణతి ఆ అనుభవ పరిపాకం ఇందులో కనిపించవు.

పద్దెనిమిది పర్వాలలో సవాలక్ష శ్లోకాలతో ఉన్న మహాభారతాన్ని భట్ట నారాయణుడు సంస్కృతంలో ఆరు అంకాల వేణీ సంహార నాటకంగా కుదించాడు భవభూతి, మురారి వంటి నాటక కర్తలు రామకథను అలాగే సంగ్రహపరిచారు అదే బాణీలో మొల్ల ఈ శ్రవ్య కావ్యాన్ని కూర్చింది అను కోవాలి

యది క్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్య చరితమ్ --- అన్నాడు అనర్ఘరాఘవంలో మురారి దాశరథి లాంటి నాయకుడు ఈ ప్రపంచంలో మరొకడు దొరకడు కనక నేనూ ఆ రామకథనే తీసుకుని నాటకం రచిస్తున్నాను అన్నాడు. ఈ భావాన్ని మొల్ల అనువదించింది. -

రాజితకీర్తి మున్నె రఘు రాము చరిత్రము సత్కవీశ్వరుల్
తేజ మెలర్ప జెప్పుటది తెల్లియు గ్రమ్మఱ జెప్పనేల నాన్-
భూజనవకల్పకం బగుచు భుక్తికి ముక్తికి మూలమైన యా
రాజును స్వామియైన రఘురాము నుతించిన దప్పకల్గునే (1-19)

నుతిస్తే రామనరపాలకుని పెంపునే నుతించాలి తప్ప చిల్లర రాజ లోకం కథలు రచించి ఏమి ప్రయోజనం ఇహమూ పరమా . అనే భక్తి భావం ఒక్కటే ప్రేరణగా మొల్ల ఈ కావ్యం రచించింది. అంతేకానీ ప్రతిభా పాండిత్యాల ప్రదర్శన కోసం రాయలేదు అలాంటి ప్రయత్నమూ చెయ్యలేదు క్లుప్తంగా కథ చెప్పకుంటూ

వెళ్ళిపోయింది యుద్ధవర్ణనలు మాత్రం కాస్త వివరించింది. అందుకని ఏ కాండ లోనూ పది పద్యాలకు విస్తరించిన ఘట్టం రసపుష్టిని పొందిన సన్నివేశం ఒక్కటీ కనిపించదు. కానీ ప్రతికాండలోనూ ఒకటి రెండు పద్యాలు ప్రసిద్ధికెక్కినవి ఉన్నాయి

అయోధ్యాపట్టణాన్ని ఇరవై పద్యాల్లో వర్ణించింది (బాల. 23-43). రాకు మారులను వర్ణించిన పద్యం శ్లేష రూపకానుప్రాణిత మైన శబ్దాలంకారంతో సాగింది.

రాజులు కాంతియందు, రతిరాజులు రూపమునందు, వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు విక్రమకేళియందు, గో
రాజులు భోగమందు, దినరాజులు సంతత తేజమందు, రా
రాజులు మానమందు, నగరంబున రాజకుమారు లందఱున్ (1-33)

(రాజు = చంద్రుడు నాయకుడు శ్రేష్ఠుడు, రారాజు = దుర్యోధనుడు).

ఆ నగరంలో ఉన్న రాజకుమారులు అందరూ లావణ్యంలో (కాంతి యందు) చంద్రులు రూపంలో మన్మధులు దాతృత్వంలో సముద్రులు (వాహిని= నది) సముద్రం మేఘాలకు నీరు దానం చేస్తుంది ప్రాణికోటికి ఆహారం దానం చేస్తుంది. ఇలా సముద్రాన్ని దానగుణానికి ప్రసిద్ధిగా చెబుతారు పరాక్రమంలో సింహాలు భోగాలు అనుభవించ డంలో ఇంద్రులు (గోరాజులు) ఎడబాయని తేజస్సులో సూర్యులు . అభి మానంలో దుర్యోధనులు ఇన్ని సుగుణాలు ఉన్నాయి అయోధ్యారాజ కుమారులకు

రాజపదం అనేకార్థాలలో ఉపయుక్తమయ్యింది కనక శ్లేష. రాజ కుమారు లకు చంద్రాదులతో అభేదం చెప్పింది కనక అభేదరూపకాలు. ఒకే వ్యక్తిని పలుర కాలుగా వర్ణించింది కనక ఉల్లేఖం రాజులు అనేది ఆవృత్త మయ్యింది కనక అనుప్రాస. ఇవి నాలుగూ తిలతండులాల్లా తేలికగా గుర్తించడానికి వీలుగా కలిసి ఉన్నాయి కనక సంసృష్టి

అంతస్సౌందర్య గుణాలు కొన్నీ బాహ్య సౌందర్య గుణాలు కొన్నీ కలగలిసి రూపొందిన ఈ పద్యం నిర్మాణశిల్పరీత్యా అనంతరకవులను చాలా మందిని ఆకర్షిం చింది. అనుకరణలు చాలా వచ్చాయి

ఒక రోజున అయోధ్యలో సూర్యాస్తమయం అయ్యింది క్రమ క్రమంగా చీకట్లు వ్యాపించాయి అట్టి సమయంబున -

తలవరులన్ , నిజాధిపుల దర్పకు నేర్పున గన్నుబ్రామి, యు
త్తల దమ పిన్నపాపల నుదారత నేర్పున నిద్రపుచ్చి , ని
ర్మల కర కంకణావళులు మట్టెలు రట్టుగ మ్రోగ నీక, వి
చ్చలవిడిగా జరించి రొగి జారలతాంగులు మధ్యరాత్రులన్ (2-10)

అర్ధరాత్రి జారకాంతలు విచ్చలవిడిగా ఆ పట్టణంలో సంచరించారుట చేతులకున్న గాజులూ, కాళ్ళకున్న మట్టెలూ గుట్టు రట్టు చేసేట్టు మోగనివ్వకుండా జాగ్రత్త పడ్డారుట అత్తలనూ పిల్లాపాపలనూ నేర్పుగా నిద్ర పుచ్చి వీళ్ళు సంచారానికి

బేతవోలు

బయలుదేరారుట అత్తలనూ పిల్లలనే కాదు తలారులనూ తమ భర్తలనుకూడా మోసగించి మాయచేసి (కన్నుబ్రామి) వచ్చారుట (జారిణులకు భర్తలు అత్తలు పిల్లలు ఏమిటో)అలా ఇద్దరిద్ద రిని మోసగించ గలగడానికి కారణం మన్మథుడి నేర్పు (దర్పకుడు) అతడు కలిగించిన సాహసం. (తలవరులు - తలారులు = రాత్రి పూట కాపలా తిరిగే ఆరక్షకులు) అయోధ్యాపట్టణంలో ఇంతటి స్వేచ్ఛ ఉందని మొల్ల భావించింది జారకాంతలే కాదు సంసారిణులుకూడా ఆ చీకట్లో ఉపభర్తలను చేరుకుంటున్నారట-

సురతము లేక యుస్సురను జోటి, వరుండుడికించు కాంతయున్
సరసత మీఱు చంద్రముఖి, సావడి దంటయు, బేర కత్తెయున్
బరపురుషాభిలాషమును బాయని కోమలి, పోరుకట్టునన్
బరగిన భామ లాది యుపభర్తల గూడి చరించి రయ్యెడన్ (౨-౧౧)

సంభోగానికి నోచుకోక ఉసూరుమంటున్న జోటి భర్తచేతిలో హింసలకు గురిఅవుతున్న(ఉడికించు) కాంత, సరసత పెచ్చు పెరిగిన చంద్రముఖి, మొగసాలకు ఎక్కిన గద్దరి - లేదా - రచ్చబండ పంచాయితీ లో ఒకసారి తప్ప వేయించుకుని రాటుతేలినది (సావడి దంట), బేరకత్తె, పరపురుషాభిలాషను వదుల్చుకోలేని కోమలి, జగడాల కోరులతో తంపుల మారులతో పొత్తుకి (కట్టు) అలవాటు పడిపోయిన భామ - ఇలాంటి వాళ్ళంతా ఉపభర్తలతో కలిసి (మారుమగడు) సంచరించారుట అంతలోకీ భళ్ళునా తెల్లవారెనమ్మా!

సంసారిణులు బాహాటంగా ఇలా జారిణులు కావడం ఆనాటి అయోధ్యలో పరిస్థితి కాదనుకుంటా వాల్మీకి రచనలో లేదు బహుశ ఇది కవయిత్రి కాలంనాటి పరిస్థితో లేకపోతే కల్పనో. ఏమయినా వర్ణన సావకాశం కాకపోతే ''కవయిత్రి - అయోధ్య '' అనే అంశాలు సుకుమార మనస్కుల్ని కొంత ఇబ్బంది పెడతాయి

అదీకాక తలవరులన్ --- అనే పద్యంలో 'నేర్పున' అనేమాట రెండుసార్లు ఒకే అర్థంలో వచ్చింది ఉదారత, నిర్మల ఒగి - అని మూడు వ్యర్థపదాలున్నాయి 'ఉదారత ' యతిస్థానంలో 'నిర్మల' ప్రాసస్థానంలో ' ఒగి ' అనేది యతిస్థానానికి పూరకంగా నిలిచాయి ఇవి పద్యరచనా శిల్పంలోని శైథిల్యానికి నిదర్శనాలు శ్రీనాథుని తరవాత పద్యరచనలో కన్పించవలసిన పరిణతి ఈమె పద్యాలలో అంతగా కనిపించదు కూర్పులో బిగువు తక్కువ

అరణ్యవాసానికి బయలుదేరిన సీతారామలక్ష్మణుల్ని గుహుడు గంగ దాటించాడు. ఆ సమయంలో రాముని కాళ్ళు కడిగాడుట. దానికి కారణం ఏమిటంటే-

సుడిగొని రాముపాదములు సోకిన ధూళి వహించి రాయి యే
ర్పడ నొక కాంత యయ్యెనట, పన్నగ నీతని పాదరేణు వి
య్యెడ వడి నోడ సోక నిది యెట్లగునో యని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయంబు పెంపునన్ (౨-౩౧)

జనకుడు చేస్తున్న యజ్ఞాన్ని చూడటం కోసం, శివధనుస్సును సందర్శిం

చడం కోసం విశ్వామిత్రుడితో కలిసి రామలక్ష్మణులు మిథిలకు బయలుదేరారు. దారిలో గౌతమ మహర్షి ఆశ్రమం చూసారు. అక్కడ రాముని పాదధూళి సోకి అప్పటి వరకూ శిలగా పడి ఉన్న అహల్య మళ్ళీ కాంతగా మారింది శాపవిమోచనం పొందింది. ఇది బాలకాండలో కథ ఈ విషయం గుహుడికి తెలుసు

ఈ రామయ్య పాదధూళి సోకితే రాయి ఒక కాంత అయ్యిందట, ఇప్పుడు ఈతని పాదరేణువు నా నావకు సోకితే ఇది ఏమవుతుందో అని గుహుడికి సంశయం కలిగి ఎందుకయినా మంచిదని భయంతో ముందు గా రాముని పాద పద్మాలను కడిగి ఆ తరవాతే ఓడ ఎక్కనిచ్చాడుట.

ఈ సుకుమారమైన కల్పన అధ్యాత్మ రామాయణంలోది మిథిలా నగరానికి వెడుతున్న రామలక్ష్మణ విశ్వామిత్రుల్ని నది దాటించబోతున్న నావికుడి అంతరంగమిది

క్షాలయామి తవ పాద పంకజం
నాథ ! దారుదృషదోః కిమంతరమ్
మానుషీకరణచూర్ణమస్తి తే
పాదయో రితి కథా ప్రథీయసీ ., (అధ్యాత్మ. బాల . 7-3)

సందర్భం మార్చి గుహుడికి కలిగిన భావంగా ఈ శ్లోకాన్ని అను వదించడం మొల్ల చేసిన మార్పు

శూర్పణఖ రావణుడి దగ్గర సీతా సౌందర్యాన్ని వర్ణించి చెప్పే సందర్భంలో మొల్ల కందువ మాటల కూర్పులో తన నేర్పు చూపించింది.

షట్పదంబుల పైకి సంపంగి పువ్వుల
జలజాతముల పైకి జందమామ
గిసలయంబుల పైకి వెస గలకంఠముల్
సింధురంబులపైకి సింగములను
దొండ పండుల పైకి దొడ్డ రాచిలుకల
వలరు తూడుల పైకి వంచపిండు
బండు వెన్నెల నిగ్గుపైకి చకోరముల్
పవనంబు మీదికి పాపజేని
మరుడు వైరంబు చేసిన మాడ్కి- నలక
నాసికా కరావన చరణ స్వనములు
వర పయోధర మధ్యోష్ఠ వచన బాహు
గమన హాసాక్షు లూర్వారు రమణి కమరె (అరణ్య -25)

ముంగురులు, ముక్కు, చేతులు ముఖం, పాదాలు, కంఠధ్వని, వక్షోజాలు, నడుము, మాటలు, బాహువులు, నడక, నవ్వు, నేత్రాలు, నిట్టూర్పులు, నూగారు - వీటిని వర్ణించింటి. తమలో తమకు పరస్పర శత్రుత్వం ఉన్న వస్తువుల్ని అదే క్రమంలో

వీటికి ఉపమానాలుగా కూర్చింది. ముంగురులు – తుమ్మెదలు, ముక్కు – సంపెంగ ఇలా క్రమం చూడాలి వాటికి శత్రుత్వాన్ని మన్మథుడు కల్పించి ఉంటాడని ఊహ చేసింది (మరుడు వైరంబు చేసిన మాడ్కి).

తుమ్మెదలు సంపెంగ పువ్వుల మీద వాలవు వాలితే వాటికి అనారోగ్యం చేస్తుందిట (దీనిమీద ఆధారపడే నానాసూనవితాన వాసనల -- అనే పద్యం ఆవిర్భవించింది. వసుచరిత్ర) సీతాదేవి ముంగురులు తుమ్మెదల్లా ఉంటే, ముక్కు సంపెంగ పువ్వులా ఉంది

చేతులు పద్మాల్లా ఉంటే, ముఖం చందమామలా ఉంది. చంద్రోద యం అయ్యేసరికి జలజాతాలు ముకుళించుకుపోతాయంటారు. కనక వీటికి వైరం. చరణాలు చిగురాకులు. కంఠధ్వని కోకిలను గుర్తుకు తెస్తుంది. కలకంఠకంఠి. కోకిల చిగురాకుల్ని మేస్తుంది కనక వైరం

పయోధరాలు సింధురాలు గజకుంభాల వంటివని. నడుము సింహం నడుములాగా సన్నగా ఉంటుంది గజసింహాల వైరం సుప్రసిద్ధం.

పెదవి దొండపండులా ఉంటుంది మాటలు చిలక పలుకుల్లా ఉంటాయి. చిలకలు దొండపండుల్ని తింటాయి కనక వైరం.

బాహువులు తామరతూడుల్లాగా ఉంటాయి నడక హంస గమనం. హంసలు (అంచపిండు = హంసల సమూహం) తామర తూడుల్ని తింటాయిట. అందుకని వైరం.

సీతాదేవి నవ్వు పండువెన్నెల్లాగా ఉంటుంది తెల్లగా చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుందని. ఆమె చూపులు చకోరాల్లా ఉంటాయి. స్వచ్ఛమైన చూపుల్ని వెన్నెలపిట్టలతో పోల్చడం ఉంది. చకోరాలు వెన్నెలను త్రాగుతా యంటారు. అంచేత వైరం

ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పవనం. నూగారు కృష్ణ సర్పంలా (పాపటేడు) ఉంది. సర్పం వాయుభక్షణ చేస్తుంది కనక వైరం

ఇలా పరస్పర శత్రుత్వం కలిగిన ఉపమానాలతో ఉపమేయ వస్తువుల్లోని సౌందర్యాతిశయాన్ని ధ్వనింపజేసింది మొల్ల ఉపమానాలు ప్రసిద్ధాలే సాహిత్యంలో ఎక్కడ చూసినా ఇవ్వే కనపడతాయి కానీ పరస్పర వైరం కలిగినవాటిని వరసగా కూర్చడంలో ఉంది ఉక్తిచమత్కారం అయితే రూప వర్ణనలో అవయవాల వరస తారుమారయ్యింది చమత్కారం కోసమని వరసని వదిలేసింది.

కిష్కింధలో వాలి సుగ్రీవులు యుద్ధం చేస్తున్నారు. రాముడు చెట్టు చాటునుంచి వాలిని కొట్టాడు ఈ సన్నివేశాన్ని వర్ణించిన పద్యం –

సాలము పొంత నిల్చి రఘుసత్తము డమ్మురిపోసి శబ్దవి
న్మూలముగాగ విల్ దివిచి ముష్టియు దృష్టియు గూర్చి గోత్ర భృ
త్కీలము వజ్రపాతహతి గూలు విధంబున గూలనేసె న
వ్వాలి బ్రకాశశాలి మృదువందనశీలి సురాళి మెచ్చగన్ (కిష్కింధ-13)

రఘుశ్రేష్ఠుడు మద్దిచెట్టుచాటున నిలబడ్డాడు ధనుస్సుకి అమ్ము తొడిగాడు.

(అరి = అల్లెత్రాడు అరి+పోయు - గసడదవాదేశ సంధి అరివోసి = అల్లెత్రాటికి బాణం తొడిగి ఎక్కుపెట్టి) చెవిదాకా లాగాడు ధనుస్సు మధ్య భాగంలో (లస్తకం) పిడికిలి బిగించి పట్టుకున్నాడు లక్ష్యం మీద దృష్టి సంధించాడు వాలిని కూలనేసాడు ఆ వాలి ప్రతాపశాలి. మృదు వందన శీలం కలవాడు రాముడు చేసిన ఈ పనిని దేవతా సమూహం (సుర+ ఆళి) మెచ్చుకుంది

రామబాణం తగిలి వాలి ఎలా కూలిపోయాడో చెప్పడానికి ఒక దృష్టాంతం - వజ్రాయుధం దెబ్బకి పర్వతపార్శ్వం కూలబడ్డట్టు - అని

ఇందులో శబ్దవిన్మూలముగాగ, గోత్రభృన్మూలము మృదు వందనశీలి అనే పదాలు అన్వయించడంలో కొంత క్లేశం కనపడుతోంది శబ్దవిత్ అంటే శబ్దవేత్త వైయాకరణుడు ఈ అర్థం ఇక్కడ అతకదు శబ్దాన్ని విని తెలుసుకోగలిగిన అవయవం చెవి అది శబ్దవిత్ అనుకుంటే దాని మూలం దాకా విల్లు దివిచి అని అర్థం చెప్పకోవచ్చు ''శబ్దవిన్మూలము దాక విల్ దివిచి '' అని పాఠం ఉంటే మేలు లేకపోయినా చెప్పకోవచ్చు

గోత్రము అంటే పర్వతం గోత్రా స్త్రీలింగమయితే భూమి అని అర్థం గోత్రాభృత్ అంటే భూభృత్ = పర్వతం. దాని కూలము అంటే కొండ చెరియ (ఒడ్డు) అది కూలినట్టుగా వాలి కూలిపోయాడని. ఇంద్రుడు పర్వతాల రెక్కలు ఖండించేటప్పడు వజ్రాయుధం దెబ్బకు పర్వత పార్శ్వం కూలిపోయినట్టు వాలి నేలకు వొరిగిపోయాడని దృష్టాంతం కానీ గోత్రాభృత్ అనడానికి బదులు గోత్రభృత్ అంది మొల్ల (హ్రస్వం)

మృదువందనశీలి అంటే మృదువైనవారికి నమస్కరించే స్వభా వంకలవాడని కలినాత్ముల్ని శిక్షిస్తాడు. మృదుస్వభావుల్ని నమస్కరిస్తాడు వాలి అనుకోవాలి. ఈ విశేషణానికి ఇక్కడ అవసరం కానీ ప్రయోజనం కానీ ఏమీ కనపడవు వాలి, శాలి, శీలి ఆలి, అని అంత్యానుప్రాస కుదరడ మే ప్రయోజనం పైకి మృదువుగా నమస్కరించే శీలం కలవాడు అని తాత్పర్యార్థం చెబితే కొంతవరకూ సబబుగా ఉంటుంది. కానీ వాలికి అటు వంటి స్వభావంలేదు ఎగేస్తే తెగేస్తాననే రకమేనాయె!

లేదా - ప్రతాపశాలి మృదువందన శీలి అనే రెండు పదాలనూ (ద్రుతం ఎలాగా వినపడటం లేదు కాబట్టి ప్రథమాంతాలుగా భావించి) రఘుసత్తమునికి విశేషణాలు చెయ్యవచ్చు రాముడు ప్రతాపశాలి సాధుసంరక్షకుడూ సజ్జనులను గౌరవించేవాడూనూ -మృదువందనశీలి ప్రతాపశాలి, మృదువందనశీలి అయిన రఘుసత్తముడు ''సురాళి మెచ్చగన్ అవ్వాలిన్ కూలనేసె '' అని అన్వయం సుఖంగా కుదురుతుంది

అయితే ఒక్క ఎమెస్కో ప్రతిలో మాత్రం (97) మృడవందన శీలి అనే పాఠం కనపడుతోంది మృడుడంటే శివుడు వాలి ఈశ్వరార్చన కళాశీలి కావచ్చు మొల్లమ్మ శివభక్తి ఇలా ప్రతిఫలించి ఉండవచ్చు

అశోకవనంలో సీతాదేవిని వర్ణించిన పద్యమొకటి చాలా ప్రసిద్ధి కెక్కింది హనుమంతుడు సూక్ష్మరూపంతో వెళ్ళి శింశుపావృక్షంమీదనుంచి మొట్టమొదటి సారిగా సీతాదేవిని దర్శించాడు -

పతి బాసినట్టి యాపదకంటె బలువూలు
వివిధమాయలచేత వేగి వేగి
వీరదానవకోటి వికృతవేషంబులు
కనుగొని చిత్తంబు క్రాగి క్రాగి
తన దిక్కులేమికై తల్లడిల్లుచు నాళ్ళ
లోపల మిక్కిలి లోగి లోగి
కర్ణకఠోరంబుగా నాడు పలుకుల
దొరగెడు కన్నీట దోగి దోగి
రాము దలచు తొంచు, రాముని బేర్కొంచు,
రామ రామ యనుచు రమణి పలుక
గపివరుండు చూచి - కామినీరత్నంబు
సీత యనుచు బొంగె జిత్తమునను (సుందర -40)

ఏ వివరణా అవసరం లేనంత సరళంగా సాగిన పద్యమిది వందల శ్లోకా లలో వాల్మీకి చెప్పిన సారాన్ని ఒక్క సీసంలో ఒడిసి పట్టింది మొల్ల.

రామలక్ష్మణుల శిరస్సులు ఖండించి నెత్తురోడుతూ తీసుకువచ్చి చూపించారు సీతాదేవికి ఆ తల్లి ఎంత భయపడిపోయిందో . ఎంతగా తల్లడిల్లిపోయిందో ఇలాంటి మాయలు చాలా చేసారు

రాక్షసరూపాలే భయంకరంగా ఉంటాయి దానికి తోడు వికృత వేషాలు ధరించిమరీ భయపెట్టారు నిద్రపోతున్నవారిని చంపి తినేవారు పసిబిడ్డలను మెడ కొరికి చప్పరించేవారు - ఇలాంటి పేరు మోసిన రాక్షసులు సీతకు కాపలా ఉన్నారు ఏకాక్షి ఏకపాద, స్థూలకర్ణ, లంబోదరి - ఇలాంటి రూపాలున్న రాక్షసస్త్రీలు చుట్టూ మూగారు సీతను చంపేసి మాంసం ఇప్పడే వాటాలు వేసేసుకుందాం తరవాత తగువు లొస్తాయని ఆమె ముందే చర్చించుకునేవాళ్ళు ఇలాంటి కర్ణకఠోరమైన మాటలకు కన్నీరుమున్నీరుగా విలపించేది రావణాసురుడి మాటలకు సరేసరి వీటన్నింటితో ఆమె హృదయం కాగిపోయింది. ఏకాకినైపోయాను, దిక్కులేని దాన్నయి పోయాను అనే అంతులేని ఒంటరితనం ఒకటి . ఎంత ఆత్మస్థైర్యం ఉంటే ఇన్ని బాధల్ని తట్టుకో గలిగిందో! కష్టాల కడలిలో మునిగి పోతూకూడా ఆశ వదలలేదు జీవితేచ్ఛని చంపుకో లేదు " ఏతి జీవంత మానంద: నరం వర్షశతాదపి " (బతికి ఉంటే నూరేళ్ళకయినా ఆనందం వచ్చితీరుతుంది) అనేది యావత్ప్రపంచానికీ యావత్కాలానికీ పనికి వచ్చే గొప్ప సందేశం .

రాముణ్ణే తలుచుకుంటూ రాముణ్ణే పేర్కొంటూ రామనామం జపిస్తూంటే

చూసి హనుమన్న ఈవిడే సీతాదేవి అని గుర్తుపట్టాడు ఆమెకు నమ్మకం కలగడానికి రాముని రూపాన్ని వర్ణించి చెప్పాడు-

నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు
ధవళాబ్జపత్ర నేత్రములవాడు
కంబు సన్నిభమైన కంఠంబు గలవాడు
బాగైనయట్టి గుల్ఫములవాడు
తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాడు
ఘనమైన దుందుభిస్వనమువాడు
పద్మరేఖలు గల్గు పదయుగంబులవాడు
చక్కని పీనవక్షంబువాడు
కపట మెఱుగని సత్యవాక్యములవాడు
రమణి ! రాముడు శుభలక్షణములవాడు
ఇన్ని గుణముల రూపింప నెసగువాడు
వరుస సౌమిత్రి బంగారువంటివాడు (సుందర- 100)

కంబువు = శంఖము సన్నిభము = సాటిది బాగైన - బాగు= అందము. గుల్ఫము = చీలమండ అరికాళ్ళలో పద్మరేఖలు ఉండటం మహా పురుష లక్షణమని సాముద్రికశాస్త్రం పీనం = దృఢము '' సౌమిత్రి బంగారువంటివాడు'' అనడంలో అతని స్వభావమూ స్వరూపమూ కూడా తెలిసిపోతున్నాయి. కందువ మాటల సామెత ఇది '' అతడి కేమండీ బంగారం ' అని వాడుక జాతీయం. లక్ష్మణుడు బంగారపు రంగుతో ఉంటాడని వాల్మీకి వర్ణన

సీతమ్మ రామయ్యకు పంపిన సందేశం మొల్లమ్మ భక్తికీ కవితాశక్తికీ నిదర్శనం

నిడుద పెన్నెఱివేణి జడలుగా సవరించి
మలిన జీర్ణాంబరం బొలయగట్టి
భూమి రజంబు విభూతి పూతగ బూసి
తన దివ్యమూర్తి చిత్తమున నిల్పి
నిరశన స్థితితోడ నిలిచి, భూశయ్యను
బవళించి నిదుర యేర్పడగ విడిచి
తారకబ్రహ్మ మంత్రంబు పఠింపుచు
గలిన రాక్షసదుర్వ్యగములలోన
నహితలంకా మహాద్వీప గగన (?) సీమ
దపము జేయుచునున్నాను దన్నుగూర్చి
నాకు బ్రత్యక్షమగుమని నాథునకును
విన్నవింపుము సత్త్వసంపన్న! నీవు. (సుందర- 11)

చేతవోలు

ఇక్కడ కవయిత్రిగా మొల్లమ్మకూ సీతమ్మకూ ఇంచుమించు అభేదం రాముడు ప్రత్యక్షమవ్వాలని కోరుకొంటున్నారు. రామదూతను వేడుకొంటున్నారు వాల్మీకంలో సీతమ్మ కోరుకొన్న పద్ధతికీ దీనికీ తేడా ఉంది ఇందులో భక్తిదే పైచెయ్యిగా కనపడుతోంది

సముద్రం లంఘించి వచ్చి రాముని కుశలవార్తనూ ముద్రికనూ అందించిన హనుమన్నను మెచ్చుకుంటూ దీనికి ప్రతిఫలంగా " ---నే నుపకార మేమియున్ దవిలి యొనర్పలేను వసుధాస్థలి వర్ధిలు బ్రహ్మకల్ప ముల్ "(సుందర-07) అని దీవించింది జానకీదేవి అటుపైని తన సందేశం వినిపించింది హనుమంతుడు చిరంజీవి అని హైందవుల విశ్వాసం దాన్ని సీతమ్మ ఆశీస్సుగా కూర్చింది మొల్ల

హనుమంతుడు తిరిగివచ్చాడు రామలక్ష్మణ సుగ్రీవులకు నమస్కరించాడు తాను వెళ్ళివచ్చిన పనిని వివరించాడు-

కంటిన్ జానకి బూర్ణచంద్రవదనన్ గల్యాణి నా లంకలో
గంటిన్ మీ పదపంకజంబులును నే గౌతూహలం బొప్పగా
గంటిన్ మీ కరుణావలోకనము విఖ్యాతంబుగా గీర్తులున్
గంటిన్ మా కపివీరబృందములలో గాంభీర్యపాథోనిధీ! (సుందర-242)

దృష్టా సీతా మయా రామ - అనిపించాడు వాల్మీకి. "దృష్టా" అనే స్త్రీలింగం తోనే సీతను చూసాను అనే అర్థం రామునికి అందేసింది. తెలుగులోకి ఆ అందం అంత క్లుప్తంగా రాకపోయినా "కంటిన్ జానకిన్" అనడంకన్నా క్లుప్తమైన ఎత్తుగడ మరి ఉండదు

జానకిని చూసాను ఆమె కల్యాణిగా (కుశలంగా) ఉంది లంకలో చూసాను మొదటి పాదంతో పని చెప్పడం పూర్తి అయిపోయింది తక్కిన పద్య మంతా ఆ ఆనందావేశంతో అదే బాణీతో పరుగులుతీసింది

రావణాసురుడు రణరంగానికి వస్తున్నాడు రామభద్రునితో తలపడటానికి వస్తున్నాడు ఆ సన్నాహం ఎలా ఉందంటే -

కరిఘీంకారములున్ మహోజవ తురంగ వ్రాత హేషావళుల్
వరకోదండ నినాదముల్ సుభట దుర్వారాట్టహాసంబులున్
గురు శంఖోజ్జ్వలనాదముల్ దశదిశాక్రోశంబుగా నొక్కటై
పరగం బంక్తిముఖుండు దా నడిచె గోపస్ఫూర్తినిఃశ్వాసుడై (యుద్ధ - 2-5)

దశముఖుడు (పంక్తి =పది) కోపంతో బుసలు కొడుతూ వస్తున్నాడు అతనితో పాటు కదలివస్తున్న గజసైన్యం ఘీంకారాలు మహావీ రుల (సుభటులు) అట్టహాసాలు శంఖారావాలు (శంఖ + ఉజ్జ్వల నాద ముల్) ఇవి దశదిశలూ ఆక్రోశిస్తున్నట్టుగా ఒక్కపెట్టున చెలరేగాయి కోలాహలం హోరెత్తిపోయేట్టు వచ్చిపడ్డాడు రావణుడు

తెలుగుకే పెద్దపీట వేస్తానని మొల్లమ్మ చెప్పినా ఇలా ప్రౌఢమైన సంస్కృత సమాసాలు దండిగా గుప్పించి బిగువుగా నడిపించిన పద్యాలుకూడా ఈ రామాయణంలో ఉన్నాయి అవసరాన్ని బట్టీ సందర్భాన్ని బట్టీ భాషలో రచనలో బిగువులగువులు ప్రదర్శించి ఔచిత్యం పాటించింది ఈ పద్యం మొదటి మూడు పాదాల్లోనూ సమాసదీర్ఘతకు సంబంధించి సమతౌల్యం పాటించడం నిర్మాణశిల్పం (చూ నాచన సోమన)

కావ్యారంభంలో ముగ్గురమ్మలనూ ముచ్చటగా మూడు పద్యాల లో స్తుతించింది ఆ స్తుతిలో స్త్రీ దృష్టి అందునా మాతృదృష్టి స్పష్టంగా కనపడుతుంది.

గజాస్యుడూ షడాస్యుడూ (కుమారస్వామి) ఎడపిల్లాడూ పెద పిల్లాడూగా అమ్మను పట్టుకుని వేళ్లాడుతున్నారు నెత్తిమీద చంద్రరేఖను అందుకోడానికని చేతులు చాపుతున్నారు వీళ్ల అల్లరిచూసి ఆ తల్లి పార్వతి నవ్వుకుంటోందిట ఆవిడ జగంబుల తల్లి. ఎంత ఓర్పో

కరిముఖుడుం గుమారుడు వికారపు జేష్టల ముద్దు జూపుచున్
గురువులువాఱుచున్ దళిని గుప్పలు దాటుచు గొమ్ము మోవగా
శిరములు రాయుచున్ గబరి జేర్చిన చంద్రుని బట్టి తియ్యగా
గరములు చాప నవ్వెడు జగంబుల తల్లి శుభంబు లిచ్చుతన్ (-౬)

తరువాత లక్ష్మీదేవిని "కాముని తల్లి" అంది ఇక్కడా మాతృత్వమే అటుపైని సరస్వతిని వర్ణిస్తూ -

మేలిమి మంచుకొండ నుపమింపగ జాలిన యంచనెక్కి వా
హ్యాళి చరించి వచ్చు చతురాస్యు నెదుర్కొని నవ్వు దేరగా
వాలిక సోగ కన్నుల నివాళి యొసంగి ముదంబు చేయు నా
బాలశశాంకశేఖరి కృపామతి భారతి యిచ్చు నిష్టముల్. (౧-౮)

మంచుకొండలాంటి హంసమీద బ్రహ్మదేవుడు షికారు చేసి (వాహ్యాళి) ఇంటికి వచ్చాడు సరస్వతీదేవి ఆప్యాయంగా ఎదురు వెళ్లింది నవ్వులు సోగకన్నుల్లో ప్రతిఫలించి అదే నివాళి అయ్యింది విరించి ఎంతగా నో సంతోషించాడు భర్తను ఇలా ఆనందపరుస్తున్న సహధర్మచారిణిగా కృపామతిగా సరస్వతిని దర్శించింది మొల్ల

అల్లసాని పెద్దన (క్రీ.శ. 1520)

మనుచరిత్ర (ప్రథమాశ్వాసం 49-80)

శ్రీ కృష్ణదేవరాయలవారి ఆస్థానంలో భువన విజయ సభామండపాన్ని అలంకరించిన అష్టదిగ్గజ కవులలో అల్లసాని పెద్దనగారిది అగ్రాసనం స్వారోచిష మనుసంభవం అనే పేరుగల మనుచరిత్ర ఈయన రచన రాయలవారికి అంకితం తెలుగు పంచకావ్యాలలో మనుచరిత్ర తప్పని సరిగా పరిగణనకి వస్తుంది.

ఆంధ్రకవితా పితామహా అల్లసాని పెద్దనార్యా ! అని రాయలవారు సగౌరవంగా పిలిచేవారట అగ్రహారాలతో పాటు గండపెండేర సత్కారంకూడా అందు కున్నాడు ఆ సభలో చెప్పిందిగా '' పూత మెఱుంగులున్- అనే మాలిక ప్రసిద్ధిలోకి వచ్చింది

మనుచరిత్రలో ఏదో ఒక భాగం పాఠ్యాంశంగా పాఠకులకు పరిచయ మయ్యే ఉంటుంది అదీకాక ఈ కావ్యంలో ఉండే కవితా గుణాలనూ అల్లిక జిగిబిగినీ వివరిస్తూ వ్యాసాలూ గంథ్రాలూ చాలానే వెలువడ్డాయి. దీన్ని భ్రమల ప్రబంధంగా నిరూపిస్తూ డా గుండవరపు లక్ష్మీనారాయణగారి వ్యాసం ప్రత్యేక మార్గంలో నడిచింది

మాయా ప్రవరుణ్ణి చూసి వరూధిని ప్రవరుడిగా భ్రమపడటం ఈ కావ్య కథలో అతిప్రధానమైన అంశం. దీనికి సూచకంగానే ఇష్టదేవతా ప్రార్థననుంచి పద్యాలు నడిచాయని వారి ప్రతిపాదన. శ్రీ వక్షోజ కురంగ నాభమెదపై జెన్నొంద విశ్వంభరాదేవిన్ తత్కమాలా సమీపమున బ్రీతిన్ నిల్పినాడో యనంగా అనే తొలి పద్యంలో విష్ణుమూర్తి వక్షస్థలం మీద ఉన్న కస్తూరిముద్రను చూసి సనందనాది మునులు భూదేవి అనుకున్నారు లక్ష్మీ-భూదేవి ఇద్దరూ స్వామివారి గుండెలపై హాయిగా విశ్రమించారనుకున్నారు. అలా భ్రమ పడ్డారు

అంకము జేరి శైల తనయాస్తన దుగ్ధము లానువేళ అనే నాలుగో పద్యంలో గజాస్యుడు సర్పహారాన్ని తామరతూడుగా భ్రమ పడ్డాడు.

ఇలా అవతారికా పద్యాలలో కనిపించే ఈ భ్రమలు కావ్యార్థ సూచకాలు అని గుండవరపువారు సమన్వయించారు.

మార్కండేయపురాణంలో ఉన్న ఈ కథను రాయలవారు పెద్దనకు సూచిం చారు ' అనఘ భవచ్చతుర రచనకు అనుకూలంబున్ (- ౧) అని వివరించారు నీ రచనా స్వభావానికి ఈ కథ అనుకూలంగా ఉంటుం ది అని రాయలవారి సూచన. ''మను సంభవ మరయ రస సముంచిత కథలన్ విన నింపు'' అనేది పై సూచనకు హేతువు. రసవత్క థలు ఉన్నాయి, నీది రసవద్రచన కాబట్టి అనుకూలిస్తుంది అని పెద్దన గారిది రసోక్తి మార్గమని ఆచార్య జి వి సుబ్రహ్మణ్యం గారి నిర్ణయం.

పెద్దనగారి ప్రత్యేకతలను చెబుతూ రాయలవారే -

హితుడవు, చతుర వచో నిధి
వతుల పురాణాగమేతిహాస కథార్థ
స్మృతి యుతుడ వాంధ్ర కవితా
పితామహుడ వెవ్వరీడు పేర్కొన నీకున్ 1-15

ఇందులో పురాణ- ఆగమ- ఇతిహాసాలు అన్నీ తెలుసు అనడం వాటిలో ఉండే కథల పరమార్థాలను నీవు ఎరుగుదు వనడం - ఇవి పెద్దన గారి పాండిత్యానికి సూచకాలు "హితుడవు"అనేది వ్యక్తిత్వానికి కితాబు చతురవచో నిధివి (నిపుణమైన వాక్కులకు గని) అనేది కవితా వ్యక్తి త్వానికి కతపత్రం

"చతుర వచోనిధి ' అనే సమాసంలో 'నిధి' శబ్దం వినపడగానే "సార మతిన్ కవీంద్రులు"-అనే నన్నయగారి పద్యంలో " నానా రుచిరార్థ సూక్తినిధి" అనే సమాసం స్ఫురణకు వస్తుంది ఆ రుచిరార్థ సూక్తులే ఈ చతుర వచస్సులు స్థూలంగా నన్నయ మార్గమే పెద్దనదీను

అనగనగా అరుణాస్పదపురం అది ఆర్యావర్త దేశంలో వరణా నది ఒడ్డున ఉంది ఆ పట్టణంలో సౌధాలు ఆకాశమంత ఎత్తు ఉంటాయి

వరణా ద్వీపవతీ తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం
బరమై సౌధసుధా ప్రభాధవళిత ప్రాలేయరుఙ్మండలీ
హరిణంబై యరుణాస్పదంబనగ నార్యావర్త దేశంబునన్
బుర మొప్పున్ మహి కంఠ హార తరళ స్ఫూర్తిన్ విడంబించుచున్ 1-49

ద్వీపవతి అంటే నది దీవులు కలది అని ఆ నది ఒడ్డున ఈ పట్టణం. సంస్కృతికీ సంపదకూ ఆలవాలం సౌధాగ్రభాగాలతో (వప్ర) ఆకాశాన్ని చుంబిస్తోంది అంతేకాదు రాత్రిపూట ఆ సౌధాల తెల్లనికాంతు లు (సుధాప్రభలు) చంద్రబింబంలో ఉన్ననల్లని మచ్చనుకూడా తెలుపు చేసేస్తున్నాయి

ప్రాలేయము అంటే మంచు రుక్ అంటే కిరణం మంచుకిరణాలు కలవాడు-చలివెలుగు-చంద్రుడు చంద్రమండలంలో మచ్చని-లేడి దుప్పి కుందేలు-ఇలా రకరకాలుగా ఊహించారు చంద్రమండలంలో ఉండే హరిణాన్ని ఈ పట్టణం తన సౌధాల సుధా ప్రభలతో ధవళితం చేస్తోంది.

భూదేవికి ఒక కంఠహారం ఉంటే అందులో నాయకమణిలాగా అరుణాస్పద పురం ప్రకాశిస్తోంది. మహికంఠహార తరళ స్ఫూర్తిన్ విడం బించుచున్ (అనుకరిస్తూ) అరుణాస్పదంబనగ పురమొప్పున్- అని అన్వయం

ఇది కథా ప్రారంభ పద్యం ఇందులో భావి కథా సూచన ఉంది అది ఎలాగంటే-

వరూథిని కామవాంఛను ప్రవరుడు తిరస్కరించాడు తన సచ్ఛీలాన్నీ నిగ్రహాన్నీ చాటుకొన్నాడు. ఇది కథ. ఈ అంశాన్ని సూచిస్తోంది ఈ పద్యం.

వరూధిని అప్సరస అప్సరసలు చంద్రాంశ సంభూతలు వరూధినిలో ఉన్న కామవాంఛ చంద్రునిలో ఉన్న కళంకం. కామాది దుర్గుణాల ను నల్లటి వస్తువులతో సచ్ఛీలాది సద్గుణాలను తెల్లటి వస్తువులతో పోల్చడం పరిపాటి ఇది కవిసమయం. అంచేత చంద్రునిలో ఉన్న నల్లటి మచ్చ వరూధిని కామవాంఛకు ప్రతీక అవుతుంది. అరుణాస్పదపురుడైన ప్రవరు డి సచ్ఛీలానికి ప్రతీక '' సౌధ సుధా ప్రభలు'' వీటి ప్రభావం ఆ నలుపుని తెలుపుచేస్తోంది అంటే భౌమమైన సచ్ఛీలం అభౌమమైన కామాన్ని తిరస్క రించి తన స్వచ్ఛతను ప్రకటించుకొంటోంది- అని వ్యంగ్యం

నిజానికి ఇది జరగడం లేదు ''వప్రస్థలీ చుంబితాంబరమై'' అన్నదీ అంతే. అతిశయోక్తి సంబంధించని వస్తువులు సంబంధించినట్లు చెప్పడం

పురవర్ణనలో చతుర్వర్ణాల వారినీ ప్రస్తావించడం ఒక సంప్ర దాయం వారి వారి వృత్తుల్లో ఎవరెవరు ఎంతటివారో చెప్పడం సమాన ప్రతిపత్తితో సాగిస్తున్న సహజీవనాన్ని సూచించడం దీని ప్రయోజనం

అచటి విప్రులు మెచ్చ రఖిల విద్యాప్రౌఢి
ముదిమది దప్పిన మొదటి వేల్పు
నచటి రాజులు బంటునంపి భార్గవునైన
బింకాన బిలిపింతు రంకమునకు
నచటి మేటి కిరాటు లలకాధిపతినైన
మును సంచి మొదలిచ్చి మనుప దక్షు
లచటి నాలవ జాతి హలముఖాత్త విభూతి
నాదిభిక్షువు భైక్షమైన మాన్చు
నచటి వెలయాండ్రు రంభాదులైన నౌరయు
గాసెకొంగున వారించి కడప గలరు
నాట్యరేఖా కళాధురంధర నిరూఢి
నచట బుట్టిన చిగురు గొమ్మైన జేవ 1-50

ఆ ఊళ్ళో విప్రులు అఖిలవిద్యలలోనూ -వేదవేదాంగాలలో ప్రౌఢులు. బ్రహ్మదేవుణ్ణికూడా మెచ్చనంతటి ప్రౌఢులు. వేదపఠన పరీక్షలో కూచుంటే సాక్షాత్తు వేదస్రష్ట అయిన బ్రహ్మదేవుణ్ణిసైతం ఓడించగలరు. ముదిమి కారణంగా నీకు మది తప్పింది పొమ్మని తిరస్కరించగలరు అంతటి ఘనపాఠులు అంతటి ఘటికులు.

ఆ ఊళ్ళో క్షత్రియులు మహావీరులు భార్గవరామునికి బంటుతో కబురు పంపి అంకానికి (యుద్ధరంగానికి) పిలిపించుకోగలిగిన బింకం ఉంది వాళ్ళకు. భార్గవ రాముడంటే ఇరవై యొక్కసార్లు క్షత్రియుల్ని ఊచకోత కోసినవాడు అంతటివాణ్ణి కూడా సవాలు చెయ్యగల మహావీరులు వీరు

ఆ ఊళ్ళో పెద్ద పెద్ద వైశ్యులు ఉన్నారు మేటి కిరాటులు .వారు కుబేరు డికికూడా పెట్టుబడి పెట్టగలిగినంతటి సంపన్నులు సంచి మొదలివ్వడం అంటే

పెట్టుబడి పెట్టడం లేదా బజానా ఇవ్వడం దీన్నే ''సంచకరము'' అనికూడా అంటారు ముందుగా అది ఇచ్చి కుబేరుణ్ణి పోషించగలగినంతటి లేదా అతడి వ్యాపారం నిల బెట్ట గలిగినంతటి సమర్థులు వీరు.

నాల్గవజాతి అంటే శూద్రులు సకల ప్రాణికోటికీ అత్యవసరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసే అతిప్రధానమైన వృత్తి వీరిది పై మూడు జాతుల వారికీ వీరే అన్నదాతలు నాగేటి కర్రు నుంచి (హలము+ ఆత్త) ఐశ్వర్యాన్ని వీరు సంపాదించి శివుడికికూడా పెట్టగలరు శివుడు భిక్షాటన మూర్తి. ఆదిభిక్షువు అతడికి బిచ్చమెత్తుకోవలసిన అవసరం (భైక్షము) లేకుండా చెయ్యగలరు వీరు. భైక్షాన్ని మాన్పించగలరు అందరూ అంతగా పంటలు పండించే ఉత్తమ కృషీవలులే ఆ ఊళ్ళో శివుడికి సంబంధించి మాట్లాడుతున్నాడు కనక ''విభూతి'' అనే మాటను సార్థకంగా ప్రయోగించాడు.

ఆ ఊళ్ళో వెలయాండ్రుకూడా ఉన్నారు వాళ్ళ నాట్య విద్యావిలాసంలో (నాట్యరేఖా కళాధురంధర నిరూఢిన్) అందెవేసిన చేతులు నాట్యప్రదర్శనకి ప్రారంభసూచకంగా కాసె కొంగు బిగిస్తే చాలు రంభాది అప్సరసలు పోటీకి వచ్చినా (ఒరయన్) ఓడిపోయి తొలగి వెళ్ళిపోవలసిందే నాట్యం దాకా అవసరమే లేదు కాసెకొంగు బిగింపు ఒకటి చాలు వాళ్ళని ఓడించడానికి

ఇంత ఎందుకు - ఆ ఊళ్ళో పుట్టిన చిగురుకొమ్మకూడా చేవకలదే సారవం తమే చిన్నది కదా లేతది కదా లోబరుచుకుందామంటే వీలు చిక్కనిది విప్రబాలుడు కూడా వేదపండితుడు క్షత్రియ శిశువు సైతం మహావీరుడు వైశ్యపుత్రుడైనా మేటి. శూద్రడింభకుడైనా మహాకృషీ వలుడు సానిపాప సైతం నాట్యకత్తె - అని అన్నింటికీ అన్వయించవచ్చు లేదా ఒక్కవెలయాండ్రకే చెప్పవచ్చు '' కొమ్మ '' అంటే స్త్రీ అని కూడా. అంచేత వేశ్యల్లో 'చిగురు కొమ్మ'' అంటే లేత వయసు సాని పిల్ల అనే అర్థం వస్తుంది చిన్న పిల్లకే అంతటి చేవ ఉంటే ఇంక పెద్దవాళ్ళు రంభాదుల్ని కాసెకొంగున వారించగలరంటే-వారించరా మరి !

రాయలవారు వెలయాండ్రని వర్ణించారు పుష్పలావికల్ని వర్ణించారు పెద్దన పుష్పలావికల్ని వర్ణించలేదు వెలయాండ్ర వర్ణనకి ఒక ప్రయోజనాన్ని తరువాత చూపించి కథతో అనుసంధానం చేసాడు

ఇంతకీ ఆ పట్టణంలో ప్రవరుడు ఉన్నాడు. కావ్యకథలో మొదటి నాయకుడు.

ఆ పురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి , భా
షాపర శేషభోగి, వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
క్షాపరతంత్రు, డంబురుహ గర్భ కులాభరణుం, డనారతా
ధ్యాపన తత్పరుండు, ప్రవరాఖ్యు డలేఖ్య తనూ విలాసుడై । -ఉ ।

ఆఖ్య అంటే పేరు. ''ప్రవరుడు'' అనే ఆఖ్య కలవాడు - ప్రవరాఖ్యుడు. ఇలా కాక కొందరు అతడి పేరే ప్రవరాఖ్యుడన్నారు అదొక అభిప్రాయం అనక వరూధినితో మాట్లాడేటప్పుడు ' ఎవ్వతె వీవు' అనే పద్యంలో ''భూసురుడనే బ్రవరాఖ్యుడన్''

అన్నాడు అక్కడా అదే ఇబ్బంది. ప్రవరు డు అనే పేరుగలవాడను అని సమన్వయించ వచ్చు. పైగా సొంత పేరు చెప్పకొనేటప్పడు ''అంటారు'' చేర్చాలి అంటారు పెద్దలు. '' నన్ను ఫలానా అంటారు'' అని చెప్పకోవాలట అందుకని ప్రవరాఖ్యుడన్ అన్నాడేమో

మాయా ప్రవరుడి దగ్గర ఈ పేచీ లేదు గంధర్వుడు వేషం మార్చి'' శాంత రస మొల్కు బ్రహ్మ తేజంబు తోడ బ్రవరుడయ్యె వియచ్చర ప్రవరు డపుడు' (3-7) అనిచెప్పాడు పెద్దన నావుడు ప్రవరుండింట్లను (-67) మార్కండేయంలోనూ ఇలాగే ఉంది కాబట్టి ప్రవరుడే అసలు పేరు సరే

ప్రవరుడు ఆ పట్టణంలో (పురిన్) ఉంటున్నాడు ఎడబాయకుండా ఏనాడూ ఎక్కడికీ వెళ్ళకుండా అలాగే అంటిపెట్టుకుని కాపురం ఉంటున్నాడు.

'' ఆ పురిన్ ఉండు'' అని చెబితే చాలు ''పాయక ఉండున్'' అని చెప్పడం లో ఒక విశేషం ఉంది విడిచిపెట్టి ఎక్కడెక్కడికో వెళ్ళాలని ఏ ఏ దేశాలో చూడాలనీ లోపల ఎంత కోరికగా ఉన్నా విడిచి పెట్టి వెళ్ళలేక పోతున్నాడు- అని వ్యంగ్యం. అందుకే ముక్కూమొగం తెలియని సిద్ధుడె వరో వచ్చి పాదలేపనం ఇస్తే హిమాలయాలకు తుర్రుమన్నాడు ఆ ఊళ్ళోకి కొత్తవారు ఎవరు వచ్చినా ప్రవరుడు వెళ్ళి ''ఏ యే దేశాలు చూసారు? విశేషాలేమిటి ? ఎంత దూరం? '' ఇలాంటి వివరాలన్నీ అడిగి తెలుసుకొని ''వెళ్ళి చూడాలి ఎలాగో ఏమిటో'' అని ఉసూరుమనేవాడట (-57) ఇది ప్రవరుడి అభిరుచి ఈ అభిరుచికి సూచనగా 'పాయక ఉండున్'' అని ముందే చెప్పాడు పెద్దన్న ప్రవరుడికి ఆరు విశేషణాలు వేసాడు ''మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి'' అనేది మొదటిది '' అలేఖ్య తనూ విలాసుడై'' అనేది చివరిది ఇవి రెండూ అతడి రూప సౌందర్యాన్ని తెలియజేప్పే విశేషణాలు ఆ అందం చూసే వరూథిని వలించి మీదపడింది ఆ అందంవల్లే ఇబ్బందిపడ్డాడు- అని సూచించడానికే రెండు విశేష ణాలను ఆద్యంతాలలో బిగించాడు కవి

మకరాంకుడంటే మన్మధుడు శశాంకుడు అంటే చంద్రుడు. ఈయన మకరాంకుడిలా , శశాంకుడిలా మనోజ్ఞమైన మూర్తి కలవాడు చూపరుల మనస్సు ను ఆకట్టుకొనే రూపం అని మన్మధుడిలా ఆకర్షకం గానూ చంద్రునిలా ఆహ్లాదకరం గానూ ఉంటాడు

ఇక్కడ మరో విశేషం చెప్పారు కొందరు మన్మధుడికి ఒక కళంకం ఉంది. చంద్రునికి ఒక కళంకం ఉంది. అందుకే మకరాంక శశాంక అని అంకపదం జోడించి చెప్పాడన్నారు అనీ-మకరాంక శశాంకుల మనస్సులకికూడా అందనంతటి సుందరమూర్తి ప్రవరుడు అని అర్థం చెప్పారు మనః + అజ్ఞ-మనోజ్ఞమూర్తి అని పద విభాగం చేసారు ' అజ్ఞ' లో అకారం పూర్వరూపసంధిలో కలిసిపోయి కనుమరుగ య్యిందన్నారు ఎంత అందగాడని చెబితే అంత మంచిది కదా. అలేఖ్యులు దేవతల్లో ఒక జాతి అందానికి పెట్టింది పేరు అలేఖ్యుల వంటి తనూవిలాసం - శరీర సౌందర్యం - కలవాడని

లేఖ్యము అంటే లిఖింపదగినది చిత్రించి చూపించగలిగిన విలాసం- లేఖ్యవిలాసం. ప్రవరుడి తనూ విలాసాన్ని ఎవరూ చిత్రించి చూపించలేరు ఎంత గొప్ప చిత్రకారుడికీ సాధ్యం కాదు అది అలేఖ్యం లిఖించి చూపించడానికి వీలుకానంతటి తనూవిలాసం కలవాడు అని కూడా కొందరు వ్యాఖ్యానించారు

మొత్తం మీద ఈ రెండు విశేషణాలలో మూడు అంశాలు స్పష్ట పడుతున్నాయి ఒకటి రూపం రెండు కాంతి మూడు విలాసం అవయవాల పొందిక రూపం కదలికలో మగతనం- విలాసం సర్వాంగాలనూ ఆవరించి ఉండే కాంతి-లావణ్యం ఇవి మూడూ పుష్కలంగా ఉన్నాయి ప్రవరుడికి

తక్కిన నాలుగు విశేషణాలూ ఆంతరంగిక గుణాలను- అంత స్సౌందర్యాన్ని వివరిస్తున్నాయి విద్యా విషయకంగా (భాష) అతడు అపర శేషభోగి ఆదిశేషుడే గృహస్థుకి చెప్పిన రకరకాల యజ్ఞాలను చేసి దాని వల్ల నిర్మలమైన ధర్మాచరణం, నిర్మలమైన కర్మాచరణం- ఈ దీక్షకు అతడు పరతంత్రుడు ధర్మాచరణం తప్పడు అందుకే వరూథిని అంతటి అప్సరసను తిరస్కరించగలిగాడు కర్మాచరణమూ వదలడు అందుకోసమనే అగ్ని హోత్రుణ్ణి ప్రార్థించి తిరిగివచ్చాడు రాగలిగాడు బ్రాహ్మణ వంశానికి (అంబురుహగర్భుడు=బ్రహ్మ) ఆభరణం లాంటివాడు

ఎల్లవేళలా (అనారత) శిష్యులకి విద్య బోధించడంలోనే (అధ్యా పన) ఇతడు తత్పరుడు అధ్యయనమూ అధ్యాపనమూ- ఇవి రెండూ బ్రాహ్మణుడికి నిత్యవిధులు వాటిని మానవద్దు-న ప్రమదితవ్యమ్ అని ఉపనిషత్తు అధ్యయనం లేకుండా అధ్యాపనం జరగదు కనక అనారత అధ్యయన-అధ్యాపన తత్పరుడు అని ఈ విశేషణానికి ఫలితార్థం. ఈ రకమైన ధర్మాచరణకీ కర్మాచరణకీ అంతరాయం కలుగుతుందని భయ పడే రేపు చూద్దాం ఇప్పేళకి వెళ్ళిపోదాం అనుకుని- హిమాలయాల నుంచి వెనక్కి బయలుదేరబోయాడు

ఇలా ఈ పద్యంలో ప్రతివిశేషణమూ భావికథలో సార్థకమయ్యేట్టుగా కవి నిబంధించాడు విశేషణాలను సాభిప్రాయంగా ప్రయోగిస్తే దాన్ని పరికరాలంకారం అంటారు (అలంకార: పరికర: సాభిప్రాయే విశేషణే)

ప్రబంధాలలో నాయకుణ్ణి మొదటిసారిగా పరిచయం చేసిన ప్రతి పద్యమూ సమాసబంధురంగానే ఉంటుంది పాఠకుల ఏకాగ్రతను ఆకట్టుకుంటూ అట్టహాసంగా రంగప్రవేశం చేయించడం ప్రయోజనం కావచ్చు. రంగస్థలం మీదయితే దీపాలూ, తెరలూ పక్కవాద్యాలూ ఇవన్నీ సహకరిస్తాయి శ్రవ్య కావ్యంలో అన్ని హంగులూ శబ్దంతోనే కూర్చుకోవాలి సమాసబంధుర రచన ఆ పనిని నెరవేరుస్తుంది ఈ పద్యానికి ఉన్న ప్రసిద్ధే దానికి తార్కాణం మకరాంక శశాంక నిర్మల ధర్మకర్మ, ప్రవరాఖ్యుడ లేఖ్య -అన్నప్పటి శబ్దాలంకారాలు మరింత సహకరించాయి చెవుల పండువు చేసాయి

వాని చక్కదనము వైరాగ్యమున జేసి
కాంక్షసేయు జారజామినులకు

బేతవోలు

భోగ బాహ్యమయ్యె బూచిన సంపెంగ

పొలుపు మధుకరాంగనలకు బోలె. -52

అరుణాస్పద పురంలో వెలయాంధ్రు ఉన్నారని చెప్పాడు. అదిగో ఆ వెలయాంధ్ర ప్రస్తావన ఇక్కడ చరితార్థమవుతోంది

ఆ ఊళ్లో వేశ్యాంగనలు (జారకామినులు. కామిని అంటే కామం కలది అని కాదు 'కమ్' ధాతువుకి కాంతి అని అర్థం కామిని అంటే లావణ్యవతి కాంతిమతి అని మాత్రమే జారకామిని అంటే- లావణ్యవతి అయిన వేశ్య) ప్రవరుడి చక్కదనం చూసి చాలామంది కాంక్షించారుట (కాంక్షసేయు అనేది కామ ప్రవృత్తికి నాగరకమైన అభివ్యక్తి ఔచిత్యానికి పెద్దన పెద్దన్న) కానీ ప్రవరుడికి ఉన్న వైరాగ్యంవల్ల వాళ్ల కోరిక తీరలేదు. ఆ చక్కదనం వాళ్లకి భోగబాహ్యం అయ్యింది దానికి దృష్టాంతం చెబుతున్నాడు- సంపెంగ పువ్వు సొగసు తుమ్మెదలకు(మధుకరాలు) ఎలా భోగ బాహ్యమో అలాగ ఉపమేయం''జారకామినులు'' స్త్రీ వాచకం కనుక 'మధుకరాంగనలకు' అని జాగ్రత్త పడ్డాడు కవి ఆడతుమ్మెదలకూ మగతుమ్మెదలకూ సంపెంగ భోగబాహ్యమే అయినా ఉపమేయాన్ని బట్టి ఉపమానంలో ఔచిత్యం పాటించాడు. (సంపెంగ దగ్గరకు వెడితే తుమ్మెదలు తల తిరిగి పడిపోతాయని లోకప్రసిద్ధి) అతడి చక్కదనానికి సంపెంగ పొలుపు ఉపమానం. భోగబాహ్యమవ్వడం సమానధర్మం. మొత్తం మీద అతడి శీల సౌందర్యాన్ని ఆవిష్కరించే పద్యం. భూలోక జారకామినులకు ఎలా భోగ బాహ్యమయ్యిందో దేవలోక జారకామినికికూడా అలాగే భోగ బాహ్యం అవుతుందని సూచన

యౌవనమందు యజ్వయు ధనాఢ్యుడునై, కమనీయ కౌతుక

శ్రీవిధి గూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ సౌ

ఖ్యావహయై భజింప, సుఖులై తలిదండ్రులు గూడి దేవియున్

దేవరపోలె నుండి యిలు దీర్పగ గాపుర మొప్పవానికిన్ । -53

గృహస్థుగా ప్రవరుడి పరిస్థితిని తెలియజేస్తున్నాడు అతడి ధార్మిక ప్రవృత్తికీ వైరాగ్యానికీ కారణం స్వతస్సిద్ధమైన స్వభావమే తప్ప, చిన్నవయస్సులోనే మీద పడిన బరువు బాధ్యతల లాంటివి ఏవీ కావు సుమా అని సూచిస్తున్నాడు.

యౌవనంలోనే యజ్ఞాలు చేసి యజ్వ అయ్యాడు. పుట్టుకతో ధనాఢ్యుడు కమనీయమైన కౌతుక శ్రీ విధితో-వైవాహిక ఉత్సాహసంపదతో (కౌతుకం=పెండ్లి వేడుక) విధ్యుక్తంగా పెద్దలు అతడికి వివాహం చేసారు కూకటులు కొలిచి చేసారు ఈడూజోడూ కుదిరిందా లేదా అని జుట్టు ముడులు(కూకటులు) కొలిచేవారుట- వెనుకటి కాలంలో కొలిచి ఈడ యిన పిల్లని వివాహం చేసారు ఈయన యౌవనంలోనే యజ్ఞం చేసాడు కనుక ఆవిడ సోమిదమ్మ అయ్యింది. కూరిమి సోమిదమ్మ పరస్పరం కూరిమి ఉంది అని ఆవిడ సౌఖ్యాలు అందిస్తూ సేవిస్తోంది (భజింప)

ప్రవరుడి తల్లిదండ్రులు సుఖంగా(సుఖులై) ఆరోగ్యంగా ఉన్నారు పార్వతీ

పరమేశ్వరుల్లాగా (దేవియున్ దేవర పోలెన్) కూడి ఉన్నారు ఇల్లు తీరుస్తున్నారు ఇంటా బయటా బాధ్యతలన్నీ తల్లిదండ్రులు చూసుకుంటున్నారు ధర్మాచరణం, కర్మాచరణం అధ్యయనం అధ్యాపనం సోమిదమ్మతో ధార్మిక సుఖానుభవం- ఇవి తప్ప ప్రవరుడికి మరొక ప్రమేయం లేదు ఇలాగ అతడి కాపురం సాగుతోంది.

దారి తప్పడానికి కావలసినంత స్వేచ్ఛ సంపత్తి ఉన్నా ప్రవరుడు నైష్ఠికుడు గానే ఉన్నాడు. జారకామినులకు భోగబాహ్యుడుగానే ఉన్నాడు అది అతడి స్వాభావిక శీలం ఆ వైరాగ్యం తెచ్చిపెట్టుకొన్నదీ కాదు. ఎవరో రుద్దినదీ కాదు అందుకే స్థిరంగా నిలబడగలిగింది. ఎక్కడో మిన్నులు పడ్డచోట ఎవరూ చూడని ఏకాంతంలో, తిరిగి ఇంటికి వెళ్ళగలమనే ఆశ లేశమంతకూడా లేని పరిస్థితిలో వరూధిని వంటి అప్సరస వలచి తనంత తానుగా వచ్చి మీద పడినా ప్రవరుడు చలించకపోవడానికి ఈ స్వాభావిక శీలమే ఈ దృఢ చిత్తమే కారణం ఇంక అతడి దినచర్య చెబుతున్నాడు

వరణాతరంగిణీ దరవికస్వర నూత్న
కమల కషాయ గంధము వహించి
ప్రత్యూష పవనాంకురములు పైకొనువేళ
వామనస్తుతి పరత్వమున లేచి,
సచ్ఛాత్రుడగుచు నిచ్చలు నేగి యయ్యేట
నఘమర్షణస్నాన మాచరించి,
సాంధ్యకృత్యము దీర్చి సావిత్రి జపియించి
సైకతస్థలి గర్మసాక్షి కెరఁగి
ఫల సమిత్కుశ కుసుమాది బహుపదార్థ
తతియు నుదికిన మడుగు దోవతులు గొంచు
బ్రహ్మచారులు వెంటరా బ్రాహ్మణుండు
వచ్చు నింటికి బ్రజ తన్ను మెచ్చి చూడ 1 -54

ప్రత్యూషం అంటే ప్రాతఃకాలం - తూర్పుదిక్కున అరుణారుణరేఖలు రాక ముందు తెలతెలవారుతున్న సమయం ఆ ప్రశాంతవేళ చల్లనిపిల్ల తెమ్మెరలు (పవన+ అంకురములు) మెల్లమెల్లగా వీస్తూ ఉంటాయి అరుణా స్పదంలో పక్కనే వరణానది ప్రవహిస్తోంది. కనక ఆ తరంగిణి ఒడ్డున అప్పుడే వికసిస్తూ ఇంకా సగం విచ్చుకునీ (దర వికస్వర) సగం విచ్చు కుంటూ ఉన్న క్రొందమ్ములు ఉన్నాయి (నూత్న కమల ములు). వాటి కషా య గంధం-రవ్వంత వగరు అనిపించే సుగంధాన్ని ప్రత్యూష పవనాంకు రాలు వహించి వీతెంచుతున్నాయి. అది అలా పైకొనే వేళ ప్రవరుడు నిద్ర లేస్తాడు విష్ణుదేవుడి స్తోత్రాలు పఠిస్తూ (వామనస్తుతి పరత్వమున) నిద్రలేస్తాడు

శిష్యులతో సహా (సచ్ఛాత్రుడగుచు) రోజూ వెళ్ళి ఆ నదిలో (అ యే టునం దున్= అయ్యేటన్) అఘమర్షణ స్నానం చేస్తాడు (అఘ+ మర్షణ = తొలగించేది) పాపపం కిలాలను తొలగించే మంత్రాలు చదువుకుంటూ చేసే స్నానం అఘమర్షణ స్నానం దాన్ని

ఆచరించి సంధ్యాసమయంలో సూర్యుడి కి చెయ్యవలసిన అర్ఘ్యతర్పణ ప్రదానాలు నిర్వహించి (సాంధ్య కృత్యమున్ తీర్చి), గాయత్రీ మంత్రాన్ని (సావిత్రిన్-సవిత్ర) జపించి ఇసుక తిన్నె మీద నిలబడి కర్మసాక్షి సూర్యభగవానుడికి నమస్కరించి (ఎఱగి) ఆ తరువాత తన శిష్యులతో కలిసి (బ్రహ్మచారులు వెంటరాన్) ఇంటికి వచ్చేవాడుట సమీపంలో దొరికిన ఫలాలు సమిధలు దర్భలు (కుశలు) కుసుమాలు ఇటువంటి పూజా ద్రవ్యాలను సేకరించి కొందరు శిష్యులు తెస్తున్నారు. మరి కొందరు ఉతికిన మడుగు దోవతులు పట్టుకొని గురువుగారి వెంట నడుస్తున్నారు ఇలా శిష్య పరివారం వెంటరాగా ఆ బ్రాహ్మణుడు నడుచు కుంటూ ఇంటికి చేరుకొనేవాడు

ప్రవరుడు ఇంత నిష్ఠగా ఉండటం, శిష్యులకి విద్యాబోధన చెయ్యడం క్రమశిక్షణ- ఇవన్నీ గమనించి ప్రజలు సంతోషించి ప్రవరుణ్ణి మెచ్చుకుంటూ చూసే వారట వారి చూపులో ఆ మెప్పుదల కనిపించేది. అంటే పట్టణ పౌరులు అతడిపట్ల గౌరవంగానూ బాధ్యతాయుతంగానూ మెలిగే వారని "ప్రజ తన్ను మెచ్చిచూడ" అని ముగించడంలో వ్యక్తి బాధ్యత- సంఘ బాధ్యతలు వాటి పరస్పర సంబంధం- ఈ స్ఫురణ ఉంది

ప్రజలు మెచ్చుకున్నారంటే ప్రజానాయకుడూ మెచ్చుకుంటాడు ఆ మెప్పు సత్కారాలుగా సమ్మానాలుగా ఆవిష్కృతమవుతుంది

శీలంబున్ గులమున్ శమంబు దమముం జెల్వంబు లేబ్రాయమున్
బోలం జూచి యితండు పాత్రుడని యే భూపాలు డీ వచ్చినన్
సాలగ్రామము మున్నుగా గొనడు -మాన్యక్షేత్రముల్ పెక్కు చం
దాలం బండు నొకప్పుడుం దఱుగ దింటం బాడియుం బంటయున్ ।-౮౮

అతడి శీలాన్ని చూసి, కులాన్ని చూసి అంతరింద్రియ నిగ్రహాన్ని (శమము) గమనించి, బాహ్యేంద్రియ నిగ్రహాన్ని (దమము) గుర్తించి, సౌందర్యాన్ని (చెల్వంబు) వీక్షించి లేత వయస్సుని- యౌవనాన్ని పరిశీలించి ఇతడు పాత్రుడు- అర్హుడు అని ఏ రాజుగారైనా ఏదైనా ఇవ్వడానికి వస్తే (ఈన్ వచ్చినన్) ప్రవరుడు అంగీకరించేవాడు కాదు కనీసం సాలగ్రామ దానమైనను స్వీకరించేవాడు కాదు

దానం పట్టినవాడు ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలి సాలగ్రామం మాత్రం విష్ణుస్వరూపం. ఇది దాతకీ ప్రతిగ్రహీతకీ కూడా శుభప్రదం. కాబట్టి దీనికి ప్రతిగ్రహీత ప్రాయశ్చిత్తం చేసుకోనవసరం లేదు. అయినా దాన్నికూడా స్వీకరించేవాడు కాదుట అప్రతిగ్రహం ప్రవరుడికి దృఢమైన నియమం అని.

దీనికి కారణం చెబుతున్నాడు- పలు విధాలుగా పండే సారవంతమైన పొలాలు-(మాన్యక్షేత్రముల్) ఉన్నాయి అతనికి. పాడికీ పంటకీ ఇంటిలో ఏనాడూ (ఒకప్పుడున్) ఏ లోటూ లేదు. అందుకని చెయ్యి చాపవలసిన అవసరం అతడికి రాలేదు

ఇప్పటివరకూ ప్రవరుణ్ణి చెప్పాడు ఇప్పుడు కూరిమి సోమిదమ్మ మంచి

తనం చెబుతున్నాడు. అన్నీ సమృద్ధంగా ఉన్నా ఇంట్లో వండిపెట్టే వసతి లేకపోతే ఎలా?

వండనలయదు వేవురు వచ్చిరేని
నన్నపూర్ణకు నుద్దియౌనతని గృహిణి ,
యతిథు లేతేర నడికి రేయైన బెట్టు
వలయు భోజ్యంబు లింట నవ్వారి గాగ 1-56

ఒక్కసారిగా వెయ్యిమంది (వేవురు) భోజనాలకు వచ్చినా ఆవిడ వండ టానికి అలిసిపోదు. బద్ధకించదు అన్నపూర్ణాదేవికి సాటివస్తుంది అతని భార్య (గృహిణి) అతిధులు అర్ధరాత్రి వేళ వచ్చినాసరే వండిపెడుతుంది కావలసిన పదార్థాలు ఇంటిలో ఎప్పడూ సమృద్ధిగా (అవ్వారిగా గన్) ఉండటంతో సోమిదమ్మ గారు సాక్షాత్తు అన్నపూర్ణ అయ్యింది

నాయకుణ్ణి పాఠకుల హృదయాల్లో నిక్షేపించడం అయ్యింది ఇప్పడు కథాగమనానికి అవసరమైన సన్నివేశం అందిస్తున్నాడు

తీర్థ సంవాసు లేతెంచినారని విన్న
నెదురుగా నేగు దవ్వంత యైన
నేగి తత్పదములకెఱగి యింటికి దెచ్చు
దెచ్చి సద్భక్తి నాతిథ్యమిచ్చు
నిచ్చి యిష్టాన్న సంతృప్తులగా జేయు
జేసి కూర్చున్నచో జేరవచ్చు
వచ్చి యిద్ధరగల్గు వనధి పర్వత సరి
త్తీర్థమాహాత్మ్యముల్ దెలియ నడుగు
నడిగి యోజన పరిమాణ మరయు. నరసి
పోవలయు జూడ ననుచు నూర్పులు నిగుడ్చు
ననుదినము తీర్థ సందర్శనాభిలాష
మాత్మ నుప్పొంగ నత్తరుణాగ్ని హోత్రి 1-57

తీర్థయాత్రలు చేసినవారెవరైనా అరుణాస్పదం వైపు వస్తున్నారని తెలిస్తే చాలు ఎంత దూరమైనా ఎదురువెడతాడు వెళ్ళి వారి పాదాలకు నమస్కరిస్తాడు. నమస్కరించి (ఎఱగి) ఇంటికి ఆహ్వానించి తీసుకు వస్తాడు తెచ్చి మంచి భక్తితో ఆతిథ్యం ఇస్తాడు ఇచ్చి ఇష్టాన్న సంతృప్తుల్నిగా చేస్తాడు చేసి వారు విశ్రాంతిగా కూచున్న సమయంలో దగ్గరకి చేరతాడు చేరి- ఈ భూమి మీద ఉన్న (ఈ ధరన్ కలుగు) సముద్రాలు పర్వతాలు, నదులు (సరిత్) తీర్థాలు వాటి మహత్తులూ తెలియ జెప్పమని అడుగు తాడు. అడిగితే వారు చూసినవి చెబుతారు అవి ఇక్కడికి ఎన్ని యోజనాల దూరంలో ఉన్నాయో అడిగి తెలుసుకొంటాడు అరసి- నేనుకూడా చూడటానికి వెళ్ళాలి అంటూ నిట్టూర్పులు విడుస్తాడు (చూడన్ పోవలయుననుచు ఊర్పులు నిగుడ్చున్). ఈ పద్యంలోముక్త పదగ్రస్తం అనే అలంకారం ఉంది

తరుణ వయస్సులో ఉన్న ఆ నిత్యాగ్నిహోత్రుడి మనస్సులో ఎప్పుడూ ఒకటే కోరిక వెళ్ళాలి తీర్థాలు సందర్శించాలి అనే అభిలాష రోజురోజుకీ ఆత్మలో ఉప్పొంగుతోంది

ఈ విధముగ నభ్యాగత
సేవా పరతంత్ర సకల జీవనుడై భూ
దేవ కుమారకు డుండం
గా వినుమొకనాడు కుతపకాలము నందున్ 1-౫౩

(కుతపకాలము= దివసాష్టమ భాగం లేదా ముహూర్తం చూ-శబ్దకల్పద్రుమః)

అభ్యాగతః స్వయం విష్ణుః '' అన్నారు కనక అతిథి అభ్యాగతుల్ని ఈ విధంగా సేవించడానికే అంకితమైన సమస్త జీవితమూ కలవాడై ఆ యువ బ్రాహ్మణుడు కాలక్షేపం చేస్తూ ఉండగా- ఒక రోజున కుతప కాలంలో ఏం జరిగిందంటే, విను

మార్కండేయ పురాణ కధను మార్కండేయుడు క్రోష్టికి చెబుతున్నాడు. కాబట్టి ఇక్కడ విను అంటే క్రోష్టి! సావధానంగా వినమని హెచ్చరిక ఉత్కంఠను పెంచే అంశం రాబోతోంది కనక ఈ హెచ్చరిక.

కుతపకాలం అంటే ఏది అని చాలా చర్చలు జరిగాయి మధ్యాహ్నం రెండు గంటలవేళ అని కొందరన్నారు అప్పుడు బయలుదేరిన ప్రవరుడు హిమాలయాలకు వెళ్ళి అక్కడ చాలా ప్రాంతం చూసి - పయి పయిన్ మధ్యాహ్నముం దెల్పెడిన్ (౨- ౨), కాబట్టి ఇప్పటికి ఇంటికి వెళ్ళిపోతాను మిగతా విశేషాలు రేపు వచ్చిచూస్తాను- అంటాడు మరి అప్పుడు మధ్యాహ్నం అయ్యిందంటే ఇంటిదగ్గర బయలుదేరిన వేళ మధ్యాహ్నం రెండుగంటల సమయం ఎలా అవుతుంది ? కాబట్టి కుతపవేళ అంటే ఇంకా ముందే అయ్యుండాలి అని మరికొందరు భావించారు ఆ కుతపవేళలో ఏం జరిగిందంటే-

ముడిచిన యొంటి కెంజడమూయ ముప్పన్నె
మెకము తోలు కిరీటముగ ధరించి
కకపాల కేదార కటక ముద్రిత పాణి
గుబుచ లాతాముతో గూర్చి పట్టి
యైణేయమ్మైన యొడ్డాణంబు లవణిచే
నక్కళించిన పొట్ట మక్కళించి
యూరకూటచ్ఛాయ నవఘళింపగ జాలు
బడుగు దేహంబున భస్మమలది
మిట్టయురమున నిడుయోగ పట్టెమెఱయ
చెవుల రుద్రాక్ష పోగులు చవుకళింప
గావి కుబుసంబు జలకుండికయును బూని
చేరె దద్దేహ మౌషధ సిద్ధు డొకడు 1-౫౪

ఒక ఔషధ సిద్ధుడు ఆ ప్రవరుడి ఇంటికి వచ్చాడు హటాత్తుగా ఊడి పడ్డాడు. సరాసరి ఇతడి ఇంటికే వచ్చాడు (ఈ రెండు కారణాల వల్లా - ఒకప్పుడు వరూధినితో తిరస్కృతుడైన గంధర్వుడే ఇక్కడికి సిద్ధుడు గా వచ్చాడనీ అనక అతడే మాయాప్రవరుడయ్యాడనీ కొందరు ఊహించారు.) ఆ సిద్దుడి వేషం చిత్రంగా ఉంది

తైలసంస్కారం లేక రాగిరంగుకి (ఎరుపు) మారిపోయిన ఒంటి జడ (కెంపు+ జడ) దాన్ని కప్పతూ పులితోలు (మువ్వన్నె మెకము= మూడు రంగుల్లో ఉండే మృగం -పెద్దపులి) కిరీటంగా ధరించాడు

ఒక చేతిలో సంచి (కకపాల) పట్టుకున్నాడు ఆ చేతికే కేదార కటకం' (పంచలోహాలతో శివలింగముద్రతో ఉన్న కడియం లేదా కంకణం) ఉంది అర్ధ చంద్రా కారముఖం గల ఒక పొట్టి దండాన్ని (లాతాము) అదే చేతి చంకలో కూర్చి దగ్గరగా పట్టుకున్నాడు జపమాల తిప్పేటప్పుడు చేతి కింద బోటుగా ఉపయోగించే యోగ దండం కావచ్చు నిది (లాతము రూపాంతరం)

దుప్పితోలుని (ఏణీ= ఆడలేడి ఐణేయం= ఆడలేడి తోలుతో చేసింది) ఒడ్డాణంగా ధరించాడు వెన్నుకి అంటుకుపోయిన పొట్టను (అక్కళించిన పొట్టన్) ఆ తోలుపట్టా బిగింపుతో (లవణి చేన్) లావుగా ఉబ్బించి కనిపించేటట్టు చేసుకున్నాడు (మక్కళించి=లావెక్కించి).

ఇత్తడి రంగులో ఉన్న (ఆరకూట+ ఛాయ) సన్నటిదేహం నిండా విభూతి పులుముకున్నాడు. (బడుగుదేహం= బక్క శరీరం) ముందుకు పొడుచుకువచ్చి ఎత్తు గా ఉన్న వక్షఃస్థలం మీద(మిట్ట ఉరము) పొడవైన యోగ పట్టి జందెంలా వేలాడుతోంది. చెవులకి రుద్రాక్షపోగులు చవుకళి స్తున్నాయి (ఊగిసలాడుతున్నాయి) కావిరంగు కుబుసాన్ని (పొడుగాటి కావిచొక్కా) ధరించాడు (కూర్పాసము=కుబుసము) జల కుండికను (కమండలువో కాబేటికాయలాంటిదో) పట్టుకున్నాడు ఇలాంటి రూపంతో ఒక ఔషధ సిద్ధుడు వచ్చాడు (కళాపూర్ణోదయంలో మణిస్తంభుడిదీ ఇంచుమించు ఇదే వేషం)

ఇట్లు చనుదెంచు పరమ యోగీంద్రు గాంచి
భక్తి సంయుక్తి నెదురేగి ప్రణతుడగుచు
నర్ఘ్య పాద్యాది పూజనం బాచరించి
యిష్టమృష్టాన్న కలన సంతుష్టు జేసి -౬౦
ఎందుండి యెందు బోవుచు
నిందుల కేతెంచినార లిప్పడు ? విద్వ
ద్వందిత ! నేడుగదా మ
మ్మందిరము పవిత్రమయ్యె, మాన్యుడనైతిన్ -౬౧
విద్వాంసులచేత నమస్కరింపబడుతున్నవాడా ! ఎక్కడినుంచి ఎక్కడికి

వెడుతూ ఇప్పుడు ఇక్కడికి వచ్చారు తమరు ? ఇవ్వేళ కదా మా గృహము పావన మయ్యింది నేను మాన్యుణ్ని అయ్యాను.

మీ మాటలు మంత్రంబులు,
మీ మెట్టిన యెడ ప్రయాగ, మీ పాద పవి
త్రామల తోయము లలఘు
ద్యోమార్గ ఝరాంబు పావరుక్త్యము లుర్విన్ 1-62

స్వామీ మీ మాటలే మంత్రాలు మీరు కాలుపెట్టినచోటు ప్రయాగ (అంతటి పవిత్రస్థలం అని) మీ కాళ్లు కడిగిన నీళ్ళు ఆకాశ గంగాజలానికి భూమిమీద పునరుక్తులు వాటికంటే రెట్టింపు పవిత్ర మైనవి అని

వానిది భాగ్యవైభవము, వానిది పుణ్యవిశేషమెన్నియున్,
వాని దవంధ్యజీవనము, వానిది జన్మము వేలు సేయు తె
వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగి జనంబు పావన
స్నానవిధాన్న పానముల సంతస మందుచు బోవు నిచ్చలున్ ।-63

అనన్య భావంతో (వేలుసేయక) ఎవడి ఇంటిలో అయితే రోజూ (నిచ్చలున్) మీవంటి యోగీశ్వరులు స్నానాలు చేసి అన్నపానాదులు స్వీకరించి సంతోషంతో వెడుతూ ఉంటారో వాడిదీ భాగ్య వైభవం అంటే వాడిదీ పుణ్యవిశేషమంటే! వాడిదీ చరితార్థజీవితం అంటే వాడిదీ జన్మమంటే

మౌనినాథ! కుటుంబ జంబాల పటల
మగ్న మాదృశ గృహమేధి మండలంబు
నుద్ధరింపగ నౌషధ మొండు గలదె!
యుష్మ దంఘ్రి రజోలేశ మొకటి దక్క. 1-64

ఓ మునీశ్వరా! సంసార రూపమైన పెద్ద బురద గుంటలో (జంబాల పటలం) మునిగిపోతున్న మావంటి గృహస్థుల్ని ఉద్ధరించాలంటే మీ దివ్య పాదరజోలేశం (కాలిదుమ్ము కణం) తప్ప మరొక ఔషధం ఉందా?

బురదలో ఉన్నవాణ్ని పొడిదుమ్మే ఉద్ధరిస్తుంది బురద తడి ఆరిపోయి బయటపడతాడని దీన్ని సారూప్యౌషధ సిద్ధాంతం అంటారుట రోగానికీ ఔషధానికీ సారూప్యం ఉండాలి అప్పుడే రోగం కుదురుతుంది అలాగ కుటుంబ జంబాలానికి పాదరేణువే మందు

ఈ మాదిరిగా పొగిడాడు ప్రవరుడు వాటిల్లో నిజమెంతో అబద్ధమెంతో గానీ ఒక రకం కాకువుతో మాట్లాడితే ఇవి వెక్కిరింపుగా కనిపిస్తాయి ఆ వాలకాన్ని చూసి ఆటపట్టిస్తున్నాడేమో ప్రవరుడు అనిపిస్తుంది కానీ ప్రవరుడిది అటువంటి స్వభావం కాదు గంభీరుడు అంచేత ఇవి భక్తితో నిజమైన వినయంతో మాట్లాడుతున్న మాటలే

నావిని ముని యిట్లను -వ
త్సా! వినుమావంటి తైర్థికావళి కెల్లన్

మీ వంటి గృహస్థుల సుఖ
జీవనమున గాదె తీర్థసేవయు దలపన్ -౮౭

అనగా విని (నాన్ విని) ఆ సిద్ధుడు ఇలా అన్నాడు నాయనా విను ఆలోచించి చూస్తే మాలాంటి తీర్థయాత్రికులకు (తైర్థికులకు) అందరికీ నిరాటంకంగా తీర్థ సేవ జరుగుతోందీ అంటే అది మీలాంటి గృహస్థుల సుఖజీవనంవల్లనే కదా మీరు సుఖంగా ఉండి మమ్మల్ని ఆదరించి పోషిస్తూ ఉంటే మాకు తీర్థయాత్రలు సాగుతున్నాయి లేకపోతే ఆకులూ అలములూ తింటూ ఎక్కడివాళ్ళు అక్కడ కూచోవలసిందే. లేదా అడవుల్లోకి పోవలసిందే అని

కెలకుల నున్న తంగెటి జున్ను - గృహమేధి
యజమాను డంకస్థితార్థ పేటి
పండిన పెరటి కల్పకము - వాస్తవ్యుండు
దొడ్డి బెట్టిన వేల్పుగిడ్డి - కాపు
కడలేని యమృతంపు నడబావి- సంసారి
సవిధ మేరు నగంబు - భవన భర్త
మరుదేశ పథ మధ్యమప్రప- కులపతి
యాకటి కొదవు సస్యము కుటుంబి
బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటి పరివ్రాజకాతిథి క్షపణ కావ
ధూత కాపాలికాద్యనాధులకు గాన
భూసురోత్తమ! గార్హస్త్యమునకు సరియె ॥ । -౮౮

ఓ బ్రాహ్మణోత్తమా ఆశ్రమాలు నాల్గింటిలోకీ గృహస్థాశ్రమమే (గార్హస్థ్యము) గొప్పది. తక్కిన అన్ని ఆశ్రమాలవారికీ ఇదే ఆధారం చెవిటి కుంటి (పంగు) గుడ్డి భిక్షువులు బ్రహ్మచారులు జటాధారులు, పరివ్రాజకులు, అతిథులు, క్షపణకులు అవధూతలు కాపాలికులు- ఈ మొదలైన అనాధులకు అందరికీ గృహమేధి (యజమానుడు, వాస్తవ్యుడు కాపు సంసారి భవన భర్త, కులపతి, కుటుంబి - ఇవి పర్యాయపదాలు) దగ్గరలో ఉన్న తంగేటిజున్ను లాంటివాడు (చేతితో తీసుకోవచ్చునని) ఒడిలో ఉన్న ధనపేటిక (డబ్బుపెట్టె) పెరటిలో ఉండి పండిన కల్పవృక్షం. దొడ్డిలో కట్టేసుకున్న కామధేనువు (వేల్పుగిడ్డి) అంతులేని అమృతకూపం అందుబాటులో ఉన్న మేరుపర్వతం ఎడారిదారిలో (మరుదేశ పథం) చలి వేంద్రం (ప్రప) ఆకలికి అమిరే పంట - అన్నీ అభేద రూపకాలు

ఇంత గొప్పది గృహస్థాశ్రమం గృహమేధిగా ఉంటూ నువ్వు సన్యాసుల్ని మమ్మల్ని పొగుడుతావేంటి పిచ్చివాడా అని సిద్ధుడి అభిప్రాయం ఆయన లౌక్యంగా అంతసేపు పొగిడితే ఈయన అంతకన్నా లౌక్యంగా క్షణంలో సర్దుబాటు చేసేసాడు నువ్వే గొప్పవాడివి అని తేల్చేసాడు. ఇది ఒకరితో ఒకరికి పనులు ఉండి లేదా అటువంటి

ఆశలుండి పరస్పరం పొగుడుకోవడంలా కనబడుతుంది కానీ మాటల్లో నిజంకూడా లేకపోలేదు

నావుడు బ్రవరుండిట్లను-
దేవా! దేవర సమస్తతీర్థాటనమున్
గావింపుదు రిలపై నటు
గావున విభజించి యడుగ గౌతుక మయ్యెన్ -67

ఏమయితేనేమి సిద్ధుడు అలా అనగానే ప్రవరుడు అందుకున్నాడు. దేవా తమరు ఇప్పటికి ఈ భూమి మీద సమస్త తీర్థాలనూ దర్శించి ఉంటారు (కావింపుదురు-తద్ధర్మార్థకక్రియ కాబట్టి భూతార్థం చెప్పవచ్చు) అలా కాబట్టి - మిమ్మల్ని విడమర్చి (విభజించి) అడగాలనే కుతూహలం కలుగుతోంది. విడి విడిగా ఏ తీర్థానికి ఆ తీర్థం వివరాలు అడిగి తెలుసుకోవాలనిపిస్తోంది అని

ఏయే దేశములన్ చరించితిరి, మీ రేయే గిరుల్ చూచినా,
రేయే తీర్థములందు గ్రుంకిడితి, రేయే ద్వీపముల్ మెట్టినా,
రేయే పుణ్యవనాళి ద్రిమ్మరితి, రేయే తోయధుల్ డాసినా,
రాయా చోటులగల్గు వింతలు మహాత్మా! నాకెఱింగింపరే. -68

ఈ పద్యాలు- సంభాషణలు కనక చాలా సులువుగా అర్థమయ్యే శైలిలో ఉన్నాయి దూరాన్వయాలు ఉండవు ఉచ్చారణ కాకుపుతో చదువుకోవడానికి అనువైన రచన తిరిగిన చోట్లు చూసిన వింతలూ అన్నీ చెప్ప మన్నాడు. ప్రవరుడు అడిగింది దివ్యక్షేత్రాలు మాత్రమే కాదు. తీర్థాలూ పుణ్యవనాలూ అడిగాడు తక్కినవి అన్నీ ప్రకృతి రామణీయకానికి ఆటపట్టులైన స్థలాలే వీటిలో ప్రథమస్థానం పర్వతాలది(గిరుల్) చరమస్థానం సముద్రాలది అరుణాస్పదం దరిదాపుల్లో ఇవి రెండూ లేవు ఎక్కడో ఉన్నాయని విన్నాడు చదివాడు వెళ్ళి చూడాలని కుతూహలం. ఆ ఎత్తూ ఆ లోతూ ఆ వైశాల్యం ఆ గాంభీర్యం ఎలా ఉంటాయో అని ఆశ్చర్యం

నిజానికి కావి కూర్పాసంతో వచ్చిన గోసాయిని అడగాల్సిన విశేషాలు కావు ఇవి పుణ్యక్షేత్రాలనుగురించి అడగాలి. క్షేత్రమాహాత్మ్యాల గురించి అడగాలి. కానీ ప్రవరుడు అలా అడగలేదు దీనికి కారణం అతడి మనస్సులో ఉన్న కోరిక. ఆ సిద్ధుణ్ణి చూస్తే ఇవ్వే అడగాలి అనిపించిందేమో కూడా.

అదీకాక గిరులూ-తరులూ, నదులూ-జలనిధులూ ద్వీపాలూ -అంతరీపాలూ అన్నింటా దివ్యత్వాన్ని దర్శించి ఆరాధించే భారతీయ సంస్కృతికి వారసుడు ప్రవరుడు ఆ దృష్టితోనూ అడిగి ఉండవచ్చు

పోయి సేవింప లేకున్న బుణ్య తీర్థ
మహిమ వినుటయు నఖిల కల్మష హరంబ
కాన వేడెద ననిన నవ్వక్ష్మినివర్ఘ్యు
డాదరాయత్త చిత్తుడై యతని కనియె. 1-69

స్వామీ. వెళ్ళి సేవించలేకపోయినా ఆ పుణ్యతీర్థాల మహిమ మీ వంటి మహానుభావులవల్ల విన్నా చాలు అది అఖిల కల్మషాలనూ (పాపాలు) హరించివేస్తుంది కాబట్టి వేడుకొంటున్నాను దయచేసి ఆ విశేషాలు అనుగ్రహించండి- అన్నాడు ప్రవరుడు సిద్ధుడికి ప్రవరుడి మీద ఆదరం కలిగింది ఆదరాయత్త చిత్తుడై పలికాడు

ఓ చతురాస్యవంశ కలశోదధి పూర్ణ శశాంక ! తీర్థయా
త్రా చణ శీలినై జనపదంబులు పుణ్యనదీ నదంబులున్
జూచితి, నందు నందు గల చోద్యములన్ గనుగొంటిప నాంటీ
రాచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచలంబుగన్ 1-70

చతురాస్యుడు అంటే నాలుగు ముఖాలు కలవాడు బ్రహ్మ ఆ వంశం అనే క్షీర సముద్రం (కలశ+ ఉదధి) ఆ సముద్రానికి పూర్ణచంద్రుని వంటివాడు అని ప్రవరుడికి సంబోధన. పున్నమి చందమామను చూస్తే సముద్రం ఉప్పొంగుతుందట అలా ప్రవరుడు ఉదయించినందువల్ల అతడి వంశం సంతోషతరంగిత మయ్యిందని చంద్రుడు క్షీర సముద్రం నుంచి జన్మించాడు క్షీరసాగర మథనకథ బ్రాహ్మణ వంశం అనే క్షీరసముద్రం నుంచి ప్రవరుడు అనే పూర్ణ శశాంకుడు జన్మించాడు

వంశంలో క్షీరసముద్రత్వం ఆరోపించి తాద్రూప్య రూపకం చేసా డు. అందు కని ప్రవరుడిలో పూర్ణశశాంకత్వారోపణ అవసరమయ్యింది ఒక రూపకం మరో రూపకానికి హేతువు అయ్యింది పరంపరిత రూపకం పూర్ణ శశాంక అని సంబోధించాడే తప్ప ఉపమేయమైన ప్రవర పదాన్ని వాచ్యం చెయ్యలేదు ఎట్టఎదుట ఉన్నాడు కనక (హస్త నిర్దేశంతో) స్ఫురింపజేసాడు ధర్మారోపణ చేసి ఉపమేయపదాన్ని వాచ్యంగా చెప్ప కుండా ఇలా స్ఫురింప జేస్తే రూపకాతిశయోక్తి అవుతుంది

ఈ సుదీర్ఘ సంబోధన సిద్ధుడికి ప్రవరుడిపై కలిగిన ఆదరాతి శయాన్ని సూచిస్తుంది. ప్రవరుడి గుణ శీలాలను అతడి సంభాషణద్వారా గ్రహించిన సిద్ధుడి మెప్పు ఈ సంబుద్ధిలో స్ఫురిస్తోంది

సంస్కృత వ్యాకరణం 'చణప్' అనే ఒక ప్రత్యయాన్ని చెప్పింది ఇది తద్ధిత ప్రత్యయం. నేర్పరి అనే అర్థంలో వస్తుంది. వ్యాకరణ చణుడు అంటే వ్యాకరణంలో నేర్పరి- పండితుడు అని అర్థం '' హింసనచణ ధ్వంస రచన'' అన్న చోట శ్రీ శ్రీ ఇది ప్రయోగించాడు

తీర్థయాత్రాచణుడంటే తీర్థయాత్రలు చెయ్యడంలో నేర్పరితనం కలవాడని. అదే శీలంగా అదే పనిగా జనపదాలూ పవిత్ర నదీనదాలూ అన్నీ తిరిగాను. అక్కడా అక్కడా ఉన్న చోద్యాలు(వింతలు) చూసాను. తె లు సుకున్నాను. ఎంతదేశం తిరిగానంటే మలయాద్రి, పశ్చిమాద్రి, హిమాద్రి పూర్వాద్రి సరిహద్దులుగా మధ్యలో ఉన్న దేశంలో అన్ని జనపదాలూ, అన్ని నదులూ అన్ని నదాలూ (పడమరగా ప్రవహించే ఏరు) దర్శించాను. పటీరం అంటే మంచి గంధం దక్షిణ దిక్కున మలయ పర్వతం ఉంది. దానిమీద మంచి గంధం చెట్లు ఎక్కువగా ఉంటాయని కవుల వర్ణన. అందుకని

మలయ పర్వతాన్ని పటీరాచలం అంటారు

సిద్ధుడు చూసిన దేశం ఎంత విశాలమైనదో సూచించడానికి ఈ సుదీర సమాసం అన్నింటికీ అచల శబ్దమే (పరత్వం) కూర్చి సవర్ణదీర్ఘ సంధులే అయ్యేట్టు చూడటంవల్ల వైశాల్య స్ఫూర్తి మరింతగా కలుగు తోంది ఇది గ్రథన వక్రత కూర్పులో నేర్పు

ఆఙ్ అనేది మర్యాద(అవధి) అభివిధి (అదికూడా కలుపుకొని) అనే అర్థాల ను బోధించడానికి పదాలముందు చేరే ఒక ఉపసర్గ ఆసముద్రం వెళ్ళానంటే సముద్రం వరకూ వెళ్ళేనని గానీ సముద్రం అవలి గట్టు దాకా వెళ్ళాననిగానీ అర్థం వస్తుంది " పటీరాచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచల" అనే ద్వంద్వ సమాసానికి ఆఙ్ చేర్చడంవల్ల ఆ పర్వతాల వరకూ అనిగానీ ఆ పర్వతాలతో కలుపుకొని అవతలి వరకూ అనిగానీ అర్థం చెప్పకోవాలి. ఆ పర్వతాలు చూసాను ఆ పర్వతాల మధ్యలో ఉన్న ప్రాంత మంతా చూసాను అని తాత్పర్యం. స్థూలంగా ఈ మాట చెప్పి వివరాలు తరవాత అంది స్తున్నాడు ముందుగా శ్రోతను- అమాయకంగా అడిగిన ప్రవరుణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చెయ్యడం ఆశ్చర్యాన్ని మరింతగా పెంపొందించడం ఇది లోకజ్ఞుడైన సిద్ధుడి మాట నేర్పరితనం

కేదారేశు భజించితిన్, శిరమునన్ గీలించితిన్ హింగుళా
పాదాంభోరుహముల్, ప్రయాగ నిలయుం బద్మాక్షు సేవించితిన్,
యాదోనాథసుతాకళత్రు బదరీ నారాయణుం గంటి, నీ
యా దేశంబన నేల? చూచితి సమస్తాశావకాశంబులన్ ।-7।

కేదారేశ్వరుణ్ణి సేవించాను హింగుళాదేవి పాదపద్మాలు శిరస్సున కీలిం చాను. శిరస్సు ఆన్చి నమస్కరించానని ప్రయాగనిలయుడైన పద్మాక్షుణ్ణి భజించాను బదరీనారాయణుడు- క్షీరసముద్రరాజ తనయాపతిని దర్శించాను.(యాదస్=నీరు, యాదోనాథుడు=సముద్రుడు, యాదోనాథుని సుత=లక్ష్మీదేవి. లక్ష్మీదేవి కళత్రంగా -భార్యగా కలవాడు విష్ణుమూర్తి)

ఈ దేశమూ ఆ దేశము ఏమిటి అన్ని దిక్కులా అన్ని భాగాలనూ అన్ని ప్రాంతాలనూ చూసాను. (సమస్త+ ఆశా= దిక్కు+అవకాశంబులన్= ప్రాంతాలను, మధ్య భాగాలను)

వ. **అది యట్లుండె వినుము గృహస్థ రత్నంబ! లంబమాన**
రవి రథ తురంగ శృంగార చారు చామరచ్ఛటా ప్రేక్షణ
క్షణోత్క్షిప్త చమర సముదయంబగు నుదయంబునం గల
విశేషంబు శేషఫణికైన లెక్కింప శక్యంబె ?

అన్నీ చూసాను అనే మాట అలా ఉంచు ఓ గృహస్థ రత్నమా (గృహస్థులలో గొప్పవాడా) ఉదయ పర్వతం మీద (తూర్పుకొండ) ఉండే విశేషాలు వర్ణించి చెప్పాలం టే వెయ్యినాల్కల ఆదిశేషుడికైనా (శేషఫణికి) లెక్కింప శక్యమా! ప్రొద్దుటే సూర్యుడు

చేతికి అందుతున్నంత ఎత్తులో నెత్తిమీద వ్రేలాడుతుంటే అతడి రథతురంగాలకు అలంకారంకోసం కట్టిన అందమైన (శృంగార చారు) చామర సముదాయాన్ని(ఛటా) చూసి ఆ క్షణంలోనే మెడలిక్కించే (ఉద్గ్రీవ)చమరమృగాలు ఆ కొండమీద గుంపులు గుంపులుగా ఉంటాయి.

వ. అంధకరిపు కంధరావాస వాసుకి వియోగ భవ
దుర్వ్యథాభోగ భోగినీ భోగ భాగ పరివేష్టిత
పటీర విటపివాటికా వేల్ల దేలా లతా వలయంబగు
మలయంబునం గల చలువకు విలువ యొయ్యది ?

మలయపర్వతం మీద ఉండే చల్లదనాన్ని విలువ కట్టగలమా ? ఆ కొండ మీద గంధపు చెట్లు బారులుతీరి ఉంటాయి. (విటపం =కొమ్మ విటపి =చెట్టు) ఆ చెట్లకి అల్లుకొని ఏలకు తీగలు (వేల్లత్ +ఏలా +లతా+ వలయంబు) వలయాలు వలయాలుగా దట్టంగా వ్యాపించి ఉంటాయి ఆ గంధపు చెట్లకే ఆడపాములు పడగలతో పరివేష్టించి ఉంటాయి (భోగము=పడగ. భోగి=మగపాము. భోగిని= ఆడపాము) అయితే ఆడపాములు ఎందుకని అలా పడుకొన్నాయి ? అంటే- భరింపశక్యం కాని పెద్దబాధతో (దుర్వ్యథా+ఆభోగము=తీవ్రత)అవి అలా చుట్టుకొని పడుకున్నాయి. ఏమిటి ఆ బాధ? అంటే-ఆడపాములకి భర్త వాసుకి అతడు శివుడి కంఠాన్ని అలంకరించి ఇప్పుడు కైలాసం మీద ఉన్నాడు ఆ వియోగంతో పుట్టిన బాధ ఇక్కడ ఆడపాముల్ని నిశ్చేష్టపరుస్తోంది (అంధకరిపువు= అంధకాసురుణ్ణి సంహరించిన శివుడు కంధర= కంఠం కంధరా+ ఆవాస+ వాసుకి)

వ. అకటకట! వికట కూట కోటి విశంకట శృంగాట
కాధావమాన జరదిందుబింబ గళ దమృత బిందు
దుర్దినార్ద్రీకృత సల్లకీ పల్లవ ప్రభంజనపరాంజన
హస్తి హస్తంబగు నస్తంబునంగల మణిప్రస్తరంబుల
విశ్రాంతిం జింతించిన మేనం బులక లిప్పుడుం బొడమెడుం.

పశ్చిమ దిక్కున అస్తాచలం ఉంది. దాని మీద మణి ప్రస్తరాలు (పెద్ద పెద్ద మణి శిలాతలాలు) ఉన్నాయి వాటిమీద నేను తీసుకున్న విశ్రాంతిని తలచుకుంటే (చింతించినన్) ఇప్పుడుకూడా శరీరం నిండా (మేనన్) పులకాంకురాలు పొడముతున్నాయి అక్కడ ఉండే చల్లదనం ఇంకెక్కడా దొరకదని ఎందుకంటే- అస్తపర్వత శిఖరాగ్రభాగాలు చాలా ఎత్తుగా ఉంటాయి విశాలంగా ఉంటాయి.(విశంకట) ఆ చత్వరాలలో (శృంగాటకం= నాలుగు దారుల కూడలి) తెల్లవారుజామున అస్తమించే వృద్ధ చంద్రుడు (జరత్+ ఇందు) సంచరిస్తూ ఉంటాడు (ఆధావమాన) ఆ చంద్ర బింబం నుంచి స్రవించే (గళత్) అమృత బిందువులతో ప్రతిరోజూ దుర్దినమే అవుతుంది (దుర్దినం=ముసురు పట్టిన రోజు) అంటే అమృత వర్షం ఎడతెరపి లేకుండా ఆ శృంగాటకాల్లో కురుస్తుంది అందువల్ల ఆ పర్వతం మీద ఉన్న సల్లకీ వృక్షాల పల్ల

వాలు(అందుగు చెట్ల చివుళ్ళు) ఆర్ద్రం గా ఉంటాయి ఆర్ద్రీకృత పల్లవాలను తెంచుకొని తినడానికి (ప్ర+ భంజన + పర) పశ్చిమ దిగ్గజం (అంజనహస్తి) తొండం సాచుతూ ఉంటుంది అటువంటి పశ్చిమాద్రిని తలచుకొంటే ఇప్పటికీ మేను పులకిస్తోంది.

ఎనిమిది దిక్కులా ఎనిమిది ఏనుగులు ఉండి భూగోళాన్ని మోస్తున్నాయని ప్రాచీనుల విశ్వాసం వీటినే అష్టదిగ్గజాలు అంటారు పశ్చిమాన ఉండే దిగ్గజానికి అంజనం అని పేరు తూర్పున ఐరావతం

వ. స్వ స్వ ప్రవర్ధిత వర్ధిష్ణు ధరణీరుహ సందోహ
దోహద ప్రధానాసమాన ఖేల దైలబిల విలాసినీ
విలాస వాచాల తులాకోటి కలకలాహూయమాన
మానస మదాలస మరాళంబగు రజత శైలంబు
నోలంబులం గాలగళు విహారప్రదేశంబులం గన్న
సంసృతి క్లేశంబులు వాయువే ?

ఉత్తర దిక్కున వెండికొండ (రజతశైలం) ఉంది దాని చెరియలలో (ఓల ములన్) పరమేశ్వరుడు (కాలగళుడు=శితికంఠుడు) విహరిస్తూ ఉంటాడు. ఆ ప్రదే శాలను చూసినట్టయితే సాంసారిక దుఃఖాలూ (సంసృతి=సంసారం)క్లేశాలూ తొల గిపోవా ?(ఓలము= రక్షిత ప్రదేశ మని తాత్పర్యార్థం చెప్పకోవచ్చు)

ఆ రజత శైలం మీద కలహంసలు (మరాళాలు) ఉంటాయి. కుబేరుడి అంతఃపురకాంతలు యక్షవిలాసినులు సంచరిస్తూ ఉంటారు (ఐలబిలుడు=కుబే రుడు. ఇలబిలుని కొడుకు) ఆ విలాసినులు వెండికొండ మీద ఒక్కొక్క చెట్టు నాటి ఎవరిది వారు స్వయంగా పెంచుతున్నారట అలా స్వస్వ ప్రవర్ధితాలై వర్ధిష్ణువులవుతున్న (ఎదుగుతున్న) ధరణీ రుహ సందోహాలకు (చెట్లవరసలకు) దోహదక్రియలు చెయ్య డానికని ప్రధా నంగా రోజూ అక్కడికి వస్తారు ఐలబిల విలాసినులు వచ్చి తమలో తాము అసమానంగా ఖేలనాలు జరుపుతూ ఉంటారు ఏవో క్రీడలు సాగిస్తూ ఉంటారు తమలో తాము పిలుచుకుంటూ విలాసంగా ఎవో కంఠధ్వనులు చేస్తారు (విలాస వాచాల) ఆ కలకలారావాలు మానససరోవరం దాకా వ్యాపిస్తాయి ఆ సరోవరంలో క్రీడిస్తున్న రాజహంసలకు (మద+ అలస+ మరాళము=మగ హంస) ఆ ధ్వనులు ఆహ్వానాలుగా వినిపిస్తాయి వెంటనే అవి ఎగురుకుంటూ వచ్చి విలాసినుల సన్నిధిలో వాలతాయి అంటే ఆ విలాసినుల కంఠధ్వనులు ఆడహంసల(కలహంసి) ఆహ్వానాల కు సాటి వస్తున్నాయి తులాకోటికి ఎక్కుతున్నాయి అని (పిట్టల్ని పట్టేవాడు వలపన్ని చెట్టుచాటున దాగి ఆడపిట్టలా కూస్తాడుట మగపిట్టలు బిలబిలావచ్చి వాలి వలలో చిక్కుకుంటాయట ఈ దృశ్యం ఈ భావానికి ప్రేరకమై ఉంటుంది)

వ. సతత మద జల స్రవణ పరాయణైరావణ విషాణ కోటి
సముట్టంకిత కటక పరిస్ఫురత్కురువింద కందల వ్రాత
జాతాలాత శంకాపసర్పద భ్రము భ్రమీ విభ్రమ

ధురంధరంబగు మేరుధరాధరంబు శిఖరంబుల సోయగంబులు
గలయం గనుంగొనుట బహుజన్మకృత సుకృత
పరిపాకంబునంగాక యేల చేకూర నేర్చు?

మేరు పర్వత శిఖరాల సోయగాలను పూర్తిగా అన్నివైపులా చూడ గలగటం అనేకపూర్వజన్మల్లో చేసుకొన్న సుకృతవిశేషం పండి పరిపక్వ మైనందువల్లమాత్రమే సిద్ధిస్తుంది లేకపోతే ఎలా లభిస్తుంది చెప్పు

ఎల్లవేళలా మదజలం స్రవిస్తూ ఉండే ఐరావతం(ఐరావణం)తన దంతాల అగ్రభాగాలతో (విషాణ కోటి) కుమ్మడంవల్ల మేరుపర్వతం మధ్య భాగంలో(కటకము) లేదా చెరియలలో గోతులు ఏర్పడి ఆ గోతుల్లో కురు వింద కందళ వ్రాతం మొలకెత్తిం ది. గురివింద మొలకలు (కందళ) గుబు రుగా ఎదిగి ప్రకాశిస్తున్నాయి. (పరిస్ఫురత్) గురువింద మొలకలు ఎర్రగా ఉన్నాయి వాటిని అభ్రమువు చూసి కొఱకంచులుగా భ్రమపడింది ఆలాత శంకతో భయపడి పారిపోతున్న (అపసర్పత్) అభ్రమువు తాలూకు భ్రమణవిభ్రమాల భారాన్ని వహిస్తోంది మేరుపర్వతం అభ్రము భ్రమీ విభ్రమ ధురధరం- మేరుధరాధరం (ఐరావతానికి భార్య- ఆడ ఏనుగు పేరు అభ్రమువు అంజన గజేంద్రుని భార్య పేరు అంజనావతి)

వ. ఏనిట్టి మహాద్భుతంబు లీశ్వరానుగ్రహంబున నల్ప
కాలంబునం గనుంగొంటి ననుటయు, నీషదంకురిత
హసన గ్రసిష్ణు గండయుగళుండగుచు బ్రవరుం డతనికిట్లనియె । -72

నేను ఇటువంటి మహాద్భుతాలు అన్నీ ఈశ్వరానుగ్రహంవల్ల అల్ప కాలంలోనే చూడగలిగాను అని సిద్ధుడు ముగించాడు. దక్షిణం నుంచి తూర్పు వరకూ నాలుగు దిక్కుల విశేషాలూ చెప్పాడు. అపటీరాచల పశ్చి మాచల హిమాచల పూర్వదిశాచలం బుగన్ అన్నమాటకి అనువుగా వర్ణించి విరమించాడు ఇన్ని దిక్కులూ ఇన్ని పర్వతాలూ వెళ్ళి చూడాలంటే ఏళ్ళూపూళ్ళూ పడుతుందిగదా ఒక జన్మచాలదే ,అటువంటిది అన్నీ ఎలా చూడగలిగారు అంటాడేమోనని ఈశ్వరానుగ్రహంవల్ల అల్పకాలంలోనే చూడగలిగాను అనికూడా చెప్పి ముగించాడు

ఇది వినేసరికల్లా ప్రవరుడి ముఖంలో చిన్న నవ్వు కొంచెం మొలకెత్తింది. ఈషత్ అంకురితం అయ్యింది ఆ హసనం చెక్కిళ్ళకు వ్యాపిం చింది. (హసన గ్రసిష్ణు గండయుగళుడు) అంటే చిరునవ్వు చెక్కిళ్ళలో తొంగి చూసిందని నవ్వుని అదుపు చేసుకుంటూ-

వెఱవక మీ కొనర్తు నొక విన్నప, మిట్టివి యెల్ల జూచిరా
నెఱకలు గట్టుకొన్న మఱి యేండ్లను బూండ్లను బట్టు, బ్రాయపుం
జఱుతదనంబు మీ మొగము చెప్పక చెప్పెడు నద్దిరయ్య! మా
కెఱుగ దరంబె మీ మహిమ లీర యొఱుంగుదురేమి చెప్పదున్। -73

అయ్యా నాదొక విన్నపం. జంకకుండా (వెరవక) మీ ముందు ఉంచు

తున్నాను ఇటువంటివి అన్నీ చూసి రావాలంటే రెక్కలు కట్టుకొని (ఎఱకలు) ఎగిరి వెళ్లినా ఏళ్ళూ పూళ్ళూ పడుతుందే మీ ముఖం చూస్తే చిన్న వయసువారిలాగే కనబడుతున్నారు చిన్న వయస్సు అనే సంగతిని (ప్రాయపున్ చిరుతదనంబున్) ముఖం చెప్పక చెబుతోంది ఆహాహా మీ మహిమలు మీకే తెలియాలి గానీ మాకు తెలుస్తాయా తెలుసుకోవడం మా తరమా! ఏమి చెప్పనింక

ఈ మాటల్లో ఆశ్చర్యమూ ఉంది అవిశ్వాసమూ ఉంది '' ఈశ్వరాను గ్రహంబున నల్పకాలంబునం గనుంగొంటి'' అని సిద్ధుడు ప్రత్యేకంగా చెప్పి ఏ అంశం మీదకి ప్రవరుడి దృష్టిని ఆకర్షించాలనుకొన్నాడో సరిగ్గా ఆ అంశం మీదకే ప్రవరుడి దృష్టి ప్రసరించింది ఆ ఈశ్వరానుగ్రహం ఏమిటో చెప్పమని ప్రవరుడి ఆంతర్యం దాన్ని అతడితో అడిగిం చుకొని చెబితే సిద్ధుడికి తన సొంత గొప్పదనాన్నీ, ప్రత్యేకతనీ చాటుకొన్న సంతృప్తి నువ్వు గృహస్థరత్నానివైతే నేను సిద్ధరత్నాన్ని సుమా అని నిరూపించుకున్న ఆనందం

అనిన బరదేశి గృహపతి
కనియెన్ – సందియము దెలియ నడుగుట తప్పా?
వినవయ్యా! జరయు రుజయు
జెనకంగా వెఱచు మమ్ము సిద్ధులమగుటన్ -74

వెఱవక మీకు ఒనర్తు ఒక విన్నపం అని ప్రవరుడు ప్రారంభించాడు కనక సిద్ధుడు అంటున్నాడు- తప్పేముందీ తెలియని విషయం అడిగి తెలుసుకోవడం తెలియజెప్పమనడం తప్పా? తప్పేమీ కాదు వినవయ్యా! మేం సిద్ధులం కనక ముసలితనం (జర) రోగం రొష్టూ (రుజ) ఇవి మమ్మల్ని సమీపించడానికి (చెనకన్) భయపడతాయి (వెఱచున్)

నా ముఖం చూస్తే చిరుత ప్రాయంగా కనపడటానికి కారణం ఇది సుమా అని చెప్పడం

ప్రవరుడి మాటల్ని బట్టి అతడు ఆశ్చర్యపోతున్నాడనీ తనకి లొంగి పోయాడనీ సిద్ధుడు గ్రహించాడు తీర్థయాత్రాభిలాష తెలుస్తూనే ఉంది. అందుకని సిద్ధులం మేము అంటూ ఆధిక్యాన్ని ప్రకటించడం, వినవయ్యా! అని చనువుగా సంబోధించడమూను ఇది సంబుద్ధి కావచ్చు లోకువ కట్టడమూ కావచ్చు ప్రవరుడి మాటల్లో ఎలాగయితే ఆశ్చర్యమూ అవిశ్వాసమూ స్ఫురించాయో అలాగే తన మాటల్లోనూ రెండు రకాల భావాలూ స్ఫురించేట్టు పలికాడు సిద్ధుడు

కథా ప్రధానంగా సాగే కావ్యాలలో సొగసులు నేలమీద సాముల్లాగా ఆహ్లాదపరుస్తాయి ఆలోచింపజేస్తాయి కథను వదిలేసి సాగే కల్పనల్లో సొగసులు నేల విడిచిన సాముల్లాగా ఆశ్చర్యపరుస్తాయి. ఆహో పుట్టిస్తాయి

సిద్ధుడు తన ఆధిక్య స్పృహతో మాట్లాడుతున్నాడు- కొనసాగిస్తున్నాడు

పరమంబైన రహస్యమౌ, నయిన దాపన్, జెప్పెదన్ భూమిని
ర్జర వంశోత్తమ! పాదలేప మనుపేరం గల్గు దివ్యౌషధం
పు రసం బీశ్వర సత్కృపం గలిగె దద్భూరి ప్రభావంబునం
జరియింతుం బవమాన మానస తిరస్కారి త్వరాహంకృతిన్ I -75

నిర్జరులు అంటే ముసలితనం (జర) లేనివారు దేవతలు భూమి నిర్జరులు అంటే భూదేవతలు=బ్రాహ్మణులు ఓ బ్రాహ్మణ వంశోత్తమా అని సంబోధన

" ఒక పరమంబైన రహస్యం ఉంది " పరమ రహస్యం అనకుండా పరమం బైన రహస్యం అని విరిచి చెప్పడంలో ఆ రహస్యం ఎంత గొప్పదో సూచించడం లక్ష్యం కావచ్చు "ఔను అది అంతటి పరమ రహస్యమే అయినా దాచను. చెబుతాను " నీకు కాబట్టి చెబుతున్నాననీ, నేను కాబట్టి చెబుతున్నాననీ స్ఫూర్తి.

పాదలేపం అనే పేరుతో ఒక దివ్యౌషధరసం నా దగ్గర ఉంది ఈశ్వరుడి సత్కృపవల్ల లభించింది దాని గొప్ప ప్రభావంతో నేను వాయువునీ మనస్సునీ మించిన(తిరస్కారి)వేగాతిశయంతో సంచరిస్తూ ఉంటాను

'చరియింతున్' అని తద్ధర్మార్థకంలో చెప్పడం- ఆ పాదలేపనం తన దగ్గర ఇప్పటికీ సిద్ధంగా ఉందని సూచన వాయువుకన్నా మనస్సుకి వేగం ఎక్కువ అయితే వాయువుకు బలం ఉంది మనస్సుకి అది లేదు ఈ రెండింటినీ తిరస్కరించే వేగంతో ప్రయాణించే శక్తిని ఇస్తుంది ఆ పాదలేపనం అని

అలతి అలతి పదాలతో పద్యమంతా నడిపి చివరలో సమాసం ఝాడించడం త్వరాహంకార సూచకం ఓ చతురాస్య వంశ (-70) పద్యంలోనూ ఇదే రచనా శిల్పం కనబడుతుంది రచనకు సంబంధించి ఇది శ్రీనాథుని ప్రభావం అంటారు.

ఈశ్వరానుగ్రహంబున నల్పకాలంబులో గనుగొంటి (-72) అని ముందు చెప్పాడు కనుక ఈ పాదలేపనం ఈశ్వర సత్కృపతో లభించిం ది అని చెప్పి సమన్వయించుకొన్నాడు ఆశ పుట్టేట్టు దాని ప్రభావం ఇంకా వివరిస్తున్నాడు.

దివి బిసరుహబాంధవ సైం
ధవ సంఘం బెంత దవ్వు దగలే కరుగున్
భువి నంత దవ్వు నేమును
రవరవలే కరుగుదుము హుటాహుటి నడలన్ I -76

బిసము అంటే తామర తూడు. దాని నుంచి పుట్టింది బిసరుహం =పద్మం. పద్మబాంధవుడు అంటే సూర్యుడు సూర్యోదయం కాగానే పద్మాలు వికసిస్తాయి కనక సైంధవమంటే గుర్రం. సూర్యుడి రథాశ్వాలు ఏడూ ఆకాశంలో దప్పిక (దగ) అనేది లేకుండా ఎంత దూరం (దవ్వు) వెడతాయో-మేమూ భూమి మీద అంత దవ్వు అలసట (రవరవ) అనేది లేకుండా హుటాహుటి ప్రయాణాలతో వెళ్ళగలం

సూర్యుడు ఆకాశంలో ఈ చివరినుంచి ఆ చివరికి ప్రయాణిస్తా డు అలాగే మేమూ ఒక్క రోజులో భూగోళం మీద ఈ చివరినుంచి ఆ చివరికి వెళ్ళగలం అని

పాదలేపన ప్రభావాన్ని నాటుకొనేటట్లు చెప్పాడు. ఇది పులుముకుని ప్రయాణం చేస్తే ఎక్కడికి వెళ్ళినా తన నిర్మల ధర్మకర్మాచరణకు ప్రత్యవాయం కలగకుండా మళ్ళీ సకాలం లో ఇంటికి తిరిగి రావచ్చు కాబట్టి ప్రవరుడి తీర్థయాత్రాభిలాష తీరే మార్గం కనపడింది ఇంత కాలమూ ఇటువంటి ఉపాయం ఏదీ కనపడక పోబట్టే '' ఆ పురిన్ పాయక '' ఉంటున్నాడు

ఇప్పటికి సిద్ధుడి మాటల మీద గురి కుదిరింది. విశ్వాసం ఏర్పడింది పైగా ఆశ ఒకటి లొంగదీస్తోంది

అనినన్ విప్రవరుండు కౌతుక భర వ్యగ్రాంతరంగుండు భ
క్తి నిబద్ధాంజలి బంధురుండు నయి మీ దివ్య ప్రభావం బెఱుం
గని నా ప్రల్లదమున్ సహించి మునిలోక గ్రామణీ ! సత్కృపన్
నను మీ శిష్యుని తీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగా జేయరే. I-77

సిద్ధుడి మాటల్లో పాదలేపనం సంగతి వినగానే విప్రవరుడి మనస్సు (అంతరంగం) కౌతుక భరంతో నిండిపోయింది ప్రవరుడు విప్ర వరుడు కదా భక్తితో గట్టిగా దండం పెట్టేశాడు అంజలి బంధం అలా ఉంచే మాట్లాడాడు

ఓ మునిలోకగ్రామణీ -అన్నాడు గ్రామణి అంటే నాయకుడు అగ్రగణ్యుడు ఓ మునిలోక నాయకా అని సంబోధించాడు

మీ దివ్య ప్రభావాన్ని తెలుసుకోలేని నా తప్పని (ప్రల్లదమున్) సహించండి. నేను మీ శిష్యుణ్ణి దయచేసి నాతో తీర్థయాత్రలు చేయించి ధన్యాత్ముణ్ణి చెయ్యరూ

పాదాభివందనం మినహా నమస్కరించాడు. ప్రాధేయపడటం మినహా ప్రార్థించాడు.

సిద్ధుడి మహిమను మన ప్రవరుడు ముందుగా గుర్తించలేదు ఇది తప్పు కాదు చెప్పకుండా చూడకుండా ఎలా తెలుస్తుంది ఆకారంలోనే అన్నీ స్ఫురించవాయె అయినా మీ మహిమను గుర్తించని నా ప్రల్లదాన్ని సహించండి అన్నాడు ప్రవరుడు. అంటే అప్పటికి తానేదో తప్పు చేసినట్లు మాట్లాడాడు ఇంతకుముందు -మీ మహిమలు మీరే ఎరుగుదురు మీ మాటలు మంత్రంబులు ఈ మాటల్లో ప్రవరుడు ఎకసెక్కెమే ఉద్దేశించాడన్నమాట ఆ తప్పు మనస్సుకి తెలుసుకనక తప్పు చేసాను క్షమించండి అంటున్నాడు లేదా పాదలేపనం అడగబోతున్నాం కదా ఎందుకయినా మంచిదిలే అని కావచ్చు

మొదటినుంచీ మీరు మీరు అంటూ బహువచనంతోనే సంభాషణ గౌరవంగా నడుపుతున్నాడు ఇప్పుడూ అదే కొనసాగించాడు కానీ '' సత్కృపన్ నను మీ శిష్యుని తీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగా జేయరే'' అనడంలో 'శిష్యుని' అనేమాటను -అప్పటికది అంగీకారం అయిపోయిన విషయంగా గుట్టుచప్పుడు కాకుండా కలిపెయ్యడం ప్రవరుడి లౌక్యం సిద్ధుడితో కాసేపు సంభాషించే సరికి ఈ పాటి లౌక్యం అబ్బిందేమో .

ప్రవరుడు ఇలా అడగ్గానే సిద్ధుడు అలా తీసి ఇచ్చేస్తున్నాడు-

అనుటయు రసలింగము నిడు
తన వ్రటువ ప్రేపసజ్జ దంతపు బరిణిన్
నినిచిన యొక పస రిదియది
యని చెప్పక పూసె దత్పదాంబుజయుగళిన్ 1-78

ప్రేముతో అల్లిన గుండ్రటి(వ్రటువ) సజ్జ తెరిచాడు అందులోనే రసలింగాన్ని (బంగారు శివలింగం) దాచుకొనేవాడు ఆ సజ్జలోంచి ఒక దంతపు బరిణి తీసాడు బరిణిలో నిండానింపిన(నినిచిన) ఒక పసరు ఉంది. ఇదీ అదీ అని చెప్పకుండా (పేరు చెప్పకుండాఅని) ఆ పసరు తీసి అతడి పాదపద్మాల జంటకు (యుగళన్) పూసాడు

మందు ఇచ్చినా మాకు ఇచ్చినా దాని పేరు చెప్పకపోవడం సిద్ధుల లక్షణం గడుసుదనం కానీ ఏమీ బెట్టు చెయ్యకుండా మళ్ళీ మళ్ళీ బతిమా లించుకోకుండా అడిగిందే తడవుగా ఇచ్చేసాడేమిటా ? అని.

ఆ మందిడి యత డరిగిన
భూమీసురు డరిగె దుహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీక్షాపేక్షన్ 1-79

ఆ మందు పులిమి ఆ సిద్ధుడు ఎలా వచ్చాడో అలాగే వెళ్ళి పోయాడు హఠాత్తుగా సరాసరి వచ్చి హఠాత్తుగా వెళ్ళిపోయాడు

కథలో ఉపాంగాలన్నీ పరస్పరం గాఢంగా అల్లుకొని నట్టనడుమ విస్తరించి గోపుచ్ఛాకారంలో ఏకోన్ముఖంగా సాగే కథన శిల్పానికి మనుచరిత్ర ఒక నిదర్శనం

భూమీసురుడు ప్రవరుడుకూడా వెళ్ళాడు హిమాలయాలకు వెళ్ళాడు తుహినం అంటే మంచు భూధరం అంటే పర్వతం. మంచు కొండ. ఆ కొండ కొమ్ముల మీద (శృంగం) పచ్చగా (శ్యామలం)కోమలంగా ఉండే కాననాలు బంగారు గుహలు ,(దరీ) సెలయేళ్ళు (ఝరీ)- వీటిని వీక్షించాలనే అపేక్షతో వెళ్ళాడు

సిద్ధుడు నాలుగు దిక్కులా సరిహద్దు గిరుల్ని చెబుతూ హిమాచలాన్ని పేర్కొన్నాడు (70) కానీ, తరవాత వచనంలో ఉత్తర దిక్కున హిమాద్రిని వర్ణించలేదు వెండి కొండని వర్ణించాడు కుబేర విలాసినుల్ని చూపించాడు హిమాలయాన్ని మరి ఎందుకు వదిలేసాడో కానీ ప్రవరుడికి సరిగ్గా దానిని చూడాలి అనే కోరికే పుట్టింది వెళ్ళాడు.

కొండ కొమ్ముల ఎత్తు పల్లాలూ సెలయేళ్ళ వంకర టింకరలూ స్ఫురించేట్టు కట్టిన సమాసమిది. మూడు లఘువులతో (తుహిన) ప్రారంభమవ్వడం అటుపైని మూడు భగణాలుగా విస్తరించడం, దరీ ఝరీ నిరీ క్షాపేక్షన్ అంటూ లఘువూ గురువూగా 'రీ' పునరుక్తం కావడం- ఇవన్నీ వర్ణనీయ వస్తు స్ఫూర్తికి సహకరిస్తాయి

సమాస నిర్మాణంలో అక్షరాల కూర్పులో వర్ణనీయ వస్తువుని స్ఫురింపజేసే

రాబోయే పద్యం 'అటజని కాంచె భూమి సురుడు'' లో ఇది బాగా ప్రస్ఫుటమవుతుంది

ప్రవరుడు హిమాలయాలకు వెళ్ళి ఎలా ప్రవర్తించాడు, ఏం చేసాడు, అతని పుణ్యవర్తన వివరించమని క్రోష్టి అడిగాడు. మార్కండేయుడు చెబుతాడు (80)

''చతుర వచో నిధివి'' అని రాయలవారు అన్నదానికి సార్ధకత చేకూర్చే సంభాషణలతో, వర్ణనలతో, అల్లసానివారి అల్లిక జిగిబిగి అన్న ప్రసిద్ధికి అనుగుణమైన కథన శిల్పంతో రచనా విధానంతో, అటు అభివ్యక్తి కౌశలానికీ ఇటు గ్రథన కౌశలానికీ ఒజ్జ బంతిలా నిలబడింది ' స్వారోచిష మను సంభవం'

నందితిమ్మన (క్రీ.శ. 1520ప్రాంతం)

పారిజాతాపహరణము (ద్వితీయాశ్వాసం 30-51)

మనుచరిత్ర లాగే పారిజాతాపహరణంకూడా చాలా ప్రసిద్ధ కావ్యం పాఠ్య భాగాలలో ఎక్కడో ఒకచోట పరిచయం అయ్యే ఉంటుంది సత్యభామ కోపం, శ్రీకృష్ణుడు బతిమాలుకోవడం, ఆవిడ కాలుతో తన్నడం ఈ ఘట్టాలు సుప్రసిద్ధాలు

నందితిమ్మన గారి ఏకైక రచన-అద్వితీయ రచన ఈ పారిజాతాపహరణం దీన్ని శ్రీకృష్ణదేవరాయలకే అంకితంచేసాడు అష్టదిగ్గజాలలో కచ్చితంగా ఉన్నారు అని నిర్ధారణ అయిన కవులలో పెద్దన-తిమ్మనలు ముఖ్యులు

ఈ కావ్యరచనకు సంబంధించి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉం ది చిన్నాదేవితో పాటు ఈయన అరణపు కవిగా రాయలవారి కొలువుకి వచ్చాడంటారు అంతఃపురకలహం - ప్రణయకలహం తీర్చడానికే పారిజా తాపహరణ కథను తీసుకొని కావ్యంగా మలిచాడంటారు. అందుకే సత్యభామతో శ్రీకృష్ణుని తలను తన్నించాడంటారు కావచ్చు

నంది తిమ్మనకే ముక్కుతిమ్మన అని మరొక ప్రసిద్ధి ఇలా ఇంటి పేరు మారడానికికూడా మరొక కథ ఉంది ఈయన నాయిక ముక్కుని వర్ణిస్తూ ఒక అద్భుతమైన పద్యం రాశాడుట

నానా సూన వితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాకన్ దపంబంది యో
షా నాసాకృతి దాల్చి సర్వ సుమన స్సౌరభ్య సంవాసియై
పూనెం ప్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబు లిర్వంకలన్.

సంపెంగ పువ్వుకీ తుమ్మెదకీ పడదు కదా. అందుకని సంపెంగ (గంధఫలి) చాలా బాధ పడిందట సృష్టిలో అన్ని పువ్వుల వాసనల్నీ ఆఘ్రా ణిస్తూ ఆనందించే తుమ్మెద (సారంగం) ఎందుకని నాదగ్గరకి రాదు, నేను చేసిన పాపం ఏమిటి? అని బాధపడీ పడీ ఆ బాకతో గొప్ప తపస్సు చేసిందట తపస్సు ఫలించి సంపెంగ నాయిక ముక్కుగా జన్మ ఎత్తిందట నాయికల ముక్కుల్ని సంపెంగ మొగ్గలతో పోలుస్తారు అందుకని ఈ కల్పన. ఇంక ఇప్పుడు అన్నిరకాల పువ్వుల సౌరభ్యాలనూ (సుమనస్= పువ్వు) తానే ఆఘ్రాణించ గలుగుతోంది. ఆనందించగలుగు తోంది కానీ అసలు కోరిక ఇదికాదు. తుమ్మెదల్ని తనచుట్టూ తిప్పుకోవాలని అదీ తీరింది నాయిక కాటుక చూపులు (ప్రేక్షణమాలికా) అనే తుమ్మెదలు (మధుకరీ= ఆడ తుమ్మెద) గుంపులు గుంపులుగా ఈ సంపెంగ ముక్కుకి రెండు వైపులా ఎల్లవేళలా బరాబరులు చేస్తున్నాయి. ఇలా సంపెంగ కోరిక తీరింది చూపుల్ని తుమ్మెదలతో పోల్చడంకూడా కవిలోక ప్రసిద్ధం

ఈ పద్యంతో నంది తిమ్మన కాస్తా ముక్కుతిమ్మన అయ్యాడు ఒక రకం పౌరుష నామధేయంగా ఇంటిపేరు మారి స్థిరపడింది

నిస్సందేహంగా ఇది గొప్పపద్యమే అయితే ఇది పారిజాతాప హర ణంలో లేదు రామరాజభూషణుడి వసుచరిత్రలో ఉంది. తిమ్మన దగ్గర ఈ పద్యాన్ని భూషణ కవి కొనుక్కున్నాడని మరోకథ పద్యం మిగలక పోయి'నా తిమ్మన గారికి ''ముక్కు'' మిగిలింది.

ఇది పూర్తిగా కట్టుకథ ఈపద్యం గొప్పదే కానీ అనువాదం. కాకతీ యుల కాలం నాటి విద్యానాథుడి శ్లోకం భృంగానవాప్తి ప్రతిపన్న ఖేదా కృత్వా వనే గంధఫలీ తపోజలమ్--- అనేది మూలం. దీన్నే కళా పూర్ణోదయ కర్త ''అంబుజగంధి నాసిక నిజాన్వయ శత్రవు చంపక ప్రసూనంబు గరంబు గెల్చుట మనంబున బెట్టి,, అంటూ అనువదించాడు అనువాద పద్యానికి ఇంత హడావిడా? ఇంటిపేరు మారిపో యిందా? అబద్ధం అసంబద్ధం.

ప్రబోధ చంద్రోదయాన్ని కావ్యంగా సంతరించి ప్రసిద్ధికెక్కిన తొలి తెలుగు జంటకవులు నంది మల్లయ-ఘంట సింగయలు. అప్పటి నుంచీ ఈ ఇంటిపేరు ప్రసి ద్ధమే నంది సింగయామాత్య పుత్రుణ్ణి తిమ్మన నామధేయుణ్ణి అంటూ ప్రతి ఆశ్వాసం చివరా కంఠోక్తిగా చెప్పకున్నాడు ఈ కవి.

అయితే ముక్కుతిమ్మన అనే పేరు ఎలా వచ్చింది? ఈ ప్రశ్నకు సమాధానం తెలీదని చెప్పడానికి ఇష్టపడక ఎవరో కథ కల్పించారు. కథలో ముక్కుతిమ్మన ఉందిగానీ కథకి ముక్కూ చెవులూ లేవు

' ముక్కుతిమ్మనార్యు ముద్దు పలుకు'' అనేది రూఢికెక్కిన మరోసూక్తి. తిమ్మనార్యుడి కవిత్వం భావ పరంగా రచనాపరంగా సుకు మారంగా ఉంటుంది అని దీని భావం ఇందులో కొంత వాస్తవం లేక పోలేదు. ''ముద్దుపలుకు'' అన్నాడు కనక అది పలుకులకు (మాటలు) సంబంధించిన సౌకుమార్యమే అనుకోవాలి. అంటే పదాల కూర్పు సుకుమారంగా ఉంటుంది అని.

పదాల కూర్పు రసాన్నిబట్టి ఏర్పడుతుంది. రసాలు తొమ్మిదిం టిలోనూ కొన్ని సుకుమారాలు కొని ఈషత్ సుకుమారాలు, కొన్ని ప్రౌఢాలు కొన్ని ఈషత్ ప్రౌఢాలు శృంగార కరుణాలు సుకుమార రసాలు. శృంగారంలో కూడా విప్రలంభ శృంగారం (వియోగశృంగారం) విశేషత: మరీమరీ సుకుమారం. ఈ రసాన్ని పోషించే ఘట్టంలో పదాల కూర్పు సుకుమారాతిసుకుమారంగా ఉంటుంది. ఉండాలి అని ఆలంకారికుల నిర్ణయం.

పారిజాతాపహరణ కథ శృంగార రస ప్రధానం. ఇంద్రుడితో యుద్ధం లాంటి ఘట్టాలలో ఈషత్ ప్రౌఢరసాల (వీరాద్భుతాలు) స్పర్శ కొంత ఉన్నా ప్రధానంగా ఇది శృంగార కావ్యం సత్యభామ కోరిక తీర్చడం కోసం శ్రీకృష్ణుడు స్వయంగా వెళ్ళి స్వర్గం నుంచి పారిజాత వృక్షాన్ని పెకలించుకు రావడం చివరలో పుణ్యక వ్రత మొకటి.

అది హాస్యప్రధానం ఆదిలో నారదుడు వచ్చి తంపులు పెట్టడం లగాయతు చివరిదాకా హాస్యరసం ఉపనదిలా సాగుతూనే ఉంటుంది

రుక్మిణి మీద ఈర్ష్యతో సత్యభామ ఇంతపని చేయించింది. దక్షిణ నాయకుడైన శ్రీకృష్ణుడు చేసాడు ఇంతకీ ఈర్ష్యా విప్రలంభం ప్రధాన రసం అది అతిసుకుమారం కాబట్టి కావ్యంలో అంతటా ప్రముఖంగా సుకుమార రచన కనపడు తుంది. '' ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు ' అనే మాట ఈమేరకు వాస్తవమే రసస్పర్శ సాక్షాత్తుగా లేని వస్తువర్ణనల్లో తిమ్మనగారి ముదురు పలుకులు సాక్షాత్కరిస్తాయి

శ్రీకృష్ణుడు సత్యభామకు మేరువుని వర్ణించి చూపుతూ- ఓ కువలయ పత్రనేత్ర చుసావా ఈ బంగారు కొండ, మరొక గరుత్మంతుడి లాగా ఉంది కన్నుల పండువుగా ఉంది - ''కువలయ పత్రనేత్ర కనుగొం టివె కన్నుల పండువయ్యె రెండవ వినతా తనూభవుని యందమునన్'' - (౭-౬౫) అంటాడు గరుత్మంతుడు బంగారువు రంగులో ఉంటాడనీ ఆయనవి బంగారు ఈకలనీ ప్రసిద్ధి. ఆ మేరుపర్వతం మీదట-

జీర్ణ పర్ణద్రు సంకీర్ణాహి మణి విభా
మాయాకిసల వంచ్యమాన పికము
శశికాంత రుచి మృషా సలిల సంస్ఫాలన
శ్లథ విషాణోద్విగ్న సైరిభంబు
గోమేధిక ప్రభాంకూర మిథ్యా మధు
ద్రవలిలిక్షామిళద్భల్లుకంబు
నీలగండ ప్రస్తరాళీక గజ భేద
శీర్యన్నఖ క్షుబ్ధ సింహకులము
గారుడాశ్మచ్ఛవిచ్ఛటా కపటయవస
పూలికాచర్వణ వ్యగ్ర బాల మృగ వి
లంఘ్యమానాబ్జరాగ శిలా వితాన
కూట దావాగ్ని యీ మరుత్కుధర మబల! (౭-౬౬)

ఆకురాలిన చెట్లు (జీర్ణ+పర్ణ+ద్రు) ఉన్నాయి. ఉత్తి మోడులు వాటి కొమ్మలకి సర్పాలు (అహి) చుట్టుకుని పడుకున్నాయి పడగలమీద ఉన్న మణుల కాంతులు(మణివిభా) ఎర్రగా చిగురాకుల్లాగా ఉన్నాయి ఆ మాయా కిసలయాలను చూసి కోకిలలు (పిక) వంచింపబడు తున్నాయి మోసపోతున్నాయి

మరొక చోట చంద్రకాంతపు మణులు కాంతులీనుతున్నాయి. అవి నీళ్ళ మిలమిలలలాగా ఉంటాయి. నీళ్ళు అనే భ్రాంతిని కల్పిస్తాయి. ఆ మృషాసలిలంలో (మృషా=అసత్యం) తలలు కుమ్మి (సంస్ఫాలన) విరిగిన కొమ్ములతో (శ్లథ+విషాణ) బాధపడుతూన్న అడవి దున్నలు (సైరిభాలు) కలది ఈ పర్వతం. చూశావా – అంటే అలా ఉద్విగ్నమవుతున్న సైరిభాలు అవిగో చూడు- అని

మరోవైపున గోమేధికాల ప్రభలు వ్యాపిస్తున్నాయి ఆ ప్రభల మొలకలు

తేనె రంగులో ఉంటాయి అది మిథ్యా మధుద్రవం దానిని తాగాలి అనే కోరికతో (లిలిక్షా) సమీపిస్తున్న ఎలుగుబంట్లు అవిగో చూడు. భల్లుకాలకు తేనె అంటే వల మాలిన ప్రీతి తేనెపట్ల కోసమే ఇవి చెట్టులు ఎక్కుతాయి పుట్టలు పీలుస్తాయి

అదిగో అటుచూడు నల్లటి గండ శిలలు(ప్రస్తరాలు). పెద్దపెద్ద బండలు ఏనుగుల్లాగా ఉన్నాయి నిజమైన ఏనుగులు కావు. అళీక గజాలు (అళీకం= అసత్యం). వాటిని పంజాతో కొట్టి, చీలిన గోళ్ళతో క్షోభిస్తున్న సింహసమూహం- అదిగో చూడు (శీర్యత్+ నఖ+ క్షుబ్ధ+ సింహకులము కలది మేరుపర్వతం)

ఇటు పైపున గరుడ పచ్చల కాంతి పుంజాలు (గారుడ+ అశ్మ+ ఛవి+ ఛటా) అవి గరిక పరకల రంగులో ఉంటాయి ఆ కపట యవస పూలికలను (దుబ్బులను) తినాలి అనే ధ్యాసకు పూర్తిగా లొంగిపోయి లేడి కూనలు (బాల మృగాలు) పరుగులు తీస్తున్నాయి మధ్యలో పద్మ రాగశిలా వితానం (సమూహం) అడ్డువచ్చింది. పద్మరాగాల కాంతులు (అబ్జం = పద్మం) ఎర్ర గా ఉంటుంది అంచేత ఆ బాలమృగాలు దాన్ని దావాగ్ని (కార్చిచ్చు) అనుకున్నాయి అనుకుని ఆ కూటదావాగ్నిని (అసత్య మైన దావానలం) దూకి దాటి వెడుతున్నాయి బాల మృగాలతో విలంఘ్య మానమవుతున్న అబ్జరాగ శిలా వితాన మనే కూట దావాగ్ని కలది ఈ మరుత్కుధరం (మరుత్=దేవతల, కుధరం=పర్వతం) అని అన్వయం ఓ అబలా అని సత్యభామకు సంబోధన పై సమా సాలు అన్నీ బహువ్రీహు లుగా మరుత్కు ధరానికి విశేషణాలు. అంతటా భ్రాంతి మదలంకారం

ఈ పద్యంలో అక్షరాల కూర్పు చూస్తే ఇది రాయలవారిది కాదు గదా అనిపి స్తుంది ఏ దృష్టినుంచి చూసినా దీన్ని ముద్దుపలుకు అనలేం, భావంలో సౌకుమార్యం ఉంది భాషలో అదిలేదు ఇటువంటిదే మరొక పద్యం - పున్నమినాటి చంద్రాస్తమయ వర్ణన (తెల్లవారితే పొద్దుమి)

తెల్లవారు జామున వైతాళికులు వచ్చి శ్రీకృష్ణుణ్ణి మేలుకొలుపు తున్నారు. ముందు శకార గుణింతంలో అం-అః వరకూ సంబోధనలు చేసారు అదొక గ్రథన వక్రత వందిమాగధుల చమత్కృతి.

శరధిక్రోడ నివేశ, శార్ఙ్గధర, శిష్టధ్యేయ,శీతాంశు భా
స్కర నేత్రద్వయ, శుభ్రవంకరుహభాస్వన్నాభ, శూరాన్వయా
భరణా, శేషశయాన, శైలధర, శోభారమ్య సర్వాంగ, శౌ
ర్యరసోదంచిత, శంఖచక్రధర, శర్వాణీ సహోయప్రియా॥ 2-57

హ్రస్వ ఎకారం హ్రస్వ ఒకారం సంస్కృతంలో లేవు కనక వదిలేసాడను కొందాం మరి ఋకారాన్ని ఎందుకు వదిలేసినట్టో!

శ్రీకృష్ణా పంజరాల్లో పెంపుడు చిల్కలు మేల్కొని తమకు మాటలు నేర్పే చెలువలను ముద్దులు గులికే పలుకులతో మేలుకొలుపుతున్నాయి నువ్వు కూడా

మేల్కో. చంద్రబింబం అప్పడే కాంతివిహీనమై పడమటి దిక్కున వెలవెల పోతోంది అంబు జాక్షా చూడు-అన్నారు అంబుజాలు అంటే పద్మాలు చంద్రుడు అస్తమిస్తున్నాడు కనక ఇక సూర్యుడు ఉదయిస్తాడనీ నీ కన్నులు పద్మాలు కనక వికసించాలనీ విప్పా రాలనీ తాత్పర్యం అస్తమిస్తున్న పూర్ణ చంద్రబింబాన్ని వైతాళికులతో వర్ణింపజేసిన పద్యం

చరమాద్రి దావాగ్ని సంప్లుష్ట సురసౌర
భేయీ కరీషైకపిండ మనగ
బహు చకోరక దంశ పరిపీత చంద్రికా
క్షౌద్రనీరస మధుచ్ఛత్ర మనగ
ప్రత్యఙ్ముఖోచ్చల ద్రాత్రి వర్షీయసీ
పలిత పాండుర కేశబంధ మనగ
గగన సౌధాలేపకర కాల శిల్పి ని
ర్ముక్త సుధావస్త్రముష్టి యనగ
సుమహిత జ్యోత్స్నికాలతా సుమగుళుచ్ఛ
మనగ నతిధూసరచ్ఛాయ నబ్జవైరి
చెలువు వోనాడి బింబావశిష్టు డగుచు
నల్ల నల్లన వ్రాలెడు నంబుజాక్ష! ౨-౮౨

దేవతల ఆవు కామధేనువు (సురల సౌరభేయి= ఆవు) అది పశ్చిమాద్రి మీద మేస్తూ తిరుగుతూ ఒక చోట పేడవేసింది అది సాయంకాలానికి ఎండి పిడక (కరీషం) అయ్యింది అది ఆ కొండ మీద రగుల్కొన్న దావాగ్నిలో (ఎర్రటి సాయంకాల సంధ్య) కాలిపోయింది.(సంప్లుష్టము) కచికగా మారిపోయింది ఇంకా దాన్ని ఎవరూ కదపలేదు. కనక ఆకారం యథాతథంగా ఉంది గుండ్రంగా అలాగే ఉంది. అదిగో ఆ కరీషైకపిండం లాగా ఉంది అస్తమిస్తున్న చంద్రబింబం అని ఉత్ప్రేక్ష

చకోరాలు గుంపులు గుంపులుగా చేరి, తుంపులు తుంపులుగా వెన్నెలను తాగేస్తాయట కౌముదీ మహోత్సవాలు జరుపుకుంటాయట (చకోరాలు, హంసలు తుమ్మెదలు- ఇలాంటివి కావ్యాల్లోనే దర్శనమి స్తాయి) చకోరాలు అనే తేనెటీగలు (దంశాలు)పూర్తిగా తాగేసిన వెన్నల అనే తేనె (క్షౌద్రం) దానితో రసవిహీనం అయి పోయి తెల్లగా వేలాడుతున్న తేనెపెర (తెట్ట) అన్నట్టు ఉంది చంద్రబింబం (నీరస+ మధుచ్ఛత్రం).

రాత్రికి వయసు గడిచిపోయింది ముసలిది అయిపోయింది. (వర్షీయసి=ముసలిది భిక్షువర్షీయసి=ముసలి బిచ్చకత్తె-శ్రీశ్రీకవితా శీర్షిక) ఆవిడ పడమటి దిక్కువైపు ముఖం ఉండేటట్టు కుక్కిమంచం మీద నుంచి ఎలాగో లేచి నడుస్తోంది (ప్రత్యక్+ ముఖ+ ఉచ్చలత్+ రాత్రి వర్షీయసీ) ఆవిడ నెరిసిపోయిన (పలిత) తెల్లటి జుట్టు ముడిలాగా ఉంది చంద్రబింబం (పాండుర+ కేశబంధం).

బేతవోలు

ఆకాశ సౌధానికి వెల్లవేస్తున్నాడు (ఆలేపకర) కాలశిల్పి. ఒక వస్త్రాన్ని కుంచెలా కర్రకు చుట్టి సున్నం కుండలో ముంచుతూ తెల్లవార్లూ వెల్లవేసాడు తెల్లవారే సరికి పని పూర్తి అయ్యింది ఇప్పుడు- కుంచెగా కట్టిన ఆ సున్నం గుడ్డను (సుధా వస్త్రం) కర్రనుంచి పీకేసి (నిర్ముక్తంచేసి) ఒక మాదిరిగా పిండి పిడచలా (ముష్టి) అటు పారేసాడు అదిగో ఆ సుధావస్త్ర ముష్టిలా ఉంది చంద్రబింబం.

అందమైన వెన్నెల తీగలకు (సువహిత+జ్యోత్స్నికా+లతా) దిగిన పుష్పగుచ్ఛం అన్నట్టుంది చంద్రబింబం. (గుళుచ్ఛము=గుత్తి. సుమ గుళుచ్ఛము= పూలగుత్తి)

వెలిబూడిద రంగులో (అతిధూసరచ్ఛాయన్) ఈ చంద్రుడు సొగసంతా కోల్పోయి (చెలువు పోనాడి) బింబమాత్రావశిష్టుడై మెల్లమెల్లగా అస్తమిస్తున్నాడు. (వ్రాలెడున్) ఓ అంబుజాక్షా నిద్రమేల్కో.

చంద్రుడు అబ్జవైరి. పద్మాలకు శత్రువు చంద్రోదయం అయ్యే సరికి పద్మాలు ముకుళించుకుపోతాయి కనక శత్రుత్వమని శ్రీకృష్ణుడు అబ్జాక్షుడు అంటే – నీ కంటికి శత్రువైన చంద్రుడు అస్తమిస్తున్నాడు కాబట్టి ఇంక నువ్వు మేల్కోవచ్చునని కూడా స్ఫూర్తి

పద్యమంతా ఉత్ప్రేక్షాలంకారమే. వస్తూత్ప్రేక్షలు కలిషం జగత్ప్ర సిద్ధమే కానీ అది చరమాద్రి దావాగ్ని దగ్ధం కావడం కవికల్పన. కాబట్టి కల్పిత-ఉపమాన వస్తువు ఉత్ప్రేక్ష ఇలాగే తక్కిన మూడు చోటుల్లోనూ వెన్నెలలో లతాత్వాన్ని ఆరోపించి చంద్రబింబంలో కుసుమత్వాన్ని చూపించాడు కాబట్టి ఇది తాద్రూప్యరూపకాను ప్రాణితోత్ప్రేక్ష ఒకే కవి లేదా కవి నిబద్ధ వ్యక్తి – వైతాళికుడు-శశిని అయిదు రకాలుగా సంభావించాడు కనక ఉల్లేఖం వెరసి మూడు అలంకారాల సంసృష్టి

ఉత్ప్రేక్షలకి రాయలువారు పెట్టింది పేరు. ఆయుగంలో వెలువడ్డ కావ్యాలు అన్నింటా ఈ వీరవిహారం కనపడుతూనే ఉంటుంది. కవి ప్రతిభ కు సంబంధించిన అనల్ప కల్పనాశక్తికి ఉత్ప్రేక్ష ఒక సాముగరిడీ. అనంత పరిశీలనకూ ఇది కాణాచి పరిచిత శాస్త్ర పాండితిని కవిత్వంగా చేసుకోవ డానికి ఈ అలంకారం అపరిమితంగా అవకాశమిస్తుంది సరే–

ఇంతకీ ఈ పద్యరచన చూస్తే ముద్దుపలుకు అనిపించదు ఆ మేరు పర్వత వర్ణనలో కానీ ఈ చంద్రాస్తమయ వర్ణనలో కానీ రసస్పర్శ లేదు కేవల వస్తువర్ణనలు. అందుకని రసోచితంగా కూర్పు సాగించ వలసి న నియమనిబంధన కవికి లేదు తనకు ఇష్టమైన శైలిలో సాగించవచ్చు ఇటువంటి చోటనే సహజశైలి బయటపడు తుందనుకుంటే ప్రబంధ కవులది అందరిదీ ఓజోగుణప్రధానమైన ప్రౌఢశైలి అని చెప్పవచ్చు అయితే కొందరు రామరాజభూషణుడు లాంటివారు శ్రవణ సుభగత్వాన్ని ఎక్కువగా పాటించారు కొందరు అంతగా పాటించలేదు అంతే తేడా. స్వరోచి వేటను వర్ణిస్తూ పెద్దనగారు రాసిన పద్యం చూస్తే ఈ విషయం ఇంకా స్పష్టపడుతుంది –

చకితైణాహుతి దావ, మావలిత పుచ్ఛస్వల్ప గచ్ఛత్తర
క్షుత,మద్రి గ్రహయాళు భల్లుకము, వక్షోభాగ నిక్షిప్త డిం
భక వల్గత్ ప్లవగీకదంబము, హ్రదాంభఃప్రోక్షిత క్రోడవా
యక, మాభీల ముఖ ద్విపి స్థపుటితం బయ్యెన్ వనం బత్తఱిన్(మను.4-38)

పారిజాతాపహరణం చేస్తానని మాట ఇచ్చి, రేపే అమరావతి మీదకి దండెత్తు తానని శ్రీకృష్ణుడు సత్యభామ కోపాన్ని చల్లార్చాడు ఆవిడ మామూలు మనిషి అయ్యింది. కులాసాగా జూదం ఆడుకుంటున్నారు ఇంతలోకే సాయంకాలం అయ్యింది. సూర్యుడు అస్తమించాడు

ఆయత తేజముల్డిగి యంబుజ బాంధవు డస్తసీమకుం
బోయిన జాడ, లేచిన తమోవిభు డంప దినాంత యోధు డీ
చాయ దదీయపత్ని బెలుచం బడ నీడ్చికొంచు బోయెడుం
గోయను మాడ్కి నంతట శకుంత రవంబు సెలంగె వెల్లెడన్. (౨-౩౦)

సూర్యుడు అస్తమించే సరికి చీకట్లు వ్యాపిస్తున్నాయి మేతకు వెళ్ళి గూళ్ళకు తిరిగి వస్తున్న పక్షుల (శకుంతాలు) కలకలారావాలు మిన్ను ముట్టుతున్నాయి దీన్ని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు.

వాడనైన కిరణాలు- విస్తృతమైన అధికారాలు- అవి తరిగిపోయి అంబుజ బాంధవుడు (సూర్యుడు అనే ఒక రాజు) అస్తసీమకు వెళ్ళిపో యాడు. ఓడి పడమటి కొండల్లోకి పారిపోయాడు. సూర్యుణ్ణి ఓడించి గెలు పొందినవాడు తమోవిభుడు- చీకటి అనే మరొక రాజు సూర్యుడు పారి పోయే వరకూ వేచి ఉన్న ఈ తమోవిభుడు అదను దొరికింది కదా అని ఇప్పుడు విజృంభిస్తున్నాడు తన నమ్మినబంటుని- దినాంత యోధుణ్ణి (సాయంకాలం అనే ఒక యోధుడు) పంపించి సూర్యుడి భార్యను (ఛాయ) చెరపట్టి ఈడ్చుకు రమ్మన్నాడు ఆ యోధుడు వచ్చి ఇదిగో ఈ వైపునుంచి (పడమటిదిశనుంచి) ఆవిణ్ణి బలవంతంగా(పెలుచన్) పడ నీడ్చుకుపోతున్నాడు బాబోయ్ అని (కో అనుమాడ్కిన్) పక్షులన్నీ గోలగోలగా లోకానికి చాటి చెపుతున్నట్టు, రక్షించండి రక్షించండి అని అరుస్తున్నట్టు- అన్ని వైపులా శకుంత రవాలు మిన్ను ముట్టాయి

ఛాయా శబ్దానికి తద్భవరూపం చాయ. ఈ చాయన్ అంటే ఈ వైపున అనే కాకుండా ఈ ఛాయాదేవిని అని కూడా

సురభి వ్యాఖ్యాత శ్రీదూసి శ్రీరామమూర్తి శాస్త్రిగారు ఛాయాదేవి యే కోయని కుయి పెట్టినట్టు శకుంతరవం వ్యాపించింది అని సమన్వయించారు ఆవిడ ఎంతగా గగ్గోలు పెట్టినా ఒక వ్యక్తి ఏడుపూ అరుపులూ అనేకశకుంతరవంగా భాసించడం అసహజం. అంచేత ఆ దౌర్జన్యానికి పక్షులే కోయని గోలచేసినట్టుగా ఉంది అనడం సమంజసం వర్ణనీయ వస్తువు శకుంతరవమే

నీడలు పడమటినుంచి తూర్పు దిశకు వ్యాపిస్తాయి కనక ఛాయ ను ఎవడో

పడనీడ్చుకుపోతున్నట్టుంది అనడం కుదురుతోంది

యుద్ధాలు గెలుపులు ఓటములు గెలిచిన రాజు ఓడిపోయిన రాజుగారి అంతఃపురాన్ని చెరపట్టడాలు అంతఃపుర కాంతలను అవమానిం చడాలు- ఇవన్నీ రాయలకాలం నాటి పరిస్థితులు ఆ దృశ్యాన్ని ఇక్కడ కలగలిపాడు తిమ్మన ఇటువంటి వర్ణనలు రెండు మూడు ఉన్నాయి పారిజాతాపహరణంలో. బహుశ అప్పట్లో ఇవి అధికంగానే జరుగుతూ ఉండేవేమో! సుకుమారుడు తిమ్మన మనస్సు మీద ముద్రపడి ఉంటాయి పట్టి పీడించి ఉంటాయి.

సూర్యుడు అస్తమించి చీకట్లు వ్యాపిస్తే చక్రవాక పక్షులకు (జక్క వలు) కళ్ళు కనిపించవుట. ఒకే సరోవరంలో ప్రక్కప్రక్కనే ఉన్నా చక్రవాక దంపతులు పరస్పరం చూసుకోలేక విరహబాధతో అలమటి స్తాయట ఇది చూపరుల మనసుల్ని కలచివేస్తుంది మరీ సుకుమారుల యితే వాటి విరహవేదన చూడలేక కళ్ళు మూసు కుంటారు ఈ సున్నితమైన భావాన్ని అంతకంటే సున్నితంగా చెప్పాడు

ఇనుదెస జూడనోడి తల లెత్తక, నీట దదీయ బింబముం
గని- వగ జక్కవల్మొగంబులు సూచుచు గుంది మూర్ఛజెం
దిన దెస జూడ లేక, జలదేవత- హాయని కన్ను మోడ్చెనాన్
వనరుహముల్ ముకుళించె-సహవాసుల దుఃఖము నెయ్యురోర్తురే ౨-౩ ।

అస్తమిస్తున్న తమ ఆప్తుడు సూర్యుడి వైపు (ఇనుదెసన్) చూడటానికి సైతం భయపడుతున్నాయి జక్కవలు చూడటానికి జంకి (చూడన్ ఓడి) తలలు ఎత్త కుండా నీళ్ళల్లోకే చూస్తున్నాయి అయితే ఆ నీళ్ళల్లోనే సూర్య బింబం ప్రతిఫలించి కనపడింది అస్తమించ బోతున్నాడని తెలిసిపోయిం ది తెల్లవార్లూ ఇంక విరహం తప్పదు. ఆ దిగులుతో (వగన్) జక్కవలు మొగమొగాలు చూసుకుంటూ బాధపడి (కుంది) మూర్ఛపోయాయిట కష్టకాలం ఇంకా రాకముందే భయంతో మూర్ఛపో యాయి

అవ్వి అలా మూర్ఛపోయిన వైపుకి చూడలేకపోయింది జల దేవత ఈవిడ అంతకన్నా సుకుమారి. సరోవర జలదేవత కదా అంతరం గంలో ఆర్ద్రత ఎక్కువ. అంచేత అటువైపే చూడలేకపోయింది పైగా జక్క వలు తన సహవాసులు. తనతో పాటే ఆ సరోవరంలో ఎంతోకాలంగా నివసి స్తున్న ప్రాణులు. (సహవాసి= కలిసి తనతో నివసించేవాడు స్నేహితుడు). అంచేత తట్టుకోలేక "హా" అని కళ్ళు మూసేసుకుందిట అలా మూసేసు కున్నదా అన్నట్టు (కన్ను మోడ్చెనాన్) సరోవరంలో పద్మాలు (వనరుహ ముల్ వనము = నీరు)ముకుళించుకున్నాయి అవిడ సరోవర జలదేవత కనక పద్మాలే కన్నులు ఆ కన్నుల్ని మూసేసుకుంది. అవును సహవాసుల దుఃఖాన్ని స్నేహితులు (నెయ్యురు) ఓర్చుకోగలరామరి (అర్థాంతరన్యాసా లం కా రం).

సూర్యాస్తమయంతో పద్మాలు ముకుళించుకుపోతాయి. జక్క వలు విరహానికి లోనవుతాయి ఇవి రెండూ ఒకే సరోవరంలో జరుగు తా యి. జలదేవతలు

ఉన్నారని విశ్వాసం ఇవన్నీ కలిపి కథ అల్లి ఒక కరుణ రసార్ద్ర సన్నివేశాన్ని, దృశ్యాన్ని మనముందు ఉంచాడు.

సూర్యుడు అస్తమించగానే పడమటి దిక్కున సంజెవెలుగులు ఎర్రగా వ్యాపించాయి ఆ సాంధ్య రాగాన్ని వర్ణిస్తున్నాడు.

తనువున నంధకారపు మదం బల మిన్నను భద్రదంతికి
న్మొనసిన జిందరేగి తపనుం డను మావుతు గ్రుంకుమెట్ట లో
యు నురలపైచిన న్నొగిలి యచ్చట నెత్తురు గ్రక్కెనో యనం
గనుగవ గోరగింప బొడకట్టె సముజ్జ్వల సాంధ్యరాగముల్ (2-32)

ఏనుగులకి ఒక్కొక్కసారి మదమెక్కుతూ ఉంటుంది అప్పుడు వాటిని లొంగ దీసుకోవడం ఎవడివల్లాకాదు మావటీడునికూడా లెక్క చెయ్యవు విసిరేస్తాయి. చెలరేగిపోతూ ఉంటాయి.

ఆకాశం అనే భద్రదంతికి (పట్టపుటేనుగు) తనువంతా అంధ కారం అనే మదం వ్యాపించిందట అలా మదం మొనసే సరికి అది మరీ చెలరేగి పోయింది (చిందరేగి) తనమీద కూచున్న సూర్యుడు అనే మావటి వాణ్ణి (తపనుండు+ అను+ మావుతున్) తీసుకు వెళ్ళి పశ్చిమాద్రి లోయలో పడేసింది (ఉరలన్ పైచినన్) వాడు దెబ్బలు తగిలి (నొగిలి) అక్కడ నెత్తురు కక్కుకున్నాడో అన్నట్టుగా గ్రుంకు గట్టు మీద సముజ్జ్వల సాంధ్య రాగాలు- బాగా ఎర్రని సంజకాంతులు పొడకట్టాయి వాటిని చూస్తోంటే కనుగవ కోరగిస్తోంది. ఆ ఎర్రదనం సముజ్జ్వలంగా చిక్కగా ముదురు రంగులో ఉండటంతో కళ్ళు చిట్లించుకుని చూడవలసి వస్తోం దని (కోరగించుట= ముకుళించుట)

అంధకారము అనే మదం మిన్ను అనే భద్రదంతి తపనుడు అనే మావుతు- ఇవి రూపకాలు. నెత్తురుగ్రక్కెనోయనన్ అనేది ఉత్ప్రేక్ష. సాంధ్యరాగము-నెత్తురు ప్రకృతాప్రకృతాలు రెండూ ప్రయుక్తమయ్యాయి కనక ఉక్తవస్తూత్ప్రేక్ష

మళ్ళీ సరోవరం దగ్గరికి వస్తున్నాడు ఒక మగతుమ్మెద సరోవరం చుట్టూ ప్రదక్షిణలు కొడుతోంది సూర్యాస్తమయం కావడంతో అప్పటికే ముకుళించు కుపోయిన ఒక పద్మం దగ్గరికి వెడుతోంది రొదచేస్తూ ఎగురుతోంది అందులోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తోంది. రేకతలుపులు తెరుచుకోవడం లేదు ప్రవేశించ లేక వెనక్కి వచ్చి మళ్ళీ సరోవరం చుట్టూ తిరుగుతోంది ఈ దృశ్యానికి భావుకత జోడించి అందిస్తున్నాడు కవి

ఒక భృంగంబు పరాళినీ మదన తంత్రోన్మాది- ప్రాణేశ్వరిన్
మకరందాసవమత్త నబ్జగృహసీమన్ బెట్టి, తా బోయి సం
జ కడ న్వచ్చి తదానమున్ముకుళ మే జాడం జొరన్ రాక, యా
మికుడో నా దిరిగెం గొలంకు రమకున్- మేలెంత హీనంబొకో!! (2-33)

ఒక గండు తుమ్మెద మగ మహారాజు. అతడు పరాయి ఆడతుమ్మెదలతో

(పర+అళనీ) మన్మధ తంత్రాలు నడపడానికి అలవాటు పడ్డాడు అదొక ఉన్మాదం ''మదపిచ్చి'' పట్టింది అతడికి. తన ప్రాణేశ్వరిని తన ఆడతుమ్మెదను పద్మ గృహంలో పెట్టేసాడు ఆవిడ పద్మంలో ఉండే మకరందం అనే ఆసవం(మద్యం) తాగి మత్తెక్కి ఉంది ఆ పరిస్థిలో ఆవిడను ఇంటిలో పెట్టి ఈ మగతుమ్మెదగాడు తన తిరుగు ళ్ళకి పోయాడు విహారా లు పూర్తిచేసుకొని సాయంకాలానికి (సంజకడన్) ఇంటికి వచ్చాడు ఈలోపులో ఈ పద్మగృహం మొగ్గలా ముకుళించుకుపోయింది. ఒక వక్కకి రవ్వంత ఒరిగిందికూడా (అనమత్+ముకుళము). దాని చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా ఏ రకంగానూ (ఏ జాడన్)లోపలికి ప్రవేశించడానికి వీలు కాలేదు పద్మదళ కవాటాలు తెరుచుకోలేదు. లోపల ఇల్లాలు భీష్మించు కుని తలుపులు వేసుకుని కూర్చు న్నట్టయ్యింది ఇంక చేసేది లేక ఆ సరోవర లక్ష్మికి (కొలంకు+రమకున్) కాపలా దారుడులాగా (యామికుడో నాన్) తిరుగుతున్నాడు మేలు. బాగుబాగు ఎంత నీచమోకదా !

యామికుడు అంటే రాత్రిపూట కర్ర తాటించుకుంటూ కాపలా తిరిగే మనిషి. తలారి తిరుగుబోతుల బతుకు ఇలా అయిపోతుందని హెచ్చరిక మేలు మేలు - ఎంత హీనమో కదా అని ఆశ్చర్యం

మేలు= ఉపకారము ఎంత హీనంబొకో= ఎంత శూన్యమో కదా సరోవరలక్ష్మికి గల యుపకారబుద్ధిశూన్యతను వెల్లడించె-అని సురభి వ్యాఖ్య ఇది చింత్యం

అలా తిరగడం ఎంత హైన్యమెుకో అనాలి. భావార్థకం లేకుండా దర్మివాచకాన్ని ప్రయోగించాడు ఇది కుదరదు. అందుకని శ్రీ దూసివారు అలా అన్వ యించి ఉంటారు కానీ అవసరం లేదు యామికుడో నాన్ తిరిగెన్. ఆ పని ఎంత హీనమో అని అన్వయించుకోవచ్చు, లేదా భావ ప్రధాన ప్రయోగం అనే సమన్వయం ఉండనే ఉంది అనుకూలవతి నాదు మనసులో వర్తించు కులకాంత మదినెంత కుందునొక్కొ (మను. 2- 7) అన్నచోట ఆనుకూల్యవతి అనడానికి బదులు అనుకూలవతి అన్నాడు పెద్దన దాన్ని భావ ప్రధాన ప్రయోగంగానే (భావార్థక ప్రత్యయం లేకపోయినా భావార్థ బోధకంగా) సమన్వయించారు

ఈ పద్యాన్ని పోలిన పద్యాలు అనంతరకావ్యాల్లో చాలా ఉన్నాయి ఈ భావం చాలా మంది కవుల్ని ఆకర్షించింది ప్రభావితుల్ని చేసింది. తుమ్మె ద త్రిమ్మరీడు పయిదోచు పిశంగిమ పద్మినీ నిశాంకమ్మది తా బరాగపటి గప్పి- అంటూ వసుచరిత్ర 3- 38

క్రమక్రమంగా చీకట్లు వ్యాపించాయి. అంధకారం జగమంతటా ఆక్రమించింది

దినవారాశి మాపను మౌని గ్రోలంగ

నడుగున గనుపట్టు వసు లనంగ

గ్రుంకు మెట్టడవి గార్కొనిన సంధ్యావహ్ని
బొడమిన దట్టంపు బొగ యనంగ
దన మణి పడిపోవ ధరణీతలంబున
నెమకంగ వచ్చిన నింగి యనగ
నల చుక్కలనియెడి వలరాజు గెలుపువ్రాల్
దెలియ బూసిన మషీలేప మనగ
వృద్ధవారవిలాసినీ విసరమునకు
నపలితంకరణౌషధం బనగ, జార
నలినముఖుల కదృశ్యాంజనం బనగ
నంధకారంబు జగమెల్ల నాక్రమించె 2-34

పగలు అనే సముద్రాన్ని (వారిరాశిన్) మాపు (రాత్రి) అనే మౌని తాగేశాడు అగస్త్యుడు సముద్రాన్ని తాగిన కథ అలా తాగేస్తే అట్టడుగున కనిపించే బురదలాగా (అసలు= బురద) ఉంది ఈ అంధకారం సము ద్రం నీలంగా ఉంటుంది కనక దాని అడుగున ఉండే బురద నల్లగా చీకటి లా ఉండవచ్చునని

క్రుంకు మెట్ట అంటే అస్తాద్రి. సూర్యుడు క్రుంకే పర్వతం దాని మీద అడవి ఉంది ఆ అడవిలో సంధ్యావహ్ని వ్యాపించింది సాయంకాల సంధ్య ఎర్రగా ఉండ టంతో అది ఆ పర్వతం మీద వ్యాపించిన దావానలంలా భాసించింది అడవి అంటు కొంది కాబట్టి పొగ పుడుతుంది. అలా పుట్టిన దట్టమైన పొగలాగా ఉంది అంధకారం సాంధ్యకాంతి అగ్నీ కాదు, అంధ కారం పొగా కాదు. కల్పన

సూర్యుడికి ద్యుమణి, నభోమణి అని పర్యాయపదాలు ఆకాశా నికి మణి అని ఆ మణి పడిపోయింది అస్తమించాడు అలా పడిపోతే నేలమీద వెదుక్కుందా మని దిగివచ్చిన నింగిలాగా ఉంది అంధకారం నల్లటి ఆకాశం మెత్తగా నేలకు వాలినట్టు ఉంది అని

ఆకాశంలో నక్షత్రాలు మన్మథుడి గెలుపువ్రాలు.(వలరాజు= మన్మ థుడు). ఆకాశం అతడి జయస్తంభం. దాని మీద విజయశాసనం చెక్కించాడు అందులో అక్షరాలు స్పష్టంగా, చదవడానికి వీలుగా కని పించాలి అంటే మసిపుయ్యాలి. నక్షత్రాలు అనే గెలుపువ్రాలు కనపడడానికి (తెలి యు) వీలుగా పులిమిన మషీలేపంలాగా ఉంది అంధకారం.

ముసలి వారవిలాసినులు ఉంటారు (ముసలి వాళ్ళు అయ్యాక ఇంకా విలాసినులు ఏమిటో వయసు అయిపోయినా విలాసాలు పోలేదని కాబోలు!!) ఆ సమూహానికి (విసరము) అపలితం కరణ - ఔషధం అన్న ట్టుంది అంధకారం. పలితము అంటే జుట్టు నెరిసిపోవడం అపలితం కరణ+ ఔషధం- జుట్టుని నల్లబరిచే మందు వాళ్ళ వయస్సుని బయట పడనియ్యకుండా అంధకారం ఔషధంలా పనిచేస్తోందని

జారకాంతలకు అదృశ్యాంజనంలాగా ఉంది అంధకారం. ఒక రకం అంజనం పులుముకుంటే మనిషి అదృశ్యమైపోతాడట. ఎవరికీ కన పడకుండా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లవచ్చు. వీళ్ళు జారకాంతలు ఎవరికంటా పడకుండా సంకేత స్థలాలకు చేరుకోడానికి ఈ అంధకారం అంజనంలా పనిచేస్తోంది (నలినముఖి=పద్మముఖి) తమోభిసారికలకు చాలా అనుకూలంగా ఉంది అని పువ్వులు మానేసి, జుట్టు విరబోసుకుని నల్లని బొట్టుపెట్టుకొని,కాటుక దిట్టంగా బుగ్గలకి కూడా పులుముకొని, నల్లటి చీర కట్టుకొని, నల్లరంగుగాజులు బిగువుగా వేసుకుని చీకట్లో చీకటిగా కలిసిపోతూ సంకేత స్థలాలకు చేరుకునే జారకాంతలను తమో భిసారికలు అంటారు తెల్లటి మేలి ముసుగు, మంచి గంధపు బొట్టూ మైపూత, ముత్యాలహారాలు-వగైరా అలంకారాలతో వెన్నెలలో వెన్నెలలా కలిసిపోయే జారిణులను జ్యోత్స్నాభిసారికలు అంటారు.

ఈ అభిసారికలు చీకటి శాశ్వతంగా ఉండిపోవాలని కోరుకుం టున్నారు రకరకాల దేవతలకి మొక్కుకుంటున్నారు

చిలుక తేరును నల్లచెఱకు విల్లును గల్వ
విరితూపు నిత్తుము మరుడ! నీకు
వనమాలికయు నూత్న వంశనాళమును బిం
ఛము సమర్పింతుము శౌరి! నీకు
గప్పె గప్పడమును కస్తూరియును గాటు
కయు నివేదింతుము కాళి! నీకు
నేరేడు బండ్లు వినీల చామరలు దూ
ర్వలు నొసంగుదు మిభవక్త్ర! నీకు
నిట్టి లోకోపకారికి నిరులుదొరకు
ఇంద్ర సూర్యాది దుర్దోష శాంతి వొదలి
నిత్యత వహింప జేయంగ నేర్తురేని
యనుచు బ్రార్థించి రభిసారికాబ్జముఖులు. (౨-౩౮)

" ఇరులు" అనే పదంలో 'లు' బహువచన ప్రత్యయం కాదు శబ్దంలోదే ఈ పదం నిత్య బహువచనార్థకం చీకటి- చీకట్లు అని అర్థం

ఇంతగా లోకోపకారం చేస్తున్న " ఇరులు దొరకు" (చీకటి దొర) చంద్రుడూ సూర్యుడూ మొదలైన గ్రహాల దృష్టిదోషం (అశుభవీక్షణం) తగలకుండా, దోషశాంతి లభించి (వొదలి)చీకటికి మీరు శాశ్వతత్వాన్ని కలిగింప జెయ్యగలిగితిరా-

ఓ మన్మథుడా. (స్మరుడు-మరుడు) నీకు చిలక రథం (తేరు) ఇస్తాం. నల్ల చెరుకు విల్లు ఇస్తాం నల్లకలువపువ్వు పుష్పబాణంగా (విరి తూపు) ఇస్తాం

ఓ శౌరీ! నీకయితే వనమాలిక ఇస్తాం ఒక కొత్త పిల్లన గ్రోవి ఇస్తాం (వంశము=వెదురు నాళము=గొట్టం-మురళి) నెమలిపింఛమూ

సమర్పిస్తాం

ఓ కాళికాదేవీ! నీకు నల్లటి దుప్పటీ ఇస్తాం కస్తూరి ఇస్తాం కాటుక ఇస్తాం

ఓ గజాస్యా (ఇభ+ వక్త్ర) నీకయితే నేరేడుపళ్ళు ఇస్తాం వినీల చామ రాలు-(నీల వీచోపులు) ఇస్తాం ముదురాకుపచ్చ గరికలు (దూర్వాంకు రాలు- దూర్వలు) ఇస్తాం

మీలో ఎవరయినా ఒకరుగానీ అందురూ కలిసిగానీ ఇరులు దొరకు శాశ్వతత్వం కల్పించండి అతడు లోకోపకారి మహానుభావుడు- అని అబ్జముఖులైన అభిసారికలు ప్రార్థించారు

ఏ దేవుడికి ఇష్టమైన వస్తువులు ఆ దేవుడికి మొక్కుకున్నారు అన్నీ నల్లటి వస్తువులే నల్లటి దేవలతలే నల్లటి చీకటికి శాశ్వతత్వం కోరుకుం టున్నారు. కనక ఔచిత్యం అయితే వీటిలో ' చిలుకతేరు'' 'దూర్వలు'' నల్లటి వస్తువులు కావు. వనమాలిక అంటే - ఆకులూ పువ్వులూ కలిపి కట్టే కదంబమాల ఇదీ నల్లగా ఉండదు కానీ ముదురాకుపచ్చ దూరానికి నల్లగానే కనపడు తుంది కాబట్టి వీటిని నల్లని వస్తువులుగా పరిగణించవచ్చు

ఈ చర్చకన్నా కవి ఆలోచనలో ఉన్న కొత్తదనాన్ని ఆనందించడం సమంజస మనుకుంటాను ఇది సీసపద్యం ప్రతిపాదం చివరా రెండు సూర్యగణాలు వస్తాయి చివరి సూర్యగణం నాలుగు పాదాల్లోనూ సమా నం ''నీకు ' అని దాని ముందటి సూర్యగణం సంబోధనగా కూర్చాడు నాల్గవ పాదంలో'' ఇభవక్త్ర'' అన్నప్పుడుకూడా సంబోధన సూర్యగణానికి వ్యాపించి అక్కడికే ముగిసింది నియత గణాలు కాని పద్యంలో రచనా పరంగా ఇటువంటి సమతౌల్యాన్ని పాటించడం ఒకానొక శిల్ప విశేషం

మొనసినదీపికా నికరముల్ గృహకార్యగతాభిసారికా
వనితల యూర్పు గాడ్పుల నెపంబున గంపము నొంద, నోడకుం
డని తిమిరంబు తా నభయహస్తము లిచ్చె ననంగ వాని పై
గనుగొన బొల్చె నంకురిత కజ్జలముల్ నవధూమ మాలికల్ (2-30)

(మొనయుట=ఉండుట మొనసినదీపిక=వెలుగుతున్నదీపం నికరములు=సమూహాలు)

వీథులలో చీకట్లు ఇంకా దట్టంగా వ్యాపించ లేదని చెప్పి అభిసారి కలు ఇళ్ళలోనే ఉండిపోయారు కాలక్షేపానికి ఏవో ఇంటి పనులు చిన్నవీ పెద్దవీ కల్పించుకుని చేస్తునారు అప్పటికే ఇళ్ళల్లో దీపాలు పెట్టారు గృహకా ర్యగతలైన అభిసారికావనితల నిట్టూర్పుగాలుల వంకతో (నెపంబు =నెవంబు) ఆ దీపాలు అల్లల్లాడుతున్నాయి జ్వాలలు కదులుతున్నాయి. గృహకృత్యాల తో అలిసిపోయో, ప్రియుల్ని కలుసుకోవడానికి ఆలస్యం అయిపోతోందనే బెంగతోనో అభిసారికలు గాఢంగా నిట్టూరుస్తున్నారు వెలుగుతున్న దీప జ్వాలలు ఆ గాలులకి కంపిస్తున్నాయి

కదిలినప్పుడల్లా ఆ జ్వాలల శిఖల నుంచి పొగలు తీగల్లా అటూ ఇటూ వ్యాపిస్తున్నాయి. ఆ నవ ధూమమాలి కలు అంకురించిన కాటుక కలవి ఆ పొగల్లో కజ్జలం ఉంది అని

దీపం ఆరిపోకుండా ఏదయినా మూకుడు సంగోరు బోర్లిస్తే దానికి లోపలి వైపున కాటుక కడుతుంది. వెనకటికి ఆదోరకం (ఆముదం) దీపాలతో కాటుక ఇలాగే తయారుచేసేవారుట

ఇంతకీ అటూ ఇటూ వ్యాపిస్తున్న ఆ పొగలు ఎలా ఉన్నాయంటే- నిట్టూర్పు గాడ్పులకి ఆరిపోతాయేమో అని భయపడి కంపిస్తున్న ఆ దీపా లకు '' మీరు భయపడ కండి ''(ఓడకుండు = జంకకుడు) ''నేనున్నాను'' అని తిమిరం తానై వచ్చి అభయ హస్తాలు ఇచ్చినట్టుగా ఉన్నాయి దీపానికి అటూ ఇటూ అభయహస్తం నిలబెట్టినట్టు (జీవితభీమావారి చిహ్నం) పొగలు ఉన్నాయి అవి చీకటిదేవుడి హస్తాలు కనక నల్లగా ఉన్నాయి మెలికలు తిరుగుతున్న పొగ ఆకారం హస్తంలాగా ఉండవచ్చు

ధూమమాలికల్ని తిమిరదేవత అభయహస్తాలుగా ఉత్ప్రేక్షిం చాడు. బొమ్మకట్టించాడు ఇదొక భావచిత్రం తరువాత నక్షత్రోదయాన్ని చూపిస్తున్నాడు.

కార్కొన్న కటిక చీకటి మొగుల్మొత్తంబు
గురిసిన వడగండ్ల గుంపులనగ
గవజక్కవలు వాయ గరనాళముల జందు
రు ండూదు పటికంపు టుండ లనగ
నెల్లెడ మిన్నేటి యిసుమున వచ్చర
లొమ లిడ్డ వెన్నెల కుప్పలనగ
దెలివి వెన్నెల పెండి తీవెలు నిగిడించు
చదలు కమ్మచ్చు బెజ్జము లనంగ
జగము గెల్వంగ దండెత్తు మగని మీద
లీల రతి చల్లు దీవన బ్రాలనంగ
వేడి వెలు గెండ గ్రాగిన విన్ను మేన
నెక్కొను చెమట బొట్లనా జుక్క లమరె 2-37

చుక్కలు పొడిచాయి అవి ఎలా ఉన్నాయో ఆరు ఊహలు చేసాడు.

కమ్ముకొన్న (కార్కొన్న) కటికి చీకటి అనే మేఘ సమూహం (మొగులు మొత్తము) కురిసిన వడగళ్ళ గుంపులు అన్నట్టుగా ఉన్నాయి చుక్కలు. చీకటి నల మబ్బులా ఉంది చుక్కలు వడగళ్ళలా ఉన్నాయి.

జంటలు జంటలుగా సరోవరాల్లో తిరుగుతున్న జక్కవలు (చక్రవాకాలు) పారిపోయేటట్టుగా (పాయన్) చంద్రుడు తన కిరణాలు అనే గొట్టాలతో (కరనాళ ములన్) ఊదుతున్న స్ఫటికంపు గుండ్లలాగా ఉన్నాయి చుక్కలు.

ఆరబోసిన కాయల్నీ గింజల్నీ తినడానికి పిట్టలు వాలితే వాటిని తరమడానికి గొట్టాల్లో మట్టి ఉండలు పోసి గట్టిగా ఊదతూ ఉంటారు అవి వెళ్ళి పిట్టలమీద పడతాయి. ఎగిరి పోతాయి పిట్టల్నిఎగరగొట్టడమే లక్ష్యం. హాయన్ చేయుట అంతే కానీ చంపడానికి కాదు వర్షిస్తున్నది చుక్కల్ని కనక పటికంపుటుండలు అన్నాడు. చంద్రుడు కర్త కరనాళాలు సాధనం జక్కవలు లక్ష్యం.

ఆకాశగంగలో అప్సరఃకాంతలు (కొమ్మ-కొమ=స్త్రీ) జలకాలు ఆడి ఆడీ ఇసుక తిప్పల మీద వెన్నెల కుప్పలు చేసారుట కూచుని తడి ఇసుకని పాదం మీద ఒత్తి నెమ్మదిగా పాదం ఇవతలికి లాగేస్తే ఇసుకకుప్ప ఏలు
స్తుంది వీటినే వెన్నెల కుప్పలు అంటారు. గంగలో ఇసుకతెల్లగా ఉంటుంది ఆ ఇసుకతో (ఇసువమునన్) చాలావుంది అప్సరసలు చాలా కుప్పల్ని అక్కడా అక్కడా ఆకాశంలో(ఎల్లెడన్) నిలిపారు చుక్కల్లా అవి దూరానికి చిన్నవిగా కనిపిస్తాయి. అలా ఇడిన (ఇడ్డ) వెన్నెల కుప్పలో అన్నట్టుగా ఉన్నాయి నక్షత్రాలు

తెల్లని వెన్నెల (తెలివి=స్వచ్ఛమైన) అనే వెండి తీగల్ని సాగదీయ డానికి ఆకాశం అనే కమ్మచ్చుకి రంధ్రాలో అన్నట్టు ఉన్నాయి చుక్కలు కమసాలి వెండి బంగారం తీగల్ని సన్నగా సాగదియ్యడానికి ఉపయోగించే పనిముట్టు కమ్మచ్చు. దీనికి చిన్నాపెద్దా పరిమాణాల్లో చాలా బెజ్జాలు ఉంటాయి.(బెజ్జం=రంధ్రం ఈ మాటకూడా ఆ వృత్తికి సంబంధించిందే) పెద్దబెజ్జంలో ముందుగా లాగి క్రమ క్రమంగా చిన్న బెజ్జాలలో లాగుతూ కావలసినంత సన్నగా తీగని తయారుచేస్తారు తీగ సన్నం అవుతున్న కొద్దీ పొడవు పెరుగుతూ ఉంటుంది. లాగే టప్పడు ఈ బెజ్జాల్లో ఒకరకం కందెన కూడా (నూనె) స్వల్పంగా వేస్తారు తెలివి వెన్నెల అనే వెండి తీగల్ని (తీగె = తీవె) లాగుతున్నాడు కాబట్టి బెజ్జాలు తెల్లగా ఉన్నాయి. లేదా ఆ బెజ్జాలలో నుంచి వెనక్కాల ఉన్న వెలుగు కనపడుతోందని కానీ

రాత్రి అయ్యింది కనక ప్రపంచాన్ని జయించడానికి మన్మథుడు దండెత్తు తున్నాడు. రాత్రిపూట మన్మథభావాలు విజృంభిస్తాయని భావం అలా దండయాత్రకు బయలుదేరుతున్న మగడిమీద వీరపత్ని రతీదేవి ''జయో஽స్తు'' అని శుభాకాంక్షలతో ''దీవెనబ్రాలు'' చల్లుతోందిట యుద్ధానికి వెళ్ళే వీరులమీద కులకాంతలు అక్షతలూ పేలాలూ చల్లుతారు అది శుభప్రదం, జయప్రదం అని వాటినే దీవెనబ్రాలు, సేసబ్రాలు, అంటా రు. (ప్రాయి+లు=ప్రాలు=బియ్యపుగింజలు, పేలగింజలుము.వి) తల మీద పోసేవి తలంబ్రాలు ఒడిలో పడినా కట్టినా ఒడిబ్రాలు. ఈ పదాలన్నీ ఇలా తయారయినవే. ఇంతకీ-రతి చల్లిన దీవెనబ్రాలో(దీవెన-దీవన) అన్నట్టు ఉన్నాయి చుక్కలు.

సాయంకాలం అయ్యేదాకా సూర్యుడు(వేడి వెలుగు) ఎండ మండిం చేసాడు ఆ ఎండకి కాగిపోయింది ఆకాశం (విన్ను) ఆ వేడికి దాని శరీరం నిండా(మేనునన్=మేనన్)చెమటలు పోసేసాయి. అలా పోసిన చెమట బొట్టులా

అనట్టున్నాయి చుక్కలు. స్వేదబిందువులు తెల్లగా ఉంటాయి కనక (నెలవు+కొను=నెక్కొను=తావుకొనుట స్థిరపడుట)

ఇన్ని రకాల ఊహలకు అనువుగా ఆకాశంలో చుక్కలు అమరెన్ ఉదయించాయి ఉత్ప్రేక్షా- ఉల్లేఖాలంకారాల సంసృష్టి తరవాత మెల్లగా చంద్రోదయమవుతోంది - దానికి సూచనగా తూర్పుదిక్కు తెల్లబడింది

యామవతీ కళత్రు నుదయావసరంబునకంటె పాండిమ
శ్రీ మును దోచె దూర్పు దెస-సిద్ధము కృష్ణుడు పారిజాతమున్
భామినికై హరించు నని పాయని నెవ్వగ నింద్రరాజ్యల
క్ష్మీ ముఖమండలంబున వసించిన వెల్లదనంబు కైవడిన్ (౭-౩౮)

యామవతి అంటే రాత్రి (యామము=జాము యామములు కలది యామవతి) (త్రియామ అనికూడా దీనికే పర్యాయపదం. యామ వతి కళత్రంగా (భార్యగా) కలవాడు-యామవతీ కళత్రుడు. చంద్రుడు చంద్రోదయ సమయం కంటే (అవసరం) ముందే తూర్పుదెసలో పాండి మశ్రీ తోచింది తెల్లదనపు శోభ ఉదయించింది అది ఎలా ఉంది అంటే- ఇంద్రుడి రాజ్యలక్ష్మిముఖమండలం మీద-(తూర్పుదిక్కుకి ఇంద్రుడు అధి పతి అది అతడి రాజ్యం)-గూడు కట్టిన వెల్లదనం లాగా ఉంది అయితే - ఇంద్రరాజ్యలక్ష్మి ముఖం ఎందుకని పాలిపోయింది అంటే కారణం చెబుతున్నాడు

భామినికోసమని (సత్యభామ) శ్రీకృష్ణుడు రేపు వచ్చి పారిజాత వృక్షాన్ని హరిస్తాడు- ఇది తప్పదు(సిద్ధము)నిశ్చయం అని ఆవిడకి ఇప్పటి నుంచీ వదలని దిగులు పట్టుకుందిట (పాయని+నెవ్వగ నెఱ+ వగ=పెద్ద దిగులు). ఆ బెంగతో ఆవిడ ముఖం పాలిపోయింది. ఆ వెల్లదనంలాగా (కైవడిన్ = వలె పోలె) పాండిమశ్రీ తూర్పు దెస తోచెన్- అని అన్వయం ఉత్ప్రేక్ష

ఇప్పటికి వర్ణనని కథతో ముడిపెట్టాడు దీనికి ముందూ వెనకా సాగిన విస్తృత వర్ణన అంతా ఇక కథతో ముడిపడినట్టే వర్ణనల్ని చాలా విస్తృతంగా చేసినా ఆది మధ్యాంతాలలో ఎక్కడో ఒకచోట ప్రధాన కథతో ఇలా అనుసంధించడం ప్రబంధాలలో తరచు కనిపించే ఒక సాంకేతికత లేకపోతే వర్ణనలు కథాసూత్రంతో అతకక తీర్థానికి తీర్థమూ ప్రసాదానికి ప్రసాదమూ అయిపోతాయి ఇటువంటి సాంకేతికతని రాయలవారు కూడా పాటించకపోలేదు

కెరలి చీకటి ప్రాను గెడపంగ నిక్కిన
సమయగజంబు దంతము లనంగ
జదలు గేదగి తూర్పుతుద తొమ్మ నరవిరి
యై కానిపించు పూరేకు లనగ
బొడుపు గుబ్బలి నేల పురిటింటి యిడుపున
జలచిన గందంపు జట్టి లనగ

మరుని ముందఱ బరాబరి సేయు కంచుకి

కులము చేతుల వెండి గుదె లనంగ
గైరవములకు వెన్నెల నీరు వఱప
బూని చేర్చిన పటికంపు దోను లనగ
గ్రమముతో శీతకర మయూఖములు గగన
భాగమున గొన్ని యల్లన బ్రాకుదెంచె (2-39)

(కెరలి= విజృంభించి గెడపుట =పెకలించుట. చదలు= ఆకాశం కేదగి = మొగిలిచెట్టు పొడుపుగుబ్బలి = తూర్పుకొండ, ఇడుపు= ఇంటిగోడల పైభాగం - గుమ్మానికి అటూ ఇటూ చూరుల కింది భాగం గుదె - గుదియ = కఱ్ఱ బెత్తం కైరవము = నల్లకలువ. చట్టలు = చారికలు లేదా పెళ్ళలు. మరుడు = స్మరుడు)

క్రమంగా శీతకరమయూఖాలు కొన్ని(చంద్రకిరణాలు) గగన భాగంలో అల్లనల్లన పాకుతూ వచ్చాయి ఆ తెల్ల కిరణాలను వర్ణిస్తున్నాడు

సమయం అనే ఏనుగు చీకటి చెట్టుని పెకలిద్దామని విజృంభించి నిలబడిందట దాని దంతాలో అన్నట్టుగా చంద్రకిరణాలు వ్యాపించాయి

ఆకాశం అనే మొగలిపొద దానికి తూర్పుతుద ఒక కొమ్మ ఆ కొమ్మకి ఒక మొగలి పువ్వు ఆ పువ్వు పూర్తిగా విచ్చుకోలేదు అరవిచ్చుకున్న విరి (అరవిరి) దాని రేకులో అన్నట్టుగా మరికొన్ని మయూఖాలు వ్యాపిం చాయి మొగలి రేకుల్లా ఉన్నాయని.

తూర్పుకొండ ఒక పురిటి ఇల్లు అది నేల పురిటిల్లు భూగృహం అన్నమాట సూర్యుడికీ చంద్రుడికీ అదే పురిటిల్లు ఆ ఇంటి యిడుపు మీద గందపు చట్టలు చరిచి నట్టుగా మరికొన్ని తెలివెలుగులు వ్యాపించాయి

సూతికా గృహంలో మాతాశిశువులు ఉన్నప్పుడు గాలీ ధూళీ సోక కుండా (దెయ్యాలు) ద్వారానికి రెండు పైపులా గోడకి మనిషి ఎత్తులో మంచి గంధం మెత్తుతారు. కొందరు పసుపు ముద్దలు పెడతారు కొందరు వేపమండలు కడతారు చెప్పు ముక్క కట్టడమూ ఉంది. కొందరు ఎందు కయినా మంచిదని అన్నీ కడతారు వీటిని చూసి దెయ్యాలు పారిపోతాయ నీ లోపలికి రావనీ శిశువుని పట్టుకోవనీ మనవాళ్ళ విశ్వాసం వీటిలో గంధం, పసుపు, వేప ఆరోగ్యానికి సంబంధించినవే వచ్చే పోయే వాళ్ళతో గానీ మరొక రకంగా గానీ లోపలికి ప్రవేశించే కొన్ని క్రిముల్ని ఇవి అరికట్టి లేత శిశువునీ పచ్చి బాలెంతరాలినీ కొంత కాపాడతాయి విశ్వాసం మాట ఎలా ఉన్నా వీటిని ఏర్పాటు చెయ్యడమనే ఆచారంలో అసలు ఆరోగ్య సూత్రం ఏదో ఉన్నట్టే ఉంది

చంద్రుడు ఉదయించాడంటే మన్మథుడు మహారాజే ఆ మరుని ముందర కంచుకులు బరాబరి చేస్తున్నారు

రాజాంతఃపురంలో ఉద్యోగం చేసే వృద్ధుణ్ణి కంచుకి అంటారు. సంస్కృత నాటకాల్లో ఈ పాత్ర తరచుగా తననీ తన ఉద్యోగాన్నీ నిందించుకుంటూ ప్రవేశిస్తుంది. అంతఃపురంలో ఉద్యోగ మంటే అసిధారావ్రతం కత్తిమీద సాము కళ్ళు ఉండీ చూడకూడదు చెవులు ఉండీ వినకూడదు. నోరు ఉండీ పలకకూడదు ఇలాంటి నియమాలతో సతమతమయిపోతు న్నాను మొర్రో అంటూ ప్రవేశిస్తాడు. అంతఃపుర చరో వృద్ధో విప్రో గుణగణా న్వితఃసర్వకార్యార్థకుశలః కంచుకీత్యభిధీయతే. జరా వైక్లబ్య యుక్తేన విశేద్గాత్రేణ కంచుకీ- అని భరతుడు నాట్యశాస్త్రంలో చెప్పాడు. ఈ పాత్రను యువకుడు ధరించినా ముసలివాడుగా నటించాలి ఊత కర్ర చేతబుచ్చు కుని వణుకుతూ నడవాలి.

ఈ ఊత కర్రలు వెండిమలాముతో ఉంటాయి లేదా మొత్తం వెండితోనే చేస్తారో, రాజాంతఃపురంలో ప్రధానోద్యోగి కదా వీటినే '' వెండి గుదెలు'' అన్నాడు తిమ్మన

మన్మథ మహారాజుగారి ముందర బరాబరులు చేస్తున్న కంచు కి బృందం (కులము = సమూహం) చేతుల్లోని వెండిగుదియలా అన్నట్టున్న కొన్ని చంద్రకిరణాలు మెల్లగా పైకి పాకాయి.

నల్లకలువలకి వెన్నెలనీరు పారించడానికి పూనికతో ఏర్పరచిన పటికపు దోనులన్నట్టు మరికొన్ని మయూఖాలు సాగాయి

రాతితో గానీ తాటి బోదలతో గానీ దోనులు చేసి మళ్ళలోకి నీరు పారిస్తారు రైతులు తీత లేకుండా నీరుసాగడానికీ, మిట్టలు ఎక్కించడానికీ, పల్లంలో చెదిరి పోకండా చూడటానికీ ఇవ్వి ఉపకరిస్తాయి ఆకాశం నుంచి నేలమీద సరోవరంలో కలువకి వెన్నెలనీరు అందాలి. చెదిరిపోకూడదు అందుకని కిరణాల దోనులు

ఒక్కొక్క భావం వెనక్కాల ఒక్కొక్క పదం చుట్టూ ఎంతెంత సంస్కృతి పరిమళంలా ఆవరించి ఉంటుందో తెలియజెబుతాయి ఈ పద్యాలు

అమరు లమృతాంబునిధిలోని యమృతరసము
వెండి చేరుల బటికంపు గుండ కట్టి
చేదుకొనియెదరోనాగ శీతరోచి
మెఱుగు మెయితోన యల్లన మిన్ను ప్రాకె (౨-40)

కిరణాలు మెల్లగా ఆకాశానికి పాకిన తరవాత చందమామ ఉదయి స్తున్నాడు స్ఫాటిక కుండలాగా ఉన్నాడు తూర్పుకొండ వెనకనుంచి క్రమ క్రమంగా పైకి వస్తోంటే ఆ బింబం, బావిలోంచి పైకి చేదుతున్న స్ఫటికపు కుండలాగా ఉందని ఈ ఉపమానానికి కథాకల్పన చేస్తున్నాడు

దేవతలు అమృత సముద్రంలోంచి అమృతరసాన్ని ఈ కుండతో తోడుకుంటున్నారుట. విలువైన అమృతరసం స్ఫాటిక పాత్ర అంతకన్నా విలువైనది తోడుతున్నవారు అమరులు. మరి దానికి కట్టినతాడు (చేంతాడు-చేదు+తాడు) పాత్రో

చితంగా ఉండద్దా. వెండిచేరులు కట్టారుట

వెన్నెల - వెండి చేరులు చంద్రుడు - పటికపు కుండ అందులో ఉన్నది- అమృతరసం తూర్పు దిగంతం - అమృతాంబునిధి అలా అమరు లు చేదుకొంటు న్నారో అన్నట్టుగా (నాగన్) చంద్రుడు (శీతరోచి = చలి వెలుగు) మెరుగు మేనితోనే అల్లన మిన్ను ప్రాకె - ఆకాశానికి క్రమంగా ఎగ బ్రాకాడు రూపకాతిశయోక్తితో అనుప్రాణితమైన ఉత్ప్రేక్ష.

తిమ్మన వర్ణనల్లో స్ఫాటిక వస్తువుల ప్రస్తావన తరచుగా వస్తోంది. బహుశ రాయలవారి కొలువులోకి స్ఫాటిక పాత్రలూ గాజుపాత్రలూ ఏ విదేశాలనుంచో కొత్తగా దిగుమతి అయ్యుంటాయి అవి కవిదృష్టిని ఆకర్షించి ఉంటాయి ఆ పాత్రలమీద రక రకాల రంగుల్లో లతాదిముద్రల అద్దకాలు ఉంటాయి రవ్వంత పారదర్శకంగా కన్పి స్తాయి కళంక సహితు డైన చంద్రబింబంతో పోలిక సర్వాత్మనా కుదురుతుంది

అమరుల బోనపుట్టిక, సహస్ర మయూఖుని జోడుకోడె, సం
తమసము వేరువిత్తు, కుముదంబుల చక్కిలిగింత, పుంశ్చలీ
సమితికి జిక్కవాలు, నవసారసలక్ష్మి తొలంగు బావ, కో
కములకు గుండెతల్లడము-కైరవమిత్రుడు తోచె దూర్పునన్ (41)

కలువల చెలికాడు(కైరవమిత్రుడు)తూర్పున పూర్తిగా ఉదయిం చాడు చంద్రబింబం నిండుగా కనపడుతోంది కవి ఆనందంతో కేరింతలు కొడుతున్నట్టు రకరకాల పర్యాయవాచకాలు సమకూరుస్తున్నాడు

చంద్రుడు - దేవతలకి భోజనపదార్థాల గంప (భోజనము- బోనము పుట్టిక= బుట్ట, గంప). చంద్రుడిలో ఉండే పదహారు కళలలోనూ రోజుకి ఒకటి చొప్పన దేవతలు ఆస్వాదిస్తారుట అందుకని చంద్రుడు అమరులకి బోనపుట్టిక (బుట్ట భోజనం ఈనాటికీ పరిచితమే)

అమృత-మానద-పూష-తుష్టి-పుష్టి-రతి-ధృతి-శశిని- చంద్రిక -కాంతి- జ్యోత్స్న-శ్రీ-ప్రీతి-అంగద-పూర్ణ-పూర్ణామృత-ఈ పదారును చంద్రుని కళలకు పేర్లు. వీటిలో ఒకటిమాత్రం వదిలేసి మిగతా పదిహేనిం టినీ దేవతలు పుచ్చుకుంటారు కృష్ణపక్షంలోచంద్రుడు క్రమక్రమంగా క్షీణించి పదహారోనాటికి రేఖామాత్రంగా- ఏకకళావశిష్టుడై మిగులు తాడు

సహస్రమయూఖుడు అంటే వే వెలుగు - సూర్యుడు ఆ గిత్తకి జోడైన తెల్లటి కోడెగిత్త చంద్రుడు వీరిద్దరూ కాలరథానికి వెలపట దాపట గిత్తలు రేరాజు చంద్రుడు. దినరాజు సూర్యుడు, రేచుక్క - పగటిచుక్క లోకాలకు కాలవిభజన చేస్తున్న కమనీయమూర్తులు సయిదోడులు

కటిక చీకటికి (సంతమసము) వేరువిత్తు వేరువిత్తు అనే పదబంధానికి వ్యుత్పత్తి ఏమోకానీ వినాశకం అనే అర్థంలో ఇది రూఢి కెక్కింది చంద్రుడు సంతమసానికి వినాశకరుడు అని

కలువలకు (కుముదములకు) చక్కిలిగింత. చంద్రోదయం తో కలువలు

వికసిస్తాయి కళకళలాడతాయి వాటి ముఖాలను వికసింపజేసి నవ్విస్తాడనీ, ఆనందం కలిగిస్తాడనీ

'పుంశ్చలి' అంటే జారిణి జారిణీ సమూహానికి (సమితికి) చంద్రుడు చుక్కవాలు చంద్రుడు ఉదయించాడంటే పుచ్చ పువ్వులా వెన్నెల పరుచుకుంటుంది కనక అభిసారికల ప్రయాణాలకు చుక్క ఎదురైనట్లు అవి సాగవని అందుకని చుక్కవాలు అన్నాడు

క్రొత్తగా అత్తింటికి వచ్చిన సారసలక్ష్మికి (నూతన పద్మశోభకు) చంద్రుడు తొలంగు బావ బావగారు (మగని అన్న) వస్తున్నారంటే కొత్తమరదలు చాటుకి తొలగుతుంది అందుకని ఆ బావగారు ''తొలంగు బావ'' ఇది కొత్తల్లోనే. నవసారస లక్ష్మి అని ప్రత్యేకించి చెప్పాడు అందుకే చంద్రోదయం కాగానే పద్మశోభ(లక్ష్మి) తొలగి పోతుంది

ఇక్కడ లక్ష్మిపదం శోభా పర్యాయం మాత్రమే అంతకంటే ఎక్కువ చెప్పకూడదు వరస తప్పుతుంది లక్ష్మీచంద్రులు తోబుట్టువులు. క్షీర సముద్రం నుంచి జన్మించారు కనక ఈ వరసని చంద్రుడు తొలంగు బావ కాడు కవిత్వావగాహనకి కూడా కొన్ని పరిమితులుంటాయ్.

క్రోకములు అంటే జక్కవలు. చక్రవాకాలు వీటికి చంద్రుడు గుండె తల్లడం, చంద్రుడు ఉదయించాడంటే సూర్యుడు అస్తమించాడన్న మాటే కదా, చక్రవాకాలకి కళ్ళుకనపడవు వాటిగుండె తల్లడిల్లిపోతుంది అందుకని చంద్రుడు వాటిపాలిట గుండె తల్లడం గుండె దడ అన్నమాట నామవాచకం చేసి ప్రయోగించడం విశేషం

కవి తానై ఒక్క చంద్రుణ్ణి ఇన్ని రకాలుగా భావించాడు కనక ఇది ఉల్లేఖం ఒక వస్తువుని పలువురు పలురకాలుగా వర్ణించినా (బహుభి ర్బహుధోల్లేఖా దేక స్యోల్లేఖ ఇష్యతే) ఒకరే విషయభేదంతో పలురకాలుగా వర్ణించినా (ఏకేన బహు ధోల్లేఖే ఒప్యసౌ విషయ భేదతః) ఉల్లేఖమే

సుందరకాండలో వాల్మీకి పూర్ణచంద్రుణ్ణి వర్ణిస్తూ చాలా అంద మైన శ్లోకాలు చెప్పాడు వాటిలో ఒకటి - చంద్రుణ్ణి హనుమంతుడు దర్శిస్తున్నాడు

తతస్స మధ్యంగత మంశుమంతం
జ్యోత్స్నా వితానం ముహురుద్వమంతమ్
దదర్శ ధీమాన్ భువి భానుమంతం
గోష్ఠే వృషం మత్తమివ భ్రమంతమ్ (౫-౧)

మదించి గోశాలలో సంచరిస్తున్న వృషభంలా ఉన్నాడు చంద్రు డు. వాడి కొమ్ములూ పెద్ద మూపురమూ ఉన్న ఆబోతులా ఉన్నాడని కూడా వర్ణించాడు. స్థితః కకుద్మానివ తీక్ష్ణశృంగః (౫)- అంచేత పూర్ణ చంద్రుణ్ణి కోడెగిత్తతో పోల్చడం ఉంది.

పొందుగ బర్చిమాబ్ధితట భూస్థలి నంశుమదంశుమత్ఫలా
కందము వాసరాంత హాలిక ప్రవరుండిడ సాంధ్య వారిభ్రృ

త్కందళముల్ తమోదళయుతంబులునై గెల పండి వ్రాలె బూ
ర్ణేందుని పేర బ్రాచి- నది హేతువు వెన్నెల కల్మి కల్మికిన్ (౨-౪౨)

వ్యవసాయాన్ని జోడించి మరో బొమ్మకడుతున్నాడు అరటి చెట్టు పెరట్లోనో తోటలోనో ఎదిగి తూర్పుదిశగా గెల దిగితే అది యజమానుడికి శుభప్రదమని ఒక నమ్మకం. ఇప్పటికీ చాలామందికి ఈ విశ్వాసం ఉంది

సాయంకాలం అనే హాలికుడు(వాసర+ అంతం అనే హాలికు డు- హాలికుడు -కృషీవలుడు) పశ్చిమ సముద్రతటం అనే చేనిలో (భూస్థలి న్) సూర్యబింబం (అంశు మంతుడు) అనే అరటిదుంపని చక్కగా (పాం దుగన్) పాతిపెట్టాడుట. "అంశు మత్పలా" అంటే అరటి కందము అంటే దుంప. పళ్ళరటి దుంప ఎర్రగా ఉంటుంది అస్తమిస్తున్న సూర్యబింబంతో పోలిక

ఎర్ర ని కాంతులు ప్రతిఫలించి సాయంకాలపు మబ్బులు (వారి= నీరు. వారిభృత్=నీటిని వహించేది-మేఘం) ఆ దుంపనుంచి మొలకెత్తిన పిలకల్లా (కందళ ములు) ఉన్నాయి అవి ఎదుగుతున్నకొద్దీ ఎర్రదనం తగ్గిపోతుంది చీకట్లు అనే ఆకులు తొడిగాయి. (తమోదళయుతంబులు) - పూర్ణ చంద్రుడు అనే గెల దిగింది పండింది తూర్పువైపుకి వాలింది. (ప్రాచిన్ వ్రాలెన్). వాసరాంత హాలికుడికి వెన్నెల అనే కలిమి లభించడానికి (కల్మికిన్) అదే హేతువు అంటున్నాడు కవి పండు వెన్నెలలు ఈనుతున్న ఉదయ చంద్రబింబం పండిన అరటిగెలలా ఉందని. లోకంలో కనిపించిన ఏ దృశ్యాన్నయినా కాలాంతరంలో కావ్యానికి తెచ్చుకుని కవిత్వంగా మలచుకోగలడు కవి- అనడానికి మరో ఉదాహణ ఈ పద్యం

పశ్చిమాబ్ధి తటము అనే భూస్థలి, అంశుమంతుడు అనే అంశు మత్పలా కందం, వాసరాంతము అనే హాలికప్రవరుడు, సాంధ్య వారిభృత్తు లు అనే కందళాలు తమస్సులు అనే దళాలు పూర్ణేందుడు అనే గెల - ఇవన్నీ తాద్రూప్య రూపకాలు వీటితో పరిపోషింపబడిన ఉత్ప్రేక్ష. వెన్నెల కల్మిని ఈ హేతు కల్పనతో సమర్థించాడు కనక కావ్యలింగం (సమర్థనీయ స్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్) మూడు అలంకారాల సంసృష్టి.

సమయవిలాసి శోణమణిసంగతమౌక్తిక చారు హారమున్
గ్రమమున గూర్చుచో నరుణరత్నము దా మును సాంధ్యరశ్మి సూ
త్రమున బొసంగ గ్రుచ్చి, యెడ తప్పిన ద్రోచి, పిఱుంద జేర్చు ము
త్తైము శ్రీయ దోచె నయ్యమృతదీధితి లాంఛనరంధ్రసంగతిన్. (౪౩)

చంద్రబింబంలో కళంకం ఉంటుంది. దాన్నే లాంఛనం(గుర్తు) అంటారు ఈ కళంకాన్ని కవులు రకరకాలుగా వర్ణించారు కొందరు పుట్టు మచ్చ అన్నారు. కొందరు వీపున అంటుకున్న సముద్రపు మట్టి అన్నారు మరి కొందరు లేడి అన్నారు. కొందరు భూచ్ఛాయ అన్నారు. ఇంకొందరు చంద్రుడు తాగిన చీకటి -కడుపులో కనపడుతోంది అన్నారు నాయికా ముఖాన్ని సృష్టించడానికి బ్రహ్మదేవుడు చంద్ర

బింబంలో చెయ్యిపెట్టి గుప్పెడు పదార్థాన్ని తీసేసాడు ఆ తొర్రలోంచి వెనక్కాలి ఆకాశం నల్లగా కనపడుతోంది -అని మరో కవి కల్పన ఇలా ఎంతోమంది ఎన్నోరకా లుగా

ఊహాలు చేస్తే తిమ్మన ఈ లాంఛనాన్ని రంధ్రంగానే భావించి చంద్రుణ్ణి ఒక ముత్యం చేసి దండగుచ్చుతున్నాడు

సమయం అనే విలాస పురుషుడు ఒక ఎర్రటి మణి (శోణమణి = పద్మ రాగం) ఒక తెల్లటి ముత్యం వరసగా దారానికి గుచ్చుతూ తన కోసం అందమైన హారాన్ని తయారుచేసుకుంటున్నాడు (శోణ మణులతో సంగతమైన మౌక్తికాలతో కూడిన చారుహారం) సంజ వెలుగు (సాంధ్య రశ్మి) అనే సూత్రానికి (దారం) వీటిని గుచ్చుతున్నాడు. పని సాగుతోంది కొంత దండ అయ్యింది అప్పుడు ముందుగా ఒక అరుణరత్నాన్ని (అస్త మిస్తున్న సూర్యబింబం) సాంధ్యరశ్మి సూత్రానికి గుచ్చాడు. తీరా చూస్తే అది ఎడ తప్పింది వరసలో స్థానం తప్పింది ఈ అరుణ రత్నానికంటే ముందుగా గుచ్చిందికూడా అరుణరత్నమే అవ్వడంతో వరస తప్పింది. అంటే ఇప్పుడు గుచ్చవలసింది శోణమణి కాదు, శ్వేత మౌక్తికాన్ని గుచ్చాలి

అందుకని అరుణ రత్నాన్ని తీసేసి (ద్రోచి) మిగిలి ఉన్న శోణమణి వెనక్కాలే (పిఱుందన్) ముత్యం చేరుస్తున్నాడు . అలా చేరుస్తున్న ముత్యంలాగా ఈ అమృత దీధితి-చంద్రుడు భాసించాడు(తోచెన్) చంద్రుడిలో లాంఛనం రంధ్రంలాగా ఉండనే ఉంది ఆ రంధ్రంలోనుంచే సాంధ్యరశ్మి సూత్రాన్ని సమయవిలాసి దూర్చాడు అని. (లాంఛనము అనే రంధ్రము యొక్క సంగతిన్=కలిమితో- ఉనికితో)

సమయవిలాసి, సాంధ్యరశ్మి సూత్రము, లాంఛన రంధ్రము ఇవి తాద్రూప్య రూపకాలు వీటితో అనుప్రాణితమైన ఉత్ప్రేక్ష ముత్తెము క్రియన్ అంటే ముత్తెమువలెన్ అని. క్రియన్ అనే పదాన్ని వలెన్ పోలెన్ మొదలైన వాటితో సమానంగా ఇవార్థంలో వాడటం చాలా కావ్యాల్లో కనిపిస్తుంది

('' ఎడ దబ్బున ద్రోచి'' అనే పాఠాంతరం ఉంది అని వినికిడి . గుచ్చిన అరుణరత్నాన్ని దారంలో కింది కొసకు ఎడమ వాటంగా దబ్బున తోసి అనే అర్థం చెప్పకోవచ్చు, కుడిచేత్తో దారం పైకొస పట్టుకొని, కిందికి వేలాడు తున్న లేదా ఒడిలోకి ఉన్న దారంలోకి- అప్పటికే గుచ్చిన మణులకు చేరువ అయ్యేటట్టు ఈ అరుణరత్నాన్ని తోసి అని సమన్వయం)

దిన పరిణామలక్ష్మికి బ్రతిచి తగం గయిసేయు వేడుకన్
వనరుహమిత్ర బింబ మను వర్తులలాక్షికపట్టికం బయో
థి వడుమ దోచి సాంధ్యనవదీప్తిరసంబు హరించి పాణిపై
చిన వెలి దూదియో యనగ శీతకరుండుదయించె నత్తఱిన్ . (౨-44)

అంత:పురకాంతలు తమ పాదాల పై భాగాన లాక్షారసంతో లతలు చిత్రించుకుంటారు. దీన్నే లత్తుక అంటారు ఇది గోరింటాకు పెట్టుకు న్నట్టుగా ఎర్రగా

ఉంటుంది లత్తుక బిళ్ళలు ఉంటాయి. అవి గుండ్రంగా వర్తులాకారంలో ఉంటాయి. వీటి మీద నీటిచుక్కలు పోస్తే ఎర్రటి రసం తయారవుతుంది ఆ రసాన్ని దూదితో తీసి పాదాలమీద లతలు చిత్రించు కుంటారు అంతఃపురకాంతలు గదా వాళ్ళు చిత్రించు కుంటారా : చెలికత్తెలతో చిత్రింపించుకుంటారు. రాజవనితలకు అలంకారం చేసేం దుకు ప్రత్యేకంగా కొందరు నేర్పుకత్తెలు ఉంటారు వీళ్ళనే సైరంధ్రులు అంటారు. వాళ్ళు చిత్రిస్తారు చిత్రించడం అయిపోయాక దూదిని గట్టిగా పిండేసి అవతలకి విసిరేస్తారు అది తడి పోవడంతో మునుపటిలాగా వ్యాకోచి స్తుంది. కానీ మునుపటంత తెల్లగా ఉండదు కొంచెం ఎర్రడాలుతో ఉంటుం ది అదిగో అలా ఉందిట అప్పుడే ఉదయించి పైకి లేచిన చంద్రబింబం ఇక్కడ రాకుమారి ఎవరు? సైరంధ్రి ఎవరు ? ఈ కథ అంతా అల్లుతున్నాడు

దిన పరిణామము అంటే సాయంకాలం ఆ సాయంకాల లక్ష్మికి పశ్చిమ దిక్కాంత (ప్రతీచి) అలంకరణలు చేద్దాము అని వేడుక పడింది కైసేయుట అంటే అలంకరించడం ఆ వేడుకతోటి సూర్యబింబం అనే గుండ్రని లత్తుక బిళ్ళని (వర్తుల+లాక్షిక+పట్టికన్) సముద్రం మధ్యలో ముంచింది (నడుమన్ తోచి). తోచడ మంటే పూర్తిగా ముంచడం కాదు. పైపైని అల్లల్లాడించడం నీళ్ళు తగలడంతో లత్తు కరసం ఏర్పడింది సాంధ్య నవ దీప్తియే లాక్షారసం సంధ్యాసమయంలో వ్యాపించిన ఎర్రని కొత్త కాంతి – అది రసం. ఆ రసంలో వెలిదూదిని (తెల్లటి దూది) తడిపి అలం కరణ పూర్తి చేసి ఆ దూదికి ఉన్న రసం హరించి పారవైచినన్, ఆ వెలి దూదియో అన గ శీతకరుండు ఉదయించె అత్తఱిన్. ఇది రూపకోత్థాపిత మైన మరొక ఉత్ప్రేక్ష, భావచిత్రం.

కడకన్ రే చలిగట్టుపట్టి దను వేడ్కం గూర్ప నేతెంచి పై
జడిగా జుక్కల తూపు లేయ, గినుకన్ జాబిల్లి ముక్కంటి దా
బొడుపుం గెంపను వేడి కంట నిరులన్ పూవిల్తు మేనేర్చ, చొ
ప్పడ దద్భూతి యలందెనా నపుడు బింబంబొప్పె బాండుద్యుతిన్ (45)

మన్మథ దహన వృత్తాంతాన్ని చంద్రవర్ణనతో సమన్వయించి కొత్త ఉత్ప్రేక్ష సృష్టిస్తున్నాడు. చంద్రుడు ఉదయించి పైకి వచ్చిన కొద్దీ ఎర్రడాలు తగ్గిపోయి తెల్లదనం పెరుగుతుంది అప్పుడు బూడిదరంగులో ఉంటాడు. మన్మథుణ్ని దహించి వేసి ఆ భస్మాన్ని కసిదీరా ఒంటికి నిండా పులుముకొన్న ముక్కంటిలా ఉన్నాడు జాబిల్లి.

చీకటి అనే మన్మథుడు (ఇరులు+ అన్ + పూవిల్తుడు) పెద్ద పూనికతో (కడ కన్) బయలుదేరాడు రేయి అనే చలిగట్టు పట్టిని ఈశ్వరుడితో వేడుకగా కూరుద్దాము అని (చలిగట్టు=మంచుకొండ. పట్టి= బిడ్డ చలిగట్టుపట్టి=పార్వతి).

శివుడి తపస్సుని భంగపరచి పార్వతిమీద కోరిక పుట్టిద్దామని బాణాలు వేసాడు చుక్కలు అనే తూపుల్ని శివుడిపైని పడేట్టు జల్లుగా కురిపించాడు. (ఏయుట= బాణం వెయ్యడం). దానితో జాబిల్లి అనే త్రినేత్రుడికి (ముక్కంటి) కోపం వచ్చింది

మూడవ వేడి కన్ను తెరిచాడు. ఉదయించినప్పటి ఎర్రదనం అనే అగ్నినేత్రంతో చీకటి పూవిల్తుని శరీరాన్ని భస్మం చేసేసాడు (ఏర్చి = దహించివేసి) ఆ భూతిని అనువుగా తన శరీరం నిండా అలందుకొన్నాడో అన్నట్టుగా జాబిల్లి (ముక్కంటి) బింబం పాండుద్యుతితో-తెల్లని కాంతితో అప్పుడు ఒప్పింది

జాబిల్లిని ముక్కంటిగా పోల్చడంలో ఒక పవిత్రత ఉంది. అతడు మన్మథ భస్మాన్ని పులుముకున్నాడనడంవల్ల మన్మథ భావోద్దీపకుడుగా చంద్రుడికి ఉన్న ప్రఖ్యాతి కాపాడినట్టయ్యింది పార్వతి నల్లగా ఉంటుంది అని ఒక అభిప్రాయం మాహేంద్రనీలద్యుతి కోమలాంగీం మాతంగకన్యాం మనసా స్మరామి అని స్తోత్రం ఇంద్రనీలమణుల రంగులో ఉంటుం దని కాళికగా ఆవిడ రంగు నలుపే. (గౌరిగా ఆవిడ రంగు పసుపు ముద్ద) అంచేత రేయిని పార్వతిగా పోల్చడం కుదిరింది

ఈ పద్యంలో మరో అందం ఏమంటే - రూపకాలన్నీ ఆచ్ఛిక పదాలతోనే ఏర్పడ్డాయి రేయి అనే చలిగట్టుపట్టి చుక్కలు అనే తూపులు. జాబిల్లి అనే ముక్కంటి. పొడుపుం గెంపు అనే వేడికన్ను ఇరులు అనే పూవిల్తుడు రే చలిగట్టుపట్టి అనే ఎత్తుగడతో ప్రారంభించిన ఈ విధానాన్ని కడదాకా నిర్వహించిన క్రమశిక్షణవల్ల పద్యానికి కొత్త అందం వచ్చింది. తద్భూతి-బింబంబు - పాండుద్యుతి అనేవి మూడు మాత్రమే తత్సమ పదాలు

రూపక - ఉత్ప్రేక్షలతో పాటు ఇక్కడ ముక్కంటి అనే విశేష్యాన్ని సాభిప్రాయంగా ప్రయోగించడంతో పరికరాంకురము అనే అలంకారం కూడా ఏర్పడింది ఇది మూడు అలంకారాల సంసృష్టి

తొలుమల జాతితో నొరయు తూరుపు దొయ్యలి ముత్తియంపు గుం
డలమున మానికంబు పడినం గనుపట్టెడు లక్కగూడు నా-
జలువలఱేని యప్పొడుపుజాయ దొఱింగిన కందు తోచె- రే
చెలువ తనుంగవం గమియు జెందిన కాటుక కప్పులైవడిన్ (2-46)

ఉదయరాగాన్ని విడిచిపెట్టి చంద్రుడు తెల్లబడటంతో అతడిలో ఉండే మచ్చ మరింత స్పష్టంగా కనపడుతోంది చల్లదనాలకు రాజు చంద్రుడు - చలువల ఱేడు. అతడికి పొడుపుచాయ - ఉదయరాగం - తొరగిపోయింది. అప్పుడు మచ్చ (కందు) ప్రస్ఫుటంగా తోచింది. ఆ మచ్చని రెండు రకాలుగా ఉత్ప్రేక్షిస్తున్నాడు

తూర్పు అనే తొయ్యలి (కాంత) ముత్యాలు పొదిగిన కుండలాలు పెట్టుకుంది ఒక కుండలం తూర్పుకొండ రాతికి ఒరుసుకుని (తొలుమల =పొడుపుకొండ) అందులో పొదిగిన ఒక మాణిక్యం (మానికంబు) రాలి పడిపోయింది ఆ ఖాళీలో లక్కగూడు కనపడుతోంది. అలా కనిపించేలక్కగూడో అన్నట్టుగా ఉంది చంద మామలో మచ్చ. చంద్రబింబమే తూర్పు తొయ్యలికి ఒక కుండలమన్న మాట.(మరో కుండలం సూర్యుడేమో)

కుండలాలకూ హారంలో పతకాలకూ రాళ్ళు పొదగడానికి వీలుగా ఆ పరి

మాణాల్లో బంగారపు రేకులతో గూళ్ళు చేసి, వాటిలో లక్క కరిగించి పోసి, ఆ వేడి వేడి లక్కమీద రాళ్ళు అతికిస్తారు. ఆ తరువాత గూళ్ళ అంచులు రాళ్ళమీదికి మడుస్తారు. రాళ్ళు స్థిరంగా ఉంటాయి కొన్ని ఏళ్ళకి లక్కపట్టు వదిలేస్తుంది మడిచిన అంచు ముక్కలు విరిగి పోతాయి అటువంటప్పుడు గట్టి ఒరిపిడి తగిలితే పొదిగిన రాళ్ళు ఊడిపోయి లక్కగూడు నల్లగా కనపడుతుంది కాలం గడిచినకొద్దీ లక్క నలుపు తిరుగుతుంది. నల్లటి లక్కకూడా ఉంది.

అలా కనపడుతున్న లక్కగూడో అన్నట్టుంది చంద్రబింబంలో కందు.

రాత్రి అనే విలాసిని రెండు కళ్ళకూ కమ్ముకునేట్టు పెట్టుకున్న కాటుక నలుపు లాగా ఉంది ఆ మచ్చ అని మరొక ఊహ చేసాడు చెలువ కనక ఎక్కువ కాటుక పెట్టు కుందనీ, అది కంటిచుట్టూ పాకిందనీ భావించాలి నిద్ర లేకపోవడంవల్లకూడా కన్నుల చుట్టూ నలుపు ఏర్పడుతుంది దీన్నే కాళిమ అంటారు. కాటుక కప్పగా (కప్పు=నల్ల దనం) దీన్ని వర్ణించడమూ ఉంది. ''కమియ జెందిన'' అనే పదాల్ని బట్టి ఈ సమన్వ యమే సమంజ సమనిపిస్తోంది రే చెలువకి నిద్ర లేకపోవడం చెలువతనానికి పూర్తిగాఅనుకూలమే.

ఇంక - వెన్నెలలు కట్ట తెగిన ప్రవాహంలా లోకాన్ని ముంచెత్తడం ః ర్ణిస్తున్నాడు.

అమృతం బాసవ, మంగరాగ ముదయోద్యత్కాంతి, చేలంబు చి
హ్నాముమంగా శశిరేవతీరమణు డున్మాదంబు మీఱం దమో
యమునన్ భంగమునొందిపాఱ గరసీరాలోడితం జేయ వ
చ్చె మరుద్వాహిని దాని దేర్చనన మించెం జంద్రికాపూరముల్ (౭-47)

బలరాముడికి (రేవతీదేవికి భర్త) ఒకసారి కోపం వచ్చి హస్తినా పట్టణాన్ని తన నాగలితో పెకలించబోయాడుట. అందుకే హస్తిపట్టణం ఒకవైపుకి ఒరిగి ఉంటుంది అంటారు.అదేమో కానీ-ఆ పట్టణంలోనే ప్రవ హిస్తున్న యమునానది నాగేటి దెబ్బకి గట్టు తెగి ఊళ్ళు ముంచేసిందిట. ఇది పురాణకథ. దీన్ని అనుసంధించి చంద్రికాప్రవాహాన్ని వర్ణిస్తున్నాడు

శశి అనే రేవతీరమణుడు అమృతం అనే మద్యం (ఆసవం) పుచ్చుకున్నాడు ఉదయచంద్రకాంతి అనే (ఉదయ+ ఉద్యత్+కాంతి) మైపూత పులుముకున్నాడు (ఎర్రచందనం మొదలైన సుగంధద్రవ్యాలను శరీరానికి పులుముకుంటారు అదే మైపూత అదే అంగరాగం). చంద్రునిలో ఉండే కళంకం (చిహ్నం) అనే వస్త్రం (చేలం) ధరించాడు.

బలరాముడు మనిషి తెల్లగా ఉంటాడుట ఎప్పుడూ మద్యపాన మత్తుడై ఉంటాడుట నల్లని వస్త్రం ధరిస్తాడుట. ఎర్రని అనులేపనాలు పులుముకుంటాడుట ఇదంతా పురాణాలలో వర్ణన. దీనికి అనుకూలంగా పై రూపకాలు కుదిరాయి

ఈ బలరాముడికి ఉన్మాదం మీరింది. చీకటి అనే యమునా నదిని

(యమునానది - నలుపు. గంగానది - తెలుపు. సరస్వతినది.- పసుపు ఇవి కవుల వర్ణనల్లో రూఢికెక్కిన రంగులు) గట్టు తెగిపోయి ప్రవహించేటట్టుగా కిరణం (కిరణాలు) అనే నాగలితో ఆలోడితం చేసేసాడు. సంక్షోభపరిచాడు బలరాముడి ఆయుధం నాగలి. అది తెలుపు అంచేత కిరణాలను సీరంగా పోల్చడం సముచితమే కర శబ్దానికి కిరణ మనే కాకుండా చెయ్యి అనికూడా అర్థం. కరము అనే కరములో (చేతిలో) ఉన్న కరసీరంతో అని శ్లిష్టరూపకంగా సమన్వయం.

అలా సంక్షోభపడిన యమునానదిని ఓదార్చడానికి (తేర్పన్) దేవతల నది (మరుత్+వాహిని) గంగమ్మ వచ్చిందా అన్నట్టు చంద్రికా పూరములు- వెన్నెల ప్రవాహాలు జగమంతటా వ్యాపించాయి- మించెన్ రూపకశ్లేషలతో అనుప్రాణితమైన ఉత్ప్రేక్ష

గంగా యమునా సరస్వతులు ముగ్గురూ ప్రియసఖులు కనక యమునకి వచ్చిన ఆపదను చూసి గంగమ్మ ఓదార్చడానికి రావడం సహజమే మరి.

మరికొంతసేపు గడిచేసరికి వెన్నెలలో చల్లదనం హెచ్చి మంచు తుంపరలు జల్లుగా తెరలుగా కురవడం మొదలుపెట్టాయి.

తారకాధీశు కిరణ కదంబకంబు
చిలికె బలుచని వలిపంపు జిలుగు మంచు
కైరవశ్రీ వధూకరగ్రహణ వేళ
వెలికి గ్రమ్మిన సాత్త్విక స్వేద మనగ 2-47

వాడిన పదం వాడకుండా చంద్రుడికి కల్పనానుకూలంగా రకరకాల పర్యాయ పదాలను తయారుచేసి ఉపయోగిస్తున్నాడు. పాఠకులకు భాషాపటిమను పెంచడంకూడా కావ్య ప్రయోజనాలలో ఒకటి

తారలకు చంద్రుణ్ణి భర్తగా చెప్పడం కవి సమయసిద్ధం . అయితే దాన్ని ఈ పద్యంలో సాభిప్రాయంగా ఉపయోగించుకున్నాడు

తారకాధీశుని కిరణ సమూహం (కదంబకం) మంచు చిలికింది అది జిలుగు మంచు తెల్లగా మెరిసిపోతున్న మంచు వలిపంలా పల్చగా ఉంది సన్నని నూలుతో పల్చగా నేసిన తెల్లని వస్త్రాన్ని "వలిపము" అంటారు. (చూ - 52). పలుచని అని మళ్ళీ చెప్పడంతో బాగా పల్చనిది అని స్ఫూర్తి, పలుచని వలిపెంలాగా జిలుగుతో ఉన్న మంచుని చిలికింది కిరణ కదంబకం. అది ఎలా ఉంది అంటే -

కైరవలక్ష్మి (కలువ బాల) అనే పెళ్ళికూతుర్ని పాణిగ్రహణం చేస్తున్న వేళ , ఆమె కర స్పర్శతో చంద్రుడికి సాత్త్విక భావోదయం అయ్యి, బయటికి వ్యాపించిన (వెలికిన్ క్రమ్మిన) స్వేదంలాగా ఉంది

సాత్త్విక భావాలు హృదయంలో పుడతాయి. పరుల సుఖదుఃఖా లను తనవిగా భావించగలిగిన హృదయసౌకుమార్యానికి సత్త్వం అని పేరు. ఆ సత్త్వం

నుంచి పుట్టిన భావాలు సాత్త్విక భావాలు హృదయ స్పందనలు అన్నమాట.

నవ వధూ కర స్పర్శతో వరుడైన చంద్రుడి హృదయంలో ఒక మధురమైన అనుభూతి స్పందన కలిగింది దానికి అనుస్పందనగా శరీరం మీద స్వేదం కమ్మింది. హృదయగత భావాలకు అభివ్యంజకంగా విక్రియగా శరీరంమీద కనిపించే మార్పుల్ని అలంకారశాస్త్రంలో సాంకేతికంగా సాత్త్విక భావాలు అంటారు. కటాక్షాదులుకూడా విక్రియలే అయితే వాటిని అనుభావాలు అంటారు స్వేదాదులు మాత్రమే సాత్త్విక భావాలు. రెండింటికీ తేడా ఉంది అనుభావాలు -చేష్టలు వాటిని నియంత్రించు కోవచ్చు, దాచుకోవచ్చు, సాత్త్వికాలుఅలాకాదు ఇవి నియం త్రణకు లొంగని స్పందనలు

సూర్యుడికీ పద్మానికీ ఉన్నట్టే కలువకీ చంద్రుడికీ భార్యా భర్తృ సంబంధం కవిలోక ప్రసిద్ధం అయితే ఇక్కడ కైరవం నవ వధువే కానీ చంద్రుడుమాత్రం నవ వరుడు కాదు. అతడు అప్పటికే తారకాధీశుడు అధీశుడు కనుక బహుభార్యాత్వం చెల్లుతుంది కైరవశ్రీని చెట్టపడు తున్నాడు అయినా సరసుడు కనక, ఆమె నవ వధువు కనక స్పర్శ మాత్రానికే సాత్త్విక భావోదయం అయ్యింది రాచరికంలో పుట్టిన కావ్యాలలో ఇటువంటి కల్పనలు కోకొల్లలు పైగా పారిజాతాపహరణ కావ్యావిర్భావానికి అంతఃపుర కథ ఏదో ఉంది అంటున్నారాయె

విరహుల మై సోకి వేడియౌ వెన్నెల
 బచ్చు వెన్నెల నులి వెచ్చ జేసి
కలువ పువ్వొళ్ళచే గసటైన వెన్నెల
 వలిప వెన్నెలలోన వడిచి తేర్చి
చంద్రకాంతపు నీట జాలైన వెన్నెల
 ముదురు వెన్నెల జిడ్డు బదనుచేసి
సతుల మైపూత బసాళించు వెన్నెల
 దనుపు వెన్నెల రసాయనము గూర్చి
చిగురు విలుకాని జాతర సేయబూని
కొలము సాముల నందఱ గూడబెట్టి
వంతు గలయుంగ బువ్వంపు బంతి- విందు
పెట్టె రెలమి జకోరపు బేరటాండ్రు (2-49)

వెన్నెల రాత్రులను వర్ణించాలంటే ఇంచుమించు ప్రతికావ్యంలో నూ చకోరాల చంద్రికావిహారాలు దర్శన మిస్తాయి దీనికి తెలుగులో తిక్కన ఒరవడి పెట్టాడనిపిస్తుంది.

చకోర పక్షులు ఉన్నాయంటారు. వాటినే వెన్నెల పులుగులు అంటారు ఇవి వెన్నెలను తాగి జీవిస్తాయట. నేలమీద వాలనే వాలవట. ఆకాశంలో ఎగురుతూనే ఉంటాయి. మబ్బుల్లో వాలతాయి వర్షాధిదేవత అయిన ఇంద్రుణ్ణి తప్ప వేరెవరినీ ఇవి

యాచించవుట అందుకని పక్షుల్లో కెల్లా చకోరమే ధన్యజీవి అని ఒక కవి అప్రస్తుత ప్రశంస చేసాడు ఇంద్రుడు అనుగ్రహించే తొలకరి జల్లులకోసం ఇవి ఎదురుచూస్తూ ఉంటాయిట వర్షపు చినుకు నేలమీద పడకుండా మధ్యలోనే ఇవి తాగి దాహం తీర్చు కుంటాయిట చకోరంలా ఎదురుచూస్తున్నాను అనే నానుడి ఇందుకని పర్పడిందే. ఉత్తమ నాయికల చూపులు స్వచ్ఛంగా సత్త్వగుణ ప్రధానంగా ఉంటాయని చెప్పడానికి చకోరదృశలు అని కవులు వర్ణించడం ఉంది గిరికాదేవి చూపుల్ని వర్ణిస్తూ ''వెన్నెల పుల్మలచాలు' (వసు 3-49) అన్నాడు రామరాజభూషణుడు

చకోరాంగనలు (పేరటాండ్రు) వెన్నెలవిందు చెయ్యడాన్ని ఈ పద్యంలో వివరించాడు తిమ్మన కవి మన్మథోత్సవం జరుపుకుందామను కుని (చిగురు విలుకాడు = మన్మథుడు. జాతర= ఉత్సవం) దానికి ప్రప్రథమంగా ఈ విందు ఏర్పాటు చేసారుట ఇది మామూలు విందు కాదు - బువ్వంపు బంతి విందు వరసైన స్త్రీ పురుషులు కలిసి భోజనం చేస్తుంటే వరసైన వనితలు కొసరి కొసరి వడ్డిస్తుంటారు సరసాలూ ఛలోక్తులూ - విరసాలూ, ఇలోక్తులూ -గోలగోలగా ఉంటుంది. అప్ప డప్పుడూ శృంగా రం మొరటుగా ముదురుపాకాన నడుస్తుంది నిగూఢంగా ఉండే కొన్ని రకాల మనోవాంఛలకు ఇది తీర్థస్నానం ఒక ఆట విడుపు

కులం పెద్దల నందరినీ (కొలము సాములన్) పిలిచి వరసగా కూర్చోబెట్టి, వడ్డన వంతు కలిసేటట్లుగా చకోరపు పేరటాండ్రు సంతోషంగా విలాసంగా (ఎల మిన్) బువ్వపు బంతిగా వెన్నెల విందు పెట్టారట వడ్డించేది పేరటాండ్రు భుజించేది కొలము సాములు కనక అల్లరి లేకుండా సాగిపోయి ఉంటుంది తరవాత ఎలాగా జాతర ఉండనే ఉంది.

వడ్డనకి అనుకూలంగా వెన్నెలల్ని ఎలా సిద్ధం చేసారో చాలా కొత్తగా చెప్పాడు.

విరహంలో కాగిపోతున్న వ్యక్తుల శరీరాలకు సోకి వేడెక్కిపోయిన వెన్నెలని పచ్చివెన్నెలతో కలిపి నులివెచ్చ వెన్నెలను తయారుచేసారుట

కలువ పువ్వుల పుప్పొడి ఎక్కువగా కలిసి వగరెక్కిన వెన్నెలని స్వచ్ఛమైన సన్నని వెన్నెలలో (వలిప వెన్నెలలోన) వడకట్టి తేర్చారుట. వగరు తగ్గించి తినడానికి వీలుగా చేసారని.

చంద్రకాంతపు మణులు ఉన్నాయంటారు. అవి వెన్నెల సోకగానే స్రవిస్తాయిట ఆ మణుల్లోంచి నీరు ఊరుతుందిట రావణాసురుడి రాజ సౌధం మీద చంద్రకాంతమణులు పొదిగిన చప్టా (మణికుట్టిమం) ఉంద నీ, పున్నమినాడు అది స్రవించిన నీటి తరంగాలలో చందమామ ప్రతిబిం బించి సరోవరంలో చిరుకెరటాల పై తేలియాడుతున్న హంసలాగా ఉన్నాడ నీ వాల్మీకి వర్ణించాడు (పోప్లూయమానం సరసీవ హంసమ్)

సూర్యకాంతపు మణులు మరొక రకం అవి సూర్యకాంతి తగల గానే

ప్రజ్వరిల్లుతాయిట వాటిమీద పడి మంచుబిందువులు చుయ్ చుయ్ మని ఛూత్కారాలతో ఆవిరి అవుతూంటే-పయిపయిన్ మధ్యాహ్నము స్దెల్వెడిన్- అనుకున్నాడు హిమాలయాల్లో ప్రవరుడు. (మను. ౨- ౨)

చంద్రకాంతపు మణులు స్రవించిన నీటితో కలిసి కొన్ని వెన్నెలలు మరీ పల్చనై పోయాయి. నీళ్ళ జాలై పోయాయి (జాలు=ప్రవాహం) విస్తరిలో వడ్డిస్తే నిలవవు. కంచంలో పోస్తే చేతికి రావు అందుకని వీటిలో కాస్త ముదురు వెన్నెల కలిపి (గట్టిది) జుర్రడానికి అనువైన పదనులోకి (పాకం లోకి) మార్చారుట

సతుల మైపూతలతో కలిసి మరీ ఘాటుగా ఘుమఘుమ లాడుతున్న వెన్నెలని (పిసాళించు =పరిమళించు ఒప్పు)స్వచ్ఛమైన వెన్నెలతో కలిపి సుగంధి పానీయంగా - రసాయనంగా తయారుచేసారుట సుగంధ ద్రవ్యాల పరిమళం తగిన మోతాదులో ఉండేట్టు సిద్ధం చేసారని

ఇలా అన్నీ సిద్ధంచేసి బువ్వపుబంతి పెట్టారు ఆ చకోరపు పేరటాండ్రు. తరవాత చిగురు విలుకాని జాతర సాగుతుంది

కామినీ మాన మేఘశ్రేణి విరియంగ
దొగ తెల్లుగుంపులు తొంగలింప
సాంధ్యరాగావిల చంద్రికాంబులు దేఱ
నిరులు మొత్తపు టస లివురఁబాఱ
యువజన రాగ పయోరాశు లుప్పొంగ
వెలిదమ్మి జాజిపువ్వులు ముడుంగ
మదచకోర మరాళ మండలి చెలరేఁగ
బఱచు చేడియ లను మెఱుపు లఱగ
నభినవ శరత్సమాగమం బనఁగ మించు
నట్టి రాకా నిశావేళ నలరు వింటి
గొనయ మెక్కించి వలరాజు కినుక మీఱ
విరహిజనములపై దండువెడలె నపుడు (౨-౮౦)

ఈ వెన్నెలరాత్రిని వినూతన శరదృతువుగా వర్ణించాడు శరదృతువు లక్షణాలు అన్నీ ఉన్నాయని నిరూపించాడు ఏమిటి ప్రయోజనం అంటే - వలరాజు (మన్మథుడు) విరహుల మీదకి ధనుస్సుఎక్కుపెట్టి దండెత్తుతున్నాడు దండయాత్రలకి అనువైన సమయం శరత్ సమాగమ మే కనక ఈ వెన్నెలరాత్రిని అభినవ-శరత్సమాగమంగా చిత్రించాడు. (అభినవ తిక్కన అభినవ పోతన అన్నట్టు ఇది అభినవశరత్తు అసలైన శరత్తు కాదని) కథలో శ్రీకృష్ణుడు తెల్లవారగానే అమరావతి మీదకి దండెత్తాలాయె.

అందగత్తెల ప్రణయ కోపం (కామినీ మాన) అనే మేఘశ్రేణి తొలగిపోగా కలువలు అనే తెల్లు పొదలు ప్రకాశించగా (తొంగలింపన్):

ఉదయ సంధ్యారాగంతో కెలికిళ్ళయిన వెన్నెల నీళ్ళు (అవిల+ చంద్రికా+అంబులు) తేరుకోగా, చీకట్ల గుంపు అనే బురద ఎండిపోగా:

యువజనుల అనురాగ సముద్రాలు ఉప్పొంగగా, తెల్లతామరలు అనే జాజిపువ్వులు ముడుచుకోగా

మదించిన చకోరాలు అనే హంసల గుంపు విజృంభించగా, అభిసారికలు అనే మెరుపుతీగలు (పఱచు చేడియ=వేగ గమనంతో అభిసరించే వనిత) మాయమై పోగా.

అభినవశరత్సమాగమం అనిపించేట్టు ప్రకాశిస్తున్న (మించునట్టి) ఈ పున్నమి రాత్రివేళ తన పుష్పధనుస్సుకి (అలరువింటన్) నారి బిగించి (గొనయము+ ఎక్కించి) వలరాజు విరహిజనులమీద దండు వెడలాడు

శరదృతువులో ఉండేవి కొన్ని, ఉండనివి కొన్ని, ఆ సరంజామా అంతా పోలికలు కుదిరేట్టు రూపకంతో సాధించాడు రాకానిశావేళను అభినవ శరత్సమాగ మంబనగ - అనడం ఉత్ప్రేక్ష. (రాకా-పూర్ణిమానిశా).

ఆ నలినాయతాక్షు గడియారమునం దభిసారికాజఘూం
నా నిరత ప్రసూన శరచాప గుణ ధ్వనులో యనంగ, ఘుం
టా నినదంబు లయ్యెడ వినంబడియెం, గుపితాబ్జలోచనా
మానసముల్ చలింప, బ్రథమ ప్రహరాపగమ ప్రశంసులై (౨-౮౧)

ఇప్పటికి రాత్రిలో మొదటి జాము గడిచిపోయింది రాత్రికి ''త్రియామ'' అని పేరుంది కనక పన్నెండు గంటల్ని మూడు యామాలుగా (జాములుగా) విభజిస్తే జాముకి నాలుగు గంటల పరిమాణం వస్తుంది

మనుచరిత్రలో మాయాప్రవరుణ్ణి చూసిన వరూధిని సత్య ప్రవ రుడే అనుకొని జాలిగొలిపేలాగా అతణ్ణి బతిమాలుకుంటూ -

ఏలర! యీ చలం బుడిగి యేలర, బాల రసాల మాలతీ
జాలములో శశాంక కర జాలములో వలవంత నశ్రువుల్
జాలుగ నాల్గుజాలు నిక జాలు భవంబనునంత కాకకున్
బా లయి రాత్రి పంచశరు బారికి జిక్కితి, నీకు దక్కితిన్ (మను ౩-౯౩)

అంటుంది. మామిడి చిగుళ్ళూ మాలతీ పుష్పాలూ చంద్ర కిరణాలూ హింసి స్తోంటే విరహంతో రాత్రి నాలుగు జాములూ (జాము+లు=జాములు-జాలు) కన్నీరు జాలుగా స్రవిస్తూంటే ఇక చాలు ఈ జన్మ (భవము) అన్నంతటి విరహాగ్నికి (కాక= వేడి) పాలయ్యాను మన్మథుడి బారికి చిక్కిపోయాను-అంటుంది ఇంకా ఎందుకురా ఈ పట్టుదల చలం విడిచిపెట్టి ఏలుకోరా అని ప్రాధేయపడుతుంది.

ఇక్కడ రాత్రికి ''నాల్గు జాలు'' అన్నాడు పెద్దన. నాలుగుమూళ్ళు పన్నెండు అంటే జాముకి మూడు గంటలన్నమాట

ఇలా మూడు గంటలే అన్నవారుకూడా ఉన్నారు కనక ప్రథమ యామం

గడిచింది అంటే రాత్రి తొమ్మిదీ పది గంటల సమయం అయ్యింది అని జాముకే మరొక పర్యాయపదం ''ప్రహరము''అని ప్రథమ ప్రహరం అపగమించింది-గడిచి పోయింది అనే విషయాన్ని ప్రశంసిస్తున్నవై (చాటుతూ) శ్రీకృష్ణుని దేవిడీలో (హజారంలో) గడి యారపు ఘంటా నినాదాలు వినపడ్డాయి అంటే మూడో నాలుగో గంటలు ఠాంగు ఠాంగు ఠాంగు మని మోగాయి ఇవి గడియారపు గంటలు అన్నా డు గంట గంటకీ తనంతతానుగా మోగే గడియారమో మరింకేదయినా పద్ధతిలో సమయాన్ని గుర్తించి అది ఊరంతటికీ తెలిసేట్టుగా నౌకరులు మోగించిన గంట చప్పడో ఈ గడియారం శ్రీకృష్ణుని కాలానికే ఉన్నట్టా? చెప్పలేం సమయాన్ని గుర్తించ డానికి ఏదో ఒక సాధనం అప్పట్లోనూ ఉండే ఉంటుంది రాయల కాలానికి గడియా రాలు వచ్చేసుంటాయా? అది చూసిన కవి వర్ణనలో సద్వినియోగం చేసుకున్నాడా

ఆ మోగిన గంటలు మన్మథుడి ధనుష్టంకారాల్లాగా ఉన్నాయట. అభిసారి కల్ని(హంతుమ్ ఇచ్ఛా జిఘాంసా-హింసాప్రవృత్తి) హింసించ డంలో నిరతుడైన పుష్ప బాణుడి (ప్రసూనశర) వింటినారి (చాప- గుణం=త్రాడు) చప్పడుల్లాగా ఉన్నాయి బాణం వేసినప్పడల్లా ధనుష్టం కారం అవుతో ఉంటుంది అంటే అప్పటికి కనీసం ముగ్గుర్నో నలుగుర్నో అభిసారికల్ని హింసించేసాడన్నమాట

ఈ గంటలు వినిపించే సరికి - అప్పటిదాకా భర్తల మీద అలిగి ఎంత బతిమాలుతున్నా వినకుండా ఎడ మొగం పెడ మొగంగా ఉన్న పద్మాక్షుల (అబ్జలోచ నలు) మనస్సులు చలించాయట అయ్యో అప్పడే జాము గడిచి పోయింది. అలకతోనే తెల్లారిపోతుందేమో అని ఆ సంసారిణుల మానసాలు సంక్షోభించాయట బహుశ ఇక కోపం విడిచిపెడతారేమో ఎవరో ఒకరు సర్దుకోవాలి కదా సన్నిధిలో విరహం మరీ దుస్సహం ఇప్పటి సత్యాశ్రీకృష్ణుల పరిస్థితి ఇదే (చూ-53)

శ్రీకృష్ణుణ్ని నలినాయతాక్షుడు అన్నాడు పుండరీకాక్షుడు అనే మాటకిఇది పర్యాయం పద్మాల్లాగా-పద్మదళాల్లాగా ఆయతమైన (పొడవైన, విశాలమైన) కన్నులు కలవాడు అని

వలిపము గట్టి, హారములు వైచి, పటీరము మైనలంది, జా
దులు నెఱి గొప్పనం దుఱిమి, త్రోవనె పోయితిమేని- తాకియుం
దలచెడువారు లేరని మనంబు కలంకలు దేర్చి, జారకాం
తలి సమయస్థలంబులకు దార్చిరి దూతిక లట్టి వెన్నెలన్. (2-82)

జారకాంతలకు విరహతాపం పెరిగిపోతోంది రాత్రి గడిచి పోతోందనే దిగులు ఒకటి. ప్రియుడు సంకేత స్థలంలో వేచి ఉంటాడు

తెల్లని వస్త్రం (వలిపము) ధరించి, ముత్యాల హారాలు వేసుకుని మంచిగంధం (పటీరము) వంటినిండా పులుముకొని జాజి పువ్వులు (జాదులు) అందమైన కొప్పులో తురుముకొని, దారినే పోయామంటే- నలుగురూ నడిచే వీధుల్లోంచే మనం వెళ్ళినా, మనల్ని తాకికూడా గుర్తించే వాళ్ళు ఉండరు. మనం తాకినా గుర్తించలేరని కానీ

వెన్నెలలో వెన్నెలగా కలిసిపోయేట్లు జ్యోత్స్నాభిసారికలుగా వెడితే ఎవ్వరూ గుర్తించలేరని మనిషి కనపడకపోవడంతో- తాకినా, ఏదో తగిలిందనో భ్రమ అనో సరిపెట్టుకుంటారు. పటీరమూ జాజులూ గుప్పు మన్నా, వీథికి ఇరువైపులా ఉండే ఏ ఇంటిలోనుంచో సుగంధ పరిమళాలు వస్తున్నాయి అనుకుంటారు

అంతే కానీ మనల్ని తలుచుకునేవాడూ గుర్తుపట్టేవాడూ ఎవ్వడూ ఉండడు. నడు- అంటూ ఉపాయం ఉపదేశించి ధైర్యం చెప్పి, అభిసారికల మనసుల్లోని సంశయాలను తొలగించి తేర్చి, తామై స్వయంగా కూడా ఉండి సంకేత స్థలాలకు (సమయ స్థలంబులకు) జారకాంతల్ని తారుస్తు న్నారట దూతికలు ఇటు అభిసారికలనుంచీ అటు ప్రియులనుంచీ ఈ దూతికలకు ముడుపులు ముడతాయి. కనక ఎన్ని ఉపాయాలన్నా చెబు తారు ఎంత సాహసమన్నా చేయిస్తారు ఇంతకీ- పిండి ఆరబోసినట్లున్న వెన్నెల ఇంత కష్టపెడుతోంది వీళ్ళని.

ఇటుపైని వెన్నెల్ని వర్ణిస్తూ ప్రబంధగద్య సుదీర్ఘంగా సాగింది. శ్రీకృష్ణుడు సత్యభామతో శయనాగారంబున వినోదకేళిం దేలి నిద్రా ముద్రిత నేత్రుడై శయనించె నయ్యవసరంబున (53) వేగుచుక్క పొడవ డం వైతాళికులు వచ్చి శ్రీకృష్ణుణ్ని మేల్కొల్పడం- కథ అంతా సాగుతుంది.

నంది తిమ్మనగారి ప్రతిభా పాటవానికీ, అభివ్యక్తి విధానానికీ రచనా పద్ధతికీ ప్రబంధశైలికీ నిదర్శకంగా, పాఠకులకు వాచవిగా నిలుస్తుంది ఈ ఘట్టం.

శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ. 1520)

ఆముక్త మాల్యద (చతుర్థాశ్వాసం 204 నుండి 285)

సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలవారి రచన ఆముక్తమాల్యద దీనికే విష్ణుచిత్తీయమని మరొకపేరు తెలుగు పంచకావ్యాల్లో ఇది ఒకటి.

మదాలసచరిత్ర, సత్యావధూప్రీణనం, సకలకథాసార సంగ్రహం జ్ఞానచింతామణి, రసమంజరి మొదలైన సంస్కృత కావ్యాలను రాయల వారు రచించినట్టు ఆముక్తమాల్యద అవతారికను బట్టి తెలుస్తోంది. అయితే ఇవి ఏవీ ఇప్పటికీ దొరకలేదు ప్రపంచ దర్పణం అనే గ్రంథంలో ఉదాహరించిన ఒకటి రెండు శ్లోకాలుమాత్రం బయట పడ్డాయి (శ్రీమాన్ ఈయూణ్ణి వీరరాఘవాచార్యులుగారి కృషి) అంతే

జాంబవతీ పరిణయమ్ అనే సంస్కృత నాటకమొకటి రాయల రచనగా లభించింది దీన్ని ఆచార్య శ్రీ బిరుదరాజు రామరాజుగారి సంపాదకత్వంలో తెలుగు అకాడమీ ప్రచురించింది ఆ సంస్కృత కావ్యాల నుగానీ, ఈ ఆముక్తమాల్యదనుగానీ రాయలవారు రచించలేదనీ ఆస్థాన కవి అల్లసాని పెద్దన రచించాడనీ, మెప్పులకోసం రాయలవారి పేరు పెట్టాడనీ ఒక వాదం ఉంది రాజ్యపరిపాలనతో యుద్ధాలతో తల మునిగిన వ్యక్తికి ఇన్ని కావ్యాలు రచించే తీరిక ఎక్కడిది అనే ఆలోచన ఈ వాదానికి బలం చేకూర్చింది అయితే విమర్శకులూ పరిశోధకులూ, అనేకాధారాలు చూపించి పై వాదాన్ని పరాస్తం చేసారు ఆముక్తమాల్యద రాయలవారి రచనయే అనేది స్థిరపడింది.

శ్రీకృష్ణదేవరాయలు కవి పండిత పోషకుడు ఆంధ్రభోజుడని బిరుదు. ఇతని ఆస్థాన సభామండపానికి భువన విజయమని పేరు ఇందులోనే అష్టదిగ్గజ మహాకవులు సమావేశమవుతూ ఉండేవారట ఈ ఎనిమిదిమందీ తెలుగు కవులే అని కొందరు భావిస్తే సంస్కృతంతోకలిపి దక్షిణాది భాషల కవులు ఎనమండుగురు అయ్యుంటారని మరికొందరు అభిప్రాయపడ్డారు

పెద్దన మనుచరిత్రనూ తిమ్మన పారిజాతాపహరణాన్నీ రాయలవారికి అంకితం చేసారు. కనక వారిద్దరూ అష్టదిగ్గజాలలో ఉండి ఉంటారు అయ్యలరాజు రామభద్రుడు (రామాభ్యుదయం) మాదయ్యగారి మల్లన (రాజశేఖర చరిత్ర) ఉన్నట్టు రాయవాచకం (కుమార ధూర్జటి) చెబు తోంది. తక్కిన నలుగురూ ఎవరో మరి!

సాహిత్య చరిత్రలో శ్రీనాథయుగం తరువాత, దక్షిణాంధ్ర యుగం వరకూ ఉన్న ఈ కాలాన్ని రాయలయుగం అంటారు ప్రక్రియా పరంగా ఇదే ప్రబంధ యుగం స్థూలంగా చెప్పాలంటే మహాకావ్యానికే మరోపేరు ప్రబంధం సంప్రదాయ సాహిత్యం లో కవితా సౌందర్యానికి పరాకాష్ఠలన దగిన ప్రబంధాలు ఈ యుగంలో వెలు

వడ్డాయి అందుకే ఈ యుగాన్ని స్వర్ణయుగమనడం ఈ పేరుకి సార్థకత చేకూర్చిన మహాప్రబంధాలలో ఆముక్తమాల్యద ప్రౌఢతమం

ఆముక్త+మాల్యద అంటే గోదాదేవి. తాను ధరించి తీసిన పుష్ప మాలికను విష్ణుమూర్తికి సమర్పించేది అని అర్థం '' ఆముక్త+మాల్య+ద'' అని. ఈవిడ విష్ణు చిత్తులవారి పెంపుడు కూతురు తులసి కోటలో దొరికిన పుత్రిక గోదా శ్రీ రంగనాయకుల వివాహం ఈ కావ్యంలో ప్రధానకథ అందుకని ఆముక్తమాల్యద అనీ విష్ణుచిత్తీయమనీ రెండు పేర్లు ఏర్పడ్డాయి. రాయలవారు మాత్రం విష్ణుచిత్తీయమనే వ్యవహరించారు కానీ ఆముక్తమాల్యద అనే పేరే ప్రసిద్ధిలోకి వచ్చింది.

విశిష్టాద్వైతంలో పన్నెండు మంది విష్ణుభక్తులు ప్రసిద్ధులున్నారు. వీరినే పన్నిద్దరాళ్వారులు అంటారు వీరిలో విష్ణుచిత్తులవా రొకరు గోదాదేవి ఏకైక మహిళా ప్రతినిధి లక్ష్మీదేవి అవతారమనీ, భూదేవి అవతారమనీ రెండు అభిప్రాయాలున్నాయి. రాయలవారు భూదేవి అవ తారం గా సంభావించారు

వైష్ణవాన్ని పరతత్త్వంగా స్థాపించడంకోసమని విష్ణుచిత్తుడు మధుర నేలుతున్న మత్స్యధ్వజుడనే పాండ్యరాజు కొలువుకి వాదానికి వెడతాడు జయిస్తాడు. ఆ సందర్భంగా ''విష్ణుచిత్తుడొకడూ యామునాచార్యు డొకడూ వైష్ణవ సిద్ధాంతాన్ని నిలబెడుతున్నారు '' అని విష్ణుమూర్తి లక్ష్మీదేవి తో అంటాడు అయితే ఆ యామున కథ చెప్పమని లక్ష్మీదేవి అడుగుతుంది విష్ణుమూర్తి చెబుతాడు (నాల్గవ ఆశ్వాసం) గురుపరంపరా ప్రభావంలోని ఈ కథను కొన్ని మార్పులతో రాయలవారు ఇక్కడ చిత్రించారు

అనగనగా ఒక పాండ్యరాజు మత్స్యధ్వజుడి పూర్వీకుడు. శివభక్తుడు. వెర్రి శైవం ముదిరింది వైష్ణవమన్నా వైష్ణవులన్నా ఉలుకు కానీ అతని భార్య వైష్ణవి ఆమె ద్వారా యామునుడు రాజసభలో ప్రవేశిస్తాడు వాదం లో పండితుల్ని జయిస్తాడు. శైవం ఓడిపోతుంది పందెం ప్రకారం రాజు గారు అర్ధరాజ్యం ఇస్తాడు క్షత్రియ కాంతను వివాహం చేసుకొని యామునుడు రాజ్యపాలన చేస్తూ ఉంటాడు. పుత్రోదయమవుతుంది. పూర్తిగా రాజ్యభోగాసక్తుడు అయిపోతాడు.- ఇలా ఉండగా

యామునాచార్యుడి చిన్ననాటి స్నేహితుడు శ్రీరామ మిత్రుడు యామునుడి తాతగారు నాథముని ఆయనకు ఈ మిత్రుడు ప్రశిష్యుడు

అతికష్టం మీద ఈ శ్రీరామమిత్రుడు ఎట్టకేలకు యామునరాజదర్శనం పొందుతాడు వైరాగ్యం ఉపదేశిస్తాడు శ్రీరంగానికి తీసుకువెళ్ళి రంగనాథుణ్ణి తరతరాల పెన్నిధిగా చూపిస్తాడు దానితో యామునుడు కళ్ళు తెరచి, కుమారుడికి రాజనీతి ఉపదేశించి రాజ్యం అప్పగించి తాను సన్యాసం స్వీకరిస్తాడు. క్లుప్తంగా ఇదీ ఈ ఉపాఖ్యానం

గోదాదేవి శ్రీరంగనాథుని విరహంతో పరితపించిపోతుంటే విష్ణు చిత్తుడు ఇదేమిటి మహానుభావా అని స్వామివారిని ప్రార్థిస్తాడు అప్పుడు స్వామి భక్తివైశిష్ట్యాన్ని

వివరించడానికి దాసరి కథ చెబుతాడు (ఆరవ ఆశ్వాసం) భ్రష్టాచారుడైన వేద వేత్తకన్నా సచ్ఛీలుడైన చండాలుడు మిన్న అని చెప్పడం దీని తాత్పర్యం గానమహిమనూ భక్తి మార్గప్రాముఖ్యాన్నీ ఈ కథ తెలియజేస్తుంది. దీన్నే చండాల బ్రహ్మరాక్షస సంవాద మనికూడా అంటారు. ఇది వరాహపురాణం లోనిది విష్ణుచిత్తుడు పాండ్యరాజు కొలువులో వాదిస్తున్నప్పుడు కర్మనిష్ఠకన్నా బ్రహ్మనిష్ఠ గొప్పదని ప్రతిపాదించడం కోసం ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానం ప్రసక్తమయ్యింది (మూడవ ఆశ్వాసం) ఖాండిక్యుడిది కర్మనిష్ఠ. కేశిధ్వజుడిది బ్రహ్మనిష్ఠ. వీరిద్దరూ బద్ధ శత్రువులు కట్టకడపటికి ఖాండిక్యుడు కేశిధ్వజుని గురుత్వాన్ని అంగీకరించి బ్రహ్మజ్ఞాని అవుతాడు దీన్ని రాయలవారు విష్ణు పురాణం నుంచి స్వీకరించారు

విష్ణుచిత్తుని కథ ఖాండిక్యకేశిధ్వజుల కథ యామునాచార్యుని కథ, బ్రహ్మరాక్షసుడి కథ గోదాశ్రీరంగేశుల వివాహం- ఇలా ఈ ఆముక్త మాల్యద అయిదు కథల సమాహారం. మధ్య మధ్యలో కథతో అంతగా పొంతన కుదరని విస్తృత వర్ణనలు న్నాయని అందుకే వస్త్వైక్యం కొరవడిందని కొందరు విమర్శకులన్నారు రెండు పురవర్ణనలూ(విలుబుత్తూరు ప్రథమ 5 -73 మధురాపురం- ద్వితీయ 3-38) : గ్రీష్మ (ద్వి-45-74) వర్షా శరద్ (చతుర్థ 76- 83) వసంత (పంచమ 98- 43) వర్ణనలూ సుదీర్ఘంగా సాగాయి. రాయలవారు వర్ణనలకు పెట్టింది పేరు మొత్తం 850 గద్యపద్యాల కావ్యంలో 250కి పైగా గద్యపద్యాలు వర్ణనలకే సరిపోయాయి అత్యద్భుతమైన కల్పనలకూ (ఉత్ప్రేక్షలు) ప్రకృతి పరి శీలనకూ ఇవి ఆటపట్టులు పూర్వకవులకు అనుకరణలు గానీ, అనుసర ణలు గానీ, ఏ కోశానా కనిపించవు. రాయలవారి ప్రతిభకు ఇవి నికషో పలాలు. మహాకవిగా నిలబెట్టినవి ఇవ్వే అన్నా అసత్యం లేదు ఒక్కొక్క వర్ణనా ఒక్కొ క్క ఖండకావ్యం నిజానికి వీటిని చెబితేనే కవిగా రాయల వారంటే ఏమిటో తెలుస్తుంది కానీ వైవిధ్యంకోసమనీ విస్తృతమైన కావ్య ప్రయోజనాలలో మరో పార్శ్వాన్ని చూపిద్దామనీ, ప్రయత్నపూర్వకంగా వర్ణనలను విడిచిపెట్టి, రాజనీతిని మీ ముందు ఉంచుతున్నాను. ఇది యామునుడు తన కుమారునికి ఉపదేశించిన రాజనీతి రాయలవారు స్వానుభవం రంగరించి అందించిన రాజనీతి దీంట్లో చాలా వాటికి ఈ నాటికీ చెల్లుబాటు ఉంది.

యామునుడు'' స్కంధావారంబునకు మగుడివచ్చి కుమారు నందు రాజ్యభారంబు బెట్టి బంధుమిత్రామాత్య సమేతంబగు బల చతుష్టయంబును బ్రకృతి వర్గంబును నతని కొప్పగించి యిట్లనియె-

ఏ పట్టున విసువక ర

క్షాపరుడవు గమ్ము ప్రజల చక్కి, విపన్నుల్

గూపెట్టిన విని తీర్పుము,

కాపురుషులమీద నిడకు కార్యభరంబుల్ 4-204

ఇది మొదటి ఉపదేశం. ప్రజలపట్ల ఏ సమయంలోనూ విసుక్కోకు.

ఎప్పుడూ వారికి రక్షణ పరతంత్రుడివిగా ప్రవర్తించు. ఆపదలో ఉన్న వాళ్ళు వచ్చి ఏదయినా మొరపెట్టుకుంటే (కూ పెట్టినన్) శ్రద్ధగా ఆలకించు వాళ్ళ ఆపదలు తీర్చు, అయితే ఇటువంటి కార్యభారాన్ని కుత్సితులైన రాజోద్యోగులకు ఏనాడూ అప్పగించకు. అర్హతలు గుర్తించి సరియైన పనులకు సరియైన వ్యక్తుల్ని నియోగించడం పరిపాలకుల విజయానికి ప్రథమసోపానమని తాత్పర్యం

రాష్ట్రవర్ధన మెద గోరు రాజవేలు
రాష్ట్రమును గోరు, దాన గార్యమొ యనంగ
రాదు, బ్రహ్మోత్తరములైన ప్రజల యేక
ముఖపు గోర్కి దదంతరాత్ముండొసగడె! 4-205

రాష్ట్రమంటే దేశం దేశమంటే మట్టికాదు. మనుషులు (లక్షణా వృత్తి) రాష్ట్రాభివృద్ధిని ఎల్లవేళలా హృదయంలో (ఎదన్) రాజుగారు కోరుకుంటే, అటువంటి రాజుగారికి మేలు జరగాలని రాష్ట్రం కోరుకుం టుంది దానివల్ల ఒరిగేదేమిటి అనకు. (దానన్ కార్యమో అనంగ రాదు) బ్రాహ్మణాది ప్రజానీకమంతా ఒకే తీరుగా, ఒకే రీతిగా (ఏకముఖము నన్) కోరుకొంటున్నదానిని సర్వాంతర్యామి శ్రీమన్నారాయణుడు (తత్ + అంతరాత్ముండు) తీర్చడంటావా ప్రజాభీష్టమే పరమాత్మ కనక తప్పక నెర వేరుతుందనీ, ప్రజాబలమే నిజమైన బలమనీ భావం జనతాజనార్దనుడు

ఆజ్ఞ వలయు నృపతి, కాభీర భిల్లాది
కంపకోల నూల నాజ్ఞ చెల్లు
నంట, సార్వభౌముడైన భూపతి యాజ్ఞ
కెల్లవారు దల్లడిల్ల వలదె 4-206

పరిపాలకుడు ఆజ్ఞాపించగలగాలి. అది చెల్లాలి. (నృపతికి ఆజ్ఞ వలయు) గొల్లలూ(ఆభీరులు) భిల్లులూ(చెంచులు) మొదలైన వారికి అంపకోలతోనూ నూలు పోగుతోనూ (నూలన్) ఆజ్ఞ చెల్లుతుందట అటు వంటిది భూపతి ఆజ్ఞకు అందరూ తలవంచవద్దా! భయపడి ఆచరించ వద్దా!!

గొల్లరేడుగానీ భిల్లరాజుగానీ, ఒక వ్యక్తికి అభయమిచ్చి దానికి సూచకంగా అంపకర్రనో నూలుపోగునో చేతబెట్టి పంపితే, దారిలో ఏ చోరులూ ఆ వ్యక్తికి హాని చెయ్యరని ప్రసిద్ధి గొల్లలకూ, భిల్లులకే ఆజ్ఞ నడిస్తే మహారాజుకు ఆజ్ఞ నడువవద్దా అని.

ఆజ్ఞ చెల్లకపోవడం అసమర్థత అవుతుంది. కనక పరిపాలకుడు చండ శాసనంగా ఆజ్ఞ చెల్లించుకోవాలని హెచ్చరిక.

దుర్గము లాప్త ద్విజవర
వర్గమునకె యిమ్ము దుర్గపత్తతి క
త్త్వర్గళ ధరాధిరాజ్య వి
నిర్గత సాధ్వసత పాదమ నిలుపకు తొలదిన్ 4-207

"దుర్గము" అంటే చోరశక్యము కానిది. అభేద్యమైన రక్షణ స్థలం ఇవి

సరిహద్దుల్లో ఉంటాయి నేలమీద నిర్మిస్తే స్థలదుర్గం, నీళ్లల్లో నిర్మిస్తే జల దుర్గం, కొండమీద కడితే గిరి దుర్గం నట్టడవిలో కడితే వన దుర్గం వీటికి అవతలవైపున శత్రురాజ్యం శత్రువు ముందుగా వీటిని స్వాధీన పరుచుకొని, ఆ తరువాత రాజ్యం మీదికి దండెత్తి ఆక్రమిస్తాడు కాబట్టి సరిహద్దుల్లో దుర్గాలు గట్టిగా ఉండాలి. వీటి సంరక్షణ ప్రభువుకి ప్రథమ కర్తవ్యం

రాజ్యసంరక్షణలో ఇంత కీలకమైన ఈ దుర్గాలను ఆప్తులైన బ్రాహ్మణోత్తములకే (ద్విజవర వర్గమునకె) ఇమ్మంటున్నాడు- రాయల వారు ఆప్తులు కనక విశ్వసనీయులనీ, బ్రాహ్మణ ఉత్తములు కనక మోసగించరనీ కాబోలు .

దుర్గాధిపత్యం అప్పగించిన తరువాత వాళ్లకు ఏ పరిమితులనూ (కొలదిన్) విధించవద్దు (నిలుపకు) అన్నాడు సైన్యం కానీ మరో సౌకర్యం కానీ ఏది కావాలంటే అది రాజుగారు పుష్కలంగా, అమితంగా అందించాలి నిర్ణయాలు తీసుకునే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి అదిలేక పోతే ఏమవుతుందో చెబుతున్నాడు. అత్యర్గళ ధరాధిరాజ్య వినిర్గత సాధ్వసత'' దుర్గాధిపతులకు పొడముతుందట నివారించడానికి శక్యం కాని(అత్యర్గళ) శత్రురాజ్యంనుంచి (ధరాధిరాజ్య) బయల్వెడలిన (వినిర్గత) భయం (సాధ్వసత) కలుగుతుంది. మన రాజు తగినంతగా సహాయం అందించడం లేదు. మాకు నిర్ణయం తీసుకునే అధికారం లేదు. శత్రురాజు ఏ నిము షాన దండెత్తి వస్తాడో అప్పడు ఏమి చెయ్యాలో అనే భయం దుర్గాధిపతు లకు పట్టుకుంటుంది కాబట్టి ఇటువంటి సాధ్వసత పొడమేటట్టు ఏ కొలదులూ (పరిమితులు) నిలుపవద్దు అని శాసిస్తున్నాడు

దుర్గాధిపత్యం ఇచ్చేటప్పడు మనిషి మంచి చెడ్డలు చూసుకోవాలి ఇచ్చిన తరువాత పరిమితులు- విధించకూడదు.- ఇదీ సారాంశం

మొదల బెనిచి, పిదప గుదియింప నెవ్వాడు
దవదు తొంటి హీనదశ దలంప,
డలుగు గాన, శీల మరయుచు గ్రమ వృద్ధి
బెనిచి, వేళ వేళ బనులు గొనుము 4-208

ముందు పెంచి తరువాత పదవి కుదిస్తే ఎవడైనాసరే వెనుకటి తన హీన స్థితిని తలుచుకోడు అలుగుతాడు అంచేత శీలం గమనిస్తూ క్రమక్రమంగా వృద్ధిలోకి తెస్తూ (క్రమవృద్ధిన్ పెనిచి) ఆయా వేళల్లో లేదా ఎల్లవేళలా (వేళ వేళన్) సేవలు చేయించుకో (పనులు కొనుము) .

శీలం సామర్థ్యం గమనిస్తూ రాజోద్యోగులకు పదోన్నతి కల్పించాలే తప్ప హఠాత్తుగా స్థితి పెంచడం కుదించడం పనికిరావని. పెంచినప్పడు సంతోషిస్తాడు. కుదించినపుడు కోపిస్తాడు. అంతేకానీ తొలినాటి తన హీనదశను తలుచుకోడు. న్యాయంగా ఇదేకదా నా స్థితి అని సరి పెట్టుకోడు ఈపాటిదానికైనా ప్రభువే కదా కారణం అని సంతృప్తి చెందడు. అలిగి ద్వేషించి అధికారికి వ్యతిరేకంగా ప్రచారం

మొదలుపెడతాడు. అంచేత క్రమ క్రమంగా పదోన్నతి కల్పించి వృద్ధిలోకి తేవడమే సబబైన పని. పై పదవి కంటికి కనబడుతూ ఉంటే దాన్ని అందుకోవడంకోసం సచ్ఛీలంతో సత్సామర్థ్యంతో పనిచేస్తాడు. అలా ఎల్ల కాలమూ సేవలు చేయించు కోమని తనయుడికి యామునులవారి ఉపదేశం.

అన భిజాతు గీకటాలయు, వ్రతుతు,
నలుకుమాని బొంకు పలుకువాని,
నాతతాయి, గడుసు, నన్యదేశ్యు, నధర్ము,
విడుము విప్రు, నేల వేడితేని 4-209

నువ్వు పదికాలాల పాటు సజావుగా రాజ్యం ఏలదావనుకుంటే ఏలదామని కోరుకుంటే (ఏలన్ వేడితి+వి+ఏనిన్) ఇదిగో ఈ లక్షణాలున్న విప్రుణ్ణి దూరంగా ఉంచు.

మంచి వంశచరిత్ర లేనివాడూ, శబర పల్లిలో(కీకటం) నివాసం ఏర్పరచుకున్నవాడూ లేదా మద్యమాంసాలు మరిగి ఎప్పుడూ అవి దొరికే చోటుల్లో తిరిగేవాడూ, పాండిత్యం లేనివాడూ, జంకూ గొంకూ లేకుండా (అలుకుమాని) బొంకులు పలికేవాడూ, ఎంతటి పాపానికైనా తెగించే ఆతతాయి,గడుసువాడూ, విదేశీయుడూ, అధర్మపరుడూ–ఈ లక్షణాలున్న బ్రాహ్మణుణ్ణి దగ్గరకు చేరనియ్యకు- విడిచి పెట్టెయ్యి (విడుము).

'ఆతతాయి' అంటే ప్రత్యేకమైన అర్థం ఉంది కొంపలకూ పంటలకూ నిప్పు పెట్టినవాడూ, విషం పెట్టినవాడూ, అకారణంగా ఆయుధం పట్టినవాడూ, పరధనం కాజేసినవాడూ, పరాయి పొలం ఆక్రమించిన వాడూ పరాయిభార్యను అపహరించినవాడూ- ఈ ఆరుగురూ ఆతతా యులు."అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణిర్ధనాపహః, క్షేత్ర దారాపహర్తా చ షడేతే హ్యాతతాయినః "అని శ్లోకం. భ్రూణహత్య (గర్భ విచ్ఛిత్తి)చేసినవాడూ, శిశు హత్య చేసినవాడూ, నిద్రిస్తున్నవాళ్ళను చంపినవాడూ ఇలా ఆతతాయుల జాబితా పెరుగుతూ వచ్చింది. నమ్మించి ద్రోహం చేసినవాడనీ చంపడానికి సిద్ధపడినవాడనీ తాత్పర్యార్థం (ఆతతాయీ వధోద్యతః అని అమర నిఘంటువు).

గడుసువాడంటే అపవాద భయం లేనివాడని వావిళ్ళవారి టీక అపరాధం చేసీ భయపడని ధృష్టుడని వేదంవారి సంజీవనీ వాఖ్య.

తక్కుము మిగుల బథిచ్యుత
పక్కణ వర్తితుల, దొల్లి భ్రష్టగు విప్రుం
డొక్కండలుగడె ప్రోచిన
కొక్కెరపై నొక్కపూట కూటికి గాగన్! 4-210

"పథిచ్యుతుడు" అంటే దారి తప్పినవాడు స్వధర్మాన్ని విడిచి పెట్టి, అపమార్గాలు పట్టి భ్రష్టులై బోయపల్లెల్లోపెరిగే విప్రుల్ని బాగా (మిగులన్) దూరంగా

ఉంచు. వారిని పూర్తిగా విడిచిపెట్టు (పక్కణ: శబరాలయ:- అమరం)

పూర్వం(తొల్లి) భ్రష్టుడైన ఒక బ్రాహ్మణుడు తనను కాపాడిన కొక్కెరపైనే (కొంగ) అలిగి, ఒకపూట తిండికోసం (కూటికిగాగన్) చంపి పొట్టనపెట్టుకున్నాడు గదా!(అలుగడె!)

ఇది మహాభారతంలో శాంతిపర్వంలో గౌతమ నాడీజంఘుల కథ గౌతముడు భ్రష్టుడైన బ్రాహ్మణుడు మద్య మాంసాలకు అలవాటుపడ్డాడు. బోయకాంతను మరిగాడు అన్ని విధాలా చెడిపోయా డు.- ఒకరోజు అడవిలో ఇతణ్ణి నాడీజంఘుడనే కొంగ కాపాడింది ఆ రాత్రి కొంగ నిద్రపోతుంటే గౌతముడు దాని రెక్కలు విరిచి చంపి తెల్లవారాక ఆహారంగా పనికివస్తుందని తీసుకుపోతాడు పథిచ్యుతులు ఇంతటి ఘోరాలకూ ఘాతుకాలకూ ఒడికడతారు కాబట్టి వాళ్ళని మిక్కిలి దూరంగా ఉంచమని హెచ్చరిస్తున్నాడు

పథిచ్యుత శబ్దాన్ని పక్కణానికి అన్వయించి ప్రధాన మార్గానికి దూరంగా ఉన్న బోయపల్లెలు అని అర్థం చెప్పింది-సంజీవనీవాఖ్య బోయ పల్లెలు ఎప్పుడూ రాచబాటకు దూరంగానే ఉంటాయి కనుక ఈ పదాన్ని బ్రాహ్మణులకు విశేషణంగా అన్వయించడమే సమంజసం(వావిళ్ళవారి టీక)

"చదివి యధర్మ భీరు నృపశాస్త్ర విధిజ్ఞతలన్ వయస్సు డె
బ్బదిటికి లోను నేబదికి బాహ్యములై, యరుజన్ స్వపూర్వులై
మదమలి, రాజు ప్రార్థన నమాత్యత గైకొని తీర్చు పాఱువా
రొదవిన వంగముల్ మిగుల నూర్జిత మౌటకు బూటచాలదే! 8

రాజు తనకు ఎవరిని మంత్రులుగా నియమించుకోవాలో ఇందులో చెప్పాడు

బాగా చదువుకొన్నవాడై యుండాలి అధర్మాచరణకు భయపడేవాడు కావాలి రాజనీతిశాస్త్రం క్షుణ్ణంగా అభ్యసించి ఉండాలి వయస్సు డెభ్భయికి లోపలా యాభయికి పైనా ఉండాలి రోగాలు లేనివాడు కావాలి (అరుజన్). వీరి వంశంలో పూర్వీకులు తన వంశంలో పూర్వీకుల దగ్గర పనిచేసినవారై పరిచితులై ఉండాలి (స్వపూర్వులై) మదమాత్సర్యాదులు ఉండకూడదు (మదము+ అలి= అహంకారము నశించి) రాజుగారి ప్రార్థనమీదనే అమాత్యత్వాన్ని స్వీకరించాలి అలా స్వీకరించి కార్యాలు చక్కబెట్టగలిగిన బ్రాహ్మణులు (పాఱువారు) దొరికినట్లయితే ఇంక ఆ రాజుగారి రాజ్యాంగాలు బాగా అభివృద్ధి చెందడానికి ఒక్కపూట చాలదా

స్వామి అమాత్య సుహృత్ కోశ రాష్ట్ర దుర్గ, బలాలు రాజ్యాంగాలు ఇవన్నీ అభివృద్ధి చెందాలంటే పై లక్షణాలున్న బ్రాహ్మణులు మంత్రు లుగా లభించాలి లభిస్తే అభివృద్ధి సాధించడం ఒక్క పూట పని

చదువుకొన్నవాడవ్వడమే కాదు, వయస్సు యాభైకి పైబడాలిట కాగి చల్లారిన పాలులా ఉండాలి స్వపూర్వులై అనడంవల్ల రాచరికంలో - మంత్రిపదవి వంశపారంపర్యమయితే మంచిదనీ అభిలషణీయమనీ తెలుస్తోంది. అయినా

రాజుగారు ప్రార్థిస్తేనే మంత్రి పదవిని అంగీకరించి చేపట్టేవాడు అవ్వాలి. అంతేగానీ ఎగబడేవాడు కాకూడదు ఎగబడినా ఇతరత్రా ప్రయత్నించినా ఒత్తిడి తెచ్చినా అతడి శీలాన్నీ సామర్థ్యాన్నీ శంకించవలసిందేనని కాబోలు

వ. అట్టి మంత్రివర్గంబు దొరకదేని 4-2 2
నీతిం దాన తలంచి చేయు బని గానీ కాకపోనీ బల
వ్రాతార్థాఢ్యత నెమ్మినుండక యొరు బ్రోవన్మంత్రియంచున్ గుణా
తీతుం, గుమ్మడికాయ యంతయగు ముత్తెంబై మనం బేర్వ న
ట్లే తా నాతనిచేతిలో బ్రదుకువాడే యౌఁ జుమీ మీదటన్ 4-2 3

అలాంటి యోగ్యమైన మంత్రివర్గం దొరక్కపోతే ఏం చెయ్యాలంటే రాజుగారు తానే నీతిని ఆలోచించి స్వయంగా రాజకార్యాలు నిర్వర్తించుకోవాలి విధి నిర్వహణ చెయ్యాలి పని అవ్వనీ కాకపోనీ తన సైన్యంమీదా(బలవ్రాతము) తన దనసంపత్తి మీదా(అర్థ) తన సామర్థ్యం మీదా (ఆఢ్యత) ఆధారపడాలి అలా ఆధారపడి నెమ్మితో ఉండకుండా అయోగ్యుణ్ణి ఎవణ్నో ఒక పరాయివాణ్ణి (ఒరున్) మంత్రి అంటూ చేరదీస్తే (మంత్రి యనుచున్ ప్రోవన్) చివరికి మనస్తాపం మిగులుతుంది గుణరహితుడైన ఆ మంత్రి గుమ్మడికాయంత ముత్యమై కూచుంటాడు మనస్తాపం కలగడ మొక్కటే కాదు (మనంబు ఏర్వన్) అలాగే ఆ పైని (మీదటన్) రాజుగారు అతడి చేతిలో కీలుబొమ్మలా బ్రతుకు గడుపవలసినవాడు అయిపోతాడు సుమా అంచేత అయోగ్యుడికి మంత్రిపదవి కట్టబెట్టడంకన్నా కష్టమో నష్టమో రాజుగారే రాజ్యపాలన స్వయంగా చూసుకోవడం మంచిదని సారాంశం.

గుమ్మడికాయయంతయగు ముత్తెంబై అనే అభివ్యక్తి రాయలవారి ముద్ర తొలగించి తీసిపారెయ్యడానికా వీలులేదు ముత్యం కనక ధరించి భరిద్దామంటే వీలుకాదు-గుమ్మడికాయంత ఉంది కనక. రాజు గారు సంకటంలో పడిపోతాడు. కట్టకడపటికి దుష్టుణ్ణి తెచ్చిపెట్టుకుంటే వాడు ఎదిగి ముదిరి అలవి కానివాడైపోతాడు. రాజుగారు వాడి చేతిలో కీలుబొమ్మై, మనస్తాపంతో బ్రతుకు వెళ్లబుచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది

మంత్రివర్గం గురించి చెప్పడమయ్యింది. ఇంక రాజోద్యోగుల గురించి ప్రస్తావిస్తున్నాడు.

ఒక్కని విరివికినె దొరల్
పెక్కండ్రే, నొక్కనికని వెంబడి ననుగుల్
పెక్కండ్రు నిలువ బను లగు 4-2 4
గక్కసము గుదింప, బెంపగా గాకుండున్

(విరివికి=కార్యాతిశయమునకు - సంజీవనీ వ్యాఖ్య)

అధికార వికేంద్రీకరణ అధిక ప్రయోజనకారి అంటున్నాడు. ఒక్కడికి విస్తరించి ఇచ్చేదానికే (విరివికిన్) అధికారులు (దొరల్) పెక్కు మంది అయితే అంటే

విస్తృతాధికారాలతో ఒక్కణ్ణే నియమించే కన్నా ఎక్కువమందిని ఉద్యోగాల్లో నియమిస్తే ఒక్కొక్కడి వెనకాలా వాడి అనుచ రులు (అనుగుల్) కనీసం మరో పదిమంది నిలుస్తారు (పెక్కండ్రు నిలు వన్) పనులు చకాచకా జరుగుతాయి (పనులు అగున్)

పనులు త్వరగా జరగాలంటే ఒక్కడి కార్యాతిశయానికే పెక్కుమందిని నియమించాలని తాత్పర్యం ఆ పెక్కుమందితో మరింత ఎక్కువ మంది పనిలో లీనమవుతారు.

అలా కాకుండా వ్యక్తుల్ని తగ్గించేసి(కుదింపన్) ఒక్కడికే అన్ని పనుల బాధ్యతలూ అధికారాలూ అప్పగిస్తే అది కర్కశం (కక్కసము) అవుతుం ది కఠిన వైఖరి అంటారు దొరల సంఖ్య(ఉద్యోగుల సంఖ్య)పెంచినట్టయితే ''కక్కసము కాకుం డున్''. అది కర్కశవైఖరి అవ్వదు ఉద్యోగాలు వచ్చా యికదా అని. ప్రభువు తమపై విశ్వాసం ఉంచాడుకదా అని ఆ పెక్కుమంది దొరలూ కొనియాడతారు. ఉదారుడని ప్రశంసిస్తారు ఇదీ ఫలితార్థం.

ధన ముఖ్యము కేవల మే
పనికిన్ గా దాస్థ గలిగి పలువురు ప్రభువుల్
పని సేయుక, తద్వశ్యం
బునకు నలోభానృశంస్యముల్ ఋతము జెలుల్ 4-215

(ఏ పనికిన్ రాదు , ఆస్థ గలిగి- అని వావిళ్ళవారి పాఠం)

కేవల ధన ప్రాధాన్యం ఏ పనికీ కాదు పలువురు అధికారులు (ప్రభువుల్= దొరలు) ఆసక్తితో పనిచేస్తేనే తప్ప కేవలం ధనమున్నంత మాత్రా న పనులు కావు. ఆ అధికారులను వశం చేసుకోడానికి- మిత్రుల్లా రాజుగారికి సహకరించే గుణాలు ప్రధానంగా మూడు ఒకటి లోభించక పోవడం(అలోభం) రెండు క్రౌర్యం లేకపోవడం (ఆనృశంస్యం) మూడు సత్యసంధత (ఋతం). ఈ మూడుగుణాలూ రాజుగారికి ఉంటే అధి కారులు వశులై ఉంటారు.

ఉద్యోగులకు ఇచ్చే జీతాల విషయంలో లోభించకపోవడం, వాళ్ళు ఏదయి నా చిన్నపొరపాటు చేస్తే మరీ క్రూరంగా శిక్షించకపోవడం, ఆడి తప్పకపోవడం- ఈ గుణాలను రాజుగారు అలవరుచుకుంటే అధికారులు ఆస్థతో విధులు సక్రమంగా నిర్వర్తిస్తారు. పనులు జరుగుతాయి - అని తాత్పర్యం

చెలి అంటే నేస్తం స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు ఇది ప్రాణి వాచకం. గుణాలు అప్రాణివాచకాలు మరి ఇవి చెలులు కావడం ఎలాగ్లె అంటే నేస్తాల్లాగా ఈ గుణాలు సహకరిస్తాయని భావం గుణాలలో మిత్ర త్వలక్షణాన్ని(ఉపమానధర్మం) ఆరోపించి సమానధర్మాన్ని (సహకరించడం) చెప్పకుండా ఉపమాన వాచకాన్ని (వలె, పోలె) ప్రయోగించకుండా వాక్యం నిర్మించాడు ఉపమానోపమేయాలను విడివిడిగా చూపించాడు. ఔపమ్యం స్ఫురింపజేసాడు దీన్ని సారోపలక్షణ అంటారు లక్షణా వృత్తిలో ఇదొక భేదం

రాజుగారికి నమ్మకమ్మైన ఉద్యోగుల అవసరాన్ని గురించి మరి కొంత చెబుతున్నాడు. -

భాండాగార హయాద్యము
లుండియు, ననువగు మనుష్యు లొదవమి నవియున్
మండలము నవయ నరికొది
గుండిన సింహాసనంబు లుర్విన్ వినమే ! 4-216

(ఒదవమిన్=అమరకపోవుటచే, నవయన్ =బలహీనపడగాన్)

తగినంత కోశాగారం ఉండీ (భాండ+ ఆగారము) అశ్వసైన్యం (హయ) గజసైన్యం మొదలైన సేనాబలం ఉండీ అనువైన మనుష్యులు (మంత్రులు ఉద్యోగులు) దొరకకపోతే (ఒదవమిన్- దొరక్కపోవడం చేత) అవీ క్షీణించిపోతాయి. చిట్టచివరికి రాజ్యమూ నీరసపడిపోతుంది. అలా బలహీనపడి, శత్రువులకి (అరికిన్) లొంగిపోయి, వాళ్ల చెప్పు చేతల్లో ఒదిగి ఉండిపోయిన రాజ్యాలను గురించి (సింహాసనంబులు) ఈ భూమి మీద ఎన్ని వినలేదు మనం! చాలా వింటున్నామని.

సింహాసనమనేది రాజ్యాధికారికి ప్రతీక - ఇదికూడా లక్షణావృత్తే: ఒదిగుండిన సింహాసనాలు అంటే శత్రువుకి లొంగిపోయిన రాజ్యాధికారాలు అని.

ఒదిగి+ఉండిన=ఒదిగుండిన. ఇది క్త్వార్థక సంధి. భూతకాలిక అసమాపక క్రియా హ్రస్వ ఇకారాన్ని క్త్వార్థకం అంటారు ఇలాంటి ఇ క్త్వా్నికి అచ్చు పరమైనప్పుడు సంధి జరగదని బాల వ్యాకరణం చెప్పింది. క్త్వర్థంబైన యిత్తునకు సంధి లేదు అప్పుడు దీన్ని శబ్దపల్లవంగా సమన్వ యించుకోవలసి ఉంటుంది లొంగుట అనేది విశేషార్థం ప్రౌఢ వ్యాకర్త ఈ సంధిని అంగీకరించాడు. కాబట్టి పేచీలేదు.

బాహుజాంఘ్రిజ ముఖ విడంబనకునైన,
గొలిచి మను విప్రధర్మంబు దెలిసియ్యైన,
బూని సంకటముల నిల్చు గాన దలచు
బ్రాహ్మణుని బ్రభు జేయుట పతికి హితము . 4-217

సాధ్యమైనంత వరకూ (తలచు) బ్రాహ్మణుణ్ని మంత్రిగా నియమించుకోవడం (ప్రభున్ చేయుట)రాజుగారికి మేలు-(పతికిన్ హిత ము) అంటున్నారు రాయలవారు. ఎందుకంటే సంకట పరిస్థితులు వచ్చినప్పుడు రాజుగారిని ఏకాకిని చేసి వదిలిపెట్టి పారిపోకుండా బ్రాహ్మణుడ యి తే ప్రయత్నపూర్వకంగా (పూని) నిలుస్తాడట దానికి కారణాలు రెండు చెబుతున్నాడు.-

బ్రాహ్మణుడయితే తక్కినకులాలవారు-క్షత్రియులూ(బాహుజ) శూద్రులూ (అంఘ్రిజ) మొదలైనవారు - ఆక్షేపిస్తారని భయపడతాడుట అలా భయపడయినా రాజుగారికి అండగా నిలుస్తాడు.

ఇరుగుపొరుగు రాజ్యాలలో రాజుల్ని సేవించి(కొలిచి) జీవిస్తున్న (మను నట్టి) బ్రాహ్మణమంత్రుల ఆచారాన్ని (విప్రధర్మంబు)తెలుసుకునైనా తనూ తనరాజుకి

అండగా నిలుస్తాడు

ఇతరులు ఆక్షేపిస్తారనే జంకుతోగానీ, సాటివారిలో అప్రతిష్ఠ వస్తుందనే గొంకుతోగానీ, ఇక్కట్లలో వెంట నిలుస్తాడు కాబట్టి తరచుగా బ్రాహ్మణుణ్ణి మంత్రిని చేసుకోవడం రాజుకి మేలు.

బాధ్యతలు అప్పగించడంలో మరొక జాగ్రత్తను ఉపదేశిస్తున్నాడు.

ఆయతికాని కీడు మమరాలయముఖ్యము, లాత దర్థ తృ
ష్ణాయుతుడై నిజోర్వినగు నష్టికి దద్ధనమున్ దొరల్చి, రా
జాయతనంబు జేర్చు, మఱి యట్టి దపథ్యము గాన, నొంటి గా
డే యధికారి కావలయు, నించుక తిన్నను వాడె రూపఱున్ 4-2 । 8

"ఆయతికాడు" అంటే ప్రజలనుంచి రకరకాల పన్నులు వసూలు చేసి రాజకోశానికి చేర్చే అధికారి దేవాలయాలు మొదలైన ధర్మ సంస్థలను (అమరాలయ ముఖ్యములు) ఆయతిగాడికి అప్పజెప్పవద్దు. ఎందుకంటే అతడికి ధనాశ ఉంటుంది. పన్నులు నూటికి నూరుశాతం వసూలు చేసి కోశాగారానికి చెల్లించి రాజుగారి మెప్పు పొందాలి అనే కాంక్ష ఉంటుంది అటువంటి అధికారి తాను పన్నులు వసూలు చేయ వలసిన భూభాగంలో (తన అధికారంలో ఉన్న భూమియందు=నిజోర్విన్) ఎప్పుడ యినా ఒక ఏడాది పండక, పన్నులు వసూలుకాక, నష్టం ఏర్పడితే ఆ నష్టిని పూరించ డానికి దేవాలయ ధనాన్ని హరించి లేదా మరల్చి (దొరల్చి) రాజకోశానికి (రాజ+ ఆయతనము=రాజకోశాగారం) చేరుస్తాడు. మరి అలా వచ్చిన ధనం దేవాలయం సొమ్ము కనక స్వీకరించరానిది అది హితం చెయ్యకపోగా (అపథ్యము=హితం కానిది) కీడు కలిగిస్తుంది దేవాలయం సొమ్ము రాజుగారు కాజేస్తున్నాడు అని అపకీర్తి వస్తుంది కాబట్టి ధార్మిక సంస్థలకు ఎప్పుడూ ఒక ప్రత్యేకాధికారినే నియమించాలి " ఒంటిగాడే అధికారి కావలయు". అది తప్ప అతడికి వేరే బాధ్యతలు ఉండకూడదు అతడూ ఒంటిగాడు-అంటే దేవుడి సొమ్ముని మరి దేనికీ మళ్ళించవలసిన అవసరం లేనివాడు

మరీ ఏకచ్ఛత్రాధిపత్యంగా ఒక్కడికే అప్పగిస్తే అదుపూ అజమాయిషీ లేక అతడే దేవాలయం సొమ్ములు కాజేస్తేనో- అంటే చెబుతున్నాడు తింటే తిననీ. ఒక్కడు ఎంత తింటాడు ! ఇంచుక తిన్నను వాడె రూపఱున్ ఏ కొంచెమో తిన్నా వాడే నాశనమైపోతాడు. ఆ పాపం రాజుగారికి అంటదు ప్రజలు తిడితే వాణ్ణే తిడతారు తప్ప రాజుగారికి అపకీర్తి రాదని.

అదీకాక దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే అన్నట్లు దేవుడి సొమ్ముకి అందరూ భోక్తలే. అంచేత ఏ కాలంలోనైనా ఏ సమాజంలోనైనా ధర్మ పరుల్ని పదిమందిని ఎంపిక చేయడం కష్టం ఒక్కణ్ణి పట్టుకోవడం కష్టం కాకపోవచ్చును అలాంటి నికార్సయిన మనిషి దైవభక్తీ పాపభీతి ఉన్నవాడు కనీసం ఊరుకి ఒక్కడయినా దొరక్కపోడు అతడికి దేవాలయం అప్పగిస్తే పదికాలాలపాటు విరాజిల్లుతుందనీ,

బేతవోలు

ఉద్దిష్ట కార్య క్రమాలకే దాని ధనం వినియోగమవుతుందనీ కాబోలు రాయలవారి ఆంతర్యం

రూపఱున్- అఱు అనే ధాతువుకి నశించుట అని అర్థం. కానీ క్రియగా దీనికి స్వతంత్ర ప్రయోగం ఉండదు ఏదో ఒక నామవాచకానికి చివరచేరి కాలబోధక ప్రత్యయాలను పొందుతూ ఉంటుంది. అది నశించు అనే అర్థాన్ని బోధిస్తూ ఉంటుంది రూపు+ అఱుట= రూపు నశించుట-పెంపు + అఱుట=పెంపు నశించుట ఇలా రూపఱు చున్నాడు రూపఱెను, రూపఱగలడు, రూపఱును ఇత్యాదిగా అన్ని కాలాల్లోనూ రూపాలు ఏర్పడతాయి రూపఱుచున్, రూపఱి, రూపఱక, రూపఱమి- ఇలా కృదంత రూపాలుకూడా ఏర్పడతాయి

ప్రతిరాజ్యానికీ బహిశ్శత్రువులూ అంతశ్శత్రువులూ ఉంటారు వీళ్ళల్లో ముందు ఎవరి పని పట్టాలి ? ఎలాగ ? అనేది కర్షకుడితో పోల్చి చెబుతున్నాడు

మును దన సీమ చేసికొని, ముల్లిడి, గుద్దట వెండి చేని మె
త్తనకయి వేరు వెల్లకియు ద్రవ్వెడు కర్షకునట్లు- శత్రుతో
నెనసియ యైన, దుర్గబలమే కొనియైన, నిజాత్మ జింత లే
క నెగడ జేసి, లోన మఱి కంటకశోధన జేయు టొప్పగున్ 4-219

కర్షకుడు పొలానికి ముందుగా సరిహద్దులు నిర్ధారించుకొని '' ఇది నా పొలం' అనిపించుకుంటాడు ఆ తరువాత దానిచుట్టూ ముళ్ళకంచె వేస్తాడు (ముల్లు+ ఇడి) అటుపైని (వెండి) చేనుని మెత్తబరచడం కోసం గునపంతో (గుద్దట న్) పొలంలో ఉన్న దుబ్బులూ, గొప్పలూ (వేరు వెల్లకి) త్రవ్వి తొలగిస్తాడు అలాగే రాజుగారుకూడా సరిహద్దు దేశాలతో (వీళ్ళు ఎప్పుడూ శత్రువులే) మైత్రి చేసుకుని గానీ (అంటే తాత్కాలిక మైత్రి) లేదా సరిహద్దుల్లో దుర్గాలను బలపరుచుకొని గానీ (దుర్గబలమే+ కొనియైనను) ముందు తన హృదయానికి చింతలేకుండా చేసుకోవాలి అప్పుడు రాజ్యం లోపల కంటకశోధన చెయ్యాలి చిన్నచిన్న ముళ్ళు- క్షుద్రశత్రువుల్ని ఏరి పారేసే కార్యక్రమం మొదలుపెట్టాలి ఇది యుక్తం. ఒప్పగున్

మొదలనె యొరుదలకానిం
జెదరంగా నాడ కాత్మ జింతింపు పదిం
బదిగ , మృషయేని మఱి విడు
దస్తుగా గాకయుండ నొక్క మతమునన్. 4-220

'' ఒరుదలకాడు'' అంటే చాడీలూ కొండేలూ చెప్పేవాడు వీళ్ళు రాజుగారికి అవసరం ఏ ఉద్యోగి ఏమి చేస్తున్నాడో వీళ్ళ వల్లే తెలుస్తుంది. ఒకరి మీద కొండేలు చెప్పడానికి వచ్చినవాణ్ణి మొట్టమొదటనే చెండనాడు కోకూడదు ''వాళ్ళ మీదా వీళ్ళ మీదా కొండేలు చెబుతావా? నీకు ఇదేమి బుద్ధిరా '' అని గద్దించి బెదరగొట్టకూడదు. (చెదరంగాన్ ఆడక) వాడు చెప్పింది వినాలి విని రాజుగారు తనలో తాను బాగా ఆలోచించుకోవాలి అప్పుడు వాడు చెప్పింది అసత్యమని తేలినట్టయితే (మృష యేనిన్)

వెంటనే వాణ్ణి ఉద్యోగంలోంచి తీసెయ్యకు వాడు అవమానపడకుండా పరాభూతుణ్ణి అయ్యానే అని వాడికి అనిపించకుండా (ఉదస్తుగాన్ కాకయుండన్) ఒక పక్షంగా ఒక పద్ధతిగా (ఒక్క మతమునన్) విడిచి పెట్టు వాడకం తగ్గించి క్రమక్రమంగా వదిలిపెట్టు

కొండెగాళ్ళను ముందే తూలనాడి దూరం చేసుకుంటే రాజుగారి కి ఇంక ఏ రహస్యాలూ అందవు ఎవరు ఏమి చేస్తున్నారో ఎక్కడ ఏమి జరుగుతోందో తెలీదు అంచేత వీళ్ళు అవసరం అయితే వీళ్ళు చెప్పేది నిజమా కాదా, ఎవరి మీదయినా వ్యక్తిగత రాగద్వేషాలతో చాడీలు చెబుతున్నారా అనేది రాజుగారు విచారించుకోవాలి లేకపోతే అదొక ప్రమాదం

కొన్ని ఆటవిక జాతులవారు హఠాత్తుగా నగరాల మీదా సమీప గ్రామాల మీదా పడి దోచుకోవడం కీకారణ్యాల్లోకీ కొండగుహల్లోకీ పారిపోవడం చేస్తూ ఉంటారు ఎప్పుడు వచ్చిపడతారో ఎక్కడికి పారిపోయి దాక్కుంటారో తెలీదు కనక వీళ్ళని అదుపుచెయ్యడం రాజులకు ఒక పటాన సాధ్యం కాదు ఈ పీడ వదిలించుకునే ఉపాయం చెబుతున్నాడు

ధరణి నసాధ్య నగాటవు
లిరవుగ భూపీడ సేయు నెఱకుల పొరుగూ
ళ్ళిరవగు నస్థితి శూరుల
కెరవుగ నిచ్చునది, మిథము నెట్లయిన నురున్ 4-22

(ఇరవుగ నస్థితి అని వావిళ్ళవారి పాఠం. ఇరవు=నిలయం)

ఈ నేల మీద అసాధ్యమైన పర్వతాలూ అడవులూ స్థావరాలుగా చేసుకుని (ఇరవుగన్) రాజ్యానికి ఉపద్రవం సృష్టించే (భూ పీడచేయు) ఎఱుకులు మొదలైన ఆటవికజాతులు కొన్ని ఉన్నాయి వీళ్ళు ఉండే ప్రదేశాలకు సమీపంలో ఉండే గ్రామాలను '' ఎరవగు నస్థితిశూరులకు ఎరవుగ నిచ్చునది '

అపరాధాలవల్ల తమ పదవులు కోల్పోయి ఇరుగు పొరుగు రాజ్యాలనుంచి బహిష్కృతులైగానీ పారిపోయిగానీ వచ్చి శరణుకోరి తన రాజ్యంలో తలదాచుకొంటున్నశూరులు '' ఎరవు అగు అస్థితి శూరులు ' స్థితి కోల్పోయారు కనక అస్థితి శూరులు పరాయి దేశాలవారు కనక ఎరవు అయినవాళ్ళు

ఇలాంటి శూరులకు ఆ ఊళ్ళను తాత్కాలికంగా అప్పగించు తల దాచుకుంటారు అస్థితిశూరులు కనక మాకు అలాంటి ఊళ్ళు చూపించావేమిటని రాజుగారిని అడగడానికి లేదు ఎక్కడ చోటుచూపితే అక్కడ తల దాచుకోవలసినదే సరే-

ఇలా ఇస్తే ఏమవుతుంది- అంటే చెబుతున్నాడు మిథము నెట్లయినన ఉరున్ ఆటవికులూ, అస్థితి శూరులూ పరస్పరం ఏమయినా ఎట్లాగ యినా అది రాజుగారికి మేలే అవుతుంది (ఉరును)

ఆటవికుల దాడుల్లో అస్థితి శూరులు చనిపోయినా అస్థితి శూరు ల చేతుల్లో

చేతపోలు

ఆటవికులు మడిసినా రాజుగారికి మేలే ఏదో ఒక బెడద సులువుగా తీరిపోతుంది అస్థితిశూరులు కూడా చాలామంది చాలాకాలం తన రాజ్యంలో ఉండటం రాజుగారికి మంచిది కాదు వాళ్ళూ శూరులే అందు లోనూ బుద్ధి మంచిది కాని శూరులు కొంతకాలానికి ముఠాలు కట్టి బలం పుంజుకుని తనకే ఎదురు తిరగవచ్చు అంచేత వీళ్ళు వదలిపోయినా వాళ్ళు వదలిపోయినా మేలేనని

ఒకవేళ అస్థితి శూరులే మడిసి, ఆటవికులు మరీ బలిసిపోతే ఎలా ? అంచేత శాశ్వత పరిష్కారం సూచిస్తున్నాడు

వ. విశేషించియు నప్పార్వతీయబలంబు లోనం గూడుకొన్న- రాజునకు ప్రజాబాధ తలఁగ ,దెట్లని బెదరువాపి వారలం జేకూర్చుకొనవలయు .అవిశ్వాసంబు ను విశ్వాసంబును, నలుకయు నెలమియు, నతివైరంబును నత్యానుకూల్యంబును నల్పులగుట నల్పంబునన యగు నెట్లంటేని 4-222

ఆ పార్వతీయుల బలగం (పార్వతీయులు-పర్వతజాతి కొండజాతి) విశేషించి అడవుల్లో (లోనన్) బాగా వృద్ధి చెందింది అంటే ఇక వాళ్ళు కల్పించే ప్రజా బాధ రాజుకి ఏనాటికీ తరగదు రోజురోజుకీ ఊరు దోపిడీలూ దారిదోపిడీలూ పెచ్చు పెరిగిపోతాయి. గ్రామ ప్రజలకు రక్షణ ఉండని పరిస్థితి ఏర్పడుతుంది

అంచేత రాజుగారు ఎలాగయినా సరే(ఎట్లనిన్) ఆ పార్వతీయుల బెదురు పోగొట్టి అనుకూలం చేసుకోవాలి దగ్గరకు చేకూర్చుకోవాలి మరి ఇది సాధ్యమా అంటే అవును చాలా తేలిక అంటున్నాడు

వాళ్ళు అల్పులు కనక, వాళ్ళకు ఉండే అవిశ్వాసం విశ్వాసం, కోపం ప్రేమ (ఎలమి) ఇవికూడా అల్పంగానే ఉంటాయి కాబట్టి వాళ్ళని విశ్వసింప జేయడం. స్నేహితులుగా మార్చుకోవడం లొంగదీసుకోవడం చాలా తేలిక ఎలాగంటావా విను- అని ఒక చిన్న కథ చెబుతున్నాడు

విల్లుం దానును భిల్లు డొక్క డరుగన్, విందింట- దుగ్ధాన్నమున్
భిల్లుండన్నుడు పెట్టి, నార యుడుకన్ వీక్షించి-దొబ్బంచు వా
భిల్లుండన్నుడు పెట్టి, నార యుడుకన్ వీక్షించి-దొబ్బంచు వా
డెల్లన్ వమ్ముగ జేసి , త న్ననుపరా, నెందే దెగం జూడగా
నుల్లం బై, "చననంపు నార చెడు" నాన్, ఊహించి పోనంపడే 4-223

అనగా అనగా ఒక ఆటవికుడు (భిల్లుడు) అతడు తన విల్లూ తనూ కలిసి మరొక భిల్లుడి ఇంటికి విందుకి వెళ్ళాడు (విల్లు చేత బట్టుకుని వెళ్ళాడని) ఆ విందిం టిలో (విందు ఇచ్చే ఇల్లు) యజమానుడైన భిల్లుడు (భిల్లుండు అన్నుండు) క్షీరాన్నం(దుగ్ధము=పాలు) పెట్టాడు అతిథి భిల్లుడు తిన్నాడు అయ్యింది బయలుదేరి వెళ్ళబోతూ పొయ్యి మీద కుండలో ఏదో ఉడకడం చూసాడు అది నార ఉడుకుతోంది ధనుస్సుకి అల్లెత్రాడు కోస మని నార ఉడకబెడుతున్నాడు- యజమాన భిల్లుడు నార కనపడకుండా, ఎర్రటి పొంగు కనపడటంతో అతిథి భిల్లుడు ఆ ఉడుకుతున్నది మాంసం (దొబ్బ+అంచున్) అనుకున్నాడు "చూసావా. వీడు మాంసం నాకు పెట్ట

లేదు నేను వెళ్ళిపోయాక ఒక్కడూ హాయిగా తింటాడన్న మాట అనే ఆలోచన వచ్చింది వాడికి దానితో అప్పటివరకూ పొందిన మర్యాదలన్నింటినీ వమ్ముచేసేసాడు (ఎల్లన్ వమ్ముగ జేసి) క్షణంలో మనసునుంచి తుడిచి వేసాడు

యజమాన భిల్లుడు తనను సాగనంపడానికి కొంతదూరం వెంట రాగా దారిలో ఎక్కడో ఒకచోట అతణ్ణి చంపేద్దాం అనే కోరిక అతిథి భిల్లుడికి కలిగింది (ఎందేన్ తెగం జూడగాన్ ఉల్లంబై) అందుకని ఎంత దూరం వచ్చినా ''ఇంక నువ్వు వెనక్కి వెళ్ళు'' అనే మాట అతిథి భిల్లుడు అనడం లేదు కొంతదూరం వెళ్ళాక యజమాన భిల్లుడే అన్నాడు- ఇక నన్ను వెనక్కి పంపు. లేకపోతే పొయ్యిమీద నారచెడిపోతుంది- అని (చనన్+ అంపుము, నార చెడున్ నాన్) అప్పటికి తెలిసింది అతిథి భిల్లుడికి పొయ్యిమీద ఉడుకు తున్నది మాంసం కాదు నార అని వితర్కించి (ఊహించి) యజమానుణ్ణి వెనక్కి పంపించాడు కదా

ఈ కథ నువ్వు ఎరిగినదే గుర్తు చేస్తున్నాను అనే ధోరణిలో చెప్పాడు- యామునాచార్యుడు తన పుత్రుడికి ఆటవికులకు చటుక్కున కోపం వస్తుందనీ ఆ కోపంలో ఎంత దారుణాన్నికైనా తెగిస్తారనీ వీరి కోపం వీరిప్రేమ(అలుకయు నెలమియున్)రెండూ క్షణికాలేననీ ఈ కథ చెబుతోంది

ఆ పాలుగూటనే నిజ
మే పాటియు దప్ప రాడిరే, నెరసున గొం
తే పాటి గన్న నలుగుదు
రీ పని యెంతనక, వెడగు టెద నాటవికుల్ 4-224

ఆ పెట్టిన పాలూ అన్నంతోనే, పాయసంతోనే (పాలును కూడును =పాలుగూడు పాలు గూటన్=పాలూ కూడుతోనే)సంబరపడి ఆటవికులు మాట యిచ్చినట్టయితే (ఆడిరేని)- నిజం- ఏ కొంచెమూ తప్పరు మాట తప్పరు గాక తప్పరు తప్పు విషయంలో (నెరసునన్) ఏ కొంచెం అచూకీ వారికి తెలిసినా(కొంత ఏపాటి కన్నన్)- అంటే ఏ చిన్న తప్పు జరిగినా కోపి స్తారు ఈ జరిగిన తప్పు (ఈపని) చిన్నది కదా ఇది ఎంతటిదిలే అనయినా అనుకోకుండా (ఎంత అనక), వెర్రి మనస్సుతో (వెడగు+ ఎదన్= వెడగు టెదన్) అలుగుతారు ఇదీ ఆటవికుల లక్షణం అల్పవిషయాలకు సంతోషి స్తారు అల్పవిషయాలకు కోపిస్తారు వెర్రిమనసులూ వెర్రి మనుషులూనూ వట్టి అమాయికులు

ఆటవికుల్నే కాదు ఎవరెవరిని ఎలా వశీకరించుకోవచ్చునో సూత్రీకరిస్తున్నాడు

ఆటవిక వశ్యకలన సత్యమున, వైరి
మనుజపతి మైత్రి దూత సమ్మానముననుం,
గూర్మి దటి భృతి గాల్వురకునుం, సపారి
తోషికపు సేవ నెలమి రౌతులకు గలుగు 4-225

ఆటవికుల్ని వశ్యం చేసుకోవడం(వశ్యకలన)సత్యంతో సిద్ధిస్తుంది శత్రు రాజుల మైత్రి దూతసన్మానంతో ఏర్పడుతుంది అంటే వారు పంపిన దూతను సమ్మా నించడం ద్వారా శత్రురాజుల (వైరి మనుజపతి) మైత్రిని సంపాదించుకోవచ్చునని

పదాతి సైనికులకు (కాల్బురు) సమయం తప్పకుండా (తఱిన్) జీతాలు చెల్లిస్తే కూర్మి కలుగుతుంది. రౌతులకు (అశ్వికులు-వాహనాలు తోలేవాళ్ళు) ఎప్పటికప్పుడు బహుమానాలు ఇస్తూ సేవలు అందుకొంటూ ఉంటే (సమీరితోషికమైన సేవన్) ప్రేమ కలుగుతుంది

వశ్యకలన మైత్రి కూర్మి ఎలమి -ఈ నాల్గింటికీ 'కలుగును' అనే క్రియ తోకే అన్వయం

మేలగు ఘోటకమును శుం
డాలంబును నాప్త సుభటునకె యిమ్ము, తఱి
న్మేలగు మేపున మందుర
బాలింపుము, దొరల పాలుపఱుపకు మెందున్ 4-226

(మేలగు మెలపునన్=మంచి జాగ్రత్తతో -అని సంజీవని)

మేలుజాతి గుర్రాన్నిగానీ, మేలురకం ఏనుగునుగానీ, నీకు అత్యం తాప్తుడైన మంచి భటునకే అప్పగించు ఆయా సమయాలకూ కాలాలకూ (తఱిన్) తగినట్టు శ్రేష్ఠమైన మేతను (మేపు) అందించే ఏర్పాటు చేస్తూ అశ్వశాలను సంరక్షించు (పాలింపుము) గజశాలనుగానీ అశ్వశాలను గానీ ఎన్నడూ (ఎప్పడున్) అధికారుల కు అప్పగించి ఊరుకోకు (దొరల పాలు పరుపకుము). గజసైన్యం, అశ్వికదళం అత్యంత ప్రధానమైనవి కాబట్టి వాటి ఆలనా పాలనా రాజుగారే స్వయంగా చూసుకో వాలనీ అధికారులకు అప్పగించి ఊరుకుంటే ఈ రెండు బలాలూ బలహీనపడ వచ్చుననీ హెచ్చరిక

ఆహారం విషయంలో గుర్రాలది మరీ సుకుమారతత్త్వం గజాశ్వాలకు ఋతువులనుబట్టి మేతలో మార్పులు వస్తూంటాయి ఏ ఋతువులో వెయ్యవలసిన మేతను ఆ ఋతువులో వేళ తప్పకుండా వేస్తున్నారా లేక అధికారులే గడ్డికరుస్తున్నారా అనేది రాజుగారే స్వయంగా పర్యవేక్షిం చాలిట - ఎంత ముందుచూపు

కార్యనిర్ణయంపట్ల అధికారులతో మంత్రులతో సంప్రదింపుల సరళి ఎలా ఉండాలో అధికారుల్లో ఎలాంటివారుంటారో తెలియ జేస్తున్నాడు

కార్యమొకొక్కడు కనిన, మాత్సర్యమున నొ
కండు కాదని ఖండించు, గన్నెఱింగి
యిరువురను గాదనక, కొల్వు విలిసి, మీద
నల్లవా డెన్నినది సేయ నగు శుభంబు 4-227

అధికారుల్లో ప్రధానుడొకడు -జరుగవలసిన పనిని దర్శించి మంచి అవగాహనతో ఒక ప్రతిపాదన చేస్తాడు. ఒక కార్యక్రమాన్ని రాజుగారి ముందు

ఉంచుతాడు అప్పుడు మరొక అధికారి లేచి లోపల ఈర్ష్యతో మాత్సర్యంతో ఆ కార్యం పనికిమాలినదంటూ ప్రతిపాదనను ఖండిస్తాడు రాజుగారు జాగరూకుడై (కన్నులెఱిగి) కళ్ళు తెరుచుకొని ఉండాలి ఈ యిద్దరిలో ఏ ఒక్కరినీ కాదనకుండా అప్పటికి సభ ముగించాలి కొలువు చాలించాలి (కొల్వు విరిసి) అటుపైని ఆ మొదటివాడు చెప్పింది జరిగే టట్టు చూడాలి ఇలా అయితే రాజుగారికి శుభం కలుగుతుంది పరిపాలన శుభప్రదంగా సాగుతుంది

మంచివాడు ప్రతిపాదించినా అది నిజంగా మంచిపనే అయినా, కొల్వులోనే వెంటనే రాజుగారు తన సమ్మతిని తెలియజేసి ఆమోదించెయ్యకూడదనీ ఖండించినవాడు మాత్సర్యంతో కాదంటున్నాడనితెలిసినా వెంటనే అతడిని తిరస్కరించకూడదనీ - రాజనీతి

వెంటనే ఆమోదిస్తే అది ప్రతిపాదించినవాడికి విలువ పెరుగుతుంది '' రాజుగారిది ఏముందిరా ఈయన ఎంత చెపితే అంత '' అని ప్రచారం జరుగుతుంది అలాగే వెంటనే తిరస్కరిస్తే ఆ అధికారి మనస్సు నొచ్చుకుంటుంది. సాటి అధికారులలో కించ పరచినట్టు అవుతుంది '' ఈయన చెబితే ఏ మాటా రాజుగారు వినరు'' అని ప్రచారం జరిగి ఆ అధికారి విలువ తగ్గిపోతుంది అతణ్ణి క్రింది ఉద్యోగులు లక్ష్యపెట్టరు ఆ శాఖ పనులు స్తంభించిపోతాయి తోటి అధికారి మీద ఉన్న మాత్సర్యంతో కాదంటున్నాడే తప్ప (ఆ గౌరవం ఆ అధికారికి దక్కనివ్వడం యిష్టం లేక పోవడమే మాత్సర్యం) ఈ కాదన్న అధికారికి రాజభక్తి తక్కువై కాదు ఈ సూక్ష్మాన్ని గ్రహించి నాటికి కొలువు చాలించి తరువాత నెమ్మదిగా మంచి పనిని అమలులో పెట్టాలి అప్పడది రాజుగారి ఆలోచనగానే చలామణీ అవుతుంది ఒక అధికారి పొంగిపోనవసరం లేదు మరొక అధికారి క్రుంగి పోనవసరం లేదు ఆలోచనాపరుడు అనే కీర్తి రాజుగారికి మిగులుతుంది ఇది కాబోలు దీని ఆంతర్యం

పగ వెలి గని, లో దస్యుల
జిగురింపగ జేసి, నృపతి చిక్కువడ బనుల్
తెగి సేయక, తారే ది
క్కుగ నడతు, రశంక నల్లకొని, దుస్సచివుల్ 4-228

మంత్రులలో కొందరు దుష్టులు ఉంటారు (దుస్సచివుల్) వాళ్ళు రాజును తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు

బయట సరిహద్దు దేశాలలో (వెలిన్) పగ ప్రబలడాన్ని వీళ్ళు గమనించి దేశం లోపల అంతశ్శత్రువులను (దస్యులు=శత్రువులు దొంగ లు) ఎగసన దోసార్తు ప్రోత్సహిస్తారు వాళ్ళ దోపిడీఆశలనూ స్వార్థ చింత నలనూ చిగురింపజేస్తారు

మంత్రులుగా తమ విధుల్ని తెగించి చెయ్యకుండా కావాలని జాప్యం చేసి రాజుని చిక్కుల్లో పడేస్తారు '' ఈ రాజుగారి ఏలుబడిలో పనులు జరగడం లేదు సంక్షేమ కార్యక్రమాలు సాగడం లేదు'' అని ప్రజలు తిరగబడేటట్టు చేస్తారు (పనుల్ తెగి

బేతవోలు

చేయక నృపతి చిక్కు పడన్)

ఇలా రాజుగారు బహిశ్శత్రువులతో అంతశ్శత్రువులతో ప్రజావ్యతిరేకతతో చిక్కుల్లో పడ్డాక ఈ దుష్ట సచివులు ఒక మురాగా ఏర్పడి లేదా అన్ని పనుల్లోనూ తలదూర్చి విస్తరించి రాజుకి మేమే దిక్కు అన్నట్టు నిర్భ యంగా నిశ్శంకంగా ప్రవర్తిస్తారు (అశంకన్ నడతురు)

ఇటువంటి దుస్సచివులపట్ల రాజు కన్నెరిగి జాగ్రత్త పడాలి మరి కొంతమంది ఇంకా తెలివైన దుస్సచివులు గడసరులు ఒక ప్రణాళిక ప్రకా రం ప్రజల్ని రాజుకి దూరం చేస్తారు. రాజుపట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం చెదిరిపోవడానికి అనువైనపనులు రాజు తోనే- అజ్ఞాతంగానో మంచిపను ల బురఖాతానో చేయించి రాజును ఒంటరివాణ్ణి చేసేస్తారు అది వివరి స్తున్నాడు

ఇప్పింతు రాళ్ళ వశులకు
దప్పింతురు పరుల, కాడి తప్పింతురు, రా
జిప్పగిదివాడె యని వే
చెప్పిన బెఱవారు నమ్మి చేరకయుండన్ 4-229

(ఆర్చి తప్పింతురని సంజీవని పాఠం ఆర్చి= ఆడించి, ప్రేరణార్థకం)

పనులు జరిపించే బాధ్యతలనూ అధికారాలనూ ఉద్యోగాలనూ వస్తు వాహనాది దానాలనూ ఒకటేమిటి రాజు చేతిలో ఏది ఉంటే దానిని ఈ గడసరి దుస్స చివులు తమవాళ్ళకే తమ వశంలో ఉండే వాళ్ళకే (ఆత్మవశులకు) ఇప్పించుకుంటారు ఇతరులకు అందకుండా పూర్తిగా తప్పించేస్తారు

రాజుచేత వాగ్దాన భంగాలు కూడా చేయిస్తారు ఒక్కసారి రాజు ఆడి తప్పా డు అంటే అది ప్రజల్లో దావానలంలా వ్యాపిస్తుంది ఇక ఛస్తే నమ్మరు ''కాదయ్యా అది పొరపాటున జరిగింది అలా అనుకుని, ఇలా జరిగింది మంత్రిగారు ముంచారు రాజుగారిది తప్పలేదు'' అంటూ వెయ్యిమంది వెయ్యివిధాలుగా నచ్చజెప్పినాసరే మరి నమ్మరు ''లేదు లేదు మాకు తెలుసు రాజు ఇలాంటివాడే అప్పుడు అలా మాట తప్పాడు ఇప్పుడు ఇలా మాట తప్పాడు '' అంటూ ఏకరువు పెడతారే తప్ప ఈ పెరవారు (మంత్రులకు గానీ రాజోద్యోగులకు గానీ, సంబంధించని సామాన్య ప్రజానీకం =పెరవారు) రాజును మళ్ళీ నమ్మి దగ్గరకు చేరరు ఇలా ''పెరవారు నమ్మి చేరక యుండన్'' దూరమయ్యేటట్టుగా దుస్స చివులు రాజుచేత వాగ్దాన భంగాలు చేయి స్తారు ఆడి తప్పిస్తారు జాగ్రత్త సుమా అని యామునప్రభువు తన కుమారునికి హెచ్చరి క చేస్తున్నాడు (వెయ్యి విధాలుగా నచ్చజెప్పినాసరే పరాయివాళ్ళు నమ్మి దగ్గరకి చేర కుండా ఉండేట్టు 'రాజు ఇలాంటివాడే ' అని ప్రచారం చేస్తారు - అని అన్వయం చేసింది సంజీవనీ వ్యాఖ్య) అయితే ఈ దుస్సచివుల పన్నాగాలకూ దుష్ప్ర చారాలకూ విరుగుడు లేదా- అంటే తెలియజేస్తున్నాడు

వాడి బొదలు జఠర వైశ్వానరుడు కఫ
ప్రముఖ, దోషయుక్తి బలిమి చెడిన,

వెలి మహౌషధంబు బలమిచ్చు గతి, ప్రతి
సేయు వారి మదము జెఱచు బరుడు 4-230

వాడీ వేడితో కడుపులో ప్రజ్వరిల్లే జఠరాగ్ని (జఠరవైశ్వానరుడు) శ్లేష్మం మొదలైన దోషాలు ఆవరించడంవల్ల (కఫ ప్రముఖ దోషయుక్తిన్) తన బలాన్నీ, తన తేజస్సునీ తాత్కాలికంగా కోల్పోతుంది జీర్ణశక్తి తగ్గిపోతుంది అప్పుడు వెలుపలనుంచి ఒక మహౌషధాన్ని - మంచి మందును సంపాదించి లోపలికి వేస్తే శ్లేష్మం పటాపంచలై మళ్ళీ జఠరాగ్ని మునుపటిలా ప్రజ్వరిల్లుతుంది జీర్ణశక్తి పెరిగి ఆరోగ్యం పుంజుకుంటుంది

అలాగే అంతశ్శత్రువులకు విరుగుడుగా రాజుగారు బయటనుంచి మరొక సమర్థుణ్ణి తీసుకువచ్చి మంత్రిని చెయ్యాలి వాళ్ళకి దీటైన ప్రత్యర్థిగా నిలబెట్టాలి (ప్రతిచేయన్) ఆ పరుడు వాళ్ళ మదం అణుస్తాడు (వారి మదము జెఱచున్) ఇదొక పద్ధతి అయితే ఈ క్రొత్తగా వచ్చినవాడు మాత్రం ముఠా కట్టడని ఏమిటి? కడతాడు కానీ దానికి కొంత సమయం పడుతుంది సమర్థుడు కనక పాతముఠాలో చేరడు. క్రొత్త ముఠా కడతాడు ఆ మేరకి పాతముఠా చీలిపోతుంది క్రొత్త ముఠా క్రమంగా బలపడితే ఇదే చికిత్సను మళ్ళీ చెయ్యాల్సివస్తుంది ఇది కాక ఇంకా గట్టి విరుగుడు చెయ్యడం (మిగిలి ప్రతిసేయన్) ఎట్లాగంటే-

వ. వారి మిగిలి ప్రతి సేయ నెట్లంటేని 4-231
భండారముతో హయమద
శుండాల ఘటాళి దనదు సొమ్మై పాగా
నుండిన నంతట బాయుదె
పండితుడును బిరుదునైన పతికిని బయలై 4-232

(హయమ్ము=గుర్రం, శుండాలము= ఏనుగు ఘటా=సమూహం ఆళి=వరుస గుంపు. పాగా =శాల)

రాజుగారు కోశాగారాన్నీ (భండారము) అశ్వసమూహాలనూ సరాసరి తన అధీనంలో పెట్టుకోవాలి తన సొమ్ముగా అవి ఆయా శాలల్లో (అశ్వశాలలు, గజశాలలు) ఉండాలి. (పాగాన్ ఉండినన్) అలా ఉన్నప్పుడు నీతికోవిదుడూ (పండితుడు= విజ్ఞుడు) వీరుడూ (బిరుదు) అయిన రాజుకి (పతికిన్) ఈ దుస్సచివుల కుతంత్రం బయలై విరగడైపోతుంది ఆతడ పాయదె- అని సంజీవనీ పాఠం తడ అంటే అవరోధం. దుస్సచివులు కల్పించే అవరోధం బట్టబయలై తొలగిపోతుంది అని

గజసైన్యం అశ్వసైన్యం రాజుగారి అధీనంలో ఉండి, కోశాగారం చేతుల్లో ఉంటే ఎవరి పన్నాగాలూ- అవి ఎంతటివైనా ఏమీ చెయ్యలేవనీ, రాజు విజ్ఞుడైతే పన్నాగాలనూ, అవరోధాలనూ బట్టబయలు చెయ్యగలుగుతాడనీ వీరుడై విరగడ చేసుకుంటాడనీ సమన్వయం ఇది శాశ్వత పరిష్కారం

సచివుల పట్ల మాత్రమే కాదు రాజోద్యోగులు అందరి పట్ల రాజుగారు ఎల్లవేళలా ఇంత జాగ్రత్తగానూ ఉండవలసిందే అంటున్నాడు.

కడుపున కొంత కడి తఱిగిన
కెడ జూచుటె కాక పతికి కెలియుం గలదే!
యిడనని విడువం జెల్లునె!
నడపవలయు నేర్చినట్లు నమ్మకయె కృపన్. 4-233

కడుపుకి ఒక్కముద్ద(కడి) తక్కువయితే చాలు ప్రతీవాడూ రాజుగారు చెడిపోవాలనే చూస్తాడు. అంతేగానీ రాజుకి నిజంగా మిత్రుడు అనే వాడు ఉంటాడా ఉండడు అందరూ అవసరార్థం చేరేవాళ్ళే, ఎవడి అవసరం ఏ కొంచెం తీరకపోయినా ద్వేషించేవాళ్ళే, స్వప్రయోజనాపేక్ష లేకుండా రాజుని సేవించేవాడు, అచ్చమైన నేస్తం (చెలి) అనదగినవాడు ఒక్కడూ ఉండడు

అలాగని తెలిసినా ''నీకు పెట్టను పో'' అని ఎవణ్నీ విడిచిపెట్టడానికీ లేదు ఇడను అని విడువన్ చెల్లునె! చెల్లదు ఎంతమందిని తొలగిస్తాడు. చాలామంది అదేబాపతాయె రాజోద్యోగులు లేకపోతేనా పనులు జరగవు. అంచేత వాళ్ళను నమ్మకుండానే ఏదో తనకు చేతనయిన పద్ధతిలో లేదా పండి తుడు కనక తెలుసుకున్న విధంగా (నేర్చినట్లు) కృపన్ నడపవలయు అంటే ఉద్యోగుల్ని దయతో పోషించాలి. వారి పట్ల దయను చూపించాలి అని.

ఒడిదండ విడువ జెల్లునె- అని సంజీవని పాఠం చేజిక్కిన శత్రువు బుజాన్ని (దండన్) విడిచిపెట్టకూడదు విడవకుండా పట్టుకునే కావలసిన పద్ధతిలో నడిపించుకోవాలి తప్పచేసి దొరికిపోయినవాడు ఇక చెప్పినట్టు పడి ఉంటాడు కనక

ఉద్యోగులు ఏం చేస్తున్నారో ఎవ్వరి స్వభావం ఎలాంటిదో అనుక్షణమూ గమనించడం రాజుకి సాధ్యమా? అలాగని అందరినీ శంకిస్తూ కూచుంటే పనులు అవుతాయా? మరి దుష్టుల్ని కనిపెట్టడం ఎలా? దీనికేమయినా చిట్కాలు ఉన్నాయా? ఇది చెబుతున్నాడు

ఒకటికి రోయకుంట గను మున్నవియున్. ద్రుపదుండు మారణే
ష్టికి బసి జాపి వేడ- మునిసింహుఁ డొకండు ''తమన్న వేల్పు, బం
డొక డపవిత్ర భూమి గని యొల్లక యే జన దా గ్రహించె రో
య'' కనియె, గాన నట్లఖు గనొ జను, సర్వము గాన శక్యమే 4-234

ఎవడయినా ఒకడు ఒక అకార్యం పట్ల వెనుకాడకుండా ప్రవర్తిస్తే (రోయక + ఉంటన్) దాన్నిబట్టి వాడి తక్కిన గుణాలూ, బుద్ధులూకూడా (ఉన్నవియున్) అలాగే ఉంటాయని తెలుసుకో (కనుము=గ్రహింపుము) దీనికి ఒక కథ చెబుతాను విను

వెనకటికి ద్రుపదమహారాజు సర్వశత్రుసంహారకమ్మైన యజ్ఞాన్ని (మారణేష్టి) చెయ్యాలని సంకల్పించాడు. ఇది శుభప్రదమ్మైనది కాదు కనక చేయించడానికి ఏ బ్రాహ్మణుడూ ముందుకి రాలేదు తిరిగి తిరిగి ఒక మునీశ్వరుడి దగ్గరకి చేరుకున్నాడు (మునిసింహుడు=మునిశ్రేష్ఠుడు) అయన పేరు ఉపయాజుడు మారణేష్టి చేయించమని వేడుకొన్నాడు చేయిస్తే ఇన్ని గోవులు (పసిన్) ఇస్తానని చూపించాడు

ఉపయాజుడు అంగీకరించలేదు. కానీ ఫలానా చోట మా అన్నగారు యాజుడు ఉన్నాడు అయన నువ్వు అడిగిన ఈ హోమం చేయిస్తాడు (వేల్చు =హోమము చేయు) చేయిస్తాడని గట్టిగా ఎలా చెప్పగలుగుతున్నానంటే ఒకసారొక చెట్టు పండు రాలి అపవిత్ర స్థలం మీద (అపవిత్ర భూమిన్) పడింది అది మా అన్నదమ్ములం ఇద్దరమూ చూసాం అశుద్ధం మీద పడిన పండు వద్దులే అని (ఒల్లక) నేను వదిలేసి వెళ్ళిపోయాను మా అన్నగారుమాత్రం ఏమీ అసహ్యించుకోకుండా ఆ పండుని గ్రహించాడు (రోయక తాన్ గ్రహించెన్) అంచేత ఆయనగారు నువ్వు కోరుతున్న ఇష్టిని జరిపిస్తాడని చెప్పగలుగుతున్నాను వెళ్ళు, వెళ్ళి మా అన్నగారిని వేడుకో అని ఉపయాజులు గారు ఉపాయం చెప్పారు

ఈ కథవల్ల తెలుస్తున్నదేమిటంటే - ఒకడు చేసిన ఒక చిన్న పనిని బట్టి అతడి స్వభావాన్ని మనం తెలుసుకోవచ్చునని (ఎఱుగన్ అవును చనును) అలా తెలుసుకోగలగాలి అంతేకానీ ఎవరు ఏం చేస్తున్నారో అన్నీ అన్నివేళలా రాజుగారు పరిశీలించడమంటే అది సాధ్యమా (సర్వ మున్ కానన్ శక్యమే)

'' ఎఱుగనౌను'' అని అక్కడికి ఆపి'' చను సర్వమున్ కానన్ శక్యమే'' అని అన్వయించారు-వేదంవారు తమ సంజీవనీ వ్యాఖ్యలో చను సర్వమున్ అంటే జరుగుతున్న సమస్తాన్నీ అని

వీడు దుష్టుడు అని తెలుసుకున్నాక ఏం చెయ్యాలో వివరిస్తు న్నాడు

వీ డెడరున గీడెన్నిన
నాడని, జయమైన, హింస వదలి కొనుము, శ్రీ
పోడి, మహి యేమి కొఱ ప
ల్వాడి సెడిన ! నట్టి దయకు వైరియు నమ్మున్ 4-238

(ఎడరు= ఆపద , అదను, పోడి-పోడిమి= అతిశయము కొఱ=ప్రయోజనం, పల్లు-పలు= కోరలు, పోడి యహి యేమి అని సంజీవని పాఠం)

''నేను ఆపదలో ఉన్నప్పుడు అదను చూసి వీడు నాకు కీడు తల పెట్టాడు'' అని ఒకణ్ణి గుర్తించావు అపదలు గడచి ఎలాగో నీకు జయం లభించింది. (జయము అయినన్) అప్పుడు సాధారణంగా రాజులు ఈ కీడు తలపెట్టినవాణ్ణి హింసిస్తారు. తల తీసేస్తారు కానీ అలా చెయ్యవద్దు అంటున్నాడు రాయలవారు హింస వదిలి పెట్టేసి వాడి ఐశ్వర్యాతిశయాన్ని (శ్రీ పోడిమిన్ కొనుము) లాగేసుకోమంటున్నాడు. సంపదలు ఊడగొట్ట మంటున్నాడు. కొట్టావద్దు తిట్టావద్దు ఉద్యోగం పీకేసి, ఆస్తులు స్వాధీన పరుచుకో చాలు కోరల వాడి చెడిపోతే (కొఱ పల్వాడి చెడిన) ఆ పాము (అహి) ఏమి చేస్తుంది కొఱగానిది అయిపోతుంది. బికార్లై పోయి కోరలు పీకిన పాములా నిష్ప్రయోజనంగా పడి ఉంటాడు

అంతేకాదు- చేసిన తప్పులకు శిక్షగా ఉద్యోగం ఊడగొడితే ఊడ కొట్టాడు. ఆస్తులు స్వాధీనపరచుకుంటే పరచుకున్నాడు. కానీ తల తీసెయ్య లేదు కనీసం

ప్రాణాలతోనైనా విడిచిపెట్టాడు. అదే పదివేలు అని ఆ అంతశ్శత్రువు సంబర పడతాడు. రాజుగారి దయాగుణాన్ని విశ్వసిస్తాడు అట్టి దయకు వైరియు నమ్మున్ రాజుగారి ఆ దయాగుణాన్ని శిక్ష పడినవాడే కాదు పడని శత్రువుకూడా నమ్ముతాడని.

అంతశ్శత్రు నిర్మూలన పథకాలు చెప్పాడు. ఇప్పుడింక రాజ్య పరి పాలన గురించి మాట్లాడుతున్నాడు. ప్రజాహిత కార్యక్రమాలు ఏమిటి, కర్షకుల్ని ఆదు కోవడం ఎలాగ ధర్మార్థాలను పెంపొందించడం ఎలాగ ఇవి ప్రస్తావిస్తు న్నాడు

దేశ వైశాల్య మర్థ సిద్ధికిని మూల,
మిల యొకింతైన గుంట కాల్వలు రచించి,
నయము పేదకు నరి గోరునను నొసంగి,
ప్రబల జేసిన నర్థ ధర్మములు పెరుగు 4-236

రాజుగారి కోశాగారం నిండాలి అంటే రాజ్యం విశాలంగా ఉండాలి. దేశం ఎంత పెద్దదయితే ఆదాయం అంత ఎక్కువగా ఉంటుంది ఒకవేళ రాజ్యం చిన్నదయిన ప్పటికీ (ఇల ఒకింత అయినన్) ఆదాయం పెంచుకునే మార్గాలు ఉన్నాయి

ఉన్నంతలోనే చెరువులూ, (గుంటలు) కాల్వలూ త్రవ్వించాలి పంటల అధికోత్పత్తికి సదుపాయాలు కల్గించాలి పేద రైతులకు ధనరూపమైన పన్నులలోనూ (అరిన్) సస్యరూపమైన పన్నులలోనూ (కోరునన్) రాయితీ- మినహాయింపు వెసులుబాటు(నయము)- ఇవ్వాలి ఇలా సన్న కారు రైతులు బలపడేట్టు చెయ్యాలి. చేస్తే దేశంలో ఆర్థికాభివృద్ధి, ధార్మికా భివృద్ధి రెండూ జరుగుతాయి. (అర్థధర్మముల్ పెరుగున్)

పన్నులు వసూలు చేసే పద్ధతి చాలా చెడ్డది ఎదుటివారి పరిస్థితి గమనించి నొప్పించకుండా సున్నితంగా వసూలు చేయగలగాలి. అటు వంటివారినే ఈ పనికి అధికారులుగా నియమించాలి. దురుసు మనుషుల్ని నియమిస్తే ఏమవుతుందో చూపిస్తున్నాడు-

ప్రజ లవిసి చన్న, బిలువ, తప్పసుల గొలుచు
నమ్మి, యిండ్లింధనంబున కాయె ననెడు
కలని నక్కైన యధికారి గల నృపతికి-
నేడు దీవులు గొన్న సమృద్ధి లేదు. 4-237

(ప్రజ నవసి చన్న అని సంజీవని. నవయుట= అలిసిపోవడం)

పంటలు పండక రైతాంగం (ప్రజలు) అవిసిపోయి ఊరువిడిచి వెళ్లిపో తూంటే (అవిసి చన్నన్)వాళ్లని ఆపి వెనక్కి పిలవవలసిన బాధ్యత ఈ పన్నులు వసూలు చేసే గ్రామాధికారిది. రాజుగారితో చెప్పి రాయితీలు ఇప్పిస్తాననో, ఋణాలు ఇప్పి స్తాననో ఏదో ధైర్యం చెప్పి వాళ్లని ఆపాలి ఆపకపోగా(పిలువక) వాళ్ళు వదిలిపెట్టిన పసువుల్నీ, ధాన్యాన్నీ(ఆ పసులన్, కొలుచున్) అమ్మి, ఖాళీ ఇళ్ళు (పాకలు) వంట చెరకుగా ఉపయోగిస్తాయి. (ఇంధనంబునకు ఆయెన్) ఇదీ బాగానే ఉంది పొమ్మను

కునే అధికారి ''కలని నక్క'. యుద్ధభూమిలో జంబుకం అంటే శవాల్ని పీక్కుతినే రకం.

ఇటువంటి జంబుకస్వామి అధికారిగా దొరికితే ఇక రాజుగారికి సప్త ద్వీ పాలూ (ఏడు దీవులు) అధీనంలో ఉంటేమాత్రం ఏమి లాభం ఏమి బాగుపడ తాడు ఏమి సమృద్ధి సాధిస్తాడు (ఏడు దీవులున్ కొన్నన్= అంతటి విశాల సామ్రాజ్యం ఉన్నా)

ప్రజలనుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన ఆదాయాన్ని రాజుగారు దేనికి దేనికి వినియోగించాలో ఎంతెంత వినియోగించాలో సూచిస్తున్నాడు. (మహా స్రగ్ధర పద్యం)

ఉరవౌ చాగంబు భోగం బుభయము నొకపా, లుగ్రసేనావనార్థం
బిరుపాల్, నిండారు బండారిలు చొర నొకపా, లిట్లుగా నాయ మొప్పన్
చరదృష్టిన్ వైరిపక్షేక్షణము సచివ షష్ఠ స్వపక్షేక్షణంబున్
ధరణీనాథుం డొనర్పం దగు, దగు దునుమన్ దస్కరాళిన్ నిజోర్విన్ ౨౩౮

ఆదాయాన్ని (ఆయము) నాలుగు భాగాలు చెయ్యాలి అందులో ఒక భాగాన్ని రాజుగారు త్యాగానికీ(చాగము) భోగానికీ ఉపయోగించుకోవాలి. భోగం కన్నా త్యాగానికి అంటే దానధర్మాలకు ఉపయోగించే సొమ్ము అధికంగా (ఉరవు) ఉండాలి అధికమైన త్యాగం అనువైన భోగం- ఈ రెంటికీ (ఉభయమున్)కలిపి ఒక భాగం

రెండుపాళ్ళు సేనాసంరక్షణకు(అవనార్థంబు)ఉపయోగించాలి. ఉగ్రమైన సేన, సైనికుల జీతాలు, వసతులు, పారితోషికాలు గజాశ్వపోషణ ఆయుధాలు,రథాలు మరమ్మత్తులు, సైన్య విస్తరణ దండయాత్రల ఖర్చులు ఇలాంటి వాటి అన్నింటికీ కలిపి మొత్తం ఆదాయంలో రెండుపాళ్ళు (ఇరు+ పాల్=ఇరువాల్) కేటాయించాలి ఇక్కడికి మూడుపాళ్ళు అయిపోయింది

నాల్గవపాలు కోశాగారానికి చేరాలి అప్పటికే అది నిండుగా ఉన్నా(నిండారునట్టి బండారు ఇల్లు) ఇంకా సమృద్ధి పరచాలి రాజ్యానికి కోశ సమృద్ధి నిజమైన బలం భవిష్యత్తులో ఏ కరువు కాటకాలు వచ్చినా దాడులు జరిగినా ఎంతకాలం ఏది ఎంత తీవ్రంగా పీడించినా, కోశం సమృద్ధిగా ఉంటే ఆదుకుంటుంది కాబట్టి ఏటేటా ఆదాయంలో నాల్గోవంతు కోశానికి చేరవలసిందే

ఇట్లుగాన్ ఆయము ఒప్పన్- ఇక్కడికి ఆయవిభాగం అయ్యింది మరొక ప్రధాన విషయాన్ని దీనికే కలిపి చెబుతున్నాడు.

రాజు చారచక్షువు గూఢచారులతోనే సమస్తాన్నీ పర్యవేక్షిస్తాడు. (చారులు= చరులు) శత్రుపక్షంలో సరిహద్దు దేశాలలో ఏమి జరుగుతోందో, స్వపక్షంలో మంత్రులతోసహా ఉన్న షడంగాలలో ఏమి జరుగుతోందో, ఎప్పటికప్పుడు చారుల ద్వారా-చరదృష్టిన్- ధరణీనాధుడు వీక్షిస్తూ ఉండాలి (సచివులు ఆరవ అంగంగా ఉన్న

-సచివ షష్ఠ-స్వపక్ష+ ఈక్షణము).

తన భూభాగంలో ఉన్న (నిజ+ ఉర్విన్) దొంగల్నీ దారిదోపిడీగాళ్లనీ (తస్కర +ఆళిన్) చంపాలి తునుమన్ తగున్. పూర్తిగా నిర్మూలించాలి. ప్రజలకు చోర భయం లేకుండా చెయ్యాలి అయితే దొంగలకు మరణశిక్ష విధించేటప్పుడు, తనకు అపకీర్తి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని హెచ్చరిస్తున్నాడు

లాలన నారక్షుల గమి
నేలి , తెలిసి ముచ్చు, నాజ్ఞ యిడ ,కతడ వెఱం
బో లాతి నిడ, నయశ మెం
తే లేవదె ! శూల పృథువణిగ్న్యాయమునన్ 4-239

గ్రామాలకూ నగరాలకూ కావలికాసే తలారుల గుంపులను (ఆరక్షుల-గమి=సమూహం) బహుమానాలతో లాలనచేసి, శ్రద్ధగా పోషించి,పరిపాలిస్తూ దొంగని(ముచ్చును)తెలుసుకోవాలి అంటే తలారుల్ని బాగా చూసుకుంటే వాళ్లు కాపలా శ్రద్ధగా కాసి దొంగల్ని బాగా పట్టు కుంటారని

ఆలస్యం జరగకుండా -దొంగ దొరికిన వెంటనే శిరశ్ఛేదం శిక్షగా విధించి అమలు జరిపెయ్యాలి. అలా వెంటనే శిక్షను ఆజ్ఞాపించకుండా, తరువాత చూద్దాంలే అని ముందు చెరసాలలో పెట్టిస్తే, ఆ చెరసాలనుంచి వాడు కాస్తా తప్పించుకుని పారిపోతే (చెరన్ పోన్), ఇది తెలిస్తే రాజుగారు మా తలలు తీసేస్తాడు దేవుడో అని కారాగారాధికారులు మరొక అమాయకుణ్ణి ఎవడ్నో పట్టుకువచ్చి,వాడికి బదులుగా చెరసాలలో పెడితే (లాతిన్ ఇడన్), ఉరిశిక్షకు ఈ అమాయకుడు బలి అయిపోతే, రాజుగారికి ఎంత అప్రతిష్ఠ! ఎంత అపకీర్తి!! (అయశము ఎంతేన్ లేవదె=కలుగదా) అసలు దొంగను వదిలేసి అమాయకుణ్ణి ఉరితియ్యడం శూల పృథువణిజ్న్యాయం గా ఉంటుంది (వణిక్+న్యాయము-అనునాసి కాదేశ సంధి).

ఈ న్యాయం ఒక కథతో పుట్టింది. సన్నగా పీలగా ఉన్న ఒక దొంగ కి ఉరిశిక్ష పడింది కొరత వెయ్యమని రాజుగారు ఆజ్ఞాపించారు

(ఊరు అవతల కొండల్లో మొనతేలిన రాతిస్తంభమో,కొయ్యకర్రో ఉంటుంది దోషిని దానికి దిగగొడతారు. కొరత వెయ్యడమంటే ఇది)

తలారులు ఆ దొంగని కొరత దగ్గరకి తీసుకుపోయారు. అక్కడ ఆ దొంగ అన్నాట్ట- అయ్యా! ఈ కొరత చూస్తే లావుగా ఉంది నేనేమో సన్నంగా ఉన్నాను ఎలా దిగ్గొడతారూ ? అని అడిగాట్ట.

తలారులకి సందేహం వచ్చింది నిజమే ఎలా దిగ్గొడతాం అను కున్నారు ఉరిశిక్ష ఆపేసారు. రాజుగారికి ఈ విషయం వర్తమానం పంపారు.

అయితే లావుగా ఉన్నవాణ్ణి చూసి, దిగ్గొట్టండి అన్నాట్ట రాజుగారు.సరే బాగుందని చెప్పి తలారులు సన్నదొంగను వదిలేసి, సరిగ్గా అదే సమయానికి ఆ దారిని వస్తున్న ఒక లావుపాటి కోమటాయన్ని పట్టుకుని కొరత వేసారుట.

శూలానికి లావుపాటి కోమటిని (వణిక్) దిగగొట్టినట్టు అని చెప్పడానికి శూలపృధువణిగ్ న్యాయం అంటారు పరిపాలకుల తెలివి తక్కువతనాన్నీ, ఉద్యోగుల మూర్ఖత్వాన్నీ ఇవి కారణంగా అమాయకులు బలిఅయి పోవడాన్నీ సూచించడానికి ఈ న్యాయం వాడుతూ ఉంటారు ఇదే కధను చిలువలూ పలవలతో ఇంకా విస్తరించి ఇంకా రక్తికట్టేట్టు చెప్పడమూ ఉంది (చూ సంజీవని)

ఇంతకీ రాజుగారు చారులమీదా తలారులమీదా ఆధారపడటమేనా ? లేకపోతే స్వశక్తితో తెలుసుకునేది ఏమయినా ఉందా ? ఉంటే ఎంత వరకూ? ఈ వివరాలు పలుకుతున్నాడు -

ఎఱుగనగున్ స్వశక్తి నవనీశుడు నాలుగు పాళ్ల మూడు పా,
ల్దెలుగక మోచినట్టి పని కిష్ట సుహృత్తతి దెల్ప నొక్క పా
లెఱుగ నగున్, నయాఢ్యమతి నిట్లు నిరాగ్రహుడైన -జేయు నె
త్తఱి విపదుగ్ర దండ పరతంత్రుడు గాక చిరంబు రాజ్యమున్ 4-240

తెలుసుకోదగిన అంశం నాలుగు పాళ్ళుగా ఉంటే అందులో మూడుపాళ్లని రాజుగారు స్వశక్తితోనే గ్రహించాలిట రాజ్యంలో జరిగే సంఘటనలు చౌర్యాలు కక్షలు, కార్పణ్యాలు, ప్రవర్తనలు, సంపాదనలు ఉత్సవాలు ఇరుగుపొరుగు దేశాల విషయాలు- ఇలా ప్రతీదీ మూడు వంతులు రాజుగారు (అవనీశుడు) స్వయంగా తెలుసుకోవాలి

ఒక్కొక్కప్పుడు కొన్నింటికి సంబంధించిన నిజాలను బయటపడ నివ్వకుండా, పొక్కనివ్వకుండా ప్రభుత్వం దృష్టికి (చారులు) రానివ్వ కుండా కొందరు జాగ్రత్త పడుతూ కప్పిపుచ్చుతూ ఉంటారు

ఇలా తనకు తెలియరాకుండా కప్పిపుచ్చిన విషయాన్ని(మోచి నట్టి పనికి) అంటే ఆ మిగిలిపోయిన నాల్గోవంతు రహస్యాన్ని ఆప్త స్నేహితుల ద్వారా తెలుసుకోవాలి (సుహృత్= మిత్రుడు ఆప్త-సుహృత్తతి) చారుల ద్వారా మూడువంతులు తెలిస్తే ఆప్తుల ద్వారా మిగిలింది తెలుసుకుని (ఒక్కపాలు ఎఱుగన్ అగున్) నిర్ధారణ చేసుకుని మొత్తం సమాచారం తన గుప్పిట్లో పెట్టుకోవాలి

ఈ విధంగారాజు నీతికోవిదుడై(నయ+ ఆఢ్య+ మతి) నిరాగ్రహుడై పరిపాలన సాగించాలి (ఆగ్రహం=కోపం పట్టుదల) అన్నింటా తనదే ఒప్పు అనిగానీ, తనకు తెలిసిందే పరిపూర్ణ సత్యమనిగానీ, తాబట్టిన కుందే టికి మూడేకాళ్ళు అని గానీ దురాగ్రహం ఉండకూడదు విపత్+ ఉగ్రదండ +పరతంత్రుడు+ కాక ఆపదలకు పరతంత్రుడు కాకూడదు అంటే ఆపదలు వచ్చినప్పుడు బెంబేలు పడిపోయి నువ్వా నువ్వా అని ఎవరు ఏది చెబితే అది చేసేవాడు కాకూడదు అలాగే ఉగ్రదండన పరతంత్రుడూ కాకూడదు చిన్న తప్పకి చిన్న శిక్ష-పెద్ద తప్పకి పెద్ద శిక్ష విధించాలి దీన్నే యధాపరాధ దండన అన్నాడు కాళిదాసు (యధాపరాధ దండానామ్) పిడుగుకీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు అన్నిటికీ ఉరిశిక్షనే విధించకూడదు. అలా ఉగ్ర

దండనలు విధించే రాజుకి ప్రజలు భయపడతారు ద్వేషిస్తారు కట్టకడపటికి తిరగ బడతారు లేదా ప్రజలు ద్వేషిస్తున్నారని తెలిస్తే పరాయిరాజు దండెత్తి వస్తాడు కాబట్టి అపదలకు పరతంత్రుడు కాకపోవడం ఎంత ముఖ్యమో ఉగ్రదండ పరతంత్రుడు కాకపోవడమూ అంతే ముఖ్యం

ఈజాగ్రత్తలు తీసుకోగలిగిన రాజుకి రాజ్యమూ రాజ్యాధికారమూ చిర స్థాయిగా నిలుస్తాయి ఎంత జాగరూకతతో ఉండాలో తెలియ జెప్పడానికి భల్లూకాన్ని ఒక దృష్టాంతంగా చూపిస్తున్నాడు

కన్నొకటి నిద్ర వో జెలకంట జాగ
రంబు గావించు భూరుహాగ్రంబు మీది
యచ్ఛ భల్లంబు గతి, భోగ మనుభవించు
నెడను బహిరంతరరులపై దృష్టి వలయు 4-24

ఎలుగుబంటి (అచ్ఛభల్లంబు) చెట్టు ఎక్కి కొమ్మమీద (భూరుహ+అగ్రంబు) పడుకొని నిద్రపోయేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉంటుందో రాజుగారు అంత జాగ్రత్తగా ఉండాలట అది ఒక కంటితో నిద్రపోతూ ఒక కంటితో జాగారం చేస్తుంది షైమరచి నిద్రపోదు తనని చంపడానికి గానీ పట్టుకుని బంధించడానికి గానీ శత్రుసమూహం ఏ వైపునుంచి ఐనా వస్తుందేమోనని ఎప్పటికప్పుడు ఒక కంట మెలుకువగా ఉండి కనిపెడుతూనే ఉంటుంది తాను పడిపోకుండా జాగ్రత్త వహిస్తూనే ఉంటుంది అలాగే రాజుగారుకూడా భోగాలు అనుభవిస్తూనే బహిశ్శత్రువుల మీదా అంతశ్శత్రువులమీదా ఒక కన్నువేసి ఉంచాలి (భోగము అనుభ వించు నెడను బహిర్ అంతర్ అరులపై దృష్టి వలయు) రాజభోగాలలో మునిగి పోయి ఒళ్ళు మరిచిపోతే ఇంతే సంగతులు అంతశ్శత్రువులైనా ముంచ వచ్చు బహిశ్శత్రువులైనా ముట్టడించ వచ్చు అంచేత రేయింబవళ్ళు అను క్షణం అడుగడుగునా అప్రమత్తుడై ఉండాలి రాజు.

ఇది భోగ పరాయణత్వంలో తీసుకోవలసిన జాగ్రత్త ఇక త్యాగ పరాయణత్వంలో తీసుకోవలసిన జాగ్రత్తలు విశద పరుస్తున్నాడు.

అక్షర పక్షపాతమున నర్థము నూళ్ళనొసంగ, నుబ్బునన్
భిక్షు జటాధరాదికులు భిన్న నిజవ్రతు లౌదు , రైన దు
ర్భిక్షరుజా శిశు చ్యుతులు పెక్కగు, భక్తియు చాలు, దాన దత్
ప్రక్షుభితత్వమే యఘము దార్చదు, శంక దలంగు మియ్యెడన్ 242

భిక్షువులు జటాధారులైన సన్యాసులు ఈ మొదలైన ఒంటరివాళ్ళకు (భిక్షు- జటాధర+ ఆదికులు) రాజుగారు తనకు సహజమైన విద్యాపక్షపాతంతో (అక్షరపక్ష పాతమునన్) ధనరాశులూ అగ్రహారాలూ దానం చేస్తే (అర్థమున్ ఊళ్లన్ ఒసంగన్) వాళ్లకు గర్వం పెరిగిపోతుంది ఆ అతిశయంతో (ఉబ్బునన్) తమ బ్రహ్మచర్యావ్రత నియమాలను వది లేస్తారు భ్రష్టులైపోతారు (భిన్న= భ్రష్టమైన, నిజ= తమయొక్క వ్రతులు =వ్రతములు కలవారు, ఔదురు)

ఆధ్యాత్మికంగా కృషి చేసి సమాజానికి శ్రేయస్సూ ప్రేయస్సూ కలి గించ వలసిన భిక్షువులూ సన్యాసులూ ధర్మభ్రష్టులైతే దేశానికి అరిష్టం కరువుకాటకాలూ (దుర్భిక్షం)వ్యాధులూ రోగాలూ (రుజా)శిశుమరణా లూ(శిశుచ్యుతులు) ఇటువంటి అరిష్టాలు పెచ్చు పెరిగిపోతాయి (పెక్కు అగున్) అంచేత రాజుగారు వారిపట్ల భక్తి మాత్రం ప్రకటిస్తే చాలు దాన ధర్మాలు పెద్దగా చెయ్యనవసరం లేదు (భక్తియ చాలు న్) మరి దాన ధర్మాలు చెయ్యకపోతే సన్యాసుల మనస్సులు క్షోభిసాయేమో ఆ క్షోభ (తత్ ప్రక్షుభితత్వము) ఏ పాపాన్నయినా చుట్టబెడుతుందేమో అంటే ఫరవాలేదు ఏ పాపాన్నీ చుట్టబెట్టదు (ఏ అఘమున్ తార్పదు=కలిగించదు) నేను చెబుతున్నాను- ఈ విషయంలో శంక విడిచిపెట్టేసెయ్యి (శంకన్ తలం గుము) అని యామునా చార్యుని నోట భరోసా ఇప్పించాడు రాయలవారు

వ్యక్తుల్ని భ్రష్టుపట్టించేటంత పెద్ద ఎత్తున రాజుగారు దానధర్మాలు చెయ్య కూడదని హెచ్చరిక. ప్రతిగ్రహీతలఆశ్రమాన్ని గుర్తెరిగి తగిన మోతాదులో సహకరిం చాలని కాబోలు సూచన సరే-

రాజుగారు నిరపరాధులకు శిక్ష పడకుండా చూడాలనీ ఉగ్ర దండ పర తంత్రుడు కాకూడదనీ ఇంతకు ముందు హెచ్చరించాడు. అందుకోసం రాజదండం ను అమలుపరచడంలో తీసుకోవలసిన జాగ్రత్త లు చెబుతున్నాడు

విను, వారత్రయు విజ్ఞా
పన తీర్పవు వధ్యకోటి పట్టున, చెదరం
దన కప్పుడె కీడగు నను
జనము౦ బట్టుటకు మునుప శస్త్రమ చాలున్ 4-243

"సుపుత్రా! శ్రద్ధగా విను " అని మొదలు పెట్టాడు విషయం మారింది కనక అభిముఖీకరణం "మును" అని సంజీవనీ పాఠం.

ఉరిశిక్షకు అర్హులైన దోషులపట్ల (వధ్యకోటి పట్టునన్) మూడు సార్లు విజ్ఞాపనలకు ఓర్పు వహించు తమ నిర్దోషిత్వం నిరూపించుకోవడానికి మూడుసార్లు అవకాశం ఇమ్మంటున్నాడు అంతేకానీ ఏకపక్షంగా నిర్ణయించేసి వెంటనే ఉరితీసెయ్య కూడదని అప్పటిదాకా ఆ దోషులను చెరసాలలో బంధించి ఉంచాలి

వాడు చెరసాలనుంచి తప్పించుకుని పోతే (చెదరన్) తనకూ తన సామ్రా జ్యానికీ తత్క్షణమే ప్రమాదం(కీడు) ముంచుకు వస్తుంది అనిపించిన ఘరానా దోషుల్ని పట్టుకోవడానికి ముందే(మునుప) శస్త్రమే చాలు పట్టుకోవడానికి ముందే శస్త్రం ప్రయోగించు. అంటే పట్టుకున్న వెంటనే లేదా పట్టుకునే ప్రయత్నంలో తల తీసెయ్యమని

పరాయిదేశాలకు ప్రతినిధులై రహస్యంగా పనిచేస్తూ ప్రజల్లో తిరుగు బాటుని లేవనెత్తేవారూ, విషప్రయోగాదులు చేసి భయోత్పాతం సృష్టించేవారూ ఇలాంటి ఘోరాపరాధుల విషయంలో- చెరసాలలో ఉంచ డం ముమ్మారు విచారణ

జరపడం, విజ్ఞాపనలు వినడం లాంటివి అవసరం లేకుండానే ఉన్నపళంగా మరణదం డనను అమలు జరపవచ్చునని ఇలాంటి ప్రత్యేకాధికారం రాజుగారికి ఎప్పడూ ఉంటుంది కనక తక్కిన సాధారణవధ్యకోటిపట్ల వారత్రయ విజ్ఞాపనకు ఓర్పుము అంటున్నాడు

ఈ ఓర్పు అనేది వధ్యుల విషయంలోనే కాదు ఇతరత్రా తన సొంత మనుషుల విషయంలోకూడా ఉండాలని చెబుతున్నాడు.-

శూరాలాపములకు - నతి
శూరుడు దానయ్యు -నృపతి నోకోర్వదగున్ ;
వా రుబ్బుదు రందున, నిజ
శూరత దొరలందు గనుటసూ కార్యమిలన్ 4-244

(నోకు= విసుగు నోకు ఓర్చుట= విసుగును నిగ్రహించుకొనుట ప్రదర్శింపక పోవుట ఉబ్బు= ఉత్సాహము అతిశయము)

తన సంస్థానంలో ఉన్న శూరులు ఎప్పడైనా అవసరపడి వీరాలాపా లు పలికితే రాజుగారు (నృపతి) మందస్మితంతో విని ఓర్చుకోవాలి. నేను మహావీరుణ్ణి గదా నా ముందర బడాయిలు పోతారేమిటి అన్న ధోరణిలో విసుక్కోకూడదు అసహనం చూపించకూడదు.

నృపతి తాను అతిశూరుడయ్యును శూరాలాపములకు నోకోర్వన్ తగును- అని అన్వయం అలా ఓర్చినందున వారు- ఆ శూరులు ఉబ్బుదురు మరింత ఉత్సాహం వహిస్తారు అది రాజుకే మేలు. కించపరిస్తే కొంచె పడతారు ఆత్మవిశ్వాసం కోల్పోతారు అది కీడు

అయినా రాజుగారికి తన శూరత్వాన్ని తనయందు చూసుకోవడం కాదు కర్తవ్యం దాన్ని తన సేనాపతుల్లో తన అధికారుల్లో (దొరలందు) చూడాలి తన శూర త్వం తనకు సాటివచ్చే రీతిగా తనవారిలో ప్రతిబిం బించేటట్టు చేసుకోగలగాలి అది సుమా కర్తవ్యం. (కనుటసూ కార్యము ఇలన్. సుమా అనేదానికి క్లుప్తరూపం సూ ఇలన్= భూమియందు . ఇది పాదపూరణకోసం)

'' ఆన్వీక్షికీ- త్రయీ- వార్తా- దండనీతయ: చతస్రో విద్యా :'' అని కౌటిల్యుడు చెప్పాడు రాజ్యపరిపాలనకు ఈ నాలుగు విద్యలూ ప్రధానంగా ఉపకరిస్తాయని తాత్పర్యం. ఆన్వీక్షికి అంటే తర్కం త్రయి అంటే ఋగ్య జుస్సామవేదత్రయం వార్త అంటే (అకారాంత స్త్రీలింగం) వ్యవసాయం, పశుపోషణ వడ్డీవ్యాపారం మొదలైనవి జీవనోపాధికి పనికి వచ్చే వ్యాపారం దండనీతి అంటే రాజనీతి లేదా శిక్షాస్మృతి

వీటిలో ఆన్వీక్షికితో వేదాన్ని అర్థం చేసుకుని వేద ప్రామాణ్యంతో వార్తా దండనీతుల్ని నిర్వహించాలని క్రమ సూచన

శుక్రాచార్యుడు దండనీతి ఒక్కటే విద్య అన్నాడట లోకంలో అంద రూ దుష్టులే దండనకు భయపడి సజ్జనులుగా ప్రవర్తిస్తున్నారు కాబట్టి జగత్తు వాసయో

గ్యంగా ఉండాలంటే దండనీతి ఒక్కటే చాలు అని వీరి మతం వార్తా దండనీతులు రెండే విద్యలని బృహస్పతిశిష్యులు అన్నారుట జీవిక నడవాలంటే వ్యాపారం ఉండాలి. అదే లేకపోతే దండన ఎవరికి? కాబట్టి వార్త ముఖ్యం. అందులో అపరాధాలూ అక్రమాలూ జరగకుండా చూడటం కోసం దండనీతి అవసరమవుతుంది ఇవి రెండే విద్యలు అని వీరి అభిప్రాయం వ్యాపారంలో నేమీ దండ నీతిలోనేమీ అన్యాయాలూ అక్రమాలూ నిర్ణయించాలంటే వేదప్రామాణ్యం ఉండాలి కాబట్టి దానితో కలిపి త్రయీ వార్తా దండనీతులు మూడే విద్యలు అని మనువూ తదను యాయులూ అన్నారుట. ప్రామాణికమైన వేదాన్ని అర్థం చేసుకోవడానికీ భ్రమ ప్రమాదాలుకు లోను కాకుండా అన్వయించడానికీ ఆన్వీక్షికి అవసర మవుతుంది కాబట్టి దానితో కలిపి నాలుగే ప్రధానవిద్యలు అని కౌటిల్యులు సిద్ధాంతం చేసారట. ఇదంతా రాజశేఖరుడు తన కావ్యమీమాంస ద్వితీయాధ్యాయంలో సంగ్రహంగా ప్రసంగవశాత్తూ చెప్పాడు

ఇంతకీ వార్త అంటే భృతి సంపాదనకు ఉపకరించే పని వృత్తి అంటే జీవిక. వృత్తిః జీవికా యస్యామస్తీతి వార్తా ''ప్రజ్ఞాశ్రద్ధార్చావృత్తి భ్యో ణః'' ఇతి ణః. తతష్టాప్ వార్తా కృషి గోరక్షావణిజ్యాకుసీదరూపా అని శ్రీ మధుసూదన మిశ్రుని వ్యాఖ్య

మానవజాతి మనుగడకు వార్త ప్రధానసాధనం వ్యవసాయోత్పత్తులు లేక పోయినా దానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుబంధితాలై సాగే మిగతా ఉత్పత్తులు లేకపోయినా, అవి అన్ని ప్రాంతాలకూ అవసరాన్ని బట్టి పరస్పర వినిమయంగా సరఫరా కాకపోయినా అందుకు అనుగుణం గా ధనం చేతులు మారకపోయినా ప్రపంచానికి రోజు గడవదు అంధ కారమే. అందుకే నన్నయ-

వార్తయందు జగము వర్తిల్లు చున్నది,
యదియు లేనినాడ యఖిల జనులు
నంధకార మగ్నులవుదురు, గావున
వార్త నిర్వహింపవలయు బతికి సభా- 1 -50

అని వార్తా నిర్వహణ ప్రాధాన్యాన్ని ధర్మజనారదుల చర్చలో తెలియజెప్పాడు. '' ఆన్వీక్షికీత్రయీ వార్తాదండనీతులు'' అనే సమాసాన్ని తిక్కన కూడా భీష్మునిచేత శాంతిపర్వం ద్వితీయాశ్వాసంలో పలికించాడు ఇది శాఖాచంక్రమణం ఇంతకీ రాయలవారుకూడా ఈ అతిప్రధానమైన వార్త గురించి కొన్ని విశేషాలు తెలియ జేస్తున్నారు-

రేవుల్ మావు మతంగజంబులు మణిశ్రీఖండముక్తాదియున్
రా,వాణిజ్యము పెంచి యేలఁగ నగున్, వర్షంపు టివ్వన్ రుజన్
పోవఁ గ్లాన్ దిగు వన్యభూప్రజల రా జాయాయి జాత్యాదితిన్
ప్రోవంగా దగు దోట దొడ్డి గను లాప్తుల్ చూడ బంపందగున్ 4-248

రేవు పట్టణాలలోకి విదేశాలనుంచి గుర్రాలు (మావులు), ఏను గులు (మతంగజంబులు) మణులు,రత్నాలు చందనం(శ్రీఖండము), ముత్యాలు మొదలై

నవి (ముక్తాదియున్) దిగుమతి అయ్యేట్టు వాణిజ్యాన్ని విస్తరింపజేసి అభివృద్ధి పరచాలి పోషించాలి.

రేవులు అంటున్నాడు కనక నౌకల మీద సముద్రాంతర్ద్వీపాలతో వ్యాపార సంబంధాలు పెంపొందిచాలని భావం. గుర్రాలూ, రత్నాలూ, సుగంధ ద్రవ్యాలూ దిగుమతి చేసుకునే ప్రధాన ద్రవ్యాలు వీటికి మించు వలె ఏవో ఎగుమతులుకూడా ఉండే ఉంటాయి. అంచేత దేశం లోపలా వెలుపలా వాణిజ్యాన్ని పెంపొందించవలసిన బాధ్యత రాజుగారికి ఉందని సూచన. రాయలవారు ఇవి నిర్వహించినట్టు చరిత్ర చెబుతోంది.

పలురకాల వర్తక వ్యాపారాలూ, వాణిజ్య సంస్థలూ, పన్నులూ, రాయితీలూ కల్తీలూ శిక్షలూ,సుంకరులూ ధరల నిర్ణయపద్ధతులూ (అగ్గ వులు) వినియోగదారుల హక్కులూ బాధ్యతలూ- ఇలాంటి అనేకానేక విషయాలకు సంబంధించి మన దేశంలో మధ్యయుగాలనాటి విశేషాలను విజ్ఞానేశ్వరము విపులంగా తెలియజెబుతోంది ఇది తిక్కన శిష్యుడు మూల ఘటిక కేతన రచన. సంస్కృతంలోంచి తెలుగు చేస్తూ పదమూడవ శతా బ్దంనాటి పరిస్థితుల్నికూడా జోడించి చెప్పినట్టు కనిపిస్తుంది. అది చూస్తే రాయలనాటికే స్థిరపడిన చాలా విశేషాలు తెలుస్తాయి

మావు మతంగజంబులు అనే వావిళ్ళవారి బహువచనాంతపారంలో దీన్ని ద్వంద్వ సమాసంగా భావించాలి మావు -మతంగజంబులు అని విడివిడిగా చెప్పకున్నా , మతంగజంబును అని ఏకవచనాంతపారాన్ని స్వీకరించినా జాత్యేకవచనంగా సమన్వయించాలి ఒక గుర్రాన్నీ ఒక ఏనుగునీ దిగుమతి చేసుకున్నారని కాదు. అశ్వజాతిని సమూహంగా, గజజాతిని సమూహంగా దిగుమతి చేసుకున్నారని భావం.

వర్షాలు లేకపోవడంవల్ల గానీ-(వర్షంపుటివ్వ=క్షామం), అంటురోగాలు ప్రబలడంవల్ల గానీ, భూకంపాలూ తిరుగుబాటులూ మొదలైన ఉపద్రవాలవల్ల గానీ (హోవళ్ళు= ఉపద్రవాలు) ఇరుగుపొరుగు దేశాల ప్రజలు (అన్యభూ-ప్రజలు) కాందిశీకులై తన దేశంలోకి గుంపు గుంపు గా దిగితే రాజుగారు ఆ ప్రజలను వారి జాతికి ఉచితమైన పద్ధతిలో సదు పాయాలు కల్పించి రక్షించాలి వాళ్ళు తిరిగి వెళ్ళేవరకూ పోషించాలి (రాజు+ ఆయాయి+జాతి+ ఔచితిన్+ప్రోవంగా+తగున్)..

రాజ్యంలో ఉన్న ఉద్యానవనాల్నీ పశువుల గోష్ఠాలనీ (బందిలి దొడ్లని) గనుల్నీ తనిఖీ చెయ్యడానికీ పర్యవేక్షించడానికీ (చూడన్) ఆప్తుల్ని పంపవచ్చును తప్పలేదు అది తగును (పంపన్ తగున్)

నిజానికి ఈ పద్యంలో మూడు విభిన్న విషయాలను గుచ్చేత్తాడు క్రిక్కిరిసి కిటకిటలాడుతోంది విడగొట్టి రాస్తే మూడు పద్యాలు అందంగా రూపొందుతాయి అయితే అది దుబారా అవుతుంది రాజనీతిని ఉపదేశిస్తూ అధిక వ్యయానికి పాల్పడతారా రాయలవారు

ఇక్కడా ఇంకా చాలాచోట్లా ఇదే పరిస్థితి ఆకాశమంత భావాన్ని నాలుగు

పాదాల్లోకి ఇమడ్చడం దానికోసమని కొంత విషయాన్నీ కొన్ని పదాలనూ పాఠకుల స్ఫురణకు వదిలివెయ్యడం కూర్పులో శ్రుతి పేయత- గతి సరళత తగ్గిపోవడం ఇదొక ప్రత్యేక శైలిగా రాయల పద్ధతిగా అవత రించింది దీనిని సహానుభూతితో స్వీకరించి,శిరసా పురస్కరించిన వారూ ఉన్నారు గొగ్గి పద్యాలు పొమ్మని తరసా తిరస్కరించి నవారూ ఉన్నారు

స్వయంగా సంగీతవిద్వాంసుడై నాదమాధుర్యం తెలిసిన కవి రాయల వారు దీనికి దాఖలాలుగా కొన్ని పద్యాలు మరీ లేకపోలేదు చిన్నభావాన్ని సావకాశంగా చెప్పినచోట అటువంటి శైలీరామణీయకతను చూపించాడు ఆనక వర్ణనల్లో వాటిని చూస్తాం . సరే-

పైని చెప్పిన వాణిజ్యంలోకానీ కాందిశీకుల ఏర్పాట్లలో కానీ, ఉద్యానాదుల పర్యవేక్షణలో గానీ ఎవడయినా తప్పచేస్తే- ఇది సరాసరి రాజుకో రాజకోశానికో దేశభద్రతకో హాని కలిగించే అపరాధం కాదు కనక

హదను వచ్చుదాక నపరాధిపై రోష
మాగి- చెఱుపవలయు హదను వేచి ,
లక్ష్య సిద్ధి దాక లావున శరమాగి
కాడ విడుచు వింటివాడు వోలె 4-246

(హదను=అదను ఆగి= ఆపి నిగ్రహించుకొని, కాడన్=నాటుకొనునట్లు)

అదను వచ్చేదాకా ఆగి అపరాధిమీద కోపం దాచుకుని, సమయం వచ్చినప్పుడు వాణ్ని నాశనం చెయ్యాలి(చెరుపన్ వలయు) అది ఎలాగంటే లక్ష్యసిద్ధీ లక్ష్యశుద్ధీ కుదిరేదాకా ఎక్కుపెట్టిన బాణాన్ని (శరము) తన భుజబలంతో (లావునన్) ఆపి సరిగ్గా లక్ష్యానికి నాటుకునేటట్టు విలుకాడు (వింటివాడు)ఎలా విడిచిపెడతాడో అలాగ అంతేకానీ రాజద్రోహిని శిక్షించినట్టు వెంటనే అలిగి దండించకూడదు అంటున్నాడు- ఎందుకో మరి వ్యాపారులంతా భయపడిపోయి మొత్తం వ్యాపారవ్యవస్థ చెడిపోతుందనో అపరాధి ఏదో వంకతో తప్పించుకుని లక్ష్యం చెదిరి పోతుందనో!

ఇంతవరకూ తన దేశం, తన మంత్రులు, తన పరిపాలన, తన జాగ్రత్తలు మొదలైన స్వదేశీయవ్యవహారాలను గురించి చెప్పడమయ్యింది ఇంక ఇప్పుడు ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు, రాజ్య విస్తరణ మొదలైన విదేశీయవ్యవహారాలను గురించి ప్రస్తావిస్తున్నాడు

పోవంబోలు లఘుప్రయాణత దినంబుల్గొన్ని యెుండొంటనే
కాపైరిక్షితి, కంబువుల్ పిఱుద రాగా నిల్చు జాలుంబలెన్
ద్రోవన్ సైన్యము గూడ, వైరి బలసాంద్రుండైన బూజాదులం
బోవంబోలు , జరోక్తిచేత నసదే బో కావరింపందగున్ 4- 247

(పిఱుదన్=వెనుకనుండి, చాలు=ప్రవాహము, చర+ ఉక్తి=గూఢచారి సందేశం, అసదు=అల్పుడు) శత్రురాజ్యం మీదికి దండెత్తే పద్ధతిని తెలియజేస్తున్నాడు

వాడు కుత్సితుడు శత్రువు (కావైరి). వాడి రాజ్యంమీదికి (క్షితికి) దండ యాత్ర. ప్రయాణం ఒకటి వెంట ఒకటిగా(ఒండొంటనే) కొన్ని రోజుల పాటు సాగాలిట. లఘుప్రయాణమే చెయ్యాలిట. ఉదయంనుంచి సాయం కాలందాకా ' ఏకబిగిగా' సైన్యాన్ని నడిపించకూడదని. ప్రయాణంలోనే అలిసిపోతే ఎలా ! అందుకని ఒకటి రెండు రోజులు పెరిగినా ఎక్కడికక్కడ విశ్రమిస్తూ లఘుప్రయాణమే మంచిదంటు న్నాడు మార్గంలో కొన్ని రోజుల పాటు విశ్రమించడం కొన్నిరోజులు ప్రయాణించడంగా కాకుండా కొద్ది కొద్దిగానే రోజూ సాగాలని తెలియజెబుతోంది ' ఒండొంటనే'' అనే పదం

ముందు కొంత సైన్యం చకచకా వెడుతూ ఉంటుంది. ఒక చోట విడిది చేస్తుంది వెనక్కాల మహాసైన్యం నెమ్మదిగా వచ్చి కలుస్తుంది. (త్రోవన్ సైన్యము కూడన్). ఇలా ప్రయాణం సాగాలి. దీనికి ఒక దృష్టాంతం చూపించాడు

ఎండిన(ఇసుక) నేలమీద నీరు క్రొత్తగా ప్రవాహం కడితే,ముందు సన్నటి పాయ(చాలు) వేగంగా దారితీస్తుంది కొంత దూరం వెళ్లి తీతతో ఆగుతుంది వెనుకనుంచి పెద్దప్రవాహంవచ్చి దీన్ని ముందుకి నడిపిస్తుంది. ఆ వెనకాలి ప్రవాహం వచ్చి చేరేవరకూ ఇది ఆగిందా (అంబువుల్- పిఱుద రాగాన్-చాలున్ బలెన్) ఆ తరువాత ప్రయాణం సాగిస్తోందా! అనిపిస్తుంది చూసేవారికి సేనా ప్రవాహంకూడా ఇలాగే సాగాలన్నాడు

తీరా అక్కడిదాకా వెళ్ళాక శత్రువు(వైరి) తనకంటే బలశాలి అనీ, ఎక్కువ సైన్యసాంద్రత కలవాడనీ చారులవల్ల తెలిస్తే (బలసాంద్రుండైనన్) ఇక యుద్ధం ప్రకటించకూడదు. మైత్రీ పూర్వకంగా ఆ రాజు సమర్పించే అతిథి పూజలూ, బహుమానాలూ, సత్కారాలూ, ఇత్యాదులు స్వీకరించేసి (పూజాదులన్), వెనక్కి తిరిగి వెళ్ళిపోవడం ఉచితం (పోవన్ పోలున్). అలాకాక వేగులవారి వర్తమానంతో (చరోక్తి చేతన్) ఆ శత్రురాజు అల్పుడనీ, బలహీనుడనీ తెలిస్తే (అసదు+ ఏని) వెనక్కిపోవక చుట్టుముట్టి ఆక్రమించడం సముచితం(పోక ఆవరింపన్ తగున్).

అనూహినూ చూసుకొని, పట్టూ- విడుపూ ఉండాలి. అంతేకానీ ఎలాగూ బయలుదేరి వచ్చాంగదా అని బలవంతుణ్ణి ఢీకొంటే అయ్యిందే!!

ఈ పద్యంలో ఒండొంటనే అనే పదాన్ని వేదంవారూ, వావిళ్ళవారూ సైన్యాని కి అన్వయించారు. ఒక్కొక్క సైన్యమూ(గజసైన్యం- అశ్వ సైన్యం- పదాతిసైన్యం) విడివిడిగా సాగుతూ ముందరి సైన్యాన్ని కలుసుకుంటూ ఉండాలని తాత్పర్యం వావిళ్ళ వారు 'కావైరి క్షితికిన్' అని సంస్కృత సమాసం చేస్తే , ఒండొంటనే కాన్+వైరిక్షితి కిన్'' అని వేదంవారు విభజించారు ఒక్కటొక్కటే అయ్యేట్టు అని అర్థం చెప్పారు. వీరిద్దరూ ఈ పదాన్ని దూరంగా ఉన్న 'సైన్యానికి' అన్వయిస్తే నేను దగ్గరలో ఉన్న '' దినం బుల్ కొన్ని''కి అన్వయించాను సైన్యాలు ఒక్కటొక్కటిగా నడవాలనడం భద్రత దృష్టితో ప్రధానం ప్రతిరోజూ అవిఘ్నంగా ప్రయాణం సాగాలనడం కాలం దృష్టితో ప్రధానం.

ఇందులో భద్రతాంశం కూడా ఉంది రెండు అన్వయాలనూ స్వీకరించడం సహృదయ దృష్టిలో మరీ ప్రధానం

శత్రు రాజ్యంలో ఏయే భేదోపాయాలు ఎలా పన్నాలి వాటిని తన రాజ్యంలో ఎవరూ పన్నకుండా ఎలా చూసుకోవాలి- వీటిని వివరిస్తున్నాడు

ద్రవిణము నొవ్వ గొంట, నొఱ ద్రాబలతో నిడుచుంట, భూమి గొం
తవలికి నిచ్చుచుంట, ప్రథమాప్తత జూడక శంక నుంట,-లో
బొవయు నృపాళికై యుభయమున్ మణిభూషలు గుప్తి బంపి భూ
ధవు డరియం దిడం దగు భిదన్, దనయం దివి మాన్పుకోదగున్ 248

(ద్రవిణము= ధనము, నొవ్వన్=నొచ్చుకొనునట్లు, ఒఱ=ఆలోచన, ద్రాబ= నీచుడు, పొవ=పొగ పొవయుట=పొగజూరుట లోలోపలకుములుట, గుప్తిన్=రహస్యముగా, భిద=భేదోపాయము)

ప్రజల మనస్సులు నొచ్చుకొనేట్టు పీడించి పన్నుల రూపంలో ధనం వసూలు చేయడం, నీచులతో మంత్రాలోచన జరపడం, (నీచమైన సలహా లిస్తారు కాబట్టి వాళ్ళు ద్రాబలు) రాజ్యంలో భూభాగాన్ని బయటికి (అవలికి) పోనివ్వడం, మొట్ట మొదటి ఆత్మీయతనూ తొలినాటి స్నేహాన్నీ పరిగణించకుండా సన్నిహితులందరినీ శంకించడం - ఇవి చెయ్యకూడదు శత్రురాజు ఇలాంటి పనులు చేస్తున్నప్పుడు, అతని సామంతరాజులు లోలోప ల కుమిలిపోతూ ఉంటారు మహారాజు కనక ఎదిరించలేరు జరుగుతున్న అకృత్యాలను ఆమోదించి, ఆత్మగౌరవం చంపుకుని కాలం గడపలేరు. పొగ రాజుకుంటూ ఉంటుంది

ఇది గమనించి ఆ శత్రురాజసామంతులకు రహస్యంగా అభయ సందేశం పంపాలి ఆత్మగౌరవం చంపుకుని తలదించుకుని కాలం గడపకండి నేనున్నాను మీకు బాసటగా అని వర్తమానం అందేటట్టు చెయ్యాలి విలువైన మణిభూషణాలు కానుకగా పంపాలి. ఇదంతా పరమ రహస్యంగా జరగాలి ఇలాగ భూధవుడు సమయం చూచి శత్రువుల పట్ల భేదోపాయం ప్రయోగించాలి

కానీ తనపట్ల ఆ శత్రువు వీటిని ప్రయోగించకుండా చూసుకోవాలి అంటే ద్రవిణము నొవ్వగొంట లాంటి అవలక్షణాలకు పాల్పడకూడదు తన సామంతరాజులు పొవయు పరిస్థితి రానివ్వకూడదు తన యందు ఇవి మాన్పుకోదగున్ - అనడంలో ఉద్దేశం ఇది.

ఒకవేళ తన సామంతరాజులలో ఒకడు సమర్థుడూ బలవంతుడూను- ఏదో కారణంగా అసంతృప్తికిలోనై కుమిలిపోతున్నాడనుకో ,అతణ్ణి సంతృప్తిపరచి చల్లార్చడం ఎలాగ? పొమ్మని వదిలెయ్యడమా, రమ్మని బుజ్జగించడమా? వదిలేసి ఊరుకుంటే పొగ రాజుకునీ రాజుకునీ మొదటి కే మోసం వస్తుంది. ఇతడు అంతశ్శ త్రువు. సమర్థుడూ బలవంతుడూను కనక భేదోపాయంగానీ, దండోపాయంగానీ పనికిరావు. ఇది అదనుగా తీసుకుని బహిశ్శత్రువు భేదోపాయాన్ని ప్రయోగించవచ్చు

అది మరీ ప్రమాదం కాబట్టి ఈ అంతశ్శత్రువుని ఎలాగైనా సరే సామదానాలతో -అవసరమైతే సగం రాజ్యం ఇచ్చి అయినా మంచి చేసుకోవడమే తెలివైన పని అంటున్నాడు

అహితుడు వేడిన నేలెడు
మహి సగమేనిచ్చి, తెగని మైత్రి గొని, విభుం
డహిభయము మాన్పికోదగు,
నహిభయ మహిభయముకంటె నధికము గాదే! 4-249

(అహిభయము= అంతశ్శత్రువువలన భయము. అహి=సర్పము,మహి= భూమి, అహితుడు=శత్రువు)

అంతశ్శత్రువు (అహితుడైన సామంతరాజు) బైటపడి కోరినట్లయి తే(వేడినన్) మహారాజు (విభుండు) తాను పరిపాలిస్తున్న సామ్రాజ్యంలో సగానికి సగమయినాసరే ఇచ్చి(సగమేని+ ఇచ్చి) తెగిపోని శాశ్వతమైన (తెగని మైత్రి) చేసుకోవాలి అంతశ్శత్రుభయాన్ని తొలగించుకోవాలి ఈ అంతశ్శత్రుభయమనేది సర్పభీతి కన్నా(అహిభయము కంటెన్) ఎక్కువ సుమా అంతకన్నా ప్రమాదకారి అని. కాబట్టి ఏది కోరితే అది ఎంత కోరితే అంత ఇచ్చేసి మైత్రి కుదుర్చుకో నిజంగా అర్ధరాజ్యం ఇచ్చెయ్యమని కాదుగానీ భయం వదిలించుకోమనడం తాత్పర్యం అయితే అంతా ఇచ్చి ఓటి మైత్రి కాకుండా గట్టిమైత్రి కుదుర్చుకో- అని హెచ్చరిక

అంతశ్శత్రువులు కొందరు ఇలా బయటపడతారు కొందరు ధైర్యం చాలక బయటపడరు కానీ బురదలో(నీటిలో) ముల్లులా గ్రుచ్చుకుంటూ ఉంటారు. వాళ్లని పసికట్టి ఏరిపారెయ్యాలి.

పలుకులు వేయునేమిటికి! పార్థివు డాత్మభుజాభృతక్షమా
తలమున గుట్టుపేడు బహుధా యరయించి, యడంచి, చంచలా
క్షుల గమిలో మెలంగు పురుషుండునుబోలె నశంక నించుచున్
మెలగడయేని, రాజ్యఫలమే యది! రాజ్యము దుఃఖ లబ్ధితే!! 4-250

పద్యభావం తరవాత చూద్దాం ముందు పద్యం చూడండి ఎంత సుఖంగా నడిచిందో. భావాన్ని కుక్కికుక్కి ఇమడ్చవలసిన అవసరం లేని చోట రాయలవారి శైలి ఇలా ఉంటుంది

వెయ్యిమాటలు ఎందుకు! ఒక్కటి చెబుతాను విను రాజుగారు తన భుజస్కంధాల మీద వహిస్తున్న భూభాగంలో (ఆత్మ- భుజా- భృత- క్షమాతలమునన్) కుట్టుపేడు ఎక్కడెక్కడ ఉన్నా బహువిధాలుగా చారుల చేత వెదికించి పట్టుకుని నాశనం చెయ్యాలి

కుట్టుపేడు అంటే గుచ్చుకునే ముల్లు. "గుట్టుపేడు" అనికూడా వ్యవహారం. రహస్యంగా ఉన్న ముల్లు ఈ అర్థంలో 'గు' ముందు అరసున్న ఉండదు. దీన్నే నీటిలో ముల్లు అడుసులో (బురదలో) ముల్లు అంటారు. పైకి కనపడదు గుచ్చుకునేవరకూ

తెలీదు. ''గుట్టుకీడు'' పారంతో రహస్య శత్రువు అని అర్థం చెప్పారు-వేదంవారు.

అంతశ్శత్రువులను నిర్మూలించి రాజ్యాన్ని నిష్కంటకం చేసుకోవాలి చేసుకుని, అందగత్తెల మధ్య నిర్భయంగా క్రీడించే పురుషపుంగవుడి లా పార్థివుడు నిశ్శంక నింపుకుని మెలగాలి అంటే సామంతాదుల్ని ఏ హానీ చెయ్యలేని చంచలాక్షుల గమిగా (గుంపు) మార్చెయ్యాలి తాను వారి మధ్య నిశ్శంకంగా రాజభోగాలు అనుభవించాలి

ఇలా చెయ్యలేకపోతే రాజ్యఫలమా అది? దొరతనానికి ప్రయోజనమా అది? రాజ్యపరిపాలన భారాన్ని చేపట్టడం దుఃఖాలపాలు కావడానికా? అని ప్రశ్నిస్తున్నాడు యామునాచార్యుడు కాదని తాత్పర్యం దుఃఖ లబ్ధిమాత్రమే ఫలమయితే రాజ్యాధికారం నిష్ప్రయోజనమని

అంతశ్శత్రువుతో కానీ, బహిశ్శత్రువుతో కానీ- వాడు ఎంత బల వంతుడైనా- మైత్రి కుదుర్చుకునేటప్పుడు రాజుగారు లోకువైపోకూడదు. అలా అయితే ప్రతివాడూ బెదిరిస్తాడు. అంచేత రన్సానిలుపుకోవాలి వాడంతట వాడుగా కలిసివచ్చేటట్టు చేసి, చేరదియ్యాలి మైత్రి కలుపుకోవాలి ఇది వివరిస్తున్నాడు-

బెదరి చేరని బలియుని బిగియబట్ట
కతని మైవడినే వచ్చి హత్త జేత
క్రమము, పెనగెడు బలుమీను త్రాట జేదు
నొడ్డుగాలంపు వేటకా డుపమ గాడె। 4-25

బలవంతుడైన మహావీరుడు ఒకడు రాజుగారి దరిచేరకుండా ఇరుగు పొరుగు దేశాల్లో అక్కడా ఇక్కడా గంతులువేస్తున్నాడనుకొందాం వాడు బెదరి చేరడం లేదు. తీరా వేడితే చేరదీస్తాడో తియ్యడో తీసాక ఆదరణ ఎలా ఉంటుందో ఇంతకన్నా మంచి అవకాశం ఇంకెక్కడయినా వస్తుందేమో- బహుశా ఇలాంటి ఆలోచనలు ఏవో వాడి బెదురుకి కారణం కావచ్చు లేకపోతే మరొకటి ఏమైనా ఆ బలియుడు ఈ మహారాజుగారి దగ్గరకు చేరడం లేదు

అలాంటివాణ్ణి వ్యవహారం బిగిసేలాగా పట్టుకోకూడదు నాతో చేరతావా చేరవా అని వెంటపడకూడదు చేరతావా చస్తావా అని భీష్మించనూ కూడదు బిగియ బట్టకండా వదిలేసి అతడు తనంతతానుగానే (అతని+మైవడిన్+ఏ) ఆత్మసమ్మతితో నే వచ్చి హత్తుకునేట్టు చెయ్యడం సరియైన పద్ధతి (హత్తన్ చేత=చేయుట- క్రమము)

దీనికి ఉపమానం ఎవరంటే చేపలు పట్టేవాడు పెద్ద గాలం కలిగిన వేటకాడు (ఒడ్డు గాలంపు-వేటకాడు) ఎలాగంటే-

గాలం ఎఱకి పెద్దచేప (బలుమీను) తగులుకుంది అది నీటిలో వెనక్కీ వెనక్కి గుంజుకుంటోంది ఆ సమయంలో గేలాన్ని పైకిలాగితే త్రాడు తెగుతుందే కాని బలుమీను పట్టుబడదు అందుకని ఆ సమయంలో గేలాన్ని పైకి ఎత్తకుండా ఎరత్రాడుని వదులు చేసి ఇంకా ఇంకా వదిలిపెడతాడు ఆ చేప వెనక్కి వెళ్లి వెళ్లి గేలం వదిలిపోయిందనుకుని ముందు ఊపు అందుకుంటుంది అప్పడు గేలాన్ని పైకిలాగితే అంత

చేతపోలు

పెద్దచేపా సులువుగా వచ్చి ఒళ్ళో పడుతుంది ఇలాగ పెనగులాడుతున్న పెద్ద చేపని త్రాడుతో తేలికగా చేదుకునే గాలం వేటగాడు ఇక్కడ రాజుగారికి దృష్టాంతం

ఇంతవరకూ విశేషించి చెప్పవలసినవి చెప్పాడు ఇంక సాధారణ విషయాల్లోకి వస్తున్నాడు రాజుగారికి ఉండకూడని లక్షణాలు ఏకరువు పెడుతున్నాడు

దండ పారుష్యంబు, కొండెమున నతర్క,
మరి సంధి కెడయీక మరలబడుట,
యవలి తప్పెన్ని తన్న విదేశ్యు జెఱచుట,
ప్రతిప్రవర్తకున కేర్పడగ జేత,
జను నవిశ్వాసంబు గనుగొని మెలగుట,
విశ్వసనీయుల వేర్పఱచుట,
మోమోట మంత్రంబుచో జిక్కి విడుకొంట,
మంత్రభేత్తకు నాజ్ఞ మఱచియుంట,
చింతపుట్టిన గను గల్గి చింత సేయ
కుంట, మాన్యుల పట్టున నొక్కచూపె
చూడ కుంట, విహీనుల గూడుకొంట,
వ్యసనియై యుంట, చల ముంట-వలదు పతికి 4-202

ఉగ్రదండనాన్నే దండ పారుష్యం అంటారు చిన్న అపరాధానికి పెద్దశిక్ష విధించడం ఇది పనికిరాదు యథాపరాధ దండన-అపరాధానికి తగిన దండన ఉండాలి

ఎవడయినా వచ్చి మరొకడి మీద చాడీలు చెబితే(కొండెము నన్) దాన్ని విచారణ చెయ్యకుండా తర్కించకుండా నమ్మడం అతర్కంగా విశ్వసించడం పనికిరాదు

సంధి చేసుకోవడానికి శత్రువుకు (అరి) అవకాశం ఇవ్వకుండా (ఎడ+ ఈయక- ఈక) తిరగబడట యుద్ధానికి దిగడం పనికిరాదు

శత్రురాజు దగ్గర దోషాన్ని గుర్తించి (అవలి తప్పు+ ఎన్ని) తనను దర్శించిన (తన్న) విదేశీయుణ్ణి చేరదీయటం పోయి-చెడగొట్టడం, చెరచడం పనికిరాదు

పరరాజు నీపట్ల ఈ తప్పు చేస్తున్నాడు-అని తనకు తెలియజెప్పడానికి వచ్చి దర్శించిన ఆ పరదేశ పారుణ్ణి చెరచడం- ఆ పరరాజుకు అప్పగించడం ఇది పనికిరాదు ఇలా అన్వయించింది సంజీవనీ వ్యాఖ్య

ప్రతికూలంగా ప్రవర్తించేవాడికి (ప్రతి ప్రవర్తకునకున్) తెలిసి పోయేటట్లు (ఏర్పడగన్) మంత్రాలోచన గానీ ఆచరణగానీ చెయ్యడం పనికిరాదు

ఎదుటి జనుడు తనమీద అవిశ్వాసంతో ఉన్నాడని తెలుసుకునీ లేదా ఎదుటి జనుడికి తనపట్ల అవిశ్వాసం ఉందని ఎరిగీ- అతడితో కలిసి మెలగడం పనికిరాదు

విశ్వసనీయుల్ని దూరంగా ఉంచడం (వేర్పఱచుట) లేదా వీరు రాజుగారికి విశ్వస

నీయులు సన్నిహితులు అని స్పష్టపడేట్టు వారిని ప్రత్యేకంగా చూడటం (వేరుపరచుట) పనికిరాదు

మంత్రులతో సమావేశమై మంత్రాలోచన చేసేటప్పుడు ప్రణాళికలు, సిద్ధాంతాలు భవిష్యత్కార్యక్రమాలు వ్యూహాలు ఇత్యాదులు చర్చించడాన్ని మంత్రాలోచన అంటారు) మిక్కిలి మొగమోటం పెట్టుకోవడం పనికి రాదు మొగమోటానికి పోయి మంత్రులు చెప్పినదానికల్లా తల ఊపకూడ దని (మిక్కిలి+ ఇడుకొంట అనేదానికి ఎక్కువమందిని మంత్రాలోచనకు రానివ్వడం అని వావిళ్ళవారి వ్యాఖ్యలో అర్థం ఇచ్చారు)

మంత్రాలోచనలో భాగస్వాములైన మంత్రులు దాన్ని రహస్యంగా ఉంచాలి ఆచరణలోకి వచ్చేవరకూ బయటకు పొక్కనివ్వకూడదు చర్చ సందర్భంగా ఎవరెవరు ఏయే అభిప్రాయాలు వెల్లడించారో ఎవరు వ్యతిరేకించారో ఎవరు సమర్థించారో ఇటువంటి ఆంతరంగిక విషయాలు కూ డా బయటికి రాకూడదు వస్తే మంత్రభేదం అయినట్టు అది ఎవరి ద్వారా బయటికి వచ్చిందో రాజుగారు తెలుసుకోవాలి తెలుసుకుని ఆ మంత్ర భేత్తకు (మంత్రాన్ని భేదించినవాడు) వెంటనే దండన(శిరచ్ఛేదం) విధించాలి అటువంటి ఆజ్ఞను వెంటనే ఇచ్చి వెంటనే అమలు పరచక మరిచి పోయి ఉండటం (మఱచియుంట) లేదా విస్మరించడం పనికిరాదు

రాజ్యంలో ఎక్కడయినా ఏదయినా ఒక వింత జరిగితే (వింత పుట్టినన్) మెలకువతో దాన్ని తెలుసుకుని (కనుగల్లి) తగిన ఆలోచన చెయ్యాలి ఏమిటి ఆ వింత? ఎలా పుట్టింది? నిజమా? కపటమా? ఎవర యినా మాయలూ మంత్రాలతో పుట్టించారా? ప్రజల్ని మోసం చెయ్య డానికి కల్పించారా? అయితే వారి అంతర్యం ఏమిటి? ఆ వ్యక్తుల చరిత్ర ఏమిటి? శత్రుదేశాలవారా? ఇత్యాదులన్నీ క్షుణ్ణంగా పరిశీలన చేయించాలి రాజుదృష్టిని మళ్ళించడానికిగానీ ప్రజల దృష్టిని మళ్ళించడానికి గానీ విశ్వాసాలను సడలించడానికి గానీ కొత్త విశ్వాసాలను కలిగించడానికి గానీ మతాంతరీకరణలకు గానీ- రకరకాలుగా రకరకా ల వింతలు కొందరు పుట్టిస్తూ ఉంటారు (వింతలు అంటే ఉత్పాతాలు అని వావిళ్ల వారి వ్యాఖ్య) వీటిని గమనించక పోయినా గమనించి వెనువెంటనే తగిన చర్యలు తీసుకోక పోయినా అనక ప్రమాదం ముంచుకు వస్తుంది కాబట్టి వింతపుట్టినప్పుడు దాన్ని గురించి ఆలోచించకపోవడం పట్టించుకోకపోవడం పనికిరాదు

మతగురువులూ కవి పండితులూ శాస్త్ర వేత్తలూ లలితకళా పారంగతులూ ఇటువంటి మాన్యుల వైపు ఒక్కసారయినా కన్నెత్తి చూడకపోవడం, వారిని బొత్తిగా గౌరవించక పోవడం,నిర్లక్ష్యం చెయ్యడం పనికిరాదు

శిష్టులను గౌరవించకపోగా పరమదుష్టులతో జతకట్టడం (విహీనులను కూడుకొంట) చేరదీసి చెలిమి చెయ్యడం - ఇది సుతరామూ పనికిరాదు

అలాగే - పాన స్త్రీ మృగయా(వేట) ద్యూత వాక్పారుష్య దండపారుష్య అర్థ

వేతపోలు

దూషణ రూపమైన సప్త వ్యసనాలకూ లేదా వీటిలో ఏదో ఒక వ్యసనానికి దాసుడె పోయి 'వ్యసని' అనిపించుకోవడం మరీ పనికిరాదు

అయినదానికీ కానిదానికీ పట్టుదల(చలము)వహించడం పనికిరాదు కాలి విషయంలో పట్టుదల మాత్సర్యమో మూర్ఖత్వమో అవుతుంది కాబట్టి విడిచి పెట్టాలి

ఈ అవలక్షణాలు రాజుగారికి(పతికి)ఉండకూడదు అని ఖండితంగా చెప్పాడు

దివ్య భౌమ అంతరిక్ష సంబంధంగా మూడు రకాల ఉత్పాతాలు కలుగుతూ ఉంటాయి వీటిలో కొన్ని-కొన్ని సందర్భాలలో వింతలే కావచ్చు ఇటువంటి ఉత్పాతాలు సంభవించినపుడు రాజుగారు ప్రప్రథమంగా అతిముఖ్యంగా చెయ్యవలసింది ఏమిటి?

త్రివిధోత్పాతము లొదవిన
నవనివిభుడు విడువవలయు నధిక ద్రవ్యం
బవనీసురముఖ సురముఖ
పవనసఖముఖముల భుక్తి బలిహోమ విధిన్ 4-253

మసూచికం వంటి అంటురోగాలు వ్యాపిస్తే దేవతలు అలిగారని ఒక విశ్వాసం ఇవి దివ్యోత్పాతాలు భూకంపాదులు భౌమోత్పాతాలు అతి వృష్టి అనావృష్టి ఇత్యాదులు అంతరిక్షోత్పాతాలు అప్పటి మానవుడికి కారణం అందనివీ అదుపు చెయ్యడానికి లొంగనివీ కళ్ళు అప్పగించి చూస్తూ భరించవలసినవీ ఈ ఉత్పాతాలు ఇవి కలిగినప్పడు (ఒదవినన్) అవనీ విభుడు కోశాగారంనుంచి అధికధనాన్ని తీసి సమాజంలోకి సర ఫరా చెయ్యాలి జపాలూ తపాలూ వంకతో బ్రాహ్మణుల ద్వారా (అవనీ సుర ముఖమున) అర్చనలూ సంతర్పణలూ మిషతో దేవతా దేవాలయాల ద్వారా (సురముఖమున),యజ్ఞయాగాదుల సాకుతో అగ్ని ద్వారా (పవన సఖ-ముఖమున) క్రమంగా భుక్తి-బలి-హోమవిధులుగా ధనం సమాజంలోకి పుష్కలంగా వచ్చేట్టు చెయ్యాలి. ప్రజలను ఆదుకోవలసిన బాధ్య తను నిర్వహించాలి రాజుగారు దర్మంతప్పితే రాజ్యంలో ఇలాంటి ఉత్పాతాలు జరుగుతాయని వెనుకటివాళ్ళ నమ్మకం కనక కోశాగారంనుంచి ఉదారం గా ధనం తరలించి సదభిప్రాయాన్ని ప్రోదిచేసుకోవడం ప్రయోజనం కావచ్చు విశ్వాసాలకు అనుగుణంగా దేవతా శాంతి జరిపించి ప్రజల మనస్సుల్లో తిరిగి ధైర్యం పాదుకొల్పడానికీ కావచ్చు

ఏమయినా ఇవి హఠాత్తుగా అనూహ్యంగా వచ్చిపడే అవసరాలు ఇటువంటివాటిని తట్టుకోవడానికే ఎల్లవేళలా కోశం సమృద్ధంగా ఉండాలనడం ఏటేటా సాలుసరి ఆదాయంలో నాలుగోవంతు కోశానికి విధిగా చేరాలనడమూను

(చూ 4-238)

పరిపాలనాపరమైన మరో రహస్యం ఉపదేశిస్తున్నాడు మంత్రులు సేనాపతులు దండనాయకులు గూఢచారులు- ఇటువంటి ఉన్నతాధికారుల్లో రకరకాల

మనస్తత్వాలవారుంటారు అందరూ ఎల్లవేళలా రాజుగారికి హితమే కోరతారనీ లేదు. అహితమే కోరతారనీ లేదు కానీ వీరంతా కూడబలుక్కుని ఏకమయితే, మురా కడితే రాజుగారి పని రా! అందుకని రాజు గారు ఎలా జాగ్రత్తపడాలో సూచిస్తున్నాడు. విభజించి పాలించు సిద్ధాం తాన్ని ప్రతిపాదిస్తున్నాడు

స్పర్ధ పరస్పరంబు దొరపట్టున యోధులపట్టునన్ నృపుల్
వర్ధన మొంద జేయదగు, వారి హితాహితచర్య లొంద వం
తర్థి, మిథోవ్యథావహ హిత ప్రథమాన సమానతా ప్రథా
ధూర్ధరతాదులం దగిలి, ద్రోహపు జింత దలంప రేమియున్ 4-284

ప్రభుత్వోద్యోగులలో ఉన్నతాధికారులకు(దొరలు) పరస్పరం స్పర్ధ పెంచాలి. అలాగే యోధులకూ (దండనాయకాదులు) పరస్పరం స్పర్ధ పెంచాలి వాళ్లల్లో వాళ్లకే పడకుండా చెయ్యాలి నృపులు స్పర్ధను వర్ధన మొందజేయదగున్ అలా చేస్తే వాళ్ల హితచర్యలు గానీ అహితచర్యలు గానీ (కీడు) ఇక దాగవు (అంతర్ధి=అంతర్ధానము-ఒందవు) స్పర్ధకార ణంగా ఒకరి వ్యవహారాలను ఒకరు రాజుగారికి ఎప్పటికప్పడు తెలియపరుస్తూ ఉంటారు తెరవెనక ఏమి జరుగుతోందో తెలిసిపోతూ ఉంటుంది. ఇక రాజుగారికి నిశ్చింత

''వీడు వెళ్లి రాజుగారికి చెబుతాడేమో'' అని ఒక అధికారిని చూసి ఒక అధికారి భయపడుతూ ఉంటారు ద్రోహాన్ని తలపెట్టనే తలపెట్టరు. స్పర్ధతో ఎలాంటి ప్రవృత్తి ఏర్పడుతుందో- మిథోవ్యథావహ అంటూ ఒక సమాసంలోకి క్రోడీకరించాడు.

ఇద్దరు అధికారులు ఉన్నారనుకుందాం వారిలో మొదటివాడు రాజుగారికి అపకారం(అహితం) చేద్దాం అనుకున్నాడు కానీ రెండవ అధికారి స్పర్ధ కారణంగా ఈ విషయాన్ని రాజుగారికి చెప్పేస్తాడేమో అని భయపడి విరమించి హితమే చేస్తాడు. అది ఇద్దరు అధికారులకీ వ్యథ కలిగిస్తుంది అహితం చేద్దామనుకున్న నేను ఇష్టం లేకపోయినా హితమే చేస్తున్నానే అని మొదటి అధికారి వ్యథ చెందుతాడు రాజుగారికి వీడు హితం చేస్తున్నాడు మరీ దగ్గరయిపోతాడేమో నన్ను మించిపోతాడేమో అని రెండవ అధికారి వ్యథ చెందుతాడు ఇలా స్పర్ధ వాళ్ళకి మిథో వ్యథావహం (మిథః= పరస్పరం) అవుతుంది దానితో ఇద్దరూ పోటీపడి హితమే చేస్తారు.

వ్యథ అయినా హితమేచేసి అటు రాజుకీ ఇటు ప్రజలకూ (ప్రశంసా పాత్రులు, ప్రసిద్ధులు) కావాలనీ రాజసత్కారాలు అందుకొని ఒకరికన్నా ఒకరు పేరు గడించాలనీ (స-మానతా- ప్రథా=పేరు కీర్తి) ఆరాట పడతారు అలాగే ధూర్ధరత్వం కోసమూ పోటీ పడతారు ''రాజకార్యాల భారాన్ని వహిస్తున్నవాణ్ణి నేనే అతిప్రధానుణ్ణి''అనే ధురంధరత్వంకోసం ప్రాకులాడుతారు ఇటువంటి ప్రాకులాటల్లో తగుల్కొని ద్రోహమనేది తలపెట్టనే తలపెట్టరు. (ద్రోహపు చింతన్ ఏమియున్ తలంపరు)

మరొక విషయంలోకి వెడుతున్నాడు. దండయాత్రలకు వెళ్ళేటప్పుడు రాజు తానై ముందుగా వెళ్లకూడదట. దొరను పంపాలిట చెబుతున్నాడు

ధరణిపు డెందునే దగదు తా జన, నూఱట కొక్కనిం దగున్
దొర నొనరించి పంప, నరి దుర్బలుచే జెడ డాత, దర్థభూ
కరితురగర్ధి లేక కొఱగా, డటు సేయ– ద్విజాన్యు డల్కకున్
నెరవగు, నాతడున్ వలయు, నిండిన దుర్గబలోర్వి యీ దగున్4–255

ధరణి పాలకుడు (ధరణిపుడు= భూమిని పాలించువాడు) తానై ఎక్కడికీ, ఏ దండయాత్రకూ (ఎందునేన్) వెళ్ళకూడదు తన వాళ్ళల్లో ఒకడిని నాయకుణ్ణి చేసి (దొరనొనరించి) దండయాత్రకు పంపించాలి.

రాజు తానై ఎందుకు వెళ్ళకూడదు? అంటే '' ఊఱటకు'' అంటున్నాడు తాను ఊరటగా విశ్రాంతిగా ఉండాలి కనక మరొకణ్ణి పంపమని అవసరపడితే కట్టకడపట తానై రణరంగానికి వెళ్ళే అవకాశం తనకు ఉంచు కోవడంకూడా ఊరటలో భాగమే

అదీగాక తన బలం ఓడిపోయే దశ వస్తే తాత్కాలికంగా నిందను దొరమీద కు నెట్టేసి తాను సంధి ప్రయత్నాలు మొదలుపెట్టవచ్చు. అంచేత రాజుగారు పై యెత్తున ఉండాలే తప్ప, అన్ని దండయాత్రలకూ తానే సిద్ధం కాకూడదు.(దొరనొనరించి పంప డం ఊరటకోసమని కూడా)

సరే– ఒకణ్ణి దొరను చేసి పంపించాడు. వెళ్ళిన ఆ దొర దుర్బలుడైతే (దుర్బలు చేన్) శత్రువు (అరి) నాశనమవుతాడా? కాదు(చెడడు). కాబట్టి ఆ దొరకు ధన సమృద్ధి భూసమృద్ధి, గజ(సైన్య) సమృద్ధి, తురగ సమృద్ధి (అశ్వ సైన్య సమృద్ధి) కల్పించాలి (తురగ+ ఋద్ధి–తురగర్ధి).ఇవి లేకపోతే వాడు కొఱగాడు. ఎందుకూ పనికిరాడు.

అన్ని సమృద్ధులూ కల్పించి ఇలా ఒకణ్ణి దొరను చేసి పంపితే (అటు సేయన్) ద్విజాన్యుడు అలకకు తావు అవుతాడట (నెరవు+ అగున్). ద్వి జాన్యుడు అలుగు తాడని. ఉపనయన సంస్కారం కలవాడు ద్విజుడు. ద్విజు డు కానివాడు ద్విజాన్యుడు ఇంతమంది మహావీరులం, యోధాను యోధులం, మేమంతా ఉంటే ఆ ద్విజుణ్ణే దొరను చేసి పంపాలా? ఆ పాటి ధన గజ తురగ సమృద్ధులు మాకు కల్పిస్తే మేము వెళ్ళి జయించుకు రాలే మా అని ద్విజాన్యులు అలక వహిస్తారని కాబోలు

ద్విజుణ్ణి పంపితే అన్యులు అలుగుతారు అన్యుణ్ణి పంపితే ద్విజులు అలుగు తారు మహావీరుల్లో ఈ అలకలు తప్పవు రాజుకి ఎవణ్నో ఒకణ్ణి పంపకా తప్పదు.

అశోక వనికాన్యాయం

(రావణుడు సీతమ్మను అశోకవనంలోనే ఎందుకు కూర్చోపెట్టాడు అని ప్రశ్న ఎక్కడ కూర్చోబెట్టినా అక్కడే ఎందుకు కూర్చోబెట్టాడు అనే ప్రశ్న వస్తుంది తీసుకు వెళ్ళాక ఎక్కడో అక్కడ కూర్చోబెట్టాలి కనక అశోకవనంలో కూర్చోబెట్టాడు అని సమా ధానం దీన్ని అశోకవనికాన్యాయం అంటారు.)

అయితే ఈ అలిగినవాడినల్లా వదిలి పెట్టేయ్యడమేనా? వాడితో పని

ఉండదా? అంటే వస్తున్నాడు.''ఆతడన్ వలయు'' అతడికి''నిండిన దుర్గ బలోర్వి యీదగున్''. దుర్గబలంతో కూడిన భూభాగాన్ని-ఒక మండలాన్నో ఒక ప్రాంతాన్నో అతడికి ఇవ్వవచ్చు.ఈన్ తగున్=ఇవ్వడం యుక్తమని.అంటే ఒక ప్రాంతానికి ఆ అన్యమహావీరుణ్ణి అధిపతిని చెయ్యమంటున్నాడు

అయితే ఆ ప్రాంతం దుర్గబలంతో కూడినది కావాలి దుర్గబల+ ఉర్వి. ఇది గమనించవలసిన మాట. అతడికి దఖలు పరిచే భూభాగంలో దుర్గబలం ఉండాలి ఆ దుర్గ బలాధిపత్యం లోగడ చెప్పిన ప్రకారం (దుర్గ ము లాప్త ద్విజవర వర్గమునకే యిమ్ము-207) రాజుగారికి అత్యంత విశ్వాస పాత్రుడైన మరొక వ్యక్తి చేతిలో ఉంటుంది. అంటే,అలిగి ఆధిపత్యం సంపాదించుకున్న ఈ మహావీరుడు తోక జాడించకుండా దుర్గబలం-నెత్తి మీద వేలాడుతున్న కత్తిలా భయపెట్టి అదుపులో ఉంచుతుందన్న మాట.

(ఈ పద్యాన్ని వావిళ్లవారూ వేదంవారూ విభిన్నమార్గాల్లో సమ న్వయించారు వావిళ్లవారి వాఖ్యలో ''అల్కకే నెరపు,నతండునున్ వల యు'' అనే పాఠం కనపడుతోంది. రెండు వాఖ్యానాల్లోనూ కొంత అస్పష్టత ఉంది సందర్భాన్నీ ఈ ఘట్టంలో రాయలవారి అభివ్యక్తి విధానాన్నీ దృష్టిలో పెట్టుకుని నేను ఈ సమన్వయం చేసాను. విజ్ఞులే ప్రమాణం)

''వృక్షో రక్షతి రక్షితః'' అని ఈనాటి నినాదం అడవుల అవసరాన్ని ఎలుగెత్తి చాటుతోంది. ''సామాజిక అడవుల పెంపక కేంద్రాలనూ'' అటవీ శాఖలనూ నిర్వహిస్తోంది ప్రభుత్వం కాలుష్య నివారణ పథకాల్లో భాగంగా అడవులు పెంచి భూగోళాన్ని పరిరక్షించమని ప్రపంచ మేధావులు మొరపెట్టుకుంటున్నారు

రాయలవారుకూడా అడవుల్ని పెంచమనే చెప్పారు అయితే ఆయన ప్రయోజనం వేరు

అడవులు గడిదేశములవి
దడములుగా బెంపు మాత్స్యధరణీ స్థలికిన్
నడుముల వి పాళ్లు పాళ్లుగ
బొడిపింపుము , దస్యు బాధ పొందక యుండన్- 4-256

(గడి=సరిహద్దు దడము=దళము, దట్టము నడిమి+లు=నడుములు,= నడుము లవి=మధ్యభాగములోనివి పాడ+లు=పాడ్లు-పాళ్లు, పాడి+లు దస్యులు=దొంగలు)

అడవులు సరిహద్దు భూభాగాల్లోవయితే వాటిని దట్టంగా పెంచు, కాకులు దూరని కారడవులుగా, చీమలు దూరని చిట్టడవులుగా పెంచు క్రూరమృగాలకు నిలయమవుతాయి శత్రుదుర్భేద్యంగా రక్షణ వలయాల వుతాయి అక్కడ వనదుర్గాలు కూడా నెలకొల్పితే శ్రీరామరక్ష

నీ భూభాగంలో నట్టనడుమున ఉన్న అడవుల్ని మాత్రం పాడలు పాడలుగా పాడిపించు. నరికించు. నగరానికీ నగరానికీ మధ్యలో గ్రామానికీ గ్రామానికీ మధ్యలో, కీకారణ్యాలుంటే ప్రజలకు దొంగల బాధ ఎక్కువవుతుంది.దొంగలు అక్కడ

మకాంపెట్టి ఊళ్ళు దోచుకుంటారు. దారిదోపిడీలు చేస్తారు అంచేత దస్యుబాధని నివారించడంకోసం రాజ్యం నట్టనడిమి అడవుల్ని అంత దట్టంగా పెరగనివ్వకు. పల్చగా ఉండేటట్టు,పొదలు పొదలు గా ఉండేటట్టు అక్కడక్కడా నరికించు

సరిహద్దుల్లో కీకారణ్యాలుంటే అవి ఆటవిక జనాలకు ఆటపట్టు లవుతాయి. దానివల్ల ఏమీ ఇబ్బంది రాదా? ఇది మాట్లాడుతున్నాడు.

క్షమ గుఱు మన్నెపున్ గహనచారిజనం బెడ,దోషదృష్టి -కు
డ్యము గడుగంగ బూన్కి , తెగ దల్లిన సర్వము, బాస నీగి వ
శ్యముగ నొనర్ప దాడికగు, నౌ గడి కొల్లలకున్, శతాపరా
ధమును సహస్రదండము నతర్క్యము-సర్వము నేలువానికిన్ 257

మన్నెము=అడవి కుఱుచయైన మన్నెము-కుఱు మన్నెము. చిట్ట డవి అని. సాధారణంగా దట్టం పెరిగినకొలదీ వైశాల్యం తగ్గుతూ ఉంటుంది కనక కుఱు మన్నెము అన్నా, చిట్టడవి అన్నా దట్టమైన అడవి అని తాత్ప ర్యార్థం.

అలాంటి అడవుల్లో చెంచులూ కోయలూ మొదలైన ఆటవిక జాతులవారు (గహన చారి జనము=వనచరప్రజలు) ఉంటారు వారి యెడన్ రాజుగారు క్షమన్= ఓర్పును కలిగి ఉండాలి. దోషదృష్టి పెట్టుకుంటే కష్టం. ఎందుకంటే వాళ్ళు అనాగర కులు. కనక తెలిసో తెలియకో ఏవో తప్పలు చేస్తూనే ఉంటారు. ఆ తప్పల్ని సరిదిద్ద డానికి పూనుకుంటే అది ''కుడ్యమున్ కడుగంగ బూన్కి'' అవుతుంది మట్టి గోడను కడగడం వంటిది. ఎంత కడిగితే మాత్రం మట్టి పోతుంది. గోడ అంతా కరిగి అదృశ్య మైపోవాలి అంతేగానీ మట్టిపోయి శుభ్రపడటమనేది జరగదు అలాగే వాళ్ళని నిర్దు ష్టుల్ని చెయ్యడంకూడా ఈ భూమిమీద (క్షమన్) అసంభవం ఈ జన్మకు తెమలదు.

అలాగని వాళ్ళు చేసే తప్పలకన్నింటికీ అలిగి రాజుగారు శిక్షించడం మొదలు పెడితే అదిమాత్రం తెములుతుందా? ఎందరిని శిక్షించడం ఎన్నిసార్లని శిక్షించడం. ఎంతకని శిక్షించడం! అల్లినన్ సర్వమున్ తెగదు. పూర్తిగా ముగియడమనేది ఉండదు. అంతంలేని పని అవుతుంది

అంచేత వాళ్ళను సత్య వాగ్దానాలతో గానీ (బాసన్), ధన కనక వస్తు వాహనాది బహుమతి ప్రదానాలతోగానీ (ఈగి=దానము)- వశ్యుల్ని చేసుకోవడం మంచిది అంతలోనే అలగడం అంతలోనే లొంగడం వారి స్వభావమనీ వారిది 'పెడగు టెద' అనీ లోగడ వివరించాడు. (చూ 222- 225) ఇట్టే వశ్యులవుతారు. అలా వశ్యం చేసుకుంటే, శత్రు దేశాలమీద దాడికి ఉపయోగిస్తారు (దాడికిన్+అగున్). సరిహద్దు దేశాలను కొల్ల గొట్టడానికీ (గడి కొల్లలకున్ ఔన్) ఉపయోగిస్తారు.

మహాసామ్రాజ్యం పరిపాలించేవాడికి (సర్వమున్ ఏలువానికిన్) శతాపరా దమూ సహస్రదండనమూ ఆలోచించరానిది (అతర్క్యము) అనుచితం వందేసి తప్పలు ఆరోపించడం వెయ్యేసి మందిని దండించడం- ఇలాంటి పనులు అసలు ఊహకే రాకూడదు. 'శతసహస్ర' పదాలు బాహుళ్యసూచకాలు (శతాపరాధమూ

సహస్ర దండనమూ అవసరపడుతోందంటే, తన విధానాల్లోనే తన శాసనాల్లోనే తప్పు ఉందని రాజు గ్రహించాలి. మార్పు అనుగ్రహించాలి ఇది వ్యంగ్యం.

రేవు పట్టణాల్లో వాణిజ్యం అభివృద్ధి పరచమని ఇంతకుముందు చెప్పాడు (చూ 245) విదేశాలనుంచి వచ్చే బేహారుల్ని(వ్యాపారులు) ఎలా మంచిచేసుకోవాలో ఎందుకు మంచిచేసుకోవాలో ఇప్పుడు చెబుతున్నాడు

సింధుర మహాశ్వముఖ్యముల్ చేర్చు దొల
దీవి వణిజుల కూళ్లు సద్గృహములు పురి
గొలువు దేఱంబు వెలవేలు గలుగ బ్రాత
వారిగా జేయు, మరి నవి చేరకుండ 4-258

ఏనుగులూ మేలుజాతి గుర్రాలూ (యవనదేశం గుర్రాలు మేలుజాతి వంటారు. యవనాశ్వమని వాడుక) ఇంకా రత్నాలూ, సుగంధ ద్రవ్యాలూ ఇత్యాదుల్ని (ముఖ్యముల్) నీ రాజ్యానికి దిగుమతి చేసే (చేర్చు నట్టి) వణిక్కులుంటారే వారిని గౌరవంగా చూసుకోవాలి. వారు దవుల దీవుల వణిజులు సుదూర ప్రాంతాల ద్వీపాల నుంచి (అరేబియా సుమిత్రా జావా మలయా మొ ॥) నౌకలమీద నెలల తరబడి సముద్రయానం చేసి కష్టాలకు ఓర్చి, వచ్చిన ధైర్యశాలులు. సాహసప్రియులు నీ రాజ్యంలో కొంతకాలం ఉండి వాటిని అమ్ముకుని, తిరిగి వెళ్ళిపోతారు మళ్ళీ సరుకు సమకూర్చుకుని ఎప్పుడో వస్తారు ఆ వ్యాపారులు సరుకు అమ్ముకోవడానికి నీ రాజ్యం లో అనువైన ఊళ్ళు చూపించడం రాజధానిలో ఉన్నప్పుడు (పురిన్) వారికి అనువైన వసతి గృహాలు (సద్గృహములు) ఏర్పాటు చెయ్యడం, నిత్యమూ కొలువు అనుగ్రహించడం (రాజదర్శనం, రాజ సభా ప్రవేశం రాజ సంభాషణం వగైరా), మంచి గౌరవం (తేఱంబు) లాభసాటి గా మంచి వెల లభించేట్టుచూడటం ఇవన్నీ చెయ్యాలి చేసి, వారిని పాత చుట్టాలుగా, చిరకాల మిత్రులుగా(ప్రాతవారిగాన్) మార్చుకోవాలి. వతన వదులుకోలేని స్నేహానుబంధం కల్పించి వారు ఎప్పుడు వచ్చినా, ఏ మేలి సరుకు తెచ్చినా- ముందు తనకే విక్రయించేట్టు తనను కాదని మరో రాజ్యానికి వెళ్లలేనట్టు చేసుకోవాలి. ఎందుకు ఈ యాతన అంతా అంటే- వారు తెచ్చే సరుకులు నీ శత్రువుకి చేరకుండా (అవి అరిన్ చేరకుండ).

వాళ్ళు తెచ్చే గుర్రాలూ ఏనుగులూ శత్రురాజ్యానికి చేరితే అతడి సైన్యం బల పడుతుంది. సుగంధద్రవ్యాలు చేరితే భోగానుభవంలో భోగాను భవప్రదర్శనలో అతడిది పైచేయి అయిపోతుంది. అందుకని దొలదీవి వణిజులను ఆదరంతో ఆత్మీయత తో కట్టేసుకోవాలి.

ఇంక మరో విషయం. సరిహద్దు దేశాలనుంచి రాయబారులు (రాజ దూతలు) వస్తే వారితో ఎలా హుందాగా వ్యవహరించాలో కొంత సూచిస్తున్నాడు .

గడి నృపుల రాయబారుల యెడ, గొలువున
సరస సల్లాపములు రాజు సలుప వలయు,

బేతవోలు

గార్య ఖడ్గము లనుచరు ల్దానబలుక
వలయు, నవి మైత్రి దా దేలబలుకవలయు 4-౨౫౯

గడి అంటేనే సరిహద్దు దేశం గడి నృపులు అంటే సరిహద్దు దేశాల రాజులు. వాళ్ల రాయబారులు వచ్చినప్పుడు కొలువులో రాజుగారు సరససల్లాపాలు చెయ్యాలి (కొలువునన్ అని ప్రముఖంగా మొట్ట మొదట చెప్పడాన్ని బట్టి రాయబారులకి కొలువులోనే దర్శనమివ్వాలనీ, ఏకాంత దర్శనాలూ, ఏకాంత సంభాషణలూ, పనికిరావనీ కాబోలు.) ముఖం ముటముటలాడిస్తూ పరుషోక్తులు రాజుగారు పలకకూడదు. మీ రాజు అప్పుడు అలా చేసాడు, ఇప్పుడు ఇలా చేసాడు, పైగా రాయబారమా- ఇలాంటి మాటలు రాజుగారు తాసై అనకూడదు. అవన్నీ అనుచరులు పలకాలి అదికూడా ఎలా''కానన్ పలుక వలయు''. మొగమోట పడకండా, చచ్చు, అట్టేపెట్టకుండా, స్పష్టపడేట్టు పలకాలి అది కార్యం కావచ్చు, ఖడ్గం కావచ్చు, అంటే వారి రాజు చేసిన అకృత్యం చెప్పడం, దానికి తాము చెయ్య గలిగిన ప్రతిక్రియ చెప్పడం. అందుకు అవసరమైన వీరాలాపాలు పలకడం. ఇదంతా కొలువులో కూచున్న రాజానుచరులు చెయ్యాలి

ఇలా పూర్తిగా దులిపెయ్యనిచ్చి చిట్టచివరకు (మధ్యమధ్యలో గానీ) రాజు గారు వాటిని మైత్రితో తేలగొట్టాలి. ''తాన్ అవి మైత్రిన్ తేలబలు కవలయు'' అంటే తనవాళ్లంతా ప్రతీకారేచ్చతో పరవళ్లు తొక్కుతున్నట్టూ, తాను మాత్రం శాంతినీ మైత్రినీ కోరుతూ ఓర్పుతో సర్దుతున్నట్టూను. గిల్లించి జోలపాడటమంటే ఇదే. అనుచరులు గిల్లుతారు తాను జోలపా డుతాడు. కార్య ఖడ్గాలకు మేము సిద్ధమే అని కట్టకడపటికి సందేశం

(ఈ సిద్ధాంతానికి నాచన సోమనాథుడి ఉత్తర హరివంశంలో జనార్దను రాయబారంలో ఉదాహరణ దొరుకుతుంది. హంసడిభకుల్ని యాదవ వీరులు నిందించడం శ్రీకృష్ణుడు తేలబలకడం)

మనుషుల మనస్తత్వాన్ని కవులు బాగా పట్టుకుంటారు అందులో రాయలవారు మరీ గడసరి. మంత్రాలోచన జరిగే రహస్య సమావేశాలలో కొత్త వారిని భాగస్వాముల్ని చేస్తే బయటకు వచ్చాక వారి హడావిడి ఎలా ఉంటుందో గుర్తించాడు. అందుకని- హెచ్చరిస్తున్నాడు-

క్రొ నవంబుగ దొరకేయువాని మంత్ర
ములకు వేగమె లోఁజేయ జనదు, వాడు
క్రొత్త మన్నన రహిఁ దమగులకు జెప్ప
నయిన నది చెడు, మఱి వాడు నగుఁ గాన. 4-౨౬౦

రాజుగారు ఒకవ్యక్తిని క్రొత్తగా మంత్రిని చేసారనుకుందాం. అతడి ని వెంటనే (వేగమే) మంత్రాలోచనలో భాగస్వామిని చెయ్యకూడదు (లో జేయన్ చనదు). చేస్తే- వాడు తనకు క్రొత్తగా లభించిన మన్ననతో కలిగిన ఉత్సాహంతొద్దీ(క్రొత్త మన్నన

రహస్) సమావేశరహస్యాల్ని స్నేహితులకు చెప్పేస్తాడు "రాజుగారు ఇలా అన్నారు పెద్ద మంత్రిగారు అలా అన్నారు నేను ఇలా అన్నాను రాజు నా సూచనను ఆమోదించారు రేపు ఇలా జరుగుతుంది చూడండి" అంటూ బడాయికి పోతాడు తనకు కలిగిన మన్ననను తెలియజెప్పడమే అతడి ఉద్దేశం కానీ ఆ బులబాటంలో తనకు తెలియకుండానే 'మంత్రభేత్త" అయిపోతున్నాడు ఐతే ప్రతి క్రొత్త దొరా అలా చెబుతాడని కాదు చెప్పే అవకాశం ఉంది కనక చెప్పినట్లయితే (చెప్పనయినన్) ముందు మంత్రాంగం చెడిపోతుంది బట్టబయలు అవుతుంది తరువాత మరి వాడూ నష్టపోతాడు తప్పదు రాచరికంలో మంత్ర భేత్తకు శిక్షలు చాలా దారుణంగా ఉంటాయి పదవి ఊడిపోతుంది తల- చెప్పలేం

మంత్రాంగం మాట దేవుడెరుగు అతడి మేలు కోరినవాడయితే రాజు క్రొత్త దొరగారిని పదవీబాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే మంత్రాలోచనకు పిలవకూడదు. క్రొత్త మురిపెం తీరేవరకూ కొంతకాలంపాటు దూరంగా ఉంచాలి

ఇప్పటివరకూ చెప్పిన రాజనీతిలో ప్రధానాంశాలను పునశ్చరణ కోసం ఒకచోటికి క్రోడీకరిస్తున్నాడు

హిత బహుశ్రుత ధర్మరత శూరతా స్వపూ
ర్వతల మన్ ద్విజుల దుర్గముల నిలిపి,
పులిజున్ను మొదలుగా బురుషాయుషావధి
కందుండ సవరణల్ పొందు పఱచి,
చీమంతయైనను సామంత కోటికి
మితము దప్పక యుండ క్షితు లొసంగి,
యాయాధిక వ్యయానధికంబునుం బ్రజా
విరుఙంబుగాగ బండరువు గూర్చి,
క్షీణరిపు ధాత్రి ఐరదృష్టిచేత జూచి
బలగతి హరాద్ గ్రహించి- తా బ్రజయు నొవ్వ
కయు పగఱ గాత్రములనె చీకాకుపఱచు
నృపతి-డెందాన జేయిడి నిద్రవోవు 4-28

హితులై విశేషశాస్త్ర పాండిత్యం కలవారై (బహుశ్రుతులు) ధర్మరతులై శూరులై తరతరాలనుంచి తన రాజవంశానికి సేవలు అందిస్తు న్నవారై (స్వపూర్వులు) జీవితం గడుపుతున్న ద్విజుల్ని (మన్ ద్విజులన్) దుర్గాధిపతులుగా నిలిపి.

ఒక పురుషాయుర్దాయానికి సరిపోయేటంతగా (పురుషాయు షావధికి) వస్తు పదార్థ సామగ్రిని (సవరణలు) ఆ దుర్గాల్లో పొందు పరచాలి. పులిజున్నుతో సహా అన్నిపదార్థాలూ ఉండాలని పులిజున్ను అసలు ఉంటుందో ఉండదో, ఉన్నా దొరకడం అసంభవం అంటే అంత అలభ్య వస్తువులతో సహా అన్నీ, నూరేళ్ళకు సరిపోయేటంత సమృద్ధిగా దుర్గాలలో నిలవచేసి ఉంచాలని. ఎప్పుడు పడితే అప్పుడు, దేనికి పడితే

దానికి బయ టకు రావలసిన అవసరం ఉండకూడదు అన్నివేళలా అలాంటి అవ
కాశం ఉండకపోవచ్చు, మధ్యమధ్యలో అయితే విషప్రయుక్తమైన వస్తువులు దుర్గంలోకి
చేరవచ్చు, రాకపోకలవల్ల దుర్గరహస్యాలు తెలిసిపోవచ్చు. అదీకాక శత్రురాజులు చుట్టు
ముడితే దుర్గంలోనుంచి బయటకీ బయట నుంచి లోపలకీ ఏదీ కదలదు. ఈ ముట
డులు ఒక్కొక్కసారి సంవత్సరాల పాటు సాగుతాయి. ఈలోగా దుర్గంలో ఉన్న సైన్యానికి
ఆహారం ఎలాగ? అందుకని ఒక వంద సంవత్సరాలకు సరిపోయేటంతగా అవసర
మైన అన్ని సరుకులూ నిలువచేసుకోవాలి. ఆయుధాలూ మందుగుండు సామగ్రీ
సరేసరి అలా పొందుపరచి

సామంత రాజులకు (సామంతకోటికి) భూభాగాన్ని మండలాలుగా
'క్షితులు' విభజించి అప్పగించేటప్పుడు చీమంతయినా సరిహద్దు నిర్ణయంలో
(మితము=పరిమితి) తేడా రాకుండా ఉండేట్టు కచ్చితంగా నిర్ణయంచేసి ఇవ్వాలి
చీమంత తేడా వచ్చినా నీ సామంతరాజులే పరస్పరం కలహించుకుంటారు సరిహద్దు
తగవులు ఒక పటాన తేలవు. చిలికి చిలికి గాలివాన అవుతాయి అంచేత ముందే జాగ్రత్త
పడి పరిమితులు స్పష్టంగా నిర్ధారించి ఇవ్వాలి అలా ఇచ్చి

ఆదాయం ఎక్కువగా ఉండేట్లూ వ్యయం తక్కువగా (అనధికంబు)
ఉండేట్లూ, ప్రజలకు బాధ కలగకండా ఉండేట్లూ (ప్రజా విరుజంబు గాగ,) కోశం
సమకూర్చుకుని (బండరువు- భాండాగారము) .

బలహీన పడుతున్న శత్రురాజ్యాన్ని చారులద్వారా తెలుసుకొని- అంటే
ఫలానా శత్రురాజు బలహీనపడ్డాడు- అనే సంగతి గూఢచారి వర్గం ద్వారా(చరదృష్టి
చేతన్) గ్రహించి కొంగలాగా హఠాత్తుగా ఆ సామ్రాజ్యాన్ని కబళించాలి ఏమీ ఎరగ
నట్టుగా గట్టుమీద కూర్చుని కూర్చు నీ నీటి పైకి చేప తేలగానే రక్కున పట్టుకుంటుంది
కొంగ అలా శత్రురాజ్యాన్ని ఆక్రమించాలి. అయితే ఆక్రమించేటప్పుడు ''తాన్ ప్రజయు
నొవ్వక యు, పగఱ గాత్రములనె చీకాకు పఱచాలి'' అని ప్రత్యేకంగా హెచ్చరిస్తున్నాడు
శత్రు శరీరాన్నే(పగఱ గాత్రములనె) చీకాకు పరచాలి అంతేకానీ తనకూ ప్రజానీకా
నికీ నొప్పి కలగకూడదు(నొవ్వకయ)

రాజనీతి పరిభాషలో రాజ్యాంగాలు అన్నీ కలిపి రాజశరీరం సైన్యం కోశం
ఇత్యాదులు వాటిపై దాడిచేసి చీకాకు పరచాలని యుద్ధ సమయాలలో శత్రుదేశ
ప్రజలకే కాదు-స్వదేశ ప్రజలకుకూడా ఇక్కట్లు కలుగుతాయి కలగనివ్వకుండా
జాగ్రత్త పడి యుద్ధం సాగించాలని కొంగను దృష్టాంతంగా చెప్పడంవల్ల కబళన
హఠాత్తుగా జరగాలి త్వరగా తెమిలిపోవాలి అని వ్యంగ్యం

ఇలా చెయ్యగలిగిన రాజుగారు చీకూ చింతా లేకుండా హాయిగా గుండెల
మీద చెయ్యివేసుకుని నిద్రపోతాడు. (డెందానన్ చేయిడి నిద్రపోవున్)

గుండెలమీద చేయివేసుకుని నిద్రపోవడమనేది నిశ్చింతగా నిర్భయంగా
సుఖాలు అనుభవిస్తూ జీవితం గడపడానికి చెప్పే జాతీయం

ఎచ్చో గజ ఘోట క్రయ
తచ్చర్వణ సుభట జీవిత ద్విజ సురపూ
జోచ్చ నిజ భోగములకగు
వెచ్చము వెచ్చంబు గాదు విత్తంబునకున్ 4-202

ఏ కాలంలోనైనా సరే ఏ దేశంలో నైనాసరే(ఎచ్చోన్) ఏనుగులూ గుర్రాలూ(ఘోట) కొనడానికీ(క్రయ) వాటిని మేపడానికీ(తత్+ చర్వణ), యోధుల జీతాలకూ (జీవిత) ద్విజదేవతా పూజలకూ ఉదాత్తమైన తన భోగాలకూ, రాజుగారు ప్రజాధనాన్ని (విత్తంబునకు) ఖర్చు పెడితే నిజానికి అది వ్యయం క్రింద (వెచ్చము= వ్యయం) లెక్కకాదు

దేశరక్షణ ప్రజాపోషణ ఉచితోదాత్త భోగానుభవం- వీటికోసం చేసే వ్యయం వ్యయమే కాదని

ప్రతిన వలదు వైరి పట్టున నృపతికి,
దండు వెడల దీఱకుండు దీఱు,
గాక యుండి యుండి కాలాంతరమున నా
గార్యకాఁడొ యంతగాఁడొ నృపుడు। 4-203

శత్రువుపట్ల (వైరి పట్టునన్) రాజుగారు ఏనాడూ ప్రతిజ్ఞలు చెయ్య కూడదు ఫలానా రోజులోగా వాణ్ణి చంపుతాను, వీడి రాజ్యం ఆక్రమిస్తాను ఇలాంటి ప్రతిజ్ఞలు చెయ్యకూడదు ఎందుకంటే అనుకున్న సమయంలో దండయాత్ర వెళ్ల డానికి(దండు వెడలన్) తీరుతుంది తీరదు కుదురుతుంది కుదరదు ఒక్కొక్కసారి ఉండీ ఉండీ ఎప్పటికో (కాలాంతరమునన్) అనుకూల సమయం కుదురుతుంది కాబట్టి ముందే ప్రతిజ్ఞలు చేసి కూచుంటే ఎలా. రాజుగారంటే కార్యసాధకుడా లేకపోతే కలహప్రియుడా (అంకగాఁడో)

కార్యసాధకుడుగా ఉండాలే తప్ప కలహప్రియుడు కాకూడదని దండ యాత్రకు వెళ్లాం అంటే విజయం వరించి తీరాలి. అలా అన్నీ చూసుకుని బయలు దేరాలి అప్పటివరకూ వేచి ఉండాలి అంతేకానీ ముందుకు ముందు ప్రతిజ్ఞ చేసేసి దానికోసమని బయలుదేరేసి అక్కడికి వెళ్లి ఇబ్బందుల్లో ఇరుక్కుపోవడం ఓడిపోవ డం, తెలివైనవాడు చెయ్యవలసిన పనికాదు

పోరానిపట్ల బోడుచుట
వైరి బలము తిరుగ జయమొ స్వర్గమొ యగు. నా
నారూప యంత్ర శస్త్రా
కారాదులపట్ల బ్రజకె కవియింపదగున్ 4-204

ఎటు పారిపోవడానికీ దారిలేని చోట (పోరాని పట్లన్) పట్టు కుని పొడవడం మొదలుపెడితే శత్రు సైన్యం అగతికంగా తిరగబడుతుంది తెగించి యుద్ధం చేస్తుంది అప్పుడు విజయమో వీర స్వర్గమో తేలిపోతుంది. (అగున్)

జయాపజయాలకు అవకాశాలు సమానం కనక, అటువంటి పరిస్థితుల్లోకి శత్రువుని నెట్టి యుద్ధం ప్రకటించకూడదు అని కావచ్చు (వావిళ్ళవారి వ్యాఖ్య) లేదా యుద్ధం ఏళ్ళ తరబడి కొనసాగకుండా పెందరాళే తెమిలిపోతుంది కనక అదే మంచి దనీ కావచ్చు (జయాపజ యాలలాగానే దీన్నీ అనిశ్చితంగా వదిలేసాడు)

శత్రుసైన్యంలోగానీ, శత్రు ప్రాకారాల మీద గానీ (కోటగోడలు) రకరకాల మారణ యంత్రాలూ శతఘ్నులూ రాళ్ళుదొర్లించే ఉపల యంత్రాలూ మొదలైనవి ఉంటాయి వాటిని ఎదుర్కొనడానికి రాజుగారు వెళ్ళకూడదు. సైనిక ప్రజనే తలపడ మని పంపాలి (ప్రజనె కవియింప దగున్ కవియుట=తలపడుట)

సైన్యం ఎంత పోయినా రాజుగారు లొంగనంతవరకూ రాజ్యం లొంగనట్లే రాజు లొంగిపోతే సైన్యం ఎంత మిగిలినా ఓడిపోయినట్లే అందుకని కాబోలు ఈ మాట చెప్పాడు.

మనమున కొండు రెండుమఱు మంత్రములన్ సరిపోవ జెప్పినన్
జనపతు లాతనిం బిలువసాగుదు, రా గతి సారె బిల్చు న
జ్ఞనపతు లాతనిం బిలువసాగుదు, రా గతి సారె బిల్చు న
చ్చనవునతే ధనాది గొని సంగతి కానివి త్రొవ్వి చేయజె
ప్పు నృపతి తద్బహిశ్చరితముం జరువే బరికింపగా దగున్ 4-265

(సరిపోవన్) ఒకటి తమ మనసుకు (మనమునకు)సరిపోయేటట్టుగా రెండుసార్లు ఆలోచనలు(మంత్రములన్) చెప్పినవాడిని రాజులు పదేపదే పిలుస్తూ ఉంటారు (పిలువసాగుదురు) వాడు చెప్పే ఆలోచనలు స్వీకరిస్తూ ఉంటారు ఇది సహజం. అయితే అలా రాజుగారు మాటిమాటికీ పిలుస్తున్న చనువుతో (సారెన్ పిల్చు ఆ చనవునకున్) త్రొవ్వెక్కి వాడేమి చేస్తాడంటే- ఇతరులనుంచి డబ్బూ దస్కం లంచం గా తీసుకుని (ధనాదిన్ కొని), అనుచితాలైన కొన్ని పనులు చేయమని రాజుగారికి సలహా చెబుతాడు లంచం ఇచ్చినవాళ్ళకి కలిసివచ్చే పనులు అవి. సంగతం కానివి అయినా చెయ్యమని రాజుగారికి సలహాలు ఇస్తాడు రాజుగారు అనాలోచితంగా నమ్మి చేసేస్తే అప్రతిష్ఠ అవి కానిపను లాయె

అందుకని అటువంటివాడి బహిశ్చరితమేమిటో,తన కొల్వు నుంచి బైటకు వెళ్ళాక వాడి ప్రవర్తన ఎలాంటిదో, చారుల ద్వారా(చరుచేన్) రాజు తెలుసుకోవాలి నిఘా వేసి ఉంచాలని(పరికింపగా దగున్)

ఒండురెండు -మఱు మంత్రములన్- అని విభజించింది సంజీవనీ వ్యాఖ్య రహస్యాలోచనలు అని అర్థం చెప్పింది. అచ్చనవున కీ ధనాది గొని అనే పాఠం స్వీకరిం చింది ఆ చనవునకున్+ ఈన్+ ధనాదిన్+ కొని -అని అన్వయం ఈన్ అంటే ఇతరు లు ఇవ్వగా ధనాదికం స్వీకరించి అని అర్థం. (సంగతికాదు. సంగతికానివి=స్నేహి తునివి అని కూడా)

గడివాడు చెడునయే దగు
తెడ జేయుట, పెడర యేని తెల్పియె తగు . ఖై

గడివా డే పనికగు దన
గడివా డరియైన ? దనకె గడి కావబడున్ 4-206

సరిహద్దు దేశంవాడు చెడేట్టయితే చెడగొట్టడమే మంచిది వాడంతట వాడే కానీ నీవల్ల కానీ నాశనమయ్యేట్టు ఉంటే నాశనం కాని వ్వడమే తగున్ చెడడయేని చెలిమి చేసుకోవడం మంచిది

నీ సరిహద్దువాడు (తన గడివాడు) నీకు శత్రువైతే ఆపై గడివాడు అంటే -వాడి అవతలి సరిహద్దువాడు నీకు ఏమి పనికివస్తాడు వాడితో నీకు ఏమీ పనిలేదు. నీ సరిహద్దుని కాపలా కాసుకోవడమే (తన గడికా వన్) నీకు సరిపోతుంది ఆ పనే నీకు పడుతుంది-(పడున్)

తన గడివా డరియైనన్ పై గడివాడే -పనికి అగున్అని అన్వయించారు సంజీవనీ వ్యాఖ్యలో నీ సరిహద్దుదేశంవాడు నీకు శత్రువైతే వాడి అవతలి సరిహద్దు దేశంవాడే నీకు పనికి వస్తాడు. అవతలివాడితో నువ్వు మైత్రి చేసుకుంటే నీకు శత్రువైన నీ గడివాడు నీ మిత్రుడికి కూడా శత్రువు అవుతాడు కనక వాడూ వాడూ జగడమాడు కుంటూంటే నీ సరిహద్దు రక్షింపబడుతుంది (కావబడున్) నీ గడివాడు నీకు కల్పిం చే ఇబ్బందులన్నీ వాడికి నీ మిత్రుని ద్వారా కల్పించవచ్చునని

మనకు ఒకడు శత్రువు ఆ శత్రువుకి మరొకడు మిత్రుడు ఆ మిత్రుడుకూడా మనకు శత్రువే అరిమిత్రుడు శత్రువు (అరేఃమిత్రమ్- అరిః) అరిమిత్రుడి మిత్రుడూ శత్రువే (తథారిమిత్ర మిత్రం చ)

మనకు ఒకడు మిత్రుడు ఆ మిత్రుడికి మరొక మిత్రుడు ఆ మిత్రుడుకూడా మనకు మిత్రుడే మిత్రమిత్రుడు మిత్రుడు (మిత్రం+ మిత్ర మిత్ర మతః పరమ్)

అలాగే మిత్ర శత్రువు మనకూ శత్రువే ఈ విషయాలు చేప్పే కామందక శ్లోకాన్ని సంజీవనీవ్యాఖ్యాత ఉదాహరించారు

అరిర్మిత్రమరేః, మిత్రం మిత్రమిత్ర మతః పరం
తథారిమిత్రమిత్రం చ విజిగీషోః పురః స్థితాః

ఇక్కడికి ఈ ప్రసంగం విడిచిపెట్టి మళ్ళీ గ్రంధంలోకి వస్తే-శత్రుకాంతలపట్ల వ్యవహరించవలసిన తీరు చెబుతున్నాడు యామునాచార్యుడు

రాష్ట్ర మెరియింపు, కొనుము దుర్గములు, తదవ
రోధ మగుపడ్డ బుట్టింటి రూఢి నెఱపు,
పరుసములు తద్రిపుల రాయబారు లెదుట
బలుకకుము, సంధి యొకవేళ వలసియుండు 4-207

నీ శత్రురాష్ట్రాలను(గడిదేశాలు) తగలబెట్టు (ఎరియింపుము) వాళ్ళ దుర్గాలను చుట్టుముట్టు. ఆక్రమించు. ఏమయినా చెయ్యి కానీ ఆ శత్రువుల అంతః పురం కనపడితే మాత్రం (తత్+ అవరోధము+ అగుపడ్డన్) పుట్టింటి పద్ధతి నడిపించు పుట్టింట్లో స్త్రీలకు ఎలాంటి గౌరవ మర్యాదలు దక్కుతాయో అంతటి మన్ననా మర్యాదా

చూపించు సొంత తోబుట్టువులుగా గౌరవించు

అవరోధము అంటే అంతఃపురం ఇక్కడ లక్షణావృత్తిని బట్టి అవరోధంలోనే ఎల్లప్పుడూ ఉండే కాంతలు అంతఃపురకాంతలని అర్థం

ఆ శత్రురాజులనుంచి రాయబారులు వస్తే ఎన్నడూ నిష్ఠురాలు పలకకు (పరుసములు=పరుషమైన వాక్కులు ఇక్కడ విశేషణం విశేష్యానికి ఉపలక్షకం) ఎందుకంటే ఒకవేళ సంధి చేసుకోవలసి రావచ్చు. యుద్ధంలో నీదే పై చెయ్యిగా ఉన్నా అనుకోని బంధుత్వాలో అనురాగాలో, ఆత్మీయతలో, మరోటో మరోటో ఎదురై ఆ సింహాసనాన్ని మళ్ళీ ఆ రాజుకే ఇచ్చి, నీకు సామంతుడుగానో మిత్రుడుగానో, బంధువుగానో పొత్తు కుదుర్చుకోవలసిన అవసరం ఏర్పడవచ్చు, లేదా వాడి మిత్రుడు మరోవైపు నుంచి నిన్ను ఇరుకున పెడితే, అప్పడు సంధి తప్పకపోవచ్చు, అంచేత రాయబారుల దగ్గర పరుషాలు పలికి శాశ్వతంగా చెడనాడుకోకు - అని ఉపదేశం.

అంతఃపురం గురించి ప్రస్తావించి ఈ మాట చెబుతున్నాడంటే రాకుమారి వలచి వరించడం, చిలకను రాయబారం పంపడం ఆ పైని తన తండ్రికి రాజ్యం ఇప్పించడం- ఈ కథలు గుర్తుకు రాక మానవు

అభిచారి ఘనగరాంబుదూషిత రుగ్ని
రంతరాద్రిగహన దంతురోగ్ర
కీకటోర్వి మేరు గిరిసమార్థము వచ్చు 4-268
నేని జొరకు, పంపె యిడుము కొనగ

రాజుగారు తానుగా వెళ్ళకూడని చోట్లు కొన్ని ఉన్నాయి వాటిని చెబుతున్నాడు ఇందులో

అభిచారం- అభిచారి అంటే చేతబడులు అవి చేసేవాళ్ళు ఉన్న దేశాలకు పాలకులు వెళ్ళకూడదు. అలాగే కొందరు కొన్ని ఊళ్ళలో తాగునీటిని విషసిక్తం చేస్తారు గరము-గరళముతో నీరు (అంబువు) దూషితం అవుతుంది కొన్ని ప్రాంతాల్లో నిరంతరం ఏవేవో రోగాలు (రుజ్-రుగ్+నిరంతర) ఉంటూనే ఉంటాయి ఇలాగే పర్వతాలూ గాఢారణ్యాలు (గహన) నిండిన ప్రదేశాలుంటాయి క్రూరులైన మ్లేచ్ఛులు (ఉగ్ర+ కీకట+ ఉర్వి) ఉండే భూభాగాలుంటాయి మేరు పర్వతమంత ధనం దొరుకుతుందన్నా సరే ఇటువంటి ప్రదేశాలకు (చొరకుము) రాజు ప్రవేశించకూడదు ఏమి చెయ్యాలి? వాటిని స్వాధీనం చేసుకోవడానికి (కొనగన్) ఒక సైన్యభాగాన్ని (పంపె) పంపించు (ఇడుము) అని రాజులకి సలహా చెబుతున్నాడు

రాజింప బల్మి తన పని
జాణై కొను, గొలుచు సంతసపు దటి, దొలగుం
ద్రాణ చెడ -గపటి మానిసి, 269
నాణె మెఱుగ బిచ్చు గాగ నరపతికి దగున్

మొదటి మూడు పాదాలకూ ''కపటి మానిసి' కర్త మోసగాడు ఇంపుగా పలికి చతురుడై (జాణ అయి) తన పని నెరవేర్చుకుంటాడు (కొనున్) రాజుగారు

ఉల్లాసంగా ఉన్న సమయంలో (సంతసపు తలిన్) వచ్చి సేవిస్తాడు నీరసంగా దిగులుగా (త్రాణ చెడన్) ఉన్నారని తెలిస్తే దరిదాపుల కి రాకండా తొలగిపోతాడు మనుషులు ఇలా ఉంటారు వీళ్ళ నాణెం (మంచి చెడ్డలూ మన్నిక) తెలుసుకోవాలంటే రాజుగారు కోమటిలా (బచ్చు గాగన్) వ్యవహరించాలి.

ఒక వస్తువుకి వెల కట్టాలంటే వ్యాపారి ఎన్ని పరీక్షలు చేస్తాడో, ఎన్ని ఆరాలు తీస్తాడో, అలాగ రాజుగారుకూడా మనుషుల్ని తూచాలని తాత్పర్యం . అప్పడుగానీ దగ్గరకి చేరనివ్వకూడదు

రాజుగారు దేశాన్నిమాత్రమే కాదు దేహాన్నికూడా శ్రద్ధగా చూసుకోవాలి. సంరక్షణ చేసుకోవాలి ఆయుర్దాయాన్ని పెంపొందించుకోవాలి సాంగరాజ్యం-సప్తాంగాలతో కూడిన రాజ్యం ఒక ఎత్తుగా స్వాంగరాజ్యం (స్వ+ అంగరాజ్యం)తన శరీర సామ్రాజ్యం మరొక ఎత్తుగా చూసుకుం టూ మెలగాలి(ఎసగ వలయు). ఈ రెండింటికీ కలిసి వచ్చేటట్టు శ్లేషతో చెబుతున్నాడు -

తద్‌జ్ఞ మండలి గూర్చి, ధాతువుల్ దెలిసి, హే
మాదులి గొని, ప్రకృత్యనుగుణాల్ప
జీవనాహృతులచే జెలగి, మహా బలో
ద్రేకంబు మర్దన రిక్తజేసి,
స్నేహార్ద్రు డగుచు నశేషంబు బోషించి,
నరవర్గముల తప్పసరణు లుడిపి,
సతత ద్విజ ప్రతిష్ఠాశాలియై బలి
యించు పట్లు బలియించి, పలుచ
జేయు పట్లు పలుచగా జేసి, తేజ
మెసగ శోధన మలవర యెసగ వలయు.
సాంగరాజ్య మొకయెత్తుగ -స్వాంగరాజ్య
మొక్క యెత్తుగ నృపతి యాయుష్యపరత 4-270

ముందు సాంగరాజ్యపరంగా చూసి తరవాత స్వాంగ రాజ్యపరంగా చూద్దాం

బంగారమూ రత్నాలూ ఇలాంటి విలువైన వస్తువులు కొనేటప్పుడు రాజుగారు వాటి మంచి చెడ్డలు గుర్తించగల నేర్పరుల్ని(తద్‌జ్ఞ మండలి) సమావేశపరచాలి. వాళ్ళు ఆ వస్తువుల్లో ఉండే ధాతువులు (మౌలిక లక్షణాలు) నాణెం చూసి కొనవచ్చునని తీర్మానిస్తే అప్పడు కొనాలి.

ప్రకృతి అంటే ప్రజలు వారికి అనుకూలంగా ఉండేటట్టు అల్పమైన పన్నులు విధించి వసూలు చెయ్యాలి (జీవన+ ఆహృతి=ధన+ ఆహ రణం) ప్రజలకు భారమయ్యేలా విధించి ధనరూపంగా పన్నులు వసూలు చేయకూడదని

మహాబలవంతులైన శత్రువుల ఔద్ధత్యాన్ని(మహాబల+ఉద్రేకంబు) మర్దించడం ద్వారా వ్యర్థపరచాలి (రిక్తన్ చేసి) అలాంటి శత్రువుల్ని నిర్దయ గా మర్దించాలని

ఉద్యోగులు, సామంతులు ప్రజలు, పండితులు, కళాకారులు ఇలా అశేషాన్ని (అశేషంబున్)స్నేహభావంవల్ల కలిగిన ఆర్ద్రతతో పోషించాలి.

నరజాతిలో నాలుగు వర్ణాలవారూ ఉన్నారు ఎవరి ధర్మాలు వారికి ఉన్నాయి అవి అపమార్గాల్లో(తప్పసరణులు)ప్రయాణించకుండా జాగ్రత్త తీసుకోవాలి తప్పుల్ని తొలగించి (ఉడిపి) వర్ణాశ్రమ ధర్మాల్ని కాపాడాలని

ఎల్లప్పడూ ద్విజులకు (ఉపనయన సంస్కారం కలవారు ఉప నయనం రెండవ జన్మగా లెఖ్ఖ. అందుకని వారు ద్విజులు) ప్రతిష్ఠ కలిగించాలి వారి భద్రత స్థిరత గౌరవం దీక్షగా కాపాడాలని

ఏవి బలపడాలో (దుర్గ కోశ సైన్యాదులు) వాటిని బలపరుస్తూ, ఏవి పల్చబడాలో వాటిని (బహిరంతశ్శత్రువులు, నడిమి అడవులు వగైరా) పల్చబరుస్తూ, తన ప్రతాపాన్ని(తేజము ఎసగన్)పెంపొందించుకోవాలి. శోధన ఎప్పడూ మరవ కూడదు చారులతో తలారులతో శత్రుశోధన చేయిస్తూనే ఉండాలి అందరిమీదా నిఘాలు వేసి అప్రమత్తంగా (మర వక) తనిఖీలు(శోధన) జరుపుతూనే ఉండాలి

ఇలాగ సాంగరాజ్యాన్ని చూసుకోవాలి. ఇంక స్వాంగరాజ్యాన్ని ఎలా సంరక్షించుకోవాలంటే- తద్‌జ్ఞ మండలిని (వైద్య బృందం) సమకూర్చుకుని పరీక్షలు జరిపించుకుంటూ, ఎప్పటికప్పడు శరీరంలో ధాతు పుష్టిని (జీవధాతువులు) తెలుసుకుంటూ ఉండాలి వాళ్ళ సలహాప్రకారం అవసరాన్ని బట్టి, తగిన మోతాదుల్లో సువర్ణ భస్మం, రజత భస్మం, వంగ భస్మం, ఇలాంటివి కలిసిన ఔషధాల్ని పుచ్చుకోవాలి (హేమాదులన్ కొని).

శరీర తత్త్వానికి అనుగుణంగా(ప్రకృతి+ అనుగుణ) అల్ప పరిమాణాల్లో- మితంగా- అన్నోదకాలు(జీవన+ ఆహృతులు) స్వీకరించాలి. మితాహారం మంచిదని. తత్త్వానికి సరిపడే ఆహారమే తీసుకోవాలని ప్రకృతి+ అనుగుణంగా అనడంవల్ల ఆయా ఋతువులకి అనుగుణంగా ఆహార పదార్థాలు భుజించాలని కూడా.

మహాబలుడు అంటే వాయుదేవుడు వాయువుకి ఉన్నంత బలం మరి దేనికీ లేదు శరీరంలో వాయుప్రకోపం కనకవస్తే దాన్ని మర్దనలతో -(రిత్తచేసి) ఉపశమింపజేసుకోవాలి. కొన్నిరకాల మర్దనలు వాయుప్రకోపాన్ని తగ్గిస్తాయని శాస్త్రం చెబుతోంది.

స్నేహమంటే నూనె (జిడ్డు)-అని కూడా అర్థం. అప్పడప్పడూ ఒళ్ళంతా అశేషంగా నూనె పులుముకుని ఆర్ద్రంగా ఉంచుకోవాలి నిత్యం నూనె పులుముకుని అభ్యంగన స్నానం చేస్తే ఆయుర్దాయం పెరుగుతుందంటారు చర్మం మృదువుగా స్నిగ్ధంగా కాంతిమంతంగా ఉంటుంది.

'నర' అనేది స్వాంగరాజ్యార్థంలో అచ్చతెనుగు పదం. దేశ్యం ముసలితనంవల్ల వెంట్రుకలు తెల్లబడటాన్ని 'నర' అంటారు తెల్ల వెంట్రుకనే పలితకేశం అనికూడా అంటారు. వాటిని తొలగించుకోవాలిట (ఉడిపి) మీసాల్లోగానీ జుట్టులో

గాలీ చెదురుమదురుగా వెంట్రుకలు తెల్లబడితే వాటిని ఉడపాలి రాజుగారు అప్పడే ముసలివాడయిపోతున్నాడు అనే భావం ప్రజలకి కలగకూడదని కాబోలు

అలాగే వర్ణముల తప్పసరణుల్నికూడా తగ్గించుకోవాలిట శరీరావయవాల రంగులు కాంతి తప్పకుండా శ్రద్ధ వహించాలని నల్లబడటం, పాలిపోవడం పొడలు రావడం ఇటువంటివి జరగకుండా చూసుకోవాలి చర్మరోగాలు కావచ్చు సాధారణంగా ఇవి దీర్ఘకాలికాలు మరింకేవయినా కావచ్చు, మితిమీరిన భోగానుభవంవల్ల శరీరం మీద పొడలు రావచ్చు ఇలా రంగుమారే ప్రమాదాల్ని అరికట్టాలని ఆహార విహారాల్లో మితంగా కన్నెరిగి ఉండమని ఉపదేశ సారాంశం

ద్విజము అంటే రెండు పుట్టుకలు కలది అని దంతాలు ద్విజాలు మొదట వచ్చిన పాలపళ్ళు ఊడిపోయి రెండవసారి వచ్చిన దంతాలు చివర దాకా ఉంటాయి కాబట్టి రెండు పుట్టుకలు ఉన్నట్టు లెక్క అందుకని ద్విజ ము అంటే దంతమని అర్థం ఏర్పడింది

రాజుగారు ఎల్లప్పుడూ దంతాల ప్రతిష్ఠని కాపాడుకోవాలి అంటే అవి కదిలి ఊడిపోకుండా జాగ్రత్త పడాలి ఊడిపోతే బంగారపు పన్ను ఉండనే ఉంది

శరీరంలో కండలు తిరిగి దృఢంగా బలపడవలసిన భాగాలను (రొమ్ము జబ్బలు పిక్కలు ఇత్యాదులు) బలపరుస్తూ పల్చబడాల్సిన భాగాలను (మెడ పొట్ట నడుం) పల్చబరుస్తూ తేజస్సుని పెంపొందించుకోవాలి ఇంద్రియ పటుత్వం పెరిగేట్టు చూసుకోవాలి

శోధన మరిచిపోకూడదు ఇది యోగవిద్యలో ఒక ప్రక్రియ. శ్వాసకోశాన్నీ జీర్ణకోశాన్నీ శుద్ధిపరిచే పద్ధతి ఆసనాదియోగ ప్రక్రియలకు అన్నింటికీ ఇది ఉపలక్షణం వాటిని ఏనాడూ మరిచిపోకుండా ఆచరించమని

ఇలాగ రాజుగారు ఆయుష్మపరుడై స్వాంగరాజ్యాన్ని - శరీరాన్ని సంరక్షించుకోవాలి సాంగరాజ్యం స్వాంగరాజ్యం రెండింటి పట్ల సమానం గా శ్రద్ధవహించాలి

ఈ పద్యంలో అంతటా సంస్కృతశ్లేష ఉంది ఒకే సంస్కృత పదానికి రెండేసి అర్థాలు ఉండటంతో కుదిరింది నర వర్ణములు' దగ్గర మాత్రం దేశపరంగా మానవార్థంలో నరశబ్దం సంస్కృతం దేహపరంగా పలితార్థంలో అచ్చికం- దీన్ని సంస్కృతాంధ్ర శ్లేష అనిగానీ సంస్కృతాచ్ఛిక శ్లేష అని గానీ అంటారు మొదటి అర్థంలో 'నర వర్ణములు' అంతా ఒకే పదం సిద్ధ సాంస్కృతిక సమాసం రెండవ అర్థంలో నరన్ ఉడిపి వర్ణముల తప్పసరణులు ఉడిపి అని విడివిడిగా అన్వయించాయి కనక నరన్ అనేది వ్యస్త పదం స్థిరాక్షరం (వ) పరంగా ఉంది కాబట్టి ద్రుతం (న్) లోపించింది

ఇన్ని పనులూ ఇన్ని బాధ్యతలూ క్రమం తప్పకుండా నిర్వహించాలంటే రాజుగారు సమయాన్నిఎలా కేటాయించుకోవాలో ఎప్పుడు ఏ పని చెయ్యాలో స్థూలంగా సూచిస్తున్నాడు -

సౌఖశాయనిక భిషక్పూర్వకము కాల్య
వేళ గార్తాంతిక ద్విజుల గోష్ఠి
జాముపోవ నమాత్య సామంత పూర్వకం
బర్థార్జనస్థ కాయస్థ గోష్ఠి
దిన మధ్యమమున మర్దన మల్ల పూర్వకం
బుగ సూదసూపకృన్మృగయు గోష్ఠి
యపరాహ్ణమున దేవతార్చన పూర్వకం
బార్య ధర్మాధికృద్భృతుల గోష్ఠి
భుక్తి మీద విదూషక పూర్వకము పు
రాణ కవి గోష్ఠి, చార పూర్వకము సంజ
జాము గాయక గోష్ఠి, నిశన్ సుషుప్తి
పూర్వకము ప్రేయసీగోష్ఠి పొసగు బతికి (4-271)

కాల్యవేళ అంటే ప్రాత: కాలం సూర్యోదయానికి ముందు తెల్లవారు జామునే నిద్ర లేవాలి రాజుగారు నిద్రలేచిన వెంటనే ''మహారాజా రాత్రి నిద్ర బాగా పట్టిందా?' అని అడగడానికి కొందరుంటారు వాళ్ళని సౌఖశాయనికులు అంటారు (సుఖ శయనం పృచ్ఛతి ఇతి-సౌఖశాయ నిక:) ఒక్కొక్కసారి వాళ్ళే నిద్రలేపుతారు లేపి 'సుఖ శయనమా?'' అని అడుగుతారు అంతే వాళ్ళ ఉద్యోగం వెళ్ళిపోతారు ఆ వెంటనే వైద్యులు (భిషక్కులు) వస్తారు కుశలం కనుక్కుంటారు ఇబ్బందులేమయినా ఉంటే చెప్పడం వైద్యుల సలహాలు తీసుకోవడం ఆ రోజుకి ఆహార విహారాలకు సంబం ధించి విధి నిషేధాలు వారు చెప్పి వెడతారు తరవాత కార్తాన్తిక ద్విజులు వస్తారు జ్యోతిశ్శాస్త్ర పండితులు ఆ రోజు మంచి చెడ్డలూ ప్రత్యేకతలూ తిథివార నక్షత్రాలూ దుర్ముహూర్తాలు ఇవన్నీ వారు చెబుతారు దాని ప్రకారం పనులు ప్రారంభించడం ముగించడం ఇత్యాదులన్నీ నడుపుకోవాలి

ఇలా సౌఖ శాయనిక భిషక్కులతో ప్రారంభించి ప్రాత:కాలంలో కార్తాంతిక ద్విజులగోష్ఠిని నడపాలి గోష్ఠి నడపడమంటే సంభాషించడం చర్చించడం

జాము గడిచాక (జాము+పోవన్ జాము - అంటే నాలుగు గంటలు మూడుగంటలే అని కొందరు) అంటే తొమ్మిది గంటల ప్రాంతంలో అమాత్యులతో సామంతులతో ప్రారంభించి కరణాలూ మునసబులతో గోష్ఠి జరపాలి ముందు అమాత్యులతో తరువాత సామంతులతో అటుపైని అర్థార్జనస్థులతో ఆ తరవాత కాయస్థులతో సంభాషించాలని. (అర్థ+ ఆర్జన స్థులు=పన్నులు వసూలు చేసేవారు) గ్రామ పరిపాలనలో ఆర్థిక వ్యవహా రాలను ఒకరు చూస్తే రక్షణాది వ్యవహారాలను కాయస్థులు చూస్తారు. ఇదీ అప్పటి ఏర్పాటు

పన్నెండు గంటలవేళ (దినమధ్యమమునన్) ఒళ్ళు పట్టే వాళ్ళతో కుస్తీలు పట్టేవాళ్ళతో (మల్లయుద్ధ ప్రవీణులు) కొంతసేపు గడపాలి వాయు దోష శాంతికోసం

మర్దన వ్యాయామంకోసం మల్లురు. ఈ తరువాత వంటవాళ్లతో (సూదకులు) పప్పుకూరలవాళ్లతో(సూపం=పప్పు సూప కృత్=పప్పు చేసేవాడు) వేటగాళ్లతో (మృగయుడు) మరికొంత సమయం గడపాలి ఏమేమి వండుతున్నారో తెలుసుకోవడం ఏమేమి కావాలో చెప్పడం ఇది కాబోలు ఇక్కడ మృగయుడు అంటే వేట మాంసం తెచ్చి ఇచ్చేవాడని చెప్పకోవాలి

రెండు గంటల సమయంలో (అపరాహ్ణం) దేవతార్చన చేసి- పూజ్యులతో(ఆర్య) ధర్మాధికారులతో (ధర్మకృత్) యతులతో గోష్ఠి జరపాలి

దేవతార్చన అంటే దేవతను అర్చించడం కానీ ఇప్పేళ అది భోజనానికి పర్యాయపదం అయ్యింది నైవేద్యం పెట్టి భుజించడమని

భోజనం అయ్యాక విదూషకుడితో (ఆస్థాన హాస్యగాడు- నర్మ సచివుడు) కాసేపు సరస సల్లాపాలు చెయ్యాలి అది అయ్యాక పురాణ గోష్ఠి ఈ తరువాత కవిగోష్ఠి నిర్వహించాలి ఈ గోష్ఠుల్లో విదూషకుడు కూడా కూడా ఉంటాడనికూడా ''విదూషక పూర్వకము పురాణ కవి గోష్ఠి''

సంధ్యా సమయంలో (సంజజాము=పగటికి చివరి జాము) గూఢ చారుల తో సమావేశం జరపాలి అటుపైని గాయక గోష్ఠి సంజ జామును చారులతో ప్రారంభించి (చారపూర్వకము) నృత్యగానా స్వాదనంతో ముగించాలని

ఇక రాత్రిపూట-సుషుప్తి సుఖంగా గాఢంగా నిద్రపోవడం ముందు వెనుకల వివరాలకేమిగానీ- దీనికి అనువుగా ప్రేయసీ గోష్ఠి

ఇలా పద్ధతిగా రోజుని విభజించుకుని క్రమం తప్పకుండా యథావిధిగా అన్నీ నిర్వర్తించడం సముచితం పొసగున్ అని సూచన.

హితులు హితాహితులు సదా
హితులునునై రాజునెడల, నిటు త్రివిధమునన్
క్షితి ననుచరు లుందురు సం
తతమున్, మఱి వారి దెల్పెదన్ విను మనఘా! 4-272

ఈ భూమి మీద (క్షితిన్) రాజుగారికి అనుచరులు మూడు విధాలవాళ్ళు ఉంటారుట కొందరు అనుచరులు కేవలం హితులు. కొందరు సదా అహితులు మరి కొందరు హితాహితులు ఈ మూడు తెగలూ ఎల్లప్పుడూ (సంతతమున్) ఉండేవే వాళ్ళగురించి చెబుతాను వినవయ్యా పుణ్యాత్ముడా అంటున్నాడు యామునాచార్యుడు. (అనఘా అనేది పాఠకుడికి రాయలవారి సంబోధన)

హితులు భిషగ్ గ్రహజ్ఞ బుధబృంద కవీంద్ర పురోహితుల్, హితా
హితులు ధనార్జనాది నృపకృత్యనియుక్తులు, వెండి కేవలా
హితులు దశావశార్జిత సమృద్ధ రమాభరణేప్సు, లౌట, నా
హితమును నల్లికా జతురవృత్తి జరించుట నీతి జేనికిన్ 4-273

వైద్యులు జ్యోతిష్కులు(గ్రహజ్ఞులు)పండితబృందం కవీంద్రులు, పురోహితులు వీళ్ళు హితవర్గం కేవలం హితులు

దనార్జన-పన్నులు వసూలు చెయ్యడం-మొదలైన రాజకార్యాల్లో నియుక్తు లైనవాళ్ళు(దొరలు) హితాహితులు వసూళ్ళు చేసి కోశాన్ని వృద్ధి పరుస్తున్నారు కాబట్టి హితులు వసూళ్ళలో కొంత కాజేసే అవకాశం లేకపోలేదు కాబట్టి అహితులు వసూళ్ళ లో కలినంగా వ్యవహరించి రాజుకి అపకీర్తి తేవచ్చు గాబట్టి అహితులు ఏమైనా వీళ్ళు ఒక రకంగా హితులు, ఒక్కొక్కప్పుడు అహితులు

తరువాత(రెండి) కేవలం అహితులు ఎవరంటే- దశ బాగోక, తమ దుర్దశా వశంగా ఒకప్పుడు రాజుకి సమృద్ధ సంపదల్ని సమర్పించిన వాళ్ళుంటారే,వాళ్ళు ఆ సమృద్ధసంపదల్ని మళ్ళీ తిరిగి పొందాలని చూస్తూ ఉంటారు కాబట్టి వీళ్ళు కేవలం అహితులు అర్పిత సమృద్ధరమను రాబట్టు కోవడానికి ఎల్లవేళలా కోరుతూ ఉంటారు కనక అందుకు అనువుగా రాజుగారిని బలహీన పరచడానికీ దెబ్బతియ్యడానికీ పన్నాగాలు పన్నుతూ ఉంటారు ప్రయత్నాలు చేస్తూ ఉంటారు వీళ్ళు అహితులు కారా మరి

ఇలా మూడు రకాలవాళ్ళు ఉంటారు అంచేత (అవుటన్-ఔటన్) వాళ్ళ పట్ల అదే రకమైన హితం చూపిస్తూ (ఆ హితమును అట్లకాన్) చాతుర్యంతో ప్రవర్తిం చడం (చతురవృత్తి చరించుట) రాజుగారికి (ఔనికిన్) నీతి. హితులపట్ల హితుడుగా హితాహితులపట్ల హితాహితుడుగా (హితా నికి హితమూ, అహితానికి అహితమూ ప్రతిఫలంగా ఇస్తూ,) అహితుల పట్ల అహితుడుగా, జాణతనంతో ప్రవర్తించడం రాజనీతి

పాత్రభూతు లెన్న బరికించి యత డడు
గకయు నొకడు చెప్పకయు మునుపుగ
బనసపండ్లు దిగిన పరిగ- స్వప్నము గన్న
నెఱిగ నొసగి వెఱగుపఱచు టొప్ప'' 4-274

అర్హుడయినవాణ్ణి (పాత్రభూతున్) చక్క గా గమనించి అతడు అడగక ముందే మరొకరు చెప్పక ముందే (సిఫారసు చెయ్య కుండానే) నీ అంతట నువ్వే సత్కారం జరిపి లేదా కావలసిన సహాయం భారీగా అందించి అతన్ని ఆశ్చర్యపరచడం మంచిది (ఒప్పన్) ఇది ప్రజల్లో నీకు అభిమానాన్నీ మంచి పేరునీ తెచ్చి పెడుతుంది ఈ అందించడం ఎలా ఉండాలంటే-''పనసపండ్లు దిగిన పరిగన్ స్వప్నము గన్న నెఱిగన్'' ఉండాలి

నీ ఉద్యోగుల్లోగానీ ప్రజల్లోగానీ

పనసచెట్టుకి ఉన్నట్టుండి కాయలు దిగుతాయి-కాస్తాయి కాలం రాగానే హఠాత్తుగా నిండా కాయలే దిగుతాయి ఆ ముందరి అవస్థలు కంటికి కనపడవు అలాగ నీ సహాయం అందాలి అని కాదోలు . అందు కుంటున్నవ్యక్తి కలగంటున్న చందంగా ఆశ్చర్య పోవాలిట.

పితృ దేవ క్రియలను విధి
బితృ క్రియలే సూక్ష్మ లగుట బితృభక్తుడవై.

శ్రుతి శీల తపశ్శాంతా
చ్యుత భక్తుల కొసగి, పనుపు మున్నత గతికిన్ 4-275

పితృకార్యాలూ దేవకార్యాలలో పితృకార్యాలే ప్రధానమని శాస్త్ర (విధి) సూక్ష్మం వాటిని విధిగా ఆచరించమని ధర్మసూక్ష్మం కాబట్టి పితృభక్తుడవై ఉండు వేదవేత్తలూ శీల సంపన్నులూ తపస్వులూ శాంత స్వభావులూ అయిన విష్ణుభక్తులకు (అచ్యుత భక్తులు=వైష్ణవులు) దానధర్మాలు చేసి (ఒసగి) ఆ పితృదేవతల్ని ఉన్నతగతికి పంపించు (పనుపుము)

పితృదేవతల పేరు చెప్పి తిథినాడు దాన ధర్మాలు చేస్తే ఆ పితృ దేవతలకు ఊర్ధ్వలోకంలో సద్గతులు కలుగుతాయని ఆస్తికుల విశ్వాసం

తిథుల్లో బ్రాహ్మణార్థాలకు పట్టింపు ఎక్కువ మిగతా శుభకార్యాలకు ఎవరు ఎక్కడికి వచ్చినా పరవాలేదు గానీ తిథినాడు మాత్రం వైష్ణవులకు వైష్ణవులే స్మార్తులకు స్మార్తులే శైవులకు శైవులే భోక్తలుగా ఉండి తీరాలని నియమం వాటిలో శాఖాభేదాలనుకూడా కొందరు పట్టి చూస్తారు పాటిస్తారు ఇది దీని పద్ధతి అందుకని అచ్యుత భక్తులకు ఇమ్మని- యామునుడు గట్టిగా చెబుతున్నాడు రాయలవారూ వైష్ణవుడే కదా అంత మాత్రంచేత మత సామరస్యం లేదని తీర్మానించకూడదు

దానము ద్విజరక్షణకును
జ్ఞానము నిజ రక్షణకుగ , శరణము చొరు మెం
తే నారాయణు -''రాజ్యాం
తే నరకం ధ్రువ'' మటంట దీనినె యొంటన్ 4-276

రాజుగారు దానం చెయ్యడం ద్విజరక్షణకు జ్ఞానం పొందడం నిజ రక్షణకు. సదసద్వివేకమే జ్ఞానం అది మనశ్శాంతికి సోపానం అందువల్ల ఆత్మరక్షణ ఇది గ్రహించి శ్రీమన్నారాయణుణ్ణి పూర్తిగా (ఎంతేన్) శరణుపొందు దీర్ఘశరణాగతి ఒక్కటే తరణోపాయం ''రాజ్యాంతే నరకం ధ్రువమ్'' రాజ్యపరిపాలన ముగిసాక ఆ రాజుకి నరకలోక ప్రాప్తి తప్పదు పరిపాలనలో తెలిసోతెలియకో కొందరిని నొప్పించక తప్పదు హింసించక తప్పదు రాజ్యవిస్తరణ కోసం, రక్షణ కోసం జీవహింస జరుగుతుంది ఈ పాపాలన్నీ చుట్టుకుని రాజుగారు నరకానికే పోతాడు అని మరి దీన్ని తొలగించుకోడానికి శ్రీమన్నారాయణ శరణాగతి ఒక్కటే ఉపాయం. వేరొక దానితో (ఒంటన్) ఇది తీరుతుందా ? తీరదు

అలు పతిభక్తి, స్త్రీ పుంసపాళి వావి,
యతి వశిత్వము, దిగుజాతు లగ్రజాతి
ననుసరించుట, హితవృత్తి నధిపు జనికి
భృత్యు డొదవుట-నృపదండ భీతి జుమ్ము 4-277

కుమారా . ఒక్క మాటలో చెప్పాలంటే రాజదండనకు భయపడే లోకం ధర్మమార్గంలో నడుస్తోంది

భార్య తన భర్తపట్ల భక్తిగా ఉంటోందన్నా స్త్రీ పురుషుల మధ్య వావి వరసలు ఉంటున్నాయన్నా, యతీశ్వరులు నిగ్రహం పాటిస్తున్నారన్నా (వశిత్వము) నిమ్న జాతుల వారు అగ్రజాతులవారిని అనుసరిస్తున్నారన్నా అధికారి చెప్పిన పనికి (అధిపు పనికి) భృత్యుడు హిత ప్రవృత్తితో ఉపయోగపడుతున్నాడన్నా (ఒదవుట) ఇదంతా రాజదండన భీతితోనే సుమా భిన్నంగా ప్రవర్తిస్తే రాజుగారు దండిస్తారనే భయం ఉండబట్టే ఇదంతా పద్ధతిగా జరుగుతోంది లేకపోతే సమాజం అల్లకల్లోలం అయిపోతుంది అందుకని శుక్రనీతి సారాంశం చెప్పాడు- ఈ పద్యంలో (చూ 245 పద్యావతారిక)

చంపి ధార్మికుండు, సతి బొంది మఱి బ్రహ్మ
చారి, బొంకి సత్యశాలి, యార
గించి సదుపవాసి, కేడించి శూరుడు, 4-278
చింది ధనియు నగు విచిత్రసరణి

రాజధర్మం చాలా విచిత్రంగా ఉంటుంది పైకి చూడటానికి పరస్పర విరుద్ధంగా కనబడుతుంది రాజుగారు మనుషుల్ని చంపి ధార్మికు డవుతాడు-(శత్రుసంహరణ కీర్తికారణం) సతిని పొంది బ్రహ్మచారి అవుతాడు (రాజానో బహువల్లభాః అనేక భార్యలు ఉండవచ్చు కాబట్టి ప్రతి పెళ్ళికీ ఈయన బ్రహ్మచారే. అదీకాక ఋతుకాలాన్ని పాటిస్తే అందరూ బ్రహ్మచారులే) అసత్యాలు చెప్పీ సత్యసంధుడవుతాడు రహస్యగోపనం కోసంగానీ, సజ్జన రక్షణకోసంగానీ విదేశిరాయబారుల దగ్గరగానీ అసత్యాలు చెప్పినా రాజుగారు సత్యసంధులే హాయిగా ఆరగించి సదుపవాసి అవుతాడు దేశరక్షణకోసం శరీరపోషణ కోసం ఆహారస్వీకరణ ఆహారంపట్ల ఆస్థలేకుండా ఇనుమారు భుజించినా ఉపవాసం క్రిందే లెక్క (చూ అనంతామాత్యుడి భోజరాజీయం-వశిష్ఠాగస్త్యోపాఖ్యానం) యుద్ధం విరమించి రణరంగంనుంచి వెనుదిరిగినా (కేడించి) శూరుడే సంధికారణంగా శూరుడు అవుతాడని ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టి విరజిమ్మినా (చింది) ధనవంతుడే (చూ 282) ఇలా రాజ ధర్మమంతా విచిత్ర పద్ధతిగా ఉంటుంది నాయనా

ప్రణిధి-స్వపుర గృహియు, భాషావిదుడు, ప్రణి
ధ్యంతరావిదుండు నగు నతండు-
లింగమాత్ర కృశుడు, లిప్సాధిక ద్రవ్య 4-279
దాన ధనియు గాక, తఱియ కోరడు

ప్రణధి అంటే గూఢచారి వేగులవాడు ఇతడికి రాజధానిలో సొంత ఇల్లు ఉండాలి (స్వపుర గృహి). రాజు ఇవ్వాలి బహు భాషాకోవిదుడై ఉండాలి ఇతరదేశాల వేగుల్ని గుర్తించగలవాడై ఉండాలి.(ప్రణిధి+ అంత ర+ అవిదుడు అన్యుడైన ప్రణధి-ప్రణిధ్యంతరుడు) ఇలాంటి ప్రణిధి- లింగ మాత్ర కృశుడూ లిప్సాధిక ద్రవ్యదాన ధనియూ అవ్వాలి అంటే తన గుర్తింపుని (లింగము= చిహ్నం) తనంతతానుగా మరుగు పరచుకున్నవాడు కావాలి ఇరుగుపొరుగువాళ్ళకుకూడా అతడెవరో ఏమిటో తెలియ

కుండా బతకాలి అయితే రాజుగారు,అతడు కోరుకున్న దానికంటే అధికంగా (లిప్సా =కోరిక లిప్సాధిక) ద్రవ్యాన్ని ఇచ్చి ప్రణిధిని ధనవంతుణ్ని చెయ్యాలి అతడికి ఉన్న ఆ శక్తికీ ఆ త్యాగానికీ రాజుగారు ఈపాటి చెయ్యాలే తప్ప చెయ్యక పోతే ఆ ఉద్యోగానికి ఎప్పుడూ దరిదాపులకి రాదు (తరియన్ జొరదు)

తనుభృశ దమనజ సుకృతము
ధన దత్తినె కొనగవలయు, దత్త దృతుత మ
ర్దన మజ్జన భోజన లే
పన వసన ప్రసవ వహనపరతం బతికిన్ 4-280

రాజవిధులు నిర్వర్తిస్తూ కట్టకడపటికి తనువు చాలించిన రాజుగారు నరకానికి పోతాడా ? అదేమి న్యాయం ప్రజలకోసం పాటుపడిన వాడికి స్వర్గం దొరకదా ?మోక్షం రాదా? అంటే ఒక మార్గం చెబుతున్నాడు.

ఉపవాసాలు ఉండి, శరీరాన్ని కృశింపజేసి ఇంద్రియాలను లొంగదీసు కుని ఘోరతపస్సులు చెయ్యడానికి రాజుగారికి ఉండదు కానీ ఆ మార్గాలలో శరీరాన్ని బాగా (భృశము) కృశింపజేసుకున్నందువల్ల పుట్టే (దమనజ) సుకృతాన్ని రాజుగారు ధనదానంతోనే (దత్తి) సంపాదించుకోవాలి ఆశ్రమాలకూ దేవాలయనిర్మాణాలకూ విగ్రహ ప్రతిష్ఠలకూ యజ్ఞయాగాలకూ భూరివిరాళాలు ఇచ్చి ఆ మేరకు పుణ్యంలో భాగాన్ని- కొనగ వలయున్

మరొక విషయాన్ని దీనికి జోడిస్తున్నాడు ఆయా ఋతువులకు అనుకూలం గా మర్దనాలూ మజ్జనాలూ భోజనాలూ లేపనాలూ (గందపు పూత వగైరా) వసనా లూ (వస్త్రాలు) పువ్వులూ(ప్రసవాలు) వీటిని తత్పరతతో ఏర్పాటు చేసుకోవాలి అని. ఈ పద్యంలో రెండవ భాగానికి క్రియా పదం లేదు సందర్భాన్నిబట్టి మనం తెచ్చుకుని అర్థం చెప్పకోవాలి దీన్ని అధ్యాహారం అంటారు.

నానావిధ షాడబముల
నాను నృపాహార మెపుడు నపరాహ్ణమునం
గాని, మఱి శుద్ధ కోష్ఠువు
గాని తమిన్ భుక్తి యెపుడు గడు బథ్యమగున్ ? 4-28

రాజభోజనం ఎప్పుడూ రకరకాల పానీయాలతో (షాడబ ముల న్) అలరారుతూ ఉంటుంది(ఆనున్) దాన్ని రాజుగారు ఎప్పుడూ అపరాహ్ణంలోనే భుజించాలి ఆకలి కరకరమనేదాకా ఆగి జఠరాగ్ని శాంతికి అవసరమయినంత మటుకే మితంగా తీసుకోవాలి అంతేగానీ ఆకలి వెయ్యకుండా జీర్ణకోశం(కోష్ఠువు) ఖాళీ కాకుండా(శుద్ధం కాకండా) ఎప్పుడు పడితే అప్పుడు, ఎంత పడితే అంత, అబగా తినడం (తమిన్ భుక్తి) ఎవరికి మాత్రం-ఎప్పడు మాత్రం పథ్యమవుతుంది? అది పథ్యం (హితవు) కాదు అని స్ఫురించేలా కాకుస్వరంతో ఈ వాక్యాన్ని సమన్వయించుకోవాలి

వినువర్గసమత నృపుడు
న్నను ధర్మాంశంబె హెచ్చెనా, పెఱమడి కె
త్తిన నీరును దెగి యరి రా
జనపు మడికి నెక్కినట్లు, చను ముదమందన్ 4-282

పుత్రకా మరో విషయం చెబుతున్నాను వినవయ్యా రాజుగారు దర్మార్థ కామాలు అనే వర్గత్రయంపట్ల(మూడు పురుషార్థాలు) సమతను పాటిస్తున్నా - మూడింటినీ సమానంగా పాటిస్తున్నా ధర్మం పట్ల రవ్వంత మొగ్గు చూపినట్టయితే (ధర్మాంశంబె హెచ్చెనా) అది చాలా ఆనందాన్ని కలిగిస్తుంది ఎలాగంటే - మరొక మడిలోకి అని పారిస్తున్న నీరుకూడా (పెరమడికి ఎత్తిన నీరున్) బోది గట్టు తెగి అలా రాజనాల మడికే ఎక్కినట్టయితే అది ఎంత ఆనందాన్ని కలిగిస్తుందో అలాగ

రాజనాలు, ధాన్య విశేషం చాలా విలువైన సస్యం ఏ పొగనారుకో మిరప నారుకో పారిస్తున్న నీళ్ళు కూడా రాజనాల మడికే మళ్ళితే రైతుకి ఆనందమే కదా అలాగ అర్థకామాలకన్నా ధర్మాంశం హెచ్చితే సంతోష మేనని

వెలయించునట్టి యొక మణి
వెలు గాశన్ దొనుము, ధరణి వెండి సువేషో
జ్జ్వలతకు వలదే వాసర 4-283
ముల మణుల విభూషణములు భూపతి దాల్పన్

దోషరహితమై ప్రకాశించే ఒక విలువైన మణిని (మేలు జాతి రత్నాన్ని) వెలుగుపై ఆశతో ఎప్పుడూ ధరించు దాని వెలుగు నీ వెలుగుని పెంచుతుందని అంతే కాదు (వెండి=తరవాత) ఈ భూమిమీద (ధరణిన్) అందమైన వేషం ఉజ్జ్వలంగా ప్రకాశించాలంటే ఏడువారాలకూ అనువుగా (వాసరములన్) మణిమయ విభూష ణాలను భూపతి తాల్పన్ వలదే తాల్చాలి ఏ రోజు అలంకారం ఆ రోజుదిగా ఏడు వారాల సొమ్ముల్ని ధరించి రాజుగారి ఆహార్యకం రోజూ ఉజ్జ్వలంగా రోజూ కొత్తగా కనిపించాలి. (ధరణిన్ అనేది వ్యర్థపదమే పాదపూరణకోసం)

ఇంత ముగింపులోకి వస్తున్నాడు ఇంతవరకూ సాగిన ఈ సుదీర్ఘో పన్యాసంవల్ల తేలిన సారాంశమేమిటంటే-సింహాసనం హంసతూలికాతల్పం కాదని రాజ్యాంతే నరకం ధ్రువమ్మని మరి ఈ పాపాన్ని పోగొట్టుకోవడం ఏలాగ? అందుకని అసలు రాజ్యమే వద్దు పొమ్మంటావా?

చేయునది రాజ్య మట, యఘు
మేయవధిగ నీగువారమే మన జన, దా
మ్నాయంబు నశక్యాను 4-284
ష్ఠేయము జెప్పదు-స్వశక్తి జేయగ జెప్పన్

చేసేది రాజ్యంట! పాపమే ఫలంట ! మరి ఈ పాపాన్ని (అఘము) ఎన్ని జన్మలకు (ఏ అవధిగా) పోగొట్టుకోగలం మేము (ఈగువారము+ ఏము) అంటా

వేమో అలా అనడం తగదు తండ్రీ! (అనన్ చనదు).

రాకుమారుడు రాజ్యపాలన బాధ్యతను విధిగా వహించి తీరాలి అని చెబుతున్నవేదంకూడా (ఆమ్నాయంబున్) అనుష్ఠించడానికి అశక్యమైన నియమాలనూ నిబంధనాలనూ చెప్పడం లేదు (చెప్పదు) యధా శక్తిగా - స్వశక్తి మేరకు అంటే ఇంత కు మించి అనుష్ఠించగలిగిన శక్తి నాకు లేదు అన్నంతమేరకు నిజాయితీగా అనుష్ఠించమనిమాత్రమే చెబు తోంది (చెప్పదు-చెప్పన్ అనేవి తద్ధర్మార్థకక్రియలు. మూడు కాలాలనూ బోధిస్తాయి)

దండన ప్రధానసాధనంగా ఉన్న ఈ రాజధర్మాన్ని యధావిధిగా అనుష్ఠించి ధర్మాత్ములుగా పేరొందినవారిని చూపిస్తున్నాడు

వ. మను దండ ధరాదులు విశేషించి దోషం బెఱిగి దండించియు ధర్మ పరులన బరగిరి. ప్రజా పరిపాలనంబు పనిగా బ్రజానాథుఁడు బహుముఖం బులం బుట్టిం పం బుట్టి, విరాట్ సమ్రాట్ ప్రభృతి వేదోదితశబ్దవాచ్యుండై దేవ సదృశుండగు మూర్ధాభిషిక్తుఁడు, నోకోర్చి యిలకునగు నలజళ్ల దీర్పవం గాక జన్మంబు సఫలం బగునె!

మనువు యముడు మొదలైన పరిపాలకులంతా దోషుల్ని దండించారు అయితే విశేషించి దోషం తెలుసుకుని, పొరపాటు జరగకండా నిర్ధారించి దండనను అమలు పరిచారు అలా దండించే-వాళ్లంతా ధర్మ పరులు అని పేరొందారు అంచేత దండన అనేది పాపహేతువు కాదని.

బ్రహ్మదేవుడు(ప్రజానాధుడు) రాజును పుట్టించిందే ప్రజా పరిపాలన అనే పనికోసం. అదికూడా బహుముఖాలుగా సృష్టించాడు అష్టదిక్పాలకుల అంశలతో సృష్టించాడని. అలా పుట్టిన ఈ రాజు విరాట్ - సమ్రాట్ చక్రవర్తి మొదలైన వేదోక్త శబ్దాలతో వ్యవహరింపబడుతున్నాడు దేవాంశ సంభూతుడుగా దేవతా సదృశుడుగా పరిగణింపబడుతున్నాడు అటువంటి పట్టాభిషిక్తుడు కష్టం సహించి (నోకు+ ఓర్చి) తన భూమికి కలిగే (ఇలకున్+ అగు) అలజడుల్ని తీర్చాలి. తీర్చకపోతే అతడి పుట్టుక సఫలమవుతుందా ? వ్యర్థం

వ. కేవలేంద్రియప్రీతి బందీకృత పరకళత్ర పథికపరిషద్రవ్యహరణ ప్రాప్త విత్తమ్ముల పాటచ్చర ప్రభువులకు జరుగదే ! యింత లాంపట్య మేమి పని యని యవనియెడ నవనపై ముఖ్యంబు చెల్లదు.

కేవలం ఇంద్రియాలను సంతోష పెట్టడంకోసమనే అయితే ఇంత శ్రమ అవసరం లేదు. బందీలుగా పట్టుకున్న శత్రువుల భార్యలు ఉంటారు బాటసారి బృందాలను కొట్టి సంపాదించే సొమ్ములు ఉంటాయి వీటితో దారిదోపిడీ నాయకులకు (పాటచ్చర ప్రభువులకు) జరగదా. నాయకత్వం నడుస్తుంది ఇంద్రియ భోగానుభవం సాగుతుంది. మరి వాటికోసమని ఇంత లంపటత్వం, ఇంతశ్రమ ఏం పని - ఇలా ఆలోచించి రాజ్యంపట్ల (అవ నియెడన్) పరిపాలన పై ముఖ్యం వహించడం తగదు.

(అవనము=రక్షించుట. అవనవైముఖ్యము= రక్షణ విముఖత్వము) ఎలాగంటే -

వ. ఎట్లనిన దొల్లి కృతయుగంబున గృతవీర్యనందనుండగు సహస్రబాహుం డాత్మీయ దోః స్తంభ సంభృతయగు విశ్వంభర నే ద్వీపంబున నే నాట నే వీట నే త్రోవ నే త్రేవ నే వేళ నెవ్వడే మి సేయుం దలంచు నప్పు డందందు నసిము సలచాపాది శస్త్రాస్త్రధారియై తోచి యాజ్ఞయిడు.

అలనాడు కృతయుగంలో కార్తవీర్యార్జునుడికి (కృతవీర్యుని నందనుడు) వెయ్యి చేతులు ఉండేవి అవి స్తంభాల్లాంటి దృఢమైన బాహువులు. వాటితో ఈ భూగోళాన్ని (విశ్వంభరన్) కాపాడేవాడు ఏ ద్వీపంలో, ఏ రోజున ఏ పట్టణంలో ఏ మార్గంలో ఏ పక్కని, ఏ సమయంలో ఎవడు, ఏ అపకారం చెయ్యతలపెట్టినా (చెయ్యనవసరం లేదు-తలపెడితే చాలు) అప్పుడు ఆ క్షణంలో అక్కడ తాను ప్రత్యక్షమై ఖడ్గం(అసి) రోకలి (ముసలం) ధనుస్సు(చాపం) మొదలైన శస్త్రాలనూ అస్త్రాలనూ ధరించినవాడై వాళ్ళని శిక్షించేవాడు (ఆజ్ఞ ఇడున్)

వ. అట్లాజ్ఞ యిడ నంతిమంబగు నీ యుగంబున యాగానుసారంబుగా మితసారంబగు రాజలోకంబునకు శక్యంబు గాదు గదా!

అలా కార్తవీర్యుడిలాగా దుష్టుల్ని శిక్షించి భూమండలాన్ని కాపాడటం ఈ కట్టకడపటి కలియుగంలో సాధ్యమా చేస్తున్న యాగాలకు అనుగుణంగా పరిమిత బలంతో పుడుతన్న ఇప్పటి రాజ సమూహానికి అది శక్యం కాదుగదా

వ. ఒక్క రాజలోకంబున కననేల యిక్కాలంబునందలి భూసురులకు నక్కాలంబునందలి భూమిదివిజులకు గల శక్తి యున్నదె! ఒక్క బాడబుండు కడలి నీరు గ్రుక్కం గొనియె. ఒక్క విప్రుండు స్రష్ట్ర సృష్టికి బ్రతిస్రష్టయయ్యె. ఒక్క బ్రాహ్మణుండు బ్రహ్మదండంబున బ్రహ్మాస్త్రంబు వారించె

కలియుగంలో శక్తి క్షీణించడమనేది ఒక్క రాజలోకంలోనే కాదు అంతటా కనపడుతోంది ఇప్పటి బ్రాహ్మణుల్లోమాత్రం అప్పటి భూసురుల్లో ఉన్న శక్తిసామర్థ్యాలు ఉన్నాయా?

అప్పటి ఒక బ్రాహ్మణుడు (బాడబుడు) అగస్త్యుడు మొత్తం సముద్రాన్ని మూడు గ్రుక్కల్లో త్రాగేశాడు. మరో విప్రుడు (విశ్వామిత్రుడు) బ్రహ్మదేవుడి సృష్టికి ప్రతిసృష్టి చేసాడు ఇంకో బ్రాహ్మణుడు వసిష్ఠుడు బ్రహ్మదండంతో బ్రహ్మాస్త్రాన్నే వారించాడు

వ. అట్టి యనుష్ఠానంబు మాకు లే దెందే మి ప్రయోజనం బని శక్త్యనుష్ఠానంబు వీరికి విడువ వచ్చునే వీరితరుల కుపాసనీయులు గాకపోయిరే!

అగస్త్యాదులకున్న తపోనుష్ఠానం మాకు లేదు. ఎక్కడ ఏమిటి ప్రయోజనం అని ఇప్పటి బ్రాహ్మణులు తపస్సునే వదిలిపెట్టవచ్చా శక్త్యనుసారంగా అనుష్ఠానం చెయ్యాలి అలా చేస్తున్నారు మరి వీళ్ళు ఇతరు లకు ఆరాధనీయులు కాకపోతున్నారా! పోల్చుకున్నప్పుడు వీరి శక్తి తక్కువే అయినా ఆ ఉన్న శక్తితోనే ఉపాసనీయులు అవు

తున్నారు

వ. కావున సావధానుండవై శక్తి కొలది శ్రుతదృష్టంబు లుపేక్షింపక రక్షణ శిక్షణంబు లాచరింపుచు నశక్యంబున కార్తశరణాగతరక్షకుండగు పుండరీకాక్షుమీద భారం బిడి యనహంకృతి బ్రవర్తిల్ల నెల్ల సంసిద్ధులు గరస్థంబులగు నది యట్లుండె నట్లయిన పట్టబద్ధుండగు రాజు ధర్మంబునంద దృష్టియిడి నడువవలయు. వరుణ వైశ్రవణవాయు వైశ్వానరవాసవాదుల జన్మంబులును బహుభవారబ్ధంబుల. భూర్భువస్స్వరాదు లగు నిజగంబులును ధర్మప్రతిష్ఠితంబులు. కావున దదాచరణచణుండవై ఋణ త్రయంబును నీగి సమానులం దుత్తమ శ్లోకుండవై రాజ్య పరిపాలనంబు సేయుమని యభిషి క్తుం జేసె నిది మదీయ భక్త ప్రభావంబని యంబుజాలయ కానతిచ్చె 4-286

కాబట్టి ఏకాగ్రచిత్తుడవై శక్తికొలదిగా వేదప్రతిపాదితమైన ధర్మాలు చిన్న చూపు చూడకుండా (శ్రుతము=విన్నది దృష్టము=చూచినది ఉపేక్షించక) శిష్టరక్షణ దుష్టశిక్షణలు అనుసరిస్తూ నీకు అశక్యమైన వాటి విషయంలో భారమంతా ఆర్తత్రాణ పరాయణుడూ శరణాగత రక్షకుడూ అయిన శ్రీమన్నారాయణుడిమీద (పుండరీ కాక్షుడి మీద) వేసి నిరహంకారుడవై ప్రవర్తించినట్లయితే సకల కార్య సిద్ధులూకూడా నీకు అరచేతిలో ఉంటాయి (కరస్థంబులు అగున్) అనాయాసంగా సిద్ధిస్తాయని పెద్దలూ చెబుతున్నారు వేదశాస్త్రాలూ ఘోషిస్తున్నాయి ఉన్న విషయం ఇది అది యట్లుండె

కాబట్టి పట్టాభిషిక్తుడైన రాజు, ధర్మమందే దృష్టిపెట్టి నడుచుకోవాలి వరుణుడు కుబేరుడు (వైశ్రవణుడు) వాయువు అగ్ని (వైశ్వానరుడు) ఇంద్రుడు మొదలైన ఈ దిక్పాలకుల పుట్టుకలు - అనేకపూర్వ జన్మలనుంచీ ఆరంభించి ఆచరి స్తున్న ధర్మకార్యాలకు ఫలితంగా లభించి నవే (బహుభవ+ ఆరబ్ధ+ క్రియా + లబ్ధం బులు+అ) భూలోకం భువర్లోకం స్వర్లోకం- ఈ మొదలైన జగత్తులన్నీ ధర్మంచేతనే నిలుస్తున్నాయి ధర్మంతోనే మన్నుతున్నాయి ధర్మప్రతిష్ఠితాలే అంచేత సర్వజగత్ స్థితి కారణమైన ధర్మాన్ని ఆచరించడంలో నేర్పరి వై (ఆచరణచణుడు) ఋషి గురు పితృ ఋణాలను (ఋణ త్రయంబు) తీర్చి నీ సాటివారిలో ఉత్తముడనిపించుకుంటూ (ఉత్తమశ్లోకుడవై) రాజ్యపరిపాలనం చెయ్యవయ్యా కుమారా

యామునాచార్యుడు ఇలా రాజనీతి ఉపదేశించి తన కుమారుణ్ణి పట్టాభి షిక్తుణ్ణి చేసాడు

ఓ లక్ష్మీ ఇది నా భక్తుడి ప్రభావం అడిగావు కదా చెప్పాను అని విష్ణుమూర్తి సెలవిచ్చాడు (ఆనతి ఇచ్చెను)

వర్ణనల్లో రాయలవారి ప్రత్యేకత ఏమిటో కొంచెం వాచవిగా చూసేస్తే అదొక సంతృప్తి ఈయన వైష్ణవుడు కనక అవతారికలో విష్ణుమూర్తి నీ ఆదిశేషుణ్ణీ గరుత్మంతు ణ్ణీ విష్వక్సేనుణ్ణీ గదా శంఖచక్ర ధనుః ఖడ్గాలనూ విడివిడిగా ఒక్కొక్క పద్యంలో

స్తుతించాడు అందులో సుదర్శన పద్యం-

అడరు గళాస్రధారలు, మహాముఖవాంత సుధాంబుధారలున్
బొడవగు వహ్ని కీలములు, పొంగుసుగా బెళ దైత్యకోటికిన్
బెడిదపు గిన్కతో నెసరువెట్టిన పెద్ద పనంటివోలె నె
క్కుడు పెస రాహుమస్తకము గొన్న సుదర్శనదేవు గొల్చెదన్(౧ -౧)

రాహువు మాయోపాయంతో దేవతల పంక్తిలోకి వచ్చి అమృతం పుచ్చుకో బోయాడు గుటక వేసేలోగా సుదర్శన చక్రం వాడి తల నరికేసింది అప్పటికి నోట్లో పోసుకున్న తెల్లటి అమృతాన్ని వెళ్ళగక్కాడు అది పైనుంచి బయటికి వచ్చేస్తోంది కింద నేమో మెడనించి రక్తం నాలుగు వైపులకీ జిమ్ముతోంది ఇదీ దృశ్యం

కంఠంనుంచి చింది కింద నాలుగు వైపులకీ వ్యాపిస్తున్న రక్తధారలు (అస్ర దారలు) పైకి పెద్ద వెడల్పాటి నోటినుంచి పొంగిపొర్లుతున్న అమృతధారలు. ఈ రక్తధారలేమో పొడవైన మంటల్లాగా(వహ్ని కీలలు)ఉన్నాయి ఈ పొర్లుతున్న అమృత మేమో పొంగులాగా ఉంది రాక్షసవంశా నికి ఎసరు పెట్టిన పెద్ద కుండలాగా ఉంది మొత్తం దృశ్యం(పనంటివోలె) ఉత్ప్రేక్ష అంత చండవేగంతో రాహుమస్తకాన్ని ఖండిం చిన(కొన్న) సుదర్శన దేవుడికి నమస్కారమని

ఎసరు పెట్టడమనేది ఈనాటికీ వాడుకలో ఉన్న జాతీయం నాశనానికి పూనుకున్నాడని

విష్ణుచిత్తులవారి ఊరు విలుబుత్తూరు దాన్ని వర్ణిస్తూ వైష్ణవ సంప్ర దాయాన్నీ ఆ వాతావరణాన్నీ కళ్ళకు కట్టించాడు అందులో ఒక పద్యం-

తల బక్షచ్ఛట గ్రుక్కి బాతువులు కేదారంపు గుల్యాంతర
స్థలి నిద్రింపగ జూచి, యారెకు లుషఃస్నాత ప్రయాత ద్విజా
వళి పిండీకృత శాటులన్ సవి దదావాసంబు జేర్పంగ రే
వుల డిగ్గన్ వెసబాఱు వాని గని నవ్వున్ శాలిగోప్యోఘముల్(-౧౧)

(బాతువుల్=బాతులు సవిన్=భ్రాంతితో, వెసన్=వేగముగా)

ఊరు ప్రక్కనే వరిచేలు. (కేదారాలు) చేలకూ ఊరికీ మధ్యన పంట కాలువ (కుల్య) ప్రవహిస్తోంది బాతులు రేవులో ఒడ్డున పడుకుని నిద్రపోతున్నాయి. అవి ముక్కుతో సహా తలల్ని రెక్కల్లో (పక్షచ్ఛటన్) దోపుకుని నిద్రిస్తున్నాయి. తలారులు (ఆరెకులు) చూసారు గట్టు మీద నుంచి చూస్తున్నారేమో ఆ సంజ వెలుగులో వాళ్ళ కంటికి అవి అంగవస్త్రం పిడపల్లా కనిపించాయి ఊళ్ళో వైష్ణవస్వాములు(ద్విజా వళి) తెల్లవారుజామున ఈ రేవుల్లో స్నానాలు చేసి వెడుతూ (ఉషః స్నాతప్రయాత) పిడిచిన అంగవస్త్రా లను (పిండీకృత శాటులు) ఇక్కడ పెట్టి మర్చిపోయి ఉంటారు వీటిని వారి ఇళ్ళకు పట్టుకువెళ్ళి ఇద్దాము (తదావాసంబు జేర్పన్) అనుకుని ఆ రెకులు రేవుల్లోకి దిగారు ఈ అలికిడికి బాతువులు లేచి తుర్రుమన్నాయి

ప్రక్కనున్న వరిచేలకు కాపలాకాస్తున్న పల్లె పడుచులు (శాలి గోపీ+ ఓఘ

ముల్) ఇదిచూసి పక్కుమన్నారు వరిచేలు పంట కాలవలు భాగవతుల నదీస్నానాలు బాతులు ఆరెకుల నిజాయితీ, శాలిగోపికలు వాళ్ళ హాస్య ప్రీతి- ఇంత వాతావరణాన్ని అందిస్తోంది ఈ పద్యం

ఆ విలుబుత్తూరులో మన్నారు కృష్ణుని (వనమాలి) కోవెల ఉంది కోవెల చూట్టూ మిన్నుముట్టేంత (మిన్ను అలము) బంగారు ప్రాకారం ఉంది (హేమ వరణం) ఆ ప్రాకారం మీదికి సంపెంగ చెట్లు (చంపక శాఖి) ప్రాకి గుబురుగా అల్లుకున్నాయి

ప్రాకారం వెలుపల అటూ ఇటూ వీధులూ, సౌధాలూ ఆ సౌధాల లో గృహస్థులూ రాత్రి నడుస్తోంది కొందరు దంపతులు ప్రణయ కలహం తో ఎడమొగం పెడమొగం బెట్టుగా పడుకున్నారు ఇదీ సన్నివేశం

మలయపు గాలి -రేలు, వనమాలి విమానపతాక ఘల్లు మం
చులియ బసిండి మువ్వ గమి నొక్కొకమాఱు గదల్ప, మిన్ను మి
న్నలము తదీయ హేమవరణాంచల చంపక శాఖలందు ప
క్షులు రొదసేయ, వేగెనని కూడుదు రల్కలు దేఱి దంపతుల్(1-74)

ఆ రాత్రిపూట (రేయి+లు=రేలు) మలయ పవనుడు వీచి ధ్వజ స్తంభానికి ఉన్న మువ్వల పతాకాన్ని (విమాన పతాక) కదిలించాడు. పసిడి మువ్వలు ఘల్లుమని ధ్వనించాయి (ఉలియన్) సంపెగ గుబురుల్లో నిద్రపోతున్న పక్షులు ఉలికిపడి లేచి రొదచేసాయి చుట్టు ప్రక్కల సౌధాల్లో పడకగదుల్లో అలిగి భీష్మించుకున్న దంపతులకి ఈ కిలకిలారవాలు వినిపించాయి అయ్యయ్యో అప్పడే తెల్లవారిపోతోందే అని ఆ దంపతులు ప్రణయ కోపంనుంచి తమంతనే తేరుకుని కూడుదురు ఇంతకన్నా అక్షరం ఎక్కువ చెబితే సొగసు చెడుతుంది ఎంతటి సరసుడూ రాయలవారు! ఇక్కడ గమనించవలసినది ఏమిటంటే ఆ ఊళ్ళో ఆ దంపతుల ధార్మిక శృంగారానుభవంలోకూడా మన్నారు కోవెల ప్రముఖపాత్ర వహిస్తోందని

తరువాత మధురాపురాన్ని వర్ణించాడు అది పాండ్యరాజధాని. ఆ రాజసం ఆ సంపన్నత, ఆ వైభోగం ఆ వైభవం ఉట్టిపడే దృశ్యాలే చూపించాడు

స్థిరసౌధాగ్ర విహారి యౌవతరతిచ్ఛిన్నాచ్ఛహార స్ఫుర
ద్గురుముక్తావళి చేటికల్ విరలతో, గూడంగ ద్రోయన్, నిజో
దర లగ్నంబగువాని నెమ్మియి లధఃస్థంబై తలిన్ రాల్ప నా
తర మభ్రంబని యంద్రుగా కుదధి దక్కన్ ముత్యముల్ పుట్టునే (2-11)

ఎత్తయిన సౌధాలున్నాయి ఆ సౌధాగ్రాల మీద యువదంపతులు (యౌవతం) క్రీడిస్తున్నారు. ఆ రాత్రి సంభోగతీవ్రతలో ఆమె మెడలోని ముత్యాల హారాలు పెరిగి, విలువైన ముత్యాలు (గురు ముక్తా+ ఆవళి) గదినిండా చెల్లాచెదురై పడ్డాయి.

తెల్లవారింది. చేటికలు (దాసీజనం) గది తుడిచారు నలిగి పడ్డ పుష్పాలతో పాటు ముత్యాలనుకూడా తుడిచి, చేటలోకి ఎత్తి కిటికీలోంచి క్రిందకి పారబోసేసారు. అవి ఆ కిటికీకి దిగువ భాగంలో (అధః స్థంబై) ఉన్న మేఘంలో (నెమ్మియిలు)

పడ్డాయి ఆ మొయిలు గాలివాటున అలా అలా ప్రయాణించి సమయానికి సముద్రం లో ముత్యాలను కురిసింది.

ఇప్పుడు చెప్పండి-ముత్యాలకు జన్మస్థలం(ఆకరము) మేఘమా? సముద్రమా ? మేఘమనే చెప్పాలి తప్ప (అభ్రంబు+ అని+ అందురు గాక) ఉదధిలో ముత్యాలు పుడతాయా?

మధురాపట్టణంలో సౌధాల ఎత్తు, యువదంపతుల భోగలాలసత, ముత్యాలు పారబోసిన చేటికల సంపన్నత- ఇవన్నీ వ్యంగ్యాలు

రాయలవారు చేసిన పుష్పలావికా వర్ణన (పువ్వులు అమ్మే సొగసు కత్తెలు) జగత్ప్రసిద్ధం సంభాషణ కొంచెం పచ్చిగా ఉంటుందన్నమాటే గానీ, పుష్పలావికలు అంతటి సెరజాణలే అయినా వాళ్ళలోనూ కొందరు అమాయిక ప్రాణులు ఉన్నారు వారినీ చూపించాడు.

సరసుల నర్మ మింపుల నొసంగ, గదంబపు దండ గట్టుచో-
గరగుట దెల్పు దృక్తరళకాంతులు, నుత్తరమిచ్చు నంతరాం
తరముల నవ్వులున్ -గలువ తండము మొల్లలు నంచు మిన్న గ్రు,
చ్చ, రహిని రిత్తనూ లొసగి సిగ్గు వహింతురు పుష్పలావికల్ (౭-౨౦)

పువ్వులుకొని ఇంటికి పట్టుకువెళ్ళడానికి కొందరు సరసులు వచ్చారు అంగడిలో అమ్మాయిల్నిచూసేసరికి సరదా పుట్టింది సరసాలు మొదలుపెట్టారు వాళ్ళ నర్మగర్భోక్తులు ఇంపులను పంచుతూంటే, ఈ పుష్ప లావికలు నవ్వుకుంటూ, వాళ్ళు అడిగిన కదంబమాల (రకరకాల పువ్వులూ మరువం కలిపి కట్టే దండ) కడుతున్నారు

పుష్పలావికల కన్నుల్లోంచి సిగ్గుతో తడిసిన తరళ కాంతులు (కలికి చూపులు) వెలువడుతున్నాయి. సరసుల మాటలకు జవాబులు చెబుతూ మధ్యమధ్యలో నవ్వులు విసురుతున్నారు ఆ కాంతులు ఎర్ర కలు వలుగా (కలువ-తండము= సమూహము), ఈ నవ్వులు తెల్లటి మొల్లలుగా, ఆ పడుచులు దండ గ్రుచ్చేసారు అవి కలువలూ కావు ఇవి మొల్లలూ కావు ఆకాశం దండగ్రుచ్చారు. (మిన్ను గ్రుచ్చి) చివరికి పువ్వులు లేని ఉత్తి నూలుదారం (రిత్తనూలు) బేరగాళ్ళ చేతిలో పెట్టారు

దండగ్రుచ్చి ఇమ్మంటే ఉత్తినూలుదారం ఇచ్చారేమిటని సరసులు అడిగే సరికి పాపం పుష్పలావికలు సిగ్గుపడిపోయారుట. దొరికిపోయామే అని కాబోలు సిగ్గు!

రాజశేఖరచరిత్రలో మాదయ్యగారి మల్లన దీనికి పైసంగతి వేసాడు ఆ సరసులుకూడా అదే పద్ధతిలో మైమరచిపోయి, వాళ్ళ లేత నవ్వులతో వికసించిన పూలదండను కొని (విలిచి) ఇంటికి పట్టుకుపోయి, అక్కడ చూసుకుని, ఇదేమిటి మంచి దండ చూపించి ఈ వడలిన దండ ఇచ్చావంటూ మళ్ళీ పుష్పలావికల దగ్గరికి తగువుకి వస్తున్నారట ఏం చెప్పమంటారు అన్నాడు. ఆ పద్యంకూడా ఒకసారి తిలకించండి

అరవిరి బాగుతో నలరులమ్ము లతాంగుల లేత నవ్వులన్
బెరసి, సరంబు లప్పటికి బెంపు వహించుట జేసి, చూపఱుల్
గర మనురక్తిమై బిలిచి కైకొని, నెమ్మది బోయి, చూచి, యా
సరములు గావు పొమ్మనుచు సారెకు గ్రమ్మఱి వత్తు రేమనన్।(1-49)

ఆరుఋతువుల్లోనూ ప్రకృతి కొత్త కొత్త అందాలను సింగారిం చుకుంటుంది. కొన్ని మార్పులు ఆనందదాయకంగా ఉంటాయి కొన్ని భయపెడతాయి మన మానసిక స్థితిపై ఇది ఆధారపడి ఉంటుంది కొన్ని మార్పుల్ని మనం అసలు గమనించలేం. వాటిని చూసి ఎవరయినా చెబితే ఆనందిస్తాం అలాగే మనం చూసినవాటికి కూడా క్రొత్త ఉపమానాలనూ పోలికలనూ, కల్పించి చెబితే అదీ ఆనందంగానే ఉంటుంది రాయలవారి ప్రకృతి వర్ణనలు ఇన్ని అందాలకూ ఆనందాలకూ పెన్నిధులు

గ్రీష్మంలో సుడిగాలుల్ని మనం తరచు చూస్తూ ఉంటాం ఎండు టాకులూ గడ్డి పరకలూ విశాలమైన పైఅంచున ఆడుతూ ఉంటే, దుమ్ము సుడిగుండంలా తిరుగుతూ నేలమీద అనీ అనకుండా రివ్వున పోతూ ఉంటాయి ముక్కుల్లో చెవుల్లో కొట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తాయి అందుకని వీటిని గాలి దెయ్యాలు అని చెప్పి పిల్లల్ని భయపెడతారు మన పెద్ద వాళ్ళు, మొలత్రాడు ఉంటే ఏమీ చెయ్యవని ఛలోక్తి. ఆ భయానికి ఇది ధైర్యోక్తి

దుమ్ముతో చక్రాకారంగా తిరుగుతూ ఉంటాయి కనక సంస్కృతంలో రజశ్చక్రాలు అంటారు వీటిని వర్ణించాడు రాయలవారు-

దవ ధూమంపు దమంబులో దమ రస ద్రవ్యంబు బంకేజభాం
ధవ భాను ప్రతతుల్ హరింప, గుయి వెంటన్ వెళ్ళ శూన్యోరుకూ
పవితానంబుల జాడ జాడ, బుడమిన్ బాటిల్లి, పై విప్పలై,
యవసం బంచుల నాడగా వెగసె వాత్యాళిన్ రజశ్చక్రముల్(2-48)

పాడుపడిన నూతులు పైకి లేచి వెడుతున్నట్టు ఉందిట (శూన్య+ ఉరు+ కూప వితానంబుల జాడన్). గ్రీష్మంలో నీళ్ళు ఎండిపోయాయి వాడకం లేక అంచున గడ్డి (యవసం) పెరిగింది అదీ ఎండి పోయింది. పైని వెడల్పుగా (పై విప్పలై) లోపలికి పోగా పోగా సన్నగా ఉంటాయి పోలిక సరిపోయింది కానీ ఈ కూపవితానం ఎందుకు పైకి వెడుతు న్నట్టు? సూర్యుడికి మొరపెట్టుకోడానికిట (కుయివెంటన్- పెట్టన్) భగ వన్ నీ కిరణాలు మా రసద్రవ్యాన్ని (నీరు అనే ధనాన్ని) హరించాయి దావాగ్నిధూమాల చీకటి చాటున (తమంబులో) ఈ దొంగతనం జరిగింది మా ద్రవ్యం మాకు ఇప్పించు మహాప్రభూ అని మొర పెట్టుకోడానికా అన్నటు లేచి వెడుతున్నాయిట. ఉత్ప్రేక్ష

వేసవికాలంలో కొబ్బరిబొండాలను ప్రొద్దున్నే దింపించి, ఉద్యానవనం ఇసుకపొతరల్లో దాస్తారు. సాయంకాలంవేళ తీసి, కొట్టించుకుని తాగితే చల్లగా ఉంటాయి. ఇది ఒకప్పటి శీతలీకరణ విధానం దీనికి మరొక ప్రయోజనంకూడా

ఉందని చెబుతున్నాడు కవి -

తారుణ్యాతిగ చూత మూత్న ఫలయుక్ తైలాభిగారస్స్వనద్
ధారాధూపితశుష్కదంబు హృత మాత్స్య చ్ఛేద పాకోద్గతో
ద్గారంపుం గన రార్చు భోగులకు సంధ్యావేళలన్ కేళకాం
తారాభ్యంతర వాలుకా స్థిత హిమాంతర్నాలికేళాంబువుల్ (౭-౬౨)

బాగాలేత మామిడి పిందెలు. (తారుణ్య+ అతిగ+చూత+ మూత్న ఫలములు. (ఫలము అంటే పండు అనేకాదు.కాయ అనికూడా. రెండింటికీ సంస్కృతంలో ఒకటే పదం) వీటినే వడపిందెలు అంటారు వీటినీ, ఎండి పోతున్న చెరువుల్లోనుంచి పట్టి తెచ్చిన చేపల్నీ (శుష్కత్+ అంబు+ హృత+ మాత్స్య+ఛేద) ముక్కలుగా తరిగి చుయ్ మనేట్టు నూనెలో వేసి వేయించాలి (తైలాభిగార+ స్వనత్+ ధారా) అటుపైని పొగచా లి ధూపితం చెయ్యాలి. దీన్నే 'తిరుగమూత'తాలింపు 'పోపు పెట్టడం'' అంటారు అలా తయారైన పాకాన్ని (వంటకం) మధ్యాహ్న భోజనంలో దట్టంగా లాగిస్తే, సాయం కాలానికి త్రేపులు (ఉద్గారము) వస్తాయి. వచ్చినప్పుడు గొంతులో ఒక రకం నుసగా ఉంటుందిట 'కనరు' అన్నాడు దాన్ని పోగొడతాయిట ఈ కొబ్బరినీళ్ళు. ఇదంతా భోగుల షోకు లెండి అన్నాడు.

కనరు గురించి చెప్పాలంటే అది భుజించినవాడే చెప్పగలడనీ అంచేత ఆముక్తమాల్యద రాయలవారి రచనమే తప్ప పెద్దన రచనకాదనీ, కొందరు విమర్శ కులు అన్నారు రవి కానని చో కవి కాంచునే కదా ! అంచేత కవి అన్నీ అనుభవించి చెప్పనవసరం లేదు పెద్దనగారు కలికుట్లు (చీకు లు) వర్ణించలేదా అని ప్రతి విమర్శకులు జవాబు చెప్పారు. ఇవన్నీ ఒకప్పటి చర్చలనుకోండి. దానికేమి !

పాండ్యరాజు సభలో వాదం చేసి విష్ణుచిత్తుడు గెలుపొందాడు ఓడిపోయిన పండితులు ఎలా నిష్క్రమించారో వర్ణించిన పద్యం రాయల నాటి ఆ వాతావరణానికి దర్పణం పడుతోంది

సెలవులు నాకుచు వెలి యరుంగులు సూడ
కరిగి పాదూవాహు నరయువారు,
తమ ప్రోల నుండు నందలము గానక దాటి
పేరెలుంగున బెస్త జీరువారు,
నగరు వెల్వడు దాక దెగివోయి మఱి నిల్చి
తోడి విద్వాంసుల గూడువారు,
వెదురైన తమవాని గృహకృత్య మడిగి వా
దనునవి తప్ప నూకొనెడివారు,
వాద మేమాయె ? నన్న '' భూవరుని పక్ష
పాత మా దాసరికి గల్గి బ్రతికె '' ననెడు
వారు'' నౌ లెండి టు విమర్శ దూరమ్మైన

వాకిట వసించు నెవ్వ డన్నారు వగుచు 4-7

నోటికి కుడి ఎడమ కొసల్ని సెలవులు (సెలవి+లు) అంటారు వాటిని నాలిక తో స్పృశిస్తూ గబగబా సభలోంచి బయటికి వచ్చారుట. అటూ ఇటూ ఉన్న అరుగుల్ని చూడకుండానే తమ చెప్పులు మోసేవాడికోసం (ప్రతి పండితుడికీ పాదుకావాహుడు ఒకడు ఉండేవాడన్నమాట) ఎక్కడ ఉన్నాడా అని వెదుకుతున్నారుట వాడు ఆ అరుగు మీదే ఉన్నాడు ఎదురు చూస్తూ. కానీ వీళ్ళు గమనించే పరిస్థితిలో లేరు

మరికొందరు ఎట్టఎదుట ఉన్న తమ అందలాలను (పల్లకీ) గమనించ కుండా- ఎక్కడ చచ్చార్రా? అని బోయీలని గట్టిగా గొంతెత్తి (పేరు+ ఎలుంగన) మరీ పిలుస్తున్నారుట (చీరుట=పిలుచుట)

రాజ గృహం (నగరు) దాటేదాకా విడివిడిగా వెళ్ళి(తెగిపోయి) అక్కడ నిలిచి, తోటి విద్వాంసుల్ని కలుసుకుంటున్నారుట బృందగానంగా అక్కసు వెళ్ళబోసు కోవడానికి తమలో తమకి పడకపోయినా సమానంగా కష్టం వచ్చినప్పుడు అంతా కలుస్తారు ప్రాణాపాయ స్థితిలో బద్ధ శత్రువులు కూడా ఏకమవుతారు అలాగే వీరూను.

దారిలో తమకు తెలిసినవాడో బంధువో ఎదురైతే వాణ్ణి పలకరింపుగా కుశల ప్రశ్నలు వేస్తున్నారుట కొందరు ఇంట్లో అంతా బాగున్నారా? అన్నీ బాగా జరుగుతున్నాయా? లాంటి గృహకృత్యాలు అడుగుతున్నారు మనసులోపలి బాధా తీవ్రతని తగ్గించుకోవడానికీ కప్పి పుచ్చుకోడానికీ ఇదొక ఉపాయం తీరా అడిగాక వాడు ఏదో చెబుతాడు వాడు అనునవి వినకుండానే లోపల తమ ఆలోచనల్లో తాము ఉంటూ పరధ్యానంగా ఊ కొడుతున్నారుట

'' ఇంతకీ వాదం ఏమయ్యింది మావయ్యా?'' అని అడిగితే ''రాజు గారి పక్షపాతం ఆ దాసరికి(వైష్ణవుడికి) ఉండి బ్రతికిపోయాడు.'' అంటున్నారట

ఆ ప్రశ్న అడిగించుకోడానికీ ఈ సమాధానం ప్రచారంలోకి తేవడానికే వీరు వాణ్ణి పలకరిస్త అసలు రహస్యం ఇది పాపం వాడి సోది అంతా భరించవలసి వచ్చింది

'' అవున్లెండి ఉచితానుచితాలు విమర్శించి చూడకుండా ఇలా పక్షపాతం తో తీర్పులు చెప్పేవాడి గుమ్మంలో ఎవడు ఉంటాడు లెండి అంటూ వెళ్ళిపోయేవారు మరి కొందరూనుట

ఇలా అనుకుంటూ, నాలుగు దారులూ కలిసిన కూడలిలో (శృంగాటక ములు) నిలబడి రాజగృహం వైపు చూస్తూ కొంతసేపు మంతనాలా డి ఆ విద్వాంసులు ఎవగ్గి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారట.' నగరు దెస జూచుచునె'' అనడంలో ఉంది సొగసు స్వభావ చిత్రణకీ మనస్తత్త్వ పరిశీలనకీ ఈ వర్ణన ఒక మచ్చుతునక

యామునాచార్యుడి కథలో వర్షాకాలాన్నీ వెనువెంటనే శరదృతువునీ వర్ణిం చాడు. ఇతడిని మూర్తీభవించిన వర్షర్తువన్నారు శరభయ్యగారు

వర్షర్తువులో అల్లంత దూరాన రాబోతున్న జల్లుకి భయపడి బాటసారులు ఒక చెట్టు క్రిందకి చేరారు నిలబడ్డారు. అంతకు ముందుకురిసి వెళ్ళిన జల్లు నీరు ఆకులనుంచి గాలికి జలజలా రాలి బాటసారుల్ని తడిపే సింది భయపెట్టిన ఆ జల్లు రాకుండానే, దానికి ముందు ఎలగోలుగా వచ్చిన గాలి ఇంత పని చేసింది (4-130). ఇలాంటి దృశ్యాలను(పద చిత్రాలు) ఎన్నింటినో చూపించాడు. పొయ్యి మండక ఇంటిలో ఆడవాళ్ళు పడే యాతనని వర్ణించాడు మేక ఎరువుం గుంపటి మంచమెక్కిన రెడ్లను చూపించాడు (34)

వానల కాలంలో తరచుగా ఏడురంగుల ఇంద్రధనుస్సు కన బడుతుంది. ఒక వైపునుంచి మరోవైపుకి - సాధారణంగా దక్షిణంనుంచి ఉత్తరానికి ప్రాకుతుంది దాని క్రింద వానకాళ్ళు కనబడతాయి ఎక్కడో కురుస్తున్న వానతాలూకు జాడలు వానకాళ్ళు ఈ దృశ్యాన్ని రాయలవారు అద్భుతంగా పట్టుకున్నారు.

పుట్ట వెడలి నభోభిత్తి బట్టు శక్ర
కార్ముకపు బెద్ద పలువన్నె కట్ల జెర్రి
దైన నడచెడు కాళ్ల గుంపనగ, గాలి
గాఱ్ఱని దిగంతముల వానకాళ్లు నడచె 4-89

ఇంద్ర ధనుస్సు(శక్ర కార్ముకము) పలువన్నెల పెద్ద కట్ల జెర్రిలాగా ఉందిట. అది పుట్టలోంచి బయలుదేరి ఆకాశం అనే గోడకి పాకుతోందిట ఆ ప్రాకేటప్పుడు వరస గా కదులుతున్న దాని కాళ్ళులాగా, వానకాళ్ళు గాలికి కదులుతున్నాయి అన్నాడు.

ఈ ఋతువులో ఆరుద్ర పురుగులు ఒకటి కవులకు వర్ణనీయ వస్తువులు. వీటినే ఇంద్రగోపాలు అంటారు. ఇవి ఎర్రగా ఉంటాయి ఆ ఋతువులోనే పుట్టు కొస్తాయి ఎక్కడ ఉంటాయో పచ్చిక బయళ్ళమీద గుంపులు-గుంపులుగా వాలి, పగడాలు పరచినట్లుంటాయి వీటిని వర్ణిస్తూ

నారెకు మింట మేఘుడు, నిజస్ఫురణంబున గ్రూరమౌ పురో
ఙ్గారకయోగ మూది తిరుగన్ సకుటుంబము దర్గ్రహంబు నెం
తే రుష ద్రొబ్బ నంతలును నింతలునై పడు తన్నభశ్చ్యుతాం
గార శిశు ప్రతానముల కైవడి రాలె సురేంద్రగోపముల్ 4-100

అంగారక గ్రహం ఎర్రగా ఉంటుందని జ్యోతిశ్శాస్త్రం చెబుతోంది గ్రహ యోగాలలో పురోఙ్గారయోగం ఒకటి.ఈ యోగం ఏర్పడితే అనా వృష్టి . పురశ్శు క్రయోగం ఏర్పడితే ఆ ఏడు మంచి వర్షాలు కురుస్తాయి ట."పురో ఙ్గారే త్వనావృష్టిః పురశ్శుక్రే ప్రవర్షతి" అని జ్యోతిశ్శాస్త్రం ఈ శాస్త్రీయ విషయాన్ని కల్పనతో జోడించి కవిత్వీకరించారు రాయలవారు.

కావ్య వస్తువునుబట్టి కవుల్ని విభజించాడు రాజశేఖరుడు (కావ్య మీమాం స-పంచమాధ్యాయం) శాస్త్ర కవి- కావ్యకవి అని స్థూల విభాగం. కావ్య మార్గంలో శాస్త్ర రచన చేసినవాడూ,శాస్త్రంలో కావ్యాన్ని నిబద్ధించిన వాడూ, కావ్యంలో

శాస్త్రార్థాలను నిక్షేపించినవాడూ అని శాస్త్ర కవి మూడు రకాలు

రచనాకవి, శబ్దకవి అర్థకవి అలంకార కవి, రస కవి, మార్గ కవి, శాస్త్రార్థ కవి – అని కావ్యకవి ఎనిమిది విధాలుగా ఉంటాడు.

కావ్యంలో శాస్త్రార్థాలను నిక్షేపించి కవిత్వీకరించినవాడే శాస్త్రార్థ కవి అవుతాడు ఈ విశ్లేషణనుబట్టి ఈ సన్నివేశంలో రాయలవారు శాస్త్రార్థ కవి.

క్రూరమైన పురోంగారక యోగం మాటిమాటికీ (సారెకున్) పట్టి పీడిస్తూంటే, తన చుట్టూనే తిరుగుతూంటే, (ఊది తిరుగన్) ఆకాశంలో మేఘుడికి మాచెడ్డ చిరాకు వచ్చింది జలదాతగా తనకున్న గొప్పదనాన్ని ఈ అంగారకుడు నాశనం చేస్తున్నాడే అని (నిజస్ఫురణంబు+ అణన్=నశింపగా) మేఘుడు ఆగ్రహం పట్టలేక (ఎంతేని రుషన్) ఆ గ్రహాన్ని సకుటుం బంగా క్రిందికి నెట్టివేసాడు (ద్రొబ్బన్). అలా ఆకాశం నుంచి జారిపడు తున్న (నభః+చ్యుత) అంగారకుడి శిశు సంతతిలాగా (శిశుప్రతాన ముల కైవడిన్) ఇంద్రగోపాలు (ఆరుద్ర పురుగులు) నేలమీద రాలుతున్నాయి

జ్యోతిష సాముద్రిక నాట్య-వ్యాకరణ గజ అశ్వ-రత్నాది శాస్త్ర విషయాలను ఆధారంగా చేసుకుని కల్పనలు జోడించి వర్ణనలు సాగించే ఈ పద్ధతి ప్రబంధాలలో ఎక్కువగా కనబడుతుంది. ఇది ఒక రకంగా పాండిత్య ప్రదర్శనమే అయినా, పాఠకు లకు పాండిత్యాన్ని కలిగిస్తూ చరితార్థమవుతుంది. ప్రబంధాల్లో ప్రౌఢికి ఇదీ ఒక కార ణం. నన్నయ నుంచి మొదలైన కావ్యరచనలో కల్పనల మార్గాలూ, అలంకారాల త్రోవలూ, క్రమక్రమంగా తొట్టినపిండి అయిపోవడంతో, క్రొత్త పుంతలు త్రొక్కే కవులకు, ఇలా ఇతర శాస్త్ర విషయాలను జోడించుకుని అభివ్యక్తిలో క్రొత్తదనాన్ని చూపించడం అవసరమై ఉంటుంది శ్రీనాథుని దగ్గర సూక్ష్మంగా ఉన్న ఈ పద్ధతి కొన్ని ప్రబంధాలలో విశ్వరూపం ధరించింది

వర్షర్తువు ముగియగానే శరదృతువు వస్తుంది యామునాచార్యుడి కథ ఈ రెండు ఋతువుల్నీ వరసగా వర్ణించాడు కవి దండయాత్రల కు వెళ్ళాలనుకున్న రాజులు శరదృతువు వచ్చేవరకూ ఆగి బయలుదేరు తారు. సైన్యం ప్రయాణించడానికి దారులు బురద ఎండి అనుకూలంగా ఉంటాయనీ, ఏరులూ నదులూ ఉరవడి తగ్గి దాటడానికి వీలుగా ఉంటా యనీ- ఇలాంటి కారణాలు చాలా చెబుతారు.

నాటకాలలో ఋతుగానమని ఒక అంశం ఉంటుంది. నాంది ముగిసాక ప్రస్తావనలో ఇది వస్తుంది గానం చేసిన ఋతువునుబట్టి నాటకంలో ప్రధాన రసం తెలుస్తుంది శరదృతువుని గానం చేస్తే వీరరసం ప్రధానం. వసంతాన్ని గానీ గ్రీష్మాన్ని గానీ గానం చేస్తే శృంగారం ప్రధానం. ఇలా రాయలవారు మత్స్యధ్వజుడి కథలో గ్రీష్మాన్ని వర్ణించారు. అతడు శృంగార పురుషుడు. మహాభోగి.

ఇంతకీ శరదృతువుకీ యుద్ధ వీరానికీ సంబంధం ఉంది ఆముక్తమాల్యద లో శరద్వర్ణన ముగియగానే యామునుడు జైత్రయాత్రకి బయలుదేరుతాడు ఈ వర్షా శరద్వర్ణనలకు కథతో పొత్తు ఇది

శరదృతువులో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. నీరులేని తెల్ల మబ్బులు నురుగుల్లా దూదిపింజల్లా పెలపెలా ఎగురుతూ కనపడతాయి రాత్రిపూట చందమామ ఆ మబ్బుల్లో దాగుడుమూతలు ఆడుతూ ఉంటాడు. మబ్బుల్లో దాగినా స్వచ్ఛంగా కనబడుతూనే ఉంటాడు పాళపాళ లాడుతూ వెన్నెల హాయిగా ఉంటుంది. ఈ తెల్ల మబ్బుల్నీ, మబ్బుచాటు చంద్రుణ్ణీ వర్ణిస్తున్నాడు కవి

గగనలక్ష్మి నిజోరునక్షత్ర మాలి
కలు వియన్నది జలముల గడుగ బిసుక,
నెఱయు కుంకుడుపండుల నురువులనగ
బలపలని పాండురాంబుదపంక్తు లమరె 4-157

ఆకాశ లక్ష్మికి మెడనిండా పెద్ద పెద్ద నక్షత్రమాలికలు ఉన్నాయి.- ముత్యాల హారాల్లాగా వాటిని తీసి శుభ్రపరచడానికి ఆకాశగంగ (వియత్ + నది) నీళ్ళలో కడుగుతోందిట కుంకుడు కాయలతో కదా హారాన్ని కడుగు తారు (కుంకుడుపళ్ళు ఎండితే కుంకుడు కాయలవుతాయి నిలవఉంటాయి) ఆ కుంకుళ్ళు పిసికిన నురుగులు ఆకాశ గంగానదిలో తెట్టుగట్టి అలా అలా సాగుతున్నాయి. అటువంటి నురుగుల్లా ఉన్నాయి ఈ తెల్లటి మబ్బుల వరసలు (పాండుర+ అంబుద+ పంక్తులు) అన్నాడు ఆకారంలో రంగులో కదలికలో మాత్రమే కాదు, ఈ పోలిక పారదర్శకత్వంలోకూడా (ట్రాన్స్ పరెంట్).పలపలని అనడంలో సూచన ఇది

ఈ మబ్బుల చాటున చంద్రుడు పరిశుద్ధ జీవాత్మలాగా ఉన్నాడుట

అప్పుల్ వారిధిచేత బుచ్చుకొని కార్యంబైన మున్నొన్న యు
య్యప్పుల్ దాచనియున్ సువృత్తికముగా నవ్వార్ధికే తీర్పగా
నప్పుణ్యాతి విశుద్ధ జీవుడు నిజావ్యాంగంబులం దోచున
ట్లొప్పారెన్ శశిబింబ గర్భితములై ద్యోచారి శుభ్రాబ్దముల్ 4-158

పుణ్యవిశేషంవల్ల పవిత్రుడైన-జీవాత్మ (అతి విశుద్ధ జీవుడు) పాంచ భౌతిక శరీరంలో భాసించినట్టుగా, చంద్రబింబాన్ని గర్భంలో ధరించి ఆకాశంలో పరిశుభ్ర మేఘాలు, (అబ్దముల్) ప్రకాశిస్తున్నాయి అంటే చందమామ జీవాత్మలా ఉన్నాడు. తెల్ల మబ్బు (పాంచభౌతిక శరీరంలా) ఉపాధిలా ఉంది.

ఇంతకీ అంతటి పుణ్యవిశేషం ఏమిటీ అని అది పై రెండు పాదాల్లోనూ వివరించాడు

ఈ మేఘాలు ఒకప్పుడు (వర్షర్తువులో) సముద్రుడి దగ్గర అప్పులు పుచ్చుకున్నాయి అప్ అంటే సంస్కృతంలో నీరు అని సముద్రం నుంచి నీరు మేఘాలకు చేరి, భూభాగం మీద వర్షంగా కురుస్తుంది. ఇది శాస్త్రం మేఘాలు వచ్చి సముద్రంమీద వాలి నీళ్ళు తాగుతాయని కవులమాట ఆ నీళ్ళకి అప్ అనే పదం ఉంది కనక అది తెలుగులోకి బహువచనంగా వస్తే 'అప్పులు' అవుతుంది కనక, అప్పులు అంటే తెలుగులో ఋణమని ఉంది కనక, రెండు అర్థాలూ జోడించి కవి కల్పన

సాధించాడు

అవసరార్థం సముద్రుడి దగ్గర అప్పులు తీసుకుని మేఘుడు చాలా దూర దేశానికి వెళ్ళిపోయాడు. (దౌ చనియున్) ఆకాశంలో ఎక్కడికో వెళ్ళిపోయాడు. కానీ అప్పులు ఎగగొట్టలేదు తన పని కాగానే (కార్యంబై నన్) తాను అలనాడు తీసుకున్న అప్పుల్ని వడ్డీతో సహా (స-వృద్ధికముగా) మళ్ళీ ఆ సముద్రుడికే చెల్లించేసాడు తాగిన నీళ్ళు కొంచెమే అయినా ఎక్కువగా కురిసి నదుల్ని పొంగించి సముద్రానికి చేర్చాడని

మరి ఇది గొప్ప పుణ్యకార్యం కదూ ఎగగొట్టడానికి అన్ని అవకాశాలూ ఉన్నా ఎగగొట్టకుండా వడ్డీతో సహా చెల్లించాడు అంటే పుణ్యాత్ముడే అంచేత ఆ పుణ్యంవల్ల జీవాత్మ అతివిశుద్ధుడయ్యాడు ఇదీ కల్పన

జానపద కాంతలు ఏరుల ఒడ్డున హారాలు తోముకోవడం చూసిన రాయల వారు, నాగరకజీవితంలో అప్పులు ఎగగొట్టని నిజాయితీని కూడా చూపించారు.

అయిదో ఆశ్వాసంలో గోదాదేవిని వర్ణించి ఆమె విరహార్తికి అనువుగా వసంతఋతువుని జోడించాడు బాల్యం గడిచి గోదాదేవికియౌవనం వచ్చింది వయసు చేసిన ఈ యౌవనీకరణాన్ని కవి చాలా శుచిగా చమత్కారంగా వర్ణించాడు.

వాతెఱ తొంటికైవడి మాటలాడదు
కుటిలవృత్తి వహించె గుంతలంబు
లక్షులు సిరులు రా నఱచూడ్కి గనుగొనె
నాడించె బొమగొని యాననంబు
చను గొమల్మెగయు వక్ష ముపేక్ష గడతొత్తె
బాణిపాదము లెఱ్ఱవాఱదొడగె
నారెకు మధ్యంబు దారిద్ర్యముల జెప్పె
బొచ్చోర్వ కిటు లోగబొచ్చె మేను
వట్టి గాంభీర్య మొక్కడు వెట్టుకొనియె
నాభి, నానాటి కీ గతి నాటి పొందు
చవుకయ్యెనట్టి యిచ్చట నునదు నిలువ
ననుచు జాలినకరణి బాల్యంబు జాఱె 5-7

గోదాదేవి శరీరంనుంచి బాల్యం జారిపోయింది. ఎందుకని? ఒకనాటి స్నేహం(పొందు) ఇప్పుడు లేదని రోజురోజుకీ (నానాటికి) అది పలుచనైపోతోంది. చవక అయిపోతోంది అవమానాలపాలు కావలసి వస్తోంది అంచేత ఇంక ఇక్కడ మనం ఉండకూడదు. వెళ్ళిపోవడం మంచి ది మన గౌరవాన్ని మనం దక్కించు కున్నవాళ్ళం అవుతాం అని బాల్యం తప్పకుందిట

ఏమిటి ఇంతకీ బాల్యానికి జరుగుతున్న అవమానాలు? అంటే చెబుతున్నాడు

ఆమె పెదవి (వాతెఱ) ఇదివరకులాగా ఎక్కువ మాట్లాడటం లేదు ఇది వరకు మాట్లాడింది మాట్లాడినట్టు ఉండేది ఇప్పుడంతా మితభాషి. యౌవనం కారణం

గా సిగ్గూ బిడియాలవల్లా హుందాతనం వల్లా మాటల్లో పొదుపు వచ్చిందని.

ఆమె ముంగురులు(కుంతలాలు) ఇదివరకు ఋజువుగా ఉండేవి. ఇప్పుడు కుటిలవృత్తిని నేర్చుకున్నాయి. అంతా కుటిలత్వమే. ముంగురులు వంకరలు తిరిగి క్రొత్త అందం వచ్చింది అని.

ఆమె కళ్ళు ఇదివరకు హాయిగా తేరిపారచూసేవి. ఇప్పుడు అర చూడ్కులే గీరగా క్రీగంట చూడటమే. దీనికి కారణం కొత్తగా వచ్చిన సిరులూ సంపదలూను యౌవనంవల్ల కళ్ళల్లో కొత్త కాంతి, తళుకూ స్ఫురిస్తోంది అని

ఆమె ముఖం బొమ్మ తీసుకుని ఆడిస్తోంది వెక్కిరిస్తోంది కను బొమ్మలు చిక్కబడి, వాటి కదలికతోనే చెలికత్తెలను అదిలిస్తోందనీ, అభిప్రాయాలను వ్యక్త పరుస్తోందనీ

ఆమె వక్షఃస్థలం ఇదివరకు చాలా ఉపేక్షగా ఉండేది అచ్ఛాదనం సరిగా ఉందా లేదా అనే పట్టింపు పెద్దగా ఉండేది కాదు ఇప్పుడో ఉపేక్షని పూర్తిగా దూరం చేసేసింది (కడకున్+ఒత్తి) అంటే అస్సలు ఉపేక్షించడం లేదు అనుక్షణం ఆచ్ఛాదనను (పైట) సవరించుకుంటూనే ఉందని దీనికి కారణం చన్నుకొనలు (అగ్రాలు) నెగయడం

ఆమె చేతులూ పాదాలూ కోపంతోలాగా బాగా ఎరుపెక్కాయి యౌవనం వల్ల శుభ్రత, సౌకుమార్యాలు పెరిగాయని

ఆమె నడుం మాటిమాటికీ లేమిని చెబుతోంది డబ్బుల్లేవో, పోషించ లేక పోతున్నానో అని గోల పెడుతోంది. నడుముకి దారిద్ర్యమంటే సన్నబడిందని

బాల్య స్పర్శనీ ఆ రొచ్చునీ ఓర్చుకోడానికి ఆమె శరీరం (మేను) సంకోచిస్తోంది ఇదివరకులా ఒళ్ళంతా బురద చేసుకుని తిరగడానికి ఇష్టపడటం లేదు. యౌవనం వల్ల శారీరక శుచి అలంకారాభిరుచి పెరిగాయని

ఇలా బాల్యం తనకు జరుగుతున్న అవమానాలన్నీ నాభితో (బొడ్డు) మొర పెట్టుకుందామంటే అది వట్టి గాంభీర్యాన్నే పెట్టుకుని కూర్చుంది నిష్ప్రయోజనం అంటే ఆమె నాభికి లోతు పెరిగిందని.

ఇలాగ ఒకనాటి గౌరవం రోజురోజుకీ తగ్గిపోవడంతో ఇంక ఇక్కడ ఉండ కూడదని భావించి జారిపోయినట్టు బాల్యం ఆమె శరీరం నుంచి జారిపోయింది గోదాదేవి యువతి అయ్యింది

సాధారణంగా ప్రబంధాలలో నాయికా వర్ణన ఘాటుగా ఉంటుంది దాన్ని రాయలవారు పరిహరించారు గోదాదేవి మాములు నాయిక కాదు. శ్రీరంగనాయిక కొందరి దృష్టిలో భూదేవి కొందరి దృష్టిలో శ్రీదేవి. సాక్షాత్ శ్రీరంగేశ్వరుని ఇల్లాలు. అందుకని గొప్ప నిగ్రహాన్నీ ఔచిత్యాన్నీ పాటించాడు.

బ్రహ్మరాక్షసుడు నివసించే మర్రి చెట్టుని వర్ణించిన పద్యం ఒకటి రాయల వారి రచనా విధానానికి ఉదాహరణగా ప్రసిద్ధి కెక్కింది.

కాంచెన్ వైష్ణవు డర్ధయోజన జటాఘాటోత్థ శాఖోపశా
ఖాంచఙ్ఝాట చరన్మరుద్రయదవీయః ప్రేషితోద్యచ్ఛదో
దంచత్కీట కృత వ్రణ చ్ఛలన లిప్యాపాదితాధ్వన్యని
స్సంచారాత్త మహాఫలోపమఫల స్ఫాయద్వటక్ష్మాజమున్ ౬-౧౮

మొత్తం మూడు పదాల పద్యమిది. కాంచెన్ అనే క్రియతో ప్రారంభం. ఇలాంటి ఎత్తుగడలు నాచనసోమన్న పోతన్నలదగ్గర ఎక్కువగా కనప డతాయి. ఇదొక శిల్పవిశేషం. తక్కిన పద్యమంతా ఒకే సుదీర్ఘ సమాసం వట వృక్షమంత విశాలంగా గాఢంగా అల్లుకుపోయి వ్యాపించింది శబ్దాల కూర్పుతో వర్ణనీయ వస్తువుని స్ఫురింప జేసే చాతుర్యం. ఇదీ రచనాశిల్ప విశేషమే.

అర్ధయోజనదూరం జడలు గుంపులుగా అల్లుకుపోయి (జటా ఘాట)దాని శాఖోపశాఖలు వ్యాపించాయి ఆ కొమ్మల గుంపులో (అంచ త్+ ఝాట)గాలి కదులు తోంది. గాలివేగానికి(మరుత్‌రయ) పండుటాకు లు ఊడి దూరప్రాంతాలకు ఎగిరి దారుల్లో పడుతున్నాయి అలా ఆకుల్ని ఆ చెట్టు దూరం పంపుతోంది.(దవీయః ప్రేషిత) అవి క్రిమిదష్టమైన ఆకులు అక్కడక్కడా పత్రహరితాన్ని పురుగులు తిన్నాయి. అవి వ్రాసిన అక్షరాల్లాగా కనపడుతున్నాయి. (కీటకృత+ వ్రణ+ ఛలన+ లిపి). ఏమిటి ఆ లిపి? ఏమిటి ఆ అక్షరాలూ అంటే - ఇక్కడ ఒక బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు ఇటు రాకండి వచ్చారంటే ప్రమాదం, అపాయం సుమా! అని ఆ చెట్టు ఆ పత్రాల మీద అక్షరాల సందేశం రాసి, ఆ దారిని అటు వచ్చే బాటసారులకి ముందుగా హెచ్చరికలు పంపుతోందిట.ఆ మార్గాన్ని నిస్సంచారం చేస్తోందట (ఆపాది త+ అధ్వన్య+నిస్సం చార). ఇది గొప్ప పుణ్యకార్యం. బ్రహ్మరాక్షసుడి పాలపడకుండా బాటసారుల ప్రాణాలు కాపాడుతోంది. అలాంటి మహాపుణ్య ఫలంతో సాటివచ్చే ఫలాలు (పండ్లు) ఆ చెట్టుకి ఉన్నాయి అటువంటి ఫలాలతో విరాజిల్లుతున్న మహావట వృక్షాన్ని (మహాఫల+ ఉపమ+ ఫల + స్ఫాయత్+ వట+ క్ష్మాజమున్) ఆ వైష్ణవుడు కాంచెన్ అని అన్వయం.

ఇదీ స్థూలంగా రాయలవారి కవితా స్వరూపం

ధూర్జటి (క్రీ.శ 1540 ప్రాంతం)

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము (తృతీయాశ్వాసము । 58 నుంచి । 78)

అష్టదిగ్గజకవులలో ధూర్జటి ఉన్నాడని, ఈతనివంశంలో నాలుగో తరం వాడో అయిదో తరంవాడో అయిన కుమార ధూర్జటి తన రాయవాచకంలో పేర్కొన్నాడు. ఇదికాక ప్రచారంలో ఉన్న కథలుకూడా ఇందుకు సాక్ష్యం పలుకుతున్నాయి. ఇతడు శైవుడు రాయలవారు వైష్ణవుడయినా శైవులపట్ల గౌరవాదరాలతో పరిపాలన సాగించాడనడానికి అష్టదిగ్గజ కవులలో ధూర్జటి స్థానమే ఒక ప్రబల నిదర్శనమని పెద్దలు భావించారు.

ఒకనాడు కృష్ణదేవరాయలవారు కొలువు తీరి "స్తుతమతియైన ఆంధ్ర కవి- ధూర్జటి పల్కుల కేల కల్గె నీ యతులిత మాధురీమహిమ" అని ప్రశ్నించారట. స్తుతింపదగిన మతికలిగిన తెలుగు కవి ధూర్జటి పలుకులకు ఈ సాటిలేని మాధుర్యాతిశయం ఎలా కలిగింది అని రాయలవారి సందేహం. చంపకమాల పద్యంలో ప్రశ్న

దీనికి తెనాలి రామకృష్ణుడు చిలిపిగా సమాధానం చెప్పాడట అదే పద్యాన్ని కొనసాగిస్తూ "హా తెలిసెన్ భువనైక మోహనోద్ధత సుకు మార వారవనితా జనతా ఘనతాప హారి సంతత మధురాధరోదిత సుధా రసధారలు గ్రోలుటం జుమీ" అని రామకృష్ణుని సమాధానం.

మధురాధరాలనుంచి పుట్టిన (ఉదిత)సుధారసధారలను సంతతం త్రాగటంవల్ల ధూర్జటి పలుకులకు అతులిత మాధురీమహిమ వచ్చింద న్నాడు ఈ సుధారస ధారలు ఘనతాప హారులు. గొప్పదైన మన్మథ తాపాన్ని హరించేవి ఎవరి అధరాలు? సుకుమారులైన వారవనితా జనత యొక్క అధరాలు వేశ్యా జనం యొక్క పెదవులు ఆ జనం భువనైక మోహనో ద్ధతం అంటే ప్రపంచాన్నే మోహింప జెయ్య గలిగిన గొప్ప సామర్థ్యం ఉంది ఆ వేశ్యలకి, అటువంటి వేశ్యల మధురాధరాలను చుంబించి అధర సుధ లను గ్రోలడంవల్ల ధూర్జటి పలుకులకు మాధుర్యం వచ్చిందని తాత్పర్యం

దీని వల్ల ధూర్జటి వేశ్యాలోలుడని కొందరు తీర్మానించారు. ఇతడి మరొక రచన శ్రీ కాళహస్తీశ్వర శతకం అందులోనూ ఇతడి వేశ్యాలోలతను ధ్రువపరిచే పద్యాలున్నాయి అన్నారు

ధూర్జటి శివభక్తుడు శ్రీవిద్యా ఉపాసకుడు. పరమ నైష్ఠికుడు అని శ్రీకాళహస్తి మాహాత్మ్యాన్ని చదివి ఒక అభిప్రాయానికి వచ్చినవారు పై పద్యానికి మరొక నిగూఢార్థం చెప్పారు

అసలు రాయలవారు అడిగిన ప్రశ్న ధూర్జటి గురించి కానేకాదు. ఆంధ్ర కవిధూర్జటి గురించి అడిగాడు అన్నారు ధూర్జటి అంటే ఈశ్వరుడు (పొడవైన జడలు

కలవాడు వ్యోమకేశుడు). కవి ధూర్జటి అంటే కవీశ్వ రుడు ఆంధ్రకవీశ్వరుడి పలుకులకి సంస్కృతకవీశ్వరుల పలుకులకు లేని ఒక అతులిత మాధురీ మహిమ ఉంది అది ఎలా కలిగింది? అనేది రాయలవారి సందేహం ఇది ఒక్క ధూర్జటి గురించి మాత్రమే కాదు ఆంధ్ర కవిధూర్జటులు అందరిగురించీని

అడిగితే - తెనాలి రామకృష్ణుడో మరొకరో (ఈ కథ అంతాకల్పిత మేనాయె) జవాబు చెప్పారట-హా తెలిసెన్ అన్నాడు ముందు వివరం చెబుతున్నాడు. లోకాన్ని మోహపరిచే ఉద్ధతమ్మైన సుకుమార వారం పుత్ర పుత్రికా సమూహం (సు+ కుమార+ వార=సమూహం) ఇదే జీవుణ్ణి మోహపాశాల్లో బంధిస్తుంది. ఆ తరవాత ''వనితా జనతా' స్త్రీ జనం అంటే భార్యా పుత్ర రూపమ్మైన సంసారమని ఫలితార్థం. ఇది భువనైక మోహనోద్ధతం ఈ సంసారం వల్ల కలిగేది ఘనతాపం-పెను దుఃఖం దాన్ని హరించివెయ్యగలిగిన దివ్యౌషధం ఒకటి ఉంది అది ఎల్లవేళలా మధువుని రాధిస్తుంది- పీడిస్తుంది మధువుకన్నా తియ్యగా ఉంటుంది (రాధృ పీడనే) అంతటి తీపి మందు ఎక్కడినుంచి వచ్చింది? అంటే రోదితం ర+ ఉదితం- రోదితమ్ రమ్ అనే బీజాక్షర ఉపాసన వల్ల పుట్టింది ఆ తీపి మందు. ర+ ఉదితమ్మైన సుధారసధారలను అంటే ఉపాసన వల్ల లభించిన అమృతప్రవాహాలను గ్రోలటం వల్లసుమా ఆంధ్ర కవిధూర్జ టుల పలుకులకు అతులిత మాధురీ మహిమలు వచ్చాయి అని సమాధానం చెప్పాడు రామకృష్ణుడు ఇదీ అసలు ఆ కవి ఉద్దేశించిన గూఢార్థం పై పైఅర్థం గ్రహించి ధూర్జటిని వేశ్యాలోలుడు అనడం సమంజసం కాదు అన్నారు మా గురువులు కీ శే రావూరి వేంకటేశ్వర్లుగారు కావచ్చు, రామ కృష్ణుడి బాణీకి ఆ లక్షణం ఆ లోతూ ఉన్నాయి.

ఈ పద్యం మొత్తం కట్టు కథయే కావచ్చు, కానీ ధూర్జటి రాయల కొలువులో ఉన్నాడు అనడానికి ఒకానొక సాక్ష్యం అయితే శ్రీ కాళహస్తి మాహాత్మ్యంలో రాయల వారి ప్రస్తావన లేదు దాన్ని ధూర్జటి తన ఉపాస్య దైవానికి శ్రీ కాళహస్తీశ్వరుడికి అంకితం చేసుకున్నాడు

ధూర్జటి తన శతకంలో భారీగా రాజదూషణ చేసాడు. సద్గుణసంపన్ను డయిన రాజు కనిపిస్తేమాత్రం శివుడుగా భావించి నెత్తి మీద పెట్టు కుంటాను అనికూడా అన్నాడు. నిజాయితీ, ధైర్యమూ ఉన్న స్వేచ్ఛా ప్రియుడు గా సర్వ తంత్ర స్వతంత్రుడుగా కనిపిస్తాడు ఈ ధూర్జటి

ఒక సాలె పురుగు (శ్రీ) ఒక పామూ (కాళము) ఒక ఏనుగూ (హస్తి) శివుణ్ణి సేవించి ముక్తి పొందిన కథలు ఈ కావ్యంలో ఉన్నాయి కాబట్టి ఇది శ్రీ కాళహస్తి మాహాత్మ్యము మిగతా కొన్ని కావ్యాలకులాగా శ్రీ అనేది ఇక్కడ గౌరవార్థకం కాదు అద·క పాత్ర. మొత్తం మీద ఈ కావ్యం క్షేత్ర మాహాత్మ్య ప్రతిపాదకం ధూర్జటి జన్మ స్థలంకూడా శ్రీ కాళ హస్తియే అని తేల్చారు విమర్శకులు

ఈ కథల్లో తిన్నడి కథ ఒకటి, నత్కీరుడి కథ ఒకటి- ధూర్జటి ఆత్మీయతనూ శివభక్తినీ ఆత్మవిశ్వాసాన్నీ బాగా పట్టి ఇస్తాయి వాటిని అంతటి తాదాత్మ్యంతో

తీర్చిదిద్దాడు కవి నత్కీరుడి కథ ఒక కవితతో ముడిపడి మరింత ఆత్మీయంగా కవికి సన్నిహితంగా ఉంటుంది

అనగనగా ఒక పాండ్యరాజు. కవి పండిత పోషకుడు ఆయన కొలువులో ఒక శంఖ ఫలకం ఉంది పుష్పక విమానం లాంటిది అర్హుడైన కవి వస్తే ఎదిగి జాగా ఇస్తుంది ఆ శంఖ ఫలకం మీద కూర్చోవడం అనే గౌరవం పొందిన ఒకానొక కవీశ్వరుడు నత్కీరుడు రోజూ ఎవరో ఒకరు రావడం కవిత్వం వినిపించడం, నత్కీరాది కవీశ్వరులు తర్కించి నిగ్గుతేల్చడం అర్హుడైతే రాజసత్కారం ఏనుగు పాడిగా అందుకోవడం అనర్హుడైతే తిరస్కృతుడై వెళ్ళిపోవడం- ఇది ఆ కొలువులో జరుగుతూ ఉండే కథ. ఇలా ఉండగా ఆ రాజ్యంలో గొప్ప కరువు వస్తుంది వానలు కురవక క్షామం దేశాన్ని పీడిస్తుంది తిండి దొరకక నీళ్ళు దొరకక, ప్రజలు మలమలామాడి రాలిపోతున్నారు మానిసిని మానిసి తినే కరువు వచ్చింది

ఆ ఊళ్ళో ఒక శివాలయం. శివాలయంలో ఒక అర్చకుడు హరద్విజుడు ఈ కరువు తట్టుకోలేక గుడి విడిచి ఊరు విడిచి వెళ్ళిపోదాం అనుకుంటూండగా శివుడు ప్రత్యక్షమవుతాడు పాండ్యరాజుగారి మీద అరవ భాషలో ఒక పద్యం అల్లి ఇస్తాడు అది రాజుగారికి వినిపించి. పురస్కారంగా వేయి మాడలు ఇస్తాడు తెచ్చుకో ఒక ఏడాది గ్రాసానికి నీకు సరిపోతాయి అని చెబుతాడు. అది అందుకొని "అతండును నా రాజ సమ్ముఖంబునకుంబోయి, శ్రీ పరమేశ్వర ప్రణీతంబైన కవితా చమత్కారంబు వచించిన, నందలి యర్థంబు సింధురరాజగమనాధమ్మిల్ల బంధంబు సహజగంధం" బని యుండుటం జేసి" 3- 57

"సింధుర రాజ గమనాధమ్మిల్ల బంధంబు సహజ గంధంబు" అనేది ఆ తమిళ పద్యానికి భావం. సింధురం అంటే ఏనుగు గజరాజ గమనం కలిగిన ఆ స్త్రీ జుట్టుముడి (ధమ్మిల్ల బంధం) సహజ సువాసనతో అలరారుతోంది అని కవితా సారాంశం ఇది హరద్విజుడు చదివాడు కొలువులో నత్కీరుడు (నక్కీరన్) ఉన్నాడు ఆయన -

దానికి నవ్వుచు నృపసభ
లో నత్కీరుండు పలికె "లోకము నగదే
పూనుకొని సహజ గంధము
వేనలికిం గలదటన్న వేయుదెఱగులన్" (3-158)

హరద్విజుడు చదివిన కవిత్వానికి నవ్వుతూ ఆ రాజసభలో నత్కీరుడు ఇలా పలికాడు. జడకి సహజ గంధం ఉంది అని వర్ణిస్తే లోకం నవ్వదా పూనుకొని నవ్వుతుంది. వేయి తెరగులుగా నవ్వుతుంది కాబట్టి-

"తప్పిది, చెప్పరాదు, కవితా సమయంబున తొప్పగాదు, నీ
విప్పగిదిన్ రచింప దగునే?" యన, విప్రుడు చిన్నవోయి, "నా
కప్పరమేశ్వరుండు వసుధాధిపుపై రచియించి యిచ్చినా,
దొప్పను దప్పనే నెఱుగ నుత్తములార!" యటంచు గ్రమ్మఱన్(3-159)

ఓ విప్రకుమారా! ఇది తప్పు. ఇలా చెప్పరాదు కవితా పద్ధతులకీ కవిసమయానికీ ఇది ఒప్పదు (ఒప్పకాదు). నువ్వు ఈ పద్ధతిగా (ఈ ప గిదిన్) రచించడం తగునా?- అని నత్కీరుడు గదమాయించాడు తప్పడు కవిత అనే అసహనం కోపం నత్కీరుడి మాటల్లో స్ఫురిస్తోంది వాక్యాలు తుంపులు తుంపులుగా వచ్చిపడ్డాయి. కవితా ప్రమాణాలను కాపాడటం, అర్హులకే రాజ సత్కారాలు అందేట్టు చూడటం- ఇవి రెండూ నత్కీరుడి బాధ్యతలు శంఖ ఫలకం మీద తమిళ కవితా ప్రతినిధిగా కూర్చున్నాడాయె! ఆ దర్పం, ఆ ఠీవి. కనపడేట్టు వాక్యాల తుంపులు విసిరాడు ధూర్జటి.

నత్కీరుడు ఇలా జమిరేసే సరికి పాపం ఆ విప్రుడు చిన్నబుచ్చు కున్నాడు. (చిన్న పోయి) బెదిరిపోయాడు

'' ఓ ఉత్తములారా! ఈ పద్యాన్ని నాకు ఆ పరమేశ్వరుడు ఇచ్చాడు రాజుగారి మీద రచించి ఇచ్చాడు ఇందులో ఒప్పూతప్పూ నాకు తెలియవు''- అని చెప్పేసి హరద్విజుడు సభనుంచి వెళ్ళిపోయాడు తన శివాలయం చేరుకున్నాడు

వచ్చి పార్వతీశు వంక గనుంగొని
యతని పద్య మతని కప్పగించి.
''నిన్ను నమ్మి పోయి, నిండిన సభ సిగ్గు
చెడితి, నున్న కథలు చెప్పనేల?'' (3-160)

తప్పిది చెప్పరాదు --- అనేపద్యం లో చిట్ట చివరగా ''క్రమ్మఱన్'' అని ఉంది. ఈ పద్యంలో మొట్ట మొదట ''వచ్చి'' అని ఉంది. వరుస పద్యాలే కనక రెండూ కలుపుకోవాలి క్రమ్మఱన్ వచ్చి- అంటే తిరిగి వచ్చి శివుణ్ని చూసి మౌనంగా- ముందు అతని పద్యం అతనికి ఇచ్చేసి (అప్పగించి) ఇంక అందుకున్నాడు

''శివా! నిన్ను నమ్మి వెళ్ళి నిండుసభలో సిగ్గు పోగొట్టుకున్నాను. ఇది చాలదూ! ఇంకా ఉన్న కథలు (జరిగిన సంగతులు) చెప్పడం ఎందుకులే

''సర్వజ్ఞత్వము, బహుముఖ
నిర్వాహక శక్తి గుణము, నీకు గలుగగా
శర్వ! నిను నమ్మి, పౌరుష
గర్వము పోనాడుకొంటి గడపటి సభలోన్'' (3-16)

ఓ శర్వా! నీకు సర్వజ్ఞత్వం ఉందనీ బహుముఖమైన నిర్వహణ శక్తి - ఆ గుణం నీకుఉందనీ నిన్నునమ్మి కట్టకడపటికి నా పౌరుష గర్వాన్ని పోనాడుకున్నాను నిండు సభలో.''

నత్కీరుడి గద్దింపుతో హరద్విజుడి అహం దెబ్బతింది అవమాన భారంతో కుతకుతలాడిపోతున్నాడు. నిజమే మరి వేనలికి సహజగంధం ఎలా కుదురుతుంది. నత్కీరుడు కాదు పొమ్మన్నాడంటే అనడూ శివుడే మోసం చేసాడు. నన్ను ఏడిపించడానికీ, అవమానించడానికీ ఇది రాసి ఇచ్చాడు , ఇటువంటి అభిప్రాయం హరద్విజుడిలో స్థిరపడింది. అందుకని హృదయంలో కుమిలిపోతున్నాడు. గాయపడ్డాడు.

ఆక్రోశంతో మాట్లాడుతున్నాడు అవున్లే నాదే తప్పు-

"తా నెఱిగిన విద్య నృపా
స్థానములో నెఱిప గీర్తి సమకూరుంగా
కే నరునకు బరవిద్యా
ధీనత భూపాల సభల దేజము గలదే? (౩-౧౬౨)

"ఎవడయినా తాను ఎరిగిన విద్యనే రాజాస్థానాల్లో ప్రదర్శించాలి. అతడికే క్రీర్తి సమకూరుతుంది అంతే గానీ పరవిద్యాధీనతతో (పరుడి విద్యని తనదిగా చెప్పుకుని ప్రదర్శిస్తే) ఏ నరునికైనా భూపాల సభలలో తేజం కలుగుతుందా? కలగదు నేను చేసింది ఇంతే అందుకే తగిన శాస్తి అయ్యింది

"నీ మాట నమ్మి పోయిన
నా మోసము జెప్పనేల? నత్కీరునిచే
నే మాట పడ్డ దుఃఖము
క్షామవ్యథ కొలది గాదు, సద్భక్తనిధీ" (౩-౧౬౩)

నీ మాట నమ్మి ఆ పద్యం పుచ్చుకొని ఎగురుకుంటూ రాజసభకి వెళ్ళిన నా మోసం - నా తెలివి తక్కువతనం- ఇక దాన్ని గురించి చెప్పేదేమి టిలే ఓ సద్భక్తనిధీ నిండు సభలో నత్కీరునితో నేను మాటపడ్డాను ఆ అవమాన దుఃఖం ఉంది చూసావా అది ఈ క్షామబాధకి ఏ కోశానా సాటిరాదు అంతకన్నా ఈ కరువుని భరించడం ఈ ఆకలి భరించడం- ఇదే తేలిక" అన్నాడు సద్భక్తనిధీ అనే సంబోధన గాయపడ్డ హృదయం నుంచి వెలువడిన దెప్పిపొడుపు-అగ్నికణం. నావంటి సద్భక్తులకు నీవు నిధివి ఓహోహో ఇలా నమ్మించి మోసం చెయ్యడమే నీ లక్షణం

వ. **అని మఱియు నిట్లనియె-(౩-౧౬౪)**

"నా భాగ్యం బిటులుండగా దుది నిను న్నత్కీరునిం దూఱగా
నే భావ్యం? బిక జాలు నిక్కఱవుచే నిట్లైతి నెందైన గా
నీ భైక్షంబున గుక్షి బ్రోచుకొని, దీనిం దీర్చి సేవత్తు, దే
వా! భద్రం బగు నీకు, నన్ననుపవే?" యన్నం గృహామూర్తియై (౩-౧౬౫)

నాలుగు మాటలు దడదడా అనేసేసరికి గుండెలో ఆక్రోశం కొంత చల్లబడింది మరో ఆలోచన వచ్చింది మాటల వరస మారింది ఇది సూచించడానికే "అని మఱియు నిట్లనియె " అన్న చిన్న వచనం

దేవా నా భాగ్యం ఇలా ఉండగా చివరికి నిన్నూ నత్కీరుణ్నీ నిందించడం (దూఱగాన్) ఏమి భావ్యం ఇక చాలులే ఈ కరువు మూలాన ఇలా అయిపోయాను లేకపోతే నీ పద్యాన్ని నాదిగా చూపించుకునే స్థితికి నేను దిగజారను ఇలా అవమానాల పాలుకాను. పోనీలే అయ్యిందేదో అయ్యింది. నేను ఎక్కడి కయినా (ఎందైనన్) పోతాను బిచ్చం ఎత్తుకుని పొట్ట (కుక్షి) గడుపుకుంటాను. కరువుకాలాన్ని వెళ్ళబుచ్చి (దీనిన్ తీర్చి) మళ్ళీ తిరిగి వస్తాను-నీకు సేవలు చెయ్యడానికి. నీకు భద్రమే

గుగాకో దయచేసి అనుమతించి నన్ను పంపించు నాకు సెలవియ్యి

ఈ చివరి మాట శివుడికి బాగా గుచ్చుకుంటుంది తనవల్ల అవమానం పొంది తననే అనుమతి ఇమ్మంటున్నాడు భక్తి విశ్వాసాలు మాత్రం సడలలేదు దీనితో శివుడు కృపామూర్తి అయ్యాడు భక్తుడికి జరిగిన అవమానాన్ని తొలగించాలి ఆ కథ ఏమిటో తేల్చుకోవాలి అనే పట్టు దలగా మారింది ఆ కృప అంటున్నాడు-

"కటకట! యన్నత్కీరుం
డట! కవితయు దప్పు వట్టినట! యటు పదమా
యెటువలెనో తెలిసెద? " నని
నిటలాక్షుడు వచ్చి, కుంభినీపతిసభలోన్ (3-100)

అయ్యయో. ఎవడో ఆ నత్కీరుడుట కవితలో తప్పు పట్టాడుట పద- అక్కడికి వెడదాం (అటు పదమా-నడువుమా) తప్పు ఏమిటో, ఎలా తప్పో తెలుసు కుంటాను - అని సాక్షాత్తు నిటలాక్షుడు మానవరూపంతో బయలుదేరి కుంభినీపతి సభకి వచ్చాడు (కుంభిని = భూమి. నిటలము= నుదురు నిటలాక్షుడు=ఫాల నేత్రుడు) ఇక్కడ నిటలాక్షుడు అనే మాట సాభిప్రాయం తరవాత సంఘటనలో దీని అవసరం కనబడుతుంది

శివుడు రాజసభలోకి సరాసరి వచ్చి అడుగుతున్నాడు-
" ఈ రాజన్ముని మీద నే గవిత సాహిత్య స్ఫుర న్మాధురీ
చారు ప్రౌఢిమ జెప్పి పంప, విని, మాత్సర్యంబు వాటించి, న
త్కీరుం డూరకె తప్పవట్టెనట- యేదీ! లక్షణంబో యలం
కారంబో, పదబంధమో, రసమొ? చక్కం జెప్పడీ తప్పినన్" (3- 07)

"ఈ రాజన్ముడి మీద నేను కవిత చెప్పాను సాహిత్య సంబంధమై ప్రకా శించే మాధుర్యంతో అందమైన (చారు) ప్రౌఢిమతో చెప్పి పంపించాను అది విని మాత్సర్యం వహించి (పాటించి) నత్కీరుడుట - ఆయనెవరో- ఊరికే తప్పు పట్టాడట! ఏదీ చెప్పండి, నా కవితలో ఛందోవ్యాకరణ లక్షణం తప్పిందా? అలంకారంలో దోషం ఉందా? సమాసంలో (పదబంధం) పొరపాటు జరిగిందా? రసంలో ఔచిత్యం దెబ్బ తిన్నదా ? దేనికి సంబంధించి ఏది తప్పిందో (తప్పినన్) చక్కగా (వెంటనే- నేరుగా) చెప్పండి. ఇలా శివుడు నిలదీసాడు

అనవుడు, నా నత్కీరుడు
మునుపటివలె దప్పటన్న, ముక్కంటియు నా
తని కనియెన్ "గిరితనయా
ఘన కచభారంబు సహజ గంధం" బనినన్ (3-108)

అలా అనే సరికి (అనవుడున్) ఆ నత్కీరుడు మునుపటిలాగానే- అంటే హారద్విజుడితో అన్నట్టే - తప్పు అన్నాడు కేశపాశానికి సహజ గంధం ఎక్కడినుంచి వస్తుంది! ఇది లోక విరుద్ధం. కవి సమయ విరుద్ధం, పొమ్మన్నాడు మళ్ళీ

అప్పుడు ముక్కంటి తన రచనని సమర్థించుకోవడానికి ప్రమాణం చెప్పాడు పార్వతీదేవి పొడవైన కేశబంధం సహజ గంధంతోనే ఉంటుంది. కాబట్టి సింధుర రాజ గమనాధమ్మిల్ల బంధంబు సహజ గంధంబు – అని నేను రాసింది తప్పేమీ కాదు అని సమర్థించుకున్నాడు

ఈయన శివుడు కనక ఆ విషయం తెలుసు అనుభవ సిద్ధం కానీ లోకానికి? అందుకే నత్కీరు డంటున్నాడు.–

''అగణితునైనం దగు, నిల
మగువలకుం దగదు, మాను మత్సర మింకన్,
గగనప్రసూన వాదము
జగతిం బ్రత్యక్షమునకు సరి యన దగునే? (3- 69)

ఓయీ నువ్వు చెప్పేది నిజమే అది పార్వతికి అయినట్టయితే చెల్లు తుంది ఈ భూమి మీద ఉండే కాంతలకు (ఇల మగువలు=మానవ కాం తలు) తగదు వారి కేశపాశాలు సహజ గంధంతో ఉండవు అంచేత ఇక పట్టుదల (మాత్సర్యం) విడిచి పెట్టు గగన ప్రసూన వాదం తీసుకువచ్చి (ఆకాశ పుష్పం) ప్రత్యక్షానికి సాటి అనడం-అదీ ఈ లోకంలో – నీకు తగునా?

ప్రత్యక్షానుభవానికి విరుద్ధంగా ఏ లోకానిదో తీసుకు వచ్చి ముడిపెట్టి వర్ణించడం అసహజం కనక అది తప్పే అని తాత్పర్యం. అంచేత–

''లూలా మాలపు మాటలు
చాలు'' నననవలిగి, తన నిజంబగు రూపం
బాలోన దెలుపవలె నని,
నీల గ్రీవుండు నిటలనేత్రము జూపన్ (3- 70)

అది తప్పు, వృధామాత్సర్యం వద్దు – అన్నంతటితో నత్కీరుడు ఆగితే బాగుం డేది ఆగలేదు. '' ఈ లూలామాలపు మాటలు ఇంక చాలించు, కట్టిపెట్టు'' అనికూడా అనేసాడు (లూలా మాలపు మాటలు=అర్థం పర్థం లేని మాటలు) అక్కడికి పార్వతీ దేవి జుట్టుని నువ్వు వెళ్ళి సువాసన చూసి వచ్చినట్టు మాట్లాడుతున్నావే అనే వెటకారం ఉంది ఈ మాటల్లో దానితో శివుడికి కోపం వచ్చింది తన నిజమైన రూపాన్ని ఇతడికి తక్షణమే (ఆలోనన్) తెలియజెయ్యాలి అనుకున్నాడు. తన వాదాన్ని సమర్థించుకోడానికి అంతకన్నా మార్గం లేదు మరో రుజువు లేదు అందుకని ఆ నీల గ్రీవుడు (నల్లని కంఠం కలవాడు – హాలహలాన్ని గొంతులో నిలుపుకున్నాడు గదా) తన నిటల నేత్రాన్ని చూపించాడు (నిటలము=ఫాలము,నుదురు).

అది చూసి నత్కీరుడు – వచ్చినవాడు త్రినేత్రుడు అని గ్రహిం చాలి. గ్రహించాక నమస్కరించాలి ''గిరితనయాఘన కచ భారంబు సహజ గంధంబు'' అని నువ్వు చెప్పినమాట సత్యమే అయ్యుంటుంది అని అంగీకరించాలి మానవ కాంతల విషయం నీకు తెలియక అలా రాసి ఉంటావు అనాలి కానీ అలా చెయ్యలేదు

పార్వతికి చెల్లుతుంది గానీ మానవ కాంతలకు చెల్లుతుందా అన్న తన ఆక్షేపణని సడలించకుండా అహంకరించి మాట్లాడాడు రాసింది తప్పు పైగా బెదిరింపులు కూడానా అన్న ధోరణిలో ఎత్తుకున్నాడు-

"తల చుట్టువాఱ గన్నులు
గలిగిన బద్యంబు దప్పు గాదన వశమే
వల దిచ్చట నీ మాయా
విలసనములు పనికి రావు విడువు" మటన్నన్ (3- 7)

చూడు బాబూ నీకు నుదిటి మీదనే కాదు తలచుట్టూరా కన్నులు ఉన్నాసరే వాటినికూడా చూపించినా సరే నువ్వు రాసిన ఈ పద్యాన్ని తప్పకాదు అనడం ఎవడి వల్లా కాదు తప్పతప్పే అంచేత - వద్దు, నీ మాయా విలాసాలూ, గారడీ ప్రదర్శనలూ ఇక్కడ పనికిరావు చూపించకు వాటిని వదిలేసెయ్ - అన్నాడు

గారడీ విద్య ఏదో ప్రదర్శించి మూడో కన్ను సృష్టించి శివుడు అనిపించి అంగీకారం పొందుదాం అనుకుంటున్న ఒక మాయావిగా భావించాడు శివుణ్ణి నత్కీరుడు అహంకారం వల్ల బుద్ధిమాంద్యం వచ్చి మోహానికి లోనయ్యాడు మాట తూలాడు అపచారం చేసాడు మరి దానికి శిక్ష ఉంటుంది కదా

శపియించెం బ్రతిభాషల
గుపితుండై రుద్రు డతని "గుష్ఠవ్యాధిం
దపియింపు" మనుచు దానికి
నపరిమిత భయమ్మునంది. యత డిట్లనియెన్ (3- 72)

వెంటనే శివుడు శపించాడు నత్కీరుడి మారు సమాధానానికి (ప్రతి భాషలన్) కోపం వచ్చి రుద్రుడై శపించాడు

నత్కీరుడి ప్రతిపాదనలో దోషం లేదు కానీ ప్రతిభాషణలో దోషం ఉంది అహంకారం ఉంది సామాన్యుల అహంకారంవల్ల సమాజానికి కీడు అట్టే ఉండదు అదీ సామాన్యంగానే ఉంటుంది కానీ నత్కీరుడిలాంటి మహోన్నతులకు ఇంత అహంకారం ఉంటే లోకానికి కీడుకూడా మహోధృతంగానే ఉంటుంది అందుకని కాబోలు తీవ్రమైన పెద్దశాపమే ఇచ్చాడు "కుష్ఠవ్యాధితో తపింతువుగాక" అనేసాడు

ఇప్పటికి నత్కీరుడి కళ్ళు తెరుచుకున్నాయి అహంకారపు పొరలూ, మోహపు తెరలూ విడిపోయాయి అపరిమితంగా భయపడిపోయాడు

"స్వామీ! ద్రోహము జేసితిం, దెలుపవే శాపాంత ముద్యత్కృపా
ధామా! నా" కనుచున్ బదాబ్జములమీదం బడ్డ, నా భక్తర
క్షామందారుడు శాంతి బొంది,యనియెం"గైలాస శైలంబు గం
టే మానుం బద" మన్న నందులకు దా డెందంబునం గుందుచున్ 3-173

ఓ స్వామీ ద్రోహం చేసాను క్షమించు ఓ కృపాధామా (దయాలవాలా) శాపవిమోచన మార్గం ఏమిటో (శాపాంతంబు) తెలుపవా నాకు - అంటూ పాద పద్మాలమీద పడ్డాడు

శివుడు భోళా శంకరుడు భక్త రక్షణకు కల్పవృక్షం(మందారం) వెంటనే శాంతించాడు '' నా కైలాస పర్వతాన్ని దర్శించినట్టయితే నీ కుష్ఠురోగం మాసిపో తుంది అదే శాప విమోచన బయలుదేరు అన్నాడు పాపం నత్కీరుడు హృదయంలో పరితపించాడు

పదము' అనే మాట నత్కీరుడికీ కావచ్చు లేదంటే తనతో హరద్విజుడికీ కావచ్చు శాప విమోచనం చెప్పేసాడు ఇక పద నాయనా అని హరద్విజుడితో బయలు దేరి తన గుడికి వెళ్ళిపోయాడు నత్కీరుడికి మాత్రం గుండెల నిండా దిగులు మిగి లింది ఇది స్వయంకృతం పశ్చాత్తాపంతో తననితాను నిందించుకుంటున్నాడు

'' ఈ కవితాభిమానము వహించితి నేటికి? శంభు పీఠపై
నీ కవులున్నయట్లు వసియింపక దేవునితోడ నేల చా
ర్వాక మొనర్చితిం? గడు భరంబగు కుష్ఠరుజా విషాద మే
నే కరణిన్ భరింతు? నిక నెన్నడు చూచెద వెండి గుబ్బలిన్! (౩- 74)

(చార్వాకము=అప్రామాణికమైన మొండివాదన ఏ కరణిన్= ఏ విధంగా వెండిగుబ్బలి=వెండికొండ)

ధూర్జటిది చాలా ప్రసన్నమైన కవిత అందునా ఇది కరుణం ఏ వివరణా అవసరం లేదు హాయిగా నడచిపోయాయి పద్యాలు వెండి కొండకి వెళ్ళాలంటే దగ్గిరా? దాపా? నడక తప్ప మరో ప్రయాణ సాధనం ఉందా?

'' ఎన్ని మహానదుల్, వనము లెన్ని, గిరీంద్రము లెన్ని బోయ వీ
ళ్లెన్ని, మృగంబు లెన్ని, జన హీనములైన పథంబు లెన్ని, నే
నిన్నియు దాటి, యే కరణి నీశ్వరు శైలము చూడబోయెదన్!
గన్నది కాదు విన్నయది గాని, సదాశివ! యేమి సేయుదున్!(౩- 75)

ఈశ్వర శైలాన్ని ఎలా వెళ్ళి చూడటం ఎప్పుడూ ఎవ్వరూ వెళ్ళింది కాదు చూసింది కాదు కాకపోతే విన్నాం ఉత్తర దిక్కున ఉంది అనీ అదే శివుడికి ఆవాసమూ అనీ, పెద్దలు చెప్పగా విన్నదే కానీ కన్నది కాదు ఓ సదాశివా (ఎల్లవేళలా శుభ ప్రదుడా) ఏమి చెయ్యను స్వామీ దారిలో ఎదురయ్యే అడవులూ క్రూరమృగాలూ రాక్షసులూ దగ్గరవుతున్న కొద్దీ పెను మంచు వానలూ కాళ్ళకి గాయాలు చేసే రాళ్ళూ రప్పలూ- ఆ దారుల్లో ప్రయాణం చెయ్యడం శక్యమా ఎలాగ స్వామీ

''హరి శార్దూల మదేభ ఖడ్గ శరభ వ్యాకీర్ణముల్, రాక్షసో
త్కర సంచార నివాసముల్, హిమపయోధారాళ వర్షంబు, లు
ద్ధుర సంఘర్షణ బాధకోపలము లా త్రోవల్, సనన్ శక్యమే?
కరుణా సాగర! భక్తవత్సల! శివా! గౌరీశ! యెట్లోగదే! (౩- 76)

ఇలా భయపడిపోయి మీనమేషాలు లెక్కపెడుతూ కూచుంటే ఏమి లాభం? బయలు దేరాలి క్షణం ఆలస్యం చెయ్యకుండా బయలు దేరా లి కుష్ఠవ్యాధి సోకి, ముదిరి నడవలేక దేకుతూ వెళ్ళవలసిన పరిస్థితి వచ్చేలోగానే కైలాసానికి

సాధ్యమైనంత దగ్గరికి చేరుకోవాలి- అనుకుంటూ కుష్ఠువ్యాధినీ అది అంచెలంచెలుగా ముదరడాన్నీ ఊహించుకుంటున్నాడు నత్కీరుడు-

"తివిరి యంగమ్ముల దిమ్మి రెత్తక మున్న
యెడలెల్ల మచ్చలు జెడక మున్న
దళ మెక్కి గాత్రంబు చెలువు తప్పక మున్న
బుడుపులు మేన నేర్పడక మున్న
యలత విగ్రహమున నంకురింపక మున్న
కాయంబు పెడరూపు గాక మున్న
తనువున జీము రక్తములు గారక మున్న
దేహ మీగలు మూగి తినక మున్న
భైక్ష మడుగంగబోయిన పల్లె జనులు
చూడ రోయక మున్న, కాలాడినపుడ
నడువవలె గాక కైలాసనగము జూడ-
హరుని వాక్యంబు శక్యమే పరిహరింప" (3-177)

కుష్ఠవ్యాధి సోకింది అనడానికి లక్షణం అవయవాలు తిమ్మిరెక్కడం స్పర్శ కోల్పోవడం (తివిరి=వ్యాపించి) అటుపైని తెల్లగా గానీ నల్లగా గానీ మచ్చలు (పొడలు) వస్తాయి ఒళ్ళంతా మొద్దుబారిపోయి (దళము ఎక్కి), చర్మం దళసరిగా తయారై ఏనుగు చర్మంలా ముడతలు పడిపోతుంది సౌందర్యం అంతా (చెలువు) నాశనం అయిపోతుంది- చెలువు తప్పతుంది అటుపైని బుడిపెల్లాగా కురుపులు వస్తాయి చెప్పలేనంత అలసట శరీరంలో (విగ్రహంబునన్) ఏర్పడుతుంది కాయం అంతా వికృతం గా (పెడరూపు) తయారవుతుంది ఆ బుడిపెలు చిట్లి చీమూ రక్తం కారు తూ ఉంటుంది స్పర్శ ఉండదేమో కంటికి కనిపించే చోట తప్ప మిగతా చోట్ల కారుతున్నట్టుకూడా తెలీదు దేహం నిండా ఈగలు మూగి చంపుకు తినేస్తూ ఉంటాయి తోలుకునే ఓపికా ఉండదు స్పర్శా ఉండదు.

అనాది జన్మం బాబయ్య - బిచ్చం వెయ్యండి బాబయ్యా అని ఎవ రింటికైనా వెళ్ళి గుమ్మంలో నిలబడితే జనాలు చూడటానికే అసహ్యించు కుంటారు వాళ్ళ చూపుల్లో రోత స్పష్టంగా కనబడుతుంది

కాలు ఆడినపుడే నడవాలి కైలాసనగం చేరుకోవాలి హరుని వాక్యాన్ని (శాపాన్ని) ఎవడూ ఏ రకంగానూ పరిహరించలేడు

నత్కీరుడు దృఢంగా ఒక నిశ్చయానికి వచ్చేసాడు ఉత్తర దిక్కుకి బయలుదేరాడు

"అనుచు చింతాపరంపర లనెడు వర్ష
ముడిగి, నత్కీరు డను మేఘు డుత్తరంబు
నడచె, సంతోషమున దక్షిణమున నున్న
కవుల ముఖపంకజములు వికాస మొందు. (3-178)

తన ఆలోచనాపరంపరలు అనే వర్షధారల్ని చాలించుకుని (ఉడి గి), నత్కీరుడు అనే మేఘుడు ఉత్తరదిశకు నడిచాడు. ఇక దక్షిణ దిక్కున నత్కీరుడు లేడు. వర్షాకాలం వెళ్ళిపోయి, శరత్కాలం వస్తే ఎంత తెరిపిగా ఉంటుందో - అంత తెరిపిగా ఉంది దక్షిణ దేశం. దక్షిణ దిక్కున ఉన్న కవుల ముఖపద్మాలు సంతోషంతో వికసించాయట. శరదృతువులో పంకజాలు వికాసం పొందినంత ఆనందం దక్షిణాపథకవుల ముఖాల్లో కనబడుతోంది. నత్కీరుడు వెళ్ళిపోయాడంటే-పీడ విరగడయ్యింది రా భగవంతుడా అని తక్కిన కవులంతా సంతోషించారని. ఇది ఆ కవుల మాత్సర్యాన్ని తెలియజేయడంకన్నా నత్కీరుడి అహంకారాన్నీ, దౌష్ట్యాన్నీ తెలియజెబు తోంది. వాళ్ళని అంతగా ఏడిపించుకుతిన్నాడన్న మాట. ఇది నత్కీరుడికి సహజ లక్షణ మన్నమాట. అదే దూకుడు శివుడిమీదా చూపించాడు. శాపగ్రస్తు డయ్యాడు.

నానాకష్టాలూ పడి వెడుతోంటే కుమారస్వామి ప్రత్యక్షమై ''శివుడు కైలాసం చూడ మన్నాడే కానీ ఉత్తర దిశా కైలాసం అనలేదు కదా, అంచేత దక్షిణ కైలాసం చూచినా చాలు, కుష్ఠరోగం మాని పోతుంది'' అని ఉపాయం చెబుతాడు. శ్రీకాళహస్తి దక్షిణ కైలాసం. దాన్ని సందర్శించి నత్కీరుడు శాపవిముక్తు డయ్యాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మంటాడు.

అప్పటికి నత్కీరుడి అహంకారం పటాపంచలు అయ్యింది. జ్ఞానో దయంతో అడిగాడు-

'' ఈ సంసారము, దుఃఖా
వాసానందంబు, దీని వర్జింపంగా
నే సుఖము గలుగు దయ న
న్నా సుఖమున గూర్చవే ! కృతార్థుడ నగుదున్'' (3-221)

అప్పుడు శ్రీకాళహస్తి పుర దైవం సంతోషించి ఆ కవికి సాయుజ్యం అనుగ్రహించాడు.

రాచరికంలో ఉంటూ, రాజులనే బాహాటంగా తిట్టిన ధైర్యశాలి ధూర్జటి . సాహసి. సత్ప్రవర్తనకూ, సౌశీల్యానికీ, పట్టం కట్టి, జీవితం గడిపి, తాత్త్విక చింతనతో నిత్య చిత్త స్థిత శివుడై సాయుజ్యం పొందిన మహానుభా వుడుగా కనిపిస్తాడు తన శతకంలో. అందులో ప్రతిపద్యమూ జీవితాను భవంలో పండి, కుతకుతలాడుతూ గుండెలు చీల్చు కొని, నెత్తురు జీరతో వచ్చి పడినదే.

రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయంబు --- అన్నప్పుడు గానీ, రాజన్నంతసె పోవునా కృపయు - అన్నపుడుగానీ, కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురు--- అన్నపుడు గానీ, కాయల్గాచె వధూ నఖాగ్రము లచే కాయంబు --- అన్నపుడు గానీ, ఆలంచున్ మెడగట్టి దానికి నపత్య శ్రేణి గల్పించి --- అన్నపుడు గానీ, మల భూయిష్ఠ మనోజధామము సుషుమ్నా ద్వారమో --- అన్నపుడు గానీ, - మనకు కనిపించేది ఆ నెత్తుటి జీరయే. జీవితంలో ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నాడో ఏమో!

దుష్ట రాజుల్ని ఎంతగా నిందించినా శిష్టరాజుల్ని నమస్కరిస్తాను ఉంటే చూపించమన్నాడు

"పది వేలైనను లోకకంటకులచే బ్రాపించు నర్థమ్ము నా
మదికిం బథ్యము గాదు సర్వమునకున్ మధ్యస్థుడై సత్యదా
నదయాదుల్గల రాజు నా కొసగు, మెన్నన్ వాని నీయట్ల చూ
చి దినంబున్ ముద మందుదున్ గడపటన్ శ్రీ కాళహస్తీశ్వరా! (౨౮)

లోక కంటకులైన రాజులు ఎంతో ఆదరంగా గౌరవంగా పదివేల రూపాయలు ఇచ్చినా ఆ సొమ్ము (అర్థమ్ము) నా మనస్సుకి రుచించదు హితవుకాదు (పథ్యము కాదు) అన్నిటికీ మధ్యస్థుడుగా ఉంటూ (ఎవరి కొమ్మూ కాయకుండా పక్షపాతం లేకుండా) సత్యం దాతృత్వం, దయ మొదలయిన ఉత్తమ గుణాలు కలిగిన రాజుని నాకు చూపించు అతనిని రోజూ (దినంబున్) నీలాగా (శివుడిలాగా) చూసు కుంటాను సేవిస్తాను కట్టకడపటికి ఆనందిస్తాను (ముదము అందుదున్) అని ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వరుడికి మొరపెట్టుకున్నాడు అప్పట్లో శిష్టరాజులు గగన కుసుమాలు అయిపోయారన్నమాట అందుకే అందర్నీ తిట్టిపోసి రాజశబ్దం ఛీ ఛీ జన్మాంతరంలోకూడా నాకు వద్దు మహాప్రభూ అన్నాడు

తెలుగు సాహిత్యంలో బహుళ ప్రచారం పొంది అధిక సంఖ్యలో వెలువడిన కావ్య ప్రక్రియ శతకం ఇది ఆత్మావిష్కారానికి ఎక్కువ వెసులుబాటు ఇచ్చే ప్రక్రియ మాకు ప్రసన్నుడయ్యెడున్ ' అనే మకుటంతో నన్నయ రచించిన నాలుగు పద్యాలు (ఉదంకోపాఖ్యానం ఆదిపర్వం) శతక ప్రక్రియకు మార్గదర్శకాలు అని పెద్దలు అంటారు మిగితా చాలా ప్రక్రియలకులాగానే శివకవులే దీనికీ శ్రీకారం చుట్టారు వంద పద్యాలు (నూట ఎనిమిది) ఉండటం మకుటం ఉండటం దేనికది ముక్తకాలు కావడం అనేవి శతక లక్షణాలు సంఖ్య వందదాటి పోయినా అక్కడక్కడా మకుటం మారినా సర్వేశ్వర శతకమే తెలుగులో మొదటిది అని కొందరు అంటారు ఈ మినహాయింపులకి అంగీకరించని వారు పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకమే మొదటిది అంటారు ఏది మొదటిదైనా కవితాపరంగా ఆర్తి పరంగా భక్తి శతకాలలో శ్రీకాళహస్తీశ్వర శతకమే అగ్రగణ్యం అటుతరువాత ఒక్క దాశరథి శతకానికే ఈ కోవలో ఇంతటి ప్రాచుర్యం ప్రాశస్త్యం లభించాయి

సామాజిక అన్యాయాలను దేవుడితో మొర పెట్టుకోవలసిరావడమే దారుణం ఆకసి ఆర్తి తిరుగుబాటూ, భక్తిశతకాలలో చాలా ఘాటుగా కనిపిస్తుంది కథతో ముడి లేకపోవడంతో శతకకవికి అన్ని విధాలా స్వేచ్ఛ ఉంటుంది ఆత్మావిష్కారానికి అవకాశం ఎక్కువ ఉంటుంది సామాజికాంశాలను తడిమే వీలుంటుంది ఈ స్వేచ్ఛతోనే ఈ ప్రక్రియ చిరంజీవిగా వర్ధిల్లుతోందని శ్రీ చేకూరి రామారావుగారు చేసిన విశ్లేషణ సమంజసమే భాషాపరంగా కూడా ఈ స్వేచ్ఛ కనపడుతుంది వ్యాకరణ నియమాల ఉల్లంఘన శతకాలలోనే ఎక్కువ

తెనాలిరామకృష్ణుడు (క్రీ.శ. 1485-1560)

పాండురంగ మాహాత్మ్యము (ద్వితీయ. 31 నుండి 65)

తెనాలి రామకృష్ణుడి పేరు చెప్పగానే రాయలవారి కొలువులో విదూషకుడుగా ఏవో చవకబారు హాస్యకథలు గుర్తుకు వస్తాయి కానీ ఇతడి రచన పాండురంగ మాహాత్మ్యం చదువుతుంటే ఉదాత్తమైన హాస్య ప్రీతి ఉదారమైన కవితా రీతి కనిపిస్తాయే తప్ప మరొక అభిప్రాయం కలగదు అష్టదిగ్గజ కవులలో ఇతడు ఉండి ఉంటే బహుశ ఛలోక్తి ప్రియుడై సరస సంభాషణ చతురుడై ఉంటాడు సరసకవివి ' అని పాండు రంగ మాహాత్మ్యకృతిభర్త ఇతడిని ప్రశంసించాడు (-23). ఈ సరసత ఆసరాగా తదనంతరకాలంలో లోకులు కట్టుకథలు అల్లి తమ బలహీనతకు రామకృష్ణ కవిని ఆలంబనం చేసుకుని ఉంటారు. కొందరు మహాకవులకు ఇదొక దురదృష్టం సంస్కృతంలో కాళిదాసుకి ఈ గతి పట్టింది

ఇతడి పేరు రామకృష్ణుడా ? రామలింగడా ? అని ఒకప్పుడు చాలా చర్చలు జరిగాయి ఆదిలో తల్లి దండ్రులు పెట్టిన పేరు రామలింగడనీ తరవాత భట్టరు చిక్కాచార్యుల వద్ద విశిష్టాద్వైతం ఉపదేశం పొంది రామకృ ష్ణుడు అయ్యాడనీ తెనాలి అగ్రహార నిర్ణేత కావడం వల్ల ఇంటిపేరు అదే అయ్యిందనీ ఉద్భటారాధ్య చరిత్ర పీఠికలో శ్రీ శే నిడదవోలు వెంకటరావు గారు ప్రతిపాదించారు

పాండురంగ మాహాత్మ్యమే కాక ఇతడు లింగపురాణం ఉద్భటారాధ్య చరిత్ర కందర్పకేతు విలాసం, పాండురంగ విజయం హరి లీలా విలాసం ఘటికాచల మాహాత్మ్యాలను రచించాడని తెలుస్తోంది వీటిలో ఉద్భటారాధ్య చరిత్ర ఘటికాచల మాహాత్మ్యాలు దొరుకుతున్నాయి వీటిని పాండురంగ మాహాత్మ్యంతో పోల్చిచూసి ఇవి తెనాలి రామకృష్ణుని రచన లు కావేమో అని సంశయిస్తున్న విమర్శకులు నేటికీ ఉన్నారు అది యట్లుండె

విశిష్టాద్వైతాన్ని స్వీకరించి వైష్ణవ క్షేత్ర మాహాత్మ్యాన్ని కావ్యంగా రచించినా రామకృష్ణుడు వీర వైష్ణవుడు కాదు శివద్వేషం లేని సమన్వయ వాది పాండురంగ మాహాత్మ్యంలో కథకుడు శివుడు శ్రోతలు పార్వతీ షణ్ముఖులు అవతారికలో హరిహరులు ఇద్దరినీ స్తుతించాడు భేదములేని భక్తిని చూపించాడు అంచేత రామలింగడు అన్నా రామకృష్ణుడు అన్నా వచ్చే పేచీ ఏమీ లేదు

ఇతనికి ''వికటకవి'' అనే పేరు స్థిరపడింది ఇది కేవలం హాస్య కథలవల్ల ఏర్పడింది కాదు ' వికటకవి' అనే మాటను ఎటునుంచి చదివి నా ఒక్కలాగే ఉంటుంది అదొక శబ్ద చమత్కారం కాగా ఆలంకారికులు ''వికటత్వమ్ ఉదారతా'' అన్నారు కవితా మహితమైన కావ్యాంగాలు అన్నింటా ఉదారతను నిర్వహించగలిగిన కవీశ్వరుణ్ని వికటకవి అనాలి కథనంలో భావంలో భాషలో కూర్పులో అన్నింటా ఉదారత కనిపించే ప్రౌఢప్రబంధం పాండురంగ మాహాత్మ్యం క్షేత్ర కావ్య శాఖలో మరొక అనర్ఘరత్నం సంస్కృత కవులలో మురారి (అనర్ఘ రాఘవ నాటకకర్త) తెలుగు

కవులలో రామకృష్ణుడు- ప్రశస్త వాగ్విలక్షణులు వీరి ఊహలు పయనించే దారులు గానీ వీరి చేతికి అందివచ్చే పదాల తీరులు గానీ చాలా విలక్షణంగా ఉంటాయి

పాండురంగ మాహాత్మ్యం పేరు చెప్పగానే అందరికీ నిగమశర్మో పాఖ్యానం గుర్తుకి వస్తుంది అంత అందంగా పుష్టిగా నిర్వహించాడు ఆ కథను తీర్థక్షేత్ర దైవత మహత్త్వాలను ప్రతిపాదించే అందమైన కథలు ఇంకా చాలా ఉన్నాయి ఈ కావ్యంలో

పాండురంగ విట్ఠలుడు దైవతం అతడు దర్శనం అనుగ్రహించిన చోటు పుండరీక క్షేత్రం అక్కడ ఉన్నది పుండరీక తీర్థం ఘర్మవీరా భైమీ నదుల సంగమ స్థలం భైమికి దక్షిణ తీరంలో యోజనదూరంలో ఈ తీర్థం ఉంది తీర్థక్షేత్రాలకు రెండింటికీ ఒకటే పేరు (క్షేత్రపాలకుడు మాత్రం కాలభైరవుడు) ఈ పేరు ఎలా ఏర్పడిందో చెప్పే కథ పాండురంగ మాహా త్మ్యంలో అతి ప్రధానమైనది

పుండరీకుడు ఒక మహాతపస్వి. బ్రహ్మ విద్యావేత్త నిష్కలంక చరిత్రుడు మాతా పితృభక్తి పరాయణుడు అంతరింద్రియాలనూ బహిరింద్రియాలనూ జయించి నిరంతరం యోగనిష్ఠతో శ్రీ కృష్ణపరమాత్మ ను ధ్యానిస్తూ సుదీర్ఘమైన తపస్సు చేసాడు పరమాత్మ సంతోషించి బాల కృష్ణ రూపంతో ప్రత్యక్షమయ్యాడు వరాలు ఇస్తాను కోరుకోమన్నాడు '' ఈ రూపంతో ఇలాగే ఇక్కడే నువ్వు ఉండిపోవాలి ఈ క్షేత్రానికీ ఈ తీర్థానికీ నా పేరు నిలవాలి' - అని పుండరీకుడు కోరుకున్నాడు స్వామి ''తథాస్తు అన్నాడు ఇదీ ఆ తీర్థక్షేత్రదైవతాల కథ ఈ కథను సాంగోపాంగంగా తీర్చిదిద్ది కండ పట్టించి ప్రాణం పోసాడు రామకృష్ణ కవి

పుండరీకుడికి ప్రత్యక్షమైన శ్రీ కృష్ణుడి రూపాన్ని అపూర్వంగా దర్శించి అద్భుతంగా వర్ణించాడు ఈ మహాకవి

యతీశ్వరుల హృదయాలలో సంచరిస్తున్నట్టు గోవర్ధన పర్వత గుహలలో విహరించడం కొండకొమ్మున నెమలిలా రాధికా హృదయం మీద వాలడం మేఘాలను తోలే ఇంద్రుడిలా రంగురంగుల ఆలమందలను మేపడం పద్మవనంలో హంసలా స్నేహితులతో కేరింతలు కొట్టడం చంద్ర బింబానికి స్వరం నేర్పుతున్నట్టు తెల్లని శంఖాన్ని ఊదడం- ఇలాంటి ఆటలన్నీ కట్టిపెట్టి ఆ దేవకీ తర్ణకం (కోడెదూడ బిడ్డ) పుండరీకుడి పర్ణశాలకు వచ్చి ప్రత్యక్షమయ్యింది (౨-౩) ఆ తర్ణకం పాద పద్మాలకు బంగరు టందెలు మ్రోగుతున్నాయి ఆ మ్రోతను కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు

లలిత శిరీష పుష్ప మృదులంబులు నీ చరణంబు, లక్కటా
యిల యిది రూక్ష మిట్టి లలయించుట కాదని ప్రార్థనా మృదూ
క్తులు సెలగంగ వేపొదివి తొల్చదువుల్ తగు విన్నపంబులన్
బలుమఱు జేయు చందమున బంగరుటందియ లుగ్గడింపగన్(౨-౩౨)

యదు బాలుని పాదపద్మాలకు బంగారపు అందెలున్నాయి ఆ అందెలు మ్రోగుతుండగా (ఉగ్గడింపన్) స్వామి నడిచి వచ్చి ప్రత్యక్షమయ్యాడు.

తొలి చదువులైన వేదాలు ఆ పాదాలను పొదివి పట్టుకుని అడుగడుగుకీ

చేతవోలు

మాటి మాటికీ (పలుమరు) తగిన విన్నపాలను చేస్తున్నట్టు ఉంది ఆ అందెలమ్రోత ఏమి విన్నవిస్తున్నాయంటే -

స్వామీ నీ చరణాలు లలితమైన శిరీషపుష్పాల్లాగా (దిరిసెన పువ్వులు) మృదులమైనవి అయ్యయ్యో ! నేల ఇది రూక్షం అతి కఠినం ఇట్లా నీ పాదాలను కష్టపెట్టడం (అలయించుట=అలసిపోయేలా చేయడం) తగదు-కాదు అని ప్రార్థనా మృదూక్తులతో (చెలగంగ) విన్నపాలు చేస్తున్నట్టు అందెలు మ్రోగుతూండగా స్వామి వచ్చేసాడు

అందెల మ్రోతను వేదాల విన్నపంగా కవి ఉత్ప్రేక్షించాడు అవి ఆ స్వామి పాదాలను వేగంగా పాదువుకున్నాయట ఆ పాదాలు వేద ప్రతిపా ద్యాలు వేద గమ్యాలు

సృష్టిలో పువ్వులే అసలు మృదువైనవి వాటిలోకెల్లా శిరీష పుష్పం మరీ మృదువు శిరీష కుసుమ పేశల సుధామయోక్తుల పెద్దనార్య-అన్నా డుట రాయల వారు ఇంకా మృదువైనవి అని చెప్పడం కోసం ' లలిత శిరీష పుష్ప ' అనడం సుకు మారాతిసుకుమారమైన పాదాలు అని. అవి కటికి నేలమీద నడవడం ' రూక్షము'' అన్నాడు ఆ పదంలోనే కాఠిన్యం ఖంగు మంటోంది

ఎంత వేదాలయినా ప్రార్థనాపూర్వకంగా మృదూక్తులతో విన్న వించుకోగలవే కానీ వద్దు అని నిషేధించలేవు శాసించలేవు స్వామి భక్త పరాధీనుడని వాటికీ తెలుసు అయినా ఉండబట్టలేక విన్నవించడమే వేద పఠనంలో పదావృత్తి- పున: పున: జరుగుతూ ఉంటుంది. అందుకనే విన్నపంబులన్ ''పలుమరు'' చేయు చందమున అన్నాడు

ఇంతకీ కృష్ణయ్య పాదాలకు బంగారు అందియలు ఉన్నాయి. అటు పైని మొలకి గోళీసంచులు నాలుగు వ్రేలాడుతున్నాయట ఆలమందలు బీడులో మేస్తోంటే స్వామివారు మిత్రబృందంతో చెట్టుక్రింద గోళీలు ఆడు కుంటారన్నమాట అందుకని నాలుగు గోళీసంచులు (గచ్చకాయల సంచు లు) ఎప్పుడూ మొలకి కట్టుకుని సిద్ధంగా ఉంచుకుంటాడు కాబోలు. ఆ సంచీలను ఉత్ప్రేక్షిస్తున్నాడు

మెత్తగ నూరిన చుట్టుం
గత్తిన్ మధుకైటభోరు కంఠరము లలనా
ఁదొత్తిన హత్తిన చేదుం
దిత్తుల క్రియ దొడల నుడ్డ తిత్తులు వ్రేలన్ (౭-౩౩)

మధుడు-కైటభుడు అనే రాక్షసుల్ని విష్ణుమూర్తి అలనాడు తన చక్రా యుధంతో సంహరించాడు చుట్టుకత్తి-చుట్టుం గత్తి అంటే గుండ్రని ఆయుధం సుదర్శన చక్రం దాన్ని మెత్తగా నూరి బాగా పదును పెట్టి ఆ ఇద్దరు రాక్షసుల ఉరు కంఠాలను (బలిసిన మెడలు) ఒత్తేసాడు ఒత్తడం అంటే చప్పడు కాకుండా తెగెయ్యడం (మీసాలు ఒత్తుట చెంపలు ఒత్తుట- అని వాడుక) అలా ఒత్తిన రోజున

వాళ్ళ ఊపిరి తిత్తులు స్వామికి హత్తాయి- లభించాయి

చేదడం అంటే తోడటం-గాలిని చేదుకోవడానికి ఉపయోగించే తిత్తులు కనక శ్వాసకోశాలను ''చేదుం దిత్తులు ' అన్నాడు ఇద్దరివీ చెరో రెండూగా నాలుగు ఊపిరితిత్తులు ఆ తిత్తులో అన్నట్టుగా నాలుగు సంచులు- బహుశా అటు రెండూ ఇటు రెండూ-తొడలమీద వేలాడుతున్నాయి

'' ఉడ్డ ' అనేది నాలుగు అనే అర్థంలో అచ్చికపదం ఉడ్డాముగ్గురు అనేది రాయలసీమ వాడుక ఏడుగురు అని క్రియన్ అనే పదాన్ని వలెన్ అనే అర్థంలో ఉపయోగించాడు అటుపైని ' మంద ప్రోయాంధ్ర కూరిమి ప్రూని పండ 'యిన కృష్ణుని జఘనం వర్ణిస్తున్నాడు

మాయావృతు డగు నాత్మని
సోయగమున దెగడ తీగ సోగలు ముచ్చు
ట్టై యునికి సంగరహితం
బై యున్- కాకున్న జఘన మభిరామ మగున్ (2-34)

కటి ప్రదేశానికి పట్టుపీతాంబరం లేదు కాబట్టి సంగరహితంగా ఉంది అలాగని దిగంబరంగానూ లేదు తెగడతీగ సోగలు మూడు చుట్లుగా-మూడు పేటలుగా చుట్టు వేలాడుతున్నాయి ''తెగడతీగ సోగలు'' అంటే పొడపైన త్రివృతాలతలు అని రాసారు తమ సంజీవనీ వ్యాఖ్యలో శ్రీ వంతరాం రామకృష్ణారావు గారు (సోయగ మునన్=వలెన్)

మూడు చుట్లుగా ఆ తీగలు ఉన్నాయి కనక (ఉనికిన్) సంగరహితమ్మైనా, ఆ జఘనం దిగంబరం కాకుండా అభిరామంగా ఉంది సంగ రహిత మయ్యీ సంగ రహితం కాకున్న జఘనం అని

అది ఎలా ఉందంటే-మాయావృతు డగు ఆత్మని సోయగము నన్ ఉంది. ఆత్మ స్వతఃగా సంగరహితుడు ఏ సంసార బంధాలూ లేవు కానీ మాయావృతు డైనప్పుడు సంగరహితుడు కానట్లు కనిపిస్తాడు. ఏవో సంగా లు- బంధాలు ఉంటాయి అవే మాయ సత్త్వ రజస్తమో గుణాలు ఇవే ముచ్చుట్టు తీగలు ఈ తీగలు చుట్టుకొని ఉన్నాయి కనక ఆత్ముడు స్వతఃగా సంగరహితుడే అయినా ఇప్పుడు సంగరహితుడు కానట్టు కన్పిస్తాడు

సంగరహితుడు కాడు- అనే చోట ,రహితుడు -కాడు అని రెండు వ్యతిరేకార కాలు ఉండటంతో అనుకూలార్థం వస్తుంది సంగరహితుడు కాడు అంటే సంగ సహితుడు అని ఫలితార్థం.

ఒకప్పుడు సంగరహితమ్మైన స్వామి జఘనం ఇప్పుడు తీగెలతో సంగ సహితమ్మై అభిరామంగా ఉంది-మాయావృతమ్మైన ఆత్మలాగా. జఘన వర్ణన అయిన తరువాత చిన్ని కృష్ణుని చిరు బొజ్జను వర్ణిస్తున్నాడు

ఇట నభ, మిట భూవలయం,

బిట బలిసద్మంబు నుండు నెలవు లివి యనన్,

బటువు లగు వళుల చెలువున,

బుట పుటనై యున్న చిన్నిబొజ్జ కదలగన్ (2-35)

కృష్ణయ్య పరుగు పరుగున వస్తోంటే నిగ నిగల చిన్ని బొజ్జ కదలాడుతోంది. (పుట పుటనై యున్న=నిగ నిగ లాడుతున్న) ఆ చిఱుబొజ్జ మీద మూడు మడతల ముడతలు (వళులు) ఉన్నాయి. అవి స్ఫుటంగా పటువుగా ఉన్నాయి. మూడు అరలకు గుర్తులుగా ఉన్నాయి

ఇదిగో ఇక్కడ ఆకాశం ఇక్కడ భూగోళం ఇక్కడ పాతాళం (బలి సద్మం) ఉండే చోటులు ఇవి అన్నట్టుగా ఆ బొజ్జకి మూడు మడతలు ఉన్నాయి పై మడతలో ఆకాశం క్రింది మడతలో పాతాళం, మధ్యలో భూగోళమని వామనావతారంలో విష్ణు మూర్తి బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కేసాడు అప్పటినుండీ అది బలికి నిలయం (సద్మం) అయ్యింది

ప్రళయకాలంలో విష్ణుమూర్తి ముల్లోకాలనూ తన గర్భగోళంలో దాచు కుంటాడని పురాణ గాధ. ఎల్ల వేళలా సూక్ష్మరూపంలో స్వామి గర్భంలోనే ఉంటాయని మరొక గాథ వాసుదేవుడు అనే మాటకు జగత్తులన్నింటా వసించే వాడనీ, అన్ని జగత్తులనూ తనలో వసింపజేసుకునే వాడనీ రెండు అర్థాలు. ఉలికిన నోర్వక ఉదరంబులో నున్న జగముల వ్రేగున జగతి కదల - అన్నాడు పోతన్న

బొజ్జ దాటి పుండరీకుని చూపులు ఇంకొంచం పైకి వెళ్ళాయి విశా లంగా వక్షస్సు కనిపించింది

తులసికి బచ్చలాకుదురు, తోయదవాహనరత్నవేది యు

క్కలిమిమెఱుంగుబోడికిని, కౌస్తుభఘర్మగభస్తికిన్ నభ

స్థలము ననంగ బొల్చి నిరతంబు, కృపావిభవంబునింటి బో

ర్తలుపు దలంపు సేయుచును, నురంబు కరంబు పరిస్ఫురింపగన్ (2-36)

స్వామి ఉరంబు (వక్షస్థలం) కరంబు పరిస్ఫురిస్తోంది. మిక్కిలి ప్రకాశిస్తోంది విశాలంగా ఉంది "కృపా విభవము " అనే ఇంటి బోర్ తలుపుని (ఏక కవాటం)గుర్తు చేస్తూ ప్రకాశిస్తోంది. ఆ కవాటం వెనక్కాల దయాసంపత్తి ఉందని స్వామి గుండె నిండా దయ ఎల్లప్పుడూ నిండి ఉంటుంది కదా

నీల మేఘశ్యాముడి విశంకట వృక్షః స్థలాన్ని మరి మూడు వస్తువులతో పోలుస్తున్నాడు.

పచ్చలాయి అంటే మరకతమణి కుదురు అంటే వేదిక లేక పాదు అని తులసీదేవికి విష్ణుమూర్తి వక్షఃస్థలం మరకతవేదిక మరకత మణులు పాదిగిన తులసి కోటలాగా ఉంది అని తులసీదేవి విష్ణు వక్షఃస్థల వాసిని అని పురాణగాథలు చెబుతు న్నాయి. నీలమేఘ శ్యాముని ఉరస్సు కనక మరకతమణి వేదికలాగా ఉంది.

(పచ్చటాయి+ కుదురు – పచ్చటా కుదురు రేయి, టాయి మొదలైన ఆచ్ఛిక పదాలకు బహువచనం లోనే కాదు సమాసంలో పూర్వపదాలుగా ఉన్నప్పడు కూడా చివరి అక్షరం ''యి'' లోపిస్తుందని ప్రౌఢ వ్యాకరణం చెప్పింది)

''మెఱుంగు బోడి '' అంటే విద్యుల్లత వంటి శరీరం కలిగిన స్త్రీ అని (బొంది=శరీరం దాని రూపాంతరమే బోడి కావచ్చు) కలిమి అంటే సంపద. కలిమి మెఱుంగుబోడి అంటే లక్ష్మీదేవి ఆ లక్ష్మీదేవికి ఈయన ఉర: ప్రదేశం తోయదవాహన రత్నవేది. ''తోయము'' అనే సంస్కృత పదానికి నీరు అని అర్థం తోయదము అంటే నీటిని ఇచ్చేది-మేఘం. మేఘమే వాహనంగా కలవాడు- తోయదవాహనుడు ఇంద్రుడు. తోయద వాహనరత్నమంటేఇంద్రనీలమణి. విష్ణువక్ష:స్థలం లక్ష్మీదేవికి ఇంద్ర నీలమణి వేదిక విష్ణుమూర్తికి అనపాయిని లక్ష్మీదేవి. వక్ష:స్థల నివాసిని.
శ్రీ మహావిష్ణువు మెడలో కౌస్తుభహారం ఉంటుంది ఆ హారంలో కౌస్తుభమే నాయక మణి ఘర్మగభస్తి అంటే వేడి కిరణాలు (గభస్తులు) కలిగిన సూర్యుడు కౌస్తుభం అనే సూర్యుడికి హరి ఉరస్సీమ ఆకాశం(నభస్తలం) ఆకాశం వినీలంగా, విశాలంగా ఉంటుంది కనక ఉరస్సీమతో పోలిక. కౌస్తుభానికి సూర్యుడితో పోలిక

ఎల్లవేళలా (నిరతంబున్) ఇలా విరాజిల్లుతూ బోర్తలుపుని గుర్తుచేస్తూ (తలంపు సేయుచు) ఉరంబు కరంబు పరిస్ఫురింపగన్ స్వామి విజయం చేసాడు

రూపకాలంకారంతో కూడిన ఉత్ప్రేక్షాలంకారం

ఇంద్రనీలము అనడానికి తోయద వాహన రత్నము అన్నాడు సంజ్ఞావాచకంలో పదాలకు పర్యాయ పదాలను కూర్చడం ఛంద: పరంగా కొన్నిచోట్ల అవసరమైతే,కొన్ని చోట్ల పాండిత్య ప్రదర్శకంగా రూపొందింది శక్రనీలము-బలభిన్మణి - వజ్రిమణి ఇలా ఎన్నయినా తయారు చేసు కోవచ్చు అటువంటిదే తోయదవాహన రత్నము అనే మాట ఈ విధానం వల్ల అర్థస్ఫూర్తిలో క్లేశం ఏర్పడుతుంది ప్రసన్నత కుంటుపడుతుంది కానీ ఈ పద్ధతి తెలుగు సాహిత్యంలో క్రమ క్రమంగా ఆమోదం పొంది ప్రబంధ కాలం నాటికి విస్తరించి స్థిరపడింది భాషాప్రౌఢికి ఒక మార్గం అయ్యింది.

ఇది రామకృష్ణుని దగ్గర మరింత హెచ్చుగా ఉదారతగా కనపడుతుంది కలిమి మెఱుంగుబోడి, ఘర్మగభస్తికిన్ అనేవికూడా నిజానికి ఇలా ఏర్పడిన పదబంధాలే అయితే రూఢికి ఎక్కాయి కనక అర్థబోధలో అట్టే క్లేశం అనిపించదు పదబంధాలూ వాటి నిర్మాణ పద్ధతులూ పరిచయమైన కొద్దీ క్లేశం తగ్గుతూ ఉంటుంది అమృత ప్రాయమైన వాక్కులు అనడానికి ''దివిషదన్నప్రాయ వాగ్గుంఫన '' (శ్రీ కాళ) అన్నాడు దూ ర్జటి. చంద్రుణ్ణి ''అమరుల బోనపుట్టిక '' (పారి) అన్నాడు తిమ్మన్న

తలుపు దలంపు, ఉరంబు కరంబు అనేవి అప్రయత్నంగా వచ్చిపడిన శబ్దాలంకారాలు. అంత్యానుప్రాసతో పద్యాన్ని ముగించడం పోతనాదుల పద్ధతి అయితే, వృత్త్యనుప్రాసతో చివరి పాదం ప్రయోగించడం రామకృష్ణుని పద్ధతి ఇది ఇతడి

చాలా పద్యాలలో కనిపిస్తుంది.

వక్షస్సు అయిన తరవాత కుడి ఎడమల దీర్ఘబాహువులు మునీశ్వరుడి చూపుల్ని ఆకట్టుకున్నాయి స్వామి కుడిచేతిలో ఏదో సంచీ ఉంది-

కలుష ఖగ వధ విధానా
కలిత ఘుటిక లవగ గ్రచ్చకాయలు, వలచే
నెలకొను నల జిలిబిలి వ
న్నెల వన్నెల సంచి నిండ- నింపులువారన్ (౭-౩౭)

ఈ కృష్ణమూర్తి కుడిచేతిలో (వల+చేతన్-వలచేన్) జిలిబిలివన్నె లు (రంగులు) కలిగిన ఒక వన్నెల సంచి (అందమైన సంచి) నెలకొని ఉంది దాంట్లో గ్రచ్చకాయలు నిండా నింపులువారుతున్నాయి ఆ సంచీని పూర్తిగా నింపుతున్నాయి. (నిండు-నించు-నింపు-నింపులు)

అవి నిజంగా గ్రచ్చకాయలే. నేస్తాలతో ఆడుకోవడానికని సంచిలో పోసుకుని తిరుగుతున్నాడు. అయితే వాటిని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు.

పాపాలు అనే పక్షులను (కలుష+ ఖగ) వధించే విధానం కోసమని సన్నద్ధం చేసుకొన్న (ఆకలిత) ఘుటికలో (మట్టి ఉండలు-గుండ్లు) అన్నట్టున్నాయి- ఆ గ్రచ్చకాయలు

''ఖగము'' అంటే ఆకాశంలో గమనం సాగించేది అని వ్యుత్పత్తి అర్థం. ఖే (ఆకాశమునందు) గచ్ఛతి (సంచరించును) - ఇతి ఖగః వ్యుత్పత్తినే యౌగికార్థం అంటారు. అయితే మేఘాలను ఖగాలు అనకూడదు. పక్షులకే రూఢి. పక్షులూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే వీటికి యౌగికార్థంతోపాటు రూఢి ఏర్పడింది ఇటు వంటిదాన్ని ''యోగ రూఢ లక్షణ'' అంటారు

గోప బాలుడిగా కృష్ణమూర్తి వేషధారణలో కనిపిస్తున్న సంచుల్నీ, గ్రచ్చకాయల్నీ - విష్ణు శక్తి స్ఫోరకంగా, విష్ణుగాథా పూరకంగా సంభావించి అభివర్ణిస్తున్నాడు ఇప్పుడు ఎడమచెయ్యి ఆ చేతిలో ''పెలితిగా చవిగొన్న వెన్నముద్ద'' లాంటి శంఖం ఉంది.

లలిత నిజ వామ కరతల
కలిత కనత్కంబు కాంతి కలకల నవ్వన్,
గలువల చెలి గిలిగింతల
నలువగు తాలన్, బిసాళి-నలువ గుణాలన్ (౭-౩౮)

మనోహరమైన తన ఎడమ అరచేతిలో ధరింపబడి ప్రకాశిస్తున్న (కనత్) పాంచజన్య శంఖకాంతి (కంబువు=శంఖము). చంద్రకాంతపు మణులనీ బ్రహ్మదేవుడి హంసలనీ పరిహసిస్తోండగా (కలకలనవ్వన్) స్వామి విచ్చేసాడు.

కృష్ణుని ఎడమచేతిలో పాంచజన్యం ఉంది. అది తెల్లగా తళతళ లాడుతోంది చంద్రకాంత మణులనూ, హంసలనూ పరిహసిస్తోందంటే తెల్లదనంలో వాటిని

తిరస్కరిస్తోంది అని వాటికన్నా ఎక్కువ తెల్లగా ఉందని

చంద్రకాంత మణులు అనడానికి పర్యాయంగా అచ్చతెనుగు పదాలతో ఒక కొత్త పదబంధాన్ని తయారు చేసాడు చంద్రకిరణాలు సోకి గిలిగింతలు పెడితే ఈ మణులకు రసస్ఫూర్తి కలిగి ద్రవిస్తాయని కదా ప్రసిద్ధి చంద్రుడు కలువలకు నేస్తం ఇవి రెండూ కలిపి పదబంధం తయారు చేసాడు కలువలచెలి పెట్టే గిలిగింతలతో అందగించే (నలువు= అందం నలువు + అగు=అందగించు- ఒప్పిదమగు) ఱాలన్ పరిహాసిస్తోంది ఱాయి- ఏకవచనం దీనికి బహువచన ప్రత్యయం పరంగా ఉంటే 'యి'' లోపిస్తుంది ఱాయి+లన్=ఱాలన్ చంద్రకాంతపు ఱాళ్ళను పరిహాసించే తెల్లదనం శంఖానికి ఉంది అని

నలువ అంటే నాలుగు ముఖాలు (వాయి) కలవాడు- బ్రహ్మ బ్రహ్మదేవుని గుఱ్ఱాలు-హంసలు గుఱ్ఱం అనే తెలుగు మాట గానీ అశ్వం అనే సంస్కృత పదం గానీ సందర్భాన్ని బట్టి వాహన పర్యాయ పదాలు అవుతూ ఉంటాయి (నా గుఱ్ఱం మూల పడింది- అంటే సైకిలు పాడైపోయింది అని ఈనాటికీ వాడుక ఉంది) నలువ గుఱ్ఱాలు అంటే బ్రహ్మ దేవుని వాహనాలు=హంసలు

కొన్ని అచ్చిక పదాల్లో అప్పుడప్పుడూ ద్విత్వానికి లోపం వస్తూ ఉంటుంది అక్కటా- అకటా నన్ను - నను మొదలైనవి అక్కటాదుల బద్దకు (ద్విత్వానికి) లోపంబు బహుళంబుగా నగు- అని చిన్నయసూరి సూత్రం దీని ప్రకారం గుఱ్ఱాలన్ అనేది గుఱాలన్ అవుతుంది పిసాళి అనే మాటకు ప్రకాశించు అని అర్థం

నలువగు+ ఱాలన్ నలువ+గుఱాలన్ అని పద విభాగం రెండు చోట్లా పదాలు వేరు అర్థాలు వేరు కానీ చెవికీ కంటికీ శబ్దపునరుక్తిలా స్ఫురిస్తున్నాయి కాబట్టి ఇది యమకం అంత్యానుప్రాస కూడా కుదిరింది ఉపమ - యమక -అంత్యానుప్రాసల సంసృష్టి శబ్దార్థాలంకారాల కలయిక

సంస్కృత నిజ శబ్దానికి ''తన యొక్క ' అని అర్థం నిజ వామ కరం అంటే తనయొక్క ఎడమ చేయి ఇది సంస్కృత పదం కనక జకా రాన్ని తాలవ్యంగా అజయుడు - విజయుడు లాంటి పదాల్లో జకా రాన్ని పలికినట్టు పలకాలి జరుగుట - జక్కవ మొదలైన పదాల్లో ఉండే జకారంలా - అంటే - దంత్యంగా పలక కూడదు అలా పలికే 'నిజం అనే పదం అచ్చికం ''సత్యము' అని దానికి అర్థం

ఇప్పుడింక రెండు బుజాలనూ కలిపి వర్ణిస్తున్నాడు లేదా మరో రెండు బుజాలు అదనంగా అనుకున్నా అట్టే ఇబ్బంది లేదు విష్ణుమూర్తిగా స్వామి చతుర్భుజుడాయె

నిజ ధైర్యౌదార్యము లను
గజములకుం బొడవు నిడుద కరములు బోలెన్,
భుజములు, పోషిత భక్త
వ్రజములు, కర విజిత పుష్కరజములు పాదలన్. (౨-౩౨)

బేతవోలు

తన ధైర్యమూ ఔదార్యమూ అనే ఏనుగులకు జనించిన పొడవైన (నిడుద) తొండాల్లాగా శ్రీ కృష్ణుని బుజాలు సొగసుగా ఉన్నాయి (పొద లుట=ఒప్పుట). పొదలగన్ ప్రత్యక్షం అయ్యాడని అన్వయం.

ఆ భుజాలు పోషిత భక్త ప్రజాలు భక్తుల్ని పోషించినవి ఇప్పటికి ఎందరో భక్తుల్ని అవి కాపాడాయి సుదర్శనాయుధంతో దుష్టుల్ని శిక్షించి శిష్టుల్ని రక్షించాయి పోషింపబడిన భక్త ప్రజములు కలవి అని బహుప్రీహి (ప్రజము=గుంపు)

పుష్కరము అంటే సరోవరం ''జ ' అంటే పుట్టినది అంభోజము - భూమి జము (చెట్టు) లాంటి పదం ' పుష్కరజము'' అనేది పద్మము అని దానికి రూఢార్థం పుష్కరంలో చాలా పుట్టినా వ్యుత్పత్తిని బట్టి అవన్నీ పుష్కరజాలే అయినా పద్మము అనే అర్థంలోనే ఇక్కడ దీనిని ప్రయోగించాడు ఇటువంటి ప్రయోగాన్ని రూఢిలక్షణ అంటారు వ్యుత్పత్తికూడా కుదురుతోంది కాబట్టి ఇందాకటి ఖగములాగానే యోగ రూఢలక్షణ

స్వామివారి హస్తాలు పద్మాలను జయించాయి కరములచేత (అరచేతుల చేత) జయింపబడిన పుష్కరజములు కలవి అని మరో బహు ప్రీహి భుజాలకు విశేషణం

ఏనుగు తొండాలతో పోల్చడంవల్ల బాహువులు దృఢంగా ఉన్నాయని నిడుదలై ఉన్నాయని చెప్పకనే చెప్పాడు. దీనివల్ల స్వామివారు ఆజానుబాహువు అనేది తెలుస్తోంది

ధైర్యము అనేది ఒక ఏనుగు ఔదార్యము అనేది ఒక ఏనుగు ఈ క్రమం లోనే విశేషణాలుకూడా అన్వయించాలి ధైర్యగజ హస్తం - పోషిత భక్త ప్రజం ఇది అభయహస్తం ధైర్యహ చక్రాంకితం ఔదార్య గజహస్తం- కరవిజిత పుష్కరజం ఇది అభయహస్తం ధైర్యహ స్తాన్నే కాక అభయ దాన హస్తాన్ని కూడా ఏనుగు తొండంతో పోల్చడం వల్ల - ఇచ్చేనా ఏనుగు పాడిగా సమృద్ధంగా ఇస్తాడని సూచన ఏనుగు తొండం పద్మాలు కనిపిస్తే చాలు పెకలించి వేస్తుంది కరవిజిత పుష్కరజములు అంటే అదికూడా మరో స్ఫూర్తి. అర్థ సౌందర్యాన్ని బట్టి

వాక్య నిర్మాణ రూపంగా ఇది క్రమాలంకారం అర్థ సౌందర్యాన్ని బట్టి ఉపమాలంకారం ధైర్యౌదార్యములు అనే గజములు అన్నచోట తాద్రూప్య రూపకం భుజాలు ఉపమేయం. ఏనుగు తొండాలు (కరము లు) ఉపమానం నిడుదదనం సమాన ధర్మం కరవిజిత పుష్కరజత్వం మరో సమాన ధర్మం పోలెన్ అనేది ఉపమావాచకం ఇలా నాలుగు అంగాలూ పరిపూర్ణంగా నిర్దిష్టమయ్యాయి కాబట్టి ఇది పూర్ణోపమ

ఉపమాలంకారంలో ఆర్థి-శ్రౌతి అనే మరోరెండు సూక్ష్మభేదాలు ఉన్నాయి ఉపమావాచకాలను (వలెన్, పోలెన్ నిభము, సన్నిభము వంటి వి) ప్రయోగించిన తీరును బట్టి ఇవి ఏర్పడతాయి తెలుగులో భట్టుమూర్తి ఈ విభాగం గురించి తన కావ్యాలంకార సంగ్రహంలో (నరసభూపాలీయం) వలెన్ పోలెన్ మాట్లాడుతూ

మాడ్కి క్రైవడి లాంటి అచ్చిక పదా లను ఉపమావాచకాలుగా ప్రయోగిస్తే శ్రౌతి: నిభము - సన్నిభము వంటి తత్సమాలను ఉపమావాచకాలుగా వినియోగిస్తే అది ఆర్థి అన్నట్లు సూచించాడు (కా సం 5-9) ఈ లెక్కన ''నిడుద కరములు బోలెన్'' అనేది శ్రౌతి - ఉపమాలంకారం అవుతుంది ద్రుతకార్యాలు వినపడుతున్నాయి కనక ఇది సమాసం కాదు కాబట్టి వాక్యశ్రౌతి

భుజములు - వ్రజములు - రజములు అని అంత్యానుప్రాస శబ్దాలంకారం రూపక - ఉపమా - అనుప్రాసల సంసృష్టి ఈ పద్యం.

భుజాలు అయ్యింతర్వాత ముఖం మీదికి మళ్ళింది పుండరీకుని దృష్టి అది వర్ణిస్తున్నాడు

వదనైక స్తంభ కనక
సదనము సిరికొఱ కొనర్చ స్రష్ట నిలుపు న
మ్మొదలింటి శంఖ శంకువొ
యిది యనగా గంబుకంఠ మింపు వహింపన్ (2-40)

ఇప్పుడు స్వామివారి కంఠాన్ని వర్ణిస్తున్నాడు అది ఇంపు వహిస్తుండగా ప్రత్యక్షమయ్యాడు కృష్ణుడు

స్త్రీ కంఠమైనా పురుష కంఠమైనా శంఖంతో పోల్చడం కవి సమయ సిద్ధం ఆకారంలో గళరేఖలలోనూ ధ్వనిలోనూ పోలిక కంబువు అంటే శంఖం కంబువు ఆకారంలో ఉన్న కంఠము - కంబుకంఠము తాద్రూప్య రూపకం

చిగురుకేలు - బింటిమోవి వంటి ఉపమాన పూర్వపద కర్మ ధారయ సమాసాలు సంస్కృతంలో లేవు (చూ బాలవ్యాకరణం సమాస 3 సూ) అంచేత బింబాధరము - కంబు కంఠము లాంటి వాటిని బింబా కారమైన అధరము కంబువు ఆకారమైన కంఠము అని విగ్రహ వాక్యాలు చెప్పి ఆకారము అనే మధ్యపదాన్ని లోపింపచేసి సమాసాలు చెయ్యాలి. వీటిని మధ్యమపదలోపి సమాసాలు అంటారు తెలుగులో కూడా గాజులు అమ్మునట్టి సెట్టి - గాజుల సెట్టి వంటివి మధ్యమ పదలోపి సమాసాలే అన్నాడు అహోబలపండితుడు (కవి శిరోభూషణము- సమాస ప్రకరణం)-

విష్ణుమూర్తివదనము అనే ఒంటిస్తంభం బంగారు మేడని (ఏక స్తంభ - కనక సదనము) సిరికోసం నిర్మించాలి అనుకున్నాడట బ్రహ్మ దేవుడు (స్రష్ట)

గృహనిర్మాణం చెయ్యాలంటే ఎవ్వరైనా ముందుగా శంకుస్థాపన చేస్తారు కర్రమేకు (శంకువు) తయారు చేయించి ఇంటి స్థలంలో అది పాతుతారు అంచేత దీనికి శంకుస్థాపన అని పేరు (శంఖుస్థాపన కాదు)

అలా శంఖమే శంకువుగా బ్రహ్మదేవుడు మొట్టమొదట నిలిపి నట్టుగా కృష్ణుడి కంబుకంఠం అలరారింది ''శంఖ శంకువొ ఇది అన గాన్'' అనడం వల్ల ఇది ఉత్ప్రేక్షాలంకారం. (మొదలిటి- మొదలింటి ఔప విభక్తిక శబ్దం మొట్టమొదటి అని అర్థం)

స్వామివారి ముఖంలో సిరి ఉందనీ, శోభ-కళ ఉన్న ముఖమనీ వ్యంగ్యం.
లక్ష్మీదేవి అయితే భార్యామణిగా వక్షఃస్థలం మీద ఉంటుందే తప్ప ముఖంలో కాదు
కదా !

ఆ ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది నిగనిగ లాడుతున్న దొండ పండు
లాంటి అధరం. అధరం-రతి సర్వస్వం. శృంగారభావం మేళవించి చెబుతున్నాడు.

బింకపు వ్రేతల వాతెఱ
మంకెన పూదేనె తేట మానక పైపై
నింకగ నింకగ బిఖ్ఖలు
బింకించుట బోలె మోవి బిచ్చైన హెచ్చన్ (2-41)

(వ్రేత = గోపిక, వాతెఱ, మోవి = పెదవి. బింకించుట = పులుముట,
రుద్దుట, పట్టించుట. బిచ్చైన = కాంతి, నిగారింపు)

బింకమైన వయస్సులో ఉన్న గోపికలు. వాళ్ళ అధరాలు మంకెన పువ్వులు.
బంధూక పుష్పాలు అంటారు వీటినే. ఎఱ్ఱగా మృదువుగా మకరందం చిప్పిలుతూ
ఉంటాయి. అందుకని అధరాలకు పోలిక.

వాయి అంటే నోరు. నోటికి తెర - వాతెఱ అంటే పెదవి. రదనచ్ఛదము
(దంతాలను కప్పి ఉంచేది) అనే సంస్కృత సమాసానికి "వాతెఱ" అనేది తెనుగుసేత.

వాతెర అనే మంకెన పువ్వులో ఉండే తేనె "తేటను" (అధరామృతాన్ని),
విడిచి పెట్టకుండా తన పెదవికి పైపైని ఇంకిన కొద్దీ ఇంకొంచెం ఇంకేట్టుగా (ఇంక
గన్- ఇంకగన్) పట్టించడంవల్ల స్వామివారి మోవి రంగు మరింత హెచ్చిందిట. అది
మంకెన పువ్వు తేనె. ఆ తేనె తేటను ఆరార గా పట్టిస్తున్నందువల్ల తన మోవికి నిగారింపు
హెచ్చింది. అటువంటి మోవితో ఆ గోపికా ప్రియుడు ప్రత్యక్షమయ్యాడని అన్వయం.

పువ్వు ఎఱ్ఱగా ఉన్నంత మాత్రంచేత తేనె ఎఱ్ఱగా ఉంటుందని కాదు.
సహజంగానే ఎఱ్ఱగా ఉన్న అతడి మోవికి నిగారింపు హెచ్చిందని హేతూత్ప్రేక్ష. అలా
పట్టించినందువల్లనా అన్నట్టు మోవి బిచ్చైన హెచ్చింది అని. అయితే గోపికా
మధురాధరామృతపానం అనే హేతువు కృష్ణుడికి సిద్ధమయ్యే ఉంది. కాబట్టి ఇది సిద్ధ
హేతూత్ప్రేక్ష. (ఈ పద్యం కొన్ని ప్రతుల లో లేదు.)

అధరాలకు పైని కోటేరులాగా, సంపెంగ మొగ్గలాగా, మొత్తం ముఖ
బింబానికి అలంకారంలాగా నాసికాపుటం ప్రస్ఫుటంగా భాసి స్తోంది. దాన్ని
తడుముతున్నాడు.

తళుకు మొగము నెలపదకము
నెలవున నిడుదీరుగాగ నిలిపిన యాఖం
దల నీల తళిత శ్రీయు ని
ట్టలమై స్ఫుటనాసికా పుటము దీపింపన్. (2-42)

పూర్ణ చంద్రాకారంలో ఉండే పతకాన్ని "నెలపద (త) కము" అంటారు.

ఇది ఒకరకం భూషణం శ్రీ కృష్ణుని తళుకు మొగం (కాంతి మంతమైన ముఖం) నెల పదకంలా ఉంది ఆ పదకానికి మధ్యభాగంలో (నెలవునన్) నిట్టనిలువుగా (నిడుతీరుగాగ) నిలిచి ఉండేట్టు పొదిగిన (నిలిపిన) ఇంద్రనీల మణికళికలాగా స్వామివారి నాసికాపుటం (ముక్కు కొస) ప్రకాశిస్తోంది నాసికాపుటం అలా దీపింపగా శ్రీకృష్ణుడు ప్రత్యక్ష మయ్యాడు

ఇంద్రనీలం అనేది ప్రసిద్ధపదం ఇందులో ఇంద్రుడికి పర్యాయ పదంగా ఆఖండల పదాన్ని కూర్చాడు ఆఖండల నీలము అంటే - తోయద వాహన రత్నము (2-36) అన్నట్టే - ఇంద్రనీలము అని భావం కళిక అంటే మొగ్గ మొగ్గలా తయారు చేసి ఇంద్రనీలాన్ని నెలపదకంలో పొదిగితే ఎలా ఉంటుందో అలా ఉంది తళుకు మొగంలో నిట్టలమైన నాసికాపుటం

విశాలమైన భావాన్ని చిన్నపద్యంలోకి ఇముడ్చుతున్నా అస్పష్టతకి తావు ఇవ్వడం లేదు ప్రసన్నత కొరవడటం లేదు. అంతేకాదు ఆ చిన్న పద్యంలోనే నిట్టలమై వంటి పదాలనూ ఆఖండలనీలము అని విస్తరించిన సమాసాలనూ కూర్చగలుగుతున్నాడు కవి రామకృష్ణుడికీ రాయలవారికీ రచనాపరంగా ఉన్న భేదం ఇది

శ్రీకారాల్లాంటి చెవులకు వేలాడుతున్నాయి మకరకుండలాలు అద్దాల్లాంటి చెక్కిళ్ళ మీద వాటి కాంతులు పారాడుతున్నాయి ఈ దృశ్యం బొమ్మకట్టిస్తున్నాడు -

తళుకు జెక్కుల- మకర కుండల కలాప
మరకత ద్యుతి రింఛోళి- హరిణ లక్ష్మ
మండలంబుల లాంఛన మంజిమములు
గానిపించు విధంబున గలయ బ్రాక (2-43)

నిగనిగలాడుతున్న చెక్కిళ్ళు రెండూ రెండు చంద్రబింబాల్లాగా ఉన్నాయి మకర కుండలాలు అనే భూషణాలు (కలాపములు) రెండు చెవులకూ ధరించాడు మకరము అంటే మొసలి. మకరాకారంలో ఉన్న ఆ కుండలాలలో మరకత మణులు ఉన్నాయి. వాటి కాంతిసమూహం చెక్కిళ్ళ పై పారాడుతోంది. (ద్యుతి+ రింఛోళి కాంతి సమూహానికే రించోళి అనే పదం సర్వసాధారణంగా తెలుగు కవులు వాడుతూ ఉంటారు గజ రింఛోళి అశ్వరింఛోళి లాంటి పదబంధాలు మృగ్యం)

హరిణం (లేడి) చిహ్నంగా కలిగిన మండలం - హరిణ లక్ష్మమండ లం అంటే చంద్రబింబం లక్ష్మ అంటే కళంకం, మచ్చ, చిహ్నం అని అర్థాలు మలినమపి హిమాంశో ర్లక్ష్మ లక్ష్మీం తనోతి- అని శాకుంతలంలో కాళిదాసు.

రెండు చంద్రబింబాలు ఉండి, వాటిలో నల్లగా కళంకాలు (లాంఛన మంజిమములు) తళుకులీనుతున్నాయా అన్నట్టుగా ఉన్నాయి - ఆ చెక్కిళ్ళు అంటే తళుకు చెక్కులు = చంద్రబింబాలు మకర కుండల మరకతద్యుతులు = లాంఛన మంజిమాలు. కుండలాల కదలికతో మరక తద్యుతిరింఛోళి - చెక్కిళ్ళపై అన్నివైపులకీ కలయబ్రాకుతోంది అలా ప్రాకుతూండగా స్వామి ప్రత్యక్షమయ్యాడు. ఇంక కన్నుల్లి

వర్ణిస్తున్నాడు.

తరళ మసార సార నిభ తారకముల్, సిత పద్మ పుత్ర బం
ధురములు, రాధికాహృదయ తోయజకోరక బోధన క్రియా
తరుణతరార్కరుగ్విలసిత స్ఫుట రక్తిమ సక్త కోణ భా
స్వరము, లసూక్ష్మ పక్ష్మములు, వాలిక కన్నులు, చెన్ను మీఱగన్. (౭-44)

స్వామివారివి వాలిక కన్నులు సోగ కన్నులు అవి చాలా అందంగా (చెన్ను) ఉన్నాయి తీర్చి దిద్దినట్టు ఒత్తుగా పెరిగిన రెప్ప పెంట్రుకలతో- బాగున్నాయి సూక్ష్మము అంటే సన్నని అసూక్ష్మము అంటే దానికి వ్యతిరేకం. ఒత్తయిన అని. అసూక్ష్మమైన పక్ష్మములు (రెప్ప వెంట్రుకలు) కలవి ఆ కన్నులు అందుకే చెన్నుమీరుతున్నాయి

ఆ కన్నుల్లో కనుగ్రుడ్లు (తారకలు)కాంతిమంతంగా (తరళము) ఉన్నాయి శ్రేష్ఠమైన ఇంద్రనీలమణులతో సాటి వచ్చేటట్టు (నిభ) ఉన్నాయి. మసారము అంటే ఇంద్రనీలమణి అని శబ్దకల్పద్రుమ నిఘంటువు చెబు తోంది సారశబ్దం శ్రేష్ఠతార్థకం కాబట్టి తరళమైన మసారసారంతో నిభమైన తారకలు కలవి ఆ కన్నులు అని అన్వయం సిత పద్మపత్రాలలాగా (తెల్ల తామర రేకులు) రమ్యమైనవి (బంధురములు) ఆ కన్నులు

తోయము అంటే నీరు. తోయజము అంటే నీటిలో పుట్టినది పద్మం (యోగరూఢలక్షణ) కోరకము అంటే మొగ్గ. తోయజకోరకము అంటే తామర మొగ్గ. రాధాదేవి హృదయం అనే తోయజకోరకం దాన్ని మేలుకొల్పడం- (బోధన+క్రియా)- వికసింపజెయ్యడం అనే పనికి శ్రీకృష్ణుని చూపులు సూర్యకాంతుల్లా పనిచేస్తాయిట. అంటే స్వామి చూపులు సోకగానే రాధికా హృదయం పద్మంలా వికసిస్తుంది అని.

అర్కుడు అంటే సూర్యుడు. తరుణ తర+ అర్కుడు అంటే అప్పుడే ఉదయించిన బాల సూర్యుడు మిక్కిలి తరుణ వయస్సులో ఉన్నాడని. బాల సూర్యుని కాంతులు (రుక్) ఎర్రగా ఉంటాయి ఇందుకోసమనే తరుణతరార్కుడు అని చెప్పడం. తరుణతరార్కుని రుగ్విలాసంతో ప్రస్ఫుటమైన రక్తిమతో (ఎర్రదనంతో) కూడిన కోణాలు ఉన్నాయి ఆ కన్నులకి నేత్రకోణాలలో (కన్నుకొసలు) ఉదయసూర్యుని రక్తిమ ఉంది అని సాముద్రికం ప్రకారం ఇది మహాపురుష లక్షణం. కళ్ళల్లో ఎర్రజీర ఉంటే భాగ్యశాలి అవుతాడు అంటారు అటువంటి రక్తిమతో సక్తమైన కోణాలతో భాస్వరములవుతున్నవి (ప్రకాశిస్తున్నవి) ఆ సోగకన్నులు. అవి చెన్ను మీరుతుండగా స్వామి ప్రత్యక్షమయ్యాడు.

''రాధికా'' నుంచి ''భాస్వరములు'' వరకూ ఒకటే సమాసం. నిజానికి ఇక్కడ ఇంత సుదీర్ఘమైన సమాసం అవసరంలేదు కానీ విశాలమైన భావాన్ని సంక్షేపంగా చెప్పడానికి సమాసం అనివార్యంగా అవసరమయ్యింది ప్రబంధాల నాటికి దీర్ఘ సమాసాల ప్రయోజనం మారిపోయింది అనడానికి ఇదొక ఉదాహరణ

తరళ మసార సార నిభ తారకముల్ అన్నచోట శబ్దాలంకారం అలా ఉండగా

ఉపమావాచకంగా నిభ శబ్దాన్ని ప్రయోగించాడు కాబట్టి ఇది '' ఆర్థి'' ఉపమాలంకారం దాన్ని సమాసంలో కలిపి ప్రయోగించాడు కనక సమాసగత- ఆర్థి- ఉపమ అవుతుంది

కన్నుల్ని వర్ణించాక కనుబొమ్మల్ని వర్ణిస్తున్నాడు అవి నల్లగా ఒత్తుగా ధనురాకారంలో ఉన్నాయిట-

అలక తిమిరంబు తను గప్పనను భయమున,
ముఖసుధాసూతి నును వెల్లు ములికి గూర్చి
సవదరించిన సింగిణి చాయ, నొసలి
వంకచూపున దగ గళి వంక బొమలు. (౨-४౭)

కళి-వంక -బొమలు. కళ్లి అంటే నల్లని అని అర్థం. కళ్లి ఆవు - నల్లని ఆవు అర్జునుడికికూడా కళ్లి అని పేరు నల్లగా ఉంటాడుట ఈ పదంలో ద్విత్వంలోపిస్తే (అక్కటా-అకటా) కళి అయ్యింది అల్లాగే బొమ్మలు అనేది బొమలు అయ్యింది నల్లని కనుబొమ్మలు అర్ధచంద్రా కారంగా వంక తేలిన బొమ్మలు (నెలవంక).

స్వామివారి ముఖం చంద్రబింబం (సుధాసూతి= అమృతాన్ని ప్రసవించేవాడు) దాన్ని కప్పి వెయ్యడానికి ఎప్పడూ ఒక తిమిరం పొంచి ఉంటుంది ముంగురులే (అలకలు) ఆ తిమిరం

అలకఅనే తిమిరం వచ్చి తనని కప్పివేస్తుంది-(కబళిస్తుంది) అనే భయంతో ఈ ముఖ చంద్రుడు విల్లు ఎక్కుపెట్టి కూర్చున్నాడుట సన్నని వెలుగు (నునువెల్లు) అనే బాణాన్ని సంధించి (ములికిన్ కూర్చి) సిద్ధం చేసుకున్న సింగిణిలాగా (ధనుస్సు-చాయన్-వలె) కళ్లి వంక బొమ్మ లు ఉన్నాయి అవి నొసలివైపు ప్రసరించే దృష్టితో (నొసలివంక చూపునన్) ఉన్నాయి అంటే ఆ కన్బొమలు ముక్కుకి పై బాగాన కలిసి (కొందరు బొట్టు పెట్టుకునే చోటు), నుదురు వైపు కొనతేలి ఉన్నాయి. ఆ కొన- ఎక్కుపెట్టిన బాణం ములికిలాగా ఉంది కన్బొమలు ధనుస్సులాగా వంకతేలి ఉన్నాయి ముఖచంద్రుడు ఇలా బాణం ఎక్కుపెట్టడానికి కారణం-అలక తిమిరం వచ్చి తనని కప్పేస్తుందేమోనన్న భయం అలా బొమలు తగన్ స్వామి ప్రత్యక్షమయ్యాడు

అలకతిమిరము, ముఖసుధా సూతి నును వెల్లు ములికి- అనేవి తాద్రూప్య రూపకాలు సవదరించిన చాయన్ కన్బొమలు ఉన్నాయి- అని ఉపమానాన్ని కల్పించాడు కనక ఉక్త వస్తూత్ప్రేక్ష భయము అనే కారణం అప్రాణులైన కన్బొమలకు అసిద్ధం [illegible]నక అది అసిద్ధ హేతూత్ప్రేక్ష

స్వామి [illegible]డుగా అవతరించా[illegible] ది చిక్కం ఉంది మత్స్యావతారం ఎ[illegible] స్వామి [illegible] [illegible]లాంటి [illegible]క్కం అది - అ[illegible]

బలభిదుపలాద్రిమౌళిన్
బల పలగా బొదువు ముదిరపటలము పగిదిన్
లలితోత్తమాంగతలమున
జిలుగుం దొలి క్రొత్త చలిది చిక్కము దనరన్ (౭-౪౬)

ఈ బాలకృష్ణుడి లలితమైన ఉత్తమాంగ తలమున-నెత్తిమీద చలిది చిక్కం ఉంది ''చిక్కము'' అంటే వలలాంటి సంచి ఉట్టిలాగా ఉంటుంది అందులో చద్దిముంత పెట్టుకుని నెత్తిమీద పట్టుకుని పొద్దున్నే పశువుల్ని మేతకి తోలుకు పోతారు కాపరులు

ఈ చిక్కం మిక్కిలి క్రొత్తది. అందుకే వదిలి పెట్టకుండా ఎక్కడికి వెళ్ళినా నెత్తిమీద పెట్టుకు తిరుగుతున్నాడు దించడం లేదు. అందునా జిలుగైనది-సన్ననిది. జిలుగున్-తొలిక్రొత్త-చలిది చిక్కం నెత్తిమీద తనరగా స్వామి ప్రత్యక్షమయ్యాడు.

చిక్కాలను సాధారణంగా వడపలతో గానీ గోగునారతో గానీ త్రాడు పేని తయారు చేస్తారు. అంత తెల్లగానూ ఉండదు, అంత నల్లగానూ ఉండదు మధ్యస్థంగా మామూలు మేఘాల రంగులో (శరన్మేఘాలూ కాదు, వార్షిక మేఘాలూ కాదు) ఉంటుంది

స్వామి నీల మేఘశ్యాముడు. ఆయన నెత్తిమీద ఈ చిక్కం ఉంది. దీనికి ఒక ఉపమానం చెబుతున్నాడు.

ఇంద్రనీలమణి పర్వత శిఖర భాగాన (మౌళిన్) పల్చగా, పొదు వుకొన్న మేఘపంక్తిలాగా ఉంది - అని.. (ముదిరము=మేఘము, పటల ము=సమూహం. పగిదిన్=వలెన్, పలపలగా=పల్చగా).

ఇంద్రుడికి మరొక పర్యాయపదం ''బలభిత్'' అనేది. బలుడు అనే రాక్షసుణ్ణి సంహరించాడుట. ఉపలం అంటే రాయి-మణి అద్రి అంటే కొండ ఇంద్రనీల మణి పర్వతం అనడానికి ఈ సమాస కల్పన ఉదారత.

అవయవాలన్నింటిలోకీ శిరస్సు ప్రధానం. జ్ఞానేంద్రియాలన్నింటి లోకీ నయనం ప్రధానం. సర్వేషు చాంగేషు శిరః ప్రధానమ్, సర్వేంద్రియా ణాం నయనం ప్రధానమ్-అని సూక్తి. ఉత్తమాంగము అంటే తల

నఖశిఖాపర్యంతం బాలకృష్ణుని రూపాన్ని ప్రత్యక్షం చేసాడు కవి అందెలు, తిత్తులు, తీగచుట్లలు, చిన్ని బొజ్జ మడతలు, ఒక చేత్తో గచ్చకాయల సంచులు మరొక చేత్తో శంఖం, చెవులకు మకరకుండలాలు, నెత్తిమీద చిక్కం- ఇదీ రామకృష్ణుడు దర్శించిన బాలకృష్ణుని స్వరూపం. ఇది చాలా అపురూపం ఇది విలక్షణత

భక్తితో స్తుతించేటప్పుడు క్రిందినుంచి పైకి -పాదాది శిరః పర్యంతం వెళ్ళా లనీ రక్తితో పొగిడేటప్పుడు పైనుంచి క్రిందికి రావాలనీ ఒక నియమం ఉన్నట్లు పెద్దలు చెబుతారు అది పాటించిన ఉదారుడు రామకృష్ణుడు.

బాలకృష్ణుని రూపంలో ఉన్న లాలిత్యాన్ని స్ఫురింపజెయ్యడానికా అన్నట్లు

''లలిత శిరీష పుష్ప మృదులంబులు (32) అంటూ ప్రారంభించి మధ్యలో లలిత నిజవామ కరతల (38) అని లలితోత్తమాంగ తలముతో (46) ముగించాడు ఆది- మధ్య- అంతాల్లో లలిత శబ్దం పనిబూని ప్రయోగించాడు

ఆటలన్నీ విడిచి పెట్టి పరుగు పరుగున వచ్చి ప్రత్యక్షమయ్యింది బాలకృష్ణుడు కనక దాన్ని స్ఫురింపజెయ్యడానికా అన్నట్టు వర్ణన అంతా చిన్న చిన్న కందపద్యాలతో, గీత పద్యాలతో నడిపించాడు మూడు మాత్రమే పెద్దవి- వృత్తాలు ఉన్నాయి అవికూడా చంపకమాలలే కావడం విశేషం వేద ఘోషవంటి అందెల మ్రోత వెడల్పయిన వక్ష: స్థలం విశాలమైన నేత్రాలు- వీటిని వర్ణించడానికి పెద్ద పద్యాలు రచించాడు ఛంద: పరంగా ఇటువంటి సూచన అందించే లక్షణం రామకృష్ణుడిలో ఉంది దశావతార వర్ణనలో అన్నీ వృత్తాలే రాసి ఒక్క వామనావతారానికి చిన్న కందపద్యం రచించాడు

ఇక్కడ మరొక విశేషం కూడా ఉంది అన్ని పద్యాలలోనూ స్వామి వారి ఏదో ఒక కదలికనే వర్ణించాడు సర్వావయవాల్లోనూ చైతన్యాన్నే దర్శించాడు అసమాపక క్రియలతో చెప్పుకుంటూ వచ్చి వచ్చి చిట్ట చివరికి 'తనదు రూపుపొడ గనిపించెన్''(48) అని ముగించాడు అప్పటికి స్వామివారు స్థిరంగా పుండరీకుని ఎదుట నిలబడ్డారు అప్పటికి స్వామి రూపం సర్వాంగీణంగా పొడకట్టింది అంటే అన్ని పద్యాలూ కలిపి ఒక చైతన్యమూర్తిని ఒక తేజ: పుంజాన్ని, ఒక నీలి వెన్నెలని ప్రత్యక్షం చేసే మహావాక్యం ఇంక ఇప్పుడు సర్వాంగీణంగా సమగ్రంగా స్వామిమూర్తిని మనోనేత్రం ముందు నిలుపుతున్నాడు

దిగ్వాసుం డురు పింఛలాంఛిత శిఖోదీర్ణుండు, వర్షాపయో
ముగ్వర్ణుండు, నవాంబుజాహితలతాముక్తాంగదుండున్, సుధా
రుగ్విస్మేరముఖుం, డనంగశతజిద్రూపాఢకుం, డగ్రభూ
వాగ్వర్గోద్భవభూమి, శ్రీవిభుడు, శ్రీవత్సాంక వక్షుండునై. (2-47)

దిక్కులే వాససములుగా కలవాడు- దిగ్వాసుడు అంటే దిగంబరుడు మొలకు తీగలు చుట్టుకున్నాడే తప్ప పీతాంబరం కట్టుకోలేదు గదా

పెద్ద పింఛంతో చిహ్నితమైన (లాంఛిత) శిఖతో ప్రకాశిస్తున్నవాడు ఉరు పింఛలాంఛిత శిఖోదీర్ణుడు

ముచ్ అంటే విడిచిపెట్టడం ముక్తి మోక్షం. అన్నీ దీనినుంచి తయారైనవే. మోక్షం అంటే భవబంధాలనుంచి విముక్తి- విడుదల పొందడం పయస్ అంటే నీరు- పాలు అని రెండు అర్థాలు. ఇక్కడ ప్రకరణాన్ని బట్టి నీరు అనే అర్థం స్వీకరించాలి

పయస్సుని విడిచిపెట్టేది-పయోముక్ అంటే మేఘం. జలదము అనే మాటకి సరిగ్గా పర్యాయపదం ఇది. స్వామి మేఘవర్ణంలో ఉన్నాడని ఆ మేఘంకూడా వర్షాకాలపు మేఘం అంచేత వర్షాపయోముగ్ వర్ణుండు అన్నాడు. శరన్మేఘమైతే తెల్లగా ఉంటుంది వాన కురిసే మేఘమైతే నీలంగా ఉంటుంది కారుమబ్బు కాదు. వెలిమబ్బు

స్వామికి భుజకీర్తులు (అంగదములు) ఉన్నాయి వాటిని ఒకరకం లతలతో,

బుజాలపై నిలిచేట్టు కట్టుకున్నాడు. ఆముక్తము అంటే అలంక రించు కొనిన అని ఆముక్త మాల్యద అన్నప్పుడు ఇదే అర్థం. స్వామికి లతలతో ఆముక్తమైన అంగదాలు ఉన్నాయి ఏమి లతలు ? నవాంబుజాహిత లతలు. అంబుజ+అహితుడు అంటే పద్మాలకు శత్రువు-చంద్రుడు. నవ చంద్ర
లతల తో భుజకీర్తులు బుజాలపై అలంకరించుకున్నాడు ఆకులు అర్థచంద్రా కారం గా ఉండే లతను అర్థచంద్రలత అంటారు. అర్థ చంద్రుడు అనడానికి బదులు నవచంద్రుడు అన్నాడు. కొత్త చంద్రుడు అంటే అమావాస్య తరువాత కృష్ణ పక్షంలో క్రొత్తగా మరొక జన్మఎత్తినట్టు రేఖామాత్రంగా కని పించే చంద్రుడని. నవచంద్రలత (అర్థచంద్రలత) అనే పేరుతో పిలవబడే లతలతో ఆముక్తమైన అంగదాలు కలవాడు అని ఫలితార్థం.

సుధారుక్ అంటే అమృతకిరణుడు (రుక్=కాంతి, కిరణం)- చందమామ చందమామను పరిహసించే ముఖం కలవాడు- సుధారుగ్ విస్మేర ముఖుండు చంద మామ కన్నా అందమైన ముఖమని తాత్పర్యం. లేదా సుధారుక్ వంటి విస్మేరంతో (చిరునవ్వుతో) విరాజిల్లే ముఖం కల వాడు అని అయినా చెప్పవచ్చు. నవ్వు రాజిల్లెడు మోమువాడు అని పోతన గారు వర్ణించినదానికీ, కృష్ణుని స్వభావానికీ అనువుగా ఉంటుంది

అనంగ శత జిత్+రూపాధికుడు. మన్మథ శతాన్ని జయించే రూపంతో అధికుడు నూరు మంది మన్మథులకన్నా అందమైన రూపం కలవాడని లేదా మన్మ థుణ్ణి నూరు సార్లు జయించే రూపంతో అధికుడు అని కానీ. పుంసాం మోహన రూపాయ అన్నట్టు పురుషుల్ని సయితం మోహింపజేసే రూప సౌందర్యం శ్రీ కృష్ణుడిది

అగ్రభూ + వాగ్వర్గ + ఉద్భవ భూమి. అగ్రభూ అంటే అన్నింటి కన్నా మొట మొదట పుట్టినది అగ్రస్థానంలో జన్మించినది అని. అలా జన్మించిన వాగ్వర్గానికి - మాటల సమూహానికి ఇతడు ఉద్భవ భూమి - జన్మస్థానం.

సర్వ వాఙ్మయానికీ అగ్రస్థానంలో జన్మించిన వాగ్వర్గమంటే వేదమంత్రాలు అందుకే వీటిని తొలిచదువులు, తొలిపలుకులు అంటారు లలిత శిరీష పుష్ప మృదులంబులు (32) అనే పద్యంలో తొల్చదువుల్ అనే మాట ఉపయోగించాడు ఆ అచ్చపు తెనుగు సమాసానికి అగ్రభూవాగ్వర్గము అనేది సంస్కృతీకరణ స్వామి వారు వేదాలకు పుట్టిల్లు అని తాత్పర్యం

ఇంతకీ ఎవరు ఈ స్వామివారు ? అంటే - శ్రీవిభుడు లక్ష్మీపతి- మహా విష్ణువు విష్ణుమూర్తి వక్షః స్థలం మీద ఒక పుట్టుమచ్చ ఉంటుందిట
దానికి ''శ్రీవత్సము'' అనిపేరు శ్రీవత్సము అనే పుట్టుమచ్చతో (అంకం) కూడిన వక్షస్సు కలవాడు శ్రీవత్సాంక వక్షుండును అయ్యి స్వామి దర్శనం అనుగ్రహించాడు

పయోముక్ అన్నచోట పయశ్శబ్దానికి ప్రకరణాన్ని బట్టి నీరు అనే అర్థమే స్వీకరించాలనుకున్నాం ఒక పదానికి అర్థం నిర్ధారణ చేసేటప్పుడు అర్థం ప్రకరణం

లింగం దేశం కాలం ఇతరశబ్దసాహచర్యం ఉచ్చరించిన వ్యక్తి స్వరం ఇత్యాదులు- ప్రముఖ పాత్ర వహిస్తాయి.

శ్రీకృష్ణుణ్ణి వర్ణిస్తున్నాడు కనక పయోముక్ అంటే బలదమనే చెప్పాలి. పాలను ఇచ్చునది - ఆవు అనో మరోటనో చెప్పకూడదు లింగాన్నిబట్టికూడా అర్థం మారిపోతుంది. గోశబ్దం స్త్రీలింగమయితే ఆవు పుంలింగమైతే ఎద్దు రజస్సు అంటే దేశాన్నిబట్టి ఎడారి వర్ణనలో దుమ్ము ఉద్యాన వన వర్ణనలో పుప్పొడి సారసవిజృంభణ అంటే కాలాన్నిబట్టి వర్షర్తువులో బెగ్గురు పక్షుల విజృంభణ అని శరదృతువులో పద్మవికాసమనీ అలాగే రామాయణంలో రాముడంటే దశరథరాముడో పరశు రాముడో త్రేతాయుగంలో బలరాముడు లేడు కనక రామకృష్ణులు అన్నచోట కృష్ణ శబ్ద సాహచర్యాన్ని బట్టి రాముడంటే బలరాముడు రామ లక్ష్మణులు అంటే లక్ష్మణ శబ్ద సాన్నిధ్యాన్ని బట్టి దాశరథి అవుతాడు "పచ్చాకు" అంటే వ్యక్తి స్వరాన్ని బట్టి పచ్చి ఆకు అనిగానీ, పచ్చని ఆకు అనిగానీ స్వీకరించవలసి ఉంటుంది ఇలా చేష్టలు సైతం అర్థనిర్ణాయకాలు అవుతాయి

పదానికి అర్థం నిర్ణయించడంలో ఇటువంటివి అనేకం సహక రిస్తాయనీ అవన్నీ చూసుకుంటూ అర్థ నిర్ణయం చెయ్యాలనీ ఆలంకారి కులు చెప్పారు

అర్ధచంద్రలత అనే సంజ్ఞావాచకాన్ని 'నవాంబుజాహితలత' అని తర్జుమా చేసాడు అర్థ స్ఫూర్తి వెంటనే కలగదు కవి ఉద్దేశించిన అర్థమేమిటో ముందుగా ఊహించి దానికి అనుకూలంగా సమన్వయించు కోవలసిన క్లేశం పాఠకుడికి ఏర్పడు తుంది. దీన్నే "నేయార్థము" అని నిత్య దోషంగా చెప్పారు ఆలంకారికులు నాయికకి "సాగర కర్ణయాన" అనే విశేషణం వేసాడు ఒక కవి ఏనుగుకి చెవి దగ్గర స్రవించే మదానికి సాగ రము అని పేరు సాగర కర్ణము అంటే ఏనుగు మదగజయాన అన డానికి సాగరకర్ణయాన అన్నాడన్నమాట కవి దీన్ని నేయార్థమనే దోషానికి ఉదాహ రణగా కావ్యాలంకార సంగ్రహం చూపించింది అటువంటి అర్థక్లేశాలు ప్రబంధాలలో సర్వసాధారణం. దీనిని ఒక ప్రౌఢిగా కొందరు కవులు భావించినట్టు కనిపిస్తుంది.

నొడువుల పడతుక మగనికి
బొడసూపని తనదు రూపు పొడ గనిపించెన్-
జడనిధి శయనుడు కొంగున
ముడిచిన మణిగాదె భక్తముఖ్యుల కెల్లన్! (౨-४౮)

జలనిధి - జడనిధి లడలకు అభేదం. సముద్రంలో శయనించే స్వామి భక్తముఖ్యులకు అందరికీ కొంగున ముడిచిన మణి కొంగు బంగా రంలాంటి వాడు భక్తజన సులభుడు అని అంచేత పుండరీకుడికి దర్శనం ఇచ్చాడు. (జలధిలో మణులు ఉంటాయి కదా!)

బ్రహ్మదేవుడికికూడా పొడచూపని తన రూపపు పొడ పుండరీకుడికి కనిపించేట్లు చేసాడు నొడువు అంటే వాక్కు నొడువుల పడతుక (స్త్రీ) అంటే వాగ్దేవి

ఆమె భర్త - బ్రహ్మ బ్రహ్మాదులకైనా స్వామి దర్శనం దుర్లభం. అటువంటిది తానే వచ్చి, దర్శనమిచ్చాడు - జలధి శయనుడు. కొంగున ముడిచిన మణిగాదె భక్త ముఖ్యుల కెల్లన్ అనే లోకోక్తితో దీన్ని సమర్థించాడు కాబట్టి కావ్యలింగం అలంకారం. (సమర్థ నీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్).

నిగనిగని విదళ కదళీ
యుగళిన్నగి, జిగి దొలంకు నూరుల, గనుచౌ
క్కు గదురఁజేయు - జగత్పతి
దగిలి కనుంగొనుచు, మునిమదావళ మెలమిన్ (౭-4౨)

ఆ జగత్పతి దర్శనం కనుచొక్కు కదురజేస్తోంది. నేత్ర పారవశ్యం (చొక్కు) కలిగిస్తోంది ఆ రూపాన్నే తగిలి కనుగొంటోంది - విడవకుండా చూస్తోంది - ఈ ముని మదావళం మదావళం అంటే దంతావళం. అంటే ఏనుగు. ముని గజేంద్రం జగత్పతిని తగుల్కొని కనుగొంటోంది. ఈ ఏనుగు అంతగా తగుల్కోవడానికి అక్కడ ఉన్న ఆకర్షణ ఏమిటి ? అంతటి నేత్ర పారవశ్యానికి కారణం ఏమిటి ? ఇది చెబుతున్నాడు పై పాదాలలో

పై పొర తొలగిపోయి (విదళ) నిగ నిగ లాడుతున్న కదళీ యుగళిని పరిహసించి(నగి)కాంతులు తొణుకుతున్న(జిగిన్ తొలంకు) ఊరువు లతో నేత్ర పారవశ్యం కల్పిస్తున్నాడు- జగత్పతి (ఊరువులు - ఊరులు).

ఇంతకు ముందటి పద్యాలలో తొడలను వర్ణించలేదు ఆ లోటు తీర్చడానికి ఈ పద్యం

ఏనుగులకి అరటి చెట్లను చూస్తే కనుచొక్కు కలుగుతుంది కద ళీవనంలో ప్రవేశించిన ఏనుగు ఒక పట్టాన బయటికి రాదు. ఆ చల్లదనా న్నీ, ఆ వగరు వాసననీ ఆనందిస్తూ, అందులోనే సంచరిస్తూ ఉంటుంది ఎంతసేపయినా.

పుండరీకుడు ముని మదావళం కనక, కదళీయుగి వంటి ఊరు వులు కలిగిన ఆ జగత్పతి రూపం-చూపులకి పారవశ్యాన్ని కలిగిస్తే, అలాగే తగిలి కనుగొంటూ, సంతోషంతో (ఎలమిన్) ఉండిపోయాడు. ఎంతకీ తేరుకొని బయట పడలేకపోయాడు

విదళ కదళీ యుగళిన్ నగునట్టి ఊరువులు అన్నచోట కదళీయు గళికీ ఊరువులకూ అభేదం - చెప్పి వాటికన్నా ఊరువులే నిగనిగలాడుతున్నాయి అని సూచించడంవల్ల ఉపమేయంలో (ఊరువులు) గుణాధిక్యం చెప్పినట్టు అయ్యింది. కాబట్టి ఇది అధికాభేదరూపకం. ఊరువులను కదళీయుగం అన్నాడు. కాబట్టి పుండరీకుణ్ణి ముని మదావళం (ఏనుగు) అని తాద్రూప్య రూపకం చెయ్యవలసి వచ్చింది ఇలా ఒకరూపకం మరొక రూపకానికి కారణమైతే దాన్ని "పరంపరితరూపకం" అంటారన్నాడు భట్టుమూర్తి. (కావ్యాలంకార సంగ్ర హము ౩-4౩)

విపుల వీక్షణశక్తిచే- వెండి -కుండ
లీంద్రతలిమూంగ రుచిసుధ యెత్తి ఁ్రోలి,

సంతత వ్రత కల్పనా జాయమాన

దుస్తర క్లేశ మంతయు దొలగ ద్రోచి. (౭-౮౦)

బాలకృష్ణుడు ప్రత్యక్షమయ్యేసరికి పుండరీకుడికి - అంతవరకూ తపోవ్రత నియమాల ఆచరణంవల్ల కలిగిన (జాయమాన) దుస్తరక్లేశం అంతా తొలగిపోయింది ఆ ఆనందంతో ఆ క్లేశాన్ని తొలగ ద్రోసుకున్నాడు - క్షణంలో మర్చిపోయాడని.

క్లేశాలను తొలగించుకోడానికి బలవర్ధక - ఔషధంలా ఎట్ట ఎదుట స్వామి కుండలీంద్రతలిముడు కుండలి అంటే సర్పం కుండలీంద్రుడు - ఆదిశేషుడు అతడు తలిమగా (తల్పంగా) శయనించేవాడు - కుండలీంద్ర తలిముడు అంటే విష్ణుమూర్తి అతడి శరీరకాంతి (అంగరుచి) అనే అమృతాన్ని (సుధను) ఈ పుండరీకుడు తన విశాలమ్మైన కన్నులు అనే శంఖాలతో (శుక్తిచేన్-జాత్యేకవచనం) ఎత్తిత్రాగాడట. ఆ అమృతాన్ని అలా క్రోలి దుస్తరక్లేశమంతా చిటికెలో తొలగించుకున్నాడు (మరియు అనే అర్థంలో వెండి అనే పదం ఇక్కడ పాదపూరకం)

వీక్షణశుక్తి చేన్ అని ఏకవచనం వాడటమేమిటి ? రెండుకన్నులూ ఉన్నాయి కదా రెండూ శుక్తులే కదా ! మరి ఏమిటిది ? అంటే - కన్నులు, చేతులు కాళ్ళు వంటి రెండేసి అవయవాలు ఉన్నప్పుడు ద్వివచనం వాడాలి (నేత్రే - కరౌ - పాదౌ) ఒక్కొక్కప్పుడు ఏకవచనం వాడినా పరవాలేదు అవి సాధారణంగా అందరికీ రెండేసి ఉంటాయి కనక అని ఆలంకారికులు అనుమతి ఇచ్చారు తెలుగులోకూడా కన్నెత్తి చూడటం చేయెత్తి మొక్కడం అని బహువచనానికి బదులు ఏకవచనం వాడటం ఉంది అంచేత "వీక్షణశుక్తిచే" అంటే శుక్తులచేన్ అని బహువచనమే చెప్పాలి (శుక్తి = శంఖము, ముత్తెపు చిప్ప)

శంఖంలో పోస్తేనే కానీ తీర్థం కాదు అని ఒక నానుడి వ్రత నియమంతో ఉన్నవాళ్ళు పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టుకోకూడదు మరి దాహం వేస్తుందికదా ఎలాగ అంటే, తీర్థంగా అయితే పుచ్చుకోవచ్చు అని అనుమతి ఇచ్చారు దాహం వేసినప్పుడల్లా గుడికి పరిగెత్తుతాడా తీర్థం పుచ్చుకుంటాడా అందుకని మడి నీళ్ళని శంఖంలో పోస్తే అది తీర్థమయి పోతుంది దాన్ని పుచ్చుకోవచ్చు, దాహం తీర్చుకోవచ్చు అన్నారు. అప్పటి నుంచీ వైష్ణవ సంప్రదాయంగా ఈ నానుడి బయలుదేరింది. అర్థ వ్యాకో చం చెంది- ఏ పనికైనా ఎవరో ఒక పెద్దవారి అనుమతి తీసుకోవాలి అనే భావంతో స్థిరపడింది.

వ్రతనియమాల్లో ఉన్న పుండరీకుడు ఇప్పుడు ఈ సుధను క్రోలుతున్నాడు. సరాసరి పుచ్చుకుంటే నియమభంగం అవుతుంది ఆచారం ఒప్పకోదు. అందుకని వీక్షణ శంఖాలలో పోసి సుధను తీర్థం చేసి ఎత్తి క్రోలుతున్నాడు ఇదీ ఈ కల్పనలో నాగసు

వీక్షణ శుక్తులలోకి ఎత్తి సుధను క్రోలి అని ఒక అన్వయం శుక్తుల చే సుధను ఎత్తిక్రోలి అని మరొక అన్వయం పాత్రను నోటికి అన్నకుండా ఎత్తి, పానీ

యాన్ని పోసుకోవడం దాక్షిణాత్యుల ఆచారం. అందునా వైష్ణవు లకు ఈ పట్టింపు ఎక్కువ. కవీ పుండరీకుడూ ఇద్దరూ వైష్ణవులే. ఇంచు మించు దాక్షిణాత్యులే

ఆవు వదల్చు పచ్చవెదు రంఘ్రియుగాంతరసీమ నూది, య
గ్రావని దేఁజిరల్లు కటిహస్తసమన్వితు, గౌస్తుభాంకు, నిం
దీవిభు, నింద్రనీల నిభదేహు, గనుంగొని, హర్ష వర్ష ధా
రావిల మానసుండగుచు, నమ్మునిఁ గృత్యవిమూఢబుద్ధియై (౭-౮ ।)

పుండరీకమునికి ఎట్టి ఎదుట ప్రత్యక్షమై బాలకృష్ణమ్మ ఎలా నిలబడ్డాడో, ఏ భంగిమలో నిలుచున్నాడో ఈ పద్యంలో చూపించాడు.

ఆవుల్ని అదిలించడానికి ఉపయోగించే పచ్చని వెదురు కర్రను తన రెండు పాదాల మధ్యలోనూ (అంఘ్రియుగ + అంతరసీమన్) నొక్కి పట్టుకున్నాడట. అది జారి క్రిందపడిపోకుండా కాళ్ళమధ్య అదిమి (ఊది) పట్టుకున్నాడని అలా పట్టుకుని తన ఎట్ట ఎదుట (అగ్ర + అవనిన్) ప్రకాశి స్తున్నాడు.

కటిహస్త సమన్వితుడై నిలబడ్డాడు రెండు చేతుల్నీ కటిభాగానికి రెండు వైపులా, కుడి ఎడమ పార్శ్వభాగాలలో ఆన్చిపట్టుకుని నిలబడ్డాడు. కుడిచేతిని కుడి వైపునా, ఎడమచేతిని ఎడమవైపునా మోచేతులకీ డొక్కలకీ మధ్య వజ్రాకారంగా (డైమండ్ షేప్) ఖాళీ ఏర్పడేట్టు నిలబడ్డాడు. కటిహస్త సమన్వితున్-ముని దర్శిం చాడు.

తొండము నేకదంతమును అనే ప్రసిద్ధ పద్యంలో తోరపు బొజ్జయు వామ హస్తమున్ అన్నచోట - బొజ్జ మీద వామహస్తం వేసుకుని కూర్చున్న వినాయకుణ్ణి ఆ కవి బొమ్మకట్టించాడు. అటువంటిదే ఇదీను.

కౌస్తుభాంకున్. కౌస్తుభమణిని అలంకారంగా (అంక శబ్దానికి భూషణ మనికూడా అర్థం) ధరించిన స్వామిని ముని కనుగొన్నాడు. "ఇందిరా" శబ్దా నికి లక్ష్మీదేవి అని అర్థం. ఇందీ విభుడు అంటే లక్ష్మీపతి. ఇందీ వరుడు అన్నా అదే.

ఇంద్రనీల మణులతో సాటివచ్చే (నిభ) దేహం కలవాడు. ఇంద్రనీల నిభ దేహున్- కనుగొన్నాడు. అన్నీ ద్వితీయాంతాలు కాబట్టి దేని కదిగా "కను గొని" అనే అసమాపక క్రియలోకి అన్వయిస్తాయి. చూసిన వాడు-కర్త - అమ్ముని.

హఠాత్తుగా ప్రత్యక్షమయ్యాడేమో - చూడటంతోనే ఆ ముని మనస్సు హర్షధారావిలం అయిపోయింది హర్షం అనే వర్షధారలతో ఒక్క క్షణం వ్యాకులం (ఆవిలము) అయిపోయింది. పట్టరానంత ఆనందంతో మనస్సు ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. దానితో ఆ భక్తుడు కృత్యవిమూఢ బుద్ధి అయ్యాడు. ఏం చెయ్యాలో తోచలేదు. అర్ఘ్యం ఇవ్వాలా ? పాద్యం ఇవ్వాలా ? కాళ్ళమీద పడాలా ? ఏంచెయ్యాలి ? తాను చెయ్యవలసిన పని ఏమిటో తోచని (విమూఢమైన) బుద్ధి కలవాడు అయ్యాడు. ఒక్కక్షణం బుద్ధికి ఏమీ తోచలేదు. కళ్ళు అప్పగించి చూస్తూ, ఆ ఆనందంలో అలా స్థాణువులా ఉండిపోయాడు.

విలిఖితమో !, శిలాకృతియొ, విస్మృతి రూపువహించెనో యనన్
చలనవిదూరుడయ్యు దొలుసావి పయోధర ధార దోగు న
య్యిల దలయెత్తు క్రొత్తపులు నేపున లే బులకల్ తనూలతన్
మొలవగ నున్న నవ్వి,యదుముఖ్యుడు తాపసముఖ్యు నిట్లనున్ ౨-౮౨

లిఖించిన బొమ్మా ? శిలాప్రతిమా ? లేక పోతే విస్మృతి అనేది (మరుపు) రూపం ధరించిందా ? అన్నట్టు చలనం లేకుండా (చలన- విదూరుడై) బిగిసిపోయాడు పుండరీకుడు.

ఇదంతా ధ్యాననిష్ఠకు ప్రతీక. ఇంతకాలమూ ధ్యాన సమాధిలో నిశ్చలంగా కూర్చున్నప్పడు మనోనేత్రానికి కన్పించిన ఆకృతి ఇప్పడు చర్మ చక్షువులకి కనపడింది. దానితో శరీరానికీ సర్వేంద్రియాలకూ సమాధి నిశ్చలత ఆవరించింది

శరీరం నిశ్చలత వహించినా ఆంతరంగిక చైతన్యం ఆనందంతో పులకిస్తూనే ఉంది ''చలన విదూరుడయ్యున్ ' అన్నచోట ఆ చివరి సముచ్చయార్థకం (యున్) ఈ సూచన చేస్తోంది

లోపలి ఆనందం శరీరం మీద పులకాంకురాలుగా ప్రస్ఫుటమ య్యింది ఇది తపస్సమాధి నిష్ఠలోనూ జరుగుతూనే ఉంటుంది

తొలకరిమబ్బుల వాన ధారలలో (సొవి= ఋతువు కాలం) మునిగి తేలిన నేలమీద(తోగు ఆ + ఇలన్) అప్పటికప్పడు క్రొత్తగా తలయెత్తే లేత పచ్చిక మొలకల్లాగా (పులు=గడ్డి ఏపు = వలెన్) పుండ రీకుడి తనూలతమీద వేగంగా పులకలు పొడమినాయి

తను వంతా పులకాంకురాలు మొలవగా అలా నిశ్చలంగా ఉండి పోయిన తాపస ముఖ్యుణ్ణి చూస్తే, స్వామికి నవ్వువచ్చిందిట సహజమే నవ్వి - యదుముఖ్యుడు - శ్రీకృష్ణుడు-ఇట్లు అనున్ ఏమి పలికాడో తరువాత పద్యంలో చెబుతాడు

'పయోధరము'' అంటే ఇక్కడ ప్రకరణాన్ని బట్టి నీటిని (పయస్ నీరు పాలు) ధరించునది - మేఘము అని మాత్రమే స్వీకరించాలి

''తనూలత న్'' అన్నాడు సాధారణంగా నాయికా శరీరాన్ని లతతో పోలుస్తారు సన్నగా సుకుమారంగా ఉంది అని స్ఫురింపజెయ్యడానికి. పురుషుల శరీరాన్ని లతతో పోల్చడం అరుదు తపోవ్రత నియమాలతో కృశించి పుండరీకుడి శరీరం సన్నగా సుకుమారంగా ఉంది అని సూచన కావచ్చు అతడు తాపసముఖ్యుడు కనకనే స్వామి యదుముఖ్యుడైనా తనంతతాను వచ్చాడని మరొక స్ఫూర్తి.

విలిఖితమో! శిలాకృతియొ! విస్మృతి రూపు వహించెనో యనన్ అనేచోట సందేహాలంకారంతో కూడిన ఉత్ప్రేక్షాలంకారం క్రొత్తపులు నేపున పులకల్ మొలవగన్ అన్నచోట ఉపమాలంకారం మూడింటి సంసృష్టి

పరమాత్మ భక్త పరాధీనుడు తానై వచ్చి దర్శనం అనుగ్రహించడమే కాదు సంభాషణకూడా తానే మొదలుపెడుతున్నాడు

"నిచ్చలు నిచ్చలో బొదలు నీ పితృ భక్తికి-జ్ఞాన శక్తికిన్
మెచ్చితి, నచ్చితిన్ గరము నీయెడ నీ యెడ యేల ? వేడు కొ
మ్మిచ్చెద జెచ్చెరన్ వలయు నీప్సితముల్ శతమేని, దీన నే
హెచ్చెము నొచ్చెముం బొరదు భూసురకేసరి! నమ్ము" నావుడున్ (౨-౮౩)

ఓ భూసుర కేసరీ అని సంబోధన చేసాడు బ్రాహ్మణ సింహమా
బ్రాహ్మణోత్తమా ! అని దీని భావం. సంబోధనలోనే రంగు తెలిసిపోయింది స్వామి
వారు మంచి ఉత్సాహంగా ఉన్నారు ఉల్లాసంగా ఉన్నారు తపస్సుకి మెచ్చి మురిసిపో
తున్నారు వరాలు కురిపిస్తారు అనే అభిప్రాయాన్ని కల్గించే సంబోధన వచ్చి ప్రత్యక్షమ
య్యాడంటేనే అంత నవ్వి అనడంలో కొంత ఈ సంబోధనతో మరింత ఉత్సాహశీల
షైన శ్రీ కృష్ణుని ఈ మానసికావస్థకు అభివ్యంజకంగా మాటల కూర్పు, వాక్య విన్యా
సమూ సాగాలి అదే చేసాడు శబ్దాలంకారాలతో కాకు స్వరాలతో చిన్న చిన్న
వాక్యాలతో.

నిచ్చలున్ ఇచ్చలో పొదలు నీ పితృభక్తికి జ్ఞాన శక్తికిన్ మెచ్చితి - ఇది ఓం
ప్రథమమంటూ మొదటి వాక్యం (ఇచ్ఛ - ఇచ్ఛ, పొదలు=వృద్ధి పొందు)
నిత్యమూ నీ హృదయంలో వృద్ధి పొందే నీ పితృభక్తికీ జ్ఞాన శక్తికీ
మెచ్చుకున్నాను- అని ముందుగా తన భక్తుణ్ణి అభినందించాడు మెచ్చాను కాబట్టే
వచ్చానని కారణం చెప్పినట్టయ్యింది

పితృభక్తి అంటే తల్లిదండ్రులపట్ల భక్తి పితృశబ్దం ఒకటే ఉన్నా తల్లి దండ్రులు
అనే అర్థం ఏకశేషసమాసం అంటారు (మాతా చ పితా చ పితరౌ అని) (సమాన
రూపం కలిగిన) స్త్రీవాచక పురుషవాచక శబ్దాలకు సమాసం చేస్తే స్త్రీవాచకశబ్దం
లోపించి పురుషవాచకశబ్దం మిగిలి అదే స్త్రీవాచక శబ్దార్థం కూడా ఇస్తుంది.
హంసలు అంటే హంసీ హంసలు అని విద్యార్థులు అంటే విద్యార్థినీ విద్యార్థులు
అని అంచేత పితృ భక్తి అంటే మాతా పితృభక్తి.

మోక్ష విషయకమైన బుద్ధికి జ్ఞానమనీ శాస్త్ర విషయక మైన బుద్ధికి
విజ్ఞానమనీ స్థూలంగా వ్యవహారం.

నీ పితృభక్తికీ నీ జ్ఞాన శక్తికీ మెచ్చుకుని ప్రత్యక్షమయ్యానని అభి నందన
పూర్వకంగా హేతూద్ఘాటన

నచ్చితిన్ కరము నీ యెడన్ - అనేది రెండో వాక్యం నీ విషయంలో మిక్కిలి
(కరము) ప్రీతి పొందాను ఆ ప్రీతిని నీకు తెలియపరచడం కోసం వచ్చానని
రావడంలో ఉద్దేశం ఇది. ప్రీతిని తెలియపరచడం వరాలు ఇవ్వడంగా ఉంటుంది

ఈ ఎడ ఏల ? - అనేది మూడో వాక్యం ఎడము - ఎడ అనే మాటలకి
దూరము, విలంబము, జాగు అని అర్థాలు ఇంకా ఈ ఆలస్యం ఎందుకు ? - అని

వేడుకొమ్ము - ఇచ్చెద చెచ్చెరన్ వలయు ఈప్సితముల్ శతమేని- అనేది
నాలుగో వాక్యం కోరుకో, ఇచ్చేస్తాను-వేగంగా, కావలసిన వరాలు వందయినాసరే

(శతమేనిన్) - అన్నాడు

ఈ పదాలను కూర్చిన వరసలోనే ఉంది సొగసంతా ఇంకా ఆలస్య మెందుకు అన్నందుకు అనువుగా, శ్రీకృష్ణుని ఆనందోత్సాహాలకు అభివ్యంజకంగా తుంపులు తుంపులుగా సాగింది

చెచ్చెరన్ (వేగంగా) అనే మాటని వేడుకొమ్ము అనే దానికీ అన్వయించ వచ్చు. ఇచ్చెదన్ అనే దానికీ అన్వయించ వచ్చు ఎంత వేగంగా కోరుకొంటే అంత వేగంగా ఇచ్చేస్తానని కోరవలసిన ఈప్సితాలకు కూడా (కోరికలకు) పరిమితి లేదు నూరయినా ఇచ్చేస్తానన్నాడు శతము అనేది బహుత్వ సూచకం. వంద అనే పరిమితి కూడా లేదు ఎన్నయినా ఇచ్చేస్తానని హుషారే

ఇక్కడ పుండరీకుడి మనస్సుకి ఒక సందేహం రావాలి. స్వామీ! ఏవో నేను కోరుకుంటాను, నువ్వు ఇస్తావు బాగానే ఉంది కానీ దీనివల్ల నా తపస్సు ఏమైనా తరిగి పోతుందేమో!. కట్టకడపట మోక్షసాధనకు సరిపోదేమో. - అని.

ఇది ఊహించాడు కాబోలు పరమాత్మ, అటువంటి ఇబ్బంది ఏమీ ఉండదని భరోసా ఇస్తున్నట్టు- ''దీనన్ ఏ పొచ్చెమున్ నొచ్చెమున్ చొరదు నమ్ముము'' అన్నాడు అయిదో వాక్యంగా

ఈ ప్సితాలు శతమేని కోరి నానుంచి పొందినందువల్ల (దీనన్) నీకు ఏ న్యూనతా (ఏ పొచ్చెమున్) రాదు ఏ లోపమూ (ఏ నొచ్చెమున్) రాదు. నామాట నమ్ము - అని గట్టిగా చెప్పాడు

కృష్ణ పరమాత్మ ఇంత ఉత్సాహంగా, ఆత్మీయంగా పలికే సరికి (నావుడున్) పుండరీకుడిలో కదలిక వచ్చింది. వెంటనే సాగిలపడ్డాడు.

భస్మోద్ధూళనపాండురాంగము - రమాప్రాణేశు పాదద్వయిన్
విస్మేరాంబుజగామి హంస మిధినాన్ వే వ్రాల్చుచున్, లేచి ''దే
వాస్మాకం శరణం త్వమేవ, గతిరన్యా నాస్తి, దుర్వాసనా
పస్మారం హర ''యంచు బల్కి మటియున్ భక్తుండు భక్తి స్పృహన్ 2-84

విభూతి పులుముకోవడంవల్ల తెల్లగా ఉన్న తన శరీరాన్ని పుండరీ కుడు స్వామివారి పాదాల మీద వెంటనే వాల్చేసాడు. భక్తి తన్మయత్వంతో అమాంతం సాష్టాంగ పడ్డాడని

పుండరీకుడు విష్ణుభక్తుడు. త్రిపుండ్రాలూ మంచి గంధం ఇలాంటివి అలం కరించుకోవాలే తప్ప శివ భక్తుడిలా భస్మ ఉద్ధూళనం చేసుకోవ డం, మరీ ఒళ్ళంతా తెల్లబడేట్టు (పాండుర+ అంగము) పులుము కోవడం విడ్డూరంగానే ఉంది బహుశ ఇది దాసభక్తిలో భాగం కావచ్చు వైష్ణవుల దృష్టిలో శివుడు విష్ణుభక్తుడు ఆ భక్తుడికీ నేను భక్తుణ్ణి అన్నట్టు సూచకంగా భస్మధారణ చేసాడేమో!!

అటువంటి తన పాండురాంగాన్ని రమా ప్రాణేశుని పాదద్వయి మీద వ్రాల్చాడు ఎంత చటుక్కున సాగిలపడ్డాడో చెప్పడాన్కి'' విస్మే రాంబుజ గామి

హంసము ఇది నాన్'' అనే ఉపమానం వేసాడు కవి వికసించిన పద్మాల దగ్గరకు
(విస్మేర+ అంబుజ) చర్రున ఈదుతూ సాగే (గామి) హంసము ఇది అన్నట్టు (నాన్)
చటుక్కున సాష్టాంగపడ్డాడు ఆ సాష్టాంగ పడటంలో వేగాన్నీ, నిశ్శబ్దాన్నీ సూచిస్తోంది
ఉపమాన కథనం

దీనివల్ల శ్రీ కృష్ణుని పాదాలు విస్మేరాంబుజాలు అనేది ఒకటి స్పష్ట పడు
తోంది పాదపద్మాలు

మునీశ్వరుల్లో హంసలూ పరమహంసలూ అని స్థాయి భేదాలు ఉన్నాయి
పుండరీకుడు ఇప్పుడు హంస స్థితిని పొందాడని మరొక సూచన భస్మోద్ధూళన పొందు
రాంగం కాబట్టి హంసతో పోలిక హంసలు తెల్లగా ఉంటాయని కదా కవుల వర్ణన

శ్రీకృష్ణుడి పాదాలమీద పుండరీకుడు ఇప్పుడు తన శరీరాన్ని - వికసించిన
పద్మాలమీద హంసలాగా వ్రాల్చాడు అనేది ఇక్కడి వాక్యం మొదటి భాగం ఉపమేయం.
రెండో భాగం ఉపమానం పాదాలకు పద్మా లూ, పుండరీకుడికి హంసమూ ఉపమా
నాలు ఉపమానోపమేయాలు రెండింటికీ (హంస పుండరీకులు) వ్రాలడం అనేది
సమానధర్మం అది దేహళీ దత్త దీప న్యాయంగా (గడపమీద దీపం లోపలికీ వెలుపలికీ
కాంతులు ప్రసరించి నట్టు) రెండింటికీ అన్వయిస్తోంది. కనక దీన్ని దీప కాలంకారం
అనవచ్చు (వదంతి వర్ణ్యావర్ణ్యానాం ధర్మైక్యం దీపకం బుధాః)

అలా సాష్టాంగ నమస్కారం చేసి లేచి ఆ భక్తుడు భక్తిస్ఫో హాతో సంస్కృ
తంలో ఇలా పలికాడు (వేచి అని కొన్ని ప్రతులలో పాఠం)

దేవ అస్మాకమ్ = మాకు, త్వమ్ ఏవ = నీవే, శరణమ్ = దిక్కు అన్యా =
వేరొక, గతిః = దిక్కు-లేదా-మార్గం న+అస్తి=లేదు దుర్వాసనా= దుస్సంస్కార
రూపమైన అపస్మారమ్ =అపస్మార రోగాన్ని (సంస్కారస్మృతి కోల్పోవడం అనే
రోగాన్ని) హర= దయచేసి తొలగించు - అని పల్కి ఇంకా ఏమన్నాడో తర్వాత పద్యాల్లో
చెబుతున్నాడు

ప్రత్యక్షమైన స్వామి తెలుగులో మాట్లాడినా పుండరీకుడు దేవ భాషను
ఆశ్రయించడం విశేషం ఆవేశం వచ్చినప్పుడు కొందరికి భాష మారిపోతూ ఉంటుంది.
పుండరీకుడిది భక్త్యావేశం పూజాపురస్కారాల్లో అలవాటయిన భాష వచ్చేసిందను
కోవాలి అయితే ఇది ''ష్మ'' ప్రాసను తేలికగా నిర్వహించడానికి కవికి అనువుగా
కలిసివచ్చింది. ''అస్మాకమ్, అపస్మారమ్'' లతో మిగతా రెండు పాదాలూ నడిచి
పోయాయి. ఇటుపైని మాత్రం తెలుగులోనే మాట్లాడుతున్నాడు - అనుగ్రహించి

పాదలు నీ పొక్కిటి పువ్వు తాన్పున గదా!
పెను మాయ పిల్లల బెట్టు టెల్ల
బోడము నీ మొదలి యూర్పుల నేర్పులవ కదా!
చదువు సంధ్యలు గల్గి జగము మనుటి
కెరలు నీ యడుగు దామరల తేనియ గదా!

పాపంపు బెనురొంపి పలుచ నగుట.
పాసగు నీ తెలిచూపు పస గదా । యిది రాత్రి
యిది పవలను మేర లెఱుగబడుట
భవన ఘటనకు మొదలి కంబమును బోలె
భువనముల కెల్ల నీ వాదిభూతి వగుచు
నిట్టనిలుచున్కిచే గాదె నెట్టుకొనియెం
గెంటు గుంటును లేక లక్ష్మీకళత్ర । (౭-౮౮)

లక్ష్మీదేవి భార్యగా (కళత్రము) కలిగిన ఓ పరమాత్మా అందమైన నీ నాభిపద్మంలో (పొక్కిటి పువ్వు) జన్మించిన బ్రహ్మదేవునివల్లనే కదా పెనుమాయ- ఈ లోకాలూ, జీవరాశులూ అనే పిల్లల్ని పెట్టింది

నీ తొలి నిట్టూర్పుల నేర్పులవల్లనే కదా ప్రపంచానికి చదువు సంధ్య లు అబ్బింది వేదాలను పరమాత్మని నిః శ్వాసాలుగా వర్ణించడం ఉంది వేదాలే చదువులు అవే సంధ్యావందన మంత్రాదికం అంచేత చమత్కారం గా వేదాలను చదువు సంధ్యలు అన్నాడు

నీ పాదపద్మాలనుంచి స్రవిస్తున్న తేనెవల్లనే కదా పాపము అనే రొంపి పలుచనై కడిగివేయబడుతోంది గంగానది పాపహారిణి అది విష్ణు పాదాలనుంచి పుట్టింది అంటారు విష్ణుపాదోద్భవ ఆ నదిని స్ఫురింప జేస్తోంది తేనియ అనే పదం

బ్రహ్మ, వేదాలు, గంగ అనే పదాలను ప్రయోగించకుండా ఉపమానాల ద్వారా స్ఫురింపజేసాడు కనక ఈ మూడు పాదాలలోనూ రూపకాతిశయోక్తి అలంకారం పెనుమాయ పిల్లల్ని పెట్టింది అనడం అపూర్వమైన అభివ్యకి

స్వామీ నీ చూపులవల్లనేకదా- ఇది రాత్రి ఇది పగలు అనే విభాగం (మేరలు) ఏర్పడుతోంది సూర్యచంద్రులు పరమాత్మకు నేత్రాలు అని పురాణవర్ణన (యే ద్వే కాలం విధత్తే అన్నాడు కాళిదాసు)

గృహనిర్మాణానికి మూలస్తంభంలాగా '(మొదలి కంభమువోలె) ఈ భువనాలకన్నింటికీ నువ్వే ఆదికారణానివి (ఆదిభూతివి) అలా నువ్వు నిలబడ్డావు కాబట్టే ఈ భువనాలు అన్నీ త్రోపుడులు లేకుండా (గెంటు) కుంటుపోకుండా కాలం నెట్టుకువస్తున్నాయి ఇవి స్థిరంగా ఇన్ని వేల యుగాలు నిలవడానికి నువ్వే ఆదికారణం అని

ఇటుపైని విష్ణుమూర్తి దశావతారాలనూ స్తుతిస్తున్నాడు తెలుగు ప్రబంధాలు చాలా వాటిలో ఈ దశావతార వర్ణన కనపడుతుంది పెద్దన చేసాడు తిమ్మన చేసాడు రాయలు చేసాడు ఇదిగో ఇప్పుడు రామకృష్ణుడూ చేస్తున్నాడు పోటీపడి అత్యద్భుతమైన కల్పనలు చూపించారు

సోమకాసురుడు వేదాలు అపహరించి సముద్రంలో దాక్కుంటే విష్ణు మూర్తి మత్స్యావతారం ధరించి అతణ్ని సంహరించి వేదాలు తెచ్చి బ్రహ్మకు అప్పగించా

దని పురాణకథ దీన్ని కవిత్వీకరిస్తున్నాడు కవి

ముదమున- సోమకాసురుడు ప్రుచ్చిలి యచ్చలమార గొన్న ప్రా
జదువులు తెచ్చి, తజ్జఠర సాంద్రతరాంత్రము లంట వంటు బల్
గదురు దొలంగ గీర్తి యను గంగ దొలంచి, విధాతృ విస్ఫుర
ద్వదన సరోజ గంధ లలితంబులు సేసితిగా! జగన్నిధీ! (౭-౮౬)

ముదమునన్- అని పద్యం ఎత్తుగడ. ఈ మాట నాలుగోపాదం చివర ఉన్న 'చేసితివి గదా' అనే క్రియలోకి అన్వయిస్తుంది సంతోషకరమైన పదంతో దశావతార వర్ణనని ప్రారంభించాలి కదా అనిచెప్పి ఇలా చేసి ఉంటాడు అంతేకానీ సోమకాసురుడు ముదమునన్ (సంతోషంతో) వేదాలను ప్రుచ్చిలించాడు అని అన్వయించకూడదు ప్రుచ్చిలించడానికి (అపహరించడం) ముదముతో అనే విశేషణం పొసగదు

ఓ జగన్నిధీ! ఆ చలము (పట్టుదల) అతిశయించేట్టు సోమకా సురుడు ప్రుచ్చిలించి తన పొట్టలో దాచి పెట్టుకున్న ప్రాజదువుల్ని (తొలి చదువులు - వేదాలు) తెచ్చావు నువ్వు వాడి డొక్కచించి పట్టుకువచ్చావు

ఆ పొట్టలో (జఠరం) దట్టంగా ఉన్న పేగులు (సాంద్రతర+ ఆంత్రములు) అంటుకొ‹‹ది ఆ సోకడంతో వేదాలకు ఒక పెద్ద దుర్వాసన (బల్ గదరు- గదురు) అంటుకొంది ఆ దుర్గంధం పోయేటట్టు (తొలంగన్) నీ కీర్తి అనే గంగానదిలో ముందు ప్రక్షాళన చేసావు (గంగన్+తొలంచి) తరవాత బ్రహ్మదేవుడి (విధాతృ) వికసించిన ముఖ పద్మాలలో (విస్ఫురద్+ వదన + సరోజ) వాటిని నిక్షేపించి పద్మసుగంధంతో అవి లలితాలు అయ్యేట్టు చేసావు

దుర్గంధం తొలగించడమే కాక సుగంధం అబ్బేట్టు చేసాడు సోమకాసురుణ్ని సంహరించి వేదాలను తీసుకురాగానే విధాత ముఖాలు వికసించాయి పద్మాలుకదా ఆ వికసించిన ముఖపద్మాలలో వీటిని సువాసితం చేసాడని లోక ప్రసిద్ధమైన విధానాన్ని జోడించి చేసిన అపూర్వ కల్పన అంతటా రూపకాలంకారం

రెండోది కూర్మావతారం ఒకప్పుడు దూర్వాసుడు శపిస్తే ఆ తాపం తట్టుకోలేక ఇంద్ర రాజ్యలక్ష్మి-వెళ్ళి సముద్రంలో మునిగిందట అప్పుడు విష్ణుమూర్తి తాబేటి రూపం (కూర్మావతారం) ధరించి ఆ రాజ్యలక్ష్మిని పైకి ఎత్తి తెచ్చి, ఇంద్రుడికి తిరిగి అప్పగించాడట ఇది మరొక పురాణ గాథ దీన్ని చెబుతున్నాడు

కోపన కోప (శాప) నవ్య శిఖి గోల్మసగన్, గనుగంది, క్రుంది, త
త్తాపము నాగ లేక, తిమిధామ జలభ్రమి గూలి, తూలు, జం
భాపహరాజ్యలక్ష్మి, వెరవారగ దేర్చవె, యూతకాయ రూ
పై, పృథుకర్పరం బమర, నాశ్రిత రక్షణ దక్షవీక్షణా! (౭-౮౭)

కోపనుడు అంటే చీటికీ మాటికీ కోప్పడేవాడు దూర్వాసుడు ఈయనకి కోపం వచ్చిందంటే శాపం ఇచ్చాడన్న పేర్లు కోపాయుధుడు, శాపాయుధుడు అని పేర్లు

మాటే ఆయన కోపమో శాపమో అదొక క్రొత్తఅగ్ని (నవ్యశిఖి మామూలు అగ్నికాదు ఇదొక క్రొత్త అగ్ని - శాపాగ్ని కోపాగ్ని) విజృంభించి దహించివేస్తోంటే (కోల్మసగన్) ఆ తాపాన్ని తట్టుకోలేక (ఆగలేక- ఆపు కోలేక) ఇంద్ర రాజ్యలక్ష్మి సముద్రంలో కూలింది భయంతో తూలుతోంది సముద్రంలో మునుగుతూ తేలుతూ కొట్టు మిట్టాడుతోంది

జంభ+ అపహుడు అంటే జంభాసురుణ్ణి సంహరించినవాడు - ఇంద్రుడు అతడి రాజ్యలక్ష్మి సముద్రం పాలయ్యింది సముద్రము అనడా నికి "తిమిధామము' అన్నాడు తిమి-తిమింగల శబ్దాలు సమానార్థకాలు తిమింగలాలకు నిలయం (ధామం) - సముద్రం భ్రమి అంటే గిర గిరా తిరిగేది - సుడిగుండం తిమిధా మంలో నీటి సుడిగుండాలలో పడి పాపం జంభాపహ రాజ్యలక్ష్మి తూలిపోతోంది

అసలే సముద్రం అందులో తిమింగలాలు సుడిగుండాలు పడిన వ్యక్తి చూస్తే స్త్రీ భర్త జంభాపహుడే అయితే ఏమిలాభం! రాక్షసుల్ని సంహ రించి రాజ్యలక్ష్మిని కాపాడుకోగలడేమో కానీ - మునిశాపంనుంచి అందు లోనూ దూర్వాసుడి శాపంనుంచి కాపాడలేకపోయాడు ఇవన్నీ శబ్దశక్తి ద్వారా స్ఫురించే విశేషాలు

అలా కూలి తూలిపోతున్న రాజ్యలక్ష్మిని ఓ దేవా! నువ్వు ఉపాయంతో (పెరవు= ఉపాయం పెరవారగన్) సముద్రంనుంచి తేలేట్టు చేసావు ఉద్ధరించి ఇంద్రుడికి అప్పగించావు అని. ఎలాగంటే-

గట్టిగా విశాలంగా ఉన్న వీపుచిప్ప (పృథుకర్పరంబు+ అమరన్) ఈతకాయ రూపంగా అమరడంతో, దానిమీద నిలబెట్టి రాజ్యలక్ష్మిని పైకి తేల్చావు

కూర్మానికి వీపు చిప్ప (కర్పరం) గట్టిగా ఉంటుంది దాన్ని ఈత కాయగా పోల్చాడు నీళ్లల్లో ఈదడానికి ఉపయోగించే సాధనాన్ని ఈత కాయ అంటారు ఈత కొరకైన కాయ) తొలిచేసిన సొరకాయ బుర్రలకి (అనపకాయ బుర్రలు) మూతి బిగించి లోపలకి నీళ్ళు వెళ్ళకుండా చేసి దాన్ని గుండెలకింద కట్టుకుని ఈతకొడతారు ఎక్కువ అలిసిపోకుండా ఎంతసేపయినా, ఎంతదూరమయినా తేలికగా ఈదవచ్చు ఆ బుర్రలో ఉండే గాలి కారణంగా అది మునగకుండా,మనిషి బరువుని కొంత మోస్తుంది. నీటికి ఉన్న ఊర్ధ్వ పీడన శక్తితో పైకి తేలుస్తుంది కూర్మావ తారానికి ఉన్న పృథుకర్పరం ఈతకాయ మాదిరిగా (ఈతకాయరూపై) అమరడంతో రాజ్యలక్ష్మిని తేలికగా పైకి తేల్చి గట్టెక్కించగలిగాడని కవి కల్పన

ప్రమాదవశాత్తూ ప్రవాహంలో పడిపోయిన ఒక నాయికను,ఒకా నొక నాయకుడు సాహసం చేసి, ఈదుకుంటూ వెళ్ళి, రక్షించి తెచ్చిన ఒకా నొక అప్రస్తుత వృత్తాంతం ప్రస్తుతంతో పాటు స్ఫురించేట్టు పద్యనిర్మాణం చేసాడు కనక ఇది సమాసోక్తి అలంకారం. (సమాసోక్తిః పరిస్ఫూర్తిః ప్రస్తు తే 2 ప్రస్తుతస్యచేత్).

ఇక్కడ స్వామివారికి " ఆశ్రిత రక్షణ దక్షణేక్షణా" అని ఒక సంబో ధన వేసాడు. ఆశ్రితుల్ని రక్షించడంలో దక్షణమైన (సమర్థమైన దక్షత కలిగిన) ఈ క్షణాలు (కన్నులు) కలవాడా - అని కేవలం ఈక్షణమాత్రం చేతనే ఆశ్రితుల్ని రక్షించగల

చేతవోలు

వాడని. కాబట్టే రాజ్యలక్ష్మిని రక్షించగలిగాడు ఈ విశేష్యం సాభిప్రాయం కనక పరిక రాంకురాలంకారం అనవచ్చు లేదా రక్షించిన సాహసాన్ని ఈ సంబోధన సమర్థిస్తోంది కనక కావ్యలింగా లంకారంగానైనా సమన్వయించుకోవచ్చు

రక్షణ - దక్షణ - ఈక్షణ పదాలను వరసగా కూర్చాడు రక్షణ - ఈక్షణ పదాలనుబట్టి మధ్యలో ఉన్న పదంకూడా క్షకారంతోనే ఉండి ఉంటుంది. ''దక్షిణే క్షణా ' అనే పాఠం సమంజసం కాదు. ఆశ్రితుల్ని రక్షించే కుడికన్ను కలవాడా అని కానీ దాక్షిణ్యం గలవాడా అని కానీ అర్థం వస్తుంది ఇవి అంత సొగసుగా లేవు 'దక్షిణ'' శబ్దానికే సమర్థుడు అనే అర్థం ఉన్నా శబ్దాలంకారం చెడిపోతుంది ఈ పాఠం కవిహృదయం కాదు అనుకుంటాను సమర్థము అనే అర్థాన్ని ఇచ్చే దక్ష దాతువుకి ల్యుట్ కానీ యుచ్ కానీ ప్రత్యయాలు (అన) భావార్థంలో చేరితే దక్షణమ్- దక్షణా అనే రూపాలు ఏర్పడతాయి (శ్రీవంతరాం సంజీవనీవ్యాఖ్య) అంతేకాక దక్ష శబ్దానికి (దక్షః - దక్షుడు, సమర్థుడు) మతుబర్థంలో ''న'' అనే ప్రత్యయం రావచ్చు లోమాది పామాది పిచ్ఛాదిభ్యః శనేలచః అని పాణిని సూత్రం ఇవి ఆకృతి గణాలు పామాది గణంలో దక్షశబ్దాన్ని చేర్చుకుంటే మతుబర్థకంగా న ప్రత్యయం చేరి దక్షణః అవుతుంది పామ అస్య అస్తీతి పామనః, లక్ష్మీరస్యాస్తీతి లక్ష్మణః అన్నట్లు దక్షతా అస్య అస్తీతి దక్షణమ్ (ఈక్షణమ్) అవుతుంది. ఏమైనా రక్షణ దక్షణేక్షణా అనేదే శబ్దాలం కార సామ్యాన్నిబట్టి రామకృష్ణుని హృదయంగా భావించవలసి ఉంటుంది. ఇటువంటి విచిత్ర ప్రయోగాలు వ్యాకరణ బలంతో చేసే వికటత్వం (ఉదారత) రామకృష్ణుడికి చాలా ఉంది

ఆ పెను పెల్లి దెళ్కు మకరాకరమేఖల నీవు దేల్చి యు
ష్టాపద టంక విభ్రమ విడంబినియౌ నిజదంష్ట్ర గూర్చుత
ద్రూపము దీపితంబవు సరోరుహలోచన! సప్తజిహ్వ జి
హ్వోపరిభాగ ధూమవలయోపమమై విలయోపలబ్ధిలన్ (౭-౮౪)

ఇందులో వరాహావతారాన్ని వర్ణిస్తున్నాడు. ప్రళయకాలంలో సృష్టి అంతా జలమయం అయిపోతుంది అందులో భూగోళం మునిగి పోతుంది విష్ణుమూర్తి వరాహావతారం ధరించి తన కోరమీద ఈ భూగోళాన్ని పైకి ఎత్తుతాడు ఇది పురాణ కథ

ఓ పుండరీకాక్షా విలయం వచ్చిన వేళల్లో (విలయ + ఉపల బ్ధిలన్) ఆ మహాజల ప్రవాహంలో (పెనుపెల్లిన్) మునుగుతూ తేలుతూ త్రెళ్ళుతున్న భూమిని (మకరాకరమేఖల) నువ్వు పైకి ఎత్తి తేల్చి నీ బంగారు కోరమీద (నిజదంష్ట్రన్) నిల బెట్టావు

ఆదివరాహం తెల్లగా ఉంటుందనీ దానికి ఒకే దంష్ట్ర ఉంటుంద నీ అది బంగారపు రంగులో ఉంటుందనీ పురాణ ప్రసిద్ధి అష్టాపదము అంటే బంగారం టంకము అంటే ఖడ్గం బంగారపు కత్తి సొగసుని- విభ్రమాన్ని ఈ కోర అనుకరి

స్తోంది (విడంబిని=అనుకరించునది)

అష్టాపద టంక విభ్రమ విడంబిని అయిన నిజదంష్ట్రమీద భూగోళాన్ని నువ్వు నిలబెడితే ఆ రూపం ఎంతగానో దీపితమయ్యింది దీనికి ఒక ఉపమానాన్ని చెబుతున్నాడు సప్తజిహ్వ జిహ్వోపరిభాగ ధూమ వలయోపమమై - అని

సప్త జిహ్వుడు అంటే అగ్ని. కాళి కరాళి, మనోజవ, లోహిత, ధూమ్రవర్ణ ఉగ్ర ప్రదీప్త- అని ఏడు జిహ్వలు (జ్వాలలు) ఉంటాయట అగ్నికి. అందుకని సప్త జిహ్వుడు.

సప్త జిహ్వుడి ఒకానొక జిహ్వకు ఉపరిభాగాన ఏర్పడి, వెనక్కి చుట్టుకున్న దూమవలయం లాగా (వలయాకారంలో చుట్టుకొన్న పొగ) ఉంది- కోరమీద భూగోళం

బంగారుకోర - సప్తజిహ్వుని జిహ్వ తడిసిన భూగోళం - దాని మీద నిలిచిన ధూమవలయం. ఇదీ దృశ్యం అగ్నిజ్వాలలు ఇంచుమించు బంగారం రంగులోనే ఉంటాయి కొంచెం ఎర్రగా ఉన్నా పెద్ద పేచీ లేదు. క్రొత్త గోదావరి నీళ్లని ఎరుపు రంగుగా వర్ణించడం ఉంది అలాగే ఇదీని పీత రక్త వర్ణాలకు కవులు పెద్దగా భేదం పాటించలేదు నిఘంటువులు అభేదం చెప్పాయి ధూమవలయం నల్లగా ఉంటుంది తడిసిన భూగోళ మూ నలుపే. జ్వాల - కొన తేలి, మధ్యలో వంపుతో-ఖడ్గంలా ఉంటుంది దంష్ట్రకూడా అంతే ఇన్ని రకాలుగా సరిపోయే ఉపమాలంకారం ఇది

పద్యం మొదటి మూడు పాదాల్లోనూ సన్నివేశాన్ని చెప్పి, అక్కడికి ఒక సంబోదన వేసి విరామం ఇచ్చి, కొసమెరుపుగా గొప్ప ఉపమానాన్ని పేల్చడం, దానితో మొత్తం పద్యానికి కొత్త వెలుగు రావడం - ఇదొక నిర్మాణ శిల్పం ఉదారత.

ప్రత్యక్షమైన స్వామివారిని పుండరీకుడు భక్త్యావేశంతో స్తుతిస్తున్నాడు కథాపరంగా ఇది ఆశుధోరణి అందుకే పద్యాల రచనలో శిల్పపరంగా ఆశుకవితా లక్షణం కనపడుతుంది పరుగులు తీసే వేగం కడదాకా నిర్వహించకండా - వచ్చిన చోట వచ్చినట్లూ, రానిచోట రానట్టుగా - విడిచి పెట్టేసిన శబ్దాలంకారాలు చదివిన వెంటనే పూర్తిగా చేతికి అందే భావ కల్పన మొత్తం పద్యాన్ని మిరుమిట్లు గొలిపే వెలుగుతో నింపే కొసమెరుపు చమత్కారం - ఇటువంటి ఆశుకవితా లక్షణాలు ఈ పది పద్యాలలోనూ ఎక్కువగా కనిపిస్తాయి కథాపరంగా అవసరమైన పద్యనిర్మాణ దోరణిని రచనాపరంగా చూపించడం ఒక శిల్ప విశేషం. " ఆశువునందు గరము మేటివి"(-౨౩) అని కృతిపతి విరూరి వేదాద్రిమంత్రి రామకృష్ణుణ్ణి ప్రశంసించడం గమనించదగింది

భూమికి పర్యాయపదంగా మకరాకర మేఖల అనే పదాన్ని ఉపయోగించాడు మకరము అంటే మొసలి మకరాలకు ఆకరం (నిలయం) మకరాకరం తిమిధామం అన్నట్టు. సముద్రమన్నమాట మకరాకరమే మేఖలగా- మొలనూలుగా కలది భూగోళం. భూదేవికి సముద్రమే మొల నూలు "సముద్రరశనాదేవీ" అని

కవితామయమ్మైన పదబంధమిది

నృసింహావతారాన్ని వర్ణిస్తున్నాడు హిరణ్యకశిపుడి గుండెలు చీల్చి ప్రేవులు తన మెడలో వేసుకున్న భీకరావతారం ఇది.

అలఘుజగద్విపద్ద్విపఘటాంకుశశాత నఖాంకురాగ్రలాం
గలములఁ మున్ను నీ వసురఘస్మర! వైరి భుజాంతరాళ జాం
గలమహి జాలువట్టి, పయి గ్రమ్మెడు నెత్తురు నీరు వెట్టి, యం
దలుకవె కీర్తి పూర్తి కలమాంకుర మింద్రరమాఫలార్థివై (౭-౮౨)

ఓ అసుర ఘస్మరా అని విష్ణుమూర్తికి సంబోధన ఘస్మరుడు అంటే వినాశకుడు అని అసురులకి ఘస్మరుడు- అసుర ఘస్మరుడు హిర ణ్య కశిపుణ్ణి సంహరించినవాడా అని తాత్పర్యం.

ఈ విశాలమైన జగత్తుకి ప్రతియుగంలోనూ ఏదో ఒక పెద్ద ఆపద వస్తూనే ఉంది. అటువంటి విపత్తులు అనే ఏనుగుల గుంపుకి (విపత్ + ద్విప+ఘటా) అంకుశాలవంటివి నీ వాడి గోళ్ళు. ఆ నఖాంకురాగ్రాలు అనే నాగళ్ళతో (లాంగలములన్) పూర్వకాలంలో నీవు శత్రువుల వక్షః స్థలాలు (భుజ+ అంతరాళ) అనే అడవి భూముల్ని (జాంగల మహిన్) దున్నేవు చాళ్ళు పట్టేట్టు నేర్పుగా దున్ని సాగుకి తెచ్చావు దున్నుతున్నప్పుడు పైకి చిప్పిలిన (పయిగ్రమ్మిన) నెత్తుర్నే నీరుగా పెట్టావు. పారించావు అలా దమ్ము చేసి ఆ మళ్ళలో కీర్తి పూర్తి అనే వరినారుని (కలమ+ అంకురము) ఊడ్చావు కీర్తి అనే వరినాట్లు వేసావుకదా - అని (అలుకవె) ఏ పంట కోరి ? - అంటే - ఇంద్ర సంపద అనే ఫలాన్ని కోరినవాడవై (ఇంద్రరమా+ ఫల+ అర్థివై) ఈ వ్యవసాయం చేసావు కదా అని సమన్వయం

హిరణ్యకశిపుడు అత్యాశకు పోయి ఇంద్ర పదవికి ఎసరు పెడితే నువ్వు నరసింహావతారం ఎత్తి అతణ్ణి మట్టు బెట్టి ఇంద్రరమను కాపాడావు సుమా

అడవుల్ని కొట్టి నాగళ్ళతో దున్ని సాగులోకి తేవడం అనే వ్యావసా యిక విషయాన్ని రూపకాలంకార సహాయంతో నరసింహావతార కథకి జోడించి చెప్పాడు ఇందులో రాయలకాలంలో వ్యవసాయం బాగా విస్తరించిందని చరిత్ర చెబుతోంది సమాజంలో వస్తున్న మార్పులూ సమకాలంలో జరుగుతున్న అభివృద్ధులూ, చారిత్రిక సంఘటనలూ కవి మనస్సుమీద ముద్ర వేసి ఏదోరూపంగా రచనలో చోటు చేసుకుంటాయనడానికి ఇది మరో నిదర్శనం

''ఘటా'' అంటేనే ఏనుగుల సమూహం అని అర్థం ''ద్విప ఘటా'' అనడం స్పష్టత కోసం మాత్రమే దీన్ని కేవల సమూహార్థకంగా భావించి అశ్వఘటా అనకూడదు. ''ద్విపము'' అనే పదం ''పాదపము' లాంటిది పాదాలు అంటే చెట్టు వేరులు చెట్టు నిలబడటానికి అవ్వే పాదాలు కనక పాదాలతో నీరుత్రాగుతుంది కాబట్టి చెట్టుని పాదపము (పాదైః పిబతి ఇతి - పాదపః) అంఘ్రిపము అంటారు. అలాగే తొండానికి ఉన్న రంధ్రాలు రెండింటితో లేదా తొండమూ నోరూ - రెండింటితో నీరు

త్రాగుతుంది కనక ఏనుగుకి ద్విపము (ద్వాభ్యాం పిబతి ద్విపః) అనే మాట ఏర్పడింది

జలచరం, ఉభయచరం, భూచరం నరసింహం (సగం మనిషి- సగం జంతువు) - అయ్యాయి పరిణామక్రమంలో ఇప్పుడు వామన పురుషుడు అవతరిస్తున్నాడు వామనావతారం కనక వామన పద్యం-

దండిత బలిపై జగములు
నిండ బెరుగుచున్న వేళ నీ యడుగున భూ
మండల మతిసూక్ష్మాకృతి
గొండిక మచ్చయునుబోలె గొమరొందు హరీ! (౨-౮౦)

వామనుడై వచ్చి, ఒకటి రెండు అడుగుల నేల (ఒకటి+రెండు= మూడు) బలిచక్రవర్తిని అడిగి పుచ్చుకుని, ఇంతింతై వటుడింతయ్యై త్రివిక్ర ముడుగా విజృంభించి, ఒక అడుగుతో ఆకాశం ఆవరించి మరొక అడుగు తో భూగోళం ఆవరించి మూడో అడుగు దాత నెత్తిమీద వేసి, అతణ్ణి పాతాళానికి పంపించేసాడు విష్ణుమూర్తి.

రవిబింబం బుపమింప పాత్రమయి - అనేది పోతన అత్యద్భుతమైన పద్యం. సూర్యబింబంతో సాపేక్షంగా త్రివిక్రమరూపం విజృంభణని వర్ణించాడు అలా విజృంభించిన వేళ, ఆ మహాపాదం (తిరువడి) దగ్గర ఈ భూగోళం ఎంత చిన్నది అనిపించిందో, ఎలా నలుసు అయిపోయిందో రామకృష్ణుడు చెబుతున్నాడు.

ఓ హరీ బలిచక్రవర్తిని దండించి లోకాలన్నీ నిండేట్టుగా నువ్వు ఎదుగుతున్న సమయంలో నీ పాదంకింద (నీ అడుగునన్) ఈ భూమండ లం అతిసూక్ష్మాకారంలో ఒక చిన్న పుట్టుమచ్చలాగా (కొండిక మచ్చ యునుబోలె) అందగించింది సుమా (కొమరు = అందం. కొమ రొందు=అందగించు).

కొత్త ఉపమానంవల్ల ఈ బుల్లి పద్యం, పోతనగారి పద్యంతో ''సమ ఉజ్జీగా'' నిలబడింది. ఇందులో దండితబలిపై అనే ఎత్తుగడ గమనించాలి దండింపబడిన బలి కలవాడై అని బహువ్రీహి బలిని దండించి అని తాత్పర్యం. ఛత్రితశేష అన్నాడు మరొక చోట (౨-౭౨)

ఇంక పరశురాముడు వస్తున్నాడు పేరే పరశురాముడు. (పర శువు = గొడ్డలి). ముయ్యేడుమార్లు క్షత్రియలోకాన్ని ఊచకోత కోసిన ఉగ్రమూర్తి.

మాతృ కఠోర కంఠబిలమార్గ గళ ద్రుధిరారుణావనం
బై తళుకొత్తు దోఃపరశు హంసికి మేత యొసంగవే- రిపు
క్ష్మాతలనాథమేచక కచా కుచ హార మృణాళనాళ సం
ఘాతము నూతనైజమదకర్దమ మర్దన సంప్రభూతమున్ (౨-౮౧)

తండ్రి ఆజ్ఞమీద తల్లి శిరస్సు ఖండించాడు పరశురాముడు. అవమానానికి ప్రతీకారంగా రాజలోకాన్ని సంహరించాడు. కట్టకడపట భూమిమీద నిలవడానికి అవకాశం కోల్పోయి మహేంద్రగిరిమీద తప స్సుకి వెళ్ళాడు. తరవాత దశరథరాముణ్ణి పరీక్షించి ఓడిపోయి,మళ్ళీ తపస్సు కొనసాగించుకున్నాడు ఇదీ సంక్షిప్తంగా ఈ

అవతారకథ ఇతడి గండ్ర గొడ్డలిని (పరశువు) హంసిగా సంభావిస్తున్నాడు ఈ పద్యంలో.

రేణుకాదేవి కంఠ-బిల - మార్గంనుంచి (శిరస్సు తెగి పడిపోవడంతో కంఠ రంధ్రం - మార్గంలాగా ఉందని) స్రవిస్తున్న రక్తంతో ఎరుపె క్కిన అగ్రభాగం (ముఖం) కలది భార్గవరాముని పరశువు. గళత్ రుధి రంతో అరుణాననమ్మై తళుకొత్తు తోంది.

ఆననం అంటే అంచు - ముఖం అని రెండు అర్థాలు గొడ్డలి అంచు రక్త సిక్త మయ్యింది అది హంసి ముక్కులాగా ఉంది. రాజహంస లకు ముక్కు ఎరుపు, దేహం తెలుపు అని కవుల వర్ణన

హంసలకు తామర తూడులే ఆహారం ఈ దోఃపరశు హంసికి (దోర్ - దోః= చెయ్యి . చేతిగొడ్డలి అనే హంసి) శత్రు కాంతల ముత్యాల హారాలు అనే తామర తూడులను (మృణాళనాళముల్) మేతగా సమర్పిం చావు కదా అంటున్నాడు పుండరీ కుడు రిపుక్ష్మాతల నాథ మేచక కచా కుచహార మృణాళనాళ సంఘాతముల్ మేత యొసంగవే

క్ష్మాతల నాథుడు అంటే భూతలానికి ప్రభువు - రాజు. రిపుక్ష్మాతల నాథులు అంటే శత్రురాజులు. ''మేచకకచా'' అంటే నల్లనికేశపాశం (కచం) కలిగిన వనిత అని. రిపుక్ష్మాతలనాథ మేచకకచలు అంటే శత్రురాజుల భార్యలు - శత్రుకాంతలు వాళ్ల కుచాలమీద (గుండెలమీద) ఉన్న హారా లు అనే మృణాళ నాళాల సంఘాతం (సమూహం) - దాన్ని నీ దోః పరశు హంసికి మేతగా వేసావు అని అన్వయం.

అయితే తామర తూడులు బురదలో పుడతాయి మరి ఈ మృణాళ నాళ సంఘాతము ఏ బురదలో పుట్టింది ? అంటే - నూతన + ఏణ మద - కర్దమ- మర్దన - సంప్రభూతమున్. కొత్తదైన కస్తూరి అనే బురదను (ఏణమద కర్దమం) మర్దనం చేసుకున్నందువల్ల ఆ చోటులో ఈ సంఘాతం జన్మించిందని (సంప్రభూతము).

జరుగుబాటున్న అంతఃపురకాంతలు కస్తూరిని గుండెలకు దిట్టంగా పట్టించు కుంటారట ఏణము అంటే కస్తూరి జింక దాని మదమే కస్తూరి. అంచేత ఏణమదము అనే మాటకు కస్తూరి అని అర్థం గుండె లకు పులుముకున్న క్రొత్త కస్తూరి అనే కర్దమంలో (బురదలో) హార మృణాళాలు జన్మించాయని భావం

అటువంటి హారమృణాళ నాళాలను దోః పరశు హంసికి మేత ఇచ్చావు . అంటే నీ పరశుహంసి శత్రుకాంతల కంఠసీమల్లో ఉన్న హారమృణాళాలను భక్షించింది అని. నిజంగా అది హంసి కాదు. ఇవి మృణా ళాలూ కావు. మరి మెయ్యడ మేమిటి ? అంటే, శత్రుకాంతల కంఠసీమల్లో ఇప్పడు హారాలు అదృశ్యం అయిపోయాయి. వాళ్ళు హారాలూ, గాజులూ, మట్టెలూ లాంటి పుంస్త్రీఅలంకారాలు ధరించే యోగ్యతను కోల్పో యారు. అలా చేసింది నీ గండ్రగొడ్డలి - అని? పరశువుతో శత్రురాజుల్ని గుంపులుగా సంహరించేసావు స్వామీ అనేది ఫలితార్థం. భంగ్యంతరంగా చెప్పాడు. దీన్ని పర్యాయోక్తి

అలంకారం అంటారు. (పర్యాయోక్తం తు గమ్యస్య వచో భంగ్యంతరా శ్రయమ్).

"మాతృ కఠోర కంఠ బిలమార్గము" అన్నచోట కంఠానికి కఠోర అనే విశేషణం ప్రయోగించాడు. అది స్త్రీ కంఠం. అందునా మాతృకంఠం. కఠోర కంఠం ఎలా అవుతుంది ? కఠోర శబ్దానికి కఠినమైన అని మాత్రమే కాక పూర్ణమైన అని మరో అప్రసిద్ధార్థం ఉంది. (చూ. సంజీవనీ వ్యాఖ్య. శ్రీ వంతరాం). మొత్తం తల ఎగిరిపోవడంతో కంఠబిలమార్గం కఠోరంగా (పరిపూర్ణంగా) తెరుచుకుంది.

రూపక - పర్యాయోక్తి - వృత్త్యను ప్రాసల అలంకార సంసృష్టి ఈ పద్యం.

భార్గవ రామావతారం అయ్యాక దశరథరామావతారం. ఈ కథ సుప్రసిద్ధం.

దారుణ బాణ పాత మద ధారలు గాఱఁగ గ్రాలు దోర్ధను
ర్వారణరాజు గొల్పి దశ వక్త్ర ముఖాంబుజవాటి గూల్చి, బృం
దారక హృత్సరోజములు దానన చేసి వికాస మాసరా
కారత నొందజేసిన ప్రగల్భత నీఱ తగున్ తగున్ హరీ! (2-02)

ఓ హరీ ! రఘు రామా ! దారుణమైన బాణపాతము అనే మద ధారలు స్రవిస్తూ ఉండగా ప్రకాశిస్తున్నాడు (గ్రాలున్) నీ చేతి ధనుస్సు అనే గజరాజు (వారణ రాజు). ఆ గజరాజును ఉసికొల్పి, రావణుడి ముఖాలు (దశవక్త్రుడు కనక పది ముఖాలు అనే పద్మసమూహాన్ని (అంబుజవాటిన్) చిందర వందర చేయించేసావు. కూల్చేసావు. ఏనుగుకి పద్మాలు ఎంతలోకువో నీ ధనుస్సుకి దశకంఠుడి శిరస్సులు అంత లోకువ అయ్యాయని.

రావణుడి ముఖపద్మాలను కూల్చావు. కానీ ఆ పనితోనే (దానన- చేసి) దేవతల (బృందారక) హృదయసరోజాలు- వికాస మాసరాకారత పొందజేసావు. వికాసంతో విస్తరించిన (మాసర) ఆకారం పొందించావు- బృందారక హృత్సరోజాలకు. అంటే దేవతల హృదయాలను సంతోష పెట్టావని.

ఏ పనితోనైతే కొన్ని పద్మాలను నశింపజేసావో ఆ పనితోనే (దానన్+ అ + చేసి) మరికొన్ని పద్మాలను వికసింపజేసావు. ఇదేదో మాయ. గారడీ. ఈ ప్రగల్భత (నేర్పు) ఓ హరీ ! నీకే (నీకు+ అ=నీఱ) తగును, తగును. ముమ్మాటికీ నీ ఒక్కడికిమాత్రమే తగును.

బాణ పాత మద ధారలు, ధనుర్వారణ రాజు, ముఖాంబుజాలు హృత్సరోజాలు - ఇవన్నీ అనుభయ తాద్రూప్య రూపకాలు.

" అ " అనేది తెలుగులో అవధారణార్థకం. నిశ్చయార్థకం. నీకు+ మాత్రమే అని. మరొకదానితో కాదు అని. ఈ అర్థంలో " ఏవ " అనే అవ్యయాన్ని వాడతారు సంస్కృతంలో. రామః ఏవ అంటే ఒక్కరాముడే అని. ఏవ అనేది అవధారణార్థకం. కాబట్టి తెలుగులో అవధారణార్థక ప్రత్యయాలను (అ - ఏ) ఏవార్థకాలు అంటారు.

దశరథ రాముడు అయ్యాక - ద్వాపరంలో బలరామావతారం. ఆదిశేషుడి

అంశ కనక బలరాముడికీ ఆదిశేషుడికీ కలిసివచ్చేట్టు శ్లేషతో వర్ణన సాగించాడు

వికటోత్తంభిత సీర భోగపటలీ విస్ఫూర్తిమన్మూర్తి, కం
చుక నిర్మోక భయానకంబు, వికృతాశుక్ష్వేళ, మగ్నిచ్ఛటా
వికిర క్రూర నిరీక్షణంబు నగు నీ వేషంబు - శేషానుకా
రి కళన్ గ్రాలదె! క్రోలదే సమదవైరి ప్రాణవాతూలముల్! (౭-౬౩)

బలరాముడి భుజంమీద - కర్రుని పడగలా చాపిన వెండి నాగలి
ఉంటుంది నిగనిగలాడే తెల్లని కవచం (కంచుకం) ధరించి ఉంటాడు సింహనాదం
(క్ష్వేళం) చేస్తూంటాడు నిరంతర మద్యపానంతో మత్తెక్కి కన్నులు చింతనిప్పల్లా
ఉంటాయి ఇదీ బలరాముడి స్వరూపం దీన్ని ఆదిశేషుడి రూపంతో పోలుస్తున్నాడు

విశాలంగా (వికటంగా) పైకి ఎత్తబడిన (వికట + ఉత్తంభిత) నాగలి అనే
భోగపటలితో (పడగల వరుసతో) విస్ఫూర్తి కలిగిన మూర్తి కంచుకం అనే కుబుసంతో
(నిర్మోకం) భయానకం వికృతమై వేగం కలిగిన (ఆశు) సింహనాదం కలది
బలరామరూపం వికృతమై వేగం కలిగిన విషం కలది (క్ష్వేళము = సింహనాదం
విషం) ఆదిశేషుడి ఆకా రం అగ్నిచ్ఛటల్ని వెదజల్లే (వికిర) క్రూరమైన నిరీక్షణాలు
(కన్నులు చూపు లు) కలది బలరామరూపం అటువంటిదే ఆదిశేషుని రూపం

ఓ బలరామా ఇలాగే నీ వేషం శేషుణ్ణి అనుకరించే కళతో అల నాడు
ప్రకాశించిందికదా

ఆదిశేషుడు సర్పం కనక వాయుభక్షణం చేస్తాడు మరి బల రామ
రూపమూ అంతేనా? అంటే - సమదవైరి ప్రాణ వాతూలముల్ క్రోలదే - అన్నాడు
మదించిన శత్రువుల ప్రాణాలు అనే వాయువులను (వాతూలముల్) లేదా ప్రాణ
వాయువులను బలరామసర్పం క్రోలుతుంది పీల్చేస్తుంది అని

భోగ పటలంలో, నిర్మోకంలో క్ష్వేళంలో, క్రూర నిరీక్షణంలో వాయు
భక్షణంలో - అన్నింటా సామ్యం సాధించి బలరామరూపం శేషాను కారి కళతో ప్రకాశిం
చింది అన్నాడు కవి

తరవాతది బుద్ధావతారం. బుద్ధుడు అంటే గౌతమ బుద్ధుడు కాదు కపిల
వాస్తు పురాన్ని పాలించే శుద్ధోదనుడికి కుమారుడైన గౌతమ బుద్ధుడు చారిత్రక
పురుషుడు వేద ప్రామాణ్యాన్ని అంగీకరించలేదు పశు హింస ఉంటుందని యజ్ఞయా
గాలు పనికిరావన్నాడంటారు కాబట్టి గౌతమ బుద్ధుడు విష్ణుదేవుని దశావతారాల్లో
చేరడు. పురాణ బుద్ధుడు వేరొకడున్నాడు అతడు విష్ణుమూర్తి అవతారం కీకట
దేశాధిపతి అంజను డు లేదా యజనుడు అనే రాజుకి ఇతడు కుమారుడుగా జన్మిం
చాడు ఇతడు ప్రబోధించిన ధర్మాన్ని సుగతము లేదా సౌగతము అంటారు తరు
వాత కాలంలో చారిత్రక బుద్ధుడు దీనినే ప్రచారంలోకి తెచ్చాడంటారు ఈ పౌరాణిక
బుద్ధావతారాన్నే రామకృష్ణుడు వర్ణిస్తునాడు

ప్రతిదిన కేశ లుంఛనపు రాయిడి నెట్టిన జుట్టు గట్టి పై

బుతపుత మంచునున్న కుబుచోడ తలన్ ధరియింపనోడియున్
సతమగు సొమ్ముగాన విడజాలవుగా శిఖిపింఛవల్లి - సౌ
గతమత ధుర్య! దాని గటి గట్టుము పట్టము- మిన్నకేటికిన్! (౭-౮4)

ఓ సౌగతమతధుర్యా! ప్రతిరోజూ తలనీలాలు తొలగించుకోవడం (కేశ+ లుంఛనము) అనే రాయిడితో (ఉపద్రవంతో) పూర్తిగా బట్ట కట్టి (జుట్టు లేనిదై), పైని పుతపుతమంటున్న (మెత్తని మాంసఖండంలా) ఇ అర్ధముండిత శిరస్సుమీద (కుబుచగా - కొంచెంగా బోడి అయిన తల) శిఖిపింఛవల్లిని ధరించలేకపోయావు. జుట్టే లేకపోయాక నెమలి పింఛాన్ని ఎక్కడ అలంకరించుకుంటావని. ధరించడానికి సంకోచపడినా (ఓడియున్) అది నీకు శాశ్వతమైన సొమ్ము కాబట్టి (సతమయిన భూషణం) విడిచిపెట్టలేకపోతున్నావు గదా! అది నీదగ్గర ఊరికే ఎందుకు ? (మిన్నక+ ఏటికిన్). దాన్ని నీ కటిప్రదేశానికి పట్టం కట్టు. (కటిన్ పట్టము కట్టుము). శిఖిపించం అనేది వల్లి కనక దిసమొలకు సిగ్గు బిళ్ళలా కట్టుకోమని సలహా! రామకృష్ణుని హాస్యప్రీతి ఇక్కడ స్ఫురిస్తుంది.

బుద్ధావతారం అయ్యాక కల్కి అవతారం. సంభళగ్రామంలో విష్ణుయశుడు అనే బ్రాహ్మణుడికి కలియుగాంతంలో కల్కి జన్మిస్తాడని పురాణ గాథ. పుండరీకుడు ద్వాపరయుగంవాడు. ఇతడు రాబోయే కల్కి అవతారాన్ని ముందుగానే ఎలా స్తుతిస్తున్నాడు?. అంటే - అవతార గాధలన్నీ ప్రతికల్పంలోనూ యథాతథంగా మళ్ళీ మళ్ళీ జరుగుతుంటాయని వేదోక్తి. ఆ ప్రకారం ఈ వర్ణన సమంజస మవుతోంది.

కలి హిమవేళ - శోభనపు గమ్మవిరుల్ సకలంబు డుల్చి, భూ
వలయ వనంబు గప్పికొని వర్తిలి, జాడ్యపుటీద పర్వగా,
వలరులకారు లీల భవదాగమనం బటు గల్గ, రోష పా
టలమగు నీ కనుంగడల డాలు - తగున్ జిగురాకు నాకృతిన్ (౭-౮౮)

కలికాలం అనేది ఒక హేమంత ఋతువు. శిశిర హేమంతాలు కలిసే ఉంటాయి. ఆ హిమవేళలో అందమైన సుగంధ పుష్పాలు (కమ్మవిరుల్) సకలమూ రాలిపోయాయి. ఆకులూ, పువ్వులూ డుల్లిపోయి భూవలయం అనే వనాన్ని కప్పివేసి, పూర్తిగా ఆవరించి, మూర్ఖత్వం అనే ఈదురు గాలి (జాడ్యము + ఈద = జాడ్యపు టీద. జడత్వం) వ్యాపించింది. ఆ సమయంలో నీ రాక (అటన్ భవదాగమనంబు) వసంత ఋతువులాగా (అలరుల కారు లీలన్) జరిగితే, కోపంతో ఎరుపెక్కిన నీ కనుగొనల కాంతి (కనుంగడల - డాలు) చిగురాకు ఆకారంలో ప్రకాశిస్తుంది.

కలియుగంలో లోకాన ఆవరించిన జాడ్యాన్ని చూసి కల్కికి కోపం వస్తుందనీ, అలా ఎరుపెక్కిన కన్ను - చిగురాకులాగా ఉంటుందనీ, కల్కి రాక జాడ్యాన్ని (ఈదను) తొలగించి వసంతాగమం అవుతుందనీ, భూ వలయ వనం మళ్ళీ శోభనపు కమ్మవిరులతో చైతన్యవంతంగా ప్రకాశిస్తుందనీ తాత్పర్యం.

ఇలా మరికొంత స్తుతించి చిట్టచివరికి పుండరీకుడు తన కోరిక అడుగు

తాడు స్వామి తథాస్తు అంటాడు క్షేత్రానికీ తీర్థానికీ పుండరీక నామం స్థిరపడు

తుంది

రామకృష్ణుని ఊహాశాలితకూ ఉదారతకూ, ప్రౌఢికీ అద్దం పట్టే ఒక ఘట్టం

ఇది

అవతారికలో తనను గురించి చెప్పకుంటూ రామకృష్ణుడు ఒక చిన్న పద్యం

అన్నాడు

నను రామకృష్ణకవి గవి
జన సహకారావళీ వసంతోత్సవ సూ
క్తి నిధి బిలిపించి యర్ధా
సనమున గూర్చుండ బనిచి చతురత ననియెన్ (1-22)

" కవులున్ బారకులున్ ప్రధానులు అలంకారజ్ఞులున్, ప్రాజ్ఞులున్" కొలువై
ఉండగా నిండుసభలో విరూరి వేదాద్రి మంత్రి రామకృష్ణకవిని సగౌరవంగా
పిలిపించి అర్ధాసనం మీద కూర్చో బెట్టుకున్నాడు ఈ సందర్భంగా " కవిజన సహ
కారావళీ వసంతోత్సవ సూక్తినిధిని నేను ' అని సగర్వంగా చెప్పకున్నాడు రామ
కృష్ణుడు కవిజనులు అనే మామిడి తోపునకు వసంతోత్సవం కల్పించే సూక్తులకు నేను
నిధిని అన్నాడు " సూక్తి నిధి" అనే సమాసం నన్నయ తరవాత మళ్ళీ ఇక్కడ
యథాతథంగా కనిపించింది పాఠక హృదయాలనే కాదు కవి హృదయాలనుకూడా
ఆనందపరచి చిగురింపజేసే సూక్తులకు నిధిని అన్నాడు సూక్తులు అంటే నీతివా
క్యాలు కావు. అలంకార మహితమైన ఉక్తులు (శోభనా చసా ఉక్తిశ్చ) వ్యుత్పత్తిని
కలిగించడంతో పాటు రసస్రోతస్సుకి పారం అందించగలిగిన సుధా నిష్యందినులే
సూక్తులు (తద్ భ్రాతః శృణు రాజశేఖరకవేః సూక్తీః సుధాస్యందినీః) నన్నయ్య దగ్గరా
ఇదే అర్థం పరిపూర్ణ కవితామయోక్తులకు తాను నిధి కనక కవి జనుల్ని పులకింప
జెయ్యగలను అని ధీమాగా ప్రకటించాడు తెనాలి రామ కృష్ణుడు కవులకు కవి-
కవీనాం కవిః

పింగళి సూరన (క్రీ.శ. 1560 ప్రాంతం)

రాఘవ పాండవీయము (ప్రథమ 1 నుండి 14)

అభివ్యక్తి మార్గాలు రాను రాను రహదారులు అయిపోవడంతో ప్రతిభావంతులైన కవులు తమ ప్రత్యేకతను నిలుపుకోవడానికీ, సాహిత్యంలో తమకు ఒక స్థానం సంపాదించుకోవడానికీ,కొత్త పుంతలు తొక్కుతూ ఉంటారు దీన్నే ప్రయోగ శీలం అంటారు ఆ కొత్త దారికి అతడు ఆద్యుడుగా కీర్తింపబడుతూ ఉంటాడు అయితే ఈ ప్రయోగాలు ఆశ్చర్యజనకంగా ఉంటే ఉండవచ్చు, ప్రజల దృష్టిని విచిత్రంగా ఆకర్షించవచ్చు, మరి కొంత మంది ఆ దారుల్లో ప్రయాణించవచ్చు - కానీ కొత్త దారులు అన్నీ ఘంటా పథాలు కానేరవు. అందుకని ప్రయోగాత్మకంగా నూతన ప్రక్రియలను సృష్టించినవారుకూడా ఆ సృష్టితో విఖ్యాతిని ఆర్జించి, మళ్ళీ రసప్రధాన కావ్య నిర్మాణ రూపమైన ఘంటాపథానికి వస్తూ ఉంటారు కావ్య ప్రపంచంలో నాటికీ నేటికీ రసవత్కావ్య నిర్మాణ మొక్కటే రాజమార్గం

రాయలకాలంలో కవులకి ఈ ప్రయోగశీలం మరింత ఎక్కువగా అవసరమయ్యింది. కావ్యనిర్మాణంలో ఏ మార్గాన ప్రయాణిద్దామన్నా తమ కంటిముందు ఒక హిమాలయం కనపడుతూనే ఉంది కవిత్రయం నన్నె చోడుడు, నాచన సోమనాదుడు, శ్రీనాథుడు,పోతన, పెద్దన, తిమ్మన ఇలా హేమా హేమీలు ఉన్నారు ఆ మార్గాల్లోనే వీరూ ప్రయాణిస్తే పరిపూర్ణ వ్యక్తిత్వంతో రాణించడం పథనిర్దేశకులుగా పరిగణన పొందడం కష్టసాధ్య మేమిటి అసంభవం అందుకని కొత్త ప్రక్రియలకోసం వెదుకులాట ప్రారంభమయ్యింది

అదీ కాక తెలుగు సాహిత్య పరిణామానికి ఆదినుంచీ అంతస్స్రూత్రంగా పని చేస్తున్న అలంకారశాస్త్రపురోగతిలో ఒక వైపున వినూతన ప్రస్థానాలు ఆవిర్భవిస్తున్నాయి. వాటిని అందిపుచ్చుకునే ప్రయత్నం వీరికి అవసరమయ్యింది

సాహిత్యపరంగా ఇదిగో ఈ చారిత్రిక దశలో కలంపట్టి నిలబడ్డ వాడు పింగళిసూరన. తన గొంతు వెదుక్కుంటూ - అప్పటి.వరకూ ఎవరూ చెయ్యివేయని సంస్కృత గరుడ పురాణాన్ని ముందుగా ఆంధ్రీకరించాడు మైలరోజుల్లో తప్ప మరెప్పుడూ ఎవ్వరూ ముట్టని గారుడాన్ని హరిఃఓం అంటూ తెలుగు చేసే సాహసం బలమైన ప్రయోగ శీలానికి ప్రతీక.

రెండవ ప్రయత్నంగా రాఘవపాండవీయం- రెండర్థాల కావ్యం రచించాడు కావ్యంలో ఎక్కడో ఒక పద్యంలో రెండు అర్థాలు వచ్చేట్టుగా శ్లేష నిర్మించడం కాదు-మొత్తం కావ్యమంతా రెండు అర్థాలు వచ్చేట్టు నిర్మించడం ఇది అమోఘమైన ప్రతిభా పాండిత్యాలకు గీటురాయి

రెండర్థంబుల పద్యమొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండు౦, దద్గతి కావ్యమెల్ల వగునే నోహో యనం జేయదే

పాండిత్యంబున ? నందునమం దెనుగు గబ్బం బద్భుతం బంద్రు,ద
క్షుండెవ్వాడిల రామ భారత కథల్ జోడింప భాషాకృతిన్ (రాఘవ 1-10)

ఇటువంటి ద్వ్యర్థికావ్యాన్ని వెనకటికి ఎప్పుడో వేములవాడ భీమన్న రచించాడని పెద్దలు చెప్పడమే తప్ప ఆ కావ్యం కాలగర్భంలో కలిసి పోయింది. పింగళి సూరన వరకూ తెలుగులో ద్వ్యర్థికావ్యం లేదు. అది రచించి ఆ ప్రక్రియకు ఆద్యుడుగా తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు.

భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాటయె కాని యందు పొం
దేమియు నేయెడ న్నిలుచు టెవ్వరు గాన రటుండ నిమ్ము (రాఘవ. 1-11)

అని పింగళి సూరన్నను తన ప్రభువు ఆకువీడు పురాధినాథుడు పెద వేంకటాద్రి ప్రోత్సహించాడు.

పురాణేతిహాసాలతో గానీ, కథా సరిత్సాగరం వంటి సంస్కృత కథా కావ్యాలతో గానీ, చరిత్రతో గానీ ఏ సంబంధమూ లేకుండా అద్యంతమూ కల్పితకథతో, అపూర్వకథన శిల్పంతో, అప్పటికి స్థిరపడిన కావ్యసంప్రదా యాలను కొన్నింటిని త్రోసి రాజని కళాపూర్ణోదయ కావ్యాన్ని నిర్మించాడు. ఈనాటికీ ఆ ప్రక్రియకు అతడే మొదలు, అతడే చివర. ఈ కావ్యాలను ఇదే వరుసలో రాసినట్టు సూరన తన చిట్టచివరి కావ్యం ప్రభావతీ ప్రద్యు మ్నం అవతారికలో చెప్పుకున్నాడు.

జనముల్ మెచ్చగ మున్ రచించితి నుదంచ త్ప్రౌఢి గారుడం
బును శ్రీ రాఘవ పాండవీయము గళాపూర్ణోదయంబున్ మఱిన్
దెనుగుం గబ్బము లెన్నియేనియును, మత్పిత్రాది వంశాభివ
ర్ణన లేమిం బరితృప్తి నాకవి యొనర్పం జాల వత్యంతమున్

నా పేరు నిలబెట్టేందుకూ నన్ను ఆద్యుడుగా నిలబెట్టేందుకూ వీలుగా మూడు కావ్యాలు రచించాను గానీ అవి నాకు అత్యంతపరితృప్తిని కల్గించడం లేదు– అన్నాడు. ఏమి, ఎందుకని కల్గించడం లేదు - అంటే ఆ మూడింటిలోనూ ఎక్కడా నా వంశ చరిత్ర చెప్పకోలేదు, అదీ నా అసం తృప్తి అన్నాడు.

రాఘవ పాండవీయాన్ని ఆరవీటి పెదవేంకటాద్రి శ్రోతగా, ప్రోత్సాహకుడుగా, విరూపాక్ష స్వామికి అంకితంగా రచించాడు. (షష్ఠ్యంతాలు విరూపాక్షుడివే). అందులో వేంకటాద్రివంశాన్ని వర్ణించాడే గానీ సూరన తన వంశాభివర్ణన చేసుకో లేదు. కళాపూర్ణోదయంలోనూ అంతే. కృతిపతి నంద్యాల నరసింహ శ్రీ కృష్ణుడి వంశా భివర్ణన ఉంది. గారుడంలో పరిస్థితి ఏమిటో తెలీదు అది ఇప్పటి దాకా దొరకలేదు. కాలగర్భంలో కలిసిపోయింది.

ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని తన తండ్రికే అంకితం చేసి స్వీయ వంశాన్ని వర్ణించుకుని సంతృప్తి చెందాడు., ఇందుకోసమే ప్రభావతి రాస్తున్నాను అన్నాడు.

బహుశ ఇదొక్కటే కాదేమో అసంతృప్తి. ఆశ్చర్యజనకంగా ప్రయో గాలు చేసాను, ఆనంద జనకంగా రసప్రధానంగా మహాకావ్యనిర్మాణం చేసి రాజమార్గం

లో కూడా ప్రయాణించి ఉనికిని నిక్షేపించుకున్నాను- అనే సంతృప్తికోసం కూడా ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని రచించి ఉండవచ్చు. ఏమైనా ప్రయోగశీలం కన్నా ప్రధానమయ్యింది రసవత్కావ్య నిర్మాణం, అనే అభిప్రాయానికి సూరన వచ్చినప్పటి రచనగా దీన్ని భావించవచ్చు. వయసు మళ్ళి కలం మూసి కూచున్నాక నీ మొత్తం రచనల్లో ఏది ఉత్తమ మో చెప్పమంటే సూరన కచ్చితంగా ప్రభావతీ ప్రద్యుమ్నాన్నే చెబుతాడు అలనాటినుంచీ పాఠకుల నిర్ణయమూ అదే

అయితే ఒక ప్రయోగంగా రాఘవ పాండవీయాన్ని పరిచయం చెయ్యడం రెండర్థాలనూ సాధించడానికి సూరన అనుసరించిన పద్ధతుల్ని వివరించడమూ సముచితమనుకుంటాను.

రెండర్థాల కావ్యాలనే కాదు మూడర్థాల కావ్యాలనూ, నాలుగర్థాల కావ్యాలనూ, శతకాలనూ రచించినవారున్నారు శ్రీ రాఘవ యాదవ పాండవీయం రామాయణ భాగవత భారత కథల మేళవింపుతో ఏర్పడిన త్ర్యర్థికావ్యం పోకూరి కాశీపత్యవధానులుగారి సారంగధరీయము మరొకటి ఎలకూచి బాలసరస్వతి దశావతారాలను వర్ణిస్తూ పది పద్యాలు రచించాడు వాటిలో ప్రతిపద్యంలోనూ ఒక్కొక్క అవతారం ప్రధానంగా తక్కిన తొమ్మిది అవతారాలూ అప్రధానంగా వాచ్యం అవుతూ ఉంటా యంటారు అంటే ఒక్కొక్క పద్యానికీ పదేసి అర్థాలన్నమాట కేవలం పది పద్యాలు శతకం పెట్టు ఇది అనడమే కానీ అ పద్యాలేవో పదేసి అర్థాలేమో నిరూపించినవారు లేరు.

సంస్కృతంలో ఒక్కొక్క పదానికి అనేకార్థాలు ఉంటాయి ఏదో ఒక్క అర్థమే ప్రసిద్ధిలోకి వస్తుంది అదీ కాక ఒక్కొక్క అక్షరమే పదంగా అనేకార్థాలను బోధించే శక్తి సంస్కృతానికి ఉంది ఏకాక్షర నిఘంటువు లు ఉన్నాయి వీటి సాయంతో ఏ పద్యానికైనా అనేకార్థాలు చెప్పవచ్చు నేమో అనిపిస్తుంది ఇది సాధ్యమని కాదు అంతటి వెసులుబాటు ఉంది సుమా అనడానికే అయితే నిఘంటువుల వినియోగం అంతగా లేకుండా పదసంయోజనతో అనేకార్థాలను సాధించడమే శ్లేషకావ్యాలలో ప్రముఖం గా కనపడుతుంది

రెండర్థాలు గానీ మూడర్థాలు గానీ- ఈ శాఖను శ్లేషకావ్యశాఖ లేదా అనేకార్థక కావ్యశాఖ అంటుంటారు శ్లేష అనేది రెండర్థాలకు పరిమి తం అయ్యింది కనక దీన్ని అనేకార్థక కావ్యశాఖ అని వ్యవహరించడమే సమంజసం

కవి ప్రయోగించిన పదాల సామర్థ్యంతో ఒకటికి మించిన అర్థాలు అన్నీ స్పష్టంగా వాచ్యం అవ్వాలి అప్పడే అది శ్లేష అవుతుంది వ్యంగ్యాలు గా అనేకార్థాలు స్ఫురిస్తే అది శ్లేష అవ్వదు (శబ్ద శక్తి మూలక) వ్యంగ్య ప్రభేదం అవుతుంది

మొగమోటం లేకుండా చెప్పాలంటే అనేకార్థక కావ్యాలలో రసానందాదులు ఉండవు. కవి దృష్టి ఎంత సేపూ అనేకార్థాలను సాధించడం మీదనే ఉంటుంది రచనా శిల్పం పాత్ర పోషణ, భావ సౌంద ర్యం అలంకారం - ఇలాంటి వాటి మీద ఉండదు

చేతవోలు

అంచేత ఇవి పాఠకులకు ఆహా పుట్టిస్తాయే తప్ప ఆనందం కలిగించవు

కథాకథన శిల్పంకూడా ఏమంత చెప్పుకోదగినట్లు ఉండదు అయితే విభిన్న
కథలను కలిపేటప్పుడు సమానాంశాలు ఏర్పడేటట్టుగా జాగ్రత్త పడి జోడించడంలో
ఒక ప్రత్యేకత కనపడుతుంది ఇలా ఏర్పడిన సమానాంశాల దగ్గర శ్లేష అవసరం
ఉండదు కనక అక్కడ రచనా సౌంద ర్యాదులు పురివిప్పుకుంటాయి కవి ఆ కాసేపూ
పులి అవుతాడు అయితే ఇటు వంటి సమాన ఘట్టాలు తక్కువ ఉంటాయి వనవాసం
వేట వివా హం, సూర్యోదయ చంద్రోదయాలు- ఇలాంటివేవో కొన్ని కలుస్తాయి
మిగతా కావ్యమంతా కవికి కత్తుల బోనే పాఠకుడికి కక్కుల కళ్ళెమే

ఇరవై నాలుగువేల శ్లోకాలున్న రామాయణాన్నీ లక్షాపాతిక వేల శ్లోకాలున్న
మహాభారతాన్నీ కేవలం ఆరువందల గద్య పద్యాల్లోకి నాలుగు ఆశ్వాసాలుగా
కుదించాడు సూరన్న దీన్నిబట్టి మనం ఊహించుకోవచ్చు కథలు ప్రసిద్ధాలు కనక
కావ్యం అర్థమవుతోంది కానీ- అదీ వ్యాఖ్యానంతో- లేకపోతే కష్టమేనని

ఈ రాఘవ పాండవీయాన్ని వినడానికీ (శ్రవ్యకావ్యం కనక) చదవడానికీ
ఒక పద్ధతి సూచించాడు ముందుగానే

ఒక కథ వినియెడి తఱి, వే
ఱొక కథ పై దృష్టి యిడిన నొక యర్థము దో
పకపోవు గాన, నేకా
ర్థ కావ్య మెట్లట్లు వినగ దగు నొక టొకటిన్.

ఏకార్థక కావ్యాన్ని ఎలా వింటారో అట్లాగే వినండి రామాయణ పరంగా
చూస్తున్నప్పుడు కడవరకూ అలాగే సాగండి మళ్ళీ మొదటికి వచ్చి ఈసారి భారత
పరంగా చూడండి అంతేకానీ ఒకే పద్యం దగ్గర ఒకేసారి రెండూ చూస్తే ఏ ఒక్కటీ
అర్థం కాదు ఒక యర్థమున్ తోపకపోవు- అని హెచ్చరించాడు ఒకే పద్యానికి పరిమి
తంగా చూసినా ఇదే రకం పర్యాయదృష్టి ఉండాలి రాఘవ పాండవీయం కనక
ముందు రామాయణ పరంగా అర్థం స్వీకరించి, అటుపైని భారత పరంగా స్వీక
రించాలి లేకపోతే అంతా గందరగోళంగా గవడగొయ్యిగా ఉంటుందిట

అనేకార్థాలను సాధించడానికి తాను అనుసరించిన ప్రధాన మార్గాలు
కూడా సూచించాడు

ఆంధ్ర భాషా సంస్కృతాభిభాషాశ్లేష
యొక్కొక చోట, నొక్కొక్క చోట
నుదిత శబ్ద శ్లేష, యొక్కొక్క చోట న
ర్థ శ్లేష, యొక్కొక తఱిని ముఖ్య
గౌణవృత్తి శ్లేష ఘటన, యొక్కొక తఱి
నర్థాన్వయము వేఱె యగుచునునికి,
శబ్దాన్వయ విభేద సంగతి నొక్కొక్క

తలి, నివి యెుక్కొక్క తలిని రెండు
మూడు గూడుటయు, మటి సముజ్జ్వలముగ
నాకుదోచిన గతి పెక్కు పోక లమర
రామభారత కథలు పర్యాయదృష్టి
జూచు సుమతుల కేర్పడ నాచరింతు 7

ప్రత్యేకమైన ఓపికతో అభిరుచితో చదవగలిగిన (వినగలిగిన) సుమతులకే ఈ శ్లేషకావ్యాలు

ఒక అర్థంలో సంస్కృత పదం మరొక అర్థంలో అదే అచ్చతెలుగు పదంగా సమన్వయింపబడుతుంది దీన్ని సంస్కృతాంధ్రశ్లేష అన్నాడు కొన్నిచోట్ల కేవల శబ్ద శ్లేష శబ్దాలను విరవడంలో తేడావల్ల రెండర్థాలూ సిద్ధిస్తాయి దీన్నే సభంగశ్లేష అంటారు ఒప్పెసగు+రూఢాపూర్వ, ఒప్పె+ సగురూఢాపూర్వ, ఇది శబ్దశ్లేష మరికొన్ని చోట్ల అర్థశ్లేష ఒకే పదానికి ఉన్న అనేకార్థాలను సద్వినియోగం చేసుకోవడం కరము అన్నామంటే చెయ్యి, కిరణం, కప్పం (పన్ను) అని మూడర్థాలు వస్తాయి మూడు కథలుండి ఈ మూడర్థాలూ సరిపోతే అది అర్థశ్లేష

పదాలకు మూడు అర్థవృత్తులున్నాయి. అభిధ-లక్షణ-వ్యంజన అభిధనే ముఖ్యవృత్తి అనీ లక్షణనే గౌణవృత్తి అనీ అంటారు ఒక అర్థానికి అభిధావృత్తిని ఆశ్రయిస్తే మరొక అర్థానికి లక్షణావృత్తిని ఆశ్రయించవలసి ఉంటుందని దీన్ని ముఖ్య గౌణవృత్తి శ్లేష అన్నాడు

అర్థాన్వయాన్ని మార్చడంవల్ల సిద్ధించేది అర్థాన్వయ విభేద శ్లేష ఒక అర్థంలో కాకుస్వరంగా మరొక అర్థంలో ప్రశ్నార్థకంగా సమన్వయించి అనుకూల వ్యతిరేకార్థాలను సాధించడం

పదాలలో పరస్పరం అన్వయక్రమాన్ని మార్చడం ద్వారా శ్లేష సిద్ధిస్తే అది శబ్దాన్వయ విభేద శ్లేష

వీటిలో రెండేసి మూడేసీ కలపడంవల్ల మొత్తం పద్యానికి రెండ ర్థాలూ సిద్ధించే పరిస్థితి మరికొన్ని చోట్ల

ఇంకా-తన బుద్ధికి తోచిన పెక్కు పోకడలతో సూరన రామభారత కథల్ని పర్యాయదృష్టితో చూచే (ఒకదాని తరవాత ఒకటి) సుమతులకు ఏర్పరించాడు

రామాయణ పరంగా అయోధ్యా పట్టణాన్నీ, భారతపరంగా హస్తినాపురాన్నీ పరిచయం చేస్తున్నాడు

వెలయు నఖిల భువనములలోన వారణ
నగరి పురమతల్లి నా దనర్చి
రాజ్యలక్ష్మి మిగుల బ్రబల నయోధ్య నా
రాజవినుతి గనిన రాజధాని. (1)

సృష్టిలో ఉన్న అఖిల భువనాలలోనూ వారింపరాని (అవారణన్) సంపద

కలది ఇంద్రుడి రాజధాని-అమరావతి. ఇంద్రుడు వజ్రాయుధం తో పర్వతాల రెక్కలు తెగగొట్టి, అవి ఎగిరి పట్టణాలమీద పడకుండా చేసాడు ట. అందుకని 'నగరిపుడు' (పర్వతాలకు శత్రువు) అయ్యాడు. ఆ నగరిపుని రమ (సంపద) అవారణమైనది. నగరిపు రమకు తల్లి అన్నట్టుగా (నాన్) తనర్చి అయోధ్య అనే రాజధాని, రాజులతో వినుతింప బడుతూ వెలయున్ ఒప్పతోంది. దీనికి కారణం ఏమిటంటే రాజ్యలక్ష్మి మిగులన్ ప్రబలుట. తన రాజ్య సంపత్తి అతిశయంగా ప్రబలడంవల్ల అమరావతికి తల్లి అన్నట్టుగా అయోధ్య అనే పేరుతో (అయోధ్య నాన్) ఒక రాజధాని వెలయున్- అని అన్వయం.

భారతపరంగా హస్తి పట్టణం. హస్తి = ఏనుగు. ఏనుగుకి పర్యాయ పదాలు అన్నీ ఇక్కడ వాడుకోవచ్చు. గజపట్టణం, కరినగరం, సామజపురం ఇలా. వారణము అన్నా ఏనుగే కాబట్టి 'వారణనగరం'' వెలయున్ అన్నాడు. అఖిలభువనాల్లోనూ అది పుర మతల్లి నాన్ వెలయు. మతల్లి, మచర్చికా అనే సంస్కృతం మాటలకు శ్రేష్ఠమైనది అని అర్థం. పుర+ మతల్లి అంటే పురవరం అని. అఖిలలోకాలలోనూ ఇది పురశ్రేష్ఠం అన్నట్టుగా (నాన్) తనర్చి వారణనగరి వెలయున్. దీనికికూడా రాజ్యలక్ష్మి మిగులన్ ప్రబలుట అనేదే కారణం. శత్రురాజుల దృష్టిలోనూ, సామంతరాజుల దృష్టిలోనూ ఇది అయోధ్య. యుద్ధం చేసి జయింప దగినది-యోధ్య. అలా జయించడానికి వీలుకానిది అయోధ్య. శత్రు దుర్భేద్య ము అని (నాన్) రాజులతో వినుతి పొందిన(కనిన) రాజ ధాని వారణనగరి వెలయున్ అని పూర్తి అన్వయం.

''అయోధ్య'' అనే పదం దగ్గర అర్థశ్లేష. రామాయణార్థంలో సంజ్ఞ. భారతార్థంలో వారణనగరికి విశేషణం. కాబట్టి ఇది అర్థశ్లేష. అఖిలభువనములలోన్+ అవారణ+ నగరిపు+ రమ+ తల్లి అని రామాయ ణార్థములో పదవిభాగం. అఖిలభువన ములలోన + వారణనగరి+ పుర - మతల్లి అని భారతార్థంలో పదవిభాగం. ఇది శ బ్దశ్లేష. అయితే తల్లి అనే పదంగా రామాయణార్థంలో అచ్చికం. మతల్లి అనే ప్రత్య యంగా భారతా ర్థంలో సంస్కృతం. కాబట్టి మొత్తానికి ఇది, సంస్కృతాంధ్ర శబ్ద సభంగ శ్లేష. మిగతా పదాలన్నీ రెండింటా సమానం.

ఆ పట్టణ మేలెడి పృథి
వీపాలుడు భ్రుకుటిమాత్ర విముఖిత సమదా (౨)
టోపారి పఙ్క్తిరథుడు
దీపించు నుదారనీతి ధృతరాష్ట్రుడనన్

ఆ అయోధ్యా పట్టణాన్ని ఏలుతున్న పృథివీపాలుడు (రాజు) పంక్తి రథుడు. పంక్తి అంటే పది. 'దశ' శబ్దానికి పర్యాయపదం. అంచేత ''దశ రథుడు'' అనే సంజ్ఞలో దశ శబ్దానికి మారుగా పంక్తి శబ్దాన్ని నిలిపాడు. హస్తి నగరాన్ని వారణ నగరం అన్నట్టు.

అయోధ్యను ఏలేరాజు దశరథుడు అని. అతడు ప్రకాశిస్తున్నాడు.

(ఉద్దీపించున్) ఉదారమైన నీతితో పోషింపబడుతున్న రాష్ట్రం (దేశం) కలవాడు అని ప్రజలందరూ అనేట్టు (అనన్) మెచ్చుకునేట్టు ఉద్దీపిస్తు న్నాడు ధృతమైన రాష్ట్రం కలవాడు ధృతరాష్ట్రుడు "ధృతము అంటే ధరింప బడిన లేదా పోషింపబడిన అభివృద్ధి పరచబడిన అని రెండర్థాలు (ధృ ఞ్ ధారణ పోషణయోః). తన రాష్ట్రాన్ని ఉదారనీతితో అభివృద్ధి పరుస్తూ పంక్తిరధుడు ఉద్దీపించున్ మరొక విశేషణం "భ్రుకుటి మాత్ర విముఖిత సమదాటోపారి" అనేది అరిఅంటే శత్రువు ఆటోపం అంటే అతిశయం. మదంతో కూడిన(సమద) అతిశయం కల అరి- సమదాటోపారి అటు వంటి శత్రువుల్ని ఈ దశరధుడు తన భ్రుకుటి మాత్రం చేతనే (కోపించి బొమముడి వేసి చూచి) విముఖితుల్ని చేస్తున్నాడు పరాఙ్ముఖుల్నీ, పరాభూతుల్నీ చేస్తున్నాడు భ్రుకుటిమాత్రంచేత విముఖితులు కావింప బడిన సమదాటోపారులు కలవాడు అనే ఈ బహువ్రీహి- పంక్తిరధుడికి విశేషణం ఉదారనీతితో ధృతరాష్ట్రుడూ భ్రుకుటి మాత్ర విముఖిత సమ దాటోపారి అయిన పంక్తిరధుడు ఆ పట్టణమేలెడి పృథివీపాలుడై ఉద్దీ పించున్- అని పూర్తి అన్వయం.

ఇక భారతపరంగా ధృతరాష్ట్ర వర్ణన ఈ అర్థంలో ఈ పదం సంజ్ఞా వాచకం విశేష్యం మిగతావి దానికి విశేషణాలు ఆ పట్టణం హస్తి పురం

ధృతరాష్ట్రుడు అనే పేరుతో (అనన్) ఆ పట్టణమేలెడి పృథివీ పాలుడు ఉదారనీతిన్ (తో) ఉద్దీపించునని అన్వయం "భ్రుకుటి మాత్ర విముఖిత సమదా టోపారి పంక్తిరధుడు" అంతా కలిసి ఒకే బహువ్రీహి సమాసంగా ధృతరాష్ట్రుడికి విశేషణం పంక్తి శబ్దానికి వరస-సమూహం అనికూడా అర్థాలు అక్షర పంక్తి అంటే అక్షరాల వరస. వృక్ష పంక్తి అంటే చెట్లగుంపు సమదాటోప+ అరి పంక్తి అంటే శత్రు సమూహం ఆ అరి పంక్తుల రథాలను భ్రుకుటి మాత్ర విముఖితం చేస్తున్నాడు వెనుదిరిగి పారిపోయేట్టు చేస్తున్నాడు భ్రుకుటి మాత్ర విముఖితమైన సమదా టోపారి పంక్తి యొక్క రధాలు కలవాడు- ధృతరాష్ట్రుడు ఈయన కోపించి బొమ ముడి వేస్తే చాలు శత్రుసమూహం- దండయాత్ర విరమించి, రధాలు మరల్చుకుని వెళ్ళిపోతుంది అని

రామాయణార్థంలో పంక్తిరధుణ్ణి, భారతార్థంలో అరిపంక్తి+ రథుడు అని విభజించి అన్వయించడంవల్ల ఈ శ్లేష కుదిరింది కాబట్టి ఇది శబ్దాన్వయ విభేద శ్లేష ధృతరాష్ట్రుడు అన్నది అర్థశ్లేష

తెలివి నతిప్రగల్భు డసదృగ్బలు డాతడు, భీష్మ చాప తౌ
శలమొ సహాయమై యమర శత్రుల నే పడపన్ వలంతియై,
నిలుకడ నేలె విశ్వధరణిం, దన మిత్రకులంబు వైభవో
జ్జ్వలత దలిర్ప, పౌరవ సుసంతతి రాజుల కెల్ల హెచ్చుగన్. (3)

దశరధుడు తన సమస్త రాజ్యాన్నీ (విశ్వధరణిన్) ఎలా పరిపాలించాడో ఈ పద్యంలో చెబుతున్నాడు

తెలివిలో అతి ప్రగల్భుడు మిక్కిలి ప్రౌఢుడు అని సాటిలేని బలం కలవాడు
(అసదృక్+ బలుడు) ఆ దశరధుడు (ఇంక ఇక్కడినుంచి ఎక్కువగా అతడు వాడు,
ఆ రాజు అంటూ సర్వనామాలతోనే ఉభయులకీ కలసి వచ్చేట్టు కధ నడిపించేస్తాడు)
భయంకరమైన (భీష్మ) చాపకౌశలమే తనకు సహాయంగా పరిపాలన సాగించాడు
ఇతడు ఎంతటి సమర్థుడంటే అమరశత్రులన్ ఏపు అడపన్ వలంతి దేవతా శత్రువులైన
రాక్షసుల విఘ్నం భణాన్ని (ఏపున్) అణపగల సమర్థుడు (వలంతి) దశరధుడు
కైకేయితో సహా వెళ్ళి ఇంద్రుడికి రాక్షసయుద్ధాల్లో సహాయం చేసాడనీ ఆ సందర్భం
గానే కైకేయికి వరాలు ఇచ్చాడనీ వాల్మీకి చెప్పాడు అది ఇక్కడ స్ఫూర్తి

మిత్రుడు అంటే స్నేహితుడనీ సూర్యుడనీ రెండర్థాలు స్నేహితుడు అనే
అర్థంలో తాకింద తావత్తు (మిత్త్రుడు) ఉంటుంది సూర్యుడనే అర్థంలో ఉండదు
అయితే శ్లేషల్లో ఇటువంటి పట్టింపులు గానీ శసలభేదం గానీ అరసున్న ఉండటం
లేకపోవడంగానీ పరిగణనలోకి రావు. అలాగే అవసరమైతే లరలకీ, లడలకీకూడా
భేదం ఉండదు (స్పేసింగ్సూ అంతే)

ఇప్పుడు మిత్రకులము అంటే -సూర్యవంశం తన సూర్య వంశం వైభవోజ్జ్వ
లతలతో తలిర్పగా, పౌరుల దగ్గర ఉండే వసుసంతతి(బంగారు రాసులు) రాజులకన్నా
హెచ్చుగా ఉండేట్టు దశరధుడు విశ్వధరణిని నిలకడగా (స్థిరంగా) పరిపాలించాడు
(ఏలెన్) అని అన్వయం

భారతార్థంలో అతడు అంటే ధృతరాష్ట్రుడు తెలివిలో అతిప్రగల్భుడు అ+స+
దృక్+ బలుడు దృష్టిబలం సరిగ్గా లేనివాడు గ్రుడ్డివాడు అని దృక్కుల బలం-
దృగ్బలం దృగ్బలంతో సహితుడు సదృగ్బలుడు సదృగ్బలుడు కానివాడు -అసదృగ్బ
లుడు- అంధుడు చర్మచక్షువులు లేకపోయినా జ్ఞానచక్షువు(తెలివి) ఉంది అని
భీష్ముడి చాపకౌశలమే అతడికి సహాయంగా అమిరింది(అమరన్) దానితో శత్రువుల
ఏపు అణపడానికి వలంతి అయ్యాడు తన స్నేహితుల సమూహం(మిత్త్రకులము)
వైభవోజ్జ్వలతలతో తలిర్పగా విశ్వధరణిన్ నిలుకడన్ ఏలెన్ తన స్నేహితులూ, తన
బంధువులూ అభివృద్ధి చెందేట్టు పరిపాలించాడని

ఇతడు పురువంశంలో పుట్టినరాజు పౌరవ వంశంలో సుసంతతి గా
(సత్సంతానంగా) జన్మించిన ఇదివరకటి రాజులందరికన్నా (రాజుల కెల్లన్) హెచ్చుగా-
వారికంటే మిన్నగా సమస్తరాజ్యాన్నీ పరిపాలించాడని అన్వయం (పౌరవ+సుసంత
తిరాజుల కెల్లన్+హెచ్చుగన్)

భీష్మ చాపకౌశలం అన్నపుడు అర్థశ్లేష అమరశత్రులన్ అనే రామాయణార్థం
మాట- సహాయమైఅమరన్+శత్రులన్ అని భారతార్థంలో విరిగింది రామాయణా
ర్థంలో సంస్కృతమైతే భారతార్థంలో తెలుగు అదీ అన్వయ విభేదంతో కాబట్టి ఇది
సంస్కృతాంధ్ర శబ్దాన్వయ విభేద శ్లేష రెండు శ్లేష పద్ధతుల కలయిక
“మిత్రకులంబు ’ అర్థశ్లేష పౌర+వసు సంతతి అని రామాయణపరంగా పౌరవ+

సుసంతతి అని భారతపరంగా. రెండింటా సంస్కృత పదమే కాబట్టి ఇది సభంగ శబ్ద శ్లేష

సుబలత నయ గుణ మహిమన్
ప్రబలి తనకు దార ధర్మ పాలన లీలన్
సొబగొంది వన్నె దేగా
విబుధస్తుతు డవ్విభుండు వెలసెన్ ధరణిన్ (4)

ఆ దశరథ విభుడు ఈ భూలోకంలో (ధరణిన్) ప్రకాశించాడు. ఎలాగ?

నీతి అనే సద్గుణమహిమతో (నయ+గుణ+మహిమన్) ప్రబలి సుబలత అనేది (మంచి బలం-సైన్యం కలిగి ఉండటం) ఉదారమైన ధర్మ బద్ధమైన పరిపాలన విధానంతో సొబగు ఒంది (అందగించి) తనకు వన్నె తేగా, అటు దేవతలతో ఇటు పండితులతో స్తుతింపబడుతున్నవాడై (విబుధ స్తుతుడు) అవ్విభుడు ధరణిన్ వెలసెన్.

దర్మం అనే పదానికి విల్లు అని మరొక అర్థం ఉంది ధార్మికుడు అంటే విలుకాడు అనికూడా. ధర్మపాలన అంటే ధనుర్ధారణ. అది సుబలంగా చేస్తున్నాడు. నయంతో(నీతితో) చేస్తున్నాడు గుణమహిమతో (అల్లెత్రాటి మహిమ గుణము = త్రాడు) చేస్తున్నాడు. ప్రజల్లో నీతినీ, ధర్మాన్నీ కాపా డటంకోసమే ధనుర్ధారణ చేస్తున్నాడని శ్లేషలో మరొక శ్లేష ఇది

''అయము'' అంటే శుభమని మరొక పదం సుబలతన్+అయ గుణ+ మహిమన్ సుబలతతో, శుభగుణ మహిమతో ప్రబలి అని మరొక అర్థం దశరథుడి స్వభావానికి విరుద్ధం కానంతవరకూ ఎన్ని అర్థాలయినా చెప్పకోవచ్చు

భారతార్థంలో ఆ+విభుడు అంటే ధృతరాష్ట్రుడు. అతడు విబుధ స్తుతుడై ధరణిన్ వెలసెన్ ఎలాగ?

సుబల తనయ-గాంధారి సుబలుడు అనే పేరుగల రాజు కూతురు ఈ రాజుగారి కొడుకు సౌబలుడు-శకుని. గాంధారికి సోదరుడు దుర్యోధ నాదులకి మేనమామ

ఈ గాంధారి పతివ్రతా గుణమహిమతో ప్రబలింది. ప్రజల్లో ప్రసిద్ధి కెక్కింది భర్తకి చూపులేదు కనక తానూ శాశ్వతంగా కళ్ళకి గంతలు కట్టుకుందంటే సామాన్యమా! ఎంతటి గుణమహిమ అంచేత ప్రసిద్ధికి ఎక్కింది భార్యా ధర్మాన్ని పరిపాలించే వైభవంతో మరీ అందగించింది. (సొబగు+ ఒంది)

దార శబ్దానికి భార్య అని అర్థం సంస్కృతంలో ఇది పుంలింగ శబ్దం అదేమిటో మరి నిత్య బహువచనాంతం దారపుత్రులు అంటే భార్యా పుత్రులు. నిజదార సుతోదరపోషణార్థమై అన్నాడు పోతన్న

దారధర్మ-పాలన లీలన్ సొబగొంది తనకు వన్నె తేగా విబుధ స్తుతుడు అవ్విభుడు ధరణిన్ వెలసెన్

సుబలతన్+నయగుణ అని రామాయణ పరంగానూ, సుబల+ తనయ+

గుణ అని భారతపరంగానూ విభజన రెండింటా సంస్కృతపదాలే. శబ్దశ్లేష. తనకున్+ ఉదార+ ధర్మపాలన అనిరామాయణపరంగా, తనకు+ దారధర్మ+పాలన అని భారతపరంగా. ఇదికూడా శబ్ద శ్లేష. ధర్మ శబ్దం దగ్గర రామాయణంలోనే అర్థశ్లేష.

అని నీడు లేని కడిమిం
దనరారు నతిప్రతాపితదనుజు డత డు
ర్విని గల నృపతుల నందఱ
దన కరిగాపులుగ జేసె దర్పస్ఫురణన్. (౭)

అతడు దశరథుడు అతిప్రతాపిత దనుజుడు. తాపము అంటే బాధ. తాపితము అంటే బాధితం. అతి+ ప్ర+తాపిత+దనుజుడు- భూరి బాధిత రాక్షసుడు దనుజుల్ని బాగా హింసించినవాడు అతిగా ప్రతాపితం కావింపబడిన దనుజులు కలవాడు అని. దనువు సంతతి దనుజులు. వీరే దానవులు. మనువు సంతతి మనుజులు-మానవులు అన్నట్టు. (పెద్ద తేడా ఏమీ లేదు-మొదటి అక్షరం తప్ప!)

అటువంటి దశరథుడు యుద్ధంలో (అనిన్) ఈడు లేని పరా క్రమంతో (కడిమిన్)తనరారుతున్నాడు. ఈ ఉర్విలో ఉన్న రాజుల్ని అందరినీ తనకు అరిగాపులుగా చేసుకున్నాడు ఆ దర్పాతిశయంతో. (దర్ప స్ఫురణన్)

అరి అనే మాట సంస్కృతంలోనూ ఉంది. తెలుగులోనూ ఉంది సంస్కృత పదానికి శత్రువు, చక్రము ఇలా చాలా అర్థాలున్నాయి. అచ్చ తెనుగయితే కప్పం-పన్ను- సుంకం అని అర్థాలు. "అరిగాపు" అంటే కప్పం చెల్లించే సామంతుడని. ఈ భూమిమీద ఉన్న రాజులను అందరినీ తన దర్పాతిశయంతో లొంగదీసుకుని కప్పాలు కట్టించుకుంటున్నాడట దశరథుడు.

భారతార్థంలో అతడు అంటే ఇప్పుడు పాండురాజు, తత్+అనుజుడు - ఆ ధృతరాష్ట్రుని తమ్ముడు- అతడు. యుద్ధరంగంలో ఈడులేని (సాటి లేని) కడిమితో తనరారే అతిప్రతాపి. గొప్ప ప్రతాపం కలవాడు. (ధనం కలవాడు ధని, గుణం కల వాడు గుణి అన్నట్టు, ప్రతాపం కలవాడు ప్రతాపి). ఆ పాండురాజు ఉర్విలో ఉన్న రాజుల్ని అందరినీ ధృతరాష్ట్రుడికి(తనకు) అరిగాపులుగా చేసాడు దర్ప స్ఫురణతో.

"అతిప్రతాపితద్దనుజుడు" అనే ఒక్కచోటనే శ్లేష. మిగతా పద్య మంతా రెండర్థాలకీ సమానం. అతిప్రతాపిత + దనుజుడు అని రామాయణ పరంగా, అతిప్రతాపి +తదనుజుడు అని భారతపరంగా శబ్దశ్లేష

ఎంత తేలికగా, అనాయాసంగా రెండు అర్థాలనూ సాధిస్తున్నాడో చూస్తే ఆశ్చర్యమూ కలుగుతుంది, బుద్ధిపరంగా ఆనందమూ కలుగు తుంది.

తానన్న మాట యింద్రుని
కైన నలంఘ్యమయి పేర్చు నట్లుగా నెంతే
మానిక జెల్లింపుచు జగ
తీనుత విక్రమము దొనర్చె దిగ్విజయంబున్ (౮)

దశరధుడు తాను అన్నమాట ఇంద్రుడికైనా అవిలఘ్యంగా (దాట రానిది శిరోధార్యం) అతిశయించేట్టు ఎంతో పూనికతో చెల్లించుకుంటూ జగత్తుచేత నుతిం పబడిన విక్రమం కలవాడై దిగ్విజయాన్ని చేసాడు

ఇంద్రుడికి సహాయం చేసేవాడు కనక దశరధుడు అతడి మాట ఇంద్రుడికి అలంఘ్యమని

భారతార్థంలో తాను అంటే పాండురాజు అతడు తన అన్నగారి మాటను ఇంద్రుడికికూడా జవదాటరానిది అన్నంత కచ్చి తంగా అమలు జరిగేట్టు చేస్తూ జగతీనుత విక్రముడై దిగ్విజయం చేసాడు

ధృతరాష్ట్రుడి ఆజ్ఞ ఎంత అవిలంఘ్యమో సూచించడానికి ' ఇంద్రునికైనన్ '' అన్నాడు అన్నగారి ఆజ్ఞ తిరుగులేని పద్ధతిగా అమలు జరిగేట్టు తగిన చర్యలు పూనికతో తీసుకుంటున్నాడు పాండురాజు అని

వ్యాస భారతంలో పాండురాజుకి పట్టాభిషేకం జరిగింది అంధు డు కనక ధృతరాష్ట్రుడుకీ, పారశదుడు కనక (దాసీ పుత్రుడు) విదురు డికీ అర్హత లేకపోయింది. దానితో పాండురాజే హస్తిపుర సింహాసనానికి అభిషిక్తుడయ్యాడు ''ధృతరాష్ట్రస్త్వచక్షుష్ట్వాత్ రాజ్యం న ప్రత్యపద్యత - కరణత్వాచ్చ విదుర: పాండురాసీన్మహీపతి:'' అతడు అడవులకి వెడుతూ తిరిగి వచ్చేదాకా బాధ్యతలు నిర్వహించమని ధృతరాష్ట్రుడికి అప్పగించి వెళ్ళాడు దురదృష్టవశాత్తూ మళ్ళీ తిరిగి రాలేదు ఇది వ్యాస భారతం

కానీ నన్నయ్య ధృతరాష్ట్రుడికే పట్టాభిషేకం చేయించాడు పాండు రాజు తాను అనుచరుడై, యౌవ రాజ్య పట్టాభిషిక్తుడై ఆజ్ఞలు చెల్లించవలసినవాడు అయ్యాడు. మూలానికి విరుద్ధంగా నన్నయ్య ఈ ప్రధానమైన మార్పు ఎందుకు చేసాడో ఏ ప్రతిని అనుసరించి చేసాడో అనూహ్యంగా ఉంది '' అంబికేయు ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి భీష్ముండు - తనకు విల్లును విదురు బుద్ధియును సహాయంబులుగా రాజ్యంబు రక్షించుచు న్నంత --- (ఆది 5-5 6 7)

పింగళి సూరన్న ఈ నన్నయ్య మార్గాన్నే అనుసరించాడు ధృతరా ష్ట్రుడి ఆజ్ఞన్ను పాండురాజు చెల్లిస్తున్నాడని చెప్పాడు.

దశరథ పాండురాజుల దిగ్విజయాలను దేశాల జాబితాతో తెలియ పరుస్తున్నాడు

ధృతి గుంతి మద్ర భూపతుల నెయ్యపు గన్య
కలనన వాలు దూపుల జయించి
యలరారు వతను జయశ్రీల వరియించె
యవన సౌరాష్ట్ర భూధవుల గెలిచె
ద్రవిడ కళింగ సాల్వ విదర్భ వసుధాధి
పతుల నోడించి కప్పముల గొనియె

చోళ నేపాళ పాంచాల కేరళ మత్స్య
వత్స భూపతుల గర్వంబడంచె
శక యుగంధర ఘూర్జరాశ్మంత సింధు
లాట భూపాల ముఖ్యుల నోటువఱచె
జగతి గోసల కేకయ మగధుల తన
యులవరించిన యాజ్ఞలో మెలగ జేసె (7)

దశరథుడు ధైర్యంతో (ధృతిన్) కుంతి మద్ర భూపతుల్ని నెయ్యపు కన్య కలనన్ వాలుతూపులతో (వాడిబాణాలతో) జయించాడు

కలను అంటే యుద్ధం ఇది ఔపవిభక్తిక శబ్దం. కలని యందున్ అనే అర్థంలో కలనునన్ అనేది ''కలనన్'' అని ఏర్పడుతుంది మేనునన్ అనేది మేనన్ అన్నట్టు వ్యాకరణంలో వీటిని ఉన్లుగ్రూపాలు అంటారు.

కలనన్ అంటే యద్ధమునందున్ అని అయితే ఆ యుద్ధం ఏమంత ప్రౌఢ యుద్ధం కాదు. వాళ్ళని జయించడానికి పెద్ద యుద్ధం చేసి శ్రమపడవలసిన అవసరం దశరధుడికి కలగలేదు. కన్య+కలనన్+అ – జయించాడు. అప్రౌఢ యుద్ధంలోనే జయించాడు (కన్నియ-కన్నె-కన్య అనేవి తద్భవరూపాలు కన్యాశబ్దంనుంచి తత్సమం గానూ ''కన్య'' ఏర్పడు తుంది రూపం ఒకటే అయినా ఒకటి తద్భవం. ఒకటి తత్సమం. తత్సమానికి అవివాహిత అని మాత్రమే అర్థం. తద్భవానికి ఆ అర్థంతోపాటు చిన్నది, అప్రౌఢము అనే అర్థాలుకూడా ఉన్నాయి. ఇది అర్థవిస్తృతి). కన్యయైన కలను అంటే అప్రౌఢ యుద్ధం అని అటువంటి చిన్న యుద్ధంలోనే వాలు తూపులు వేసి కుంతి మద్రభూపతుల్ని జయించాడు (అ-అనేది అవధార ణార్థకం. అదే అన్న అర్థం ఇస్తుంది. రాముడ అంటే రాముడే అని)

అలా జయించి -అలరారు అతను జయశ్రీలను వరించాడు. చేసిన యుద్ధాలు చిన్నవేకానీ వరించిన జయశ్రీలు మాత్రం పెద్దవి (తను=సూక్ష్మం X అతను) ఇంకా యవన-సౌరాష్ట్ర భూధవులను గెలిచాడు ద్రావిడ కళింగ సాల్వ-విదర్భ వసుధాధిపతులను ఓడించాడు. కప్పాలు వసూలు చేసాడు. చోళ-నేపాళ పాంచాల-కేరళ-మత్స్య-వత్స భూపతుల గర్వం అణచాడు శక-యుగంధర-ఘూర్జర-అశ్మంత -సింధు -లాట భూపాల ముఖ్యులను-అంటే ఇత్యాదుల్ని అందరినీ ఓటు పరిచాడు (ఓడించాడు).

ఈ జగతిలో కోసల-కేకయ-మగధుల తనయలన్ (ఆ రాజుల పుత్రికలను) వరించి, అంటే కౌసల్య – కైకేయి – సుమిత్ర ఈ ముగ్గురినీ వరించి నీతితో కూడిన ఆజ్ఞలో (నయ+ ఆజ్ఞలోన్) మెలగ జేసాడు.

భారతపరంగా- పాండురాజు సంతోషంతో (ధృతిన్) కుంతి మద్ర భూప తుల నెయ్యపు కన్యకలన్ వరించాడు. ఆ రాజుల గారాబు పుత్రికలను వరించాడు. ఆ కన్యకలు- ననవాలు తూపులన్ జయించి అలరారుతున్న అతను జయశ్రీలు. నన

అంటే పువ్వు, పుష్పబాణాలను జయించి మన్మధ విజయలక్ష్ముల్లాగా అలరారుతున్నారు అతనుడు అంటే శరీరం లేనివాడు భావమాత్రుడు. మన్మధుడు శివనేత్రవహ్నిలో భస్మమై శరీరంలేనివాడయ్యాడని పురాణకథ పుష్పబాణాలను మించి మన్మధ జయ శ్రీలలాగా ఉన్న కుంతీ మాద్రులను (కుంతి - మాద్రి) వివాహం చేసుకున్నాడని. మిగతా రాజుల పట్టిక అంతా సమానం కోసల కేకయ మగధులే తాను ఏర్పాటు చేసిన ఆజ్ఞలో (అలకవరించిన ఆజ్ఞలో)తమంత మెలిగేట్టు చేసు కున్నాడు

ఇక్కడకూడా'' మగధులు + అ ''అని అవధారణార్థకమే మగధులన్ + తన అలవరించిన అని చెబితే ద్రుతసంధి జరిగి ''మగధు ల దన '' అవుతుంది అప్పుడు రామాయణార్థంలో తనయలన్ అనే అర్థం కుదరదు అరసున్న ఇబ్బంది పెట్టదు కనక తొలగించినా దనయలన్ అంటే పొసగదు మొత్తం ద్రుతకార్యాన్నే తొలగించాలి. ఇక చెయ్యడమెందుకు

కన్యకలనన + వాలు తూపులన్ అనే రెండూ రామాయణార్థంలో ఆచ్ఛికాలు కన్యకలన్ + ననవాలు అన్నప్పుడు మొదటి పదం తత్సమం రెండోది ఆచ్ఛికం. కాబట్టి ఇది సంస్కృతాంధ్ర శబ్ద సభంగశ్లేష. వాక్యంలో శబ్దాన్వయ విభేద శ్లేష. మగధుల +తనయలన్ మగధుల+తన+ యలవరిం చిన అనేదికూడా అంతే.

పాండురాజు దండయాత్రకు వెళ్ళాడు. కథా ఘట్టం కలిసి రావడం కోసమని దశరధుడూ దండయాత్రకు వెళ్ళాడు అవ్వే దేశాలకు వెళ్ళాడు.

కొందఱు తన వార్త కొనసోకి నంతన
కొందఱు వృత్తాంతగురుత కతన,
గొందఱు భేరి నిర్ఘోషంబు లాలించి
కొందఱు పదరజో బృంద మఱసి,
కొందఱు నాసీర కోలాహలంబున
గొందఱు మణికేతుకోటి వీక్ష,
గొందఱు కోదండ గుణటంకృతులు విని
కొందఱు హుంక్రియాకులత జెంది
కొంద ఱొకటి రెండే టుల కొలది గలిగి
విదిత దిగ్దేశ నృపతులు వెఱిగిపొఱ
నవనియందును యుద్ధ విహారమునకు
మాఱు లేకయు విహరించె మనుజవిభుడు (8)

అవనియందు తన యుద్ధ విహారానికి ఎదురు లేకుండా (మాఱు లేక) విహరించాడు ఆ దశరధుడు లేదా ఆ పాండురాజు(మనుజవిభుడు). మిగతా పద్యమంతా ఇద్దరికీ సమానం.

మనుజవిభుడు దండెత్తేసరికి వివిధ దిక్కులలో దేశాలను ఏలే రాజులు ఎప్పడెప్పడు దాసోహమ్ అన్నారో ఒక క్రమంలో చెప్పాడు

కొందరయితే దండెత్తుతున్నాడు అన్న వార్తలో కొసముక్క వచ్చి చెవికి సోకినంతనే దాసులయిపోయారట మరికొందరు వార్తను పూర్తిగా విని (వృత్తాంతగురుత కతన) ఆ భారంతో దాసులైపోయారట. దండ యాత్ర బయలుదేరుతున్నప్పటి భేరీ నినాదాలు విని బయలుదేరాడు అని నిర్ధారించుకుని మరి కొందరు దాసులయ్యారు. సైన్యం నడుస్తున్నప్పుడు కాళ్ళతో రేగి ఆకాశంలో కనిపించే దుమ్ము చూసి (రజోబృందము అరసి) మరికొందరు సేనాగ్రంలో చెలరేగే కోలాహలం విని ఇంకొందరు, సైన్యంలో అంబారీలకూ, రధాలకూ కట్టిన మణికేతనాల అగ్రభాగాలను చూసి (మణికేతు కోటి వీక్షన్) మరికొందరు, ధనుష్టంకారాలు విని ఇంకొందరు, సైనికుల హుంకారాలు విని ఆకులతతో మరికొందరు, ఒకటి రెండు దెబ్బల వరకూ(ఏటుల కొలదిన్)తట్టుకుని ఇంకొందరు- ఇలా తమతమ ధైర్య సాహసాలను బట్టి ముందూ వెనకగా రాజులంతా ఓడిపోయారట. (విఱి గి పారన్). శ్లేష సాధించవలసిన అవసరం లేదు కనక రవ్వంత భావ చమత్కారం తళుక్కుమంది.

తలపం జొప్పడి యొప్పెనప్పుడు తదుద్యద్ జైత్రయాత్రాసము
త్కలికా లింఖ దసంఖ్య సంఖ్య జయవత్కంఖాణ లింఖా విశృం
ఖల సంఘూత ధరాపరాగపటలాక్రాంతంబు మిన్నే ఱన
ర్గళ భేరీ రవ నిర్దళ ద్గగన రేఖాలేప పంకాకృతిన్ (౭)

ఇదికూడా రామాయణ భారతార్థాల్లో సమానం. అశ్వసైన్యం కదను తొక్కుతూ నడుస్తోంటే గిట్టలతో లేచిన దుమ్ము ఆకాశగంగా జలం లో (మిన్ను+ ఏఱు) కలిసి ఆకాశానికి ఆలేప పంకంలా తయారయ్యిందిట. నీరంతా చిక్కటి రొంపిలా మారిపోయిందని. ఈ పద్యానికి వైవిధ్యం కోసమనీ సౌలభ్యంకోసమనీ ప్రతిపదార్థం ఇస్తున్నాను

తత్= ఆ రాజుయొక్క, ఉద్యత్= విజృంభిస్తున్న, జైత్రయాత్రా= దండయాత్రలో, సముత్కలికా= అత్యుత్సాహంతో, లింఖిత్= కదనుతొక్కుతూ, అసంఖ్య= అప్పటికే లెక్కలేనన్ని, సంఖ్య= యుద్ధాల్లో, జయవత్= విజయం సాధించిన, కంఖాణ= గుర్రాల, లింఖా= గిట్టలతో, విశృంఖల= స్వేచ్ఛగా, సంఘూత= తొక్కబడిన, ధరా= భూమి యొక్క, పరాగ= దుమ్ము యొక్క, పటల= సమూహంతో-పెద్ద దుమ్ముతో, ఆక్రాంతంబు= ఆక్రమించబడినదై, మిన్నేఱు= ఆకాశగంగ, అనర్గళ= నిరాటంకమైన, భేరీరవ= భేరీ ధ్వనులతో, నిర్దళత్= పగిలిపోతున్న, గగనరేఖా= ఆకాశభాగానికి, ఆలేప పంక+ ఆకృతిన్= పూతవంటి రొంపి ఆకారంతో- రొంపిగా మారి అని, అప్పుడు= ఆ సమయంలో తలపన్= ఆలోచింపగా, చొప్పడి ఒప్పెన్= అర్థమై ఒప్పింది.

ఆకాశగంగకీ ఈ దుమ్ముకీ ఏ సంబంధమూ లేదు. అయినా సంబంధం ఉన్నట్టు చెప్పాడు కనక ఇది సంబంధాతిశయోక్తి. ఆ రొంపి ఆలేప పంకంలా ఉంది అన్నాడు కాబట్టి ఉత్ప్రేక్ష

తురగ ఖురాహత క్షితిజ ధూళి చయ స్థగి తాంబరంబుతో
నొరయుచు దచ్చమూ గజ సముత్కర మప్పుడు చూడనొప్పె ది
క్కరి వరయూథ మత్సర విగాఢత జేసి సమస్తమైన యి
ద్ధర దన పైకి నెత్తుకొని తాల్చెడినో యనుచుండ జూపరుల్ ।౦.

గుర్రాల డెక్కలతో ఎగరగొట్టబడిన దుమ్ము ఆకాశమంతా క్రమ్మే సింది. ఆ సైన్యంలో ఉన్న పెద్ద పెద్ద ఏనుగులమీద ఆ ధూళి పొర మరో భూగోళంలా ఉంది దిగ్గజాలతో మాత్సర్యం పెట్టుకుని ' మీరేనేమిటి మేమూ మొయ్యగలం'' అని మొత్తం భూగోళాన్ని తమ మీదకి, ఎత్తుకున్నాయేమో ఈ ఏనుగులు అన్నట్టుంది. చూసేవాళ్ళు అలా అనుకుంటున్నారు ఇది మరొక అద్భుతమైన ఉత్ప్రేక్ష

జవవద్ఘోటక పాటిత క్షితి రజస్సంక్రాంతిచే నింకు సిం
ధువులన్ గ్రమ్మఱ నుర్వికిన్ దివికి దోడ్తో నించె దన్నాగముల్
నవ నిర్యన్మద నిర్ఝరౌఘమున శుండా శీకరోర్ధ్వ ప్రవ
ర్ష విధిన్- దానసుజేసి సింధురము లన్ ప్రఖ్యాతి గాంచెన్ గరుల్।।

వేగంగా పరుగెత్తే గుర్రాలు ఎగరగొట్టిన దుమ్ము వచ్చి చేరడంతో (సంక్రాంతి) ఇంకిపోతున్న నదుల్ని (సింధువులన్) భూమికీ ఆకాశానికీ కూడా మదపుటేనుగులు పునః సృష్టిస్తున్నాయిట నవస్థానాలనుంచీ కిందికి స్రవిస్తున్న మదం నేలమీద నదుల్ని సృష్టిస్తోంది ఎత్తిన తొండాల కొసలలో స్రవించి పైకి ఎగజిందుతున్న మదధారలు ఆకాశంలో నదిని మళ్ళీ సృష్టిస్తున్నాయి ఇలా రెండుచోట్లా నదుల్ని సృష్టిస్తు న్నాయి కనక ఈ కరులు సింధురాలు అనే ప్రఖ్యాతిని పొందాయి

సింధురము అంటే ఏనుగు అని ప్రసిద్ధార్థం సింధువుల్ని (నదుల్ని) సృష్టించేది అని వ్యుత్పత్తి అర్థం మదజలంతో నదీసృష్టిని కవి కల్పించి వ్యుత్పత్తి అర్థం కుదిరేట్టు చెప్పాడు కనక ఇది నిరుక్తి అలంకారం. (నిరుక్తిర్యోగతో నామ్నాం అన్యార్థత్వప్రకల్పనమ్)

మదగజానికి శరీరంలో తొమ్మిది స్థానాలనుంచి మదం స్రవిస్తుం దట. చెక్కిళ్ళపై స్రవించే మదానికి ''దానము'' అని పేరు కుంభస్థలం మీద మదం తొండం మీద శీకరం కాళ్ళ నుంచి మేఘము ఇలా గజశాస్త్రం లో ప్రత్యేకమైన పేర్లు ఉన్నాయి. శుండా+శీకర+ ఊర్ధ్వ+ ప్రవర్ష విధిన్ అన్నాడు అందుకనే

గంభీరవేది లక్షణ లక్షితంబులై
తనరారు భద్ర దంతావళములు
నారట్ట సింధు గాంధారాది భవములై
కొఱలు శ్రీ వృష్ణికీ ఘోటకములు
పదునాల్గు జాతులం ద్రిదశ కాంతల మీఱు
పద్మినీ జాతి సౌభాగ్యవతులు
కడు నద్భుతములైన కనక రత్నాంశుక

చందనాది సువస్తు సంపదలును

నఖిల దిగ్దేశ భూప సమర్పితంబు

లగుచు నరణంబు గతి దోన యరుగు దేర

దను వరించు జయశ్రీల గొనుచు నతడు

పురికి జను సొంపు వాగగోచరత బఱగె (12)

ఓడిపోయిన రాజులందరూ దశరథుడుకి లేదా పాండురాజుకి గొప్ప గొప్ప కానుకలు సమర్పిస్తున్నారు

కొందరు ''గంభీరవేది'' అనే ఉత్తమ సాముద్రిక లక్షణాలతో అలరారుతున్న మదగజాలను ఇచ్చారు ఆరట్ట-సింధు-గాంధారాది దేశాల్లో పుట్టిన '' శ్రీ వృక్షకి' లక్షణ లక్షితాలైన మేలు జాతి గుర్రాలను కొందరిచ్చారు మరికొందరు పద్మాలుగు జాతుల్లోనూ అప్సరసలను మించే పద్మినీ జాతి స్త్రీలను బహూకరించారు ఇంకొందరు బంగారం,రత్నాలు, వస్త్రాలు-చందనం మొదలైన మేలిమి వస్తువుల్ని సమర్పించారు

ఇవన్నీ పెళ్లి కట్నాలలాగా (అరణంబు గతిన్) వెంటరాగా, తనని వరించిన జయాన్నీ, సంపదనీ- జయశ్రీలను తీసుకుని ఆ దశరథుడు, లేదా పాండురాజు తన రాజధానికి (అయోధ్య లేదా హస్తిపురం) తిరిగి వెళ్లే సొంపు వాక్కులకి అగోచరంగా ఉంది

శ్లేషను సాధించాల్సిన అవసరం లేకపోయేసరికి కవికి ఆటవిడుపు అయ్యింది పంజరంలోంచి బయటపడిన చిలకలాగా ఉవ్వెత్తున ఎగిరి పల్లటీలు కొడుతున్నాడు దానికి నిదర్శనమే ఈ సమాసోద్ధత రచన.

ద్వితీయాశ్వాసంలో వసంత ఋతు వర్ణనకూడా ఇలాగే కలిసి వచ్చింది అక్కడా సూరన రచన ఇలాగే సమాసబంధురంగా అనుప్రాస సుందరంగా గిలికీలు కొట్టింది

అంత వసంత మొప్పె జరమాగ్రిమ భాగ చరాఖిలర్తు సా

మంత, మనంత జాలక సమంజస రంజిత కుంజ కుంజరో

ద్భ్రాంత నితాంత సాంద్ర మధు దాన విజృంభిత బంభర స్వనా

త్మంత నిరంతరీకృత దిగంత, మతాంత లతాంత కుంతమై 2-4

ముందూ వెనకా నడుస్తున్న మిగతా ఋతువులు వసంతానికి సామంతులట అనంతమైనమొగ్గలతో రంజిల్లే లతాకుంజాలే(పొదరిళ్ళు) కుంజరాలుట. (ఏనుగులు) ఆ పూలపొదరిళ్ల నుంచి స్రవిస్తున్న మకరందం అనే మదజాన్ని తాగి విజృంభించిన తుమ్మెదల(బంభరాల) ఝుంకార ధ్వనులతో దిగంతాలు క్రిక్కిరిసి (నిరంతరీకృత) పిక్కటిల్లి పోతున్నాయట. లతాంతం అనే కుంతాన్ని (పువ్వు అనే ఆయుధం) ధరించిన మన్మథుడు అలసట అనేది లేకుండా సంచరిస్తున్నాడుట ఇంత అందమైన భావాన్ని ఇంత అందమైన కూర్పుతో, వినడానికీ అనడానికీ కనడానికీ అనువుగా అందించగలిగాడు సూరన్న తెలుగు సాహిత్యంలో ఇటువంటి పద్యం మరొకటి లేదు

అంటే అతిశయోక్తికాదు అయితే శ్లేష కావ్యాలలో ఈ జీడి పలుకులు చెదురుమదురుగా ఒకటీ అరా తగులుతూ ఉంటాయి. ఓపిక పట్టాలి- అంతే

ఈ పింగళిసూరన్న నంద్యాల ప్రాంతంవాడు నంద్యాల నరసింహ కృష్ణుని ఆస్థానకవి. ఈ నరసింహ కృష్ణుడు రాయల తదనంతరం నంద్యాల ప్రభువయ్యాడు. క్రీ.శ. ౧౫౮౦ ఇతని కాలం సూరన పూర్వీకులు కృష్ణా తీరం వారని తెలుస్తోంది. ఇతడు కృష్ణదేవరాయల కొలువులో అష్టదిగ్గజాల లో ఉన్నాడో లేడో నిర్ధారణగా చెప్పలేం కానీ పెద్దన తిమ్మనలకంటే వయస్సులో కొంచెం పెద్దవాడనీ జనశ్రుతిలో స్థిరపడింది ఇతడి రాఘవ పాండ వీయాన్ని చూసాకనే రామరాజభూషణుడు హరిశ్చంద్రనలోపాఖ్యానాన్ని రచించాడు.

కళాపూర్ణోదయంలోనూ ప్రభావతీ ప్రద్యుమ్నంలోనూ ఇతడు తన సాహిత్య దృక్పథాన్ని కథాపాత్రలతోఅక్కడక్కడా సూచించాడు ఇతడి దృష్టి లో కవిత్వం పంచేంద్రియ తర్పకంగా ఉండాలి చలువగల వెన్నెలలకు పరిమళం అబ్బినట్టుండాలి పదాల కూర్పు పొసగ ముత్తెపు సరుల్ పోహ ఆంచిన లీలగా ఉండాలి. మంచి కవిత్వానికి ఇవి సార్వకాలిక లక్షణాలు.

రామరాజభూషణుడు (క్రీ.శ. 1510-80)

వసుచరిత్ర (తృతీయాశ్వాసం 26-46)

రామరాజభూషణుడూ భట్టుమూర్తీ ఒక్కరేనని ఇప్పటికి పరిశోధకులు ఒక నిర్ణయానికి వచ్చారు. శ్రీకృష్ణదేవరాయల అనంతరం సింహాసనం అధిష్ఠించిన అళియరామరాయల ఆస్థానానికి భట్టుమూర్తి (మూర్తికవి) భూషణంగా ఉండేవాడు అందుకని అతడికి రామరాజభూషణుడు అనేది బిరుద నామంగా ఏర్పడింది. అందుకే ''రామనృప భూషణుడను'' అనికూడా చెప్పకున్నాడు.

మూర్తి కవిగా ఉన్న తొలినాళ్ళలో ''కావ్యాలంకారసంగ్రహము'' అనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దాన్ని ఓబళ నరసరాజుకి అంకితంగా రూపొందించాడు అందుకని దానికి నరసభూపాలీయము అనికూడా మరొక పేరు ఏర్పడింది.

ఇతడి రెండవ రచన వసు చరిత్ర. ప్రబంధ నిర్మాణ చాతుర్యానికీ పద్య రచనలో గేయధర్మానికీ ఇది పరాకాష్ఠ. ఆరు ఆశ్వాసాల జగద్గేయ కావ్యం. దీన్ని అళియ రామరాయల తరవాత (క్రీ.శ. 1565) విజయనగర సామ్రాజ్యాన్ని పెనుగొండనుంచే పరిపాలించిన తిరుమల రాయలకి అంకితం చేసాడు. కాబట్టి వసు చరిత్ర రచనాకాలం క్రీ.శ. 570 ప్రాంతం.

ఇతడి చిట్టచివరి రచన హరిశ్చంద్రనలోపాఖ్యానము అనే ద్వ్యర్థికావ్యం.

అష్టదిగ్గజ కవులలో ఈ మూర్తికవి ఉన్నాడు-అని చెప్పడానికి చారిత్రిక ఆధారాలు ఏమీలేవు పెద్దనకు శిష్యుడనీ, తిమ్మన నుంచి ముక్కు పద్యం కొనుక్కున్నాడనీ జనశ్రుతిలో ఉన్న కథలే ఆధారం. చారిత్రకంగా చూస్తే ఇతడు అప్పటికి పిన్న వయస్సువాడై కావ్యనిర్మాణ కుతూహలంతో ఉండి ఉంటాడనిపిస్తుంది

వసుచరిత్రలో కథ అతి స్వల్పం అనగనగా ఒక వసురాజు. శుక్తిమతీ నదిమీద కోలాహల పర్వతం కామంతో వచ్చిపడి జలప్రళయం సంభవిస్తే ఈ రాజు తన కాలిగోటితో పర్వతాన్ని మీటి ఆ నదినీ, లోకాన్నీ కాపాడాడు ఈ ఘన కార్యానికి ఇంద్రుడు సంతోషించి దివ్య విమానం బహూకరించాడు. వసురాజు తన నర్మ సచివుడితో కలిసి ఈ విమానం ఎక్కి సంచరిస్తుంటాడు.

కోలాహలుడి అత్యాచారంతో శుక్తిమతీనది గర్భవతి అవుతుంది. గిరిక అనే అమ్మాయి పుడుతుంది. ఆ పిల్ల పెరిగి పెద్దది అవుతుంది. కోలాహల పర్వతం మీద చెలికత్తెలతో కలిసి విహరిస్తూ ఉంటుంది. వీణ వాయిస్తూ ఉంటుంది

అదే సమయానికి వసురాజు నర్మసచివుడితో ఆ ప్రాంతానికి వస్తాడు. వీణాగానం వింటాడు పూల పొదల చాటుగా నిలబడి గిరికను చూస్తాడు మనసు పోగొట్టుకుంటాడు. నర్మ సచివుణ్ణి యతివేషం ధరించి వాళ్ళదగ్గరకు వెళ్ళి ఆ అమ్మాయి

చరిత్ర తెలుసుకోమని పంపుతాడు. తాను పొదలచాటునుంచి వింటూ ఉంటాడు ఆమె చెలికత్తె మంజువాణి గిరికాజన్మవృత్తాంతం అంతా చెబుతుంది వసురాజును వలచింది అంటుంది. చెట్టుచాటునుంచి రాజుగారు ప్రవేశిస్తారు చూపుల కలయిక. మనస్సుల కలయిక వివాహం కావ్యం శుభాంతమవుతుంది

భారతంనుంచి తీసుకున్న చిన్న కథను కల్పనలతో విస్తరించి రసనిర్భర మహాకావ్యంగా, సానలదీరిన జాతిరత్నంగా తయారు చేసాడు. కథా శరీరం క్రమ క్రమంగా తగ్గిపోతూవచ్చిన పైఖరికి ఈ ప్రబంధం ఒక నిదర్శనం

ఇందులో ఒక నదిని ఒక రెక్కల పర్వతం కామించడం, అది వచ్చి మీద పడితే నది గర్భవతి కావడం, ఒక అమ్మాయిని ప్రసవించడం అనేది సృష్టి విరుద్ధమైన కథాంశం అందుకని నదీరూపంలో స్త్రీమూర్తి స్ఫురించేట్టు పర్వత చిత్రణలో పురుష రూపం కనిపించేట్టు వర్ణన సాగించాడు ఈ మానవీకరణవల్ల దీన్ని రసవత్కా వ్యంగా రూపొందించ గలిగాడు ఇది రామరాజ భూషణుడి ప్రతిభా పాండిత్యాలకు గీటు రాయి. శ్లేషకూ, శబ్ద శక్తి మూల ధ్వనికీ ఆటపట్టు.

నర్మసచివుడు యతివేషంలో వచ్చాడు. వసురాజు పొదల మాటున ఉన్నాడు. చెలికత్తె మంజువాణి మంజు-వాణీ విలాస సంపదలతో గిరికాదేవి జన్మ వృత్తాంతాన్ని చెబుతోంది

కోలాహలుడి అవరోధంతో శుక్తిమతీదేవి నీరుమోసి శుభ ముహూర్తాన ప్రసవించింది. మగబిడ్డ, ఆడపిల్ల కవలలుగా జన్మించారు మగబిడ్డకి వసుపదుడు అని పేరు పెట్టారు కోలాహలుణ్ణి ఎగమీటి తనను కాపాడిన మహారాజు వసురాజు కనక మగబిడ్డకు అతడి పేరు పెట్టుకుని శుక్తిమతీదేవి కృతజ్ఞతను చాటుకుంది. ఇంక ఆడపిల్ల విషయం- చెబుతోంది.

గిరిరాజతనయ కైవడి
సిరి రాజిల వెలయు నీ సుశీల యనుచు నా
గిరి కన్య కచటి మౌనులు
గిరికా శుభనామ మిడి రకిల్బిషఫణితిన్. (౩-౨౦)

ఈ సుశీల పార్వతీదేవిలా (గిరిరాజ తనయ=హిమవంతుని కూతురు) సకల సౌభాగ్య సంపదలతోనూ విరాజిల్లుతుంది (సిరిరాజిలన్ వెలయు) అని చెప్పి అక్కడి మునీశ్వరులు పవిత్ర వాక్కులతో (అకిల్బిష ఫణితిన్) ''గిరిక'' అనే శుభనామ ధేయం పెట్టారు. (ఇడిరి)

కోలాహలుడు హిమవంతుని కొడుకు ఇతడు మరొక గిరిరాజు. అంచేత ఇతని కూతురుకూడా గిరిరాజ తనయయే. ఆ పసిబిడ్డల ఆలనా పాలనా ఎలా జరి గాయో వివరిస్తోంది

జలకము లార్చి, పాండు జలజచ్ఛదపాళిక గప్పి, తమ్మిసం
కుల దెలిదేవె లుగ్గు లిడి, క్రొందరగల్ గదలించు కల్పతో

ట్టిలల గుమారు గూతునను ఘటించి భజించు నదీలలామ- కో
మల కుముదాగతాళికుల మంజురవంబున జోలపాడుచున్ (3-27)

నదీలలామ శుక్తిమతీదేవి తన పసిబిడ్డలు ఇద్దరినీ జలకాలు ఆడించి (ఆడించుట= ఆర్చుట) తెలిదామర రేకుల్ని వరసతో కప్పి తడి ఒత్తుతోంది. (పాండు-జలజం=తెల్లని పద్మం ఛద-పాళిక =రేకుల వరస). తుడిస్తే కందిపోతారేమోనని ఒత్తుతోంది. అవి ఆకులు కాదు. తామర పూరే కులు వాటితోనైనా సరే-తుడవడం లేదు, ఒత్తుతోంది ఒక్కొక్కరేకు తీసు కోవడం అలా ఒత్తి ఇలా పారెయ్యడం. అందుకని ఛదపాళిక అన్నాడు అంత సుకుమారంగా పెంచుతోంది ఆ బిడ్డల్ని

తమ్మి మొగ్గలు అనే శంఖాలలోనుంచి తెలితేనెల్ని ఉగ్గులు పెడు తోంది శంఖం ఉగ్గు గిన్నెలాగా ఉంటుంది. తమ్మి మొగ్గలే సంకువులు. మకరందమే ఉగ్గు

ఉగ్గు పెట్టిన తరవాత బిడ్డలు ఇద్దరినీ ఉయ్యేల తొట్టెల్లో వేస్తోంది కలువలే ఉయ్యాల తొట్టెలు ఇద్దరినీ పక్క పక్కనే చెరొక కలువ పువ్వులోనూ పరుండబెడు తోంది కొత్త తరంగాలు-చిరుకెరటాలు ఆ కలువ ఉయ్యాలల్ని కదిలిస్తున్నాయి పసిబిడ్డల్ని ఉయ్యేలలో వేసినపుడు కొత్తగదా!, అలవాటు పడేవరకూ ఊపరు మెల్ల మెల్లగా కుదుపుతారు. ఊపితే దడుసుకోవచ్చు, గాలి ఒత్తిడి ఇబ్బంది పెట్టవచ్చు అంచేత క్రొందరగలు కదిలిస్తున్నాయి అనడం కలువ తొట్టెల్లో విడివిడిగా ఒక దాంట్లో కుమారుణ్ణి, మరొక దాంట్లో కూతుర్ని పరుండబెట్టింది (ఘటించి) మరి జోలపాట లేదా ఉంది కోమల కుముదాగత+అళికుల+మంజురవంబున జోల పాడుచున్ మృదువైన కలువ పువ్వులకోసం దగ్గరికి వచ్చిన తుమ్మెదల అందమైన ఝుంకారాలతో (అళికుల రవంబునన్) జోల పాడుతోంది. అవి మంజు రవాలు కాబట్టి పిల్లలు ఉలిక్కిపడరు హాయిగా ఆదమరచి నిద్రపోతారు

ఇలా ఆ నదీలలామ తన అందుబాటులో ఉన్నవాటితో బిడ్డల్ని ఎంతో అపురూపంగా సాకుతోంది (భజించున్=సేవలు చేస్తోంది). రోజుకి ఏడాదిగా ఎదిగి పెద్దవాళ్ళు అవుతున్నారు అందులో ముఖ్యంగా అమ్మాయి-తోటకూరకాడలా ఎదుగు తోంది

మందయానము నేర్వ నిందిందిరాజీవ
రాజీవ రాజన్మరాళ రాజి,
కలికి పల్కులు నేర్వ లలిత నానా వాస
నావాస నికట కానన శుకాళి,
గొనబు పాటలు నేర్వ గుము దరసామోద
సామోద మధుప శుద్ధాంత సమితి,
నటన లీలలు నేర్వ దట రూఢ కల్పాగ
కల్పాగచర నీలకంఠ వితతి,
యన్నదీకన్య కఖిల భాగ్యములు గలుగ

మునిపురంధ్రీజనంబు దీవన లొసంగు
వతివ సైరంధ్రులై దాదులై వయస్య
లై విపిన దేవతలు ప్రోతు రనుదినంబు (28)

గిరిక నడకలు-మాటలు-పాటలు- ఆటలు క్రమంగా నేర్చు కుంటోంది. ముందు నడకలు స్వయంగా హంసలే నేర్పుతున్నాయి

ఇందిందిరము అంటే తుమ్మెద ఇందిందిరాలకు జీవనా ధారమైన (ఆజీవ) రాజీవాలు-పద్మాలు ఆ నదిలో ఉన్నాయి ఆ పద్మాల కోసం వచ్చి వాటిమీద విరాజిల్లు తున్న (రాజత్+మరాళరాజి) రాజహంసల శ్రేణి ఈ అమ్మాయికి మందయానం నేర్పుతోంది. తప్పట డుగులు నేర్చి నప్పటినుంచీ గిరికమ్మది హంసగమనమే.

చిలకలు వచ్చి మాటలు నేర్పుతున్నాయి అయితే చిలకలు నది దగ్గరకి రావు. లలితమైన నానావిధమైన సువాసనలకు ఆవాసమైన సమీప కాననాల్లో సంచరించే శుకబృందం గిరికకు పలుకుగురువులు (లలిత+నానా+వాసన+ ఆవాస+నికట= సమీపం+కానన+శుక+ ఆళి). చిలకలు నేర్పే పలుకులు కలికి పలుకులు అంటే అందమైన మాటలు, విన సొంపైన మాటలు. ఈ చిలకలకి ఆవాసమైన కాననాలు పెరిగింది శుక్తిమతీ జలాలతోనే

మాటలు వచ్చాక పాటలు ఆడతుమ్మెదలు గొనబు పాటలు నేర్పుతున్నాయి. ఇంపయిన పాటలు నేర్పుతున్నాయి ఈ ఆడతుమ్మెదలు శుక్తిమతికి నేస్తాలు. కలువల్లో ఉండే మకరంద రసంతో, సుగంధంతో (ఆమోదం) ఆనందపరవశమయ్యే (స+ ఆమోద= ఆనందంతో) మధుప శుద్ధాంతసమితి (కుముదరస+ ఆమోద+సామోద+ మధుపశుద్ధాంత సమితి). మకరందం త్రాగి జీవించేది-మధుపం శుద్ధాంతమంటే అంతః పురం శుద్ధాంతాన్ని ఎల్లవేళలా విడిచిపెట్టకుండా అక్కడే నివసించే స్త్రీని కూడా శుద్ధాంతము అనే అంటారు (లక్షణావృత్తి గృహము అంటే గృహిణి అనే అర్థంకూడా ఇలా వచ్చిందే)

సమితి అంటే సమూహమని ఇప్పుడు మధుప శుద్ధాంత సమితి అంటే అంతఃపుర కాంతలైన మధుపాల సమితి అని మధుపాంగనల బృంద మని తాత్ప ర్యార్థం. అందరికీ అంతఃపురాలు ఉండవు కదా। అందుకని అంతఃపుర-అంతఃపురీ- శుద్ధాంత శబ్దాలు స్త్రీవాచకాలుగా స్థిరపడ్డాయి.

ఆ తుమ్మెద పేరటాండ్రు బృందాలుగా వచ్చి గొనబు పాటలు నేర్పుతున్నారు.

మాట పాట నేర్చాక ఇప్పుడు ఆట. నటన లీలలు (విలాసాలు) నేర్పుతు న్నాయి నెమళ్ళు. వీటికి కంఠం నీలం రంగులో ఉంటుంది నెమలి కంఠం రంగు అంటారు నీలాన్ని. అందుకని నీలకంఠం అంటే నెమలి అని (నీల కంఠుడు అంటే శివుడు. ఆయనా నాట్యానికి ప్రసిద్ధుడే) నెమళ్ళు నదిలో ఉండవు కానీ ఆ నదికి ఇరుపైపులా ఉన్న ఒడ్డుల మీద (తట) వేళ్ళు పోసుకుని స్థిరపడిన చెట్లు ఉన్నాయి.

అవి శుక్తిమతి నీళ్ళతోనే పెరిగాయి. తటాల మీద రూఢమయ్యాయి ఎదిగి ఇప్పుడు అవి పువ్వులూ ఫలాలతో కల్పవృక్షాలకు (కల్ప+అగ) సాటి వస్తున్నాయి (తట రూఢ+ కల్పాగ కల్ప+ అగ+చర+ నీలకంఠ వితతి = సమూహం) ఆ చెట్ల మీద సంచ రించే నీలకంఠ సమూహం స్వయంగా వచ్చి అమ్మాయికి నటన లీలలు - నాట్యంలో మెలకువలు నేర్పుతోంది.

శుక్తిమతీ నదికి చుట్టుపక్కల ఉభయ తటాల్లోనూ మునిపల్లెలు ఉన్నాయి. మునిపత్నులు రోజూ వచ్చి ఆ నదినుంచే మడినీళ్ళు తీసుకు వెడతారు ఆ మునిపురం ధ్రీజనం (స్త్రీజనం) ఆ నదీ కన్య అయిన గిరికకు అఖిలభాగ్యాలూ కలిగేట్టు దీవెనలు ఇస్తున్నారు

ముని పురంధ్రీ జనం కలిసికట్టుగా పేరటాండ్రై వచ్చి దీవించి వెళ్ళవలసిన సంఘటన ఏదో గిరికకు జరిగిందన్నమాట యౌవనవతి అయ్యిందని,కాబట్టే స్త్రీలు వచ్చి సౌభాగ్య ప్రదమైన ఆశీస్సులు అందించడం.

అప్పటినుంచీ గిరికాదేవికి (అతివకు) సైరంధ్రులూ (ముస్తాబు చేసే స్త్రీలు) దాదులూ,వయస్యలూ (చెలిమి కత్తెలు) అవసర మయ్యారు. వనదేవతలే ఇవన్నీ అవుతూ ఆమెను అనుదినమూ సంరక్షిస్తున్నారు. కొందరు వనదేవతలు సైరంధ్రులై అలంకరిస్తే, కొందరు దాదులై పాలన చేస్తే కొందరు వయస్యలై లాలన చేస్తున్నారు వయస్సు కారణంగా మనస్సు విప్పి చెప్పకోవడానికి వయస్యలు అవసరమయ్యారు

తమాషా ఏమిటంటే ఉపమాన వస్తువులే ఈమెకు ఆయా విష యాల్లో గురువులయ్యారు. అందరూ ఉలికే తమంత తాముగా వచ్చి తమ తమ విద్యలు నేర్పు తున్నారు దీనికి కారణం కృతజ్ఞత. వారంతా శుక్తి మతీ నదీ జలాలపై ఆధారపడి ఇంతకాలంగా జీవితాలు గడుపుతున్నారు. ఇప్పటికి ఋణ విముక్తి పొందడానికి ఒక అవకాశం వచ్చింది అందుకని మనఃస్ఫూర్తిగా నేర్పుతున్నారనుకోవాలి ఈ అభి ప్రాయం సూచించడం కోసమే ఆ గురువులకు అంతంత పొడుగు విశేషణాలు వేసాడు

ఈ సీస పద్యం ఒక గేయంలాగా నడిచింది. శబ్దాలంకారంతో అందం ఇనుమడించింది వసుచరిత్రలో పద్యాలన్నింటా ఉంటుంది ఈ గేయ ధర్మం ఇది ఇతడి ప్రత్యేకశైలి వరసలు కట్టి ఈ పద్యాలను శ్రావ్యంగా గానం చేసేవారూ, వీణలపై పలికించేవారూ ఈ నాటికీ ఉన్నారు దేశంలో. రామరాజభూషణుడు ''సంగీత కళా రహస్యనిధి''

''తట రూఢ కల్పాగకల్పాగచర నీలకంఠవితతి'' అన్నచోట మరొక విశేషం ఉంది. అగము అంటే కదలనిది (న గచ్ఛతి ఇతి-అగః) అని అర్థం. పర్వతం కావచ్చు , చెట్టు కావచ్చు ''నగము'' అన్నా ఇలాగే రెండర్థాలు ఇక్కడ సందర్భాన్ని బట్టి కల్పాగము అంటే కల్పవృక్షము అనే కల్ప వృక్షాలు మందారము, పారిజాతము ఇత్యాది నామధేయాలతో అయిదు ఉన్నాయని చెబుతారు.అది సరే ''కల్పాగ కల్ప'' అనే

ప్రయోగం గురించి సంస్కృతంలో ''కల్పప్ ' అనే తద్ధిత ప్రత్యయం సమానము- తుల్యము- సాటి అనే అర్థాల్లో వస్తుంది గురు కల్పుడు అంటే గురువు కాదు గానీ గురుతుల్యుడు అని కవి కల్పుడు పతి కల్పుడు ఇల్లా అన్నింటికీ చేర్చుకోవచ్చు అల్లాగే కల్పాగ కల్పము అంటే నిజంగా కల్పవృక్షం కాదుగానీ కల్పాగంతో సమానము అని కల్పాగ కల్పములైఅగములు- కల్పాగ కల్పాగములు వాటిమీద చరించే నీలకంఠ వితతి.

శుక్తిమతీనది ఇసుక తిన్నెల మీద గిరికాదేవి తన వయస్కులైన వనదేవతలతో కలిసి రకరకాల ఆటలు ఆడుకుంటోంది

పిచ్చుక గూళ్ళు కడుతోంది దూ దూబిళ్ళ ఆడుతోంది ఆ చమత్కారం వర్ణిస్తున్నాడు దూదూబిళ్ళ ఆట ఈ రోజుల్లో చాలా మందికి తెలిసి ఉండదు అదేమిటంటే-

ఒక చెలికత్తెను ఎదురుగా కూర్చోబెట్టుకుని మధ్యలో ఇసుకని పొడవుగా చిన్న గట్టుగా పేర్చి ఒక పుల్ల ముక్కని కుడిచేతి బొటన వేలూ చూపుడు వేలులతో నొక్కి పట్టుకుని ఎడమచేత్తో దాన్ని మూసి ఆ ఇసుక కుప్పలో ఎక్కడో ఒకచోట దాస్తుంది ఎదురుగా ఉన్న చెలికత్తె ఈ పుడక దాచినచోటును ఒక్కసారిగా పట్టుకోవాలి ఇదిగో ఇక్కడ ఉంది అని ఆమె తన రెండుచేతులూ గుత్తి కట్టి ఏదో ఒక చోట వేస్తుంది ఆ చేతుల కింద ఉన్న ఇసుకలో ఆ పుడక దొరకాలి దొరికితే ఆ చెలికత్తె నెగ్గినట్టు ఇప్పుడింక ఆమె ఆడుతుంది దొరకకపోతే గిరిక నెగ్గినట్టు చెలిమికత్తె ఓడిపోయినట్టు కాబట్టి దొంగపట్టాలి మరో చెలికత్తె వచ్చి ఆమె కళ్ళు మూస్తుంది గిరికాదేవి తాను దాచిన పుడకను ఇసుకతో సహా తీసి దొంగకి దోసిట్లో పోస్తుంది అలా కళ్ళు మూసే అటుతిప్పీ ఇటుతిప్పీ చాలా దూరం నడిపించుకు తీసుకువెళ్ళి ఒకచోట ఆ ఇసుకను పుడకతో సహా పోయించేస్తారు కళ్ళు అలా మూసి ఉంచే మళ్ళీ వంకరలు తిప్పతూ బయలుదేరినచోటికి తీసుకువచ్చి వదిలిపెడతారు దొంగ తన కళ్ళు నులుముకుంటూ తెరుస్తుంది ఇసుక ఎక్కడ పోసి వచ్చిందో అక్కడికి గుర్తు పట్టి వెళ్ళాలి ఆ పుడకని పట్టుకురావాలి అది శిక్ష పట్టుకురాలేక పోతే గుంజీళ్ళో మరోటో మరో శిక్ష ఇదీ దూదూబిళ్ళ ఆట

గిరికాదేవి వనదేవతలతో ఆడుతోంది అయితే అగర్వ శ్రీమంతురాలు కనక పుల్లముక్కకి బదులు రత్నాలూ మణులూ ముత్యాలూ ఉపయోగిస్తున్నారు తల్లి శుక్తిమతికి ఒంటినిండా ముత్యాలే వైడూర్యాలే తండ్రి కోలాహలుడికి నిలువెల్లా రత్నాలే ఇక లోటేమిటి ఆటలకికూడా వాటినే ఉపయోగిస్తున్నారు అందుకే అతిపరిచయాత్ అవజ్ఞా అన్నారు సరే, ఆ పద్యం-

వెలదుల్ దాఁచును గూఢ రత్న సికతాన్వేషంబు గావించుచున్,
చెలి బాల్యంబున నిక్కువల్ గనఁ దయుం జేసాచి యాళ్ళప్రసూ
ఫులిపోర్చిన్ మణు లెందునేని గొనిరా, బోటుల్ ''బళి'' తల్లి ని
శ్లెలిపించెన్ సిరికళ్ళి నంచు నగుచుం గ్రీడింతు రబ్జాలతోన్ (3-21)

వెలదులూ తానూ కలిసి ''గూఢ రత్న సికతాన్వేషము'' అనే ఆటని కావిస్తోంది. ఆడుతోంది. దూదూబిళ్ళని ఆ క్రీడా స్వరూపాన్ని బట్టి ''గూఢ రత్న సికతా న్వేషము'' అని సంస్కృతీకరించాడు. గూఢంగా రత్నాన్ని ఇసుకలో (సికతా) అన్వే షించడం కలిగిన ఆట. అది సాగుతోంది.

గిరికాదేవి దొంగ అయ్యింది. ఇసుకని ఎక్కడ పోసి వచ్చిందో అక్కడికి వెళ్ళి వెదికి రత్నం పట్టుకురావాలి. ఆ నిధి ఈమెకు దొరకలేదు. వెతికి పట్టుకోలేక పోయింది. దానికి కారణం బాల్యం. చెలి (గిరిక) బాల్యం వల్ల నిక్కువలు (నిధులు) కనిపెట్టలేకపోయినప్పటికీ (నిక్కువల్ కనకయున్) అవి అన్నీ తన తల్లిగారి ఇసుక తిన్నెలే కనక, ఎక్కడ పడితే అక్కడ మణులు దొరుకుతాయి కనక ఎక్కడో అక్కడ చెయ్యి చాపి మరో మణిని తీస్తోందిట. ఆమె అలా తీసి ఇచ్చినది తాము అంతవరకూ ఆడిన రత్నం కాదు. ఇది మణి. ఎప్పుడు తాను దొంగ అయినా ఇంతే చేస్తోంది గిరికా దేవి. ఇలాగే గెలుస్తోంది.

ఆత్మ ప్రసూ (తన తల్లి యొక్క) పులిన+ ఉర్విన్ (ఇసుక తిన్నె యందు) ఎందునేని (ఎక్కడో ఒకచోటనుంచి) చేసాచి మణుల్ కొని రాన్ - అని అన్వయం. మణులు అని బహువచనంలో చెప్పాడు కనక తాను దొంగ అయినప్పడల్లా ఇలాగే చేసి, చాలా మణులు తెచ్చి గెలుస్తోంది అని.

ఇది చెలికత్తెలు మొట్ట మొదటే గమనించారు. కానీ ఏదో చిన్న పిల్ల కదా (బాల్యం) అని ఊరుకున్నారు. ఒకసారి అయ్యింది. రెండు సార్లు అయ్యింది. పదిసార్లు ఇంతే అయ్యే సరికి ఇక ఊరుకోలేక ఆ బోటులు (స్త్రీలు) అన్నారట- బళి! సిరి ఉంది కనక (సిరియొక్క కలిమిచేతన్ -సిరి కల్మిన్) మీ తల్లి నిన్ను గెలిపించింది- అని. ఈ అనడం నిష్ఠూరంగా కాదు, ఆక్షేపణ అంతకన్నా కాదు. ఇలా అంటూనే నవ్వుతూ (నగు చున్) ఆ బాలతో క్రీడిస్తున్నారు. కాకపోతే ఇక్కడికి ఈ ఆట విరమించి, సైకత స్థలం విడిచిపెట్టి, కోలాహలుడి దగ్గరకు వెళ్ళి మరో ఆట- బువ్వాలాట ప్రారంభి స్తున్నారు. స్థలం మారింది. ఆటా మారింది.

గురు సవిధ ప్రదేశమున గోమల కల్పక పుష్పధూళిచే
ధరసుత బొమ్మరి ల్లిలిపి, తన్మృదు పల్లవపాత్రపంక్తి గే
సరములు ఖాద్యముల్, మధురసంబు ఘృతంబు, ప్రసూన పుంజి మో
గిరమని పెట్టి, నన్నియు సఖీతతి కట్టివయూ ప్రియంబునన్ (3-30)

తన తండ్రికి సమీప ప్రదేశంలో (గురు సవిధ ప్రదేశమునన్) గిరికాదేవి (ధరసుత) బువ్వాలాట ఆడుతోంది. ముందుగా ఒక బొమ్మరిల్లు (ఇల్లు - ఇలు-ఇల్) కట్టింది. దేనితోనూ ? కోమలమైన కల్పక పుష్పాల ధూళితో. కల్ప వృక్షాలు ఆ గిరి సానువుల నిండా (కొండ చెరియలు) ఉన్నాయి. వాటి పుష్పాలు కుప్పలు తెప్పలుగా రాలి పడ్డాయి. వాటిలో పుష్కలంగా పుప్పొడి ఉంది. ఆ పుప్పొడి పోగుచేసి దానితో బొమ్మరిల్లు (పిచిక గూడులాగా) నిలిపింది.

ఇల్లు కట్టాక గృహప్రవేశమూ భోజనాలూ ఉంటాయికదా! చెలి కత్తెల్ని బంతిగా కూర్చో బెట్టింది ఆ కల్పవృక్షాల లేత ఆకుల్ని భోజన పాత్రలు అంటూ పంక్తిగా అందరి ముందూ వేసింది (తత్+మృదు పల్లవ+ పాత్రపంక్తి). పుష్పకేసరాలు తుంపి, ఇవ్వి తినుబండారాలు- ఇదే పప్పు, ఇదే కూర, ఇదే పచ్చడి ఇదే పిండివంట-అంటూ ఆ పల్లవ పాత్రల్లో వడ్డించింది పువ్వుల్లో ఉన్న మకరందాన్ని (మధురసంబు) రాల్చి- ఇది ఘృతము (నెయ్యి) అంది మరికొన్ని చిన్ని పువ్వులు తెచ్చి వడ్డించి ఇది అన్నము (ఓగిరము) అని అందరి విస్తళ్ళలోనూ పెట్టింది పెడితే- ఆ సఖీతతికి అన్నీ అన్నట్టు గానే మారిపోయాయట అట్టివే (అట్టివి+ అ) అయ్యాయిట. ఎంతో ప్రియం (హితవు) కలిగించాయిట అవును మరి అవి కల్పవృక్షాలయ్యే. అక్కడ ఎవరు ఏ మాట అంటే, ఏది కోలతే అది జరిగిపోతుంది ఇదీ చమత్కారం

గిరికాదేవి ఆభరణాల విషయంలోనూ, పెంపకం విష యంలోనూ తల్లిదండ్రులు పోటీపడుతున్నారు ఏకైక పుత్రిక ఇద్దరూ సంపన్నులు. వాళ్ళిద్దరికీ పరస్పరం పడకపోయినా, మాటలే లేకపోయినా, పిల్ల విషయంలో మాత్రం పోటీ పడుతున్నారు

పంకజపాణి శంఖపరిభావక కంధర దల్లి యేలొకో
సంకులు గట్టె నంచు గులశైల సుతాగ్రణి పాయ ద్రోచి, ర
త్నాంకితహార ముంప- బరువానునొ బిడ్డ కివేల కర్కశా
లంకృతు లంచు హల్లక కలాపము లుంచు నదీలలామయున్ (3-31)

గిరికాదేవి పంకజపాణి. అరచేతులు పద్మాల్లా (పంకజాలు) ఉంటాయి. ఆవిడ కంఠసీమ (కంధర) శంఖాన్ని అవమానపరిచేదిగా (పరిభావకం) ఉంటుంది అటువంటి శంఖ పరిభావక కంధరలో -శుక్తిమతీదేవి బుల్లి బుల్లి శంఖాలు (సంకువులు-సంకులు) ఏరి, మాలగా గుచ్చి ధరింపజేసిందట శంఖహారం వేసింది. అది వేసుకుని గిరికాదేవి వాళ్ళ నాన్నదగ్గరికి (కోలాహలుడు) చూపిద్దామని వెళ్ళింది. కోలాహలుడు చూసాడు తల్లి ఏలొకో సంకులు కట్టె ?- అనుకున్నాడు. నీ గళమే ఒక శంఖమయితే మరో శంఖహారం ఎందుకు? అని పైగా మా అమ్మాయికి రత్నహారం ఉండాలి గానీ శంఖహారమా అనిపించి ఉంటుంది శుక్తిమతి తనకంటే బీదరాలు. ఇంతకంటే విలువైన హారం ఏమి వేస్తుందిలే అనికూడా భావించి ఉండవచ్చు ఎందుకంటే "కులశైల సుతాగ్రణి" అంటున్నాడు కవి. కుల పర్వత రాజుగారి పుత్రుల్లో కెల్లా అగ్రణి ఈ కోలాహలుడు రత్నాల రాశి ఇంతకీ ఏంచేసాట్టా - ఆ సంకులదండ తీసేసాడు. తీసి అవతలకి విసిరేసాడు. (పాయన్ద్రోచి) మరో రత్నాంకిత హారం (రత్నాల దండ) కూతురుమెడలో ఉంచాడు. ఇదీ నా కూతురుగా నువ్వు ధరించ వలసింది అంటూ రత్నహారం వేసాడు

రత్నాంకిత హారం వేసుకుని గిరికాదేవి తల్లి దగ్గరకి వచ్చింది. ఆమె చూసింది. అయ్యయ్యో రాళ్ళూ రప్పలూ దండలు గుచ్చివేస్తే బరువైపోదూ! (బరువు

అనునో) ఛీ ఛీ! ఇవ్వేమిటి బాబూ కర్కశాలంకారాలు!! (ఇవేల కర్కశాలంకృతులు) అంటూ ఆ రత్నహారం తీసివేసింది. ఎదిగిన ఆడపిల్ల మెడ బోసిగా ఉండకూడదు గదా ! అందుకని ఎర్రకలువల హారాలు వేసిందట (హల్లకము- ఎర్రకలువ. కలాపము=సమూహము, భూషణము). తక్కువ తిందా !. ఆవిడా- ధృక నదీలలామ, ఆయన శైలాగ్రణి అయితే ఈవిడ నదీలలామ (లలామము= శ్రేష్ఠము).

ఇలాగ శుక్తిమతీ కోలాహలులు పోటీపడి ఎవరికి అందుబాటులో ఉన్న ఆభరణాలు వారు ధరింపజేస్తున్నారు. ఈ పోటీని కవి మొదటినుంచీ సూచిస్తూనే ఉన్నాడు. మందయానము నేర్పు ..... అనే పద్యంలో ఇది ఉంది. నడకలు నేర్పిన హంసలు శుక్తిమతి నేస్తాలు. పలుకులు నేర్పిన చిలకలు కాననినివాసులు కనక కోలాహలుడి బంధువులు పాటలు నేర్పిన తుమ్మెదలు మళ్ళీ శుక్తిమతి చుట్టాలు. ఆటలు నేర్పిన నీలకంఠ వితతి కల్పవృక్ష సంచారులు, కనక కోలాహలుడి మిత్రబృందం ముని పురంధ్రీ జనమూ విపినదేవతలూ ఇద్దరికీ చెందినవారు. లేదా మునిపత్నులు శుక్తిమతికి నెచ్చెలులు, విపిన దేవతలు కోలాహలుడికి ఆశ్రితలుఇలాకూడా భావించ వచ్చు. అక్కడ సూచన ప్రాయంగా ఉన్న పోటీ రాను రాను బలపడి బయటపడింది.

అనుగుణ క్రీడల నెల్లవారలకు నిట్లల్లారు ముద్దైన కూ
తునకున్ వాహిని- వాణి దాల్చు సుకవిస్తోమంబు రప్పించి, త
ద్ఘన విద్యామహిమల్ కరామలకముల్ గావించె, నాత్మీయ నూ
తన పద్మోపచయం బశేషముసు దత్ప్రాప్తంబు గావించుచున్. (౭-౩౭)

అనువైన క్రీడలతో అందరికీ అల్లారు ముద్దుగా పెరుగుతున్న గిరికాదేవికి (కూతునకున్) ఇంకా పెద్ద చదువులు (ఘన విద్యా మహిమల్) నేర్పించాలి అనుకుంది శుక్తిమతీ వాహిని. వెంటనే విదేశాల నుంచి సుకవిస్తోమాన్ని (సమూహాన్ని) రప్పించింది. సరస్వతిని ధరించిన సుకవి స్తోమం ఇది (వాణిన్ దాల్చు సుకవి స్తోమంబున్). అల్లాటప్పా విష యం కాదు. గొప్ప వాగ్వైభవం కల సుకవి బృందాన్ని రప్పించి వాళ్ళ దగ్గర ఉన్న ఘనవిద్యామహిమలు అన్నీ గిరికాదేవికి కరామలకాలు చేయించింది. అరచేతిలో ఉసిరికాయలాగా విద్యలన్నీ ఆమెకు స్వాధీనాలు కావిం చింది. (ఆమలకము= ఉసిరికాయ).

విదేశాలనుంచి వచ్చిన సుకవిస్తోమం ఏ ప్రతిఫలమూ ఆశించ కండా ఉత్తినే విద్యలు నేర్పుతుందా? నేర్పదు అందుకని శుక్తిమతి తనదగ్గర ఉన్న కొత్త కొత్త పద్మనిధులను అన్నింటినీ (నూతన పద్మ+ ఉపచయంబు= సమూహం) అశేషంగా (పూర్తిగా) ఆ సుకవిస్తోమానికి ప్రాప్తం కావిం చింది. సమర్పించేసింది నవనిధులలో పద్మం అనే పేరుగల నిధి ఒకటి. ఆ నిధిని పూర్తిగా సమర్పించింది అని

ఈ సుకవి స్తోమం బ్రహ్మలోకంనుంచి వచ్చింది. అదే సత్యలోకం అక్కడ వాణీ చతుర్ముఖులు ఉంటారు ఆ లోకంతో శుక్తిమతికి రాక పోకలు ఉన్నాయి. (అక్కడి నుంచి వస్తున్నప్పడే ఒక రోజున కోలాహలుడు ఈమెను చూసి మోహించాడు. ఇంటికి

వచ్చాక మీద పడ్డాడు అత్యాచారం చేసాడు గిరిక పుట్టింది) అంచేత సత్యలోకం నుంచి కబురు పెట్టి సుకవిస్తోమాన్ని రప్పించగలిగింది

కవి శబ్దానికి పక్షి అనికూడా అర్థం సుకవిస్తోమము అంటే పక్షు లలోకెల్లా గొప్పవీ మంచివీ హంసలు కనక హంస సమూహాన్ని రప్పించింది అని ఈ హంసలు వాణిని దాల్చే (ధరించే) హంసలు సాక్షాత్తుగా సరస్వతికి వాహనాలు వాటి దగ్గర చాలా ఘనవిద్యా మహిమలు ఉన్నాయి ఆ మహిమలన్నీ గిరికాదేవికి నేర్పించింది కరామలకాలు చేయించింది

ఇంతకు ముందు ఒక మరాళరాజి గిరికకు మందయానం నేర్పింది ఆ మరాళాలకు వచ్చిన విద్య అంతవరకే అది ఘన విద్యామహిమ కాదు పైగా మరాళ రాజి శుక్తిమతికి మిత్రబృందం స్థానికం వాణిని ధరించిన బృందం కాదు అంచేత ఏ ప్రతిఫలమూ ఇవ్వవలసిన అవసరం లేకపోయింది

ఇప్పుడు అలాకాదు సత్యలోకం హంసలు ఇవ్వి పారితోషికం ముట్టజెప్పాలి అందుకని ఆత్మీయ నూతన పద్మోపచయాన్ని-కొత్తగా విక సించిన పద్మాల సమూహాన్ని పూర్తిగా సమర్పించింది

ఘన విద్యా మహిమల్ అన్నచోటకూడా మరో అర్థాన్ని గ్రహించ వచ్చు ఘనము అంటే మేఘం ''ఘనవిద్యా' అంటే ఆకాశగమన, స్వేచ్ఛా రూపధారణ విద్యలు మేఘానికి ఆ రెండు శక్తులూ ఉన్నాయి ఈ సత్యలోక హంసలుకూడా అటువంటి మహిమలు కలవే. కాబట్టి ఆ మహిమలను గిరికకు నేర్పి వెళ్ళాయని చెప్పవచ్చు అయితే ఈ మహిమలను గిరిక కావ్యం మొత్తం మీద ఎక్కడా ఉపయోగించలేదు కానీ గిరిక నెచ్చెలి మంజువాణిమాత్రం ఒకసారి ఉపయోగించింది ఆకాశ గమనంతో వసురాజధానికి రాయబారం వెళ్ళింది బహుశ గిరిక తాను నేర్చిన మహిమని తన అవసరంకోసం నెచ్చెలికి నేర్పి ఉంటుంది అనుకుంటే విద్య చరితార్థం అయినట్టే

శుక్తిమతి-గిరికాదేవికి కన్నతల్లిగా నదీమతల్లిగా రెండు అర్థాలూ స్ఫురించేట్టు శ్లేషతో పద్యరచన చేసాడు మొత్తం కావ్యమంతటా ఇదే బాణీ అనాయాసంగా నడిపించేసాడు బహుళాంధ్రోక్తిమయ ప్రపంచం రామరాజ భూషణుడికి కరతలామలకం

తల్లి ఈ విధంగా ఘనవిద్యామహిమలు నేర్పిస్తే తండ్రి మరొక విదేశం నుంచి గానకళా విశారదుల్ని పిలిపించి గాంధర్వ విద్య నేర్పించాడుట

అన్నగశేఖరుండును మహామణికూట సమర్పణంబు చే
గిన్నరతోటుల న్నిలిపి, గేయవిశారద జేసె గూతునున్,
గిన్నెర మీట, వీణ బలికింపగ గీతములుం బ్రబంధముల్
వన్నియ బాడ, జెప్ప వనివారిత చాతురి గల్గునట్లుగాన్. (3-33)

ఆ నగశేఖరుడుకూడా తనకున్న మహా మణి సమూహాలను (కూట

పారితోషికంగా సమర్పించి కిన్నర బృందాలను తన ఇంటికి పిలిచి నిలిపాడు
కిన్నరులు గంధర్వజాతి సంగీతానికి పెట్టింది పేరు. వారు ఆకాశంలో స్వేచ్ఛగా
సంచరిస్తూ ఎత్తయిన అందమయిన పర్వత శిఖరాలమీద విడిది చేస్తూ తమకోసం
తాము పాడుకుంటూ ఆనందిస్తూ ఉంటారట అటువంటి కిన్నర కోటుల్ని కోలాహలుడు
నిలిపాడు అతడికి అనర్ఘమణులతో కూడిన శిఖరాగ్రాలు (కూటములు కోటులు)
ఉన్నాయి ఆ శిఖరాగ్రాలను కిన్నరులకు విడిది ఇళ్ళుగా సమర్పించాడుట
అలా నిలిపి వారి గురుత్వంలో తన కూతురిని గేయ విశారదను చేసాడుట
గాత్రవిద్యలో ప్రవీణ అయ్యింది గేయ విద్యమాత్రమే కాదు వాద్యాలుకూడా నేర్పిం
చాడు కిన్నెర మీటడం వీణ పలికించడం గీతాలూ ప్రబంధాలూ (కీర్తనల్లో
విశేషాలు) వర్ణాలూ పాడటం లేదా వన్నియగా (అందంగా) పాడటం మరొకరికి
చెప్పడం (నేర్ప డం)- వీటిల్లో గిరికాదేవి కి అనివారితమైన చాతురి లభించేట్లు
గాంధర్వ విద్యను చెప్పించాడు పాడన్ చెప్పన్ అన్నందువల్ల ఆమె మరొకరికి తానే
గురువు కాదగినంత స్థాయి సంపాదించిందని
వీణ వాయించడం వీణ పలికించడం అని రెండు విధాలు గురువులు
నేర్పింది నేర్పినట్టు యధాతథంగా మ్రోగించడమేమో- వీణ వాయించడం తన
ప్రతిభతో క్రొత్త కొత్త సంగతులు వేస్తూ తనదే ఒక బాణీగా మ్రోగిస్తే అది వీణ పలికించ
డం అని స్థూలంగా కొందరు విశేషార్థం చెబుతారు. దీనివల్ల ఇక్కడయితే వచ్చే ఇబ్బంది
ఏమీ లేదు పైగా గిరికా ప్రతిభను వెల్లడిస్తుంది ' వీణ బలికింపగ' అన్నాడు కాబట్టి
స్వీకరించ వచ్చు
కోలాహలుడు వ్యయానికి ఓర్చి వీణ నేర్పించాడు బాగానే ఉంది కానీ ఆ
విద్యను వినియోగించడానికీ అభ్యాసం నిరంతరంగా కొనసాగించడానికీ అనువైన
వసతులూ సౌకర్యాలూ కల్పించవద్దా ? కల్పించాడు ఆ విశేషం చెబుతున్నాడు

వీణావాదన వేళలన్ ఘుమ ఘుమావిర్భూతి నింపన్, ఇగ
వీణావాదన వేళలన్ ఘుమ ఘుమావిర్భూతి దీపశ్రేణికాపాదియై
ప్రాణాచంచల శైల శూన్య నవ దీపశ్రేణికాపాదియై
రాణింపన్, ముఖలక్ష్మికిన్ ముకురమై రంజిల్ల, లే బట్టికిన్
మాణిక్యాయతనం బొనర్చె గిరి యాత్మశ్రీ ప్రభావంబునన్. (3-34)

ఆ కోలాహలుడు (గిరి=పర్వతం) ఆత్మశ్రీ ప్రభావంతో (తన సంపన్నతా
శక్తితో) తన చిన్నారి కూతురికి (లేత+ పట్టి= కూతురు- లే బట్టి) ఒక మాణిక్యాయతనం
-రత్నాలు పొదిగిన సభామండపం లేదా మాణిక్యం లాంటి గృహం నిర్మింపచేసి
ఇచ్చాడు
అందులో కూర్చుని వీణావాదన చేస్తున్న వేళల్లో ఘుమ ఘుమా విర్భూతి
నిండుతుంది వీణాధ్వనికి కొత్త అందాలు ఆవిర్భవించి ఇమ్మడి ముమ్మడిగా వెలుపలికి
వినిపిస్తుందికాబోలు చాలా దూరంవరకూ శ్రోతలు వినే అవకాశం కల్పిస్తుంది
కాబోలు ఘుమ ఘుమా విర్భూతి నింపన్ - అన్నాడు లోపలే ప్రతిధ్వనులు వస్తే

అది దుర్భరం. అంచేత వెలుపలికే అనాలి.

నవ దీప శ్రేణికి ఆ గృహం ఆపాది- నిలయం కొత్తరకం దీపాలు శ్రేణులుగా ఉన్నాయి అందులో అవి తైలశూన్యాలు నూనె నింపి వెలిగించ వలసిన అవసరం లేదు వాటిని. అంతేకాదు జగత్ప్రాణ+అచంచలాలు జగత్తుకి అంటే జీవరాశికి ప్రాణం-వాయువు ఆ వాయువు ఎంతగా వీచి నా ఈ దీపాలు అచంచలాలు ఊగిస లాడవు కొండ ఎక్కవు బహుశ మణిదీపాలు అయ్యుంటాయి పోనీ విద్యుద్దీపాలే అందామా! (నేటి మన విద్యుద్దీపాలు గట్టిగా గాలివేసినా వాన కురిసినా ఆరిపో తున్నాయే).

ఇంకా- ఆ మాణిక్యాయతనం ఆమె ముఖలక్ష్మికి ముకురమ్మై (అద్దమ్మై) రంజిల్లుతోందిట. అందులోకి వెళ్ళి నిలబడితే చాలు ఎటుచూస్తే అటు ముఖం ప్రతిబింబిస్తుందన్న మాట లోపలి తట్టున చుట్టూ నిలువుట ద్దాలో, మణి దర్పణాలో ఏర్పాటు చేయించి ఉంటాడు

తన సంపదకూ తన స్థాయికీ తగ్గట్టు కట్టించాడు కనక ఎన్ని షోకు లైనా ఉంటాయి అది నిర్మించి ఇచ్చాడు తెలుసా అని మంజువాణి మాయా యతికి (రాజు గారి నర్మసచివుడికి) ఊరిస్తూ చెప్పింది. బహుశ ఆ మాణిక్యాయతనాన్ని సమీపంలో చేతితో చూపించే ఉంటుంది. అలా చెప్పి-

ఆ నగజాత యీ తరుణి, యీ వనదేవత లీ వయస్య, లా
మానవనాథ పాద నఖ మర్దిత భూధర మీ నగోత్తమం,
బీ నగమౌళిపై నెసగు నీ మణి ధామము, లీ కొలంకు, లీ
కోనలు, నీ నికుంజములు కుంజరయాన విహార రంగముల్. (౩-౩౮)

ఓ యతీశ్వరా! ఆ కోలాహలపర్వతరాజు కూతురు (నగజాత) ఇదిగో ఈ తరుణి ఆ వనదేవతలే ఈ చెలికత్తెలం (వయస్యలు) మేమంతా అలనాడు ఆ మానవ నాథుని (వసురాజు) పాదనఖంచేత (కాలిగోరు) మర్దితమ్మైన భూధరం (పర్వతం) ఇదిగో ఈ పర్వతమే. (ఈ నగ+ ఉత్త మంబు=పర్వతరాజం) ఈ నగమౌళిమీద అందంగా ప్రకాశిస్తున్న (ఎసగున్) ఈ మణిగృహాలూ ఈ కొలనులూ (కొలను+లు= కొలకులు, కొలంకులు), ఈ కోనలూ ఈ పొదరిళ్ళూ (నికుంజములు)- ఇవన్నీ ఈ మదగజయానకు (కుంజరం= ఏనుగు) విహార రంగాలు. ఆమెతో కలిసి మేమంతా ఈ పరిసరాల్లోనే విహరిస్తూ ఉంటాం

మంజువాణి గిరికాదేవి జన్మవృత్తాంతాన్ని శుక్తిమతీ కోలాహలుల కథతో ప్రారంభించి మధ్యలో వసురాజుగారి వీరోచిత కృత్యాన్ని వివరించి ఇదిగో ఈ తరుణియే ఆ గిరిక - అని నాటకీయంగా హస్త నిర్దేశంతో చూపి ముగించింది.

అని వనిత యుపరిచరవసు
జననాయకు కథయు, గన్య జననాగతియున్
వినయంబున వినుపింపగ,
విని యమ్ముని సమ్మదాబ్ధివీచిక దేలెన్. (౩-౩౯)

ఈ రకంగా ఆ వనిత - మంజువాణి ఉపరిచర వసురాజుగారి కథనీ, గిరికాకన్య పుట్టుకనీ (జనన+ అగతి) వినయంగా వినిపింప జేసింది. ఆ ముని అంతా శ్రద్ధగా విని ఆనందాబ్ధి వీచికలలో (తరంగం) తేలియాడాడు.

వసురాజుకి " ఉపరిచర'వసువు అనేది బిరుదనామం. చేసిన ఉపకారానికి పురస్కారంగా ఇంద్రుడు ఇచ్చిన దివ్యరథంలో ఆకాశ సంచారం (ఉపరిచర) చేస్తాడు కనక ఉపరిచర వసువు అయ్యాడు.

నర్మసచివుడు వచ్చాడంటే రాజుగారూ వచ్చే ఉంటారు. ఈ చుట్టు పక్కల దాక్కుని ఉంటారు. ఇతణ్ణి ముందు పంపించి ఉంటారు- అని మంజువాణి ఊహించే, కథ అంతా చాలా నేర్పుగా చెప్పింది అనిపిస్తుంది. అసత్యాలు చెప్పలేదు గానీ వసురాజు గారిని బాగానే ప్రశంసించింది ప్రశంసిస్తున్నట్టు అనిపించకుండా ప్రశంసించింది. అదీ వచన ప్రాగల్భ్యం అంటే. పొదలచాటునుంచి వసురాజు ఇదంతా శ్రద్ధగా ఆలకించాడు (గిరిక మనస్సులో అప్పటికే వసురాజు ఉన్నాడు అనే సంగతిమాత్రం తానై చెప్పలేదు. చెబితే గిరిక చులకనై పోదూ. అందుకని ఈ ప్రస్తావనని యతి తానై చేసే దాకా ఆగి - ఆ రాజుగారు ఇక్కడికి ఎప్పుడు వస్తారూ, ఎప్పుడు చూస్తారూ, ఎప్పుడు పెళ్ళాడతారూ, మేమంతా చూసి సంతోషించే దెపుడూ- అంటూ సాగదీసు కుంది).

లతికా సంవృత గాత్రుడై నిజకథాలాపంబు లాలించు భూ
పతి యచ్చో హితు నేర్పు- బోటి వచన ప్రాగల్భ్యమున్, గన్య యు
న్నత గోత్రోద్భవ వైభవంబును మదిన్వర్ణించి యూహించె ధ
న్యత నా శుక్తిమతీ ఝరీ జనిత రత్నం బాత్మ విత్తంబుగాన్. (3-37)

లతికలచేత కప్పివేయబడిన గాత్రం (శరీరం) కలవాడై - అంటే తీగ గుంపుల చాటున దాక్కుని తన కథకు సంబంధించిన సంభాషణల్ని (నిజకథా+ ఆలాపంబులు) ఆలిస్తున్న వసురాజు (భూపతి) ఆ సందర్భంలో (అచ్చోటన్-అచ్చోన్) తన హితుడి నేర్పునీ మంజువాణి (బోటి=స్త్రీ) వాక్కు లలో ప్రగల్భతనీ (ప్రాగల్భ్యం= జాణతనం) గిరికాదేవి ఉన్నత గోత్రంలో (వంశంలో) ఉద్భవించిందన్న వైభవాన్నీ తన మదిలో తెగమెచ్చేసుకుని (వర్ణించి=ప్రశంసించి), శుక్తిమతీనదికి (ఝరి= నది) జన్మించిన ఆ కన్యారత్నం ఇక తన విత్తమే-తన సొమ్మే అని (ఆత్మవిత్తంబుగాన్) ఊహించి, అదే ధన్యతగా భావించాడు (ధనం లబ్ధ్వా-ధన్యః. గణం లబ్ధ్వా-గణ్యః)

రత్నగ్రాహీ తు పార్థివః అని ఒక నియమం రత్నాలేకాదు సామ్రా జ్యంలో విలువైన వస్తువు ప్రతిదీ రాజుగారికే చేరాలని దాని తాత్పర్యం. ఈ కన్య- శుక్తిమతీ ఝరీ జనిత రత్నం. కాబట్టి తనకే దక్కాలి. ఆత్మ విత్తంబు గా ఊహించాడు. ఆమె తనకు " ఆత్మవిత్తం" కావడమే ధన్యతగా భావించాడు. ఆమె కన్య. ఆమెది ఉన్నత గోత్రోద్భవ వైభవం. అంటే ఉత్తమ వంశంలో పుట్టింది అనే కాక, ఎత్తయిన (ఉన్నత) గోత్రానికి- పర్వతానికి జన్మించింది, అనికూడా శ్లేష (గోత్రం=వంశం. పర్వతం).

వసురాజుగారు ఇలా ఊహించి పొదలచాటున కలలు కంటున్నాడు ఇక్కడ

దొంగమునిగారేమో-

మాయామౌనియు నంత గొంత తడ వాత్మధ్యాన విజ్ఞానము
ద్రాయత్తంబున నున్నయట్లలరి, కాంతారత్నముం బల్కు "లే
మా! యే మాంతరదృష్టి జూచితిమి, భామాభావి భాగ్యోదయం
బీ యబ్జానన బెండ్లియాడు వసురాజేంద్రుండు వాలాయమున్ (౩-౩౮

అంతా విన్న మాయామౌని అప్పడు కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆత్మధ్యానంలోకి వెళ్ళిపోయినట్టున్నాడు సుమా అని తెలియజెప్పే (విజ్ఞాన) ముద్రా యత్త స్థితితో – ఆ భంగిమతో ఉన్నట్లు అభినయించి (అలరి= ఆనందించి) ఆ కాంతా రత్నమైన మంజువాణితో- ఇలా పలికాడు అది దొంగధ్యానం దొంగముద్ర. కళ్ళు మూసుకుని దివ్య దృష్టితో ఏదో చూసేస్తున్నట్టు అభినయం కొంచెంసేపు ఈ నాటకం ఆడి కళ్ళుతెరిచాడు హఠాత్తుగామంజువాణిని "లేమా" (ఓ వనితా) అని పిలిచాడు అరిచాడు

లేమా ! మేము (ఏము) ఆంతర దృష్టితో చూసాము- మీ భామా భావి భాగ్యోదయాన్ని (గిరికాదేవికి కలగబోయే అదృష్ట పరంపరనీ సౌ భాగ్య సంపదనీ) ఈ అబ్జముఖిని (అబ్జం=పద్మం, చంద్రబింబం) వసు రాజు పెండ్లి ఆడతాడు-తప్పదు. ఇది తథ్యం (వాలాయమున్=తప్పని సరి గా) అన్నాడు

యతీశ్వరుడు కనక మేము అంటూ మాట్లాడతాడు తాను దొంగ యతినని తనకు తెలుసు కనక మరికాస్త. ఇతడు మాయామౌని అని గ్రహించేసిన వాళ్ళకి బడాయి అనిపిస్తుంది

ఆంతర దృష్టితో చూసి చెప్పిన విషయాన్ని లౌకిక దృష్టితో సమర్థి స్తూ సంభాషణ కొనసాగించాడు.

రమణీ ! యిట్టి కాంతాలోక రత్న మమర
జేసిన విధాత వసువుతో జేర్పడేని
నాతని నిసర్గ మధుర సర్గానుభావ
మఖిల భువన ప్రసాధనం బగుట యెట్లు (౩-౩౯)

ఓ రమణీ మంజువాణీ! ఇటువంటి కాంతాలోక రత్నాన్ని (ఉత్తమ స్త్రీని) అందంగా సృష్టించిన బ్రహ్మదేవుడు (అమరన్ చేసిన- అమరజేసిన విధాత) ఈ రత్నాన్ని వసువుతో చేర్చకపోతే (వసువు=వసురాజు, బంగారం) ఇక అతడి సృష్టి ఎందుకు? నిసర్గ మధురమైన (సహజతతో సుందర మైన) అతడి సృష్టిక్రియ (సర్గము= సృష్టి, అనుభావము=క్రియ) అఖిల భువనాలకీ- సమస్తలోకాలకీ అలంకారం అవ్వడం ఎట్లా ? (ప్రసాధనము =భూషణం).

అంచేత అతడి సృష్టి చరితార్థం అవ్వాలంటే సహజతతో సుందరం కావా లంటే ఈ కన్యారత్నాన్ని వసువుతో చేర్చవలసిందే రత్నానికి బంగా రంలో పొదిగినప్పడే అందం అదే సహజం అప్పడే అది అఖిలలోకాలకూ భూషణం అవుతుంది- అని

గిరికావసురాజుల కలయిక అఖిలలోకాలకూ ప్రసాధనం అవుతుందనీ. భువనమంటే నీరు అనే అర్థం ఉంది కనక ఇది ఒక్క శుక్తిమతీనదికే కాక, అఖిల నదులకూ ప్రసాదనం అవుతుందనీ స్ఫూర్తి. అటుపైని- వీరిది అనురూపదాంపత్యం అవుతుందని కూడా ప్రతి పాదిస్తున్నాడు

నెలతలలో త్రిలోకనుత నిర్మల రూపకలాప ధన్య యీ
కులగిరి రాజకన్య, నృపకోటులలో వసురాజు మేటి, యు
య్యలఘుడు నీ లతాంగియు లతాంతము దావియుబోలి యేకమై
వెలయగ గన్నులార గను వేడుక వేగము మీకు గల్గెడున్ (౩-౪౦)

ఓ బాలామణీ స్త్రీలలోకెల్లా సౌందర్యవతి ఈ కులగిరిరాజకన్య (కోలాహల పుత్రిక) త్రిలోకాలచేతా నుతింపదగిన నిర్మలమైన రూప కలాపంతో ధన్యురాలు ఈ కన్య ఆ వసురాజుగారేమో రాజ సమూహాల్లో (నృపకోటులలోన్) మేటి ఆ అలఘుడూ (గొప్పవాడు.) ఈ లతాంగియు పువ్వూతావీలాగా ఏకమై విడదీయరాని రీతిగా అలరారుతుంటే (వెలయ గన్) కన్నులారా చూసే వేడుక మీకు అందరికీ త్వరలోనే (వేగము) కలుగు తుంది గాక!- అని ఆశీస్సుకూడా ముందుగానే అందించేసాడు

వ. అనిన నమ్మందయాన సందియంబున నిట్లనియె (౩-౪౧)

యతీశ్వరుడు ఇలా అనేసరికి ఆ మందయాన - మంజువాణికి సందేహం వచ్చింది ఆ సందియంతోనే పలికింది.

సందియంబునన్ అన్నాడే తప్ప ఏమి సందేహమో చెప్పలేదు కవి. ఇతడు నిజంగా యతీశ్వరుడేనా అని సందేహమో, వసురాజు వచ్చిపెళ్లాడేనా అని సందేహమో - ఈ రెండోదే పైకి చెబుతోంది-

ఇన్నగరాజు జాడ వసుధేశ్వరు డెన్నడు వచ్చు-వచ్చి యీ
క్రొన్నన తీవ జొంపములకోనకు నెన్నడు డిగ్గు, డిగ్గి యీ
కన్నియ గన్నులార గుతుకంబున నెన్నడు గాంచు, గాంచి రా
జెన్నడు గారవించు, చెలు లెన్నడు గాంతు రభీష్టసంపదల్. (౩-౪౨)

ఈ నగరాజుని దర్శించడానికి వసుధేశ్వరుడు ఎన్నడు వస్తాడు? వచ్చి ఈ క్రొత్త పువ్వుల తీగ జొంపాల కోనకు ఎన్నడు దిగుతాడు? దిగి ఈ కన్నెను కన్నులారా కుతుకంతో (కుతుకము=వైవాహికోత్సాహం) ఎన్నడు చూస్తాడు? చూసి తాను ఎన్నడు గౌరవిస్తాడు ? ఈ చెలులు అభీష్ట సంపదల్ని ఎప్పుడు పొందుతారు.? (కాంతురు).

ఇదంతా జరిగేనా పెట్టేనా, ఎప్పటికో అన్నట్లు మాట్లాడింది. కానీ వెంటనే మరో సందేహం వచ్చినట్టుంది- యతీశ్వరుడు చిన్నబుచ్చుకుంటా డేమోనని. అందుకని సంభాషణ కొనసాగించి సర్దుకుంటోంది.

అని జవరాలు వెండియు బ్రియంవమ్మున నమ్మని జూచి "యో తపో
ధనమణి! యీ లతాంగి వసుధావరు నెన్నడు చెట్టవట్టునో

యని యనురక్తి పెంపుమెయి నాడితి గాక, శుభప్రసంగ మం
గనకు నొసంగ గొంగుముడి గాదె భవద్వచనంబు'' నావుడున్ (3-43)

అన్ని సందేహాలు వెలిబుచ్చిన తరవాత ఆ జవరాలు ప్రియంతో ఆ మునీశ్వరుణ్ని చూసి మళ్ళీ (పెండియున్) పలికింది

ఓ తపోధనమణీ (మునివరా- అని) ఈ లతాంగి గిరికాదేవి వసురాజును (వసుధా= భూమి, వరుడు= భర్త) ఎప్పుడు వివాహ మాడుతుందో కదా అని అనురాగాతిశయంతో అలా మాట్లాడానే కానీ (అనురక్తి పెంపుమెయిన్ ఆడితిన్ కాక) అంగన గిరికకు వివాహ ప్రసంగం (సంబంధం) కలిగించడంలో నీ మాట కొంగుముడి కాదా .

కొంగుముడి అంత తేలికగా వివాహ ప్రసంగాన్ని ఒసంగుతుంది నీమాట దానికి తిరుగులేదులే అని ఒక అర్థం కొంగుముడి అనేది వివాహంలో వేస్తారు దాన్ని కలిగించడంలో నీ మాట సమర్థమే, నువ్వు అన్నట్టే పెళ్ళి జరుగుతుంది అని మరో సూచన. ఇలా నుడికారాన్ని శ్లేషించడంలో చేమకూరవేంకటకవి ఈ గురువును మించిపోయాడు.

మంజువాణి ఇలా అనగానే మునికి పంతం పెరిగిపోయింది ఎంత సర్దుకున్నా సందేహించింది కదా నిరూపించుకోవాలి ఇది పైపై సంగతి అసలుకి వసురాజుని రప్పించాలి. అందుకని పంతమాడు తున్నాడు

లలనా! యీ యెలనాగ బెండ్లియగు వాలాయంబు చేదిక్షమా
తలనాథుం డిది నమ్మవేని నిజమంత్ర ప్రౌఢి రప్పింతు, నా
నల నాసత్య సమాను జూడు'' మని పంతం బొప్ప మాయా జపా
కలనాదంభము బూని మౌని దిశ లాకర్ణించి ''మజ్ఝా'' యనన్ (3-44)

ఓ లలనా. చేది రాజ్యాధిపతి వసురాజు ఈ ఎలనాగను తప్పకుండా పెండ్లి ఆడతాడు ఇది నువ్వు నమ్మకపోతే నా మంత్రశక్తితో (నిజ మంత్రప్రౌఢిన్) రప్పిస్తాను ఎవరిని? ఆ నల సమానుణ్ని ఆ నాసత్య సమానుణ్ణి(అశ్వనీ దేవతలు)- వసురాజుని రప్పిస్తాను చూడు-అన్నాడు

అని ఆవిడ సమాధానంకోసం ఆగకుండానే పంతంతో మంత్ర జపానికి పూనుకున్నాడు అది దొంగజపం మాయాజపం ఆచరించడమనే మోసాన్ని-నాటకాన్ని ప్రారంభించాడు నడుం నిలబెట్టి కళ్ళు మూసేసు కున్నాడన్న మాట. ఆ మౌని అలాగే కూర్చుని దిశలు ఆకర్ణించాడు. ఆకాశం నుంచి తనకేదో వినపడుతున్నట్టు తానొక్కడూ వింటున్నట్టు నటించి ఉన్నట్టుండి ఒక్కసారిగా ''మజ్ఝా'' అన్నాడు. అంటే అది వసురాజు గారికి అవ్వాల్సిన మంత్రమన్నమాట

లతికా సంవృత గాత్రుడై ఇదంతా తిలకిస్తున్న వసురాజు ఈ మాట విన్నాడు తన నర్మసచివుడు ఏ పంతంతో ఈమాట అన్నాడో తెలుస్తూనే ఉంది తనక-

ఇది సంధింపగ వేళ యంచు వసురాజేంద్రుండు-నీరంధ్రనీ
రద వారప్రతిసీర వెల్వడిన తారాభర్త లీలన్ లతా
చ్ఛద సంఛాదిక బాసి నిల్చె నెదుటన్-సారంగ రాగభ్రమ
న్మద భృంగీరుతి వందిమాగధ కథా మాధుర్యముం దెల్పగన్ (3-48)

ఇది నేను వెళ్ళ వలసిన సమయం రంగం సిద్ధమయ్యింది కాబట్టి ప్రవే
శించవచ్చు మాయామౌని పంతంతో అన్న మాటకు సత్యతను సంధించవలసిన
తరుణం (వెళ్ళకపోతే మౌని తుస్సుమంటాడు. నాటకమంతా బట్టబయలు అవు
తుంది.) అని నిశ్చయించుకుని వసు రాజేంద్రుండు, లతల ఆకుల తెరచాటును విడిచి
పెట్టి (లతా+ ఛద= ఆకు ల+ సంఛాదికన్= తెరను) ముందుకువచ్చి వారందరి ఎట్టి
ఎదుటా నిలిచాడు దట్టమైన మేఘ పంక్తి అనే తెరనుంచి (నీరంధ్ర +నీరదవార+
ప్రతిసీర=తెర) వెలువడిన తారాభర్తలాగా (చంద్రుని లీలతో) ముందుకి వచ్చి
నిలిచాడు

రాజుగారు వస్తున్నారంటే ముందు వందిమాగధుల స్తోత్రాలు వినిపించాలి
కదా అదికూడా సమకూర్చాడు కవి

లతల చాటునుంచి రాజుగారు వస్తుంటే అవన్నీ కదిలాయి. లతాంతాల మీద
వాలి మకరందం గ్రోలుతున్న తుమ్మెదలు చెలరేగి ఒక్కపెట్టున ఝుంకారధ్వనులు
చేసాయి

వంది-మాగధుల స్తోత్రాలు సాధారణంగా సారంగరాగంలో ఉంటాయిట
సారంగం అంటే తుమ్మెద అందుకే ఆ రాగానికి ఆ పేరు వచ్చిందంటారు సారంగ
రాగంలో ఝుంకారాలు చేస్తూ ఎగురుతున్న (భ్రమత్) మదించిన ఆడ తుమ్మెదల
ధ్వని (మద భృంగీరుతి - భృంగము - భృంగి) వంది మాగధ కథా మాధుర్యాన్ని-స్తోత్ర
సౌందర్యాన్ని తెల్పగా వసురాజు ప్రవేశించాడు.

మగ తుమ్మెదల మీద (సారంగ) అనురాగంతో (రాగ) వాటి చుట్టూ
తిరుగు తున్న మదభృంగీరుతి అనికూడా చెప్పవచ్చు

వంది-మాగధులు ఇద్దరు. వీళ్ళనే సూత మాగధులు అనికూడా అంటారు
రాజుకి వీళ్ళ అవసరం ఏమిటి ? ఎందుకు స్తుతించాలి? అది రాచరికమా? అంటే -
ప్రయోజనం ఉంది

రాజుని లేదా అధికారంలో ఉన్నవాడిని ఎల్లవేళలా ఉత్సాహంగా
ఉల్లాసంగా ఉంచడం ఒక ప్రయోజనం నిర్ణయాలు తీసుకోవలసిన వ్యక్తి ఉల్లాసంగా
ఉంటే సమాజానికి పనికివచ్చే మంచి నిర్ణయాలను త్వర త్వరగా ఉత్సాహంగా తీసు
కుంటాడు. అమలు జరిపిస్తాడు ఇది కాక మరో ప్రయోజనాన్ని సూచించింది శ్రీ
విష్ణుపురాణం.

పృధు మహారాజు అప్పుడే జన్మించాడు అతణ్ణి స్తుతించండి అని మునులు
సూత మాగధుల్ని అడుగుతారు ఇప్పుడే పుట్టాడు ఇతని గుణగణాలు ఏమిటో

తెలియవు ఏమని స్తుతించేది అని సూతమాగధులు విస్తుపోతారు సద్గుణాలు ఉన్నా యని స్తుతించండి అంటారు మునులు "సద్గుణాలవల్ల ప్రశంస కలుగుతుంది. నేను సద్గుణాలను అలవరుచుకోవాలి ఏ గుణాలు ఉన్నాయని వర్ణిస్తారో వాటిని నేను అలవరచుకొని శ్రద్ధగా ఆచరిస్తాను ఏ దుర్గుణాలను విడిచిపెట్టాలని మీరు సూచిస్తారో వాటిని విడిచి పెడతాను"- అంటాడు పృథుమహారాజు (శ్రీ విష్ణు పురాణం అంశం- అధ్యాయం - 3 శ్రీ యేలూరిపాటి అనంతరామయ్యగారి అను వాదం)

ఎంత దుష్టుడైనా పొగడగా పొగడగా ఒక మంచిగుణాన్ని అలవరుచు కుంటాడు ఈ దుర్గుణాలు లేవు ఈ దుర్గుణాలు లేవు అని ఊదరకొడుతుంటే ఏదో ఒకనాటికి ఏదో ఒక దుర్గుణాన్నయినా వదులు కుంటాడు ఆ మేరకు లోకానికి మేలు జరుగుతుంది స్తోత్రాలకు ఇదే పరమ ప్రయోజనం అనిపిస్తుంది సరే- కథలోకి వద్దాం

మగ మహారాజు అందునా వసురాజు-మాని "మజ్జా" అనే సరికల్లా ప్రత్యక్ష మయ్యేటప్పటికి గిరిక మంజువాణి ఆమె చెలికత్తెలూ మొత్తం ఆడంగులంతా కళవళపడిపోయి ఉంటారు ఆ సంభ్రమాన్ని శబ్దాలంకారంతో సూచిస్తూ వసురాజుని వర్ణిస్తున్నాడు-

తలిరు బ్రాయమువాని, వలరాజు నలరాజు
నలరాజు దెగడు సోయగమువాని
బసిడి చాయలవాని , బగడంబు జగడంబు
జగడంబు గల మోవి సొగసువాని
దళుకు జెక్కులవాని, దులకింపు పలుకెంపు
పలు కెంపు లొలయు నవ్వులుకువాని ,
జికిలి చూపులవాని, సిరి మించు దొర- యించు
దొరయించు కాంచనాంబరమువాని,
సొబగు గలవాని ,మకుట కేయూరహార
కటక కుండల చారుచక్రములవాని,
నమ్మహీజాని గని లేచి- యమిత వినయ
సంభ్రమము దోప నిలిచి రబ్జాతముఖులు (3-48)

చిగురాకు వయస్సులో ఉన్నవాడు (తలిరు యొక్క ప్రాయము నవయౌ వనమని) మన్మథుణ్ణి (వలరాజున్) నలచక్రవర్తినీ (నలరాజున్) అల చంద్రుణ్ణీ (అల-రాజున్) తిరస్కరించే (తెగడునట్టి) సోయగం కల వాడు

బంగారపు రంగులు వెదజల్లుతున్న శరీరం కలవాడు పగడానికి ఉన్న గొప్ప కాంతితో (జగ-డంబు) జగడం ఆడగల మోవి సొగసు కల వాడు

తళుకు చెక్కిళ్ళవాడు తుళ్ళిపడుతున్న (తులకిస్తున్న) మిక్కిలి ఎర్ర దనంతో కూడిన (పలు-కెంపు = ఎరుపు) అనేక వైడూర్యాలను (పలు- కెంపులు) ఒలికించే

లేదా గుర్తుకి తెచ్చే (ఒలయు) నవ్వులు ఒలుకు తున్నవాడు తళుకు చెక్కులవల్ల నవ్వులుకూడా కెంపులు ఒలుకు తున్నాయని లేదంటే ఏ తాంబూలసేవనమో కారణం కావచ్చు

చురుకైన వాడి చూపులవాడు (చికిలి చూపులు) సిరి అనే మించుకి (మెరు పుతీగకి) దొర-సిరిమించు దొర. అంటే విష్ణుమూర్తి ఆ దొరకి అందం (ఇంచున్) కలిగించే (దొరయించునట్టి) కాంచనాంబ రాన్ని (బంగారు వస్త్రాన్ని-పట్టు పీతాంబ రాన్ని)ధరించినవాడు

సౌందర్యం కలవాడు (ఒలపు=సౌందర్యం) కిరీటం భుజకీర్తులు(కేయూ రాలు) హారాలు, కంకణాలు (కటకాలు) కుండలాలు- వీటి తళతళలు కలవాడు (చకచక-చాకచక్యములు).

వానిన్ వానిన్ అంటూ వీటినన్నింటినీ ద్వితీయా విభక్తులుగా వేసి వేసి అనుప్రాస కుదిరేట్టు ''అమ్మహీజానిన్ ' అన్నాడు మహి అంటే భూమి మహియే జాయగా (భార్యగా) కలవాడు మహీజాని=రాజు ఆ మహీజానిని చూసి ఆ పద్మ ముఖులు అందరూ (అప్=నీరు అబ్జాతం= పద్మం) రక్కున లేచి నిలబడ్డారు రాజు కదా అని అమిత వినయం హఠాత్తుగా వచ్చాడని అమిత సంభ్రమం- అమిత వినయ సంభ్రమాలు ప్రస్ఫుట మవుతూ ఉండగా (శోపన్)ఆ వనితలందరూ ఒక్కసారిగా లేచి నిలబడ్డారు

''చింతిత కళ్యాణ సమృద్ధిరస్తు'' అని మాయా మౌని సాభిప్రా యంగా వసురాజుని దీవించాడు అబ్జాతముఖులు సంభ్రమంనుంచి తేరుకుని ఒక బంగారు పీట (జాంబూనద పీఠి) చూపించగా వసురాజు అలంకరించాడు పద్మం మీద అలరారుతున్న హంసలాగా ఉన్నాడు (నారీ జనార్పిత జాంబూనద పీఠి దొల్చె జలజ ప్రేంఖన్మరాళం బనన్)- (3-47)

తరువాత గిరికా వసురాజుల చూపులు కలవడం, మనస్సులు కలవడం చెలికత్తెలు ఏడిపించడం రమణీయంగా సాగిపోతాయి

ఎవరో తాపసులు వచ్చారుట నిన్ను ఆశీర్వదించడానికి మీ అమ్మగారు (శుక్తిమతి) నిన్ను రమ్మన్నారు- అని ఒక కలహంసి వచ్చి చెబు తుంది గిరికాదేవి వెళ్ళ లేక వెళ్ళలేక వెడుతుంది ఇంక విప్రలంభశృంగారం

కావ్యాలంకార సంగ్రహంలో తృతీయాశ్వాసం రసప్రకరణం వసుచరిత్రలో ఈ మూడో ఆశ్వాసం దానికి ఉదాహరణం అది లక్షణం- ఇది లక్ష్యం అన్నట్టుగా రాసాడా అనిపిస్తుంది

మొత్తంమీద వసుచరిత్ర ఒక ప్రౌఢ శృంగార కావ్యం దీని పద్య నిర్మాణ సౌందర్యం ఎంతమందిని ప్రభావితుల్ని చేసిందో చెప్పలేం పిల్ల వసుచరిత్రలు ఎన్నో వచ్చాయి నేటికీ పద్యకవులకు వసుచరిత్ర పద్యాలు ఒజ్జబంతులు ఇతిహాస కావ్యశైలి రాను రాను ప్రబంధ పద్య శైలిగా మారిన వైనం అటు పాండురంగ మాహాత్మ్యం లోనూ ఇటు వసుచరిత్ర లోనూ స్పష్ట పడుతుంది

పొన్నెగంటి తెలగన్న (క్రీ.శ. 1520-1600)

యయాతి చరిత్రము (ప్రథమాశ్వాసము)

మెదక్ జిల్లాలో ఉన్న పొటం చెరువు లేదా పొట్లచెరువు అనే గ్రామం పొన్నెగంటి తెలగన్న నివాసం. ఇతని మేలిమి రచన యయాతి చరిత్ర ఇది అచ్చ తెనుగు కావ్యం ఈ కావ్యశాఖలో ఇదే మొట్టమొదటిది ఇదే నేటికీ అగ్రగణ్యంకూడా సాధారణంగా ఒక శాఖకు మార్గదర్శకంగా శ్రీకారం చుడుతూ వెలువడిన కావ్యానికి చారిత్రిక ప్రాధాన్యం మాత్రమే ఉంటుంది ఆ శాఖలో తదనంతరకాలంలో వెలువడిన కావ్యాలు గుణ పరిణతితో అలరారి అగ్రస్థానం ఆక్రమిస్తాయి. కానీ తెలుగు సాహిత్యంలో చాలా కావ్యశాఖలలో మొదట వెలువడినదే నేటికీ గుణాత్మకంగా అగ్ర స్థానంలో ఉండటం విశేషం

ఈ యయాతి చరిత్రను అమీన్‌ఖాన్‌కి అంకితం చేసాడు తెలగన్న గోల్కొండ సామ్రాజ్యాన్ని పరిపాలించిన ఇబ్రహీం కుతుబ్‌షా(మల్కిభరామ్) దగ్గర ఒక అమీన్‌గా ఉన్న వ్యక్తి ఈ అమీన్‌ఖాన్ అంటే తెలగన్న కాలం క్రీ శ. 520 ప్రాంతం.

తెలుగు+ అన్న తెలుగన్న అనేది అసలు పేరనీ అది వాడుకలో తెలగన్నగా మారిపోయిందనీ కొందరు విమర్శకులు భావించారు (శ్రీ ఎం రంగకృష్ణమాచార్యులు)

ఆంధ్రభాషలో పదాలను సంస్కృత సమాలు ప్రాకృత సమాలు, సంస్కృత భవాలు, ప్రాకృత భవాలు దేశ్యాలు, అన్యదేశ్యాలు అని ఆరు రకాలుగా విభజించారు

కావ్యభాషకు సంబంధించి గ్రామ్య విభాగం మరొకటి ఉంది. పై ఆరింటిలోనూ దేనినైనా వ్యాకరణ విరుద్ధంగా ప్రయోగిస్తే అది గ్రామ్యం అవుతుంది

కృదంత తద్ధితాంత, సమాస రూపంగా ఉంటే సంస్కృత ప్రాతి పదికలకు తెలుగు విభక్తులు చేర్చి ప్రయోగించుకుంటే అవి సంస్కృత సమాలు రాముడు (రామ) పటుత్వము (పటుత్వ) సీతారాములు మొదలయినవి ఉదాహరణలు

సంస్కృతంలోంచి ప్రాకృతంలోకి వచ్చిగానీ లేదా ప్రాకృతంలోనే సహజంగా ఉండిగానీ ప్రాతిపదికలు తెలుగు విభక్తులతో తెలుగులోకి వస్తే అవి ప్రాకృత సమాలు అగ్గి(అగ్నిః అగ్గి) ఝులఝులి (ప్రాకృతదేశ్యం) మొదలైనవి అటువంటివి

అంటే వీటిలో ప్రాతిపదికకు మార్పు ఉండదు అక్షరాలు యథా తథంగా ఉంటాయి. ఎటొచ్చీ చివర తెలుగు విభక్తి చేరుతుంది అంతే అందుకే వీటికి 'సమాలు' తత్సమాలు అని పేరు

ఇలాకాక సంస్కృత ప్రాతిపదికలు గానీ ప్రాకృత ప్రాతిపదికలు గానీ కొన్ని అక్షరాల మార్పులతో తెలుగులోకి వచ్చి తెలుగు విభక్తుల్ని పొందితే అవి భవాలు- తద్భవాలు ఆకసము(ఆకాశః) అచ్చెరువు (ఆశ్చర్యమ్- అచ్చేరో) మొదలైనవి ఉదాహరణలు

తెలుగులో స్వతస్సిద్ధంగా ఉండే పదాలు దేశ్యాలు. వాడు, వీడు, ఒకటి

రెండు చేయుట చూచుట, ఇలాంటి వన్నీను. వీటికి తమిళ కన్నడాది ద్రావిడ భాషలతో సంబంధం ఉంటుంది

హిందీ ఉర్దూ ఇంగ్లీషు మొదలైన భాషల్లోంచి అవసరం కొద్దీ తెలుగులోకి తెచ్చుకున్న పదాలు అన్యదేశ్యాలు వీటికి కూడా తెలుగు విభక్తులు చేర్చి తెలుగు వేషం వెయ్యడం ఉంది

సంస్కృత సమాలు తప్ప తక్కిన ప్రాకృత సమ సంస్కృత భవ ప్రాకృత భవ దేశ్య పదజాలంతో కూడిన భాషను అచ్చ తెనుగు లేక ఆచ్చిక భాష అంటారు అన్య దేశ్యాలను కూడా ఇందులోకి చేర్చుకోవచ్చు సంస్కృ త సమాలతో కలిపి మొత్తం మనది ఆంధ్రభాష

సంస్కృత సమపదం ఒక్కటి కూడా రాకుండా పద్యాన్ని రచించడం కొంచెం కష్టమైన పనే ఆంధ్రభాషలో వందల పద్యాలతో (కబ్బం) రాస్తూ మధ్యలో ఎక్కడయినా ఒకటి అచ్చ తెనుగు పద్యం (పద్దెం) రాస్తే అది పాఠకుడికీ శ్రోతకీ పెద్ద విశ్రాంతిగా ఉంటుంది వైవిధ్యం వల్ల మనస్సుకి ఉల్లాసం కలుగుతుంది మాటిమాటికీ దాన్నే పేర్కొంటూ సహృదయుడు సంబరపడిపోతూ ఉంటాడు రెండర్థాల పద్యం ఒకటి తగిలితే ఎంత సంబరపడతాడో, అంతగానూ దీనికీ సంబరపడతాడు అటువంటిది మొత్తం పుస్తకమంతా (పొత్తం) అచ్చతెనుగులోనే పలికితే (నొడువన్) ఇంకెంత సంబరపడతాడు దాని చందం తెలిసినవాడు ఎంతగా ఆశ్చర్యపోతాడు శ్రమను గుర్తించి ఎంతగా కొనియాడతాడు ఊహించలేం ఈ అభిప్రాయంతోనే తెలగన్న ఈ తెనుగు కావ్యం రచించానన్నాడు అచ్చ తెనుంగు పద్దె మొకటైనను గబ్బములోన నుండినన్

హెచ్చని యాడుచుండు రది యొన్నుచు, పేర్చున బొత్త మెల్ల ని
ట్లచ్చ తెనుంగున్న న్నొడువ నందుల చంద మెఱుంగువారు నిన్
మెచ్చరొ యబ్బురం బనరొ మేలనరో కొనియాడరో నినున్ (- ౨)

అయితే ఎక్కడయినా ఒకటి ఇలాంటి పద్యం తగిలితే పాఠకుడు సంతోషిస్తాడు తప్ప అదొక నియమంగా పెట్టేసుకుని కావ్యమంతా రచిస్తే శ్రమకు ఆశ్చర్యపోతాడే కానీ ఆనందం పొందడు

రాస్తూ పింగళి సూరన ద్వ్యర్థికావ్యాన్ని తెలుగులో మొట్టమొదటిసారిగా కూడా (రాఘవ పాండవీయము) ఇలాగే భావించాడు

పరిచయంలో లేని అచ్చతెనుగు పదాలు అవసరమవుతాయి భావ ప్రకటనకు చాలిన తెలుగు పదం లేనప్పుడు దొరకనప్పుడు సంస్కృత పదాన్ని తెలుగుచేసి ఉపయోగిస్తాడు దానితో కృతకంగా తయారవుతుంది పెరసి అచ్చతెనుగుకావ్యంలో ప్రసన్నత కరువై పాఠకుడికి దూరమవుతుంది అనేకార్థక కావ్యాలకూ ఇదే గతి కాకపోతే అది ఆశ్చర్యకరమైన ప్రక్రియగా మన్నన పొందుతుంది భాషా సంపదతో పాటు భాషా సృజనశక్తి బయటపడుతుంది

అమీన్‌ఖాన్ కొలువులో అప్పటికే స్థిరపడిన పండిత కవి మరింగంటి అప్పన్న గారు ఆయన ప్రోత్సహించి ఈ అచ్చతెనుగు కావ్యాన్ని అమీన్‌ఖాన్‌కి అంకితం చేయించాడు ఆ సందర్భంగా ఆయన మాట్లాడు తూ- ఇంతకుముందు ఎవ్వరూ రచించని పద్ధతినిస్వీకరించి(తెన్ను=దారి -తెన్నిడి) అచ్చ తెనుగుకబ్బం(కావ్యం) నువ్వు రాస్తున్నావు నిన్ను పొగడాలంటే చంద్రశేఖరుడైన (నెలతాల్పు- నెల=చంద్రరేఖ) పరమేశ్వరుడి కయినా సాధ్యమా- అన్నాడు

మున్నెవ్వరు నొడువని యీ
తెన్నిడి కడుమీఱి యచ్చ తెనుగుంగబ్బం
బెన్నిక మీఱగ జెప్పిన
నిన్నుం బొగడంగ గలడె నెలతాల్పయినన్ (1-1)

ఈ మాటవల్ల యయాతి చరిత్రమే మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యం అనే అంశం స్థిరపడుతోంది దీని రచనకు తెలగన్న ఒక నియమం పెట్టుకున్నాడు కథలో పాత్రలూ పట్టణాలూ మొదలైనవాటి పేరుల్ని (సంజ్ఞావాచకాలను) తెనుగు చెయ్యను మారుపేరులు పెట్టకుండా వాటిని యథాతథంగా- సంస్కృతాలైనా సరే ఉపయోగించుకుంటాను మిగతా అంతా అచ్చతెనుగులోనే చెబుతాను అన్నాడు

తెనుగునను మాఱు పేళ్లిడి
పెనిచిన వినగూడ దనుచు బిరుదులు పేళ్లన్
మును వేల్పుబాస వెంబడి
నునిచెద గా దనకుడయ్య యుల్లములందున్ (- 4)

సంజ్ఞావాచకాలను ఉచ్చరించడం స్మరించడం పుణ్య ప్రదమని మనవాళ్ల నమ్మకం అంచేత వాటిని తర్జుమా చేస్తే వినకూడదు కాబట్టి వాటిని వేల్పుబాసలోనే (దేవతల భాష=సంస్కృతం) ఉంచుతాను దయ చేసి కాదనకండి స్వామీ- అని పాఠక వరుల్ని అభ్యర్థించాడు తెలగన్న అందులో గడుసుదనం ఉంది పేర్లని కూడా తర్జుమా చేస్తే కృతకత్వం భీకరంగా తయారవుతుంది యయాతి శర్మిష్ఠ దేవయాని శుక్రాచార్యుడు ప్రతిష్ఠాన పట్టణం, లాంటి పేర్లు తెనుగు చెయ్యాలంటే డొంగవు చరిత్రలోకి వెళ్లి ఫలానావారి బిడ్డ అనో, ఫలనా ఘనకార్యం చేసినవాడు అనో తంటాలుపడి తెనుగు చెయ్యాలి ఒక్కొక్కప్పడు అ తెన్నుసేత ఛందస్సులోకి ఇమడకపోవచ్చు ఈ నియమంవల్ల అటు కవీ, ఇటు పాఠకులూ సగం తెరిపిన పడ్డారు

సీత అనడానికి పంట చెలి పట్టి అన్నాడు ఒక కవి పంటలకు చెలి భూదేవి భూదేవికి బిడ్డ సీతాదేవి అని '' ఏనికతోలు దుప్పటము తాల్చు దొర'' అంటే శివుడు గజచర్మాన్ని వస్త్రంలా ధరించే స్వామి అని ''గజ చర్మధారి'' అనే సంస్కృత సమాసానికి ఇది అచ్చీకీకరణం ఇది కృతకత్వానికి పరాకాష్ఠ పాఠకుల పాట్లు వర్ణనాతీతం ఈ అవస్థ నుంచి తప్పించాడు గడసరి తెలగన్న

సాంప్రదాయికుడైన కవి తన మహాకావ్యాన్ని ఒక మహమ్మదీయుడికి

(ప్రభువు కనక) అంకితం చెయ్యడం అతన్ని విష్ణుమూర్తి అంశగా భావించడం, హైందవ దేవతలు రక్షింతురు గాక అని ఆశీర్వదించడం వంశచరిత్రనూ గుణగణాలనూ గొప్పగా వర్ణించడం అతడి అంతఃపుర కాంతలను హైందవ స్త్రీ దేవతామూర్తులతో పోల్చడం ఇవన్నీ నేటి వాతా వరణంలో ఆదర్శప్రాయంగా కనిపిస్తాయి మహమ్మదీయులు చేసిన సాహిత్యపోషణకు నిదర్శనంగానూ (స్థానిక ప్రజల మెప్పూ అండదండలూ కావాలి కనక!) నిలుస్తాయి

కావ్యాన్ని శ్రీకారంతో ప్రారంభించాలనీ అది కృతికర్తకూ కృతిభర్తకూ పాఠకులకూ మేలు చేకూరుస్తుందనీ ప్రాచీనుల నమ్మకం కావ్యంలో ఏవైనా దోషాలు చోటుచేసుకుంటే ఆ కీడు పోతుందని విశ్వాసం మంత్ర శాస్త్రంలో శ్రీ కారానిది అగ్రపీఠం అయితే అది సంస్కృత పదం అందుకని సిరితో (శ్రీ-సిరి తద్భవం) తన అచ్చతెనుగు కావ్యానికి శ్రీకారం చుట్టాడు తెలగన్న (శకార రకార ఈ కారాల సంపుటి-త్రిపుటి)

ఇందులో భావం చమత్కారంగా ఉంటుంది విష్ణుమూర్తి తన నాలుగు చేతులతోనూ (చతుర్భుజుడు కదా) లక్ష్మీదేవి చెక్కిళ్లనూ వక్షోజాలనూ (సిబ్బెపు గబ్బి గుబ్బలు) పట్టుకున్నాడట ఆయన బొడ్డు నుంచి పైకి వెళ్లిన కమలం మీద బ్రహ్మ ఉన్నాడు తండ్రి చతుర్భుజుడైతే తనయుడు చతుర్వదనుడు (నాలుగు వాయి+లు= నోరులు కలవాడు నలువ-నల్వ) నాలుగు వైపులకీ ఈయనగారి చూపులు ఎల్లవేళలా ప్రసరిస్తూనే ఉంటాయి ఎక్కడ ఏం జరుగుతోందో కనపడుతూనే ఉంటుంది అదీ ఇబ్బంది లక్ష్మీదేవి ఈ విషయాన్ని గమనించింది విష్ణుమూర్తిగారి శృంగార చేష్టలను వారించ లేకపోయింది వారించడం ఇష్టం లేకపోయిందేమో కూడా అందువల్ల ఉపాయంగా తన హస్త పద్మంతో (కేలు దామరన్) స్వామివారి కుడి కన్ను మూసేసిందట

ఏమిటి ఇందులో చమత్కారం అంటే-సూర్య చంద్రులు విష్ణు మూర్తికి కుడి ఎడమ కళ్ళు కుడి కన్నుని మూసేస్తే సూర్యుడు అస్తమించినట్టు సూర్యుడు అస్తమిస్తే, కమలాలు (పద్మాలు) ముకుళించుకుపోతే అందులో ఉన్న బ్రహ్మదేవుడు మునిగిపోతాడు ఇంటిలో పెట్టి తలుపులన్నీ వేసేసినట్టే ఇక తనకూ తన భర్తకూ ఏకాంతం శృంగార చేష్టలకు నిరాటంకం ఇది లక్ష్మీదేవి అభిప్రాయం

దీన్ని విష్ణుడు (వెన్నుడు) గమనించి తేలికగా హాయిగా తెరలు తెరలుగా నవ్వాడుట మాటికిన్ నవ్వెడు వెన్నుడు అన్నాడు కవి కుడి కన్ను మొయ్యడంవరకూ సిరుల మెరుంగు బోడి (లక్ష్మీదేవి) కర్త నాల్గు చేతులతో పట్టడంలోనూ నవ్వడంలోనూ విష్ణువు కర్త అలా నవ్వే విష్ణుమూర్తి - నవ్వు రాజిల్లెడు మోమువాడు ఇంపుతో చెలరేగి అమీన్‌ఖానుని స్థిరంగా ప్రోచు గావుతన్ అని ఆశీర్వచనం

సిరుల మెఱుంగుబోడి తన చెక్కులు సిబ్బెపు గబ్బి గుబ్బలున్
ఇరువది నాల్గు చేతులను బట్టగ , నవ్వ దలంచి కేలుదా

మర గుడి కన్ను మూయుటకు మాటికి నవ్వెడు వెన్న డింపుతో
బిరముగ బ్రోచు గావుత మదిం జెలరేగి యమీనుఖానునిన్ I-I

తెలుగు ప్రబంధాలలో కథ సాధారణంగా పురవర్ణనతో ప్రారంభ మవు తుంది. కావ్యాన్ని ఎవరికి అంకితం చేస్తున్నాడో వారికిన్ వారికిన్ అంటూ షష్ఠ్యంతాలు రచించి ఏవంవిధ గుణ విశిష్టునికి అభ్యుదయ పరం పరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన మహాకావ్యంబునందు కథా ప్రారంభం బెట్టిదనిన అంటూ పురవర్ణన అందుకుంటాడు ఆ పురంలో నాయకుడు ఉన్నాడని అతడిని వర్ణిస్తాడు. అలా కథ సాగుతుంది. తెలగన్న ఇదే పద్ధతిని అనుసరించాడు

అమీన్‌ఖానునకున్ సిరులుం కడునమరు కొమరులుం గలిగి (కుమారు లు-కొమరులు) మనునట్లుగా నా యొనర్పం బూనిన అబ్బు రంబగు ఇబ్బలు కబ్బంబు నకున్ ప్రావయగు త్రోవ ఎట్టిదనిన .(-74) అని ప్రతిష్ఠాన పురవర్ణన (యయాతి రాజధాని) ఆరంభించాడు.

ఈ మహాకావ్యం అనడానికి ఈ ''బలు కబ్బము'' అన్నాడు దానికి యోగ్య మైన లేదా అర్హమైన (ప్రావ అగునట్టి) త్రోవ కథాక్రమం ఎటువంటిదంటే-

తగ గోట దాచిన మగమానికంబుల
 తెలిరంగు లెపుడు వెన్నెలలు గాయ
మేడలపై నాడు మెలతలు దెఱగంటి
 కొమ్మలు నే ప్రొద్దు గూడి తిరుగ
జిలువ చామ లగడ్త వలి నీటిపై దేలి
 యొలిమతో నవయుంబు నోలలాడ
మేలిమి బంగారు మేని పచ్చల డాలు
 మిసిమి మింటికి నెల్ల బసిమి యొసగ
ఐదల రాసిన కొమ్మల చాలు కతన
మీద రారాక యల ప్రొద్దు మెఱుగు దేఱు
గవనులవె రాక పోకలుగా మెలంగ
దనరు బుడమి బ్రతిష్ఠాన మనగ వీడు I-75

ఆ పట్టణంలో రాజుగారి కోట ఉంది ఆ కోటగోడలకి మగమాణిక్యాలు-శ్రేష్ఠమైన మణులు (రత్నాలు) తాపించి ఉన్నాయి. వాటి తెలిరంగు లు ఎల్లవేళలా (ఎపుడున్) వెన్నెలలు కాస్తున్నాయి రత్నకాంతులు కనక వేడి ఉండదు శుక్లపక్షం, కృష్ణపక్షం అనే విభాగం ఉండదు ఎల్లవేళలా వెన్నెలలాంటి వెలుగుల్ని విరజిమ్ము తున్నాయి. సంపన్నత వ్యంగ్యం.

మేడల మీద ఆడుకునే మెలతలు (స్త్రీలు) ఉన్నారు. వారికి తెరగంటి కొమ్మల తో స్నేహం కొమ్మ అన్నా స్త్రీ అనే. తెరకన్నులు కల కొమ్మలు కన్నులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి రెప్ప వెయ్యడమనేది ఉండదు. అనిమేషాంగనలు అన్నమాట అంటే

దేవకాంతలు .అప్సరసలు ఈ మెలతలూ ఆ కొమ్మలూ ప్రతిష్ఠాన పట్టణంలో మేడల మీద ఎప్పుడు చూసినా కలిసి తిరుగుతూ ఉంటారుట. భవనాల ఎత్తు , కాంతల సౌందర్యం, సంపన్నత ఇవి వ్యంగ్యం.

కోటచుట్టూ అగడ్త ఉంది పరిఖ అంటారు. పాతాళం నుంచి నాగకన్యలు (చిలువ=పాము చామలు=స్త్రీలు)వచ్చి ఆ అగడ్తలో ఉన్న వలి నీళ్లల్లో తేలి అందంగా (ఒలిమతో) ఎల్లవేళలా (అనయంబున్) ఓలలాడు తూ ఉంటారుట. అగడ్తలు పాతాళ మంత లోతు ఉన్నాయని వ్యంగ్యం.

కోట శిఖరాన్ని మేలిమి బంగారంతో తాపితం చేసారు దాని ఒంటినిండా గరుడపచ్చలు (ఒకరకం మణులు) పొదిగారు ఈ రెండింటి కాంతుల తళతళలూ (డాలు మిసిమి) ఆకాశమంతటికీ పసిమిరంగు కలిగిస్తున్నాయిట.

కోటకి శిఖరాలు(కొమ్మలు=బురుజులు) చాలా ఉన్నాయి. (చాలు= శ్రేణి) అవ్వి చదలుతో ఒరుసుకుంటున్నాయి. (చదలన్= ఆకాశ మును, రాసిన= ఒరిసిన) అది కారణంగా సూర్యుడు ఆకాశంలోకి ఎక్కి రాలేకపోయాడుట. అతడి రథాశ్వాలకు ఈ బురుజులు అడ్డం వచ్చాయి. అందుకని కోటకి ఉన్న సింహద్వారాలలోనుంచే రాక పోకలుగా మెలగు తున్నాడుట. (మెరుగుదేరు=ప్రకాశించు, గవనులు= సింహ ద్వారాలు, పురద్వారాలు)

ఇలాగ ఈ పుడమి మీద (పృథివి=పుడమి=భూమి) ప్రతిష్ఠానము అనే పేరుతో ఒక వీడు (పట్టణం) తనరుతోంది. కవి కావ్య కథాకాలంలోకి వెళ్ళి చెప్పడం ఆనవాయితి కదా

సూర్యుడి అవస్థ చెప్పాడు. ఇక ఇప్పుడు చంద్రుడి పరిస్థితి చెబు తున్నాడు.

పాడవగు బంగరు మేడల
గడు వేడుకనాడు పడతుకల మొగములతో
దడబడుదు నంచు రేలం
గడకడ జను జందురుండు కందుచు నచటన్ (1-70)

పాడవైన బంగారు మేడలమీద రాత్రిపూట వెన్నెలలో ఆడుకుంటున్నారు పడతుకలు పురకాంతలూ, అంతఃపుర కాంతలూ, అప్సరః కాంతలూ కూడాను ఆ పడతుకల ముఖాలలో కలసిపోయి తడబడిపోతానేమోననిట చందురుడు కడకడగా తప్పించుకుని సాగిపోతున్నాడుట అది కూడా కందుచున్ నాకన్నా వీళ్ళ ముఖాలే అందంగా ఉన్నాయని కించ పడుతూ నడుస్తున్నాడని. (కందు=దోషం మచ్చ చిహ్నం, కందుట=అవ మానభారంతో దుఃఖించడం, దిగులు పడటం) పురకాంతల ముఖ సౌంద ర్యం, వెన్నెల రాత్రుల్ని నిత్యోత్సవంగా జరుపుకునే కళాభిరుచి, సౌభాగ్యం, కోట కొమ్మలే కాదు ఆ పట్టణంలో ఉన్న భవనాలు అన్నీ అత్యున్నతాలే అతి సంపన్నాలే అనీ- ఇవన్నీ వ్యంగ్యాలు.

కోటకొమ్మల ఎత్తుని సూచించడానికి మరో కల్పన చేస్తున్నాడు కవి. అవి

స్వర్గలోకమంత ఎత్తు ఉన్నాయిట వాటి మీద తెల్లని మాణిక్యాలు పై కప్పలుగా తాపడం చేసారుట రత్నమాణిక్యాలు చప్టాలుగా (చప్పరాలుగా) పొదిగారన్నమాట ఇదీ పరిస్థితి-

కనదగు తెల్ల మానికపు గప్పల నొప్పెడు చప్పరాలలో
దన పొడ పైన నీడ గని తాళక యేను గటంచు గొమ్ములం
జెనక గ వచ్చి, కోటపయి జేసిన ముత్తె పు సింగపుంగమిం
గనుగొని పాఱు వేల్పు దొరగా రత డౌదల మస్తరింపంగన్ -77

కనపడుతున్న తెల్ల మాణిక్యాల కప్పలతో (కప్పు=పైకప్పు) ఒప్పుతున్న చప్పరాలలో ఇంద్రుడి ఐరావతం తన పొడపైన నీడని (ప్రతిబింబాన్ని) చూసుకుందిట ప్రతిబింబం పొడువుగా పెద్దదిగా కనపడింది అంటే ఆ మణికుట్టిమాలు ఐరావతానికి అంత దగ్గరగా ఉన్నాయన్నమాట

ఆ ప్రతిబింబాన్ని చూసి అది మరొక ఏనుగు అనుకుందిట తాళలేకపోయింది ఏనుగుకి మరో ఏనుగు కనబడితే సహించదు కోరలతో ఢీ కొంటుంది అలాగే ఐరావతం కూడా కొమ్ములతో చెనకడానికి వచ్చింది అయితే ఆ కోటమీద (మధ్య శిఖరం) ముత్యాలు పొదిగిన సింహంప్రతిమలు (బొమ్మలు) వరుసగా చాలా ఉన్నాయి సింహాల గమిని (సమూహాన్ని) తయారు చేసి కోట మీద నిక్షేపించారు రాజుగారి నివాసం కదా అందుకని --సింహం బొమ్మలు పెట్టారు

ఆ సింగపు బొమ్మలను చూసి వేల్పుదొరగారు (ఏనుగు) భయపడి పారిపోతోంది (వేల్పుదొర=దేవేంద్రుడు) ఆయనగారు దాన్ని కుంభస్థలం మీద (ఔదలన్) మర్దిస్తూ (మస్తరించు) తన అమరావతి వైపు మళ్ళించుకోవడానికి తంటాలు పడుతున్నాడు

ప్రతిష్ఠాన పట్టణంలో పలు అంతస్తులమేడలున్నాయి అవికూడా స్వర్గలోకమంత ఎత్తు ఉన్నాయి ప్రతిసౌధం మీదా స్వర్ణకలశాలు (బంగారుకుండలు) తాపడం చేసి ఉన్నాయి తార్కొన్నాయి అవి ఆకాశ గంగా నదిలోకి చొచ్చుకుపోయాయి. దీని మీద ఒక కల్పన-

తళుకుల్ గుల్కెడు నందు మేడలతుదన్ దార్కొన్న బంగారుకుం
డలు మిన్నేటను గానిపించుచును విన్నాణంపు దెళ్వం గడున్
విలసిల్లంగని పైడి తమ్ములనుచున్ వేల్పుంబువుంబోండ్లు చే
తుల దేరంజన జాది నవ్వుదురు అంతుల్లాగ జేజేదొల్. 1-78

తళుకులు తులుకుతూ ఆ పట్టణంలో మేడల తుదలలో దార్కొన్న మేడలతుదలలో దార్కొన్న బంగారు కుండలు ఆకాశగంగలో (మిన్ను+ ఏఱు= మిన్నేఱు నందున్- మిన్నేటన్) పాటమరించి పైకి కనిపిస్తున్నాయి విన్నాణమైన కాంతితో (తెలివిన్) విలసిల్లుతున్నాయి వాటిని చూసి అప్సరఃకాంతలు (వేల్పులైన పువ్వు బోడులు= దేవతా స్త్రీలు) పసిడి పద్మాలు(పసిడి-పైడి తమ్మి+ లు= తమ్ములు=పద్మాలు) అనుకున్నారు

అనుకుని చేతులతో తుంపి తీసుకు వద్దామని నీళ్ళల్లో దిగారుట (తేరన్ చనన్)
అది జేజే దొరలు (దేవతా పురుషులు) చూసారు చూసి పెద్దగా పగలబడి కలకల
ధ్వనులుగా (రంతుల్ గాగన్) నవ్వుతున్నారుట

నవ్వుదురు రంతుల్గాగ జేజేదొరల్ అనే ఈ చివరి ముక్క ''తల పక్షచ్ఛట
గ్రుక్కి-----నవ్వున్ శాలిగోప్యోఘముల్'' అనే రాయల వారి పద్యాన్ని గుర్తుచేస్తుంది
అక్కడ పురుషులు (ఆరెకులు) భ్రాంతి పడితే స్త్రీలు పరిహాసం చేసారు ఇక్కడ స్త్రీలు
భ్రాంతి పడితే పురుషులు పకాలున నవ్వారు మానవులకు భ్రాంతి సహజం దేవతలు
కూడా భ్రాంతి పడ్డారనడం విశేషం ఆ సువర్ణ కలశాలకీ పద్మకోశాలకీ అంతగా దగ్గరి
పోలికలు ఉన్నాయన్నమాట ఆకాశగంగలో బంగారు పద్మాలు ఉంటాయని కవి
సమయం

ఐరావతం భ్రాంతి పడింది దేవకాంతలు భ్రాంతి పడ్డారు ఇప్పుడు పక్షుల
భ్రాంతి వర్ణిస్తున్నాడు

దళముగ నందు గోటల తుదం దవిలించిన మించు పైడి వ్రా
తల కలి టెక్కెముల్ గని, యెద న్మెఱుగుల్గల మబ్బులంచు బం
పిలి, తగనాడ, నన్నెమలిపిండు గనుంగొని, చిన్కుగూటియ
ప్పులుగులు సంతసిల్లు గడుపుల్గడు నిండగ నాను గోర్కులన్. I -79

ఆ పట్టణంలో కోటల తుదలలో అంటే కోట బురుజుల పైని దగ్గర దగ్గరగా
(దళముగన్=దట్టముగా ఇదే సంస్కృత సమమైతే ఆకు అని గానీ సేన అని గానీ
అర్థం) నల్లజెండాలు(కలిటెక్కెముల్) వందల సంఖ్యలో తగిలించారుట ఆ జెండా
గుడ్డల మీద తళుకులీనే బంగారపు తీగలతో లతలో బొమ్మలో అక్షరాలో ఏవో లిఖించా
రుట అల్లిక పని చేసారని మించు పైడివ్రాతలతో ఉన్న ఆ నల్లజెండాల గుంపుని చూసి
నెమళ్ళు మెరుపులున్న మబ్బులు అనుకున్నాయిట తమ హృదయాల్లో(ఎదన్)
మెరుగులు గల మబ్బులు అని భావించి అతిశయించి(బంపిలి) తగిన రీతిలో పురులు
విప్పి ఆడటం మొదలు పెట్టాయిట

అలా ఆడుతున్న నెమలి పిండుని చూసి (పిండు=గుంపు) చాతక పక్షులు
సంతసించాయిట తొలకరి వాన కురుస్తుంది కడుపులుపూర్తిగా నిండేట్టు
తొలకరిచినుకుల్ని త్రాగవచ్చు అనే కోరికలతో సంతసిల్లాయిట

చాతకపక్షులు ఉన్నాయనీ అవి తొలకరి వానచినుకుల్ని మాత్రమే
ఆస్వాదిస్తాయనీ, ఆ చినుకులే వాటికి ఆహారమనీ వాటికోసం ఇంద్రుణ్ణి ప్రార్థిస్తూ
ఆకాశానికి కాళ్ళు తన్ని తలక్రిందుల జపం చేస్తూ ఉంటాయనీ- కవులు వర్ణిస్తూ
ఉంటారు అందుకే తెలగన్న వీటిని 'చిన్కు గూటి యప్పులుగులు'' అన్నాడు ఆ+
పులుగులు అంటే ఆ పక్షులు 'ఆ' అనేది ప్రసిద్ధిని తెలియజేస్తుంది చినుకు-చిన్కు
కూడుగా (ఆహారంగా) కలిగిన ఆ పులుగులు- చిన్కు కూటి ఆ పులుగులు

కోటకొమ్మలూ భవనాలూ అయ్యాక అగడిత (అగడ్త) వర్ణిస్తున్నాడు

ఎత్తులు అయ్యాక ఇక లోతులు

అగడితలో గెందామర
మొగడలు కనుపట్టి జాల మూకై చూడం
దగి మున్నీటం దేలుచు
బెగడని వార్వంపుటగ్గి పిల్లలు వోలెన్. 1-80

కోటచుట్టూ ఉన్న పరిఖలో (అగడితలో) ఎర్రతామర మొగ్గలు (కెందామర మొగ్గలు) చాలా ఉన్నాయి గుంపులు గుంపులుగా (మూక) కనిపిస్తున్నాయి అవి ఎలా ఉన్నాయంటే - సముద్రం అట్టడుగునుంచి (మున్నీరు=సముద్రం మున్నీటన్= సముద్రంలో) పైకి తేలివచ్చి ప్రజలు చూడడానికి తగినట్టుగా బెదరకండా (బెగడని) నిలబడ్డ బడబాగ్ని పిల్లల్లాగా ఉన్నాయిట

సముద్రం అట్టడుగున అగ్ని ఉంటుందిట అది ఆడగుర్రం (బడబా) ఆకారంలో ఉంటుందిట అందుకని దానికి బడబాగ్ని బాడబాగ్ని అని పేరు వారువము-వార్వము అన్నా గుర్రమనే అర్థం బడబాగ్నిని వార్వంపు+ అగ్గి-వార్వంపుటగ్గి అని తెనుగుచేసాడు ఔర్వవహ్ని అనికూడా దీన్నే అంటారు ప్రళయ కాలంలో ఈ అగ్ని వేడికి సముద్ర జలాలు ఆవిరై మహా మేఘాలు క్రమ్ముకుంటాయంటారు బడబాగ్ని కనక ఎర్రగా ఉంటుంది దాని పిల్లలు పైకివచ్చి నీటిలో తెలుతూ లోకాన్ని చూస్తున్నట్టూ జనసంచారానికి బెగడొందక అల్లాగే నిలబడినట్టూ కవి సంభావించాడు పిల్లలు కనక భయం తెలియదనీ ఎర్రకలువ మొగ్గలకు సాటి వస్తున్నాయనీ అద్భుతమైన ఉత్ప్రేక్ష ఇంక ఆ పట్టణంలో ఉన్న అందగత్తెలని చూపిస్తున్నాడు

మెఱసి - పోవక నిల్చి మెలఁతలై యొఱపుచే
 తిలకించు క్రొమ్మించు తీవె లనఁగ
గప్పారు తొంగలి ఱెప్ప లల్లార్చు క
 న్గవల నొప్పెడు వేల్పు టువిద లనఁగ
గడు నోయగంబుచే బుడమి పై నడయాట
 బొలుచు మేలిమి పైడి బొమ్మ లనఁగ
సింగార మమరంగ జికిలి చేయించిన
 వలరాచవాని పూవులుకు లనఁగ
నలువ తా జేయ గలిగిన పొలుపు గూర్చి
కరము జేతుల బట్టిన గందునంచు
దలచె గొమ్మలుగా నన నలరునట్టి
పువ్వుబోండ్లు తనర్తు రా ప్రోలిలోన 1-81

మెరసి వెంటనే మాయమైపోకండా నిలిచి మెలతలుగా (స్త్రీలు గా) మారి ఒఱపుతో తిలకిస్తున్న తొలకరి మెరుపు తీగలా అన్నట్టూ (ఒఱపు= సౌందర్యం, ఉపాయం, మించు=మెరుపు క్రొత్త మించు= క్రొమ్మించు=తొలకరి మెరుపు)

మిక్కిలి నల్లగా ఉన్న(కప్పు= నలుపు) తొంగలి రెప్పల్ని అల్లల్లాడిస్తున్న కనుగవతో (ఆడించు= ఆర్చు, అల్లార్చు) ఒప్పి ఉన్న దేవకాంతలా అన్నట్లు (వేల్పు+ ఉవిద =స్త్రీ వేల్పుటువిదలు=దేవకాంతలు అప్సరసలు) ఉన్నారు దేవకాంతలు అనిమేషలు రెప్పవెయ్యరు కానీ వీళ్ళు రెప్పలల్లార్చుతారు అదొక్కటే తేడా అని

మిక్కిలి ఒయ్యారంతో (సోయగము) భూమి మీద నడయాడుతూ ప్రకాశిస్తున్న(పొలుచు)మేలిమి బంగారు బొమ్మలా అన్నట్లు (బంగారు బొమ్మలు కదలవు కానీ వీళ్ళు నడయాడే బంగారు బొమ్మలు)

అందం (సింగారం) అతిశయించేట్లు తళతళలాడే పదును పెట్టించిన (చికిలిచేయించిన)మన్మథుడి పుష్పబాణాలా అన్నట్లు(వలరాజు వలరాచవాడు= మన్మథుడు ములికి=బాణం,పువ్వుములికి+లు,పూములుకులు=పుష్పబాణాలు)

ఆ పట్టణంలో వనితామణులు ఉన్నారు నాలుగు ఉత్ప్రేక్షలు అందించాడు అంతటి సొగసుగత్తెల్ని బ్రహ్మదేవుడు (నలువ) ఎలా సృష్టించగలిగి ఉంటాడో ఊహిస్తున్నాడు- ఎత్తు గీతిలో

తాను సృష్టించ గలిగిన సౌందర్యం సౌకుమార్యం అంతా ఒక చోటుకి చేర్చి రాశిపోసి చేతులతో గట్టిగా (కరమున్=మిక్కిలిగా) పట్టుకున్నట్టయితే అది కంది పోతుందని పట్టుకుని ఆకారాలు తయారుచెయ్యకుండా ఈ రాశి ఒక వనితగా (కొమ్మ) రూపొందుగాక అని మనస్సు లోనే సంకల్పిస్తే (తలచెన్) ఈ కొమ్మలు రూపొందారు అన్నట్టుగా అలరారు తున్న పువ్వుబోండ్లు ఆ పట్టణంలో(ప్రోలు=పట్టణం, ప్రోలిలోన్) తనరారు తున్నారు (తనర్తురు) ఊహకు కూడా అందని సౌందర్యం సౌకుమార్యం ఆ కాంతలకు ఉంది అని

రాజధానిని వర్ణించేటప్పుడు గుర్రాలనూ ఏనుగులనూ వర్ణించడం పరిపాటి వాటిని చెబుతున్నాడు ముందుగా గుర్రాలు-

ఇంచుక తేల వాగె గుదియించిన సంభ్రమము దాటుచుం, జుమా
యించిన నేల గ్రక్కదల నిట్టటుగా వడి ద్రొక్కుచున్, దువా
యించిన గట్లు గుట్టనక లెక్కకు మిక్కిలి దవ్వు వాలుచున్,
ఇంచిన వారువంబు లట మీఱుచు, ద్రిమ్మరు నెన్ని యేనియున్ 182
మించిన వారువంబు లట మీఱుచు, ద్రిమ్మరు నెన్ని యేనియున్

కొంచెంగా వాగెను (కళ్లెము) కుదిస్తే చాలు (బిగించితే చాలు) సముద్రాలు దాటేస్తాయి జుమాయిస్తే చాలు (హహ అని గదిమితే చాలు) నేల క్రక్కదిలి పోయేట్లు ఇట్టటుగా వేగంతో కదను త్రొక్కుతాయి దువాళిస్తే చాలు(కాళ్ళు పెట్టుకునే జీబులతో తాటిస్తే చాలు)గట్టుల్నీ గుట్టల్నీ లెక్కచెయ్య కుండా- కొలిచి లెక్కించడానికి వీలులేనంత దూరం పరిగెడతాయి అటు వంటి ఉత్తమజాతి అశ్వాలు (మించిన వారువంబులు) ఆ పట్టణంలో ఎన్నో అతిశయించి సంచరిస్తున్నాయి (ద్రిమ్మరున్)

మరింక ఏనుగుల మాట చెబుతున్నాడు

ఎనిమిది తావులం దొడరి యేపుగ నెప్పుడు నాము జాలగా
నెనయుచు గెంపు రేకలు పయింబొలుపొందగ నందు వేనుగుల్

తనరుచునుండు నాకసము దాకెడు నిక్కున జూప ఋబ్బురం
బున సెలయేళ్లతోడ నడయాడెడు జేగురు గొండలో యనన్ -83

మదగజాలకు శరీరంలో ఎనిమిది స్థానాలనుంచి మదం స్రవిస్తుందిట అలా ప్రవాహం కట్టి ఏపుగా ఎప్పుడూ మదం(ఆము) జారుతూ ఉండి. అది ఆరీ ఆరక ఎర్రచారలు (కెంపురేకలు) ఏర్పడుతున్నాయి మదం ఎరుపుకి దగ్గరగా ఉండే జేగురు రంగులో ఉంటుంది నల్లని శరీరం మీద ఈ జేగురు రంగు చారికలు పెడల్పుగానూ అధిక సంఖ్యలోనూ ఉండేసరికి తక్కువశాతంలో కనిపిస్తున్న నల్లని(చర్మ) భాగాలు సెలయేళ్ళు గా. ఏనుగులు జేగురుకొండలుగా భాసిస్తున్నాయి లేదా మదప్రవాహాలే కొత్తనీటి సెలయేళ్ళు ఒక్కొక్కటీ ఆకాశం తాకేటంత నిక్కుతో (ఎత్తు) ఉన్నాయి. చూపరులు (ప్రేక్షకులు) అబ్బురపడిపోతున్నారు వాళ్ళ చూపులకి ఇవి సెలయేళ్లు కలిగి నడయాడుతున్న జేగురుకొండలో అనిపిస్తున్నాయి (ఉత్ప్రేక్ష) అటుపైని పుష్పలావికలను (పువ్వులు అమ్మే చెలువలు) వర్ణిస్తున్నాడు

బెళుకులై తళుకులు గులుకు కన్నుల చెన్ను
కలువల కొక వింత చెలువు గొలుప
గొప్పలై యొప్పల కుప్పలై పాలిండ్లు
విరి బంతులకు వింత సరవి గఱప
బొలుపులై వలరాచ బులుపులై పలు మొనల్
మొల్లల కొక వింత మురువు నింప
దళుకులై తేనెలు చిలుకు మోవుల రంగు
చెందొవలకు వింత సిరుల జేయు
సొలపు వలపును గొలుపు నిచ్చలపు దెలుపు
నగవు మల్లెల కొక వింత నయము దెలుప
గోడె కాండ్రకు విరులమ్ముకొందు రెపుడు
బవ్వులమ్మెడు చెల్వ లా ప్రోలిలోన -84

(బెళుకులై=కాంతిమంతములై, చెన్ను=సొగసు అందం చెలువు=అందం. సరవి=వరుస బులుపులై=వేడుకలై బులిపి=పసిరిమొగ్గ చిన్నది మురువు=అందం. సొలపు=పారవశ్యం నిచ్చలము=నిశ్చయం నిర్దోషం స్వచ్ఛం నయము=అందం, రీతి. చెలువలు-చెల్వ లు=సొగసు కత్తెలు)

తళుకులూ, బెళుకులూ కులికే కన్నుల అందాలు తమ అంగడిలో ఎదురుగా ఉన్న కలువలకి ఒక వింత చెలువాన్ని కలిగిస్తున్నాయి. పెద్దవిగా ఒప్పల కుప్పలుగా ఉన్న వక్షోజాలు (పాలిండ్లు)పూల చెండులకి (విరిబంతు లకు) ఒక వింత వరస (బాంధవ్యం)నేర్పుతున్నాయి.(కఱపన్) పొలుపుగా ఉండి మన్మధుడి(వలరాచవాడు) బులుపుల్లాగా ఉన్న పలుమొనలు (దంతాల కొనలు)మొల్లమొగ్గలకు ఒక వింత మురుపు నింపుతున్నాయి. నిగనిగలాడుతూ తేనెలు చిలుకుతున్న పెదవులరంగు

(మోవి=క్రిందిపెదవి) ఎర్ర కలువలకు ఒక వింతసిరులని అందిస్తున్నది పారవశ్యపు వలపుని కలిగిస్తూ స్వచ్ఛంగా తెల్లగా ఉండే నవ్వులు మల్లెపూలకి ఒక వింత అందాన్నీ రీతినీ తెలియజెబుతున్నాయి

ఇలా తమ అవయవాల సొగసులతో పువ్వులకే అందాలు తీరుస్తూ పుష్ప లావికలు ఆ పట్టణంలో కోడె కాండ్రకు (యౌవనంలో ఉన్న సరసులకు) విరులు అమ్ము కొంటూ ఉంటారు

''అమ్ముకొందురు'' అనడంలో ఉపమానాలు ఉపమేయాలు అంగడి సరుకే అనే స్ఫూర్తి ఉంది ఒక జాలికూడా ఉందేమో సరే-

పుష్పలావికలు అయ్యాక వేశ్యల వర్ణన ధనానికి అమ్ముడు పోయే స్త్రీని వెల+ ఆలు=వెలయాలు అంటారు. వాళ్ల జాణతనం చెబుతున్నాడు

నగ గల్గిననుఁ జాలు మొగసాల వాకిలి
కాపించు నబ్బేసికంటి నైన
జని చూడ గల్గిన జాలు జేయును నన్ను
కానిగా బూవిలుకానినైన
బలుక గల్గిన జాలు బనులు సేయించును
వెట్టి మై జదలేటిపట్టి నైన
జెనక గల్గిన జాలు జేయును దలయింటి
చుట్టు ద్రిమ్మర గాలిచూలినైన
నంట గలిగిన నవ్వెనకయ్య నైన
గోచి విడిపించి వలపులు గొల్పి నిచ్చ
వెంట దిరుగాడ జేయు నవ్వీటిలోన
గలుగు వెలయాండ్ర గమి పొల్పువలకు దిగిచి 1-85

తమ వైపు చూసి ఒక్కసారి నవ్వితేచాలు (నగ గల్గిననుచాలు) ఆ ముక్కంటి నైనా సరే (బేసి కన్నులవాడు- అ + బేసికంటి) తమ ఇంటి మొగసాలవాకిలికి కావలా దారునిగా చేసెయ్యగలరు మన్మధుణ్ణి జయించిన శివుణ్ణి కూడా లోబరుచుకోగలరని తాత్పర్యం (పైగా వాకిలికి కాపలా కాయడం శివుడికి అలవాటే- బాణాసురుడి కథ)

దగ్గరకు వెళ్ళి చూడగలిగితే చాలు పూవిలుకాడినైనా (మన్మధు డు)తమకు విటుణ్ణిగా (ననుపుకాడు- నన్నుకాడు) చేసుకోగలరు. అందరినీ విటులుగా మార్చే మన్మధుణ్ణి విటుణ్ణిగా చేసుకోగలరని

తమతో ఒక్కసారి మాట్లాడగలిగితే చాలు ఆజన్మబ్రహ్మచారి గాంగే యుడి నైనాసరే(చదలేరు= గంగ. పట్టి= బిడ్డ చదలేటిపట్టి= గంగా పుత్రుడు - భీష్ముడు) తమకు సేవకుణ్ణిగా చేసేసుకోగలరు జీతమూ బత్తెమూ లేకుండా వెట్టి చాకిరీ చేయించుకోగలరు భీష్ముడు పెళ్ళి మానేసి జీవితాంతమూ కౌరవులకు చేసింది వెట్టి చాకిరీయే

తమకు ఒక్కసారి ఎదురయితే చాలు (చెనకుట=తాకుట ఎదుర్కొనుట)

మరొక బ్రహ్మచారి హనుమంతుణ్ణి కూడా (చూలి= బిడ్డ గాలి చూలి=వాయు పుత్రుడు- మారుతి) తమ ఇంటి వీథి గుమ్మం చుట్టూ తిరి గేట్టు (త్రిమ్మరన్ చేయు) చేసుకోగలరు (తల=అగ్రభాగం ఇంటి యొక్క తల-తలయిల్లు తలవాలము పెడచెవి పూర్వకాయము ఇత్యాదుల్లా ఏకదేశి సమాసం) రామాలయాలకి తలయింటి కాపలాదారు హనుమన్న కదా!

తమను ఒక్కసారి తాకగలిగితే చాలు (అంటుట= స్పృశించుట. అంటగలిగినన్) మరొక బ్రహ్మచారి ఆ వినాయకుణ్ణి సయితం (ఆ+వెనకయ్య. చాలా శివాలయాల్లో వినాయకుడి విగ్రహం గుడికి వెనక వైపుననే ఉంటుంది అందుకనో కుమారస్వామికంటే వెనకపుట్టాడనో వెనకయ్య అని పేరు వచ్చి ఉంటుందని కొందరి సమన్వయం) గోచి విడిపించి వలపులు రగుల్కొల్పి నిత్యమూ తమ వెంట తిప్పకోగలరు వెనకయ్య కనక వెంట తిరుగాడకాడని.

పొలుపువలకు లాగి ఎంతటి కఠోర బ్రహ్మచారి నయినా సరే ఇలా మార్చెయ్యగలిగిన సౌందర్యంతో చాతుర్యంతో అలరారుతోంది- ఆ పట్టణంలో ఉన్న వెలయాంగ్ర బృందం (గమి=సమూహం). కాంతా జనానికి ప్రథమస్థానం ఇచ్చి వారిని వర్ణించి ఇప్పుడింక పురుషజాతిని వర్ణిస్తున్నాడు.

పలుకుల చిలువల దొర లన
నలు మొగములు పూని రాని నలువ లనంగా
దొలు మినుకుల ప్రోవు లన
వెలియుదు రప్పీటి పుడమివేలుపు లెపుడున్ 1-88

ఆ వీటిలో ఉన్న బ్రాహ్మణులు (పుడమి వేలుపులు= భూదేవతలు) పలుకుల విషయంలో ఆదిశేషులా అన్నట్టు (చిలువ= పాము చిలువల దొర=పాములకు రాజు) నాలుగు ముఖాలు ధరించి రాని చతుర్ముఖులా అన్నట్లు (నాలుగు వాయి+ లు= ముఖాలు కలవాడు- నలువ= బ్రహ్మ) వేదాల రాసులా అన్నట్లు (మినుకు=మాట తొలి-తొలు + మినుకులు= ఆది మ వాక్కులు=వేదాలు), ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉంటారు

మొత్తం మూడూ అభేద రూపకాలే. "నలు మొగములు పూనిరాని నలువలు" అన్నచోట ఉపమేయమైన పుడమివేల్పులకి నాలుగు ముఖాలు ధరించి రాకపోవడం అనే న్యూనత కనబడుతోంది కనక అది న్యూనాభేదరూపకం. (అచతుర్వదనో బ్రహ్మ-అన్నట్టూ సాక్షీయ మపరా లక్ష్మీరసుధాసాగరోదితా అన్నట్టూ)

వరుస వెంబడి గాని వారిగాని లేకయ్య
మూర్తురే గా రాము మునికి యెంత
దురములో సిరిగెస్తు వెరసాచ్చి పగవారి
గెలిచిన తప్పిడి యల వదెంత
మూడుపాలెములు తెంపున గెల్చి పాదలు జా
ల్లిలాలుపు వెల్చి తేరమెంత

కోమటి సైదోడు గూడ ద్రిమ్మరి పేర్మి
దగు విక్రమార్కుని తెగువ యెంత
నేలపై నిల్చి తమ యేపు నిలుపలేక
బెడిదముల బర్వు పిడుగుల కడిమి యెంత
యనుచు గేలిగా రచ్చల నాడుకొనుచు
నేచి పచరింతు రచ్చటి రాచవారు. 1-87

ఆ పట్టణంలో రాచబిడ్డలు (యువక్షత్రియులు) రచ్చబండల మీద గుమి గూడి విజృంభించి(ఏచి=అతిశయించి) వీరాలాపాలు చేసుకుంటూ ఉంటారుట. ఏమని అంటే-

ఒకడి తరువాత ఒకడు అని వరసబెట్టి గానీ శత్రువుల్ని(మార్తురన్) సంహరించలేకపోయాడు (పొరిగొనలేడు)ఆ పరశురాముడు. అతడి బ్రతుకు(మనికి) ఎంతయ్యా మేమైతే ఒక్కుమ్మడిగా ఎంతమంది రైనా సంహరించగలమని

కురుక్షేత్ర సంగ్రామంలో (దురము=యుద్ధం) శ్రీకృష్ణుణ్ణి (సిరిగేస్తు) ఆశ్రయించి శత్రువుల్ని గెలిచాడు ఆ అర్జునుడు(కవ+వడి=కవ్వడి. రెండు చేతులతోనూ యుద్ధం చెయ్యగలవడి ఉన్నవాడు=అర్జునుడు) అతడి పరాక్రమం (అలవు) అది ఎంతయ్యా మాముందు! మేమయితే సిరిగేస్తు సహాయం అవసరం లేకుండానే గెలిచి ఉండేవాళ్ళమని

జీవితానికంతటికీ ఒక పెద్ద మహాఘన కార్యంలాగా మూడు పాలెములు (పల్లెలు-త్రిపురాలు) తెంపుతో గెలిచి విర్రవీగుతున్నాడు (పొదలు) ఆ చంద్రశేఖరుడు. (జాబిల్లి తాలుపు వేల్పు) ఆయన గారి బీరం(వీరత్వం) ఏపాటి దయ్యా మాముందు మేమైతే రోజుకి మూడు శత్రుపురాలు భస్మం చెయ్యగలమని

భట్టి అనే ఒక కోమటిని సైదోడుగా(మంత్రిగా)పెట్టుకుని దేశాలన్నీ త్రిమ్మరి పేర్మి(కీర్తి) సంపాదించుకుని తగుదునమ్మా అంటున్న ఆ విక్రమార్కుని సాహసం (తెగువ) ఎంతయ్యా మేమయితే ఏ సైదోడూ అక్కర లేకుండానే అంతకన్నాగొప్ప సాహసకృత్యాలు చెయ్యగలమని

అసలు మా ముందు పిడుగుల కడిమిమాత్రం ఎంత! (కడిమి= బలం, పరాక్రమం, ఆధిక్యం) అవి నేలమీద నిలబడి తమ ఏవు ఏమిటో నిలుపుకోలేక ఉరుము కుంటూ పరుగులు తీస్తాయా!(బెడిదము-బెట్టిదం=నిష్ఠురము పర్వు=ఒప్పు, వ్యాపించు, సాగు) వాటి గొప్ప ఎంత మాముందు మేమయితే నిలబడి యుద్ధం చేస్తాం పిడుగులు కురిపిస్తాం మెరుపుదాడి చేసి పారిపోం అని

ఇల్లాగ్గ పరశురాముడు లగాయతు ఏ-మహావీరుణ్ణి లెక్కచెయ్యకుండా గేలిచేస్తూ మాట్లాడుకుంటూ ఉంటారుట అచ్చటి రాచవారు

తడవగ వశమా యందుల
నెడపని సిరు లేలిరైన- వెలుగగ వచ్చున్

నొడువక కోటికి నెత్తిన

పడగలచే గోమ టిండ్ల బంగరుమళిగల్ -88

ఆ పట్టణంలో ఉన్న అంతులేని (ఎడపని) సిరుల్ని తడవడం(లెక్క పెట్టడం) ఎవరికైనా వశమా సాధ్యమవుతుందా!

కానీ ఒక రకంగా ఎవరికైనా ఎవరూ చెప్పకుండానే (నొడువక) తెలుసు కునే అవకాశం ఉంది (ఎఱగగవచ్చున్)

కోమటుల ఇండ్లలో బంగారపు నిధులు (మళిగలు-మాళిగలు- నేలమాళి గలు-భూగృహాలలో దాచిన బంగారపునిధులు) ఎన్ని ఉన్నాయో -కోటికి ఎత్తిన పడగలతో లెక్కకట్టి తెలుసుకోవచ్చు

కోటికి పడగ ఎత్తడం అని సామెత ఒక కోటి రూపాయిలు నిధి ఉంటే ఇంటిమీద ఒక పతాకం ఎగురవేస్తారుట ఆ ఇంటి మీద ఎన్ని పతాకాలు (పడగలు) ఎగురుతూంటే అన్ని నిధులు ఆ యజమానుడికి ఉన్నట్లు ఉన్న ధనాన్ని ప్రభుత్వానికీ ప్రజలకూ తెలియకుండా దాచుకోవలసిన పరిస్థితి లేని మంచిరోజులు అవి అందు కని ప్రతి కోటీశ్వరుడూ తన భవనం మీద పడగలు ఎత్తేవాడు ఆ పడగల సంఖ్యను బట్టి, అతడి దగ్గర ఎన్ని కోట్లు నిలువ ఉన్నాయో ఎవరూ నొడువకండానే ఎవరికైనా ఎరుగవచ్చు ఆ ప్రతిష్ఠాన పట్టణంలో వైశ్యులందరి ఇళ్ళపైనా ఈ పడగలు ఎగురుతూనే ఉండేవనీ అందరూ కోటీశ్వరులేననీ

ఇంతటి సంపన్నులున్న పట్టణాన్నీ దేశాన్నీ రక్షించడానికీ చోరబాధ లేకుండా కాపాడటానికీ ఎటువంటి యోధులు ఉండాలి! అది చెబుతున్నాడు-

గడితపు పిడుగుల నైనను

బెడిదపు సింగముల నైన బెడచే బుడమిం

బడనడచు బంటు లెన్నఁగ

గడ లేక తనర్తు రచట గడు బీరమునన్.......... 1-89

కఠినమైన పిడుగులనైనా సరే భయంకరమైన సింహాలనైనా సరే ఎడమ చేత్తో (పెడచేన్) నేల మీదకు పడవేసి అణచి వెయ్యగలిగిన యోధులు (పడన్ అడచు బంటులు) అంతులేనంత మంది మహాప్రతాపం తో (కడు బీరమునన్) ఆ పట్టణంలో తనరారుతున్నారు. (కడ=అంతం కడలేక=అనంతంగా)

వ. ఇట్లు కడలి కడగా గలుగు పుడమి పడతికి దొడవనం గడునొప్పు నవ్వీ డేలునేల ఱేడెట్టివా డనిన......... 1-90

సముద్రమే (కడలి) చివరి సరిహద్దుగా ఉన్న మొత్తం భూదేవికి (పుడమి పడతికి) అలంకారం అనిపించేటట్టు (తొడవు+అనన్) చాలా అందంగా ప్రకాశిస్తున్న ఆవీడు-ప్రతిష్ఠాన పట్టణాన్ని ఏలుతున్న నేల ఱేడు (భూపతి) ఎటువంటివాడంటే- అని కావ్యకథానాయకుడైన యయాతిని పరిచయం చేస్తున్నాడు

పొన్నెగంటి తెలగన్న శ్రీకారం చుట్టిన ఈ అచ్చతెనుగు కావ్యశాఖ ఎక్కువ

మంది కవులను ఆకర్షించకపోయినా నిన్న మొన్నటిదాకా అలా అలా సాగుతూనే వచ్చింది. కూచిమంచి తిమ్మకవి(18వశతాబ్దం) రామాయణాన్నీ నీలాసుందరీ పరిణయాన్నీ రచించాడు ములుగు పాపయారాధ్యుల వారూ, కందుకూరి వీరేశ లింగం పంతులు గారూ, ఆదిభట్ల నారాయణదాసుగారూ ఆకుండి వ్యాసమూర్తి గారూ ఈ కావ్య శాఖకు తమ రచనలతో పుష్టి కలిగించారు కానీ అవి ఏవీ కూడా తక్కిన ఆంధ్ర భాషామయ కావ్యాల్లాగా పాఠకుల హృదయాలకు ఎక్కలేదు. పఠన పాఠనాలకు దూరమయ్యాయి. ఈశాఖకు ప్రతినిధిగా ఏదో ఒకటి ఉండాలి కనక పాఠ్యభాగాల్లో చేర్చడమే అవుతోంది ఆ గౌరవం కూడా యయాతి చరిత్రకూ, నీలా సుందరీ పరిణయానికీ,ఎక్కువగా దొరుకుతూ వచ్చింది కొందరు కావ్యానికి పేరు పెట్టడం దగ్గరనుంచి వీర- అచ్చికాభి మానం చూపిస్తూ వచ్చారు చిలువ పడగ ఠేని కవిత రెంట త్రాగుడు గొంగ పుట్టింటి వేల్పు శతకము, జేజేల మేలువాని యింపు నిట్ట- ఇత్యాదులు. అయితే ఒక ప్రత్యేకమైన అభిరుచి పట్టుదలా ఉన్న పాఠకులు అనే క్రార్థక కావ్యాలనూ అచ్చిక కావ్యాలనూ చదివి ఆనందించ గలిగితే ఆనందించవచ్చు.

భాషాపరంగా చూసినప్పుడు ఈ కావ్యాలు చేసిన మేలు గణనీయంగా కన పడుతుంది భావప్రకటనలో తెలుగుకి ఉన్న సొష్ఠవం తెలిసి వస్తుంది అనవసరమైన దురాక్రమణకి లోనుకాకుండా అచ్చతెనుగు పదాలను పరిరక్షించుకోవడానికీ, పర్యాయపదాలనూ సమాసాలనూ తయారుచేసుకుని పరిపుష్టం చేసుకోడానికీ ఈ ప్రక్రియ అద్వితీయంగా సహకరిస్తుంది.

చేమకూర వేంకటకవి (క్రీ.శ.1600-1632)

విజయవిలాసము (ప్రథమాశ్వాసము 32-41,83-86, 117-121, 130-134 ,ద్వితీయాశ్వాసము 78-111)

విజయ నగర సామ్రాజ్యం పతనమయ్యాక తెలుగుసాహిత్యానికి తంజావూరు పట్టుకొమ్మ అయ్యింది తంజావూరు నాయకరాజులు అభినవ భోజులై కవిపండిత పోషణ విశేషంగా చేసారు సామ్రాజ్యంలో శాంతి భద్రతలు నెలకొన్నాయి ధన దాన్యసమృద్ధి ఏర్పడింది ప్రజలూ పాలకులూ కూడా విలాసవంతమైన జీవితం గడిపినట్టు చరిత్ర చెబుతోంది.

నాయకరాజుల్లో రఘునాధనాయకుడూ అతని కుమారుడు విజయరాఘవనాయకుడూ స్వయంగా కవులై, కవులనూ కవయిత్రులనూ ఎంతోమందిని గౌరవాదరాలతో పోషించారు. రఘునాథనాయకుడు ఆశుప్రబంధాలను అనేకం రచించాడు అచ్యుతాభ్యుదయం అనే ద్విపదకావ్యాన్ని తన తండ్రి చరిత్రతో రచించాడుట వాల్మీకి చరిత్ర ఇతడి ప్రౌఢ పద్యకావ్యం నలచరిత్ర శృంగార సావిత్రి, రఘునాథ రామాయణం ఇత్యాదులు ఇతడి రచనలు విజయరాఘవ నాయకుడుకూడా తన తండ్రినే నాయకుణ్ణి చేసి రఘునాధ నాయకాభ్యుదయం ద్విపదగానూ యక్షగానంగానూ రచించాడు వీటిలో ఆనాటి నాయకరాజుల విలాసమయ జీవితం కన్నులకు కట్టినట్టు కనపడుతుంది

రఘునాధనాయకుని కొలువులో చేమకూర వెంకన్న ఒక ప్రముఖ కవి కాబట్టి ఇతడి కాలం క్రీ శ ౧౬౩౦ ప్రాంతం సారంగధర చరిత్ర - విజయవిలాసాలు చేమకూర రచనలు

వీటిలో విజయ విలాసం చాలా చమత్కార భరితమైన కావ్యం ప్రతి పద్యంలోనూ చమత్కృతి ఉండేట్టు రచించావని కవిని కృతిపతి రఘునాధనాయకుడు ప్రశంసించాడు

ప్రతిపద్యమునందు చమ
త్కృతి గలుగం జెప్ప నేర్తు, పెల్లడ తెలుగా
కృతి వింటి మహారముగా,
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదు సుమీ (అవతారిక -౮౦)

ఈ ప్రతిపద్యచమత్కృతి అవతారికతో సహా విజయవిలాసం అంతటా కనపడుతుంది. కావ్యానికి చమత్కారమే ప్రధానమనే సిద్ధాంతాన్ని మొట్టమొదటి సారిగా ప్రతిపాదించినవాడు తెలుగువాడు. విశ్వేశ్వర దేశికుడు ఇతడు నాచన సోమనాథుడికి సమకాలికుడనీ, అదే సోమ నాధుని రచనలో నవీన గుణమనీ శ్రీ.జి.వి. సుబ్రహ్మణ్యం గారూ, శ్రీ ఎన్ సీతాపతిగారూ ప్రతిపాదించారు (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు పుట-౨౪ ౨౫)

అయితే విజయ విలాసంలో ప్రధానంగా కనిపించేది శబ్దచమ త్కారమే. కల్పనల్లోగానీ, ఉపమానాల్లోగానీ కొత్తదనం అంతగా కనపడదు ఉక్తి విధానంలో మాత్రం ప్రతి పద్యంలోనూ ఏదో ఒక చమత్కారం కనపడుతూనే ఉంటుంది తెలుగు జాతీయాలనూ నుడికారా లనూ సార్థకంగా సమన్వయించే శబ్దచమత్కారం మరీ ఎక్కువగా కనపడుతుంది. శ్లేషయమకాదులు సరేసరి

వసుచరిత్ర - ప్రభావతీ ప్రద్యుమ్నాల తరవాత తెలుగు కావ్యనిర్మాణానికి ఒక మూస ఏర్పడింది. వసుచరిత్ర ముద్ర అనంతర కవుల మీద మరింత గాఢంగా పడింది విజయవిలాసానికి పిల్ల వసుచరిత్ర అనే కీర్తి ఉంది.

వసుచరిత్రనుంచీ కావ్యాలలో కథాశరీరం బాగా కుంచించుకు పోయింది. ఉన్నది కాస్తా మూసకట్టుగానే తయారయ్యింది. నాయకరాజు ల విలాసమయ జీవితం ఈ స్వల్ప కథా శరీరాన్ని యథాశక్తి ప్రభావితం చేసింది.

రాజు ఊరేగింపుగా వెళ్ళడం. ఒక అందగత్తె చూసి మోహించడం విరహ వేదన చిలక రాయబారం. రాజుగారు అనుగ్రహించడం సంభోగ వర్ణన. కావ్య సమాప్తి - ఇదీ మూస అవసరాన్ని బట్టి ప్రకృతి వర్ణనలు ఉంటాయి. నాయికను అంగాగం వర్ణించడం రెండుమూడు సార్లయినా జరుగుతుంది. ఒక్కొక్కసారి ఇద్దరు ముగ్గురు నాయికలు ఉంటారు. పడక టింటినీ అక్కడి కార్యక్రమాలనీ సవిస్తరంగా వర్ణించడ మొకటి ప్రస్ఫుటంగా కనపడుతుంది రాజుగారు ప్రధానంగా శృంగార నాయకుడు అనేక భార్యల్ని సమానంగా చూసుకునే దక్షిణనాయకుడు ఇతడి మిగతా గుణాలు సాధారణంగా ప్రస్తావనకు రావు వచ్చినా శృంగార పరంగానే వస్తాయి ఇదీ విలాసకావ్యాల మూస.

ఈ విజయ విలాసంలో కథ భారతంలోది బ్రాహ్మణ గోసంరక్ష ణార్థం, విల్లంబులకోసం అర్జునుడు ధర్మరాజుగారి అంతఃపురం వైపు వెడతాడు. ఆ ఏడాది ద్రౌపదీదేవి ధర్మరాజుగారి సన్నిధిని ఉంది నియమం ప్రకారం అర్జునుడు అటు వెళ్ళకూడదు. కానీ పరాకున వెళ్ళాడు దానికి ప్రాయశ్చిత్తంగా భూప్రదక్షిణకు బయలు దేరాడు. కూడా విశారదుడు అనే నర్మసచివుడూ కదిలాడు దారిలో ఉలూచి అనే నాగకన్యనూ చిత్రాంగద అనే మలయధ్వజ మహారాజుగారి కూతురినీ తర్వాత శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రనీ వివాహమాడాడు కావ్యం ముగిసింది.

సుభద్ర సౌందర్యాన్ని గదుడు వచ్చి వర్ణించి చెప్పినప్పటినుంచీ వెళ్ళాలి చూడాలి అనుకుంటున్నాడు అర్జునుడు. అంతలోకీ దైవికంగా ఈ సంఘటన జరిగింది. భూప్రదక్షిణ అనువుగా కలిసివచ్చింది

కావ్యం మొత్తం ప్రతి పాత్రలోనూ ప్రతి సన్నివేశంలోనూ శబ్ద చమత్కారాలతో కవిగారే తొంగి చూస్తూ ఉంటాడు. ఆ చమత్కారాలు మాత్రం అత్యద్భుతంగా, ఆశ్చర్యజనకంగా ఉంటాయి. కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి నభూతే నభవిష్యతి అనిపించాడు చేమకూర వేంకట కవి ఇవి తప్ప మిగతా ఉత్తమకావ్యగుణాలకోసం

ఆశించడంగానీ అన్వేషించడం గానీ వృథా ప్రయాస ఇదొక బాణీ ఇదొక నిర్మాణ శిల్పం

అర్జునుడికి విజయుడు అనేది పర్యాయపదం అతడి విలాసాన్ని చెప్పే కావ్యం కనక ఇది విజయవిలాసం కృష్ణదేవరాయల సభా భవనాన్ని భువన విజయం అన్నట్టుగా రఘునాథనాయకుడి కొలువు కూటానికి విజయభవనం అని పేరుట అందుకని కూడా విజయవిలాసం అనే పేరు పెట్టి ఉండఎచ్చు-కవి. అన్నారు కొందరు విమర్శకులు ఈ ఆలోచనకు ఆధారం తృతీయాశ్వాసంలో ఉంది విరహంలో ఉన్న సుభద్ర తన 'చెలులు ప్రసంగవశమ్మున అలరెన్ గడు విజయభవన మనినన్'' తెలియ వింటోందిట (౩-౨౮) విజయ అనే మాట వినపడితే చాలు సుభద్రకు ప్రాణం లేచి వస్తోంది ఈ చమత్కారానికీ కావ్యం పేరుకీ విజయభవనమే ప్రేరకమని విమర్శకుల భావన

ముగ్గురు నాయికలనూ వర్ణించిన పద్యాలు చూద్దాం కాసేపు ఔచిత్యమూ అశ్లీలమూ లాంటివి మర్చిపొండి అని హెచ్చరిక

పాండవుల కుశలం కనుక్కోవడానికి ద్వారకనుంచి ఇంద్రప్రస్థానికి వచ్చి గదుడు ఏకాంతంలో అర్జునుడికి సుభద్ర సౌందర్యాన్ని వర్ణించి చెబుతాడు పంచచామర వృత్తంలో ఉత్సాహంగా మొదలు పెట్టాడు

కనన్ సుభద్రకున్ సమంబుగాగ నే మృగీవిలో
కనన్; నిజంబు గాగ నే జగంబునందు జూచి కా
కనన్, దదీయ వర్ణనీయ హావ భావ ధీవయః
కనన్మనోజ్ఞ రేఖ లెన్నగా దరంబె గ్రక్కనన్ - (౧-౩౨)

ఓ విజయా. సుభద్రకు సమంగా మరో మృగీవిలోకనను (ఆడ లేడి = మృగి, మృగీవిలోకనన్ = ఆడలేడి కన్నుల వంటి కన్నులు గల స్త్రీని) నేను కనను (చూడను చూడలేదు అని) నేను ఈ మాట నిజంగా జగమంతా చూచికాక అనను (చూచికాక+ అనన్) ఆమెకు సంబంధించినవై వర్ణించదగిన హావభావాలూ బుద్ధి (ధీ) వయస్సు వీటి ప్రకాశించే మనోజ్ఞరేఖలు (కనత్ + మనోజ్ఞ = కనన్మనోజ్ఞ) ఎంచి గ్రక్కునగా చెప్పా లంటే తరమా ఇదీ తాత్పర్యం

భావంలో కొత్తదనం లేకపోయినా ' కనన్'' అనే అక్షరసంపుటి ప్రాసలో వచ్చేట్టు పదబంధాలు కూర్చాడు ' గ్రక్కననన్ ''తో ముగించాడు ఆద్యంతాలలో 'కనన్ '' సాధించాడు శబ్దాలంకారంగా ఇది యమకం

ప్రాయపు టెక్కునన్ చెలువ పల్కులు చిల్కల గారవించు, గ
న్దోయి చకోరపాళి దయతో బెనుచున్, చనుకట్టు మచ్చికల్
చేయు సదా రథాంగయుగళిన్, నడ లంచల బుజ్జగించు, నౌ
నేయెడ నింపు గావు గయింప నవీన వయో విలాసముల్ (౧-౩౩)

ప్రాయం తెచ్చిన టెక్కుతో (ప్రాయము = వయస్సు యౌవనం) ఆ చెలువ

పలుకులు చిలకల్ని ఆదరిస్తాయి కన్దోయి (కన్నుల జంట) చకోర సమూహాన్ని (వెన్నెల పులుగులు) దయతో పెంచుతుంది చనుకట్టు చక్ర వాకద్వయంతో (యుగళిన్) సదా మచ్చిక చేస్తుంది నడకలు హంసల్ని (అంచలు) బుజ్జగిస్తాయి

ఈ ఉపమానాలు అన్ని కావ్యాలలోనూ కనిపించేవే కాకపోతే క్రియా పదాలను వాడటంలో కొంత కొత్తదనమూ సార్థకతా ఉన్నాయి చిలుకలు చకోరపాళి రథాంగయుగళి అంచలు – ఈ ఉపమాన వస్తువు లన్నీ పక్షిజాతివే నాల్గవ పాదంలో ఈ చమత్కారాన్ని పాదిగాడు '' అవును గణించి చూస్తే నవీనవయో విలాసాలు ఏయెడ ఇంపుగావు '' అని అర్థాంతరన్యాసం వేసాడు నవీన వయస్సు అంటే కొత్త వయస్సు యౌవనం యౌవన విలాసాలు ఎప్పుడయినా ఇంపుగానే ఉంటాయి కదా అని సుభద్ర ప్రాయపు టెక్కులతో ఉంది కనక ఆవిడ నవీనవయో విలాసాలు ఇంపుగానే ఉంటాయి ''వయస్' అనే పదానికి పక్షి అనికూడా అర్థం ఉంది క్రొత్త పైన పక్షుల విలాసాలు ఇంపుగానే ఉంటాయి కదా అనే అర్థంతో ఈ అర్థాంతరన్యాసం ఉపమానవస్తువులకికూడా అన్వయిస్తుంది శ్లేషతో సాధించిన శబ్దచమత్కృతి ఇది

అతివ కుచంబులున్, మెఱుగుటారును, వేనలియున్ ధరాధిపో
న్నతియు, నహీన భూతి కలనంబు, ఘనాభ్యుదయంబు నిప్పడొం
దితిమని మాటి మాటికిని నిక్కెడు–నీల్గెడు–విఱ్ఱ వీగెడున్
క్షితినటుగాదె యొక్కొకరికిన్ నడుమంత్రపు గల్మి కల్గినన్ (–34)

అర్జునుడు సభద్రాదేవిని ఎప్పుడో చిన్నప్పుడు చూసాడు ఇప్పుడు ఆవిడ యౌవనవతి అయ్యింది శరీరంలో చాలా మార్పులు వచ్చాయి వాటిని క్రమాలంకారంతో చెప్పి అర్థాంతరన్యాసంతో సమర్థిస్తున్నాడు శ్లేష సహకారం ఉండనే ఉంది

ఆ అతివ వక్షోజాలు ధరాధిపోన్నతిని ఇప్పటికి పొందాము కదా అని మాటి మాటికీ నిక్కుతున్నాయి ఆమె నల్లని నూగారు – (బొడ్డునుంచి గుండెలపైపు వ్యాపించే సన్నని వెంట్రుకల బారు) – అహీన భూతి కలనం ఇప్పటికి పొందాను కదా అని మాటి మాటకీ నీల్గుతోంది ఆమె జడ(వేనలి) ఇప్పుడు కదా ఘనాభ్యుదయం పొందాను అని మాటి మాటికీ విర్రవీగుతోంది మూడింటికీ కలిపి '' ఇప్పడు + ఒందితిమి '' అని క్రియని బహువచనంలో వేసాడు

వక్షోజాలకి పర్వతాలు ఉపమానం ధరాధిపము అంటే శ్రేష్ఠమైన పర్వతం సంస్కృతంలో ధర – ధర శబ్దాలు రెండూ ఉన్నాయి ధరము అంటే పర్వతం ధర + అధిపము = ధరాధిపము పర్వతం యొక్క ఉన్నతిని (ఎత్తును) పొందాము అనే గర్వంతో అవి నిక్కుతున్నాయి ధరా+ అధిప + ఉన్నతి అనే పదవిభాగంతో రాజుగారి ఉన్నతి (గొప్పదనం) అని మరో అర్థం వస్తుంది అదికూడా నిక్కడానికిహేతువే దరాధిపోన్నతి అనే సమాసంలో ఉన్న శ్లేష ఎంత ముఖ్యమో ''నిక్కెడున్'' అన్న క్రియాపదం కూడా అంతే సార్థకం పైకి ఎదగడమనీ, అహంకరించడమనీను

నూగారుకి నల్లత్రాచు ఉపమానం అహి అంటే పాము ఇన శబ్దానికి రాజు

అని అర్థం అహి+ ఇనము- అంటె శ్రేష్ఠమైన సర్పం సర్పరాజం అదే త్రాచుపాము దాని శోభను (భూతిని) కలిగి ఉండుట (కలనంబు) ఇన్నాళ్లకు నూగారుకి లభించింది అంచేత నూగారు గర్వంతో నీలుగు తోంది సాగుతోందనీ అహంకరి స్తోందనీను హీనం కానిది అహీనం (న హీనమ్ - అహీనమ్) అహీనమైన ఐశ్వర్య లబ్ధితో (భూతి-కలనంబు) అది నీలుగుతోంది - అంటే - అహంకరిస్తోంది

వేనలికి ఘనంతా ఉపమాన వస్తువు మేఘం నల్లగా విశాలంగా ఉంటుంది కేశపాశమని ఘనం యొక్క అభ్యుదయం ఇప్పుడు వేనలి పొందింది దాని అతిశయం దీనికి లభించింది అంచేత విర్రవీగుతోంది అహంకరిస్తోందనీ వెనక్కాలవైపున పొడ వుగా ఊగుతోందనీను ఘనమైన అభ్యుదయం - ఘనాభ్యుదయం పొందింది కనక విర్రవీగడం ఇలా మూడు ఉపమానాలనూ శ్లేషతో అహంకారహేతువులుగా మలిచాడు అనురూపమైన క్రియలు పేర్చాడు అయితే అహంకరిస్తున్నావ్ అనడానికి విర్రవీగడం నీల్గడం, నిక్కడం అనే మాటలు ఉత్తరోత్తరం కొంచెం మొరటు అభివ్యక్తులు

నడు మంత్రపు కలిమి వస్తే ఈ భూమి మీద (క్షితిన్) ఒక్కొక్కళ్లకి అలాగే ఉంటుందిలే అని అర్థాంతరన్యాసం బిగించాడు నడమంతరపు కలిమో నరం మీద పుండో అన్నారు రెండూ భరించరానివే ఈ అవయవా లకు (ఉపమేయాలు) ఇప్పుడున్న ఈ అతిశయం నడమంతరపు కలిమే. బాల్యంలో లేదు ముసలితనంలో ఉండదు నడమంత్రంగా యౌవనం వల్ల వచ్చింది నడమంత్రపు సిరి కాబట్టే అంతగా నిక్కడం నీల్గడం, విర్రవీగడమూను అయితే నడమంత్రపు సిరి వచ్చిన వారందరూ ఇలాగ మిడిసిపడరు. ఒక్కొక్కరికి ఈ మిడిసిపాటు ఉంటుంది ఆమె శరీరంలో మిగతా భాగాలకుకూడా నడమంత్రపు కల్మి (యౌవన సౌందర్యం) ం ఛ్చింది అవి ఇలా నిక్కడం లేదు నీల్గడం లేదు విర్రవీగడం లేదు అదీ '' ఒక్కొకరిక్ న్ '' అనడంలో చమత్కారం ఈ పద్యంలో ఏ పదాన్ని మార్చి పర్యాయపదం ఉంచినా చమత్కారం చెడిపోతుంది ప్రాధాన్యాన్ని బట్టి ఇదీ శబ్దచమత్కారమే

కేళికాసరసిలో దేలి యాడుట జేసి
శైవాల లత కొంత సాటివచ్చు
పుష్ప మాలికలతో బొందు సల్పుట జేసి
యెలదేటిగమి కొంత యీడు వచ్చు
కంటికింపగు రేఖ గల్గియుండుట జేసి
మినుకు గాటుక కొంత దినుసు వచ్చు
బిబుద సౌయ్యారంబు మెఱయుచుండుట జేసి
చమరివాల మొకింత సమము వచ్చు
గాక నీలత్వమున సరిగావు తెలియ

నెఱి గలిగి, యొుక్కమొత్తమై, నిడుదలై,ద
ళమ్ములై, మెఱ్గులై, కారు క్రమ్ముచున్న
వికచకమలాక్షి నునునోగ వెంట్రుకలకు (1-35)

వికసించిన కమలాల వంటి కన్నులు కలిగిన ఆ సుభద్ర (వికచ+ కమల+ అక్షి) జుట్టుని వర్ణిస్తున్నాడు ఈ పద్యంలో సుదీర్ఘమైన విశాలమైన కేశపాశం ఆవిడది అందుకే సీసపద్యం కావలసివచ్చింది

నునుపైన సోగ అయిన ఆమె తల వెంట్రుకలకు ఏవేవి కొంతలో కొంత సాటి వస్తాయో పై నాలుగు పాదాలలోనూ చెప్పాడు నాచుతీగలు (శైవలం-శైవాలం), తుమ్మెదల గుంపు (ఎలతేటి + గమి), కాటుక చమరీ మృగం తోక - వీటిని కేశపా శానికి పొడుగులో నల్లదనంలో ఉపమానాలు గా చెబుతారు అవే ఈ పద్యంలోనూ ఉన్నాయి అయితే చెప్పడంలో కొంత కొత్తదనం ఉంది

కేళికా సరసిలో తేలి ఆడుతూ ఉంటుంది కనక నాచుతీగ ఈమె జడకి కొంత సాటి వస్తుంది సుభద్ర జడకూ శైవాలలతకూ కేళికాసరసి లో తేలి ఆడటమనేది సమానధర్మం

పుష్పమాలికలతో చెలిమి చేస్తుంది కనక (పొందు సల్పుటన్ చేసి) ఎల తేటిగమి ఈమె జడకి కొంత ఈడు వస్తుంది. పుష్పమాలికలతో పొందు కలిగి ఉండటం జడకూ తుమ్మెదలకూ సమానధర్మం

కంటికి ఇంపయిన రేఖను (గీత) కలిగి ఉంటుంది కనక మినుకు కాటుక (మెరిసే కజ్జలం) ఈమె జడకి కొంత దినుసు వస్తుంది (దినుసు=మాదిరి). కంటికి అందాన్నితెచ్చే రేఖగా ఉంటుంది కాటుక ఈమె జడ- చూపరుల కంటికి ఇంపుకూర్చే అందాన్ని (రేఖను) కలిగి ఉంటుంది కంటికి ఇంపగు రేఖ కలిగి ఉండుట అనేది రెండింటికీ సమాన ధర్మం

వెనక తట్టున (పిఱుదన్) ఒయ్యారంగా అలరారుతుంటుంది కనక చమరీవాలం ఈమె జడకి కొంత సమం వస్తుంది వెనకతట్టున ఉండటం తోకకీ జడకీ సమానధర్మం

ఈ ఉపమాన వస్తువులు ఆమె జడకి కొంత సాటివస్తున్నాయి. కొంత ఈడు వస్తున్నాయి అంతేగాని పూర్తిగా సరిపోవడంలేదు అంటే ఉపమానాలకన్నా ఆమె కేశపాశమే (ఉపమేయం) గుణాధిక్యంతో ఉన్నదన్నమాట ఏ విషయం ఎందువల్ల- అనేది క్రమంగా ఎత్తుగీతిలో చెబుతున్నాడు

నీలత్వంలో ఇవేవీ ఆమె జడకి సరికావు వాటి అన్నింటికంటే నల్ల గా ఉంది సుభద్ర జడ. పైగా అది నెఱి కలిగి ఉంది. నెఱి అనే మాటకి అందమూ, నిండు దనమూ హుందాతనమూ అనే అర్థాలు ఉన్నాయి. నెఱిదనంలో ఆమె జడముందు శైవాలలత తేలిపోతోంది ఒకే మొత్తంగా (గుంపుగా) ఉండటంలో ఆమె జడముందు ఎలదేటి గమి ఓడిపోతోంది తుమ్మెదలు చెల్లాచెదురుగా ఎగురుతాయే తప్ప ఒక్క

మొత్తమై ఉండవు కాటుకరేఖ కన్నుకి సరిపడా ఉంటుంది అంతకంటే నిడివిగా ఉండదు కాబట్టి నిడుదలై ఉండటంలో కాటుకరేఖలు ఆమె నునుసోగ వెం(డ్రుకలకు కొంతమాత్రమే సాటి వస్తున్నాయి వాటికన్నా నిడుదలై ఉండటం వీటికి ఉన్న గుణాధిక్యం చమరీమృగం తోక పొడవుగా ఉంటుంది కానీ చిక్కగా ఉండదు కాబట్టి దళములై (ఒత్తుగా) ఉండటం సోగవెం(డ్రుకల ఆధిక్యం

ఇవి కాక మెరుగులై ఉండటం కారు క్రమ్ముతూ ఉండటం (నల్లదనం వ్యాపించడం) అనే మరి రెండు గుణాలు నునుసోగ వెం(డ్రుకలకు అధికంగా ఉన్నాయి

ఇలా ఉపమానాలకన్నా ఉపమేయంలో గుణాధిక్యాలు విశేషంగా చూపించాడు కాబట్టి ఇది వ్యతిరేకాలంకారం అవుతుంది (వ్యతిరేకో విశేషశ్చేత్ ఉపమానోపమేయయోః)

సుభద్ర కన్నులు (అక్షులు) వికచమైన కమలాలు అంటే వికసించిన కమలాలు. ''వికచ'' అనే పదానికి వికసించిన అని మాత్రమే కాక కచరహితమైన (వి+ కచ) అనికూడా అర్థం చెప్పవచ్చు కచమంటే జడ సకచ అయిన సుభద్ర కన్నులు వికచమైన కమలాల్లాగా ఉన్నాయని ఈ చమత్కారం ప్రభావతీ ప్రద్యుమ్నంలో పింగళి సూరన్నగారి పద్యాన్ని గుర్తుకి తెస్తుంది (అకలుష నీలిమ నా కన్యక కచమునకోడి పాఱినవియై తేటుల్
మకరందార్థము తఱచుగ వికచములగు పుష్పములకె వెదకుచునుండున్ 2-౭౭)

నలిన లీల సంచు నలినలి గావించు
నించుమించులాడు నించు మించు
లేమ నగవుజూపు లేమన నగు బాపు!
ఐగ మెఱుంగు దాని ఐగ- మెఱుంగు (-౩౭)

నవ్వు లొలికే చూపుల్ని వర్ణించాడు ఈ పద్యంలో ఆ లేమ నగవు చూపుల్ని ఏమి+అనన్+అగు ఏమని వర్ణించి చెప్పను అని ఆశ్చర్య పోయాడు గదుడు బాపురే అన్నాడు (బాపు బాపురే, పురే- ఇవన్నీ ఆశ్చర్యార్థకాలు) ఎందు కంత ఆశ్చర్యమో మొదటి రెండు పాదాలలోనూ చెప్పాడు

నళినము- నలినము అంటే పద్మం. దాని విలాససంపదని (సంచు= అందం కాంతి) ఆమె చూపులు నలినలి గావిస్తాయి చిందర వందర చేసేస్తాయి అంటే నలిన లీలకన్నా చూపుల సంచు మిన్నగా ఉంటుంది అని అలాగే ప్రకాశించే మెరుపుని (ఇంచునట్టి మించు= మెరుపుతీగ) ఇంచుమించులాడతాయి చూపులతో మెరుపులు సాటివస్తాయా రావా అనేది ఇంచుమించుగా ఉంటుంది అని మెరుపుల కన్నా ఆమె చూపులే కాంతిమంతంగానూ, చంచలంగానూ ఉన్నాయని. ఫలితార్థంగా ఇంచుమించు ఇదీ వ్యతిరేకాలంకారమే

''నగవు చూపులు'' అనేదాన్ని రెండుగా విడగొట్టి ఆమె నగవులు నలినలీల

సంచుని నళినలిగావిస్తున్నాయనీ చూపులు ఇంచునట్టి మించుల్ని ఇంచుమించులాడుతున్నాయనీ అన్వయించవచ్చు.

కాబట్టి గదుడు (కవి) ఆశ్చర్యపోయి - నేను వర్ణించలేను బాబూ- అనేసాడు దాని జగా మెఱుంగున్ = ప్రశస్తమైన సౌందర్యాన్ని జగము + ఎఱుంగున్= లోకమే ఎరుగును ఆమె సౌందర్యం జగత్ప్రసిద్ధమని తేల్చిచెప్పేసాడు

''జగా' అనేది కాంతి ప్రశస్తి అనే అర్థాల్లో అచ్చతెనుగు పదం దీనికి హ్రస్వాంతరూపంకూడా ఉంది అది ప్రయోగించాడు

ఒక స్త్రీని అందునా నాయికను 'అది ఇది, దానిని దానియొక్క'' అని వ్యవహరించడం నేటి నాగరకతకు ఎబ్బెట్టుగా ఉంటుంది కానీ అప్పట్లో అది చెల్లింది నన్నయ్య ద్రౌపదిని కూడా ''దానిని ' అన్నాడు పైగా ఇది కవిత్వం ఎవరినైనా రాకొట్టవచ్చు

నళినలిగావించు ఇంచుమించులాడు అనే క్రియా పదాలలో ఉపమాన పదాలు స్ఫురించడం మరొక శబ్దచమత్కారం లేమ + నగవు- చూపు లేమన నగు జగ మెఱుంగు - జగ+ మెఱుంగు అనే చోటుల్లో కూడా సంధి వశంవల్ల అక్షరాను పూర్వితో శబ్దస్వరూపం అర్థ భేదంతో పునరావృత్తం అయ్యింది కాబట్టి అంతటా యమకం

జలరుహగంధి వీనుల పసల్ నవసంఖ్య నదేమి లెక్కనున్,
తెలువ నఖాంకురాళి నెలచేడియ సైకము దానుచుక్కనున్,
బొలతుక గబ్బిచన్నుగవ పువ్వుల చెండ్లను లేదు బంతనున్,
గలికి ముఖారవిందముల కల్వలరాయుని త్రోసిరాజనున్ (1-37)

గబ్బిచనుగవ ముఖార చెవులు (వీనులు), గోళ్ళు (నఖాంకుర+ ఆళి) గబ్బిచనుగవ ముఖార విందం - వీటిని వర్ణించాడు ఈ పద్యంలో చెవి తొమ్మిది అంకెలా ఉందనీ శ్రీకారంలా ఉందనీ వర్ణించడం కవులకు పరిపాటి శ్రీకారమనడం మరీ ప్రసిద్ధం నఖాంకు రాలను నక్షత్రాలతో పోలుస్తారు వక్షోజాలను పూల గుత్తులతో పోలుస్తారు ఇవి ప్రసిద్ధ మైన ఉపమానాలు వీటిని ఆమె అవయ వాలు తిరస్కరిస్తున్నాయి - అంటే వీటికన్నా అవే అందంగా ఉన్నాయని తిరస్కరిస్తున్నాయి అనడానికి తమాషా క్రియాపదాలను ఉపమాన వస్తువుల స్వరూప స్వభావాలకు అనుగుణంగా ప్రయోగించాడు అదీ చమత్కారం

ఆ పద్మగంధి వీనుల సొగసులు (పస-పసలు) తొమ్మిది అంకెను (నవ సంఖ్యన్) అదేమి లెక్క అంటున్నాయట లెక్కచెయ్యడం లేదని ఒక అర్థం అదేమి అంకె (లెక్క) అని ఎదురు ప్రశ్నించడమని మరొక అర్థం. ''తొమ్మిది'' అంకె కాబట్టి ఇది కుదిరింది

మొనతేలి అంకురాలుగా ఉన్న చేతి గోళ్ళూ కాలిగోళ్ళ వరస (నఖ+ అంకుర+ ఆళి) తార (ల) అందాన్ని ఉచుక్కు అంటోందిట నెల అంటే చంద్రుడు అతని భార్య

(చేడియ) నక్షత్రం ఆమె అందాన్ని (సైకమున్) చూసి ఈ నఖాంకురాళి తిరస్కారంగా ఉస్కోమంటోందని ఇది ఒక ధ్వన్యనుకరణ పదం ఉచుక్కు+ అనున్= ఉచుక్కనున్ ఇందులో చుక్క అనే మాట ఏర్పడుతోంది తాను + చుక్క+అనున్ నువ్వొక స్వల్పమైన చుక్కవు మాత్రమే కదా (చుక్క = నక్షత్రం తార) అంటోందని సమన్వయం. ''తాను'' అనే పదాన్ని ముందు చేర్చడంవల్ల ఈ విరుపులు సాధ్యమయ్యాయి ఇది రచనా శిల్పం

ఆ పొలతుక గబ్బచన్నుగవ పూల చెండ్లను చూసి- లేదు బంతి+ అనున్ బంతి అనేది పంక్తి శబ్దభవం వరస, సాటి అనే అర్థాల్లో వాడతారు భోజనాలప్పుడు బంతులు లేచాయి అంటారు సహపంక్తి భోజనం అనే వాడుక ఉండనే ఉంది బంతి అంటే పూలగుత్తి అని కూడా ''లేదు బంతి'' అనే పదబంధాన్ని అసత్యమూ బూటకమూ అనే భావంలో కూడా ఉపయోగిస్తారు ఇవన్నీ కుదిరేట్టు చేమకూర వెంకన్న ప్రయో గించాడు. పూలబంతులకన్నా గబ్బచన్నుగవ అందంగా ఉందని తాత్పర్యం (బంతి+ అనున్ - ఇత్త్వ సంధి చిన్నయసూరి చెప్పిన ఏమ్యాదులు ఆకృతి గణం ఇటువంటి సంధులే కాదు క్త్వార్థకేకార సంధులుకూడా ఈయన చాలా చేసాడు. చమత్కారమే ప్రధానం)

ఆ కలికి ముఖపద్మం (అరవిందం) కలువలరాయణ్ణి (చంద్రుణ్ణి) త్రోసిరాజు అంటుంది ఈ పదం చదరంగానికి సంబంధించిన పరిభాష తన బంటుని లేదా మరొక పావుని ముందుకు త్రోసి, ఎదుటి వారి రాజుకి దిగ్బంధనం కల్పించి (చెక్ చెప్పడం) ఆటకట్టు అనడాన్ని 'త్రోసిరాజు ' అంటారు. తన పావుని తప్పించి ఆట కట్టిస్తే తెరచిరాజు అంటారు దీన్నీ కవి ఉపయోగించాడు (3- 4) ఆట కట్టించడం తిరస్కరించడం అనే భావాల్లో ఇది రెండూ వాడుకలోకి వచ్చాయి రాజు అంటే చంద్రుడని కూడా అర్థం అందుకని ఆమె ముఖం చంద్రుణ్ణి త్రోసిరాజు అంటోంది

ఈమెది ముఖపద్మం. అతడు కలువలరాయడు చంద్రుడి పద్మాలతో శత్రుత్వం కావ్యజగత్ప్రసిద్ధం తన భార్యలైన కలువలతో కాకుండా ఆమె ముఖం తన శత్రులైన పద్మాంతో సన్నిహితంగా ఉంది కనక జగడానికి దిగాడు ముఖారవిందమే గెలిచింది చంద్రుణ్ణి త్రోసిరాజు అంది

''అనున్'' అనేది తద్ధర్మార్థక క్రియ తిర్యగ్జడాలు కర్తలుగా ఉన్నప్పడు మాత్రమే దీని బహువచనానికి బదులు ఏకవచనరూపం నిలుస్తుంది అందుకని ''వీనుల పసలు (కర్త-జడవాచకం) అదేమి లెక్క+ అనున్'' అనడం కుదిరింది అరవిందం కూడా ఇలాగే జడవాచకం - ఏకవచనం నఖాంకురాళి, చన్నుగవ అన్నప్పడు సమూహార్థక పదంతో (ఆళి - గవ) జడ వాచక కర్తలు ఏకవచనాంతాలే అయ్యాయి. కాబట్టి అంతటా ''అనున్'' అనేరూపం సరిపోయింది

అయ్యారే! చెలువెక్కడ!

నయ్యారే గెలువజాలు నంగజు నాలిన్,

వెయ్యాఖులలో సరిలే
రయ్యా, రుచిరాంగరుచుల నయ్యంగనకున్ (1-38)

రుచిరమైన అంగాల రుచులలో (అందాలలో) ఆ అంగనకు వెయ్యాఖులలో ఎవ్వరూ సరిలేరయ్యా బాబూ!- అని గదుడు మళ్ళీ ఆశ్చర్యం ప్రకటించాడు వేలకొలదిగా ఉన్న కాంతలలో (ఆరువేల మంది కాంతల్లో) ఆమెకు సాటివచ్చే అంగనయే లేదు పొమ్మన్నాడు. అయ్యారే ఆ చెలువు (అందం) ఎక్కడ! ఈ ప్రపంచంలో ఇంక ఏచోటా ఇంతటి అందం కనపడదు అని. చెలువ + ఎక్కడ (అత్త్వసంధి) అనే పదవిభాగంతో (చెలువ = స్త్రీ) ఆ సుభద్ర ఎక్కడా! ఈ కాంతలు ఎక్కడా! అస్సలు పోలికకే రారు పొమ్మని.

ఆమెకున్న ఆ నూగారే (ఆ+ ఆరు+ ఏ - ఆ+ యారే - అయ్యారే. యడాగమం తరవాత త్రికసంధి " ఏ " అనేది అవధారణార్థకం) అంగజు నారిని గెలువజాలుతుంది.

అంగజుడు అంటే మన్మధుడు అతడి ధనుస్సుకి తుమ్మెదలు అల్లె త్రాడుగా (నారిగా) ఉంటాయట ఈమె నూగారు తుమ్మెదల బారుకన్నా అందంగా ఉండి అంగజుని వింటినారిని గెలువగలదుట. విల్లు- నారీ అంటున్నాడు కనక గెలుచుట అనే పదం సార్థకం. అది మామూలు నారి కాదు మన్మథుని వింటినారి. అదొక విశేషం

అల్లెత్రాడు అనే అర్థంలో నారి అనేమాట అచ్చికం 'నారీ' అనే సంస్కృత పదానికి స్త్రీ అని అర్థం ఇది తత్సమంగా తెలుగులోకి వస్తే 'నారి' అవుతుంది అంగజు నారి అంటే రతిదేవి మిగతా సొగసులూ, పోలికలూ ఏమీ అవసరం లేకుండా కేవలం ఒక్క నూగారుతోనే సుభద్రాదేవి రతిదేవిని గెలవగలదు అనికూడా అర్థం స్ఫురిస్తోంది

అయ్యారే - అ య్యారే అని యమకం సాధించాడు మొత్తం పద్యంలో ద్విప్రాస ఉంది. ఇటువంటి యమకాలకూ ఇటువంటి పద్య రచనకూ శ్రీకారం చుట్టినవాడు నాచనసోమనాథుడు అరి గరమున నే దాల్చిన - నరి గరము నగేంద్ర ధీరుడైనన్ చెడడే (4- 62) ఇలాంటి పద్యాలు ఉత్తరహరివంశంలో వాచవిగా సాక్షాత్కరిస్తాయి. దీన్ని ఐక్కన్న పోతన్నలు బాగా అభివృద్ధిపరిచారు చేమకూర వేంకటకవి ఈ శిల్పాన్ని పరాకాష్ఠకు తీసుకువెళ్ళాడు

కడు హెచ్చు కొప్పు, దానిన్
గడవన్ జనుదోయి హెచ్చు, కటి యన్నిటికిన్
గడు హెచ్చు, హెచ్చులన్నియు
నడుమే పసలేదు గాని నారీమణికిన్ (1-39)

సుభద్రాదేవి గుండ్రని కొప్పు (జుట్టుముడి) చాలా పెద్దది దానిని మించగలిగినంత హెచ్చు ఆమె చనుదోయిది అంటే అవి కొప్పకన్నా గుండ్రంగా

పెద్దవిగా ఉన్నాయని. ఆమె కటిప్రదేశం (జఘనభాగం) అన్నింటికంటే కడు హెచ్చు ఆ రెండింటికన్నా చాలా పెద్దది అని . అతి ఘనం ఆమె జఘనం. నడుము ఒక్కటే పసలేదు గానీ ఆ నారీమణికి మిగతావి అన్నీ హెచ్చులే. ఆ నడుముకి పసలేకపోవడమే అందం. అసలు నడుము ఉన్నట్టు లేనట్టు అన్నంత సన్నంగా ఉంటే మరీ అందం. అస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరి- అన్నాడు శ్రీనాథుడు.

ఈ పద్యంలో మరికొన్ని విశేషాన్వయాలు చెప్పారు వ్యాఖ్యాతలు (హృదయోల్లాసవ్యాఖ్య. శ్రీ తాపీ ధర్మారావు). దానం కలిగినది దాని. గుణం కలిగినది గుణి అన్నట్టు. దానం అంటే దాతృత్వం (ఈవి) అనీ, మదజలం అనీ రెండు అర్థాలు. మదం అనే అర్థంలో ''దాని'' అంటే ఏనుగు. దాతృత్వానికి మేఘం పెట్టిందిపేరు. ఎవ్వరూ అడగకండానే పుష్కలంగా నీరు దానం చేస్తుంది. ఇప్పుడు ఈ అర్థాలలోనూ పద్యంలో ''దానిన్'' అనే మాట అన్వయిస్తోంది.

కడు హెచ్చు కొప్పు దానిన్. ఆమె కొప్పు నల్లదనంలో వైశాల్యంలో మేఘాన్ని (దానిన్) అతిశయిస్తోంది. కడు హెచ్చుతోంది. ఇంక మిగిలింది ''కడవన్ చనుదోయి హెచ్చు '' అనే ముక్క. కడవ అంటే గుండ్రంగా ఉండే మంచినీళ్ళ కుండ. (ఇది పయోధరమే). దాని చనుదోయి హెచ్చు తోంది. ఏకవచనమే అయినా బహువచనార్థం స్వీకరించవచ్చు. జాత్యేకవచనం అనుకుందాం.

కడు హెచ్చు కొప్పు - అని ఆపేసి: ''దానిన్ కడవన్ చనుదోయి హెచ్చు'' అని వాక్యం విరుచుకుంటే ఏనుగునీ (దానిన్) కుండనీ చనుదోయి హెచ్చుతుందిఅనే అన్వయం లభిస్తుంది. ఉపమేయం చను దోయి కనక ఏనుగు అంటే కుంభస్థలమే గ్రాహ్యం.

ఇన్ని రకాల అన్వయాలతో శ్లేషలతో సారాలంకారంగా రూపొంది వ్యాజస్తుతితో ముగిసింది ఈ చిన్న కందం. ఇలాంటివి ఉన్నాయి కాబట్టే ఈ కావ్యం శబ్ద చమత్కారాలకు మూలకందం.

అంగము జాళువా పసిడి యంగము, క్రొన్నెలవంక నెన్నొసల్
ముంగురు లింద్రనీలముల ముంగురు, లంగజు డాలు వాలుజూ
పుంగవ యేమిచెప్ప ! నృపపుంగవ ! ముజ్జగ మేల జేయు న
య్యంగన బోలు సౌక్కసకి యుం గన బో, నెటిమించ నన్నిటన్ (1-40)

అంగము అనే మాటకి శరీరము, అవయవము, భాగము, అంశ- ఇలా చాలా అర్థాలు ఉన్నాయి. సుభద్రాదేవి శరీరం జాళువా పసిడిలో ఒక భాగం. మేలిమి బంగారపు తునకలాగా ఉంటుందని. ఆమె శరీరమే ఒక సువర్ణశలాక. జాళువాదేశంలో దొరికే పసిడి ఉత్తమోత్తమమైనదని కవుల వర్ణన. అందుకని జాలువా పసిడి అంటే మేలిమి బంగారమని స్థిరపడింది. (యవ నాశ్వం అన్నట్టు)

ఆమె నెన్నొసలు - నెటి + నొసలు - అందమైన నుదురు- క్రొన్నెల వంక. విదియనాటి చంద్రవంక. నాయికల ఫాలభాగాన్ని చంద్రరేఖతో పోలుస్తారు. ఆకారం

లోనూ ఆకర్షణలోనూ పోలిక

ఆమె ముంగురులు - నుదిటి మీద నాట్యంచేసే అలకలు ఇంద్ర నీల మణులకు (మరకత మణులకు) తొలి గురువులు అంత నల్లగా నిగనిగ లాడుతున్నాయి అని (ఇంద్రవత్ నీలః - ఇంద్రనీలః- ఇంద్రునివలె నల్లనిది అని శబ్దకల్పద్రుమంలో వ్యుత్పత్తి. ఇంద్రుడూ ఇంద్రుడి కొడుకు అర్జునుడూ కూడా నలుపే నన్నమాట)

గురుశిష్య - సోదర - మాతాపుత్ర - ఇత్యాది సంబంధాలను పోలిక అనే అర్థంలో వాడటం చాలామంది కవులదగ్గరఉంది వెంకన్న దగ్గర మరీ ఉంది ఆ సంబంధాలను ఎక్కువచోట్ల సార్థకంగానే వాడాడు

ప్రిాతాది సంధితో ముందు + కురులు - ముంగురులు అయినట్టే ముందు లేదా మున్ + గురు (వు) లు = ముంగురులు అవుతుంది సరళ స్థిరాలు పరంగా ఉన్నప్పుడుకూడా కొన్ని చోట్ల ద్రుతానికి పూర్ణబిందు స్థితి ఉంటుంది (వచ్చెంగోవులు, మెఱ సెంఖడ్గము - ఇత్యాదుల్ని చిన్నయసూరి ఉదాహరించాడు) కాబట్టి గురుశబ్దంలో సహజసరళం పరంగా ఉన్నా పూర్ణ బిందువుకి సందేహమే లేదు ''మునురులు'' అని సంశ్లేష రూపాన్ని కూడా రాసుకోవచ్చుగానీ అలకలు అనే అర్థంలో ఈ పదం ప్రాసలో ఉంది పూర్ణబిందు పూర్వక గకారం కదా ప్రాస. అందుచేత ''ముంగురులు'' అనే రూపమే స్వీకరించాలి దాన్ని బట్టి గురువుల్ని కూడా ''ముంగురులు''గానే ఉంచాలి

పాదానికి ప్రారంభంలో ఉన్న మూడు అక్షరాలే, అదే ఆనుపూర్వితో యతిస్థానంనుంచి మరో భగణంగా పునరావృత్తం కావడం ఈ పద్యంలో ఒక రచనా విశేషం '' ఆ నగరాజ భేదియును నానగరాని మనోరథంబుతో '' అంటూ వసుచరిత్రకారుడు ఇటువంటి పద్యమే రచించాడు (వసు- తృతీయ - 79).

ఇంక ఆమె వాలు చూపున్ + కవ (జంట) అంగజుడి డాలు డాలు అంటే జెండా అని ఒక అర్థం కత్తియుద్ధం చేసేవారు ఆత్మరక్షణ కోసంరెండో చేతితో పట్టుకునే సిబ్బె అని మరొక అర్థం సోగగా ఉన్న కన్నుల జంట మన్మధుడి పతాక మన్మధుడు మీనకేతనుడు కాబట్టి కన్నులు చేపలలా విశాలంగా నిగనిగలాడుతూ ఉన్నాయని మన్మథుడంతటివాడు ఆత్మరక్షణ చేసుకోవాలంటే ఈమె చూపుల్ని ఆశ్రయించవలసిందేనని మరొక సమన్వయం

ఓ నృపపుంగవా ! ఏమి చెప్పమంటావయ్యా ఆమె సౌందర్యం! గదుడు మరోసారి ఆశ్చర్యంప్రకటించాడు.

'పుంగవము అంటే (మగగోవు) ఎద్దు వృషభమన్నమాట సింహశార్దూలాది శబ్దాలలాగా ఇదికూడా శ్రేష్ఠతార్థకం నృపపుంగవా అంటే ఓ రాజోత్తమా అని సంబోధన చూపుంగవ-నృపపుంగవ అని ''పుంగవ '' అనే మూడక్షరాలు ఆవృత్తమయ్యాయి

అన్ని విషయాలలోనూ చక్కదనం (నెఱి) మించుతూ తనను చెట్టపట్టిన మగనితో ముజ్జగాలనూ పరిపాలింప జెయ్యగలిగిన ఆ అంగనను సరిపోలే మరొక్క సకియను (స్త్రీని) ఇప్పటికి చూడలేదు - ఇక ముందు కనబోను గదుడు నిశ్చయంగా చెప్పేసాడు సుభద్రలాంటి అమ్మాయిని ఇంతకు ముందు ఎన్నడూ ఎక్కడా చూడలేదనే సంగతిని ఆదిలోనే కనన్ సుభద్రకున్ సమంబుగాగ నే మృగీవిలోకనన్ అంటూ చెప్పనే చెప్పాడు ఇప్పడేమో - ఇక శేషించి ఉన్న ముందటి కాలంలో కూడా "కన బోను" అన్నాడు అంతటి అందగత్తె భూతలంలో లేదు భవిష్యత్కాలం లో ఉండదు అని.

తనను వివాహమాడినవాడితో ముజ్జగాలనూ ఏలిస్తుంది (ఏలన్+ చేయున్) ఆమె జాతకమహిమ అటువంటిది అని ఇలాంటి కథలు పురాణాలలోనూ ఇతరత్రా చాలా కనిపిస్తాయి ఇదికాక మరో విశేషం ఉంది. పైని చెప్పిన ఉపమానాలు మూడూ మూడు లోకాలకు సంబంధించినవి. జాళువా పసిడి భూలోకానిది. క్రొన్నెల వంక చంద్రలో కానిది ఇంద్రనీలమణులు సారూప్యంవల్ల ఇంద్రలోకానివి అను కుందాం లేదా గనుల్లో దొరుకుతాయి కాబట్టి, సర్పాల పడగల మీద ఉంటాయి కాబట్టి పాతాళానికి సంబంధించినవైనా కావచ్చు, గురువంటే తండ్రి అనికూడా అర్థం అంటే జన్మనిచ్చినవాడు ఇంద్రనీలాలకు గురువులు సర్పశిరస్సులు. అవికూడా అలకలకు సాటిరావచ్చు, ఇలా ఒప్పకుంటే నెలవంక ఊర్ధ్వలోకాలకు ప్రతినిధి అవుతుంది ముజ్జగాలూ కుదిరి పోయాయి ఇవి మూడూ ఆమె స్వాధీనంలోనే ఉన్నాయి ఇది సూచించ డానికే తాద్రూప్యరూపకాలు చెయ్యకండా అభేదరూపకాలు చేసాడు కవి ఆమె శరీరం జాళువాపసిడి. నొసలు నెలవంక కురులు ఇంద్రనీలాల మున్గురులు ఇవి మూడూ అభేదరూపకాలే కాబట్టి ముజ్జగాలూ ఆమె శరీరం మీదనే ఉన్నాయి మూడింటా నెఱి మించుతోంది చెట్టపట్టిన వాడితో ఏలించు కుంటుంది. ఇటువంటి వెసులుబాటు ఏ యుగంలోనూ, ఏ లోకంలోనూ ఏ వనితకూ ఉండదు అందుకనే సుభద్రకు సాటివచ్చే మరొక్క సకియను కనుబోను అని గదుడు నిర్ధారించి చెప్పగలిగాడు

ఇంద్రనీలమణిని పాలల్లో వేస్తే పాలుకూడా నీలంగా మారి పోతాయట అది దీనికి పరీక్ష అన్నారు రత్నకోవిదులు క్షీరమధ్యే క్షిపే న్నీలం, క్షీరం చేత్ నీలతాం వ్రజేత్ ఇంద్రనీలమితి ఖ్యాతం తదా హి రత్న కోవిదైః

ఎక్కడ జెప్పినాడ దరళేక్షణ చక్కదనమ్ము ! నింక న
మ్మక్క! యదే మనంగ నిపుడందు శతాంశము దెల్పలేదు నే,
నొక్కొక యంగ మెంచ వలయున్ బదివేల ముఖంబు లాయెబో
చొక్కపు చూపులో సాలపు చూచిన గాక యెఱుంగ వచ్చునే (I -4)

ఓ అర్జునా ! అబిత్తర చూపుల సుభద్రాదేవి (తరళ+ ఈక్షణ) సౌందర్యాన్ని అసలు నేను ఎక్కడ చెప్పాను ! ఇది చెప్పినట్టే కాదు అహహా (అమ్మక్క అనేమాట,

ఆశ్చర్యార్థకం. అవ్యయం). అదేమిటయ్యా ఇప్పటి దాకా పదిపద్యాల్లో వర్ణించావు కదా అంటే - ఇప్పటి దాకా చెప్పింది నూరో వంతుకూడా కాదు. ఒక్కొక్క అవయవాన్నీ ఎంచాలంటే పది వేల ముఖాలు కావాలి (వలయున్). ఆయెబో - అయ్యిందిలే - నాకెక్కడ సాధ్యమవు తుంది ఒక వేళ పదివేల ముఖాలతో వర్ణించి చెప్పినా రూప సౌందర్యం రూపు కట్టించవచ్చునేమో కాని, ఆమె అందమైన (చొక్కము) చూపులో ఉండే సొలపుని (ఒయ్యారాన్ని) చూసి తెలుసుకోవలసిందే తప్ప మరోలా అంటే - వర్ణనలతోనూ, చిత్ర పటాలతోనూ ఎరుగగల్గడం సాధ్యం కాదు.

ఒక్క ముఖమే ఉన్న గదుడు పది పద్యాల్లో వర్ణించాడు. అది వెయ్యిలో శతాంశం (నూరోవంతు) అంటున్నాడు. అటువంటిది వెయ్యికి వెయ్యి పాళ్ళూ వర్ణించాలంటే పదివేల ముఖాలు కావలసిందే మరి

అర్జునుడు భూప్రదక్షిణానికి బయలుదేరి గంగ ఒడ్డున విడిది చేసాడు నాగకన్య ఉలూచి చూసింది మత్స్యయంత్రాన్ని కొట్టినప్పటి నుంచీ అర్జునుణ్ని వలచి ఉంది. అమాంతం నాగలోకానికి ఎత్తుకుపోయి తన పడకటింటిలో దించింది జపం ముగించుకుని అతడు కళ్ళు తెరిచి ఉలూచిని చూసాడు. సంభాషించాడు ఆవిడ హృదయం తెలుసుకున్నాక సౌందర్యాన్ని పరిశీలనగా చూసి మనస్సులోనే మెచ్చు కుంటున్నాడు

అన్నన్న! మొగము వెన్నుని
యన్నన్న జయించు, గన్నులన్నన్ నలినా
సన్నములు, నడుము మిక్కిలి
సన్నము, మాటలు సుధాప్రసన్నము లెన్నన్ (1-83)

అన్నన్నా ఈమె మొగం వెన్నుని అన్న అన్నను జయిస్తుంది. వెన్నుడు అంటే విష్ణుమూర్తి అతడి అన్ను (భార్య, స్త్రీ) లక్ష్మీదేవి. ఆమెకు అన్నగారు చంద్రుడు క్షీరసముద్రంలో ముందు చంద్రుడు పుట్టాడు తరవాత లక్ష్మీదేవి జన్మించింది. కాబట్టి అన్నగారు అచంద్రుణ్ణి జయిస్తోంది ఉలూచి ముఖం అంటే అంతకన్నా ఆహ్లాదకరంగా ఉంది అని.

ఇక కన్నులు అ న్నామా (అన్నన్) అవి నలినా సన్నాలు. నళినాలకు (పద్మాలకు) ఆ సన్నాలు అంటే దగ్గరవి. పద్మాలకు సన్నిహితంగా సరిపోలు తున్నాయని.

ఆమె నడుము మిక్కిలి సన్నము ఎంచి చూస్తే (ఎన్నన్) మాటలేమో సుధలాగా (అమృతంలాగా) ప్రసన్నాలు

అన్నన్న - అన్నన్న జయించు - కన్ను లన్నన్నలిన - అని మూడుసార్లు ''అన్నన్న'' అనే మూడక్షరాలు పునః పునరావృత్తమయ్యాయి అలాగే ''సన్నము'' అనేది మరో మూడుసార్లు వినిపించింది కేవలం యమకం. శబ్ద చమత్కారం మాత్రమే.

నువ్వు బువ్వు నవ్వు జవ్వని నాసిక,

చివురు సవురు జవురు నువిద మోవి,

మబ్బు నుబ్బు గెబ్బు బిబ్బోకవతి వేణి,

మెఱపు నొఱపు బఱపు దెఱవ మేను (1-84)

ఆ జవ్వని నాసిక (ముక్కుకొస) నువ్వు పువ్వుని నవ్వుతోంది పరిహాసిస్తోంది అంటే నువ్వు మొక్కల పువ్వు కన్నా కొనతేలి అందంగా ఉంది అని

ఆ ఉవిద అధరోష్ఠం (మోవి) చివురాకు సవురును (సొరు - సవురు = అందం) జవిరేస్తోంది జవురుట అంటే దండించటం పారద్రోలడం, హింసించడం ఇలాంటి అర్థాలు ఉన్నాయి చిగురు సొరుని జవురుతోందంటే ఆ మోవి అంతకంటే ఎర్రగా సుకుమారంగా ఉంది అని

ఆ విలాసవతి (బిబ్బోకవతి) జడ- మబ్బు యొక్క ఉబ్బును (గర్వాన్ని) గెబ్బుతుంది గెబ్బడం అంటే పడద్రొయ్యడం ఇదీ తిరస్కరించడమే అంటే ఆమె వేనలి మబ్బుకంటే నల్లగా నిడుదగా ఉంది అని

ఆ తెరవ శరీరం (మేను) మెఱపుయొక్క ఒఱపుని (అందాన్ని) పారద్రోలుతోంది (పరపుట=పరచునట్లు చేయుట) మెరుపుని మించి కాంతిమంతంగా ఉంది అని

ఉపమానాల్లో కానీ ఉపమేయాల్లో కానీ ఏ విశేషమూ లేదు ఏ కొత్తదనమూలేదు మాత్రల కొలతలో, చివరి అక్షరాలలో సమానంగా ఉన్న పదాల పునఃపునరావృత్తి ఒక్కటే రవ్వంత శబ్ద చమత్కారం. ఇటువంటి రచన సాహిత్య విద్యలో ప్రారంభకుల్ని ఆకర్షించి ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది

రవరవలు నెఱపు నీలపు
రవ రవణముతోడ చెలి యరాళకచంబుల్,
కవ కవ నవ్వున్ వలి జ
క్కవ కవ గలకంఠకంఠి కఠినకుచంబుల్ (-85)

ఈ చెలి యొక్క అరాళకచములు (వంకరలు తిరిగిన గిరజాల శిరోజాలు) నీలపు రవ్వయొక్క (రవ్వ-రవ = మణి) రవణంతో - అంటే అందంతో రవరవలు నెరపుతుంది జగడమాడుతుంది అంటే ఇంద్రనీల మణులకన్నా నల్లగా నిగనిగలాడుతున్నాయని కచాలకు అరాళత్వం (కుటిలత్వం) ఉంది కనక అందరితోనూ రవరవలు నెరపుతున్నాయని

ఈ కలకంఠకంఠి యొక్క కఠినమ్మైన కుచాలు గుండ్రటి జక్కవల జంటను చూసి కవ కవ నవ్వుతాయి కలకంఠము అంటే కోకిల కోకిల కంఠ స్వరం వంటి కంఠం కలది - కలకంఠ కంఠి ఉలూచి అప్పటికే మాట్లాడింది కాబట్టి ఆమె కంఠస్వరం అర్జునుడికి తెలిసింది ఆమె కుచాలు చూపులకే కఠినంగా కనపడుతున్నాయి గుండ్రంగా ఉన్నాయి అందుకని జక్కవ కవతో (చక్రవాకయుగళి) పోటీ పడి వాటిని అట్టహాసంగా పరిహాసిస్తున్నాయి వాటికన్నా గుండ్రంగా ఉన్నాయని కాఠిన్యం ఉంది కనక అహంకరించి నవ్వడం ''కవకవ'' అనేది ధ్వన్యనుకరణ

ఇది కచ్చితంగా కచకుచవర్ణన పద్యం భావంలో కొత్తదనం ఏమీలేదు రవరవలు – కవకవలు అనే అక్షరక్రమం పునరుక్తమై యమకం అవుతోంది అరాళ – కఠిన శబ్దాలను సాభిప్రాయ విశేషణాలుగా ప్రయోగించాడు కనక పరికరాలంకారం చెప్పాలి. (అలంకార: పరికర: సాభిప్రాయే విశేషణే).

చెక్కుల యందమున్, మొగము చెల్వము, జిన్నవ నీటు,వేణి తీ
రెక్కడ జూడ, మన్నిటికి నెక్కు వదేమన– సైకతంబుతో
నెక్కటి కయ్యమున్ సలుపు నిక్కటి యొక్కటి చాలదే మరుం
డక్కగొనన్ రతిన్ గెలిచి డక్కగొనన్ నవమోహనాంగికిన్ (1-80)

ఈమె చెక్కిళ్ల అందం, ముఖ సౌందర్యం వక్షోజాల నీటుదనం, జడతీరు– వీటిని మరింక ఎక్కడా చూడం ఈమె దగ్గర అన్నింటి కన్నా ఎక్కువది అదేమి అన్నట్టయితే (అనన్) ఈ కటి ఒక్కటీ చాలదే అది సైకతంతో (ఇసుక తిన్నెతో) ఎక్కటి కయ్యం సల్పుతుంది (ఎక్కటి = అద్వితీయం) ద్వంద్వ యుద్ధం చేస్తుంది అంటే సైకతాన్ని పోలి ఉంది అని

మన్మధుణ్ణి లోబరచుకోవడానికీ (దక్కన్ – డక్కన్ గొనుట = వశపరచుకొనుట) రతిదేవిని గెలిచి ఆమె దగ్గర రాజచిహ్నంగా ఉన్న డక్కను (ఢక్కా) ఊడలాక్కోడానికీ– ఈ నవమోహనాంగికి ఇక్కటి ఒక్కటీ చాలదే! ముమ్మాటికీ చాలునని

మోహనాంగుడు మన్మధుడు మోహనం అనే బాణం అంగంగా (చతురంగబలాలలో ఒకటిగా) కలవాడు – మోహనాంగుడు అతని భార్య మోహనాంగి అంటే రతిదేవి ఈ ఉలూచి నవ–మోహనాంగి. అంటే కొత్త రతిదేవి పాత రతిదేవిని గెలిచి రాజచిహ్నం స్వాధీనపరచుకున్న కొత్త రతిదేవి ఈ ఉలూచి ఈ అందంకూడా చెప్పారు హృదయోల్లాస వ్యాఖ్యలో శ్రీ తాపీధర్మారావుగారు

ఉలూచికి ఇలావంతుడనే కొడుకు జన్మించాడు పాప జవరాలి బంగారు పడకటింటినుంచి మళ్ళీ గంగ ఒడ్డుకి వచ్చి చేరాడు అర్జునుడు ఉలూచి తన మాయామంత్రంతో చేర్చింది నర్మసచివుడు విశారదుడు మొదలైనవారు సంతోషించారు విశారదుడితో ఉలూచి కథ చెబుతూ మళ్ళీ వర్ణించాడు

చెప్పెడిదేమి! కన్నుగవ చేరలకెక్కుడు, చంద్ర బింబమే
తప్పదు మోము, మోవి సవతా చివురెక్కడి మాట!; గొప్పకున్
గొప్ప పిఱుందు, గబ్బిచనుగుబ్బలు తొగిటి కెచ్చు, జూళువా
యొప్పుల కుప్ప మేను, నడు మున్నదొ లేదొ యెఱుంగ నింతకున్ (– 7)

సవతి + ఆ = సవతా. మోవికి చివురు సవతా ? సాటియా ? ఇదెక్కడి మాట.. ఇంతకూ ఆమెకు నడుము ఉన్నదో లేదో ఎరగను సుమా– అనడంలో ఉంది చమత్కారం

చంగున దాటు చూపు లిరుచక్కని బేడిసలేమొ, మీటినన్
కంగున వాగు గుబ్బలు చొకారపు తాళము లేమొ,చూడనౌ

వంగున మించు చెక్కిళు లొయారపు టద్దము లేమొ, చొక్కమై
రంగున మీఱు దాని యధరంబిల గెంపగు నేమొ నెచ్చెలీ! (౧-౧౧౮)

ఆమె చూపులు చంగున (చెంగున) దాటుతున్నాయి కనక రెండూ రెండు చక్కని బేడిసలేమో (బేడిసలు = ఒకరకం చేపలు) మీటితే ఖంగుమని మ్రోగుతున్నాయి కనక ఆమె వక్షోజాలు అందమైన తాళపు సిబ్బెలేమో ప్రతిబింబం చూసుకోడానికి అనువైన హంగుతో ప్రకాశిస్తున్న చెక్కిళ్ళు ఒయ్యారమైన అద్దాలేమో! చొక్కంగా ఎర్రని రంగుతో విలసిల్లుతున్న (మీఱునట్టి) అధరం కెంపేమో (కెంపు= ఎర్రటి మణి, పద్మరాగం). ఇలన్ = భూమి మీద - అనేది పాదపూరణకోసమే. చెలి అంటే నేస్తం స్త్రీ పురుషులు ఎవరయినా కావచ్చు, నెఱి (ఱ) + చెలి - నెచ్చెలీ = ఓ మిత్రమా, విశారదా అని సంబుద్ధి

ఆ యెలనాగ వేణి మెఱుగారు కటారికి మాసటీడగుం
బో యనవచ్చు, నమ్మెఱుగుబోడి పిఱుందు సమస్త భూమికిన్
రాయలనంగ వచ్చు, నల రాజనిభాస్య యెలుంగు గట్టివా
కోయిల కంచుకుత్తికలకున్ బయకాడనవచ్చు నెచ్చెలీ! (౧-౧౧౯)

ఓ ప్రియ మిత్రమా విశారదా! ఆ యెలనాగ ఉలూచి జడ (వేణి) తళతళలాడే కటారికి (కత్తికి) మాసటీడు (ఖడ్గవిద్యా ప్రవీణుడు) అవుతుందిసుమా అనవచ్చు, తళతళలాడే పాడవుపాటి ఖడ్గంలా ఉంది ఆమె జడ

. ఆ శంపాలతాంగి (మెరుగుబోడి) జఘన భాగం సమస్త భూమికీ రాయలు (రాజు) అనవచ్చు, అంతవిశాలంగా ఉంది అని. అల చంద్రునితో సాటి వచ్చే ముఖం కలిగిన ఆమె కంఠస్వరం (రాజ+ నిభ+ ఆస్య) గయ్యాళి కోయిలల కంచు కంఠాలకు (కుత్తికలు) సంగీత గురువు (బయకాడు)

ఆమె జడ ఆమె జఘనం, ఆమె కంఠస్వరం మూడింటినీ వర్ణించాడు. గట్టివాయి (నోరు) కలది - గట్టివాకోయిల (కోకిల) నోరున్న కోకిల అని దానిది కంచు కంఠం ఆ కంఠానికి కూడా పాఠాలు నేర్పగలిగిన బయకాడు ఉలూచి కంఠస్వరం. మాసటీడు రాయలు, బయకాడు అనే పదాలను మించు - అతిశయించు అనే అర్థాలకు సూచకంగా ప్రయోగించడం ఒక విశేషం. అవి మూడూ (సాహస) పురుష వాచక శబ్దాలే. శారీరకంగా మానసికంగా స్త్రీత్వం ఉన్నా, శృంగార చేష్టాగతంగా ఉలూచిలో మగతనం ఉన్నదని సూచన కిరీటిని అపహరించుకుని తీసుకుపోయింది. సరాసరి తన పడకటింటిలోకి అతడికి వ్రతభంగం కలిగించింది. అటుపైని క్రీడా విలాసాలలో కూడా తన ప్రౌఢి చూపించింది.

నాగరకముద్ర గల మంచి జాగరియట
నాగవాసములో వింత నటనల దట
కులుకు గుబ్బల ప్రాయంపు గోమలి యట
వలచి వలపింపదే యెంతవానినైన (౧-౧౧౦)

అని ఆ సందర్భంలో కవి విస్తుపోయాడు. కాబట్టి ఈమెకు కొంత సాహసం, కొంత మగటిమి ఉన్నాయి. ఈ విషయాన్ని సూచించే ఒక మొరటు సామెత తెలుగునాట ప్రచారంలో ఉంది. బహుశ దాన్ని స్ఫురింప జెయ్యడానికే నేమో "కంచు కుత్తికలు" అన్నాడు.

గ్రామ్యధర్మాన్ని బోధించే ఇలాంటి మొరటు సామెతల్నీ పలుకు బడుల్నీ చాలావాటిని- కొండొకచో నాజూకుగా మలిచి ఉపయోగించు కున్నాడు ఈ చేమకూర వేంకట కవి గుట్టసియాడటం (1-6), చిత్తజుడల్లి తూపు మొన చెయ్యడం - ధ్వజ మెత్తడం (3- 5), అత్తవారి నాయువు కల్లువా డగుననడం (3- 26), మూడు వలపుల్ వలపించడం (- 09), రేకు మడచడం (3- 66) మొదలైనవి అన్నీ అటువంటివే.

మదిరాక్షి మోవి జిగి ప్రతి
వదనము గావించు గీర వదనముతోడన్,
మదనుని విలు గొన వచ్చున్
సుదతీమణి కన్నుబొమల సుద తీరెంచన్ (1-120)

ఆ కాటుక కన్నుల చిన్న దాని (మదిరము = కాటుక పిట్ట) మోవి కాంతి (జిగి) కీర వదనంతో (కీరము = చిలక వదనము = ముక్కు) ప్రతివదనం చేస్తుంది. ప్రతివదనం అంటే ముఖాముఖి ఎదుర్కోవడం. చిలకముక్కుకన్నా ఉలూచి పెదవి ఎర్రగా ఉంది అని

అందమైన పలువరుస కలిగిన స్త్రీలలో (సుదతీషు) మణి వంటిది ఆ ఉలూచి సుదతీమణి అన్నాడు. ఆమె కనుబొమ్మల కొసల తీరు (సుత సుద = కొన) ఎంచినట్టయితే- మదనుడి విల్లుని కొనుక్కోవచ్చు (కొనన్ వచ్చు). అంటే మన్మథధనుస్సు కొసలకంటే మించి క్రొనతేలి హృదయా వర్జకంగా ఉన్నాయని. కనుబొమ్మల సుద తీరును ఎంచడానికి (స్తుతిం చడానికి) మదనుని విలుకొన (ధనురగ్రభాగం) తానై వస్తుంది. (వచ్చు న్) అనికూడా అన్వయించవచ్చు

ఏమయినా అటూ ఇటూ విరుపుల్లోనూ, అన్వయాల్లోనూ చమత్కారాలే తప్ప ఇవి అపూర్వ కల్పనలు కావు. ప్రతివదనము - కీరవదనము, సుదతీమణి - సుద, తీరు ఈ శబ్దస్వరూప పునరుక్తి యమకం.

అల ఇడ యందమున్, మెఱుగుటారు మిటారము, నాకు ముందుగా
జిలువ కొలం బటంచు తెలి చెప్పక తొల్తనె చెప్పె, దత్తనూ
విలసన మెన్న గన్నదియు విన్నదిగా, దిలలో లతాంగు ల
వ్వాలతుక కాలిగోరులకు బోలరు, పోలునొ యేమొ తారకల్ (1-121)

ఆమె వేణీ సౌందర్యం, నూగారు ఒయ్యారం (మిటారం = మిడిసి పాటు) ఇవి రెండూ - ఉలూచి చెప్పకముందే ఆమెది నాగకులం (చిలువ = పాము కులము- కొలము = జాతి) అనే విషయాన్ని నాకు తెలియ జెప్పాయి అంటే అవి రెండూ నల్ల

త్రాచు పాముల్లాగా ఉన్నాయని. ఆమె శరీరంవిలాసం (తత్+తనూ +విలసనము) ఉంది చూసావా - అది ఎప్పుడూ ఎక్కడా కన్నది కాదు విన్నది కాదు సర్పజాతికి కన్నులే చెవులు అందుకే పాముల్ని చక్షుఃశ్రోత్రాలు అంటారు వాళ్ళకి కన్నదే విన్నది అవుతుంది అర్జునుడికిమాత్రం ఆ చిలువచెలువ చెలువు కన్నదీ కాదు. విన్నదీ కాదు

ఈ భూమి మీద (ఇలలో) ఉండే లతాంగులు (ఇలలో లతాం గులు = భూకాంతలు) ఆ పాలతుక కాలిగోరులకు కూడా సరిపోలరు ఒక వేళ పోలితే గీలితే తారకలేమన్నా సరిపోలతా యేమో

కాలిగోళ్ళను తారకలతో పోల్చడం సుప్రసిద్ధం ఉక్తి చమత్కారంతో దానినే చెప్పాడు ఇలలో లతాంగులు సరిపోలరు అనడానికి కాలిగోళ్ళకు కూడా సరిపోలరు అనే నుడికారం ఉపయోగించి, గోరులకి తారకల పోలిక తెచ్చాడు అదికూడా సందేహంగా (అలంకారం) వదిలేసాడు

ఇక్కడితో ఉలూచీవర్ణన అయ్యింది అర్జునుడు హిమాలయా లకు వెళ్ళాడు అక్కడినుంచి పుణ్యక్షేత్రాలు అన్నీ చూసుకుంటూ దక్షిణాన రామేశ్వరం చేరుకున్నాడు పన్నెండు నెలల కాలం గడిచింది పదమూడో నెల అక్కడినుంచి మలయధ్వజ మహారాజుగారు పాలించే పాండ్య మండలంలో రాజధానికి బయలుదేరాడు ఇదంతా సుదీర్ఘవచనం (- 28). దారిలో రాజోద్యానవనం కనపడింది అందులో చెలికత్తెలతో విహరిస్తున్న సుందరాంగి కనిపించింది ఆమెయే పాండ్యరాజ సుత చిత్రాంగద పాండ్యరాజసుతగాంచి ఆ పాండురాజసుతుడు (- 29)

ఈ వెలంది యొడల్- పైడిలో వెలంది,
యీ నెలంత లలాటంబు - లే నెలంత,
యీ సుహాణి రదశ్రేణియే - సుహాణి,
యీబిడారు మృగీమదశ్రీ - బిడారు (- 30)

ఈ వెలది శరీరం (ఒడల్) బంగారంలో మిక్కిలి వెల కలది - వెలంది. స్త్రీ అనే అర్థంలో వెలది అనే మాటలో అరసున్న ఉంటుంది దానిని అవసరాన్నిబట్టి నిండుసున్న చేసుకోవచ్చు అలా చేసి రెండు అర్థాలలోనూ ''వెలంది'' అనే పదం ఏర్పడేట్టు ప్రయోగించాడు అలాగే నెలత - నెలంత.

ఈ నెలత లలాటం (నుదురు) లేనెల + అంత. నెల అంటే చంద్రుడు లేతదైన నెల అంటే విదియనాటి చంద్రరేఖ

ఆమె చేతులు అందంగా ఉన్నాయి అందుకని సుహాణి అన్నాడు ఈ సుహాణి పలువరుసయే (రదము = దంతము) సుహాణి ముత్యాల తార త్యాన్ని (నీరు కాంతి) సుహాణి అంటారు అంటే ఆమె పలు వరుస ముత్యాల్లా ఉంది అని

ఈబిడ (ఈవిడ)నూగారు కస్తూరి నల్లదనానికి (మృగీమదపు శ్రీ) బిడారం - నివాస స్థానం. ఈబిడఆరు కస్తూరిరేఖలాగా నల్లగా ఉంది అని.

వెలంది - వెలంది నెలంత - లే నెలంత, సుహాణి - సుహాణి ఈ బిడారు -

చేతపోలు

బిడారు అని అంతటా యమకం

వాతెఱకు నమృతమే తుల,
మే తులకింపుల పిసాళి మిసిమికి క్రొమ్మిం
చే తుల, చేతుల కబ్జము
లే తుల, లేతుల వెలందు లీ చెలి తులయే (1-131)

చిత్రాంగద అధరాన్ని (వాతెఱ) శరీరకాంతినీ (మేనుమిసిమి) చేతులనీ వర్ణించాడు వాయి అంటే నోరు. నోటికి తెర అనే అర్థంలో వా తెఱ (ర) అంటే అధరం క్రింది పెదవికే ఇది రూఢం తుల అంటే సాటి అని. ఆమె వాతెరకు అమృతమే - అదొక్కటే సాటి. మేను యొక్క తులకింపులతో (నిగనిగలతో) కూడిన అందమైన (పిసాళి) మిసిమికి - అంటే - కాంతికి, క్రొమ్మించు ఒక్కటే (క్రొత్త + మించు = క్రొమ్మించు) తుల తొలకరి మెరుపే సాటి వస్తుంది చేతులకు అబ్జములే (పద్మాలే) తులలు రెండు చేతులు కనక బహువచనం ఏతుల వెలందులు ఈ చెలికి తులయే ? సాటివస్తారా - అని " ఏతుల" అనేది ఒకే పదం ఆచ్ఛికం తగుపాటి ఇంతి అని దీనికి అర్థం. " ఏతుల యనంగ తగుపాటి యింతి వెలయు" నని ఆంధ్ర భాషార్ణవం అనే నిఘంటువు చెబుతోందిట సాధారణమైన ఇతర స్త్రీలు (వెలదులు) ఈ చిత్రాంగదకు సాటిరారని భావం ఈమె అసాధారణ సౌందర్యవతి

ముక్తపదగ్రస్తం అనే శబ్దాలంకారాన్ని ఇందులో అద్భుతంగా పొదిగాడు. అమృతమే తుల అన్నదాంట్లో చివరి మూడు అక్షరాలనూ మళ్ళీ స్వీకరించి మే తులకింపులకు అని ప్రారంభించాడు క్రొమ్మించే తుల అన్నదాంట్లో చివరి మూడక్షరాలనూ మళ్ళీ స్వీకరించి చేతులకు అని ప్రారంభించాడు. అబ్జములే తుల అన్నదాంట్లో చివరి మూడక్షరాలనూ మళ్ళీ స్వీకరించి- తుల "లేతుల" అని సంధివశాన వినిపించేట్టూ కనిపించేట్టూ చేసాడు కాబట్టి ఇది ముక్త పదగ్రస్తం ఛేకానుప్రాసకూడా అవుతుంది ఉపమానం ఉండనే ఉంది మూడు అలంకారాల సంసృష్టి

కన్నె నగుమోముతోడం
బున్నమ చందురుని సాటి బోలుపవచ్చున్-
నెన్నుదురుతోడ మార్కొని
మున్నందఱు జూడ రేక మోవక యున్నన్ (1-132)

ఈ చిత్రాంగద నెన్నుదురుతో పోటీపడి (మార్కొని = ఎదిరించి) ఒకప్పుడు (మున్ను) ప్రజలందరి ఎదుటా చంద్రుడు రేక మోసాడు. అంటే బాల్యంలో ఆమె నుదురు చంద్రరేఖని ఓడించింది అంతఃపురకాంత అయినా బాల్యంలో కనక అందరూ చూసారు చిన్నప్పటినుంచీ ఆమె ఫాలభాగం చంద్రరేఖలా ఉంది అని తాత్పర్యం చూసిన ప్రజలు అలా ప్రశంసించారు అనికూడా

రేక మొయ్యడం అంటే గాటుతినడం శత్రువు ప్రయోగించిన ఆయుధం

దెబ్బతో గంటు ఏర్పడి అది మచ్చగా రేఖగా మిగిలిపోవడం ఇది అవమానానికీ ఓటమికీ చిహ్నం చంద్రుడు అలనాటి పోటీలో రేకమోసాడు అంటే ఓడిపోయాడు చంద్రునిలో మచ్చ ఎలాగూ ఉండనే ఉంది మున్ను అంటే విదియనాడు రేఖాకారంగా ఉన్నప్పుడు ఆమె నెన్నుదురుతో పోటీపడి సాటిరాలేక ఓడిపోయాడు కనక రేకమొయ్యడం అనేది ఆ రకంగానూ సిద్ధిస్తోంది ఇది ఒకప్పటి మాట

ఇప్పుడు యుక్తవయస్కురాలైన ఈ కన్నియది నగుమోము ఈ నగుమోముతో పున్నమి చంద్రుణ్ణి (పూర్ణచంద్ర బింబాన్ని) సాటిగా పోల్చి చెప్పవచ్చు నవ్వు వెన్నెలలాగా ముఖం బింబంలాగా ఉంది కానీ చంద్రుడి చరిత్రలో ఒక ఓటమి ఉంది అలనాడు రేకమోసిన మచ్చ ఉంది అదే లేక పోతేనా ఈమె నగుమోముకి సాటివచ్చేవాడే పాపం గొప్ప అవకాశాన్ని పోగొట్టుకున్నాడు పున్నమి చంద్రుడు అంటే కళంక రహితమైన ఈమె నవ్వుముఖం పున్నమ చంద్రుడికన్నా ఆహ్లాదకరంగా ఉంది అని

రేక మొయ్యడమనేది లేకపోతే సాటివస్తాడు అన్నాడు కనక ఇది సంభావనాలంకారం అవుతుంది సంభావనా యదీత్థం స్యాదిత్యూ హో ఽ న్యస్య సిద్ధయే. యది శేషో భవేద్వక్తా కథితాః స్యుర్గుణాస్తవ

కమలముల నుజ్జగించుం

గుముదంబుల బుజ్జగించు గొమ చూపులు, పు

న్నమ చందమామ వెలుగుల

కొమరంతయు బుణికి పుచ్చుకొనటోలు జుమీ! (1-132)

చెట్టునుంచి పువ్వుల్ని గానీ కాయల్నిగానీ మంచి మంచివాటిని ఏరి ఏరి కోసుకోవడాన్ని పుణికిపుచ్చుకోవడం అంటారు పుణుకుట అంటే వెదికి వెదికి కోయడమని

ఈవిడ ముఖం పున్నమి చందమామలో ఉండే వెలుగుల అందాన్ని (కొమరు) అంతటినీ అలా పుణికి పుచ్చుకుంది కాబోలు సుమా- అన్నాడు. ఎందుకనంటే- ముఖబింబంనుంచి వెలువడుతున్న ఈమె (కొమ్మ-కొమ = స్త్రీ) చూపుల్లో పున్నమి వెన్నెల లక్షణాలు కనపడుతున్నాయి. కమలాలను (పద్మాలు) ఉజ్జగిస్తున్నాయి- నిరసిస్తున్నాయి. కుముదాలను (కలువలు) బుజ్జగిస్తున్నాయి - లాలిస్తున్నాయి ఈమె చూపులు.

పద్మాలను ముకుళింపజెయ్యడం, కలువలను వికసింపజెయ్యడం చందమామ వెలుగుల లక్షణం అది ఈమె చూపుల్లో కనపడుతోంది కనక అర్జునుడు అలా ఉత్ప్రేక్షించాడు కన్నులు వికసించిన కలువల్లాగా ఉన్నాయనీ చూపులు వెన్నెల్లాగా స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయనీ ఉత్తమజాతి స్త్రీల సాత్త్విక వీక్షణాలను వెన్నెలతో పోల్చడం ఉంది పద్మినీ జాతి స్త్రీ అని ఫలితార్థం

చెండ్లా గుబ్బలు, జాళువా తళుకులా చెక్కిళ్ళ డాల్, సింగిణీ

విండ్లా కన్బొమ, లింద్రనీలమణులా వేణీరుచుల్, తమ్మి లే

బేతపోలు

దూండ్లా బాహువు, లింత చక్కదన మెందుం గాన,యీ జవ్వనిం
బెండ్లాడంగలవాడు సేసినది సుమ్మీ భాగ్యమూహింపగన్ (1-134)

చిత్రాంగద గుబ్బలు పూపచెండ్లా చెక్కిళ్ళ కాంతి (డాలు-డాల్) జాళువా తళుకులా కన్బొమలు సింగిణీ విల్లులా .

సింగిణి అన్నా ధనుస్సు అనే సింగిణీ విల్లు అంటే ఒకరకం ధనుస్సు అని భావించాలి విల్లు+లు = విండ్లు

జడ అందాలు (రుచి = కాంతి అందం) ఇంద్రనీలమణులా బాహువులు లేతతామర తూడులా (లేత+తూండ్లు- లే దూండ్లు. తమ్మి = పద్మం)

ఆహాహా ఇంతటి చక్కదనం ఎక్కడా (ఎందున్) చూడం ఈ యువతిని (జవ్వని) పెండ్లి చేసుకోగల్గినవాడిదే సుమా అదృష్ట మంటేను ఎంతగా ఆలోచించినా (ఊహించినా) ఇదే సత్యం అని

విశారదుణ్ణి ప్రక్కన పెట్టుకుని ఈ వర్ణన అంతా చేసాడు అర్జునుడు నర్మస చివుడు పరపురుషుడిగా లెక్కకాదు ఒక్కొక్కప్పుడు అసలు పురుషుడుగానే పరిగణించరు అంచేత- తాను పెళ్ళాడబోయే స్త్రీని ఇంతగా అంగాంగ వర్ణన చేస్తున్నా డేమిటా అని ఆశ్చర్యపోనవసరం లేదు ప్రబంధాలలో ఇది సహజం పాఠకులకోసమే ఈ వర్ణనలన్నీను

చిత్రాంగద విహరించి వెళ్ళిన ఉద్యానవనంలో అర్జునుడు కూడా ఏదో తృప్తి కోసం విహరించాడు ఆ వనంలో ఒక సరస్సు ఉంటుందిగా ఆ సరోవరంలో వికసిం చిన పద్మాలు ఉన్నాయి. ఆ పద్మాలనుంచి తుమ్మెదలు ఎగురుతూ ఝుంకారాలు చేస్తున్నాయి ఈ దృశ్యాన్ని కథాసందర్భంతో మేళవించి చేమకూర వేంకట కవి వర్ణించిన పద్యం తెలుగు సాహిత్యంలోనే ఒక అత్యద్భుతమైన సృష్టి

"తనకుం గౌగిలి యీ వొకప్పుడును నాథా! నీ కరస్పర్శనం
బున గిల్గింతలె"- యంచు బద్మిని కరాంభోజంబువన్ మందమం
దనటద్వాయు చలద్దళాంగుళులు గన్పట్టంగ నవ్వేల్పు రా
యని "రా రా" యని పిల్చెనా దగె ద్విరేఫాధ్వంత దీర్ఘధ్వనుల్ (- ౩౨)

నీటిలో ఉన్న పద్మానికి (పద్మినికి) నింగిలో ఉన్న సూర్యుడే భర్త ఇది విచిత్రమైన దాంపత్యం ఏనాడూ కలయిక ఉండదు ఉదయమే సూర్యుడు ఉదయించి కిరణ స్పర్శతో (కరము = చెయ్యి కిరణము) గిలిగింతలు పెడితే అదే పదివేలు సాయం కాలం దాకా ఆ కరస్పర్శ సుఖాన్ని ఆనందిస్తూ పద్మిని ముఖం వికసింప జేసుకుని గడిపేస్తుంది సూర్యుడు అస్తమించగానే ముకుళించుకుపోతుంది తెల్లవార్లూ నిరీక్షణ ఆ పద్మిని సూర్యుడితో అంటోందిట-

నాథా నాకు (తనకు) ఒక్కనాడైనా నీ కౌగిలింత అనుగ్రహించవు (ఈవు) కేవలం నీ కరస్పర్శతో గిలిగింతలు ఒక్కటే (దక్కు తున్నాయి)- అంటూ పద్మినివెల్లుల రాయడిని "రారా కౌగిలి ఈరా" అని పిలుస్తోందిట

పిలవాలంటే చెయ్యి ఊపాలి 'రారా' అనే ధ్వని నోటితో చెయ్యాలి ఇవి పద్యానికి ఎలా కుదురుతాయి కవి కనక కుదిరించాడు

కరమువంటి అంభోజంతో (మరొక పద్మమే ఆమెకు హస్తం) పిలుస్తోంది ఈ కరాంభోజానికి రేకులు (దళములు) అనే అంగుళులు (వేళ్ళు) కనపడుతున్నాయి అవి ఆహ్వానిస్తున్నట్టు కదులుతున్నాయి మెల్ల మెల్లగా వీస్తున్న (మందమంద నటత్) వాయువుతో కదలాడుతున్న దళములు అనే వ్రేళ్ళు కలిగిన కరాంభోజంతో - రమ్మని పిలుస్తోంది తన నాధుణ్ణి

తుమ్మెదల ఝుంకారాలే 'రా రా'' అనే ధ్వనులుగా పదాలుగా వినపడు తున్నాయి

ద్విరేఫము అంటే తుమ్మెద అని అర్థం ఈ అర్థం రావడానికి ఒక కథ ఉంది రెండు రకాలు కలిగిన పదాన్ని ద్విరేఫం అంటారు అది భ్రమర శబ్దం ఇందులో రెండు రేఫలు ఉన్నాయి భ్రమర మంటే తుమ్మెద కనక ద్విరేఫము = తుమ్మెద అనే అర్థం స్థిరపడింది ద్విరేఫము = భ్రమరము= తుమ్మెద అని దీని క్రమం

ద్విరేఫాల ఆద్యంత దీర్ఘధ్వనులు వినపడుతున్నాయి ఆది నుంచి అంతవరకూ తుమ్మెదలు దీర్ఘంగా ఝుంకారధ్వనులు చేస్తున్నాయి - అని ఆ ధ్వనులు '' రా రా' అన్నట్టే వినపడుతున్నాయా అంటే వినపడు తున్నాయి- ఎలాగా ?

అవి రెండు రేఫల ఆద్యంత దీర్ఘధ్వనులు మొదటి రేఫకూ రెండో రేఫకూ కూడా (ఆది రేఫ - అంత్యరేఫ) దీర్ఘాచ్చులే ఉన్నాయి ఉన్న అచ్చు అకారదీర్ఘమేనా ? రీరీ కావచ్చు గదా కాదు ఆ + ఆద్యంత = ఆద్యంత దీర్ఘధ్వనుల్- అని పదవిభాగం అకారమే ఆద్యంతరేఫలమీద దీర్ఘధ్వనిగా నిలిచింది ''రా రా ' అయ్యింది

ఇదంతా కల్పన పద్మిని అలా పిలిచిందా (పిల్చె - నాన్) అన్నట్టుగా ఆ ధ్వనులు ఉన్నాయని కవిగారి ఉత్ప్రేక్ష దీనికి శ్లేష సహక రించింది వెల్లురాయని - రారాయని అన్నచోట ''రాయని' పునరావృత్తితో యమకం

దీంట్లో ''పద్మిని '' అన్నందువల్ల (పద్మము అంటే నపుంసక లింగం అమహద్వాచకం సొగసే లేదు) ఒక ఉత్తమ జాతి నాయిక (చిత్రాంగద కావచ్చు) ''వెల్లురాయడు ' అన్నందువల్ల ఒక నాయకుడు (అర్జునుడా ?) స్ఫురించి- విరహంలో ఉన్ననాయిక తన నాయకుణ్ణి చెయ్యి ఊపి పిలుస్తున్న వృత్తాంతం మరొకటి అప్రస్తుతంగా - పాఠకులకు అందుతోంది కాబట్టి సమాసోక్తి అలంకారం సమాసోక్తిః పరిస్ఫూర్తిః ప్రస్తుతే అప్రస్తుతస్యచేత్ - అయ మైంద్రీముఖం పశ్య రక్త శ్చుంబతి చంద్రమాః (ద్విరేఫాత్యంత దీర్ఘధ్వనుల్ అనే పాఠాన్ని గ్రహించారు శ్రీ తాపీ ధర్మారావు గారు)

అటుపైని సాయంకాల వర్ణన చంద్రోదయ వర్ణన చేసాడు కవి ఇక్కడున్న మరొక అద్భుతమైన పద్యం సాహిత్తిలోకంలో చాలా ప్రసిద్ధికి ఎక్కింది నేలమీద (క్షితి పయిన్) వసంత ఋతువు అందాలు కనపడు తున్నాయి ఆకాశంలో చంద్రుని సొగ

సులు దర్శనమిస్తున్నాయి ఈ రెండింటినీ జోడించి ఒక అర్థాంతరన్యాసంతో కొత్త అందాలు ఒలికించాడు చేమకూర వేంకటకవి

క్షితిపయి వట్టి మ్రాకులు జిగిర్ప వసంతుడు తా రసోపగుం
భిత పదవాసనల్ నెఱప, మెచ్చక చంద్రుడు మిన్నునన్ ప్రస
న్నతయును సౌకుమార్యము గనంబడ ఱాల్గరగంగ జేసె: నే
గతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా! (-148)

వసంతుడు ఈ క్షితిమీద వట్టి మ్రాకులు కూడా (చెట్లు) చిగురించేట్టు రసోపగుంభిత పదవాసనలు నెరపాడు పసరు పచ్చదనం మకరందం మొదలైన రసాలతో (ద్రవాలు) నిండిన తావులు (పదము= స్థానము మాట) అంటే ఆకులూ పువ్వులూ వీటి సువాసనలు విస్తరించేట్టు

శోభను రచించాడు - కల్పించాడు

దీనిని చంద్రుడు మెచ్చుకోలేదు తాను మరొక విధంగా శోభా రచన చేసాడు ఆకాశంలో (మిన్నునన్) ప్రసన్నత సౌకుమార్యం ప్రస్ఫుట మవుతుండగా (కనబడన్) రాళ్ళనుకూడా కరిగించాడు చంద్రదర్శనం తో చంద్రకాంతపు మణులు (ఱాళ్ళు) కరిగి ద్రవిస్తాయి అలా తానొక రచన చేసాడు

అవును ఎంత గొప్పగా రచించినా (ఏగతిన్ రచియించిరేని) సమకాలం వారు మెచ్చుకోరు గదా మోడు వారిన చెట్లను సైతం చిగిరింప జేసిన వసంతుడి రచనను చంద్రుడు మెచ్చలేదు-సరికదా- దీటుగా రాళ్ళను సైతం కరిగించగల మరొక రచనను తాను చేసి సమాధానంగా చూపించాడు

ఇందులో రసోపగుంభిత పద వాసనల్ ప్రసన్నత సౌకుమార్యం రచి యించిరేని అనే పదాలవల్లా వసంతుడు - చంద్రుడు అనే పదాల పుంలింగతవల్లా స్పర్ధాళువులైన ఇద్దరు కవుల కథ స్ఫురిస్తోంది

శృంగారాది రసాలతో ఉపగుంభితమైన పదాలనూ, భావాలనూ (వాసనలు- సాత్త్విక భావాలు) పొదిగి వసంతుడు (ఒక కవి) రచన చేసి వట్టి మ్రాకుల వంటి రసహీనుల్ని కూడా చిగురింపజేసాడు స్పందింప జేసాడు పులకింప జేసాడు అయితేనేమీ చంద్రుడు (మరొక కవి) మెచ్చుకోలేదు

ప్రసన్నత (ప్రసాదం) సుకుమారత అనే కవితాగుణాలతో తాను మరొక రచన చేసాడు దానితో ఏ స్పందనా లేని రాళ్ళవంటి అరసికులను సైతం కరిగించాడు హృదయాలను ఆర్ద్రపరచి ద్రవింపజేసాడు

ఇద్దరూ విభిన్న స్థలాలలో (ఒకరు క్షితిపయిన్ మరొకరు మిన్నునన్) ఈ రచనలు చేసారు కానీ సమకాలికులే అందుకే వసంతుడి రచనను చంద్రుడు మెచ్చుకోలేకపోయాడు అన్నింటా సమ ఉజ్జీలైన సమకాలిక కవులలో ఈ స్పర్ధలు సహజమే కదా తోటి కవి రచనను మెచ్చుకునే సహృదయత ఉండదు కదా

ఈ అప్రస్తుతార్థం స్ఫురిస్తోంది కనక సమాసోక్తి దానికి శ్లేష సహక

రించింది. అర్థాంతరన్యాసంతో ముగించాడు. మూడు అలంకారాల సంసృష్టి ఈ గొప్ప పద్యం.

ఆ ఉద్యాన వనంలో విహరిస్తూ మళ్ళీ చిత్రాంగదా సౌందర్యాన్ని కిరీటి మననం చేసుకున్నాడు.

చందనగంధి నెన్నుదురు చందురులో సగపాలు, బాల ము
ద్దుం దెలిచూపు లంగజుని తూపులలోపల మేల్తరంబు, లిం
దిందిరవేణి మోవి యెలదేనియలో నికరంపు దేట, యే
మందము మందయాన ముఖ మందము మీఱు నవారవిందమున్ (1-149)

ఆ చందనగంధి నెన్నుదురు చందమామలో సగభాగం (సగ పాలు) - చంద్రరేఖ. ముద్దులు గులికే చూపులు మన్మథ బాణాలలో (తూపులలోపల) మేల్తరమైనవి. తుమ్మెదల వంటి జడ కలిగిన ఆమె (ఇందిందిరము = తుమ్మెద) పెదవి క్రొత్త పువ్వుల తేనెలో నికరమైన తేట (కల్తీ లేని తేట - అని). ఇంక ఆ మందయాన ముఖాన్ని ఏమందాం! (ఏమి + అందము) దాని అందం నవారవిందాన్ని మీరుతోంది. క్రొందామరకన్నా అందంగా ఉంది.

విశేషణాలతోనూ వివరణలతోనూ అవే అవయవాలను అవే ఉపమానాలతో చెబుతున్నాడు. కనక రెండూ అప్రధానమే. ఉక్తి వైచిత్రి, శబ్దాలంకారాల్లో కొత్తదనం- ఇవే గ్రహించాలి. మందయాన మొగము + అందము మీరు నవారవిందమున్ అనికూడా కొందరు అన్వయించారు.

బంగరు బొంగరాల పరిపాటి చనుంగవ, మీల సూటి త
ళ్కుంగనుదోయి, చంద్రు ప్రతికోటి మొగం, బెలదేటి ధాటి క
ప్పం గడు మేటి వేణి, పులినంబుల సాటి పిఱుం, దయారె! చి
త్రాంగద సాటి జోటి కలదా! - యని మెచ్చె గిరీటి. మాటికిన్ (1-150)

(పరిపాటి = విధం, మీను + లు = చేపలు. సూటి = సాటి. ప్రతికోటి = ప్రత్యర్థి. ధాటి = సైన్యం, శ్రేణి. పులినము = ఇసుకతిన్నె. జోటి= స్త్రీ, కిరీటి = అర్జునుడు).

ఇంతవరకూ వర్ణించిన ఏ పద్యంలోనూ పాత్ర పేరు రాలేదు. వాటిని ఏ నాయికకయినా అన్వయించుకోవచ్చు. ఈ పద్యంలో మాత్రం నాయిక పేరు వచ్చింది. అదీ విశేషం.

అర్జునుడు ఇంక తాళలేక మలయధ్వజుడికి "మామకాగమన వార్త దెలుపుమనుచు విశారదు బిలిచి పనిచె" (1-152)

"మామకాగమన వార్త" అనే పదబంధంలో మూడురకాల విరుపులు ఉన్నాయి. మామక = నా యొక్క, ఆగమనవార్త = రాకకు సంబంధించిన వార్త. అంటే - నేను ఇక్కడికి వచ్చాను, ఉద్యానవనంలో ఉన్నాను అనే వార్త తెలియజేసి రమ్మని. మామ కాగన్ + మన వార్త అని మరో విరుపు. ఇది తెలుగు నాకు ఆయన మామగారు అయ్యేట్టు (కాగన్) మన వార్త చెప్పిరా అని. మన అనేది రాజసంతో

బహువచనం.

మామకున్ + ఆగమనవార్త అని మూడో విరుపు. ఇది తెలుగు సంస్కృతాల కలయిక. మలయధ్వజుడు అప్పడే తనకు మామ అయిపోయినట్లు. అంటే నేను చిత్రాంగదను పెళ్ళాడి తీరతానని. మర్యాదగా ఇస్తే మంచిదే. అందుకే ఆగమనవార్త తెలియ జెయ్యడం ఇవ్వకపోతే శక్తి ఉంది కనక ఎగరేసుకుపోతాడని గ్రహించాలి.

యతివేషంలో ఉన్న అర్జునుడితో సుభద్ర మాట్లాడుతూ "స్వామీ మీరు అందందు నరుగ నరు గానరుగా ? " అని అడిగింది. మీరు ఆయా తీర్థాలూ, క్షేత్రాలూ దేశాలూ తిరుగుతూ (అరుగన్) ఎక్కడయినా మా బావ అర్జునుణ్ణి (నరున్) కానరుగా = చూడలేదు గదా! చూసి ఉంటే చెప్పండి అని సుభద్ర ప్రార్థన.

ఇటువంటి శబ్ద చమత్కారాలు కోకొల్లలుగా ఉన్నాయి కనక విజయ విలాసం మహాకావ్యమని ఒకరు భోజనాల సందర్భంలో ఉపన్యసించారు. అది విని సహపంక్తిని ఉన్న మరొకరు (భమిడిపాటి కామేశ్వర రావుగారు కాబోలు) " చారుగా చారుగా చారుగా " అన్నారుట. చారు గా (అందంగా, రుచిగా) చారు - కాచారుగా అని విరిచి అర్థం చెప్పి ఇదీ మహా కవిత్వమే అన్నారుట. శబ్ద చమత్కారాలు ఆపోనివారి విసుర్లు ఇలా ఉంటాయి.

చిత్రాంగదతో వివాహం అయ్యింది. బభ్రువాహనుడు జన్మించాడు (ఇంతకు ముందు ఉలూచి యందు ఇలావంతుడు అనే కుమారుడు కలిగాడు). అటునుంచి కదలి దారిలో శాపవశాత్తూ పంచతీర్థంలో మొసళ్ళుగా పడి ఉన్న అయిదుగురు గంధర్వకన్యలకు శాపవిమోచనం అనుగ్రహించి, అక్కడికి ద్వారక చేరువలోనే ఉందని విని అటు ప్రయాణం సాగించాడు. ద్వారకని తలుచుకోగానే సుభద్ర రూపం గుర్తుకు వచ్చింది.

అర చందమామ నేలిన
దొరగా నెన్నుదురు నెన్నుదురు బిత్తరికిన్
పరువంపు మొల్ల మొగ్గల
దొరగా బల్కుదురు బల్కుదురు జవ్వనికిన్ (౨-౭౮)

ఆ ఒయ్యారి (బిత్తరి) నెన్నుదురును చూసి అరచందమామను (అర్థ చంద్రరేఖ) ఏలిన దొరగా ఎన్నుదురు - పరిగణిస్తారు చూపరులు ఆ జవ్వని పల్ + కుదురును (దంతాల పొందిక) పరువంలో ఉన్న మొల్ల మొగ్గలకు సాటిగా (దొరగా) పల్కుదురు వీటిలో రెండవ స్థానంలో ఉన్న, ఎన్నుదురు, పల్కుదురు అనేవి క్రియలు . మొదటివి ఉపమేయాలు అరచందమామ మొల్లమొగ్గలు ఉపమానాలు. యమకం ఒక్కటే కొత్తదనం

అలకలు నీలము, లధరం
బల పగడము, గోళ్ళు ముత్తియంబు లటంచున్
దెలుప వినను వింధు జలుకల
కొలికి తెఱంగెల్ల బూస గ్రుచ్చిన రీతిన్ (౨-౭౯)

గదుడు సుభద్రా సౌందర్యాన్ని పూసగుచ్చినట్లు వర్ణించి చెప్పాడు. విషయాలను క్రమం తప్పకుండా వివరించి చెప్పడాన్ని పూసగ్రుచ్చినట్లు చెప్పడం అంటారు. మణుల్నీ పూసల్నీ చిన్నాపెద్దా క్రమం తప్పకుండా దారానికి గుచ్చుతారు కనక ఈ నుడికారం ఏర్పడి ఉంటుంది. దీనికి సార్థకత చేకూరుస్తూ ఈ పద్యంలో ఉపమానాలు పొందుపరిచాడు.

ఆమె అలకలు (ముంగురులు) ఇంద్రనీల మణులు. అధరమో (అల = ఆ ప్రసిద్ధమైన) పగడం. గోళ్ళు ముత్యాలు. ఇలా అన్నీ మణులే. వీటిని పూసగ్రుచ్చిన రీతిగా చిలకలకొలికి అందాన్ని గదుడు తెల్పగా మున్ను విందుము కదా అని తలుచుకుని సంబరపడ్డాడు విజయుడు.

కల్పన ద్వారా లోకోక్తులకూ సామెతలకూ నుడికారాలకూ సార్థకత కల్పిస్తే ఛేకోక్తి అనే అలంకారం అవుతుంది. ఛేకోక్తిర్యత్ర లోకోక్తే: స్యాదర్థాంతరగర్భితా! భుజంగ ఏవ జానీతే భుజంగచరణం సఖే..

ఇలా తలుచుకుంటూ ద్వారక దగ్గరికి చేరుకున్నాడు. యాదవులకు యతీశ్వరులంటే గౌరవం. అంచేత ఆ వేషం ధరించి వెడదాం అనుకున్నాడు. అలాగే వెళ్ళాడు. తరవాత అక్కడ సుభద్రని చూసాడు. తాను విన్నదీ ఇప్పుడు కన్నదీ సరిగ్గా సరిపోయింది. మహాశ్చర్యం పొందేసాడు. సుభద్రా సౌందర్యాన్ని పొగడటం (ఆత్మగతంగా) మొదలుపెట్టాడు.

మును విన్నది, తానప్పుడు
గనుగొన్నది యొక్క తీరుగా దార్కొనై
పెనగొన్న మహాశ్చర్యం
బున నన్నరుడిట్లు అనుచు బొగడం దొడగెన్ (2-101)

చూడమె దేవతాసతుల శోభనకాంతి విలాస వైఖరుల్,
చూడమె నాగ కన్యకల లోక మనోహర రూప సంపదల్
చూడమె మర్త్యకామినుల సోయగముల్, దమకంబు వెల్లి తీ
పొడగ దీనివంటి యొలపైన మిటారిని జూడ మెందులన్ (2-102)

శాప విమోచనం కలిగించి అప్సరః కాంతలు అయిదుగురి విలాస వైఖరులు చూసాడు. నాగకన్య ఉలూచి లోకమనోహర రూపసంపదలు చూసాడు. మర్త్యకామిని చిత్రాంగద సోయగం చూసాడు. కానీ ఈ సుభద్ర వారందరికంటే ఒరపుగా ఉంది. తమకాన్ని వెల్లుగా తీపొడిస్తోంది. ఇటువంటి మిటారిని ఎక్కడా చూడలేదు అనుకొన్నాడు.

చెక్కుల జిగి, చనుగుబ్బల
చక్కదనము, మొగము తేట, ఇడతీ రౌరా!
చొక్కమగు దీని జూచిన
జొక్క మనంగూడ దెట్టి సుజ్ఞానులకున్ (2-103)

ఆమె చెక్కుల కాంతి వక్షోజాల చక్కదనం మొగంలో తేటదనం జడ తీరూ - ఔరా- మిక్కిలి అందమైన (చొక్కము + అగు) ఈ సుభద్రను చూసాక -ఎంతటి సుజ్ఞానులకైనా (యతీశ్వరులకైనా) చొక్కము = మేము మోహపడము అనడం అసంభవం (అనన్+ కూడదు) అనుకొన్నాడు తాను యతీశ్వరుడి వేషంలో ఉన్నాడు గదా- అందుకని ఈ చమత్కారం. నిజమైన యతీశ్వరులే చొక్కము అనకూడదంటే దొంగ యతి - తాను చొక్కను అంటే కుదురుతుందా

కన్నులు దీర్ఘముల్, నగు మొగంబవురా । తలకట్టు తమ్మిపూ
పున్నమ చందమామలకు, బొక్కిలి చక్కదనంబు జెప్పగా
నున్నదే । మేలు బంతులు పయోధరముల్, చిఱుకౌను సున్నయౌ
నెన్నిక కెక్కు వ్రాత ఫల మివ్వరవర్ణినికిన్ నిజంబుగన్ (౨- ౦౪)

వ్రాత ఫలము అంటే బ్రహ్మదేవుడు నుదుట వ్రాసిన వ్రాతఫలము అని ప్రసిద్ధార్థం ఆమె అవయవాలకు లేఖన సంకేతాలను (వ్రాత) ఉప మానాలుగా చెప్పి - ఇదంతా ఆవిడ (నొసలి) వ్రాత ఫలము అంటున్నాడు ఆ లోకోక్తికి సార్ధకత కల్పించి ఛేకోక్తి చేసాడు సుభద్రను వర వర్ణిని అన్నాడు వర్ణి అంటే బ్రహ్మచారి (వర్ణిన్ శబ్దం) వర్ణిని అంటే బ్రహ్మచారిణి అవివాహిత కన్య అని ఫలితార్థం వర్ణినుల్లోనూ ఆవిడ వర- ఉత్తమురాలు

వర్ణములు అంటే అక్షరాలు - వ్రాతలు అవి కలది వర్ణిన్ గుణిన్ అన్నట్టు దానికి స్త్రీలింగరూపం (ఋన్నేభ్యోఙీప్) వర్ణినీ గుణినీ అన్నట్టు దీర్ఘానికి హ్రస్వం వచ్చి తత్సమంగా "వర్ణిని " అవుతుంది అంటే లేఖన చిహ్నాలు కలది అని మరో అర్థం ఉపమాన పరంగానూ ఉపమేయ పరంగానూ రెండర్థాలూ కుదిరేట్టు శ్లేష ఉపయోగించాడు ఏయే వర్ణాలు (లేఖన చిహ్నాలు) ఉన్నాయో చెబుతున్నాడు

కన్నులు - దీర్ఘాలు పొడవైనవి అని. నగు మొగమేమో తమ్మి పువ్వు కీ పున్నమ చందమామకీ తలకట్టు వాటిని మించినది అని (వాకట్టులాగా వాటి తలల్ని కట్టేస్తుందని గానీ పాగాలాగా అధిరోహి స్తుందని గానీ చెప్పవచ్చు.) ఏమైనా తమ్మి పువ్వు కన్నా పున్నమ చందమామ కన్నా అందం గా ఉంది ఆమె ముఖమని. తలకట్టులు లేఖన చిహ్నాలుగా ప్రసిద్ధం

ఆమె పొక్కిలి(బొడ్డు)చక్కదనం వర్ణించి చెప్పడానికి అయ్యేదేనా చెప్పగానున్నదే అంటే అంతలోతైనది అని పారం చెప్పడానికి ఏమీ లేదని లేఖన పరంగా. ముగింపు చిహ్నం ( ) అని కావచ్చు

ఆమె పయోధరాలు మేలు బంతులు మేలయిన పూలగుత్తులు అని మేలు శ్రేష్ఠములనీ- అక్షరాలు దిద్దిస్తూ మార్గదర్శకంగా గురువు వ్రాసిచ్చే పంక్తిని ఒజ్జబంతి అంటారు ఇదే ఒజ్జబంతి (ఒజ్జ = ఉపాధ్యాయుడు)

చిఱుకౌను (కౌను = నడుము) సున్నాయే అంటే శూన్యమని శూన్య మంటే ఆకాశం నడుముని ఆకాశంతో పోల్చడం కవిసమయం. శూన్య శబ్ద భవమే సున్న అనే మాట

పోలుస్తారు (ఆకాశం నీ నడుమూ - అని పాటకూడా ఉంది). ఈమెకి నడుము అసలు లేనేలేదు అన్నంత సన్నగా ఉంది అని తాత్పర్యం అసలే లేకపోతే ఎలాగా ,లేఖన చిహ్నంగా సున్నా ప్రసిద్ధమే

ఇది నిజంగా ఈ వర వర్ణినికి ఎన్నికకు (ప్రసిద్ధికి) ఎక్కే వ్రాత ఫలం బ్రహ్మదేవుడు ఈవిడ ముఖాన ఇంత అందం '' రాసి పెట్టాడు '

భ్రమరక మనోహరం బౌట బద్మమగును,
తారకా హృద్యమగుట సుధానిధి యగు,
రెంటి జగడాలు మోమున నంటి యుంట,
నబ్జముఖి యంట లెస్స యీ యలరుబోడి (౭-౧౦౮)

ఈ అలరు బోడిని (పువ్వువలె సుకుమారమైన శరీరం కలది) అబ్జముఖి అనడం లెస్స అని తీర్పు చెప్పాడు. అసలు తగువు ఏమిటంటే -

సుభద్రముఖంలో (మోమునన్) రెండు జగడాలు (అభిప్రాయ భేదాల తగువులు. జగ + డాలు = అందమైన కాంతి) అంటి ఉన్నాయి ఒక రకంగా అది పద్మం. మరొక విధంగా అది సుధానిధి (అధరామృత నిధి అనీ చంద్రుడనీ చంద్రుడు అనడమే ప్రకృతం). ఈ రెండింటి (ఉపమానాలు) జగా - డాలూ, జగడాలు ముఖాన్ని హత్తుకుని ఉన్నాయి.

భ్రమరకములు అంటే చిట్టి తుమ్మెదలు ముంగురులు అని రెండు అర్థాలు భ్రమరకములు అనే (ముంగురులు అనే) భ్రమరకములతో (తుమ్మెదలతో) మనోహరంగా ఉంది కాబట్టి ఆ ముఖాన్ని పద్మం అనాలి. ఇదొక అభిప్రాయం. భ్రమరకాల మనస్సును హరించేది పద్మమే కాబట్టి అది భ్రమరక మనోహరం. అల్పార్థంలోక ప్రత్యయం

తారకా పదానికి నక్షత్రమనీ కంటిపాప అనీ (తారకా తారికా కనీనికా) రెండర్థాలు కంటిపాప రంగులో కాకపోయినా కాంతిలో ఆకారంలో నక్షత్రంలా ఉంటుంది. (కనుగ్రుడ్డు నల్లగా ఉంటుంది కంటి పాప సాధారణంగా తెల్లగానే ఉంటుంది). కాబట్టి తారకలు (కంటి పాపలు అనే)తారకలతో (నక్షత్రాలతో) హృద్యంగా ఉన్నందువల్ల ఆ ముఖాన్ని చంద్రుడు అనాలి ఇది మరొకరి అభిప్రాయం. సుధానిధి (చందమామ) తారకలకు హృద్యుడు తారాపతి. హృదయానికి ప్రియుడు అనే అర్థంలో హృద్యః అవుతుంది. హృదయస్య ప్రియః (4-4-౯౫) హృద్+ య (త్)

ఇలా శ్లిష్ట రూపకాలతో జగడాలు సాధించాడు. ఇరు వాగుల వారికీ అంగీకారయోగ్యంగా ''అబ్జముఖి'' అనడం సమంజసమని తీర్పు చెప్పాడు అబ్జము అంటే నీళ్ళల్లోనుంచి పుట్టినది అని వ్యుత్పత్తి పద్మమూ నీళ్ళల్లోనుంచే పుట్టింది చందమామా నీళ్ళల్లోనుంచే పుట్టాడు క్షీర సముద్రంనుంచి కదా జన్మించాడు. కాబట్టి సుధానిధి అబ్జుడే . ఎవరికి కావలసిన అర్థం వారు స్వీకరించి ఉభయ పక్షాలూ జగడాలుమాని శాంతిస్తాయన్నమాట. అబ్జసదృశమైన ముఖము కలది అని

చేతవోలు

మధ్యమపద లోపిసమాసం చెప్పాలి.

ధారాధరము వెన్నుదన్ని పుట్టిన చాయ
నున్నదీ బింబాధరోష్ఠి వేణి,
జక్కవ కవ కొమ్ము త్రొక్కి నిల్చిన జాడ
నున్నవీ నవలా పయోధరములు,
చిన్ని ప్రాయపు లేడి జెవులు పట్టాడించు
గతినున్నదీ రామ కన్ను దోయి
నల్ల చీమల బారు నడుము దాకిన వీక
నున్నదీ చెలువంపు గన్నెయారు,
విపుల పులినంబు వెన్కకు వీగ నొత్తు
నందమున నున్నదీ మందయాన పిఱుదు,
దీనికెనయైన లత కూనగాన మా మ
నోజ వజ్రాంగి యీ జగన్మోహనాంగి (౭-౧౦౬)

బింబఫలం అంటే దొండపండు బింబసదృశమైన అధరోష్ఠం కలది – బింబాధరోష్ఠి. ఇక్కడ సుభద్ర నవలా అనేది ఆకారాంతం ఆచ్ఛిక పదం. స్త్రీ అని అర్థం రామ అన్నాకూడా అదే అర్థం కన్నె మందయాన, జగన్మోహనాంగి – ఇవన్నీ స్త్రీ పర్యాయాలుగా ప్రసిద్ధాలు. లతకూన, మనోజు వజ్రాంగి అనేవి అందమైన పద బంధాలు. మన్మథుడి విజయాలకి ఈవిడ వజ్రాంగి. అపజయం లేదని (మనోజుడు= మన్మథుడు)

వేణికి ధారాధరాన్ని (మేఘం), పయోధరాలకు జక్కవ కవనీ (కవ = జంట), కన్నులకి లేడికూన కన్నుల్నీ, నూగారుకి నల్లచీమల బారునీ పిఱుదుకి పులినాన్నీ (ఇసుక తిన్నె) ఉపమానాలుగా కూర్చాడు. ఆయా అవయవాల స్థానాలకూ, గుణాలకూ అమరైన పదాలతో సారూప్యాలు ఉత్ప్రేక్షించడం ఇందులో ఉన్న క్రొత్తదనం

మేఘాన్ని వెన్ను తన్ని పుట్టిందా అన్నట్టుంది జడ అన్నాడు స్త్రీలకు జడ ఎప్పడూ వెన్ను తన్నుకునే ఉంటుంది జక్కవకవను కొమ్ము త్రొక్కి నిల్చినట్టున్నాయి పయోధరాలు అవి ఎలాగా కొమ్ము త్రొక్కే ఉంటాయి కన్నులు లేడి కూనల్ని చెవులు పట్టి ఆడిస్తాయిట అంటే ఆమె కన్నులు చెవుల వరకూ వ్యాపించి ఉన్నాయని నల్లచీమల బారుని నడుము తాకినట్టుంది ఆమె నూగారు. నూగారు ఉండేది నడిమి భాగంలోనే, నడుము తాకే పులినాన్ని వెనకకు వీగిపోయేట్టు ఒత్తుతున్నట్టుంది జఘనం. అది ఉండేది వెన్కగానే, వీగుతోనే

సైకతము నడుము, విలాస ర
సైకతము నెమ్మొగము, దీని వ్యదు మధురోక్తుల్
పైకతము దెగడు, న్నవలా
పైకములో నెల్ల మేలుబంతిది బళిరా! (౭-107)

'సైకము - సైకము అనీ పైకము - పైకము అనీ యమకం కుదిర్చాడు వీటిలో ఒకటి అచ్చిక పదం మరొకటి సంస్కృత వ్యాకరణ సిద్ధమైన పదస్వరూప విశేషం

సన్ననిది, సూక్ష్మమైనది అనే అర్థాల్లో ''సైకము '' అనే మాట అచ్చతెనుగు దేశ్యం. సయికము అనికూడా రూపాంతరం అల్లాగే సమూహం అనే అర్థంలో పైకము- పయికము అనేది అచ్చికం, దేశ్యం

నడుము సైకం - సన్ననిది నెమ్మొగమేమో విలాసరస + ఏకము- విలాస రసమే ప్రధానంగా కలది రస + ఏకము = వృద్ధిసంధితో రసైకము అని మరో ' సైకము '' సంస్కృత వ్యాకరణ నియమంతో సిద్ధించింది

ఈవిడ మృదుమధురమైన మాటలు (ఉక్తులు) పైకమును తిరస్కరి స్తున్నాయి (తెగడున్) అంతకన్నా శ్రావ్యంగా ఉన్నాయని పికముల సమూహం - పైకము (పికానాం సమూహః పైకమ్ బకానాం సమూహః బాకమ్ తస్య సమూహః 4-2-37 అనే సూత్రంతో అణ్ ప్రత్యయం)

అర్జునుడు ఇంత వరకూ సుభద్ర గొంతు వినలేదు కానీ పికా లాపాలుగా వర్ణించేస్తున్నాడు (ఇలాంటి చిన్న చిన్న అనౌచిత్యాల్ని మనం పట్టించుకోకూడదు పెద్ద మనస్సుతో వదిలెయ్యాలి)

నవలా పయికంబులోకెల్లా ఇది (సుభద్ర) మేలుబంతి. బళిరా!
ఇత్తరళాక్షి మేని జిగి యేలిక మేలి కడాని పైడి , కీ
గుత్తపు గుబ్బలాడి జడ కూకటి చీకటి మూలదుంప, కీ
పుత్తడిబొమ్మ కన్నుగవ పోలిక వాలిక గండుమీల, కీ
బిత్తరి ముద్దు నెమ్మొగము పిన్నమ పున్నమ చందమామకున్ (2- 08)

తరళాక్షి అంటే చంచలమైన కన్నులు కలది అని తరళత అంటే ముత్యం చుట్టూ పారదర్శకంగా ఉండే కాంతివలయం కూడా ఈవిడ శరీరకాంతి(జిగి) మేలిమి బంగారంలాంటి (కడాని = పుత్తడి) బంగారానికి ఏలిక (కడాని పైడి = కుందనపు బంగారం) క్రిక్కిరిసిన గుబ్బలు కలిగిన ఈమె జడ-చీకటి అనే మూల దుంపకు తల్లివేరు (కూకటి) ఈ పుత్తడిబొమ్మ కన్దోయి- వాలిక గండు మీనులకి పోలిక శృంగార చేష్టలు గల ఈమె (బిత్తరి) ముద్దు నెమ్మొగం- పున్నమనాటి చంద మామకు పిన్నమ్మ (పిన్నమ) సోదరుడు అన్నట్టుగా పిన్నమ్మ ఉపమావాచకం అయ్యింది ఏలిక - మేలిక కూకటి- చీకటి, పోలిక - వాలిక పిన్నమ - పున్నమ అనే శబ్దాలంకారమే కొత్తదనం ఉక్తి చమత్కారం.

కామినీమణి నిడు వాలు గన్నుగవకు
నెన్నికకు రాని తొగరేకు లీడు సేత
తగదు తగ ; దిక నళిన పత్రంబులందు
నీడగునొ యేమొ నూట వేయింట నొకటి . (2-109)

ఈ కాంతిమతి నిడుపైన వాలైన కన్దోయికి- లెక్కలోకే రాని (ఎన్నికకు
రాని) కలువరేకుల్ని ఈడు చెయ్యడం- పోలికగా చెప్పడం తగదంటే తగదు ఇక
మరి వేటితో పోల్చాలి అంటే - నళిన పత్రాలలో నూరింటిలోనో వేయింటిలోనో ఒకటి
ఈడు అవుతుందో యేమో

పద్మానికి శతపత్రమనీ సహస్ర పత్రమనీ రెండు పర్యాయ పదాలు
ఉన్నాయి. దానికి ఉండే రేకుల్ని లెక్కపెట్టి ఈ పేర్లు పెట్టారు వంద రేకులున్న పద్మం -
శత పత్రం అంతకుమించి చాలా రేకులు ఉంటే అది- సహస్రపత్రం కాబట్టే నూటన్
వేయింటన్ ఒకటి అన్నాడు రేకుల ఎన్నికను బట్టి ఏర్పడే ఇటువంటి పర్యాయపదాలు
కలువలకి లేవు అందుకని '' ఎన్నికకు రాని తొగ రేకులు ' అన్నాడు

మహిలో సరి గలదా యీ
మహిలోత్తంసంబు మేని మహిమకు దెలియన్!
మిహి కుందనపు సలాకన్,
మిహికాకరు రేఖ మించు, మించున్, మించున్. (౨- ౦)

ఈ మహిళోత్తంసం శరీరశోభకు (మహిమకు) మహిలో (భూమిలో)
తెలియగా సరి కలదా ? లేదని తాత్పర్యం ఆమెది సాటిలేని శరీరకాంతి మేలిమి
బంగారు శలాకనూ (మిహి = మేలైనది. సలాక =కడ్డీ ముక్క కుందనం = బంగా
రం) మిహికాకరుని రేకకాంతినీ (మించునూ) మెరుపు తీగనూ (మించునూ)
మించుతుంది (మించును) - అతిశయిస్తుంది

'' మిహిక '' అంటే మంచు దానికి ఆకరుడు (నిలయం) - చంద్రుడు
బంగారు శలాకనీ చంద్రరేఖ కాంతినీ మెరుపుతీగనీ ఈమె మేని మహిమ
అతిశయిస్తుంది

సంస్కృతంలో '' ళ' కు బదులు '' ల ' వ్రాయడం సుప్రసిద్ధం నలినం -
నళినం , మహిల - మహిళ కలాశాల - కళాశాల ఇవన్నీ సుప్రసిద్ధాలే మహిలో అని
ప్రారంభించి మహిలా + ఉత్తంసము - మహిలోత్తంసము అని రెండో పాదంలో అదే
అక్షరానుపూర్విని సాధించి యమకంగా రూపొందించాడు

శబ్దాలంకారాన్ని నియత స్థానంలో సాధించడానికే పాదం లో
మిగతా భాగాన్ని వ్యర్థపదాలతో నిరర్థకవిశేషణాలతో నింపడం రావలసిన పదం కావల
సిన స్థానంలో వచ్చేవరకూ భావాన్ని సాగదీయడం - ఇలాంటి లోపాలు ఈ కావ్యంలో
చాలాచోట్ల చూస్తాం ఈ పద్యంలో- మహిలో తెలియన్ అనేవి రెండూ వ్యర్థపదాలే
'మహిమను '' కాంతి శోభ అనే అర్థాల్లో వాడటంకూడా శబ్దాలంకారం కోసమే
ఉపమానోపమేయాలు పునరుక్తం కావడమే కాదు శబ్ద చమత్కారాలు కూడా అవ్వే
అవ్వే వస్తున్నాయి మించుతో చమత్కారాలు ఇంచుమించు నాలుగయిదుసార్లు
వచ్చాయి.

శబ్దాలంకారం అప్రయత్నంగా వచ్చిపడాలే తప్ప - దీన్నే అపృథగ్యత్న సిద్ధం
అన్నారు ఆలంకారికులు - ప్రయత్న పూర్వకంగా సాధించడం నిర్వహించడం

మొదలుపెడితే పద్య నిర్మాణంలో ఇటువంటి లోపాలు తప్పవు ప్రసన్నత లోపిస్తుంది పాఠకుల దృష్టి దానిపైపే ఆకృష్టమవుతుంది కావ్యపఠనకు పరమ ప్రయోజనమైన రసానందం గగన కుసుమమై పోతుంది అందుకే శబ్దాలంకారాలకు పెద్దపీట వేసిన రచనలను అధమ కావ్యాలన్నారు ఆలంకారికులు

అలంకారాలను వరసగా పేర్చుకుంటూ పోకూడదు అవసరాన్నీ ఔచిత్యాన్నీ గుర్తించి పట్టు విడుపులు ఉండాలి "కాలే చ గ్రహణ త్యాగౌ " అన్నాడు ఆనంద వర్ధనుడు కవికి ఈ నిగ్రహం లేకపోతే పాఠకుడికీ ఉండదు కావ్య ప్రయోజనం దెబ్బతింటుంది కవికి ఇటువంటి నిగ్రహాలు చాలా ఉంటాయి వీటినన్నింటినీ కలిపి "నిలుకడ వలయు కృతికి" అన్నారు తిక్కనగారు " కావ్యకర్మణి కవేః సమాధిః పరం వ్యాప్రియతే " - అన్నాడు శ్యామదేవుడు " సమాధి" అంటే ఏకాగ్రత ఇది కూడా అభ్యాసంతో సిద్ధిస్తుందని జయమంగళుడి అభిప్రాయం

కలిగెనో యీ యింతి కులుకు గుబ్బల జూడ
శీత శైలాదుల సేవ ఫలము ,
కలిగెనో యీ నాతి వళుల యందము జూడ
గంగా తరంగముల్ గన్న ఫలము,
కలిగెనో యీ రామ కనుబొమల్జూడంగ
మును ధనుష్కోటిలో మునుగు ఫలము,
కలిగెనో యీ భామ కటి విలాసము జూడ
భూప్రదక్షిణము సల్పుటకు ఫలము
తోడుతోడనె యిటుల చేకూడ వలదె,
తన్వితీరంగ నింక నీ తన్వి గూడి
సరస సంభోగ సల్లాప సరణి దేలు
నాడుగా ఫలియించుట నా తపంబు. (౨-౧)

ఇదొక్కటీ కథతో అన్వయించే వర్ణన హిమాలయాలనుంచి ధనుష్కోటి వరకూ భూప్రదక్షిణం చేసి వచ్చాడు అర్జునుడు. దాన్ని సుభద్రా వర్ణనతో జోడిస్తు న్నాడు

ఈమె కులుకు గుబ్బలను (వక్షోజాలను) చూస్తే హిమాలయం మొదలైన పర్వతాలను సేవించివచ్చిన ఫలం కలుగుతోంది సుమా ! పర్వతాలు ఉపమానం వాటిలాగానే ఈ ఉపమేయాలను కూడా సేవిం చాలని దొంగయతిగారి అభిలాష -వ్యంగ్యం.

ఈ నాతి పొట్టమీద కనపడుతున్న ముడతల్ని (వళులు- త్రివళులు) చూస్తోంటే గంగా తరంగాలను దర్శించిన ఫలం కలుగుతోంది త్రివళుల ను తరంగా లతో పోల్చడం ఉంది ఆ తరంగాల స్పర్శను అనుభవించినట్టే వీటి స్పర్శనూ పొందాలని తలంపు- వ్యంగ్యం

ఈ రామ కన్బొమలు చూస్తోంటే ధనుష్కోటిలో మునిగిన ఫలం లభి

న్తోంది. కన్బొమలు ధనురాకారంలో ఉన్నాయని. వాటిని స్పృశించాలనే వాంఛ వ్యంగ్యం

ఈ భామ కటివిలాసం చూస్తోంటే భూప్రదక్షిణ చేసిన ఫలం సిద్ధిస్తోంది కటి భాగం భూమండలంలా గుండ్రంగా విశాలంగా ఉందని. దాని చుట్టూ ప్రదక్షిణలు చేయాలనే కోరిక వ్యంగ్యం.

ఫలాలు వెంట వెంటనే ఇలా చేకూరాలి కదా ! తనివి తీరేట్టు (తనివి - తనివా) ఇంక ఈ తన్వితో కూడి సరస సంభోగ సల్లాప సరణిలో తేలియాడగలిగి ననాడు గదా నా తపస్సు ఫలించడం. ఇప్పుడు మాయా తపస్వి వేషంలో ఉన్నాడు. కాబట్టి తపస్సు ఫలించాలని అభిలషిస్తున్నాడు. ఆవిడ పొందు తనకు తప: ఫలమని

మొత్తం మీద విప్రలంభం ఈ పద్యంలో వ్యంగ్యం అభిలాష - భావధ్వని దీనివరకూ ఇది ఉత్తమ కావ్యం

మాయాయతికి సేవలు అందించమని సుభద్రనే నియమిస్తారు. అర్జునుడి అవస్థ నర్మ సంభాషణలు సరసంగా వర్ణించాడు. కిరీటిని ఎరుగుదురా అని సుభద్ర అడిగితే, నేనే కిరీటి ని అని చెప్పేస్తాడు మాయా యతి సిగ్గుతో ఆవిడ తుర్రు మంటుంది. విరహతాపాలతో తృతీయాశ్వాసం మొదలవుతుంది. రామ రామాయ టంచు నా రాజసుతుడు కృష్ణ కృష్ణా యటంచు నా కీరవాణి (౩-౨౫) విరహవేదన అనుభవిస్తారు కృష్ణుడంటే అర్జునుడుకూడా. రామ అంటే స్త్రీఅని చంద్రోపాలంభన వగైరా నడిచాయి సుభద్రార్జునులకు వివాహం అయ్యింది ఇంద్రప్రస్థానికి బయలుదే రారు బలరాముడికి తెలిసింది. అలిగాడు కృష్ణుడు చల్చార్చాడు. ఇప్పుడు సలక్షణంగా బలరాముడే బంధువులందరినీ ఆహ్వానించి అయిదు రోజుల పెళ్ళి చేసాడు ఆనాటి తెలుగింటి పెళ్ళిని చూపించాడు చేమకూర ముత్యాల వెల్ల గొడుగులూ, ఐరేణి కుండలూ, వరస్తైనవారి సరసాలూ, మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు వగైరా తంతు అంతా నడిచింది సరే పడకటింటి శృంగారవర్ణన అభిమన్యుడి జననంతో కావ్యం శుభాంతం, సుఖాంతం అయ్యింది

ముగ్గురు నాయికలూ ఒకే నాయకుడుగా మూడాశ్వాసాలలో సాగిన విలాస ప్రబంధమిది ప్రతీ నాయికనూ కనీసం రెండేసి సార్లు సుభ ద్రాదేవి నైతే మూడుసార్లు వర్ణించాడు అయితే ఆ వర్ణనల్లో ఒకటి రెండు తప్పిస్తే మిగతావి ఏ పద్యమ్మైనా ప్రపంచంలో ఏ నాయికకైనా అన్వయి స్తుంది స్త్రీవర్ణనతో కొన్ని పద్యాలు రచించి ముగ్గురు నాయికలకూ సర్దుబాటు చేసాడేమోనని ఎవరయినా ఆక్షేపిస్తే ఆశ్చర్యపోనవసరం లేదు

కావ్యమీమాంసలో రాజశేఖరుడి విభజన ప్రకారం చేమకూర వెంకన్న అలంకారకవి. అలంకారం కోసమే అలంకారం నిర్వహిస్తాడు అందునా శబ్దాలం కారమంటే మరీ చెవి కోసుకుంటాడు అంచేత శబ్దాలంకారకవి అనడం సబబు

అయితే దీని నిర్వహణలో ఇతనికి ఇతడే సాటి, "క్షితిలో నీమార్గ మెవరికిన్

రాదు సుమీ '' అని కృతిపతి రఘునాధనాయకుడు చేసిన ప్రశంస స్తవం కాని వాస్తవం

అర్జునుడు చేసిన గంగాస్తుతితో ఈ కావ్యపరిచయాన్ని ముగిస్తాను

పార్వతీదేవి ఆకులూ అలములూ తింటూ కఠోర నియమాలతో శివుడికోసం ఘోర తపస్సు చేసింది అపర్ణ అని పేరు పొందింది తపస్సు ఫలించి వివాహమయ్యింది శివుడి తేజస్సుని తన గర్భంలో భరించలేక పోయింది గంగాదేవికి అప్పగించింది ఆవిడ ఎలాగో భరించి ఒక రెల్లు పొదలో (శరము, శరవణము) కుమారుణ్ణి ప్రసవించింది ఆ శిశువును ఆరుగురు కృత్తికలు తల్లులై సాకారు అందుకని ఆ కుమారస్వామికి శర జన్ముడు శరవణ భవుడు కార్తికేయుడు షాణ్మాతురుడు అనే పేర్లు ఏర్పడ్డాయి ఈ పురాణ కధను గుర్తుచేస్తూ కిరీటి కవియై గంగాలహరి చేసాడు

తా సైరింప కపర్ణయుండగ భవద్గర్భంబునన్ దాల్చి, తే
జోసహ్యున్ శరజన్ము గాంచి, యుల నీహారక్షమాభృత్కుమా
రీ సాపత్న్యము గన్న మోహపు బురంధ్రీరత్నమున్నీవ తా
దే సర్వజ్ఞనికేల నిన్ను దలపై నెక్కించుకో జాహ్నవీ! (-49)

ఓ గంగమ తల్లీ అపర్ణ తాను భరించలేకపోతే (సైరింపక ఉండ గన్) ఆ శివతేజస్సుని నీ గర్భంలో దరించావు పరాక్రమంతో (తేజస్సుతో) దుస్సహుడైన శరజన్ముణ్ణి ప్రసవించావు ఇలా కుమారస్వామికి . జన్మనిచ్చి నువ్వు పార్వతీదేవితో సాటి వచ్చావు (సాపత్న్యము - సపత్నీత్వం) గంగా పార్వతులు సవతులు కనక పోటీ తప్పదు

పార్వతీదేవి వినాయకుడికి జన్మనిచ్చి శివుడి వంశాన్ని నిలబెట్టిం ది పైగా ఆవిడ నీహారక్షమాభృత్కుమారి నీహారము అంటే మంచు క్షమా భృత్ అంటే భూమిని మోసేది-కొండ. రాజు అనికూడా పెరసి మంచు కొండరాజు పార్వతి రాకుమారి అందుకని శివుడికి పార్వతిమీదనే మోహం ఎక్కువ

కానీ ఇప్పుడు కుమారస్వామికి (తేజో సహ్యుడు) జన్మనివ్వ డంతో నువ్వే శివుడికి ''మోహపు పురంధ్రీ రత్నమవు'' అయ్యావు (పురంధ్రి=పుం స్త్రీ మగనాలు) కాకపోతే - ఓ జాహ్నవీ సర్వజ్ఞుడయ్యుండీ శివుడు నిన్ను నెత్తిమీద ఎక్కించుకుంటాడా చెప్పు (నెత్తి మీదపెట్టుకోవడం ఎక్కించుకోవడం అనేది శిరసావహించడం లాంటి పలుకుబడి) ఛేకోక్తి అలంకారం

పార్వతి రాకుమారి అయితే గంగమ్మ ఋషికన్య. జహ్ను మహర్షి కూతురు కనక జాహ్నవి (రామాయణంలో గంగావ తరణభగీరధ కధ) అందుచేతనే లోక శ్రేయస్సుకోసం తారకాసురుణ్ణి సంహరించగల కారణ జన్ముడైన కుమారస్వామిని ప్రసవించావనీ, శివుడికి అత్యంతాప్తురాలివి కాగలిగావనీ వ్యంగ్యం

మహాకావ్యాన్ని శ్రీనుంచి ఇతిశ్రీవరకూ పఠించినప్పుడు మళ్ళీ మొదటికి వచ్చి ఏవో ఒకటి రెండు పద్యాలయినా చదివి ముగించాలనేది ఒక మంచి సంప్రదాయం కావ్యపరన నిరంతరంగా కొనసాగాలి అనేది అందులో ఉన్న సూచన.

నిరంతర కావ్యానుశీలనవల్ల మనోముకురం (అద్దం) విశదం అవుతుంది తన్మయీభవన యోగ్యత సిద్ధిస్తుంది అది సిద్ధించినవారే సహృదయ సార్వభౌములు సరస్వత్యాస్తత్వం కవి సహృదయాఖ్యం విజయతే - అన్నారు వీరే భావుకులు కవిది కారయిత్రీ శక్తి అయితే వీరిది భావయిత్రీ శక్తి కవిగారి శ్రమనూ, అభిప్రాయాన్నీ గుర్తించి ఆనందించి అభినందించగలిగిన శక్తి ఇది వీరివల్లనే నిండా కవితాతరువు ఫలిస్తుంది కావ్యానికి దశదిశలా ప్రసిద్ధి చేకూరుతుంది. అరోచకులు సతృణాభ్యవ హారులు మత్సరులు తత్త్వాభినివేశులు అని భావుకులు నాలుగు రకాలుగా ఉంటారన్నాడు రాజశేఖరుడు (కావ్యమీమాంస - చతుర్థాధ్యాయం) వీరిలో తత్త్వా భినివేశి ఉత్తమోత్తముడు వెయ్యిమందికి ఒక్కడు ఉంటాడేమో అంటూ ఒక శ్లోకం ఉదాహరించాడు

శబ్దానాం వివినక్తి గుంభన విధీన్, ఆమోదతే సూక్తిభిః
సాంద్రంతే ధి రసామృతం, విచినుతే తాత్పర్యముద్రాం చ యః
పుణ్యైః స్సంఘటతే - వివేక్తృ విరహాదంతర్ముఖం కావ్యతాం
కేషామేవ కదాచిదేవ సుధియాం కావ్యశ్రమజ్ఞో జనః..

భావుకుడు కావ్యంలో ఉన్న శబ్ద గుంఫన పద్ధతుల్ని వివేచిస్తాడు సార్థక్యాలూ వైయర్థ్యాలూ నిర్ధారిస్తాడు (వివినక్తి)అలంకారాలను ఆమో దిస్తాడు ఆనంది స్తాడు (రాజశేఖరుడి మతంలో సూక్తి అంటే కవితా మయోక్తి లేదా అలంకార మహితమైన వాక్యం) రసామృతాన్ని తనివి తీరా ఆస్వాదిస్తాడు (సాంద్రం-లేఢి) తాత్పర్య ముద్రను అన్వేషిస్తాడు ఏ వ్యంగ్యార్థ స్ఫూర్తికోసం ఏ పదం కవి ప్రయో గించాడో గుర్తిస్తాడు (విచి నుతే) ఇవీ ఉత్తమ భావుకుడి కర్తవ్యాలు (రసం తప్ప మిగిలిన కావ్యాంగాలు అన్నీ వివేచనకూ వివరణకూ లొంగుతాయి రసంమాత్రం ఎవరికివారే ఆస్వాదించాలని ఈ శ్లోకంలో క్రియాపదాలు సూచిస్తున్నాయి

వివేకవంతుడైన వ్యక్తి దొరకలేదని లోపల లోపల కుమిలిపోతున్న కావ్యమేమో కవులందరూ భావుకులే - అన్నట్టు (ఇదీ తర్కం) ...

వివేకవంతుడైన వ్యక్తి దొరకలేదని లోపల లోపల కుమిలిపోతున్న సత్కవీశ్వరులకు (సుధియామ్) అందరికీ కాదు, కొందరికి మాత్రమే అదీ కొన్ని వేళల్లో మాత్రమే బహుజన్మల పుణ్యాల కారణంగా (పుణ్యైః - నతు పుణ్యేన) ఇటువంటి ఉత్తమభావుకుడు - కావ్యశ్రమను గుర్తించగల వ్యక్తి - తటస్థపడతాడు (సంఘటతే)

కవికీ భావుకుడికీ ఉన్న తారతమ్యం ఏమిటంటే - కవులందరూ భావుకులే . కానీ భావుకులందరూ కవులు కాలేరు భావయిత్రీ శక్తి ఇద్దరికీ సమానమే కారయిత్రీ శక్తి అదనంగా ఉన్నవాడు మాత్రమే కవి కాగలుగుతాడు అయితే భావుకుడు లేకపోతే కావ్యకథయే లేదు కావ్యం అనే నాణేనికి వీరిద్దరూ బొమ్మా బొరుసూ. అందుకే సరస్వతీ తత్త్వం కవి సహృదయాఖ్యం అన్నారు

స్వామీ మిత్రం చ మంత్రీ చ శిష్యశ్చాచార్య ఏవ చ
కవేర్భవతి హీ చిత్రం కిం హి తద్యన్న భావుకః.
(కావ్యమీమాంసా - చతుర్థోఽధ్యాయః)

కంకంటి పాపరాజు (క్రీ.శ. 1575-1632)

ఉత్తర రామాయణము (ఆరవ ఆశ్వాసము 196 నుంచి 300)

మహాభారతాన్ని సవాలక్ష గ్రంథం (లక్షా పాతిక వేల శ్లోకాలు) అన్నట్లే శ్రీమద్రామాయణాన్ని శతకోటి ప్రవిస్తరం అంటారు. వందల స్థానం మూడు కోట్ల స్థానం ఎనిమిది మూడు ఎనిమిదులు ఇరవై నాలుగు అంటే వాల్మీకి రామాయణం ఇరవై నాలుగువేల శ్లోకాలు అని చతుర్వింశతి సహస్రికాయాం సంహితాయామ్ అని కూడా ఇదే మాట చెబుతారు గాయత్రీ మంత్రంలో ఇరవై నాలుగు అక్షరాలుంటాయి అక్షరానికి వెయ్యి చొప్పున వాల్మీకి శ్లోకాలు రచించాడనీ పెద్దలు చెబుతున్నారు ఉత్తర కాండతో కలిపి చూస్తేనే తప్ప ఈ శ్లోక సంఖ్య సరిపోదు కాబట్టి ఉత్తర కాండకూడా వాల్మీకి రచనమే అని

కథా నిర్మాణ దృష్టితో చూసిన కొందరు విమర్శకులు ఉత్తర కాండ వాల్మీకి రచన కాదు అంటారు. శ్రీరామ పట్టాభిషేకంతో ప్రధాన కథ పూర్తి అయ్యింది సుఖాంతమయ్యింది

ఉత్తర కాండలో కథ అంతా అధిక భాగం పూర్వజన్మ వృత్తాంతాలే. రావణాదుల జన్మలూ వాలి ప్రభృతుల జన్మలూ హనుమద్ వృత్తాంతం ఇవే సగానికి పైగా ఆవరించాయి కంకంటి పాపరాజు రచనలో ఇది మొదటి అయిదు ఆశ్వాసాలూ నడిచింది. అటుపైని సీతా పరిత్యాగం, కుశలవ జననం, రామాశ్వమేధం, అవతార సమాప్తి కనిపిస్తాయి ఇది చివరి మూడు ఆశ్వాసాలూను ఈ భాగమే ఆరు కాండల పూర్వరామాయణకథతో సరాసరి గాఢంగా అన్వయిస్తుంది రావణాదుల జన్మ కథలూ వగైరా నేపథ్యం మాత్రమే అందుకని ఈ ఉత్తరకాండ మొత్తం అసలు వాల్మీకి రచనమే కాదని కొందరు విమర్శకులు భావించారు

అయితే భాస భవభూతుల నాటికే ఈ ఉత్తరకాండ ఉంది. భాసుడి ప్రతిమానాటకానికి భవభూతి ఉత్తరరామచరిత నాటకానికీ ఇదే ఆధారం.

తెలుగులో మొట్టమొదటగా తిక్కన దీన్ని నిర్వచనోత్తర రామాయణంగా రూపొందించాడు రంగనాథ రామాయణంలో (ద్విపద) ఉత్తరకాండ ఉంది కంకంటి పాపరాజు ప్రబంధ శైలిలో గద్య పద్యాత్మకంగా (చంపువు) పునారచన చేసాడు

చేస్తూ – తిక్కన ఇంతకు ముందు రచించాడు గదా ! నువ్వు మళ్ళీ అదే ఉత్తర రామాయణాన్ని ఎందుకు రచిస్తున్నావు ? అంత కంటే గొప్పగా రచిద్దామనా ? అని ప్రశ్నిస్తే ప్రాజ్ఞులకు సమాధానం చెప్పకున్నాడు.

వరుసం దిక్కనయజ్వ నిర్వచన కావ్యం బై తగం జేసె ను
త్తర రామాయణ, మందునన్ మఱి ప్రబంధం బూని నిర్మించుటే
సరసత్వంబని ప్రాజ్ఞులార! నిరసించం బోకుడీ, రాఘు వే
శ్వరు చారిత్రము నెంద ఱెన్ని గతులన్ వర్ణించినం గ్రాలదే ! । - । 4

ఈ సమాధానంలో గడుసుదనం ఏమిటంటే '' ప్రబంధంబూని

నిర్మించుట'' అనేది. పురాణలక్షణాన్ని వదలగొట్టి ప్రబంధ పరిమళాన్ని ఆపాదించాడు పద్యరచనలోనూ, అష్టాదశ వర్ణనల్లోనూ మాత్రమే కాదు సీతారాముల వేషభాషలలోనూ, సరస సంభాషణల్లోనూ చేష్టలలోనూ ఉద్యానవన విహారాల్లోనూ, జలక్రీడలోనూ, పురవీధుల ఊరేగింపులోనూ, దాసదాసీజన నర్మసఖివర్ణనలోనూ, వేశ్యా వర్ణనలోనూ, పురవర్ణనలోనూ అన్నింటా ప్రబంధలక్షణాలను ఆపాదించి ఒక విలాసకావ్యంగా చేశాడు ఏ మొగమోటమీ లేకండా చెప్పాలంటే పురాణపాత్రలు సీతారాములకు ఉన్న ఉదాత్తతను పాడుచేసి దక్షిణాంధ్రయుగంలో ఒక రాజవంశానికి చెందిన సాధారణ నాయికా నాయకుల స్థాయికి దిగజార్చాడు

సీతారాములు-వన విహారం జలకేళి ముగించుకుని ఏనుగు మీద అంతఃపురానికి వస్తున్నారు రాజవీథికి ఇరువైపులా సౌధాల నుంచి పురకాంతలు రాముణ్ని తిలకించి శృంగార చేష్టలతో పులకించి పోతున్నారట ఈ ఘట్టంలో పద్యాలు- భోజరాజు ఊరేగుతున్నప్పుడు పురకాంతల చేష్టలను వర్ణించిన అనంతామాత్యుడి పద్యాలకూ (భోజరాజీయము), స్వరోచి ఊరేగుతున్నప్పుడు పెద్దన పద్యాలకూ (మనుచరిత్ర), రఘునాధ నాయకుడు ఊరేగుతున్నప్పుడు విజయరాఘవ నాయకుని పద్యాలకూ (రఘునాధనాయకాభ్యుదయము),సాటివచ్చేవిగానో కొంచెం తక్కువవి గానో కనిపిస్తాయి

జాలిన పువ్వుదండ జడ జక్కగ జుట్టుక, కొంత పాణి పం
కేరుహసీమ బూనుకొని, శ్రీరఘురాముని జూచె ముత్తెపున్
నోరణగండ్ల నోర్తు-నిను జూచిన నన్ను మరుండు నొంచె ద
త్క్రూర సుమాంబకంబు లివిగో నని చూపగ దెచ్చెనో యనన్ 6-148

ఒక అలివేణి జడలో పూలదండ తురుముకుంటూ పరుగు పరుగున వచ్చి కిటికీలోంచి చూసిందట సగందండ జడలో, సగందండ చేతిలో ఉంది ''ఓ రామా! నిన్ను చూసిన నన్ను మన్మథుడు(మరుండు) హింసిస్తున్నాడు ఇదిగో అతడు వేసిన క్రూరమైన పుష్పబాణాలు (కుసుమ+ అంబకంబులు) అంటూ చూపడానికి తీసుకువచ్చిందా అన్నట్టు, ఆమె చేతిలో పూలదండ ఉంది అన్నాడు. ఇలా స్త్రీలందరూ తన భర్తను అబగా చూస్తోంటే ''భూనందన కెట్టులుండు నికనాథుని నందలు జూచి చొక్కినన్'' అనికూడా ఒక భామామణి అనుకుందిట

రాముడు ''పుంసాం మోహన రూపాయ'' అన్నట్టు ఉంటాడు కనక వయస్సులో ఉన్న పురకాంతలు ఎవరో కొందరు కామవివశలయ్యా రంటే అర్థం ఉంది. అందరూ అయ్యారన్నా ఒప్పకోవచ్చు, కానీ ఒక్కరంటే ఒక్కరుకూడా రామునిలో ఉన్న ఉదాత్తతనీ వీరుణ్ణి పరమాత్మనూ దర్శించ లేకపోయారు ముసలోముతకో ఒక్కరికైనా అటువంటి భావాలు కలిగి నట్లు కవి చెప్పక పోవడంతో ఈ మొత్తం ఘట్టం సాధారణ స్థాయికి వచ్చేసింది. అయోధ్యలో ఆపాటి సంస్కారం ఉన్న మనుషులే లేకపో యారా? రావణవధ పర్యంతం ఉన్న పూర్వరామాయణగాథ వారికి తెలీదా?

హస్తిపురం రాజవీథిలో- పాండవదూతగా వస్తున్న శ్రీకృష్ణుణ్ణి తిక్కన వర్ణించాడు. ఇలాగే వర్ణించాడా ? శ్రీకృష్ణుడు శృంగార పురుషుడే అయినా పరమాత్మ ఆ ఉదాత్తతని మరిచిపోలేదు చూడండి-

వ ఇరుకెలంకుల రమ్యహర్మ్యంబులపై నిలిచి పొలచి కనుంగొను నంగనా జనంబులు తమలోన- (ఉద్యోగ 3- 74)

ప్రాణంబుతో గూడ రక్కసిచన్నుల
పాలు ద్రావిన ప్రౌఢబాలు డితడె
వ్రేల్మిడి జాణూరు విఱిచి లోకముల మె
చ్చించిన ఆ జగజెట్టి యితడె
దుర్వృత్తు డగు కంసు దునిమి యాతని తండ్రి
బట్టంబు గట్టిన ప్రభు వితండె,
సత్యభామకు బారిజాతంబు పై గల
కోర్కి దీర్చిన రసికుండితండె,
వెన్నలును గోపికాచిత్త వృత్తములును
నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె
శ్రుతి శిరోభాగముల దన సుభగచరణ
సరసిజామోదమును గూర్చుచతురు డితడె (ఉద్యోగ.3-175)

బాల్యం నుంచీ కృష్ణుడు వింత బాలుడు ఆ కథలు తలుచుకున్నారు అతడుచేసిన లోకోపకారాల్ని సంభావించారు. రసికతను ధార్మికం గా కొనియాడారు ' వెన్నలును గోపికా చిత్తవృత్తములునూ అని సహోక్తి చేసి ముచ్చిల నేర్చినవాడు అనడంలోనూ ఆ ముచ్చిలడంకూడా ''అరసి ముచ్చిల నేర్చిన హరి'' అనడంలోనూ ఎంత ప్రతీకాత్మకత తాత్త్వికత ధ్వనిస్తున్నాయి దీనితోపోల్చి చూస్తే కంకంటి పాపరాజు పద్యాలు ఎక్కడ నిలుస్తాయి అందంగా పద్యాలు రాయడం, చమత్కారంగా భావాలు కూర్చడం మాత్రమే కాదు కావ్య రచన అంటే. ఔచిత్యం జీవగఱ్ఱ.

ఉద్యానవనంలో సీతతో శ్రీరాముడు నర్మోక్తులు ఆడతాడు. భార్యా భర్తలు కనక ఏకాంతంలో తప్పలేదు. తరవాత రాబోయే శాశ్వత విరహంలో కరుణరసాన్ని ఉద్దీపింపజెయ్యాలంటే ముందు ప్రాతిపదికగా శృంగార రసాన్ని విస్తరించి వర్ణించవలసిందే శిల్ప దృష్టితో అవసరమే. కానీ పాత్రల ఔచిత్యం మాట ఏమిటి ? మర్యాదామహామూర్తి అని శ్రీరాముని కీర్తి ఆయన నర్మోక్తులు ఆలకించండి ఎలా ఉన్నాయో -

ఈ ద్రాక్షఫలముల కెక్కుడో నీ మోవి
యీసారి చవిచూడనీవె చెలియ!
యీ మంజరులతోడ నీడేమొ నీ చన్ను

లింతొకపరి పట్టనీవె సకియా!
------------------------- ౮-౩౯

ఇట్టులపు బువ్వుగుత్తుల నట్టనడుమ
గలికి! దులకించె దాడిమీఫలయుగంబు
కంటి తెంబట్టు రవిక పిక్కటిల నుబ్బు
నీ బటువు గబ్బిగుబ్బల నీటు బూని ౮-౪౮

శృంగారం వేరు-కామం వేరు శృంగారాన్ని శుచి: ఉజ్జ్వల: అన్నారు అలంకారికులు సీతారాముల శృంగార వర్ణనలో ప్రధానంగా ఈ రెండు లక్షణాలనూ పాటించలేదు పాపరాజు. తన కావ్యం- కళిందజోజ్జ్వల రసాప్తిన్ మించి (43) ఉంటుందని చెప్పకున్నాడే కానీ సీతారాముల శృంగారాన్ని ఉజ్జ్వల రసంగా చిత్రించలేకపోయాడు. మితిమీరిన శృంగార వర్ణనలకూ విలాస కావ్యాలకూ పెట్టింది పేరైన దక్షిణాంధ్ర యుగంలో అవతరించింది ఈ కావ్యం యుగ ధర్మంగా సరిపెట్టుకోవాలి. మూలంలో సీతారాముల శృంగార క్రీడలను సూచిస్తూ శచీమివ పురందర: అనీ అరుంధత్యా సహాసీనో వశిష్ఠ ఇవతేజసా అనీ అన్నాడు(42- 8,22) వాల్మీకి. ఋషి వాక్కుకీ కవిమాత్రుడి పలుకులకీ తారతమ్యం ఇదీ.

సీతా పరిత్యాగ ఘట్టాన్ని మాత్రం అత్యద్భుతంగా కరుణరసం తొణికిసలాడేలాగా ప్రతిపద్యం గుండెను పిండేసేట్టు రచించాడు ఈ కావ్యాన్ని బతికిస్తున్న ఘట్టం ఇదొక్కటే అనిపిస్తుంది. అశక్తతతో ఆవేదనతో కుమిలిపోతున్న లక్ష్మణుణ్ణి రూపు కట్టించాడు అంతులేని దు:ఖాన్ని అన్యాయంగా మౌనంగా భరిస్తూ, ఎవరినీ పల్లెత్తుమాట అనని సహన మూర్తిగా శోకదేవతగా జానకీ మాతను పాఠక హృదయాలలో ప్రతిష్ఠించాడు. అన్ని అనౌచిత్యాలకూ ఇది విరుగుడై తెలుగుపాఠకులు ఈ కావ్యాన్ని నెత్తిమీద పెట్టుకున్నారనిపిస్తుంది.

ఈ కంకంటి పాపరాజు తొలిరచన విష్ణుమాయావిలాసము అనే యక్షగానం తరవాతది ఉత్తరరామాయణం. దీని రచనలో పుష్పగిరి తిమ్మన్న (సమీర కుమార విజయము) పాపరాజుకి చేయూత. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి శ్రీకృష్ణుడిలా పుష్పగిరి తిమ్మన్న తనకి సహకరించాడని కావ్యావతారికలో కృతజ్ఞతలు చెప్పకున్నాడు పాపరాజు.

అని గిరీటికి శౌరి తోడైన యట్లు
లమ్మహాకవి సాహాయ్య మాచరింప
గృతి నొనర్పగ బూనిన యేను మొదట
నెంతు మద్వంశవిధ మది యెట్లు లనిన ౨౦

ఉత్తర రామాయణాన్ని మదనగోపాల స్వామికి అంకితం చేసాడు ఆ స్వామి అష్ట మహిషీ సమేతుడు వారిలో అయిదుగురి పేర్లు కలిసివచ్చేట్టు శ్లేషతో తన కావ్యగుణాలను పేర్కొన్నాడు అవతారికలో-

వైదర్భీ విలసద్విలాసమున జెల్వంబూని, సత్కోక్తి నెం
తే దీపించి,కళిందజోజ్జ్వల రసాప్తిన్ మించి, భద్రాత్మకం
బై, దీవ్యద్ఘనలక్షణాశ్రయ సమాఖ్యం గాంచు మత్కావ్య మా
హ్లాదంబిచ్చు, గ్రహింప కృష్ణునకు నర్హంబే కదా యెయ్యెడన్

విదర్భరాజుగారి కూతురు వైదర్భి రుక్మిణి వైదర్భి అనేది ఒక కావ్య రీతి సత్కోక్తి స్పష్టమే. 'కళిందజా'' అంటే కాళింది ఆమె స్వామివారి ఒక భార్య కాళిందీనదికూడా ఉంది మడుగు అలా తరగని ఉజ్జ్వల రసంతో కావ్యం ఒప్పు తోందని. భద్ర మరొక భార్యపేరు శుభప్రద మని కావ్య పక్షంలో లక్షణాదేవి మరొక దర్మపత్ని. ప్రకాశించే గొప్ప లక్షణాలకు ఆశ్రయం ఈ కావ్యమని స్ఫూర్తి అందుకని నా కావ్యం శ్రీకృష్ణుడికి ఆహ్లాదం కలిగిస్తుం దనీ స్వామి ఈ కృతికన్యను స్వీకరించడం (తొమ్మిదవ భార్యలాగా) అన్ని విధాలా అర్హమేననీ పాపరాజు సంబరపడ్డాడు

ఇంతకీ ఈ పాపరాజు కాలం ఏమిటో నిర్ధారించడానికి ఆధారాలు ఏమీ ఈ అవతారికలో లేవు ఆశ్వాసాంత గద్యల్లోనూ లేవు పుష్పగిరి తిమ్మన్నకి సమకాలికుడు అని తెలుస్తోంది పుష్పగిరి తిమ్మన రచన సమీర కుమార విజయము అందులోనూ ఆధారాలు లేవు నెల్లూరిసీమవారు అని మాత్రం తెలుస్తోంది ప్రళయకావేరీపట్టణంలో పాపరాజు అమీనుగా ఉండేవాడుట రాజోద్యోగి.

పుష్పగిరి తిమ్మన్నగారే ఉత్తర రామాయణం రచించాడనీ పాప రాజు ఏదో కారణంగా దాన్ని సొంతం చేసుకున్నాడనీ ఒక కథ ప్రచారం లో ఉంది తీసుకున్న అప్పు తీర్చలేక పుష్పగిరి తిమ్మన్న తన రచనని పాప రాజుకి అమ్మేసాడుట ఈ కథకి బలమైన ఆధారాలు ఏమీ లేవు దీన్ని సాంగోపాంగంగా చర్చించి ఇది కట్టుకథ అని తేల్చారు డా. మారుటూరి పాండురంగారావుగారు తమ సిద్ధాంత గ్రంథంలో (ఉత్తర రామాయణ విమర్శ.)

కంకంటి పాపరాజు కాలాన్నికూడా డా యస్వీ జోగారావుగారి కృషి ఫలితంగా పాండురంగారావుగారు నిర్ధారించగలిగారు. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో డి.సి.నెం 2 ఉత్తరరామాయణం వ్రాతప్రతి అతి ప్రాచీనం దొరికిందట దాన్ని వ్రాయసకాడు క్రీ.శ. 7- - 632నాడు పూర్తి చేసాడు అంటే అప్పటికి ముందుది ఈ రచన. మిగతా ఆధారాలను బట్టి పాపరాజు క్రీ శ 575 - 632 మధ్య కాలంలో జీవించాడనీ , క్రీ శ. 600 ప్రాంతంలో విష్ణుమాయావిలాసం రచించాడనీ క్రీ శ 6 0 లో ఉత్తరరామాయణం ముగించి ఉంటాడనీ పాండురంగారావు గారు అభిప్రాయపడ్డారు

ఒక సాయంకాలం పొద్దు పోయాక రాముడు తన ఆప్త మిత్రుల తో గోష్ఠి జరుపుతున్నాడు. రాజ్యంలో విశేషాలు అడిగి తెలుసుకుంటున్నాడు. మిత్రులద్వారా ఒకవంతు సమాచారాన్ని తానుగా రాబట్టుకోవడం రాజనీతి (చూ.రాయలరాజనీతి).

ఆ మిత్రుల్లో భద్రుడొకడు. అతడు చెబుతున్నాడు మహారాజా ప్రజలంతా నిన్ను వేనోళ్ల కీర్తిస్తున్నారు. సేతుబంధం చేసి రావణాసురుణ్ణి సంహరించిన నీ వీరగాథల్ని ప్రశంసిస్తున్నారు నువ్వు హరివో, హరుడవో అనుకుంటున్నారు- అని ఆ భద్రుడు చెబుతాడు అది విని రాముడు-

ఎలనగ వంకురింప ధరణీశుడు గ్రమ్మఱ బల్కె- భద్ర! నీ
పలు కిది నిక్కమౌ నయిన పౌరులు భూమిజనుల్ శుభాశుభో
క్తుల వచియించుచోట ననుగూరిచి జానకిగూర్చి నిందలన్
బలుకకపోవ రత్తె ఱ గబద్ధము లాడక తెల్పుమీ- యనన్ ౬-౧౨౬

విలాసంగా చిన్న నవ్వు (ఎల=విలాసం) ముఖం మీద మొలకెత్త గా రాముడు మళ్ళీ ఇలా పలికాడు

భద్రా నువ్వు అంటున్న ఈ మాట నిజమే అయినా పౌరులు జానపదులూ (భూమిజనుల్) శుభాశుభాలను మాట్లాడుకునే టప్పుడు నన్నుగురించి గానీ, జానకినిగురించి గానీ నిందలు ఏమీ అనకుండానే ఉన్నారంటావా పలకకపోరు అవి చెప్పు. అబద్ధాలు ఆడకుండా తెలియజెయ్యి

రాముడికి అసలు ఈ ఆలోచన ఎందుకు వచ్చింది? రాజ్యంలో ఏదయినా ఉపద్రవం జరిగితే అది రాజదోషమనే అంటారు. అంచేత శుభాశుభాలలో ప్రజలు రాజుని ఆడిపోసుకోవడం సహజం కాబట్టి అది తెలుసుకోవాలి అనుకున్నాడు పరమాత్మగా సర్వజ్ఞుడు కనక భద్రుడి ద్వారా బయటపెట్టిద్దామనైనా అనుకుని ఉండాలి అబద్ధాలు ఆడకుండా చెప్ప మన్నాడు మొగమిచ్చకంకోసం మెప్పుల్లో కొంత అబద్ధాలు చేర్చడం కొందరి కీ,రాజోద్యోగులందరికీ సహజం ఆ మేరకు కొంత శాతం తొలగించే- రాజులు యథార్థాన్ని స్వీకరిస్తూ ఉంటారు. అందుకని ఈ హెచ్చరిక

ఆ భద్రుండు వినమ్రుడై పలికె, దేవా! నీవు పల్మాఱు న
న్నీ భంగిన్ నిజమేమిదెల్పు మనినన్, హీనాత్మకుల్ పల్కు ప
ల్కే భావ్యంబని విన్నవింతు? అది మీ కేలా వినన్? మూర్ఖులై
యే భూపాలుర మెచ్చి రీ నరులు! వీ రేపాటి పాటింపగన్ ౬-౧౨౭

భద్రుడు వినమ్రుడై పలికాడు దేవా! నువ్వు మాటిమాటికీ ఇలా నిజం చెప్పు,నిజం చెప్పు అని నన్ను రొక్కిస్తుంటే ఏమి చెప్పను! హీనాత్మకులు ఏవో కూస్తూ ఉంటారు. ఆ పలుకులు ఏమంత భావ్యమని నీకు విన్న వించను అసలు అది మీకెందుకూ వినడం! ఈ ప్రజలు మూర్ఖులు ఏ భూపాలురనైనా ఏనాడైనా వీళ్ళు మెచ్చుకున్నారా? వీళ్ళు ఏపాటి మనుషులు కనక వీళ్ళమాట పట్టించుకోడానికి!

కరుణ గల్గిన రాజకంతీరవుని గన్న
మెత్తనివా డంచు మెచ్చ రతని
దురుసు దండనలతో ధరనేలు దొర గన్న
హింసాపరుండని యెంచ రతని

ధైర్య సంపన్నుఁడౌ ధరణీశ్వరుని గన్న
కలినచిత్తుండని కదియు రతని
సుజనుల బ్రోచు భూభుజుని గన్నను పక్ష
పాతియం చలతిగా జాతురతని
నీ వివేకవంతు లే మెఱుంగుదు రట్టి
యెఱుకలేని జనుల సరకు చేసి
మొఱకు పలుకు వినెడికొరకు మేకొనగ దే
వరకు దగునె ? యాజివరకుమార ‖ 6-198

అశ్వమేధయాగం చేసిన దశరథుని (యాజి) ఉత్తమపుత్రుడా! ప్రజల మనస్తత్వం చాలా చిత్రంగా ఉంటుంది

దయగలిగిన రాజసింహాన్ని (కంఠీరవము= ఉత్తముడని) మెత్తని వాడు పొమ్మంటారు దురుసుగా ఉంటే హింసాత్ముడంటారు ధైర్యంగా రాజ్యాన్ని విస్తరిస్తే క లినహృదయుడు అంటారు. సజ్జనుల్ని కాపాడుతున్న రాజుని చూస్తే పక్షపాతి అని లోకువగా చూస్తారు ఈ మహా వివేకవంతుల కి ఏం తెలుసు అటువంటి అజ్ఞానుల్ని లెక్కచేసి- వాళ్ళ మూర్ఖపు మాటలు వినిపించు వింటాను అని దేవరవారు పూనుకోవడం (మేకొనుట) సమంజసమా చెప్పండి

జన జను లాడుకొనియెడి
నానోక్తులు విన దలంచిన న్నడిగిన మీ
యానకు వెఱచి గణించెద
భానుకులాధీశ ! వినుము పౌరుల పలుకుల్ 6-199

అయినా ఓ సూర్యవంశ ప్రభూ! జనులు మాట్లాడుకునే పలుకుల్ని (నానా ఉక్తుల్ని) వినదలచి మీరు అడిగారు కనక, మీ ఆజ్ఞకు భయ పడి (వెఱచి) పౌరుల పలుకులు చెబుతున్నాను ఆలకించండి

ఏ కళంకము లేని యిక్ష్వాకు కులమున
సంభవించియు రామచంద్రు డకట
తొడమీద నిడుకొని దోషాచరాగ్రణి
యెత్తుక చని లంక నేడు కాల
ముంచిన యిల్లాలి నించుక కొంచక
మరల దా గొనివచ్చి మరులు హెచ్చి
యెట్టిలికము లేక యేలుచున్నాడు
చెఱకు విల్కానికి జిక్కినాడు
పగతు లే కాంతలను జెఱపట్టికొన్న
బలిమి విడిపించుకొని తెచ్చి కలియవచ్చు
బ్రజకు రాజానుమతమె ధర్మంబు గాదె !

యనుచు గుమిగూడి పలికెద రవని జనులు

ఏ కళంకమూ లేని ఇక్ష్వాకువంశంలో పుట్టి కూడా అయ్యయ్యో. రామచంద్రుడు ఎంత పని చేసాడు వంశానికి కళంకం తెచ్చాడు

రాక్షసనాయకుడు (దోషా చరుడు=రాక్షసుడు) తొడ మీద కూర్చోబెట్టుకుని, ఎత్తుకుపోయి లంకలో ఏడాది కాలం ఉంచిన ఇల్లాలిని కొంచెంకూడా సంకోచించకుండా మళ్ళీ తెచ్చుకుని ఏలుకుంటున్నాడే ! సీత మీద అంతటి మరులా ఎట్టెరికం లేదా ! మన్మథుడికి (చెఱకు విలుకాడు) వశుడైపోయాడా !

ఇలా అయితే ఇంక శత్రువులు ఎవరి కాంతలను ఎత్తుకు పోయినా పెళ్ళి బలవంతంగా విడిపించి తెచ్చుకోవడం, ఏలుకోవడమే నన్నమాట. రాజానుమతో ధర్మః అన్నారుగదా ! రాజుగారు ఏది ఆచరిస్తే ఏది అనుమతిస్తే అదే ధర్మం మనందరికీని. ప్రభూ . ప్రజలంతా గుమిగూడి ఇలా మాట్లాడుకుంటున్నారు

వినివిని నేను వేసరితి వీథుల వీథుల నిట్టి మాటలే
యనుకొనువార లూరదఱ చజ్ఞల నోరులు మూయవచ్చునే
యినకులనాథ ! వారి నిక నేమన గూడు- నటంచు దెల్పినన్
విని శితశూలముల్ చెవుల ప్రేసినలాగయి జాలి జెందుచున్ (८-२०।)

ఏ వీథిలో చూసినా ఇవ్వే మాటలు విని విని నేను వేసారి పోయాను ప్రతిగ్రామంలోనూ (ఊరన్) తరచుగా ఇవ్వేమాటలు వినబడుతు న్నాయి ఓ సూర్యవంశ ప్రభూ !అజ్ఞుల నోళ్ళను మూయించడం ఎవరితరం! వాళ్ళని ఇంక ఏమంటాం ! ఏమనడానికిమాత్రం కుదురు తుంది.(ఏమి అనన్ కూడును= చెల్లును)

భద్రుడు ఇలా చెప్పేసరికి రాముడి చెవ్వుల్లో వాడిగా శూలాలు దించినట్టయ్యింది.ఉన్నవాడున్నట్టు దీనుడైపోయాడు.(జాలిన్ చెందు చున్).

''వారి నిక ఏమనగూడును'' అనే ముక్తాయింపులో ఉన్నాడు భద్రుడు అవునుమరి నువ్వు చేసినపని అంత అందంగా ఉంది ఏమం టాం, ఎలా అంటాం నానావిధాలుగా అనుకుంటున్నారంటే అనుకోరు మరీ-అని స్ఫురణ. ప్రజలు అజ్ఞులూ, మూర్ఖులూ కనక వారిమాట లెక్క చెయ్యక్కర్లేదు-అంటున్నాడే తప్ప, అది అసత్యం కనక సరకుచెయ్యక్క ర్లేదు అని చెప్పడం లేదు పైగా వాళ్ళ నోళ్ళు మూయించడం సాధ్యమా అన్నాడు

ఎవడో బడుగుజీవి ఒకడో అరో అనడం కాదు. గుసగుసలు అంతకన్నా కాదు ఊరూరా, వాడవాడలా, ప్రజలు గుమికూడి బాహాటంగా చర్చించుకుంటున్నారుట.తిక్కనగారి భద్రుడు మొగమోటపడి కొంత మార్చి చెప్పాడు గానీ పాపరాజుగారి భద్రుడు మొగమోటపడకుండా మూలంలో ఎలా ఉందో అలాగే చెప్పేసాడు చత్వరాపణరథ్యాసు వనేషూపవనేషు చ (43- 3) ఏవం బహువిధా

వాచో వదంతి పురవాసినః నగరేషు చ చర్వేషు రాజన్ జనపదేషు చ (43-20)

ఈ భద్రుడు విన్నది విన్నట్టు చెప్పి ఊరుకున్నాడు తప్ప ప్రజల్ని నిందించలేదు నోళ్ళు ముయ్యగలమా ఏం చెయ్యగలం ఇలా తన అభి ప్రాయాన్ని జోడించలేదు. విన్నమాటల్ని నమ్మనివాడు ఎలా పలుకుతాడో అలా చెప్పి ఊరుకున్నాడు అంతే

"తొడమీద నిడుకొని దోషాచరాగ్రణి యెత్తుక చని" అనే మాట ఒకటి వచ్చింది. సీతాదేవిని రావణాసురుడు అలా అపహరించాడని వాల్మీకి ఇలాగే చెప్పాడు రావణుడు ఎడమచేత్తో ఆమె జుట్టు పట్టుకున్నాడు కుడిచేతిని తొడల క్రిందవేసి మొత్తం మనిషిని అమాంతం పైకి లేపి మోసు కుంటూ పుష్పకం ఎక్కాడు. అలాగే పట్టుకుని గదమాయిస్తూ ఒడిలో కూర్చోబెట్టుకుని సాగి పోయాడు

వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణ సః
ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహ పాణినా
తతస్తాం పరుషైర్వాక్యైః భర్త్స్యయన్ మహాస్వనః
అంకేనాదాయ వైదేహీం రథమారోపయత్తథా (అరణ్య49-17,20)

ఈ విషయం తెలిసినవాళ్ళు గనక సాకేతప్రజలు "కీదృశ్యం హృదయే తస్య సీతాసంభోగజం సుఖమ్, అంకమారోప్య తు పురా రావణేన బలాద్ధృతామ్" (ఉత్తర-43- 7) అనుకొన్నారు. ఇది తెలిసింది కానీ సీతాదేవి అగ్నిప్రవేశం మాట వీరికి తెలియలేదు కాబోలు

రాముడు ఆప్తమిత్రుల్ని పంపించేసి, అప్పటికప్పుడు సోదరుల్ని పిలిపించి విషయమంతా చెప్పి తెల్లవారుతూనే సీతాదేవిని గంగ దాటించి ఆవలి ఒడ్డున వాల్మీకి ఆశ్రమ ప్రాంతంలో విడిచి పెట్టిరమ్మని లక్ష్మణుడికి ఆజ్ఞాపించాడు ఆరాధనాయ లోకస్య-యది వా జానకీమపి-విడిచిపెట్ట డానికి బాధపడను అన్నాడు ఒకప్పుడు రాముడు అదే నిజమయ్యింది.

గర్భవతిగా ఉన్న సీతాదేవి ఆ సాయంకాలమే రాముణ్ణిఒక కోరిక అడిగింది " ఆశ్రమాలనూ మునిపత్నులనూ ఒకసారి దర్శించి రావాలని ఉంది నాథా! అంది అలాగే వెడుదువుగాని అన్నాడు రాముడు ఇప్పడు అది అనువుగా కలిసి వచ్చింది ఈమాటనే చెప్పి లక్ష్మణుడికి అలా ఆజ్ఞా పించాడు. జీవితంలో మొట్టమొదటిసారిగా సీతాదేవి రాముణ్ణి కోరిన కోరిక బంగారు లేడిని పట్టి తెమ్మని ఇప్పడిది రెండవ కోరిక మునిపత్నుల్ని చూడాలని రెండుకి రెండే వియోగానికి దారితీసాయి.

అగ్నిప్రవేశంనాడూ లక్ష్మణుడు నోరెత్తలేదు. చితి పేర్చాడు ఇప్పడూ అంతే సుమంత్రుణ్ణి రథం సిద్ధం చెయ్యమని తెల్లవారుజామునే సీతను తీసుకుని బయలుదేరాడు సీతమ్మకు ఈ విషయాలేమీ తెలియవు. పిచ్చి తల్లి-ముని పత్నుల్ని చూసిరావడానికే అనుకుంటోంది.

"అంబుజగంధి యయ్యెడ మహర్షుల పత్నులకంచు గొన్ని హే
మాంబర రత్న భూషణచయంబులు గైకొని యమ్మ బందియున్
వెంబడి నెక్కగా రథము వేడుక నెక్కి చిరత్న రత్న పీ
ఠంబున నుండె, వాజుల హుటాహుటి దోలె సుమంత్రు డంతటన్.౦-232

మహర్షుల పత్నులకోసమని కొన్ని విలువైన వస్త్రాలూ రత్నాభర ణాలూ తీసుకుని బయలుదేరింది ముందు తానే రథం ఎక్కింది. లక్ష్మణుడు తరువాత ఎక్కాడు రథ మధ్యభాగంలో విలువైన రత్నపీఠం మీద దర్జాగా మహారాణీలాగా కూర్చుంది ఎంత ఉత్సాహంగా ఉందో. సుమంత్రుడు గుర్రాలను (వాజులన్) హుటాహుటి తోలాడు

ఈ సుమంత్రుడికీ ఇది రెండవ అనుభవం ఆ వేళ రాముడు కూడా ఉన్నాడు. ఇవ్వేళ ఒక్క సీతనే అడవుల్లో దింపిరావడానికి రథం తోలుతున్నాడు. నేనూ నీ వెంటనే వస్తానని పేచీ పెట్టుకోవడానికి అవకాశం లేదు ఈసారి సుమంత్రుడికి

బయలుదేరిన క్షణంనుంచీ అన్నీ అపశకునాలే అసాధారణమైన అపశకునాలు "లక్ష్మణా ఏమిటిదీ" అంటూ భయపడింది సీత. మనస్సు కూడా ఏదో తెలియని ఆవేదనకు లోనవుతోంది.

మునుకొని యిట్లు దుశ్శకునముల్ గనిపించుటకున్ మెఱుంగు పె
ట్టిన గతి నామనంబున గడింది భయంబు జనించె, దక్షిణాం
గనికరముల్ చలించె, ధృతి గాసిలె, మే నవశత్వమొందె,నే
మని వివరించుదాన, జగమంతయు జాడయి తోచె జాడ్కికిన్.౦-230

(మునుకొని=మొదలుపెట్టి, కడింది=మిక్కిలి, నికరముల్=సమూహాలు, ధృతి=ధైర్యం గాసిలుట=క్షీణించుట, మేను+ అవశత్వము+ ఒందె)

మరునాటి మధ్యాహ్నానికి గంగానదిని చేరుకున్నారు. సీతమ్మ గంగమ్మను స్తుతించింది. లక్ష్మణుడి ముఖంలో దిగులు గూడుకట్టుకొని కనపడుతోంది. అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు జాలువారుతున్నాయి. సీత గమనిస్తూనే ఉంది. నిన్నటినుంచీ అపశకునాలూ లక్ష్మణుడి ముఖంలో ఈ దిగులూ విన్నబాటూ. సీతమ్మకి ఏమీ అర్థం కావడం లేదు

విన్నదనంబు మించె బురి వెల్వడినప్పటినుండి, నీ మొగం
బున్న తెఱంగు గాంచి దిగులొందుచు నుందు నిదేమొ యంచు, మీ
యన్నకు దత్సహోదరుల కాప్తులకున్ శుభమే కదన్న, నీ
కన్నుల నేల నశ్రువులు గ్రమ్మెడి దెల్పగదన్న లక్ష్మణా! ౦-249

అడవిని దొల్లి శ్రీ దొఱగి యన్నను గొల్చుచు వచ్చునప్పుడున్
గడుసరి యింద్రజిత్తుని ముఖాముఖి గయ్యము సేయునప్పుడున్
జడుడగు రావణాసురుని శక్తి యురంబున నాటినప్పుడున్
బొడమదు కంట నీ, రిపుడు పుట్టిన దేటికొ తండ్రి దెల్పవే!

తండ్రీ! ఎన్ని కష్టాలువచ్చినా నువ్వు కంట తడిపెట్టలేదే. అటు వంటిది ఇప్పుడు

కన్నీరు పెట్టుకున్నావంటే- ఏమిటి నాయనా కారణం. చెప్పబాబూ అంది

మానసిక వ్యథ¬ రుజలు మాన్పగనోపిన పుణ్యరాశి గం
గానది జేరియుండియును గస్తిపడన్ దగునయ్య ? వేడ్కతో
నీ నదిదాటి, తాపసుల యింతుల గన్గొని, భూషణావళుల్
కానుకలిచ్చి దీవనలు గైకొని వత్తము, రమ్ము, చెచ్చెరన్. (6-25)

(రుజలు=రోగాలు, కస్తిపడుట=దుఃఖించుట)

అని పలికి లక్ష్మణుని దైన్యంబు గని తలంకి మరల నిట్లనియె (252)

కనరాని దుశ్శకునములు
గనునప్పటినుండి మనసు గలగెడు నాకున్.
వనులేల ? మరలిపోదమె ?
నిను జూచిన నినుమడించె నెవ్వగ లనినన్. (253)

దుశ్శకునాలను చూసినప్పటినుంచీ నా మనస్సు కలత చెందు తోంది నిన్ను చూస్తోంటే నా దిగులు రెట్టింపు అవుతోంది పోనీలే ఈ అడవు లెందుకు (వని+లు=వనులు?) వెనక్కి వెళ్ళిపోదామా- అంది

తల్లీ ఇవన్నీ నిన్నటి దుర్నిమిత్తాలే అయోధ్యకెందుకూ మీరు కోరినట్టు అవతలి గట్టుకు వెడదాం- అని లక్ష్మణుడు గుండెలు చిక్క బట్టుకుని మాట్లాడాడు

అరదము డిగ్గి, యచ్చతురుడచ్చట సారథి నుంచి, యోడ పై
ధరణిజ నెక్క బంచి, వెత దార్కొన దానును నెక్కి, తత్సరి
త్తరణ మొనర్చి వేగ దటధారుణి జేరియు , శోక వార్ధిలో
దరళ మనస్కుడై మునిగి, ధారగ గన్నుల నశ్రులొల్కగన్ (6-255)

(అరదము=రథం, వెత=వ్యధ, తార్కొనుట= ఆవరించుట సరిత్తరణము=నది దాటుట తటము= ఒడ్డు ధారుణి=భూమి వార్ధి=సముద్రం తరళమనస్కుడు=కం పిస్తున్న మనస్సు కలవాడు అశ్రులు=కన్నీరు)

జనకజ మోము దీనత యెసంగ గనుంగొని యూరెలుంగుతో
"జననిరో ! హాయ దీ హృదయశల్యము, శోకదవాగ్ని గ్రాగుకం
టెను మరణంబు మేలు, జననిందితకృత్యము బూని వచ్చితిన్
నను శపియించు మంచు జరణంబుల చెంగట వ్రాలి యేడ్వగన్ (256)

నిన్నటి నుంచీ గుండెల్లో మోస్తున్న దుఃఖభారాన్ని ఇంక నిలువ రించలేకపోయాడు చెప్పి తీరవలసిన సమయం వచ్చింది ఒక్కసారిగా భళ్ళుమన్నాడు జననిరో . అంటూ కాళ్ళ మీద పడి వలవలా ఏడ్చేసాడు

ఆ తల్లి కంగారు పడిపోయింది. ఎవరికి ఏమి జరిగిందని ఇతడు ఇంతగా దుఃఖిస్తున్నాడు ? రామాజ్ఞలేకుండా నన్ను ఇక్కడికి తీసుకు వచ్చాడా? ఏమయినా కానిపనులు చేసాడా? స్వామికి నామీద కోపం వచ్చిందా? ఏమిటికి అడలెదవు తండ్రీ ఎఱిగింపవే- అంది సౌమిత్రీ. భయమయ్యెడిన్ నుడువుము నా స్వామి కుశలమే

కదా- అంది

తెలుపుటకు గొంత చింతిలి
తెలుపక పోరా దటంచు దృఢనిశ్చయుతన్
దలచుచు, వడి లేచి, కృతాం
జలియై, యతడ(శు లొలుక జనకజ కనియెన్ ౨౭౫

ఇంతకు బూని వచ్చి వచియింపక పోదునె విన్ము తల్లి! దు
శ్చింతులు దైత్యుచేబడిన సీతను (గమ్మఱ నేలుచున్న వా
డెంత విమోహి రాముడని యెగ్గులు పల్కిన నాలకించి భూ
కాంతుడు నింద జెంది నిను గానలలోపల డించి రమ్మనెన్ ౨౭౬

ఈ మాటలు వింటూనే సీతాదేవి మొదలు నరికిన అరటి చెట్టు లాగా- హా తల్లీ అంటూ నేలమీద పడిపోయింది కొంతసేపటికి తేరుకుంది తన దుఃఖాన్ని గుండెల్లో దిగమింగుకుని లక్ష్మణుణ్ణి ఓదారుస్తోంది ఆ తల్లి-

అడలకుమన్న! నీకు వసుధాధిపునానతి దాట వచ్చునే
యిడుమల జెందుమంచు విధి యీ ధర నన్ను సృజించి యుండగా
గడపగ నెవ్వరోపుదురు, కానల కేగిననాడె యాపదల్
గడచితి నంచునుంటి, నెఱుగన్ దుద కిట్లగునంచు నా మదిన్ (277)

ఆ దుర్నిమిత్తముల ఫలి
మీ దుఃఖము సేయుకున్నె, యీ దుఃఖము లా
పాదింప విధి తలంచియె
కాదే యీ కోర్కి నాకు గలిగించుటయున్! 6-278

ఎడపక పూర్వజన్మముల నే మిథునంబుల బాయు జేసి, వా
రడలగ నవ్వుచుండితినొ యీ యఘమూరక పోనె, నాడు కా
ఱడవుల రామపాదజలజాప్తి వసించితి- నేడు నాథు పాం
డెడసి యనాథ నై యిచట నే గతి మేన భరింతు (బాణముల్!(279)

ఏను సాధ్వి ననుచు నెల్లవారలు నన్ను
నెన్నుతింతు రనుచు సంతసింతు
గాని నడుమ నిట్టి కటిక నిందలు పుట్టి
యడవి (దోచు రాముడనుచు నెఱుగ 6-280

కటకట లక్ష్మణా! పిడుగు కంటెను బెట్టిదమైన మాట నే
డిటు వినియుండియున్, బగుల దింతలు నింతలుగాదు గుండె, యె
ప్పటివలెనున్న దీ కటిక భావముతో నసువుల్ భరించి, యి
య్యెటవినె యింక నే వలన నాపద లొందగ నున్న దాననో (6-281)

కళవళ మంది తెల్పితివొ, కాక పరాకున దప్ప వింటివో,
కలనయినన్ రఘూద్వహుడు కానలలో నను (దోయ బంచునే?

తెలిసి గణింపు లక్ష్మణ! మతిభ్రమమయ్యెనదా హా! సహింపు మి
ప్పలుకు,లెఱుంగ జంటి, వెతబాటిలె, నీ కొక భ్రాంతి యున్నదే ?(6-282)

ఎన్నటికిన్ రఘూద్వహుని నేనును నన్నిక రామచంద్రుడున్
గన్నుల జాడ గల్గ దొకొ! కల్గకయుండిన ప్రాణ మేల పో
దన్న! రఘుప్రవీరు చెవులారగ నింతయు దెల్పు, నాదు మే
నున్నది, చెంత గంగమడు గున్నది,యైనను లయ్యెడున్ దుదిన్(6-283)

పతి మతి నెంచెనేమొ తను బాసి యశోకవనంబులోపలన్
బ్రతుకదె పెక్కునా ళ్లనుచు, గ్రమ్మఱ దా జనుదెంచి శత్రునిన్
హతునిగ జేయు,నేలు నను నాసగదా బ్రదికించె నాటి కా
గతి, నిక నేమి యాసగొని కాయము నిల్పుదు దెల్పు లక్ష్మణా!(6-284)

ఎఱుగని మూఢు లాడుకొను నెగ్గులకున్ భయమంది, యప్పుడే
కఱకు మనంబుతో విభుడు కాననసీమకు బంపె గాక- యు
త్తెఱ గొకసారి నన్ బిలిచి తెల్పి మనోవ్యథ తీర్చి నన్న నే
మఱ నని బంపడయ్యె, నభిమానము గూర్మియు నెందు బోయెనో?
(6-285)

ఆ కరుణ యా ప్రసన్నత,
యా కూరిమి, యా ప్రియోక్తి యా గారవమున్,
గాకుత్స్థుడు మఱచె గదా!
యాకస్మికముగ జనించు నపవాదమునన్ (6-286)

ఆకర్ణాయతనేత్రమై మణిమయోద్యత్కుండల ద్వంద్వ శో
భాకీర్ణాంచితగల్లమై సురదనంబై సుందర భ్రూయుతం
బై, కమ్రస్మిత చంద్రికా విలసితంబై యొప్పు శ్రీరాము మో
మీ కాయంబున జూచు భాగ్య మిక లేదేమో సుమిత్రాత్మజా! (6-287)

అవని నయోనిజనయి పుట్టి మిథిలేంద్రు
వీట నే బెరిగిన విధము వినరొ
యంగరాగము లిచ్చి యనసూయ మొదలైన
సతు లెంచుకొన్నది చాల వినరొ
యా లంకలో దొల్లి త్రైలోక్యము నుతింప
వహ్ని నే జొచ్చిన వార్త వినరొ
యీ సీత నిర్దోషి యేలుకొమ్మని రాము
బ్రహ్మదు లపుడన్న పలుకు వినరొ
వినియు గనియు- బ్రజలు నను నిందసేసిన
యంతమాత్రముననె యధిపు డులికి,
యింత తెగువ సేయ నిచ్చగించుట నా య
భాగ్య మింతె, యొకరి బల్కనేల! 6-288

వనముల కేల వచ్చితివి వల్లభునిన్ బెడబాసి యొంటిగా
నని, ముని పత్ను లెల్ల గుమియై యడుగన్, ధృతిమాలి, వారి కే
మని వివరింతు,నింత విపదంబుధి నే కరణిన్ దరింతు, నే
యనువున నీ ప్రతిక్షణ మహాయుగముల్ క్రమియింతు లక్ష్మణా!

వ. అని పెక్కువగల నమ్మగువ వాగిలి, మగని తెగువకు బరితపించియు నించుక తగవు దలంచి, తెగువ వహించి, బహిర్లిఖిత చిత్రంబు తొమరొంది యున్న యమ్మహి దితో మఱియు నిట్లనియె. (౬-౨౯౦)

వగపున దోచినన్నియు నవారణ బల్కితి గాక, భర్తకున్
జగదపవాదమున్ గడువ శక్యమె, నేను వియోగ మగ్నతన్
దెగువకు జొచ్చి, రాము జననిందితు జేయుదునే, తదాజ్ఞ యె
ల్ల గతుల బూని కానల మెలంగెద, మేను గలంత కాలమున్(౬-౨౯౧)

అన్న! లక్ష్మణ! యింక నాలస్యమేటికి
జను మయోధ్యాపురంబునకు నీవు
ముమ్మ రత్తలకును మ్రొక్కితి నని తెల్పు
మచటి బంధుల నెల్ల నడిగితి నను
మతికృపాళునకు రామావనీంద్రునకు నా
మ్రొక్కుగా నతిభక్తి మ్రొక్కు మీవు
తన యాజ్ఞ దలదాల్చి, జననింద తను జెంద
నీక, కానల జరియింతు ననుము
భూజనుల బాంధవుల లెస్స ప్రోవు మనుము
తలప నా కేడుగడయును దాని యనుము,
భావమెప్పుడు దన మూర్తి బాయ దనుము
నెమ్మి యొకయింత నామీద నిల్పు మనుము ౬-౨౯౨
పోయి రమ్ము, శుభంబులు బొందు నిన్ను
నమ్మ మఱవకయుండుమా! యన్న! యనుచు
గన్నుగవ నశ్రుధారలు గ్రమ్ముకొనగ
వన్నెలంతుక దీనయై యడలుచున్న ౬-౨౯౩

చన గాళ్లు రాక, చన కిక
జన దని, ధేనువును బాయజాలని వత్సం
బును బోలి, జాలిగొని, యో
జననీ! జననాథు గొలువ జనుదునె! యనుచున్ ౬-౨౯౪

అల్లన మ్రొక్కి, కాళ్ల వడకాడ బ్రదక్షిణ మాచరించి, మే
నెల్ల జలింప హోరుమని యేడ్చుచు, బెద్ద యెలుంగుతోడ,మా
తల్లిని డించి పోయెదను దాపసకామినులార! కూర్మి నం
దల్లగ బ్రోవరే! యనుచు దీనత లక్ష్మణు డేగెనయ్యెడన్ ౬-౨౯౫

ఏగి, నావ యెక్కి, యెడద దల్లడపడ
దిరిగి తిరిగి సీత దిక్కు గనుచు,
దిక్కు కలిగి-నీకు దిక్కు లేదాయెగా
తల్లి! యనుచు నవలితటము జేరి 6-296

తేజిని వగ నందుండెడి
తే రెక్కి సుమంత్ర! యెంత దీనత వచ్చెన్
శ్రీరాము లీల మీఱెడి (శ్రీరామ = లక్ష్మీదేవి)
శ్రీరామవధూటి గనుచు జింతిలుకొనుచున్ 6-297

చనుచుండె- నిచట సీతా
వనజాక్షియు, నతడు మరలి వచ్చునొ యని యా
యన చనినత్రోవ పలుమఱు
గనుచున్, విధి దూఱుకొనుచు, గటగట యనుచున్ 6-298


రమణి మఱికొంత వడిదాక రథము జూచు
దరుణి మఱికొంత సేపు కేతనము జూచు
గాంత మఱిమీద రథపరాగంబు జూచు
బడతి మఱి యంతటను వట్టి బయలు సూచు 6-299

చూచి చూచి, నొక్కి, స్రుక్కి తాలిమి దక్కి
వగల బొగిలి, యూర్పు సెగల నొగిలి,
దిగులు దగుల గుంది, వగజెంది, బెగడొంది,
యలసి, సొలసి, మూర్ఛ లొలసి, తెలిసి 6-300

అడవిలో ఒంటరిగా దుఃఖిస్తున్న సీతాదేవిని వాల్మీకి శిష్యులు ముని కుమారులు చూసారు గురువుగారికి విన్నవించారు ఆయన వచ్చి సీతాదేవిని ఊరడించి తన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు అక్కడే లవకుశుల జననం

ప్రబంధ పద్యాలలో కనిపించే గాఢ బంధమూ భావప్రౌఢీ కొంత పలచబడి ఆశుధోరణి బలపడి, ప్రసన్నతకూ సరళతకూ సుకుమారతకూ ప్రాధాన్యం ఏర్పడింది కృతకమైన శ్లేషలూ అలంకారాలూ వెనకబట్టాయి కరుణరసం కనక ఈ ఘట్టం ఇలా ఉండటం కాదు- మొత్తం ఉత్తర రామాయణం అంతటా ప్రధానంగా ఇదే శైలి అనంతరకాలంలో తిరుపతి వేంకట కవులతో మొదలుపెట్టి కొందరు భావకవులూ పింగళి-కాటూరి కవులూ, జాషువా కరుణశ్రీలూ- వీరంతా పాపరాజు పద్య రచనాశైలితో ప్రభావితులయ్యారని నిస్సందేహంగా చెప్పవచ్చు

(ఈపాటికి పద్యం చదివి అర్థం చేసుకోవడం అలవడి ఉండాలి అందుకే ఈ తేలిక పద్యాలకు వివరణ ఇవ్వలేదు ఇది పరీక్ష అనుకొన్నా సరే)



బేతవోలు

PADYA KAVITHA PARICHAYAM

by Bethavolu Ramabrahmam

ఎవరికి..... ఎందుకు....

పద్య కవిత్వమంటే అభిమానం ఉండి, పద్యాలను చదివి అర్థం చేసుకునే అభ్యాసమూ, శిక్షణా తగినంతగా లేని ఈనాటి సాహితీ ప్రియుల కోసం ఈ పుస్తకం. ప్రతిపదార్థ తాత్పర్యాల వ్యాఖ్యాన సంప్రదాయానికి భిన్నంగా సంభాషణా శైలిలో సరళ సుందరమైన వాడుక భాషలో రూపొందింది. పద్యంలో ఉండే అందచందాలనూ, కవితా మాధురులనూ, వాటిని ఆస్వాదించే పద్ధతులనూ - అన్నింటినీ ఆవిష్కరిస్తోంది ఇది.

వెయ్యేళ్ళ చరిత్ర ఉన్న పద్యకవిత్వంలో నన్నయ నుంచి కంకంటి పాపరాజు దాకా ఇరవై మంది మహాకవుల కావ్యాల నుంచి ఒక్కొక్కటిగా రసవద్ఘట్టాలను మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి మార్గదర్శకత్వంలో బేతవోలు రామబ్రహ్మంగారు ఎంపిక చేసుకొని సమగ్ర వివరణ సమకూర్చారు

పీఠికలో చేకూరి రామారావుగారన్నట్టు ప్రాచీన కావ్యాలకు దూరమై నేటి సాహితీ యువతరం చాలా పోగొట్టుకొంది. కొందరిది బెరుకు. కొందరిది ఉలుకు. వాటిని తొలగించే తొలి ప్రయత్నం ఈ రచన.

ఇకపైని పద్యకవిత్వాన్ని 'అసహాయశూరులమై' ఆస్వాదించగలం - అనే విశ్వాసం పాఠకులకు కలిగించే గ్రంథమిది. వెలువడిన రెండేళ్ళకే పునర్ముద్రణకు వచ్చింది. అంతగా అందరి ఆదరణకు నోచుకుంది. ఇది అందించిన ఉత్సాహంతో కందుకూరి నుంచి కరుణశ్రీ దాకా మరో 'పద్య కవితా పరిచయం' త్వరలోనే రాబోతోంది.

A APPAJOSYULA - VISHNUBHOTLA FOUNDATION PUBLICATION